శ్రీమద్వాల్మీకి రామాయణము

సుందరకాండము

తృతీయ సంపుటము

(41-68 సర్గలు)

పదచ్ఛేద - అన్వయక్రమ - ప్రతిపదార్థ - వ్యాఖ్యానవిశేష -
తాత్పర్యములతో కూడిన

సుబోధినీ వివరణ సహితము

విద్యాప్రవీణ, భాషాప్రవీణ
మైలవరపు సుబ్రహ్మణ్యము

బోయినపల్లి
కామేశ్వరరావు, బి.ఏ

సుందరకాండము

సుబోధినీ వివరణ సహితము

తృతీయ సంపుటము

ద్వితీయ ముద్రణ : 2014

ప్రతులు : 500

ప్రకాశకులు : తులసి సుబ్బారావు,
డోర్ నం. 406, పృథ్వి, మైహోమ్ నవద్వీప
మాధాపూర్, హైదరాబాదు - 500081

ప్రతులకు : **తులసి సుబ్బారావు,** హైదరాబాదు, (మొ) 9849496017.
తూపురాణి నమ్మాళ్వార్, హైదరాబాదు, (మొ) 9441013775.
మైలవరపు యజ్ఞనాథం, కాకినాడ, (మొ) 9490365053.

This book is published with the financial assistance of
Tirumala Tirupati Devasthanams.

The Author / Publisher is responsible for any legal action in case of dispute or criticism if any arises after publication of this book.

వెల : రూ.300/- (మూడు సంపుటములు కలిపి)

కూర్పు : సుందర్ గ్రాఫిక్స్,
(మొ) 9391030025

ముద్రణ: సంహిత గ్రాఫిక్స్
(ఫోన్) 040 - 23741620

విజయతే శ్రీవేంకటేశః ప్రభుః

శ్లో॥ లభ్యతే దర్శనా ద్యస్య
నిర్వృతి ర్నేత్రయోః, హృది ।
బ్రహ్మానందానుభూతి శ్చ
తం భజే వేంకటప్రభుమ్ ॥

శ్లో॥ వినుతిః కలిదోషశోషణాయ
ప్రణతి ర్వాంఛితసిద్ధయే చ యస్య ।
స్మరణం చిరసౌఖ్యలబ్ధయే స్యాత్
కలయే తం హృది వేంకటాద్రినాథమ్ ॥

శ్లో॥ యో దేవ స్స్వజనావనాయ కృతసంకల్పోఽవతీర్ణః క్షితౌ
లక్ష్మీశోభితవిగ్రహః ప్రవిలసద్వైకుంఠరమ్యాలయః ।
అశ్రాంతోత్సవరాజితో ఘనదయాసింధు స్స బంధు స్సతాం
భక్తాభీష్టవరప్రదో విజయతే శ్రీవేంకటేశః ప్రభుః ॥

: సుబోధినీ సమర్పకులు :

మైలవరపు సుబ్రహ్మణ్యము

బోయనపల్లి కామేశ్వరరావు బి.ఏ.,

విషయ సూచిక

1. మంగళాశాసనము – శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు
ముముక్షుజన మహాపీఠాధిపతులు. (10)

2. అభినందనము – ఆచార్య సి.నారాయణరెడ్డిగారు
ఉపాధ్యక్షులు : తెలుగు విశ్వవిద్యాలయం (12)

4. సుబోధినీ సౌందర్యము – శ్రీ పేరాల భరతశర్మ, ఎమ్.ఏ (13)

5. పరిప్రేక్షణ – డాక్టరు యస్.సంజీవదేవుగారు డి.లిట్.
చిత్రకళానిష్ణాతులు. (16)

6. ప్రహర్షము – ఉ.వే.ప్ర శ్రీమాన్ కొ.శఠకోపాచార్యులుగారు
రిటైర్డు లెక్చరర్. (23)

8. ఆమోదము – ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, MA, Ph.D (25)

9. ప్రమోదము – శ్రీమాన్ డా॥ కందాళ వేంకటాచార్యులు MA, Ph.D (27)

13. అభినందనము – తూమాటి దోణప్ప (28)

14. శుభాశంసనము – జి.వి.జ్వాలానరసింహశాస్త్రి (29)

15. సుందరసుబోధినీ – చంద్రమౌళి శేషగిరిరావు (33)

16. సుందరనందనము – బుద్ధరాజు రామరాజు (35)

17. క్షేమంకరం – ఓగేటి పశుపతి (37)

3. సమ్మోద నివేదనము – సుబోధినీ సమర్పకులు (38)

7. హనుమత్ప్రణతి – సుబోధినీ సమర్పకులు (40)

10. జయతి పవనసూనుః – సుబోధినీ సమర్పకులు (45)

11. స్వీయనివేదనమ్ – సుబోధినీ సమర్పకులు (48)

12. ఆదికావ్యప్రశంస – సుబోధినీ సమర్పకులు (50)

విషయ సూచిక - II

విషయము	సర్గము	శ్లోకము	పుట
1. లంకనుండి వెడలుటకు ముందు హనుమ చేసిన ఆలోచనము	41	1	1
2. హనుమ రావణుని ప్రమదావనమును ధ్వంసము చేయుట	"	14	9
3. హనుమనుగూర్చి రాక్షసస్త్రీల ప్రశ్న : జానకి సమాధానము	42	5	17
4. హనుమచర్యలను రాక్షసస్త్రీలు రావణునకు వివరించుట	"	11	20
5. రావణుడు హనుమమీదకు కింకరాసురులను పంపుట	42	24	27
6. కింకరాసురులను గాంచి హనుమ విజయఘోషణము చేయుట	"	30	29
7. హనుమ కింకరాసురులను మడియించుట	"	40	34
8. చైత్య ప్రాసాద మారోహించి హనుమ తిరిగి విజయఘోషణము చేయుట	43	3	38
9. హనుమ చైత్యప్రాసాద మధిరోహించి వానరవీరుల శౌర్యము నుగ్గడించుట	43	18	46
10. జంబుమాలి యుద్ధవర్ణనము	44	1	50
11. జంబుమాలి మరణించుట	"	16	57
12. మంత్రిపుత్రుల యుద్ధవర్ణనము	45	1	61
13. మంత్రిపుత్రసప్తకము మరణించుట	"	12	66
14. సేనాపతిపంచకమును పంపుచు రావణుడు వారికి హితోపదేశము చేయుట	46	4	71
15. సేనాపతు లైదుగురును వరుసగ మృతినొందుట	46	27	83

16. యుద్ధసన్నద్ధుడై అక్షకుమారుడు హనుమమీదకు వచ్చుట	47	3	92
17. హనుమ అక్షకుమారుని యుద్ధకౌశలము మెచ్చుట	॥	16	101
18. హనుమ అక్షకుమారుని అంతమొందించుట	॥	31	112
19. రావణుడు ఇంద్రజిత్తుపరాక్రమమును శ్లాఘించుట	48	2	119
20. ఇంద్రజిత్తు రణభూమికి వచ్చుట	॥	16	129
21. ఇంద్రజిత్తు – హనుమల సంగ్రామము	॥	24	134
22. ఇంద్రజిత్తు హనుమను బ్రహ్మాస్త్రముచే బంధించుట	॥	35	140
23. రాక్షసులు హనుమను బంధించి రావణుని కడకు గొనిపోవుట	॥	46	147
24. హనుమ రావణుని వైభవమును గాంచి విస్మితుడగుట	49	16	165
25. రావణుని కోరికపై ప్రహస్తుడు “నీరాకకు కారణ”మే మని హనుమను ప్రశ్నించుట	50	1	169
26. హనుమ రావణునితో తాను శ్రీరాముని దూతగా అతనికడకు వచ్చితినని తెలుపుట	॥	12	175
27. హనుమ రావణునకు రామసుగ్రీవసఖ్యము, శ్రీరాముని సీతావియోగమునుగూర్చి తెలుపుట	51	1	180
28. సీతను అపహరించిన అపరాధము శ్రీరామునియెడ నొనర్చిన అధర్మము నీకు వినాశముతెచ్చునని తెలుపుట	॥	17	189
29. నీకు కలుగబోవు మహావినాశము తప్పించుకొనుట అసాధ్యమని తెలుపుట	॥	27	196
30. హనుమను వధింపుడన్న రావణుని ఆజ్ఞను విభీషణు డాక్షేపించుట	52	1	212
31. దూతను వధించుటవలన పెక్కు నష్టములు ఉన్నవని విభీషణుడు వివరించుట	॥	13	219

32. రావణుని ఆజ్ఞ ప్రకారము రాక్షసులు హనుమ వాలమునకు నిప్పు ముట్టించి నగరవీథులలో త్రిప్పుట	53	1	230
33. హనుమ వాలమును దహించుచున్నారని విని సీత అగ్నిదేవుని ప్రార్థించుట	"	23	243
34. తనయెడ అగ్ని శీతలుడగుట సీతారాముల ప్రభావము చేతనే అని గ్రహించి హనుమ రక్కసులను పరిమార్చుట	"	33	248
35. తనపై ప్రేమను జూపిన అగ్నికి విందుచేయుదు ననుచు హనుమ వాలాగ్నితో రాక్షసభవనములను దహించుట	54	1	255
36. దహింపబడుచున్న లంకానగరము యొక్క దృశ్యము	"	21	264
37. దగ్ధమగుచున్న నగరములోని వారి హాహాకారములు	54	36	273
38. హనుమ సాహసకృత్యమును దేవగణములు ప్రస్తుతించుట	"	49	282
39. హనుమ సీతాదేవికి హానిజరిగియుండునని పరితపించుట	55	2	285
40. అప్పటి శుభనిమిత్తముల వలన సీతకు హాని కలుగలేదని గ్రహించి హనుమ ఊరట నొందుట	"	22	295
41. హనుమ సీతనోదార్చి లంకాతీరమునందలి అరిష్టపర్వతము నారోహించుట	56	1	305
42. హనుమ తిరుగు ప్రయాణము, సముద్రలంఘన సన్నాహము	"	25	318
43. సముద్రలంఘన వర్ణనము	57	1	324
44. హనుమ సింహనాదమును వినిన వానరుల ఆనందము	"	18	332

45. మహేంద్రపర్వతముపై దిగి వానరముఖ్యులను చేరి వారికి హనుమ సీతా క్షేమమును తెలుపుట	57	30	337
46. మహానందముతో అంగదాదులు హనుమ ప్రజ్ఞను ప్రశంసించుట	॥	40	340
47. జాంబవంతుడు లంకనుండి వచ్చిన హనుమను అచటి విశేషముల నడుగుట	58	2	350
48. హనుమ తెలిపిన మైనాకవృత్తాంతము	॥	8	353
49. సురసావృత్తాంతము, సింహికాసంహారము	॥	21	359
50. లంకిణీవిజయము, సీతాసందర్శనము	॥	48	371
51. రావణుని ప్రార్థనము, సీత ఈసడింపు	॥	68	380
52. రావణక్రోధము - మండోదరి మందలింపు	॥	74	384
53. రాక్షసాంగనలను త్రిజట మందలించుట	॥	84	389
54. హనుమత్సీతాసంభాషణము, చూడామణిప్రదానము	॥	91	392
55. వనవిధ్వసనము, రాక్షససంహారము	॥	102	398
56. ఇంద్రజిత్తుచేత బంధనము	58	122	408
57. రావణునికి తెలిపిన సుగ్రీవసందేశము	॥	130	412
58. రావణుని క్రోధము - విభీషణుని నీతివచనములు	॥	139	416
59. లాంగూల దహనము, వాలాగ్నితో లంకాదహనము	॥	147	420
60. లంకనుండి తన తిరుగు ప్రయాణము	॥	159	427
61. సీతాశీలప్రశంస	59	1	430
62. వీరులమైన మనము సీతమ్మను తెచ్చి రాముని కర్పింత మనుట	॥	6	433
63. సీతాదురవస్థాకథనము	॥	23	442

64. హనుమ మాటకు అంగదుని అంగీకారము, జాంబవంతుని అసమ్మతి	60	1	449
65. కిష్కింధకు వానరుల పయనము - త్రోవలో మధువనవిహారము	61	2	456
66. వనపాలురతో పోరాటము	॥	19	465
67. అంగదు డభయమిచ్చుటతో పోరు ఘోరమగుట	62	5	472
68. సుగ్రీవునికి దధిముఖుని విన్నపము	॥	36	487
69. సుగ్రీవుడు వానరుల కార్యసిద్ధిని గ్రహించుట	63	16	497
70. దధిముఖునితో వానరులను వెంటనే పంపుమనుట	॥	28	503
71. తాను గ్రహించిన సంతోష విషయమును రామునకు తెలుపుట	64	26	518
72. హనుమ రామునకు మణి నొసగి సీతా వార్తలను తెలుపుట	65	7	529
73. శ్రీరాముడు చూడామణిని చూచుచు విషాదము నొందుట	66	1	542
74. సీతమ్మ రామునకు జ్ఞాపకము చేయుమన్న వాయస వృత్తాంతము	67	2	550
75. ఆమె మరల మరల తెలిపిన సందేశ వచనములు	67	18	559
76. హనుమ సీతమ్మ సందేహములను తీర్చుచు రావణ సంహారము, శ్రీరామ పట్టాభిషేకము శీఘ్రముగనే జరుగునని ఊరడించుట	68	7	575

శ్రీరామ పట్టాభిషేక ఘట్టము

77. శ్రీరాముని పట్టాభిషేకము	1	587
78. బహుమానములు, సత్కారములు	12	591
79 రామరాజ్యము, ప్రజాక్షేమము	37	605
80. పారాయణ ఫలశ్రుతి	40	607

★★★

మంగళాశాసనము

శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులు
ముముక్షుజన మహాపీఠము, శ్రీ కృష్ణాశ్రమము
పెదముత్తీవి , కృష్ణామండలము

ఓం నమో భగవతే వైకుంఠనాథాయ
ఓం నమ శ్రీసీతారామయతీంద్రాయ

శ్రీమద్రామాయణం అందరికీ అందుబాటులో ఉండేవిధంగా పదచ్ఛేద అన్వయక్రమ టీకాతాత్పర్య లఘువ్యాఖ్యలతో వ్యాప్తిలోకి వస్తే బాగుండును అని ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మావంటివారికి విందు అయింది మీరు ప్రచురిస్తున్న రామాయణం. సుందరకాండము నలభై సర్గలవరకు అయిదుసంపుటాలుగా ఇతఃపూర్వం అందుకున్నాం; ఆనందించాం. హనుమద్విక్రమము అన్న విశిష్ట శీర్షికతోడి ఆరవ సంపుటం ఇప్పుడు అందుకొని శిరసున ధరించాము.

"వ్రాసిన రామచంద్రకథ వ్రాసితినం చనిపించుకో –
వృథాయాసము కాక కట్టుకత లైహికమా? పరమా?" అన్నారట యశ శ్శరీరులైన విశ్వనాథ శోభనాద్రి మహాశయులు తమ పుత్రులు 'కవి సమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారితో.

'తండ్రి హరిజేరుమనియెడి తండ్రి తండ్రి'. వెనుక ఒకరిద్దరు ఇట్టి ప్రయత్నం చేసినమాట నిజమే కానీ ఆ ప్రచురణలు ఏవీ ఈనాడు ఆసక్తికల పాఠకులకు అందుబాటులో దొరకటం లేదు. అంతేకాక పూర్వవ్యాఖ్యాతలు చెప్పిన విశేషాలు – సంక్షిప్తంగా అయినా ఆ గ్రంథాలలో ఉన్నగుర్తు లేదు.

ఈనాడు మీరు చేస్తున్న ఈసేవ ఈనాటి ఆంధ్ర ఆస్తికలోకం శాశ్వతంగా గుర్తుంచుకుంటుంది. ఈ రచనకు మీరువాడిన భాష సులభసుందరంగా ఉంది. సరళమైన గ్రాంథికభాష. భాషలోని సారళ్యం జిగిని బిగిని ఏమాత్రం సడలించలేదు. అది విశేషం. మూలం చక్కగా వివరిస్తూ – విశేషార్థాలు అవసరమైన మేరకు, సంప్రదాయబద్ధంగా అందిస్తూ – ఇట్టి గ్రంథాలు ఎలా ఉండాలో ఒరవడి పెట్టారు అని అనిపించింది. ఇది "శ్రీ శ్రీ శ్రీ రామచరణ" శుశ్రూషాఫలం.

ఈ సందర్భంగా మీతో సహకరిస్తూ మీతో అద్వైతభావం భజిస్తున్న బ్రహ్మశ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యంగారిని ప్రత్యేకముగా అభినందిస్తున్నాం.

ఇదే క్రమంలో మిగిలిన భాగాలు అన్నీ ఎప్పుడు చూస్తామా, సమగ్ర రామాయణ సంగ్రహవ్యాఖ్యాతలుగా మిమ్ము ఎప్పుడు ఆశీర్వదిద్దామా అని ఎదురు చూస్తూ మంగళాశాసనం చేస్తున్నాను.

లక్ష్మణ యతీంద్రులు

అభినందన

ఆచార్య సి. నారాయణరెడ్డి
ఎం.ఎ, పిహెచ్.డి., డి.లిట్,
ఉపాధ్యక్షులు : తెలుగు విశ్వవిద్యాలయం
కళాభవనం, సైఫాబాదు
హైదరాబాదు

కవిత్రయం పుణ్యాన వ్యాసమహాభారతం తెలుగువారి ఇళ్లకూ లోగిళ్లకూ అందింది. పోతన చేతిచలువవల్ల వ్యాసమహాభాగవతం తెలుగు కృతే అన్నంత ఆత్మీయతను సంతరించుకుంది. ఎన్ని రామాయణాలు తెలుగులో వెలువడినా ఎందుకో సముచిత ప్రాచుర్యం లభించలేదు.

శ్రీ కామేశ్వరరావుగారు వాల్మీకి రామాయణంలోని సుందరకాండను పదచ్ఛేదం, అన్వయక్రమం, ప్రతిపదార్థం అన్న విభజనతో సుబోధకంగా తెలుగులో వివరిస్తూ ఈ సంపుటాలు వెలువరిస్తున్నారు.

వాల్మీకిహృదయం సామాన్య తెలుగు పాఠకులకు అవగతం కావడానికి ఈమార్గం ఉత్తమమైంది. అందుకు వీరికి నా అభినందన.

సి.నారాయణరెడ్డి

సుబోధినీ సౌందర్యము

'అవధానసరస్వతి', 'కవిపంచానన'
శ్రీ పేరాల భరతశర్మ, ఎమ్.ఏ.
ప్రభుత్వ మహారాజ సంస్కృత కళాశాల అధ్యక్షులు
విజయనగరం.

సుందరుని భావము సౌందర్యమా? సుందరి భావము సౌందర్యమా? సుందరీ సుందరుల భావమే సౌందర్యమా? దీనికి పరిష్కారముగా సీతారాములు ఒకే సౌందర్యము యొక్క రెండు రూపములుగా కనుగొన్నవాడు హనుమ. సౌందర్యం యొక్క సమగ్రమైన సాక్షాత్కారంకొఱకు తపించిన వానికంటె, ఆ సౌందర్యమును తన హృదయమున నిలుపుకొన్నవానికంటె సుందరుడు మరెవ్వరు? అటువంటి సుందరుడు తన విశ్వరూపంతో మనకు కనిపించే కాండము సుందరకాండము.

రామాయణమువలన మనం ప్రధానంగా పొందవలసిన ప్రయోజనం ఏమిటి? "రామస్య రామాయాశ్చ అయనమ్" రామునియొక్కయు రామయొక్కయు మార్గము తెలియాలి. అదే ప్రయోజనం. రామ రామా అయనం అన్నది – అతిసూక్ష్మం, అతివిస్తారము. అతిగహనము అత్యుదాత్తము. దానిని కనుగొన్నవానికంటె సుందరుడెవడు? ఆ సుందరుడు ప్రధానంగా నడిచే కాండము సుందరకాండము.

అర్థం తెలియక పారాయణం చేసినా గొప్పఫలితాన్ని కలిగించటంలో సందేహం లేదు. కాని అర్థం తెలిసికొని సుశబ్దంగా సుస్వరంగా సుష్ఠుగా పారాయణం చేస్తే దాని ప్రయోజనం ఇంత అంత అని చెప్పగలమా?

ఆ ప్రయోజనాన్ని పొందడానికి జనాన్ని అనుగ్రహించి శ్రీ బోయనపల్లి కామేశ్వరరావుగారు, శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యముగారు సుందరకాండములోని ప్రతిశ్లోకానికి పదవిభాగం, అన్వయం, ప్రతిపదార్థం వివిధవ్యాఖ్యాతలు చెప్పిన విశేషార్థాల సారాంశం గ్రుచ్చియెత్తి వివరంగా వ్రాస్తూ ఎనిమిది సంపుటాలలో ప్రకటిస్తున్నారు. ఇది ఆంజనేయస్వామి సముద్రసంతరణమంతటి ఘనకార్యము. సీతారాముల సమగ్రసౌందర్యదర్శనానికి అనుకూలించే కార్యము. 'స్వయం తీర్త్వా పరాం స్తారయేత్' అన్న దానికి నిదర్శనంగా తాము పొందిన ప్రయోజనాన్ని ఇతరుల కందించే ఉదారసంకల్పము. వారికి ఆంధ్రపాఠకలోకం భక్తకోటి ఋణపడి ఉన్నాము. ఆ ఋణము తీర్చుకోవడమంటే అది ఋషిఋణం తీర్చుకోవడం వంటిది.

ఈ సుబోధినీ వివరణ సహితమైన సుందరకాండాన్ని ఇంటింటా ప్రతివారూ

చదువుకోవాలి. అవగాహన చేసుకోవాలి. వాల్మీకిహృదయాన్ని తెలుసుకోవాలి. శబ్ద బ్రహ్మస్వరూపమున ఉన్న పరమాత్మను ఉపాసించడానికి తగిన సాధనాన్ని అందిపుచ్చుకోవాలి. అందుకే చిరకాలంగా భక్తులు రామాయణం పారాయణం చేస్తున్నారు. అందులో సుందరకాండ మరీ శ్రద్ధగా పారాయణం చేస్తారు.

ఒక మహాకావ్యం పారాయణగ్రంథంగా ఒక జాతిచేత నిత్యమూ ఆరాధింపబడటం మన దేశంలోనే ఉన్న సత్సంప్రదాయం.

రామకథ తెలియనివారు లేరు. లౌకికంగా పారమార్థికంగా ఎన్నో రహస్యాలు ఈ కథనుండి మానవజాతికి అవగతమైనాయి. దానికి కారణము పారాయణమే. ఋషులు చెప్పిన గ్రంథాలు వట్టి అక్షరాల ముద్దలు, వాక్యాల సంపుటులు కావు. ఋషులు తపించి తపించి తమ ప్రాణాన్ని తేజోమయంగా చేసుకుంటారు. వారు తమ ప్రాణశక్తిని అక్షరరూపాన భద్రపరచినపుడు ఆ అక్షరాలలో ఆ అక్షరాల పరంపరలతోడి పదాలలో వాక్యాలలో ఒక శబ్దజ్యోతి ఇమిడి ఉంటుంది.

'శమప్రధానేషు తపోధనేషు గూఢం హి దాహాత్మక మస్తి తేజః' అన్న కాళిదాసు మహాకవిభావనను మనం ఇక్కడ అనుశీలించి అర్థం చేసుకోవాలి. ఆ శబ్దాలలోని తేజస్సును తెలుసుకుంటే మన ప్రాణాలు ఆ తేజస్సుతో పచనం అయి పాకానికి వస్తాయి. అలా కాక వట్టి శబ్దాలుగా వాటిని ఉచ్చరించినా ఆ తేజఃప్రభావంచేత మన ప్రాణాలు అబోధపూర్వకమైన ఒక సుఖాన్ని పొందుతాయి.

పారాయణంలో పఠించిన గ్రంథంలోని అక్షరాలనుండి శబ్దం వస్తుంది కదా! ఆ శబ్దంలో ఋషియొక్క ప్రాణశక్తి ఉంటుంది. దానిని గ్రహించడానికి మన దగ్గర కొంత తపన ఉండాలి. అదే తపస్సు – అగ్ని. అప్పుడది వట్టి శబ్దంగా కాక నాదరూపంగా పరిణమిస్తుంది. అందుకనే రామాయణం వంటి ఒక ఆర్షగ్రంథాన్ని మనం శ్రద్ధతో నియమంతో నిష్ఠతో పారాయణం చేస్తున్నప్పుడు పవిత్రత సంపన్నం అవుతుంది.

ఆ ఆర్షకవి ఏ అక్షరాలలోనికి తన తపోమయమైన ప్రాణాన్ని ఊదినాడో ఆ ప్రాణము దీప్తిమంతము కావాలంటే ఆ అక్షరాలను పలుకుతున్న మనలో ఆర్తి, తపన, తపస్సు ఉండాలి. అప్పుడు ఆ అక్షరాలలోని ఋషుల ప్రాణశక్తి మన ప్రాణాలను సముజ్జ్వలింపచేస్తుంది. ఋషి తపశ్శక్తి అక్షరాలలో నాదరూపాన ఉంటుంది.

'న'కారో ప్రాణవాచకః 'ద'కారోఽగ్నివాచకః. ప్రాణాగ్నిసంయోగాన్నాద ఇతీర్యతే. మన ప్రాణమును తపోరూపమైన అగ్నిలో వ్రేల్చినపుడు నాదం పుట్టుతుంది.

పారాయణంలో రామకథను నాదరూపాన కరగించుకోవటంచేత పరాగతిని పొందని వాడుండడు, "శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్"

కనుక ముందు రామకథ మనకు స్పష్టంగా తెలియాలి. ఆ వాల్మీకి శ్లోకాలలో ఆధ్యాత్మిక లోకాలెన్నో ఉన్నాయి. అవి తెలియవలెనంటే ఆ శ్లోకాలలో, సమాసాలలో, పదాలలో పదసంధులలో వాని కూర్పులలో సుష్ఠుగా ఉన్న మధురమైన అర్థమును అందించే వాక్యాలలో ముని చెప్పిన రఘువరచరితమును మనం యోగ్యంగా అర్థం చేసుకోవాలి.

వాల్మీకి ముని ప్రతిశ్లోకం నాదరూపమైన పరబ్రహ్మయొక్క అక్షరరూపము. ఈ అక్షరరూపమైన శ్లోకబద్ధమైన సమాససంధియోగంతో నిరూపితమైన అర్థమాధుర్యాన్ని మనం గ్రోలినప్పుడు శ్లోకములలోని రామకథ నాదరూపంగా పరిణమించి మన పారాయణము శబ్దబ్రహ్మోపాసనముగా వికసిస్తుంది. విస్తరిస్తుంది.

అందుకు సహకరించే గ్రంథం ఈ సుబోధినీ వివరణ సహితమైన ఎనిమిది సంపుటాల సుందరకాండము.

"తెలిసి రామచింతన సేయవే మనసా"

పేరాల భరతశర్మ

పరిప్రేక్షణ

డా॥యస్.సంజీవదేవ్, డి.లిట్.
చిత్రకళానిష్ణాతులు

రామాయణం, మహాభారతం, భాగవతం వంటి గ్రంథాలు మన పురాణ వాఙ్మయానికి చెందినవి.

ఈ గ్రంథం రామాయణంలో సుందరకాండకు చెందింది.

ఈ గ్రంథకర్త కామేశ్వరరావుగారు రామాయణంలోని సుందరకాండను మాత్రమే తీసుకొని తెలుగు అనువాదంలోకి ఎనిమిది సంపుటాలలో ముగించారు.

కామేశ్వరరావుగారు, ఈయనకు సహకరిస్తున్న సుబ్రహ్మణ్యంగారు కూడ ప్రకాండపండితులు. తెలుగులోను, సంస్కృతంలోను కూడ వాల్మీకి రామాయణంలోని సుందరకాండను సంస్కృతమాతృకనుండి తెలుగులోనికి ఎనిమిది సంపుటాలుగా అనువదించారు.

ఈ ఆరవ సంపుటం పేరు "హనుమద్విక్రమం", అంటే మౌలికశ్లోకాలను, పదచ్ఛేద, అన్వయక్రమ, ప్రతిపదార్థ, వ్యాఖ్యానవిశేషసహితంగా అనువదించారు. అంటే ఇది విశ్లేషణాత్మక అనువాదం.

ఇదివరలో ఎందరో మహానుభావులు సంస్కృత వాల్మీకి రామాయణాన్ని, తెలుగులోకి అనువదించారు. గద్యరూపంలో, పద్యరూపంలో కూడా. వాటిలో వారు కథకు ప్రాధాన్యం ఇవ్వటమే కాని కథన విశ్లేషవిశేషాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు.

కొందరు పండితులు టీకాతాత్పర్యసహితంగా అనువదించారు కాని కామేశ్వరరావుగారి వలె ప్రతిశ్లోకాన్నీ ఇన్ని విధాలుగా విశ్లేషించి చూపలేదు. ఇదే ఈ గ్రంథంలోని ప్రత్యేకత.

దీనిలోని కథావిశేషాలను తెలుసుకోవాలి అనేవారు తాత్పర్యాన్ని చదువుకుంటే సరిపోతుంది. అదికాక భాషాపాండితిని, వాక్యనిర్మాణాన్ని, పద, పదార్థ వైచిత్రి మొదలైన వాటిని తెలియకోరేవారు విశ్లేషణ వివరాలను తెలుసుకొంటే సరిపోతుంది.

ఈవిధంగా ఈగ్రంథం సామాన్య పాఠకునికీ, అసామాన్య పాఠకునికి కూడ సమానంగా ఉపకరిస్తుంది.

వాల్మీకి రామాయణంలోని వైశిష్ట్యాలలో ఒక ప్రధానవైశిష్ట్యం ఏమంటే ఆయన కావ్యరచనలో అర్థాని కెంత విలువ ఉంటుందో శబ్దానికి అంత విలువ ఉంటుంది.

ఉత్తమకావ్యలక్షణం కూడ అదే; శ్రావ్యమైన శబ్దం, విషయవిశదీకరణగల అర్థం, శబ్దం నిమిత్తం అర్థాన్ని బలివ్వటం కాని, అర్థం నిమిత్తం శబ్దాన్ని బలివ్వటం కాని జరగరాదు.

నిజానికి సాహితీరచనలో శబ్దం నిమిత్తం శబ్దం కాక, అర్థాన్ని అభివ్యక్త పరిచేందుకు శబ్దం వాడబడుతుంది.

శుద్ధసంగీతంలో, అంటే రాగాలాపనలాంటి వాటితో, అర్థం కాక, కేవలం నాదం మాత్రమే ఉంటుంది. అటువంటి శుద్ధసంగీతం శ్రోతకు అర్థాన్ని కాక శుద్ధ అనుభూతిని ప్రసాదించి రసానందాన్ని కలిగిస్తుంది. ఇటువంటి సంగీతంలో అర్థంతో పనిలేదు, అనుభూతి మాత్రమే ప్రధానం.

ఈ పద్ధతి సాహిత్యానికి వర్తించదు. సంగీతానికి మాధ్యమం నాదం, సాహిత్యానికి వాక్కు, నాదానికి సంవేదన మాత్రమే ఉంటుంది కాని అర్థం ఉండదు. కాని వాక్కుకు నాదం ఉంటుంది, అర్థం ఉంటుంది.

వాల్మీకి ఆదికవి మాత్రమే కాదు, కావ్యరచనలో శబ్దం, అర్థంకూడ సమపాళ్ళలో ఉండాలని గ్రహించిన ఆదిలాక్షణికుడు కూడ.

ఆయన అర్థానికి ఎంత విలువ ఇచ్చాడో అర్థాన్ని అభివ్యక్తపరిచే మాధ్యమానికీ (శబ్దానికీ) అంత విలువ ఇచ్చాడు.

వాల్మీకి తన రచనల్లో శబ్ద సౌందర్యానికీ, అర్థగాంభీర్యానికి కూడ సమాన మర్యాద ఇచ్చాడు.

ఈ గ్రంథంలోని ఒక శ్లోకాన్ని చూతం.

"తత్తస్య రక్తం రక్తేన రంజితం శుశుభే ముఖమ్ ।
యథాకాశే మహాపద్మం సిక్తం చందనబిందుభిః ॥"

ఈ పై శ్లోకంలోని ప్రతీది ఒక శ్రావ్యపదం, గ్రంథకర్త విశ్లేషించిన రీతిని కూడా చూతాం.

పదచ్ఛేదము :- తత్ - తస్య - రక్తం - రక్తేన - రంజితం - శుశుభే - ముఖమ్ - యథా - ఆకాశే - మహాపద్మం - సిక్తం - చందనబిందుభిః ॥

అన్వయక్రమము :- రక్తేన రంజితం తస్య తత్ రక్తం ముఖం ఆకాశే చందనబిందుభిః సిక్తం మహాపద్మం యథా శుశుభే.

ప్రతిపదార్థము :- రక్తేన = నెత్తురుచే, రంజితం = పూయబడిన, తస్య = ఆ హనుమ యొక్క, రక్తం = ఎఱ్ఱనై యున్న, తత్ ముఖం = ఆ ముఖము, ఆకాశే = ఆకాశమున, చందనబిందుభిః = రక్తచందనబిందువులచే, సిక్తం = తడుపబడిన, మహాపద్మం యథా = గొప్పదైన పద్మంవలె, శుశుభే = శోభిల్లెను.

"**తాత్పర్యము** :- నెత్తురుచారలతో ముఖమంతయు నిండి ఎఱ్ఱనై కానవచ్చుచున్న హనుమముఖము రక్తచందనబిందువులతో తడుపబడి ఆకాశమునందు వికసించియున్న ఒక మహాపద్మమువలె ప్రకాశించెను."

పైన ఉదాహరించిన వాల్మీకి శ్లోకం ఎంత రమణీయంగా ఉన్నదో కామేశ్వర రావుగారి విశ్లేషణవైవిధ్యం అంత కమనీయంగా ఉన్నది.

ప్రాచీనకాలపు సాహిత్యం ప్రధానంగా పద్యమే కాని గద్యం కాదు. గద్యంకంటే పద్యం ఎక్కువగా చెవిమీద ఆధారపడి ఉంటుంది. ఒకప్పుడు సాహిత్యం ఎక్కువగా వాచ్యమే కాని లేఖ్యం కాదు. నోటితో పలకటమే కాని చేతితో వ్రాయటం ఉండేదికాదు.

లేఖాసాహిత్యానికంటే వాచ్యసాహిత్యానికి శబ్దప్రాధాన్యం ఎక్కువ స్థానం ఉండేది.

ఈ సత్యమే వాల్మీకిశ్లోకాల్లో గోచరిస్తుంది. ఆయనది శబ్దజాలం కనుకనే సునాదాన్ని కలిగి ఉండేది అది.

అసలు ఆలోచనకుకాని, అనుభూతికికాని శ్రావ్యరూపంకాని దృశ్యరూపంకాని లేవు. వాటిరూపం నైరూప్యమే, వాటిశబ్దం నిశ్శబ్దమే.

ఆలోచనలు, అనుభూతులు అభివ్యక్తం కావాలంటే ఒక శ్రావ్యమాధ్యమాన్నో, దృశ్యమాధ్యమాన్నో తీసుకోవలసి వచ్చేది.

అందుకు వాల్మీకి శబ్దమాధ్యమాన్నే తీసుకొన్నాడు. అందుకే ఆయన కావ్యంలో అర్థానికిచ్చినంత ప్రాధాన్యం శబ్దానికి కూడ ఇచ్చాడు.

లంకలో సీత ఉంటున్న అశోకవనం హనుమంతుని ధ్వంసకాండ మూలంగా శోకవనం అయినదట.

"సా విహ్వలాశోకలతాప్రతానా
వనస్థలీ శోకలతాప్రతానా ।
జాతా దశాస్యప్రమదావనస్య
కపే ర్బలాద్ధి ప్రమదావనస్య ॥"

ఇందులో పదప్రయోగం ఎంత లలితంగా ఉన్నదో అర్థం కూడ అంత రమణీయంగా ఉన్నది. కామేశ్వరరావుగారి మాటల్లో దాని తాత్పర్యం ఇది:

'సీతాదేవి నివసించుచున్నట్టి ఆ రావణుని ప్రమదావనమున అశోకలతలు అన్నియు చెదిరిపోయినవై ఆ వనభూమియందు హనుమగావించిన విధ్వంసకృత్యము వలన వెనుకటి అశోకవనమిప్పుడు శోకవనము అయినది.'

పై శ్లోకంలోని పదాలు పారిజాతాలవలె ఉన్నాయి. అందులోని భావాల పరిమళంతో వినిపించే పదాలద్వారా వినిపించని భావలహరి ప్రతిధ్వనించింది.

హనుమంతుని పరాక్రమమంతా ఈ సంపుటంలో చాలావరకు కావ్యస్థమైంది. అందుకే ఈ సంపుటానికి 'హనుమద్విక్రమము' అనే నామకరణం చేయబడింది.

హనుమంతునిచేత అక్షకుమారుడు మృతుడైనట్లు తెలుసుకొని రావణుడు ఇంద్రజిత్తుతో అంటాడు, ఇంద్రజిత్తు సమరశక్తి ప్రతిభను గురించి అందుకు సంబంధించిన ఈ క్రిందిశ్లోకం ఒక శ్రవ్యవైచిత్రిని ప్రదర్శిస్తుంది.

"న తేఽ స్త్యశక్యం సమరేషు కర్మణా
న తేఽ స్త్యకార్యం మతిపూర్వమంత్రణే ।
న సోఽ స్తి కశ్చిత్ త్రిషు సంగ్రహేషు వై
న వేద య స్తేఽ స్త్రబలం బలం చ తే ॥"

ఇందుకు కామేశ్వరరావుగారి తాత్పర్యం : -

'యుద్ధములందు నీవు నిర్వహింపజాలని అసాధ్యకృత్యము ఏదియును లేదు, ఈ మూడు లోకములందును నీ అస్త్రబలమును గురించిగాని శరీరబలమును గురించి గాని తెలియనివాడు ఎవ్వడును లేడు.'

ప్రతికాలంలోను, గడచిపోయిన కాలంలో కాని గడుస్తున్నకాలంలో కాని, ‘బలం’కు ఉన్నబలం మరోదానికి లేనట్లు కనిపిస్తుంది! అన్నిటికీ బలం ప్రధానం. శరీరబలం, మానసికబలం, ఆత్మబలం, అస్త్రబలం, శస్త్రబలం, ఇతరులను చంపే బలం, తాను స్వయంగా చచ్చే బలం, ఎన్నో మరెన్నో బలాలు అవసరం. ఈ లోకంలో బలం ఉన్న మనిషి సబలుడు, బలంలేని మనిషి దుర్బలుడు.

అందుకే రావణుడు ఇంద్రజిత్తుకు ‘బలం’యొక్క బలాన్ని గురించి ప్రబోధించసాగేడు.

నేడు మనం మంత్రబలాన్ని దాటి యంత్రబలంలో నివసిస్తున్నాం. అయితే క్రమేణ ఈ పరమాణుయుగంలో స్థూలయాంత్రికత తన యంత్రబలాన్ని సూక్ష్మమైన నైరూప్యంలోకి రూపాంతరపరుస్తూ మంత్రబలంలాంటి అతిసూక్ష్మబలంలోకి ప్రవేశింప చూస్తూంది. జడం క్రమేణ చేతనామయం అవుతుంది.

రామాయణ యుద్ధానికి మాత్రమే కాదు బలం కావలసింది, రామాయణ రచనకు కూడ బలం కావాలి. ఒకటి స్థూలబలం, రెండవది సూక్ష్మబలం. ఒకటి దేహబలం, రెండవది బుద్ధిబలం. యుద్ధం తాత్కాలికం, రచన చిరకాలికం.

రామాయణయుద్ధం, కొందరు ఓడిననాడు – మరికొందరు గెలిచిననాడుతో అంతమైంది; రామాయణరచన నేటికీ మిగిలే ఉన్నది; అసంఖ్యాకపాఠకులకు, శ్రోతలకు ప్రాణప్రేరణ నిస్తూనే ఉన్నది.

దాని మాతృక సంస్కృతంలో రచించబడినా, అనువాదం అనే అద్భుత సాధనం ద్వారా అది అన్యభాషల్లోకి ప్రవేశిస్తున్నది.

అటువంటి సంస్కృత రామాయణాన్ని మన కామేశ్వరరావుగారు సామాన్య అనువాదం కాక సాంకేతికమైన విశ్లేషణాత్మక అనువాదం చేసి తెలుగు పాఠకులకు నూతనకిరణాన్ని చూపేరు.

ఆధునికయుగంలో పౌరాణిక కావ్యాలు అవసరమా? దీని జవాబుకు ముందు మరోప్రశ్న ఉదయిస్తుంది. ఆధునికయుగంలో, పరమాణువైజ్ఞానికయుగంలో అసలు కావ్యాలు అవసరమా అని.

మానవుడు ఆలోచనలో మాత్రమే జీవించలేడు, ఆనందంతో కూడ జీవించాలి. ఆనందం లేని ఆలోచన ఎండుఎడారి మాత్రమే అవుతుంది.

అందుకే మానవుడికి ఆలోచనజ్వాలకు తోడు రసానుభూతి సుగంధంకూడ అవసరం. అందుకే అనేది – వైజ్ఞానికయుగంలో కావ్యాలు పూర్వం కంటే ఎక్కువ అవసరమని.

ఆధునికయుగంలో కావ్యాలు అవసరమని తేలినప్పుడు ఆ కావ్యాలు పౌరాణికాలా, సామాజికాలా అనే చర్చ అవసరంలేదు. ఒకో తరహా కావ్యం ఒకో తరహా రసానుభూతిని ప్రసాదిస్తుంది. అటువంటి కావ్యాలు ప్రాచీనాలు కావచ్చు. అర్వాచీనాలు కావచ్చు.

పాఠకులు మూడు విధాలుగా ఉంటారు. సాధారణంగా సంస్కృతంతో అసలు పరిచయం లేనివారు, సగం పరిచయం ఉన్నవారు, పూర్ణపరిచయం ఉన్నవారు.

సంస్కృతంతో అసలు పరిచయం లేనివారికికూడ ఆ భాషను చదువుతుంటే అర్థంకాకపోయినా చెవికి ఇంపుగా వినిపిస్తుంది.

సగం పరిచయం ఉన్న వారికి వాక్యాలు మొత్తం అర్థం కాకపోయినా, అర్థం అవుతున్నట్లు ఆభాస జనిస్తుంది.

ఇక ఆ భాషతో పూర్ణపరిచయం ఉన్నవారికి ఆ భాషలో ఉన్న అసలు అర్థానికి మించికూడ విశిష్టార్థం జనిస్తుంది.

సంస్కృతంలో అసలు పరిచయం లేనివారికి కామేశ్వరరావుగారి ఈ గ్రంథాన్ని చదివితే అసలు సంస్కృతం అంటే ఎట్లా ఉంటుందో దాని స్థూలరేఖలు తెలుస్తాయి.

సగం పరిచయం ఉన్నవారు ఈ గ్రంథాన్ని చదివితే సంస్కృత భాషలోని స్థూలరేఖలేకాక సూక్ష్మరేఖలుకూడ తెలుస్తాయి వారికి.

ఇక మూడవ వర్గంవారైన పూర్ణపరిచయం ఉన్నవారు దీన్ని చదివితే వారికి సంస్కృతపు స్థూలరేఖలు తెలుస్తాయి, ఇంకా తెలుస్తాయి తెలుసుకోతగినవన్నీ, ఇంకా తెలుస్తాయి తెలిసినవాటికంటె మించికూడ.

ఈ గ్రంథంలోని ప్రతిశ్లోకంలోని వాక్యనిర్మాణం, పదవిన్యాసం, శబ్దవిశ్లేషణ, అర్థవివరణ, భావాభివ్యక్తి మొదలైన కావ్య సామగ్రి అంతా నగ్నరూపంలో ప్రత్యక్ష పరచబడింది అనువాదకుని అశేష సాహితీ ప్రతిభ ద్వారా.

ఈ కృషిలో కామేశ్వరరావుగారికి తోడునీడ అయి నిలచి సర్వవిధాలా

సహకరించి ఈ మహాకార్యాన్ని (మహాకావ్యాన్ని) ఈ విధంగా రూపొందించిన విద్యాప్రవీణ, భాషాప్రవీణ శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యముగారు శ్లాఘనీయులు.

సంస్కృతం, కొందరంటున్నట్టుగా, మాతృభాషకాదు; అదొక అద్భుతభాష; అదొక శాస్త్రీయభాష, రచనాత్మక భాషకూడ.

వాల్మీకి రామాయణం, అందులోని కథను వదలినా కూడ మహాకావ్యంగా నిలవగల సాహితీశిల్పాన్ని, రససృష్టిని కలిగి ఉండటం ప్రమోదకరమైన విషయం.

దాన్ని తెలుగు అనువాదరూపంలో, సాహిత్య శాస్త్రఛాయల్లో శిల్పించిన నిపుణశిల్పి శ్రీ కామేశ్వరరావుగారు, వారితో సహకరించిన శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యముగారు తెలుగుపాఠకులకు చిరసంస్మరణీయులు.

భాషలో వాక్యానిది పెద్దస్థానం, అయితే, మనిషి వాక్యంతో మాత్రమే జీవించజాలడు. వాక్యం కావ్యంగా శిల్పించబడాలి. ఆ వాక్యం కావ్యంగా మారినపుడే మనిషి మేధావిగా మాత్రమేకాక రసజీవిగాకూడ తన జీవననౌకను ఈ భవసాగరపు కెరటాలమీద నర్తనశీలి అయి నడపగలడు!

ఎన్.సంజీవదేవ్

శ్రీమతే రామానుజాయ నమః

ప్రహర్షము

సాహిత్య విద్యా ప్రవీణ, భాషాప్రవీణ
ఉ.వే.ప్ర.శ్రీమాన్ కందాళ శఠకోపాచార్యులు,
రిటైర్డు లెక్చరర్ – మహారాజ సంస్కృతకళాశాల
విజయనగరము.

సుబోధినీ సమర్పకులు ప్రేమతో నాకు పంపిన సుందరకాండముల సంపుటములు ఐదును అందుకొని ఆసక్తితో ఆమూలాగ్రము చదివితిని. ఇది నాకు నిత్యపారాయణ ప్రవచనములలో నున్న పూజనీయగ్రంథము. చాల సంతోషమైనది. ఆ ఆనందమును తెలుపుటకు కొద్దిమాటలు వ్రాయుచున్నాను.

సంస్కృతాంధ్ర సాహిత్య ప్రవీణులు శ్రీ సుబ్రహ్మణ్యముగారును, ఆంధ్రాంగ్ల సాహితీకోవిదులు శ్రీమంతులు కామేశ్వరరావుగారును శ్రీరామ శరణ్ గురువర్యుల శిష్యులు, శ్రీసీతారామాంజనేయ సద్భక్తులు, జన్మాంతర సుకృత విశేషముచే మంచి ప్రతిభావ్యుత్పత్తులు కలవారును అగుటచే తమ జీవితమును ఇట్టి సత్కార్యములతో సార్థకము చేసికొనుచున్నారు.

దైవసంకల్పమువలననే వీరుభయులకును మైత్రి కలిగినది. అదియే వీరిని ఇట్టి అపూర్వ కార్యకరణ దక్షులను చేసినది. "న హి కర్మసు సీదన్తి మహత్స్వమిత తేజసః" అని వాల్మీకి సుందరకాండములో చెప్పినట్లుగా వీరు సీతారామ హనుమ దుపాసనామితతేజస్కులగుటచేతనే మానసికఆర్థికశ్రమల కోర్చి నిర్వేదముచెందక పరస్పరసహాయముతో లోకోపకారమైన ఈకృషిని ఇట్లు నిర్వహించుచు తెలుగువారిని తరింపచేయుచున్నారు.

సంస్కృతమునందు ప్రవేశము చాలక పోయినను ఈ సుందర పవిత్ర కృతియందు మిక్కిలి భక్తి, ఆసక్తి కలిగియున్న వారెల్లరికిని సుబోధకమగునట్లుగా చక్కని ప్రణాళికను వేసికొని, వ్యయప్రయాసలకు లెక్కచేయక, ఎన్నో ప్రాచీన నవీన వ్యాఖ్యాన విమర్శ విశేషములను అందించుచున్న వీరికృషి సర్వశ్లాఘ్యము.

ముఖ్యముగా వాల్మీకి వెల్లడింపదలచుకొన్న సీతారామహనుమంతులయొక్క బాహ్య ఆంతర సౌందర్యమునంతను లోకమునకు తెలియచేయుటలో వీరు కృతార్థులైనారని నా నిశ్చయము. ఆ పావనమూర్తుల దివ్యమంగళ విగ్రహములను

మన మనోనేత్రములముందు నిలిపి చూపుచున్న ఈమిత్రులిరువురి యత్నము సర్వదా ధన్యము.

ఈ ధన్యజీవులపై నాకుగల స్నేహగౌరవములతో ఈ పావనవిశేష సుందరకృతి సంపుటములు చదువుచుండగా ఎన్నో విషయములు చెప్పవలసినవి కనబడినవి. కాని గ్రంథవిస్తరభీతిచే నా "ప్రహర్షమును" సారాంశముగా మాత్రమే ఇప్పుడిట్లు వెల్లడించుట జరిగినది.

ఇట్టి విశేష విషయములనే తెలుగులోకమునకు తేటతెల్లము చేయుచు ఈ మిత్రద్వయము శ్రీసీతారామ హనుమానుల కరుణా విశేషముచే శ్రీమద్రామాయణము నంతనుకూడ ప్రచురింపగల శక్త్యుత్సాహములు ఆయుర్భాగము కలవారగుదురుగాక.

కందాళ శఠకోపాచార్యులు

ఆమోదము

ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారు
MA, Ph.D
తెలుగు విశ్వవిద్యాలయము
బొమ్మూరు – రాజమండ్రి.

"బ్రహ్మలోకంనుంచి భూలోకానికి అవతరిస్తున్న భారతీదేవికి ప్రథమ విశ్రామశాఖ" అన్నాడు వాల్మీకిని అనర్ఘ రాఘవకర్త మురారిభట్టు.

"ఈ సంసార మిదెన్ని జన్మలకు నేనీ మౌని వాల్మీకి భాషా సంక్రాంత ఋణంబు దీర్పఁగలదా! సత్కావ్య నిర్మాణరేఖా సామగ్రి ఋణంబు దీర్పఁగలదా!" అని విశ్వనాథవారు ఆశ్చర్యపోయారు.

"మానవుడు ఎలా ఉన్నాడో చెబుతుంది భారతం, ఎలా ఉండాలో చెబుతుంది రామాయణం" అన్నారు మా గురుదేవులు.

ఇన్ని రకాలుగా వీను మిగిలినది – చతుర్వింశతి సాహస్రిక శ్రీమద్రామాయణం. అది భారతీయసంస్కృతికి ప్రాణం. ప్రాంతీయభాషాకవులకు కావ్యవస్తునిధానం. ఏదో రకంగా రామాయణాన్ని స్పృశించని కలంగానీ గళంగానీ లేవు.

ఆ రామాయణానికి ప్రాణస్నాయువు సుందరకాండ. కవితాపరంగా తాత్త్వికంగా ఈ కాండకు ఉన్న ప్రాముఖ్యాన్నీ, ప్రాశస్త్యాన్నీ గుర్తించి శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యం గారూ, శ్రీ బోయనపల్లి కామేశ్వరరావు గారూ దీనికి సమగ్రంగా వ్యాఖ్యానం సంతరించి ఆంధ్ర జిజ్ఞాసువులను ఋణగ్రస్తులను చేస్తున్నారు. ఏదో అర్థతాత్పర్యాలు రాయడంగా కాకుండా వివిధవ్యాఖ్యానాలను పరిశీలించి వివిధ సంప్రదాయాలను అనుశీలించి ఆ యా విశేషాలను కూడా నాతిదీర్ఘంగా పొందు పరచడం వీరి కృషికి అద్వితీయతనూ, అపూర్వతనూ సమకూరుస్తోంది. ఇకనుంచి ఆంధ్రదేశంలో ఆస్తికమహాజనుల సుందరకాండ పారాయణ సార్థకమవుతుంది. అందరి పక్షానా భవిష్యత్తరాల పక్షానా ఈ జంట రచయితలకు కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

శ్రీరాముని కళ్యాణ గుణాలను ఏకరువు పెడుతూ వాల్మీకి "కృతజ్ఞశ్చ" అన్నాడు. కృతజ్ఞత్వం అనేది అంత ప్రత్యేకంగా పేర్కొన వలసిన గుణం అని వాల్మీకి సంభావన. జనాభా పెరిగి మానవ సంఖ్య తరిగిపోతున్న ఈ రోజుల్లో ఇది మరీ ప్రత్యేకంగా గుర్తుపెట్టుకోవలసిన అంశం. ఈ దృష్టితో ఆర్ద్రమైన హృదయంతో వీరికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుతూ సెలవు.

భవదీయుడు

బేతవోలు రామబ్రహ్మం

ప్రమోదము

శ్రీమాన్ కందాళ వేంకటాచార్యులుగారు
MA, Ph.D
విశ్రాంతాంధ్రోపన్యాసకులు
విజయనగరము.

శ్రీరామాయణము వామలూరుభవుని తపఃఫలము. ఎంతవానికంతగా నర్థమును ప్రసాదించునది. వేదవేద్యుడు రాముడు కాగా వేదము రామాయణ రూపమున వాల్మీకి కోకిల కుహూనాదమున ఆవిర్భవించినది.

శ్రీ రామాయణ భూషణ మను వ్యాఖ్యానమును అనుగ్రహించిన గోవిందరాజు "క్వాహం మందమతిః గభీరహృదయం రామాయణం తత్ క్వ చ" అని నివ్వెరపోయిరి. తత్త్వదీపికావ్యాఖ్యాత యగు మహేశ్వరతీర్థులు "నానాటీకాస్థవాక్యాని లిఖ్యన్తేఽత్ర యథామతి,..., లేఖకోఽహం న కల్పకః" అన్నారు. అట్టి రామాయణమున తిలకాయమానము సుందరకాండము, దీని వ్యాఖ్యకు 'శృంగారతిలకము' అని సార్థక నామముంచి మురిసిపోయినారు గోవిందరాజులు.

అట్టి మహోన్నత గ్రంథమైన దీనిలోని వివిధ విషయములను వ్యాఖ్యాత లనేకులు సంస్కృతముననను, ఆంధ్రముననను ఎట్లు వివరించిరో పరిశీలించి సుబోధినీ వ్యాఖ్య పేర సుబోధకముగ ఆంధ్రపాఠకులకు అందించిన మహనీయులు శ్రీయుతులు మైలవరపు సుబ్రహ్మణ్యముగారు, శ్రీయుతులు బోయనపల్లి కామేశ్వరరావుగారు. వీరిరువురి కృషి ఫలితముగా వెలసిన యీ గ్రంథము ఆంధ్రుల భాగ్యపు పంట.

హనుమ రావణునకు చేసిన హితబోధలోని 'ధర్మశ్చాధర్మనాశనః' 'ఇంద్రో మహేంద్రస్సురనాయకో వా' వంటి శ్లోకముల భావము చాల సుగమముగా చక్కగా వ్రాసిరి. చాల సంతోషమైనది.

ఆంధ్రలోకము ఈ గ్రంథమును పఠించి ధన్యమై కృతికర్తల ఋణమును తీర్పవలెనని ఆశించుచున్నాను.

ఇట్లు
భవదీయుడు
కందాళ వేంకటాచార్యులు

అభినందనము

ఆచార్య తూమాటి దోణప్పగారు,
తొలి ఉపాధ్యక్షులు,
తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు.

శ్రీ కామేశ్వరరావుగారికి

ఆదరపురస్సరంగా మీ రంపిన సుబోధిని, సుందరకాండం ఏడు సంపుటాలు అందాయి. రోజు కొక సంపుటం వంతున వారం రోజులలో అన్నీ పరిశీలించాను.

సామాన్యులకు సైతం చక్కగా అర్థమయ్యే రీతిలో అన్ని అంశాలు సమగ్రంగా శాస్త్రీయంగా వివరణం సాగింది. పూర్వవ్యాఖ్యాతల తీర్పులను చేర్చడం మరింత ఆనందవర్ధనం.

అంతా సర్వాంగసుందరంగా అమరింది. హార్దికమైన అభినందనలు. మీ కృషి ప్రశంసార్హం.

ధన్యవాదాలతో
తూమాటి దోణప్ప

శుభాశంసనము

"సాహిత్య కళా తపస్వి"
జి.వి.జ్వాలా నరసింహశాస్త్రి,
బి.కాం, బి.యల్.
అడ్వకేటు : పబ్లిక్ నోటరీ, చీరాల

యః కర్ణాంజలి సంపుటై రహరహ స్సమ్య క్పిబ త్యాదరా
ద్వాల్మీకే ర్వదనారవిన్దగళితం రామాయణాఖ్యం మధు ।
జన్మవ్యాధిజరావిపత్తిమరణైః అత్యంతసోపద్రవం
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్ ॥

పుట్టుటలు, వ్యాధులు, ఆపదలు, ముదుసలితనాలు, చావులు చర్వితచర్వణం అవుతుంటే, సంసారభారాన్ని మోయలేక, భవబంధాలచేత కట్టుబడి, అవస్థల పాలౌతున్న ప్రాణికోటికి అపూర్వమైన మధువును "రామాయణ" మనే రూపంలో ప్రసాదించి, తరించడానికి మహోపకారం చేసిన వాల్మీకిమహర్షి చరణకమలములకు సహస్రప్రణామములను సమర్పించుకొన్ననూ యీ సంసారము ఆయనకు ఎల్లప్పుడూ ఋణపడియే ఉంటుంది.

"అచ్చమైన యమృత మమరులు త్రావినా
రోయి! దాని కే నసూయపడను
పరమమౌనియైన వాల్మీకి కృత రామ
సత్కథాసుధారసంబుఁ ద్రావి"

"ఈ సంసార మిదెన్ని జన్మలకు నేనీ మౌని వాల్మీకి భా -
షా సంక్రాంత ఋణమ్ము దీర్పగలదా! సత్కావ్యనిర్మాణరే - ।
ఖాసామగ్రి ఋణమ్ము దీర్పకలదా! కాకుత్థ్సుడౌ స్వామిగా -
థా సంపన్నము భక్తిఁదీర్చినను ద్వైతాద్వైతమార్గమ్ములన్"

అని కవిసామ్రాట్ విశ్వనాథ, కల్పవృక్షావతారికలో ప్రశంసించారు.

శ్రీరామ కథగా, సీతాదేవికథగా, పౌలస్త్యవధకథా విశేషంగా పఠనమునకు ప్రాచుర్యం పొందిన వాల్మీకిరామాయణం సర్వలక్షణలక్షితంగా, గాయత్రీ

మహామంత్రార్థపూర్ణంగా, సకలవేద వేదాంగ ఉపనిషద్భాష్య మందరంగా అధ్యాత్మ విదులచే మంత్రశాస్త్రవేత్తలచే పరమ ప్రమాణ పారాయణ పాత్రమైనది.

ఈ రామాయణమును ఎన్ని విధాల ఎందరో మహానుభావులు ప్రాంతీయ భాషలలోనికి అనువాదం చేసినా, వాల్మీకి హృదయగతార్థములను గీర్వాణవాణిలో నిర్భరమైనట్లుగా, వ్యాఖ్యానాలు, ఎన్ని వచ్చినా, వాల్మీకి వదనారవింద గళితం అయిన రామాయణాఖ్య మధువుయొక్క స్వాదుగుణము యితరత్రా కొరవడుతూనే ఉంది. అందుకే ఆంధ్రీకృత, తమిళానువాద, హిందీభాషాగత రామాయణములను చదివి ఆనందిస్తూనే మూలంలో వాల్మీకి ఎలా అన్నాడో, ఎలా రచించాడో తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రతివారిలోనూ సహజంగా ఉంటున్నది.

ఇదంతా ఎందుకు చెప్పడం అంటే, ఇంతకాలానికి కూడా వాల్మీకి విరచిత సంస్కృతభాషాగత శబ్దవృత్తి అర్థప్రతిపత్తియొక్క ప్రాధాన్యమును తెలుసుకోడానికే!

ఆ ప్రధానలక్ష్యమే శ్రీమైలవరపు సుబ్రహ్మణ్య శ్రీ బోయినపల్లి కామేశ్వరరావు మహోదయులను ప్రేరేపించగా పదపదార్థ టీకా తాత్పర్యములతో సరిక్రొత్త ప్రతిని మరల ఆంధ్రుల హస్తాలకు అందించవలెనని కృషికి దీక్షాకంకణులైనట్లు అనుకొన వలెను.

ప్రస్తుతానికి రామాయణ మహాగ్రంథంలో అతి ముఖ్యమైన సుందర కాండకు యీ కృషిని ఎన్నుకోడం హర్షదాయకం. సుందరకాండ పలువురకు పారాయణ గ్రంథంగా యిష్టార్థసిద్ధి నిచ్చు మంత్రరాజముగా యీనాటికీ ప్రచారంలో ఉన్నది. సంస్కృత భాషా జ్ఞానం లేనివారు చక్కగా తాము పఠించే శ్లోకార్థాలను అవగతం చేసుకుంటూ మననం చేసుకుంటూ యున్నప్పుడు వారికి విశేషపరిజ్ఞానం, వారి పాఠ్యాంశం పట్ల ప్రత్యయము, లెస్సగా కల్గి, ఏకాగ్రతకూ, ఆసక్తికీ, సంపూర్ణ స్వాదనకూ ఆలంబనం అవుతుంది.

ఇంతటి ఘనకార్యం చేపట్టిన కృతికర్తలు శ్లాఘనీయులు, ఈ సుందరకాండ యొక్క ప్రాముఖ్యం పండితులకు తెలియనిదికాదు.

"సుందరే సుందరో రామః, సుందరే సుందరీ కథా
సుందరే సుందరీ సీతా, సుందరే సుందరం వనం
సుందరే సుందరం కావ్యం, సుందరే సుందరః కపిః
సుందరే సుందరం మంత్రం, సుందరే కిం న సుందరమ్?"

'నష్టద్రవ్యస్య లాభో హి సుందరః పరికీర్తితః'

ఇట్టి కాండమును చక్కగా తెలుగు పాఠకులకు అవగతం కావాలనే సులభ శైలిలో, వాల్మీకి ప్రయోగించిన కొన్ని గూఢార్థములతో కూడిన శబ్దములకు అపచారం జరుగకుండా అనగా, "రహస్యం చ ప్రకాశం చ యద్ వృత్తం తస్య ధీమతః" అన్న విషయాన్ని మనసునం దుంచుకొని చేస్తున్న అనువాదము యిది.

లోగడ వావిళ్ళవారూ మరి కొందరు ప్రచురణ కర్తలూ తాత్పర్యమును మాత్రం యిస్తూ సంస్కృతమూలమును ముద్రించినారు. కాని ప్రతిపదార్థ టీకా భావార్థ, విశేషార్థ ప్రవచనం చేసినట్లు తెలియదు. ఆ కొరతను శ్రీ మైలవరపు వారు, శ్రీ బోయినపల్లివారు పూర్తి చేసినారు. ఈ కృషికి అసాధారణ పాండిత్యం కావాలి, వ్యాఖ్యాతలను అర్థం చేసుకోవాలి. ఉభయభాషలయందు దర్శనములయందు ఉత్తమమైన సంస్కారం ఉండాలి.

అది శ్రీ సుబ్రహ్మణ్యము కామేశ్వరరావుగారలయొక్క రచనలో కన్పిస్తున్నది. భాషకూడ అటుకేవలం గ్రామ్యం కాకుండా, జటిలగ్రాంథికం కాకుండా, వీలైనంత సులువుగా అర్థమయ్యే శిష్టుల భాషనే యీ అనువాదంలో ఉపయోగించారు.

వాస్తవంలో ఇది "సుబోధినీవివరణ" సహితమే! సుందరకాండమును సశాస్త్రీయంగా విభజించి, ఆ ప్రకారం సులువుగా హస్తగతం చేసుకొనుటకు అనువుగా సంపుటాలను ఎన్నుకోవడంలో రచయితలయొక్క సూక్ష్మదృష్టి తెలుస్తున్నది.

ప్రకృతం "క్షేమనివేదనము" అను శీర్షికతో ఈ చివరి సంపుటాన్ని అందిస్తున్నారు.

మానసికసంక్షోభంనించి సీతాక్షేమనివేదనము చేసి రామచంద్రుడికీ, అట్లే రామభద్రుని కుశలవార్తాహరుడై సీతాసాధ్వికీ, దుఃఖవిమోచనం కల్గచేసిన ధన్యజీవి, పరమభాగవతోత్తముడు, శ్రీ ఆంజనేయస్వామి!

లంకలో శత్రువుల గుండెలలో సంక్షోభాన్ని తాను సృష్టించి, అవసరమైనంత సంక్షయం చేసి, సంక్లిష్టకర్తవ్యమును తన ప్రజ్ఞతో సాధించిన మతిమంతుడు, బుద్ధిమంతుడు, హనుమంతుడు! హనుమత్సందేశము సంక్షేమనివేదనమే! రావణుడికి కిట్టనందున సంకీర్ణపరిస్థితులను కొనితెచ్చుకొన్నాడు. "దాసోఽహం కోసలేంద్రస్య, రామస్యాక్లిష్టకర్మణః" అని చెప్పుకొన్న ధైర్యశౌర్యవీర్యవంతుడు.

ఈ ప్రకరణంలో అందరికీ క్షేమం ప్రాప్తిస్తుంది. అది పఠించిన, పారాయణం చేసినవారికి కూడ క్షేమం కల్గుతుంది. ఇంత విషయవివేచనం చేసి ఔచిత్యవంతంగా నామకరణం చేసిన తాత్త్వికులు ఈ సుబోధినీ వివరణ కర్తలు!

లోకకల్యాణం కొరకైన యితివృత్తభాగము అనువదించడం ద్వారా సర్వ జనులకు సర్వతోభద్రమును కాంక్షించిన ఈ సుకృతులకు హనుమత్ సీతా లక్ష్మణ సమేతుడైన రామచంద్రుడు శుభాశీస్సులు వర్షించుగాక.

ఇట్లు

జ్వాలాశాస్త్రి

సుందర సుబోధిని

చంద్రమౌళి శేషగిరిరావు
(మహాభారతోపన్యాసకులు)
యాజలి, గుంటూరుజిల్లా.

శ్రీయుతులు మైలవరపు సుబ్రహ్మణ్యంగారు శ్రీబోయనపల్లి కామేశ్వరరావు గారు ఉభయులు శ్రమించి వివరణ సమేతముగా ప్రచురించిన సుందర కాండమును సాకల్యముగ పఠించి ఆనంద పరవశుడనైతిని. వాల్మీకి మహర్షి రచించిన సంస్కృత రామాయణమునందలి సుందరకాండమునకు పదచ్ఛేదము, అన్వయక్రమము, ప్రతిపదార్థము, వ్యాఖ్యాన విశేషము, తాత్పర్యము – ఈ క్రమములో వివరణ ఇచ్చుట అనునది చిన్నవిషయం కాదు. పాండిత్యబల సాధ్యమైన ఈ పనిని చేయసంకల్పించి కృతకృత్యులైన ఈ విద్వాంసు లిరువురూ అభినందనీయులు. ఈ రోజులలో ఇటువంటి వివరణతో కూడిన గ్రంథములు ఎంతయో అవసరము. మనకు సాహిత్యమునకు కొరతలేదు. వాల్మీకి మహర్షి, వ్యాసభగవానుడు, కాళిదాసాది మహాకవులు సంస్కృత భాషలో ఎంతో గొప్ప సాహిత్యాన్ని ప్రసాదించారు. దానిని పఠించుటవలన ఉత్తమ జ్ఞానము, విషయ పరిజ్ఞానము, మనోవికాసము కలుగుతుంది. ఆ సాహిత్యాన్ని విజ్ఞాన సర్వస్వమని చెప్పుకోకలిగినవారు తెలుగువారిలో చాలాకొద్దిమంది మాత్రమే. ఈ లోటును భర్తీ చేయుటయే యీ ఉభయుల సంకల్పము. అక్షరాస్యుడైన ప్రతివాడును ఇతరుల సహాయం లేకుండానే వీరు ప్రచురించిన ఈ గ్రంథము ననుసరించి అర్థంచేసుకొని పరిపూర్ణమయిన జ్ఞానమును పొందగలరు. ఇంతవరకు ఇటువంటి వివరణము ఇచ్చే గ్రంథములు లేకపోవుటచే మన సాహిత్యంవలన తగిన ప్రయోజనం పొందలేక పోవుచున్నారు. ఎవరైనా ఇటువంటి గ్రంథములు ప్రచురిస్తే బాగుండునుకదా అని నేను అనుకొనేవాడిని. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు వీరు వివరణ సమేతముగా గ్రంథమును ప్రచురించడం, అభిప్రాయాన్ని కోరుతూ వారు నాకు పుస్తకాన్ని పంపటం జరిగింది. నా కల సఫలమయిందని సంతోషించాను. సంతోషమే కాదు, ఆశ్చర్యంకూడా కలిగింది, ఎందుకంటే ఈ రోజులలో చాలామంది ద్రవ్యార్జన లక్ష్యంతో ఏమేమో వ్రాస్తారు, భాష ఉండదు – భావం ఉండదు. అంతా ఆర్భాటం. వీరు మాత్రం స్వతంత్రంగా గ్రంథరచనకు పూనుకోకుండా సర్వజనామోదమైన పరమపవిత్రమైన, పూజ్యమైన రామాయణ మహాకావ్యాన్ని వివరణ సహితంగా ప్రచురించి ఆంధ్రావళికి అందించటానికే పూనుకున్నారు ధన్యులు.

“భావంబెక్కడలేక వృత్తనియమాపాయంబు చింతింపక పైపై వన్నెల్ పచరింప

దాని తిలకింపబోరు ధీరోత్తములు" అని పూర్వమే సారహీనసాహిత్యాన్ని నిందచేశారు. యీ బెడద పూర్వం నుండి కూడ ఉన్నది. దానివలన విలువయిన సాహిత్యం మరుగునపడే ప్రమాదం ఉంది.

వీరు వ్రాసిన వివరణతో విలువయిన సాహిత్యం వెలుగుచూడడం వలన అది మరుగునపడిపోయే ప్రమాదం తప్పింది. భారతరచన ప్రారంభంలో తిక్కన సోమయాజి "భారతామృతము కర్ణపుటంబుల నారగ్రోలి ఆంధ్రావళి మోదముంబొరయునట్లుగ" అన్నారు. అదే ఉద్దేశ్యము వీరిరువురిలో గోచరిస్తుంది. మహాభారతంలో విరాటోద్యోగ పర్వములు ఎట్లాగో రామాయణములో సుందరకాండము అట్లాగే రసవత్తరమైనది. రామాయణ మహాకావ్య రసపానముచేసి ఆంధ్రావళి మోదమున్ బొరయుటయే వీరి ఆశయము. వీరి కృషి వడ్డించిన విస్తరి. కడుపార నారగించి తృప్తినొందుటయే పాఠకులవంతు.

రామాయణ కృతికి చక్కని వివరణ ఇచ్చారు కనుక నేను మరల అందులోని విషయం జోలికి పోలేదు.

వీరు చేయవలసినది ఇంకనూ ఎంతో ఉంది. రసవత్తరమైన కావ్యాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. వాటికి కూడా ఇదేవిధముగా సుబోధినీ వివరణ ఇస్తే బాగుంటుంది. ఆ పని కూడా వీరేచేస్తే బాగుంటుందని తలుస్తాను. ఇందుకు వారికి తగిన శక్తిని ఆయురారోగ్యములను ప్రసాదించవలసినదిగా దైవాన్ని ప్రార్థిస్తున్నాను. అనితరసాధ్యమైన వీరికృషిని ప్రశంసిస్తూ ఈ ప్రయత్నంలో కృతకృత్యులైనందుకు వీరిని సహృదయంగా అభినందిస్తున్నాను.

ఇట్లు

చంద్రమౌళి శేషగిరిరావు

సుందర నందనము

కవిరాజ పండిత
బుద్ధరాజు రామరాజు ఎమ్.ఎ.,
విద్యాప్రవీణ, శిక్షాశాస్త్రి
ప్రధాన సాహిత్యాచార్యులు
మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాల
విజయనగరము

"మధుమయఫణితీనాం మార్గదర్శీ మహర్షిః" అనియు
"పాఠ్యే గేయే చ మధురమ్" అనియును
"స్వసూక్తినాం పాత్రం రఘుతిలకమేకం కలయతామ్"

అనియు పలువిధములుగా స్తుతింపబడిన వాల్మీకి రామాయణ కావ్యము విశ్వసాహిత్యములో ప్రథమగణ్యమైనట్టిది.

"న గాయత్ర్యాః పరో మంత్రః" అను మహాప్రభావముగల గాయత్రీ మంత్రాత్మకమైన పవిత్రకావ్య మిది.

అందు **"సుందరం సర్వసుందరమ్"** అనిపించుకొన్న సుందరకాండము సారభూత మైనట్టిది.

ఇందు కథా ప్రసంగమున శ్రీరాముని పావనచరిత్రము, సర్వలక్షణపూర్ణమైన ఆతని దివ్యమంగళవిగ్రహ వర్ణన, సర్వజనగ్రాహ్యమైన హితోపదేశమును నిండియున్నవి.

మరియు **"సుందరే సుందరః కపిః"** అని కీర్తింపబడిన హనుమ **"విక్రాంతస్త్వం సమర్థస్త్వం, ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ"** అని సీతామహాదేవిచే శ్లాఘింపబడుచు లాంగూలచక్రముతో పింగళవర్ణముతో శ్వసనవిక్రముడై మనకు సాక్షాత్కరించును.

ఈ సుందరకథలోని సీతాన్వేషణమునందలి అంతరార్థము – జీవుడు తాను అన్వేషించి పొందవలసిన జీవితపరమార్థమును సాధించుటయే అని తెలియనగును.

ఆ సాధనలో జపింపబడు మంత్రమే **"నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై, నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోఽస్తు చంద్రార్క మరుద్గణేభ్యః"** అన్నట్టిది.

సమస్తపీడాపరిహారమునకును, సర్వజయ మంగళములకును సాధనమైన ఈ సత్కావ్యము భారతీయుల తపఃఫలము.

ఇట్టి విశిష్టమైనట్టి ఈ ఆదికావ్యము సంస్కృతభాషలోనే చదువుకొనగల్గిన అదృష్టము సామాన్యమైనది కాదు.

అట్టి భాగ్యము తమ సుబోధినీ వివరణ రూపమున శ్రీవైలవరపు సుబ్రహ్మణ్యము గారును, శ్రీ బోయనపల్లి కామేశ్వరరావుగారును ఆంధ్రపాఠకులకు సులభగ్రాహ్యము చేసినారు.

ఇందలి పదచ్ఛేదాదికమైన వివరణము భాషాజిజ్ఞాసువులకు కూడ అత్యంత లాభదాయకమైనది. తాత్పర్యాది విశేష వివరణము తారకరాముని పావన చరిత్ర యొక్క గ్రహణమునకును మనననిదిధ్యాసనములకును సాధనమయి భక్తవరేణ్యులకు పరమార్థసంధాయకమై యుండుట నిశ్చయము.

బుద్ధరాజు రామరాజు

క్షేమంకరం

మధురకవి, కవికులశేఖర
ఓగేటి పశుపతి
విద్యాక్షేత్రం, యాజలి,
గుంటూరుజిల్లా.

"సత్యం శివం సుందరం. సీత సుందరి, శ్రీరాముడు సుందరుడు", "బుద్ధిమతాం వరిష్ఠః" అయిన హనుమంతుడు దశకంఠునియొక్క అంటే దశేంద్రియముల యొక్క ప్రాబల్యంచే యెడబాటు ప్రాప్తించిన సుందరీసుందరులను (ప్రకృతి పురుషులను) కలుపుటకు చేసిన ప్రయత్నం గురించి చెప్పేదే సుందరకాండము. అది కావ్యరూపంలో రసభరితం అన్నమాట.

భవసాగరతరణోపాయంగా భావించి దానిని నిత్యం పారాయణ చేసుకొనే శ్రద్ధాళువులూ, భక్తులూ ఎందరో ఉన్నారు. సంస్కృతభాషలో సరియైన పరిజ్ఞానం లేక దానిని సరియైన రీతిలో అర్థం చేసుకోలేనివారు కూడా ఎందరో ఉన్నారు. అట్టివారందరికి ఉపయోగించునట్లు వివిధ వ్యాఖ్యానాలలోగల విశేషార్థాలతో తేటతెనుగులో ఈ గ్రంథము వెలువరించుచున్న శ్రీయుతులు సుబ్రహ్మణ్యం కామేశ్వరరావుగార్లు ఎంతో అభినందనీయులు. విశేషించి 'క్షేమనివేదనము' ప్రకృతి పురుషుల అవినాభావసంబంధం తెలుపుచూ భౌతికవిజ్ఞానశాస్త్రం బలిసి పోయిన అధునాతన ప్రపంచంలో ఆదర్శ దాంపత్య జీవిత విషయంలో కనువిప్పు క్షేమకరం కాగలదని నా విశ్వాసం.

ఇంకొకమాట – ఈ గ్రంథకర్తలు మా బుద్ధాం 'నామప్రయాగ' సంస్థాపకులు శ్రీరామశరణ్ గురువర్యుల శిష్యులు కావటం మాకు మరింత సంతోషకరమైన విషయం. శ్రీరామశరణులు పరమపదించియు ఏతాదృశశిష్యగణంతో శ్రీరామనామ ప్రచారం చేస్తూనే ఉన్నారు. మహాపురుషులు అమరులు.

ఓగేటి పశుపతి

సమ్మోద నివేదనము

ప్రస్తుత 'హనుమద్విక్రమ' సంపుటము ఆరంభించినది ఆదిగా అడుగడుగున అంతరాయములు బాధించుచుండగా ఆర్తితో 'హనూమత్ప్రభో నః ప్రసన్నో భవ త్వమ్", అని ఎన్నోమాఱులు వేడుకొన్నాము. ఆ ఆర్తి పూర్తిగా తొలగి నేడు "హనూమత్ప్రభో! నః ప్రసన్నో హ్యసి త్వమ్' అని ఆనందముతో కృతజ్ఞత తెలుపుకొనుచున్నాము.

ఇట్టి నేటి ఈ మా సమ్మోదమునకు కారణములు –

ఈ సంపుటము బైండరుదగ్గర బైండింగు పూర్తికాకుండగనే చివరి క్షణములో శ్రీ భరతశర్మగారి నుండి మాకు చేరిన వారి అభిమానపూర్వకమైన అమూల్య అభినందన సుభాషితములు, సునిశిత ప్రతిభతో వారు గావించిన సుందరకావ్యసారావిష్కృతి;

మాపై ప్రేమపూర్ణహృదయులు శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రులు ప్రసాదించిన మంగళాశాసనపూర్వకమైన సుందరకావ్యముఖతిలకము;

స్వయముగా దర్శింపజాలక లేఖామూలముగానే – మా కృషిని చిత్తగించి తమ ఆమోదమును దయచేయుడని కోరగా సాహిత్యబాంధవులైన ఆచార్య శ్రీ సి.నారాయణరెడ్డి మహోదయులు ఒసగిన 'అభినందన' మఱియు నేడే ఆంధ్రసాహితీ లోకమునకంతకును గర్వకారణమగు దేశములోనికెల్ల సర్వశ్రేష్ఠమైన జ్ఞానపీఠము వారి అవార్డు వీరికి లభించుట.

వర్ణరేఖావిన్యాసములతో అక్షరములైన సజీవచిత్రములను సృష్టించి నేత్రపర్వముచేయు డాక్టరు సంజీవదేవుగారి బహుముఖప్రజ్ఞాపాటవముతో పరిమితాక్షర పదములతో వాల్మీకిమహాకవి హృదయమునుండి రామాయణ మహాకావ్యములోనికి జాలువారిన సౌందర్య స్వరూప నిరూపణము.

మిత్రులు శ్రీమాన్ శఠకోపాచార్యులుగారు మాపైగల స్నేహగౌరవముల వలనను, ఏతత్ కృతిపరిశీలనము వలనను కలిగిన ఆమోదమును వెల్లడించుచు తెలియజేసిన ప్రహర్షము అని మా మనవి.

మా కోరికమేరకు ఆప్తహృదయముతో ఇట్లు మమ్ము ప్రోత్సహించిన ఈ మహనీయులకు ప్రత్యేకముగా మా హృదయపూర్వక కృతజ్ఞతా వందనము లర్పించుకొనుచున్నాము.

ఆది నుండియు మమ్మాదరించుచున్న తిరుమలేశుని దేవస్థాన అధికార వర్గమువారికి మా నమస్సుమాంజలి.

సుబోధినీ సమర్పకులు

శ్రీ హనుమత్ ప్రణతి

శ్లో॥ యత్ర యత్ర రామనామకీర్తనం ప్రవర్తతే
తత్ర తత్ర హర్షబాష్పలోచనః ప్రనృత్యసి ।
రామదేవదివ్యనామమాధురీరసజ్ఞ! హే
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 1

ఎచ్చటెచ్చట భక్తగణము కూడి ముక్తకంఠముతో రామనామ సంకీర్తనము చేయుచుందురో అచ్చోటులనెల్ల సన్నిహితుడవై ఆనందబాష్పములు నిండిన కన్నులతో నృత్యము చేయుచుందువు. రామదేవుని దివ్యనామమునందలి మాధుర్యవిశేషమును పూర్ణముగా అనుభవింపజాలిన ధన్యుడవు నీవు. నీ శౌర్యధైర్యములు ఎంత అద్భుతమైనవో రామప్రభునియెడ నీ భక్తికూడ అంత ఘనమైనది.

రామధ్యానతత్పరమతీ! మారుతీ! నీకు మా ప్రణతులు.

శ్లో॥ దుస్తరో మహాంబుధి స్స గోష్పదో బభూవ తే
అక్ష మేఘనాదముఖ్య రాక్షసాశ్చ కీటకాః ।
రామనామ చింతన ప్రవృద్ధ శౌర్య జృంభణ!
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 2

అపారమైన మహాసాగరము నీకు చిన్నగోష్పద మైనది. ఎనుబది వేలమంది కింకరాసురులు, ఎదురులేని అక్షకుమారుడు, ఇంద్రజిత్తు వంటి దుర్దాంతదానవులు నీకు కీటకప్రాయులైనారు. "జయత్యతిబలో రామః... దాసోఽహం కోసలేంద్రస్య రామస్య....." అనుచు లంకలో రామనామమును ప్రతిధ్వనింపజేయుచు అరిగణము పెరుగుచున్నకొలది శౌర్యధైర్యములతో విజృంభించిన ధీరవీరుడవు నీవు!

రామభక్త! మారుతీ! నీకు మా ప్రణతులు.

శ్లో॥ సర్వలోక భీకరో ఽపి భీవశో దశాననః
సో ఽభవత్ భవత్ప్రతాపతాపతప్తమానసః ।
అప్రధృష్యశౌర్యధైర్యవిక్రమక్రమోజ్జ్వల!
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 3

"యస్య సూర్యో న తపతి, భీతో యస్య చ మారుతః న వాతి...." అనిపించుకొని సర్వలోక భయంకరుడై యున్న రావణుడు నీ విక్రమమునుగూర్చి విని ".... శంకాహతాత్మా దధ్యౌ, ... మన స్సమాధాయ ..... మహత్ సత్త్వమిదం జ్ఞేయం .... సర్వథా తత్ మహద్ భూతం ..... నహ్యహం తం కపిం మన్యే" అనుచు నీ శౌర్యధైర్యములకు గుండె చెదిరినవాడైనాడు.

నిరుపమవిక్రమా! హనుమా! నీకు మా నమస్కారములు.

శ్లో॥ రాఘవేణ సీతయా చ సన్నుతో భృశం ముదా
దుష్కరార్థసాధక స్త్వ మప్రమేయవిక్రమః ।
ఆశ్రితార్తినాశకః ప్రమోదకృత్ సతాం సదా
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 4

"కృతం హనుమతా కార్యం సుమహన్ భువి దుష్కరం, మనసాఽపి య దన్యేన న శక్యం ధరణీతలే ..... విక్రాంత స్త్వం సమర్థ స్త్వం ప్రాజ్ఞ స్త్వం వానరోత్తమ! .... తేజో ధృతి ర్యశో దాక్ష్యం, సామర్థ్యం వినయో నయః, పౌరుషం విక్రమో బుద్ధి ర్యస్య త్వేతాని నిత్యదా.... అహం చ రఘువంశశ్చ లక్ష్మణశ్చ మహాబలః, వైదేహ్యా దర్శనే నాద్య ధర్మతః పరిరక్షితాః" అని సీతారాములచే కీర్తింపబడిన ప్రభావముగల మహనీయుడవు నీవు. నీ అప్రమేయవిక్రమముచే ఆశ్రితుల ఆర్తిని పోగొట్టి సదా సజ్జనులకు సమ్మోదము గూర్తువు నీవు.

సర్వజనస్తవనీయా! ఆంజనేయా! నీకు మా నమోవాకములు.

శ్లో॥ యత్ర తే గభీరవీరదివ్యమూర్తి రర్చ్యతే
యత్ర చైవ కీర్త్యతే త్వదప్రమేయవిక్రమః ।
దుష్టశక్తయః ప్రయాంతి దూరతస్తతోఽఖిలాః
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 5

ధీరగంభీరమైన నీ దివ్యరూపమును నెలకొల్పుకొని నిన్నెచ్చట అర్చించు చుందురో, అద్భుతములైన నీ పరాక్రమగాథలను ఎచ్చట కీర్తించుచుందురో, పరమపవిత్రమైన ఆయా ప్రదేశములందెల్ల అనగా ఆ హృదయములందు, ఆ మందిరములందు, ఆ జనపదము లందెల్ల భూతప్రేత పిశాచాది దుష్టరాక్షసగణముగాని హింసాద్వేషాసూయాది రాక్షసభావములుగాని నిలువజాలక దూరముగా తొలగిపోవును.

మహనీయా! శత్రుభయంకర వీరాంజనేయా! నీకు మా భక్తి పూర్వకమైన ప్రణామాంజలి.

శ్లో॥ దృప్త దుష్ట హృద్విదారి తావకోగ్రవీక్షణమ్
త్వత్ప్రసన్నరమ్యమూర్తి రాశ్రితాక్షికౌముదీ ।
దివ్యభావదీపనం హి తే గుణౌఘచింతనం
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 6

దుష్టశిక్షకుడవైన నీ ఉగ్రవీక్షణములు దుర్జనుల సర్వగర్వములను నిర్మూలింప జేయును. నీ శరణముగోరిన ఆశ్రితజనుల కనులకు నీ దివ్యసుందరవిగ్రహము చల్లని వెన్నెల యగును. ఉజ్జ్వలమైన నీ పావనచరితమును భావన చేయు ధన్యుల మానసములు ఘనమైన జ్ఞానక్రియాశక్తులకు నెలవులై దైవీభావసంపన్నములై యుండును.

అరిభయంకరా! ఆశ్రితవత్సలా! అనుపమగుణాంబుధీ! హనుమా! నీకు మా ప్రణామములు.

శ్లో॥ వానరోత్తమస్య తే హి యో భవేత్ ప్రియో నరః
స్యా న్నరోత్తమప్రభో స్స రాఘవస్య చ ప్రియః ।
నిశ్చయం నరోత్తమ స్స సర్వదేవతాప్రియః
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 7

వానరోత్తమా! నీ భక్తుడై నీ ప్రేమకు పాత్రుడైన నరుడు నరులలో ఉత్తముడగును. మఱియు ఆ ధన్యుడు నిన్ను అమితముగా ప్రేమించు పురుషోత్తముడైన రామప్రభువునకు కూడ మిక్కిలి ప్రీతిపాత్రుడగును, అంతేకాక సర్వదేవతలకును నీవు ఇష్టుడవు కావున ఆ నరోత్తముడు హరి హర బ్రహ్మేంద్రాది సకల దేవతలకు కూడ ప్రేమపాత్రుడగును.

ఈ విషయమునే 'ఆంజనేయః పూజితశ్చేత్ పూజితా స్సర్వదేవతాః' అను ఆర్షవచనము విశదము చేయుచున్నది.

అఖిలదేవతలకును ఆత్మీయుడవైన రామభక్తాగ్రణీ! పావనీ! నీకు మా వందనములు.

శ్లో॥ వ్యోమగామివీర! వాయుజాంబురాశిలంఘన!
భూమిజార్తినాశ! వహ్నిదగ్ధదైత్యమందిర ।
స్వామిసేవనోపయుక్తపంచభూతసంచయ!
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 8

వాతాత్మజా; నీవు లంకలో రామదూతగా సాధించిన విజయము ఎన్నోవిధముల విశిష్టమైనది. అందొక విశేష మిట్టిది – ఇందు పృథివ్యాది పంచభూతములకును భాగము కలిగినది. ఎట్లనగా – నీచే అన్వేషింపబడి ఆర్తి తొలగించుకొన్నది – పృథివీసుత; నీవు లంకను చేరుటకు దాటినది – జలరాశి; నీ వచట రాక్షసభవనములందు జ్వలింపజేసినది – అగ్ని ; ఏతత్కార్యనిర్వాహకుడవైన నీ జనకుడు – వాయువు; నీ సుదీర్ఘ గమన ప్రదేశము ఆకాశము.

స్వామి సేవనోపయుక్త సర్వభూత సంతతీ! మారుతీ! నీకు మా ప్రణతి.

శ్లో॥ రత్నసాను శైల రమ్య దివ్య దేహ రాజిత!
దివ్య రత్నహార ముఖ్య హేమభూషణోజ్జ్వల ।
భానువంశ రామరత్న దీప్యమాన మానస!
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 9

రత్నసాను వైన మేరుగిరివంటి సుందరగంభీరమైన శరీరముతో విరాజిల్లు వాడవు. సీతామాత ప్రేమపూర్వకముగా నొసగిన రత్నహారము మున్నగు హేమాభరణములతో శోభిల్లువాడవు. మఱియు భానువంశరత్నమైన రామప్రభుని ఉనికిచే మహాతేజస్సుతో నిండిన మనస్సుతో వెలుగొందువాడవు.

రామాయణమహామాలారత్నమా! అనిలాత్మజా! నీకు ప్రణామాంజలి.

శ్లో॥ అంజనామనోంబుజాతరంజనప్రభాకర!
వారితావనీసుతాప్రగాఢచిత్తసంజ్వర!
రామదేవభవ్యదివ్యపాదపద్మబంభర!
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 10

సూర్యుడు పద్మములకు వికాసము కూర్చునట్లు నీవు అంజనామాత మానసమునకు ఆనందము కూర్చువాడవు. అమితమైన తాపము నొందుచున్న సీతామాత హృదయవ్యథను శమింపజేసినవాడవు. మధుపము పద్మమును జేరి అమితానందము నొందునట్లు నీవు రామదేవుని పావనపాదసన్నిధిని మహానందము

నొందువాడవై యుందువు.

అంజనానందనా! జానకీశోకనాశనా! రామభక్తాగ్రణీ! నీకు వందనము.

శ్లో॥ భక్తకోటి వాంఛితార్థ దానకల్పభూరుహా!
యో భవత్కటాక్షభాగ్యభాజనో జనో భవేత్ ।
నిర్భయో నిరాపద స్స సంతతాప్తసమ్మదః
వీర! ధీర! రామభక్త! మారుతే! నమోఽస్తు తే ॥ 11

ఏయే భక్తుడు ఏయే ఫలమును కోరి నిన్ను వేడుచుండునో ఆ యా భక్తునకు ఆయా ఫలములనెల్ల యొసగి సంతుష్టుల జేయునట్టి ముంగిటి కల్పవృక్షము వంటివాడవు నీవు భక్తులకు. నీ కటాక్షభాగ్యమునకు పాత్రుడైన మానవుడు ఎట్టి భయములకును గురికాకుండా ఎట్టి ఇక్కట్లకు లోనుగాకుండా ధన్యజీవనుడగుచు నిరంతరానందముతో వెలయుచుండును.

ఆశ్రితవత్సలా! అమేయమహిమా! హనుమా! నీ పాదపద్మములకు సాష్టాంగదండ ప్రణామములు.

☆☆☆

ఓం నమో భగవతే హనుమతే

జయతి పవనసూనుః

సకలసుజనబంధు స్సచ్చిదానందసింధుః
నిఖిలఖలవిదారీ శిష్టకష్టాపహారీ ।
నిరవధిసుఖదాయీ నైకసంపద్విధాయీ
జయతి పవనసూనుః భక్తహృత్పద్మభానుః ॥ 1

సజ్జను లెల్లరికిని ఆప్తబంధువు, సత్యజ్ఞానానందములకు నిలయము, దుష్టులను నాశమొందించి శిష్టుల కష్టములను తొలగించునట్టివాడు, శాశ్వత సౌఖ్యములను సమకూర్చి సమస్త సంపదలను ప్రసాదించునట్టివాడు, సూర్యుడు పద్మములను వికసింపజేయునట్లు భక్తుల మనస్సులను ఆనందభరితము చేయునట్టివాడు అని కీర్తింపబడునట్టి హనుమ – సర్వసేవ్యుడైన దైవము.

కనకశిఖరిరమ్యప్రాజ్యగంభీరమూర్తిః
శమితదనుజదర్పోద్రేకసంలబ్ధకీర్తిః ।
పరిహృతనిజభక్తస్వాంతసంతాపజార్తిః
జయతి కపివరేణ్యో రామభక్తాగ్రగణ్యః ॥ 2

బంగరు కొండవంటి గంభీరమైన మూర్తిసౌందర్యము, దుష్టదానవ సంహారముచే గలిగిన కీర్తి వైభవము, ఆశ్రితభక్తుల ఆర్తిని పోగొట్టు కారుణ్యభావము, అను దివ్యలక్షణములతో విరాజిల్లు రామభక్తాగ్రగణ్యుడైన హనుమ సర్వలోకశరణ్యుడు.

సురగురుసమబుద్ధిప్రాభవఖ్యాతకీర్తిః
హృదయలసితసీతారామసౌమిత్రిమూర్తిః ।
రఘుపతినుతిజాతానందబాష్పార్ద్రనేత్రః
జయతి జగతిసేవ్యస్సంతతం వాయుపుత్రః ॥ 3

బృహస్పతిసమానుడైన బుద్ధిశాలి యను కీర్తివైభవము, మనసునందు నిలుపుకొన్న సీతారామలక్ష్మణులను ధ్యానించు నిత్యభక్తి, తన రామప్రభువు దివ్యగుణగానానందముతో ఆర్ద్రమైన నేత్రయుగళము కలిగి వెలయుచుండు వాయుపుత్రుడైన హనుమ లోకత్రయారాధ్యుడు.

అమితజవవిశేషోత్తీర్ణదుర్గాంబురాశిః
అతిచతురగవేషజ్ఞాతసీతానివేశః ।
శమితజనకజాహృత్తీవ్రసంతాపవహ్నిః
జయతి విజయహేతుర్మారుతీ రామభక్తః ॥ **4**

అద్భుతమైన జవసత్త్వములతో మహాసముద్రమును లంఘించి అమిత చాతుర్యముతో సీతామాత ఉనికిని కనుగొని ఆ సాధ్వి మనసునందలి సంతాపాగ్నిని శమింపజేసి స్వామి కార్యవిజయము సాధించినట్టి రామదూత మారుతి - భక్తతతికి విజయప్రదాతయై వెలయుచున్నాడు.

మథితసుబహురక్షోరక్షితాశోకవన్యః
ప్రమథితమదరుంధద్ధీకరాక్షాదిదైత్యః ।
ప్రశమితదశవక్త్రస్వాంతదుర్దాంతదర్పః
జయతి కపివరేణ్యో వీరలోకాగ్రగణ్యః ॥ **5**

ప్రబల రాక్షస సంరక్షణమునందున్న అశోకవనవాటికను విలాసముగా విధ్వంసమొనర్చి, ఎదుర్కొన వచ్చిన అక్షకుమారాది రాక్షసమహావీరులను హతమార్చి దశకంఠుని అకుంఠిత ధైర్యదర్పములను అణచివైచి అద్భుతశౌర్యధుర్యుడుగా విరాజిల్లినట్టి ఘనుడు - కపివర్యుడైన హనుమ!

స్వహృదయచిరదీప్తం జానకీశోకవహ్నిం
సమయసముచితం సంగృహ్య లంకాం సమస్తామ్ ।
సదశవదనదర్పం సందదాహాశు యస్సః
జయతి పవనజాతో రుద్రతేజఃప్రభూతః ॥ **6**

చిరకాలమునుండి రగులుకొనుచున్నట్టి జానకీదేవి హృదయమునందలి శోకాగ్నిజ్వాలను గ్రహించి వాయుపుత్రుడగు హనుమ వాయుమిత్రుడైన అగ్నిదేవునకు విందు గావించుచు సమస్తలంకాపట్టణమునే గాక లంకాధిపతి మదిలోని మహాదర్పమును గూడ దహించివేసి తన ప్రభువు ఘనతను, తన రుద్రతేజః ప్రభావమును గూడ వెల్లడించి దేవగణములచే కొనియాడబడినట్టి మహిమాఢ్యుడు.

రణధరణివిశీర్ణం లక్ష్మణం జీవయిత్వా
ప్లవగతతిసమేతం రాఘవం రంజయిత్వా ।
ప్రముదితరఘునాథాశ్లేషసమ్మానితో యః
జయతి స హనుమాన్ శ్రీరామచంద్రాత్మభక్తః ॥ **7**

రణరంగమున సమ్మూర్ఛితుడైనట్టి లక్ష్మణస్వామి ప్రాణసంరక్షణము గావించి సర్వవానరవీరులకును రామప్రభువునకును మహానందమును గలిగించి తత్ఫలితముగా రఘునాథుని గాఢాలింగనభాగ్యము నొందిన హనుమ రామప్రభువున కాత్మీయుడు.

అతులితబలశాలీ భక్తసంత్రాణశీలీ
నిఖిలనిగమవేదీ దీనదుఃఖాపనోదీ ।
దురితతతివినాశీ సాధుబుద్ధిప్రకాశీ
జయతి సులభసేవ్య స్సుప్రసన్నాంజనేయః ॥ 8

లోకోత్తరపరాక్రమము, భక్తసంరక్షణదీక్ష, దీనజనకారుణ్యము, సకలపాపపరిహరణము, సద్బుద్ధిప్రదానము, స్మరణమాత్రప్రసన్నత మున్నగు దివ్య ప్రభావములకు నిలయమైన ఆంజనేయస్వామి – సకలజనులకు సులభసేవ్యుడైన పరమదైవము.

సుందర సుబోధినీ సమర్పకులు

స్వీయ నివేదనము

దైవకృపచే ఈ మా సుబోధినీ సమేత సుందరకాండ గ్రంథసంపుటములు నేటికి పూర్తియై మేము కృతకృత్యులమైనాము.

ఈ పవిత్రకృతిని అంకితము గొనుచు మాగురుదేవులు శ్రీరామశరణ మహనీయులు "ఈ కృతిని భక్తసేవ్యముగా లోకమున ప్రకాశింప జేయగలరు." అని చేసిన ఆశీర్వాదమును సఫలము చేసికొన్నాము.

ఇందలి ప్రథమసంపుటము ప్రకటించిననాటి నుండియు పెద్దలును సహృదయ భక్తసోదరులును "మీ ప్రణాళిక సుందరకావ్యమును సుగమము చేయుచున్నది" అని తెలుపుచుండు అభినందనలు మాకు ఎంతయో ఉత్సాహప్రదము లగుచుండినవి.

కాని పరిమితశక్తులు గల మేము మా కోరికను దైవనిర్ణయముగానే ఎంచి ఆనందించుచు యథాశక్తిగా ముందుకు సాగుచుండగా "శ్రేయాంసి బహువిఘ్నాని" అను సూక్తి మాయెడ పూర్తిగ నిజమై మా దీక్షకు అనేక పరీక్షలు ఏర్పడినవి. తత్ ఫలితముగా ఈ సంపుటములను అందించుటలో ఆలస్యము అనివార్యము అగుచుండెను. ఆలస్యమైనను శాశ్వతోపయుక్తమగు ఉత్తమగ్రంథమును లోకమున కర్పింప గలిగినాము అనెడి తృప్తి మాకు లభించినది.

వాల్మీకి రామాయణము నందలి ఈ సుందరకాండమునకు "బీజకాండము" అను ప్రశస్తియున్నదికదా! ఇందలి శ్లోకములన్నియు మంత్రతుల్యములైనవి కావున అందలి పదములనన్నింటిని పునఃపునః ఆవృత్తి చేయుచు మహర్షిముఖపద్మ నిస్సృతమైన రామకథామధువును భక్తకోటికి శుభప్రదమైన రీతిలో సులభప్రాప్యము చేయుట అను మా లక్ష్యము సిద్ధించినది అని మనవి.

మరియు "క్షేమనివేదనము" అను ఈ ఎనిమిదవ సంపుటము ఈ కాండమునకు మకుటాయమానమైనట్టిది. ఇందలి మొదటి సర్గమునందు వెనుకటి కథ అంతయు సంగ్రహముగా తెలుపబడియుండుటచే సంపూర్ణ గ్రంథపఠన లాభము కలుగగలదు. ఇంకను ఇందలి ప్రధానవిషయమైన "క్షేమనివేదనము" ఆనాటి రామలక్ష్మణాదులకు వలెనే నేటి సమస్తభక్తకోటికిని సంతోషకరమును, సంతాపహరమును అగుచు శ్రేయోదాయకము కాగలదు.

అత్యధిక ద్రవ్యసాధ్యమైన ఈ బృహద్గ్రంథ ప్రచురణభాగ్యము భక్తవరదుడైన శ్రీ తిరుమలేశుని కృపావిశేషము వలననే లభ్యమైనదని తెలుపుకొనుచు శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానకార్య నిర్వహణాధిపతులకు మా హృదయపూర్వకమైన కృతజ్ఞతా వందనములను అర్పించుచున్నాము.

చివరి మనవిగా – మా ఉత్సాహమునకు తగిన పూర్తి అవకాశములు మాకు లేకపోవుటచే ఈ కృతిలో కనిపించిన లోపములకు విజ్ఞమహాశయులు మమ్ము మన్నింపవలెనని ప్రార్థించుచున్నాము.

ఇట్లు

సుబోధినీ సమర్పకులు

ఆదికావ్య ప్రశంస

ఏక స్సేవ్యో రామదేవో యథా నః
మంతవ్యం త ద్రామవృత్తం తథైవ ।
య న్మర్త్యానాం జన్మసాఫల్యకృత్ తత్
భవ్యం కావ్యం సేవ్య మాద్యం సుధీభిః ॥ 1

రామప్రభువొక్కడే ఎట్లుగా ఆరాధ్యదైవమై యున్నాడో, అట్లే మనము మననము చేయవలసియున్నది కూడ రామచరిత్ర మొక్కటే. అదియే మనకు జన్మ సాఫల్యము కూర్చునట్టిది కాబట్టి సర్వబుధసేవ్యమై యున్న కావ్యము.

గైర్వాణీ వాక్ రమ్యతాయా నిధానం
శ్రీణాం మూలం చైహికాముష్మికాణామ్ ।
య ద్విశ్వస్మిన్ వాఙ్మయే నిస్తులం తత్
భవ్యం కావ్యం సేవ్య మాద్యం సుధీభిః ॥ 2

ఈ మహాకావ్యము అమరభాషలోని అందముల నన్నింటిని సంతరించు కొన్నట్టిది. మానవులకు ఐహికాముష్మికశ్రేయముల కన్నింటికి మూలమైనట్టిది మరియు ప్రపంచభాషలన్నింటిలోను సాటిలేని మేటికావ్యమని ఎన్నిక గన్నట్టిది. ఇట్టి విశిష్టకావ్యము సర్వబుధసేవ్యమైనట్టిది కదా!

పాఠ్యే గేయే ఽత్యంతమాధుర్యపూర్ణం
సద్ధర్మాణాం నిర్మలం దర్పణం యత్ ।
వాల్మీకీయం దివ్యరామాయణం తత్
భవ్యం కావ్యం సేవ్య మాద్యం సుధీభిః ॥ 3

వాల్మీకిమహర్షి తన రామాయణకావ్యమును పఠనమునందును గానము నందును కూడ మధురముగా నుండునట్లుగను, మానవజీవితమునకు వలసిన సర్వధర్మములను విశదము చేయునట్టిదానిగను నిర్మించి యున్నాడు కాబట్టి ఈ మధురమంగళకావ్యము సర్వసుజనసంసేవ్యము.

ఆదౌ జ్ఞాతం బ్రహ్మణస్సూనునా యత్
పశ్చాత్ సాక్షాత్ బ్రహ్మణా ప్రేరితం సత్ ।
బ్రాహ్మ్యే దేవ్యా వాక్స్థయా చోదితం తత్
భవ్యం కావ్యం సేవ్య మాద్యం సుధీభిః ॥ **4**

ఆదికాలమునందు వాల్మీకి కోరికపై బ్రహ్మమానసపుత్రుడైన నారదుడు ఈ రామచరితమును ఆతనికి తెలియజేసినాడు. పిమ్మట బ్రహ్మయే స్వయముగా సాక్షాత్కరించి ఆతనికి వలసిన శక్తినంతను ప్రసాదించి దీనిని సర్వలోకసేవ్యముగా ప్రకాశింపజేయుమని ప్రోత్సహించినాడు. అట్లే బ్రాహ్మీదేవి వాణి మహర్షివాక్కున నిలచియుండి ఈ భవ్యకావ్యమును వెలయింప జేసినది. కాబట్టి ఈ దివ్యమైన ఆదికావ్యము సర్వలోకసంసేవ్యము.

వేదై ర్వేద్యో యః పరః పూరుష స్సః
స్వేన ప్రేమ్ణా మానవస్సన్ యథా నః ।
ఆత్మీయో ఽ భూత్ తత్ క్రమం వక్తి యత్ తత్
భవ్యం కావ్యం సేవ్య మాద్యం సుధీభిః ॥ **5**

అవాఙ్మానసగోచరుడుగా వేదప్రతిపాదితుడైన పరమాత్మ తన కృపా విశేషముచే మానవుడుగా మన మధ్య జన్మించి తన ప్రేమను మనకు పంచి ఉత్తమ జీవనమార్గమును చూపిన విధమును తెలుపుచున్నట్టి ఈ భవ్యకావ్యము బుధజనులకు వరప్రసాదముగా నిత్యసేవ్య మైనట్టిది కదా.

విశ్వశ్రేయఃకామివాల్మీకిమౌనీ
సీతారామస్తవ్యగాథాత్మకం యత్ ।
ప్రాదా న్న స్తత్ లోకసంవేద్యసారం
భవ్యం కావ్యం సేవ్య మాద్యం సుధీభిః ॥ **6**

వాల్మీకిమహర్షి చిరతపఃప్రభావముచే తనకు లభించిన దివ్యశక్తిని లోక శ్రేయమునకై వినియోగించి మానవులు గ్రహించవలసిన జ్ఞానమునంతను సీతారాముల పవిత్రచరిత్రరూపమున వెలయించినాడు. అట్టి భవ్యకావ్యము సకలసేవ్యము.

రామం సీతాం మారుతిం మానవానాం
స్వాంతక్షేత్రే స్థాపయిత్వా దృఢం నః ।
భక్తిధ్యానజ్ఞానధన్యాన్ వితన్వత్
భవ్యం కావ్యం సేవ్య మాద్యం సుధీభిః ॥ 7

రామదేవుని, సీతామాతను, హనుమత్స్వామిని మానవుల హృదయపీఠము నందు స్థిరముగ నెలకొల్పి వారిని భక్తితత్పరులనుగాను, జ్ఞానసంపన్నులను గాను తీర్చి దిద్దుచున్నట్టి ఈ భవ్యకావ్యము నిఖిలజననిత్యసేవ్యము.

వ్యాసాద్యై స్తైః కాళిదాసాదిభి శ్చ
లోకక్షేమం సాధితం యస్య మార్గాత్ ।
స్వీయై రమ్యై ర్వాగ్విలాసై శ్చిరాత్ తత్
భవ్యం కావ్యం సేవ్య మాద్యం సుధీభిః ॥ 8

వేదవ్యాసుని వంటి మహామునులును, కాళిదాసు వంటి మహాకవులును ఏ ఆదికావ్యమును తమకు మార్గదర్శకముగా గ్రహించి పురాణ శ్రవ్య దృశ్యకావ్యాది రూపమున మానవకళ్యాణమును సాధించు కమనీయవచోవిలాసములకు నిలయమైన ఉత్తమవాఙ్మయము నందించుచున్నారో అట్టి ఈ ఉత్కృష్టకావ్యము మనకెల్లరికిని సమస్తసన్మంగళసంధాయక మైనట్టిది.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామశరణ గురుభ్యో నమః

శ్రీమద్వాల్మీకి రామాయణము

సుందర కాండము

ఏకచత్వారింశసర్గ

శ్లో॥ స చ వాగ్భిః ప్రశస్తాభిః గమిష్య న్పూజిత స్తయా ।
తస్మాద్దేశా దపాక్రమ్య చింతయామాస వానరః ॥ 1

పదచ్ఛేదము :– సః – చ – వాగ్భిః – ప్రశస్తాభిః – గమిష్యన్ – పూజితః – తయా – తస్మాత్ – దేశాత్ – దపాక్రమ్య – చింతయామాస – వానరః ॥

అన్వయక్రమము :– సః వానరః తయా ప్రశస్తాభిః వాగ్భిః పూజితః, గమిష్యన్, తస్మాత్ దేశాత్ అపాక్రమ్య చింతయామాస.

ప్రతిపదార్థము :– సః వానరః = ఆ హనుమ, తయా = ఆ సీతాదేవిచే, ప్రశస్తాభిః = శ్రేష్ఠములైన, వాగ్భిః = మాటలచే, పూజితః = గౌరవింపబడినవాడై, గమిష్యన్ = వెడలబోవుచు, తస్మాత్ దేశాత్ = ఆ ప్రదేశము నుండి, అపాక్రమ్య = తొలగి, చింతయామాస = ఆలోచింపదొడగెను.

తాత్పర్యము :– హనుమ సీతాదేవిచే మంచి మాటలతో సముచితముగా గౌరవింపబడి అటనుండి వెడలిపోవుచు ఆ ప్రదేశము నుండి ప్రక్కకు వెడలి కొలది దూరమున నిలచి ఇట్లు చింతింపసాగెను.

శ్లో॥ అల్పశేష మిదం కార్యం దృష్టేయ మసితేక్షణా ।
త్రీ నుపాయా నతిక్రమ్య చతుర్థ ఇహ దృశ్యతే ॥ 2

పదచ్ఛేదము :– అల్పశేషమ్ – ఇదం – కార్యం – దృష్టా – ఇయం – అసితేక్షణా – త్రీన్ – ఉపాయాన్ – అతిక్రమ్య – చతుర్థః – ఇహ – దృశ్యతే ॥

అన్వయక్రమము :– ఇదం కార్యమ్ అల్పశేషమ్; ఇయమ్ అసితేక్షణా దృష్టా; ఇహ త్రీన్ ఉపాయాన్ అతిక్రమ్య చతుర్థః దృశ్యతే.

ప్రతిపదార్థము :– ఇదం కార్యం = ఈ కార్యము, అల్పశేషం = కొద్దిగ మిగిలినట్టిది, ఇయం అసితేక్షణా = ఈ సీతాదేవి, దృష్టా = కనబడినది, ఇహ = ఇచ్చట, త్రీన్ ఉపాయాన్ = సామాదులైన మూడు ఉపాయములను, అతిక్రమ్య = మించి, చతుర్థః

= నాల్గవదైన దండోపాయము, దృశ్యతే = కాన్పించుచున్నది.

తాత్పర్యము :– ప్రధానకార్యమైన సీతాసందర్శనము ఇప్పటికి సాధింపబడినది. శత్రుబల సందర్శనమనెడి రెండవ చిన్న కార్యము ఇంక మిగిలియున్నది. దానికొఱకు సామదాన భేదములనెడి మూడు ఉపాయములును గాక దండము అనగా యుద్ధము అనెడి నాల్గవ ఉపాయమే ప్రస్తుతము ప్రయోజనకరముగా నాకు గాన్పించుచున్నది.

శ్లో॥ న సామ రక్షస్సు గుణాయ కల్పతే
న దాన మర్థోపచితేషు యుజ్యతే ।
న భేదసాధ్యా బలదర్పితా జనాః
పరాక్రమ స్త్వేవ మ మేహ రోచతే ॥ 3

పదచ్ఛేదము :– న – సామ – రక్షస్సు – గుణాయ – కల్పతే – న – దానమ్ – అర్థోపచితేషు – యుజ్యతే – న – భేదసాధ్యాః – బలదర్పితాః – జనాః – పరాక్రమః – తు – ఏవ – మమ – ఇహ – రోచతే ॥

అన్వయక్రమము :– రక్షస్సు సామ గుణాయ న కల్పతే; అర్థోపచితేషు దానం న యుజ్యతే; బలదర్పితాః జనాః భేదసాధ్యాః న; ఇహ మమ పరాక్రమః ఏవ రోచతే.

ప్రతిపదార్థము :– రక్షస్సు = రాక్షసుల విషయమునందు, సామ = సామవచనము, గుణాయ = మంచి కొఱకు, న కల్పతే = ఉపయోగింపదు, అర్థోపచితేషు = ధనముచే సమృద్ధిగాంచియున్న వారి యెడ, దానం = దానము, న యుజ్యతే = ఉపయోగించదు, బలదర్పితాః = బలముచే మదించియున్నట్టి, జనాః = జనులు, భేదసాధ్యాః = భేదోపాయముచే వశపడునట్టి వారు, న = కారు, ఇహ = ఈ సందర్భమున, మమ = నాకు, పరాక్రమః ఏవ = పరాక్రమమే, రోచతే = ఇష్టమగుచున్నది.

తాత్పర్యము :– ఈ రాక్షసులయందు సామవచనము ఫలవంతము గాజాలదు. ఐశ్వర్యముతో మదించియున్న ఈ రక్కసుల యెడ దానమను ఉపాయముకూడ పనిచేయదు. ఎవ్వరిని లెక్కచేయని బలగర్వితులైన వీరినడుమ పరస్పరవైరము కల్పించి సాధింపవలసియున్నట్టి భేదోపాయముగూడ ఏమియు పనిచేయదు. అందుచే వీరియెడ చూపవలసినది చివరి ఉపాయమైన యుద్ధమనెడి దండోపాయ మొక్కటియే యని నా నిశ్చయము.

శ్లో॥ న చాస్య కార్యస్య పరాక్రమా దృతే
వినిశ్చయః కశ్చి ది హోపపద్యతే ।

హతప్రవీరా శ్చ రణే తు రాక్షసాః
కథంచి దీయు ర్య ది హాద్య మార్దవమ్ ॥ 4

పదచ్ఛేదము :– న – చ – అస్య – కార్యస్య – పరాక్రమాత్ – ఋతే – వినిశ్చయః – కశ్చిత్ – ఇహ – ఉపపద్యతే – హతప్రవీరాః – చ – రణే – తు – రాక్షసాః – కథంచిత్ – ఈయుః – యత్ – ఇహ – అద్య – మార్దవమ్ ॥

అన్వయక్రమము :– ఇహ అస్య కార్యస్య పరాక్రమాత్ ఋతే కశ్చిత్ వినిశ్చయః న ఉపపద్యతే; ఇహ అద్య రణే హతప్రవీరాః రాక్షసాః కథంచిత్ మార్దవమ్ ఈయుః.

ప్రతిపదార్థము :– ఇహ = ఇచ్చట, అస్య కార్యస్య = ఈ కార్యమునకు, పరాక్రమాత్ ఋతే = పరాక్రమముగాక, కశ్చిత్ వినిశ్చయః = ఒకానొక నిశ్చయము, న ఉపపద్యతే = తగియుండదు, యత్ = ఏలననగా, ఇహ = ఇచ్చట, అద్య = నేడు, రణే = యుద్ధమునందు, హతప్రవీరాః = చనిపోయిన మహాయోధులు కలిగినట్టి, రాక్షసాః = రక్కసులు, కథంచిత్ = ఎట్లో, మార్దవం = మెత్తబడుటను, ఈయుః = పొందగలరు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రామాయణ శిరోమణి :– రాక్షసాః కథంచిత్ మార్దవమ్ ఈయుః – నేనిప్పుడే విజృంభించి ఈ రాక్షసులలో పెద్దవారిని హతమార్చినచో వారు చేయునదిలేక తమ కార్యమును వదలి, సీతను రామునకు అప్పగించినచో రాక్షసకులవిధ్వంసనము జరుగకుండును గదా యని హనుమ తన దయాస్వభావము నిట్లు వెల్లడించుచున్నాడు.

తాత్పర్యము :– నేను సాధింపబోవు కార్యమునకు పరాక్రమము కంటె వేఱైన మార్గమేమియు తగియుండదు. ఈ రాక్షసులలోని మహావీరులు నేడు హతమారినచో మిగిలిన వారైనను క్రౌర్యమును వీడి ఎట్లో సాధుమార్గము నవలంబించవచ్చును.

శ్లో॥ కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూ న్యపి సాధయేత్ ।
పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తు మర్హతి ॥ 5

పదచ్ఛేదము :– కార్యే – కర్మణి – నిర్దిష్టే – యః – బహూని – అపి – సాధయేత్ – పూర్వకార్యావిరోధేన – సః – కార్యం – కర్తుమ్ – అర్హతి ॥

అన్వయక్రమము :– నిర్దిష్టే కార్యే కర్మణి యః బహూని అపి పూర్వకార్యావిరోధేన సాధయేత్, సః కార్యం కర్తుమ్ అర్హతి.

ప్రతిపదార్థము :– నిర్దిష్టే = నిర్దేశింపబడినట్టి, కార్యే = కర్తవ్యమైనట్టి, కర్మణి =

పనియందు, పూర్వకార్యావిరోధేన = మొదటి కర్తవ్యమునకు విరోధము లేకుండగా, బహూని అపి = పెక్కింటిని గూడ, యః = ఎవడు, సాధయేత్ = నెఱవేర్చునో, సః = ఆతడు, కార్యం = పనిని, కర్తుం = సాధించుటకు, అర్హతి = తగియుండును.

సూచన :– కార్యే కర్మణి నిర్దిష్టే – అనుటకు బదులుగా 'కార్యే కర్మణి నిర్వృత్తే' అని పాఠాంతరము. అనగా నిర్ణయింపబడిన కర్తవ్యము పూర్తిగా నిర్వహింపబడిన పిమ్మట అని అర్థము.

తాత్పర్యము :– తనకు నిర్దేశింపబడినట్టి కర్తవ్యనిర్వహణమునందు ప్రధానకార్యమునకు విరోధము లేకుండ, ఆ కార్యమునకే పోషకములైనట్టి మఱి పెక్కింటిని గూడ నెవ్వడు సాధింపగల్గునో అట్టి వాడే కార్యనిర్వహణమునకు అర్హుడై యుండును.

శ్లో॥ న హ్యేక స్సాధకో హేతు స్స్వల్ప స్యాపీహ కర్మణః ।
యో హ్యర్థం బహుధా వేద స సమర్థో ఽర్థసాధనే ॥ 6

పదచ్ఛేదము :– న – హి – ఏకః – సాధకః – హేతుః – స్వల్పస్య – అపి – ఇహ – కర్మణః – యః – హి – అర్థం – బహుధా – వేద – సః – సమర్థః – అర్థసాధనే ॥

అన్వయక్రమము :– ఇహ స్వల్పస్య కర్మణః అపి సాధకః హేతుః ఏకః న హి; యః అర్థం బహుధా (కర్తుం) వేద, సః అర్థసాధనే సమర్థః హి.

ప్రతిపదార్థము :– ఇహ = ఈ లోకమున, స్వల్పస్య = చిన్నదైనట్టి, కర్మణః అపి = పనికిగూడ, సాధకః = సాధించునట్టి, హేతుః = కారణము, ఏకః = ఒక్కటి, న హి = కాదుగదా, యః = ఎవ్వడు, అర్థం = కార్యమును, బహుధా = పెక్కువిధములుగా, (కర్తుం = నిర్వహించుటకు) వేద = తెలిసియుండునో, సః = ఆతడు, అర్థసాధనే = కార్యనిర్వహణమునందు, సమర్థః హి = అర్హుడుగదా!

తాత్పర్యము :– లోకమునందు ఎంతచిన్న పనికిని గూడ దానిని సాధించుటకు ఒక్కటే సాధనము అని చెప్పవీలుపడదు. కార్య నిర్వహణమునకు అనేకములు సాధనములు ఉండితీరును. అందుచే ఒక మహాకార్యమును నిర్వహించుటకు పలుమార్గములను ఎవ్వడు ఎఱిగియుండునో ఆతడే మహాకార్యనిర్వహణమునకు సమర్థుడు కాగలడు.

శ్లో॥ ఇ హైవ తావ త్కృతనిశ్చయో హ్యహం
యది వ్రజేయం ప్లవగేశ్వరాలయమ్ ।

పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవి
త్తతః కృతం స్యా న్మమ భర్తృశాసనమ్ ॥ 7

పదచ్ఛేదము :– ఇహ – ఏవ – తావత్ – కృతనిశ్చయః – హి – అహమ్ – యది – వ్రజేయం – ప్లవగేశ్వరాలయమ్ – పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవిత్ – తతః – కృతం – స్యాత్ – మమ – భర్తృశాసనమ్ ॥

అన్వయక్రమము :– ఇహ అద్య ఏవ తావత్ పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవిత్, కృతనిశ్చయః అహం ప్లవగేశ్వరాలయం వ్రజేయం యది, తతః మమ భర్తృశాసనం కృతం స్యాత్.

ప్రతిపదార్థము :– ఇహ = ఇచట, అద్య ఏవ = ఇప్పుడే, తావత్ = ముందుగా, పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవిత్ = శత్రువులయొక్కయు మాయొక్కయు బలవిశేషముల వాస్తవరూపమును తెలిసికొన్నవాడనై, కృతనిశ్చయః = చేసికొన్న నిశ్చయము గలవాడనై, అహం = నేను, ప్లవగేశ్వరాలయం = వానరరాజైన సుగ్రీవుని నివాసమును గూర్చి, వ్రజేయం యది = వెడలినయెడల, తతః = ఆ కారణమువలన, మమ = నా యొక్క, భర్తృశాసనం = రాజాజ్ఞ, కృతం = నెఱవేర్పబడినది, స్యాత్ = కాగలదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవిత్' నేను శత్రుబలమును గూడ వాస్తవముగా తెలిసికొన్నవాడను గావలయును. లేనిచో శ్రీరాముడును మిగిలిన సుగ్రీవాదులును శత్రుబల మెంతటిదని అడిగినచో నేను నిరుత్తరుడను గావలసియుండునుగదా! అని భావము.

తాత్పర్యము :– నేనిప్పుడే ముందుగా సంపూర్ణముగా శత్రువుయొక్క బలాధిక్యము ఎంతటిదో ఆ వాస్తవస్వరూపమును తెలిసికొని నిశ్చయజ్ఞానము సంపాదించి మా వానరరాజు నిలయమునకు వెడలుదును. అట్లు చేయుటవలన మా ప్రభువు ఆజ్ఞను నేను పూర్తిగా నిర్వహించినవాడను కాగలను.

శ్లో॥ కథం ను ఖ ల్వద్య భవే త్సుఖాగతం
ప్రసహ్య యుద్ధం మమ రాక్షసై స్సహ ।
తథైవ ఖ ల్వాత్మబలం చ సారవ
త్సమ్మానయే న్మాం చ రణే దశాననః ॥ 8

పదచ్ఛేదము :– కథం – ను – ఖలు – అద్య – భవేత్ – సుఖాగతం – ప్రసహ్య –

యుద్ధం - మమ - రాక్షసైః - సహ - తథా - ఏవ - ఖలు - ఆత్మబలం - చ - సారవత్ - సమ్మానయేత్ - మాం - చ - రణే - దశాననః ॥

అన్వయక్రమము :- అద్య కథం ను మమ సుఖాగతం భవేత్ ఖలు! రాక్షసైః సహ ప్రసహ్య మమ యుద్ధం (కథం ను భవేత్;) తథా ఏవ దశాననః సారవత్ ఆత్మబలం మాం చ, రణే కథం ను సమ్మానయేత్ ఖలు!

ప్రతిపదార్థము :- అద్య = నేడు, కథం = ఎట్లుగా, మమ = నాకు, సుఖాగతం = సుఖకరమైన రాక, భవేత్ ఖలు = కాగలదో, రాక్షసైః సహ = రాక్షసులతోడ, ప్రసహ్యా = బలవంతముగా, మమ = నాకు, యుద్ధం = రణము, కథం ను భవేత్ = ఎట్లుగా సంభవించును?, తథా ఏవ = అట్లే, దశాననః = రావణాసురుడు, సారవత్ = శ్రేష్ఠమైన, ఆత్మబలం = తన సైన్యమును, మాం చ = నన్నును, కథం = ఎట్లు, సమ్మానయేత్ ఖలు = గౌరవించునో గదా!

తాత్పర్యము :- నేడు ఇచటికి నా రాక సుఖకరమైన ఫలితముగలది ఎట్లు కాగలదో? ఈ రాక్షసులతో బలవంతముగా నాకు యుద్ధమెట్లు సంభవించునో? మఱియు ఈ రావణుడు యుద్ధమునందు సమర్థమైన తన సైన్యము యొక్క బలమును, నా శక్తిని గ్రహించి ఆ రెండింటి తారతమ్యమును గుర్తించి నన్ను ఎట్లు గౌరవించునో గదా!

శ్లో॥ తత స్సమాసాద్య రణే దశాననం
సమంత్రివర్గం సబలప్రయాయినమ్ ।
హృది స్థితం తస్య మతం బలం చ వై
సుఖేన మత్వాஉహ మితః పున ర్వ్రజే ॥ 9

పదచ్ఛేదము :- తతః - సమాసాద్య - రణే - దశాననం - సమంత్రివర్గం - సబలప్రయాయినమ్ - హృది - స్థితం - తస్య - మతం - బలం - చ - వై - సుఖేన - మత్వా - అహమ్ - ఇతః - పునః - వ్రజే ॥

అన్వయక్రమము :- తతః సమంత్రివర్గం, సబలప్రయాయినం దశాననం రణే సమాసాద్య తస్య హృది స్థితం మతం, తస్య బలం చ మత్వా సుఖేన ఇతః పునః వ్రజే.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, సమంత్రివర్గం = మంత్రుల వర్గములతో కూడిన వాడును, సబలప్రయాయినమ్ = సైన్యముతో వెడలిన వాడునగు, దశాననం = రావణుని, రణే = యుద్ధమున, సమాసాద్య = చేరి, తస్య = అతనియొక్క, హృది = మనస్సునందు, స్థితం = ఉన్నట్టి, మతం = అభిప్రాయమును, (తస్య = అతనియొక్క)

బలం చ = శక్తిని, మత్వా = తెలిసికొని, సుఖేన = సుఖముగా, ఇతః = ఇటనుండి, పునః = తిరిగి, వ్రజే = వెడలిపోవుదును.

తాత్పర్యము :– యుద్ధము సంభవించిన పిమ్మట రావణాసురుడు తన మంత్రివర్గము తోడను తన యోధులతోడను రణరంగమునకు వచ్చును. అట్లు వచ్చిన ఆ రావణుని ఎదుర్కొని అతని మనస్సునందున్న అభిప్రాయమును, అతని బలవిశేషమును సంపూర్ణముగ గ్రహించి నేను సుఖముగా ఇటనుండి వెడలిపోవుదును గాక!

శ్లో॥ ఇదమస్య నృశంసస్య నందనోపమ ముత్తమమ్ ।
వనం నేత్రమనఃకాంతం నానాద్రుమలతాయుతమ్ ॥ 10

పదచ్ఛేదము :– ఇదమ్ – అస్య – నృశంసస్య – నందనోపమమ్ – ఉత్తమమ్ – వనం – నేత్రమనఃకాంతం – నానాద్రుమలతాయుతమ్ ॥

అన్వయక్రమము :– అస్య నృశంసస్య నందనోపమమ్, ఉత్తమం, నానాద్రుమ లతాయుతమ్ ఇదం వనం నేత్రమనఃకాంతం (వర్తతే).

ప్రతిపదార్థము :– అస్య నృశంసస్య = ఈ దుర్మార్గునియొక్క, నందనోపమమ్ = నందనవనముతో సాటివచ్చునదియు, ఉత్తమం = శ్రేష్ఠమైనదియును, నానాద్రుమ లతాయుతమ్ = పలువృక్షములతోడను తీగలతోడను కూడినదియు నగు, ఇదం వనం = ఈ వనము, నేత్రమనఃకాంతం = నేత్రములకును మనస్సునకు రమణీయమై, (వర్తతే = ఉన్నది).

తాత్పర్యము :– ఈ దుర్మార్గునియొక్క ఈ వనము స్వర్గమునందలి నందనవనమును బోలి, బహువిధ వృక్షములతోడను, లతలతోడను వెలయుచు కన్నులకును మనస్సునకును గూడ గొప్ప వేడుక గూర్చు చున్నది.

శ్లో॥ ఇదం విధ్వంసయిష్యామి శుష్కం వనమివానలః ।
అస్మి న్భగ్నే తతః కోపం కరిష్యతి దశాననః ॥ 11

పదచ్ఛేదము :– ఇదం – విధ్వంసయిష్యామి – శుష్కం – వనమ్ – ఇవ – అనలః – అస్మిన్ – భగ్నే – తతః – కోపం – కరిష్యతి – దశాననః ।

అన్వయక్రమము :– శుష్కం వనమ్ అనలః ఇవ ఇదమ్ అహం విధ్వంసయిష్యామి; అస్మిన్ భగ్నే (సతి) తతః దశాననః కోపం కరిష్యతి.

ప్రతిపదార్థము :– శుష్కం = ఎండిపోయినట్టి, వనం = వనమును, అనలః ఇవ = అగ్నివలె, ఇదం = ఈ వనమును, అహం = నేను, విధ్వంసయిష్యామి = ధ్వంసము

గావింతును, అస్మిన్ = ఈ వనము, భగ్నే (సతి) = ధ్వంసముకాగా, తతః = పిమ్మట, దశాననః = రావణుడు, కోపం కరిష్యతి = కోపగించును.

తాత్పర్యము :- నేనిప్పుడీ వనమును ఎండిపోయియున్న అడవిని అగ్నిహోత్రుడు దహించునట్లుగా ధ్వంసము గావించెదను. రావణాసురుడు ఈ ధ్వంసమును గూర్చి విని తప్పక మిక్కిలి క్రోధము నొందును.

శ్లో॥ తతో మహ త్సాశ్వమహారథద్విపం
బలం సమాదేక్ష్యతి రాక్షసాధిపః ।
త్రిశూలకాలాయసపట్టిసాయుధం
తతో మహ ద్యుద్ధ మిదం భవిష్యతి ॥ 12

పదచ్ఛేదము :- తతః - మహత్ - సాశ్వమహారథద్విపం - బలం - సమాదేక్ష్యతి - రాక్షసాధిపః - త్రిశూలకాలాయసపట్టిసాయుధం - తతః - మహత్ - యుద్ధమ్ - ఇదం - భవిష్యతి ॥

అన్వయక్రమము :- తతః రాక్షసాధిపః సాశ్వమహారథద్విపం, త్రిశూలకాలాయస పట్టిసాయుధం, మహత్ బలం సమాదేక్ష్యతి; తతః ఇదం మహత్ యుద్ధం భవిష్యతి.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, రాక్షసాధిపః = రాక్షసరాజు, సాశ్వమహారథ ద్విపం = గుఱ్ఱములతోడను, పెద్దరథములతోడను; ఏనుగులతోడను, కూడినదియు, త్రిశూలకాలాయసపట్టిసాయుధం = త్రిశూలములను, నల్లని ఉక్కుకత్తులను, ఆయుధములుగా కలిగినట్టిదియు నగు, మహత్ బలం = గొప్పదైన సైన్యమును, సమాదేక్ష్యతి = ఆజ్ఞాపించును, తతః = ఆ కారణమున, ఇదం = ఇది, మహత్ యుద్ధం = గొప్ప యుద్ధము, భవిష్యతి = సంభవింపగలదు.

తాత్పర్యము :- అట్లు కోపించినట్టి రాక్షసరాజు వెంటనే గుఱ్ఱములతోడను రథముల తోడను మదగజముల తోడను కూడి త్రిశూలములు ఖడ్గములు మున్నగు ఆయుధములు బూనినట్టి గొప్పదైన తనసైన్యమును బంపి నన్ను బంధింపుడని ఆజ్ఞాపించును. అప్పుడు అచ్చట గొప్పదైన యుద్ధము సంభవించును.

శ్లో॥ అహం తు తై స్సంయతి చండవిక్రమైః
సమేత్య రక్షోభి రసహ్యవిక్రమః ।
నిహత్య త ద్రావణచోదితం బలం
సుఖం గమిష్యామి కపీశ్వరాలయమ్ ॥ 13

పదచ్ఛేదము :- అహం - తు - తైః - సంయతి - చండవిక్రమైః - సమేత్య - రక్షోభిః - అసహ్యవిక్రమః - నిహత్య - తత్ - రావణచోదితం - బలం - సుఖం - గమిష్యామి - కపీశ్వరాలయమ్ ॥

అన్వయక్రమము :- అసహ్యవిక్రమః అహం తు సంయతి చండవిక్రమైః తైః రక్షోభిః సమేత్య రావణచోదితం తత్ బలం నిహత్య సుఖం కపీశ్వరాలయం గమిష్యామి.

ప్రతిపదార్థము :- అసహ్యవిక్రమః = సహింప శక్యముగాని పరాక్రమముగల్గినట్టి, తైః రక్షోభిః = ఆ రాక్షసులతో, సమేత్య = కూడి, రావణచోదితం = రావణునిచే ప్రేరేపింపబడినట్టి, తత్ బలం = ఆ సైన్యమును, నిహత్య = తునుమాడి, సుఖం = సుఖముగా, కపీశ్వరాలయం = వానరరాజు భవనమునకు, గమిష్యామి = పోవుదును.

తాత్పర్యము :- శత్రువులు భరింపశక్యముగాని పరాక్రమము గల్గిన నే నా యుద్ధమునందు భయంకరపరాక్రమముతో పోరాడుచున్నట్టి ఆ రాక్షసులకు ఎదురునిలచి, రావణుడు పంపిన ఆ సైన్యమునంతను నేలగూల్చి సుఖముగా వానరరాజు నిలయమునకు చేరుకొందును.

శ్లో॥ తతో మారుతవ త్క్రుద్ధో మారుతి ర్భీమవిక్రమః ।
ఊరువేగేన మహతా ద్రుమాన్ క్షేప్తుమ థారభత్ ॥ 14

పదచ్ఛేదము :- తతః - మారుతవత్ - క్రుద్ధః - మారుతిః - భీమవిక్రమః - ఊరువేగేన - మహతా - ద్రుమాన్ - క్షేప్తుమ్ - అథ - ఆరభత్ ॥

అన్వయక్రమము :- తతః భీమవిక్రమః మారుతిః క్రుద్ధః మారుతవత్ అథ మహతా ఊరువేగేన ద్రుమాన్ క్షేప్తుమ్ ఆరభత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, భీమవిక్రమః = భయంకరపరాక్రముడైన, మారుతిః = హనుమ, క్రుద్ధః = క్రోధమునొందిన, మారుతవత్ = ప్రభంజనమువలె, అథ = పిమ్మట, మహతా = గొప్పదైన, ఊరువేగేన = తోడలవేగముతో, ద్రుమాన్ = వృక్షములను, క్షేప్తుమ్ = విసరుటకు, ఆరభత్ = మొదలిడెను.

తాత్పర్యము :- ఇట్లు ఆలోచించిన పిమ్మట ప్రచండపరాక్రమముగలవాడైన ఆ వాయునందనుడు ప్రభంజనమువలె విజృంభించి భీకరమైన తన తొడల వేగముతో ఆ వనమునందలి వృక్షములను విసరివేయ నారంభించెను.

శ్లో॥ తతస్తు హనుమా న్వీరో బభంజ ప్రమదావనమ్ ।
మత్తద్విజసమాఘుష్టం నానాద్రుమలతాయుతమ్ ॥ 15

పదచ్ఛేదము :– తతః – తు – హనుమాన్ – వీరః – బభంజ – ప్రమదావనమ్ – మత్తద్విజసమాఘుష్టం – నానాద్రుమలతాయుతమ్ ॥

అన్వయక్రమము :– తతః వీరః హనుమాన్ మత్తద్విజసమాఘుష్టం నానాద్రుమ లతాయుతం ప్రమదావనం బభంజ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, వీరః = వీరుడైనట్టి, హనుమాన్ = హనుమ, మత్తద్విజసమాఘుష్టం = మదించిన పక్షులచే రొదచేయబడుచున్నదియును, నానాద్రుమలతాయుతం = బహువృక్షములతోడను, తీగలతోడను గూడినదియునగు, ప్రమదావనం = ఉద్యానవనమును, బభంజ = ధ్వంసముచేసెను.

తాత్పర్యము :– పిమ్మట మహావీరుడైన ఆ హనుమ మదించిన పక్షుల కోలాహలముతో గూడి బహువిధములగు వృక్షములతోను లతలతోను నిండియున్న ఆ యుద్యానవనము నంతను ధ్వంసము చేసివేసెను.

శ్లో॥ తద్వనం మథితై ర్వృక్షై ర్భిన్నై శ్చ సలిలాశయైః ।
చూర్ణితైః పర్వతాగ్రైశ్చ బభూ వాప్రియదర్శనమ్ ॥ 16

పదచ్ఛేదము :– తత్ – వనం – మథితైః – వృక్షైః – భిన్నైః – చ – సలిలాశయైః – చూర్ణితైః – పర్వతాగ్రైః చ – బభూవ – అప్రియదర్శనమ్ ॥

అన్వయక్రమము :– తత్ వనం మథితైః వృక్షైః భిన్నైః సలిలాశయైః చ, చూర్ణితైః పర్వతాగ్రైః చ అప్రియదర్శనం బభూవ.

ప్రతిపదార్థము :– తత్ వనం = ఆ వనము, మథితైః = విఱిచివేయబడిన, వృక్షైః = వృక్షములతోడను, ప్రభిన్నైః = తెగగొట్టబడిన, సలిలాశయైః = జలాశయములతోడను, చూర్ణితైః = నుగ్గుగా చేయబడిన, పర్వతాగ్రైః చ = గిరిశిఖరములతోడను, అప్రియదర్శనం = చూచుటకు అప్రియమైనదిగా, బభూవ = ఆయెను.

తాత్పర్యము :– అప్పుడా వనము విఱుగగొట్టిన చెట్లతోను తెగిన గట్టులు గల తటాకముల తోడను ముక్కలు ముక్కలుగా చేసిన పర్వతశిఖరములతోను చూచుట కెంతయో బీభత్సముగా నుండెను.

శ్లో॥ నానాశకుంతవిరుతైః ప్రభిన్నై స్సలిలాశయైః ।
తామ్రైః కిసలయైః క్లాంతైః క్లాంతద్రుమలతాయుతమ్ ॥
న బభౌ త ద్వనం తత్ర దావానలహతం యథా ।
వ్యాకులావరణా రేజు ర్విహ్వలా ఇవ తా లతాః ॥ 17

పదచ్ఛేదము :– నానాశకుంతవిరుతైః – ప్రభిన్నైః – సలిలాశయైః – తామ్రైః – కిసలయైః – క్లాంతైః – క్లాంతద్రుమలతాయుతమ్ – న – బభౌ – తత్ – వనం – తత్ర – దావానలహతం – యథా – వ్యాకులావరణాః – రేజుః – విహ్వాలాః – ఇవ – తాః – లతాః ॥

అన్వయక్రమము :– నానాశకుంతవిరుతైః ప్రభిన్నైః సలిలాశయైః క్లాంతైః తామ్రైః కిసలయైః, క్లాంతద్రుమలతాయుతం, తద్వనం దావానలహతం యథా న బభౌ; తత్ర వ్యాకులావరణాః తాః లతాః విహ్వాలాః (స్త్రియః ఇవ) రేజుః.

ప్రతిపదార్థము :– నానాశకుంతవిరుతైః = వివిధములగు పక్షుల కూతలచేతను, ప్రభిన్నైః = తెగిపోయినట్టి, సలిలాశయైః = తటాకములతోడను, క్లాంతైః = వాడిపోయినట్టి, తామ్రైః = ఎఱ్ఱనైనట్టి, కిసలయైః = చిగుళ్ళతోడను, క్లాంతద్రుమ లతాయుతం = వాడిపోయినచెట్ల తోడను తీగలతోడను కూడినట్టి, తద్వనం = ఆ వనము, దావానలహతం యథా = కారుచిచ్చుచే ధ్వంసమైనదివలె, న బభౌ = ప్రకాశింప కుండెను, తత్ర = ఆ వనమునందు, వ్యాకులావరణాః = చెదిరిపోయిన కంచెలు గలిగినట్టి, తాః లతాః = ఆ తీగలు, విహ్వాలాః = భయచకితురాంద్రైన, (స్త్రియః ఇవ = అబలలవలె) రేజుః = ప్రకాశించినవి.

తాత్పర్యము :– వివిధములగు పక్షుల కూతలతోను, తెగిపోయిన గట్టులుగల జలాశయములతోను, వాడిపోయిన ఎఱ్ఱని చిగుళ్ళతోను, వాడిపోయిన చెట్లతోను, తీగలతోను ఆ వనమంతయు కారుచిచ్చుచే దహింపబడినట్లు వెల వెల బోవుచుండెను. అచ్చటి కంచెలు అన్నియు చెడిపోగా ఆ పూలతీగలు భయముతో హడలిపోవుచున్న అబలవలె కనబడినవి.

శ్లో॥ లతాగృహై శ్చిత్రగృహై శ్చ నాశితై
ర్మహోరగై ర్వ్యాళమృగై శ్చ నిర్ధుతైః ।
శిలాగృహై రున్మథితై స్తథా గృహైః
ప్రణష్టరూపం త దభూ న్మహ ద్వనమ్ ॥ 18

పదచ్ఛేదము :– లతాగృహైః – చిత్రగృహైః – చ – నాశితైః – మహోరగైః – వ్యాళమృగైః – చ – నిర్ధుతైః – శిలాగృహైః – ఉన్మథితైః – తథా – గృహైః – ప్రణష్టరూపం – తత్ – అభూత్ – మహత్ – వనమ్ ॥

అన్వయక్రమము :– నాశితైః లతాగృహైః చిత్రగృహైః చ నిర్ధుతైః మహోరగైః వ్యాళమృగైః చ తథా ఉన్మథితైః శిలాగృహైః చ తత్ మహద్వనం ప్రణష్టరూపమ్ అభూత్.

ప్రతిపదార్థము :– నాశితైః = ధ్వంసముచేయబడినట్టి, లతాగృహైః = పొదరిండ్లతోడను, చిత్రగృహైః చ = చిత్రమందిరములతోడను, నిర్ధుతైః = తఱుమబడినట్టి, మహోరగైః = మహాసర్పములతోడను, వ్యాళమృగైః = క్రూరమృగములతోడను, ఉన్మథితైః = విఱుగగొట్టబడినట్టి, శిలాగృహైః = ఱాతిభవనములతోడను, తథా = అట్లే, గృహైః = సామాన్యమైన ఇండ్లతోడను, తత్ మహత్ వనం = ఆ గొప్పదైనట్టి వనము, ప్రణష్టరూపం = చెడిపోయినట్టి రూపముగలదిగ, అభూత్ = ఆయెను.

తాత్పర్యము :– గొప్పదైన ఆ వనమంతయు ధ్వంసమైయున్న పొదరిండ్లతోను, విలాస భవనములతోను, తఱుమగొట్టిన మహాసర్పములతోను, క్రూరమృగములతోను, విఱిగిపోయిన శిలాభవనములతోను, సామాన్యగృహములతోను పూర్తిగా చెడిపోయి శోభావిహీనమై యుండెను.

శ్లో॥ సా విహ్వలాశోకలతాప్రతానా
వనస్థలీ శోకలతాప్రతానా ।
జాతా దశాస్యప్రమదావనస్య
కపే ర్బలా ద్ధి ప్రమదావనస్య ॥ 19

పదచ్ఛేదము :– సా – విహ్వలాశోకలతాప్రతానా – వనస్థలీ – శోకలతాప్రతానా – జాతా – దశాస్యప్రమదావనస్య – కపేః – బలాత్ – హి – ప్రమదావనస్య ॥

అన్వయక్రమము :– ప్రమదావనస్య దశాస్యప్రమదావనస్య విహ్వలాశోకలతాప్రతానా వనస్థలీ, కపేః బలాత్ శోకలతాప్రతానా జాతా.

ప్రతిపదార్థము :– ప్రమదావనస్య = స్త్రీలకు రక్షణమైనట్టి, దశాస్యప్రమదావనస్య = రావణుని ఉద్యానవనముయొక్క, విహ్వలాశోకలతాప్రతానా = చెదిరిపోయిన అశోకలతల సమూహము గలిగినట్టి, వనస్థలీ = వనభూమి, కపేః = హనుమయొక్క, బలాత్ = బలమువలన, శోకలతాప్రతానా = శోకమనెడి తీగల సమూహము గలదిగా, జాతా = ఆయెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– "శోకలతాప్రతానా" – రలయోః అభేదః అనుటచే శోకరతమైన అనగా వాడిపోయినట్టి, అప్రుతానా – నీటియందు విస్తరించినట్టి తామరలు కలువలు మున్నగునది గలిగినట్టిది అనగా వాడిపోయిన తామరపువ్వులు మున్నగునవి గలిగినట్టిది. దశాస్యప్రమదావనస్య – రావణుడు కాపాడుచున్న సీతకు నివాసమైనట్టి,

వనస్థలీ – అశోకవనభూమి.

తిలకము :– దశాస్యప్రమదావనస్య – రావణుని స్త్రీలకు కామసంవర్ధనమును గూర్చుచు రక్షకమై యుండునట్టిదని అశోకవనమునకు విశేషణము. వనస్థలీ – తృణములు, గుల్మములు, లతలు, జలాశయములు అనువానితో గూడిన రమ్య వనభూమి యని భావము.

శోకలతాప్రతానా – చూచువారి మనస్సునకు శోకము జనింపజేయునట్టిది.

తాత్పర్యము :– సీతాదేవి నివసించుచున్నట్టి ఆ రావణుని ప్రమదావనమున అశోకలతలు అన్నియు చెదరిపోయినవై ఆ వనభూమియందు హనుమ గావించిన విధ్వంసకృత్యమువలన వెనుకటి అశోకవన మిప్పుడు శోకవనము అయినది.

శ్లో॥ స తస్య కృత్వార్థపతే ర్మహాకపి
ర్మహ ద్వ్యళీకం మనసో మహాత్మనః ।
యుయుత్సు రేకో బహుభి ర్మహాబలైః
శ్రియా జ్వలం స్తోరణ మాశ్రితః కపిః ॥ 20

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"ప్రమదావనభంజనం" నామ
ఏకచత్వారింశస్సర్గః.

పదచ్ఛేదము :– సః – తస్య – కృత్వా – అర్థపతేః – మహాకపిః – మహత్ – వ్యళీకం – మనసః – మహాత్మనః – యుయుత్సుః – ఏకః – బహుభిః – మహాబలైః – శ్రియా – జ్వలన్ – తోరణమ్ – ఆశ్రితః – కపిః ॥

అన్వయక్రమము :– సః మహాకపిః తస్య అర్థపతేః, మహాత్మనః మనసః మహత్ వ్యళీకం కృత్వా మహాబలైః బహుభిః ఏకః యుయుత్సుః, శ్రియా జ్వలన్ తోరణమ్ ఆశ్రితః.

ప్రతిపదార్థము :– సః మహాకపిః = ఆ వానరశ్రేష్ఠుడు, తస్య = ఆ, అర్థపతేః = ఐశ్వర్యవంతుడైన, మహాత్మనః = మహనీయుడైన రావణునియొక్క, మనసః = మనస్సునకు, మహత్ = గొప్పదైన, వ్యళీకం = అప్రియమును, కృత్వా = చేసి, మహాబలైః = గొప్పబలశాలురైన, బహుభిః = పెక్కుమందితో, ఏకః = ఒంటరియై, యుయుత్సుః = యుద్ధము చేయగోరినవాడై, శ్రియా = శోభతో, జ్వలన్ =

ప్రజ్వలించుచు, తోరణం = బహిర్ద్వారమును, ఆశ్రితః = ఆశ్రయించెను.

తాత్పర్యము :- అప్పు డా వానరశ్రేష్ఠుడైన హనుమ, మహైశ్వర్యముతోను, అధికారముతోను విఱ్ఱవీగుచున్నట్టి రావణుని హృదయమునకు గొప్పవేదనను కలిగింపగోరి అచ్చటనున్న అసంఖ్యాకులైన మహావీరులతో తాను ఒక్కడే తన పరాక్రమమును వెలయించుచు పోరుసలుప దలచినవాడై అద్వితీయమైన పరాక్రమాతిశయముతో శోభిల్లుచుండెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"ప్రమదావన భంజనము" అను
నలుబదియొకటవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

ద్విచత్వారింశసర్గ

శ్లో॥ తతః పక్షినినాదేన వృక్షభంగస్వనేన చ ।
బభూవు స్త్రాససంభ్రాంతా స్సర్వే లంకానివాసినః ॥ 1

పదచ్ఛేదము :– తతః – పక్షినినాదేన – వృక్షభంగస్వనేన – చ – బభూవుః – త్రాససంభ్రాంతాః – సర్వే – లంకానివాసినః ॥

అన్వయక్రమము :– తతః పక్షినినాదేన, వృక్షభంగస్వనేన చ లంకానివాసినః సర్వే త్రాససంభ్రాంతాః బభూవుః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, పక్షినినాదేన = పక్షులధ్వనిచేతను, వృక్షభంగ స్వనేన చ = వృక్షములు విఱుగుటయొక్క శబ్దముచేతను, లంకానివాసినః = లంకలో నివసించునట్టి, సర్వే = ఎల్లరును, త్రాససంభ్రాంతాః = భయముచేత చకితులు, బభూవుః = అయిరి.

తాత్పర్యము :– అప్పుడు ఆ వనమునందలి పక్షులు భయముతో చేయు రొదలచేతను, చెట్లు విఱుగుచున్నప్పుడు కలిగిన ధ్వనులచేతను, లంకానివాసులైన రక్కసు లెల్లరును భయవిహ్వలురయిరి.

శ్లో॥ విద్రుతాశ్చ భయత్రస్తా వినేదు ర్మృగపక్షిణః ।
రక్షసాం చ నిమిత్తాని క్రూరాణి ప్రతిపేదిరే ॥ 2

పదచ్ఛేదము :– విద్రుతాః – చ – భయత్రస్తాః – వినేదుః – మృగపక్షిణః – రక్షసాం – చ – నిమిత్తాని – క్రూరాణి – ప్రతిపేదిరే ॥

అన్వయక్రమము :– మృగపక్షిణః భయత్రస్తాః విద్రుతాః వినేదుః చ. రక్షసాం క్రూరాణి నిమిత్తాని ప్రతిపేదిరే.

ప్రతిపదార్థము :– మృగపక్షిణః = మృగములును పక్షులును, భయత్రస్తాః = భయపీడితములై, విద్రుతాః = పరుగెత్తుచున్నవై, వినేదుః చ = అఱచినవి కూడను, రక్షసాం = రాక్షసులకు, క్రూరాణి = ఘోరములైనట్టి, నిమిత్తాని చ = శకునములుగూడ,

ప్రతిపేదిరే = సంభవించినవి.

తాత్పర్యము :– అచ్చట జంతువులును పక్షులును భయచకితములై నలుమూలలకును పరుగిడుచు అఱచుట ప్రారంభించినవి. అప్పుడు రాక్షసులకు దారుణములైన ఎన్నో అపశకునములు గూడ సంభవించినవి.

శ్లో॥ తతో గతాయాం నిద్రాయాం రాక్షస్యో వికృతాననాః ।
తద్వనం దదృశు ర్భగ్నం తం చ వీరం మహాకపిమ్ ॥ 3

పదచ్ఛేదము :– తతః – గతాయాం – నిద్రాయాం – రాక్షస్యః – వికృతాననాః – తత్ – వనం – దదృశుః – భగ్నం – తం – చ – వీరం – మహాకపిమ్ ॥

అన్వయక్రమము :– తతః నిద్రాయాం గతాయాం (సత్యాం) రాక్షస్యః వికృతాననాః (సత్యః) భగ్నం తద్వనం, వీరం తం మహాకపిం చ దదృశుః.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, నిద్రాయాం = నిద్ర, గతాయాం (సత్యాం) = తొలగిపోవగా, రాక్షస్యః = రాక్షసస్త్రీలు, వికృతాననాః (సత్యః) = వికారముపొందిన ముఖములు గలవారై, భగ్నం = ధ్వంసమైయున్న, తద్వనం = ఆ వనమును, వీరం = వీరుడైన, తం మహాకపిం చ = ఆ వానరశ్రేష్ఠుని కూడ, దదృశుః = చూచిరి.

తాత్పర్యము :– అప్పుడచ్చటి రాక్షసస్త్రీలు ఆ భయంకరశబ్దములచే నిద్ర తొలగిపోవగా, భయముచే వికారములయిన ముఖములతో, విధ్వంసమైయున్న తమ వనమును, మహావీరుడై అచట నిలచి యున్న హనుమను చూచిరి.

శ్లో॥ స తా దృష్ట్వా మహాబాహు ర్మహాసత్త్వో మహాబలః ।
చకార సుమహ ద్రూపం రాక్షసీనాం భయావహమ్ ॥ 4

పదచ్ఛేదము :– సః – తాః – దృష్ట్వా – మహాబాహుః – మహాసత్త్వః – మహాబలః – చకార – సుమహత్ – రూపం – రాక్షసీనాం – భయావహమ్ ॥

అన్వయక్రమము :– మహాబాహుః, మహాసత్త్వః, మహాబలః సః తాః దృష్ట్వా రాక్షసీనాం భయావహం సుమహత్ రూపం చకార.

ప్రతిపదార్థము :– మహాబాహుః = గొప్పవైన బాహువులు గలవాడును, మహాసత్త్వః = గొప్పదైన శక్తిగలవాడును, మహాబలః = మహాబలము గలవాడునగు ఆ హనుమ, తాః = ఆ రాక్షసస్త్రీలను, దృష్ట్వా = చూచి, రాక్షసీనాం = రాక్షసస్త్రీలకు, భయావహం = భయంకరమైనట్టి, సుమహత్ = మిక్కిలిగొప్పదైనట్టి, రూపం = ఆకారమును, చకార = చేసెను.

తాత్పర్యము :– ఆజానుబాహుడును అమితసత్త్వసంపన్నుడును మహాబలాఢ్యుడును అగు ఆ హనుమ ఆ రాక్షసస్త్రీలను గాంచి వారు జడిసికొనునట్లుగా గొప్పదైన భీకరాకారమును ధరించెను.

శ్లో॥ తత స్తం గిరిసంకాశ మతికాయం మహాబలమ్ ।
రాక్షస్యో వానరం దృష్ట్వా పప్రచ్ఛుర్జనకాత్మజామ్ ॥ 5

పదచ్ఛేదము :– తతః – తం – గిరిసంకాశమ్ – అతికాయం – మహాబలమ్ – రాక్షస్యః – వానరం – దృష్ట్వా – పప్రచ్ఛుః – జనకాత్మజామ్ ॥

అన్వయక్రమము :– తతః గిరిసంకాశమ్, అతికాయం, మహాబలం వానరం దృష్ట్వా రాక్షస్యః జనకాత్మజాం పప్రచ్ఛుః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, గిరిసంకాశం = పర్వతమును బోలినవాడును, అతికాయం = గొప్పదైన శరీరముగలవాడును, మహాబలం = గొప్పదైన బలము గలవాడు నగు, తం వానరం = ఆ వానరుని, దృష్ట్వా = చూచి, రాక్షస్యః = రాక్షస వనితలు, జనకాత్మజాం = జానకీదేవిని, పప్రచ్ఛుః = అడిగిరి.

తాత్పర్యము :– అప్పుడు పర్వతమువలె పెద్దదైన శరీరము కలిగి మహాబలాఢ్యుడై యున్న ఆ వానరశ్రేష్ఠుని జూచి ఆ రాక్షసస్త్రీలు జానకీదేవిని ఈ రీతిగా ప్రశ్నింపదొడగిరి.

శ్లో॥ కోఽయం కస్య కుతో వాఽయం కిన్నిమిత్త మిహాగతః ।
కథం త్వయా సహానేన సంవాదః కృత ఇత్యుత ॥ 6

పదచ్ఛేదము :– కః – అయం – కస్య – కుతః – వా – అయం – కింనిమిత్తమ్ – ఇహ – ఆగతః, కథం – త్వయా – సహ – అనేన – సంవాదః – కృతః – ఇతి – ఉత ॥

అన్వయక్రమము :– అయం కః? కస్య అయమ్? కింనిమిత్తమ్ ఇహ కుతః ఆగతః? త్వయా సహ అనేన కథమ్ ఉత సంవాదః కృతః? ఇతి.

ప్రతిపదార్థము :– అయం = ఈతడు, కః = ఎవ్వడు? కస్య = ఎవనియొక్క (సంబంధము గలవాడు)? అయం = ఈతడు, కింనిమిత్తం = ఎందునిమిత్తమై, ఇహ = ఇచ్చటికి, కుతః = ఎచ్చటినుండి, ఆగతః = వచ్చియున్నాడు? త్వయా సహ = నీతోగూడ, అనేన = వీనిచే, కథమ్ ఉత = ఎట్లుగాను, సంవాదః = సంభాషణము, కృతః = చేయబడినదో, ఇతి = అని, (పప్రచ్ఛుః = అడిగిరి).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– అనేన కథం సంవాదః త్వయా కృతః – హనుమత్ సీతా సంభాషణము జరుగుచున్నప్పు డీ రాక్షసస్త్రీలు నిద్రించియే యుండిరి. వనభంగధ్వని వినియే మేల్కొనిరి.

తాత్పర్యము :– ఈతడు ఎవ్వడు? ఎవనికి సంబంధించినవాడు? ఎచ్చటినుండి వచ్చినవాడు? ఈత డిచ్చటి కెందునిమిత్తమై వచ్చినాడు? నీతోగూడ ఈతడు ఎట్లుగా మఱియు ఏమని సంభాషించినాడు? అని ఆతని వివరములన్నియు అడుగసాగిరి.

శ్లో॥ ఆచక్ష్వ నో విశాలాక్షి మా భూత్తే సుభగే భయమ్ ।
సంవాద మసితాపాంగే త్వయా కిం కృతవా నయమ్ ॥ 7

పదచ్ఛేదము :– ఆచక్ష్వ – నః – విశాలాక్షి – మా – భూత్ – తే – సుభగే – భయమ్ – సంవాదమ్ – అసితాపాంగే – త్వయా – కిం – కృతవాన్ – అయమ్ ॥

అన్వయక్రమము :– విశాలాక్షి! నః ఆచక్ష్వ; సుభగే! తే భయం మా భూత్; అసితాపాంగే! అయం త్వయా కిం సంవాదం కృతవాన్?

ప్రతిపదార్థము :– విశాలాక్షి = విశాలమైన కన్నులు గల ఓ సుందరాంగీ! నః = మాకు, ఆచక్ష్వ = చెప్పుము. సుభగే = ఓ సౌభాగ్యవతీ, తే = నీకు, భయం = భీతి, మా భూత్ = లేకుండుగాక, అసితాపాంగే = నల్లని కనుగొనలుగల ఓ రమణీ, అయం = ఈతడు, త్వయా = నీతో, కిం సంవాదం = ఏమి సంభాషణమును, కృతవాన్ = చేసియున్నాడు?

తాత్పర్యము :– ఓ సుందరీ! మాకు స్పష్టముగా తెలుపుము. నీ కేమియు భయ మక్కఱ లేదు. ఆతడు నీతో ఏమి సంభాషణము గావించినాడు?

శ్లో॥ అథాబ్రవీ న్మహాసాధ్వీ సీతా సర్వాంగసుందరీ ।
రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః ॥ 8

పదచ్ఛేదము :– అథ – అబ్రవీత్ – మహాసాధ్వీ – సీతా – సర్వాంగసుందరీ – రక్షసాం – భీమరూపాణాం – విజ్ఞానే – మమ – కా – గతిః ॥

అన్వయక్రమము :– అథ సర్వాంగసుందరీ, మహాసాధ్వీ సీతా అబ్రవీత్, భీమరూపాణాం రక్షసాం విజ్ఞానే మమ కా గతిః ?

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, సర్వాంగసుందరీ = సర్వాంగసౌందర్యముగల,

మహాసాధ్వీ = పరమపతివ్రతయైన, సీతా = సీతాదేవి, అబ్రవీత్ = పలికెను, కామరూపాణాం = కామరూపులైయుండు, రక్షసాం = రక్కసులయొక్క, విజ్ఞానే = వివరము తెలియుటయందు, మమ = నాకు, కా గతిః (అస్తి) = ఏమి శక్తియున్నది?

తాత్పర్యము :- రాక్షసస్త్రీల ప్రశ్నమునకు సీతాసాధ్వి ఈ రీతిగ సమాధానము చెప్పెను. కామరూపులై యుండు రాక్షసుల చర్యలు తెలిసికొనుటకు నాకేమి శక్తి యున్నది?

శ్లో॥ యూయమేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి ।
అహి రేవ హ్యహేః పాదా న్విజానాతి న సంశయః ॥ 9

పదచ్ఛేదము :- యూయం - ఏవ - అభిజానీత - యః - అయం - యత్ - వా - కరిష్యతి - అహిః - ఏవ - హి - అహేః - పాదాన్ - విజానాతి - న - సంశయః ॥

అన్వయక్రమము :- అయం యః, యత్ వా కరిష్యతి; (ఇతి) యూయమ్ ఏవ అభిజానీత; అహేః పాదాన్ అహిః ఏవ విజానాతి హి; సంశయః న.

ప్రతిపదార్థము :- అయం = ఈతడు, యః = ఎవ్వడో, యత్ = దేనిని, కరిష్యతి వా = చేయునో, ఇతి = అని, యూయమ్ ఏవ = మీరే, అభిజానీత = ఎఱుగుదురు, అహేః = పాముయొక్క, పాదాన్ = పాదములను, అహిః ఏవ = పామే, విజానాతి హి = తెలిసికొనునుగదా, సంశయః న = సందేహములేదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- "యూయమేవ అభిజానీత' అని ఇచ్చట మీకే తెలియవలయును గాని నాకు తెలియదు అని అసత్యము చెప్పుట దోషము గాదు

"వివాహకాలే రతి సంప్రయోగే ప్రాణాత్యయే సర్వధనాపహారే ।
మిత్రస్య చార్థే ప్యనృతం వదేయుః పంచానృతా న్యాహు రపాతకాని ॥"

అని పెద్దల వచనము.

వాసుదాసస్వామి :- దురుద్దేశము లేని హాస్యము నందును, స్త్రీల విషయము నందును, వివాహకాలము నందును, ప్రాణాపాయము సంభవించు నప్పుడును, తన సర్వధనము నపహృత మగునపుడును, నీ యైదు విషయంబుల నసత్య మాడుట వలన పాపములేదు.

హనుమంతుడు సీతాదేవికి ప్రత్యుపకార మపేక్షింపని యుపకారి. గౌరవమిత్రుడు, నిరపరాధి. అట్టివానికి తాను సత్యమాడుటచే నిష్కారణముగ హింస

కలుగునేని, సీతాదేవికి పాపము వచ్చునే గాని సత్యమాడిన ఫలము రాదు, సత్యము చెప్పుటచే తనకును ప్రాణభయము గలదని భయపడెను. కావున ఆమె యసత్యమునకు అసత్యదోషము లేదు.

తాత్పర్యము :– ఈతడు ఎవ్వడో ఏమి చేయగలడో అది యంతయును మీకే తెలియవలయును. పాముల పాదములు పాములకే తెలియును గదా! మీ రాక్షసుల చేష్టలు మా కెట్లు తెలియగలవు?

శ్లో॥ అహ మప్యస్య భీతాఽస్మి నైవ జానామి కో న్వయమ్ ।
వేద్మి రాక్షసమేవైనం కామరూపిణ మాగతమ్ ॥ 10

పదచ్ఛేదము :– అహమ్ – అపి – అస్య – భీతా – అస్మి – న – ఏవ – జానామి – కః – ను – అయమ్, వేద్మి – రాక్షసమ్ – ఏవ – ఏనం – కామరూపిణమ్ – ఆగతమ్ ॥

అన్వయక్రమము :– అస్య; అహం అపి భీతా అస్మి; అయం కః ను (ఇతి) (అహం) న ఏవ జానామి; ఏనం కామరూపిణమ్ ఆగతం రాక్షసమ్ ఏవ వేద్మి.

ప్రతిపదార్థము :– అస్య = వీనికి, అహమ్ అపి = నేనుకూడ, భీతా అస్మి = భయపడినదాననై యున్నాను, అయం = ఈతడు, కః ను = ఎవ్వడో? నైవ జానామి = ఎఱుగనే ఎఱుగను, ఏనం = ఈతనిని, కామరూపిణం = కామరూపుడుగా, ఆగతం = వచ్చినట్టి, రాక్షసమ్ ఏవ = రాక్షసునిగనే, వేద్మి = గ్రహించుచున్నాను.

తాత్పర్యము :– నేనును ఇతనిని జూచి భయపడుచున్నాను. ఈత డెవ్వడై యుండునో నాకేమి తెలియును? నేను మాత్రము వీనిని కామరూపముతో వచ్చిన రాక్షసుడనియే భావించుచున్నాను.

శ్లో॥ వైదేహ్యా వచనం శ్రుత్వా రాక్షస్యో విద్రుతా ద్రుతమ్ ।
స్థితాః కాశ్చి ద్గతాః కాశ్చిత్ రావణాయ నివేదితుమ్ ॥ 11

పదచ్ఛేదము :– వైదేహ్యాః – వచనం – శ్రుత్వా – రాక్షస్యః – విద్రుతాః – ద్రుతమ్, స్థితాః – కాశ్చిత్ – గతాః – కాశ్చిత్ – రావణాయ – నివేదితుమ్ ॥

అన్వయక్రమము :– వైదేహ్యాః వచనం శ్రుత్వా రాక్షస్యః ద్రుతం విద్రుతాః; కాశ్చిత్ స్థితాః, కాశ్చిత్ రావణాయ నివేదితుం గతాః.

ప్రతిపదార్థము :– వైదేహ్యాః = సీతాదేవియొక్క, వచనం = మాటను, శ్రుత్వా = విని, రాక్షస్యః = రాక్షసాంగనలు, ద్రుతం = శీఘ్రముగా, విద్రుతాః = పరుగెత్తి పోయిరి,

కాశ్చిత్ = కొద్దిమంది, స్థితాః = నిలచిరి, కాశ్చిత్ = కొద్దిమంది, రావణాయ = రావణునకు, నివేదితుం = విన్నవించుటకు, గతాః = వెడలిరి.

తాత్పర్యము :– సీతాదేవి పలికిన మాటలు విని రాక్షసాంగనలు కొందఱు పరుగెత్తుకొని పోయిరి. మఱికొందఱు రావణునకు విన్నవించుటకై పోయిరి. కొలదిమందిమాత్ర మచ్చటనే సీతమ్మకు కావలిగా నిలచియుండిరి.

శ్లో॥ రావణస్య సమీపే తు రాక్షస్యో వికృతాననాః ।
విరూపం వానరం భీమ మాఖ్యాతు ముపచక్రముః ॥ 12

పదచ్ఛేదము :– రావణస్య – సమీపే – తు – రాక్షస్యః – వికృతాననాః – విరూపం – వానరం – భీమమ్ – ఆఖ్యాతుం – ఉపచక్రముః ॥

అన్వయక్రమము :– వికృతాననాః రాక్షస్యః రావణస్య సమీపే విరూపం, భీమం వానరమ్ ఆఖ్యాతుమ్ ఉపచక్రముః.

ప్రతిపదార్థము :– వికృతాననాః = వికారమైన ముఖముకల్గినట్టి, రాక్షస్యః = రాక్షసస్త్రీలు, రావణస్య = రావణుని యొక్క, సమీపే = సన్నిధిని, విరూపం = విపరీతరూపము కలిగినట్టియు, భీమం = భయంకరుడైనట్టియు, వానరమ్ = వానరునిగూర్చి, ఆఖ్యాతుమ్ = చెప్పుటకు, ఉపచక్రముః = ప్రారంభించిరి.

తాత్పర్యము :– వికారములైన ముఖములు గలిగిన ఆ రాక్షసస్త్రీలు రావణుని సమక్షమున కేగి విపరీతమైన ఆకారముతో భయంకరముగా అచట తమకు కానవచ్చిన ఆ వానరుని వర్ణించుట మొదలుపెట్టిరి.

శ్లో॥ అశోకవనికామధ్యే రాజన్ భీమవపుః కపిః ।
సీతయా కృతసంవాద స్తిష్ఠ త్యమితవిక్రమః ॥ 13

పదచ్ఛేదము :– అశోకవనికామధ్యే – రాజన్ – భీమవపుః – కపిః – సీతయా – కృతసంవాదః – తిష్ఠతి – అమితవిక్రమః ॥

అన్వయక్రమము :– రాజన్! అశోకవనికామధ్యే భీమవపుః అమితవిక్రమః కపిః సీతయా కృతసంవాదః తిష్ఠతి.

ప్రతిపదార్థము :– రాజన్ = ఓ రాజా, అశోకవనికామధ్యే = అశోకవనము నడుమ, భీమవపుః = భయంకరమైన శరీరము కలవాడును, అమితవిక్రమః = అపారమైన పరాక్రమము గలవాడు నగు, కపిః = ఒక వానరుడు, సీతయా = సీతతో, కృత సంవాదః = సంభాషణము గావించినవాడై, తిష్ఠతి = ఉన్నాడు.

తాత్పర్యము :- మహారాజా! మన అశోకవనమునడుమ మహాభయంకరమైన శరీరముతో ఒకానొక వానరుడు సీతతో సంభాషణ మొనరించి అమితపరాక్రమము గలవాడై అచ్చటనే యున్నాడు.

శ్లో॥ న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా ।
అస్మాభి ర్బహుధా పృష్టా నివేదయితు మిచ్ఛతి ॥ 14

పదచ్ఛేదము :- న - చ - తం - జానకీ - సీతా - హరిం - హరిణలోచనా - అస్మాభిః - బహుధా - పృష్టా - నివేదయతుమ్ - ఇచ్ఛతి ॥

అన్వయక్రమము :- హరిణలోచనా జానకీ సీతా అస్మాభిః బహుధా పృష్టా తం హరిం నివేదయితుం న చ ఇచ్ఛతి.

ప్రతిపదార్థము :- హరిణలోచనా = లేడికన్నులవంటి కన్నులుగల, జానకీ = జనకుని కుమార్తెయైన, సీతా = సీత, అస్మాభిః = మాచే, బహుధా = పలువిధములుగ, పృష్టా = అడుగబడినదై, తం హరిం = ఆ వానరుని గూర్చి, నివేదయితుం = తెలుపుటకు, న చ ఇచ్ఛతి = ఏమియు నిచ్చగించుట లేదు.

తాత్పర్యము :- చంచలమైన చూపులు గల ఆ సీతాదేవి మేమెన్ని విధములుగా అడిగినప్పటికిని ఆ వానరుని గూర్చి ఎంతమాత్రమును మాకు చెప్పుటలేదు.

శ్లో॥ వాసవస్య భవేద్దూతో దూతో వైశ్రవణస్య వా ।
ప్రేషితో వాపి రామేణ సీతాన్వేషణకాంక్షయా ॥ 15

పదచ్ఛేదము :- వాసవస్య - భవేత్ - దూతః - దూతః - వైశ్రవణస్య - వా - ప్రేషితః - వా - అపి - రామేణ - సీతాన్వేషణకాంక్షయా ॥

అన్వయక్రమము :- (అయం) వాసవస్య దూతః భవేత్; వైశ్రవణస్య వా దూతః భవేత్; సీతాన్వేషణకాంక్షయా రామేణ ప్రేషితః, (అపి వా భవేత్).

ప్రతిపదార్థము :- (అయం = ఈతడు) వాసవస్య = దేవేంద్రునియొక్క, దూతః = దూత, భవేత్ = అయియుండును, వైశ్రవణస్య వా = కుబేరునియొక్కగాని, దూతః = దూత, భవేత్ = అయియుండును, సీతాన్వేషణకాంక్షయా = సీతను వెదుకు కోరికతో, రామేణ = రామునిచే, ప్రేషితః అపి వా = పంపబడినట్టి వాడైనను, (భవేత్ = కావచ్చును).

తాత్పర్యము :- ఈ వానరుడు సామాన్యుడుగాడు. దేవేంద్రుడు పంపినదూత గావచ్చును. లేక కుబేరుని దూతయైనను గావచ్చును. లేక సీతను వెదుకుటకొఱకై రాముడు

పంపినట్టి దూతయైనను గావచ్చును.

శ్లో॥ తే నై వాద్భుతరూపేణ యత్త త్తవ మనోహరమ్ ।
నానామృగగణాకీర్ణం ప్రమృష్టం ప్రమదావనమ్ ॥ 16

పదచ్ఛేదము :– తేన – ఏవ – అద్భుతరూపేణ – యత్ – తత్ – తవ – మనోహరమ్, నానామృగగణాకీర్ణం – ప్రమృష్టం – ప్రమదావనమ్ ॥

అన్వయక్రమము :– అద్భుతరూపేణ తేన ఏవ మనోహరం, నానామృగగణాకీర్ణం తవ యత్ ప్రమదావనం (అస్తి) తత్ ప్రమృష్టమ్.

ప్రతిపదార్థము :– అద్భుతరూపేణ = ఆశ్చర్యకరమైన రూపము గల్గినట్టి, తేన ఏవ = అతనిచేతనే, మనోహరం = రమణీయమైనదై, నానామృగగణాకీర్ణం = వివిధమృగ సమూహములతో నిండినదై, తవ = నీకు, యత్ ప్రమదావనం = ఏ ప్రమదావనమైతే, అస్తి = ప్రియమైయున్నదో, తత్ = ఆ వనము, ప్రమృష్టమ్ = ధ్వంసము చేయబడినది.

తాత్పర్యము :– పెక్కు విధములగు జంతువులతో నిండి రమణీయమై నీకు మిక్కిలి ప్రియమైనట్టిదైన నీ ప్రమదావనమును భీకరమైన అద్భుతశరీరముగల ఆ వానరుడే ధ్వంసము చేసివేసినాడు సుమా!

శ్లో॥ న తత్ర కశ్చి దుద్దేశో య స్తేన న వినాశితః ।
యత్ర సా జానకీ సీతా స తేన న వినాశితః ॥ 17

పదచ్ఛేదము :– న – తత్ర – కః – చిత్ – ఉద్దేశః – యః – తేన – న – వినాశితః – యత్ర – సా – జానకీ – సీతా – సః – తేన – న – వినాశితః ॥

అన్వయక్రమము :– తత్ర యః ఉద్దేశః తేన న వినాశితః, (సః) కశ్చిత్ న (అస్తి), సా జానకీ సీతా యత్ర (అస్తి), సః తేన న వినాశితః.

ప్రతిపదార్థము :– తత్ర = ఆ ప్రమదావనమున, యః ఉద్దేశః = ఏ ప్రదేశము, తేన = ఆ వానరునిచే, న వినాశితః = ధ్వంసముచేయబడలేదో, సః = అట్టిది, కశ్చిత్ = ఏదియునుకూడ, న అస్తి = లేదు, సా జానకీ సీతా = ఆ జనకపుత్రియైన సీత, యత్ర (అస్తి) = ఎచ్చట నున్నదో, సః = ఆ చోటు, తేన = ఆ వానరునిచే, న వినాశితః = ధ్వంసము చేయబడలేదు.

తాత్పర్యము :– ఆ ప్రమదావనమునందు ఆ వానరుడు ధ్వంసము చేయనట్టి ప్రదేశము లేదు, కాని జనకపుత్రియైన సీతయున్న ప్రదేశ మొక్కటి మాత్రము ఆతడు విడిచిపెట్టెను.

**శ్లో॥ జానకీరక్షణార్థం వా శ్రమాద్వా నోపలక్ష్యతే ।
అథవా కశ్శ్రమ స్తస్య సైవ తేనాభిరక్షితా ॥** 18

పదచ్ఛేదము :– జానకీరక్షణార్థం – వా – శ్రమాత్ – వా – న – ఉపలక్ష్యతే, అథవా – కః – శ్రమః – తస్య – సా – ఏవ – తేన – అభిరక్షితా ॥

అన్వయక్రమము :– జానకీరక్షణార్థం వా, శ్రమాత్ వా (ఇతి) న ఉపలక్ష్యతే, అథవా తస్య శ్రమః కః? సా ఏవ తేన అభిరక్షితా.

ప్రతిపదార్థము :– జానకీరక్షణార్థం వా = సీతయొక్క రక్షణముకొఱకో, శ్రమాత్ వా = శ్రమవలననో, (ఇతి = అని) న ఉపలక్ష్యతే = తెలియుటలేదు, అథవా = లేక, తస్య = అతనికి, శ్రమః కః = శ్రమ ఏమి? తేన = అతనిచే, సా ఏవ = ఆమెయే, అభిరక్షితా = రక్షింపబడినది.

తాత్పర్యము :– జనకరాజపుత్రి యున్న ప్రదేశమును ధ్వంసము చేయకుండుట అనునది ఆమెను రక్షించుటకొఱకే, లేక తనకు శ్రమ కలుగుటచేతనో తెలియుటలేదు. కాని ఆ మహనీయునికి శ్రమ అనునది ఎట్లుండును? కావలసియే ఆత డామెను రక్షించినాడు.

**శ్లో॥ చారుపల్లవపుష్పాఢ్యం యం సీతా స్వయ మాస్థితా ।
ప్రవృద్ధ శ్శింశుపావృక్ష స్స చ తేనాభిరక్షితః ॥** 19

పదచ్ఛేదము :– చారుపల్లవపుష్పాఢ్యం – యం – సీతా – స్వయమ్ – ఆస్థితా – ప్రవృద్ధః – శింశుపావృక్షః – సః – చ – తేన – అభిరక్షితః ॥

అన్వయక్రమము :– సీతా స్వయం చారుపల్లవపుష్పాఢ్యం యమ్ ఆస్థితా, సః ప్రవృద్ధః శింశుపావృక్షః చ తేన అభిరక్షితః.

ప్రతిపదార్థము :– సీతా = సీతాదేవి, స్వయం = స్వయముగా, చారుపల్లవపుష్పాఢ్యం = సుందరమైన చిగుళ్ళతోడను పువ్వులతోడను నిండినట్టి, యం = ఏ వృక్షమును, ఆస్థితా = చేరియున్నదో, సః = ఆ, ప్రవృద్ధః = ఏపుగా పెరిగినట్టి, శింశుపావృక్షః చ = శింశుపావృక్షముగూడ, తేన = ఆతనిచే, అభిరక్షితః = రక్షింపబడినది.

తాత్పర్యము :– మనోహరమైన పల్లవములతోడను, పుష్పములతోడను నిండియున్న ఏ చెట్టును సీతాదేవి స్వయముగా చేరియున్నదో ఆ శింశుపావృక్షమును మాత్రము ఆ వానరుడు చెక్కుచెదరకుండ నిలిపియుంచినాడు.

శ్లో॥ త స్యోగ్రరూప స్యోగ్రం త్వం దండమాజ్ఞాతు మర్హసి ।
సీతా సంభాషితా యేన తద్వనం చ వినాశితమ్ ॥ 20

పదచ్ఛేదము :– తస్య – ఉగ్రరూపస్య – ఉగ్రం – త్వం – దండమ్ – ఆజ్ఞాతుమ్ – అర్హసి, సీతా – సంభాషితా – యేన – తత్ – వనం – చ – వినాశితమ్.

అన్వయక్రమము :– యేన సీతా సంభాషితా, (యేన) తత్ వనం చ వినాశితం, ఉగ్రరూపస్య తస్య త్వమ్ ఉగ్రం దండమ్ ఆజ్ఞాతుమ్ అర్హసి.

ప్రతిపదార్థము :– యేన = ఏ వానరునిచే, సీతా = జానకి, సంభాషితా = సంభాషణము చేయబడెనో, యేన = ఎవ్వనిచే, తత్ వనం చ = ఆ వనము గూడ, వినాశితం = నాశనము చేయబడెనో, ఉగ్రరూపస్య = భయంకరరూపుడైనట్టి, తస్య = అతనికి, త్వమ్ = నీవు, ఉగ్రం = భయంకరమైనట్టి, దండమ్ = శిక్షను, ఆజ్ఞాతుమ్ = విధించుటకు, అర్హసి = తగుదువు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– 'ఉగ్రం త్వం' అనుటకు బదులుగా 'ఉగ్రః త్వం' అని పాఠాంతరము. అనగా ఓ ఉగ్రుడా! ఆ ఉగ్రరూపమునకు తగిన దండమును నీవు విధింపదగుదువని భావము.

తాత్పర్యము :– సీతతో సంభాషణము గావించియు, మన వనమును భగ్నముచేసియు మహాపరాధము గావించినట్టి ఆ భయంకరవానరునకు నీవు భయంకరమైన దండనము విధింపవలసియున్నది.

శ్లో॥ మనఃపరిగృహీతాం తాం తవ రక్షోగణేశ్వర ।
క స్సీతా మభిభాషేత యో న స్యా త్త్యక్తజీవితః ॥ 21

పదచ్ఛేదము :– మనఃపరిగృహీతాం – తాం – తవ – రక్షోగణేశ్వర – కః – సీతామ్ – అభిభాషేత – యః – న – స్యాత్ – త్యక్తజీవితః ॥

అన్వయక్రమము :– రక్షోగణేశ్వర! తవ మనఃపరిగృహీతాం తాం సీతాం, యః త్యక్త జీవితః న స్యాత్, సః కః అభిభాషేత?

ప్రతిపదార్థము :– రక్షోగణేశ్వర! = ఓ రాక్షసచక్రవర్తీ, యః = ఎవడు, త్యక్తజీవితః = విడిచిన జీవితాశగలవాడు, న స్యాత్ = కాకుండునో, సః = అట్టి, కః = ఎవ్వడు, తవ = నీ యొక్క, మనఃపరిగృహీతాం = మనస్సుచే స్వీకరింపబడినట్టి, తాం సీతాం

= ఆ జానకినిగూర్చి, అభిభాషేత = మాటలాడును?

తాత్పర్యము :– ఓ రాక్షసరాజా! జీవితముపై ఆశ యున్న వాడెవ్వడు నీవు మనసార స్వీకరించియున్న ఆ సీతాదేవితో మాటలాడుటకు సాహసింపగలడు?

శ్లో॥ రాక్షసీనాం వచ శ్ర్శుత్వా రావణో రాక్షసేశ్వరః ।
చితాగ్నిరివ జజ్వాల కోపసంవర్తితేక్షణః ॥ 22

పదచ్ఛేదము :– రాక్షసీనాం – వచః – శ్రుత్వా – రావణః – రాక్షసేశ్వరః – చితాగ్నిః – ఇవ – జజ్వాల – కోపసంవర్తితేక్షణః ॥

అన్వయక్రమము :– రాక్షసీనాం వచః శ్రుత్వా రాక్షసేశ్వరః రావణః కోపసంవర్తితేక్షణః (సన్) చితాగ్నిః ఇవ జజ్వాల.

ప్రతిపదార్థము :– రాక్షసీనాం = రాక్షసస్త్రీలయొక్క, వచః = మాటను, శ్రుత్వా = విని, రాక్షసేశ్వరః = రాక్షసప్రభువైన, రావణః = రావణుడు, కోపసంవర్తితేక్షణః (సన్) = కోపముచే త్రిప్పబడుచున్న కన్నులుగలవాడై, చితాగ్నిః ఇవ = చితియందలి మంటవలె, జజ్వాల = ప్రజ్వలించెను.

సూచన :– "చితాగ్నిః ఇవ" అనుటకు బదులుగా "హుతాగ్నిః ఇవ" అని పాఠాంతరము. అనగా చక్కగా హోమము చేయబడుటచే మండిన అగ్నివలె అని భావము.

తాత్పర్యము :– రాక్షసస్త్రీలయొక్క మాట లాలించి ఆ రాక్షసాధిపతి క్రోధముతో మిడిగ్రుడ్లను త్రిప్పుచు చితియందలి అగ్ని ప్రజ్వలించినట్లుగా తీవ్రముగా మండిపడెను.

శ్లో॥ తస్య క్రుద్ధస్య నేత్రాభ్యాం ప్రాపతన్నస్రబిందవః ।
దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిషః స్నేహబిందవః ॥ 23

పదచ్ఛేదము :– తస్య – క్రుద్ధస్య – నేత్రాభ్యాం – ప్రాపతన్ – అస్రబిందవః – దీప్తాభ్యాం – ఇవ – దీపాభ్యాం – సార్చిషః – స్నేహబిందవః ॥

అన్వయక్రమము :– క్రుద్ధస్య తస్య నేత్రాభ్యాం, దీప్తాభ్యాం దీపాభ్యాం సార్చిషః స్నేహబిందవః ఇవ అస్రబిందవః ప్రాపతన్.

ప్రతిపదార్థము :– క్రుద్ధస్య = క్రోధమునొందియున్నట్టి, తస్య = ఆ రావణునియొక్క, నేత్రాభ్యాం = రెండు కన్నులనుండి, దీప్తాభ్యాం = జ్వలించుచున్న, దీపాభ్యాం = దీపములనుండి, సార్చిషః = మంటతో గూడినట్టి, స్నేహబిందవః ఇవ = నూనెబొట్టులవలె, అస్రబిందవః = కన్నీటిబొట్టులు, ప్రాపతన్ = రాలినవి.

తాత్పర్యము :- క్రోధోద్రిక్తుడైనట్టి ఆ రావణాసురుని నేత్రయుగ్మము నుండి జ్వలించుచున్న దీపద్వయమునుండి మంటతోకూడిన నూనెబొట్లు రాలినట్లుగ కన్నీటిబొట్లు రాలిపడినవి.

శ్లో॥ ఆత్మన స్సదృశా న్వీరా న్కింకరా న్నామ రాక్షసాన్ ।
వ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః ॥ 24

పదచ్ఛేదము :- ఆత్మనః - సదృశాన్ - వీరాన్ - కింకరాన్ - నామ - రాక్షసాన్ - వ్యాదిదేశ - మహాతేజాః - నిగ్రహార్థం - హనూమతః ॥

అన్వయక్రమము :- మహాతేజాః (సః) హనూమతః నిగ్రహార్థం కింకరాన్ నామ ఆత్మనః సదృశాన్ వీరాన్ రాక్షసాన్ వ్యాదిదేశ.

ప్రతిపదార్థము :- మహాతేజాః (సః) = మహాప్రతాపశాలియైన ఆ రావణుడు, హనూమతః = హనుమంతునియొక్క, నిగ్రహార్థం = బంధనము కొఱకై, కింకరాన్ నామ = కింకరులను పేరుగల, ఆత్మనః = తనకు, సదృశాన్ = సమానులైనట్టి, వీరాన్ = వీరులైన, రాక్షసాన్ = రక్కసులను, వ్యాదిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- మహాప్రతాపశాలియగు ఆ రావణుడు హనుమంతుని పట్టిబంధించుటకై కింకరు లను పేరుగల తనతో సమానమగు వీరులైన రాక్షసులను యుద్ధమునకు బంపెను.

శ్లో॥ తేషా మశీతిసాహస్రం కింకరాణాం తరస్వినామ్ ।
నిర్యయు ర్భవనా త్తస్మా త్కూటముద్గరపాణయః ॥ 25

పదచ్ఛేదము :- తేషామ్ - అశీతిసాహస్రం - కింకరాణాం - తరస్వినామ్ - నిర్యయుః - భవనాత్ - తస్మాత్ - కూటముద్గరపాణయః ॥

అన్వయక్రమము :- తేషాం తరస్వినాం కింకరాణామ్ అశీతిసాహస్రం కూటముద్గర పాణయః (సంతః) తస్మాత్ భవనాత్ నిర్యయుః.

ప్రతిపదార్థము :- తేషాం = ఆ, తరస్వినాం = బలవంతులైనట్టి, కింకరాణాం = కింకరులయొక్క, అశీతిసాహస్రం = ఎనుబదివేలమంది, కూటముద్గరపాణయః = ఇనుపదండములు ముద్గరాయుధములు చేతియందు గలవారై, తస్మాత్ భవనాత్ = ఆ భవనమునుండి, నిర్యయుః = వెడలిరి.

తాత్పర్యము :- మహాబలవంతులైన ఆ కింకరాసురులు ఎనుబదివేలమంది కూటములను, ముద్గరములను తమ తమ చేతులయందు ధరించి రావణుని భవనము

నుండి హనుమను గూర్చి వెడలిరి.

శ్లో॥ మహోదరా మహాదంష్ట్రా ఘోరరూపా మహాబలాః ।
యుద్ధాభిమనస స్సర్వే హనూమద్గ్రహణోన్ముఖాః ॥ 26

పదచ్ఛేదము :– మహోదరాః – మహాదంష్ట్రాః – ఘోరరూపాః – మహాబలాః – యుద్ధాభిమనసః – సర్వే – హనూమద్గ్రహణోన్ముఖాః ॥

అన్వయక్రమము :– మహోదరాః మహాదంష్ట్రాః ఘోరరూపాః మహాబలాః (తే) సర్వే యుద్ధాభిమనసః (సంతః) హనూమద్గ్రహణోన్ముఖాః (నిర్యయుః).

ప్రతిపదార్థము :– మహోదరాః = పెద్దపొట్టలు గలవాడును, మహాదంష్ట్రాః = పెద్దకోఱలు గలవారును, ఘోరరూపాః = భీకరాకారము గలవారును, మహాబలాః = గొప్పబలము గలవారునగు, (తే) సర్వే = ఆ కింకరులెల్లరును, యుద్ధాభిమనసః సంతః = యుద్ధమునందు కోరికగలవారై, హనూమద్గ్రహణోన్ముఖాః = హనుమంతుని పట్టుకొనుటకు ఉద్యుక్తులై, (నిర్యయుః = వెడలిరి).

తాత్పర్యము :– పెద్దపొట్టలును పెద్దకోఱలును భయంకరమైన ఆకారములును గొప్పబలమును గలిగియున్న ఆ కింకరరాక్షసు లందఱును యుద్ధమును గూర్చిన వాంఛతో హనుమంతుని బంధించుటకై నిశ్చయించుకొని వెడలిరి.

శ్లో॥ తే కపిం తం సమాసాద్య తోరణస్థ మవస్థితమ్ ।
అభిపేతు ర్మహావేగాః పతంగా ఇవ పావకమ్ ॥ 27

పదచ్ఛేదము :– తే – కపిం – తం – సమాసాద్య – తోరణస్థమ్ – అవస్థితమ్ – అభిపేతుః – మహావేగాః – పతంగాః – ఇవ – పావకమ్ ॥

అన్వయక్రమము :– మహావేగాః తే తోరణస్థమ్ అవస్థితం తం కపిం సమాసాద్య పతంగాః పావకమ్ ఇవ అభిపేతుః.

ప్రతిపదార్థము :– మహావేగాః = గొప్పవేగము కల్గినట్టి, తే = ఆ రాక్షసులు, తోరణస్థం = బహిర్ద్వారమునందు ఉన్నవాడును, అవస్థితం = సన్నద్ధుడైన వాడును అగు, తం కపిం = ఆ హనుమను, సమాసాద్య = చేరి, పతంగాః = మిడుతలు, పావకమ్ ఇవ = అగ్నినిగూర్చివలె, అభిపేతుః = మీదబడిరి.

తాత్పర్యము :– అట్లు ఆ రక్కసులు బయలువెడలి ఆ వనబహిర్ద్వారముపై నిశ్చలముగ కూర్చొనియున్న ఆ హనుమంతుని మీదికి మిడుతలు అగ్నిమీదికి దుమికినట్లుగా, మహావేగముతో పోయి మీదబడిరి.

శ్లో॥ తే గదాభి ర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః ।
ఆజఘ్ను ర్వానరశ్రేష్ఠం శరై శ్చాదిత్యసన్నిభైః ॥ 28

పదచ్ఛేదము :- తే - గదాభిః - విచిత్రాభిః - పరిఘైః - కాంచనాంగదైః - ఆజఘ్నుః - వానరశ్రేష్ఠం - శరైః - చ - ఆదిత్యసన్నిభైః ॥

అన్వయక్రమము :- తే విచిత్రాభిః గదాభిః కాంచనాంగదైః పరిఘైః ఆదిత్యసన్నిభైః శరైః చ వానరశ్రేష్ఠం ఆజఘ్నుః.

ప్రతిపదార్థము :- తే = ఆ రాక్షసులు, విచిత్రాభిః = విచిత్రములైన, గదాభిః = గదలతోడను, కాంచనాంగదైః = సువర్ణాభరణములతో కూడిన, పరిఘైః = పరిఘల తోడను, ఆదిత్యసన్నిభైః = సూర్యునితో సమానమైనట్టి, శరైః = బాణములతోడను, వానరశ్రేష్ఠం = వానరోత్తముడైన హనుమను, ఆజఘ్నుః = కొట్టిరి.

తాత్పర్యము :- ఆ కింకరాసురులు విచిత్రములైన తమ గదలతోడను, బంగారు కట్టులుగల పరిఘలతోడను, సూర్యసన్నిభములైన బాణములతోడను హనుమను కొట్టదొడగిరి.

శ్లో॥ ముద్గరైః పట్టసై శ్శూలైః ప్రాసతోమరశక్తిభిః ।
పరివార్య హనూమంతం సహసా తస్థు రగ్రతః ॥ 29

పదచ్ఛేదము :- ముద్గరైః - పట్టసైః - శూలైః - ప్రాసతోమరశక్తిభిః - పరివార్య - హనూమంతం - సహసా - తస్థుః - అగ్రతః ॥

అన్వయక్రమము :- (తే) ముద్గరైః పట్టసైః శూలైః ప్రాసతోమరశక్తిభిః సహసా హనూమంతం పరివార్య అగ్రతః తస్థుః.

ప్రతిపదార్థము :- (తే = వారు) ముద్గరైః = ఇనుపగుదియలతోడను, పట్టసైః = అడ్డకత్తులతోడను, శూలైః = శూలములతోడను, ప్రాసతోమరశక్తిభిః = ఈటెలు, చిల్లకోలలు, బల్లెములు అనువానితోడను, సహసా = వేగముగా, హనూమంతం = హనుమను, పరివార్య = చుట్టుముట్టి, అగ్రతః = ఎదురుగా, తస్థుః = నిలచిరి.

తాత్పర్యము :- ఆ రక్కసులు ఇనుపగదలు, అడ్డకత్తులు, శూలములు, ఈటెలు, చిల్లకోలలు, బల్లెములు అను వివిధములైన ఆయుధములను ధరించి హనుమంతుని చుట్టుముట్టి నిలచిరి.

శ్లో॥ హనుమానపి తేజస్వీ శ్రీమా న్పర్వతసన్నిభః ।
క్షితా వావిధ్య లాంగూలం ననాద చ మహాస్వనమ్ ॥ 30

పదచ్ఛేదము :- హనుమాన్ - అపి - తేజస్వీ - శ్రీమాన్ - పర్వతసన్నిభః - క్షితౌ - ఆవిధ్య - లాంగూలం - ననాద - చ - మహాస్వనమ్ ॥

అన్వయక్రమము :- పర్వతసన్నిభః, తేజస్వీ, శ్రీమాన్ హనుమాన్ అపి క్షితౌ లాంగూలం ఆవిధ్య మహాస్వనం ననాద.

ప్రతిపదార్థము :- పర్వతసన్నిభః = పర్వతమును బోలినవాడును, తేజస్వీ = తేజశ్శాలియును, శ్రీమాన్ = శుభలక్షణసమేతుడును అగు, హనుమాన్ అపి = హనుమంతుడుగూడ, క్షితౌ = నేలపై, లాంగూలం = తోకను, ఆవిధ్య = చఱచి, మహాస్వనం = గొప్పధ్వని అగునట్లు, ననాద = అఱచెను.

తాత్పర్యము :- పర్వతముతో సమానమైన శరీరముతోను, గొప్ప తేజస్సుతోను, గొప్ప శోభతోను వెలుగొందుచున్న హనుమగూడ వారిని జూచి నేలపై తన వాలముతో గొట్టి పెద్దధ్వని యగునట్లు అఱచెను.

శ్లో॥ స భూత్వా సుమహాకాయః హనుమా న్మారుతాత్మజః ।
ధృష్ట మాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్ ॥ 31

పదచ్ఛేదము :- సః - భూత్వా - సుమహాకాయః - హనుమాన్ - మారుతాత్మజః - ధృష్టమ్ - ఆస్ఫోటయామాస - లంకాం - శబ్దేన - పూరయన్ ॥

అన్వయక్రమము :- మారుతాత్మజః హనుమాన్ సుమహాకాయః భూత్వా లంకాం శబ్దేన పూరయన్ ధృష్టమ్ ఆస్ఫోటయామాస.

ప్రతిపదార్థము :- మారుతాత్మజః = వాయునందనుడైన, హనుమాన్ = హనుమంతుడు, సుమహాకాయః భూత్వా = పెద్దదైన శరీరము గలవాడయి, లంకాం = లంకా నగరమును, శబ్దేన = ధ్వనితో, పూరయన్ = నిండించుచు, ధృష్టం = కఠోరముగా, ఆస్ఫోటయామాస = చఱచుకొనెను.

తాత్పర్యము :- అట్లు వాయునందనుడైన యా హనుమ పెద్దగ శరీరమును పెంచుకొని గొప్ప ధ్వనితో లంకానగరము నంతను పూరించుచు దర్పముతో తన జబ్బ చఱచు కొనెను.

శ్లో॥ త స్యాస్ఫోటితశబ్దేన మహతా సానునాదినా ।
పేతు ర్విహంగా గగనా దుచ్చై శ్చేద మఘోషయత్ ॥ 32

పదచ్ఛేదము :- తస్య - ఆస్ఫోటితశబ్దేన - మహతా - సానునాదినా - పేతుః - విహంగాః - గగనాత్ - ఉచ్చైః - చ - ఇదమ్ - అఘోషయత్ ॥

అన్వయక్రమము :- సానునాదినా మహతా తస్య ఆస్ఫోటితశబ్దేన గగనాత్ విహంగాః పేతుః, (సః) ఉచ్చైః ఇదం అఘోషయత్ చ.

ప్రతిపదార్థము :- సానునాదినా = ప్రతిధ్వనితో కూడినట్టి, మహతా = గొప్పదైనట్టి, తస్య = ఆ హనుమయొక్క, ఆస్ఫోటితశబ్దేన = భుజాస్ఫాలనశబ్దముచే, గగనాత్ = ఆకసమునుండి, విహంగాః = పక్షులు, పేతుః = పడినవి, (సః = ఆ హనుమ) ఉచ్చైః = బిగ్గరగా, ఇదమ్ = దీనిని, అఘోషయత్ = ఘోషించెను.

తాత్పర్యము :- గొప్ప ప్రతిధ్వని గలుగునట్లుగా ఆతడు గావించిన భుజాస్ఫాలన శబ్దమునకు ఆకసము నందలి పక్షులు నేలగూలినవి. అప్పుడు హనుమంతుడు ఉచ్చైః స్వరముతో ఈ రీతిగ ఘోషించెను.

శ్లో॥ జయ త్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః ॥ 33

శ్లో॥ దాసో ఽహం కోసలేంద్రస్య రామ స్యాక్లిష్టకర్మణః ।
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః ॥ 34

శ్లో॥ న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్ ।
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః ॥ 35

శ్లో॥ అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీమ్ ।
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్ ॥ 36

పదచ్ఛేదము :- జయతి - అతిబలః - రామః - లక్ష్మణః - చ - మహాబలః - రాజా - జయతి - సుగ్రీవః - రాఘవేణ - అభిపాలితః - దాసః - అహం - కోసలేంద్రస్య - రామస్య - అక్లిష్టకర్మణః - హనుమాన్ - శత్రుసైన్యానాం - నిహంతా - మారుతాత్మజః - న - రావణసహస్రం - మే - యుద్ధే - ప్రతిబలం - భవేత్ - శిలాభిః - తు - ప్రహరతః - పాదపైః - చ - సహస్రశః - అర్దయిత్వా - పురీం - లంకామ్ - అభివాద్య - చ - మైథిలీమ్ - సమృద్ధార్థః - గమిష్యామి - మిషతాం - సర్వరక్షసామ్ ॥

అన్వయక్రమము :- అతిబలః రామః జయతి, మహాబలః లక్ష్మణః చ (జయతి), రాఘవేణ అభిపాలితః రాజా సుగ్రీవః జయతి, అహమ్ అక్లిష్టకర్మణః కోసలేంద్రస్య రామస్య దాసః, శత్రుసైన్యానాం నిహంతా, మారుతాత్మజః హనుమాన్; సహస్రశః శిలాభిః పాదపైః చ ప్రహరతః మే యుద్ధే రావణసహస్రం ప్రతిబలం న భవేత్,

సర్వరక్షసాం మిషతాం (సతాం) లంకాపురీం అర్దయిత్వా మైథిలీం అభివాద్య చ సమృద్ధార్థః (సన్) గమిష్యామి.

ప్రతిపదార్థము :- అతిబలః = అధికబలుడైన, రామః = శ్రీరాముడు, జయతి = సర్వోత్కర్షతో వర్ధిల్లుచున్నాడు; మహాబలః = బలశాలియైన, లక్ష్మణః చ = లక్ష్మణుడును, జయతి = వర్ధిల్లుచున్నాడు; రాఘవేణ = శ్రీరామునిచే, అభిపాలితః = రక్షింపబడు చున్నట్టి, రాజా సుగ్రీవః = రాజైన సుగ్రీవుడు, జయతి = వర్ధిల్లుచున్నాడు, అహం = నేను, అక్లిష్టకర్మణః = క్లేశము కల్గింపని కృత్యములు గలవాడును, కోసలేంద్రస్య = కోసలప్రభువునగు, రామస్య = రామునకు, దాసః = సేవకుడను. శత్రుసైన్యానాం = శత్రుసైన్యములకు, నిహంతా = మారకుడనైన, అహం = నేను, మారుతాత్మజః = వాయుదేవుని పుత్రుడనగు, హనుమాన్ = హనుమంతుడను. సహస్రశః = వేలకొలది, శిలాభిః = ఱాళ్ళతోడను, పాదపైః చ = వృక్షములతోడను, ప్రహరతః = ప్రహరించు చున్నట్టి, మే = నాకు, యుద్ధే = యుద్ధమునందు, రావణసహస్రం = వెయ్యిమంది రావణుల సమూహము, ప్రతిబలం = ఎదురునిలచు శత్రువు, న భవేత్ = కాజాలదు, సర్వరక్షసాం = ఎల్లరు రాక్షసులును, మిషతాం (సతాం) = చూచుచుండగా, లంకాపురీం = లంకానగరమును, అర్దయిత్వా = పీడించి, మైథిలీమ్ = జానకీదేవిని, అభివాద్య = నమస్కరించి, సమృద్ధార్థః = సుసంపన్నమైన ప్రయోజనముగలవాడనై, గమిష్యామి = వెడలిపోవుదును.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- "అక్లిష్టకర్మణః రామస్య దాసః" అనుచు తన దాస్యము క్లేశమును గల్పించునట్టి కర్మగ చేయబడుటలేదు. మఱియేమనగా తనకు సహజమైన ధర్మముగా చేయుచున్నానని హనుమ చెప్పుచున్నాడు.

వాసుదాస స్వామి :- శ్రీరామచంద్రమూర్తికి తాను దాసుడను అనగా కింకరుడను అని చెప్పుటచే తాను జీతబత్తెములను కోరి దాసుడుగా లేడనియు, శ్రీరామమూర్తి యందుగల కళ్యాణగుణములు నామనస్సు నాకర్షించుటచే దాస్యము నా స్వరూపము గాన నే నాయనను సేవించుచున్నానని భావము.

ఈ నాలుగు శ్లోకములును క్షుద్రప్రయోగములనెల్ల హరించునని అనుభవజ్ఞులు చెప్పిరి. ఎవరైనను ఏదైన క్షుద్రశక్తి ప్రయోగము చేసినారని భయపడువారు ఈ నాల్గు శ్లోకములను కొన్నాళ్లు విడువక జపించిరేని ఆ ప్రయోగము చెడును. దీని పఠనము వలన దుష్టస్వప్నముల భయముండదు.

విమర్శక శిరోమణి బ్రహ్మశ్రీ చిలుకూరి పాపయశాస్త్రి - కార్య విజయము నాకాంక్షించి సుందరకాండ పారాయణము చేయగోరువారు ప్రతిసర్గకును ప్రారంభమున ఈ నాలుగు శ్లోకములను పఠించుచు పారాయణము గావించి విజయమును సాధించుట సంప్రదాయముగ వచ్చుచున్న విషయము.

తాత్పర్యము :- అతిబలసముపేతుడైన శ్రీరామునకు జయము, మహాబలసంపన్నుడైన లక్ష్మణునకు జయము, రాఘవునిచే పాలింపబడిన సుగ్రీవ మహారాజునకు జయము, సజ్జన క్లేశవిదూరమైన కృత్యములొనరించు కోసలాధినాథుడగు శ్రీరామునకు నేను సేవకుడను. శత్రుసైన్యములను పరిమార్చు శక్తిమంతుడనైన నేను వాయుపుత్రుడను. హనుమంతుడను పేరుగల వాడను. వేలకొలదిగ శిలలతోడను వృక్షములతోడను ప్రహరించుచు యుద్ధము చేయునట్టి నాకు వేయిమంది రావణులు వచ్చినను నాతో సమానమైన ప్రతివీరులు గాజాలరు. ఇచ్చటి రాక్షసుల కట్టెదుటనే లంకానగరము నంతను ధ్వంసముచేసి మా సీతమ్మకి మ్రొక్కి నేను తలపెట్టిన కార్యమును సాధించుకొని వెడలిపోవుదును.

శ్లో॥ తస్య సన్నాదశబ్దేన తే ఽభవ న్భయశంకితాః ।
దదృశుశ్చ హనూమంతం సంధ్యామేఘమి వోన్నతమ్ ॥ 37

పదచ్ఛేదము :- తస్య - సన్నాదశబ్దేన - తే - అభవన్ - భయశంకితాః - దదృశుః - చ - హనూమంతం - సంధ్యామేఘమ్ - ఇవ - ఉన్నతమ్ ॥

అన్వయక్రమము :- తే తస్య సన్నాదశబ్దేన భయశంకితాః అభవన్, ఉన్నతం సంధ్యామేఘమ్ ఇవ (స్థితం) తం హనూమంతం దదృశుః చ.

ప్రతిపదార్థము :- తస్య = ఆ హనుమయొక్క, సన్నాదశబ్దేన = అఱపుయొక్క ధ్వనిచేత, తే = ఆ కింకరాసురులు, భయశంకితాః = భీతిచే శంకనొందినవారు, అభవన్ = అయిరి, ఉన్నతం = ఎత్తుగనున్న, సంధ్యామేఘమ్ ఇవ = సంధ్యాకాలపు మేఘమువలె, స్థితం = ఉన్నట్టి, హనూమంతం = హనుమంతుని, దదృశుః చ = చూచిరికూడను.

తాత్పర్యము :- ఈ రీతిగా హనుమంతుడు గావించిన మహాశబ్దమునకు ఆ కింకరాసురులు భయచకితులైరి. పిమ్మట తమ ఎదుట సంధ్యామేఘమువలె అత్యున్నత రూపముతో తేజరిల్లుచున్న హనుమను కనుగొనిరి.

శ్లో॥ స్వామిసందేశనిశ్శంకా స్తత స్తే రాక్షసాః కపిమ్ ।
చిత్రైః ప్రహరణై ర్భీమై రభిపేతు స్సహస్రశః ॥ 38

పదచ్ఛేదము :– స్వామిసందేశనిశ్శంకాః – తతః – తే – రాక్షసాః – కపిమ్ – చిత్రైః – ప్రహరణైః – భీమైః – అభిపేతుః – సహస్రశః ॥

అన్వయక్రమము :– తతః తే రాక్షసాః స్వామిసందేశనిశ్శంకాః చిత్రైః భీమైః ప్రహరణైః సహస్రశః (తం) కపిమ్ అభిపేతుః.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, తే రాక్షసాః = ఆ రాక్షసులు, స్వామిసందేశ నిశ్శంకాః = ప్రభువుయొక్క ఆజ్ఞచే శంకారహితులై, చిత్రైః = చిత్రములైనట్టి, భీమైః = భయంకరమైనట్టి, ప్రహరణైః = ఆయుధములతో, సహస్రశః = వేలకొలదిగా, తం కపిం = ఆ హనుమను, అభిపేతుః = ఎదుర్కొనిరి.

తాత్పర్యము :– అప్పు డా రాక్షసులెల్లరును తమ ప్రభువు ఇచ్చిన ఆజ్ఞను స్మరించు కొనుచు శంకవీడి విచిత్రములును భయంకరములును అగు వివిధములైన ఆయుధములతో వేలకొలదిగా గుమిగూడి ఆ హనుమపై బడజొచ్చిరి.

శ్లో॥ స తైః పరివృత శ్శూరై స్సర్వత స్స మహాబలః ।
ఆససాదాஉஉయసం భీమం పరిఘం తోరణాశ్రితమ్ ॥ 39

పదచ్ఛేదము :– సః – తైః – పరివృతః – శూరైః – సర్వతః – సః – మహాబలః – ఆససాద – ఆయసం – భీమం – పరిఘం – తోరణాశ్రితమ్ ॥

అన్వయక్రమము :– తైః శూరైః సర్వతః పరివృతః సః మహాబలః తోరణాశ్రితం భీమమ్ ఆయసం పరిఘమ్ ఆససాద.

ప్రతిపదార్థము :– తైః శూరైః = ఆ వీరులచే, సర్వతః = అన్నివైపుల నుండి, పరివృతః = చుట్టుకొనబడినవాడై, మహాబలః = బలాఢ్యుడైన, సః = ఆ హనుమ, తోరణాశ్రితం = బహిర్ద్వారముననున్నట్టి, భీమమ్ = భయంకరమైనట్టి, ఆయసం పరిఘమ్ = ఉక్కు దూలమును, ఆససాద = సమీపించెను.

తాత్పర్యము :– ఆ వీరులు తనను చుట్టుముట్టి యుండగా మహాబలాఢ్యుడైన ఆతడు తాను కూర్చున్న వనబహిర్ద్వారమునందే భయంకరముగ కానవచ్చుచున్న ఒక ఇనుపదూలమును చూచి దానిని సమీపించెను.

శ్లో॥ స తం పరిఘ మాదాయ జఘాన చ నిశాచరాన్ ।
స పన్నగమి వాదాయ స్ఫురంతం వినతాసుతః ।
విచచా రాంబరే వీరః పరిగృహ్యా చ మారుతిః ॥ 40

పదచ్ఛేదము :– సః – తం – పరిఘమ్ – ఆదాయ – జఘాన – చ – నిశాచరాన్ – సః – పన్నగమ్ – ఇవ – ఆదాయ – స్ఫురంతం – వినతాసుతః – విచచార – అంబరే – వీరః – పరిగృహ్య – చ – మారుతిః ॥

అన్వయక్రమము :– సః తం పరిఘమ్ ఆదాయ నిశాచరాన్ జఘాన; వినతాసుతః స్ఫురంతం పన్నగమ్ ఆదాయ ఇవ సః వీరః మారుతిః (తం) పరిగృహ్య అంబరే విచచార.

ప్రతిపదార్థము :– సః = ఆ హనుమ, తం = ఆ, పరిఘమ్ = ఇనుపగుదియను, ఆదాయ = పట్టుకొని, నిశాచరాన్ = రాక్షసులను, జఘాన = చంపెను, వినతాసుతః = గరుత్మంతుడు, స్ఫురంతం = మెఱయుచున్న, పన్నగమ్ = సర్పమును, ఆదాయ ఇవ = పట్టుకొనివలె, సః = ఆ, వీరః = వీరుడైన, మారుతిః = హనుమ, తం = ఆ పరిఘను, పరిగృహ్య = పట్టుకొని, అంబరే = ఆకాశమునందు, విచచార = తిరిగెను.

తాత్పర్యము :– హనుమ ఆ పరిఘను చేతబట్టి పెక్కండ్రు రాక్షసులను సంహరించెను. పిమ్మట నాతడు గరుత్మంతుడు మిలమిల మెఱయుచున్న సర్పమును బట్టి ఎగురుచున్నట్లుగా ఆ పరిఘను చేతితో బట్టుకొని ఆకాశమున కొద్దిసేపు విహరించెను.

శ్లో॥ స హత్వా రాక్షసా న్వీరాన్ కింకరా న్మారుతాత్మజః ।
యుద్ధకాంక్షీ పున ర్వీర స్తోరణం సముపాశ్రితః ॥ 41

పదచ్ఛేదము :– సః – హత్వా – రాక్షసాన్ – వీరాన్ – కింకరాన్ – మారుతాత్మజః – యుద్ధకాంక్షీ – పునః – వీరః – తోరణం – సముపాశ్రితః ॥

అన్వయక్రమము :– సః మారుతాత్మజః వీరాన్ కింకరాన్ రాక్షసాన్ హత్వా యుద్ధకాంక్షీ పునః తోరణం సముపాశ్రితః.

ప్రతిపదార్థము :– సః = ఆ, వీరః = వీరుడైన, మారుతాత్మజః = వాయునందనుడు, వీరాన్ = వీరులైన, కింకరాన్ రాక్షసాన్ = కింకరులనెడి రాక్షసులను, హత్వా = హతమార్చి, పునః = తిరిగి, యుద్ధకాంక్షీ = యుద్ధమును కోరుచున్నవాడై, తోరణం = బహిర్ద్వారమును, సముపాశ్రితః = చేరుకొనెను.

తాత్పర్యము :– ఆ పవననందనుడు వీరులైన ఆ కింకరాసురులను హతమార్చి తిరిగి యుద్ధమును కాంక్షించుచు ఆ బహిర్ద్వారము మీదకే చేరి నిలచెను.

శ్లో॥ తత స్తస్మా ద్భయా న్ముక్తాః కతిచి త్తత్ర రాక్షసాః ।
నిహతా న్కింకరా న్సర్వాన్ రావణాయ న్యవేదయన్ ॥ 42

పదచ్ఛేదము :– తతః – తస్మాత్ – భయాత్ – ముక్తాః – కతిచిత్ – తత్ర – రాక్షసాః – నిహతాన్ – కింకరాన్ – సర్వాన్ – రావణాయ – న్యవేదయన్ ॥

అన్వయక్రమము :– తతః తత్ర తస్మాత్ భయాత్ ముక్తాః కతిచిత్ రాక్షసాః (గత్వా) రావణాయ సర్వాన్ కింకరాన్ నిహతాన్ న్యవేదయన్.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, తత్ర = ఆ యుద్ధభూమియందు, తస్మాత్ భయాత్ = ఆ భయమునుండి, ముక్తాః = విడువబడినట్టి, కతిచిత్ = కొద్దిమంది, రాక్షసాః = రాక్షసులు, (గత్వా = పోయి) రావణాయ = రావణునకు, సర్వాన్ కింకరాన్ = ఎల్ల కింకరాసురులను, నిహతాన్ = చనిపోయినవారినిగా, న్యవేదయన్ = నివేదించిరి.

తాత్పర్యము :– అప్పుడు అచ్చటి ఆ మారణమునుండి తప్పించుకొనిపోయి కొద్దిమంది రక్కసులు రావణుని కడకేగి ఆతనితో కింకరాసురులెల్లరును మడిసిరని విన్నవించిరి.

శ్లో॥ స రాక్షసానాం నిహతం మహద్బలమ్
నిశమ్య రాజా పరివృత్తలోచనః ।
సమాదిదే శాప్రతిమం పరాక్రమే
ప్రహస్తపుత్రం సమరే సుదుర్జయమ్ ॥ 43

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"కింకరనిషూదనం" నామ
ద్విచత్వారింశస్సర్గః.

పదచ్ఛేదము :– సః – రాక్షసానాం – నిహతం – మహత్ – బలం – నిశమ్య – రాజా – పరివృత్తలోచనః – సమాదిదేశ – అప్రతిమం – పరాక్రమే – ప్రహస్త పుత్రం – సమరే – సుదుర్జయమ్ ॥

అన్వయక్రమము :– సః రాజా రాక్షసానాం మహత్ బలం నిహతం నిశమ్య, పరివృత్త లోచనః సన్ పరాక్రమే అప్రతిమం, సమరే సుదుర్జయం ప్రహస్తపుత్రం (యుద్ధాయ) సమాదిదేశ.

ప్రతిపదార్థము :– సః రాజా = ఆ లంకాధిపతి, రాక్షసానాం = రాక్షసులయొక్క, మహత్ = గొప్పదైన, బలం = సైన్యమును, నిహతం = హతమైనదానినిగా, నిశమ్య = విని, పరివృత్తలోచనః సన్ = త్రిప్పబడిన కన్నులుగలవాడై, పరాక్రమే =

శౌర్యమునందు, అప్రతిమం = సాటిలేనివాడును, సమరే = యుద్ధమునందు, సుదుర్జయం = జయింపశక్యముగానివాడును అగు, ప్రహస్తపుత్రం = ప్రహస్తుని కుమారుని (జంబుమాలిని), (యుద్ధాయ = యుద్ధమునకై), సమాదిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- ఆ రాక్షసరాజు గొప్పదైన తన రాక్షససైన్యమంతయు హతమారినదని వినగానే కన్నులు తిరిగిపోవుచుండగా వెంటనే పరాక్రమమునందు సాటిలేనివాడును యుద్ధమునందు జయింప శక్యముగాని వాడును అగు ప్రహస్తపుత్రుడైన జంబుమాలిని యుద్ధమునకై ఆజ్ఞాపించెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"కింకర నిషూదనము' అను
నలుబదిరెండవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

త్రిచత్వారింశసర్గ

శ్లో॥ తత స్స కింకరా న్హత్వా హనుమా న్ధ్యాన మాస్థితః ।
వనం భగ్నం మయా చైత్యప్రాసాదో న వినాశితః ॥ 1

పదచ్ఛేదము :- తతః - సః - కింకరాన్ - హత్వా - హనుమాన్ - ధ్యానమ్ - ఆస్థితః, వనం - భగ్నం - మయా - చైత్యప్రాసాదః - న - వినాశితః ॥

అన్వయక్రమము :- తతః సః హనుమాన్ కింకరాన్ హత్వా ధ్యానమ్ ఆస్థితః "మయా వనం భగ్నం; చైత్యప్రాసాదః న వినాశితః"

(మీది శ్లోకముతో అన్వయము)

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, సః హనుమాన్ = ఆ హనుమ, కింకరాన్ = కింకరాసురులను, హత్వా = వధించి, ధ్యానమ్ ఆస్థితః = ఆలోచననొందెను, మయా = నాచేత, వనం = వనము, భగ్నం = ధ్వంసము చేయబడినది, చైత్యప్రసాదః = వనసౌధము, న వినాశితః = నాశనము చేయబడలేదు.

తాత్పర్యము :- అప్పుడు హనుమంతుడు ఆ కింకరాసురులను హతమార్చి పిమ్మట ఈ రీతిగా ఆలోచించెను. రావణాసురుని ఈ వనమును ధ్వంసము చేసితినిగాని ఈ రక్కసుల వనసౌధమును ధ్వంసము చేయలేదు.

శ్లో॥ తస్మా త్ప్రాసాదమప్యేవ మిమం విధ్వంసయామ్యహమ్ ।
ఇతి సంచింత్య మనసా హనుమాన్ దర్శయన్ బలమ్ ॥ 2

శ్లో॥ చైత్యప్రాసాద మాప్లుత్య మేరుశృంగమివోన్నతమ్ ।
ఆరురోహ హరిశ్రేష్ఠో హనుమాన్ మారుతాత్మజః ॥ 3

పదచ్ఛేదము :- తస్మాత్ - ప్రాసాదం - అపి - ఏవమ్ - ఇమం - విధ్వంసయామి - అహమ్ - ఇతి - సంచింత్య - మనసా - హనుమాన్ - దర్శయన్ - బలం, చైత్యప్రాసాదమ్ - ఆప్లుత్య - మేరుశృంగమ్ - ఇవ - ఉన్నతమ్; ఆరురోహ - హరిశ్రేష్ఠః - హనుమాన్ - మారుతాత్మజః ॥

అన్వయక్రమము :- తస్మాత్ ఇమం ప్రాసాదమ్ అపి అహమ్ ఏవం విధ్వంసయామి, ఇతి మనసా సంచింత్య బలం దర్శయన్ హరిశ్రేష్ఠః మారుతాత్మజః హనుమాన్ మేరుశృంగమ్ ఇవ ఉన్నతం చైత్యప్రాసాదమ్ ఆప్లుత్య ఆరురోహ.

ప్రతిపదార్థము :- తస్మాత్ = అందువలన, ఇమం ప్రాసాదమ్ అపి = ఈ సౌధమును గూడ, ఏవం = ఈ రీతిగనే, అహం = నేను, విధ్వంసయామి = ధ్వంసము చేయుదును, ఇతి = అని, మనసా = మనస్సున, సంచింత్య = ఆలోచించి, బలం = శక్తిని, దర్శయన్ = చూపుచు, హరిశ్రేష్ఠః = వానరశ్రేష్ఠుడైన, మారుతాత్మజః హనుమాన్ = వాయునందనుడగు ఆ హనుమ, మేరుశృంగం ఇవ = మేరుశిఖరమునువలె, ఉన్నతం = ఎత్తయినట్టి, చైత్యప్రాసాదమ్ = వనశిలాసౌధమును, ఆప్లుత్య = గెంతి, ఆరురోహ = ఆరోహించెను.

తాత్పర్యము :- అందుచేత ఈ సౌధమును గూడ ఆ వనమును వలెనే ఇప్పుడే ధ్వంసము చేయుదునని నిశ్చయించి తన బలమును ప్రదర్శించుచు పవనసుతుడైన ఆ హనుమ మేరుపర్వత శిఖరమువలె ఉన్నతమైయున్న ఆ చైత్యప్రాసాదము మీదికి ఒక్క గంతులో ఎగిరి దానిపై కూర్చుండెను.

శ్లో॥ ఆరుహ్య గిరిసంకాశం ప్రాసాదం హరియూథపః ।
బభౌ స సుమహాతేజాః ప్రతిసూర్య ఇవోదితః ॥ 4

పదచ్ఛేదము :- ఆరుహ్య - గిరిసంకాశం - ప్రాసాదం - హరియూథపః - బభౌ - సః - సుమహాతేజాః - ప్రతిసూర్యః - ఇవ - ఉదితః ॥

అన్వయక్రమము :- సుమహాతేజాః సః హరియూథపః గిరిసంకాశం ప్రాసాదమ్ ఆరుహ్య, ఉదితః ప్రతిసూర్యః ఇవ బభౌ.

ప్రతిపదార్థము :- సుమహాతేజాః = మిక్కిలి గొప్పదైన తేజస్సు గలిగిన, సః హరియూథపః = ఆ వానరశ్రేష్ఠుడు, గిరిసంకాశం = పర్వతసన్నిభమైనట్టి, ప్రాసాదమ్ = చైత్యప్రాసాదమును, ఆరుహ్య = అధిష్ఠించి, ఉదితః = ఉదయించినట్టి, ప్రతిసూర్యః ఇవ = రెండవ సూర్యుడువలె, బభౌ = ప్రకాశించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- "ఉదితః ప్రతిసూర్యః ఇవ బభౌ" - ఉదయించిన రెండవ సూర్యునివలె ప్రకాశించెను అనగా తూర్పు దిక్కున అప్పుడే సూర్యోదయ మగుచుండెనని సూచింపబడెను.

తాత్పర్యము :– మహాతేజస్వియైన ఆ హనుమ మహాపర్వతము వలె నున్న ఆ యున్నత సౌధము నధిష్ఠించి అచ్చట ఇంకొక సూర్యు డుదయించి యున్నాడా అనునట్లుగా గొప్పగా ప్రకాశించుచుండెను.

శ్లో॥ సంప్రధృష్య చ దుర్ధర్షం చైత్యప్రాసాద మున్నతమ్ ।
హనుమాన్ ప్రజ్వలన్ లక్ష్మ్యా పారియాత్రోపమోఽభవత్ ॥ 5

పదచ్ఛేదము :– సంప్రధృష్య – చ – దుర్ధర్షం – చైత్యప్రాసాదమ్ – ఉన్నతమ్ – హనుమాన్ – ప్రజ్వలన్ – లక్ష్మ్యా – పారియాత్రోపమః – అభవత్ ॥

అన్వయక్రమము :– దుర్ధర్షమ్, ఉన్నతం చైత్యప్రాసాదం సంప్రధృష్య హనుమాన్ లక్ష్మ్యా ప్రజ్వలన్ పారియాత్రోపమః అభవత్.

ప్రతిపదార్థము :– దుర్ధర్షం = చలింపజేయరాని, చైత్యప్రాసాదం = శిలాసౌధమును, సంప్రధృష్య = ధ్వంసముచేసి, హనుమాన్ = హనుమ, లక్ష్మ్యా = శోభతో, ప్రజ్వలన్ = మిక్కిలి ప్రకాశించుచు, పారియాత్రోపమః = పారియాత్రపర్వతమును బోలినవాడు, అభవత్ = ఆయెను.

తాత్పర్యము :– వెంటనే హనుమ మహాబలిష్ఠమై ఉన్నతముగానున్న ఆ చైత్య ప్రాసాదమును ధ్వంసముచేసి శౌర్యలక్ష్మితో విరాజిల్లుచు పారియాత్ర పర్వతమువలె కనిపించుచుండెను.

శ్లో॥ స భూత్వా సుమహాకాయః ప్రభావా న్మారుతాత్మజః ।
ధృష్ట మాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్ ॥ 6

పదచ్ఛేదము :– సః – భూత్వా – సుమహాకాయః – ప్రభావాత్ – మారుతాత్మజః – ధృష్టమ్ – ఆస్ఫోటయామాస – లంకాం – శబ్దేన – పూరయన్ ॥

అన్వయక్రమము :– సః మారుతాత్మజః ప్రభావాత్ సుమహాకాయః భూత్వా లంకాం శబ్దేన పూరయన్ ధృష్టమ్ ఆస్ఫోటయామాస.

ప్రతిపదార్థము :– సః మారుతాత్మజః = ఆ వాయునందనుడు, ప్రభావాత్ = మహిమ వలన, సుమహాకాయః = మిక్కిలి పెద్దదైన శరీరము గలవాడుగా, భూత్వా = అయి, లంకాం = లంకను, శబ్దేన = ధ్వనితో, పూరయన్ = నింపుచు, ధృష్టం = కఠోరముగా, ఆస్ఫోటయామాస = చఱచెను.

తాత్పర్యము :– పెద్దగా శరీరమును పెంచి లంకానగరమునంతను ధ్వనితో నింపించుచు మిక్కిలి కఠోరముగా భుజాస్ఫాలనము గావించెను.

శ్లో॥ త స్యాస్ఫోటితశబ్దేన మహతా శ్రోత్రఘాతినా ।
పేతు ర్విహంగమా స్తత్ర చైత్యపాలాశ్చ మోహితాః ॥ 7

పదచ్ఛేదము :- తస్య - ఆస్ఫోటితశబ్దేన - మహతా - శ్రోత్రఘాతినా - పేతుః - విహంగమాః - తత్ర - చైత్యపాలాః - చ - మోహితాః ॥

అన్వయక్రమము :- శ్రోత్రఘాతినా మహతా తస్య ఆస్ఫోటితశబ్దేన తత్ర విహంగమాః పేతుః; చైత్యపాలాః చ మోహితాః.

ప్రతిపదార్థము :- శ్రోత్రఘాతినా = చెవులను బ్రద్దలుగొట్టునట్టి, మహతా = గొప్పదైనట్టి, తస్య = ఆ హనుమయొక్క, ఆస్ఫోటితశబ్దేన = ఆస్ఫాలనధ్వనిచేత, తత్ర = అచ్చటి, విహంగమాః = పక్షులు, పేతుః = పడినవి, చైత్యపాలాః = ప్రాసాదరక్షకులు, మోహితాః (అభవన్) = మూర్ఛితులైరి.

తాత్పర్యము :- చెవులు బ్రద్దలగునట్లు పెద్దధ్వనితో హనుమ గావించినట్టి ఆ భుజాస్ఫాలన శబ్దమునకు ఆకాశమున ఎగురుచున్న పక్షులు భయవిహ్వలములై నేలకూలినవి. ఆ చైత్యరక్షకులు ఎల్లరును మూర్ఛనొందిరి.

శ్లో॥ అస్త్రవి జ్జయతాం రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ॥ 8

శ్లో॥ దాసోఽహం కోసలేంద్రస్య రామ స్యాక్లిష్టకర్మణః ।
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః ॥ 9

శ్లో॥ న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్ ।
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః ॥ 10

శ్లో॥ అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీమ్ ।
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్ ॥ 11

పదచ్ఛేదము :- అస్త్రవిత్ - జయతాం - రామః - లక్ష్మణః - చ - మహాబలః - రాజా - జయతి - సుగ్రీవః - రాఘవేణ - అభిపాలితః - దాసః - అహం - కోసలేంద్రస్య - రామస్య - అక్లిష్టకర్మణః - హనుమాన్ - శత్రుసైన్యానాం - నిహంతా - మారుతాత్మజః - న - రావణసహస్రం - మే - యుద్ధే - ప్రతిబలం - భవేత్ - శిలాభిః - తు - ప్రహరతః - పాదపైః - చ - సహస్రశః - అర్దయిత్వా - పురీం - లంకామ్ - అభివాద్య - చ - మైథిలీమ్ - సమృద్ధార్థో - గమిష్యామి

– మిషతాం – సర్వరక్షసామ్ ॥

అన్వయక్రమము :– అస్త్రవిత్ రామః జయతామ్, మహాబలః లక్ష్మణశ్చ జయతామ్, రాఘవేణ అభిపాలితః రాజా సుగ్రీవః జయతి, అహం అక్లిష్టకర్మణః కోసలేంద్రస్య రామస్య దాసః, శత్రుసైన్యానాం నిహంతా (అహం) మారుతాత్మజః హనుమాన్, సహస్రశః శిలాభిః పాదపైః చ ప్రహరతః మే యుద్ధే రావణసహస్రం ప్రతిబలం న భవేత్, సర్వరక్షసాం మిషతాం (సతాం) లంకాం పురీం అర్దయిత్వా మైథిలీమ్ అభివాద్య చ సమృద్ధార్థః (సన్) గమిష్యామి.

ప్రతిపదార్థము :– అస్త్రవిత్ = అస్త్రకోవిదుడైన, రామః = శ్రీరాముడు, జయతాం = జయించుగాక; మహాబలః = బలాఢ్యుడైన, లక్ష్మణశ్చ = లక్ష్మణుడును, జయతాం = వర్ధిలుగాక, రాఘవేణ = శ్రీరామునిచే, అభిపాలితః = సంరక్షింపబడిన, రాజా సుగ్రీవః = రాజైన సుగ్రీవుడు, జయతి = వర్ధిల్లుచున్నాడు, అహం = నేను, అక్లిష్టకర్మణః = క్లేశముగూర్పని కృత్యములు గల్గినట్టి, కోసలేంద్రస్య = కోసలాధిపతియగు, రామస్య = శ్రీరామునకు, దాసః = బంటును, శత్రుసైన్యానాం = శత్రుసైన్యములకు, నిహంతా = మారకుడనగు, అహం = నేను, మారుతాత్మజః = వాయుపుత్రుడనగు, హనుమాన్ = హనుమంతుడను పేరుగలవాడను, సహస్రశః = వేలకొలదిగ, శిలాభిః = ఱాళ్ళతోడను, పాదపైః చ = వృక్షములతోడను, ప్రహరతః = ప్రహరించుచున్నట్టి, మే = నాకు, యుద్ధే = యుద్ధమునందు, రావణసహస్రం = వేయిమంది రావణుల సమూహము, ప్రతిబలం = ప్రతిపక్షము, న భవేత్ = కాజాలరు, సర్వరక్షసాం = రాక్షసులెల్లరును, మిషతాం (సతాం) = చూచుచుండగా, లంకాం పురీం = లంకానగరమును, అర్దయిత్వా = ధ్వంసముచేసి, మైథిలీం = జానకిని, అభివాద్య చ = మ్రొక్కియు, సమృద్ధార్థః = సంపన్నమైన కార్యము గలవాడనై, గమిష్యామి = వెడలిపోవుదును.

తాత్పర్యము :– సర్వాస్త్రవిద్యలును తెలిసినట్టి శ్రీరాముడు సర్వోత్కర్షతో వర్ధిల్లుగాక! మహాబలాఢ్యుడైన లక్ష్మణుడును వర్ధిల్లుగాక! శ్రీరామునిచే సంరక్షింపబడిన సుగ్రీవమహారాజు వర్ధిల్లుచున్నాడు. క్లేశకృత్యమును ఎఱుగనట్టి కోసలప్రభువైన శ్రీరామునకు నేను బంటును. శత్రుసైన్యములను పరిమార్చువాడనగు నేను వాయునందనుడైన హనుమంతుడను. వేలకొలదిగ శిలలతోడను, వృక్షములతోడను ప్రహరించుచు యుద్ధముచేయునట్టి నాకు రణరంగమునందు వేయిమంది రావణులైనను ఎదురుగ నిలువగల ప్రతివీరులు గాజాలరు. ఈ రాక్షసులెల్లరును చూచుచుండగనే లంకానగరమును ధ్వంసముచేసి మా జానకీదేవికి మ్రొక్కి నే దలపెట్టిన

కార్యమును సాధించుకొని వెడలిపోవుదును.

శ్లో॥ ఏవ ముక్త్వా మహాబాహు శ్చైత్యస్థో హరియూథపః ।
ననాద భీమనిర్హ్రాదో రక్షసాం జనయ న్భయమ్ ॥ 12

పదచ్ఛేదము :- ఏవమ్ - ఉక్త్వా - మహాబాహుః - చైత్యస్థః - హరియూథపః - ననాద - భీమనిర్హ్రాదః - రక్షసాం - జనయన్ - భయమ్ ॥

అన్వయక్రమము :- మహాబాహుః హరియూథపః చైత్యస్థః (సన్) ఏవమ్ ఉక్త్వా రక్షసాం భయం జనయన్ భీమనిర్హ్రాదః సన్ ననాద.

ప్రతిపదార్థము :- మహాబాహుః = మహావీరుడైనట్టియు, హరియూథపః = వానరవీర శ్రేష్ఠుడైనట్టియు హనుమ, ఏవమ్ ఉక్త్వా = ఇట్లు పలికిన, రక్షసాం = రక్కసులకు, భయం = భీతిని, జనయన్ = కలిగించుచు, భీమనిర్హ్రాదః (సన్) = భీకరమైన ధ్వనిగలవాడై, ననాద = గర్జించెను.

తాత్పర్యము :- మహావీరుడైన ఆ వానరశ్రేష్ఠుడు చైత్యప్రాసాదముపై నిలచి ఈరీతిగ ఘోషించుచు రాక్షసులకు మహాభీతిని కల్గించుచు భయంకరమైన శబ్దముతో గర్జన చేసెను.

శ్లో॥ తేన శబ్దేన మహతా చైత్యపాలా శ్శతం యయుః ।
గృహీత్వా వివిధా నస్త్రా న్ప్రాసా న్ఖడ్గా న్పరశ్వధాన్ ।
విసృజంతో మహాకాయా మారుతిం పర్యవారయన్ ॥ 13

పదచ్ఛేదము :- తేన - శబ్దేన - మహతా - చైత్యపాలాః - శతం - యయుః - గృహీత్వా - వివిధాన్ - అస్త్రాన్ - ప్రాసాన్ - ఖడ్గాన్ - పరశ్వధాన్ - విసృజంతః - మహాకాయాః - మారుతిం - పర్యవారయన్ ॥

అన్వయక్రమము :- మహతా తేన శబ్దేన శతం చైత్యపాలాః వివిధాన్ అస్త్రాన్ గృహీత్వా యయుః, మహాకాయాః (తే) ప్రాసాన్ ఖడ్గాన్ పరశ్వధాన్ విసృజంతః మారుతిం పర్యవారయన్.

ప్రతిపదార్థము :- మహతా = గొప్పదైనట్టి, తేన శబ్దేన = ఆ ధ్వనిచేత, శతం = వందమంది, చైత్యపాలాః = చైత్యపాలకులు, వివిధాన్ = బహువిధములైన, అస్త్రాన్ = అస్త్రములను, గృహీత్వా = గ్రహించి, యయుః = బయలువెడలిరి, మహాకాయాః = గొప్పదైన శరీరముగల, తే = ఆ చైత్యపాలురు, ప్రాసాన్ = ఈటెలను, ఖడ్గాన్ = ఖడ్గములను, పరశ్వధాన్ = గండ్రగొడ్డళ్ళను, విసృజంతః = విసరుచు, మారుతిం =

హనుమను, పర్యవారయన్ = చుట్టుముట్టిరి.

తాత్పర్యము :– హనుమ గావించిన ఆ భీకరగర్జనకు అచటి చైత్యపాలకులు వందమంది వివిధములగు ఆయుధములను ధరించి యుద్ధమునకు వచ్చిరి. భీకరమైన శరీరములు కలిగిన ఆ చైత్యపాలురు హనుమమీదికి ఈటెలను, కత్తులను, గండ్రగొడ్డళ్ళను విసరుచు ఆతనిని చుట్టుముట్టిరి.

శ్లో॥ తే గదాభి ర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః ।
ఆజఘ్ను ర్వానరశ్రేష్ఠం బాణై శ్చాదిత్యసన్నిభైః ॥ 14

పదచ్ఛేదము :– తే – గదాభిః – విచిత్రాభిః – పరిఘైః – కాంచనాంగదైః – ఆజఘ్నుః – వానరశ్రేష్ఠమ్ – బాణైః – చ – ఆదిత్యసన్నిభైః ॥

అన్వయక్రమము :– తే, విచిత్రాభిః గదాభిః కాంచనాంగదైః పరిఘైః ఆదిత్యసన్నిభైః బాణైః చ వానరశ్రేష్ఠమ్ ఆజఘ్నుః.

ప్రతిపదార్థము :– తే = వారు, విచిత్రాభిః = విచిత్రములైనట్టి, గదాభిః = గదలతోడను, కాంచనాంగదైః = బంగారు అలంకారములు గల, పరిఘైః = పరిఘలతోడను, ఆదిత్యసన్నిభైః = సూర్యునితో సమానమైన, బాణైః చ = బాణములతోడను, వానర శ్రేష్ఠం = వానరశ్రేష్ఠుడైన హనుమను, ఆజఘ్నుః = ప్రహరించిరి.

తాత్పర్యము :– ఆ చైత్యపాలకులు విచిత్రములైన గదలతోడను, బంగారు నడికట్టుగల ఇనుప గుదియలతోడను, సూర్యునివలె ప్రకాశించు బాణములతోడను ఆ వానరవీరుని ప్రహరింపసాగిరి.

శ్లో॥ ఆవర్త ఇవ గంగాయా స్తోయస్య విపులో మహాన్ ।
పరిక్షిప్య హరిశ్రేష్ఠం స బభౌ రక్షసాం గణః ॥ 15

పదచ్ఛేదము :– ఆవర్తః – ఇవ – గంగాయాః – తోయస్య – విపులం – మహాన్ – పరిక్షిప్య – హరిశ్రేష్ఠం – సః – బభౌ – రక్షసాం – గణః ॥

అన్వయక్రమము :– గంగాయాః తోయస్య విపులః మహాన్ ఆవర్తః ఇవ, సః రక్షసాం గణః హరిశ్రేష్ఠం పరిక్షిప్య బభౌ.

ప్రతిపదార్థము :– సః = ఆ, రక్షసాం = రాక్షసులయొక్క, గణః = సమూహము, హరిశ్రేష్ఠం = వానరశ్రేష్ఠుడైన హనుమను, పరిక్షిప్య = చుట్టుముట్టి, గంగాయాః = గంగానదియొక్క, తోయస్య = జలముయొక్క, విపులః = విస్తారమైనదియును, మహాన్ = గొప్పదియు నగు, ఆవర్తః ఇవ = సుడివలె, బభౌ = ప్రకాశించెను.

తాత్పర్యము :- ఆ రాక్షసుల సమూహము హనుమను చుట్టుముట్టినప్పుడు ఆ దృశ్యము గంగానదీ ప్రవాహజలములో కానవచ్చెడి గొప్పదైన పెద్ద సుడిగుండమువలె వింతగా కనిపించెను.

శ్లో॥ తతో వాతాత్మజః క్రుద్ధో భీమం రూపం సమాస్థితః ।
ప్రాసాదస్య మహాంతస్య స్తంభం హేమపరిష్కృతమ్ ॥ 16

శ్లో॥ ఉత్పాటయిత్వా వేగేన హనుమా న్పవనాత్మజః ।
తత స్తం భ్రామయామాస శతధారం మహాబలః ॥ 17

పదచ్ఛేదము :- తతః - వాతాత్మజః - క్రుద్ధః - భీమం - రూపం - సమాస్థితః - ప్రాసాదస్య - మహాంతస్య - స్తంభం - హేమపరిష్కృతమ్ - ఉత్పాటయిత్వా - వేగేన - హనుమాన్ - పవనాత్మజః - తతః - తం - భ్రామయామాస - శతధారం - మహాబలః ॥

అన్వయక్రమము :- తతః క్రుద్ధః వాతాత్మజః భీమం రూపం సమాస్థితః - మహాంతస్య ప్రాసాదస్య హేమపరిష్కృతం స్తంభమ్ ఉత్పాటయిత్వా తతః మహాబలః పవనాత్మజః హనుమాన్ శతధారం తం వేగేన భ్రామయామాస.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, క్రుద్ధః = క్రోధితుడైన, వాతాత్మజః = హనుమ, భీమం రూపం = భయంకరమైన రూపమును, సమాస్థితః = ధరించినవాడై, మహాంతస్య = గొప్పదైన శిఖరముగల, ప్రాసాదస్య = చైత్యప్రాసాదముయొక్క, హేమపరిష్కృతం = బంగారునగిషీ గలిగినట్టి, స్తంభం = స్తంభమును, ఉత్పాటయిత్వా = పెల్లగించి, తతః = పిమ్మట, మహాబలః = మహాబలశాలియైన, పవనాత్మజః = వాయునందనుడగు, హనుమాన్ = హనుమ, శతధారం = నూఱుఅంచులు గలిగినట్టి, తం = ఆ స్తంభమును, వేగేన = వేగముతో, భ్రామయామాస = త్రిప్పదొడగెను.

సూచన :- ఇట శతధారం తం భ్రామయామాస అను పదములను, తం శతధా అరం భ్రామయామాస, అనగా ఆ స్తంభమును నూఱువిధములుగా వేగముగా త్రిప్పుచుండెను అని ఇంకొక అన్వయము గలదు. (అరం = వేగముగా)

తాత్పర్యము :- అటుపిమ్మట వాయునందనుడు మిక్కిలి క్రోధము నొంది భయంకరమైన రూపమును దాల్చినవాడై గొప్పదైనట్టి ఆ ప్రాసాదమునందలి స్వర్ణభూషితమైన ఒకానొక స్తంభమును పెఱికివేచి వజ్రాయుధమువలె నూఱుమొనలతో ప్రకాశించుచున్నట్టి ఆ స్తంభమును తనచేతితో మహావేగముగా త్రిప్పదొడగెను.

శ్లో॥ తత్ర చాగ్ని స్సమభవ త్ప్రాసాద శ్చా ప్యదహ్యత ।
దహ్యమానం తతో దృష్ట్వా ప్రాసాదం హరియూథపః ॥ 18

శ్లో॥ స రాక్షసశతం హత్వా వజ్రే ణేంద్ర ఇవాసురాన్ ।
అంతరిక్షే స్థిత శ్శ్రీమా నిదం వచన మబ్రవీత్ ॥ 19

పదచ్ఛేదము :– తత్ర – చ – అగ్నిః – సమభవత్ – ప్రాసాదః – చ – అపి – అదహ్యత – దహ్యమానం – తతః – దృష్ట్వా – ప్రాసాదం – హరియూథపః – సః – రాక్షసశతం – హత్వా – వజ్రేణ – ఇంద్రః – ఇవ – అసురాన్ – అంతరిక్షే – స్థితః – శ్రీమాన్ – ఇదం – వచనమ్ – అబ్రవీత్ ॥

అన్వయక్రమము :– తత్ర అగ్నిః చ సమభవత్ – ప్రాసాదః చ అపి అదహ్యత. తతః సః హరియూథపః దహ్యమానం ప్రాసాదం దృష్ట్వా ఇంద్రః వజ్రేణ అసురాన్ ఇవ రాక్షసశతం హత్వా శ్రీమాన్ అంతరిక్షే స్థితః (సన్) ఇదం వచనమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :– తత్ర = ఆ స్తంభమునందు, అగ్నిః = అగ్ని, సమభవత్ = జనియించెను, ప్రాసాదః చ అపి = ఆ చైత్యప్రాసాదము కూడ, అదహ్యత = దహింపబడెను, తతః = పిమ్మట, హరియూథపః = వానరవీరుడైన హనుమ, దహ్యమానం = దహింపబడుచున్న, ప్రాసాదం = చైత్యప్రాసాదమును, దృష్ట్వా = చూచి, ఇంద్రః = దేవేంద్రుడు, వజ్రేణ = వజ్రాయుధముచే, అసురాన్ ఇవ = రాక్షసులనువలె, రాక్షసశతం = నూఱుమంది రాక్షసులను, హత్వా = వధించి, శ్రీమాన్ = ఆ శోభాసమన్వితుడైన హనుమ, అంతరిక్షే = ఆకాశమున, స్థితః సన్ = నిలచినవాడై, ఇదం వచనమ్ = ఈ మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :– అప్పుడా ఇనుప ప్రాసాద స్తంభము ఇతరములైన ఇనుపస్తంభములతో రాచుకొని అగ్ని ఉద్భవించినది. ఆ యగ్నిచే ఆ చైత్యప్రాసాదము తగులబడినది. హనుమ అట్లు తగులబడుచున్న ఆ చైత్యప్రాసాదమును చూచి ఆ చైత్యపాలకులైన వందమంది రాక్షసులను ఇంద్రుడు వజ్రాయుధముచే రాక్షసులను వధించినట్లు చంపివేసి అంతరిక్షమున కెగిరి అచట నిలచి ఈ విధముగా పలికెను.

శ్లో॥ మాదృశానాం సహస్రాణి విసృష్టాని మహాత్మనామ్ ।
బలినాం వానరేంద్రాణాం సుగ్రీవవశవర్తినామ్ ॥ 20

పదచ్ఛేదము :– మాదృశానాం – సహస్రాణి – విసృష్టాని – మహాత్మనామ్ – బలినాం – వానరేంద్రాణాం – సుగ్రీవవశవర్తినామ్ ॥

అన్వయక్రమము :- సుగ్రీవవశవర్తినామ్, వానరేంద్రాణాం, బలినాం మహాత్మనాం, మాదృశానాం సహస్రాణి విసృష్టాని.

ప్రతిపదార్థము :- సుగ్రీవవశవర్తినాం = సుగ్రీవుని వశవర్తులైనట్టియు, బలినాం = బలాఢ్యులైనట్టియు, మహాత్మనాం = మహనీయులైనట్టియు, మాదృశానాం = నావంటి, వానరేంద్రాణాం = వానరశ్రేష్ఠులయొక్క, సహస్రాణి = వేలసంఖ్యలు గలవారు, విసృష్టాని = పంపబడిరి.

తాత్పర్యము :- సుగ్రీవుని ఆజ్ఞానువర్తనులై మహాబలశాలులై యున్న నావంటి వానరశ్రేష్ఠులు వేలకొలదిగా ఈ రీతిగా నలుమూలలకును పంపబడినారు.

శ్లో॥ అటంతి వసుధాం కృత్స్నాం వయ మన్యే చ వానరాః ।
దశనాగబలాః కేచి త్కేచి ద్దశగుణోత్తరాః ॥ 21

శ్లో॥ కేచి న్నాగసహస్రస్య బభూవు స్తుల్యవిక్రమాః ।
సంతి చౌఘబలాః కేచి త్కేచి ద్వాయుబలోపమాః ।
అప్రమేయబలా శ్చాన్యే త త్రాస న్హరియూథపాః ॥ 22

పదచ్ఛేదము :- అటంతి - వసుధాం - కృత్స్నాం - వయమ్ - అన్యే - చ - వానరాః - దశనాగబలాః - కేచిత్ - కేచిత్ - దశగుణోత్తరాః - కేచిత్ - నాగసహస్రస్య - బభూవుః - తుల్యవిక్రమాః - సంతి - చ - ఓఘబలాః - కేచిత్ - కేచిత్ - వాయుబలోపమాః - అప్రమేయబలాః - చ - అన్యే - తత్ర - ఆసన్ - హరియూథపాః ॥

అన్వయక్రమము :- వయం అన్యే వానరాః చ కృత్స్నాం వసుధామ్ అటంతి, (తేషు) కేచిత్ దశనాగబలాః, కేచిత్ దశగుణోత్తరాః, కేచిత్ నాగసహస్రస్య తుల్యవిక్రమాః బభూవుః, కేచిత్ ఓఘబలాః, కేచిత్ వాయుబలోపమాః సంతి, తత్ర అన్యే హరియూథపాః అప్రమేయబలాః చ - ఆసన్.

ప్రతిపదార్థము :- వయం = మేమును, అన్యే = ఇతరులైన, వానరాః చ = వానరులును, కృత్స్నాం = సంపూర్ణమైన, వసుధామ్ = భూమిని, అటంతి = పర్యటించుచున్నారు, తేషు = వారిలో, కేచిత్ = కొంతమంది, దశనాగబలాః = పదిఏనుగుల బలముగలవారుగను, కేచిత్ = కొంతమంది, దశగుణోత్తరాః = వారికంటెను పదిరెట్లు బలముగల వారుగను, కేచిత్ = కొంతమంది, నాగసహస్రస్య = వేయిఏనుగుల యొక్క, తుల్యవిక్రమాః = సమానమైన పరాక్రమము గలవారుగను ఉన్నారు, కేచిత్

= కొంతమంది, ఓఘబలాః = ప్రవాహముయొక్క బలమువంటి బలముగలవారు గను, కేచిత్ వాయుబలోపమాః = కొంతమంది వాయువుయొక్క బలముతో సమానమైన బలము కలవారుగను, సంతి = ఉన్నారు, తత్ర = అచ్చట, అన్యే = ఇతరులైన, హరియూథపాః = వానరయోధులు, అప్రమేయబలాః చ = అపరిమితమైన బలము గలవారుగను, ఆసన్ = ఉండిరి.

తాత్పర్యము :- ఈ విధముగా మేమును మిగిలిన వానరవీరులును భూమండల మంతయును పర్యటించుచున్నాము. మాలో కొందఱు పది ఏనుగుల బలముగలవారు. కొంతమంది వంద ఏనుగుల బలముతో సమానమైన బలము గలవారును, కొంతమంది వేయిఏనుగులతో సమానమైన బలముగలవారును ఉన్నారు. మఱియు మావారు కొందఱు మహానదీప్రవాహముతో సమానమైన బలము గలవారును, వాయుదేవునితో సమానమైన బలముగలవారును పెక్కుమంది యున్నారు. వారిలో మఱికొందఱు వానరయోధులు అపరిమితమైన పరాక్రమము గలవారు కూడ నున్నారు.

సూచన :- ఓఘబలాః - ఓఘమనునది ఒక పెద్దసంఖ్య. అట్టి సంఖ్యగల ఏనుగుల బలముగలవారు మఱికొంతమంది వానరులు అని కొందఱు వాఖ్యాతలు అర్థము చెప్పిరి.

శ్లో॥ ఈదృగ్విధైస్తు హరిభి ర్వృతో దంతనఖాయుధైః ।
శతై శ్శతసహస్రైశ్చ కోటీభి రయుతైరపి ।
ఆగమిష్యతి సుగ్రీవ స్సర్వేషాం వో నిషూదనః ॥ 23

పదచ్ఛేదము :- ఈదృగ్విధైః - తు - హరిభిః - వృతః - దంతనఖాయుధైః - శతైః - శతసహస్రైః - చ - కోటీభిః - అయుతైః - అపి - ఆగమిష్యతి - సుగ్రీవః - సర్వేషాం - వః - నిషూదనః ॥

అన్వయక్రమము :- ఈదృగ్విధైః దంతనఖాయుధైః శతైః శతసహస్రైః చ కోటీభిః అయుతైః అపి హరిభిః వృతః సర్వేషాం వః నిషూదనః (సన్) సుగ్రీవః ఆగమిష్యతి.

ప్రతిపదార్థము :- శతైః = వందలకొలదియు, శతసహస్రైః చ = లక్షలకొలదియు, కోటీభిః = కోట్ల కొలదియు, అయుతైః అపి = అయుత సంఖ్య కలిగినట్టియు, ఈదృగ్విధైః = ఈ విధముగనున్నట్టి, దంతనఖాయుధైః = దంతములు నఖములు ఆయుధములుగాగల, హరిభిః = వానరులతో, వృతః = కూడినవాడై, సుగ్రీవః = సుగ్రీవుడు, సర్వేషాం వః = మీ అందఱికిని, నిషూదనః (సన్) = మారకుడగుచు, ఆగమిష్యతి = రాగలడు.

తాత్పర్యము :– వందలకొలదియు, లక్షలకొలదియు, కోట్లకొలదియు, పదివేలకోట్ల కొలదియు నున్నట్టి ఈ విధమైన మహాబలాఢ్యులైన, తమ దంతములు నఖములు ఆయుధములుగా చేసికొని పోరాడు వానరవీరులతో కూడినవాడై మా సుగ్రీవమహారాజు మిమ్ముల నందరను తుదముట్టించుటకై త్వరలోనే రాబోవుచున్నాడు సుమీ!

శ్లో॥ నేయ మస్తి పురీ లంకా న యూయం న చ రావణః ।
యస్మా దిక్ష్వాకునాథేన బద్ధం వైరం మహాత్మనా ॥ 24

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"చైత్యప్రాసాదదాహో" నామ
త్రిచత్వారింశస్సర్గః.

పదచ్ఛేదము :– న – ఇయమ్ – అస్తి – పురీ – లంకా – న – యూయం – న – చ – రావణః – యస్మాత్ – ఇక్ష్వాకునాథేన – బద్ధం – వైరం – మహాత్మనా ॥

అన్వయక్రమము :– యస్మాత్ మహాత్మనా ఇక్ష్వాకునాథేన వైరం బద్ధం (తస్మాత్) ఇయం లంకాపురీ ఇతః పరం న అస్తి, యూయం (న స్థ) రావణః చ న అస్తి.

ప్రతిపదార్థము :– యస్మాత్ = ఎందువలననైతే, మహాత్మనా = మహనీయుడైన, ఇక్ష్వాకునాథేన = ఇక్ష్వాకువంశప్రభువైన శ్రీరామునితో, వైరం = శత్రుత్వము, బద్ధం = కూర్చబడెనో, (తస్మాత్ = ఆ కారణమువలన) ఇయం లంకాపురీ = ఈ లంకానగరము, ఇతః పరం = ఇకమీదట, న అస్తి = ఉండదు, యూయం చ = మీరును, న(స్థ) = ఉండరు, రావణః చ = రావణుడు, న అస్తి = ఉండడు.

తాత్పర్యము :– మహాత్ముడైన ఇక్ష్వాకు వంశ ప్రభువగు శ్రీరామునితో మీరు వైరమును పెట్టుకొన్నారు కాబట్టి ఇకమీదట ఈ లంకానగరము ఉండదు. మీరెవ్వరును ఉండరు. అట్లే రావణుడును ఉండడు సుమీ!

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"చైత్య ప్రాసాద దహనము" అను
నలుబదిమూడవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

చతుశ్చత్వారింశసర్గ

శ్లో॥ సందిష్టో రాక్షసేంద్రేణ ప్రహస్తస్య సుతో బలీ ।
జంబుమాలీ మహాదంష్ట్రో నిర్జగామ ధనుర్ధరః ॥ 1

శ్లో॥ రక్తమాల్యాంబరధరః స్రగ్వీ రుచిరకుండలః ।
మహా న్వివృత్తనయన శ్చండ స్సమరదుర్జయః ॥ 2

శ్లో॥ ధను శ్శక్రధనుఃప్రఖ్యం మహ ద్రుచిరసాయకమ్ ।
విస్ఫారయాణో వేగేన వజ్రాశనిసమస్వనమ్ ॥ 3

పదచ్ఛేదము :– సందిష్టః – రాక్షసేంద్రేణ – ప్రహస్తస్య – సుతః – బలీ – జంబుమాలీ – మహాదంష్ట్రః – నిర్జగామ – ధనుర్ధరః – రక్తమాల్యాంబరధరః – స్రగ్వీ – రుచిరకుండలః – మహాన్ – వివృత్తనయనః – చండః – సమరదుర్జయః – ధనుః – శక్రధనుఃప్రఖ్యం – మహత్ – రుచిరసాయకం – విస్ఫారయాణః – వేగేన – వజ్రాశనిసమస్వనమ్ ॥

అన్వయక్రమము :– రాక్షసేంద్రేణ సందిష్టః ప్రహస్తస్య సుతః, బలీ జంబుమాలీ ధనుర్ధరః, మహాదంష్ట్రః రక్తమాల్యాంబరధరః స్రగ్వీ, రుచిరకుండలః, మహాన్, చండః, సమరదుర్జయః వివృత్తనయనః, (సన్) శక్రధనుఃప్రఖ్యం, రుచిరసాయకం, వజ్రాశనిసమస్వనం, మహత్ ధనుః వేగేన విస్ఫారయాణః నిర్జగామ.

ప్రతిపదార్థము :– రాక్షసేంద్రేణ = రాక్షసాధిపుడైన రావణునిచే, సందిష్టః = ఆజ్ఞాపింప బడినవాడై, ప్రహస్తస్య = ప్రహస్తునియొక్క, సుతః = పుత్రుడు, బలీ = బలాఢ్యుడైన, జంబుమాలీ = జంబుమాలియనువాడు, ధనుర్ధరః = గొప్పధనుస్సును ధరించినవాడును, మహాదంష్ట్రః = పెద్దకోఱలు కలవాడును, రక్తమాల్యాంబరధరః = ఎఱ్ఱని పూలమాలికలను, వస్త్రములను ధరించినవాడును, రుచిరకుండలః = సుందరమైన కర్ణాభరణములు గలవాడును, మహాన్ = గొప్పవాడును, చండః = భీకరుడును, సమరదుర్జయః = యుద్ధమున జయింప శక్యముగాని వాడును,

వివృత్తనయనః (సన్) = తిరుగుడు కన్నులు గలవాడును అగుచు, శక్రధనుఃప్రఖ్యం = ఇంద్రధనుస్సుతో సమానమైనదియును, రుచిరసాయకం = సుందరమైన బాణము గలదియును, వజ్రాశనిసమస్వనం = పిడుగుతో సమానమైన ధ్వనిగలదియునగు, మహత్ = గొప్పదైన, ధనుః = ధనుస్సును, విస్ఫారయాణః = సారించుచున్నవాడై, నిర్జగామ = బయలువెడలెను.

తాత్పర్యము :- రాక్షసరాజైన రావణుడు ప్రహస్తుని పుత్రుడైన మహాబలాఢ్యుడగు జంబుమాలిని హనుమను ఎదుర్కొనుటకు ఆజ్ఞాపింపగా ఆతడు ధనుర్ధారియై యుద్ధమునకు బయలుదేరి వచ్చెను. ఆ జంబుమాలి భీకరమైన కోఱలును, ఎఱ్ఱని పూలమాలలను, వస్త్రములను, సుందరమైన హారములను మనోహరమైన కర్ణాభరణములను ధరించి, యుద్ధమునందు జయింపరానివాడుగను, భయంకరుడుగను మహావీరుడుగను కన్పట్టుచు తనగ్రుడ్లు త్రిప్పుచు ఇంద్రధనుస్సును బోలిన తన గొప్పధనుస్సును సుందరమైన బాణములతో చేత ధరించి పెద్దపిడుగు మ్రోతవంటి ధ్వనిగల్గునట్లుగా వేగముగ వింటినారిని మ్రోగించుచు బయలుదేరెను.

శ్లో॥ తస్య విస్ఫారఘోషేణ ధనుషో మహతా దిశః ।
ప్రదిశశ్చ నభశ్చైవ సహసా సమపూర్యత ॥ 4

పదచ్ఛేదము :- తస్య - విస్ఫారఘోషేణ - ధనుషః - మహతా - దిశః - ప్రదిశః - చ - నభః - చ - ఏవ - సహసా - సమపూర్యత ॥

అన్వయక్రమము :- తస్య ధనుషః మహతా విస్ఫారఘోషేణ దిశః, ప్రదిశః చ, నభః చ ఏవ సహసా సమపూర్యత.

ప్రతిపదార్థము :- తస్య = అతనియొక్క, ధనుషః = ధనుస్సుయొక్క, మహతా = గొప్పదైన, విస్ఫారఘోషేణ = సారించుటయొక్క ధ్వనిచే, దిశః = దిక్కులును, ప్రదిశః చ = విదిక్కులును, నభః చ ఏవ = ఆకాశముకూడను, సహసా = వెంటనే, సమపూర్యత = నిండింపబడెను.

తాత్పర్యము :- ఆ జంబుమాలి గావించిన గొప్పదైన ధనుష్టంకార ఘోషమునకు ఎనిమిది దిక్కులును, ఆకాశమును అంతయును వెంటనే పెద్దధ్వనితో నిండిపోయెను.

శ్లో॥ రథేన ఖరయుక్తేన త మాగత ముదీక్ష్య సః ।
హనుమా న్వేగసంపన్నో జహర్ష చ ననాద చ ॥ 5

పదచ్ఛేదము :- రథేన - ఖరయుక్తేన - తమ్ - ఆగతమ్ - ఉదీక్ష్య - సః -

హనుమాన్ - వేగసంపన్నః - జహర్ష - చ - ననాద - చ ॥

అన్వయక్రమము :- ఖరయుక్తేన రథేన ఆగతం తమ్ ఉదీక్ష్య సః హనుమాన్ వేగ సంపన్నః (సన్) జహర్ష చ ననాద చ.

ప్రతిపదార్థము :- ఖరయుక్తేన = గాడిదలతో కూడినట్టి, రథేన = రథముతో, ఆగతం = వచ్చిన, తం = ఆ జంబుమాలిని, ఉదీక్ష్య = వీక్షించి, సః హనుమాన్ = ఆ హనుమ, వేగసంపన్నః సన్ = వేగాధిక్యముగలవాడై, జహర్ష చ = సంతోషించెను మఱియు, ననాద చ = గర్జనము చేసెను కూడ.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- జహర్ష - తన శక్తికి అనురూపమైన శత్రువు ఇప్పుడు ప్రాప్తించినాడని హనుమ హర్షము నొందెనని భావము.

తాత్పర్యము :- గాడిదలు పూన్చిన రథము నధిష్ఠించి వచ్చియున్న ఆ జంబుమాలిని చూచి హనుమంతుడు గొప్ప శౌర్యోత్సాహము గలవాడై హర్షాతిరేకముతో సింహగర్జనము చేసెను.

శ్లో॥ తం తోరణవిటంకస్థం హనుమంతం మహాకపిమ్ ।
జంబుమాలీ మహాతేజా వివ్యాధ నిశితైశ్శరైః ॥ 6

పదచ్ఛేదము :- తం - తోరణవిటంకస్థం - హనుమంతం - మహాకపిమ్ - జంబుమాలీ - మహాతేజాః - వివ్యాధ - నిశితైః - శరైః ॥

అన్వయక్రమము :- తోరణవిటంకస్థం మహాకపిం తం హనుమంతం మహాతేజాః జంబుమాలీ నిశితైః శరైః వివ్యాధ.

ప్రతిపదార్థము :- తోరణవిటంకస్థం = బహిర్ద్వారముయొక్క మీదివాసముపై నిలచియున్న, మహాకపిం = వానరశ్రేష్ఠుడైన, తం హనుమంతం = ఆ హనుమను, మహాతేజాః = మహాప్రతాపవంతుడగు, జంబుమాలీ = జంబుమాలి, నిశితైః = వాడియైన, శరైః = బాణములతో, వివ్యాధ = కొట్టెను.

తాత్పర్యము :- ఆ భవనముయొక్క బహిర్ద్వారము మీది విశాలమైన కపోతపాలికపై భీకరాకారముతో నిలచియున్న ఆ హనుమపై మహావీరుడైన జంబుమాలి వాడియైన బాణములను కురిపించెను.

శ్లో॥ అర్ధచంద్రేణ వదనే శిర స్యేకేన కర్ణినా ।
బాహ్వోర్వివ్యాధ నారాచై ర్దశభి స్తం కపీశ్వరమ్ ॥ 7

పదచ్ఛేదము :- అర్ధచంద్రేణ - వదనే - శిరసి - ఏకేన - కర్ణినా - బాహ్వోః - వివ్యాధ - నారాచైః - దశభిః - తం - కపీశ్వరమ్ ॥

అన్వయక్రమము :- తం కపీశ్వరమ్ అర్ధచంద్రేణ వదనే కర్ణినా ఏకేన శిరసి, దశభిః నారాచైః బాహ్వోః వివ్యాధ.

ప్రతిపదార్థము :- తం కపీశ్వరమ్ = ఆ వానరశ్రేష్ఠుని, అర్ధచంద్రేణ = అర్ధచంద్రాకార బాణముతో, వదనే = ముఖమునందును, కర్ణినా = చెవులుగల, ఏకేన = ఒక బాణముతో, శిరసి = తలమీదను, దశభిః నారాచైః = పదిబాణములతో, బాహ్వోః = రెండుభుజములందును, వివ్యాధ = ప్రహరించెను.

తాత్పర్యము :- ఆ జంబుమాలి ఆ వానరశ్రేష్ఠుని గుఱిచూచి అర్ధచంద్రాకారమగు ఒక బాణముతో ముఖముమీదను, వాడియైన చెవులుగల ఒక్క బాణముతో శిరస్సునందును, పది బాణములతో భుజములమీదను ప్రహరించెను.

శ్లో॥ తస్య త చ్ఛుశుభే తామ్రం శరేణాభిహతం ముఖమ్ ।
శరదీ వాంబుజం ఫుల్లం విద్ధం భాస్కరరశ్మినా ॥ 8

పదచ్ఛేదము :- తస్య - తత్ - శుశుభే - తామ్రం - శరేణ - అభిహతం - ముఖమ్, శరది - ఇవ - అంబుజం - ఫుల్లం - విద్ధం - భాస్కరరశ్మినా ॥

అన్వయక్రమము :- శరేణ అభిహతం తస్య తామ్రం తత్ ముఖం శరది, భాస్కరరశ్మినా విద్ధం ఫుల్లమ్ అంబుజమ్ ఇవ శుశుభే.

ప్రతిపదార్థము :- శరేణ = బాణముచే, అభిహతం = కొట్టబడిన, తస్య = ఆ హనుమయొక్క, తామ్రం = ఎఱ్ఱనైన, తత్ ముఖం = ఆ ముఖము, శరది = శరత్కాలము నందు, భాస్కరరశ్మినా = సూర్యకిరణముచే, విద్ధం = భిన్నమైనదై, ఫుల్లమ్ = వికసించిన, అంబుజమ్ ఇవ = తామరపువ్వువలె, శుశుభే = శోభిల్లెను.

తాత్పర్యము :- జంబుమాలి ప్రయోగించిన బాణముయొక్క ఘాతముచే రక్తసిక్తమై ఎఱ్ఱబడియున్న హనుమ ముఖము శరత్కాలమునందు సూర్యకాంతి స్పర్శనొంది చక్కగా వికసించిన తామరపువ్వువలె ఎంతయో ప్రకాశించెను.

శ్లో॥ త త్తస్య రక్తం రక్తేన రంజితం శుశుభే ముఖమ్ ।
యథాఽఽకాశే మహాపద్మం సిక్తం చందనబిందుభిః ॥ 9

పదచ్ఛేదము :– తత్ – తస్య – రక్తం – రక్తేన – రంజితం – శుశుభే – ముఖమ్ – యథా – ఆకాశే – మహాపద్మం – సిక్తం – చందనబిందుభిః ॥

అన్వయక్రమము :– రక్తేన రంజితం తస్య తత్ రక్తం ముఖమ్ ఆకాశే చందనబిందుభిః సిక్తం మహాపద్మం యథా శుశుభే.

ప్రతిపదార్థము :– రక్తేన = నెత్తురుచే, రంజితం = పూయబడిన, తస్య = ఆ హనుమ యొక్క, రక్తం = ఎఱ్ఱనైయున్న, తత్ ముఖం = ఆ ముఖము, ఆకాశే = ఆకాశమున, చందనబిందుభిః = రక్తచందనబిందువులచే, సిక్తం = తడుపబడిన, మహాపద్మం యథా = గొప్పదైన పద్మమువలె, శుశుభే = శోభిల్లెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'చందనబిందుభిః' అనుటకు మాఱుగా కాంచనబిందుభిః అను పాఠాంతరము గలదు.

అశోకః కాంచనాహ్వయః – అశోకమునకు కాంచనమను పేరు గలదు. అందుచే రక్తాశోక పుష్పరస బిందువులచే అని అర్థము. మహాపద్మమ్ ఇవ – గొప్పదైన రక్తపద్మమువలె నున్నది. ఈ ఉపమను అభూతోపమ అందురు.

తాత్పర్యము :– నెత్తురు చారలతో ముఖమంతయు నిండి ఎఱ్ఱనై కానవచ్చుచున్న హనుమముఖము రక్తచందనబిందువులతో తడుపబడి ఆకాశమునందు వికసించి యున్న ఒక మహాపద్మమువలె ప్రకాశించెను.

శ్లో॥ చుకోప బాణాభిహతో రాక్షసేన మహాకపిః ।
తతః పార్శ్వేఽతివిపులాం దదర్శ మహతీం శిలామ్ ॥ 10

పదచ్ఛేదము :– చుకోప – బాణాభిహతః – రాక్షసేన – మహాకపిః – తతః – పార్శ్వే – అతివిపులాం – దదర్శ – మహతీం – శిలామ్ ॥

అన్వయక్రమము :– బాణాభిహతః మహాకపిః రాక్షసస్య చుకోప, తతః పార్శ్వే అతివిపులాం మహతీం శిలాం దదర్శ.

ప్రతిపదార్థము :– బాణాభిహతః = బాణముచే కొట్టబడినవాడై, మహాకపిః = వానరశ్రేష్ఠుడైన హనుమ, రాక్షసస్య = రాక్షసునిపై, చుకోప = కోపించెను, తతః = పిమ్మట, పార్శ్వే = ప్రక్కన, అతివిపులాం = మిక్కిలిపెద్దదై యున్న, మహతీం = గొప్పదైన, శిలాం = ఒక శిలను, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- అట్లు బాణములచే గాయపఱుపబడిన హనుమ రాక్షసునిపై క్రోధము నొంది ప్రక్కనే మిక్కిలి పెద్దదిగా నున్న ఒక పెద్ద ఱాతిబండను చూచెను.

శ్లో॥ తరసా తాం సముత్పాట్య చిక్షేప బలవద్బలీ ।
తాం శరై ర్దశభిః క్రుద్ధ స్తాడయామాస రాక్షసః ॥ 11

పదచ్ఛేదము :- తరసా - తం - సముత్పాట్య - చిక్షేప - బలవత్ - బలీ - తాం - శరైః - దశభిః - క్రుద్ధః - తాడయామాస - రాక్షసః ॥

అన్వయక్రమము :- బలీ (సః) తం తరసా సముత్పాట్య బలవత్ చిక్షేప, రాక్షసః క్రుద్ధః (సన్) తాం దశభిః శరైః తాడయామాస.

ప్రతిపదార్థము :- బలీ = బలాఢ్యుడైన, సః = ఆ హనుమ, తాం = ఆ శిలను, తరసా = వేగముగ, సముత్పాట్య = పెల్లగించి, బలవత్ = బలముగా, చిక్షేప = విసిరెను, రాక్షసః = జంబుమాలి, క్రుద్ధః (సన్) = కోపించినవాడై, దశభిః శరైః = పది బాణములతో, తాం = ఆ శిలను, తాడయామాస = కొట్టెను.

తాత్పర్యము :- వెంటనే మహాబలాఢ్యుడైన హనుమ ఆ ఱాతిబండను పెల్లగించి జంబుమాలిపై విసరెను. ఆతడును క్రోధముతో దానిని పదిబాణములచే ముక్కలు ముక్కలు చేసెను.

శ్లో॥ విపన్నం కర్మ తద్దృష్ట్వా హనుమాం శ్చండవిక్రమః ।
సాలం విపుల ముత్పాట్య భ్రామయామాస వీర్యవాన్ ॥ 12

పదచ్ఛేదము :- విపన్నం - కర్మ - తత్ - దృష్ట్వా - హనుమాన్ - చండవిక్రమః - సాలం - విపులమ్ - ఉత్పాట్య - భ్రామయామాస - వీర్యవాన్ ॥

అన్వయక్రమము :- చండవిక్రమః హనుమాన్ తత్ కర్మ విపన్నం దృష్ట్వా వీర్యవాన్ (సః) విపులం సాలం ఉత్పాట్య భ్రామయామాస.

ప్రతిపదార్థము :- చండవిక్రమః = భీకరమైన పరాక్రమము గల్గినట్టి, హనుమాన్ = హనుమ, తత్ కర్మ = ఆ పనిని, విపన్నం = చెడిపోయినదిగా, దృష్ట్వా = చూచి, వీర్యవాన్ సః = శౌర్యవంతుడైన ఆతడు, విపులం = విశాలమైనట్టి, సాలం = మద్దిచెట్టును, ఉత్పాట్య = పెల్లగించి, భ్రామయామాస = త్రిప్పుచుండెను.

తాత్పర్యము :- భీకరవిక్రముడైన ఆ హనుమ తాను గావించిన శిలాప్రయోగము వ్యర్థమగుట గాంచి వెంటనే అచట నున్న ఒక పెద్ద మద్దిచెట్టును పెల్లగించి దానిని గిరగిర త్రిప్పసాగెను.

శ్లో॥ భ్రామయంతం కపిం దృష్ట్వా సాలవృక్షం మహాబలమ్ ।
చిక్షేప సుబహూన్ బాణాన్ జంబుమాలీ మహాబలః ॥ 13

పదచ్ఛేదము :– భ్రామయంతం – కపిం – దృష్ట్వా – సాలవృక్షం – మహాబలమ్ – చిక్షేప – సుబహూన్ – బాణాన్ – జంబుమాలీ – మహాబలః ॥

అన్వయక్రమము :– సాలవృక్షం భ్రామయంతం మహాబలం కపిం దృష్ట్వా మహాబలః జంబుమాలీ సుబహూన్ బాణాన్ చిక్షేప.

ప్రతిపదార్థము :– సాలవృక్షం = మద్దిచెట్టును, భ్రామయంతం = త్రిప్పుచున్నట్టి, మహాబలం = మహాబలశాలియైన, కపిం = హనుమను, దృష్ట్వా = చూచి, మహాబలః = మహాబలాఢ్యుడైన, జంబుమాలీ = జంబుమాలి, సుబహూన్ = అనేకములైన, బాణాన్ = బాణములను, చిక్షేప = చిమ్మెను.

తాత్పర్యము :– మిక్కిలి పెద్దదైయున్న ఆ మద్దిచెట్టును అవలీలగా త్రిప్పుచున్న ఆ మహాబలశాలియైన హనుమను జూచి మహాబలాఢ్యుడైన జంబుమాలి దానిపై అనేకములైన బాణములను కురిపించెను.

శ్లో॥ సాలం చతుర్భి శ్చిచ్ఛేద వానరం పంచభి ర్భుజే ।
శిర స్యేకేన బాణేన దశభిస్తు స్తనాంతరే ॥ 14

పదచ్ఛేదము :– సాలం – చతుర్భిః – చిచ్ఛేద – వానరం – పంచభిః – భుజే – శిరసి – ఏకేన – బాణేన – దశభిః – తు – స్తనాంతరే ॥

అన్వయక్రమము :– చతుర్భిః సాలం చిచ్ఛేద; వానరం భుజే పంచభిః, శిరసి ఏకేన బాణేన, స్తనాంతరే దశభిః (వివ్యాధ).

ప్రతిపదార్థము :– చతుర్భిః = నాల్గుబాణములతో, సాలం = మద్దిచెట్టును, చిచ్ఛేద = ఛేదించెను, వానరం = హనుమను, భుజే = భుజమునందు, పంచభిః = ఐదింటితోడను, శిరసి = తలయందు, ఏకేన బాణేన = ఒక్క బాణముతోడను, స్తనాంతరే = స్తనములనడుమ, దశభిః = పదింటితోడను, (వివ్యాధ = కొట్టెను).

తాత్పర్యము :– అప్పుడు జంబుమాలి నాల్గుబాణములతో ఆ మద్దిచెట్టును ముక్కలుచేసి హనుమయొక్క భుజమును ఐదుబాణములతోను, తలను ఒక బాణముతోను, రొమ్మును పదిబాణములతోను కొట్టెను.

శ్లో॥ స శరైః పూరితతనుః క్రోధేన మహతా వృతః ।
తమేవ పరిఘం గృహ్య భ్రామయామాస వేగతః ॥ 15

పదచ్ఛేదము :– సః – శరైః – పూరితతనుః – క్రోధేన – మహతా – వృతః – తమ్ – ఏవ – పరిఘం – గృహ్య – భ్రామయామాస – వేగతః ॥

అన్వయక్రమము :– శరైః పూరితతనుః సః మహతా క్రోధేన వృతః, తం పరిఘమ్ ఏవ గృహ్య వేగతః భ్రామయామాస.

ప్రతిపదార్థము :– శరైః = బాణములతో, పూరితతనుః = నింపబడిన శరీరము కలిగినట్టి, సః = ఆ హనుమ, మహతా = గొప్పదైన, క్రోధేన = కోపముతో, వృతః = కూడినవాడై, తం పరిఘమ్ ఏవ = ఆ పరిఘమునే, గృహ్య = పట్టుకొని, వేగతః = వేగముగా, భ్రామయామాస = త్రిప్పెను.

తాత్పర్యము :– ఒడలినిండ బాణములు గ్రుచ్చుకొనగా తీవ్రమైన క్రోధమునొంది హనుమంతుడు వెనుకటి పరిఘమునే చేతబట్టి వేగముగా త్రిప్పదొడగెను.

శ్లో॥ అతివేగో ఽతివేగేన భ్రామయిత్వా బలోత్కటః ।
పరిఘం పాతయామాస జంబుమాలే ర్మహోరసి ॥ 16

పదచ్ఛేదము :– అతివేగః – బలోత్కటః – పరిఘమ్ – అతివేగేన – భ్రామయిత్వా – జంబుమాలేః – మహోరసి – పాతయామాస ॥

అన్వయక్రమము :– బలోత్కటః అతివేగః (సః) పరిఘమ్ అతివేగేన భ్రామయిత్వా జంబుమాలేః మహోరసి పాతయామాస.

ప్రతిపదార్థము :– బలోత్కటః = బలముచే తీవ్రమైనవాడును, అతివేగః = మహావేగము కలవాడునునైన, సః = ఆ హనుమ, పరిఘం = ఇనుపదూలమును, అతివేగేన = మహావేగముతో, భ్రామయిత్వా = త్రిప్పి, జంబుమాలేః = జంబుమాలియొక్క, మహోరసి = గొప్పదైన వక్షమున, పాతయామాస = విసిరెను.

తాత్పర్యము :– తీవ్రమైన బలముతో ప్రకాశించు ప్రతాపశాలియైన ఆ హనుమ తాను పూర్వము ఉపయోగించిన ఆ ఉక్కుదూలమునే తన చేతబట్టి అమితవేగముతో త్రిప్పుచు జంబుమాలియొక్క విశాలమైన రొమ్ముపై గురిచూచి విసిరెను.

శ్లో॥ తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ ।
న ధనుర్న రథో నాశ్వా స్తత్రాదృశ్యంత నేషవః ॥ 17

పదచ్ఛేదము :– తస్య – చ – ఏవ – శిరః – న – అస్తి – న – బాహూ – న – చ – జానునీ – న – ధనుః – న – రథః – న –అశ్వాః – తత్ర – అదృశ్యంత – న – ఇషవః ॥

అన్వయక్రమము :– తదా తత్ర తస్య శిరః చైవ నాస్తి; బాహూ న స్తః; జానునీ చ న స్తః; ధనుః నాస్తి; రథః నాస్తి; అశ్వాః న సంతి. ఇషవః న అదృశ్యంత.

ప్రతిపదార్థము :– (తదా = అప్పుడు) తస్య = ఆ జంబుమాలియొక్క, శిరః చైవ = తలయును, నాస్తి = లేకుండెను, బాహూ = రెండుభుజములును, న స్తః = లేకుండెను, జానునీ చ = మోకాళ్లును, న స్తః = లేకుండెను, రథః నాస్తి = రథము లేకుండెను, అశ్వాః = గుఱ్ఱములు, న సంతి = లేకుండెను, ఇషవః = బాణములు, న అదృశ్యంత = కానరాకుండెను.

తాత్పర్యము :– ఆ పరిఘము తనపై బడుటచే అప్పుడచ్చట ఆ జంబుమాలి శిరస్సుగాని బాహవులుగాని మోకాళ్లుగాని ధనుస్సుగాని రథము గాని, గాడిదలుగాని ఏమియు కానరాకుండెను.

శ్లో॥ స హత స్తరసా తేన జంబుమాలీ మహాబలః ।
పపాత నిహతో భూమౌ చూర్ణితాంగవిభూషణః ॥ 18

పదచ్ఛేదము :– సః – హతః – తరసా – తేన – జంబుమాలీ – మహాబలః – పపాత – నిహతః – భూమౌ – చూర్ణితాంగవిభూషణః ॥

అన్వయక్రమము :– తేన తరసా హతః, మహాబలః సః జంబుమాలీ నిహతః చూర్ణితాంగవిభూషణః సన్ భూమౌ పపాత.

ప్రతిపదార్థము :– తేన = ఆ హనుమచే, తరసా = బలముగా, హతః = కొట్టబడినవాడై, మహాబలః = మహాబలాఢ్యుడైన, సః జంబుమాలీ = ఆ జంబుమాలి, నిహతః = మరణించినవాడై, చూర్ణితాంగవిభూషణః సన్ = చూర్ణములైపోయిన అవయవములును ఆభరణములును గలవాడై, భూమౌ = నేలపై, పపాత = పడిపోయెను.

తాత్పర్యము :– హనుమ అట్లు బలముగా పరిఘముతో కొట్టగా మహాబలాఢ్యుడైన ఆ జంబుమాలి అసువులు గోల్పోయి నుగ్గునుగ్గు అయిన అవయవములతోను, అలంకారములతోను నేలపై కుప్పగూలెను.

శ్లో॥ జంబుమాలిం చ నిహతం కింకరాంశ్చ మహాబలాన్ ।
చుక్రోధ రావణః శ్రుత్వా కోపసంరక్తలోచనః ॥ 19

పదచ్ఛేదము :– జంబుమాలిం – చ – నిహతం – కింకరాన్ – చ – మహాబలాన్ – చుక్రోధ – రావణః – శ్రుత్వా – కోపసంరక్తలోచనః ॥

అన్వయక్రమము :- రావణః జంబుమాలిం చ నిహతం, మహాబలాన్ కింకరాన్ చ (నిహతాన్) శ్రుత్వా కోపసంరక్తలోచనః (సన్) చుక్రోధ.

ప్రతిపదార్థము :- రావణః = రావణుడు, జంబుమాలిం చ = జంబుమాలినిగూడ, నిహతం = చనిపోయినవానినిగాను, మహాబలాన్ = మహాబలశాలురైన, కింకరాన్ చ = కింకరాసురులనుగూడ, (నిహతాన్ = చనిపోయినవారినిగాను), శ్రుత్వా = విని, కోపసంరక్తలోచనః (సన్) = కోపముచే ఎఱ్ఱబారిన కన్నులు గలవాడగుచు, చుక్రోధ = క్రోధమునొందెను.

తాత్పర్యము :- రావణాసురుడు, తాను పంపిన జంబుమాలియు అమితబలశాలురైన కింకరాసురులు గూడ మడిసి రనువార్తను వినగానే కోపముచే ఎఱ్ఱబడిన కన్నులతో అమితమైన ఆవేశముతో తీవ్రముగా క్రోధము నొందెను.

శ్లో॥ స రోషసంవర్తితతామ్రలోచనః
ప్రహస్తపుత్రే నిహతే మహాబలే ।
అమాత్యపుత్రా నతివీర్యవిక్రమాన్
సమాదిదే శాశు నిశాచరేశ్వరః ॥ **20**

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"జంబుమాలివధో" నామ
చతుశ్చత్వారింశస్సర్గః.

పదచ్ఛేదము :- సః - రోషసంవర్తితతామ్రలోచనః - ప్రహస్తపుత్రే - నిహతే - మహాబలే - అమాత్యపుత్రాన్ - అతివీర్యవిక్రమాన్ - సమాదిదేశ - ఆశు - నిశాచరేశ్వరః ॥

అన్వయక్రమము :- మహాబలే ప్రహస్తపుత్రే నిహతే (సతి) సః నిశాచరేశ్వరః రోషసంవర్తితతామ్రలోచనః (సన్) ఆశు అతివీర్యవిక్రమాన్ అమాత్యపుత్రాన్ సమాదిదేశ.

ప్రతిపదార్థము :- మహాబలే = మహాబలాఢ్యుడైన, ప్రహస్తపుత్రే = ప్రహస్తుని పుత్రుడు, నిహతే సతి = చంపబడినవాడు కాగా, సః = ఆ, నిశాచరేశ్వరః = రాక్షసరాజైన రావణుడు, ఆశు = వెంటనే, అతివీర్యవిక్రమాన్ = మిక్కిలి శౌర్యపరాక్రమములు కలిగినట్టి, అమాత్యపుత్రాన్ = మంత్రిపుత్రులను, సమాదిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- మహాబలశాలియైన ప్రహస్తపుత్రుడు, హనుమచేతిలో మడియుట విని క్రోధముతో ఎఱ్ఱబారిన కన్నులు తిరిగిపోవుచుండగా వెంటనే ఆ రాక్షసరాజు అమితమైన శౌర్యపరాక్రమములు గల్గినట్టి తన మంత్రిపుత్రులను ఏడుగురిని హనుమను నిర్జించి రండని ఆజ్ఞాపించెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"జంబుమాలివధ" అను
నలుబదినాల్గవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

పంచచత్వారింశసర్గ

శ్లో॥ తత స్తే రాక్షసేంద్రేణ చోదితా మంత్రిణ స్సుతాః ।
నిర్యయు ర్భవనా త్తస్మాత్సప్త సప్తార్చివర్చసః ॥ 1

శ్లో॥ మహాబలపరీవారా ధనుష్మంతో మహాబలాః ।
కృతాస్త్రాస్త్రవిదాం శ్రేష్ఠాః పరస్పరజయైషిణః ॥ 2

శ్లో॥ హేమజాలపరిక్షిప్తై ర్ధ్వజవద్భిః పతాకిభిః ।
తోయదస్వననిర్ఘోషై ర్వాజియుక్తై ర్మహారథైః ॥ 3

శ్లో॥ తప్తకాంచనచిత్రాణి చాపా న్యమితవిక్రమాః ।
విస్ఫారయంత స్సంహృష్టా స్తటిత్వంత ఇవాంబుదాః ॥ 4

పదచ్ఛేదము :- తతః - తే - రాక్షసేంద్రేణ - చోదితాః - మంత్రిణః - సుతాః - నిర్యయుః - భవనాత్ - తస్మాత్ - సప్త - సప్తార్చివర్చసః. మహాబలపరీవారాః - ధనుష్మంతః - మహాబలాః - కృతాస్త్రాస్త్రవిదాం - శ్రేష్ఠాః - పరస్పరజయైషిణః - హేమజాలపరిక్షిప్తైః - ధ్వజవద్భిః - పతాకిభిః - తోయదస్వననిర్ఘోషైః - వాజియుక్తైః - మహారథైః - తప్తకాంచనచిత్రాణి - చాపాని - అమితవిక్రమాః - విస్ఫారయంతః - సంహృష్టాః - తటిత్వంతః - ఇవ - అంబుదాః ॥

అన్వయక్రమము :- తతః రాక్షసేంద్రేణ చోదితాః మంత్రిణః సుతాః మహాబలపరీవారాః, ధనుష్మంతః, మహాబలాః, కృతాస్త్రాస్త్రవిదాం శ్రేష్ఠాః, వరస్పరజయైషిణః సంతః, అమిత విక్రమాః, హేమజాలపరిక్షిప్తైః, ధ్వజవద్భిః, పతాకిభిః, తోయదస్వననిర్ఘోషైః, వాజియుక్తైః, మహారథైః తటిత్వంతః అంబుదాః ఇవ తప్తకాంచనచిత్రాణి చాపాని విస్ఫారయంతః, సప్తార్చివర్చసః తే సప్త తస్మాత్ భవనాత్ నిర్యయుః.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, రాక్షసేంద్రేణ = రాక్షసరాజైన రావణునిచే, చోదితాః = ప్రేరేపింపబడినవారై, మంత్రిణః = మంత్రియొక్క, సుతాః = పుత్రులు, మహాబలపరీవారాః = గొప్పదైన సైన్యపరివారము గలవారును, ధనుష్మంతః =

గొప్పధనుస్సులు గలవారును, మహాబలాః = గొప్పశక్తి గలవారును, కృతాస్త్రాస్త్రవిదాం = అస్త్రశిక్షణను పొందిన ధనుర్విద్యను నేర్చినవారిలో, శ్రేష్ఠాః = అధికులును, పరస్పరజయైషిణః = ఒకరినొకరు మించు కోరిక గలవారును, (సంతః = అగుచు) అమితవిక్రమాః = అనంతమైన పరాక్రమముగలవారై, హేమజాలపరిక్షిప్తైః = బంగరు జాలరులతో చుట్టబడినవియును, ధ్వజవద్భిః = గొప్పవైన ధ్వజస్తంభములు గలవియును, పతాకిభిః = శ్రేష్ఠమైన జెండాలు గలవియును, తోయదస్వననిర్ఘోషైః = మేఘముల ధ్వనులవంటి మహాశబ్దము గలవియును, వాజియుక్తైః = శ్రేష్ఠమైన గుఱ్ఱములతో కూడినవియునునగు, మహారథైః = గొప్పవైన రథములతోడ, తటిత్వంతః = మెఱపులతో కూడిన, అంబుదాః ఇవ = మేఘములవలె, తప్తకాంచనచిత్రాణి = కరిగిన బంగారు చిత్రములు కలిగినట్టి, చాపాని = ధనుస్సులను, విస్ఫారయంతః = టంకారముచేయుచు, సంప్రహృష్టాః = గొప్పహర్షముగలవారై, సప్తార్చివర్చసః = అగ్నిహోత్రముతో సమానమైన తేజస్సు గలిగినట్టి, తే సప్త = ఆ మంత్రిపుత్రులు ఏడుగురును, తస్మాత్ భవనాత్ = ఆ రావణుని భవనము నుండి, నిర్యయుః = బయలువెడలిరి.

తాత్పర్యము :- అటుపిమ్మట రాక్షసరాజైన రావణుడు ప్రేరేపింపగా అతని మంత్రి పుత్రులు ఏడుగురును అగ్నిహోత్రముతో సమానమైన తేజస్సుతో ప్రజ్వలించుచు, గొప్పసైన్యములను వెంటపెట్టుకొని గొప్పధనుస్సులను చేతబూని, మహాబలాఢ్యులైన తాము గొప్పదైన అస్త్రశిక్షను బొంది అస్త్రవిద్యలో శ్రేష్ఠులుగావున ఒకరిని మించి ఒకరు జయమును సంపాదించు కోరికగలవారై, అమితమైన తమపరాక్రమమును ప్రదర్శింపగోరి, బంగారుజాలరులతో అలంకరింపబడిన శ్రేష్ఠమైన ధ్వజములతోను పతాకములతోను విరాజిల్లుచు శ్రేష్ఠమైన గుఱ్ఱములు పూన్చినట్టి మేఘగర్జనములవంటి గొప్పధ్వని గలిగిన శ్రేష్ఠమైన రథములను ఆరోహించి, మెఱపుతీగలతో కూడిన మేఘమువలె మేలిమిబంగారు చిత్తరువులు గలిగిన దృఢమైన తమ ధనుస్సులను టంకారముచేయుచు, మహాహర్షముతో రావణుని భవనమునుండి హనుమమీదికి బయలుదేరిరి.

శ్లో॥ జనన్య స్తా స్తత స్తేషాం విదిత్వా కింకరాన్ హతాన్ ।
బభూవు శ్శోకసంభ్రాంతా స్సబాంధవసుహృజ్జనాః ॥ 5

పదచ్ఛేదము :- జనన్యః - తాః - తతః - తేషాం - విదిత్వా - కింకరాన్ - హతాన్ - బభూవుః - శోకసంభ్రాంతాః - సబాంధవసుహృజ్జనాః ॥

అన్వయక్రమము :- తేషాం తాః జనన్యః కింకరాన్ హతాన్ విదిత్వా తతః సబాంధవ

సుహృజ్జనాః శోకసంభ్రాంతాః బభూవుః.

ప్రతిపదార్థము :- తేషాం = ఆ మంత్రిపుత్రులయొక్క, తాః జనన్యః = ఆ కన్నతల్లులు, కింకరాన్ = కింకరాసురులను, హతాన్ = చంపబడినవారినిగా, విదిత్వా = తెలిసికొని, తతః = ఆ కారణమున, సబాంధవసుహృజ్జనాః = బంధుజనముతోడను మిత్రజనముతోడను కూడినవారై, శోకసంభ్రాంతాః = దుఃఖవిహ్వలురాండ్రు, బభూవుః = అయిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా.శిరోమణి :- తాః జనన్యః - పూర్వము నిహతులైన కింకరాసురుల యొక్క తల్లులు అని సింహావలోకనన్యాయముగ పూర్వవిషయము ఇచ్చట స్మరింపబడినదని గ్రహించవలెను.

సూచన :- మంత్రిణః సుతాః అని పూర్వము ఒక మంత్రియొక్క బిడ్డలే ఈ ఏడుగురు అని చెప్పబడినది కాబట్టి "తేషాం జనన్యః - అనగా వారితల్లులని బహువచనముతో ఇచ్చట చెప్పబడి యుండుటచే ప్రస్తుతము పేర్కొనబడిన తల్లులు మంత్రిపుత్రుల తల్లులుగారని శంకింప నక్కరలేదు. ఏలననగా ఆ మంత్రికే పెక్కుమంది భార్యలు ఉండవచ్చును. కాబట్టి మంత్రిపుత్రులకు తల్లులు పలువు రుండుట సమర్థనీయమే యగును.

తాత్పర్యము :- అప్పు డా మంత్రిపుత్రుల తల్లులు కింకరాసురు లంతటివారే హనుమచేతిలో చనిపోయిరని విని తమ బంధువులతోడను మిత్రులతోడను గూడ తమ పుత్రుల క్షేమవిషయమున అధైర్యముతో శోకవిహ్వల లగుచుండిరి.

శ్లో॥ తే పరస్పరసంఘర్షా స్తప్తకాంచనభూషణాః ।
అభిపేతు ర్హనూమంతం తోరణస్థమవస్థితమ్ ॥ 6

పదచ్ఛేదము :- తే - పరస్పరసంఘర్షాః - తప్తకాంచనభూషణాః - అభిపేతుః - హనూమంతం - తోరణస్థమ్ - అవస్థితమ్ ॥

అన్వయక్రమము :- పరస్పరసంఘర్షాః, తప్తకాంచనభూషణాః తే అవస్థితం, తోరణస్థం హనుమంతం అభిపేతుః.

ప్రతిపదార్థము :- పరస్పరసంఘర్షాః = ఒకరినొకరు త్రోసికొనుచున్నవారగుచు, తప్తకాంచనభూషణాః = మేలిమి బంగారు భూషణములు కలిగినట్టి, తే = ఆ మంత్రిపుత్రులు, అవస్థితం = నిశ్చలుడై, తోరణస్థం = బహిర్ద్వారమునం దున్నట్టి,

హనుమంతం = హనుమంతుని, అభిపేతుః = మీదబడిరి.

తాత్పర్యము :- మేలిమిబంగారు ఆభరణములను ధరించిన ఆ ఏడుగురు మంత్రి పుత్రులును ఒకరినొకరు త్రోసికొనుచు ఆ బహిర్ద్వారముపై నిశ్చింతగ కూర్చొనియున్న హనుమమీద పడిరి.

శ్లో॥ సృజంతో బాణవృష్టిం తే రథగర్జితనిస్వనాః ।
ప్రావృట్కాల ఇవాంభోదా విచేరు ర్నైరృతాంబుదాః ॥ 7

పదచ్ఛేదము :- సృజంతః - బాణవృష్టిం - తే - రథగర్జితనిస్వనాః - తే - ప్రావృట్కాలే - ఇవ - అంభోదాః - విచేరుః - నైరృతాంబుదాః ॥

అన్వయక్రమము :- ప్రావృట్కాలే అంభోదాః ఇవ తే నైరృతాంబుదాః రథగర్జితనిస్వనాః బాణవృష్టిం సృజంతః విచేరుః.

ప్రతిపదార్థము :- ప్రావృట్కాలే = వర్షాకాలమునందు, అంభోదాః ఇవ = మేఘములవలె, తే నైరృతాంబుదాః = ఆ మేఘములవంటి రాక్షసులు, రథగర్జితనిస్వనాః = ఉఱుములనెడు రథగర్జనములుగలవారై, బాణవృష్టిం = వర్షములవంటి బాణ పరంపరను, సృజంతః = కురిపించుచు, విచేరుః = సంచరించిరి.

తాత్పర్యము :- మేఘముల గుంపువంటి ఆ రాక్షసుల సమూహము, మేఘముల ఉఱుములవంటి రథములధ్వనితో వర్షపు జల్లులవంటి బాణపరంపరలను హనుమపై కురిపించుచు వర్షాకాలములోని మేఘములవలెనే అతనిమీది భాగమున తిరుగాడు చుండిరి.

శ్లో॥ అవకీర్ణ స్తత స్తాభి ర్హనుమా న్శరవృష్టిభిః ।
అభవ త్సంవృతాకార శ్శైలరాడివ వృష్టిభిః ॥ 8

పదచ్ఛేదము :- అవకీర్ణః - తతః - తాభిః - హనుమాన్ - శరవృష్టిభిః - అభవత్ - సంవృతాకారః - శైలరాట్ - ఇవ - వృష్టిభిః ॥

అన్వయక్రమము :- తతః హనుమాన్ తాభిః శరవృష్టిభిః అవకీర్ణః వృష్టిభిః శైలరాట్ ఇవ సంవృతాకారః అభవత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, హనుమాన్ = హనుమ, తాభిః శరవృష్టిభిః = ఆ బాణవర్షములచే, అవకీర్ణః = చుట్టుకొనబడినవాడై, వృష్టిభిః = వర్షములతో, శైలరాట్ ఇవ = పర్వతరాజువలె, సంవృతాకారః = కప్పబడిన స్వరూపము గలవాడుగ, అభవత్ = ఆయెను.

తాత్పర్యము :- అప్పు డా హనుమ మంత్రిపుత్రులు కురిపించిన బాణవర్షముచే మూయబడి వర్షముతో కప్పబడియున్న హిమపర్వతమువలె తన రూపము ఇతరులకు గాన్పించనివాడుగా నుండెను.

శ్లో॥ స శరా న్మోఘయామాస తేషా మాశుచరః కపిః ।
రథవేగం చ వీరాణాం విచర న్విమలే ఽంబరే ॥ 9

పదచ్ఛేదము :- సః - శరాన్ - మోఘయామాస - తేషామ్ - ఆశుచరః - కపిః - రథవేగం - చ - వీరాణాం - విచరన్ - విమలే - అంబరే ॥

అన్వయక్రమము :- ఆశుచరః సః కపిః విమలే అంబరే విచరన్, తేషాం వీరాణాం శరాన్, రథవేగం చ మోఘయామాస.

ప్రతిపదార్థము :- ఆశుచరః = వేగముగా చలించు, సః కపిః = ఆ హనుమ, విమలే = నిర్మలమైనట్టి, అంబరే = ఆకాశమున, విచరన్ = వేగముగ తిరుగుచు, తేషాం వీరాణాం = ఆ వీరులయొక్క, శరాన్ = బాణములను, రథవేగం చ = రథవేగమును గూడ, మోఘయామాస = వమ్ముచేసెను.

తాత్పర్యము :- అతివేగముగ చలించు నైపుణ్యముగల ఆ హనుమ విశాలమైన ఆకాశముపై వడిగా తిరుగుచు ఆ శత్రువీరులు కురిపించు బాణములను తనను ఆంటకుండగా చేసికొనుచు వారి శరములు, రథవేగము గూడ వ్యర్థము అగునట్లు చేసెను.

శ్లో॥ స తైః క్రీడ న్ధనుష్మద్భి ర్వ్యోమ్ని వీరః ప్రకాశతే ।
ధనుష్మద్భి ర్యథా మేఘై ర్మారుతః ప్రభురంబరే ॥ 10

పదచ్ఛేదము :- సః - తైః - క్రీడన్ - ధనుష్మద్భిః - వ్యోమ్ని - వీరః - ప్రకాశతే - ధనుష్మద్భిః - యథా - మేఘైః - మారుతః - ప్రభుః - అంబరే ॥

అన్వయక్రమము :- సః వీరః తైః ధనుష్మద్భిః వ్యోమ్ని క్రీడన్, అంబరే ధనుష్మద్భిః మేఘైః క్రీడన్ ప్రభుః మారుతః యథా ప్రకాశతే.

ప్రతిపదార్థము :- సః వీరః = ఆ వీరుడైన హనుమ, తైః ధనుష్మద్భిః = ధనుర్ధారులైన ఆ వీరులతో, వ్యోమ్ని = ఆకసమున, క్రీడన్ = క్రీడించుచు, అంబరే = ఆకసమునందు, ధనుష్మద్భిః = ఇంద్రధనుస్సులతో కూడిన, మేఘైః = మేఘములతో, క్రీడన్ = ఆడుచున్న, ప్రభుః మారుతః యథా = ప్రభావశాలియైన వాయుదేవునివలె, ప్రకాశతే = ప్రకాశించు చుండెను.

తాత్పర్యము :– అప్పుడు వీరుడైన హనుమ ఆకసమునందు గొప్పధనుస్సులను చేతబూనిన ఆ వీరులతో రణక్రీడ గావించుచు ఆకాశమునందు ఇంద్రధనుస్సులతో ప్రకాశించుచున్న మేఘములతో స్వేచ్ఛగ విహరించుచున్న ప్రభావసంపన్నుడైన వాయుదేవుని వలెనే ప్రకాశించు చుండెను.

శ్లో॥ స కృత్వా నినదం ఘోరం త్రాసయంస్తాం మహాచమూమ్ ।
చకార హనుమా న్వేగం తేషు రక్షస్సు వీర్యవాన్ ॥ 11

పదచ్ఛేదము :– సః – కృత్వా – నినదం – ఘోరం – త్రాసయన్ – తాం – మహాచమూమ్ – చకార – హనుమాన్ – వేగం – తేషు – రక్షస్సు – వీర్యవాన్ ॥

అన్వయక్రమము :– వీర్యవాన్ సః హనుమాన్ తాం మహాచమూం త్రాసయన్ ఘోరం నినదం కృత్వా తేషు రక్షస్సు వేగం చకార.

ప్రతిపదార్థము :– వీర్యవాన్ = పరాక్రమవంతుడైనట్టి, సః హనుమాన్ = ఆ హనుమ, తాం మహాచమూం = ఆ మహాసైన్యమును, త్రాసయన్ = భయపెట్టుచు, ఘోరం = భీకరమైన, నినదం = గర్జనమును, కృత్వా = చేసి, తేషు రక్షస్సు = ఆ రాక్షసుల విషయమున, వేగం = తీవ్రతను, చకార = చేసెను.

తాత్పర్యము :– మహాపరాక్రమశాలియైన ఆ హనుమ సైన్యసమూహమును భయగ్రస్తము గావించుచు భీకరముగ గర్జించి ఆ రాక్షసవీరుల విషయమున గొప్ప తీవ్రత చూపించుచు విజృంభించెను.

శ్లో॥ తలేనాభ్యహన త్కాంశ్చిత్పద్భ్యాం కాంశ్చిత్పరంతపః ।
ముష్టినాభ్యహన త్కాంశ్చిన్నఖైః కాంశ్చిద్వ్యదారయత్ ॥ 12

పదచ్ఛేదము :– తలేన – అభ్యహనత్ – కాంశ్చిత్ – పద్భ్యాం – కాంశ్చిత్ – పరంతపః – ముష్టినా – అభ్యహనత్ – కాంశ్చిత్ – నఖైః – కాంశ్చిత్ – వ్యదారయత్ ॥

అన్వయక్రమము :– పరంతపః (సః) కాంశ్చిత్ తలేన అభ్యహనత్, కాంశ్చిత్ పద్భ్యాం (అభ్యహనత్), కాంశ్చిత్ ముష్టినా అభ్యహనత్, కాంశ్చిత్ నఖైః వ్యదారయత్.

ప్రతిపదార్థము :– పరంతపః = శత్రువులను తపింపజేయునట్టి, (సః = ఆ హనుమ) కాంశ్చిత్ = కొంతమందిని, తలేన = అరచేతితో, అభ్యహనత్ = మోదెను, కాంశ్చిత్ = కొందఱిని, పద్భ్యాం = పాదములతో, (అభ్యహనత్ = తన్నెను) కాంశ్చిత్ = కొంతమందిని, ముష్టినా = పిడికిటితో, అభ్యహనత్ = పొడిచెను, కాంశ్చిత్ = కొంతమందిని, నఖైః = గోళ్లతో, వ్యదారయత్ = చీల్చెను.

తాత్పర్యము :- శత్రుమర్దనుడైన హనుమ అప్పుడట్లు విజృంభించి శత్రుసైన్యములోని కొందఱు రక్కసులను తన అఱచేతితో మోదెను. మఱికొందఱిని కాళ్లతో క్రుమ్మెను. మఱికొందఱిని పిడికిటితో పొడిచెను. మఱికొందఱిని తనగోళ్లతో చీల్చెను.

శ్లో॥ ప్రమమా థోరసా కాంశ్చి దూరుభ్యా మపరా న్కపిః ।
కేచి త్తస్య నినాదేన తత్రైవ పతితా భువి ॥ 13

పదచ్ఛేదము :- ప్రమమాథ - ఉరసా - కాంశ్చిత్ - ఊరుభ్యాం - అపరాన్ - కపిః - కేచిత్ - తస్య - నినాదేన - తత్ర - ఏవ - పతితాః - భువి ॥

అన్వయక్రమము :- (సః) కపిః కాంశ్చిత్ ఉరసా ప్రమమాథ. కేచిత్ తస్య నినాదేన తత్ర ఏవ భువి పతితాః.

ప్రతిపదార్థము :- (సః) కపిః = ఆ హనుమ, కాంశ్చిత్ = కొంతమందిని, ఉరసా = ఱొమ్ముతో, ప్రమమాథ = రూపడచెను, అపరాన్ = మిగిలినవారిని, ఊరుభ్యాం = తొడలతో, ప్రమమాథ = చంపెను, కేచిత్ = కొంతమంది, తస్య = ఆ హనుమ యొక్క, నినాదేన = గర్జనచేత, తత్ర ఏవ = అచ్చటనే, భువి = నేలపై, పతితాః = పడిపోయిరి.

తాత్పర్యము :- అప్పు డా హనుమ కొందఱిని తన ఱొమ్ముతో నొక్కి నలిపివేసెను. మఱికొందఱిని తన తొడలతో నొక్కి నలిపివేసెను. ఇక కొంతమంది ఆతని సింహగర్జనకు అసువులు బాసి అచ్చటనే నేలగూలిరి.

శ్లో॥ తత స్తే ష్వవసన్నేషు భూమౌ నిపతితేషు చ ।
త త్సైన్య మగమ త్సర్వం దిశో దశ భయార్దితమ్ ॥ 14

పదచ్ఛేదము :- తతః - తేషు - అవసన్నేషు - భూమౌ - నిపతితేషు - చ - తత్ - సైన్యమ్ - అగమత్ - సర్వం - దిశః - దశ - భయార్దితమ్ ॥

అన్వయక్రమము :- తతః తేషు అవసన్నేషు భూమౌ నిపతితేషు (సత్సు) తత్ సర్వం సైన్యం భయార్దితమ్ (సత్) దశ దిశః అగమత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, తేషు = ఆ రక్కసులు, అవసన్నేషు = నశించిన వారును, భూమౌ = నేలపై, నిపతితేషు = పడిపోయిన వారును, (సత్సు = అగుచుండగా) తత్ సర్వం సైన్యం = ఆ సమస్తమైన సైన్యమును, భయార్దితమ్ (సత్) = భయముచే పీడింపబడినదై, దశ దిశః = పదిదిక్కులకును, అగమత్ = పోయెను.

తాత్పర్యము :- అప్పుడారీతిగా, ఆ రాక్షస సైనికులు శక్తిహీనులై నేలపై గూలుచుండగా ఆ సైన్యమంతయు భయవిహ్వలమై ఎల్లదిక్కులకును పరుగిడిపోయెను.

శ్లో॥ వినేదు ర్విస్వరం నాగా నిపేతు ర్భువి వాజినః ।
భగ్ననీడ ధ్వజచ్ఛత్రైర్భూశ్చ కీర్ణాఽభవద్రథైః ॥ 15

పదచ్ఛేదము :- వినేదుః - విస్వరం - నాగాః - నిపేతుః - భువి - వాజినః - భగ్ననీడధ్వజచ్ఛత్రైః - భూః - చ - కీర్ణా - అభవత్ - రథైః ॥

అన్వయక్రమము :- నాగాః విస్వరం వినేదుః; వాజినః భువి నిపేతుః; భగ్ననీడ ధ్వజచ్ఛత్రైః రథైః భూః కీర్ణా అభవత్ చ.

ప్రతిపదార్థము :- నాగాః = ఏనుగులు, విస్వరం = వికృతమైన స్వరముతో, వినేదుః = అఱచినవి, వాజినః = గుఱ్ఱములు, భువి = నేలపై, నిపేతుః = పడినవి, భగ్ననీడ ధ్వజచ్ఛత్రైః = విఱిగిపోయిన కప్పులును ధ్వజములును గొడుగులును కలిగినట్టి, రథైః = రథములతో, భూః = భూమి, కీర్ణా = నిండినది, అభవత్ = ఆయెను.

తాత్పర్యము :- అప్పుడు అచ్చట ఏనుగులు వికారమైన స్వరముతో ఘీంకారములు చేసినవి. గుఱ్ఱములు నేలపై కూలినవి. కప్పులును ధ్వజములును ఛత్రములును ముక్కలైపోగా అట్లు భగ్నములైన రథములతో ఆ ప్రదేశమంతయు నిండిపోయి యుండెను.

శ్లో॥ స్రవతా రుధిరే ణాథ స్రవంత్యో దర్శితాః పథి ।
వివిధైశ్చ స్వనై ర్లంకా ననాద వికృతం తదా ॥ 16

పదచ్ఛేదము :- స్రవతా - రుధిరేణ - అథ - స్రవంత్యః - దర్శితాః - పథి - వివిధైః - చ - స్వనైః - లంకా - ననాద - వికృతం - తదా ॥

అన్వయక్రమము :- అథ పథి స్రవతా రుధిరేణ స్రవంత్యః దర్శితాః; తదా వివిధైః స్వనైః లంకా వికృతం ననాద.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, పథి = మార్గమునందు, స్రవతా = పారుచున్న, రుధిరేణ = రక్తముతో, స్రవంత్యః = ఏఱులు, దర్శితాః = చూపబడినవి, తదా = అప్పుడు, వివిధైః = బహువిధములైన, స్వనైః = ధ్వనులతో, లంకా = లంకానగరము, వికృతం = వికృతముగా, ననాద = ఘోషిల్లెను.

తాత్పర్యము :- అప్పుడచటి మార్గమునందు ప్రవహించుచున్న రక్తపు టేఱులు గానవచ్చినవి. లంకానగరము అంతయు పశువుల పక్షుల రక్కసుల అఱపులతో

మిక్కిలి వికృతముగా నాక్రోశించినది.

శ్లో॥ స తా న్ప్రవృద్ధా న్వినిహత్య రాక్షసాన్
మహాబల శ్చండపరాక్రమః కపిః ।
యుయుత్సు రన్యైః పునరేవ రాక్షసైః
తదేవ వీరో ఽభిజగామ తోరణమ్ ॥ 17

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"అమాత్యపుత్రవధో" నామ
పంచచత్వారింశస్సర్గః.

పదచ్ఛేదము :– సః – తాన్ – ప్రవృద్ధాన్ – వినిహత్య – రాక్షసాన్ – మహాబలః – చండపరాక్రమః – కపిః – యుయుత్సుః – అన్యైః – పునః – ఏవ – రాక్షసైః – తత్ – ఏవ – వీరః – అభిజగామ – తోరణమ్ ॥

అన్వయక్రమము :– మహాబలః, చండపరాక్రమః సః వీరః కపిః ప్రవృద్ధాన్ రాక్షసాన్ వినిహత్య, పునః ఏవ అన్యైః రాక్షసైః యుయుత్సుః, తత్ తోరణమేవ అభిజగామ.

ప్రతిపదార్థము :– మహాబలః = మహాబలాఢ్యుడును, చండపరాక్రమః = భీకరమైన విక్రమము గలవాడునగు, వీరః = వీరుడైనట్టి, సః కపిః = ఆ హనుమ, ప్రవృద్ధాన్ = పెచ్చుపెరిగిన, రాక్షసాన్ = ఆ రాక్షసులను, వినిహత్య = పరిమార్చి, పునరేవ = మఱలగూడ, అన్యైః రాక్షసైః = ఇతరులైన రక్కసులతో, యుయుత్సుః = యుద్ధము చేయుకోరిక గలవాడై, తత్ తోరణమ్ ఏవ = ఆ బహిర్ద్వారమునే, అభిజగామ = చేరుకొనెను.

తాత్పర్యము :– మహాబలశాలియు భీకరపరాక్రమోపేతుడును అగు మహావీరుడైన ఆ హనుమ అట్లు తనమీదికి చెలరేగి వచ్చిన ఆ రక్కసుల నందఱను ఉక్కడగించి ఇంకను అచ్చటి రాక్షసవీరులతో పోరాడవలెనని కుతూహలముతో ఇదివఱకటినుండియు కూర్చునియున్న ఆ బహిర్ద్వారమునే చేరుకొనెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"అమాత్యపుత్రవధ" అను నలుబదియైదవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

షట్చత్వారింశసర్గ

శ్లో॥ హతా న్మంత్రిసుతా న్బుద్ధ్వా వానరేణ మహాత్మనా ।
రావణ స్సంవృతాకార శ్చకార మతి ముత్తమామ్ ॥ 1

పదచ్ఛేదము :- హతాన్ - మంత్రిసుతాన్ - బుద్ధ్వా - వానరేణ - మహాత్మనా - రావణః - సంవృతాకారః - చకార - మతిమ్ - ఉత్తమామ్ ॥

అన్వయక్రమము :- మహాత్మనా వానరేణ మంత్రిసుతాన్ హతాన్ బుద్ధ్వా రావణః సంవృతాకారః (సన్) ఉత్తమాం మతిం చకార.

ప్రతిపదార్థము :- మహాత్మనా = మహనీయుడైనట్టి, వానరేణ = హనుమచే, మంత్రిసుతాన్ = మంత్రిపుత్రులను, హతాన్ = చంపబడిన వారినిగా, బుద్ధ్వా = తెలిసికొని, రావణః = రావణుడు, సంవృతాకారః = దాచుకొనబడిన స్వరూపము గలవాడై, ఉత్తమాం = యోగ్యమైన, మతిం = ఆలోచనను, చకార = చేసెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- సంవృతాకారః - అణుచుకొనిన లోపలనున్న భయముగలవాడు.

తాత్పర్యము :- మహావీరుడైన హనుమచేతిలో తాను పంపిన మంత్రిసుతులెల్లరును హతమారినట్లు తెలిసికొని రావణుడు తనమనస్సులో గలిగిన భయమును, శంకలను పైకి కనపడకుండ అణచుకొని భావికార్యమును గూర్చి ధైర్యముతో ఆలోచనమును గావించెను.

శ్లో॥ స విరూపాక్షయూపాక్షౌ దుర్ధర్షం చైవ రాక్షసమ్ ।
ప్రఘసం భాసకర్ణం చ పంచ సేనాగ్రనాయకాన్ ॥ 2

శ్లో॥ ఆదిదేశ దశగ్రీవో వీరా న్నయవిశారదాన్ ।
హనూమద్గ్రహణే వ్యగ్రా న్వాయువేగసమాన్యుధి ॥ 3

పదచ్ఛేదము :- సః - విరూపాక్షయూపాక్షౌ - దుర్ధర్షం చ - ఏవ - రాక్షసమ్ -

ప్రఘసం - భాసకర్ణం - చ - పంచ - సేనాగ్రనాయకాన్ - ఆదిదేశ - దశగ్రీవః - వీరాన్ - నయవిశారదాన్ - హనూమద్గ్రహణే - వ్యగ్రాన్ - వాయువేగసమాన్ - యుధి ॥

అన్వయక్రమము :- సః దశగ్రీవః వీరాన్, నయవిశారదాన్, హనూమద్గ్రహణే వ్యగ్రాన్, యుధి వాయువేగసమాన్ విరూపాక్షయూపాక్షౌ రాక్షసం దుర్ధర్షం చైవ, ప్రఘసం, భాసకర్ణం చ పంచసేనాగ్రనాయకాన్ ఆదిదేశ.

ప్రతిపదార్థము :- సః దశగ్రీవః = ఆ దశకంఠుడు, వీరాన్ = శూరులును, నయవిశారదాన్ = యుద్ధనీతికోవిదులును, హనూమద్గ్రహణే = హనుమను బంధించుటయందు, వ్యగ్రాన్ = తీవ్రమైన వాంఛగలవారును, యుధి = యుద్ధమునందు, వాయువేగసమాన్ = వాయువుతో సమానమైన వేగముగలవారును అగు, విరూపాక్షయూపాక్షౌ = విరూపాక్షుని, యూపాక్షుని, రాక్షసం = రాక్షసశ్రేష్ఠుడైన, దుర్ధర్షం = దుర్ధర్షుని, ప్రఘసం = ప్రఘసుని, భాసకర్ణం చ = భాసకర్ణుని, పంచ = ఐదుగురు, సేనాగ్రనాయకాన్ = సేనాధిపతులను, అదిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- అప్పుడు దశకంఠుడు వెంటనే విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధర్షుడు, ప్రఘసుడు, భాసకర్ణుడు అనెడు మహావీరులును, యుద్ధనీతివిశారదులును, హనుమంతుని బంధించి తెచ్చుటకై వేగిరపడుచున్నవారును, యుద్ధమున వాయుదేవునితో సమానమైన చురుకుదనము గలవారును అగు తన ప్రధాన సైన్యాధికారులైన ఐదుగురిని హనుమంతునితో పోరుటకై ఆజ్ఞాపించెను.

శ్లో॥ యాత సేనాగ్రగా స్సర్వే మహాబలపరిగ్రహాః ।
సవాజిరథమాతంగా స్స కపి శ్శాస్యతామితి ॥ 4

పదచ్ఛేదము :- యాత - సేనాగ్రగాః - సర్వే - మహాబలపరిగ్రహాః - సవాజిరథ మాతంగాః - సః - కపిః - శాస్యతామ్ - ఇతి ॥

అన్వయక్రమము :- హే సేనాగ్రగాః యూయం సర్వే మహాబలపరిగ్రహాః సవాజిరథమాతంగాః యాత; సః కపిః శాస్యతామ్ ఇతి (ఆదిదేశ).

ప్రతిపదార్థము :- హే సేనాగ్రగాః = ఓ సైన్యాధిపతులారా (యూయం=మీరు) సర్వే = అందరును, మహాబలపరిగ్రహాః = గొప్పదైన సైన్యమును వెంటనిడుకొనినవారై, సవాజిరథమాతంగాః = గుఱ్ఱములతోడను రథములతోడను, ఏనుగులతోడను గూడిన వారగుచు, యాత = వెడలుడు, సః కపిః = ఆ వానరుడు, శాస్యతాం = శిక్షింపబడుగాక! ఇతి = అని, ఆదిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :– ఓ సైన్యాధిపతులారా! మీరెల్లరును కలసి ఆవశ్యకమైన మహాసైన్యమును వెంటబెట్టుకొని కావలసినన్ని మన ఏనుగులను, గుఱ్ఱములను, రథములను గైకొని ఆ వానరుని మీదకు పోయి ఆతనిని దండించిరావలెను.

శ్లో॥ యత్తైశ్చ ఖలు భావ్యం స్యాత్త మాసాద్య వనాలయమ్ ।
కర్మ చాపి సమాధేయం దేశకాలావిరోధితమ్ ॥ 5

పదచ్ఛేదము :– యత్తైః – చ – ఖలు – భావ్యం – స్యాత్ – తమ్ – ఆసాద్య – వనాలయమ్ – కర్మ – చ – అపి – సమాధేయం – దేశకాలావిరోధితమ్ ॥

అన్వయక్రమము :– తం వనాలయం ఆసాద్య యత్తైః భావ్యం స్యాత్ ఖలు! కర్మ చ అపి దేశకాలావిరోధితం సమాధేయమ్.

ప్రతిపదార్థము :– తం వనాలయం = ఆ వానరుని, ఆసాద్య = చేరి, యత్తైః = జాగరూకులై, భావ్యం స్యాత్ ఖలు = యుండవలెను సుమీ!, కర్మ చ అపి = పనిగూడ, దేశకాల అవిరోధితం = దేశమునకును కాలమునకును విరోధింపనిదిగా, సమాధేయం = చేయవలసినది.

తాత్పర్యము :– మీ రా వానరునితో తలపడునప్పుడు అతిజాగరూకులుగా మెలగవలయును సుమీ! అచ్చట మీరు చేయు కృత్యము కూడ దేశకాలములకు విరుద్ధముగాకుండ సముచితముగనే నిర్వహింపవలసియున్నది.

శ్లో॥ న హ్యహం తం కపిం మన్యే కర్మణా ప్రతితర్కయన్ ।
సర్వథా తన్మహద్భూతం మహాబలపరిగ్రహమ్ ॥ 6

పదచ్ఛేదము :– న – హి – అహం – తం – కపిం – మన్యే – కర్మణా – ప్రతితర్కయన్ – సర్వథా – తత్ – మహత్ – భూతం – మహాబలపరిగ్రహమ్ ॥

అన్వయక్రమము :– కర్మణా ప్రతితర్కయన్ అహం తం కపిం న హి మన్యే, తత్ సర్వథా మహాబలపరిగ్రహం మహత్ భూతమ్ (స్యాత్).

ప్రతిపదార్థము :– కర్మణా = కృత్యముచే, ప్రతితర్కయన్ = ఆలోచించుచు, అహం = నేను, తం = అతనిని, కపిం = వానరునిగా, న హి మన్యే = ఎంతమాత్రమును అనుకొనను, సర్వథా = ఎల్లవిధముల, తత్ = ఆయది, మహాబలపరిగ్రహం = గొప్పదైన, భూతం = భూతము, స్యాత్ = అగును.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా.శిరోమణి :– మహాబలపరిగ్రహం – తనను చుట్టుముట్టిన మహాసైన్యములను విధ్వంసము చేయునట్టిది అని అర్థము.

తాత్పర్యము :– అతడు గావించిన భీకరకృత్యములనుబట్టి చూచినచో ఆతడు కేవలము వానరమాత్రుడు గాడని భావించుచున్నాను. సర్వవిధముల ఆతడు మహాశక్తి సంపన్నుడైనట్టి ఒక మహాభూతమై యుండవలెను.

శ్లో॥ వానరోఽయ మితి జ్ఞాత్వా న హి శుధ్యతి మే మనః ।
నై వాహం తం కపిం మన్యే యథేయం ప్రస్తుతా కథా ॥ 7

పదచ్ఛేదము :– వానరః – అయమ్ – ఇతి – జ్ఞాత్వా – న – హి – శుధ్యతి – మే – మనః – న – ఏవ – అహం – తం – కపిం – మన్యే – యథా – ఇయం – ప్రస్తుతా – కథా ॥

అన్వయక్రమము :– మే మనః అయం వానరః ఇతి జ్ఞాత్వా న హి శుధ్యతి, యథా ఇయం ప్రస్తుతా కథా (తథా) అహం తం కపిం నైవ మన్యే.

ప్రతిపదార్థము :– మే = నా యొక్క, మనః = మనస్సు, అయం = ఈతడు, వానరః = వానరుడు, ఇతి = అని, జ్ఞాత్వా = తెలిసికొని, న హి శుధ్యతి = శాంతి నొందుట లేదు, యథా = ఏరీతిని, ఇయం = ఈ, ప్రస్తుతా = ప్రస్తుతపు, కథా = వ్యవహారము, (దృశ్యతే = కాన్పించుచున్నదో) తథా = ఆ రీతిని, తం = ఆతనిని, కపిం = వానరునిగా, నైవ మన్యే = ఎంతమాత్రము తలచను.

తాత్పర్యము :– ఈత డొక వానరుడని తెలిసికొని నేను మనస్సులో తృప్తిపడలేకున్నాను. ప్రస్తుతము జరుగుచున్న భీకరకృత్యములనుబట్టి ఈతడు వానరమాత్రుడని నే నెంతమాత్రము విశ్వసింపజాలను.

సూచన : – ఈ శ్లోకము కొన్ని ప్రతులలో గానవచ్చుటలేదు.

శ్లో॥ భవే దింద్రేణ వా సృష్ట మస్మదర్థం తపోబలాత్ ।
సనాగయక్షగంధర్వా దేవాసురమహర్షయః ॥ 8

శ్లో॥ యుష్మాభిః ప్రహితైః స్సర్వై ర్మయా సహ వినిర్జితాః ।
తై రవశ్యం విధాతవ్యం వ్యలీకం కించిదేవ నః ॥ 9

పదచ్ఛేదము :– భవేత్ – ఇంద్రేణ – వా సృష్టమ్ – అస్మదర్థం – తపోబలాత్ –

సనాగయక్షగంధర్వాః – దేవాసురమహర్షయః – యుష్మాభిః – ప్రహితైః – సర్వైః – మయా – సహ – వినిర్జితాః. తైః – అవశ్యం – విధాతవ్యం – వ్యలీకం – కించిత్ – ఏవ – నః ॥

అన్వయక్రమము :– అస్మదర్థమ్ ఇంద్రేణ తపోబలాత్ (ఇదం) సృష్టం భవేత్; మయా ప్రహితైః యుష్మాభిః మయా సహ సనాగయక్షగంధర్వాః, దేవాసురమహర్షయః వినిర్జితాః; అవశ్యం నః కించిత్ ఏవ వ్యలీకం తైః విధాతవ్యమ్.

ప్రతిపదార్థము :– అస్మదర్థం = మాకొఱకై, ఇంద్రేణ = దేవేంద్రునిచే, తపోబలాత్ = తపశ్శక్తివలన, ఇదం = ఈ మహాభూతము, సృష్టం = సృజింపబడినది, భవేత్ = కావచ్చును, మయా = నాచేత, ప్రహితైః = పంపబడినట్టి, యుష్మాభిః = మీచేత, మయా సహ = నాతోగలసి, సనాగయక్షగంధర్వాః = నాగులతోడను యక్షులతోడను గంధర్వులతోడను కూడినట్టి, దేవాసురమహర్షయః = దేవతలును, రాక్షసులును మహర్షులును, వినిర్జితాః = ఓడింపబడియుండిరి, అవశ్యం = తప్పనిసరిగా, తైః ఏవ = వారిచేతనే, (ఇదం = ఈ) కించిత్ = ఏదోఒక, వ్యలీకం = అప్రియము, నః = మనకు, విధాతవ్యమ్ = చేయబడియుండును.

తాత్పర్యము :– ఈ వానరరూపమైన మహాభూతమును దేవేంద్రుడే తన తపశ్శక్తి వలన మనకొఱకుగాను సృష్టించి యుండవచ్చును. పెక్కుమాఱులు నాగులు, యక్షులు, గంధర్వులు, దేవతలు, దానవులు, మహర్షులు నాతో కలసి మీయందఱిచేతను ఓడింపబడి యుండిరి కదా! వారే నేడు మనకు హాని కల్గించుటకై ఈ విధమైన అప్రియమును మనకు సృష్టించి యుందురు.

శ్లో॥ తదేవ నాత్ర సందేహః ప్రసహ్య పరిగృహ్యతామ్ ।
నావమాన్యో భవద్భిశ్చ హరి ర్ధీరపరాక్రమః ॥ 10

పదచ్ఛేదము :– తత్ – ఏవ – న – అత్ర – సందేహః – ప్రసహ్య – పరిగృహ్యతామ్ – న – అవమాన్యః – భవద్భిః – చ – హరిః – ధీరపరాక్రమః ॥

అన్వయక్రమము :– ఇదం తత్ ఏవ; అత్ర సందేహః న (అస్తి). ప్రసహ్య పరిగృహ్యతామ్; ధీరపరాక్రమః హరిః భవద్భిః నచ అవమాన్యః.

ప్రతిపదార్థము :– ఇదం = ఈ మహాభూతము, తత్ ఏవ = ఆ ఇంద్రసృష్టియే; అత్ర = ఈ విషయమునందు, సందేహః = శంక, నాస్తి = లేదు; ధీరపరాక్రమః = ధైర్యయుతమైన పరాక్రమము కల్గినట్టి, హరిః = వానరుడు, భవద్భిః = మీచేత, న చ అవమాన్యః = ఎంతమాత్రము అవమానింపబడకూడదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– ఇంతకుపూర్వము పదమూడువేల శ్లోకములు గడిచినవి. ఇది పదునాల్గవ సహస్రముయొక్క ప్రథమ శ్లోకము. గాయత్రీమంత్రమునందలి పదునాల్గవ అక్షరమైన 'ధీ' యను అక్షరము ఇందు ప్రయుక్తమైనది (ధీరపరాక్రమః)

తాత్పర్యము :– ఈ వానరుడు ఆ దేవేంద్రునిచే సృష్టింపబడిన మహాభూతమే యగును. ఇందు సందేహములేదు. కాబట్టి మీ రాతనిని బలాత్కారముగా పట్టి బంధించి తెండు. మహాధైర్యపరాక్రమములు కల్గినట్టి ఆ వానరుని ఎంతమాత్రము అవమానము చేయకుడు.

శ్లో॥ దృష్టా హి హరయః పూర్వం మయా విపులవిక్రమాః ।
వాలీ చ సహసుగ్రీవో జాంబవాంశ్చ మహాబలః ॥ 11

శ్లో॥ నీల స్సేనాపతిశ్చైవ యే చాన్యే ద్వివిదాదయః ।
నైవం తేషాం గతి ర్భీమా న తేజో న పరాక్రమః ॥ 12

శ్లో॥ న మతి ర్న బలోత్సాహౌ న రూపపరికల్పనమ్ ।
మహ త్సత్త్వ మిదం జ్ఞేయం కపిరూపం వ్యవస్థితమ్ ॥ 13

పదచ్ఛేదము :– దృష్టాః – హి – హరయః – పూర్వం – మయా – విపులవిక్రమాః, వాలీ – చ – సహసుగ్రీవః – జాంబవాన్ – చ – మహాబలః – నీలః – సేనాపతిః – చ – ఏవ – యే – చ – అన్యే – ద్వివిదాదయః, న – ఏవం – తేషాం – గతిః – భీమా – న – తేజః – న – పరాక్రమః, న – మతిః – న – బలోత్సాహౌ – న – రూపపరికల్పనమ్, మహత్ – సత్త్వమ్ – ఇదం – జ్ఞేయం – కపిరూపం – వ్యవస్థితమ్ ॥

అన్వయక్రమము :– సహసుగ్రీవః వాలీ చ, మహాబలః జాంబవాన్ చ, సేనాపతిః నీలః చైవ, అన్యే ద్వివిదాదయః యే విపులవిక్రమాః హరయః పూర్వం మయా దృష్టా హి, తేషాం గతిః ఏవం భీమా న; తేజః న; పరాక్రమః న, మతిః న; బలోత్సాహౌ న; రూపపరికల్పనం న; ఇదం కపిరూపం వ్యవస్థితం మహత్ సత్త్వం జ్ఞేయమ్.

ప్రతిపదార్థము :– సహసుగ్రీవః = సుగ్రీవునితో గూడినట్టి, వాలీ చ = వాలియును, మహాబలః = మహాబలాఢ్యుడైన, జాంబవాన్ చ = జాంబవంతుడు, సేనాపతిః = సేనాధిపతియైన, నీలః చ = నీలుడును, ద్వివిదాదయః = ద్వివిదుడు మున్నగు, విపులవిక్రమాః = అమితవిక్రమము కల్గినట్టి, అన్యే = ఇతరులైన, యే హరయః =

ఏ వానరవీరులు, పూర్వం = ఇంతకుముందు, మయా దృష్టాః = నాచేత చూడబడిరో, తేషాం = వారికి, ఏవం = ఈ రీతిగా, భీమా గతిః = భయంకరమైన గమనము, న = లేదు. తేజః న = తేజస్సు లేదు, పరాక్రమః న = పరాక్రమము లేదు, మతిః న = ప్రజ్ఞ లేదు, బలోత్సాహౌ న = శక్తి, యుత్సాహమును లేవు, రూపపరికల్పనం న = కామరూపధారణమును లేదు, కపిరూపం = వానరరూపమును, వ్యవస్థితం = ధరించినట్టి, ఇదం = ఈయది, మహత్ సత్త్వం = మహాభూతముగా, జ్ఞేయం = తెలియదగినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– భీమా గతిః = మహాసముద్రమును దాటివచ్చుట అనెడి భయంకరమైన గమనము.

తాత్పర్యము :– నేను పూర్వము అమితపరాక్రమ సంపన్నులైన వానరవీరులను ఎంతమందినో చూచియుంటిని గదా! ఆ వాలి, ఆ సుగ్రీవుడు, మహాబలాఢ్యుడైన ఆ జాంబవంతుడు, వానరసేనా నాయకుడైన నీలుడు, ఇంకను ద్వివిదుడు మున్నగు పెక్కుమంది వానరయోధులు నాకు పరిచితులే. వారెవ్వరిలోను ఈవిధమైనట్టి భయంకరమైన గతి గాని, శక్తి గాని, మహాప్రతాపము గాని పరాక్రమము గాని, ప్రజ్ఞ గాని, శక్తిఉత్సాహములు గాని, స్వేచ్ఛారూపధారణశక్తి గాని, గాన్పింపలేదు. అందుచే ఈతడు వానరరూపమును స్వీకరించి యున్న అద్భుతమైన ఒక మహాభూతమే యని మనము గ్రహించవలెను.

శ్లో॥ ప్రయత్నం మహ దాస్థాయ క్రియతా మస్య నిగ్రహః ।
కామం లోకా స్త్రయ స్సేంద్రా స్ససురాసురమానవాః ।
భవతా మగ్రతః స్థాతుం న పర్యాప్తా రణాజిరే ॥ 14

పదచ్ఛేదము :– ప్రయత్నం – మహత్ – ఆస్థాయ – క్రియతామ్ – అస్య – నిగ్రహః – కామం – లోకాః – త్రయః – సేంద్రాః – ససురాసురమానవాః – భవతాం – అగ్రతః – స్థాతుం – న – పర్యాప్తాః – రణాజిరే ॥

అన్వయక్రమము :– మహత్ ప్రయత్నం ఆస్థాయ అస్య నిగ్రహః క్రియతామ్, రణాజిరే సేంద్రాః ససురాసురమానవాః కామం త్రయః లోకాః భవతామ్ అగ్రతః స్థాతుం పర్యాప్తాః న (భవంతి).

ప్రతిపదార్థము :– మహత్ ప్రయత్నం = గొప్పదైన ప్రయత్నమును, ఆస్థాయ =

ఒనరించి, అస్య = వీనియొక్క, నిగ్రహః = నిరోధించుట, క్రియతాం = చేయబడుగాక, రణాజిరే = రణరంగమున, సేంద్రాః = ఇంద్రునితో గూడినట్టియు, ససురాసురమానవాః = దేవదానవమానవులతో గూడినవియునగు, త్రయః లోకాః = మూడులోకములును, కామం = స్వేచ్ఛగా, భవతామ్ అగ్రతః = మీ ఎదుట, స్థాతుం = నిలచుటకు, పర్యాప్తాః = సమర్థములైనవి, న భవంతి = కావు;

తాత్పర్యము :– గొప్పదైన యత్నమును గాంచి ఈతనిని మీరు బంధింపవలెను. ఇంద్రునితోడను, దేవదానవమానవులతోడను కూడి వచ్చినను సరియే యుద్ధభూమిలో మీ ఎదుట నిలబడుటకు వారికి సామర్థ్యము కలుగదు.

శ్లో॥ తథాపి తు నయజ్ఞేన జయమాకాంక్షతా రణే ।
ఆత్మా రక్ష్యః ప్రయత్నేన యుద్ధసిద్ధిర్హి చంచలా ॥ 15

పదచ్ఛేదము :– తథా – అపి – నయజ్ఞేన – జయమ్ – ఆకాంక్షతా – రణే – ఆత్మా – రక్ష్యః – ప్రయత్నేన – యుద్ధసిద్ధిః – హి – చంచలా ॥

అన్వయక్రమము :– తథాపి రణే జయం ఆకాంక్షతా నయజ్ఞేన తు ఆత్మా ప్రయత్నేన రక్ష్యః; యుద్ధసిద్ధిః చంచలా హి.

ప్రతిపదార్థము :– తథాపి = అయినప్పటికిని, రణే = యుద్ధమునందు, జయం = జయమును, ఆకాంక్షతా = వాంఛించుచున్నట్టి, నయజ్ఞేన తు = యుద్ధనీతివేత్త చేతమాత్రము; ఆత్మా = తన దేహము, ప్రయత్నేన = గొప్పయత్నముతో, రక్ష్యః = రక్షించుకొనవలసినది, యుద్ధసిద్ధిః = యుద్ధమున జయసిద్ధి, చంచలా హి = చంచలమైనదిగదా.

తాత్పర్యము :– మీరు ముల్లోకములను జయింపగలవారే; అయినప్పటికిని యుద్ధమునందు విజయమును సంపాదింపగోరు నీతివేత్త మాత్రము తనను తాను మిక్కిలి ప్రయత్నపూర్వకముగా కాపాడుకొనవలసియుండును. యుద్ధమునందు విజయప్రాప్తి సాధారణముగా అనిశ్చయమై యుండును గదా!

శ్లో॥ తే స్వామివచనం సర్వే ప్రతిగృహ్య మహౌజసః ।
సముత్పేతు ర్మహావేగా హుతాశసమతేజసః ॥ 16

పదచ్ఛేదము :– తే – స్వామివచనం – సర్వే – ప్రతిగృహ్య – మహౌజసః – సముత్పేతుః – మహావేగాః – హుతాశసమతేజసః ॥

అన్వయక్రమము :– మహౌజసః తే సర్వే స్వామివచనం ప్రతిగృహ్య హుతాశసమతేజసః

మహావేగాః (సంతః) సముత్పేతుః.

ప్రతిపదార్థము :- మహౌజసః = మహాపరాక్రమవంతులైన, తే సర్వే = ఆ సేనాధిపతులందరును, స్వామివచనం = ప్రభువుయొక్క మాటను, ప్రతిగృహ్య = స్వీకరించి, హుతాశసమతేజసః = అగ్నిహోత్రునితో సమానమైన తేజస్సు గలవారును, మహావేగాః = అమితమైన వేగముగలవారును, సంతః = అగుచు, సముత్పేతుః = మీదికి ఎగిరిరి.

తాత్పర్యము :- ఆ సేనానాయకులు ఏవురును తమ ప్రభువు ఆజ్ఞను స్వీకరించి అగ్నిహోత్రములవలె జ్వలించుచు అమితమైన వేగముతో అటనుండి యుద్ధభూమికి ఎగసిపోయిరి.

శ్లో॥ రథై ర్మత్తైశ్చ మాతంగై ర్వాజిభిశ్చ మహాజవైః ।
శస్త్రైశ్చ వివిధై స్తీక్ష్ణైస్సర్వై శ్చోపచితా బలైః ॥ 17

పదచ్ఛేదము :- రథైః - మత్తైః - చ - మాతంగైః - వాజిభిః - చ - మహాజవైః - శస్త్రైః - చ - వివిధైః - తీక్ష్ణైః - సర్వైః - చ - ఉపచితాః - బలైః ॥

అన్వయక్రమము :- (తే) రథైః మత్తైః మాతంగైః చ మహాజవైః వాజిభిశ్చ, తీక్ష్ణైః వివిధైః శస్త్రైః చ, సర్వైః బలైః చ ఉపచితాః సముత్పేతుః.

ప్రతిపదార్థము :- (తే = ఆ పంచ సేనానాయకులు) రథైః = రథములతోడను, మత్తైః = మదించిన, మాతంగైః = ఏనుగులతోడను, మహాజవైః = మహావేగముగల, వాజిభిః చ = గుఱ్ఱములతోడను, తీక్ష్ణైః = వాడియైన, వివిధైః = పలువిధములైన, శస్త్రైః చ = ఆయుధములతోడను, సర్వైః = ఎల్లవిధములైన, బలైః = బలములతోడను, ఉపచితాః = కూడుకొన్నవారై, (సముత్పేతుః = ఎగసిరి).

తాత్పర్యము :- ఆ సేనానాయకపంచకము శ్రేష్ఠములైన రథములను, మదించిన ఏనుగులను, అమితవేగము గల అశ్వములను, పలువిధములైన వాడిగల ఆయుధములను, చతురంగ బలములను, అన్నిటిని చక్కగా సమకూర్చుకొని హనుమ మీదకి వెడలెను.

శ్లో॥ తత స్తం దదృశు ర్వీరా దీప్యమానం మహాకపిమ్ ।
రశ్మిమంత మివోద్యంతం స్వతేజోరశ్మిమాలినమ్ ॥ 18

పదచ్ఛేదము :- తతః - తం - దదృశుః - వీరాః - దీప్యమానం - మహాకపిమ్, రశ్మిమంతమ్ - ఇవ - ఉద్యంతం - స్వతేజోరశ్మిమాలినమ్ ॥

అన్వయక్రమము :– తతః (తే) వీరాః స్వతేజోరశ్మిమాలినమ్, దీప్యమానం తం మహాకపిమ్, ఉద్యంతం రశ్మిమంతమ్ ఇవ దదృశుః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తే వీరాః = ఆ వీరులు, ఉద్యంతం = ఉదయించుచున్నట్టి, రశ్మిమంతమ్ ఇవ = భాస్కరునివలె, స్వతేజోరశ్మిమాలినమ్ = తన తేజస్సు అనెడు ప్రకాశము కల్గియున్న, దీప్యమానం = ప్రజ్వలించుచున్న, తం మహాకపిమ్ = ఆ వానరశ్రేష్ఠుని, దదృశుః = చూచిరి.

తాత్పర్యము :– అట్లు వెడలివచ్చిన ఆ సేనాధిపతు లైదుగురును అప్పుడే ఉదయించుచున్న సూర్యునివలె తన తేజోవిశేషముచేత ప్రజ్వలించుచున్న వానరశ్రేష్ఠుడైన హనుమను గాంచిరి.

శ్లో॥ తోరణస్థం మహోత్సాహం మహాసత్త్వం మహాబలమ్ ।
మహామతిం మహావేగం మహాకాయం మహాభుజమ్ ॥ 19

శ్లో॥ తం సమీక్ష్యైవ తే సర్వే దిక్షు సర్వా స్వవస్థితాః ।
తై స్తైః ప్రహరణై ర్భీమై రభిపేతు స్తత స్తతః ॥ 20

పదచ్ఛేదము :– తోరణస్థం – మహోత్సాహం – మహాసత్త్వం – మహాబలమ్ – మహామతిం – మహావేగం – మహాకాయం – మహాభుజమ్ – తం – సమీక్ష్య – ఏవ – తే – సర్వే – దిక్షు – సర్వాసు – అవస్థితాః – తైః – తైః – ప్రహరణైః – భీమైః – అభిపేతుః – తతః – తతః ॥

అన్వయక్రమము :– తోరణస్థం మహోత్సాహం, మహాసత్త్వం మహాబలం, మహామతిం, మహావేగం, మహాకాయం మహాభుజం తం సమీక్ష్య ఏవ సర్వే సర్వాసు దిక్షు అవస్థితాః, తతః తతః భీమైః తైః తైః ప్రహరణైః అభిపేతుః.

ప్రతిపదార్థము :– తోరణస్థం = బహిర్ద్వారముపై కూర్చున్నవాడును, మహోత్సాహం = గొప్ప ఉత్సాహము గలవాడును, మహాసత్త్వం = గొప్పశక్తి గలవాడును, మహాబలం = గొప్ప బలము గలవాడును, మహామతిం = గొప్ప ప్రజ్ఞ గలవాడును, మహాభుజం = గొప్ప భుజములు గలవాడును అగు, తం = ఆ హనుమను, సమీక్ష్య ఏవ = చూచియే, తే సర్వే = వారెల్లరును, సర్వాసు దిక్షు = అన్నివైపులందును, అవస్థితాః = నిలచిపోయిన వారై, తతః తతః = ఆ యా దిక్కులనుండి, భీమైః = భయంకరమైనట్టి, తైః తైః ప్రహరణైః = ఆ యా ఆయుధములతో, అభిపేతుః = మీదబడిరి.

తాత్పర్యము :– ఆ సేనాధిపతు లైదుగురును ఆ ప్రాసాదబహిర్ద్వారముపై అమితమైన

ఉత్సాహముతోడను శక్తితోడను బలముతోడను ప్రజ్ఞతోడను వేగముతోడను విరాజిల్లుచు, ధృఢములైన భుజములతోడను శరీరముతోడను గానవచ్చుచున్న మహావీరుడైన ఆ హనుమను చూచి వెంటనే మూలమూలలకు బోయి నిలచి తమ తమ తీక్ష్ణములైన ఆయుధములను చేత ధరించి అన్నివైపుల నుండి వచ్చి ఆతనిపై బడిరి.

శ్లో॥ తస్య పంచాయసా స్తీక్ష్ణాస్సితాః పీతముఖా శ్శరాః ।
శిర స్యుత్పలపత్రాభా దుర్ధరేణ నిపాతితాః ॥ 21

పదచ్ఛేదము :– తస్య – పంచ – ఆయసాః – తీక్ష్ణాః – సితాః – పీతముఖాః – శరాః – శిరసి – ఉత్పలపత్రాభాః – దుర్ధరేణ – నిపాతితాః ॥

అన్వయక్రమము :– తస్య శిరసి దుర్ధరేణ ఆయసాః, తీక్ష్ణాః, సితాః పీతముఖాః ఉత్పలపత్రాభాః పంచశరాః నిపాతితాః.

ప్రతిపదార్థము :– తస్య = ఆ హనుమయొక్క, శిరసి = శిరస్సున, ఆయసాః = లోహనిర్మితములును, తీక్ష్ణాః = వాడియైనవియును, సితాః = తెల్లనివియును, పీతముఖాః = పచ్చని ములికి కలిగినవియును, ఉత్పలపత్రాభాః = కలువఱేకులవంటి కాంతులు గలవియునగు, పంచశరాః = ఐదుబాణములు, దుర్ధరేణ = దుర్ధరునిచే, నిపాతితాః = ప్రయోగింపబడినవి.

తాత్పర్యము :– వారిలో దుర్ధరు డనువాడు హనుమ శిరస్సుపై లోహనిర్మితములై బంగారుములికి గలిగి వాడివై కలువఱేకులవంటిపై తెల్లని కాంతులుగలవై యున్న ఐదుబాణములను ప్రయోగించెను.

శ్లో॥ స తైః పంచభి రావిద్ధః శరై శ్శిరసి వానరః ।
ఉత్పపాత నదన్వ్యోమ్ని దిశో దశ వినాదయన్ ॥ 22

పదచ్ఛేదము :– సః – తైః – పంచభిః – ఆవిద్ధః – శరైః – శిరసి – వానరః – ఉత్పపాత – నదన్ – వ్యోమ్ని – దిశః – దశ – వినాదయన్ ॥

అన్వయక్రమము :– సః వానరః శిరసి తైః పంచభిః శరైః ఆవిద్ధః దశ దిశః వినాదయన్ నదన్ వ్యోమ్ని ఉత్పపాత.

ప్రతిపదార్థము :– సః వానరః = ఆ హనుమ, శిరసి = శిరస్సునందు, తైః పంచభిః శరైః = ఆ యైదు బాణములచే, ఆవిద్ధః = కొట్టబడినవాడై, దశ దిశః = పది దిక్కులను, వినాదయన్ = ప్రతిధ్వనింప చేయుచు, నదన్ = గర్జించుచు, వ్యోమ్ని =

ఆకాశమునందు, ఉత్పపాత = ఎగిరెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమ ఆ యైదు బాణములు తన తలకు తగులగనే ఎల్లదిక్కులు పిక్కటిల్లునట్లు గర్జించుచు ఆకసమున కెగిసెను.

శ్లో॥ తతస్తు దుర్ధరో వీర స్సరథ స్సజ్యకార్ముకః ।
కిరన్ శరశతైస్తీక్ష్ణై రభిపేదే మహాబలః ॥ 23

పదచ్ఛేదము :- తతః - తు - దుర్ధరః - వీరః - సరథః - సజ్యకార్ముకః - కిరన్ - శరశతైః - తీక్ష్ణైః - అభిపేదే - మహాబలః ॥

అన్వయక్రమము :- తతః మహాబలః వీరః దుర్ధరః సరథః సజ్యకార్ముకః (సన్) తీక్ష్ణైః శరశతైః కిరన్ అభిపేదే.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, మహాబలః = మహాబలాఢ్యుడును, వీరః = శూరుడును అగు, దుర్ధరః = దుర్ధరుడు, సరథః = రథముతో కూడినవాడును, సజ్యకార్ముకః = ఎక్కుపెట్టిన విల్లుగలవాడును అగుచు, తీక్ష్ణైః = వాడియైన, శరశతైః = వందల కొలదిబాణములతో, కిరన్ = వెదజల్లుచు, అభిపేదే = మీదికి వచ్చెను.

తాత్పర్యము :- వీరుడును మహాబలాఢ్యుడును అగు ఆ దుర్ధరుడు రథముతోడను ఎక్కు పెట్టిన విల్లుతోడను మీదికి ఎగసి వాడియైన బాణములను వందలకొలది హనుమపై కురిపించదొడగెను.

శ్లో॥ స కపి ర్వారయామాస తం వ్యోమ్ని శరవర్షిణమ్ ।
వృష్టిమంతం పయోదాంతే పయోదమివ మారుతః ॥ 24

పదచ్ఛేదము :- సః - కపిః - వారయామాస - తం - వ్యోమ్ని - శరవర్షిణమ్ - వృష్టిమంతం - పయోదాంతే - పయోదమ్ - ఇవ - మారుతః ॥

అన్వయక్రమము :- సః కపిః వ్యోమ్ని శరవర్షిణం తం పయోదాంతే మారుతః వృష్టిమంతం పయోదమ్ ఇవ వారయామాస.

ప్రతిపదార్థము :- సః కపిః = ఆ హనుమ, వ్యోమ్ని = ఆకసమునందు, శరవర్షిణం = బాణములను కురిపించుచున్న, తం = ఆ దుర్ధరుని, పయోదాంతే = వర్షాకాలముచివర, మారుతః = వాయువు, వృష్టిమంతం = వర్షించుచున్నట్టి, పయోదమ్ ఇవ = మేఘమునువలె, వారయామాస = అడ్డగించెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమ తనతో ఆకసమునకు వచ్చి తనపై బాణములు

కురిపించుచున్నట్టి ఆ దుర్ధరుని శరత్కాలమునందు జల్లులను కురిపించుచున్నట్టి మేఘమును వాయువు దూరమున కెగురగొట్టినట్లుగా ఎగురగొట్టెను.

శ్లో॥ అర్ద్యమాన స్తత స్తేన దుర్ధరే ణానిలాత్మజః ।
చకార కదనం భూయో వ్యవర్ధత చ వేగవాన్ ॥ 25

పదచ్ఛేదము :– అర్ద్యమానః – తతః – తేన – దుర్ధరేణ – అనిలాత్మజః – చకార – కదనం – భూయః – వ్యవర్ధత – చ – వేగవాన్ ॥

అన్వయక్రమము :– తతః వేగవాన్ అనిలాత్మజః తేన దుర్ధరేణ అర్ద్యమానః కదనం చకార. భూయః వ్యవర్ధత చ.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, వేగవాన్ = వేగవంతుడైనట్టి, అనిలాత్మజః = వాయునందనుడైన హనుమ, తేన దుర్ధరేణ = ఆ దుర్ధరునిచే, అర్ద్యమానః = పీడింపబడుచున్నవాడై, కదనం = యుద్ధమును, చకార = చేసెను. భూయః = తిరిగి, వ్యవర్ధత చ = మిక్కిలిగా వృద్ధినొందెను కూడ.

సూచన :– 'కదనం' అనుటకు బదులుగా 'నినదం' అని పాఠాంతరము. అనగా గొప్పగర్జన చేసెను అని అర్థము.

తాత్పర్యము :– అప్పుడు మహావేగశాలియైన హనుమ దుర్ధరునిచే అట్లు పీడింపబడుచునే మిక్కిలి విజృంభించి తిరిగి మహాయుద్ధము చేయసాగెను.

శ్లో॥ స దూరం సహ సోత్పత్య దుర్ధరస్య రథే హరిః ।
నిపపాత మహావేగో విద్యుద్రాశిర్గిరావివ ॥ 26

పదచ్ఛేదము :– సః – దూరం – సహసా – ఉత్పత్య – దుర్ధరస్య – రథే – హరిః, నిపపాత – మహావేగః – విద్యుద్రాశిః – గిరౌ – ఇవ ॥

అన్వయక్రమము :– మహావేగః సః హరిః సహసా దూరమ్ ఉత్పత్య విద్యుద్రాశిః గిరౌ ఇవ దుర్ధరస్య రథే నిపపాత.

ప్రతిపదార్థము :– మహావేగః సః హరిః = అమిత వేగవంతుడైన ఆ హనుమ, సహసా = వెంటనే, దూరం = దూరముగా, ఉత్పత్య = మీదికి ఎగిరి, విద్యుద్రాశిః = విద్యుత్తుల సమూహమైన పిడుగు, గిరౌ ఇవ = పర్వతమునందువలె, దుర్ధరస్య = దుర్ధరునియొక్క, రథే = రథమునందు, నిపపాత = ఉఱికెను.

తాత్పర్యము :– అప్పుడు హనుమ వెంటనే ఆకసముమీది కెగిరిపోయి పర్వతముపై

పిడుగు పడినట్లుగా అమితమైన వేగముతో దుర్ధరుని రథముమీదికి ఉఱికెను.

శ్లో॥ తత స్స మథితాష్టాశ్వం రథం భగ్నాక్షకూబరమ్ ।
విహాయ న్యపతత్ భూమౌ దుర్ధర స్త్యక్తజీవితః ॥ 27

పదచ్ఛేదము :– తతః – సః – మథితాష్టాశ్వం – రథం – భగ్నాక్షకూబరమ్ – విహాయ – న్యపతత్ – భూమౌ – దుర్ధరః – త్యక్తజీవితః ॥

అన్వయక్రమము :– తతః సః దుర్ధరః మథితాష్టాశ్వం భగ్నాక్షకూబరం రథం విహాయ త్యక్తజీవితః సన్ భూమౌ న్యపతత్.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, సః దుర్ధరః = ఆ దుర్ధరుడు, మథితాష్టాశ్వం = చంపబడిన ఎనిమిది గుఱ్ఱములు కలిగినట్టియు, భగ్నాక్షకూబరం = విరిగిపోయిన ఇరుసును కాడియును గలదియును అగు, రథం = రథమును, విహాయ = విడిచి, భూమౌ = నేలపై, న్యపతత్ = పడెను.

తాత్పర్యము :– అప్పు డా దుర్ధరుడు తన రథమునకు కట్టిన ఎనిమిది గుఱ్ఱములును నలిగి ముద్దయైపోవగా రథచక్రములును నొగలును ముక్కముక్కలై పోవగా నేలపై గూలి అసువులు బాసెను.

శ్లో॥ తం విరూపాక్షయూపాక్షౌ దృష్ట్వా నిపతితం భువి ।
సంజాతరోషౌ దుర్ధర్షా వుత్పేతతు రరిందమౌ ॥ 28

పదచ్ఛేదము :– తం – విరూపాక్షయూపాక్షౌ – దృష్ట్వా – నిపతితం – భువి – సంజాతరోషౌ – దుర్ధర్షౌ – ఉత్పేతతుః – అరిందమౌ ॥

అన్వయక్రమము :– తం భువి నిపతితం దృష్ట్వా దుర్ధర్షౌ అరిందమౌ, విరూపాక్ష యూపాక్షౌ సంజాతరోషౌ (సంతౌ) ఉత్పేతతుః.

ప్రతిపదార్థము :– తం = ఆ దుర్ధర్షుని, భువి = నేలపై, నిపతితం = కూలినవానినిగా, దృష్ట్వా = చూచి, దుర్ధర్షౌ = ఎదిరింప శక్యముగాని వారును, అరిందమౌ = శత్రు మర్దనులును అగు, విరూపాక్షయూపాక్షౌ = విరూపాక్షుడు యూపాక్షుడు అను సేనాధిపతు లిరువురును, సంజాతరోషౌ (సంతౌ) = జనించిన మహారోషము గలవారై, ఉత్పేతతుః = మీదికి ఎగసిరి.

తాత్పర్యము :– దుర్ధరు డా రీతిగా నేలగూలుటను జూచి మహాపరాక్రమవంతులగు విరూపాక్షుడు యూపాక్షుడు అను ఇరువురు సేనాధిపతులును అమితమైన రోషావేశము నొంది హనుమ మీదికి ఎగసిరి.

శ్లో॥ స తాభ్యాం సహ సోత్పత్య విష్ఠితో విమలేఽమ్బరే ।
ముద్గరాభ్యాం మహాబాహు ర్వక్ష స్యభిహతః కపిః ॥ 29

పదచ్ఛేదము :– సః – తాభ్యాం – సహసా – ఉత్పత్య – విష్ఠితః – విమలే – అంబరే – ముద్గరాభ్యాం – మహాబాహుః – వక్షసి – అభిహతః – కపిః ॥

అన్వయక్రమము :– మహాబాహుః సః కపిః విమలే అంబరే విష్ఠితః తాభ్యాం సహసా ఉత్పత్య ముద్గరాభ్యాం వక్షసి అభిహతః.

ప్రతిపదార్థము :– విమలే = నిర్మలమైనట్టి, అంబరే = ఆకాశమునందు, విష్ఠితః = నిలచియున్నట్టి, మహాబాహుః = మహావీరుడైన, సః కపిః = ఆ హనుమ, తాభ్యాం = ఆ విరూపాక్షయూపాక్షు లిరువురిచే, సహసా = వెంటనే, ఉత్పత్య = మీదికెగిరి, ముద్గరాభ్యాం = రెండు ఇనుప గుదియలచేత, వక్షసి = ఱొమ్ముపై, అభిహతః = కొట్టబడెను.

తాత్పర్యము :– నిర్మలమైన ఆకాశమునందు ధీరుడై నిలచియున్న మహావీరుడైన ఆ హనుమను ఆ విరూపాక్షయూపాక్షు లిరువురును మీదికి ఎగిరి తమతమ ముద్గరములతో ఱొమ్ముపై బలముగా ప్రహరించిరి.

శ్లో॥ తయో ర్వేగవతో ర్వేగం వినిహత్య మహాబలః ।
నిపపాత పున ర్భూమౌ సుపర్ణసమవిక్రమః ॥ 30

పదచ్ఛేదము :– తయోః – వేగవతోః – వేగం – వినిహత్య – మహాబలః – నిపపాత – పునః – భూమౌ – సుపర్ణసమవిక్రమః ॥

అన్వయక్రమము :– వేగవతోః తయోః వేగం వినిహత్య మహాబలః సుపర్ణసమవిక్రమః (సః) పునః భూమౌ నిపపాత.

ప్రతిపదార్థము :– వేగవతోః = మహావేగము కలిగినట్టి, తయోః = ఆ సేనాధిపతుల ఇరువురియొక్క, వేగం = వేగమును, వినిహత్య = అణచివేసి, మహాబలః = మహాబలాఢ్యుడును, సుపర్ణసమవిక్రమః = గరుత్మంతునితో సమానమగు పరాక్రమము గలవాడునగు, (సః = ఆ హనుమ) పునః = తిరిగి, భూమౌ = భూమిమీదకు, నిపపాత = ఉఱికెను.

తాత్పర్యము :– ఆకసమునందు తనమీదకు మహావేగముతో వచ్చుచున్నట్టి వారి వేగాతిశయమును వమ్ముచేయుచు గరుత్మంతునితో సమానమైన జవసత్త్వములు కలిగినట్టి ఆ హనుమ వారికి చిక్కకుండ నేలమీదికి ఉఱికెను.

శ్లో॥ స సాలవృక్ష మాసాద్య త ముత్పాట్య చ వానరః ।
తా వుభౌ రాక్షసౌ వీరౌ జఘాన పవనాత్మజః ॥ 31

పదచ్ఛేదము :- సః - సాలవృక్షమ్ - ఆసాద్య - తమ్ - ఉత్పాట్య - చ - వానరః - తౌ - ఉభౌ - రాక్షసౌ - వీరౌ - జఘాన - పవనాత్మజః ॥

అన్వయక్రమము :- పవనాత్మజః సః వానరః సాలవృక్షమ్ ఆసాద్య, తమ్ ఉత్పాట్య చ వీరౌ ఉభౌ తౌ రాక్షసౌ జఘాన.

ప్రతిపదార్థము :- పవనాత్మజః = వాయుపుత్రుడైన, సః వానరః = ఆ హనుమ, సాలవృక్షం = ఒక మద్దిచెట్టును, ఆసాద్య = చేరి, తం = ఆ చెట్టును, ఉత్పాట్య చ = పెల్లగించియు, వీరౌ = వీరులైనట్టి, ఉభౌ తౌ రాక్షసౌ = ఆ రాక్షసు లిరువురిని, జఘాన= హతమార్చెను.

తాత్పర్యము :- వెంటనే హనుమ సమీపమున నున్న మద్దిచెట్టును చేరి దానిని పెల్లగించి మహావీరులైన ఆ రాక్షసు లిరువురను దానితోడనే మోది కడతేర్చెను.

శ్లో॥ తత స్తాం స్త్రీ న్హతా న్జ్ఞాత్వా వానరేణ తరస్వినా ।
అభిపేదే మహావేగః ప్రసహ్య ప్రఘసో హరిమ్ ॥ 32

పదచ్ఛేదము :- తతః - తాన్ - త్రీన్ - హతాన్ - జ్ఞాత్వా - వానరేణ - తరస్వినా - అభిపేదే - మహావేగః - ప్రసహ్య - ప్రఘసః - హరిమ్ ॥

అన్వయక్రమము :- తతః ప్రఘసః తరస్వినా వానరేణ తాన్ త్రీన్ హతాన్ జ్ఞాత్వా, మహావేగః (సన్) ప్రసహ్య (తం) హరిమ్ అభిపేదే.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, ప్రఘసః = ప్రఘసుడను సేనాధిపతి, తరస్వినా = మహాబలశాలియైన, వానరేణ = వానరునిచే, తాన్ = ఆ సేనానాయకులను, త్రీన్ = ముగ్వురిని, హతాన్ = చంపబడినవారినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, మహావేగః (సన్) = అమితమైన వేగముగలవాడై, ప్రసహ్య = బలవంతముగా, తం హరిం = ఆ హనుమను, అభిపేదే = ఎదుర్కొనెను.

తాత్పర్యము :- అప్పుడు ప్రఘసుడను సేనాధిపతి - దుర్ధరుడు, విరూపాక్షుడు, యూపాక్షుడు అను ముగ్వురును గూడ మహావీరుడైన హనుమ చేతిలో మడిసిరని తెలిసికొని మహావేగముతో మిక్కిలి పూనికతో హనుమ మీదకి వెడలెను.

శ్లో॥ భాసకర్ణశ్చ సంక్రుద్ధ శ్శూల మాదాయ వీర్యవాన్ ।
ఏకతః కపిశార్దూలం యశస్విన మవస్థితమ్ ॥ 33

పదచ్ఛేదము :– భాసకర్ణః – చ – సంక్రుద్ధః – శూలమ్ – ఆదాయ – వీర్యవాన్, ఏకతః – కపిశార్దూలం – యశస్వినమ్ – అవస్థితమ్ ॥

అన్వయక్రమము :– సంక్రుద్ధః, వీర్యవాన్ భాసకర్ణః చ శూలమ్ ఆదాయ అవస్థితం యశస్వినం కపిశార్దూలమ్ ఏకతః (అభిపేదే).

ప్రతిపదార్థము :– సంక్రుద్ధః = మిక్కిలి క్రోధము నొందినట్టి, వీర్యవాన్ = పరాక్రమశాలియగు, భాసకర్ణః చ = భాసకర్ణు డను సేనాధిపతియును, శూలం = శూలమును, ఆదాయ = తీసికొని, యశస్వినం = కీర్తిశాలియును, అవస్థితం = నిలచియున్నవాడునగు, కపిశార్దూలం = వానరశ్రేష్ఠుని, ఏకతః = ఒకవైపునుండి, అభిపేదే = ఎదుర్కొనెను.

తాత్పర్యము :– మిక్కిలి కోపించియున్న భాసకర్ణుడనెడు మహావీరుడైన సేనాధిపతి తనశూలమును చేత ధరించి రణరంగమున నిర్భయముగా నిలచియున్న సాటిలేని వీరుడైన హనుమ మీదికి వేఱొకవైపు నుండి పోయెను.

శ్లో॥ పట్టసేన శితాగ్రేణ ప్రఘసః ప్రత్యయోధయత్ ।
భాసకర్ణశ్చ శూలేన రాక్షసః కపిసత్తమమ్ ॥ 34

పదచ్ఛేదము :– పట్టసేన – శితాగ్రేణ – ప్రఘసః – ప్రత్యయోధయత్, భాసకర్ణః – చ – శూలేన – రాక్షసః – కపిసత్తమమ్ ॥

అన్వయక్రమము :– ప్రఘసః శితాగ్రేణ పట్టసేన, రాక్షసః భాసకర్ణః శూలేన చ, కపిసత్తమం ప్రత్యయోధయత్.

ప్రతిపదార్థము :– ప్రఘసః = ప్రఘసుడు, శితాగ్రేణ = వాడియైనకొనగల, పట్టసేన = దీర్ఘమైన ఖడ్గముతోడను, రాక్షసః భాసకర్ణః = రాక్షసుడైన భాసకర్ణుడు, శూలేన చ = శూలముతోడను, కపిసత్తమం = వానరశ్రేష్ఠుడైన హనుమను, ప్రత్యయోధయత్ = ఎదుర్కొనెను.

తాత్పర్యము :– అప్పుడా ప్రఘససేనాధిపతి వాడియైన అగ్రములు కలిగినట్టి తన పట్టసముతోను, భాసకర్ణసేనానాయకుడు తన శూలాయుధముతోను హనుమ నెదుర్కొనిరి.

శ్లో॥ స తాభ్యాం విక్షతై ర్గాత్రై రసృగ్దిగ్ధతనూరుహః ।
అభవ ద్వానరః క్రుద్ధో బాలసూర్యసమప్రభః ॥ 35

పదచ్ఛేదము :– సః – తాభ్యాం – విక్షతైః – గాత్రైః – అసృగ్దిగ్ధతనూరుహః –

అభవత్ - వానరః - క్రుద్ధః - బాలసూర్యసమప్రభః ॥

అన్వయక్రమము :- తాభ్యాం విక్షతైః గాత్రైః అసృగ్దిగ్ధతనూరుహః సః వానరః క్రుద్ధః (సన్) బాలసూర్యసమప్రభః అభవత్.

ప్రతిపదార్థము :- తాభ్యాం = ఆ ఇరువురిచే, విక్షతైః = గాయపఱచబడిన, గాత్రైః = అవయవములచే, అసృగ్దిగ్ధతనూరుహః = రక్తముచే పూయబడిన రోమములు కలిగినట్టి, సః వానరః = ఆ హనుమ, క్రుద్ధః (సన్) = మిక్కిలి కోపించినవాడై, బాలసూర్యసమప్రభః = బాలసూర్యునితో సమానమైన కాంతిగలవాడుగా, అభవత్ = ఆయెను.

తాత్పర్యము :- ప్రఘసుడును భాసకర్ణుడును కొట్టిన దెబ్బలచే రక్తము కారి శరీరము నందలి రోమము లన్నియును ఎఱ్ఱబడి యుండగా క్రోధోద్రిక్తుడైన ఆ హనుమ ఉదయకాల సూర్యబింబమువంటి తేజస్సుతో ప్రకాశించుచుండెను.

శ్లో॥ సముత్పాట్య గిరే శృంగం సమృగవ్యాళపాదపమ్ ।
జఘాన హనుమాన్ వీరో రాక్షసౌ కపికుంజరః ।
గిరిశృంగవినిష్పిష్టౌ తిలశ స్తౌ బభూవతుః ॥ 36

పదచ్ఛేదము :- సముత్పాట్య - గిరేః - శృంగం - సమృగవ్యాళపాదపమ్ - జఘాన - హనుమాన్ - వీరః - రాక్షసౌ - కపికుంజరః, గిరిశృంగవినిష్పిష్టౌ - తిలశః - తౌ - బభూవతుః ॥

అన్వయక్రమము :- కపికుంజరః వీరః హనుమాన్ సమృగవ్యాళపాదపమ్ తం గిరేః శృంగం సముత్పాట్య రాక్షసౌ జఘాన, గిరిశృంగవినిష్పిష్టౌ తౌ తిలశః బభూవతుః.

ప్రతిపదార్థము :- కపికుంజరః = వానరశ్రేష్ఠుడైనట్టి, వీరః = వీరుడైన, హనుమాన్ = హనుమ, సమృగవ్యాళపాదపం = మృగములతోడను, సర్పములతోడను, వృక్షములతోడను గూడినట్టి, గిరేః = పర్వతముయొక్క, శృంగం = శిఖరమును, సముత్పాట్య = పెల్లగించి, రాక్షసౌ = ఇరువురు రక్కసులను, జఘాన = ప్రహరించెను, గిరిశృంగవినిష్పిష్టౌ = పర్వతశిఖరముచే నుగ్గుగా చేయబడిన, తౌ = వారిరువురును, తిలశః = నువ్వుగింజలుగా, బభూవతుః = అయిరి.

సూచన :- ఇందలి చివరిపాదము కొన్ని ప్రతులలో గాన్పించుటలేదు.

తాత్పర్యము :- మహావీరుడైన హనుమ అచ్చటనేయున్న ఒక పర్వతశిఖరమును అందుండు జంతువులతో, సర్పములతో, వృక్షములతో సహ పెల్లగించి ఆ

సేనానాయకులిరువురిని చావమోదెను. ఆ గిరిశిఖరము మీదబడగా నలిగి వారిరువురును నువ్వుగింజలంతలుగా తునుకలు తునుక లయిరి.

శ్లో॥ తత స్తేష్వవసన్నేషు సేనాపతిషు పంచసు ।
బలం త దవశేషం చ నాశయామాస వానరః ॥ 37

పదచ్ఛేదము :– తతః – తేషు – అవసన్నేషు – సేనాపతిషు – పంచసు – బలం – తత్ – అవశేషం – చ – నాశయామాస – వానరః ॥

అన్వయక్రమము :– తతః తేషు పంచసు సేనాపతిషు అవసన్నేషు (సత్సు) వానరః తత్ అవశేషం బలం చ నాశయామాస.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తేషు = ఆ, పంచసు = ఐదుగురైన, సేనాపతిషు = సేనానాయకులు, అవసన్నేషు (సత్సు) = చనిపోయినవారు కాగా, వానరః = హనుమ, తత్ = ఆ, అవశేషం = శేషించియున్న, బలం చ = సైన్యమునుగూడ, నాశయామాస = సంహరించెను.

తాత్పర్యము :– అట్లు ఆ సేనానాయకులు ఏవురును కడతేరిపోగా హనుమ వారితో వచ్చియున్న మిగిలిన సైనికులనుగూడ హతమార్చెను.

శ్లో॥ అశ్వై రశ్వాన్ గజై ర్నాగాన్ యోధై ర్యోధాన్ రథై రథాన్ ।
స కపి ర్నాశయామాస సహస్రాక్ష ఇవాసురాన్ ॥ 38

పదచ్ఛేదము :– అశ్వైః – అశ్వాన్ – గజైః – నాగాన్ – యోధైః – యోధాన్ – రథైః – రథాన్ – సః – కపిః – నాశయామాస – సహస్రాక్షః – ఇవ – అసురాన్ ॥

అన్వయక్రమము :– సః కపిః అశ్వైః అశ్వాన్, యోధైః యోధాన్, రథైః రథాన్, సహస్రాక్షః అసురాన్ ఇవ నాశయామాస.

ప్రతిపదార్థము :– సః కపిః = ఆ హనుమ, అశ్వైః = గుఱ్ఱములతో, అశ్వాన్ = గుఱ్ఱములను, గజైః = ఏనుగులతో, నాగాన్ = ఏనుగులను, యోధైః = యోధులచే, యోధాన్ = యోధులను, రథైః = రథములచే, రథాన్ = రథములను, (ప్రహరన్ = మోదుచు) సహస్రాక్షః = దేవేంద్రుడు, అసురాన్ ఇవ = దైత్యులనువలె, నాశయామాస = నాశ మొందించెను.

తాత్పర్యము :– అప్పుడు హనుమ శత్రుసైన్యమునందలి గుఱ్ఱములను పైకెత్తి గుఱ్ఱములను మోదియు, అట్లే ఏనుగులతో ఏనుగులను మోదియు, యోధులతోనే

యోధులను మోదియు, దేవేంద్రుడు విజృంభించి రక్కసుల నుక్కడగించినట్లు ఆ రాక్షససైనికుల నెల్లరను తుదముట్టించెను.

శ్లో॥ హతై ర్నాగై స్తురంగై శ్చ భగ్నాక్షైశ్చ మహారథైః ।
హతైశ్చ రాక్షసై ర్భూమీ రుద్ధమార్గా సమంతతః ॥ 39

పదచ్ఛేదము :– హతైః – నాగైః – తురంగైః – చ – భగ్నాక్షైః – చ – మహారథైః, హతైః – చ – రాక్షసైః – భూమిః – రుద్ధమార్గా – సమంతతః ॥

అన్వయక్రమము :– భూమిః హతైః నాగైః, తురంగైశ్చ భగ్నాక్షైః మహారథైః చ, హతైః రాక్షసైః చ, సమంతతః రుద్ధమార్గా (అభవత్).

ప్రతిపదార్థము :– భూమిః = యుద్ధభూమి, హతైః = చనిపోయిన, నాగైః = ఏనుగుల చేతను, తురంగైః చ = గుఱ్ఱములచేతను, భగ్నాక్షైః = విఱిగిపోయిన ఇరుసులు గల్గినట్టి, మహారథైః చ = మహారథములతోడను, హతైః = చనిపోయిన, రాక్షసైః చ = రక్కసులతోడను, సమంతతః = అన్నివైపులను, రుద్ధమార్గా = అడ్డగింపబడిన త్రోవలు గలదిగ (అభవత్ = ఆయెను)

తాత్పర్యము :– ఆ రీతిగా హనుమచే ధ్వంసము చేయబడిన ఆ ప్రదేశమునందు చనిపోయిన ఏనుగులతోడను, గుఱ్ఱములతోడను, విఱిగిపోయిన పెద్దరథములతోడను, నిహతులై పడియున్న రాక్షసులతోను, యుద్ధభూమి కాలుమోపుటకు వీలులేనిదిగా నైనది.

శ్లో॥ తతః కపి స్తాన్ ధ్వజినీపతీన్ రణే
నిహత్య వీరాన్ సబలాన్ సవాహనాన్ ।
తదేవ వీరః పరిగృహ్య తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే ॥ 40

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"సేనాపతిపంచకవధో" నామ
షట్చత్వారింశస్సర్గః.

పదచ్ఛేదము :– తతః – కపిః – తాన్ – ధ్వజినీపతీన్ – రణే – నిహత్య – వీరాన్ – సబలాన్ – సవాహనాన్ – తత్ – ఏవ – వీరః – పరిగృహ్య – తోరణం – కృతక్షణః – కాలః – ఇవ – ప్రజాక్షయే ॥

అన్వయక్రమము :– తతః వీరః కపిః సబలాన్, సవాహనాన్ వీరాన్, తాన్ ధ్వజనీపతీన్ రణే నిహత్య, తత్ తోరణం ఏవ పరిగృహ్య, ప్రజాక్షయే కృతక్షణః కాలః ఇవ (అతిష్ఠత్).

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, వీరః = వీరుడైన, కపిః = హనుమ, సబలాన్ = సేనలతో కూడియున్నవారును, సవాహనాన్ = వాహనములతో గూడియున్న వారును, వీరాన్ = మహావీరులును అగు, తాన్ ధ్వజనీపతీన్ = ఆ సేనాధిపతులను, రణే = యుద్ధమున, నిహత్య = వధించి, ప్రజాక్షయే = జనులను అంతమొందించుటలో, కృతక్షణః = పూనిన వేడుకగల్గినట్టి, కాలః ఇవ = యముడువలె, తత్ తోరణమ్ ఏవ = ఆ బహిర్ద్వారమునే, పరిగృహ్య = స్వీకరించి, (అతిష్ఠత్ = నిలచియుండెను).

తాత్పర్యము :– అప్పు డా వీరుడైన హనుమ అనంతములైన సైన్యములతోను, రథగజాది వాహనములతోను రణమునకు వచ్చియున్న ఆ సేనానాయకపంచకమును పరిమార్చి ప్రజాక్షయమునకై సమాయత్తుడైన మృత్యుదేవతవలె ఎప్పటివలె చైత్యప్రాసాదముయొక్క బహిర్ద్వారము మీదనే అధివసించెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"సేనాపతి పంచక వధ" అను
నలుబదియాఱవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

సప్తచత్వారింశసర్గ

శ్లో॥ సేనాపతీన్ పంచ స తు ప్రమాపితాన్
హనూమతా సానుచరాన్ సవాహనాన్ ।
నిశమ్య రాజా సమరోద్ధతోన్ముఖం
కుమార మక్షం ప్రసమైక్షతాగ్రతః ॥ 1

పదచ్ఛేదము :– సేనాపతీన్ – పంచ – సః – తు – ప్రమాపితాన్ – హనూమతా – సానుచరాన్ – సవాహనాన్ – నిశమ్య – రాజా – సమరోద్ధతోన్ముఖం – కుమారమ్ – అక్షం – ప్రసమైక్షత – అగ్రతః ॥

అన్వయక్రమము :– సః రాజా సానుచరాన్, సవాహనాన్, పంచసేనాపతీన్ హనుమతా ప్రమాపితాన్ నిశమ్య అగ్రతః (స్థితం) సమరోద్ధతోన్ముఖం కుమారమ్ అక్షం ప్రసమైక్షత.

ప్రతిపదార్థము :– సః రాజా = ఆ రాక్షసరాజు, సానుచరాన్ = అనుచరులతో కూడినవారును, సవాహనాన్ = వాహనములతో కూడినవారునగు, పంచ సేనాపతీన్ = ఐదుగురు సేనాధిపతులను, హనుమతా = హనుమచే, ప్రమాపితాన్ = సంహరింప బడినవారినిగా, నిశమ్య = విని, అగ్రతః = ఎదుట, (స్థితం = ఉన్నట్టి) సమరోద్ధ తోన్ముఖం = యుద్ధమునందు ఉద్ధతుడై వేగిరపడుచున్నవాడు అగు, కుమారమ్ అక్షం = పుత్రుడైన అక్షుని, ప్రసమైక్షత = చూచెను.

తాత్పర్యము :– హనుమచే తన సేనాధిపతులు ఏవురును చతురంగబలసమేతముగా వధింపబడినట్లు విని, రావణాసురుడు తన ఎదుటనే యుద్ధమున కేగి హనుమతో పోరాడుటకై ఉవ్విళ్ళూరుచున్న అక్షకుమారుని గాంచెను.

శ్లో॥ స తస్య దృష్ట్యర్పణసంప్రచోదితః
ప్రతాపవాన్ కాంచనచిత్రకార్ముకః ।
సముత్పపా తాథ సద స్యుదీరితః
ద్విజాతిముఖ్యై ర్హవిషేవ పావకః ॥ 2

పదచ్ఛేదము :- సః - తస్య - దృష్ట్యర్పణసంప్రచోదితః - ప్రతాపవాన్ - కాంచనచిత్రకార్ముకః - సముత్పపాత - అథ - సదసి - ఉదీరితః - ద్విజాతిముఖ్యైః - హవిషా - ఇవ - పావకః ॥

అన్వయక్రమము :- అథ సదసి తస్య దృష్ట్యర్పణసంప్రచోదితః, ప్రతాపవాన్, కాంచనచిత్రకార్ముకః సః ద్విజాతిముఖ్యైః, హవిషా ఉదీరితః పావకః ఇవ సముత్పపాత.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, సదసి = రాజసభయందు, తస్య = ఆ రావణుని యొక్క, దృష్ట్యర్పణ సంప్రచోదితః = చూపును ఉంచుటచే ప్రోత్సహింపబడినట్టివాడును, ప్రతాపవాన్ = పరాక్రమవంతుడును, కాంచనచిత్రకార్ముకః = బంగరు చిత్తరువులతో గూడినట్టి ధనుస్సు గలవాడును అగు, సః = ఆ యక్షకుమారుడు, ద్విజాతిముఖ్యైః = విప్రశ్రేష్ఠులచే, ఉదీరితః = వృద్ధినొందింపబడిన, పావకః ఇవ = అగ్నిహోత్రుడువలె, సముత్పపాత = మీదికి లేచెను.

తాత్పర్యము :- అప్పుడు ఆ రాజసభలో రావణుడు తనమీద దృష్టిపఱపి ప్రోత్సహింపగా గొప్ప ప్రతాపశాలియగు ఆ యక్షకుమారుడు కాంచనచిత్రములతో గూడిన తన ధనుస్సును చేతధరించి యజ్ఞశాలలో బ్రాహ్మణులచే ఆజ్యాదిహోమద్రవ్యములతో వృద్ధిచేయబడిన అగ్నిహోత్రునివలె ఒక్కసారిగా లేచి నిలచెను.

శ్లో॥ తతో మహద్బాలదివాకరప్రభం
ప్రతప్త జాంబూనదజాల సంతతమ్ ।
రథం సమాస్థాయ యయౌ స వీర్యవాన్
మహాహరిం తం ప్రతి నైరృతర్షభః ॥ **3**

పదచ్ఛేదము :- తతః - మహత్ - బాలదివాకరప్రభం - ప్రతప్తజాంబూనదజాల సంతతమ్, రథం - సమాస్థాయ - యయౌ - సః - వీర్యవాన్ - మహాహరిం - తం - ప్రతి - నైరృతర్షభః ॥

అన్వయక్రమము :- తతః వీర్యవాన్ సః నైరృతర్షభః ప్రతప్తజాంబూనదజాలసంతతం, బాలదివాకరప్రభం, మహత్ రథం సమాస్థాయ తం మహాహరిం ప్రతి యయౌ.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, వీర్యవాన్ = పరాక్రమశాలియైన, సః నైరృతర్షభః = ఆ రాక్షసశ్రేష్ఠుడు, ప్రతప్తజాంబూనదజాలసంతతం = మేలిమి బంగరుగొలుసులతో నిండినట్టిదియును, బాలదివాకరప్రభం = లేతసూర్యుని కాంతివంటి కాంతి గలదియునగు, మహత్ = గొప్పదైన, రథం = రథమును, సమాస్థాయ = అధిష్ఠించి, తం మహాహరిం ప్రతి = ఆ వానరశ్రేష్ఠునిగూర్చి, యయౌ = వెడలెను.

తాత్పర్యము :- వెంటనే మహాపరాక్రమవంతుడగు ఆ అక్షకుమారుడు శుద్ధమైన బంగారు జాలరులతో అంతటను అలంకరింపబడి లేత సూర్యునివలె గొప్ప ప్రకాశముతో వెలయుచున్న గొప్పదైన రథమును అధిష్ఠించి హనుమ నెదుర్కొనుటకై వెడలెను.

శ్లో॥ తత స్తపస్సంగ్రహసంచయార్జితం
ప్రతప్తజాంబూనదజాలశోభితమ్ ।
పతాకినం రత్నవిభూషితధ్వజం
మనోజవాష్టాశ్వవరై స్సుయోజితమ్ ॥ 4

శ్లో॥ సురాసురాధృష్య మసంగచారిణమ్
రవిప్రభం వ్యోమచరం సమాహితమ్ ।
సతూణ మష్టాసినిబద్ధబంధురం
యథాక్రమావేశితశక్తితోమరమ్ ॥ 5

శ్లో॥ విరాజమానం ప్రతిపూర్ణవస్తునా
సహేమదామ్నా శశిసూర్యవర్చసా ।
దివాకరాభం రథ మాస్థిత స్తతః
స నిర్జగా మామరతుల్యవిక్రమః ॥ 6

పదచ్ఛేదము :- తతః - తపస్సంగ్రహసంచయార్జితమ్ - ప్రతప్తజాంబూనదజాల శోభితమ్ - పతాకినం - రత్నవిభూషితధ్వజం - మనోజవాష్టాశ్వవరైః - సుయోజితమ్ - సురాసురాధృష్యమ్ - అసంగచారిణమ్ - రవిప్రభం - వ్యోమచరం - సమాహితమ్ - సతూణమ్ - అష్టాసినిబద్ధబంధురం - యథాక్రమావేశితశక్తితోమరమ్ - విరాజమానం - ప్రతిపూర్ణవస్తునా - సహేమదామ్నా - శశిసూర్యవర్చసా - దివాకరాభం - రథమ్ - ఆస్థితః - తతః - స - నిర్జగామ - అమరతుల్యవిక్రమః ॥

అన్వయక్రమము :- తతః అమరతుల్యవిక్రమః సః తపస్సంగ్రహసంచయార్జితం, ప్రతప్తజాంబూనదజాలశోభితం, పతాకినం, రత్నవిభూషితధ్వజం, మనోజవాష్టాశ్వవరైః సుయోజితం, సురాసురాధృష్యమ్ అసంగచారిణం, రవిప్రభం, వ్యోమచరం, సమాహితం, సతూణమ్, అష్టాసినిబద్ధబంధురం, యథాక్రమావేశితశక్తితోమరం, శశిసూర్యవర్చసా, సహేమదామ్నా, ప్రతిపూర్ణవస్తునా విరాజమానం, దివాకరాభం రథమ్ ఆస్థితః సన్ తతః నిర్జగామ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, అమరతుల్యవిక్రమః = దేవతలతో సమానమైన పరాక్రమము కల్గినట్టి, సః = ఆ అక్షకుమారుడు, తపస్సంగ్రహసంచయార్జితం = ప్రోగుచేసి మహాతపోరాశిచే సంపాదింపబడినదియును, ప్రతప్తజాంబూనదజాలశోభితం = మేలిమి బంగరుజాలరులతో ప్రకాశించుచున్నదియును, పతాకినం = శ్రేష్ఠమైన జండా కలదియును, రత్నవిభూషితధ్వజం = రత్నములచే అలంకరింపబడిన ధ్వజస్తంభము గలదియును, మనోజవాష్టాశ్వవరైః = మనోవేగముకల్గిన ఎనిమిది హయశ్రేష్ఠములచే, సుయోజితం = పూన్చబడినదియును, సురాసురాధృష్యమ్ = దేవదానవుల కెదిరింపరానిదియును, అసంగచారిణం = నేలకంటకుండ చరించునదియును, సతూణమ్ = అమ్ములపొదులతో గూడినదియును, అష్టాసినిబద్ధబంధురం = ఎనిమిది ఖడ్గములతో బంధింపబడిన రథఫలకములు గలదియును, యథాక్రమావేశితశక్తితోమరం = యథాస్థానమునం దుంచబడినట్టి శక్తి తోమరాయుధములు గలదియును, శశిసూర్యవర్చసా = చంద్రసూర్యులవంటి కాంతికల్గినట్టి, సహేమదామ్నా = బంగరుపూలమాలికలతో, ప్రతిపూర్ణవస్తునా = సంపూర్ణమైన ద్రవ్యములు కలిగియున్న పరికరములతో, విరాజమానం = వెలయుచున్నదియును, (వ్యోమచరం = ఆకాశమున చరించుచున్నదియును), సమాహితం = చక్కగా కూర్చబడినదియును, దివాకరాభం = సూర్యునివంటి తేజస్సు గలదియునగు, రథమ్ = రథమును, ఆస్థితః (సన్) = ఆరోహించినవాడై, తతః = అటనుండి, నిర్జగామ = వెడలెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– రవిప్రభం దివాకరాభం అని రెండు మాఱులు చెప్పుటవలన ఆతని రథము సూర్యునివంటి కాంతికల్గియున్నదియు, ఆకాశమున ప్రజ్వలించుచున్నట్టిదనియు చెప్పుటకని తెలియవలెను. శశిసూర్యవర్చసా సహేమదామ్నా – అనగా ఆ బంగారుమాలికలందు కొంతభాగము చంద్రునివలె తెల్లగను, కొంతభాగము సూర్యునివలె ఎఱ్ఱగను ఉన్నదని తెలియవలెను.

తిలకము :– అష్టాసినిబద్ధబంధురం – ఎనిమిది దిక్కులందును కత్తులను అడ్డముగ కట్టియుంచిరని భావము.

వాసుదాసస్వామి :– పూర్వపు మంత్రులు రథముల విడిచి యాకాశమున యుద్ధము చేయుటచే జంపబడిరని విని, యాకాశమునందు జేరి, మీదినుండియే యుద్ధముచేయ సాధ్యపడునట్లు ఆకాశమున సంచరించగల రథముపై గూర్చుండి, దూరపు యుద్ధమునకు బాణములు, ద్వంద్వయుద్ధమునకు గత్తులు నని యుభయవిధ

సాధనములు గ్రహించినవాడయ్యెనని భావము.

తాత్పర్యము :– అప్పుడు దేవతలతో సమానమైన పరాక్రమము గల్గినట్టి ఆ అక్ష కుమారుడు తన రథమును అధిష్ఠించి హనుమమీదికి వెడలెను. అట్లాతడారోహించిన రథము అతడు చిరకాలము తపస్సుచేసి సంపాదించినట్టిది. మేలిమి బంగరు గొలుసులతో ప్రకాశించుచున్నట్టిది. రత్నాలంకృతమైన ధ్వజములతోడను, సుందరమైన జండాలతోడను ఆ రథము వెలయుచుండెను. మనోవేగము గల ఎనిమిది గుఱ్ఱములు దానికి పూన్చబడి యుండెను. దేవదానవులకు సమీపింపరానిదై, నేలనంటకయే సంచరింపగలదై, సూర్యతేజముతో ఆకాశమున సంచరించుచున్నదై, యుద్ధమునకు వలయు సమస్తవస్తువులతో నిండినదై, అమ్ములపొదులను శక్తి తోమరాది ఆయుధములను చక్కగా అమర్చుకొన్నదై, ఎనిమిది మూలలందును పలువిధములగు ఖడ్గములతో నిండియుండి, చంద్రసూర్యుల కాంతులను బోలిన బంగరుపూల మాలికలతోను సమగ్రమైన సమరోచితద్రవ్యములతోను నిండియుండి, సూర్యతేజముతో ఆ రథము అద్భుతరూపము కలిగి వెలుగొందుచుండెను.

శ్లో॥ స పూరయన్ ఖం చ మహీం చ సాచలాం
తురంగమాతంగమహారథస్వనైః ।
బలై స్సమేతై స్సహ తోరణస్థితం
సమర్థ మాసీన ముపాగమ త్కపిమ్ ॥ 7

పదచ్ఛేదము :– సః – పూరయన్ – ఖం – చ – మహీం – చ – సాచలాం – తురంగ మాతంగ మహారథస్వనైః, బలైః – సమేతైః – సహ – తోరణస్థితం – సమర్థమ్ – ఆసీనమ్ – ఉపాగమత్ – కపిమ్ ॥

అన్వయక్రమము :– సః తురంగమాతంగమహారథస్వనైః ఖం చ, సమేతైః బలైః సహ సాచలాం మహీం చ పూరయన్, తోరణస్థితం, సమర్థమ్, ఆసీనం కపిమ్ ఉపాగమత్.

ప్రతిపదార్థము :– సః = ఆతడు, తురంగమాతంగమహారథస్వనైః = గుఱ్ఱముల యొక్కయు, ఏనుగుల యొక్కయు, మహారథముల యొక్కయు ధ్వనులతో, ఖం చ = ఆకాశమును, సమేతైః = కూడియున్నట్టి, బలైః సహ = సైన్యములతోగూడ, సాచలాం = పర్వతములతో గూడిన, మహీం చ = భూమిని, పూరయన్ = నిండించుచు, తోరణస్థితం = ద్వారముపైనున్న, సమర్థమ్ = సమర్థుడై, ఆసీనం = కూర్చొనియున్న, కపిమ్ = హనుమను, ఉపాగమత్ = సమీపించెను.

సూచన :– ఈశ్లోకమున ఈ మూడవపాదమున 'బలైః సమేతైః సహితః రణస్థితం'

అను పాఠాంతరమున్నది. దానికి తన బలములతో కూడినవాడై యుద్ధభూమి యందున్నట్టి హనుమను చేరెను అని అర్థము.

తాత్పర్యము :– ఆ అక్షకుమారుడు తన వెంటనున్న గుఱ్ఱములును, ఏనుగులును, మహారథములును చేయుచున్న ధ్వనులతో ఆకసమును, తన వెంటనున్న అపారమైన సైన్యములతో భూమినంతను నిండించుచు ద్వారముపై కూర్చున్న హనుమను చేరవచ్చెను.

శ్లో॥ స తం సమాసాద్య హరిం హరీక్షణో
యుగాంతకాలాగ్నిమివ ప్రజాక్షయే ।
అవస్థితం విస్మితజాతసంభ్రమః
సమైక్షతాక్షో బహుమానచక్షుషా ॥ 8

పదచ్ఛేదము :– సః – తం – సమాసాద్య – హరిం – హరీక్షణః – యుగాంత కాలాగ్నిమ్ – ఇవ – ప్రజాక్షయే, అవస్థితం – విస్మితజాతసంభ్రమః – సమైక్షత – అక్షః – బహుమానచక్షుషా ॥

అన్వయక్రమము :– ప్రజాక్షయే అవస్థితం యుగాంతకాలాగ్నిమ్ ఇవ (స్థితం) హరిం సమాసాద్య విస్మితజాతసంభ్రమః హరీక్షణః, సః అక్షః బహుమానచక్షుషా తం సమైక్షత.

ప్రతిపదార్థము :– ప్రజాక్షయే = ప్రజానాశనమునందు, అవస్థితం = ఉద్యుక్తుడైనట్టి, యుగాంతకాలాగ్నిమ్ ఇవ = ప్రళయకాలమునందలి అగ్నివలె, (స్థితం = ఉన్నట్టి) హరిం = హనుమను, సమాసాద్య = చేరి, విస్మితజాతసంభ్రమః = ఆశ్చర్యముచే కలిగిన తొట్రుబాటు కలిగినట్టి, హరీక్షణః = సింహమువంటి చూపుగల్గిన, సః అక్షః = ఆ అక్షకుమారుడు, బహుమానచక్షుషా = గౌరవముతో కూడిన దృష్టితో, తం = ఆ హనుమను, సమైక్షత = తిలకించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– విస్మితజాతసంభ్రమం అని ఒక పాఠము. ఇది హనుమకు విశేషణ మగును. ఇట్టి చిన్నవయస్సులో నున్న ఈతడు నావంటివానిమీదికి ఎట్లు వచ్చినాడో యని హనుమకు రావణుని పుత్రునిపై ఆ సమయమున గల్గిన వాత్సల్యమును ఆదర భావమును ఈ విశేషణము సూచించుచున్నది.

తాత్పర్యము :– చైత్యద్వారముపై ప్రళయకాలమందు ప్రజాసంహారమున కుద్యుక్తుడైన భయంకరాగ్నివలె ప్రజ్వలించుచున్న ఆ హనుమను సమీపించి ఆతని తేజో

విశేషమునకు ఆశ్చర్యమును తొట్రుపాటును గలుగుచుండగా ఆ అక్షకుమారుడు ఆతనిని గొప్ప గౌరవభావముతో చూచెను.

శ్లో॥ స తస్య వేగం చ కపే ర్మహాత్మనః
పరాక్రమం చారిషు రావణాత్మజః ।
విచారయన్ స్వం చ బలం మహాబలో
యుగక్షయే సూర్య ఇవాభ్యవర్ధత ॥ 9

పదచ్ఛేదము :- సః - తస్య - వేగం - చ - కపేః - మహాత్మనః - పరాక్రమం - చ - అరిషు - రావణాత్మజః - విచారయన్ - స్వం - చ - బలం - మహాబలః - యుగక్షయే - సూర్యః - ఇవ - అభ్యవర్ధత ॥

అన్వయక్రమము :- మహాబలః సః రావణాత్మజః మహాత్మనః తస్య కపేః వేగం చ, అరిషు పరాక్రమం చ, స్వం బలం చ విచారయన్ యుగక్షయే సూర్యః ఇవ అభ్యవర్ధత.

ప్రతిపదార్థము :- మహాబలః = మహాబలాఢ్యుడైన, సః రావణాత్మజః = ఆ రావణపుత్రుడు, మహాత్మనః = మహనీయుడైన, తస్య కపేః = ఆ హనుమయొక్క, వేగం చ = జవమును, అరిషు = శత్రువుల విషయమున, పరాక్రమం చ = పరాక్రమమును, స్వం = తన, బలం చ = బలమును, విచారయన్ = పర్యాలోచించుచు, యుగక్షయే = ప్రళయకాలమునందలి, సూర్యః ఇవ = సూర్యుడువలె, అభ్యవర్ధత = విజృంభించుచుండెను.

తాత్పర్యము :- మహావీరుడైన ఆ అక్షకుమారుడు సాటిలేని వీరుడగు ఆ హనుమ యొక్క ప్రతాపమును, శత్రువులపై ఆతడు చూపుచున్న పరాక్రమమును తన బలవిశేషమును చక్కగా గుర్తించుకొనుచు ప్రళయకాలమునందలి సూర్యుడువలె విజృంభింపసాగెను.

శ్లో॥ స జాతమన్యుః ప్రసమీక్ష్య విక్రమం
స్థిరం స్థిత స్సంయతి దుర్నివారణమ్ ।
సమాహితాత్మా హనుమంత మాహవే
ప్రచోదయామాస శరై స్త్రిభి శ్శితైః ॥ 10

పదచ్ఛేదము :- సః - జాతమన్యుః - ప్రసమీక్ష్య - విక్రమం - స్థిరం - స్థితః - సంయతి - దుర్నివారణమ్, సమాహితాత్మా - హనుమంతమ్ - ఆహవే - ప్రచోదయామాస - శరైః - త్రిభిః - శితైః ॥

అన్వయక్రమము :– జాతమన్యుః సః సంయతి దుర్నివారణం (తస్య) విక్రమం ప్రసమీక్ష్య, సమాహితాత్మా స్థిరం స్థితః సన్ హనుమంతం శితైః త్రిభిః శరైః ఆహవే ప్రచోదయామాస.

ప్రతిపదార్థము :– జాతమన్యుః = జనించిన క్రోధము కల్గినట్టి, సః = ఆ అక్ష కుమారుడు, సంయతి = యుద్ధమునందు, దుర్నివారణమ్ = వారింపశక్యముగాని, తస్య విక్రమం = ఆతని పరాక్రమమును, ప్రసమీక్ష్య = చూచి, సమాహితాత్మా = కూడదీసికొనిన మనస్సుగలవాడై, స్థిరం = స్థిరముగా, స్థితః సన్ = నిలచినవాడగుచు, హనుమంతం = హనుమను, శితైః = వాడియైన, త్రిభిః శరైః = మూడు బాణములతో, ఆహవే = యుద్ధమున, ప్రచోదయామాస = ప్రేరేపించెను. (కొట్టెను).

తాత్పర్యము :– మిక్కిలి కోపించియున్న ఆ అక్షకుమారుడు యుద్ధమునందు ఆ హనుమ చూపుచున్న పరాక్రమవిశేషమును గ్రహించి తన ధైర్యమును కూడగట్టుకొని దృఢముగ నిల్చినవాడై, మూడు వాడిబాణము లుపయోగించి హనుమను యుద్ధమునకు ప్రోత్సహించెను.

శ్లో॥ తతః కపిం తం ప్రసమీక్ష్య గర్వితం
జితశ్రమం శత్రుపరాజయోర్జితమ్ ।
అవైక్షత తాక్ష స్సముదీర్ణమానసం
స బాణపాణిః ప్రగృహీతకార్ముకః ॥ 11

పదచ్ఛేదము :– తతః – కపిం – తం – ప్రసమీక్ష్య – గర్వితం – జితశ్రమం – శత్రుపరాజయోర్జితమ్ – అవైక్షత – అక్షః – సముదీర్ణమానసం – సః – బాణపాణిః – ప్రగృహీతకార్ముకః ॥

అన్వయక్రమము :– బాణపాణిః ప్రగృహీతకార్ముకః సః అక్షః ప్రసమీక్ష్య, తం కపిం జితశ్రమం, శత్రుపరాజయోర్జితం, సముదీర్ణమానసం, గర్వితమ్ అవైక్షత.

ప్రతిపదార్థము :– బాణపాణిః = బాణములు చేతియందు గలవాడును, ప్రగృహీత కార్ముకః = స్వీకరింపబడిన ధనుస్సు గలవాడునగు, సః అక్షః = ఆ అక్షకుమారుడు, ప్రసమీక్ష్య = బాగుగా చూచి, తం కపిం = ఆ హనుమను, జితశ్రమం = జయించిన శ్రమగలవానినిగను, శత్రుపరాజయోర్జితం = శత్రువుల అపజయముచే విజృంభించిన వానినిగను, సముదీర్ణమానసం = పొంగుచున్న మనస్సు గలవానినిగను, గర్వితం = గర్వించియున్నవానినిగను, అవైక్షత = కనుగొనెను.

తాత్పర్యము :– బాణములను, ధనుస్సును ధరించి యుద్ధమునందు నిలచియున్న ఆ

అక్షకుమారుడు ఎదుటనున్న హనుమ గంభీరవిగ్రహమును జూచి ఆతడు శ్రమనెఱుగని వాడనియు, శత్రువుల నోడించి ఉత్సాహముతో నున్నవాడనియు, ఇంకను యుద్ధమునకు కుతూహలముతో గర్వించి శత్రువుకొఱకు నిరీక్షించుచున్నాడనియు గ్రహించెను.

శ్లో॥ స హేమనిష్కాంగదచారుకుండలః
సమాససా దాశుపరాక్రమః కపిమ్ ।
తయో ర్బభూ వాప్రతిమ స్సమాగమః
సురాసురాణామపి సంభ్రమప్రదః ॥ 12

పదచ్ఛేదము :– సః – హేమనిష్కాంగదచారుకుండలః – సమాససాద – ఆశుపరాక్రమః – కపిమ్, తయోః – బభూవ – అప్రతిమః – సమాగమః – సురాసురాణామ్ – అపి – సంభ్రమప్రదః ॥

అన్వయక్రమము :– హేమనిష్కాంగదచారుకుండలః, ఆశుపరాక్రమః సః, కపిం ఆససాద, తయోః సమాగమః సురాసురాణాం అపి సంభ్రమప్రదః అప్రతిమః బభూవ.

ప్రతిపదార్థము :– హేమనిష్కాంగదచారుకుండలః = సువర్ణమయమైన పతకములును, భుజకీర్తులును, రమ్యమైన కర్ణాభరణములును గలవాడై, ఆశుపరాక్రమః = తీవ్రమైన పరాక్రమముగల్గినట్టి, సః = ఆ అక్షకుమారుడు, కపిం = హనుమను, ఆససాద = చేరెను. తయోః = ఆ ఇరువురియొక్క (హనుమయొక్కయు అక్షునియొక్కయు), సమాగమః = కలయిక, సురాసురాణామ్ అపి = దేవతలకును దానవులకును గూడ, సంభ్రమప్రదః = తొట్రుబాటు గల్గించునట్టిదై, అప్రతిమః = సాటిలేనిదిగ, బభూవ = ఉండెను.

తాత్పర్యము :– సువర్ణహారములును, భుజకీర్తులును, కర్ణాభరణములును ధరించియున్న ఆ మహావీరుడు వెంటనే హనుమ నెదుర్కొనెను, యుద్ధమునందు మహావీరులైన వారిరువురి పోరాటమును దేవదానవులకు గూడ సంభ్రమకారణమై సాటిలేనిదిగా కానవచ్చుచుండెను.

శ్లో॥ రరాస భూమిర్న తతాప భానుమాన్
వవౌ న వాయుః ప్రచచాల చాచలః ।
కపేః కుమారస్య చ వీక్ష్య సంయుగం
ననాద చ ద్యౌ రుదధిశ్చ చుక్షుభే ॥ 13

పదచ్ఛేదము :– రరాస – భూమిః – న – తతాప – భానుమాన్ – వవౌ – న –

వాయుః - ప్రచచాల - చ - అచలః, కపేః - కుమారస్య - చ - వీక్ష్య - సంయుగం - ననాద - చ - ద్యౌః - ఉదధిః - చ - చుక్షుభే ॥

అన్వయక్రమము :- కపేః కుమారస్య చ సంయుగం వీక్ష్య భూమిః రరాస; భానుమాన్ న తతాప; వాయుః న వవౌ; అచలః ప్రచచాల; ద్యౌః చ ననాద, ఉదధిః చ చుక్షుభే.

ప్రతిపదార్థము :- కపేః = హనుమయొక్కయు, కుమారస్య చ = అక్షకుమారుని యొక్కయు, సంయుగం = యుద్ధమును, వీక్ష్య = చూచి, భూమిః = భూమి, రరాస = ఆక్రోశించెను, భానుమాన్ = సూర్యుడు, న తతాప = తపింపకుండెను, వాయుః = వాయువు, న వవౌ = వీవకుండెను, అచలః = పర్వతము, ప్రచచాల = చలించెను, ద్యౌః చ = ఆకాశము, ననాద = శబ్దము చేసెను, ఉదధిః చ = సముద్రము, చుక్షుభే = క్షోభిల్లెను.

తాత్పర్యము :- అప్పుడు ఆ హనుమ యొక్కయు అక్షకుమారుని యొక్కయు సంగ్రామమును గాంచి భయముచే భూమి ఆక్రోశింపదొడగెను. సూర్యుడు చల్ల బడుచుండెను. వాయువు వీచుట మానివేసెను. పర్వతములు కంపింప దొడగెను. ఆకాశము గొప్ప నాదము చేయుచుండెను. సముద్రము కలగుండుపడెను.

శ్లో॥ తత స్స వీర స్సుముఖాన్ పతత్రిణః
సువర్ణపుంఖా న్సవిషా ని వోరగాన్ ।
సమాధిసంయోగవిమోక్షతత్త్వవిత్
శరా నథ త్రీన్ కపిమూ ర్ధ్న్యపాతయత్ ॥ 14

పదచ్ఛేదము :- తతః - సః - వీరః - సుముఖాన్ - పతత్రిణః - సువర్ణపుంఖాన్ - సవిషాన్ - ఇవ - ఉరగాన్, సమాధిసంయోగవిమోక్షతత్త్వవిత్ - శరాన్ - అథ - త్రీన్ - కపిమూర్ధ్ని - అపాతయత్ ॥

అన్వయక్రమము :- అథ - సమాధిసంయోగవిమోక్షతత్త్వవిత్ సః వీరః తతః కపిమూర్ధ్ని సవిషాన్ ఉరగాన్ ఇవ సుముఖాన్ పతత్రిణః సువర్ణపుంఖాన్ త్రీన్ శరాన్ అపాతయత్.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, సమాధిసంయోగవిమోక్షతత్త్వవిత్ = గ్రహించుట కూర్చుట విడుచుట అనువానియొక్క రహస్యములు తెలిసినట్టి, సః వీరః = ఆ రాక్షసవీరుడు, తతః = అటుపిమ్మట, కపిమూర్ధ్ని = హనుమ శిరమున, సవిషాన్ = విషముతో కూడిన, ఉరగాన్ ఇవ = సర్పములనువలె, సుముఖాన్ = మంచిమొనలు గలవియును, పతత్రిణః = చక్కనిఱెక్కలుగలవియును, సువర్ణపుంఖాన్ = హేమపుంఖములు కలవియునగు, త్రీన్ శరాన్ = మూడు బాణములను, అపాతయత్

= ప్రయోగించెను.

తాత్పర్యము :- అప్పుడా సమయమున అస్త్రముయొక్క ప్రయోగోపసంహారాది రహస్యములను చక్కగా నెఱిగినట్టి వీరుడైన ఆ అక్షకుమారుడు ఆ హనుమ శిరముపై విషపూర్ణములైన సర్పములవంటి చక్కని ములుకులును ఱెక్కలును పుంఖములును కలిగినట్టి సువర్ణనిర్మితములగు మూడు బాణములతో కొట్టెను.

శ్లో॥ స తై శ్శరై ర్మూర్ధ్ని సమం నిపాతితైః
క్షరన్నసృగ్దిగ్ధవివృత్తలోచనః ।
నవోదితాదిత్యనిభ శ్శరాంశుమాన్
వ్యరోచ తాదిత్య ఇవాంశుమాలికః ॥ 15

పదచ్ఛేదము :- సః - తైః - శరైః - మూర్ధ్ని - సమం - నిపాతితైః - క్షరన్నసృగ్దిగ్ధ వివృత్తలోచనః, నవోదితాదిత్యనిభః - శరాంశుమాన్ - వ్యరోచత - ఆదిత్యః - ఇవ - అంశుమాలికః ॥

అన్వయక్రమము :- మూర్ధ్ని సమం నిపాతితైః తైః శరైః క్షరన్నసృగ్దిగ్ధవివృత్తలోచనః శరాంశుమాన్ సః నవోదితాత్యనిభః (సన్) అంశుమాలికః ఆదిత్యః ఇవ వ్యరోచత.

ప్రతిపదార్థము :- మూర్ధ్ని = తలపై, సమం = ఒక్కమాఱుగా, నిపాతితైః = ప్రయోగింపబడిన, తైః శరైః = ఆ బాణములచే, క్షరన్నసృగ్దిగ్ధవివృత్తలోచనః = స్రవించుచున్న రక్తముచే పూయబడిన తిరుగుడుపడుచున్న నేత్రములు గలవాడును, శరాంశుమాన్ = బాణము లనెడు కిరణములు గలవాడు నగు, సః = ఆ హనుమ, నవోదితాత్యనిభః (సన్) = క్రొత్తగ నుదయించిన సూర్యునితో సమానమగుచు, అంశుమాలికః = కిరణములవఱుస కలిగినట్టి, ఆదిత్యః ఇవ = సూర్యుడువలె, వ్యరోచత = ప్రకాశించెను.

తాత్పర్యము :- అట్లు తన తలపై ప్రయోగింపబడిన ఆ బంగారు బాణములచే గాయములనుండి స్రవించుచున్న రక్తముచేత తడిసి చలించుచున్న నేత్రములు గల్గిన ఆ హనుమ ఎఱ్ఱని ముఖముతోను, పచ్చని కిరణములవంటి బాణములతోను ఉదయకాలమున లేతకిరణములతో ప్రకాశించుచున్న సూర్యునివలెనే గానవచ్చుచుండెను.

శ్లో॥ తత స్స పింగాధిపమంత్రిసత్తమః
సమీక్ష్య తం రాజవరాత్మజం రణే ।
ఉదగ్రచిత్రాయుధచిత్రకార్ముకం
జహర్ష చాపూర్యత చాహవోన్ముఖః ॥ 16

పదచ్ఛేదము :- తతః - సః - పింగాధిపమంత్రిసత్తమః - సమీక్ష్య - తం - రాజవరాత్మజం - రణే, ఉదగ్రచిత్రాయుధచిత్రకార్ముకం, జహర్ష - చ - ఆపూర్యత - చ - ఆహవోన్ముఖః ॥

అన్వయక్రమము :- తతః పింగాధిపమంత్రిసత్తమః సః రణే ఉదగ్రచిత్రాయుధ చిత్రకార్ముకం తం రాజవరాత్మజం సమీక్ష్య జహర్ష, ఆహవోన్ముఖః (సన్) ఆపూర్యత చ.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, పింగాధిపమంత్రిసత్తమః = వానరరాజు యొక్క అమాత్యశ్రేష్ఠుడైన, సః = ఆ హనుమ, రణే = యుద్ధమున, ఉదగ్రచిత్రాయుధచిత్రకార్ముకం = శ్రేష్ఠములును చిత్రములునగు ఆయుధములను, చిత్రమైన వింటిని ధరించియున్న, తం రాజవరాత్మజం = ఆ మహారాజు పుత్రుడైన అక్షుని, సమీక్ష్య = చూచి, జహర్ష = ఆనందించెను, ఆహవోన్ముఖః సన్ = యుద్ధమునకు ఆయత్తు డగుచు, ఆపూర్యత చ = (బలమును) పూరించుకొనెనుగూడ.

తాత్పర్యము :- వానరరాజుమంత్రులలో శ్రేష్ఠుడైన యా హనుమ, మహారాజపుత్రుడైన అక్షకుమారుడు శ్రేష్ఠములైన చిత్రవిచిత్రములగు ఆయుధములను, చిత్రమైన ధనుస్సును ధరించి ఎదురుగ నిలచి యుండుటను జూచి మిక్కిలి హర్షము నొందెను. యుద్ధమునకు సన్నద్ధుడగుచు ఎంతయు నుప్పొంగెనుకూడ.

శ్లో॥ స మందరాగ్రస్థ ఇ వాంశుమాలికః
వివృద్ధకోపో బలవీర్యసంయుతః ।
కుమార మక్షం సబలం సవాహనం
దదాహ నేత్రాగ్నిమరీచిభి స్తదా ॥ 17

పదచ్ఛేదము :- సః - మందరాగ్రస్థః - ఇవ - అంశుమాలికః - వివృద్ధకోపః - బలవీర్యసంయుతః - కుమారమ్ - అక్షం - సబలం - సవాహనం - దదాహ - నేత్రాగ్నిమరీచిభిః - తదా ॥

అన్వయక్రమము :- బలవీర్యసంయుతః, వివృద్ధకోపః సః మందరాగ్రస్థః అంశుమాలికః ఇవ తదా నేత్రాగ్నిమరీచిభిః సబలం సవాహనం కుమారమ్ అక్షం దదాహ.

ప్రతిపదార్థము :- బలవీర్యసంయుతః = బలముతోడను పరాక్రమముతోడను కూడినవాడును, వివృద్ధకోపః = హెచ్చిన కోపముగలవాడు నగు, సః = ఆ హనుమంతుడు, మందరాగ్రస్థః = మందరపర్వతముయొక్క శిఖరముపై నున్న, అంశుమాలికః ఇవ = సూర్యునివలె, తదా = అప్పుడు, నేత్రాగ్నిమరీచిభిః =

కన్నులందలి అగ్నిజ్వాలలచే, సబలం = సైన్యముతో కూడినవాడును, సవాహనం = వాహనముతో గూడినవాడునగు, కుమారమ్ అక్షం = అక్షకుమారుని, దదాహ = దహించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- మందరాగ్రస్థః - మందరము అనునది భూమధ్యము నందలి పర్వతము. దాని కొననున్న సూర్యుడు అనగా మధ్యాహ్నకాలమున మిక్కిలి ఉగ్రముగ నున్నవాడని అర్థము.

తాత్పర్యము :- మహాబలపరాక్రమసంపన్నుడైన ఆ హనుమ వాహనములతోను, సైన్యములతోను యుద్ధభూమిలో నిలచియున్న ఆ అక్షకుమారుని, మందరపర్వత శిఖరముపై ప్రజ్వలించుచున్న భాస్కరుడువలె క్రోధముతో నిప్పులు గ్రక్కుచున్న తన నేత్రములతో చూచుచు దహించెను.

శ్లో॥ తత స్స బాణాసనశక్రకార్ముకః
శరప్రవర్షో యుధి రాక్షసాంబుదః ।
శరా న్ముమోచా చాశు హరీశ్వరాచలే
వలాహకో వృష్టిమి వాచలోత్తమే ॥ 18

పదచ్ఛేదము :- తతః - సః - బాణాసనశక్రకార్ముకః - శరప్రవర్షః - యుధి - రాక్షసాంబుదః - శరాన్ - ముమోచ - ఆశు - హరీశ్వరాచలే, వలాహకః - వృష్టిమ్ - ఇవ - అచలోత్తమే ॥

అన్వయక్రమము :- తతః వలాహకః అచలోత్తమే వృష్టిమ్ ఇవ బాణసనశక్రకార్ముకః, శరప్రవర్షః సః రాక్షసాంబుదః హరీశ్వరాచలే ఆశు శరాన్ ముమోచ.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, వలాహకః = మేఘము, అచలోత్తమే = పర్వతశ్రేష్ఠముపై, వృష్టిమ్ ఇవ = వర్షమును వలె, బాణసనశక్రకార్ముకః = విల్లు అనెడు ఇంద్రధనుస్సు గలవాడును, శరప్రవర్షః = బాణము లనెడు పెద్దవర్షము గలవాడు నగు, సః రాక్షసాంబుదః = ఆ రాక్షసుడనెడి పర్వతముపై, హరీశ్వరాచలే = వానరశ్రేష్ఠ డనెడి పర్వతముపై, ఆశు = వెంటనే, శరాన్ = బాణము లనెడు జలములను, ముమోచ = వర్షించెను.

తాత్పర్యము :- అప్పుడా అక్షకుమారుడు అనెడు మేఘము, చేతిలో విల్లనెడు ఇంద్రధనుస్సును దాల్చి హనుమంతు డనెడు పర్వతముపై తీవ్రముగా బాణము లనెడు వర్షమును గురిపించెను. అప్పుడు హనుమ వర్షధారలచే కప్పబడియున్న పెద్ద

పర్వతమువలెనే కనిపించెను.

శ్లో॥ తతః కపి స్తం రణచండవిక్రమం
వివృద్ధతేజోబలవీర్యసంయుతమ్ ।
కుమార మక్షం ప్రసమీక్ష్య సంయుగే
ననాద హర్షాద్ఘనతుల్యనిస్వనః ॥ 19

పదచ్ఛేదము :- తతః - కపిః - తం - రణచండవిక్రమం, వివృద్ధతేజోబలవీర్య సంయుతమ్, కుమారమ్ - అక్షం - ప్రసమీక్ష్య - సంయుగే, ననాద - హర్షాత్ - ఘనతుల్యనిస్వనః ॥

అన్వయక్రమము :- తతః ఘనతుల్యనిస్వనః (సః) కపిః సంయుగే రణచండవిక్రమం వివృద్ధతేజోబలవీర్యసంయుతం తం కుమారమ్ అక్షం ప్రసమీక్ష్య హర్షాత్ ననాద.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, (సః)కపిః = ఆ హనుమ, రణచండవిక్రమం = యుద్ధమున తీవ్రమైన పరాక్రమము గలవాడును, వివృద్ధతేజోబలవీర్యసంయుతం = మిక్కిలి వృద్ధిపొందిన ప్రతాపముతోను బలముతోను పరాక్రమముతోను గూడినట్టి, తం కుమారమ్ అక్షం = ఆ అక్షకుమారుని, సంయుగే = యుద్ధమున, ప్రసమీక్ష్య = చూచి, ఘనతుల్యనిస్వనః సన్ = మేఘముతో సమానమైన ధ్వని గలవాడై, హర్షాత్ = సంతోషముతో, ననాద = గర్జించెను.

తాత్పర్యము :- అప్పు డా హనుమ యుద్ధమునందు గొప్ప పరాక్రమమును జూపుచు తనయెదుట అంతకంతకు మించిపోవుచున్న ప్రతాపముతోను, బలపరాక్రమములతోను విజృంభించుచున్న ఆ అక్షకుమారుని శౌర్యమును గాంచి తనకు కలిగిన హర్షాతిశయముతో పెద్ద ఉఱుమువంటి ధ్వనితో గర్జించెను.

శ్లో॥ స బాలభావా ద్యుధి వీర్యదర్పితః
ప్రవృద్ధమన్యుః క్షతజోపమేక్షణః ।
సమాససా దాప్రతిమం కపిం రణే
గజో మహాకూపమి వావృతం తృణైః ॥ 20

పదచ్ఛేదము :- సః - బాలభావాత్ - యుధి - వీర్యదర్పితః - ప్రవృద్ధమన్యుః - క్షతజోపమేక్షణః, సమాససాద - అప్రతిమం - కపిం - రణే - గజః - మహాకూపమ్ - ఇవ - ఆవృతం - తృణైః ॥

అన్వయక్రమము :- బాలభావాత్ యుధి వీర్యదర్పితః, ప్రవృద్ధమన్యుః, క్షతజోపమేక్షణః

సః, గజః తృణైః ఆవృతం మహాకూపమ్ ఇవ, రణే అప్రతిమం తం కపిం సమాససాద.

ప్రతిపదార్థము :- బాలభావాత్ = చిన్నతనమువలన, యుధి = యుద్ధమునందు, వీర్యదర్పితః = పరాక్రమముచే గర్వించినవాడును, ప్రవృద్ధమన్యుః = హెచ్చిన క్రోధము గలవాడును, క్షతజోపమేక్షణః = రక్తమును బోలిన కన్నులు గలవాడునుఅగు, సః = ఆ అక్షకుమారుడు, గజః = ఏనుగు, తృణైః = గడ్డిపరకలతో, ఆవృతం = కప్పబడియున్న, మహాకూపమ్ ఇవ = పెద్దనూతినివలె, రణే = యుద్ధమునందు, అప్రతిమం = సాటిలేనట్టి, తం కపిం = ఆ హనుమను, సమాససాద = చేరుకొనెను.

తాత్పర్యము :- అప్పుడా అక్షకుమారుడు తనబాల్యచాపల్యముచే యుద్ధవిషయమున తనపరాక్రమమును చూచుకొని గర్వించుచు, పెరిగిపోవుచున్న క్రోధముతో ఎఱ్ఱబడిన నెత్తుఱుగడ్డలవంటి కన్నులు గలవాడై తృణములచే కప్పబడిన మిక్కిలిలోతుగనున్న పెద్దనూతిలో ఏనుగు దిగబడినట్లు సాటిలేని పరాక్రమముతో విజృంభించుచున్న హనుమమీదకి పోయెను.

శ్లో॥ స తేన బాణైః ప్రసభం నిపాతితైః
చకార నాదం ఘననాదనిస్వనః ।
సముత్పపా తాశు నభ స్స మారుతిః
భుజోరువిక్షేపణఘోరదర్శనః ॥ 21

పదచ్ఛేదము :- సః - తేన - బాణైః - ప్రసభం - నిపాతితైః - చకార - నాదం - ఘననాదనిస్వనః, సముత్పపాత - ఆశు - నభః - సః - మారుతిః - భుజోరువిక్షేపణఘోరదర్శనః ॥

అన్వయక్రమము :- సః ప్రసభం తేన నిపాతితైః బాణైః ఘననాదనిస్వనః (సన్) నాదం చకార. భుజోరువిక్షేపణఘోరదర్శనః (సన్) సః ఆశు నభః సముత్పపాత.

ప్రతిపదార్థము :- సః = ఆ హనుమ, తేన = ఆ అక్షకుమారునిచే, ప్రసభం = బలముగా, నిపాతితైః = ప్రయోగింపబడినట్టి, బాణైః = బాణములచే, ఘననాదనిస్స్వనః సన్ = మేఘముయొక్క ఉఱుమును బోలిన గర్జనము గలవాడై, నాదం చకార = ధ్వనిని చేసెను, భుజోరువిక్షేపణఘోరదర్శనః (సన్) = భుజముల యొక్కయు తొడలయొక్కయు చాచుటచే భయంకరమైన ఆకారముగలవాడై, సః = ఆ హనుమ, ఆశు = శీఘ్రముగా, నభః = ఆకాశమునకు, ఉత్పపాత = ఎగసెను.

తాత్పర్యము :- అప్పుడా అక్షకుమారుడు గొప్ప బలముతో తనపై ప్రయోగించిన బాణముల దెబ్బలకు హనుమంతుడు ఉఱుము వంటి ధ్వనితో పెద్ద గర్జనము చేసెను.

తన భుజమును, ఊరువులను దూరముగ చాచుచు వెంటనే ఆతడు ఆకసము మీదికి ఎగిరెను.

శ్లో॥ త ముత్పతంతం సమభి(ద్రవ ద్బలీ
స రాక్షసానాం (ప్రవరః (ప్రతాపవాన్ ।
రథీ రథి(శ్రేష్ఠతమః కిరన్ శరైః
పయోధర శ్శైలమి వాశ్మవృష్టిభిః ॥ 22

పదచ్ఛేదము :– తమ్ – ఉత్పతంతం – సమభి(ద్రవత్ – బలీ – సః – రాక్షసానాం – (ప్రవరః – (ప్రతాపవాన్ – రథీ – రథి(శ్రేష్ఠతమః – కిరన్ – శరైః – పయోధరః – శైలమ్ – ఇవ – అశ్మవృష్టిభిః ॥

అన్వయక్రమము :– (ప్రతాపవాన్ రథీ రథి(శ్రేష్ఠతమః, బలీ రాక్షసానాం (ప్రవరః సః పయోధరః శైలం అశ్మవృష్టిభిః ఇవ, ఉత్పతంతం తం శరైః కిరన్ సమభి(ద్రవత్.

ప్రతిపదార్థము :– (ప్రతాపవాన్ = పరా(క్రమవంతుడును, రథీ = రథారూఢుడును, రథి(శ్రేష్ఠతమః = మహావీరులలో మిక్కిలి (శ్రేష్ఠుడును, బలీ = బలాఢ్యుడును, రాక్షసానాం = రాక్షసులలో, (ప్రవరః = (శ్రేష్ఠుడునగు, సః = ఆ అక్షకుమారుడు, పయోధరః = మేఘము, శైలం = పర్వతమును, అశ్మవృష్టిభిః ఇవ = ఊళ్ళవర్షములతోవలె, ఉత్పతంతం = మీదికి ఎగురుచున్నట్టి, తం = ఆ హనుమను, శరైః = బాణములతో, కిరన్ = చిమ్ముచు, సమభి(ద్రవత్ = మీదికి పరుగిడెను.

తాత్పర్యము :– మహా పరా(క్రమవంతుడును, మహారథికులలో అ(గగణ్యుడును మహాబలశాలియునగు ఆ రాక్షస(శ్రేష్ఠుడైన అక్షుడు పెద్ద మేఘము పర్వతముపై ఊళ్ళవర్షమును కురిపించినట్లుగ మీదకెగురుచున్నట్టి ఆ హనుమపై బాణవర్షమును గురిపించుచు అతని నెదుర్కొనెను.

శ్లో॥ స తాన్ శరాం స్తస్య విమోక్షయన్ కపిః
చచార వీరః పథి వాయుసేవితే ।
శరాంతరే మారుతవ ద్వినిష్పతన్
మనోజవ స్సంయతి చండవి(క్రమః ॥ 23

పదచ్ఛేదము :– సః – తాన్ – శరాన్ – తస్య – విమోక్షయన్ – కపిః – చచార – వీరః – పథి – వాయుసేవితే, శరాంతరే – మారుతవత్ – వినిష్పతన్ – మనోజవః – సంయతి – చండవి(క్రమః ॥

అన్వయక్రమము :- చండవిక్రమః మనోజవః, వీరః సః కపిః సంయతి వాయుసేవితే పథి, శరాంతరే మారుతవత్ వినిష్పతన్ తస్య తాన్ శరాన్ విమోక్షయన్ చచార.

ప్రతిపదార్థము :- చండవిక్రమః = భీకరమైన పరాక్రమము గలవాడును, మనోజవః = మనస్సుయొక్క వేగమువంటి వేగముగలవాడును, వీరః = గొప్పశూరుడైన వాడును అగు, సః కపిః = ఆ హనుమ, సంయతి = యుద్ధమున, వాయుసేవితే పథి = వాయువు సంచరించు మార్గమైనట్టి ఆకాశమునందు, శరాంతరే = బాణములనడుమ, మారుతవత్ = వాయువువలె, వినిష్పతన్ = తప్పించుకొనుచు, తస్య = ఆ యక్ష కుమారుని యొక్క, తాన్ శరాన్ = ఆ బాణములను, విమోక్షయన్ = తొలగించుకొనుచు, చచార = సంచరించెను.

తాత్పర్యము :- ప్రచండ పరాక్రమము గలవాడును, మనోవేగమువంటి వేగము గలవాడునగు వీరుడైన హనుమ ఆ యాకాశమార్గమునందు జరుగుచున్న యుద్ధమున బాణముల నడుమనుండి వాయువు అవలీలగా ముందుకు పోవునట్లు ఆ యక్ష కుమారుడు తనపై ప్రయోగించిన బాణములు తనకు తగులకుండ తప్పించుకొనుచు వానిమధ్య సంచరించు చుండెను.

శ్లో॥ త మాత్తబాణాసన మాహవోన్ముఖం
ఖ మాస్తృణంతం వివిధై శ్శరోత్తమైః ।
అవైక్ష తాక్షం బహుమానచక్షుషా
జగామ చింతాం చ స మారుతాత్మజః ॥ 24

పదచ్ఛేదము :- తం - ఆత్తబాణాసనం - ఆహవోన్ముఖం - ఖమ్ - ఆస్తృణంతం - వివిధైః - శరోత్తమైః - అవైక్షత - అక్షం - బహుమానచక్షుషా - జగామ - చింతాం - చ - సః - మారుతాత్మజః ॥

అన్వయక్రమము :- సః మారుతాత్మజః ఆహవోన్ముఖం ఆత్తబాణాసనం వివిధైః శరోత్తమైః ఖం ఆస్తృణంతం తం అక్షం బహుమానచక్షుషా అవైక్షత చింతాం జగామ చ.

ప్రతిపదార్థము :- సః మారుతాత్మజః = ఆ వాయునందనుడు, ఆహవోన్ముఖం = యుద్ధమునకు సన్నద్ధుడైనవాడును, ఆత్తబాణాసనం = చేపట్టిన ధనుస్సు గలవాడును, వివిధైః శరోత్తమైః = బహువిధములగు శ్రేష్ఠములైన బాణములతో, ఖం = ఆకాశమును, ఆస్తృణంతం = కప్పివేయుచున్నవాడునగు, తం అక్షం = ఆ యక్షకుమారుని, బహుమానచక్షుషా = గౌరవపూర్వకమైన దృష్టితో, అవైక్షత = చూచెను, చింతాం

జగామ చ = చింతను బొందెనుకూడ.

తాత్పర్యము :– అప్పుడా హనుమ తనతో యుద్ధమునకు సన్నద్ధుడై చేతిలో మేటివింటిని ధరించి బహువిధములగు గొప్పశక్తిగల బాణములతో ఆకసమును గప్పివేయుచు ధైర్యముతో పోరాడుచున్న ఆ యక్షకుమారుని ఎంతయును గౌరవపూర్వకమైన దృష్టితో చూచెను. మఱియు ఇట్టి వానిని ఎట్లు వధించుటా యని చింతాగ్రస్తుడయ్యెను.

శ్లో॥ తతశ్శరైర్భిన్నభుజాంతరః కపిః
కుమారవీర్యేణ మహాత్మనా నదన్ ।
మహాభుజః కర్మవిశేషతత్త్వవిత్
విచింతయామాస రణే పరాక్రమమ్ ॥ 25

పదచ్ఛేదము :– తతః – శరైః – భిన్నభుజాంతరః – కపిః – కుమారవీర్యేణ – మహాత్మనా – నదన్ – మహాభుజః – కర్మవిశేషతత్త్వవిత్ – విచింతయామాస – రణే – పరాక్రమమ్ ॥

అన్వయక్రమము :– తతః మహాత్మనా కుమారవీర్యేణ శరైః భిన్నభుజాంతరః మహాభుజః కర్మవిశేషతత్త్వవిత్ సః కపిః నదన్ రణే పరాక్రమం విచింతయామాస.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, మహాత్మనా = మహనీయుడైనట్టి, కుమార వీర్యేణ = కుమారస్వామియొక్క పరాక్రమము వంటి పరాక్రమము గల్గిన (తేన = ఆ అక్షకుమారునిచే) శరైః = బాణములచే, భిన్నభుజాంతరః = బ్రద్దలైన వక్షస్థలము గలవాడై, మహాభుజః = మహావీరుడును, కర్మవిశేషతత్త్వవిత్ = యుద్ధకృత్యముల యొక్క విశేషములందలి రహస్యమును తెలిసినవాడునగు, కపిః = హనుమ, నదన్ = గర్జించుచు, రణే = యుద్ధమునందు, పరాక్రమం = పరాక్రమమును గూర్చి, విచింతయామాస = ఆలోచింపసాగెను.

తాత్పర్యము :– కుమారస్వామియొక్క పరాక్రమమును బోలిన మహాపరాక్రమమును ప్రదర్శించుచున్న మహనీయుడైన ఆ అక్షకుమారుడు ప్రయోగించిన శరములచే గాయపడిన ఱొమ్ము కల్గిన మహావీరుడైన హనుమ ఏయే సమయములందు ఏయే కృత్యములు గావించుట ధర్మమో చక్కగా తెలిసినట్టివాడు గావున కాలోచితముగా భీకరముగా గర్జించుచు అప్పుడు తాను చూపవలసిన పరాక్రమమును గూర్చియే ఆలోచించెను.

శ్లో॥ అబాలవ ద్బాలదివాకరప్రభః
కరో త్యయం కర్మ మహ న్మహాబలః ।

న చాస్య సర్వాహవకర్మశోభినః
ప్రమాపణే మే మతి రత్ర జాయతే ॥ 26

పదచ్ఛేదము :– అబాలవత్ – బాలదివాకరప్రభః – కరోతి – అయం – కర్మ – మహత్ – మహాబలః – న – చ – అస్య – సర్వాహవకర్మశోభినః – ప్రమాపణే – మే – మతిః – అత్ర – జాయతే ॥

అన్వయక్రమము :– మహాబలః బాలదివాకరప్రభః అయమ్ అబాలవత్ మహత్ కర్మ కరోతి. సర్వాహవకర్మశోభినః అస్య ప్రమాపణే అత్ర మే మతిః న చ జాయతే.

ప్రతిపదార్థము :– మహాబలః = మహాబలశాలియు, బాలదివాకరప్రభః = లేత సూర్యునివంటి తేజస్సుగలవాడు నగు, అయం = ఈతడు, అబాలవత్ = ప్రౌఢునివలెనే, మహత్ కర్మ = ఘనమైన కార్యమును, కరోతి = కావించుచున్నాడు. సర్వాహవకర్మ శోభినః = యుద్ధమునందలి సమస్తమైన క్రియలతోడను ప్రకాశించుచున్నట్టి, అస్య = వీనియొక్క, ప్రమాపణే = సంహారమున, అత్ర = ఇచ్చట, మే = నాకు, మతిః న చ జాయతే = ఎంతమాత్రమును బుద్ధి పుట్టుట లేదు.

తాత్పర్యము :– బాలసూర్యునివంటి తేజస్సుగల ఈ మహాబలశాలియైన అక్షుడు బాలురు చేయలేనట్టి గొప్పదైన కృత్యమును గావించుచున్నాడు. యుద్ధమునకు సంబంధించిన సమస్తవిజ్ఞానమును కౌశలమును గలిగిన ఈతనిని వధించు విషయమున నాకు మనస్సు ఒప్పకున్నది.

శ్లో॥ అయం మహాత్మా చ మహాంశ్చ వీర్యతః
సమాహిత శ్చాతిసహశ్చ సంయుగే ।
అసంశయం కర్మగుణోదయా దయం
సనాగయక్షై ర్మునిభిశ్చ పూజితః ॥ 27

పదచ్ఛేదము :– అయం – మహాత్మా – చ – మహాన్ – చ – వీర్యతః – సమాహితః – చ – అతిసహః – చ – సంయుగే, అసంశయం – కర్మగుణోదయాత్ – అయం – సనాగయక్షైః – మునిభిః – చ – పూజితః ॥

అన్వయక్రమము :– అయం, మహాత్మా చ – వీర్యతః చ మహాన్ సంయుగే సమాహితః, అతిసహః చ కర్మగుణోదయాత్ అసంశయమ్ అయం సనాగయక్షైః మునిభిః చ పూజితః.

ప్రతిపదార్థము :– అయం = ఈతడు, మహాత్మా చ = మహనీయుడును, వీర్యతః చ

= పరాక్రమమువలన గూడ, మహాన్ = గొప్పవాడును, సంయుగే = యుద్ధమునందు, సమాహితః చ = ఏకాగ్రమగు చిత్తము గలవాడును, అతిసహః చ = గొప్ప ఓర్పు గలవాడును, (భవతి = అగుచున్నాడు) కర్మగుణోదయాత్ = యుద్ధకృత్యములలోని గుణములయొక్క ఆధిక్యమువలన, అసంశయమ్ = నిస్సంశయముగా, అయం = ఈతడు, సనాగయక్షైః = నాగులతోడను, యక్షులతోడను గూడినట్టి, మునిభిశ్చ = మునులచేగూడ, పూజితః = పూజింపబడువాడు, భవతి = అగుచున్నాడు.

తాత్పర్యము :– ఈతడు సహజముగనే మహనీయుడుగా గానవచ్చుచున్నాడు. తన పరాక్రమముచే గూడ నీతడు మహాత్ముడే యగుచున్నాడు. ఈతడు యుద్ధమున గొప్ప ఏకాగ్రత గలిగి యుద్ధక్లేశములను సహించగలవాడుగా నున్నాడు. యుద్ధోచితమైన పరాక్రమాదిగుణసంపదచే నిస్సంశయముగా నీతడు నాగయక్షాదులకును, మహర్షులకును గూడ పూజ్యుడే యగును.

శ్లో॥ పరాక్రమోత్సాహవివృద్ధమానసః
సమీక్షతే మాం ప్రముఖాగ్రత స్థ్సితః ।
పరాక్రమో హ్యస్య మనాంసి కంపయేత్
సురాసురాణామపి శీఘ్రకారిణః ॥ 28

పదచ్ఛేదము :– పరాక్రమోత్సాహవివృద్ధమానసః – సమీక్షతే – మాం – ప్రముఖాగ్రతః – స్థితః – పరాక్రమః – హి – అస్య – మనాంసి – కంపయేత్ – సురాసురాణాం – అపి – శీఘ్రకారిణః ॥

అన్వయక్రమము :– పరాక్రమోత్సాహవివృద్ధమానసః ప్రముఖాగ్రతః స్థితః, మాం సమీక్షతే, శీఘ్రకారిణః అస్య పరాక్రమః సురాసురాణామ్ అపి మనాంసి కంపయేత్.

ప్రతిపదార్థము :– పరాక్రమోత్సాహవివృద్ధమానసః = పరాక్రమముచేతను ఉత్సాహము చేతను వృద్ధి బొందుచున్న మనస్సుగలవాడై, ప్రముఖాగ్రతః = ఎట్టఎదుట, స్థితః = నిలచినవాడై, మాం = నన్ను, సమీక్షతే = చూచుచున్నాడు, శీఘ్రకారిణః = వేగముగ కృత్యములను ఆచరించునట్టి, అస్య = ఈతనియొక్క, పరాక్రమః = విక్రమము, సురాసురాణామ్ అపి = దేవతలయొక్కయు రాక్షసులయొక్కయు కూడ, మనాంసి = మనస్సులను, కంపయేత్ = కంపింపచేయును.

తాత్పర్యము :– గొప్పదైన పరాక్రమముతోను, ఉత్సాహముతోను విజృంభించుచున్నట్టి ఈతడు నా ఎట్టఎదుటనే నిలచి నన్ను నిర్భయముగా చూచుచున్నాడు. యుద్ధ పద్ధతులందు లాఘవము గల్గినట్టి ఈతని పరాక్రమమును చూడగా దేవదానవులు గూడ కంపించవలసినదే.

శ్లో॥ న ఖల్వయం నాభిభవే దుపేక్షితః
పరాక్రమో హ్యస్య రణే వివర్ధతే ।
ప్రమాపణం త్వేవ మమాద్య రోచతే
న వర్ధమానోఽగ్ని రుపేక్షితుం క్షమః ॥ **29**

పదచ్ఛేదము :- న - ఖలు - అయమ్ - అభిభవేత్ - ఉపేక్షితః - పరాక్రమః - హి - అస్య - రణే - వివర్ధతే, ప్రమాపణం - తు - ఏవ - మమ - అద్య - రోచతే - న - వర్ధమానః - అగ్నిః - ఉపేక్షితుం - క్షమః ॥

అన్వయక్రమము :- రణే అస్య పరాక్రమః వివర్ధతే, ఉపేక్షితః చేత్ అయం న ఖలు న అభిభవేత్, అద్య అస్య ప్రమాపణం తు ఏవ మమ రోచతే; వర్ధమానః అగ్నిః ఉపేక్షితుం క్షమః న.

ప్రతిపదార్థము :- రణే = యుద్ధమునందు, అస్య = వీనియొక్క, పరాక్రమః = విక్రమము, వివర్ధతే = పెరిగిపోవుచున్నది. ఉపేక్షితః చేత్ = ఉపేక్షింప బడినచో, అయం = ఈతడు, న ఖలు న అభిభవేత్ = తిరస్కరింపకుండ నుండడు, అద్య = నేడు, అస్య = వీనియొక్క, ప్రమాపణం తు ఏవ = సంహారమే, మమ = నాకు, రోచతే = ఇష్టమగుచున్నది, వర్ధమానః = వృద్ధిచెందుచున్నట్టి, అగ్నిః = అగ్ని, ఉపేక్షితుం = ఉపేక్షించుటకు, క్షమః న = తగినదిగాదు.

తాత్పర్యము :- యుద్ధమునం దితని పరాక్రమము చూడగా అంతకంతకు పెరిగి పోవుచున్నది. నేనిట్లే ఉపేక్షించినచో ఈతడు నన్ను అణచివేయకుండ నుండడు. అందుచే నే డీతనిని సంహరించుటయే నేను చేయవలసిన కృత్యము. అంతకంతకు విస్తరించుచున్న అగ్ని నుపేక్షించుట ఎవరికిని తగదుగదా!

శ్లో॥ ఇతి ప్రవేగం తు పరస్య తర్కయన్
స్వకర్మయోగం చ విధాయ వీర్యవాన్ ।
చకార వేగం తు మహాబల స్తదా
మతిం చ చక్రే ఽస్య వధే మహాకపిః ॥ **30**

పదచ్ఛేదము :- ఇతి - ప్రవేగం - తు - పరస్య - తర్కయన్ - స్వకర్మయోగం - చ - విధాయ - వీర్యవాన్, చకార - వేగం - తు - మహాబలః - తదా - మతిం - చ - చక్రే - అస్య - వధే - మహాకపిః ॥

అన్వయక్రమము :- ఇతి వీర్యవాన్, మహాబలః (సః) పరస్య ప్రవేగం తర్కయన్,

స్వకర్మయోగం చ విధాయ, మహాకపిః తదా అస్య వధే మతిం చక్రే; వేగం చ చకార.

ప్రతిపదార్థము :- ఇతి = ఇట్లు, వీర్యవాన్ = శౌర్యవంతుడును, మహాబలః = మహాబలసంపన్నుడును అగు, మహాకపిః = వానరముఖ్యుడగు, సః = ఆ హనుమ, పరస్య = శత్రువుయొక్క, ప్రవేగం = తీవ్రతనుగూర్చి, తర్కయన్ = ఊహించుచు, స్వకర్మయోగం చ = తన కృత్యముయొక్క విధానమును, విధాయ = నిర్ణయించుకొని, తదా = అప్పుడు, అస్య = ఈతనియొక్క, వధే = సంహారమునందు, మతిం చక్రే = ఆలోచన చేసెను, వేగం చ చకార = తొందరపడెను గూడ.

తాత్పర్యము :- పరాక్రమవంతుడును బలశాలియునగు హనుమ ఈరీతిగా శత్రువుల యొక్క విజృంభణమును గూర్చి ఆలోచించి తనకర్తవ్యమును గూడ నిర్ణయించుకొని అప్పు డాతనిని వధించుటకే నిశ్చయించుకొని అందులకై తగిన వేగిరపాటును జూపెను.

శ్లో॥ స తస్య తా నష్ట హయా న్మహాజవాన్
సమాహితా న్భారసహా న్వివర్తనే ।
జఘాన వీరః పథి వాయుసేవితే
తలప్రహారైః పవనాత్మజః కపిః ॥ 31

పదచ్ఛేదము :- సః - తస్య - తాన్ - అష్టహయాన్ - మహాజవాన్ - సమాహితాన్ - భారసహాన్ - వివర్తనే - జఘాన - వీరః - పథి - వాయుసేవితే - తలప్రహారైః - పవనాత్మజః - కపిః ॥

అన్వయక్రమము :- పవనాత్మజః వీరః సః కపిః మహాజవాన్ వివర్తనే సమాహితాన్, భారసహాన్, తాన్ అష్టహయాన్ వాయుసేవితే పథి తలప్రహారైః జఘాన.

ప్రతిపదార్థము :- పవనాత్మజః = వాయునందనుడును, వీరః = శూరుడును అగు, సః కపిః = ఆ హనుమ, మహాజవాన్ = గొప్పవేగము గలవియును, వివర్తనే = బహువిధమైన గమనమునందు, సమాహితాన్ = చక్కనిశిక్షణము పొందినవియును, భారసహాన్ = భారమును సహింపగలవియునగు, తాన్ అష్టహయాన్ = ఆ ఎనిమిదిగుఱ్ఱములను, వాయుసేవితే = వాయువుచే సేవింపబడినట్టి, పథి = మార్గమున (ఆకాశమున), తలప్రహారైః = అఱచేతిదెబ్బలచే, జఘాన = ప్రహరించెను.

తాత్పర్యము :- వాయునందనుడగు ఆమహావీరుడైన హనుమ యుద్ధమునందు వలసినట్టి సకలవిధమైన గమనములందును సంపూర్ణమైన శిక్షణమును పొందినవై ఎంతటి భారమైనను అవలీలగ భరించి మహావేగముతో పరుగిడగల ఆ అక్షకుమారుని

అశ్వములను ఎనిమిదింటిని ఆ యాకాశమార్గమునందే తన అఱచేతి దెబ్బలకును, అఱికాలిదెబ్బలకును గుఱిచేసి హతమార్చెను.

శ్లో॥ తత స్తలే నాభిహతో మహారథః
స తస్య పింగాధిపమంత్రినిర్జితః ।
ప్రభగ్ననీడః పరిముక్తకూబరః
పపాత భూమౌ హతవాజి రంబరాత్ ॥ 32

పదచ్ఛేదము :- తతః - తలేన - అభిహతః - మహారథః - సః - తస్య - పింగాధిపమంత్రినిర్జితః, ప్రభగ్ననీడః - పరిముక్తకూబరః, పపాత - భూమౌ - హతవాజిః - అంబరాత్ ॥

అన్వయక్రమము :- తతః తస్య తలేన అభిహతః, పింగాధిపమంత్రినిర్జితః, సః మహారథః ప్రభగ్ననీడః, పరిముక్తకూబరః, హతవాజిః (సన్) అంబరాత్ భూమౌ పపాత.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, తస్య = ఆ హనుమయొక్క, తలేన = అఱచేతిచే, అభిహతః = కొట్టబడినదియును, పింగాధిపమంత్రినిర్జితః = సుగ్రీవుని మంత్రియైన హనుమచే జయింపబడినదియు నగు, సః మహారథః = ఆ గొప్పదైన రథము, ప్రభగ్ననీడః = విఱిగిపోయిన తొట్టిగలదియును, పరిముక్తకూబరః = ఊడిపోయిన కాడిగలదియును, హతవాజిః = చనిపోయిన గుఱ్ఱములు గలదియును, అంబరాత్ = ఆకసమునుండి, భూమౌ = నేలపై, పపాత = కూలెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా.శిరోమణి :- మహారథః పపాత - భగ్నమైన నీడమును పరిముక్తకూబరములును హతములైన అశ్వములును కలిగిన మహారథికుడైన అక్షుడు నేలగూలెను.

తాత్పర్యము :- పిమ్మట ఆ హనుమయొక్క అఱచేతి దెబ్బకు గుఱియై ఆతనిచే సంపూర్ణముగా ధ్వంసమైన ఆ యక్షుని మహారథము తొట్టి విఱిగిపోయి, కాడి ఊడిపోయి, గుఱ్ఱములు చనిపోయి ఎల్లరును చూచుచుండగా ఆకసమునుండి నేలపై ముక్కలు ముక్కలుగా కూలెను.

శ్లో॥ స తం పరిత్యజ్య మహారథో రథం
సకార్ముకః ఖడ్గధరః ఖ ముత్పతన్ ।
తపోభియోగా దృషి రుగ్రవీర్యవాన్
విహాయ దేహం మరుతామి వాలయమ్ ॥ 33

పదచ్ఛేదము :– సః – తం – పరిత్యజ్య – మహారథః – రథం – సకార్ముకః – ఖడ్గధరః – ఖమ్ – ఉత్పతన్, తపోభియోగాత్ – ఋషిః – ఉగ్రవీర్యవాన్ – విహాయ – దేహం – మరుతామ్ – ఇవ – ఆలయమ్ ॥

అన్వయక్రమము :– ఉగ్రవీర్యవాన్ సః మహారథః, తం రథం పరిత్యజ్య సకార్ముకః ఖడ్గధరః ఖమ్ ఉత్పతన్ తపోభియోగాత్ దేహం విహాయ మరుతామ్ ఆలయం ఉత్పతన్, ఉగ్రవీర్యవాన్ ఋషిః ఇవ (బభూవ).

ప్రతిపదార్థము :– ఉగ్రవీర్యవాన్ = ఉగ్రమైన పరాక్రమముగల్గిన, సః మహారథః = ఆ మహారథుడైన అక్షుడు, తం రథం = ఆ మహారథమును, పరిత్యజ్య = విడచి, సకార్ముకః = ధనుస్సుతో కూడినవాడై, ఖడ్గధరః = ఖడ్గమును ధరించినవాడై, ఖమ్ = ఆకాశమును గూర్చి, ఉత్పతన్ = ఎగురుచు, తపోభియోగాత్ = తపస్సువలన గలిగిన యోగశక్తివలన, దేహం = శరీరమును, విహాయ = విడచి, మరుతామ్ ఆలయమ్ = దేవతలకు నివాసమైన స్వర్గమును గూర్చి, ఉత్పతన్ = ఎగురుచున్నట్టి, ఋషిః ఇవ = ఋషీశ్వరుడువలె, బభూవ = ఉండెను.

తాత్పర్యము :– ఉగ్రమైన పరాక్రమముగల ఆ అక్షకుమారుడు అప్పుడు శిథిలమైన తన రథమును విడిచిపెట్టి ధనుస్సును ఖడ్గమును చేతబూని ఆకసముమీదికి ఎగసిపోవుచు చూచువారికి ఒక మహర్షి తనతపోయోగశక్తిచే భౌతికశరీరమును విడిచిపెట్టి దివ్యదేహముతో దేవలోకమునకు ఏగుచున్నట్లుగా గానవచ్చెను.

శ్లో॥ తతః కపి స్తం విచరంత మంబరే
పతత్త్రిరాజానిలసిద్ధసేవితే ।
సమేత్య తం మారుతతుల్యవిక్రమః
క్రమేణ జగ్రాహ స పాదయోర్దృఢమ్ ॥ 34

పదచ్ఛేదము :– తతః – కపిః – తం – విచరంతమ్ – అంబరే – పతత్త్రిరాజానిలసిద్ధ సేవితే, సమేత్య – తం – మారుతతుల్యవిక్రమః – క్రమేణ – జగ్రాహ – సః – పాదయోః – ధృఢమ్ ॥

అన్వయక్రమము :– తతః మారుతతుల్యవిక్రమః సః కపిః పతత్త్రిరాజానిలసిద్ధసేవితే అంబరే విచరంతం తం క్రమేణ సమేత్య పాదయోః ధృఢం జగ్రాహ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, మారుతతుల్యవిక్రమః = వాయుదేవునితో సమానమైన విజృంభణము గల్గినట్టి, సః కపిః = ఆ హనుమ, పతత్త్రిరాజానిలసిద్ధసేవితే = గరుత్మంతునిచేతను వాయువుచేతను సిద్ధులచేతను సేవింపబడు, అంబరే =

ఆకాశమునందు, విచరంతం = సంచరించుచున్నట్టి ఆ అక్షకుమారుని, సమేత్య = చేరి, పాదయోః = పాదములందు, ధృఢం = బలముగా, జగ్రాహ = పట్టుకొనెను.

తాత్పర్యము :- అప్పుడు వాయుదేవునివలె విజృంభించుచున్న ఆ హనుమ - గరుడునకును, వాయువునకును, సిద్ధులకును సంచారస్థలమైన ఆకాశమునందు సంచరించుచున్న ఆ అక్షకుమారుని నేర్పుగా సమీపించి ఆతని పాదములను రెండింటిని బలముగ పట్టుకొనెను.

శ్లో॥ స తం సమావిధ్య సహస్రశః కపిః
మహోరగం గృహ్య ఇవాండజేశ్వరః ।
ముమోచ వేగా త్పితృతుల్యవిక్రమో
మహీతలే సంయతి వానరోత్తమః ॥ 35

పదచ్ఛేదము :- సః - తం - సమావిధ్య - సహస్రశః - కపిః - మహోరగం - గృహ్య - ఇవ - అండజేశ్వరః - ముమోచ - వేగాత్ - పితృతుల్యవిక్రమః - మహీతలే - సంయతి - వానరోత్తమః ॥

అన్వయక్రమము :- పితృతుల్యవిక్రమః, వానరోత్తమః సః కపిః, అండజేశ్వరః మహోరగమ్ ఇవ సంయతి తం గృహ్య సహస్రశః సమావిధ్య వేగాత్ మహీతలే ముమోచ.

ప్రతిపదార్థము :- పితృతుల్యవిక్రమః = తండ్రితో సమానమైన పరాక్రమముకల్గినట్టి, వానరోత్తమః = వానరశ్రేష్ఠుడగు, సః కపిః = ఆ హనుమ, అండజేశ్వరః = పక్షిరాజైన గరుడుడు, మహోరగమ్ ఇవ = మహాసర్పమునువలె, సంయతి = యుద్ధమునందు, తం = ఆ అక్షుని, గృహ్య = పట్టుకొని, సహస్రశః = వేయివిధములుగ, సమావిధ్య = కొట్టి, వేగాత్ = వేగముగా, మహీతలే = భూమిపై, ముమోచ = విడిచెను.

తాత్పర్యము :- తన తండ్రియైన వాయుదేవునితో సమానమైన పరాక్రమము గల్గినట్టి ఆ హనుమ ఆకాశయుద్ధమునందు గరుత్మంతుడు మహాసర్పమును పట్టినట్లుగా, అట్లా అక్షకుమారుని పట్టుకొని వేయి మాఱులు వేగముగా గిరగిరత్రిప్పి నేలపైబడ వేసెను.

శ్లో॥ స భగ్నబాహూరుకటీశిరోధరః
క్షరన్నసృ జ్నిర్మథితాస్థిలోచనః ।
ప్రభిన్నసంధిః ప్రవికీర్ణబంధనో
హతః క్షితౌ వాయుసుతేన రాక్షసః ॥ 36

పదచ్ఛేదము :- సః - భగ్నబాహూరుకటీశిరోధరః - క్షరన్ - అసృక్ - నిర్మథితాస్థిలోచనః, ప్రభిన్నసంధిః - ప్రవికీర్ణబంధనః, హతః - క్షితౌ - వాయుసుతేన - రాక్షసః ॥

అన్వయక్రమము :- వాయుసుతేన హతః సః రాక్షసః భగ్నబాహూరుకటీశిరోధరః, నిర్మథితాస్థిలోచనః ప్రభిన్నసంధిః, ప్రవికీర్ణబంధనః సన్, క్షరన్ అసృక్ క్షితౌ (పపాత).

ప్రతిపదార్థము :- వాయుసుతేన = వాయునందనునిచే, హతః = తునుమబడిన, సః రాక్షసః = ఆ రాక్షసుడు, భగ్నబాహూరుకటీశిరోధరః = విఱిగిపోయిన భుజములును తొడలును, నడుమును, మెడయును గలవాడును, నిర్మథితాస్థిలోచనః = చూర్ణము గావింపబడిన ఎముకలు కన్నులు గలవాడును, ప్రభిన్నసంధిః = ఊడిపోయిన కీళ్ళు గలవాడును, ప్రవికీర్ణబంధనః = చెదిరిపోయిన సంధిబంధములు గలవాడును అగుచు, క్షరన్ అసృక్ = కారుచున్ననెత్తుఱు గలవాడై, క్షితౌ = నేలపై, పపాత = పడెను.

తాత్పర్యము :- హనుమచే నా విధముగా విహతుడైన ఆ అక్షకుమారుడు విఱిగిపోయిన బాహువులు, ఊరువులు, నడుము, మెడ తోడను, ముక్కలు ముక్కలైన ఎముకలును, కనుగ్రుడ్లును గలవాడై సర్వావయములయొక్క కీళ్ళును విడిపోగా రక్తమును గ్రక్కుచు నేలగూలెను.

శ్లో॥ మహాకపి ర్భూమితలే నిపీడ్య తం
చకార రక్షోధిపతే ర్మహ ద్భయమ్ ॥ 37

పదచ్ఛేదము :- మహాకపిః - భూమితలే - నిపీడ్య - తం - చకార - రక్షోధిపతేః - మహత్ - భయమ్ ॥

అన్వయక్రమము :- మహాకపిః తం భూమితలే నిపీడ్య రక్షోధిపతేః మహత్ భయం చకార.

ప్రతిపదార్థము :- తం = ఆ అక్షకుమారుని, భూమితలే = నేలపై, నిపీడ్య = పడగొట్టి, రక్షోధిపతేః = రాక్షసరాజైన రావణునకు, మహత్ భయం = గొప్పదైన భయమును, చకార = కావించెను.

తాత్పర్యము :- హనుమంతుడా విధముగా ఆ యక్షకుమారుని నేలపై కూలవేసి రాక్షసరాజైన దశగ్రీవునకు అమితమైన భీతిని గూర్చెను.

శ్లో॥ మహర్షి భి శ్చక్రచరై స్సమాగతైః
సమేత్య భూతైశ్చ సయక్షపన్నగైః ।

సురైశ్చ సేంద్రై ర్భృశజాతవిస్మయైః
హతే కుమారే స కపి ర్నిరీక్షితః ॥ 38

పదచ్ఛేదము :- మహర్షిభిః - చక్రచరైః - సమాగతైః - సమేత్య - భూతైః - చ - సయక్షపన్నగైః - సురైః - చ - సేంద్రైః - భృశజాతవిస్మయైః, హతే - కుమారే - సః - కపిః - నిరీక్షితః॥

అన్వయక్రమము :- కుమారే హతే సతి సః కపిః భృశజాతవిస్మయైః సమేత్య సమాగతైః చ, సేంద్రైః సురైః చ నిరీక్షితః.

ప్రతిపదార్థము :- కుమారే = అక్షకుమారుడు, హతే సతి = చంపబడగా, భృశజాత విస్మయైః = మిక్కిలిగా ఆశ్చర్యము కలిగినట్టి వారును, సమేత్య = కలసి, సమాగతైః = వచ్చినట్టివారును, చక్రచరైః = జ్యోతిశ్చక్రమునందు సంచరించువారునగు, మహర్షిభిః = మహర్షులచేతను, సయక్షపన్నగైః = యక్షులతోడను, పన్నగులతోడను గూడినట్టి, భూతైః చ = భూతములచేతను, సేంద్రైః = ఇంద్రునితో గూడినట్టి, సురైః = దేవతలచేతను, సః కపిః = ఆ హనుమ, నిరీక్షితః = చూడబడెను.

తాత్పర్యము :- అక్షకుమారు డా విధముగ మృతినొందగానే అచ్చటికి చేరియున్న జ్యోతిశ్చక్రమునందలి సప్తమహర్షి ప్రభృతులును, యక్షులు పన్నగులు మున్నగువారును, మహాభూతములును, దేవేంద్రునితో గూడిన దేవతలును అమితమైన ఆశ్చర్యముతో ఆ హనుమను చూడసాగిరి.

శ్లో॥ నిపాత్య తం వజ్రిసుతోపమం రణే
కుమార మక్షం క్షతజోపమేక్షణమ్ ।
తదేవ వీరోఽభిజగామ తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే ॥ 39

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"అక్షకుమారవధో" నామ
సప్తచత్వారింశస్సర్గః.

పదచ్ఛేదము :- నిపాత్య - తం - వజ్రిసుతోపమం - రణే, కుమారమ్ - అక్షం - క్షతజోపమేక్షణమ్, తత్ - ఏవ - వీరో - అభిజగామ - తోరణం, కృతక్షణః - కాలః - ఇవ - ప్రజాక్షయే ॥

అన్వయక్రమము :- సః వీరః రణే వజ్రిసుతోపమం, క్షతజోపమేక్షణం తమ్ అక్షం కుమారం నిపాత్య, ప్రజాక్షయే కృతక్షణః కాలః ఇవ తత్ తోరణమ్ ఏవ అభిజగామ.

ప్రతిపదార్థము :- సః వీరః = వీరుడైన ఆ హనుమ, రణే = యుద్ధమునందు, వజ్రిసుతోపమం = దేవేంద్రుని పుత్రునితో సాటియగు వాడును, క్షతజోపమేక్షణం = రక్తమును బోలినకన్నులు గలవాడునగు, తం అక్షం కుమారం = ఆ అక్షకుమారుని, నిపాత్య = కూల్చి, ప్రజాక్షయే = జనక్షయమునందు, కృతక్షణః = వేడుకగల్గినట్టి, కాలః ఇవ = యముడువలె, తత్ తోరణమ్ ఏవ = ఆ బహిర్ద్వారమునే, అభిజగామ = చేరుకొనెను.

తాత్పర్యము :- వీరుడైన యా హనుమంతుడు, ఎఱ్ఱని కన్నులతో మహావీరుడును దేవేంద్రుని పుత్రునివంటి మహత్త్వముగలవాడునగు ఆ అక్షకుమారుని యుద్ధమున వధించి ప్రజావినాశమునకై వేడుకపడుచు సమయముకొఱకు చూచుచున్న యమధర్మరాజువలె పూర్వము రీతిగా బహిర్ద్వారము మీదకే పోయి కూర్చుండెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"అక్షకుమారవధ" అను
నలుబదిఏడవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

అష్టచత్వారింశసర్గ

శ్లో॥ తత స్స రక్షోధిపతి ర్మహాత్మా
హనూమతాక్షే నిహతే కుమారే ।
మన స్సమాధాయ త దేంద్రకల్పం
సమాదిదే శేంద్రజితం సరోషమ్ ॥ 1

పదచ్ఛేదము :- తతః - సః - రక్షోధిపతిః - మహాత్మా, హనూమతా - అక్షే - నిహతే - కుమారే, మనః - సమాధాయ - తదా - ఇంద్రకల్పం, సమాదిదేశ - ఇంద్రజితం - సరోషమ్ ॥

అన్వయక్రమము :- తతః హనూమతా కుమారే అక్షే నిహతే (సతి) మహాత్మా సః రక్షోధిపతిః మనః సమాధాయ తదా సరోషమ్ ఇంద్రకల్పమ్ ఇంద్రజితం సమాదిదేశ.

ప్రతిపదార్థము :- హనూమతా = హనుమచే, కుమారే అక్షే = అక్షకుమారుడు, నిహతే (సతి) = చంపబడినవాడుకాగా, తతః = పిమ్మట, మహాత్మా = మహనీయుడైన, సః రక్షోధిపతిః = ఆ రాక్షసరాజు, మనః = మనస్సును, సమాధాయ = చిక్కబట్టుకొని, తదా = అప్పుడు, సరోషం = రోషముతో, ఇంద్రకల్పం = ఇంద్రునితో సమానమైన పరాక్రమము కల ఇంద్రజిత్తును, సమాదిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- అక్షకుమారుడు హనుమంతునిచే నిహతుడైనట్లు విని రాక్షసరాజు చెదిరిపోయిన తన గుండెను చిక్కబట్టుకొని తీవ్రమైన రోషముతో తన ఆజ్ఞకొఱకు వేచియున్నట్టి ఇంద్రతుల్యపరాక్రముడైన ఇంద్రజిత్తును హనుమంతు నెదుర్కొనుట కాజ్ఞాపించెను.

శ్లో॥ త్వ మస్త్రవి చ్ఛస్త్రభృతాం వరిష్ఠః
సురాసురాణామపి శోకదాతా ।
సురేషు సేంద్రేషు చ దృష్టకర్మా
పితామహారాధనసంచితాస్త్రః ॥ 2

పదచ్ఛేదము :– త్వం – అస్త్రవిత్ – శస్త్రభృతాం – వరిష్ఠః – సురాసురాణామ్ – అపి – శోకదాతా – సురేషు – సేంద్రేషు – చ – దృష్టకర్మా – పితామహారాధన సంచితాస్త్రః ॥

అన్వయక్రమము :– త్వమ్ అస్త్రవిత్, శస్త్రభృతాం వరిష్ఠః సురాసురాణామ్ అపి శోకదాతా సేంద్రేషు సురేషు దృష్టకర్మా, పితామహారాధనసంచితాస్త్రః చ (అసి).

ప్రతిపదార్థము :– త్వమ్ = నీవు, అస్త్రవిత్ = అస్త్రముల నెఱిగినవాడవు, శస్త్రభృతాం = ఆయుధధారులలో, వరిష్ఠః = శ్రేష్ఠుడవు, సురాసురాణామ్ అపి = దేవతలకును, దానవులకును కూడ, శోకదాతా = దుఃఖమును కలిగించువాడవు, సేంద్రేషు = దేవేంద్రునితో గూడినట్టి, సురేషు = దేవతలయందు, దృష్టకర్మా = చూడబడిన గొప్ప కృత్యములు గలవాడవు, పితామహారాధనసంచితాస్త్రః చ = బ్రహ్మదేవునియొక్క ఆరాధనముచే సాధింపబడిన గొప్ప అస్త్రములు గలవాడవుకూడను, (అసి = అగుచున్నావు).

తాత్పర్యము :– ఓ మేఘనాదుడా! నీవు అస్త్రవిద్యలను సమగ్రముగా నేర్చినవాడవు. ఆయుధములనుపయోగింప నేర్చిన యోధులలో అగ్రగణ్యుడవు. నీ పరాక్రమముచే దేవతలకును దానవులకును గూడ దిగులు కల్పించువాడవు. దేవేంద్రునితో గూడిన దేవతలెల్లరికిని నీ యుద్ధనైపుణ్యమును గనపఱచినవాడవు. బ్రహ్మదేవుని ఆరాధించి దివ్యాస్త్రములను బడిసినవాడవునుగదా!

శ్లో॥ త వాస్త్రబల మాసాద్య నాసురా న మరుద్గణాః ।
న శేకు స్సమరే స్థాతుం సురేశ్వరసమాశ్రితాః ।
న కశ్చి త్త్రిషు లోకేషు సంయుగే న గతశ్రమః ॥ 3

పదచ్ఛేదము :– తవ – అస్త్రబలం – ఆసాద్య – న – అసురాః – న – మరుద్గణాః, న – శేకుః – సమరే – స్థాతుం – సురేశ్వరసమాశ్రితాః, న – కశ్చిత్ – త్రిషు – లోకేషు – సంయుగే – న – గతశ్రమః ॥

అన్వయక్రమము :– సమరే తవ అస్త్రబలమ్ ఆసాద్య అసురాః స్థాతుం న శేకుః; సురేశ్వరసమాశ్రితాః మరుద్గణాః (అపి) (న శేకుః) త్రిషు లోకేషు కశ్చిత్ సంయుగే న గతశ్రమః న (అస్తి).

ప్రతిపదార్థము :– సమరే = యుద్ధమునందు, తవ = నీయొక్క, అస్త్రబలం = అస్త్రబలమును, ఆసాద్య = పొంది, అసురాః = రాక్షసులు గాని, మరుద్గణాః = దేవతలు కాని, మూడు లోకములందును, కశ్చిత్ = ఒకడును, సంయుగే =

యుద్ధమునందు, న గతశ్రమః = పొందని క్లేశము గలవాడు, న (అస్తి) = లేడు.

తాత్పర్యము :- నీకుగల అస్త్రబలప్రభావముచే యుద్ధమునందు నిన్నెదిరించి నిలచుటకు రాక్షసవీరులకుగాని దేవేంద్రుని రక్షణముపొంది యున్నట్టి దేవతలకుగాని ఎవ్వరికిని శక్తిలేదుసుమా! త్రిభువనములందును యుద్ధభూమిలో నీకెదురుగా నిలచి క్లేశముల పాలుగానివాడు ఎవ్వడునులేడు.

శ్లో॥ భుజవీర్యాభిగుప్తశ్చ తపసా చాభిరక్షితః ।
దేశకాలవిభాగజ్ఞ స్త్వమేవ మతిసత్తమః ॥ 4

పదచ్ఛేదము :- భుజవీర్యాభిగుప్తః - చ - తపసా - చ - అభిరక్షితః - దేశకాల విభాగజ్ఞః - త్వమ్ - ఏవ - మతిసత్తమః ॥

అన్వయక్రమము :- త్వమ్ ఏవ భుజవీర్యాభిగుప్తః చ తపసా అభిరక్షితః చ దేశకాల విభాగజ్ఞః మతిసత్తమః చ (అసి).

ప్రతిపదార్థము :- త్వమ్ ఏవ = నీవే, భుజవీర్యాభిగుప్తః చ = భుజపరాక్రమముచే రక్షింపబడినవాడవును, తపసా = తపస్సుచే, అభిరక్షితః చ = రక్షింపబడినవాడవును, దేశకాలవిభాగజ్ఞః = దేశముయొక్కయు, కాలముయొక్కయు విభాగమును గూర్చి తెలిసిన వాడవును, మతిసత్తమః = ప్రజ్ఞచే శ్రేష్ఠుడవును, చ (అసి) = అగుచున్నావు.

తాత్పర్యము :- ఓ వీరాగ్రేసరా! నీ భుజపరాక్రమముచే నిన్ను నీవు రక్షించుకొను చున్నావు. మఱియు నీ తపోబలముచే గూడ నీవు రక్షింపబడుచున్నావు. దేశకాలముల తారతమ్యము చక్కగా తెలిసినవాడవు నీవే! నీవే గొప్ప ప్రజ్ఞాశాలివి.

శ్లో॥ న తే ఽ స్త్యశక్యం సమరేషు కర్మణా
న తే ఽ స్త్యకార్యం మతిపూర్వమంత్రణే ।
న తే ఽ స్తి కశ్చి త్రిషు సంగ్రహేషు వై
న వేద య స్తేఽస్త్రబలం బలం చ తే ॥ 5

పదచ్ఛేదము :- న - తే - అస్తి - అశక్యం - సమరేషు - కర్మణా, న - తే - అస్తి - అకార్యం - మతిపూర్వమంత్రణే - న - తే - అస్తి - కశ్చిత్ - త్రిషు - సంగ్రహేషు - వై, న - వేద - యః - తే - అస్త్రబలం - బలం - చ - తే ॥

అన్వయక్రమము :- సమరేషు తే కర్మణా అశక్యం న అస్తి. మతిపూర్వమంత్రణే తే అకార్యం న అస్తి, త్రిషు సంగ్రహేషు - యః తే అస్త్రబలం, తే బలం చ న వేద సః కశ్చిత్ న అస్తి.

ప్రతిపదార్థము :– సమరేషు = యుద్ధములందు, తే = నీ యొక్క, కర్మణా = పూనికచేత, అశక్యం = అసాధ్యమైనది, న అస్తి = లేదు, మతిపూర్వమంత్రణే = బుద్ధిమూలకమైన ఆలోచనమునందు, తే = నీకు, అకార్యం = చేయశక్యముగానిపని, న అస్తి = లేదు, త్రిషు సంగ్రహేషు = మూడులోకములయందును, యః = ఎవడు, తే = నీయొక్క, అస్త్రబలం = అస్త్రశక్తిని, తే = నీయొక్క, బలం చ = సామర్థ్యమును, న వేద = తెలిసికొనలేడో, సః = అట్టివాడు, కశ్చిత్ = ఒక్కడును, న అస్తి = లేదు.

తాత్పర్యము :– యుద్ధములందు నీవు నిర్వహింపజాలని అసాధ్యకృత్యము ఏదియును లేదు. ఈ మూడు లోకములందును నీ అస్త్రబలమును గుఱించిగాని శరీరబలమును గుఱించిగాని తెలియనివాడు ఎవ్వడును లేడు సుమా!

శ్లో॥ మ మానురూపం తపసో బలం చ తే
పరాక్రమ శ్చాస్త్రబలం చ సంయుగే ।
న త్వాం సమాసాద్య రణావమర్దే
మనశ్శ్రమం గచ్ఛతి నిశ్చితార్థమ్ ॥ 6

పదచ్ఛేదము :– మమ – అనురూపం – తపసః – బలం – చ – తే – పరాక్రమః – చ – అస్త్రబలం – చ – సంయుగే – న – త్వాం – సమాసాద్య – రణావమర్దే – మనః – శ్రమం – గచ్ఛతి – నిశ్చితార్థమ్ ॥

అన్వయక్రమము :– తే తపసః బలం చ, పరాక్రమః చ, అస్త్రబలం చ, మమ అనురూపమ్, రణావమర్దే త్వాం సమాసాద్య మే మనః నిశ్చితార్థం (సత్) శ్రమం న గచ్ఛతి.

ప్రతిపదార్థము :– తే = నీయొక్క, తపసః = తపము యొక్క, బలం చ = బలమున్నూ, పరాక్రమః చ = పరాక్రమమున్నూ, అస్త్రబలం చ = అస్త్రముల బలమున్నూ, మమ = నాకు, అనురూపమ్ = సదృశ్యమైయున్నది. రణావమర్దే = యుద్ధ సంఘర్షమున, త్వాం = నిన్ను, సమాసాద్య = పొంది, మే = నాయొక్క, మనః = మనస్సు, నిశ్చితార్థం సత్ = జయము విషయమున నిశ్చయముకలదై, శ్రమం = విషాదమును, న గచ్ఛతి = పొందదు.

తాత్పర్యము :– నీవు తపోబలముననుయుద్ధముననుఅస్త్రబలముననునన్నుబోలినవాడవు. యుద్ధమున సంకటము గల్గునప్పుడు నామనసు నిన్ను దలంచి దుఃఖము నొందకుండును.

శ్లో॥ నిహతాః కింకరాస్సర్వే జంబుమాలీ చ రాక్షసః ।
అమాత్యాపుత్రా వీరాశ్చ పంచ సేనాగ్రయాయినః ॥ 7

పదచ్ఛేదము :- నిహతాః - కింకరాః - సర్వే - జంబుమాలీ - చ - రాక్షసః - అమాత్యపుత్రాః - వీరాః - చ - పంచ - సేనాగ్రయాయినః ॥

అన్వయక్రమము :- సర్వే కింకరాః నిహతాః. రాక్షసః జంబుమాలీ చ (నిహతః). వీరాః అమాత్యపుత్రాః చ, పంచ సేనాగ్రయాయినః చ (నిహతాః).

ప్రతిపదార్థము :- సర్వే కింకరాః = కింకరరాక్షసు లెల్లరును, నిహతాః = చంపబడిరి, రాక్షసః జంబుమాలీ చ = రాక్షసుడైన జంబుమాలియు, (నిహతః = వధింపబడెను). వీరాః = శూరులైన, అమాత్యపుత్రాః చ = మంత్రికుమారులును, పంచ సేనాగ్రయాయినః = ఐదుగురు సేనాధిపతులును, నిహతాః = చంపబడిరి.

తాత్పర్యము :- మన కింకరరాక్షసు లెల్లరును మరణించిరి. రాక్షసవీరుడైన జంబుమాలియును వధింపబడెను. మహావీరులైన మంత్రికుమారు లేడుగురును సేనాధిపతు లేవురును గూడ పంచత్వము నొందిరి.

శ్లో॥ బలాని సుసమృద్ధాని సాశ్వనాగరథాని చ ।
సహోదర స్తే దయితః కుమారోఽక్షశ్చ సూదితః ।
న హి తేష్వేవ మే సారో యస్త్వ య్యరినిషూదన ॥ 8

పదచ్ఛేదము :- బలాని - సుసమృద్ధాని - సాశ్వనాగరథాని చ - సహోదరః - తే - దయితః - కుమారః - అక్షః - చ - సూదితః, న - హి - తేషు - ఏవ - మే - సారః - యః - త్వయి - అరినిషూదన ॥

అన్వయక్రమము :- సాశ్వనాగరథాని సుసమృద్ధాని బలాని (నిహతాని); తే దయితః, సహోదరః, కుమారః అక్షః చ సూదితః; అరినిషూదన! త్వయి మే యః సారః, తేషు సః నైవ అస్తి.

ప్రతిపదార్థము :- సాశ్వనాగరథాని = గుఱ్ఱములతోడను, ఏనుగులతోడను, రథములతోడను గూడినట్టి, సుసమృద్ధాని = మిక్కిలి సమగ్రమైనట్టి, బలాని చ = సైన్యములును, (నిహతాని = సంహరింపబడినవి). తే = నీయొక్క, దయితః = ప్రియుడైన, సహోదరః = సోదరుడగు, కుమారః అక్షః చ = అక్షకుమారుడును, సూదితః = వధింపబడినాడు. అరినిషూదన = ఓ శత్రుమర్దనుడా! త్వయి = నీయందు, యః సారః = ఏ గౌరవము, మే = నాకు, అస్తి = ఉన్నదో, తేషు = వారియందు,

సః = ఆ గౌరవము, నైవ అస్తి హి = ఏమియును లేదు సుమా.

తాత్పర్యము :- అసంఖ్యములైన అశ్వములు, మదగజములు, రథములు మున్నగు వానితో నిండియున్న మనసైన్యములు ఎన్నియో నశించిపోయినవి. ప్రేమపాత్రుడైన నీ తమ్ముడు అక్షకుమారుడుగూడ కడదేరినాడు. ఓ శత్రుసంహారకుడా! వారెవ్వరి యందునుగూడ విజయమునకు నాకు నీయం దున్నంతటి గౌరవము, నమ్మకము ఎన్నడును లేదు సుమా!

శ్లో॥ ఇదం చ దృష్ట్వా నిహతం మహద్బలం
కపేః ప్రభావం చ పరాక్రమం చ ।
త్వ మాత్మన శ్చాపి సమీక్ష్య సారం
కురుష్వ వేగం స్వబలానురూపమ్ ॥ 9

పదచ్ఛేదము :- ఇదం - చ - దృష్ట్వా - నిహతం - మహత్ - బలం - కపేః - ప్రభావం - చ - పరాక్రమం - చ - త్వమ్ - ఆత్మనః - చ - అపి - సమీక్ష్య - సారం, కురుష్వ - వేగం - స్వబలానురూపమ్ ॥

అన్వయక్రమము :- ఇదం నిహతం మహత్ బలం చ, కపేః ప్రభావం చ, పరాక్రమం చ దృష్ట్వా, ఆత్మనః సారం చ అపి సమీక్ష్య స్వబలానురూపం వేగం కురుష్వ.

ప్రతిపదార్థము :- ఇదం = ఈ, నిహతం = చంపబడినట్టి, మహత్ = గొప్పదైన, బలం చ = సైన్యమును, కపేః = వానరునియొక్క ప్రభావం చ = మహిమను, పరాక్రమం చ = శౌర్యమును, దృష్ట్వా = చూచి, ఆత్మనః = నీయొక్క, సారం చ అపి = బలమును గూడ, సమీక్ష్య = చక్కగా తెలిసికొని, స్వబలానురూపం = నీశక్తికి తగినట్టిదైన, వేగం = విజృంభణమును, త్వం = నీవు, కురుష్వ = కావింపుము.

తాత్పర్యము :- ఇంతవఱకును యుద్ధమునందు కడతేరియున్న మన గొప్పదైన బలసంపదను, ఆ వానరుని ప్రభావమును, చక్కగా గుర్తించుకొని, నీవు నీ సామర్థ్యమును చక్కగా తెలిసికొని నీ శక్తికి తగినరీతిగా యుద్ధమునందు విజృంభించుము.

శ్లో॥ బలావమర్ద స్త్వయి సన్నికృష్టే
యథాగతే శామ్యతి శాంతశత్రౌ ।
తథా సమీ క్ష్యాత్మబలం పరం చ
సమారభ స్వాస్త్రవిదాం వరిష్ఠ ॥ 10

పదచ్ఛేదము :- బలావమర్దః - త్వయి - సన్నికృష్టే - యథా - గతే - శామ్యతి - శాంతశత్రౌ, తథా - సమీక్ష్య - ఆత్మబలం - పరం - చ - సమారభస్వ - అస్త్రవిదాం - వరిష్ఠ ॥

అన్వయక్రమము :- అస్త్రవిదాం వరిష్ఠ! త్వయి సన్నికృష్టే గతే శాంతశత్రౌ చ (సతి) యథా బలావమర్దః శామ్యతి, ఆత్మబలం పరం చ సమీక్ష్య, తథా సమారభస్వ.

ప్రతిపదార్థము :- అస్త్రవిదాం = అస్త్రవేత్తలలో, వరిష్ఠ = శ్రేష్ఠుడా, త్వయి = నీవు, సన్నికృష్టే = సమీపమున, గతే = వెళ్ళినవాడవును, శాంతశత్రౌ చ (సతి) = చల్లార్చబడిన (అణచివేయబడిన) శత్రువులు గలవాడవు నగుచుండగా, యథా = ఏరీతిగా, బలావమర్దః = బలముయొక్క ఉద్రేకము, శామ్యతి = క్షీణించునో, తథా = ఆ రీతిగా, ఆత్మబలం = నీ శక్తిని, పరం చ = శత్రువును, సమీక్ష్య = ఆకళించుకొని, సమారభస్వ = ఉద్యమింపుము.

తాత్పర్యము :- ఓ సర్వాస్త్రనిపుణుడా! నీవు యుద్ధభూమి కేగి శత్రువు బలోద్రేకము చల్లబడిపోవునట్లుగా నీ నిజబలమును చూపుచు శత్రుబలమును కూడ చక్కగా ఆకళింపు చేసికొనుచు తగినరీతిగా యుద్ధక్రమమునందు ముందునకు సాగుము.

శ్లో॥ న వీర సేనా గణశోచ్యవంతి
న వజ్రమాదాయ విశాలసారమ్ ।
న మారుత స్యాస్య గతిప్రమాణం
న చాగ్నికల్పః కరణేన హంతుమ్ ॥ 11

పదచ్ఛేదము :- న - వీర - సేనాః - గణశోచి - అవంతి - న - వజ్రమ్ - ఆదాయ - విశాలసారమ్, న - మారుతస్య - అస్య - గతిప్రమాణం - న - చ - అగ్నికల్పః - కరణేన - హంతుమ్ ॥

అన్వయక్రమము :- వీర! గణశోచి (అస్మిన్) సేనాః న అవంతి; విశాలసారం వజ్రం ఆదాయ న (ప్రయోజనం); అస్య గతిప్రమాణం మారుతస్య న (అస్తి); అగ్నికల్పః (అయం) కరణేన హంతుం న చ (శక్యః).

ప్రతిపదార్థము :- వీర! = ఓ మహావీరుడా! గణశోచి = శత్రుగణములను శోకింపజేయునట్టి, (అస్మిన్ = ఈతనియెడ) సేనాః = సైన్యములు, న అవంతి = రక్షింపవు, విశాలసారం = గొప్పదైన సామర్థ్యముగల, వజ్రమ్ = వజ్రమును, ఆదాయ = గ్రహించి, న ప్రయోజనమ్ = ప్రయోజనములేదు, అస్య = ఈతనియొక్క, గతి ప్రమాణం = గమనపరిమితి, మారుతస్య = వాయుదేవునకు, న (అస్తి) = లేదు,

అగ్నికల్పః = అగ్నిహోత్రునితో సమానుడైన, (అయం = ఈతడు) కరణేన = సాధనముతో, హంతుం = చంపుటకు, న(శక్యః) = శక్యమైనవాడుగాడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– సేనాః గణశః చ్యవంతి – సైన్యములు గుంపులుగా పరుగుపెట్టుకొని పోవును (హనుమను చూడగానే) మారుతస్య అస్య గతిప్రమాణం న – వాయుదేవుని పుత్రుడైన ఈతనియొక్క గమనమునకు ఇంతటిదను పరిమాణము లేదు. ఈ వచ్చినది వాయుపుత్రుడే అని రావణునకు తెలియుట అశక్యముగాదు. "హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః" అని హనుమ తనను గూర్చి చెప్పుకొనెనుగదా!

గోవిందరాజీయము :– "అలసారం వజ్రం ఆదాయ న విశ" హనుమంతుని విషయమున అదికూడ అల్పబలము కలిగినట్టిదే అగును. కావున వజ్రాయుధమును గ్రహించి వెడలకుము. "అస్య మారుతస్య గతేః ప్రమాణం న" – ఈ వాయుపుత్రుని యొక్క గమనమునకు పరిమితిలేదు. వాయు వేదిక్కుకైనను అవలీలగ నెట్లు పోగలదో అట్లే ఈతడు ఏ దిక్కునుండి సైన్యము మీదకురుకునో తెలియదని భావము.

న గణశోఽవ్యవంతి – అని పాఠాంతరము. అనగా సైన్యములు ఎన్ని సమూహములుగ వచ్చినను హనుమనుండి రక్షింపలేవని భావము.

తాత్పర్యము :– శత్రుసైన్యముల సమూహము లెన్నివచ్చినను నశింపచేయగల ఈ హనుమ విషయమున సైన్యములు మనను కాపాడజాలవు. ఎట్టి ఆయుధములకును భయపడని ఈతని మీదికి గొప్పబలముగల వజ్రాయుధమును గొనిపోయినను ప్రయోజనములేదు. యుద్ధరంగమునందు ఈతని గమనమునకుగల లాఘవము ఆ వాయుదేవునకు గూడలేదు. మీదికి పోయి పిడికిళ్లతో పొడిచి పోరుటకు ఈతడు అగ్నిహోత్రునివంటివాడు గావున అదియును అశక్యమే.

శ్లో॥ త మేవ మర్థం ప్రసమీక్ష్య సమ్యక్
స్వకర్మసామ్యాద్ధి సమాహితాత్మా ।
స్మరంశ్చ దివ్యం ధనుషో ఽస్త్రవీర్యం
వ్రజాక్షతం కర్మ సమారభస్వ ॥ 12

పదచ్ఛేదము :– తమ్ – ఏవమ్ – అర్థం – ప్రసమీక్ష్య – సమ్యక్, స్వకర్మసామ్యాత్ – హి – సమాహితాత్మా, స్మరన్ – చ – దివ్యం – ధనుషః – అస్త్రవీర్యం – వ్రజ – అక్షతం – కర్మ – సమారభస్వ ॥

అన్వయక్రమము :- ఏవం తమ్ అర్థం సమ్యక్ ప్రసమీక్ష్య, స్వకర్మసామ్యాత్ సమాహితాత్మా, ధనుషః దివ్యమ్ అస్త్రవీర్యం స్మరన్ వ్రజ, అక్షతం కర్మ సమారభస్వ.

ప్రతిపదార్థము :- ఏవం = ఈవిధముగా, తమ్ అర్థం = ఆ విషయమును, సమ్యక్ = లెస్సగా, ప్రసమీక్ష్య = గుర్తించుకొని, స్వకర్మసామ్యాత్ = నీపనికి సరియగునట్లుగా, సమాహితాత్మా = ఏకాగ్రమైన మనస్సుగలవాడవై, ధనుషః = ధనుస్సుయొక్క, దివ్యం = గొప్పదైనట్టి, అస్త్రవీర్యం = అస్త్రప్రభావమును, స్మరన్ = జ్ఞప్తికి తెచ్చుకొనుచు, వ్రజ = పొమ్ము, అక్షతం = హానిలేనట్టి, కర్మ = పనిని, సమారభస్వ = ప్రారంభించుము.

తాత్పర్యము :- ఈవిధముగ నున్న విషయమును చక్కగా ఆకళింపు చేసికొని ఏకాగ్రచిత్తుడవై నీ కృత్యమునకు తగినరీతిగా ఆలోచనము సాగించుచు నీ యధీన మందున్న ధనుస్సు శక్తిని, అస్త్రముల ప్రభావమును మఱచిపోకుండ యుద్ధరంగమునకు వెడలి అపాయము లేనిరీతిగా ఈ యుద్ధకార్యమును కొనసాగింపుము.

శ్లో॥ న ఖల్వియం మతిః శ్రేష్ఠా యత్త్వాం సంప్రేషయామ్యహమ్ ।
ఇయం చ రాజధర్మాణాం క్షత్రస్య చ మతి ర్మతా ॥ 13

పదచ్ఛేదము :- న - ఖలు - ఇయం - మతిః - శ్రేష్ఠా - యత్ - త్వాం - సంప్రేషయామి - అహం, ఇయం - చ - రాజధర్మాణాం - క్షత్రస్య - చ - మతిః - మతా ॥

అన్వయక్రమము :- త్వామ్ అహం సంప్రేషయామి (ఇతి) యత్, ఇయం మతిః న శ్రేష్ఠా ఖలు; రాజధర్మాణాం, క్షత్రియస్య ఇయం మతా మతిః.

ప్రతిపదార్థము :- అహం = నేను, త్వాం = నిన్ను, సంప్రేషయామి = పంపుచున్నాను, ఇతి = అనునది, యత్ = ఏదియున్నదో, ఇయం మతిః = ఈ యాలోచనము, న శ్రేష్ఠా ఖలు = మంచిదిగాదుసుమా! రాజధర్మాణాం = రాజధర్మములకును, క్షత్రియస్య చ = క్షత్రియునకును, ఇయం = ఈ పద్ధతి, మతా = సమ్మతమైనట్టి, మతిః = ఆలోచనము, భవతి = అగుచున్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- రావణుడు జాతిగుణకర్మములచే క్షత్రియుడేగాని బ్రాహ్మణుడుగాడు. రావణునకు జరిపిన యుత్తరక్రియల విధానమును పరిశీలించినను బ్రాహ్మణునకు చేయు కార్యములు గావని స్పష్టపడును. భగవద్ద్వేషియైన సుమాలియొక్క పుత్రికయగు కైకసి, బిడ్డలనుకోరి ప్రదోషకాలమందు విశ్రవసుని బొందినది కావున బ్రాహ్మణుడైన

వి(శవసునకు వివాహము చేసికొనని రాక్షసక్ష(త్రియయందు బుట్టిన రావణుడు (బాహ్మణ జాతివాడెట్లగును? విశ్వామి(త్రుని తాత కుశుడు సాక్షాద్బ్రహ్మపు(త్రుడైనను ఆయన వంశము వారందరు క్ష(త్రియధర్మ మవలంబించుటచే క్ష(త్రియులైరి గాని (బాహ్మణు లనబడలేదుగదా!

తాత్పర్యము :– నిన్నిప్పుడు ఇట్లు యుద్ధమునకు పంపుట యనునది నాకు ఎంత మా(తము సమ్మతమైన మంచి ఆలోచనము గాదు, గాని ఈ పద్ధతియే రాజ ధర్మమునకును, క్ష(త్రియుని కర్తవ్యమునకును ఉచితమైనదని పెద్దల నిర్ణయము.

శ్లో॥ నానాశ(స్త్రేషు సం(గ్రామే వైశారద్య మరిందమ ।
అవశ్యమేవ బోద్ధవ్యం కామ్యశ్చ విజయో రణే ॥ 14

పదచ్ఛేదము :– నానాశ(స్త్రేషు – సం(గ్రామే – వైశారద్యమ్ – అరిందమ – అవశ్యమ్ – ఏవ – బోద్ధవ్యం – కామ్యః – చ – విజయః – రణే ॥

అన్వయక్రమము :– అరిందమ! సం(గ్రామే నానాశ(స్త్రేషు వైశారద్యమ్ అవశ్యమేవ బోద్ధవ్యమ్; రణే విజయః చ కామ్యః.

ప్రతిపదార్థము :– అరిందమ = ఓ శ(త్రుమర్దనుడా, సం(గ్రామే = యుద్ధమున, నానాశ(స్త్రేషు = వివిధములగు శ(స్త్రములందు, వైశారద్యం = (ప్రావీణ్యము, అవశ్యమ్ ఏవ = తప్పనిసరిగనే, బోద్ధవ్యం = తెలిసికొన వలసియున్నది, రణే = యుద్ధమున, విజయః చ = జయమును, కామ్యః = కోరదగినది.

సూచన :– 'నానాశ(స్త్రేషు (తే) వైశారద్యం (అస్తి) అవశ్యమేవ యోద్ధవ్యం' అని పాఠాంతరము. అనగా నీకు పెక్కు ఆయుధముల (ప్రయోగమున (ప్రావీణ్యమున్నది గాన తప్పక యుద్ధము చేయుమని భావము.

తాత్పర్యము :– ఓ శ(త్రుంజయుడా! యుద్ధమున ధర్మశా(స్త్రము, అర్థశా(స్త్రము, నీతిశా(స్త్రము, కూటనీతి మున్నగు పెక్కింటియందు (ప్రావీణ్యము కలిగియుండవలెను. రణమున ముఖ్యముగా విజయము కోరదగినదై యుండును.

శ్లో॥ తతః పితు స్త ద్వచనం నిశమ్య
(ప్రదక్షిణం దక్షసుత(ప్రభావః ।
చకార భర్తార మతిత్వరేణ
రణాయ వీరః (ప్రతిపన్నబుద్ధిః ॥ 15

పదచ్ఛేదము :- తతః - పితుః - తత్ - వచనం - నిశమ్య - ప్రదక్షిణం - దక్షసుత ప్రభావః, చకార - భర్తారమ్ - అతిత్వరేణ, రణాయ - వీరః - ప్రతిపన్నబుద్ధిః ॥

అన్వయక్రమము :- తతః పితుః తద్వచనం నిశమ్య దక్షసుతప్రభావః, వీరః రణాయ ప్రతిపన్నబుద్ధిః, అతిత్వరేణ భర్తారం ప్రదక్షిణం చకార.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, పితుః = తండ్రియొక్క, తద్వచనం = ఆ మాటను, నిశమ్య = విని, దక్షసుతప్రభావః = దక్షసుతులైన దేవతలయొక్క ప్రభావముగల, వీరః = వీరుడైన ఇంద్రజిత్తు, రణాయ = యుద్ధముకొఱకు, అతిత్వరేణ = మిక్కిలిత్వరగా, ప్రతిపన్నబుద్ధిః = నిశ్చయించుకొన్నట్టి మనస్సుగలవాడై, భర్తారం = తండ్రినిగూర్చి, ప్రదక్షిణం చకార = ప్రదక్షిణము గావించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- దక్షసుతాః దేవాః - ఇందుకు ప్రమాణము "మనసా త్వేవ భూతాని పూర్వం దక్షోఽసృజత్ తథా, దేవాన్ ఋషీన్ సగంధర్వా నురగాన్ పక్షిణస్తథా"

- విష్ణుపురాణము

తాత్పర్యము :- అప్పుడా ఇంద్రజిత్తు తండ్రిమాటలను విని దేవతల పరాక్రమము గల్గినట్టి ఆతడు యుద్ధమునకు వేగిరపడుచు లేచి తండ్రికి ప్రదక్షిణ మొనరించెను.

శ్లో॥ తత స్తై స్స్వగణై రిష్టై రింద్రజి త్ప్రతిపూజితః ।
యుద్ధోద్ధతః కృతోత్సాహః సంగ్రామం ప్రత్యపద్యత ॥ 16

పదచ్ఛేదము :- తతః - తైః - స్వగణైః - ఇష్టైః - ఇంద్రజిత్ - ప్రతిపూజితః, యుద్ధోద్ధతః - కృతోత్సాహః - సంగ్రామం - ప్రత్యపద్యత ॥

అన్వయక్రమము :- తతః ఇంద్రజిత్ ఇష్టైః, తైః స్వగణైః ప్రతిపూజితః, యుద్ధోద్ధతః, కృతోత్సాహః సంగ్రామం ప్రత్యపద్యత.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, ఇంద్రజిత్ = ఇంద్రజిత్తు, ఇష్టైః = ప్రియులైనట్టి, తైః స్వగణైః = తనయొక్క ఆత్మీయులచే, ప్రతిపూజితః = సన్మానింపబడినవాడై, యుద్ధోద్ధతః = యుద్ధమునుగూర్చి ఉద్రేకము గలవాడగుచు, కృతోత్సాహః = కూర్చుకొన్న ఉత్సాహముగలవాడై, సంగ్రామం = యుద్ధమును, ప్రత్యపద్యత = పొందెను.

తాత్పర్యము :- అప్పుడా ఇంద్రజిత్తు ఆత్మీయులైన రాక్షసగణములు తనను సన్మానింపగా మిక్కిలి ఉత్సాహముతోను, ఆవేశముతోను రణమునకై వేగిరపడుచుండెను.

శ్లో॥ శ్రీమాన్ పద్మపలాశాక్షో రాక్షసాధిపతే స్సుతః ।
నిర్జగామ మహాతేజాః సముద్ర ఇవ పర్వసు ॥ 17

పదచ్ఛేదము :– శ్రీమాన్ – పద్మపలాశాక్షః – రాక్షసాధిపతేః – సుతః – నిర్జగామ – మహాతేజాః – సముద్రః – ఇవ – పర్వసు ॥ ॥

అన్వయక్రమము :– శ్రీమాన్, పద్మపలాశాక్షః, మహాతేజాః, రాక్షసాధిపతేః సుతః, పర్వసు సముద్రః ఇవ నిర్జగామ.

ప్రతిపదార్థము :– శ్రీమాన్ = గొప్పశోభ గలవాడును, పద్మపలాశాక్షః = తామరఱేకుల వంటి కన్నులు గలవాడును, మహాతేజాః = గొప్పదైన తేజస్సు గలవాడునగు, రాక్షసాధిపతేః = రాక్షసరాజుయొక్క, సుతః = కుమారుడైన ఇంద్రజిత్తు, పర్వసు = పర్వదినములందు, సముద్రః ఇవ = సముద్రమువలె, నిర్జగామ = (యుద్ధమునకు) వెడలెను.

తాత్పర్యము :– గొప్పశోభగలవాడును, తామరఱేకులవంటి కన్నులుగలవాడును, అమితమైన తేజస్సుగలవాడు నగు రాక్షసరాజు తనయుడైన ఇంద్రజిత్తు పర్వదినములందు సముద్రము పొంగి పొరలి పోవుచున్నట్లుగా యుద్ధభూమికి వెడలెను.

శ్లో॥ స పక్షిరాజానిలతుల్యవేగై
ర్వ్యాళై శ్చతుర్భి స్సితతీక్ష్ణదంష్ట్రైః ।
రథం సమాయుక్త మసంగవేగం
సమారురో హేంద్రజి దింద్రకల్పః ॥ 18

పదచ్ఛేదము :– సః – పక్షిరాజానిలతుల్యవేగైః – వ్యాలైః – చతుర్భిః – సితతీక్ష్ణదంష్ట్రైః – రథం – సమాయుక్తమ్ – అసంగవేగం – సమారురోహ – ఇంద్రజిత్ – ఇంద్రకల్పః ॥

అన్వయక్రమము :– ఇంద్రకల్పః సః ఇంద్రజిత్ పక్షిరాజానిలతుల్యవేగైః, సితతీక్ష్ణదంష్ట్రైః చతుర్భిః వ్యాలైః సమాయుక్తమ్ అసంగవేగం రథం సమారురోహ.

ప్రతిపదార్థము :– ఇంద్రకల్పః = ఇంద్రునితో సమానుడగు, సః ఇంద్రజిత్ = ఆ ఇంద్రజిత్తు, పక్షిరాజానిలతుల్యవేగైః = గరుత్మంతునితోడను వాయువుతోడను సమానమైన వేగముగలవియును, సితతీక్ష్ణదంష్ట్రైః = తెల్లనివాడియైన కోఱలుగలవియునగు, చతుర్భిః వ్యాలైః = నాలుగు క్రూరమృగములచే, (అనగా సింహములచే) సమాయుక్తం = పూన్చబడినట్టి, అసంగవేగం = సాటిలేని వేగము

గల్గినట్టి, రథం = రథమును, సమారురోహ = ఆరోహించెను.

సూచన :– పక్షిరాజానిలతుల్యవేగైః అను నీ పాఠము జగద్గురు శ్రీకంచి కామకోటి పీఠాధీశ్వరుల ఆమోదముతో వెలువడిన మద్రాసుప్రతిలోనిది. మిగిలిన ప్రతులలో పక్షిరాజోపమతుల్యవేగైః అనియే ఉన్నది. ఈ పాఠమునకు అర్థము గరుత్మంతునితో సమానమైన వేగముగలవియును, తమలో తాము సమానమైన వేగము గల్గినట్టివియును అని చెప్పుకొనవలెను. ఇచ్చట ఈ శ్లోకమున 'వ్యాలైః' అను పదమునకు తిలక వ్యాఖ్యానమున 'సర్పములతో' అనియును, 'గుఱ్ఱములచే' అని వాసుదాసస్వామియును, 'హింస్రపశువులచే' యని మహేశ్వరతీర్థులవారును, 'సింహములచే' అని గోవింద రాజీయమును తెల్పుచున్నది.

తాత్పర్యము :– దేవేంద్రునితో సమానమైన శక్తిశాలియగు ఇంద్రజిత్తు గరుడునితోడను, వాయువుతోడను సమానమైన వేగముగల్గి, తెల్లని వాడియైన కోఱలతో ప్రకాశించుచున్న నాల్గు సింహములతో కూర్చబడిన సాటిలేని వేగముగల రథమును నారోహించెను.

శ్లో॥ స రథీ ధన్వినాం శ్రేష్ఠః శస్త్రజ్ఞో ఽస్త్రవిదాం వరః ।
రథే నాభియయౌ క్షిప్రం హనుమాన్యత్ర సోఽభవత్ ॥ 19

పదచ్ఛేదము :– సః – రథీ – ధన్వినాం – శ్రేష్ఠః – శస్త్రజ్ఞః – అస్త్రవిదాం – వరః – రథేన – అభియయౌ – క్షిప్రం – హనుమాన్ – యత్ర – సః – అభవత్ ॥

అన్వయక్రమము :– ధన్వినాం శ్రేష్ఠః, శస్త్రజ్ఞః, అస్త్రవిదాం వరః, సః రథీ, సః హనుమాన్ యత్ర అభవత్, తత్ర క్షిప్రం రథేన అభియయౌ.

ప్రతిపదార్థము :– ధన్వినాం = విలుకాండ్రలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడును, శస్త్రజ్ఞః = ఆయుధ రహస్యముల నెఱిగినవాడును, అస్త్రవిదాం = అస్త్రవేత్తలలో, వరః = శ్రేష్ఠుడునగు, రథీ సః = రథికుడైన ఆ ఇంద్రజిత్తు, సః హనుమాన్ = ఆ హనుమ, యత్ర అభవత్ = ఎచ్చటనుండెనో, క్షిప్రం = వెంటనే, రథేన = రథముతో, అభియయౌ = చేరెను.

తాత్పర్యము :– మేటి విలుకాండ్రలో శ్రేష్ఠుడును, శస్త్రాస్త్రముల రహస్యములు తెలిసిన వారిలో మేటియునగు మహారథుడైన ఆ ఇంద్రజిత్తు తన రథము నతిశీఘ్రముగా నడిపించుకొనుచు హనుమయున్న చోటికి చేరుకొనెను.

శ్లో॥ స తస్య రథనిర్ఘోషం జ్యాస్వనం కార్ముకస్య చ ।
నిశమ్య హరివీరో ఽసౌ సంప్రహృష్టతరో ఽభవత్ ॥ 20

పదచ్ఛేదము :- సః - తస్య - రథనిర్ఘోషం - జ్యాస్వనం - కార్ముకస్య - చ, నిశమ్య - హరివీరః - అసౌ - సంప్రహృష్టతరః - అభవత్ ॥

అన్వయక్రమము :- సః అసౌ హరివీరః తస్య రథనిర్ఘోషం, కార్ముకస్య జ్యాస్వనం చ నిశమ్య, సంప్రహృష్టతరః అభవత్.

ప్రతిపదార్థము :- సః = ఆ, అసౌ = ఈ, హరివీరః = వానరవీరుడైన హనుమ, తస్య = ఆ ఇంద్రజిత్తుయొక్క, రథనిర్ఘోషం = రథధ్వనిని, కార్ముకస్య = ధనుస్సుయొక్క, జ్యాస్వనం చ = అల్లెతాటిమ్రోతను, నిశమ్య = ఆలకించి, సంప్రహృష్టతరః = మిక్కిలి సంతోషించినట్టివాడు, అభవత్ = ఆయెను.

తాత్పర్యము :- మహావీరుడైన హనుమ ఇంద్రజిత్తు రథముయొక్క ఘోషయును, ఆతని వింటినారినుండి వెలువడు ధనుష్టంకారముల యొక్క ధ్వనిని ఆకర్ణించి మఱల ఇంకొక మహావీరుడు వచ్చుచున్నాడని మహానందము నొందెను.

శ్లో॥ స మహ చ్చాప మాదాయ శితశల్యాంశ్చ సాయకాన్ ।
హనూమంత మభిప్రేత్య జగామ రణపండితః ॥ 21

పదచ్ఛేదము :- సః - మహత్ - చాపమ్ - ఆదాయ - శితశల్యాన్ - చ - సాయకాన్, హనూమంతమ్ - అభిప్రేత్య - జగామ - రణపండితః ॥

అన్వయక్రమము :- రణపండితః సః మహత్ చాపం శితశల్యాన్ సాయకాన్ చ ఆదాయ హనూమంతమ్ అభిప్రేత్య జగామ.

ప్రతిపదార్థము :- రణపండితః = యుద్ధమునందు ఆరితేరినట్టి, సః = ఆ ఇంద్రజిత్తు, మహత్ = మిక్కిలి గొప్పదైన, చాపం = ధనుస్సును, శితశల్యాన్ = వాడియైన ములుకులు గల, సాయకాన్ చ = బాణములను, ఆదాయ = తీసికొని, హనూమంతం అభిప్రేత్య = హనుమంతుని ఉద్దేశించి, జగామ = వెడలెను.

తాత్పర్యము :- యుద్ధకోవిదుడైన ఆ ఇంద్రజిత్తు మిక్కిలి శ్రేష్ఠమైన ధనుస్సును, వాడియైన అలుగులుగల బాణములను ధరించి హనుమంతుని వెదకికొనుచు బయలుదేరెను.

శ్లో॥ తస్మిం స్తత స్సంయతి జాతహర్షే
రణాయ నిర్గచ్ఛతి బాణపాణౌ ।
దిశశ్చ సర్వాః కలుషా బభూవు
ర్మృగాశ్చ రౌద్రా బహుధా వినేదుః ॥ 22

పదచ్ఛేదము :– తస్మిన్ – తతః – సంయతి – జాతహర్షే – రణాయ – నిర్గచ్ఛతి – బాణపాణౌ, దిశః – చ – సర్వాః – కలుషాః – బభూవుః – మృగాః – చ – రౌద్రాః – బహుధా – వినేదుః ॥

అన్వయక్రమము :– తతః సంయతి జాతహర్షే బాణపాణౌ, తస్మిన్ రణాయ నిర్గచ్ఛతి (సతి) సర్వాః దిశః చ కలుషాః బభూవుః, రౌద్రాః మృగాః బహుధా వినేదుః చ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, సంయతి = యుద్ధవిషయమునందు, జాతహర్షే = జనించిన సంతోషముగల్గినట్టి, బాణపాణౌ = బాణహస్తుడైన, తస్మిన్ = ఆ ఇంద్రజిత్తు, రణాయ = యుద్ధముకొఱకై, నిర్గచ్ఛతి సతి = బయలుదేరి వెళ్ళుచుండగా, సర్వాః = సమస్తములైన, దిశశ్చ = దిక్కులును, కలుషాః = వ్యాకులములు, బభూవుః = అయినవి, రౌద్రాః = క్రూరములైన, మృగాః = జంతువులు, బహుధా = పలు విధములుగా, వినేదుః చ = ఆక్రోశించినవిగూడను.

తాత్పర్యము :– యుద్ధమునకై యువ్విళ్లూరుచున్న ఆ ఇంద్రజిత్తు ధనుర్బాణములను ధరించి రణరంగమునకు చేరుచుండగా దిక్కులెల్లను కలతనొందినవి. నక్కలు మున్నగు క్రూరమృగములు వివిధరీతులుగా ఆక్రోశింపసాగినవి.

శ్లో॥ సమాగతా స్తత్ర తు నాగయక్షాః
మహర్షయ శ్చక్రచరాశ్చ సిద్ధాః ।
నభ స్సమావృత్య చ పక్షిసంఘా
వినేదు రుచ్చైః పరమప్రహృష్టాః ॥ 23

పదచ్ఛేదము :– సమాగతాః – తత్ర – తు – నాగయక్షాః, మహర్షయః – చక్రచరాః – చ – సిద్ధాః, నభః – సమావృత్య – చ – పక్షిసంఘాః, వినేదుః – ఉచ్చైః – పరమప్రహృష్టాః ॥

అన్వయక్రమము :– తత్ర నాగయక్షాః, సిద్ధాః, చక్రచరాః మహర్షయః చ సమాగతాః, పక్షిసంఘాః చ పరమప్రహృష్టాః (సంతః) నభః సమావృత్య ఉచ్చైః వినేదుః.

ప్రతిపదార్థము :– తత్ర = ఆ ప్రదేశమునకు, నాగయక్షాః = నాగులును, యక్షులును, సిద్ధాః = సిద్ధులు, చక్రచరాః = జ్యోతిశ్చక్రమునందు చరించునట్టి, మహర్షయః చ = మహాఋషులును, సమాగతాః = వచ్చిరి. పక్షిసంఘాః = పక్షిసమూహములును, పరమప్రహృష్టాః (సంతః) = మిక్కిలి సంతోషమును బొందినవి యగుచు, నభః = ఆకాశమును, సమావృత్య = ఆవరించి, ఉచ్చైః = బిగ్గరగా, వినేదుః = అఱచినవి.

తాత్పర్యము :– ఆ రణమును చూడగోరి నాగులు, యక్షులు, సిద్ధులు, జ్యోతిశ్చక్రము నందలి మహర్షులును కూడ వచ్చిరి. పక్షిసంఘములు కూడ ఆకాశము నావరించి గొప్ప ఉత్సాహముతో బిగ్గరగా నాదములు చేసినవి.

శ్లో॥ ఆయాంతం సరథం దృష్ట్వా తూర్ణ మింద్రజితం కపిః ।
విననాద మహానాదం వ్యవర్ధత చ వేగవాన్ ॥ 24

పదచ్ఛేదము :– ఆయాంతం – సరథం – దృష్ట్వా – తూర్ణమ్ – ఇంద్రజితం – కపిః – విననాద – మహానాదం – వ్యవర్ధత – చ – వేగవాన్ ॥

అన్వయక్రమము :– కపిః తూర్ణమ్ ఆయాంతం, సరథమ్ ఇంద్రజితం, దృష్ట్వా మహానాదం విననాద; వేగవాన్ (సన్) వ్యవర్ధత చ.

ప్రతిపదార్థము :– కపిః = హనుమ, తూర్ణమ్ = శీఘ్రముగా, ఆయాంతం = వచ్చుచున్నట్టి, సరథం = రథముతోగూడిన, ఇంద్రజితం = ఇంద్రజిత్తును, దృష్ట్వా = చూచి, మహానాదం = గొప్పదైనధ్వని కలుగునట్లు, విననాద = గర్జించెను. వేగవాన్ (సన్) = గొప్ప వేగము గలవాడగుచు; వ్యవర్ధత చ = పెరిగెను గూడను.

తాత్పర్యము :– అప్పుడు హనుమంతుడు, రథము నారోహించి తన వైపునకు వేగముగా వచ్చుచున్న ఇంద్రజిత్తును గాంచి గొప్పధ్వనితో పెద్దగర్జనమును చేసెను. తన శరీరమును గూడ తగినట్లుగా పెంచుకొనెను.

శ్లో॥ ఇంద్రజిత్స రథం దివ్య మాస్థిత శ్చిత్రకార్ముకః ।
ధను ర్విస్ఫారయామాస తటిదూర్జితనిస్వనమ్ ॥ 25

పదచ్ఛేదము :– ఇంద్రజిత్ – సః – రథం – దివ్యమ్ – ఆస్థితః – చిత్రకార్ముకః – ధనుః – విస్ఫారయామాస – తటిదూర్జితనిస్వనమ్ ॥

అన్వయక్రమము :– చిత్రకార్ముకః సః ఇంద్రజిత్ దివ్యం రథమ్ ఆస్థితః, తటిదూర్జిత నిస్వనం ధనుః విస్ఫారయామాస.

ప్రతిపదార్థము :– చిత్రకార్ముకః = చిత్రమైన ధనుస్సుగల్గినట్టి, సః ఇంద్రజిత్ = ఆ ఇంద్రజిత్తు, దివ్యం = దివ్యమైనట్టి, రథమ్ = రథమును, ఆస్థితః = ఆరోహించినవాడై, తటిదూర్జితనిస్వనమ్ = మెఱుపులతో గూడిన ఉఱుముల మ్రోతవంటి ధ్వనిగలిగిన, ధనుః = ధనుస్సును, విస్ఫారయామాస = సారించెను.

తాత్పర్యము :– చిత్రమైన తన గొప్పధనుస్సును చేతబట్టి రథము నధిష్ఠించి అచ్చటికి వచ్చిన ఇంద్రజిత్తు, మేఘగర్జనమువంటి ధ్వనిని కల్గించుచు వింటినారిని సారించెను.

శ్లో॥ తత స్సమేతా వతితీక్ష్ణవేగౌ
మహాబలౌ తౌ రణనిర్వి్శంకౌ ।
కపిశ్చ రక్షోధిపతేశ్చ పుత్రః
సురాసురేంద్రావివ బద్ధవైరౌ ॥ 26

పదచ్ఛేదము :– తతః – సమేతౌ – అతితీక్ష్ణవేగౌ – మహాబలౌ – తౌ – రణనిర్వి్శంకౌ, కపిః – చ – రక్షోధిపతేః – చ – పుత్రః – సురాసురేంద్రౌ – ఇవ – బద్ధవైరౌ ॥

అన్వయక్రమము :– తతః అతితీక్ష్ణవేగౌ, మహాబలౌ, రణనిర్వి్శంకౌ తౌ కపిః చ, రక్షోధిపతేః పుత్రః చ, బద్ధవైరౌ సురాసురేంద్రౌ ఇవ సమేతౌ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, అతితీక్ష్ణవేగౌ = మిక్కిలి తీవ్రమైన వడిగలవారును, మహాబలౌ = అమితబలసంపన్నులును, రణనిర్వి్శంకౌ = యుద్ధమున జంకులేనివారునగు, తౌ = ఆ, కపిః చ = హనుమయును, రక్షోధిపతేః = రాక్షసరాజు యొక్క, పుత్రః చ = పుత్రుడును, బద్ధవైరౌ = ఏర్పడినవైరముగలిగిన, సురాసురేంద్రౌ ఇవ = దేవేంద్రుడును రాక్షసేంద్రుడునువలె, సమేతౌ = కలసికొనిరి.

తాత్పర్యము :– అటుపిమ్మట యుద్ధమునందు అతితీక్ష్ణమైన ప్రతాపము గలవారును, మహాబలాఢ్యులును, యుద్ధమునకై యువ్విళ్లూరుచున్న వారునగు ఆ హనుమంతుడు, ఇంద్రజిత్తును బద్ధవైరము గలిగినట్టి దేవేంద్రుడును రాక్షసేంద్రుడును పరస్పరము ఎదుర్కొన్నట్లుగా అచ్చట కలిసికొనిరి.

శ్లో॥ స తస్య వీరస్య మహారథస్య
ధనుష్మత స్సంయతి సమ్మతస్య ।
శరప్రవేగం వ్యహన త్ప్రవృద్ధ
శ్చచార మార్గే పితు రప్రమేయే ॥ 27

పదచ్ఛేదము :– సః – తస్య – వీరస్య – మహారథస్య – ధనుష్మతః – సంయతి – సమ్మతస్య – శరప్రవేగం – వ్యహనత్ – ప్రవృద్ధః – చచార – మార్గే – పితుః – అప్రమేయే ॥

అన్వయక్రమము :– వీరస్య, మహారథస్య, ధనుష్మతః, సంయతి సమ్మతస్య తస్య శరప్రయోగం, ప్రవృద్ధః (సన్) సః వ్యహనత్; అప్రమేయే పితుః మార్గే చచార.

ప్రతిపదార్థము :– వీరస్య = వీరుడును, మహారథస్య = మహారథుడును, ధనుష్మతః = గొప్పవిలుకాడును, సంయతి = యుద్ధమునందు, సమ్మతస్య = గౌరవించబడిన

వాడునగు, తస్య = ఆ ఇంద్రజిత్తుయొక్క, శరప్రయోగం = బాణముల గొప్పవేగమును, ప్రవృద్ధః (సన్) = మిక్కిలిగ పెరిగియున్నవాడై, సః = హనుమ, వ్యహనత్ = వ్యర్థము చేసెను, అప్రమేయే = మితిలేనట్టి, పితుః మార్గే = తండ్రియొక్క మార్గమైన ఆకాశము నందు, చచార = సంచరించెను.

తాత్పర్యము :– మహారథుడును, గొప్పవిలుకాడును, యుద్ధమున విఖ్యాతి గలవాడునగు ఇంద్రజిత్తు మహావేగముగా తనపై కురిపించుచున్న బాణవర్షమున ఒక్క బాణమైనను తనకు తగులకుండ హనుమ తన తండ్రియైన వాయుదేవుని సంచారమార్గమైన ఆకాశమునందు అపరిమితమైన లాఘవముతో తప్పించుకొనుచుండెను.

శ్లో॥ తత శ్శరా నాయతతీక్ష్ణశల్యాన్
సుపత్త్రిణః కాంచనచిత్రపుంఖాన్ ।
ముమోచ వీరః పరవీరహంతా
సుసంతతాన్ వజ్రనిపాతవేగాన్ ॥ 28

పదచ్ఛేదము :– తతః – శరాన్ – ఆయతతీక్ష్ణశల్యాన్ – సుపత్త్రిణః – కాంచనచిత్రపుంఖాన్, ముమోచ – వీరః – పరవీరహంతా – సుసంతతాన్ – వజ్రనిపాతవేగాన్ ॥

అన్వయక్రమము :– తతః పరవీరహంతా (సః) వీరః ఆయతతీక్ష్ణశల్యాన్, సుపత్త్రిణః, కాంచనచిత్రపుంఖాన్, సుసంతతాన్, వజ్రనిపాతవేగాన్ శరాన్ ముమోచ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, పరవీరహంతా = శత్రువీరులను హతమార్చువాడగు, సః వీరః = ఆ వీరుడైన ఇంద్రజిత్తు, ఆయతతీక్ష్ణశల్యాన్ = పొడవైనవై వాడియైన అలుగులు గలవియును, సుపత్త్రిణః = మంచిఱెక్కలు గలవియును, కాంచనచిత్రపుంఖాన్ = బంగరు చిత్రములు గలిగియుండిన పుంఖములు గలవియును, సుసంతతాన్ = మిక్కిలి దృఢమైనవియును, వజ్రనిపాతవేగాన్ = పిడుగుపాటువంటి వేగము గలవియును అగు, శరాన్ = బాణములను, ముమోచ = ప్రయోగించెను.

తాత్పర్యము :– శత్రుసంహారకుడైన మహావీరుడగు ఆ ఇంద్రజిత్తు పొడవైనవై వాడియైన అలుగులుగలవై, మంచిఱెక్కలుగలవై, బంగరుచిత్తరువులుగల పుంఖములుగలవై, ధృఢమైనవై, పిడుగుపాటు వంటి గొప్పవేగముగలవై యున్న బాణములను పెక్కింటిని హనుమపై ప్రయోగించెను.

శ్లో॥ తత స్స త త్స్యందననిస్వనం చ
మృదంగభేరీపటహస్వనం చ ।
వికృష్యమాణస్య చ కార్ముకస్య
నిశమ్య ఘోషం పున రుత్పపాత ॥ 29

పదచ్ఛేదము :- తతః - సః - తత్ - స్యందననిస్వనం - చ - మృదంగభేరీ పటహస్వనం - చ - వికృష్యమాణస్య - చ - కార్ముకస్య - నిశమ్య - ఘోషం - పునః - ఉత్పపాత ॥

అన్వయక్రమము :- తతః సః తత్ స్యందననిస్వనం చ, మృదంగభేరీపటహస్వనం చ, వికృష్యమాణస్య కార్ముకస్య ఘోషం చ నిశమ్య పునః ఉత్పపాత.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, సః = ఆ హనుమ, తత్ = ఆ, స్యందన నిస్వనం చ = రథధ్వనిని, మృదంగభేరీపటహస్వనం చ = మద్దెలలయొక్కయు భేరీలయొక్కయు పటహములయొక్కయు ధ్వనిని, వికృష్యమాణస్య = ఎక్కుపెట్టబడు చున్నట్టి, కార్ముకస్య = ధనుస్సుయొక్క, ఘోషం చ = ధ్వనిని, నిశమ్య = విని, పునః = మఱల, ఉత్పపాత = మీది కెగసెను.

తాత్పర్యము :- అప్పుడా హనుమ ఆ ఇంద్రజిత్తుయొక్క రథధ్వనిని, మృదంగభేరీ పటాహాది యుద్ధవాద్యముల ధ్వనిని, వినుచు వెంటనే మఱల ఆకసముమీదికి ఎగిరెను.

శ్లో॥ శరాణా మంతరే ష్వాశు వ్యావర్తత మహాకపిః ।
హరి స్తస్యాభిలక్ష్యస్య మోఘయన్ లక్ష్యసంగ్రహమ్ ॥ 30

పదచ్ఛేదము :- శరాణామ్ - అంతరేషు - ఆశు - వ్యావర్తత - మహాకపిః - హరిః - తస్య - అభిలక్ష్యస్య - మోఘయన్ - లక్ష్యసంగ్రహమ్ ॥

అన్వయక్రమము :- మహాకపిః (సః హరిః) శరాణామ్ అంతరేషు అభిలక్ష్యస్య తస్య లక్ష్యసంగ్రహం మోఘయన్ ఆశు వ్యావర్తత.

ప్రతిపదార్థము :- మహాకపిః = వానరశ్రేష్ఠుడైనట్టి, (సః హరిః = ఆ హనుమ) అభిలక్ష్యస్య = లక్ష్యమును ఛేధించుటలో నిపుణుడైనట్టి, తస్య = ఆ ఇంద్రజిత్తు యొక్క, లక్ష్యసంగ్రహం = లక్ష్యముమీది దృష్టిని, మోఘయన్ = వ్యర్థముచేయుచు, శరణాం = బాణములయొక్క, అంతరేషు = మధ్యభాగములందు, వ్యావర్తత = తిరిగెను.

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడైన ఆ హనుమ, లక్ష్యమును చక్కగా ఛేదించుటలో గొప్పఖ్యాతి నార్జించిన ఆ ఇంద్రజిత్తుయొక్క లక్ష్యభేదనప్రావీణ్యము నంతను వ్యర్థము

చేయుచు ఆతడు ప్రయోగించు బాణములు తనకు తగులకుండ ఆ బాణములమధ్యనే పరిభ్రమించుచుండెను.

శ్లో॥ శరాణా మగ్రత స్తస్య పున స్సమభివర్తత ।
ప్రసార్య హస్తౌ హనుమా నుత్పపా తానిలాత్మజః ॥ 31

పదచ్ఛేదము :- శరాణామ్ - అగ్రతః - తస్య - పునః - సమభివర్తత, ప్రసార్య - హస్తౌ - హనుమాన్ - ఉత్పపాత - అనిలాత్మజః ॥

అన్వయక్రమము :- అనిలాత్మజః హనుమాన్ తస్య శరాణాం అగ్రతః హస్తౌ ప్రసార్య సమభివర్తత, పునః ఉత్పపాత.

ప్రతిపదార్థము :- అనిలాత్మజః = వాయునందనుడైన, హనుమాన్ = హనుమ, పునః = తిరిగి, తస్య = ఆ ఇంద్రజిత్తుయొక్క, శరాణాం = బాణములకు, అగ్రతః = ఎదుట, సమభివర్తత = నిలచెను, హస్తౌ = చేతులను, ప్రసార్య = చాచి, ఉత్పపాత = మీదికి ఎగిరెను.

తాత్పర్యము :- వాయునందనుడైన హనుమ అప్పుడు మఱల ఒకసారి ఆ ఇంద్రజిత్తు ప్రయోగించుచున్న బాణములకు ఎదురుగవచ్చి నిలుచుండెను. మఱల అంతలోనే బాహువులు చాచి మీది కెగిరిపోయెను.

శ్లో॥ తా వుభౌ వేగసంపన్నౌ రణకర్మవిశారదౌ ।
సర్వభూతమనోగ్రాహి చక్రతు ర్యుద్ధ ముత్తమమ్ ॥ 32

పదచ్ఛేదము :- తౌ - ఉభౌ - వేగసంపన్నౌ - రణకర్మవిశారదౌ - సర్వభూత మనోగ్రాహి - చక్రతుః - యుద్ధమ్ - ఉత్తమమ్ ॥

అన్వయక్రమము :- రణకర్మవిశారదౌ, వేగసంపన్నౌ తౌ ఉభౌ, సర్వభూతమనోగ్రాహి, ఉత్తమం యుద్ధం చక్రతుః.

ప్రతిపదార్థము :- రణకర్మవిశారదౌ = యుద్ధముచేయుటయందు ప్రవీణులైనట్టి వారును, వేగసంపన్నౌ = గొప్పవేగముగలవారునగు, తౌ ఉభౌ = వారిరువురును, సర్వభూతమనోగ్రాహి = సర్వప్రాణుల మనస్సులను ఆకర్షించునట్టి, ఉత్తమం = గొప్పదైనట్టి, యుద్ధం = యుద్ధమును, చక్రతుః = చేసిరి.

తాత్పర్యము :- యుద్ధము గావించుటలో గొప్ప ప్రావీణ్యము గలవారును, అమితమైన లాఘవము గలవారునగు ఆ హనుమంతుడును, ఇంద్రజిత్తును అచ్చటగల ఎల్లరి మనస్సులకును ఆశ్చర్యము గొల్పునట్టి, గొప్పదైన యుద్ధమొనరించిరి.

శ్లో॥ హనూమతో వేద న రాక్షసోఽ౦తరమ్
న మారుతి స్తస్య మహాత్మనో ఽ౦తరమ్ ।
పరస్పరం నిర్విషహౌ బభూవతుః
సమేత్య తౌ దేవసమానవిక్రమౌ ॥ 33

పదచ్ఛేదము :- హనూమతః - వేద - న - రాక్షసః - అంతరం, న - మారుతిః - తస్య - మహాత్మనః - అంతరమ్, పరస్పరం - నిర్విషహౌ - బభూవతుః - సమేత్య - తౌ - దేవసమానవిక్రమౌ ॥

అన్వయక్రమము :- రాక్షసః, హనూమతః అంతరం న వేద; మారుతిః తస్య మహాత్మనః అంతరం న(వేద); దేవసమానవిక్రమౌ తౌ సమేత్య పరస్పరం నిర్విషహౌ బభూవతుః.

ప్రతిపదార్థము :- రాక్షసః = ఇంద్రజిత్తు, హనూమతః = హనుమంతునియొక్క, అంతరం = లోతును, న వేద = తెలిసికొనలేకుండెను, మారుతిః = హనుమ, తస్య మహాత్మనః = ఆ మహనీయుడైన ఇంద్రజిత్తుయొక్క, అంతరం = అవకాశమును, న వేద = తెలిసికొన లేకుండెను, దేవసమానవిక్రమౌ = దేవతలతో తుల్యమైన పరాక్రమము గల్గినట్టి, తౌ = వారిరువురును, సమేత్య = కూడి, పరస్పరం = ఒకరికొకరు, నిర్విషహౌ = సహింపరానివారుగా, బభూవతుః = అయిరి.

తాత్పర్యము :- ఇంద్రజిత్తునకు హనుమంతుని శక్తి గూర్చి అంతుచిక్కుటలేదు. అట్లే హనుమంతునకును ఇంద్రజిత్తు యొక్క పరాక్రమము ఇంతటిదని బోధపడకున్నది. దేవతుల్యపరాక్రములైన వారిరువురును కలసి పోరుచు ఒకరికొకరు అజేయులుగా గానవచ్చుచుండిరి.

శ్లో॥ తతస్తు లక్ష్యే స విహన్యమానే
శరే ష్వమోఘేషు చ సంపతత్సు ।
జగామ చింతాం మహతీం మహాత్మా
సమాధిసంయోగసమాహితాత్మా ॥ 34

పదచ్ఛేదము :- తతః - తు - లక్ష్యే - సః - విహన్యమానే - శరేషు - అమోఘేషు - చ - సంపతత్సు, జగామ - చింతాం - మహతీం - మహాత్మా, సమాధిసంయోగ సమాహితాత్మా ॥

అన్వయక్రమము :- తతః అమోఘేషు శరేషు సంపతత్సు చ లక్ష్యే విహన్యమానే (సతి) సమాధిసంయోగసమాహితాత్మా స మహాత్మా మహతీం చింతాం జగామ.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, అమోఘేషు = తిరుగులేనట్టి, శరేషు = బాణములు, సంపతత్సు (సత్సు)చ = మీదబడుచున్నను, లక్ష్యే = లక్ష్యము, విహన్యమానే సతి = తప్పిపోవుచుండగా, సమాధిసంయోగసమాహితాత్మా = సంధించుట ప్రయోగించుట యనువానియం దేకాగ్రచిత్తముగల, సః మహాత్మా = ఆ మహాత్ముడైన, ఇంద్రజిత్తు, మహతీం = గొప్పదైన, చింతాం = చింతను, జగామ = పొందెను.

తాత్పర్యము :- తనకు లక్ష్యమైన శత్రువగు ఆ హనుమ అద్భుతమైన శక్తిగల, తిరుగులేని తన బాణములు ఎన్ని మీద కురిసినప్పటికిని చెక్కుచెదరక యుండుట చూచి బాణసంధానప్రయోగాదులందు అమితమైన కౌశలముగల్గిన ఇంద్రజిత్తు (ఎంతయో) చింతకు లోనయ్యెను.

శ్లో॥ తతో మతిం రాక్షసరాజసూను
శ్చకార తస్మిన్ హరివీరముఖ్యే ।
అవధ్యతాం తస్య కపే స్సమీక్ష్య
కథం నిగచ్ఛే దితి నిగ్రహార్థమ్ ॥ 35

పదచ్ఛేదము :- తతః - మతిం - రాక్షసరాజసూనుః, చకార - తస్మిన్ - హరివీరముఖ్యే, అవధ్యతాం - తస్య - కపేః - సమీక్ష్య - కథం - నిగచ్ఛేత్ - ఇతి - నిగ్రహార్థమ్ ॥

అన్వయక్రమము :- తతః రాక్షసరాజసూనుః తస్య కపేః అవధ్యతాం సమీక్ష్య (అయం) కథం నిగచ్ఛేత్ ఇతి హరివీరముఖ్యే తస్మిన్ నిగ్రహార్థం మతిం చకార.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, రాక్షసరాజసూనుః = రాక్షసప్రభువుయొక్క పుత్రుడైన ఇంద్రజిత్తు, తస్య కపేః = ఆ హనుమయొక్క, అవధ్యతాం = వధించుటకు శక్యముగాకుండుటను, సమీక్ష్య = గ్రహించి, (అయం = ఈతడు) కథం = ఎట్లుగా, నిగచ్ఛేత్ = వశుడగును, ఇతి = అని, హరివీరముఖ్యే = వానరశ్రేష్ఠుడైన, తస్మిన్ = ఆ హనుమ విషయమున, నిగ్రహార్థం = బంధించుటకొఱకు, మతిం చకార = నిశ్చయము చేసెను.

తాత్పర్యము :- రాక్షసరాజతనయుడైన ఇంద్రజిత్తు, ఎంతకును తన శస్త్రములచే హనుమ నిహతుడు కాకుండుటను జూచి ఈ వానరవీరుడు తన కెట్లు వశుడగునా యని చింతించి చివరకు ఆతనిని బంధించుటకై నిశ్చయించుకొనెను.

శ్లో॥ తతః పైతామహం వీర స్సో ఉ_స్త్ర మస్త్రవిదాం వరః ।
సందధే సుమహాతేజా స్తం హరిప్రవరం ప్రతి ॥ 36

పదచ్ఛేదము :- తతః - పైతామహం - వీరః - సః - అస్త్రం - అస్త్రవిదాం - వరః - సందధే - సుమహాతేజాః - తం - హరిప్రవరం - ప్రతి ॥

అన్వయక్రమము :- తతః అస్త్రవిదాం వరః సుమహాతేజాః సః వీరః తం హరిప్రవరం ప్రతి పైతామహమ్ అస్త్రం సందధే.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, అస్త్రవిదాం = అస్త్రవేత్తలలో, వరః = శ్రేష్ఠుడును, సుమహాతేజాః = మహాతేజస్సంపన్నుడును అగు, సః వీరః = ఆ వీరుడైన ఇంద్రజిత్తు, తం హరిప్రవరం ప్రతి = ఆ వానరశ్రేష్ఠునిగూర్చి, పైతామహమ్ = బ్రహ్మదేవునికి సంబంధించిన, అస్త్రం = అస్త్రమును, సందధే = సంధించెను.

తాత్పర్యము :- అస్త్రవిద్యాప్రవీణుడైన తేజశ్శాలియగు ఆ ఇంద్రజిత్తు తన ఎదుట నున్న ఆ వానరశ్రేష్ఠుని గూర్చి వెంటనే బ్రహ్మాస్త్రమును సంధించెను.

శ్లో॥ అవధ్యో ఉ_యమితి జ్ఞాత్వా త మస్త్రేణాస్త్రతత్త్వవిత్ ।
నిజగ్రాహ మహాబాహు ర్మారుతాత్మజ మింద్రజిత్ ॥ 37

పదచ్ఛేదము :- అవధ్యః - అయం - ఇతి - జ్ఞాత్వా - తం - అస్త్రేణ - అస్త్రతత్త్వవిత్, నిజగ్రాహ - మహాబాహుః - మారుతాత్మజమ్ - ఇంద్రజిత్ ॥

అన్వయక్రమము :- అస్త్రతత్త్వవిత్ మహాబాహుః ఇంద్రజిత్, అయం అవధ్యః ఇతి జ్ఞాత్వా తం మారుతాత్మజం తేన అస్త్రేణ నిజగ్రాహ.

ప్రతిపదార్థము :- అస్త్రతత్త్వవిత్ = అస్త్రరహస్యముల నెఱిగిన, మహాబాహుః = బలశాలియైన, ఇంద్రజిత్ = ఇంద్రజిత్తు, అయమ్ = ఈ హనుమ, అవధ్యః = చంపుటకు సాధ్యుడుగాడు, ఇతి = అని, జ్ఞాత్వా = తెలిసికొని, తం మారుతాత్మజం = ఆ వాయుసూనుని, తేన అస్త్రేణ = ఆ బ్రహ్మాస్త్రముతో, నిజగ్రాహ = బంధించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'అవధ్యః అయం ఇతి జ్ఞాత్వా' - ఈ వానరవీరుడు బ్రహ్మాస్త్రముచేత గూడ వధించుటకు సాధ్యమైనవాడు గాడని తెలిసికొని.

తాత్పర్యము :- మహావీరుడైన ఇంద్రజిత్తు ఈ వానరశ్రేష్ఠుడు నాకు వధింప శక్యుడు గాడని గ్రహించి వివిధాస్త్రముల రహస్యములను ఎఱిగినవాడగుటచే ఆ

వాయునందనుని మహాశక్తిగల బ్రహ్మాస్త్రముతో బంధించెను.

శ్లో॥ తేన బద్ధ స్తతో ఽ స్త్రేణ రాక్షసేన స వానరః ।
అభవ న్నిర్విచేష్టశ్చ పపాత చ మహీతలే ॥ 38

పదచ్ఛేదము :– తేన – బద్ధః – తతః – అస్త్రేణ – రాక్షసేన – సః – వానరః – అభవత్ – నిర్విచేష్టః – చ – పపాత – చ – మహీతలే ॥

అన్వయక్రమము :– తతః రాక్షసేన తేన అస్త్రేణ బద్ధః సః వానరః నిర్విచేష్టః అభవత్ చ; మహీతలే పపాత చ.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, రాక్షసేన = ఇంద్రజిత్తుచేత, తేన అస్త్రేణ = ఆ బ్రహ్మాస్త్రముచే, బద్ధః = బంధింపబడినవాడై, సః వానరః = ఆ హనుమ, నిర్విచేష్టః = చేష్టారహితుడు, అభవత్ చ = ఆయెను, మహీతలే = భూతలమున, పపాత చ = పడిపోయెను కూడను.

తాత్పర్యము :– ఇంద్రజిత్తు అట్లు బ్రహ్మాస్త్రముచే హనుమను బంధింపగా ఆతడు చేష్టారహితుడై నేలపై బడిపోయెను.

శ్లో॥ తతో ఽ థ బుద్ధ్వా స త దస్త్రబంధం
ప్రభోః ప్రభావా ద్విగతాత్మవేగః ।
పితామహానుగ్రహ మాత్మనశ్చ
విచింతయామాస హరిప్రవీరః ॥ 39

పదచ్ఛేదము :– తతః – అథ – బుద్ధ్వా – సః – తత్ – అస్త్రబంధం – ప్రభోః – ప్రభావాత్ – విగతాత్మవేగః, పితామహానుగ్రహమ్ – ఆత్మనః – చ, విచింతయామాస – హరిప్రవీరః ॥

అన్వయక్రమము :– తతః హరిప్రవీరః సః తదస్త్రబంధం బుద్ధ్వా ప్రభోః ప్రభావాత్ విగతాత్మవేగః, అథ ఆత్మనః పితామహానుగ్రహం చ విచింతయామాస.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, హరిప్రవీరః = వానరశ్రేష్ఠుడైనట్టి, సః = ఆ హనుమ, తదస్త్రబంధం = బ్రహ్మదేవుని అస్త్రముయొక్క బంధనమును గూర్చి, బుద్ధ్వా = తెలిసికొని, ప్రభోః = ప్రభువుయొక్క, ప్రభావాత్ = మహిమవలన, విగతాత్మవేగః = తొలగిన నిజప్రతాపము గలవాడై, అథ = పిమ్మట, ఆత్మనః = తనకు, పితామహానుగ్రహం చ = బ్రహ్మదేవుని అనుగ్రహమును గూర్చి కూడ, విచింతయామాస = ఆలోచించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా.శిరోమణి :- 'విగతాత్మవేగః' అనుటకు బదులుగా 'విగతాల్పవేగః' అని పాఠాంతరము గలదు.

'ప్రభోః ప్రభావాత్' అనగా ప్రభువైన శ్రీరామునియొక్క ప్రభావమువలన విగతాల్పవేగుడయ్యెను అనగా అతనిలోని అల్పప్రతాపము తొలగి బ్రహ్మాస్త్రమును భరించుటకు తగిన రీతిగా మహాప్రతాపశాలియయ్యెనని భావము.

'ఆత్మనః పితామహానుగ్రహమ్' - ముహూర్త మాత్రముననే నా అస్త్రబంధము నుండి నీకు విమోక్షణము లభింపగలదని పూర్వము బ్రహ్మ తనపై చూపిన అనుగ్రహమని భావము.

తాత్పర్యము :- వెంటనే హనుమ తాను బ్రహ్మాస్త్రముచేత బంధితుడనైతినని గుర్తుంచుకొని ఆతని ప్రభావముచేతనే తాను శక్తిహీనుడైన విషయమును, మఱియు బ్రహ్మదేవుని అనుగ్రహముచేత తనకు కొలది గడియలలో బంధవిముక్తి గలుగుననియు తెలిసికొనెను.

శ్లో॥ తతస్స్వాయంభువైర్మంత్రై ర్బ్రహ్మాస్త్రమభిమంత్రితమ్ ।
హనుమాం శ్చింతయామాస వరదానం పితామహాత్ ॥ 40

పదచ్ఛేదము :- తతః - స్వాయంభువైః - మంత్రైః - బ్రహ్మాస్త్రమ్ - అభిమంత్రితం - హనుమాన్ - చింతయామాస - వరదానం - పితామహాత్ ॥

అన్వయక్రమము :- తతః స్వాయంభువైః మంత్రైః అభిమంత్రితం బ్రహ్మాస్త్రం, పితామహాత్ వరదానం హనుమాన్ చింతయామాస.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, స్వాయంభువైః = బ్రహ్మ దేవతగా గల్గినట్టి, మంత్రైః = మంత్రములచే, అభిమంత్రితం = అభిమంత్రింపబడినట్టి, బ్రహ్మాస్త్రం = బ్రహ్మాస్త్రమును గూర్చియు, పితామహాత్ = బ్రహ్మదేవునినుండి, వరదానం = వరదానమును గూర్చియు, హనుమాన్ = హనుమ, చింతయామాస = ఆలోచించెను.

తాత్పర్యము :- అటుపిమ్మట హనుమ బ్రహ్మదేవతాకములైన మహామంత్రములచే అభిమంత్రింపబడిన ఆ బ్రహ్మాస్త్రముయొక్క ప్రభావమును గూర్చియు, తనకు బ్రహ్మదేవు డనుగ్రహించిన వరదానమును గూర్చియు ఆలోచింపసాగెను.

శ్లో॥ న మే ఉ_స్య బంధస్య చ శక్తి రస్తి
విమోక్షణే లోకగురోః ప్రభావాత్ ।
ఇత్యేవ మత్వా విహితో ఉ_స్త్రబంధః
మ యాత్మయోనే రనువర్తితవ్యః ॥ 41

పదచ్ఛేదము :– న – మే – అస్య – బంధస్య – చ – శక్తిః – అస్తిః – విమోక్షణే – లోకగురోః – ప్రభావాత్, ఇతి – ఏవ – మత్వా – విహితః – అస్త్రబంధః – మయా – ఆత్మయోనేః – అనువర్తితవ్యః ॥

అన్వయక్రమము :– లోకగురోః ప్రభావాత్ అస్య బంధస్య విమోక్షణే మే శక్తిః న చ అస్తి ఇతి ఏవ మత్వా, విహితః అత్మయోనేః అస్త్రబంధః మయా అనువర్తితవ్యః.

ప్రతిపదార్థము :– లోకగురోః = బ్రహ్మదేవునియొక్క, ప్రభావాత్ = మహిమవలన, అస్య బంధస్య = ఈ యస్త్రబంధముయొక్క, విమోక్షణే = విడిపించుకొనుటయందు, మే = నాకు, శక్తిః = సామర్థ్యము, న చ అస్తి = ఏమియు లేదు, ఇతి = అని, మత్వా ఏవ = తలచియే, విహితః = ప్రయోగింపబడినట్టి, అత్మయోనేః = బ్రహ్మయొక్క, అస్త్రబంధః = అస్త్రబంధము, మయా = నాచే, అనువర్తితవ్యః = అనుసరింప బడవలసినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'విమోక్షణే శక్తిః నాస్తి' – బ్రహ్మాస్త్రమునుండి విడిపించుకొనుటకు శక్తి లేదని హనుమ గ్రహించుకొనెను.

గోవిందరాజీయము :– బ్రహ్మాస్త్రము నుండి విడిపించుకొనుటకు హనుమకు శక్తి లేదని ఇంద్రజిత్తు తలచెను. మహేశ్వరతీర్థుల భావము గూడ నిదియే.

తాత్పర్యము :– పరమేష్ఠి యొక్క ప్రభావము వలన ఈ యస్త్రబంధమునకు వశము గాకుండ తప్పించుకొనుటకు నాకెంతమాత్రము శక్తిలేదని గ్రహించి హనుమ, ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రబంధనమునకు కట్టుబడి యుండవలెననియే తలచుకొనెను.

శ్లో॥ స వీర్య మస్త్రస్య కపి ర్విచార్య
పితామహానుగ్రహ మాత్మనశ్చ ।
విమోక్షశక్తిం పరిచింతయిత్వా
పితామహాజ్ఞా మనువర్తతే స్మ ॥ 42

పదచ్ఛేదము :– సః – వీర్యమ్ – అస్త్రస్య – కపిః – విచార్య – పితామహానుగ్రహమ్ – ఆత్మనః – చ – విమోక్షశక్తిం – పరిచింతయిత్వా, పితామహాజ్ఞామ్ – అనువర్తతే – స్మ ॥

అన్వయక్రమము :– సః కపిః అస్త్రస్య వీర్యం విచార్య, ఆత్మనః పితామహానుగ్రహం, విమోక్షశక్తిం చ పరిచింతయిత్వా పితామహాజ్ఞామ్ అనువర్తతే స్మ.

ప్రతిపదార్థము :– సః కపిః = ఆ హనుమ, అస్త్రస్య = బ్రహ్మాస్త్రముయొక్క, వీర్యం = సామర్థ్యమును, విచార్య = ఆలోచించి, ఆత్మనః = తనకు, పితామహానుగ్రహం = బ్రహ్మదేవుని అనుగ్రహమును, విమోక్షశక్తిం = విడిపించుకొనుటయందు శక్తిని, పరిచింతయిత్వా = చక్కగా ఆలోచించి, పితామహాజ్ఞాం = బ్రహ్మదేవుని ఆదేశమును, అనువర్తతే స్మ = అనుసరించుచుండెను.

తాత్పర్యము :– అప్పుడా హనుమ బ్రహ్మాస్త్రమునకు గల మహామహిమను గుర్తించుచు తనపై బ్రహ్మదేవునికి గల అనుగ్రహమును గూర్చియు ఆయన అనుగ్రహముచే తనకు అల్పకాలములో గలుగు విమోక్షణమును గూర్చియు బాగుగా తెలిసికొని తత్కాలోచితముగా బ్రహ్మదేవుని ఆదేశము ననుసరించి ఆ యస్త్రబంధనమునకు కట్టుబడియుండెను.

శ్లో॥ అస్త్రేణాపి హి బద్ధస్య భయం మమ న జాయతే ।
పితామహమహేంద్రాభ్యాం రక్షిత స్యానిలేన చ ॥ 43

పదచ్ఛేదము :– అస్త్రేణ – అపి – హి – బద్ధస్య – భయం – మమ – న – జాయతే – పితామహమహేంద్రాభ్యాం – రక్షితస్య – అనిలేన – చ ॥

అన్వయక్రమము :– పితామహమహేంద్రాభ్యాం అనిలేన చ రక్షితస్య మమ, అస్త్రేణ బద్ధస్య (సతః) అపి భయం న జాయతే హి.

ప్రతిపదార్థము :– పితామహమహేంద్రాభ్యాం = బ్రహ్మచేతను, దేవేంద్రునిచేతను, అనిలేన చ = వాయువుచేతను, రక్షితస్య = రక్షింపబడినట్టి, మమ = నాకు, అస్త్రేణ = బ్రహ్మాస్త్రముచే, బద్ధస్య సతః అపి = బంధింపబడినవాడ నైనప్పటికిని, భయం = భీతి, న జాయతే హి = కలుగుటలేదుగదా!

తాత్పర్యము :– బ్రహ్మదేవుడును, దేవేంద్రుడును, నా తండ్రి వాయుదేవుడును నన్ను కాపాడుచుండుటచే బ్రహ్మాస్త్రము నన్ను బంధించినను నా మనస్సున ఏమియు భయము జనించుట లేదు.

శ్లో॥ గ్రహణే చాపి రక్షోభి ర్మహాన్మే గుణదర్శనః ।
రాక్షసేంద్రేణ సంవాద స్తస్మాద్గృహ్ణంతు మాం పరే ॥ 44

పదచ్ఛేదము :– గ్రహణే – చ – అపి – రక్షోభిః – మహాన్ – మే – గుణదర్శనః – రాక్షసేంద్రేణ – సంవాదః – తస్మాత్ – గృహ్ణంతు – మాం – పరే ॥

అన్వయక్రమము :– రక్షోభిః గ్రహణే అపి మే మహాన్ గుణదర్శనః రాక్షసేంద్రేణ సంవాదః (సిధ్యతి) తస్మాత్ మాం పరే గృహ్ణంతు.

ప్రతిపదార్థము :– రక్షోభిః = రాక్షసులచే, గ్రహణే అపి = పట్టుకొని పోబడుటయందు గూడ, మే = నాకు, మహాన్ = గొప్పదైన, గుణదర్శనః = గుణము జూపునట్టి, రాక్షసేంద్రేణ = రాక్షసాధిపతియైన రావణునితో, సంవాదః = సంభాషణము, సిధ్యతి = కలుగును, తస్మాత్ = అందువలన, మాం = నన్ను, పరే = శత్రువులు, గృహ్ణంతు = పట్టుకొందురుగాక.

తాత్పర్యము :– నన్ను రాక్షసులు పట్టుకొని తీసికొని పోయినప్పటికినికూడ గొప్ప ఉపయోగమే గానవచ్చుచున్నది. ఈ విధముగా నాకు రాక్షసరాజుతో సంభాషించు అవకాశము కల్గును. కావున అదియు నొక మేలే. అందుచే నన్నీ శత్రుభటులు బంధించి స్వేచ్ఛగా గొనిపోవుదురుగాక.

శ్లో॥ స నిశ్చితార్థః పరవీరహంతా
సమీక్ష్యకారీ వినివృత్తచేష్టః ।
పరైః ప్రసహ్యాభిగతై ర్నిగృహ్య
ననాద తైస్తైః పరిభర్త్స్యమానః ॥ 45

పదచ్ఛేదము :– సః – నిశ్చితార్థః – పరవీరహంతా – సమీక్ష్యకారీ – వినివృత్తచేష్టః – పరైః – ప్రసహ్య – అభిగతైః – నిగృహ్య – ననాద – తైః – తైః – పరిభర్త్స్యమానః ॥

అన్వయక్రమము :– పరవీరహంతా, సమీక్ష్యకారీ సః నిశ్చితార్థః, వినివృత్తచేష్టః, అభిగతైః పరైః ప్రసహ్య నిగృహ్య తైః తైః పరిభర్త్స్యమానః ననాద.

ప్రతిపదార్థము :– పరవీరహంతా = శత్రువీరులను పరిమార్చువాడును, సమీక్ష్యకారీ = చక్కగా ఆలోచించి పనిచేయువాడునగు, సః = ఆ హనుమ, నిశ్చితార్థః = నిశ్చయించుకొన్న కృత్యముగలవాడై, వినివృత్తచేష్టః = తొలగిన చేష్టలుగలవాడై, అభిగతైః = చుట్టునుచేరినట్టి, పరైః = శత్రువులైనట్టి, తైః తైః = ఆయా రక్కసులచే, ప్రసహ్య = బలవంతముగా, నిగృహ్య = పట్టుకొని, పరిభర్త్స్యమానః = మిక్కిలిగ పీడింప

బడుచున్నవాడై, ననాద = అఱచెను.

తాత్పర్యము :- కోరినచో శత్రువీరులను క్షణములో తుదముట్టింప గలవాడును, చక్కగా ఆలోచించి పనిచేయగలవాడునగు ఆ హనుమ తన కర్తవ్యమునుగూర్చి చక్కగా నిశ్చయించుకొని ఆ సమయమునందు అన్ని చేష్టలను ఉడిగి శత్రుభటులు తనను బలవంతముగా కట్టివేసి హింసించుచుండగా భయముచేవలెనే పెద్దగా ఆక్రోశించు చుండెను.

శ్లో॥ తత స్తం రాక్షసా దృష్ట్వా నిర్విచేష్ట మరిందమమ్ ।
బబంధు శ్శణవల్కైశ్చ ద్రుమచీరైశ్చ సంహతైః ॥ 46

పదచ్ఛేదము :- తతః - తం - రాక్షసాః - దృష్ట్వా - నిర్విచేష్టమ్ - అరిందమమ్, బబంధుః - శణవల్కైః - చ - ద్రుమచీరైః - చ - సంహతైః ॥

అన్వయక్రమము :- తతః రాక్షసాః అరిందమం తం నిర్విచేష్టం దృష్ట్వా సంహతైః శణవల్కైః చ ద్రుమచీరైః చ బబంధుః.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, రాక్షసాః = రక్కసులు, అరిందమం = శత్రుమర్దనుడైన, తం = ఆ హనుమను, నిర్విచేష్టం = కదలికలేనివానినిగా, దృష్ట్వా = చూచి, (సంహతైః = పేనినట్టి) శణవల్కైః చ = జనపనారలతోడను, ద్రుమచీరైః చ = వల్కలములతోడను, బబంధుః = బంధించిరి.

తాత్పర్యము :- అప్పుడంతవఱకును శత్రుభయంకరుడుగా నుండిన హనుమ ఎట్టి చేష్టలును లేక తమకు లొంగి యుండుటను జూచి ఆ రక్కసులు వెనువెంటనే చక్కగా పేనినట్టి జనపనారత్రాళ్ళతోడను వల్కములతోడను బంధింపసాగిరి.

శ్లో॥ స రోచయామాన పరైశ్చ బంధనం
ప్రసహ్య వీరై రభిగర్హణం చ ।
కౌతూహలాన్మాం యది రాక్షసేంద్రో
ద్రష్టుం వ్యవస్యేదితి నిశ్చితార్థః ॥ 47

పదచ్ఛేదము :- సః - రోచయామాస - పరైః - చ - బంధనం - ప్రసహ్య - వీరైః - అభిగర్హణం - చ, కౌతూహలాత్ - మాం - యది - రాక్షసేంద్రః - ద్రష్టుం - వ్యవస్యేత్ - ఇతి - నిశ్చితార్థః ॥

అన్వయక్రమము :- రాక్షసేంద్రః కౌతూహలాత్ యది మాం ద్రష్టుం వ్యవసేత్ ఇతి నిశ్చితార్థః (సన్) సః పరైః ప్రసహ్య బంధనం చ వీరైః అభిగర్హణం చ రోచయామాస.

ప్రతిపదార్థము :- రాక్షసేంద్రః = రాక్షసరాజైన రావణుడు, కౌతూహలాత్ = కుతూహలమువలన, మాం = నన్ను, ద్రష్టుం = చూచుటకు, వ్యవస్యేత్ యది = యత్నించునేమో, ఇతి = అని, నిశ్చితార్థః = నిశ్చయించబడిన ప్రయోజనముగలవాడై, పరైః = శత్రువులచే, ప్రసహ్య = బలవంతముగ, బంధనం = బంధింపబడుటను, వీరైః = రాక్షసవీరులచే, అభిగర్హణం చ = దూషణమును, రోచయామాస = ఇష్టపడు చుండెను.

తాత్పర్యము :- రాక్షసరాజైన రావణుడు కుతూహలముగలవాడై ఒకవేళ తనను చూడవలెనని నిశ్చయించుకొనవచ్చును గదా యను దృఢమైన అభిప్రాయముతో హనుమ శత్రువీరులును భటులును తనను బంధించుచున్నను దూషించుచున్నను గూడ ఇష్టపడి ఊరకుండెను.

శ్లో॥ స బద్ధ స్తేన వల్కేన విముక్తో ఽ స్త్రేణ వీర్యవాన్ ।
అస్త్రబంధ స్స చాన్యం హి న బంధ మనువర్తతే ॥ 48

పదచ్ఛేదము :- సః - బద్ధః - తేన - వల్కేన - విముక్తః - అస్త్రేణ - వీర్యవాన్ అస్త్రబంధః - సః - చ - అన్యం - హి - న - బంధమ్ - అనువర్తతే ॥

అన్వయక్రమము :- తేన వల్కేన బద్ధః వీర్యవాన్ సః తేన అస్త్రేణ విముక్తః (అభవత్) సః అస్త్రబంధః అన్యం బంధం న అనువర్తతే హి.

ప్రతిపదార్థము :- తేన వల్కేన = ఆ వల్కలముతో, బద్ధః = కట్టబడినట్టి, వీర్యవాన్ = ఆ పరాక్రమశాలి, అస్త్రేణ = బ్రహ్మాస్త్రముచే, విముక్తః = విడువబడినవాడు, (అభవత్ = అయెను) సః అస్త్రబంధః = ఆ బ్రహ్మాస్త్రబంధనము, అన్యం బంధం = వేఱు బంధనమును, న అనువర్తతే హి = అనుసరించదు గదా!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- అస్త్రబంధ మనగా మంత్రముచే బంధనము. మంత్రముచే బద్ధమైనది ఇతర బంధనములను వేనిని సహించదు. అప్పుడు ఆ మంత్రబంధనము తనయొక్క పట్టును విడుచునని భావము.

వాసుదాసస్వామి :- రాక్షసులు బ్రహ్మాస్త్రబంధనబలమునందు విశ్వాసములేనివారై జనపనారత్రాళ్ళతో హనుమను కట్టగనే యా అవమానము సహింపలేక అస్త్రబంధము ఊడిపోయెను. అట్లే ప్రపత్తి చేసినవాడు దానియందు విశ్వాసములేక దానికి సహాయమని వేఱొక సాధనమును గ్రహించెనేని ప్రపత్తి చెడును. ప్రపత్తియందుండు అపాయమిదియే! ఉత్తములు నీచసహవాసమును సహింపలేరుగదా!

తాత్పర్యము :- పరాక్రమశాలియైన హనుమ జనపనార త్రాళ్లచే అట్లు బంధింపబడినంతనే బ్రహ్మాస్త్రబంధనము నుండి విముక్తుడై పోయెను. మంత్రపూరితమైనట్టి దివ్యాస్త్రబంధనము వేఱు లౌకికబంధనమును సహింపక తాను స్వయముగనే తన పట్టును వదలివేయునుగదా!

శ్లో॥ అ థేంద్రజిత్తు ద్రుమచీరబద్ధం
విచార్య వీరః కపిసత్తమం తమ్ ।
విముక్త మస్త్రేణ జగామ చింతాం
నాన్యేన బద్ధో హ్యనువర్తతేఽస్త్రమ్ ॥ 49

పదచ్ఛేదము :- అథ - ఇంద్రజిత్ - తు - ద్రుమచీరబద్ధం, విచార్య - వీరః - కపిసత్తమం - తమ్, విముక్తమ్ - అస్త్రేణ - జగామ - చింతాం, న - అన్యేన - బద్ధః - అనువర్తతే - అస్త్రమ్ ॥

అన్వయక్రమము :- అథ వీరః ఇంద్రజిత్ ద్రుమచీరబద్ధం తం కపిసత్తమమ్ అస్త్రేణ విముక్తం విచార్య, అన్యేన బద్ధః (అయం) అస్త్రం న అనువర్తతే హి (ఇతి) చింతాం జగామ.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, వీరః = వీరుడైన, ఇంద్రజిత్ = ఇంద్రజిత్తు, ద్రుమచీరబద్ధం = వృక్షచర్మముచే కట్టబడిన, తం కపిసత్తమం = వానరశ్రేష్ఠుని, అస్త్రేణ = బ్రహ్మాస్త్రముచే, విముక్తం = విడువబడినవానినిగా, విచార్య = గ్రహించి, అన్యేన = ఇతరమైనదానిచే, బద్ధః = బంధింపబడిన, (అయం = ఈతడు) అస్త్రం = బ్రహ్మాస్త్రమును, న అనువర్తతే = అనుసరింపడు, (ఇతి = అని) చింతాం = విచారమును, జగామ = పొందెను.

తాత్పర్యము :- అప్పుడు వీరుడైన ఇంద్రజిత్తు వల్కలములచే బంధింపబడిన హనుమను జూచి ఈతడు బ్రహ్మాస్త్రము నుండి విముక్తుడై పోయెనని గ్రహించి వేఱుబంధనములచే కట్టుబడిన బ్రహ్మాస్త్రమునకు కట్టుబడియుండవలసిన పనిలేదు గదా యని చింతానిమగ్నుడయ్యెను.

శ్లో॥ అహో! మహ త్కర్మ కృతం నిరర్థకం
న రాక్షసై ర్మంత్రగతి ర్విమృష్టా ।
పునశ్చ నాస్త్రే విహతే ఽస్త్ర మన్య
త్ప్రవర్తతే సంశయితా స్స్మ సర్వే ॥ 50

పదచ్ఛేదము :– అహో – మహత్ – కర్మ – కృతం – నిరర్థకం – న – రాక్షసైః – మంత్రగతిః – విమృష్టా, పునః – చ – న – అస్త్రే – విహతే – అస్త్రమ్ – అన్యత్ – ప్రవర్తతే – సంశయితాః – స్మ – సర్వే ॥

అన్వయక్రమము :– అహో! మహత్ కర్మ నిరర్థకం కృతం, రాక్షసైః మంత్రగతిః న విమృష్టా, అస్త్రే విహతే పునః చ అన్యత్ అస్త్రం న ప్రవర్తతే; సర్వే సంశయితాః స్మ (ఇతి చింతాం జగామ).

ప్రతిపదార్థము :– అహో = ఆహా; మహత్ = గొప్పదైనట్టి, కర్మ = కార్యము, నిరర్థకం = నిష్ఫలము, కృతం = చేయబడినది, రాక్షసైః = రాక్షసులచే, మంత్రగతిః = మంత్రముల విధానము, న విమృష్టా = విమర్శింపబడలేదు, అస్త్రే = బ్రహ్మాస్త్రము, విహతే = చెడగొట్టబడగా, అన్యత్ అస్త్రం = వేఱొక అస్త్రము, న ప్రవర్తతే = పనిచేయదు, సర్వే = అందరమును, నంశయితాః = సందిగ్ధస్థితి నొందినవారము, స్మ = అయితిమి, (ఇతి = అని, చింతాం = విచారమును, జగామ = పొందెను).

తాత్పర్యము :– ఆహా! మహాప్రభావముగల నా బ్రహ్మాస్త్రప్రయోగము నిష్ఫలము చేయబడినదిగదా! ఈ రాక్షసులు మంత్రప్రభావమును గూర్చి సరిగా ఆలోచింపలేక పోయిరి. ప్రయోగించిన బ్రహ్మాస్త్రము కారణాంతరములచే విఫలమైనప్పుడు ఇంకొక మా రా బ్రహ్మాస్త్రమును ప్రయోగించుటకు వీలులేదు. అందుచే గొప్ప జయమును సాధించినప్పటికిని మేము తిరిగి సందిగ్ధస్థితిలో పడిపోయితిమిగదా!

శ్లో॥ అస్త్రేణ హనుమా న్ముక్తో నాత్మాన మవబుధ్యత ।
కృష్యమాణ స్తు రక్షోభి స్తైశ్చ బంధై ర్నిపీడితః ॥ 51

పదచ్ఛేదము :– అస్త్రేణ – హనుమాన్ – ముక్తః – న – ఆత్మానమ్ – అవబుధ్యత – కృష్యమాణః – తు – రక్షోభిః – తైః – చ – బంధైః – నిపీడితః ॥

అన్వయక్రమము :– అస్త్రేణ ముక్తః హనుమాన్ ఆత్మానం న అవబుధ్యత; రక్షోభిః కృష్యమాణః (సన్) తైః బంధైః చ నిపీడితః (అభవత్).

ప్రతిపదార్థము :– అస్త్రేణ = బ్రహ్మాస్త్రముచే, ముక్తః = విడువబడిన, హనుమాన్ = హనుమ, ఆత్మానం = తనను, న అవబుధ్యత = వెల్లడికానీయలేదు, రక్షోభిః = రాక్షసులచే, కృష్యమాణః (సన్) = లాగబడుచున్నవాడై, తైః బంధైః చ = ఆ బంధనములచే కూడ, నిపీడితః = హింసింపబడినవాడు, అభవత్ = ఆయెను.

సూచన :– 'హనుమాన్ముక్తో నాత్మానమవబుధ్యతే' అను తన పాఠముతో తిలక వ్యాఖ్యాత 'అవబుధ్యతే' అని క్రియాపదమునకు 'న అవబోధయతి, న ప్రకాశయతి' అని యర్థము

చెప్పవలెను. అని సమర్థించియున్నాడు. కొందఱు వ్యాఖ్యానకారులు మాత్రము తనకు ఆ ఎఱుక లేకుండగనే హనుమ రాక్షసులచే పీడింపబడెనని యథాతథముగా అర్థము చెప్పిరి.

తాత్పర్యము :– బ్రహ్మాస్త్రముచే విడువబడిన హనుమ ఆ విషయము పరులకు తెలియనీయక దానిచే బద్ధుడైయున్నట్లే వారికి గాన్పించుచుండెను. అందుచే ఆ యా బంధములతో వారాతనిని హింసించుచు ఈడ్చుకొని పోవుచుండినను హనుమ ఆ పీడను సహించుచు యుండెను.

శ్లో॥ హన్యమాన స్తతః క్రూరై రాక్షసైః కాష్ఠముష్టిభిః ।
సమీపం రాక్షసేంద్రస్య ప్రాకృష్యత స వానరః ॥ 52

పదచ్ఛేదము :– హన్యమానః – తతః – క్రూరైః – రాక్షసైః – కాష్ఠముష్టిభిః – సమీపం – రాక్షసేంద్రస్య – ప్రాకృష్యత – సః – వానరః ॥

అన్వయక్రమము :– తతః క్రూరైః రాక్షసైః కాష్ఠముష్టిభిః హన్యమానః సః వానరః రాక్షసేంద్రస్య సమీపం ప్రాకృష్యత.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, సః వానరః = ఆ హనుమ, క్రూరైః = క్రూరులైన, రాక్షసైః = రాక్షసులచే, కాష్ఠముష్టిభిః = కఱ్ఱలతోడను పిడికిళ్ళతోడను, హన్యమానః = కొట్టబడుచున్నవాడై, రాక్షసేంద్రస్య = రాక్షసరాజైన రావణునియొక్క, సమీపం = సన్నిధిని గూర్చి, ప్రాకృష్యత = ఈడ్వబడెను.

తాత్పర్యము :– దుర్మార్గులైన ఆ రాక్షసులు హనుమను కఱ్ఱలతో కొట్టుచు పిడికిళ్ళతో పొడుచుచు రావణుని సమీపమునకు లాగుకొని పోయిరి.

శ్లో॥ అ థేంద్రజిత్తం ప్రసమీక్ష్య ముక్త
మస్త్రేణ బద్ధం ద్రుమచీరసూత్రైః ।
వ్యదర్శయ త్తత్ర మహాబలం తం
హరిప్రవీరం సగణాయ రాజ్ఞే ॥ 53

పదచ్ఛేదము :– అథ – ఇంద్రజిత్ – తం – ప్రసమీక్ష్య – ముక్తమ్ – అస్త్రేణ – బద్ధం – ద్రుమచీరసూత్రైః – వ్యదర్శయత్ – తత్ర – మహాబలం – తం – హరిప్రవీరం – సగణాయ – రాజ్ఞే ॥

అన్వయక్రమము :– అథ ఇంద్రజిత్ తమ్ అస్త్రేణ ముక్తం ప్రసమీక్ష్య ద్రుమచీర సూత్రైః బద్ధం తం మహాబలం హరిప్రవీరం తత్ర సగణాయ రాజ్ఞే వ్యదర్శయత్.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, ఇంద్రజిత్ = ఇంద్రజిత్తు, తం = ఆ హనుమను, అస్త్రేణ = బ్రహ్మాస్త్రముచే, ముక్తం = విడువబడినవానినిగా, ప్రసమీక్ష్య = గ్రహించి, ద్రుమచీరసూత్రైః = వృక్షవల్కలముల త్రాళ్ళతో, బద్ధం తం = బంధింపబడియున్న, మహాబలం = మహాబలశాలియైన, తం హరిప్రవీరం = ఆ వానరవీరాగ్రేసరుని, తత్ర = ఆ కొలువునందు, సగణాయ = పరివారముతో గూడినట్టి, రాజ్ఞే = రాజయిన రావణునకు, వ్యదర్శయత్ = చూపించెను.

తాత్పర్యము :- అప్పుడు ఇంద్రజిత్తు హనుమను బ్రహ్మాస్త్రము విడిచియుండెనని గ్రహించియే నారతాళ్ళచే కట్టబడియున్న ఆ మహాబలాఢ్యుడైన వానరవీరుని తన పరివారముతో కొలువుదీరియున్న రావణునకు చూపించెను.

శ్లో॥ తం మత్తమివ మాతంగం బద్ధం కపివరోత్తమమ్ ।
రాక్షసా రాక్షసేంద్రాయ రావణాయ న్యవేదయన్ ॥ 54

పదచ్ఛేదము :- తం - మత్తమ్ - ఇవ - మాతంగం - బద్ధం - కపివరోత్తమం - రాక్షసాః - రాక్షసేంద్రాయ - రావణాయ - న్యవేదయన్ ॥

అన్వయక్రమము :- రాక్షసాః బద్ధం మత్తం మాతంగమ్ ఇవ (స్థితం) తం కపివరోత్తమం రాక్షసేంద్రాయ రావణాయ న్యవేదయన్.

ప్రతిపదార్థము :- రాక్షసాః = రాక్షసులు, బద్ధం = బంధింపబడియున్న, మత్తం = మదించిన, మాతంగం = ఏనుగువలె, (స్థితం = ఉన్నట్టి) తం కపివరోత్తమం = ఆ వానరోత్తముని, రాక్షసేంద్రాయ = రాక్షసరాజైన, రావణాయ = రావణునకు, న్యవేదయన్ = నివేదించిరి.

తాత్పర్యము :- అప్పుడు ఆ రాక్షసులు బంధించి తెచ్చిన మత్తగజమువలె నున్నట్టి ఆ వానరవీరుని రాక్షసరాజైన రావణునకు చూపిరి.

శ్లో॥ కోఽయం కస్య కుతో వాత్ర కిం కార్యం కో వ్యపాశ్రయః ।
ఇతి రాక్షసవీరాణాం తత్ర సంజజ్ఞిరే కథాః ॥ 55

పదచ్ఛేదము :- కః - అయం - కస్య - కుతః - వా - అత్ర - కిం - కార్యం - కః - వ్యపాశ్రయః - ఇతి - రాక్షసవీరాణాం - తత్ర - సంజజ్ఞిరే - కథాః ॥

అన్వయక్రమము :- అయం కః? కస్య వా (సుతః)? కుతః (ఆగతః) ? అత్ర కిం కార్యమ్? (అస్య) కః వ్యపాశ్రయః? ఇతి తత్ర రాక్షసవీరాణాం కథాః సంజజ్ఞిరే.

ప్రతిపదార్థము :- అయం = ఈతడు, కః = ఎవడు? కస్య వా = ఎవనియొక్క

(సుతః = పుత్రుడు)? కుతః = ఎచ్చటినుండి, (ఆగతః = వచ్చినాడు) ? అత్ర = ఇచ్చట, కిం కార్యమ్ = ఏమిపని? (అస్య = వీనికి) కః = ఎవ్వడు, వ్యపాశ్రయః = ఆశ్రయము, ఇతి = అని, తత్ర = ఆ కొలువునందు, రాక్షసానాం = రాక్షసులలో, కథాః = ప్రసంగములు, సంజజ్ఞిరే = కలిగినవి.

తాత్పర్యము :– ఈత డెవ్వడు; ఎవ్వని పుత్రుడై యుండును? ఎచ్చటనుండి వచ్చినాడు? ఇచ్చట అతనికి గల పనియేమి? ఈత డెవ్వని ఆశ్రయమున నున్నట్టివాడు? అనుచు ఆ రావణుని కొలువునందు ఆ రాక్షసులు పరస్పరము ప్రశ్నించుకొనదొడగిరి.

శ్లో॥ హన్యతాం దహ్యతాం వాపి భక్ష్యతా మితి చాపరే ।
రాక్షసా స్తత్ర సంక్రుద్ధాః పరస్పర మ థాబ్రువన్ ॥ 56

పదచ్ఛేదము :– హన్యతాం – దహ్యతాం – వా – అపి – భక్ష్యతాం – ఇతి – చ – అపరే, రాక్షసాః – తత్ర – సంక్రుద్ధాః – పరస్పరమ్ – అథ – అబ్రువన్ ॥

అన్వయక్రమము :– అథ తత్ర రాక్షసాః సంక్రుద్ధాః (సంతః) (అయం) హన్యతాం, దహ్యతామితి, అపరే భక్ష్యతాం ఇతి చ పరస్పరం అబ్రువన్.

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, తత్ర = ఆ కొలువునందు, రాక్షసాః = రాక్షసులు, సంకృద్ధాః (సంతః) = మిక్కిలి క్రోధము నొందినవారై, అయం = ఈ వానరుడు, హన్యతాం = చంపబడుగాక! దహ్యతాం = కాల్చబడుగాక, ఇతి = అనియు, అపరే = మఱికొంత మంది, భక్ష్యతాం = భక్షింపబడుగాక! ఇతి చ = అనియును, పరస్పరమ్ = తమలో తాము, అబ్రువన్ = పలుకుచుండిరి.

తాత్పర్యము :– ఆ రావణుని కొలువునందు అప్పుడు క్రోధావిష్టులైన రాక్షసులు హనుమను జూచుచు ఈ వానరుని చంపివేయుదని కొందఱును, కాల్చివేయుదని కొందఱును, తినివేయుదమని మఱికొందఱును తమలో తాము అఱవసాగిరి.

శ్లో॥ అతీత్య మార్గం సహసా మహాత్మా
స తత్ర రక్షోధిపపాదమూలే ।
దదర్శ రాజ్ఞః పరిచారవృద్ధాన్
గృహం మహారత్నవిభూషితం చ ॥ 57

పదచ్ఛేదము :– అతీత్య – మార్గం – సహసా – మహాత్మా – సః – తత్ర – రక్షోధిప పాదమూలే, దదర్శ – రాజ్ఞః – పరిచారవృద్ధాన్, గృహం – మహారత్నవిభూషితం – చ ॥

అన్వయక్రమము :- మహాత్మా సః మార్గం సహసా అతీత్య తత్ర రక్షోధిపపాదమూలే పరిచారవృద్ధాన్, మహారత్నవిభూషితం రాజ్ఞః గృహం చ దదర్శ.

ప్రతిపదార్థము :- మహాత్మా = మహనీయుడైన, సః = ఆ హనుమ, సహసా = తొందరగా, మార్గం = బాటను, అతీత్య = కడచి, తత్ర = అచ్చట, రక్షోధిపపాదమూలే = రాక్షసరాజుయొక్క చరణసమీపమున, పరిచారవృద్ధాన్ = పరిచారకులైన వృద్ధులను, మహారత్నవిభూషితం = గొప్పవైన రత్నములతో అలంకరింపబడిన, రాజ్ఞః = రాజైన రావణునియొక్క, గృహం చ = గృహమునుగూడ, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- మహాత్ముడైన హనుమంతుడప్పుడు త్వరలో మార్గము నతిక్రమించి రావణుని కొలువుచేరి అచ్చట అతని చరణసన్నిధిని పరిచర్యలు చేయుచున్న వృద్ధ రాక్షసులను, అనర్ఘరత్నకాంతులతో విరాజిల్లుచున్న ఆతని మందిరమును తిలకించెను.

శ్లో॥ స దదర్శ మహాతేజా రావణః కపిసత్తమమ్ ।
రక్షోభిర్వికృతాకారైః కృష్యమాణ మితస్తతః ॥ 58

పదచ్ఛేదము :- సః - దదర్శ - మహాతేజాః - రావణః - కపిసత్తమమ్ - రక్షోభిః - వికృతాకారైః - కృష్యమాణమ్ - ఇతః - తతః ॥

అన్వయక్రమము :- మహాతేజాః సః రావణః వికృతాకారైః రక్షోభిః ఇతః తతః కృష్యమాణం కపిసత్తమం దదర్శ.

ప్రతిపదార్థము :- మహాతేజాః = మహాతేజశ్శాలియగు, సః రావణః = ఆ రావణుడు, వికృతాకారైః = వికారములైన రూపములు గల్గినట్టి, రక్షోభిః = రక్కసులచే, ఇతః తతః = ఇటునటు, కృష్యమాణం = లాగబడుచున్న, కపిసత్తమం = వానరశ్రేష్ఠుని, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- తేజశ్శాలియగు ఆ రావణుడు వికృతాకారులైన రక్కసులు ఇటునటు లాగుచుండగా తనవైపునకు వచ్చుచున్న ఆ వానరశ్రేష్ఠుని చూచెను.

శ్లో॥ రాక్షసాధిపతిం చాపి దదర్శ కపిసత్తమః ।
తేజోబలసమాయుక్తం తపంతమివ భాస్కరమ్ ॥ 59

పదచ్ఛేదము :- రాక్షసాధిపతిం - చ - అపి - దదర్శ - కపిసత్తమః - తేజోబల సమాయుక్తం - తపంతమ్ - ఇవ - భాస్కరమ్ ॥

అన్వయక్రమము :- కపిసత్తమః చ అపి తపంతం భాస్కరమ్ ఇవ (స్థితం) తేజోబల సమాయుక్తం రాక్షసాధిపతిం దదర్శ.

ప్రతిపదార్థము :- కపిసత్తమః చ అపి = వానరశ్రేష్ఠుడైన హనుమగూడ, తపంతం = జ్వలించుచున్న, భాస్కరమ్ ఇవ = సూర్యునివలె (స్థితం = ఉన్నట్టి), తేజోబలసమాయుక్తం = తేజస్సుతోడను బలముతోడను నిండియున్న, రాక్షసాధిపతిం = రాక్షసరాజైన రావణుని, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- వానరోత్తముడైన హనుమయు తీక్ష్ణమైన కాంతులు వెడలగ్రక్కుచున్న సూర్యునివలె గొప్పతేజస్సుతోను, బలముతోను విరాజిల్లుచున్న రాక్షసచక్రవర్తి యగు రావణుని జూచెను.

శ్లో॥ స రోషసంవర్తితతామ్రదృష్టి
ర్దశానన స్తం కపి మన్వవేక్ష్య ।
అథోపవిష్టా న్కులశీలవృద్ధా
న్సమాదిశ త్తం ప్రతి మంత్రిముఖ్యాన్ ॥ 60

పదచ్ఛేదము :- సః - రోషసంవర్తితతామ్రదృష్టిః - దశాననః - తం - కపిమ్ - అన్వవేక్ష్య, అథ - ఉపవిష్టాన్ - కులశీలవృద్ధాన్ - సమాదిశత్ - తం - ప్రతి - మంత్రిముఖ్యాన్ ॥

అన్వయక్రమము :- అథ రోషసంవర్తితతామ్రదృష్టిః సః దశాననః తం కపిమ్ అన్వవేక్ష్య ఉపవిష్టాన్ కులశీలవృద్ధాన్ మంత్రిముఖ్యాన్ తం ప్రతి (జ్ఞాతుం) సమాదిశత్.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, రోషసంవర్తితతామ్రదృష్టిః = క్రోధముచే త్రిప్పబడుచున్న ఎఱ్ఱనైన చూపులు గలవాడు అగు, సః దశాననః = ఆ దశముఖుడు, తం కపిం = ఆ వానరుని, అన్వవేక్ష్య = చూచి, ఉపవిష్టాన్ = కూర్చునియున్న, కులశీలవృద్ధాన్ = కులముచేతను శీలముచేతను పెద్దలైయున్నట్టి, మంత్రిముఖ్యాన్ = ముఖ్యులైన మంత్రులను, తం ప్రతి = ఆ హనుమను గూర్చి, (జ్ఞాతుం = తెలిసికొనుటకు), సమాదిశత్ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- అప్పుడు తీవ్రమైన రోషముచే తన కనుగ్రుడ్లు సంభ్రమించుచుండగా క్రోధారుణమైన నేత్రములతో ఆ దశముఖుడు ఎదుటనున్న హనుమను జూచుచు సమీపమున ఉపవిష్టులైయున్న కులశీలవృద్ధులగు తన ముఖ్యమంత్రులను హనుమను గూర్చి వివరములు తెలిసికొనుడని ఆజ్ఞాపించెను.

శ్లో॥ యథాక్రమం తై స్స కపి ర్విపృష్టః
కార్యార్థ మర్థస్య చ మూల మాదౌ ।

నివేదయామాస హరీశ్వరస్య
దూత స్సకాశా దహమాగతోఽస్మి ॥ **61**

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే ఆదికావ్యే సుందరకాండే
"ఇంద్రజిదభియోగో" నామ అష్టచత్వారింశస్సర్గః.

పదచ్ఛేదము :- యథాక్రమం - తైః - సః - కపిః - విపృష్టః - కార్యార్థమ్ - అర్థస్య - చ - మూలమ్ - ఆదౌ, నివేదయామాస - హరీశ్వరస్య - దూతః - సకాశాత్ - అహమ్ - అగతః - అస్మి ॥

అన్వయక్రమము :- సః కపిః తైః యథాక్రమం ఆదౌ కార్యార్థం అర్థస్య చ మూలం చ విపృష్టః, అహం హరీశ్వరస్య సకాశాత్ ఆగతః దూతః అస్మి (ఇతి) నివేదయామాస.

ప్రతిపదార్థము :- సః కపిః = ఆ హనుమ, తైః = ఆ మంత్రులచే, యథాక్రమం = క్రమముగా, ఆదౌ = మొదట, కార్యార్థం = కర్తవ్యమైన ప్రయోజనమును గూర్చియు, అర్థస్య చ = ప్రయోజనముయొక్క, మూలం చ = కారణమును గూర్చియు, విపృష్టః (సన్) = వివరముగ ప్రశ్నింపబడినవాడై, అహం = నేను, హరీశ్వరస్య = వానరరాజైన సుగ్రీవునియొక్క, సకాశాత్ = సమీపమునుండి, ఆగతః = వచ్చినట్టి, దూతః = దూతను, అస్మి = అగుచున్నాను, ఇతి = అని, నివేదయామాస = నివేదించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- ఇది వ్యాసవాక్యమునకు ముందు సంగ్రహవాక్యమనియైన గ్రహింపవచ్చును లేక సభ్యులకిచ్చిన ప్రత్యుత్తరమనియైన దలపవచ్చును.

తాత్పర్యము :- అప్పుడా మంత్రులు హనుమను జూచి ఇచట నీవు తలపెట్టిన కృత్యమేమి? దానియొక్క ప్రయోజనమేమి? దానిని గూర్చి నిన్ను పంపిన ఆ మూల పురుషు డెవ్వడని వఱుసగా హనుమను వివరములు ప్రశ్నింపగా హనుమ తాను వానరరాజైన సుగ్రీవుని సన్నిధినుండి వచ్చినట్టి దూతనని వారికి తెలిపెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"ఇంద్రజిదభియోగము" అను
నలుబదియెనిమిదవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

ఏకోనపంచాశసర్గ

శ్లో॥ తత స్స కర్మణా తస్య విస్మితో భీమవిక్రమః ।
హనుమాన్ రోషతామ్రాక్షో రక్షోధిప మవైక్షత ॥ 1

పదచ్ఛేదము :– తతః – సః – కర్మణా – తస్య – విస్మితః – భీమవిక్రమః – హనుమాన్ – రోషతామ్రాక్షః – రక్షోధిపమ్ – అవైక్షత ॥

అన్వయక్రమము :– తతః భీమవిక్రమః సః హనుమాన్ తస్య కర్మణా విస్మితః రోషతామ్రాక్షః (సన్) రక్షోధిపమ్ అవైక్షత.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, భీమవిక్రమః = భయంకరమైన పరాక్రమము కల్గినట్టి, సః హనుమాన్ = ఆ హనుమ, తస్య = ఆ రావణునియొక్క, కర్మణా = కృత్యముచేత, విస్మితః = ఆశ్చర్యము నొందినవాడై, రోషతామ్రాక్షః (సన్) = క్రోధముచే ఎఱ్ఱనైన కన్నులు గలవాడునగుచు, రక్షోధిపం = రాక్షసరాజైన రావణుని, అవైక్షత = చూచెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'తస్య కర్మణా' రావణుని కృత్యముచేత అనిగాక ఇంద్రజిత్తు కృత్యముచేత యని చెప్పవలెను. రావణు డింతవఱకును తన యెడ ఎట్టి కృత్యమును చేయలేదు గదా యని కతకవ్యాఖ్యానము.

రా.శిరోమణి :– తస్య కర్మణా – యని రెండు మాఱులు గ్రహించవలెను. మొదట ఇంద్రజిత్తు కృత్యముచే హనుమ ఆశ్చర్యము నొందెను. రెండవది రావణుని సీతాపహరణ కృత్యముచే క్రోధతామ్రాక్షుడయ్యెను. అని ఇట్లు రెండుమాఱులు గ్రహించి అర్థము చెప్పవలెను.

గోవిందరాజీయము; మహేశ్వరతీర్థులు :– నాతో యుద్ధము చేయుటకై రావణుడు నాయొద్దకు రావలెనని నేను ప్రయత్నించితిని గాని రాజనీతివేత్తయైన రావణుడు, తన సింహాసనమునుండి కదలకుండగనే, ఇంద్రజిత్తుచే నన్ను బంధింపజేసి, తన

యొద్దకే నన్ను రప్పించుకొన్నాడని ఆతని కృత్యముచే, విస్మితుడయ్యెనని భావము.

తాత్పర్యము :– అటు పిమ్మట రావణుని కృత్యమునకు ఆశ్చర్యమునొందిన భీకర పరాక్రముడైన హనుమంతుడు అంతలోనే అతని దుష్టత్వమునకు మఱల క్రోధముచే కన్నులెఱ్ఱబాఱుచుండగా తీవ్రమైన చూపులతో రావణుని జూచెను.

శ్లో॥ భ్రాజమానం మహార్హేణ కాంచనేన విరాజతా ।
ముక్తాజాలవృతే నాథ మకుటేన మహాద్యుతిమ్ ॥ 2

పదచ్ఛేదము :– భ్రాజమానం – మహార్హేణ – కాంచనేన – విరాజతా – ముక్తాజాలవృతేన – అథ – మకుటేన – మహాద్యుతిమ్ ॥

అన్వయక్రమము :– అథ మహార్హేణ కాంచనేన విరాజతా ముక్తాజాలవృతేన మకుటేన భ్రాజమానం మహాద్యుతిం రక్షోధిపమ్ అవైక్షత.

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, మహార్హేణ = మిక్కిలి విలువైన, కాంచనేన = సువర్ణముతో, విరాజతా = ప్రకాశించుచున్నట్టి, ముక్తాజాలవృతేన = ముత్యాల జాలరులతో నిండిన, మకుటేన = కిరీటముతో, భ్రాజమానం = ప్రకాశించుచున్న వాడును, మహాద్యుతిం = గొప్పతేజస్సు కల్గియున్నవాడునగు, (రక్షోధిపం = రావణుని, అవైక్షత = చూచెను).

తాత్పర్యము :– ఆ రావణుడు మిక్కిలి శ్రేష్ఠమైన బంగారముతో నిర్మింపబడి తళతళ మెఱయు ముత్యాల జాలరులతో నిండిన కిరీటమును ధరించి గొప్పదైన తేజస్సుతో వెలుగొందుచుండెను.

శ్లో॥ వజ్రసంయోగసంయుక్తై ర్మహార్హై ర్మణివిగ్రహైః ।
హైమై రాభరణై శ్చిత్రైర్మనసేవ ప్రకల్పితైః ॥ 3

పదచ్ఛేదము :– వజ్రసంయోగ సంయుక్తైః – మహార్హైః – మణివిగ్రహైః – హైమైః – ఆభరణైః – చిత్రైః – మనసా – ఇవ – ప్రకల్పితైః ॥

అన్వయక్రమము :– వజ్రసంయోగసంయుక్తైః మహార్హైః మణివిగ్రహైః మనసా ప్రకల్పితైః ఇవ (స్థితైః) చిత్రైః హైమైః ఆభరణైః (భ్రాజమానం రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :– వజ్రసంయోగసంయుక్తైః = వజ్రముల సంధులతో గూడినవియును, మహార్హైః = మిక్కిలి విలువైనవియును, మణివిగ్రహైః = మణిరూపములు గల్గియున్నవి యును, మనసా = మనస్సుతో, ప్రకల్పితైః ఇవ (స్థితైః) = ఊహించి నిర్మింపబడినట్లు ఉన్నవియును, చిత్రైః = వివిధవర్ణములు గలవియునగు, హైమైః = సువర్ణమయములైన,

ఆభరణైః = భూషణములతో, (భ్రాజమానం = ప్రకాశించుచున్నట్టి, రక్షోధిపమ్ = రావణుని, అవైక్షత = చూచెను).

తాత్పర్యము :- వజ్రములతో సంధించి నిర్మింపబడినవియును, అమూల్యములైన వియును, మణివిగ్రహములతో కూడినవియును, మనస్సుతో ఊహించినట్లుగనే నిర్మింపబడినవియునగు విచిత్రములైన వివిధవర్ణములుగల సువర్ణాభరణములతో వెలుగొందుచున్న ఆ రావణుని హనుమ చూచెను.

శ్లో॥ మహార్హక్షౌమసంవీతం రక్తచందనరూషితమ్ ।
స్వనులిప్తం విచిత్రాభి ర్వివిధాభిశ్చ భక్తిభిః ॥ 4

పదచ్ఛేదము :- మహార్హక్షౌమసంవీతం - రక్తచందనరూషితమ్ - స్వనులిప్తం - విచిత్రాభిః - వివిధాభిః - చ - భక్తిభిః ॥

అన్వయక్రమము :- మహార్హక్షౌమసంవీతం, రక్తచందనరూషితం, వివిధాభిః విచిత్రాభిః భక్తిభిః స్వనులిప్తం (రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :- మహార్హక్షౌమసంవీతం = అమూల్యములైన పట్టువస్త్రములను ధరించియున్న వాడును, రక్తచందనరూషితం = ఎఱ్ఱని గంధమును పూసుకొనియున్న వాడును, వివిధాభిః = బహువిధములైన, విచిత్రాభిః = విచిత్రములైన, భక్తిభిః = రేఖలతో, స్వనులిప్తం = చక్కగా పూయబడియున్న వాడునగు, (రక్షోధిపం = రావణుని, అవైక్షత = చూచెను).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- భక్తిభిః = శైవులు ధరించు విభూత్యాది త్రిపుండ్రరేఖలవంటి రచనా విశేషములతో.

తాత్పర్యము :- ఆ రావణుడు అమూల్యములైన పట్టువస్త్రములను ధరించి ఒడలినిండ రక్తచందనమును పూసుకొన్నవాడై కస్తూరి మున్నగు పరిమళద్రవ్యములతో వివిధములగు విచిత్రములైన రేఖలను ఒడలినిండుగా ధరించి ప్రకాశించుచుండెను.

శ్లో॥ వివృతైర్దర్శనీయైశ్చ రక్తాక్షైర్భీమదర్శనైః ।
దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః ప్రలంబదశనచ్ఛదైః ॥ 5

శ్లో॥ శిరోభిర్దశభి ర్వీరం భ్రాజమానం మహౌజసమ్ ।
నానావ్యాళసమాకీర్ణై శ్శిఖరైరివ మందరమ్ ॥ 6

పదచ్ఛేదము :– వివృతైః – దర్శనీయైః – చ – రక్తాక్షైః – భీమదర్శనైః – దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః – ప్రలంబదశనచ్ఛదైః – శిరోభిః – దశభిః – వీరం – భ్రాజమానం – మహౌజసమ్, నానావ్యాళసమాకీర్ణైః – శిఖరైః – ఇవ – మందరమ్ ॥

అన్వయక్రమము :– వివృతైః, దర్శనీయైః, రక్తాక్షైః చ, భీమదర్శనైః, దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః, ప్రలంబదశనచ్ఛదైః దశభిః శిరోభిః, నానావ్యాళసమాకీర్ణైః శిఖరైః మందరమ్ ఇవ భ్రాజమానం మహౌజసం వీరం (రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :– వివృతైః = తెరువబడినవియును, దర్శనీయైః = చూడదగినవియునగు, రక్తాక్షైః = ఎఱ్ఱని కన్నులుగలవియును, భీమదర్శనైః = భీకరమైన ఆకారము గలవియును, దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః = మిక్కిలి ప్రకాశించు వాడియైన కోఱలు గలవియును, ప్రలంబదశనచ్ఛదైః = వ్రేలాడుచున్న పెదవులుగలవియునగు, దశభిః శిరోభిః = పదితలలతో, నానావ్యాళసమాకీర్ణైః = బహువిధసర్పములతో నిండియున్న, శిఖరైః = శిఖరములతో, మందరమ్ ఇవ = మందరపర్వతమువలె, భ్రాజమానం = ప్రకాశించుచున్నట్టి, మహౌజసం = గొప్పప్రతాపము కల్గిన, (వీరం = వీరుడైన, రక్షోధిపమ్ = రావణుని, అవైక్షత = చూచెను).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'దశభిః శిరోభిః' – రావణుడు రణరంగమునందు వలెనే హనుమను కలసికొనినప్పుడు గూడ పదితలలుగల భీకరరూపమునే ధరించెనని గ్రాహ్యము.

వాసుదాసస్వామి :– రావణు డుత్తరరామాయణమున "అహం పౌలస్త్యతనయో దశగ్రీవశ్చ నామతః" యని తన పేరు దశగ్రీవుడనియే చెప్పుకొనెను. దీనివలన పదితలలు సహజములనియు కృత్రిమములు కావనియు తెలియుచున్నది.

ఛందత స్తవ రూపం చ మనసా యద్య దీప్సితమ్ ।
భవిష్యతి న సందేహో మద్వరాత్తవ రాక్షస! ॥

– ఉత్తర రామాయణము

రావణుడు కోరినప్పుడు కోరినరూపమెత్తు వరము బ్రహ్మ ఇచ్చెను. కావున తన ఇచ్ఛానుసారము పదితలలతోను ఒంటితలతోను ఉండగలడు.

తాత్పర్యము :– హనుమ చూచుచున్న ఆ రావణుడు బహువిధసర్పములతో నిండియున్న పెక్కు శిఖరములతో గూడిన మందరపర్వతమువలె, భయంకరములైన పదితలలతో తేజరిల్లుచుండెను. ఆతని శిరస్సులు పదియును గూడ చక్కగా తెరువబడి

చూడదగియున్నవై ఎఱ్ఱని కన్నులతోను, భయంకరములై మిక్కిలి వాడిగనున్న కోఱలతోను, వ్రేలాడుచున్నట్టి పెదవులతోను వెలుగొందుచుండెను.

శ్లో॥ నీలాంజనచయప్రఖ్యం హారే ణోరసి రాజతా ।
పూర్ణచంద్రాభవక్త్రేణ సబలాకమివాంబుదమ్ ॥ 7

పదచ్ఛేదము :– నీలాంజనచయప్రఖ్యం – హారేణ – ఉరసి – రాజతా, పూర్ణచంద్రాభ వక్త్రేణ – సబలాకమ్ – ఇవ – అంబుదమ్ ॥

అన్వయక్రమము :– పూర్ణచంద్రాభవక్త్రేణ ఉరసి రాజతా హారేణ సబలాకమ్ అంబుదమ్ ఇవ నీలాంజనచయప్రఖ్యం (రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :– పూర్ణచంద్రాభవక్త్రేణ = నిండుచంద్రుని బోలిన ముఖముతోడను, ఉరసి = ఱొమ్మునందు, రాజతా = ప్రకాశించుచున్న, హారేణ = ముత్యాలహారము తోడను, సబలాకం = బెగ్గురు పక్షులతో కూడిన, అంబుదమ్ ఇవ స్థితం = మేఘమువలె నున్నట్టి, నీలాంజనచయప్రఖ్యం = నల్లనికాటుకరాశివలె వెలయుచున్న, (రక్షోధిపమ్ = రావణుని, అవైక్షత = చూచెను).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– పూర్ణచంద్రాభవక్త్రేణ – అనునది 'హారేణ' యను పదమునకు విశేషణము.

ముత్యాలహారమునందలి ముఖస్థానీయమైన నాయకరత్నము చంద్రునివలె ప్రకాశించుచున్నదని అర్థము.

తాత్పర్యము :– వక్షమునందు ప్రకాశించుచున్న ముత్యాలహారముతోను, నిండు చంద్రునివలె ప్రకాశించుచున్న ముఖముతోను గూడి నల్లని రంగుతో కాటుకరాశి వలెనున్న ఆ రావణుడు బెగ్గురుపిట్టలబారులతో గూడియున్న నల్లని మేఘమువలె గానవచ్చుచుండెను.

శ్లో॥ బాహుభి ర్బద్ధకేయూరై శ్చందనోత్తమరూషితైః ।
భ్రాజమానాంగదైః పీనైః పంచశీర్షైరివోరగైః ॥ 8

పదచ్ఛేదము :– బాహుభిః – బద్ధకేయూరైః – చందనోత్తమరూషితైః – భ్రాజమానాంగదైః – పీనైః – పంచశీర్షైః – ఇవ – ఉరగైః ॥

అన్వయక్రమము :– చందనోత్తమరూషితైః, బద్ధకేయూరైః భ్రాజమానాంగదైః, పంచశీర్షైః

ఉరగైః ఇవ (స్థితైః) పీనైః బాహుభిః యుక్తం (రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :- చందనోత్తమరూషితైః = శ్రేష్ఠమైన మంచిగంధముచే పూయబడినవియును, బద్ధకేయూరైః = కేయూరములతో కూర్పబడినవియును, భ్రాజమానాంగదైః = ప్రకాశించుచున్న భుజకీర్తులుగల్గినవియును, పంచశీర్షైః = ఐదుతలలు గల్గినట్టి, ఉరగైః ఇవ = సర్పములవలె, (స్థితైః = ఉన్నట్టివియును) పీనైః = బలిష్ఠములైనవియును అగు, బాహుభిః = భుజములతో, యుక్తం = కూడిన, (రక్షోధిపమ్ = రావణుని, అవైక్షత = చూచెను).

తాత్పర్యము :- ఆ రావణాసురుని భుజములు మంచిగంధముతో చక్కగా పూయబడి సుందరమైన పనితనముగల బాహుపురులతో ప్రకాశించుచు మిక్కిలి బలిసియున్నవై ఐదుతలలతో కూడిన మహాసర్పములవలె ఒప్పుచుండెను.

శ్లో॥ మహతి స్ఫాటికే చిత్రే రత్నసంయోగసంస్కృతే ।
ఉత్తమాస్తరణాస్తీర్ణే సూపవిష్టం వరాసనే ॥ 9

పదచ్ఛేదము :- మహతి - స్ఫాటికే - చిత్రే - రత్నసంయోగసంస్కృతే - ఉత్తమాస్తరణా స్తీర్ణే - సూపవిష్టం - వరాసనే ॥

అన్వయక్రమము :- స్ఫాటికే, చిత్రరత్నసంయోగసంస్కృతే ఉత్తమాస్తరణాస్తీర్ణే, మహతి వరాసనే సూపవిష్టం (రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :- స్ఫాటికే = స్ఫటికములతో నిర్మింపబడినదియును, చిత్రే = వివిధ వర్ణములు గల్గియున్నదియును, రత్నసంయోగసంస్కృతే = రత్నములయొక్క సంయోజనముతో అలంకరింపబడినదియును, ఉత్తమాస్తరణాస్తీర్ణే = మంచిదైన కంబళిచే పఱవబడియున్నదియుననగు, మహతి వరాసనే = గొప్పదైన సింహాసనముపై, సూపవిష్టం = చక్కగా కూర్చుండియున్న, (రక్షోధిపమ్ = రావణుని, అవైక్షత = చూచెను).

తాత్పర్యము :- ఆ రావణుడు స్ఫటికమణులతో నిర్మింపబడి రంగురంగుల వివిధ మణుల కూర్పులతో అలంకరింపబడి శ్రేష్ఠమైన కంబళితో గూడియున్న గొప్పదైన సింహాసనముపై మిక్కిలి ఠీవిగ కూర్చుండియుండెను.

శ్లో॥ అలంకృతాభి రత్యర్థం ప్రమదాభి స్సమంతతః ।
వాలవ్యజనహస్తాభి రారాత్సముపసేవితమ్ ॥ 10

పదచ్ఛేదము :- అలంకృతాభిః - అత్యర్థం - ప్రమదాభిః - సమంతతః -

వాలవ్యజనహస్తాభిః – ఆరాత్ – సముపసేవితమ్ ॥

అన్వయక్రమము :– అత్యర్థమ్ అలంకృతాభిః వాలవ్యజనహస్తాభిః ప్రమదాభిః ఆరాత్ సమంతతః సముపసేవితం (రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :– అత్యర్థం = మిక్కిలిగా, అలంకృతాభిః = అలంకరణము చేసికొనబడినట్టి, వాలవ్యజనహస్తాభిః = వింజామరలు చేతియందు కలిగినట్టి, ప్రమదాభిః = యువతులచే, ఆరాత్ = దగ్గరగా, సమంతతః = చుట్టునునుండి, సముపసేవితం = చక్కగా సేవింపబడుచున్నట్టి, (రక్షోధిపమ్ = రావణుని, అవైక్షత = చూచెను).

తాత్పర్యము :– ఆ రావణునికి చుట్టును దగ్గరగ నిలచి చక్కగ నలంకరించుకొనియున్న విలాసినీజనము వింజామరలు చేత ధరించి ఆతనిని ఆసక్తితో సేవించుచుండిరి.

శ్లో॥ దుర్ధరేణ ప్రహస్తేన మహాపార్శ్వేన రక్షసా ।
మంత్రిభి ర్మంత్రతత్త్వజ్ఞైర్నికుంభేన చ మంత్రిణా ॥ 11

శ్లో॥ ఉపోపవిష్టం రక్షోభి శ్చతుర్భి ర్బలదర్పితైః ।
కృత్స్నం పరివృతం లోకం చతుర్భిరివ సాగరైః ॥ 12

పదచ్ఛేదము :– దుర్ధరేణ – ప్రహస్తేన – మహాపార్శ్వేన – రక్షసా – మంత్రిభిః – మంత్రతత్త్వజ్ఞైః – నికుంభేన – చ – రక్షసా – ఉపోపవిష్టం – రక్షోభిః – చతుర్భిః – బలదర్పితైః – కృత్స్నం – పరివృతం – లోకం – చతుర్భిః – ఇవ – సాగరైః ॥

అన్వయక్రమము :– మంత్రతత్త్వజ్ఞైః, బలదర్పితైః, చతుర్భిః రక్షోభిః మంత్రిభిః దుర్ధరేణ, ప్రహస్తేన, రక్షసా మహాపార్శ్వేన, మంత్రిణా నికుంభేన చ, చతుర్భిః సాగరైః పరివృతం కృత్స్నం లోకమ్ ఇవ ఉపోపవిష్టం (రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :– మంత్రతత్త్వజ్ఞైః = ఆలోచనాతత్త్వము తెలిసినట్టివారును, బలదర్పితైః = బలముచే గర్వించియున్నవారునగు, చతుర్భిః = నలుగురైన, రక్షోభిః మంత్రిభిః = రాక్షసమంత్రులయినట్టి, దుర్ధరేణ = దుర్ధరుడనువానిచేతను, ప్రహస్తేన = ప్రహస్తుడను వానిచేతను, రక్షసా = రక్షసుడైన, మహాపార్శ్వేన = మహాపార్శ్వుడు అనువానిచేతను, మంత్రిణా = మంత్రియైన, నికుంభేన = నికుంభుడను వానిచేతను, చతుర్భిః సాగరైః = నాల్గుసముద్రములచేతను, పరివృతం = చుట్టుకొనబడిన, కృత్స్నం లోకమ్ ఇవ = సంపూర్ణమైన లోకమువలె, ఉపోపవిష్టం = దగ్గరగా కూర్చొనియున్నట్టి, (రక్షోధిపమ్ = రాక్షసరాజును, అవైక్షత = చూచెను).

తాత్పర్యము :– దుర్ధరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు అను ఆలోచనా తత్త్వమును తెలిసినవారును, తమ బలపరాక్రమములచే గర్వితులై యున్నవారును అగు రాక్షసమంత్రులు నలుగురును భూమిని చుట్టియుండు నాల్గు సముద్రములవలె రావణుని చుట్టును చేరి ఆతనిని సేవించుచుండిరి.

శ్లో॥ మంత్రిభి ర్మంత్రతత్త్వజ్ఞై రన్యైశ్చ శుభబుద్ధిభిః ।
అన్వాస్యమానం సచివైః సురైరివ సురేశ్వరమ్ ॥ 13

పదచ్ఛేదము :– మంత్రిభిః – మంత్రతత్త్వజ్ఞైః – అన్యైః – చ – శుభబుద్ధిభిః – అన్వాస్యమానం – సచివైః – సురైః – ఇవ – సురేశ్వరమ్ ॥

అన్వయక్రమము :– మంత్రతత్త్వజ్ఞైః శుభబుద్ధిభిః అన్యైః మంత్రిభిః సచివైః చ సురైః సురేశ్వరమ్ ఇవ అన్వాస్యమానం (రక్షోధిపమ్ అవైక్షత).

ప్రతిపదార్థము :– మంత్రతత్త్వజ్ఞైః = ఆలోచనలతత్త్వము తెలిసినట్టియు, శుభబుద్ధిభిః = మంచిబుద్ధిగలిగినట్టియు, అన్యైః = ఇతరులైన, మంత్రిభిః = మంత్రులతోడను, సచివైః = సచివులతోడను, సురైః = దేవతలచే, సురేశ్వరమ్ ఇవ = దేవేంద్రునివలె, అన్వాస్యమానం = సమీపమున కూర్చుండబడియున్న, (రక్షోధిపమ్ = రావణుని, అవైక్షత = చూచెను).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– మంత్రి = బుద్ధిసహాయకుడు; సచివుడు = కార్యసహాయకుడు.

తాత్పర్యము :– దేవతలచే పరివేష్టింపబడిన దేవేంద్రుడువలె రావణుడు మంత్రతత్త్వ కోవిదులును ఉత్తమమైన కార్యదక్షత గలవారును అగు మఱికొంతమంది వేఱువేఱు విధములగు మంత్రిసత్తములచే కూడ పరివేష్టింపబడి యుండెను.

శ్లో॥ అపశ్య ద్రాక్షసపతిం హనుమా నతితేజసమ్ ।
విష్ఠితం మేరుశిఖరే సతోయమివ తోయదమ్ ॥ 14

పదచ్ఛేదము :– అపశ్యత్ – రాక్షసపతిం – హనుమాన్ – అతితేజసమ్ – విష్ఠితం – మేరుశిఖరే – సతోయమ్ – ఇవ – తోయదమ్ ॥

అన్వయక్రమము :– హనుమాన్ మేరుశిఖరే విష్ఠితం సతోయం తోయదమ్ ఇవ (స్థితం) అతితేజసం రాక్షసపతిమ్ అపశ్యత్.

ప్రతిపదార్థము :– హనుమాన్ = హనుమ, మేరుశిఖరే = మేరుపర్వతశిఖరమునందు,

విష్ఠితం = నిలచియున్న, సతోయం = నీటితో కూడిన, తోయదమ్ ఇవ స్థితం = మేఘమువలె నున్నట్టి, అతితేజసం = మహాతేజస్సుతో గూడిన, రాక్షసపతిమ్ = రాక్షసరాజును, అపశ్యత్ = చూచెను.

తాత్పర్యము :– హనుమకు పచ్చని ఉన్నతమైన మహారత్నసింహాసనముపై మహా తేజస్సుతో వెలుగొందుచు నల్లని శరీరముతో నున్న ఆ రావణుడు సువర్ణపర్వతముపై నిలచియున్న నీలమేఘమువలె గానవచ్చెను.

శ్లో॥ స తై స్సంపీడ్యమానోఽపి రక్షోభి ర్భీమవిక్రమైః ।
విస్మయం పరమం గత్వా రక్షోధిప మవైక్షత ॥ 15

పదచ్ఛేదము :– సః – తైః – సంపీడ్యమానః – అపి – రక్షోభిః – భీమవిక్రమైః – విస్మయం – పరమం – గత్వా – రక్షోధిపమ్ – అవైక్షత ॥

అన్వయక్రమము :– భీమవిక్రమైః తైః రక్షోభిః సంపీడ్యమానః అపి సః పరమం విస్మయం గత్వా రక్షోధిపమ్ అవైక్షత.

ప్రతిపదార్థము :– భీమవిక్రమైః = భీకరమైన పరాక్రమము గల్గినట్టి, తైః రక్షోభిః = ఆ రక్కసులచే, సంపీడ్యమానః అపి = మిక్కిలి పీడింపబడుచున్నవాడైనప్పటికిని, సః = ఆ హనుమ, పరమం = గొప్పదయిన, విస్మయం = ఆశ్చర్యమును, గత్వా = పొంది, రక్షోధిపం = రాక్షసరాజును, అవైక్షత = చూచెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– రక్షోధిపమ్ అవైక్షత – హనుమ ఎదుటనున్న రావణునే చూచుచుండెను గాని రాక్షసులు తనకు గల్గించుచున్న పీడను ఏమియు చూడకుండెనని భావము.

తాత్పర్యము :– మహాభయంకర పరాక్రమముకల్గినట్టి రాక్షసులెందరో తనను చుట్టుముట్టి పలువిధముగా బాధించుచున్నను హనుమ దాని నేమియును లెక్కచేయక తన కమితాశ్చర్యము గొల్పుచున్న రావణాసురునే పరికించుచుండెను.

శ్లో॥ భ్రాజమానం తతో దృష్ట్వా హనుమాన్ రాక్షసేశ్వరమ్ ।
మనసా చింతయామాస తేజసా తస్య మోహితః ॥ 16

పదచ్ఛేదము :– భ్రాజమానం – తతః – దృష్ట్వా – హనుమాన్ – రాక్షసేశ్వరమ్ – మనసా – చింతయామాస – తేజసా – తస్య – మోహితః ॥

అన్వయక్రమము :– తతః భ్రాజమానం రాక్షసేశ్వరం దృష్ట్వా హనుమాన్ తస్య తేజసా

మోహితః సన్ మనసా చింతయామాస.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, భ్రాజమానం = విరాజమానుడైయున్న, రాక్షసేశ్వరం = రాక్షసరాజును, దృష్ట్వా = చూచి, హనుమాన్ = హనుమ, తస్య = ఆ రావణునియొక్క, తేజసా = తేజస్సుచే, మోహితః = ముగ్ధుడై, మనసా = మనస్సు చేత, చింతయామాస = ఆలోచింప దొడగెను.

తాత్పర్యము :- ఈ రీతిగా వెల్గొందుచున్న రాక్షసాధిపతిని గాంచి హనుమ అతని తేజోవిశేషమునకు విస్మయము నొంది తన మనస్సునం దిట్లు చింతింపదొడగెను.

శ్లో॥ అహో రూప మహో ధైర్య మహో సత్త్వమహో ద్యుతిః ।
అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా ॥ 17

పదచ్ఛేదము :- అహో - రూపమ్ - అహో - ధైర్యమ్ - అహో - సత్త్వమ్ - అహో - ద్యుతిః - అహో - రాక్షసరాజస్య - సర్వలక్షణయుక్తతా ॥

అన్వయక్రమము :- రాక్షసరాజస్య రూపమ్ అహో! ధైర్యమ్ అహో, సత్త్వమ్ అహో, ద్యుతిః అహో, సర్వలక్షణయుక్తతా అహో.

ప్రతిపదార్థము :- రాక్షసరాజస్య = రాక్షసాధిపతియొక్క, రూపం = రూపము, అహో! = ఎంత యాశ్చర్యకరమైనదో, ధైర్యం = ధైర్యము, అహో! = ఆశ్చర్యము, సత్త్వం = శక్తి, అహో! = ఆశ్చర్యకరము! ద్యుతిః = తేజస్సు, అహో! = ఆశ్చర్యకరము! సర్వలక్షణయుక్తతా = సర్వలక్షణ సంపన్నత, అహో! = ఎంత యాశ్చర్యకరమో!

తాత్పర్యము :- ఆహా! ఈ రాక్షసరాజైన రావణుని రూప మెంత అద్భుతమైనది! ధైర్య మెంత యాశ్చర్యకరమైనది! ఈతనిశక్తి ఈతని తేజస్సు నిరుపమానముగదా! మహాపురుషలక్షణము లన్నియును ఈతనియం దెంత అద్భుతముగా నిండియున్నవో గదా!

శ్లో॥ య ద్యధర్మో న బలవాన్ స్యా దయం రాక్షసేశ్వరః ।
స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా ॥ 18

పదచ్ఛేదము :- యది - అధర్మః - న - బలవాన్ - స్యాత్ - అయం - రాక్షసేశ్వరః - స్యాత్ - అయం - సురలోకస్య - సశక్రస్య - అపి - రక్షితా ॥

అన్వయక్రమము :- అయం అధర్మః బలవాన్ న స్యాత్ యది అయం రాక్షసేశ్వరః సశక్రస్య సురలోకస్య అపి రక్షితా స్యాత్.

ప్రతిపదార్థము :– అయం అధర్మః = ఈ యధర్మము, బలవాన్ = ప్రబలమైనది, న స్యాత్ యది = కాకుండినయెడల, అయం రాక్షసేశ్వరః = ఈ రాక్షసరాజు, సశక్రస్య = దేవేంద్రునితో గూడిన, సురలోకస్య అపి = దేవలోకమునకు గూడ, రక్షితా స్యాత్ = రక్షకుడుగా నుండి యుండునుగదా.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– ఇన్ని విధముల బలసమృద్ధులుగల ఈతనిలో వినాశమూలమైనట్టి అధర్మమే లేకున్నచో దేవేంద్రునితో గూడిన స్వర్గమును విష్ణువువలె రక్షింప గల్గి యుండును. ఈతని ఈ యధర్మదోషమే తన వారందఱికిని గూడ ముప్పుతెచ్చిపెట్టినది గదా!

మహేశ్వరతీర్థులు :– ఈ రావణుడు అధర్మపరుడు గానిచో మహాబలసంపన్నుడై యుండును. స్వర్గాదిలోకములను గూడ రక్షింపగల్గిన వాడై యుండును.

తాత్పర్యము :– ఈ రాక్షసరాజునందు పరదారాపహరణమనెడి ప్రబలమైన యధర్మమే లేకుండినయెడల దేవేంద్రునితో కూడిన స్వర్గలోకము వంటి ఊర్ధ్వలోకములనుగూడ రక్షింపగల్గినవాడై యుండునుగదా!

శ్లో॥ అస్య క్రూరై ర్నృశంసైశ్చ కర్మభి ర్లోకకుత్సితైః ।
సర్వే బిభ్యతి ఖ ల్వస్మాల్లోకా స్సామరదానవాః ॥ 19

పదచ్ఛేదము :– అస్య – క్రూరైః – నృశంసైః – చ – కర్మభిః – లోకకుత్సితైః – సర్వే – బిభ్యతి – ఖలు – అస్మాత్ – లోకాః – సామరదానవాః ॥

అన్వయక్రమము :– క్రూరైః నృశంసైః లోకకుత్సితైః చ అస్య కర్మభిః సామరదానవాః సర్వే లోకాః అస్మాత్ బిభ్యతి ఖలు.

ప్రతిపదార్థము :– క్రూరైః = క్రూరములును, నృశంసైః = ఘాతుకములును, లోకకుత్సితైః చ = లోకులచే నిందింపబడినట్టివియును అగు, అస్య = ఈతనియొక్క, కర్మభిః = కార్యములచే, సామరదానవాః = దేవతలతోడను దానవులతోడను కూడిన, సర్వే లోకాః = సమస్తలోకములును, అస్మాత్ = ఈతనినుండి, బిభ్యతి ఖలు = భయపడుచున్నవిగదా.

తాత్పర్యము :– క్రూరములును, ఘాతుకములును, లోకనింద్యములునైన వీనియొక్క దారుణకృత్యములకు దేవదానవులతో కూడిన సమస్తలోకములును గూడ నిత్యమును భయగ్రస్తములై యున్నవి గదా.

శ్లో॥ అయం హ్యుత్సహతే క్రుద్ధః కర్తు మేకార్ణవం జగత్ ।
ఇతి చింతాం బహువిధా మకరో న్మతిమా న్కపిః ।
దృష్ట్వా రాక్షసరాజస్య ప్రభావ మమితౌజసః ॥ 20

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"రావణప్రభావదర్శనం" నామ
ఏకోనపంచాశస్సర్గః.

పదచ్ఛేదము :- అయం - హి - ఉత్సహతే - క్రుద్ధః - కర్తుమ్ - ఏకార్ణవం - జగత్ - ఇతి - చింతాం - బహువిధామ్ - అకరోత్ - మతిమాన్ - కపిః - దృష్ట్వా - రాక్షసరాజస్య - ప్రభావమ్ - అమితౌజసః ॥

అన్వయక్రమము :- అమితౌజసః రాక్షసరాజస్య ప్రభావం దృష్ట్వా మతిమాన్ కపిః క్రుద్ధః అయం జగత్ ఏకార్ణవం కర్తుమ్ ఉత్సహతే హి, ఇతి బహువిధాం చింతామ్ అకరోత్.

ప్రతిపదార్థము :- అమితౌజసః = అపరిమితమైన ప్రభావము గల్గినట్టి, రాక్షసరాజస్య = రావణునియొక్క, ప్రభావం = ప్రభావమును, దృష్ట్వా = చూచి, మతిమాన్ = బుద్ధిశాలియైన, కపిః = హనుమ, అయం = ఈ రావణుడు, క్రుద్ధః = కోపించినవాడై, జగత్ = లోకమును, ఏకార్ణవం = ఏకసముద్రముగా, కర్తుమ్ = చేయుటకు, ఉత్సహతే హి = ఉత్సహించునుగదా! ఇతి = అని, బహువిధాం = పలువిధములైనట్టి, చింతాం = ఆలోచనమును, అకరోత్ = చేసెను.

తాత్పర్యము :- బుద్ధిశాలియైన హనుమ, అపరిమితశక్తిశాలియైన రాక్షసరాజు ప్రభావమును గాంచి ఆహా! ఈ రావణుడు క్రోధమునొందినచో ఈ లోకమునంతను ఏకసముద్రము చేసివేయగలడు గదా! యనుచు బహువిధములుగా రావణుని ప్రజ్ఞను గూర్చి తలపోయసాగెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"రావణప్రభావదర్శనము" అను
నలుబదితొమ్మిదవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

పంచాశసర్గ

శ్లో॥ త ముద్వీక్ష్య మహాబాహుః పింగాక్షం పురత స్థితమ్ ।
రోషేణ మహతాఽఽవిష్టో రావణో లోకరావణః ॥ 1

పదచ్ఛేదము :– తమ్ – ఉద్వీక్ష్య – మహాబాహుః – పింగాక్షం – పురతః – స్థితం – రోషేణ – మహతా – ఆవిష్టః – రావణః – లోకరావణః ॥

అన్వయక్రమము :– మహాబాహుః లోకరావణః రావణః పురతః స్థితం పింగాక్షం తమ్ ఉద్వీక్ష్య మహతా రోషేణ ఆవిష్టః (అభవత్).

ప్రతిపదార్థము :– మహాబాహుః = గొప్ప భుజములు గలవాడును, లోకరావణః = లోకములను ఆక్రోశింపజేయువాడునగు, రావణః = రావణుడు, పురతః = ఎదుట, స్థితం = ఉన్నట్టి, పింగాక్షం = పచ్చని కన్నులు గల్గియున్నట్టి, తం = ఆ హనుమను, ఉద్వీక్ష్య = చూచి, మహతా = గొప్పదైన, రోషేణ = క్రోధముతో, ఆవిష్టః = నిండినవాడు (అభవత్ = ఆయెను).

తాత్పర్యము :– తన భీకరకృత్యములచే లోకములను ఆక్రోశింపజేయు మహావీరుడైన ఆ రావణు డప్పుడు పచ్చని కన్నులతో తన ఎదుట నిలచియున్న హనుమను గాంచి తీవ్రమైన క్రోధము నొందెను.

శ్లో॥ శంకాహతాత్మా దధ్యౌ స కపీంద్రం తేజసా వృతమ్ ।
కి మేష భగవా న్నందీ భవే త్సాక్షాదిహాఽఽగతః ॥ 2

శ్లో॥ యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా ।
సోఽయం వానరమూర్తి స్స్యా త్కింస్వి ద్బాణోఽపి వాఽసురః॥ 3

పదచ్ఛేదము :– శంకాహతాత్మా – దధ్యౌ – సః – కపీంద్రం – తేజసా – వృతమ్ – కిమ్ – ఏషః – భగవాన్ – నందీ – భవేత్ – సాక్షాత్ – ఇహ – ఆగతః – యేన – శప్తః – అస్మి – కైలాసే – మయా – సంచాలితే – పురా, సః – అయం – వానరమూర్తిః – స్యాత్ – కిం – స్విత్ – బాణః – అపి – వా – అసురః ॥

అన్వయక్రమము :– శంకాహతాత్మా సః తేజసా వృతం కపీంద్రం (ఏవం) దధ్యౌ. పురా మయా కైలాసే సంచాలితే సతి యేన శప్తః అస్మి సః భగవాన్ నందీ ఇహ సాక్షాత్ అయం ఏషః వానరమూర్తిః సన్ ఆగతః భవేత్ కిమ్? అపి వా అసురః బాణః స్యాత్ కిం స్విత్?

ప్రతిపదార్థము :– శంకాహతాత్మా = సంశయముచే పీడింపబడిన మనస్సుగల్గినట్టి, సః = ఆ రావణుడు, తేజసా = తేజస్సుతో, వృతం = నిండిన, కపీంద్రం = ఆ వానర శ్రేష్ఠుడైన హనుమనుగూర్చి, (ఏవం = ఇట్లు), దధ్యౌ = చింతించెను. పురా = పూర్వము, మయా = నాచేత, కైలాసే = కైలాసపర్వతము, సంచాలితే సతి = కంపింపజేయబడగా, యేన = ఎవ్వనిచేతనైతే, శప్తః = శపింపబడినవాడను, అస్మి = అయితినో, సః = ఆ, భగవాన్ = పూజ్యుడైన, నందీ = నంది, సాక్షాత్ = స్వయముగా, ఇహ = ఇటకు, ఏషః = ఈ, అయం వానరమూర్తిః సన్ = ఈ వానర రూపుడుగా, ఆగతః = వచ్చినవాడు, భవేత్ కిమ్ = అగునా యేమి? అపి వా = లేక, అసురః = రాక్షసుడైన, బాణః = బాణాసురుడు, స్యాత్ కిం స్విత్ = అగునా యేమి?

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'నందీ' – వానరముఖము కల్గిన ప్రమథగణాధిపుడు. 'శప్తః' – పూర్వము కైలాసపర్వతమునకు తాను పోయినప్పుడు అచట వానరముఖముతో కనబడిన నందిని జూచి రావణుడు పరిహసింపగా, నావంటి ముఖము కలిగినవారిచే నీకు వినాశము సంభవింపగలదని అతడప్పుడు శపించెను. బాణోఽపి వా అసురః – 'బాణుడు' బలికుమారుడైన రాక్షసుడు. అతడును శివభక్తగణములలోనివాడే యగుటచే ఆ నందిచే పంపబడిన వానరరూపములో నున్న బాణుడా ఈత డని రావణుని సందేహము.

తాత్పర్యము :– మహాతేజస్సుతో ప్రకాశించుచున్న హనుమను గాంచి రావణుడు శంకాకులహృదయుడై, పూర్వము నేను కైలాసమున కేగినప్పుడు తనను చూచి నవ్వితినను కోపముతో వానరముఖుడైన ఆ నంది నావంటి ముఖముగలవారిచే నీకు వినాశము సంభవించునని శపించిన పూర్వవృత్తాంతము ప్రకారము నానిమిత్తమై ఆ నందియే ఇట వానరరూపముతో వచ్చియుండునేమో? లేక అతనిచే పంపబడిన బాణాసురుడై యుండునేమో! అని తనలో అనుకొనెను.

శ్లో॥ స రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మంత్రిసత్తమమ్ ।
కాలయుక్త మువాచేదం వచో విపుల మర్థవత్ ॥ 4

పదచ్ఛేదము :– సః – రాజా – రోషతామ్రాక్షః – ప్రహస్తం – మంత్రిసత్తమమ్ –

కాలయుక్తమ్ - ఉవాచ - ఇదం - వచః - విపులమ్ - అర్థవత్ ॥

అన్వయక్రమము :- సః రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మంత్రిసత్తమం కాలయుక్తం విపులమ్ అర్థవత్ ఇదం వచః ఉవాచ.

ప్రతిపదార్థము :- సః రాజా = ఆ రాక్షసాధిపతి, రోషతామ్రాక్షః = క్రోధముచే ఎఱ్ఱబారిన కన్నులు గలవాడై, ప్రహస్తం = ప్రహస్తుడను, మంత్రిసత్తమం = అమాత్య శ్రేష్ఠునిగూర్చి, కాలయుక్తం = కాలోచితమును, విపులం = విస్తృతమైనదియును, అర్థవత్ = ప్రయోజనకరమైనదియునగు, ఇదం వచః = ఈ మాటను, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- రాక్షసాధిపుడైన ఆ రావణుడప్పుడు క్రోధముచే ఎఱ్ఱబడిన కన్నులతో అచ్చటనున్న ప్రహస్తుడను మంత్రిశ్రేష్ఠుని జూచి తత్కాలోచితముగా విపులముగా సార్థకమైన మాటల నీరీతిగ పలికెను.

శ్లో॥ దురాత్మా పృచ్ఛ్యతా మేష కుతః కిం వాఽస్య కారణమ్ ।
వనభంగే చ కోఽస్యార్థో రాక్షసీనాం చ తర్జనే ॥ 5

పదచ్ఛేదము :- దురాత్మా - పృచ్ఛ్యతామ్ - ఏషః - కుతః - కిం - వా - అస్య - కారణమ్ - వనభంగే - చ - కః - అస్య - అర్థః - రాక్షసీనాం - చ - తర్జనే ॥

అన్వయక్రమము :- ఏషః దురాత్మా పృచ్ఛ్యతామ్. ఏషః కుతః (ఆగతః)? అస్య (ఆగమనస్య) కారణం కిమ్? వనభంగే చ, రాక్షసీనాం తర్జనే చ అస్య అర్థః కః?

ప్రతిపదార్థము :- ఏషః దురాత్మా = ఈ దుర్మార్గుడు, పృచ్ఛ్యతామ్ = అడుగబడుగాక, ఏషః = ఈతడు, కుతః = ఎచ్చటినుండి (ఆగతః = వచ్చినవాడు?) అస్య = వీనియొక్క (ఆగమనస్య = రాకయొక్క) కారణం = హేతువు, కిం వా = ఏమైయున్నది? వనభంగే చ = వనవినాశమునను, రాక్షసీనాం = రాక్షసస్త్రీలయొక్క, తర్జనే చ = పీడించుటయందును, అస్య = వీనికి, అర్థః = ప్రయోజనము, కః = ఏమి?

సూచన :- 'రాక్షసీనాం'కి బదులుగా 'రాక్షసానాం' అని బొంబాయి ప్రతి. ఇచ్చట స్త్రీలింగస్వారస్యముచే పురుషులైన మా రాక్షస వీరులెవ్వరును వీనికి భయపడుటలేదు. స్త్రీలు మాత్రమే భయపడి యుండవచ్చునని రావణుని భావముగా గ్రహింపవలెను.

తాత్పర్యము :- ఈ దురాత్ముని అడిగి తెలిసికొనుము. ఈత డెచ్చటినుండి ఇటకు వచ్చెను? ఈతని రాకకు కారణమేమి? ఈ వనమును ధ్వంసము చేయుటలో ఈతని యుద్దేశమేమి? ఈ రాక్షసస్త్రీలను భయపెట్టుటలో ఈతని యభిప్రాయ మేమి?

శ్లో॥ మత్పురీ మప్రధృష్యాం వాఽఽగమనే కిం ప్రయోజనమ్? ।
ఆయోధనే వా కిం కార్యం పృచ్ఛ్యతా మేష దుర్మతిః ॥ 6

పదచ్ఛేదము :– మత్పురీమ్ – అప్రధృష్యాం – వా – ఆగమనే – కిం – ప్రయోజనమ్ – ఆయోధనే – వా – కిం – కార్యం – పృచ్ఛ్యతామ్ – ఏషః – దుర్మతిః.

అన్వయక్రమము :– అప్రధృష్యాం మత్పురీమ్ ఆగమనే కిం వా ప్రయోజనమ్? ఆయోధనే కిం వా కార్యమ్? ఇతి ఏషః దుర్మతిః పృచ్ఛ్యతామ్.

ప్రతిపదార్థము :– అప్రధృష్యాం = ఎదిరింపశక్యముగాని, మత్పురీం = నా పట్టణమును గూర్చి, ఆగమనే = వచ్చుటయందు, కిం వా ప్రయోజనమ్ = ఏమి ప్రయోజనము, ఆయోధనే = యుద్ధమునందు, కిం వా కార్యమ్ = ఏమి ప్రయోజనము, ఇతి = అని, ఏషః దుర్మతిః = ఈ దుర్మార్గుడు, పృచ్ఛ్యతామ్ = అడుగబడుగాక.

తాత్పర్యము :– పరులు చేరుట కసాధ్యమైనట్టి నా పట్టణమునకు వచ్చుటలో ఈతని అభిప్రాయమేమి? మా రాక్షసులతో యుద్ధము చేయుటలో ఈతని ఉద్దేశ్యమేమి? అని ఇది యంతయును సరిగా చెప్పుమని ఈ దుర్మార్గుని అడుగుము.

శ్లో॥ రావణస్య వచ శ్శ్రుత్వా ప్రహస్తో వాక్య మబ్రవీత్ ।
సమాశ్వసిహి భద్రం తే న భీః కార్యా త్వయా కపే ॥ 7

పదచ్ఛేదము :– రావణస్య – వచః – శ్రుత్వా – ప్రహస్తః – వాక్యమ్ – అబ్రవీత్, సమాశ్వసిహి – భద్రం – తే – న – భీః – కార్యా – త్వయా – కపే ॥

అన్వయక్రమము :– రావణస్య వచః శ్రుత్వా ప్రహస్తః వాక్యమ్ అబ్రవీత్, కపే సమాశ్వసిహి; తే భద్రమ్ (అస్తు). త్వయా భీః న కార్యా ॥

ప్రతిపదార్థము :– రావణస్య = రావణునియొక్క, వచః = మాటను, శ్రుత్వా = విని, ప్రహస్తః = ప్రహస్తుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను, కపే = ఓ వానరుడా! సమాశ్వసిహి = ఊరడిల్లుము, తే = నీకు, భద్రం (అస్తు) = క్షేమ(మగుగాక), త్వయా = నీచేత, భీః = భయము, న కార్యా = చేయబడనక్కరలేదు.

తాత్పర్యము :– రావణుని మాటలను వినగనే మంత్రియైన ప్రహస్తుడు హనుమను ఇట్లు అడిగెను. ఓ వానరుడా! స్తిమితపడుము. నీకు క్షేమము కలుగును. నీవేమియు భయపడనక్కరలేదు.

శ్లో॥ యది తావత్త్వ మింద్రేణ ప్రేషితో రావణాలయమ్ ।
తత్త్వ మాఖ్యాహి మా భూత్తే భయం వానర! మోక్ష్యసే ॥ 8

పదచ్ఛేదము :- యది - తావత్ - త్వమ్ - ఇంద్రేణ - ప్రేషితః - రావణాలయమ్ - తత్త్వమ్ - ఆఖ్యాహి - మా - భూత్ - తే - భయం - వానర - మోక్ష్యసే ॥

అన్వయక్రమము :- వానర! త్వమ్ ఇంద్రేణ రావణాలయం ప్రేషితః యది తావత్ తత్త్వమ్ ఆఖ్యాహి; తే భయం మా భూత్, (బంధాత్) మోక్ష్యసే.

ప్రతిపదార్థము :- వానర! = ఓ వానరుడా! త్వం = నీవు, ఇంద్రేణ = దేవేంద్రునిచే, రావణాలయం = రావణుని నివాసమును గూర్చి, ప్రేషితః యది = పంపబడిన వాడవైనయెడల, తావత్ = ముందుగా, తత్త్వం = యథార్థమును, ఆఖ్యాహి = చెప్పుము, తే = నీకు, భయం = భీతి, మా భూత్ = కలుగకుండుగాక! (బంధాత్ = బంధనమునుండి,) మోక్ష్యసే = విడిపింపబడుదువు.

తాత్పర్యము :- ఓ వానరుడా! నీవు గాని యా దేవేంద్రునిచే మా రావణభవనమునకు పంపబడినట్టివాడవైనయెడల ఆ యథార్థమును ముందుగా స్పష్టముగా చెప్పివేయుము. నీ కేమియును భయ మక్కరలేదు. మేము నీ బంధనమునుండి నిన్ను విడిపించెదము.

శ్లో॥ యది వైశ్రవణస్య త్వం యమస్య వరుణస్య చ ।
చారరూప మిదం కృత్వా ప్రవిష్టో నః పురీ మిమామ్ ॥ 9

పదచ్ఛేదము :- యది - వైశ్రవణస్య - త్వం - యమస్య - వరుణస్య - చ - చారరూపమ్ - ఇదం - కృత్వా - ప్రవిష్టః - నః - పురీమ్ - ఇమామ్ ॥

అన్వయక్రమము :- త్వం వైశ్రవణస్య యమస్య వరుణస్య చ ఇదం చారరూపం కృత్వా నః ఇమాం పురీం ప్రవిష్టః యది (తత్త్వమ్ ఆఖ్యాహి).

ప్రతిపదార్థము :- త్వం = నీవు, వైశ్రవణస్య = కుబేరుని యొక్కయు, యమస్య = యముని యొక్కయు, వరుణస్య చ = వరుణునియొక్కయును, ఇదం చారరూపం = ఈ దూతరూపమును, కృత్వా = వహించి, నః = మాయొక్క, ఇమాం పురీం = ఈ నగరమును, ప్రవిష్టః యది = ప్రవేశించివాడవైనయెడల, తత్త్వమ్ ఆఖ్యాహి = యథార్థమును చెప్పుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'చారరూప మిదం కృత్వా' - సామాన్యముగా రాజకృత్యములకై వచ్చు చారులు ప్రచ్ఛన్నవేషములు ధరించియే వత్తురు గావున నీ వానరరూపము నిజమైనది గాదు అని మా భావము.

తాత్పర్యము :– నీవు కుబేర, యమ, వరుణులలో ఎవరి గూఢచారిగానో ఈ రూపమును ధరించి మా పట్టణమునకు వచ్చినట్లుగా కనబడుచున్నావు. ఆ యథార్థవిషయమును చెప్పుము. అప్పుడే నిన్ను మేము బంధనమునుండి విడిపించుదుము.

శ్లో॥ విష్ణునా ప్రేషితో వాపి దూతో విజయకాంక్షిణా ।
న హి తే వానరం తేజో రూపమాత్రం తు వానరమ్ ॥ 10

పదచ్ఛేదము :– విష్ణునా – ప్రేషితః – వా – అపి – దూతః – విజయకాంక్షిణా – న – హి – తే – వానరం – తేజః – రూపమాత్రం – తు – వానరమ్ ॥

అన్వయక్రమము :– (త్వం) విజయకాంక్షిణా విష్ణునా ప్రేషితః దూతః అపి వా (తత్త్వమ్ ఆఖ్యాహి) తే తేజః వానరం న హి; రూపమాత్రం తు వానరమ్.

ప్రతిపదార్థము :– (త్వం = నీవు) విజయకాంక్షిణా = విజయమును ఆశించుచున్నట్టి, విష్ణునా = విష్ణువుచే, ప్రేషితః = పంపబడిన, దూతః = దూతవు, అపి వా = అయినప్పటికిని (తత్త్వమ్ ఆఖ్యాహి = యథార్థమును చెప్పుము), తే = నీయొక్క, తేజః = ప్రతాపము, వానరం న హి = వానరోచితము గాదు, రూపమాత్రం తు = ఆకారముమాత్రమే, వానరం = వానరసంబంధమైనది.

తాత్పర్యము :– విజయమును ఆశపడుచున్నట్టి విష్ణువు నిన్ను ఇచ్చటికి దూతగా పంపినను, ఆ యథార్థమును మాకు చెప్పివేయుము. నీ ప్రతాపము చూడగా వానరజాతికి తగినదిగ లేదు. నీవు స్వరూపమునకు మాత్రమే వానరజాతికి చెందినవాడవు అని మాకు అనిపించుచున్నది.

శ్లో॥ తత్త్వతః కథయ స్వాద్య తతో వానర మోక్ష్యసే ।
అనృతం వదతశ్చాపి దుర్లభం తవ జీవితమ్ ।
అథవా యన్నిమిత్తస్తే ప్రవేశో రావణాలయే ॥ 11

పదచ్ఛేదము :– తత్త్వతః – కథయస్వ – అద్య – తతః – వానర – మోక్ష్యసే – అనృతం – వదతః – చ – అపి – దుర్లభం – తవ – జీవితమ్ – అథవా – యన్నిమిత్తః – తే – ప్రవేశః – రావణాలయే ॥

అన్వయక్రమము :– వానర! అథవా రావణాలయే తే ప్రవేశః యన్నిమిత్తః అద్య తత్త్వతః కథయస్వ; తతః మోక్ష్యసే; అనృతం వదతః తవ జీవితమ్ అపి దుర్లభం (భవేత్).

ప్రతిపదార్థము :– వానర! = ఓ వానరుడా! అథవా = అట్లుగానిచో, రావణాలయే =

రావణభవనమునందు, తే = నీయొక్క, ప్రవేశః = ప్రవేశము, అద్య = నేడు, యన్నిమిత్తః = ఏయుద్దేశ్యముచేతనో, తత్త్వతః = యథార్థముగ, కథయస్వ = చెప్పుము, తతః = అందువలన, మోక్ష్యసే = విడిపింపబడుదువు. అనృతం = అసత్యమును, వదతః = పలుకుచున్న, తవ = నీకు, జీవితమ్ అపి = ప్రాణముగూడ, దుర్లభం భవేత్ = దుర్లభమగును.

తాత్పర్యము :- ఓ వానరుడా! మొదట నీ వీ రావణభవనమును ప్రవేశించుటలో నీ యుద్దేశ్యమేమో యదార్థముగ చెప్పివేయుము. అట్లు చెప్పినచో నిన్ను విడిపించెదము. అట్లుగాక నీవు అసత్యమును పల్కిన యెడల నీ ప్రాణము నిలుచుట దుర్లభమగును సుమా!

శ్లో॥ ఏవ ముక్తో హరివర స్తథా రక్షోగణేశ్వరమ్ ।
అబ్రవీన్నాస్మి శక్రస్య యమస్య వరుణస్య వా ॥ 12

పదచ్ఛేదము :- ఏవమ్ - ఉక్తః - హరివరః - తదా - రక్షోగణేశ్వరమ్ - అబ్రవీత్ - న - అస్మి - శక్రస్య - యమస్య - వరుణస్య - వా ।

అన్వయక్రమము :- ఏవమ్ ఉక్తః హరివరః - తదా రక్షోగణేశ్వరమ్ అబ్రవీత్ - (అహం) శక్రస్య యమస్య వరుణస్య వా (దూతః) న అస్మి.

ప్రతిపదార్థము :- ఏవమ్ = ఈరీతిగా, ఉక్తః = పలుకబడినట్టి, హరివరః = వానర శ్రేష్ఠుడైన హనుమ, తదా = అప్పుడు, రక్షోగణేశ్వరమ్ = రాక్షసచక్రవర్తిని గూర్చి, అబ్రవీత్ = పలికెను, అహం = నేను, శక్రస్య = దేవేంద్రునియొక్కగాని, యమస్య = యమునియొక్కగాని, వరుణస్య = వరుణునియొక్కగాని (దూతః = దూతను), అస్మి = కాను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- "ఏవం ఉక్తః రక్షోగణేశ్వరమ్ అబ్రవీత్" ఇంతవఱకును తనను అన్ని ప్రశ్నలు వేసినది ప్రహస్తుడేయైనను హనుమ అతనిని లెక్కచేయుట మాని రాక్షసరాజునే చూచుచు అతనికే జవాబు చెప్పుట కారంభించెను అని గ్రహించవలెను.

తాత్పర్యము :- ప్రహస్తుడు తననిట్లు ప్రశ్నింపగా హనుమ రాక్షసరాజును గాంచి అతనితో ఇట్లు పలికెను:- నేను దేవేంద్రునకుగాని, యమునకుగాని, వరుణునకుగాని సంబంధించిన దూతను కాను సుమా!

శ్లో॥ ధనదేన న మే సఖ్యం విష్ణునా నాస్మి చోదితః ।
జాతిరేవ మమ త్వేషా వానరో ఽహ మి హాగతః ॥ 13

పదచ్ఛేదము :– ధనదేన – న – మే – సఖ్యం – విష్ణునా – న – అస్మి – చోదితః – జాతిః – ఏవ – మమ – తు – ఏషా – వానరః – అహం – ఇహ – ఆగతః ॥

అన్వయక్రమము :– ధనదేన మే సఖ్యం న (అస్తి); విష్ణునా చోదితః న (అస్మి); ఏషా తు మమ జాతిః ఏవ, ఇహ ఆగతః అహం వానరః.

ప్రతిపదార్థము :– ధనదేన = కుబేరునితో, మే = నాకు, సఖ్యం = మైత్రి, న అస్తి = లేదు, విష్ణునా = విష్ణువుచే, చోదితః = ప్రేరేపింపబడినవాడను, న (అస్మి) = కాను, ఏషా తు = ఈ వానరరూపము, మమ = నాకు, జాతిః ఏవ = జన్మసిద్ధమైనదే, ఇహ = ఇటకు, ఆగతః = వచ్చినట్టి, అహం = నేను, వానరః = వానరుడను.

తాత్పర్యము :– కుబేరునితో నాకేమియును స్నేహము లేదు. నన్ను విష్ణువేమియు ప్రేరేపించి ఇటకు పంపలేదు. ఈ నా రూపము నాకు సహజమైనదే. ఇచ్చటికి వచ్చిన నేను నిజముగ వానరుడనే.

శ్లో॥ దర్శనే రాక్షసేంద్రస్య దుర్లభే త దిదం మయా ।
వనం రాక్షసరాజస్య దర్శనార్థే వినాశితమ్ ॥ 14

పదచ్ఛేదము :– దర్శనే – రాక్షసేంద్రస్య – దుర్లభే – తత్ – ఇదం – మయా – వనం – రాక్షసరాజస్య – దర్శనార్థే – వినాశితమ్ ॥

అన్వయక్రమము :– రాక్షసేంద్రస్య దర్శనే దుర్లభే (సతి) మయా రాక్షసరాజస్య దర్శనార్థే ఇదం తత్ వనం వినాశితమ్.

ప్రతిపదార్థము :– రాక్షసేంద్రస్య = రాక్షసరాజుయొక్క, దర్శనే = దర్శనము, దుర్లభే (సతి) = దుర్లభము కాగా, మయా = నాచేత, రాక్షసరాజస్య = రాక్షసాధిపతియొక్క, దర్శనార్థే = దర్శనము నిమిత్తము, ఇదం తత్ వనం = ఈ యా వనము, వినాశితమ్ = పాడు చేయబడినది.

తాత్పర్యము :– రాక్షసప్రభువైన నీ దర్శనము వేఱొక రీతిగా నాకు కాజాలదు గనుక నీ దర్శనమును గుఱించియే నీకు మిక్కిలి ప్రియమైనట్టి అశోకవనమును ధ్వంసము చేసితిని.

శ్లో॥ తత స్తే రాక్షసాః ప్రాప్తా బలినో యుద్ధకాంక్షిణః ।
రక్షణార్థం తు దేహస్య ప్రతియుద్ధా మయా రణే ॥ 15

పదచ్ఛేదము :- తతః - తే - రాక్షసాః - ప్రాప్తాః - బలినః - యుద్ధకాంక్షిణః - రక్షణార్థం - తు - దేహస్య - ప్రతియుద్ధాః - మయా - రణే ॥

అన్వయక్రమము :- తతః యుద్ధకాంక్షిణః, బలినః, తే రాక్షసాః ప్రాప్తాః. దేహస్య రక్షణార్థం తు రణే మయా (తే) ప్రతియుద్ధాః.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, బలినః = బలవంతులైన, రాక్షసాః = రాక్షసులు, యుద్ధకాంక్షిణః = యుద్ధమును కోరుచున్నవారై, ప్రాప్తాః = వచ్చిరి. దేహస్య = శరీరముయొక్క, రక్షణార్థం తు = రక్షణముకొఱకు మాత్రమే, మయా = నాచేత, రణే = యుద్ధమునందు, తే = ఆ రక్కసులు, ప్రతియుద్ధాః = ఎదిరింపబడిరి.

సూచన :- "రక్షణార్థం తు దేహస్య" - నా ప్రాణములకు హాని కలిగించుట వీరెవరికిని శక్యము గాదు. నా కాయము మాత్ర మేల గాయము నొందవలెను? అని నా మీదికి వచ్చిన వారిని హతమార్చినానని హనుమ భావము.

తాత్పర్యము :- నేను నీ దర్శనము కోరుచుండగా బలాఢ్యులైన రాక్షసులు నాతో యుద్ధము చేయగోరుచు నా మీదికి వచ్చిరి. అత్తఱి నేను నా శరీరరక్షణముకొఱకు మాత్రమే వారి ఎదుట నిలిచి పోరాడితిని.

శ్లో॥ అస్త్రపాశైర్న శక్యోఽహం బద్ధుం దేవాసురై రపి ।
పితామహాదేవ వరో మమా ప్యేషోఽభ్యుపాగతః ॥ 16

పదచ్ఛేదము :- అస్త్రపాశైః - న - శక్యః - అహం - బద్ధుం - దేవాసురైః - అపి, పితామహాత్ - ఏవ - వరః - మమ - అపి - ఏషః - అభ్యుపాగతః ॥

అన్వయక్రమము :- అహమ్ అస్త్రపాశైః బద్ధుం దేవాసురైః అపి న శక్యః. మమ అపి ఏష వరః పితామహాత్ ఏవ అభ్యుపాగతః.

ప్రతిపదార్థము :- అహం = నేను, అస్త్రపాశైః = అస్త్రములచేతను పాశముల చేతను, బద్ధుం = బంధించుటకు, దేవాసురైః అపి = దేవతలచేతను దానవులచేతను గూడ, న శక్యః = సాధ్యమైనవాడను గాను, పితామహాత్ ఏవ = బ్రహ్మదేవుని నుండియే, ఏషః వరః = ఈ వరము, మమ అపి = నాకుకూడ, అభ్యుపాగతః = ప్రాప్తించినది.

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- "అస్త్రపాశైః" = బ్రహ్మాస్త్రము వఱకునుగల సమస్తాస్త్రములచేతను అనియు, యమపాశమువఱకుగల సమస్తపాశములచేతను అనియు, "దేవాసురైః అపి" -

దేవతలును దానవులును కలసి యుద్ధము చేసినప్పటికిని అనియు, “మమాపి ఏష వరః” – అద్భుతమైన వరములు నీకేగాక నాకును బ్రహ్మవలన లభించినవిసుమా అనియును హనుమ తెలుపుచున్నాడు.

తాత్పర్యము :– ఏ యస్త్రముగాని ఏ పాశముగాని ప్రయోగింపనిమ్ము. దేవతలును దానవులును కలసి వచ్చినను రానిమ్ము, ఎన్నటికిని నన్ను బంధింపజాలరు. బ్రహ్మదేవుని యనుగ్రహముచే నాకు గూడ నిట్టి అద్భుతమైన వరములు ప్రాప్తించియున్నవి సుమా!

శ్లో॥ రాజానం ద్రష్టుకామేన మ యాస్త్ర మనువర్తితమ్ ।
విముక్తో హ్యహ మస్త్రేణ రాక్షసై స్త్వభిపీడితః ॥ 17

పదచ్ఛేదము :– రాజానం – ద్రష్టుకామేన – మయా – అస్త్రమ్ – అనువర్తితమ్, విముక్తః – హి – అహమ్ – అస్త్రేణ – రాక్షసైః – తు – అభిపీడితః ॥

అన్వయక్రమము :– రాజానం ద్రష్టుకామేన మయా అస్త్రమ్ అనువర్తితమ్. రాక్షసైః అభిపీడితః తు అహమ్ అస్త్రేణ విముక్తః.

ప్రతిపదార్థము :– రాజానం = రాక్షసరాజును, ద్రష్టుకామేన = చూడగోరినట్టి, మయా = నాచేత, అస్త్రమ్ = బ్రహ్మాస్త్రము, అనువర్తితమ్ = గౌరవింపబడినది. రాక్షసైః = రక్కసులచే, అభిపీడితః తు = తిరిగి బంధింపబడగనే, అస్త్రేణ = ఆ బ్రహ్మాస్త్రముచే, విముక్తః అస్మి = విడువబడిన వాడనైతిని.

తాత్పర్యము :– రాక్షసప్రభువైన నిన్ను చూచుటకొఱకే నేను బ్రహ్మాస్త్రమునకు వశుడనై యుంటిని కాని ఈ రాక్షసులు తిరిగి నన్ను బంధించుటచే నేనా యస్త్రబంధమునుండి విడిచి వేయబడితిని.

శ్లో॥ కేనచి ద్రాజకార్యేణ సంప్రాప్తోఽస్మి తవాంతికమ్ ।
దూతోఽహ మితి విజ్ఞేయో రాఘవ స్యామితౌజసః ॥ 18

శ్లో॥ శ్రూయతాం చాపి వచనం మమ పథ్య మిదం ప్రభో ॥ 19

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
“ప్రహస్తప్రశ్నో” నామ
పంచాశస్సర్గః.

పదచ్ఛేదము :- కేన - చిత్ - రాజకార్యేణ - సంప్రాప్తః - అస్మి - తవ - అంతికమ్, దూతః - అహమ్ - ఇతి - విజ్ఞేయః - రాఘవస్య - అమితౌజసః - శ్రూయతాం - చ - అపి - వచనం - మమ - పథ్యమ్ - ఇదం - ప్రభో ॥

అన్వయక్రమము :- కేనచిత్ రాజకార్యేణ తవ అంతికం సంప్రాప్తః అస్మి, అహమ్ అమితౌజసః రాఘవస్య దూతః, ఇతి విజ్ఞేయః. ప్రభో! పథ్యం ఇదం మమ వచనం చ అపి శ్రూయతామ్.

ప్రతిపదార్థము :- కేనచిత్ = ఒకానొక, రాజకార్యేణ = రాజకార్యముచే, తవ = నీయొక్క, అంతికం = సమీపమును, సంప్రాప్తః = చేరినవాడను, అస్మి = అగుచున్నాను. అహం = నేను, అమితౌజసః = అపరిమితమైన ప్రతాపము గల్గినట్టి, రాఘవస్య = శ్రీరామునియొక్క, దూతః = దూతను, ఇతి = అని, విజ్ఞేయః = తెలియదగిన వాడను, ప్రభో = రాజా! పథ్యం = హితమైనట్టి, ఇదం = ఈ, మమ = నాయొక్క, వచనం = మాట, శ్రూయతాం = వినబడుగాక!

తాత్పర్యము :- ఇప్పుడు నేను నీ కడకు వచ్చినది ఒకానొక రాజకార్యము గుఱించి సుమా! నేను మహాపరాక్రమసంపన్నుడైన శ్రీరాముని కడనుండి వచ్చిన దూతనని తెలిసికొనుము. రాజా, నీ మేలుగోరి నేను చెప్పుచున్న మాటను శ్రద్ధగా ఆలకింపుము.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"ప్రహస్త ప్రశ్నము" అను
ఏబదియవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

ఏకపంచాశసర్గ

శ్లో॥ తం సమీక్ష్య మహాసత్త్వం సత్త్వవాన్ హరిసత్తమః ।
వాక్య మర్థవ దవ్యగ్రస్త మువాచ దశాననమ్ ॥ 1

పదచ్ఛేదము :– తం – సమీక్ష్య – మహాసత్త్వం – సత్త్వవాన్ – హరిసత్తమః – వాక్యమ్ – అర్థవత్ – అవ్యగ్రః – తమ్ – ఉవాచ – దశాననమ్ ॥

అన్వయక్రమము :– సత్త్వవాన్ హరిసత్తమః, మహాసత్త్వం తం సమీక్ష్య అవ్యగ్రః తం దశాననమ్ అర్థవత్ వాక్యమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :– సత్త్వవాన్ = బలశాలియైన, హరిసత్తమః = వానరశ్రేష్ఠుడగు హనుమ, మహాసత్త్వం = మహాబలాఢ్యుడైన, తం = ఆ రావణుని, సమీక్ష్య = చూచి, అవ్యగ్రః = తొట్రుపాటు లేనివాడై, తం దశాననం = ఆ దశగ్రీవునిగూర్చి, అర్థవత్ = అర్థయుక్తమైనట్టి, వాక్యం = వాక్యమును, ఉవాచ = పలికెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– ''అర్థవత్ వాక్యం'' – ఈ రావణుడు న్యాయానుసారియై సామోపాయమునకు తగియుండువా డగునో కాదో యని తెలిసికొనుటకై సుగ్రీవసందేశ వ్యాజమున సాభిప్రాయములైన వచనములను హనుమ పలుకుచున్నాడని భావము.

తాత్పర్యము :– అమితబలశాలియైన హనుమ మహాబలాఢ్యుడైన రావణుని చూచి ఎట్టి తొట్రుపాటును లేనివాడై తన దౌత్యకృత్యప్రయోజనమునకు అనుకూలములైన వచనములను రావణుని గూర్చి ఇట్లు పలికెను.

శ్లో॥ అహం సుగ్రీవసందేశా దిహ ప్రాప్త స్త వాలయమ్ ।
రాక్షసేంద్ర హరీశ స్త్వాం భ్రాతా కుశల మబ్రవీత్ ॥ 2

పదచ్ఛేదము :– అహం – సుగ్రీవసందేశాత్ – ఇహ – ప్రాప్తః – తవ – ఆలయమ్ – రాక్షసేంద్ర – హరీశః – త్వాం – భ్రాతా – కుశలమ్ – అబ్రవీత్ ॥

అన్వయక్రమము :– రాక్షసేంద్ర! అహం సుగ్రీవసందేశాత్ ఇహ తవ ఆలయం ప్రాప్తః. భ్రాతా హరీశః త్వాం కుశలమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :– రాక్షసేంద్ర! = ఓ రాక్షసరాజా!, అహం = నేను, సుగ్రీవసందేశాత్ = సుగ్రీవుని సందేశమువలన, ఇహ = ఇచ్చట, తవ = నీయొక్క, ఆలయం = నివాసమును, ప్రాప్తః = చేరినవాడను. భ్రాతా = సోదరుడైన సుగ్రీవుడు, త్వాం = నిన్ను, కుశలమ్ అబ్రవీత్ = క్షేమము నడిగెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– సుగ్రీవసందేశాత్ – హనుమ చెప్పబోవు విషయము సుగ్రీవుడా పద్ధతిలో పూర్వము చెప్పకున్నను ఈ సందర్భమున చెప్పబోవునది యంతయును తన యజమానికి అనుకూలమైన దగు ననెడి భావముతో సుగ్రీవ సందేశమును తెలుపుచున్నా ననుచు హనుమ అట్లు చెప్పెను.

తాత్పర్యము :– ఓ రాక్షసేశ్వరా! నేను మా ప్రభువైన సుగ్రీవుని సందేశమును గొని నీ నివాసమునకు వచ్చియున్నాను. నీకు సోదరప్రాయుడైన మా వానరరాజు నిన్ను కుశల మడిగినాడు.

శ్లో॥ భ్రాతు శ్శృణు సమాదేశం సుగ్రీవస్య మహాత్మనః ।
ధర్మార్థోపహితం వాక్య మిహ చాముత్ర చ క్షమమ్ ॥ 3

పదచ్ఛేదము :– భ్రాతుః – శృణు – సమాదేశం – సుగ్రీవస్య – మహాత్మనః – ధర్మార్థోపహితం – వాక్యమ్ – ఇహ – చ – అముత్ర – చ – క్షమమ్ ॥

అన్వయక్రమము :– మహాత్మనః భ్రాతుః సుగ్రీవస్య సమాదేశం ధర్మార్థోపహితం ఇహ చ అముత్ర క్షమం వాక్యం శృణు.

ప్రతిపదార్థము :– మహాత్మనః = మహనీయుడైన, భ్రాతుః = సోదరుడగు, సుగ్రీవస్య = సుగ్రీవునియొక్క, సమాదేశం = సందేశరూపమైన, ధర్మార్థోపహితం = ధర్మముతోడను, అర్థముతోడను కూడినట్టిదియును, ఇహ చ = ఈ లోకమునను, అముత్ర చ = పైలోకమునను, క్షమం = సమర్థమైనట్టిదియు నగు, వాక్యం = వాక్యమును, శృణు = ఆలకింపుము.

తాత్పర్యము :– మహాత్ముడగు నీ సోదరుడైన సుగ్రీవుడు ధర్మయుక్తముగను అర్థయుక్తముగను ఈ లోకమునను పైలోకమునను నీకు శ్రేయస్సును గూర్చు విధముగా తెలిపిన ఈ సందేశ వచనములను శ్రద్ధగా ఆలకింపుము.

సూచన :- (రావణుడును వాలియును భ్రాతృభావము గలవారమై యుందమని సంధి చేసికొనిరి).

శ్లో॥ రాజా దశరథో నామ రథకుంజరవాజిమాన్ ।
పితేవ బంధు ర్లోకస్య సురేశ్వరసమద్యుతిః ॥ 4

పదచ్ఛేదము :- రాజా - దశరథః - నామ - రథకుంజరవాజిమాన్, పితా - ఇవ - బంధుః - లోకస్య - సురేశ్వరసమద్యుతిః ॥

అన్వయక్రమము :- రథకుంజరవాజిమాన్, లోకస్య పితా ఇవ బంధుః, సురేశ్వరసమద్యుతిః దశరథః నామ రాజా (ఆసీత్).

ప్రతిపదార్థము :- రథకుంజరవాజిమాన్ = శ్రేష్ఠములైన రథములును ఏనుగులును గుఱ్ఱములును సమృద్ధిగ కలిగినట్టివాడును, లోకస్య = లోకమునకు, పితా ఇవ = తండ్రివలె, బంధుః = బంధువైన వాడును, సురేశ్వరసమద్యుతిః = దేవేంద్రునితో సమానమైన తేజస్సుగలవాడునగు, దశరథః నామ = దశరథుడను ప్రసిద్ధుడైన, రాజా = రాజు, ఆసీత్ = ఉండెను.

తాత్పర్యము :- అసంఖ్యాకములైన రాజవైభవచిహ్నములగు మేలుజాతి గుఱ్ఱములు ఏనుగులు రథములు కలిగినవాడును, ప్రజల నెల్లరను కన్నతండ్రివలె పరిపాలించిన వాడును, దేవేంద్రతుల్యమైన తేజస్సు గలవాడును అగు దశరథు డను జగద్విఖ్యాతుడైన రాజుండెను.

శ్లో॥ జ్యేష్ఠ స్తస్య మహాబాహుః పుత్రః ప్రియకరః ప్రభుః ।
పితు ర్నిదేశా న్నిష్క్రాంతః ప్రవిష్టో దండకావనమ్ ॥ 5

శ్లో॥ లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చాపి భార్యయా ।
రామో నామ మహాతేజా ధర్మ్యం పంథాన మాశ్రితః ॥ 6

పదచ్ఛేదము :- జ్యేష్ఠః - తస్య - మహాబాహుః - పుత్రః - ప్రియకరః - ప్రభుః - పితుః - నిదేశాత్ - నిష్క్రాంతః - ప్రవిష్టః - దండకావనమ్ - లక్ష్మణేన - సహ - భ్రాత్రా - సీతయా - చ - అపి - భార్యయా - రామః - నామ - మహాతేజాః - ధర్మ్యం - పంథానమ్ - ఆశ్రితః ॥

అన్వయక్రమము :- మహాబాహుః ప్రియకరః ప్రభుః తస్య జ్యేష్ఠః పుత్రః రామో నామ మహాతేజాః పితుః నిదేశాత్ నిష్క్రాంతః భ్రాత్రా లక్ష్మణేన, భార్యయా సీతయా చ అపి సహ ధర్మ్యం పంథానమ్ ఆశ్రితః దండకావనం ప్రవిష్టః.

ప్రతిపదార్థము :– మహాబాహుః = మహావీరుడును, ప్రియకరః = ప్రియమును గూర్చువాడును, ప్రభుః = సామర్థ్యవంతుడునగు, తస్య = ఆ దశరథునియొక్క, జ్యేష్ఠః పుత్రః = పెద్దకుమారుడు, రామో నామ = రాముడను ప్రసిద్ధుడైన, మహాతేజాః = గొప్ప తేజశ్శాలి, పితుః = తండ్రియొక్క, నిదేశాత్ = ఆజ్ఞవలన, నిష్క్రాంతః = ఇల్లు వెడలినవాడై, భ్రాత్రా = సోదరుడైన, లక్ష్మణేన = లక్ష్మణునితోడను, భార్యయా = ధర్మపత్నియైన, సీతయా చ అపి = సీతతోడను గూడ, సహ = కూడి, ధర్మ్యం = ధర్మసమ్మతమైనట్టి, పంథానం = మార్గమును, ఆశ్రితః = ఆశ్రయించినవాడై, దండకావనం = దండకారణ్యమును, ప్రవిష్టః = ప్రవేశించినవాడయ్యెను.

తాత్పర్యము :– మహావీరుడును, లోకమునకు హితమును గూర్చువాడును, సర్వసమర్థుడును అగు ఆ దశరథుని పెద్దకుమారుడు శ్రీరాము డను సువిఖ్యాత మహాపురుషుడు తమ్ముడైన లక్ష్మణునితోడను అర్ధాంగియైన సీతతోడను గూడి తండ్రి ఆజ్ఞను శిరసావహించి అయోధ్యను వీడి దండకారణ్యమును ప్రవేశించెను.

శ్లో॥ తస్య భార్యా వనే నష్టా సీతా పతి మనువ్రతా ।
వైదేహస్య సుతా రాజ్ఞో జనకస్య మహాత్మనః ॥ 7

పదచ్ఛేదము :– తస్య – భార్యా – వనే – నష్టా – సీతా – పతిమ్ – అనువ్రతా – వైదేహస్య – సుతా – రాజ్ఞః – జనకస్య – మహాత్మనః ॥

అన్వయక్రమము :– వైదేహస్య రాజ్ఞః మహాత్మనః జనకస్య సుతా పతిమ్ అనువ్రతా తస్య భార్యా సీతా వనే నష్టా.

ప్రతిపదార్థము :– వైదేహస్య రాజ్ఞః = విదేహాధిపతియైనట్టి, మహాత్మనః = మహాత్ముడైన, జనకస్య = జనకుని యొక్క, సుతా = పుత్రికయును, పతిమ్ అనువ్రతా = భర్త ననుసరించి యుండునదియును అగు, తస్య భార్యా = ఆ శ్రీరామునిభార్యయైన, సీతా = జానకీదేవి, వనే = అరణ్యమునందు, నష్టా = అదృశ్యమైనది.

తాత్పర్యము :– విదేహదేశాధిపతియగు జనకమహారాజు పుత్రిక, రాముని భార్య, మహాపతివ్రత యగు సీతాదేవి దండకారణ్యమునందలి జనస్థానమున భర్తతో వసించుచుండగా దైవవశమున ఆమె అదృశ్యురాలైనది.

శ్లో॥ స మార్గమాణ స్తాం దేవీం రాజపుత్ర స్సహానుజః ।
ఋశ్యమూక మనుప్రాప్త స్సుగ్రీవేణ సమాగతః ॥ 8

పదచ్ఛేదము :– సః – మార్గమాణః – తాం – దేవీం – రాజపుత్రః – సహానుజః –

ఋశ్యమూకమ్ – అనుప్రాప్తః – సుగ్రీవేణ – సమాగతః ॥

అన్వయక్రమము :– సహానుజః సః రాజపుత్రః తాం దేవీం మార్గమాణః ఋశ్యమూకమ్ అనుప్రాప్తః సుగ్రీవేణ సమాగతః.

ప్రతిపదార్థము :– సహానుజః = తమ్మునితో కూడినట్టి, సః రాజపుత్రః = ఆ రాజకుమారుడైన శ్రీరాముడు, తాం దేవీం = ఆ సీతాదేవిని, మార్గమాణః = వెదకుచున్నవాడై, ఋశ్యమూకమ్ = ఋశ్యమూకపర్వతమును, అనుప్రాప్తః = చేరినవాడై, సుగ్రీవేణ = సుగ్రీవునితో, సమాగతః = కలసికొన్నవాడయ్యెను.

విశేషార్థములు – వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– ఈ శ్లోకమునందలి వాక్యవిధానముచేత కూడ హనుమ చెప్పునది సుగ్రీవుని మాటలు గావనియు, ఆతని హృదయము ననుసరించి హనుమయే స్వయముగా అవసరమైన విషయము చెప్పుచున్నాడనియు తెలియుచున్నది.

గోవిందరాజీయము :– లోకమున కొందఱు వక్తలు తమను గుఱించి ప్రథమ పురుషములోనే చెప్పుకొను మర్యాద ఒకటి గలదు. సుగ్రీవు డిచట ఆ పద్ధతినే అవలంబించెనని అనుకొనవచ్చును. లేక సుగ్రీవుని మాటలను మనస్సునం దుంచుకొని హనుమ – రామసుగ్రీవుల సఖ్యము మున్నగు విషయములను స్వయముగనే వివరించుచున్నాడని గ్రహించవలెను.

వాసుదాసస్వామి :– ఉత్తమదూత తన ప్రభువు అభిప్రాయము ననుసరించి దానికి విరోధము గాకుండునట్లు ఏ మాటలైన చెప్పవచ్చును. ఏ పనియైన చేయవచ్చును. అదియును గాక రాజులు తమ్ము గుఱించి చెప్పునపుడు అస్మదర్థకముతో చెప్పక యన్యుడుగా చెప్పు మర్యాద గలదు.

తాత్పర్యము :– అప్పుడు శ్రీరాముడు తన తమ్ముడైన లక్ష్మణుడు వెంటనుండగా సీతాదేవిని వెదకుచు ఋశ్యమూకపర్వతమును చేరుకొని అచట సుగ్రీవునితో మైత్రి చేసికొనెను.

శ్లో॥ తస్య తేన ప్రతిజ్ఞాతం సీతాయాః పరిమార్గణమ్ ।
సుగ్రీవస్యాపి రామేణ హరిరాజ్యం నివేదితమ్ ॥ 9

పదచ్ఛేదము :– తస్య – తేన – ప్రతిజ్ఞాతం – సీతాయాః – పరిమార్గణమ్ – సుగ్రీవస్య – అపి – రామేణ – హరిరాజ్యం – నివేదితమ్ ॥

అన్వయక్రమము :– తేన తస్య (సన్నిధౌ) సీతాయాః పరిమార్గణం ప్రతిజ్ఞాతమ్. రామేణ అపి సుగ్రీవస్య హరిరాజ్యం నివేదితమ్.

ప్రతిపదార్థము :– తేన = ఆ సుగ్రీవునిచే, తస్య = ఆ శ్రీరామునియొక్క (సన్నిధౌ = సన్నిధిని) సీతాయాః = సీతాదేవియొక్క, పరిమార్గణం = అన్వేషణమును గూర్చి, ప్రతిజ్ఞాతం = ప్రతిజ్ఞ చేయబడినది, రామేణ అపి = శ్రీరామునిచే గూడ, సుగ్రీవస్య = సుగ్రీవునకు, హరిరాజ్యం = వానరరాజ్యము, నివేదితం = వాగ్దానము చేయబడినది.

తాత్పర్యము :– అప్పు డచ్చట సుగ్రీవుడు తాను సీతాన్వేషణము గావించెదనని ప్రతిజ్ఞ యొనర్చెను. శ్రీరాముడు గూడ సుగ్రీవునకు వానరరాజ్యమును ఒసగెదనని ప్రతిజ్ఞ చేసెను.

శ్లో॥ తత స్తేన మృధే హత్వా రాజపుత్రేణ వాలినమ్ ।
సుగ్రీవ స్థాపితో రాజ్యే హర్యృక్షాణాం గణేశ్వరః ॥ 10

పదచ్ఛేదము :– తతః – తేన – మృధే – హత్వా – రాజపుత్రేణ – వాలినమ్ – సుగ్రీవః – స్థాపితః – రాజ్యే – హర్యృక్షాణాం – గణేశ్వరః ॥

అన్వయక్రమము :– తతః తేన రాజపుత్రేణ మృధే వాలినం హత్వా హర్యృక్షాణాం రాజ్యే సుగ్రీవః గణేశ్వరః స్థాపితః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తేన రాజపుత్రేణ = ఆ రాజపుత్రుడైన శ్రీరామునిచే, మృధే = యుద్ధమునందు, వాలినం = వాలిని, హత్వా = చంపి, హర్యృక్షాణాం = వానరులయొక్కయు, భల్లూకములయొక్కయు, రాజ్యే = రాజ్యమునందు, సుగ్రీవః = సుగ్రీవుడు, గణేశ్వరః = రాజుగా, స్థాపితః = స్థాపింపబడెను.

తాత్పర్యము :– అటుపిమ్మట శ్రీరాముడు యుద్ధమునందు వాలిని సంహరించి వానర రాజ్యమునకు సుగ్రీవుని ప్రభువును గావించెను.

శ్లో॥ త్వయా విజ్ఞాతపూర్వశ్చ వాలీ వానరపుంగవః ।
స తేన నిహతః సంఖ్యే శరేణైకేన వానరః ॥ 11

పదచ్ఛేదము :– త్వయా – విజ్ఞాతపూర్వః – చ – వాలీ – వానరపుంగవః – సః – తేన – నిహతః – సంఖ్యే – శరేణ – ఏకేన వానరః ॥

అన్వయక్రమము :– వానరపుంగవః వాలీ త్వయా విజ్ఞాతపూర్వః; సః వానరః సంఖ్యే తేన ఏకేన శరేణ నిహతః.

ప్రతిపదార్థము :- వానరపుంగవః = వానరశ్రేష్ఠుడైనట్టి, వాలీ = వాలి, త్వయా = నీచేత, విజ్ఞాతపూర్వః చ = బాగుగా తెలియబడియున్నవాడే కూడను, సః వానరః = ఆ వానరుడైన వాలి, సంఖ్యే = యుద్ధమునందు, తేన (రామేణ) = ఆ శ్రీరామునిచే, ఏకేన శరేణ = ఒక్కబాణముచే, నిహతః = సంహరింపబడినాడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'వాలీ త్వయా విజ్ఞాతపూర్వః - చ - అనుటలో వాలి పరాక్రమమును అతనిచే రావణునకు జరిగినట్టి పరాభవమును అట్టి వానిని చంపిన శ్రీరాముని ఉత్కర్షయు హనుమ ఇచట వ్యంగ్యముగ తెలుపుచున్నాడని గ్రహింపవలెను.

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడైన వాలిని నీవు పూర్వమునుండియు బాగుగ నెఱుగుదువుగదా! అట్టి మహావీరుడైన వాలిని యుద్ధమున శ్రీరాముడు ఒక్క బాణముచేతనే నేలగూల్చినాడు సుమా!

శ్లో॥ స సీతామార్గణే వ్యగ్ర స్సుగ్రీవ స్సత్యసంగరః ।
హరీన్ సంప్రేషయామాస దిశ స్సర్వా హరీశ్వరః ॥ 12

పదచ్ఛేదము :- సః - సీతామార్గణే - వ్యగ్రః - సుగ్రీవః - సత్యసంగరః - హరీన్ - సంప్రేషయామాస - దిశః - సర్వాః - హరీశ్వరః ॥

అన్వయక్రమము :- సత్యసంగరః సః హరీశ్వరః సుగ్రీవః సీతామార్గణే వ్యగ్రః సర్వాః దిశః హరీన్ సంప్రేషయామాస.

ప్రతిపదార్థము :- సత్యసంగరః = సత్య ప్రతిజ్ఞ కలిగినట్టి, హరీశ్వరః = వానరరాజగు, సః సుగ్రీవః = ఆ సుగ్రీవుడు, సీతామార్గణే = సీతాన్వేషణమునందు, వ్యగ్రః = ఆత్రముగలవాడై, సర్వాః దిశః = ఎల్లదిక్కులను, హరీన్ = వానరులను, సంప్రేషయామాస = పంపెను.

తాత్పర్యము :- సత్యప్రతిజ్ఞుడైన ఆ వానరరాజగు సుగ్రీవుడు సీతాన్వేషణమునందు మిక్కిలి ఉత్సుకత గలవాడై ఎల్లదిక్కులకును తన యనుచరులైన వానరులను బంపెను.

శ్లో॥ తాం హరీణాం సహస్రాణి శతాని నియుతాని చ ।
దిక్షు సర్వాసు మార్గంతే హ్యధ శ్చోపరి చాంబరే ॥ 13

పదచ్ఛేదము :- తాం - హరీణాం - సహస్రాణి - శతాని - నియుతాని - చ - దిక్షు - సర్వాసు - మార్గంతే - హి - అధః - చ - ఉపరి - చ - అంబరే ॥

అన్వయక్రమము :– హరీణాం శతాని, సహస్రాణి, నియుతాని చ సర్వాసు దిక్షు అధః ఉపరి చ అంబరే చ తాం మార్గంతే.

ప్రతిపదార్థము :– హరీణాం = వానరులయొక్క, శతాని = వందలును, సహస్రాణి = వేలును, నియుతాని చ = లక్షలును, సర్వాసు = సమస్తములైన, దిక్షు = దిక్కులందును, అధః = పాతాళమునందును, ఉపరి చ = పైనున్న భూమియందును, అంబరే చ = ఆకాశమునందును, తాం = సీతాదేవిని, మార్గంతే = వెదకుచున్నారు.

తాత్పర్యము :– ఆ సీతాదేవికొఱకై వేలకొలది, లక్షలకొలది వానరు లెల్ల దిక్కులందును, పాతాళమునందును, భూమ్యాకాశములందును గూడ శ్రద్ధగా వెదుకుచున్నారు.

శ్లో॥ వైనతేయసమాః కేచి త్కేచి త్తత్రానిలోపమాః ।
అసంగగతయ శ్శీఘ్రా హరివీరా మహాబలాః ॥ 14

పదచ్ఛేదము :– వైనతేయసమాః – కేచిత్ – కేచిత్ – తత్ర – అనిలోపమాః – అసంగగతయః – శీఘ్రాః – హరివీరాః – మహాబలాః ॥

అన్వయక్రమము :– తత్ర కేచిత్ మహాబలాః హరివీరాః వైనతేయసమాః, కేచిత్ అనిలోపమాః అసంగగతయః శీఘ్రాః.

ప్రతిపదార్థము :– తత్ర = ఆ వానరసైన్యమునందు, మహాబలాః = మహాబలాఢ్యులైన, హరివీరాః = వానరవీరులు, కేచిత్ = కొంతమంది, వైనతేయసమాః = గరుత్మంతునితో సమానమైనవారు, కేచిత్ = కొంతమంది, అనిలోపమాః = వాయువుతో సమానులై, అసంగగతయః = సాటిలేని గమనముగల్గినవారైన, శీఘ్రాః = వేగవంతులైనవారును.

తాత్పర్యము :– ఆ వానరసైన్యమునందు మహాబలాఢ్యులైన కొందరు వానరవీరులు గరుత్మంతునితో సమానమైనవారు, మఱికొందరు వాయుదేవునితో సమానులై సాటిలేని గమనశక్తిగల అమితవేగశాలురును సుమా!

శ్లో॥ అహం తు హనుమాన్నామ మారుత స్యౌరస స్సుతః ।
సీతాయాస్తు కృతే తూర్ణం శతయోజన మాయతమ్ ॥ 15

శ్లో॥ సముద్రం లంఘయిత్వైవ తాం దిదృక్షు రిహాగతః ।
భ్రమతా చ మయా దృష్టా గృహే తే జనకాత్మజా ॥ 16

పదచ్ఛేదము :– అహం – తు – హనుమాన్ – నామ – మారుతస్య – ఔరసః – సుతః – సీతాయాః – తు – కృతే – తూర్ణం – శతయోజనమ్ – ఆయతమ్ –

సముద్రం – లంఘయిత్వా – ఏవ – తాం – దిదృక్షుః – ఇహ – ఆగతః – భ్రమతా – చ – మయా – దృష్టా – గృహే – తే – జనకాత్మజా ॥

అన్వయక్రమము :– మారుతస్య ఔరసః సుతః హనుమాన్ నామ అహం తు సీతాయాః కృతే శతయోజనమ్ ఆయతం సముద్రం తూర్ణం లంఘయిత్వా తాం దిదృక్షుః ఏవ ఇహ ఆగతః; తే గృహే భ్రమతా మయా జనకాత్మజా దృష్టా చ.

ప్రతిపదార్థము :– మారుతస్య = వాయుదేవునియొక్క, ఔరసః సుతః = ఔరస పుత్రుడనగు, హనుమాన్ నామ = హనుమంతు డనెడు, అహం తు = నేనుమాత్రము, సీతాయాః కృతే = సీతాదేవికొరకై, శతయోజనం = నూఱామడల, ఆయతం = పొడవైనట్టి, సముద్రం = సాగరమును, లంఘయిత్వా = దాటి, తాం = ఆ సీతాదేవిని, దిదృక్షుః ఏవ = చూడగోరినవాడనయియే, ఇహ = ఇచ్చటికి, ఆగతః = వచ్చినాడను. తే = నీయొక్క, గృహే = భవనమునందు, భ్రమతా = తిరుగుచున్నట్టి, మయా = నాచేత, జనకాత్మజా = సీతాదేవి, దృష్టా చ = చూడబడినది కూడను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'తాం దిదృక్షుః ఇహ ఆగతః' అనుటకు బదులుగా 'త్వాం దిదృక్షుః ఇహ ఆగతః' అని బొంబాయి ముద్రణమున గలదు. దాని ననుసరించి మా సుగ్రీవునకు సోదరుడవైన నిన్ను కలసికొన్నచో సర్వలోకవృత్తాంతములు తెలిసియున్న నీవు మాకు సీతమ్మ వృత్తాంతమును తెలుపగలవని మాకు సుగ్రీవుడు చెప్పియుండుటచే నేనిచ్చటికి నిన్ను చూడగోరియే వచ్చితినని భావము. దైవవశమున కుంటివాని మీద గంగాజలము బడినట్లుగ మా సీతమ్మ దర్శనము కూడ నిటనే లభించినది అని హనుమ వచనముల భావము.

రా.శిరోమణి :– మారుతస్య ఔరసః సుతః – తాను కేసరికి క్షేత్రజపుత్రుడననియు, వాయుదేవునకు ఔరసపుత్రుడననియు ఈ రీతిగా హనుమ తెలుపుచున్నాడని గ్రహించవలెను.

వాసుదాసస్వామి :– నేను అన్ని ప్రదేశములను వెదకినట్లే ఇటుకూడ వెదుకవచ్చితిని. నీవు లంకకు బోయినపుడు మా యన్న రావణు నడుగుము. ఆయన అన్నిలోకములయొక్క వృత్తాంతములు తెలిసినవాడు. నీకు సీత వృత్తాంతము తెలుపునని సుగ్రీవుడు చెప్పియుండెను. ఆ మాట ప్రకారము నీకై వెదకుచుండగా నీతో మాట్లాడుటకు ముందు సీతయే గానవచ్చెనని భావము. నీ దర్శనము మాకు దుర్లభమని తక్కిన కార్యము చేసితిని అని భావము.

తాత్పర్యము :- వాయుదేవున కౌరసపుత్రుడనైన నన్ను హనుమంతు డందురు. సీతాదేవికొఱకై నూఱామడల సముద్రమును మహావేగముతో లంఘించి ఆమెను చూడగోరియే నే నీ లంకానగరమునకు వచ్చియున్నాను. నీ భవనమునందు పరిభ్రమించుచు నేను మా సీతమ్మను కనుగొంటిని.

శ్లో॥ త ద్భవాన్ దృష్టధర్మార్థ స్తపఃకృతపరిగ్రహః ।
పరదారాన్ మహాప్రాజ్ఞ నోపరోద్ధుం త్వ మర్హసి ॥ 17

పదచ్ఛేదము :- తత్ - భవాన్ - దృష్టధర్మార్థః - తపఃకృతపరిగ్రహః - పరదారాన్ - మహాప్రాజ్ఞ - న - ఉపరోద్ధుం - త్వమ్ - అర్హసి ॥

అన్వయక్రమము :- మహాప్రాజ్ఞ ! (యత్) భవాన్ దృష్టధర్మార్థః తపఃకృతపరిగ్రహః తత్ త్వం పరదారాన్ ఉపరోద్ధుం న అర్హసి.

ప్రతిపదార్థము :- మహాప్రాజ్ఞ = ఓ వివేకసంపన్నుడా! (యత్ = ఎందువల్లనైతే) భవాన్ = నీవు, దృష్టధర్మార్థః = గ్రహించిన ధర్మతత్త్వము గలవాడవును, తపః కృతపరిగ్రహః =తపశ్శక్తిచే సాధించుకొన్న విభవము గలవాడవు (అయియుంటివో), తత్ = అందువలన, త్వం = నీవు, పరదారాన్ = పరుల భార్యలను, ఉపరోద్ధుం = అడ్డగించుటకు, న అర్హసి = తగవు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- 'దృష్టధర్మార్థః' - శాస్త్రముచే బోధపరచుకొన్న ధర్మముయొక్కయు అర్థముయొక్కయును స్వరూపము గలవాడవు. 'తపఃకృతపరిగ్రహః' - స్వయముగా తపస్సుచేతనే పరిగ్రహింపబడినట్టి మహావైభవసంపన్నుడవు గావున నీ కిట్టి పని తగదని సుగ్రీవుడు స్వయముగా చెప్పిన మాటలుగా గ్రహించవలెను.

వాసుదాసస్వామి :- గురువువద్ద 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా' అన్నట్లు అధ్యయనము, బోధము, ఆచరణము, ప్రచారణము అను నాలుగు రీతులుగా, శాస్త్రధర్మమును చదివినవాడవు.

తాత్పర్యము :- నీవు సమస్త ధర్మశాస్త్రములందలి విషయములును తెలిసినవాడవు. తపశ్శక్తిచే ఎన్నో విభవములను సాధించినవాడవు. అట్టి మహాప్రాజ్ఞుడవైన నీకు పరభార్యలను చెఱబట్టుట ఎంత మాత్రమును తగదు సుమా!

శ్లో॥ నహి ధర్మవిరుద్ధేషు బహ్వపాయేషు కర్మసు ।
మూలఘాతిషు సజ్జంతే బుద్ధిమంతో భవద్విధాః ॥ 18

పదచ్ఛేదము :– నహి – ధర్మవిరుద్ధేషు – బహ్వపాయేషు – కర్మసు – మూలఘాతిషు – సజ్జంతే – బుద్ధిమంతః – భవద్విధాః ॥

అన్వయక్రమము :– భవద్విధాః ధర్మవిరుద్ధేషు బహ్వపాయేషు మూలఘాతిషు కర్మసు నహి సజ్జంతే.

ప్రతిపదార్థము :– భవద్విధాః = నీవంటివారైన, బుద్ధిమంతః = ప్రాజ్ఞులైనవారు, ధర్మవిరుద్ధేషు = ధర్మమునకు విరుద్ధమైనవియును, బహ్వపాయేషు = బహుళములైన అపాయములు గల్గినట్టివియును, మూలఘాతిషు = మూలమునకే వినాశము కల్గించునవియునగు, కర్మసు = పనులందు, నహి సజ్జంతే = ఆసక్తులుగారుగదా!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– ధర్మవిరుద్ధేషు బహ్వపాయేషు మూలఘాతిషు – ధర్మశాస్త్రవిరుద్ధములైన కర్మలను సుఖసంపాదనకొఱకు చేయుచున్నాను అనరాదు. నీ కృత్యములు బహువిధములైన అపాయములతో నిండినవి. నే నపాయములకు వెఱవను అనరాదు, నీ కృత్యములు మూలమునకే వినాశము తెచ్చునట్టివి కాబట్టి నీ ప్రజ్ఞ యంతయును వ్యర్థమని తెలిసికొనవలెను సుమా యని భావము.

తాత్పర్యము :– బుద్ధిమంతులైన నీబోటివాడు ఎవ్వడును ధర్మవిరుద్ధములును, బహు ప్రమాద భూయిష్ఠములును, మూలమునకే వినాశమును గల్గించునట్టివియునగు ఇట్టి అకృత్యములకు పాల్పడడు సుమా!

శ్లో॥ కశ్చ లక్ష్మణముక్తానాం రామకోపానువర్తినామ్ ।
శరాణా మగ్రత స్థాతుం శక్తో దేవాసురేష్వపి ॥ 19

పదచ్ఛేదము :– కః – చ – లక్ష్మణముక్తానాం – రామకోపానువర్తినామ్ – శరాణామ్ – అగ్రతః – స్థాతుం – శక్తః – దేవాసురేషు – అపి ॥

అన్వయక్రమము :– రామకోపానువర్తినాం లక్ష్మణముక్తానాం శరాణామ్ అగ్రతః స్థాతుం దేవాసురేషు అపి శక్తః కః.

ప్రతిపదార్థము :– రామకోపానువర్తినాం =శ్రీరాముని క్రోధమును వెల్లడించునవియును, లక్ష్మణముక్తానాం = లక్ష్మణునిచే ప్రయోగింపబడినవియునగు, శరాణామ్ = బాణములయొక్క, అగ్రతః = ఎదుట, స్థాతుం = నిలుచుటకు, దేవాసురేషు అపి = దేవతలందును దానవులందును గూడ, శక్తః = సమర్థుడు, కః = ఎవ్వడు(న్నాడు)?

తాత్పర్యము :– శ్రీరాముని క్రోధకారణముగా వెడలి, లక్ష్మణునిచే ప్రయోగింపబడినట్టి నిశితాస్త్రములను యుద్ధభూమియందు ఎదురొడ్డి నిలువగలవాడు దేవదానవులలో ఎవడున్నాడో ఆలోచించుకొంటివా?

శ్లో॥ న చాపి త్రిషు లోకేషు రాజన్ విద్యేత కశ్చన ।
రాఘవస్య వ్యలీకం యః కృత్వా సుఖ మవాప్నుయాత్ ॥ 20

పదచ్ఛేదము :– న – చ – అపి – త్రిషు – లోకేషు – రాజన్ – విద్యేత – కః – చన – రాఘవస్య – వ్యలీకం – యః – కృత్వా – సుఖమ్ – అవాప్నుయాత్ ॥

అన్వయక్రమము :– రాజన్! రాఘవస్య వ్యలీకం కృత్వా యః సుఖమ్ అవాప్నుయాత్ సః త్రిషు లోకేషు చ అపి కశ్చన న విద్యేత.

ప్రతిపదార్థము :– రాజన్ = ఓ రాజా! రాఘవస్య = శ్రీరామునకు, వ్యలీకం = అప్రియమును, కృత్వా = చేసి, యః = ఎవ్వడు, సుఖమ్ = సుఖమును, అవాప్నుయాత్ = పొందగల్గునో, సః = అట్టివాడు, త్రిషు లోకేషు చ అపి = మూడులోకముల యందునుకూడ, కశ్చన = ఎవ్వడును, న విద్యేత = ఉండడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :– "త్రిషు లోకేషు కశ్చన న విద్యతే" మహాపాతకములకు ప్రాయశ్చిత్తము చేసికొని, దేహాంతరములం దనుభవింప వలసిన పాపములను నివృత్తి చేసికొనుటకు వీలుండవచ్చును గాని శ్రీరామున కపరాధము గావించుట యను పాతకమునకు నివృత్తియు శ్రేయఃప్రాప్తియు మాత్రము ఆయన అనుగ్రహములేనిదే లభించదని భావము.

తాత్పర్యము :– ఓ రాక్షసేశ్వరా! శ్రీరామునియెడ నపరాధము గావించి అతనికి క్రోధము కల్గించి సుఖము పొందగలుగువాడు ముల్లోకములందును ఎవ్వడు నుండబోడు సుమా!

శ్లో॥ తత్త్రికాలహితం వాక్యం ధర్మ్య మర్థానుబంధి చ ।
మన్యస్వ నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్ ॥ 21

పదచ్ఛేదము :– తత్ – త్రికాలహితం – వాక్యం – ధర్మ్యమ్ – అర్థానుబంధి – చ – మన్యస్వ – నరదేవాయ – జానకీ – ప్రతిదీయతామ్ ॥

అన్వయక్రమము :– తత్, వాక్యం త్రికాలహితం ధర్మ్యమ్ అర్థానుబంధి చ మన్యస్వ

నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్.

ప్రతిపదార్థము :– తత్ = అందువలన, వాక్యం = నా మాటను, త్రికాలహితం = భూతభవిష్యద్వర్తమాన కాలములందు హితమైనదిగాను, ధర్మ్యమ్ = ధర్మసమ్మతమైనదిగాను, అర్థానుబంధి చ = ప్రయోజనమును గూర్చునదిగాను, మన్యస్వ = తలచుము, నరదేవాయ = నరరూపమున నున్న దేవుడైన శ్రీరామునకు, జానకీ = సీతాదేవి, ప్రతిదీయతామ్ = తిరిగి ఈయబడుగాక!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'త్రికాలహితం' = సీతను ఇచ్చివేయుటవలన భూతకాలమునందు అపరాధము తొలగును, వర్తమానమునందు ఐశ్వర్యమునకు వినాశము లేకుండును, భవిష్యత్తునందు శుభములు గల్గించును సుమా యని భావము. 'నరదేవాయ' యనుటకు బదులు 'నరశార్దూల' యని రావణసంబోధనపరముగ పాఠాంతరము.

గోవిందరాజీయము :– ప్రస్తుతము చేయునట్టి కృత్యము భూతకాలహితము అగుట ఎట్లనగా దారుణమైన యధర్మము తత్కర్తయొక్క పూర్వపురుషులకుగూడ హానిని గూర్చును గావున ప్రస్తుత అధర్మమును విడిచినచో భూతకాలహితముగూడ సాధించుకొనినట్లగును అని భావము.

తాత్పర్యము :– అందువలన రామునియెడల అపరాధము గావించినట్టివానికి వినాశము తప్పదు గనుక భూతభవిష్యత్వర్తమానకాలములందు నీకు మేలు గల్గించునట్టి నా మాట ధర్మయుక్తమైనట్టిది, పరమార్థప్రదమైనట్టిది అని తెలిసికొని సీతాదేవిని శ్రీరామునకు తిరిగి అప్పగింపుము.

శ్లో॥ దృష్టా హీయం మయా దేవీ లబ్ధం య దిహ దుర్లభమ్ ।
ఉత్తరం కర్మ య చ్ఛేషం నిమిత్తం తత్ర రాఘవః ॥ 22

పదచ్ఛేదము :– దృష్టా – హి – ఇయం – మయా – దేవీ – లబ్ధం – యత్ – ఇహ – దుర్లభమ్ – ఉత్తరం – కర్మ – యత్ – శేషం – నిమిత్తం – తత్ర – రాఘవః ॥

అన్వయక్రమము :– మయా ఇయం దేవీ దృష్టా హి; యత్ దుర్లభం (తత్) ఇహ లబ్ధమ్; ఉత్తరం శేషం యత్ కర్మ తత్ర రాఘవః నిమిత్తమ్.

ప్రతిపదార్థము :– మయా = నాచేత, ఇయం దేవీ = ఈ సీతాదేవి, దృష్టా హి = చూడబడినది సుమా! యత్ = ఏది, దుర్లభం = పొందశక్యముగానిదో, తత్ = అది, ఇహ = ఇచ్చట, లబ్ధం = పొందబడినది, ఉత్తరం = తరువాతిదగు, శేషం =

మిగిలినది, యత్ కర్మ = ఏ కృత్యమున్నచో, తత్ర = దాని విషయమున, రాఘవః = శ్రీరాముడు, నిమిత్తం = ప్రమాణము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– దృష్టా దేవీ! – సీతాదేవి నావద్ద లేదని నీవు అపలాపించుటకు వీలులేదు. నాకన్నులతో నేనామెను ఈ లంకయందే చూచితినని భావము. నిమిత్తం తత్ర రాఘవః– చూచిన సీతను తీసికొనిపోవుటయో లేక ఆమెకై యుద్ధముచేయుటయో అనునది మా పనిగాదు. మా పని చూచి వెళ్లుటయే. మిగిలిన కార్యమును నిర్ణయింపవలసిన వాడు శ్రీరాముడని భావము.

తాత్పర్యము :– సీతాదేవిని నేనిచ్చట జూచియేయున్నాను. మా ఇతరవానరులకు అసాధ్యమైన సీతాదర్శనభాగ్యము నాకు లభించినది. చూచివచ్చుటయను నా పని పూర్తి అయినది తరువాత మిగిలియున్న పనిని శ్రీరాముడే నిర్ణయించవలసియున్నది.

శ్లో॥ లక్షితేయం మయా సీతా తథా శోకపరాయణా ।
గృహ్యా యాం నాభిజానాసి పంచాస్యా మివ పన్నగీమ్ ॥ 23

పదచ్ఛేదము :– లక్షితా – ఇయం – మయా – సీతా – తథా – శోకపరాయణా – గృహ్యా – యాం – న – అభిజానాసి – పంచాస్యామ్ – ఇవ – పన్నగీమ్ ॥

అన్వయక్రమము :– యాం పంచాస్యాం పన్నగీం గృహ్యా ఇవ న అభిజానాసి సా ఇయం సీతా తథా శోకపరాయణా మయా లక్షితా.

ప్రతిపదార్థము :– యాం = ఎవరినయితే, పంచాస్యాం = ఐదునోరులు గల, పన్నగీం = త్రాచును, గృహ్యా ఇవ = పట్టుకొనివలె, న అభిజానాసి = తెలిసికొనలేకున్నావో, ఇయం (సా)సీతా = అట్టి ఈ సీతాదేవి, తథా = ఆ రీతిగా, శోకపరాయణా = శోకమగ్నురాలుగా, మయా = నాచేత, లక్షితా = చూడబడినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– పంచాస్యాం పన్నగీం – సీతాదేవి శోకాగ్నిచేతనే ఐదుతలల త్రాచు కోరలందలి విషాగ్నిచేతవలె నీ లంకానగరము దగ్ధము కాగలదని భావము.

రా. శిరోమణి :– "గృహ్యా" అనుటకు బదులుగా "గృహే" అని పాఠాంతరము. నీవే దొంగిలించి తెచ్చిన సీతాదేవి, ఇంటిలో నున్న భయంకరమైన ఐదుతలల త్రాచుపామని నీవు గుర్తింపలేకున్నావు అని భావము.

గోవిందరాజీయము :– 'తథా శోకపరాయణా' – వాక్కులతో వర్ణింపజాలనట్టి శోకస్థితిలో నున్నట్టి సీతాదేవి యని భావము.

మహేశ్వరతీర్థులు :– పరమపతివ్రతయైన సీతమ్మ శోకపరాయణయై నీ లంకలో బంధింపబడుటచే నీ లంక నశించునని భావము.

తాత్పర్యము :– శోకపరాయణురాలుగా దీనస్థితిలో నున్న సీతను నేను జూచితిని. ఆమె నట్లు బంధించుట ఐదుతలల త్రాచుపామును చేతితో పట్టియుండుటయే యని నీవు తెలిసికొనలేకున్నావు.

శ్లో॥ నేయం జరయితుం శక్యా సాసురై రమరై రపి ।
విషసంసృష్ట మత్యర్థం భుక్త మన్న మివౌజసా ॥ 24

పదచ్ఛేదము :– న – ఇయం – జరయితుం – శక్యా – సాసురైః – అమరైః – అపి, విషసంసృష్టమ్ – అత్యర్థం – భుక్తమ్ – అన్నమ్ – ఇవ – ఓజసా ॥

అన్వయక్రమము :– సాసురైః అమరైః అపి ఇయం భుక్తమ్ అత్యర్థం విషసంసృష్టమ్ అన్నం ఇవ ఓజసా జరయితుం న శక్యా.

ప్రతిపదార్థము :– సాసురైః = రాక్షసులతో గూడిన, అమరైః అపి = దేవతలచేగూడ, ఇయం = ఈ సీతాదేవి, భుక్తం = భుజింపబడిన, అత్యర్థం = మిక్కిలిగా, విషసంసృష్టం = విషమిశ్రితమైనట్టి, అన్నమ్ ఇవ = ఆహారమువలె, ఓజసా = ప్రతాపముచే (జఠరాగ్నిచే) జరయితుం = జీర్ణించుకొనుటకు (దక్కించుకొనుటకు), శక్యా న = సాధ్యమైనదిగాదు.

తాత్పర్యము :– మిక్కిలిగా విషము కలిపియున్న అన్నమును తిని జఠరాగ్నిబలముచే జీర్ణించుకొనుట సాధ్యము గానట్లుగా ఈ సీతాదేవిని బంధించి దేవతలును రాక్షసులును గూడ దక్కించుకొనజాలరు.

శ్లో॥ తపస్సంతాపలబ్ధ స్తే యోఽయం ధర్మపరిగ్రహః ।
న స నాశయితుం న్యాయ్య ఆత్మప్రాణపరిగ్రహః ॥ 25

పదచ్ఛేదము :– తపస్సంతాపలబ్ధః – తే – యః – అయం – ధర్మపరిగ్రహః – న – సః – నాశయితుం – న్యాయ్యః – ఆత్మప్రాణపరిగ్రహః ॥

అన్వయక్రమము :– తపస్సంతాపలబ్ధః ధర్మపరిగ్రహః తే యః ఆత్మప్రాణపరిగ్రహః (అస్తి) సః అయం నాశయితుం న్యాయ్యః న.

ప్రతిపదార్థము :– తపస్సంతాపలబ్ధః = తపఃక్లేశముచే పొందబడినదియును, ధర్మపరిగ్రహః = ధర్మసంపదతో కూడినదియునగు, తే = నీయొక్క, యః = ఏ, ఆత్మప్రాణపరిగ్రహః = చిరకాల జీవిత మనెడి సంపదయున్నదో, సః అయం = అయ్యది, నాశయితుం = నశింపచేసికొనుటకు, న్యాయ్యః న = యుక్తముగాదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– నాశయితుం న న్యాయ్యః – పరభార్యాపహరణ రూపమైన అధర్మముచేత నీ భాగ్యమును నశింపజేసికొనుట తగదని భావము.

తాత్పర్యము :– గొప్ప తపఃక్లేశముచే సంపాదించుకొన్న పరమధర్మరూపమైన సంపదయును, తత్ఫలితముగా నీవు సంపాదించుకొన్న చిరకాలజీవనభాగ్యమును ఇట్టి యధర్మాచరణమువలన నశింపజేసికొనుట నీ కుచితము గాదు సుమా!

శ్లో॥ అవధ్యతాం తపోభిర్యాం భవాన్సమనుపశ్యతి ।
ఆత్మనస్సాసురై ర్దేవైర్హేతు స్తత్రాప్యయం మహాన్ ॥ 26

పదచ్ఛేదము :– అవధ్యతాం – తపోభిః – యాం – భవాన్ – సమనుపశ్యతి, ఆత్మనః – సాసురైః – దేవైః – హేతుః – తత్ర – అపి – అయం – మహాన్ ॥

అన్వయక్రమము :– భవాన్ తపోభిః సాసురైః దేవైః ఆత్మనః యామ్ అవధ్యతాం సమనుపశ్యతి, తత్ర అపి అయం మహాన్ హేతుః (అస్తి).

ప్రతిపదార్థము :– భవాన్ = నీవు, తపోభిః = తపస్సులచే, సాసురైః = రాక్షసులతో గూడినట్టి, దేవైః = దేవతలచే, ఆత్మనః = నీకు, యామ్ అవధ్యతాం = ఏ మృత్యురాహిత్యమును, సమనుపశ్యతి = చూచుకొనుచున్నావో, తత్ర అపి = ఆ విషయమునందుగూడ, అయం = ఈ, మహాన్ = గొప్పదైన, హేతుః = కారణము, అస్తి = ఉన్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'తత్రాపి అయం మహాన్ హేతుః' – నీవు సాధించుకొన్న అవధ్యత్వవరమునకు నీ గొప్పధర్మబలమే కారణము. దానిని క్షీణింపజేసికొనకుమని భావము.

మహేశ్వరతీర్థులు :– నీ అవధ్యత్వవరము సుగ్రీవాదులయెడ ఫలింపదు అని నేను ముందు తెలుపబోవునట్టి కారణమును గ్రహింపుమని భావము.

తాత్పర్యము :– నేను గొప్ప తపస్సు జేసి దేవాసురులకు అవధ్యుడనై యుండునట్టి వరమును సంపాదించుకొంటిని గదా యని నీవు అనుకొనుచున్నావు; ఆ వరముకూడ పనిచేయదని నేను చెప్పబోవుచున్న కారణమును వినుము.

శ్లో॥ సుగ్రీవో నహి దేవోఽయం నాసురో నచ రాక్షసః ।
న దానవో న గంధర్వో న యక్షో నచ పన్నగః ।
(మానుషో రాఘవో రాజన్ సుగ్రీవశ్చ హరీశ్వరః)
తస్మా త్ప్రాణపరిత్రాణం కథం రాజ న్కరిష్యసి ॥ 27

పదచ్ఛేదము :– సుగ్రీవః – న – హి – దేవః – అయం – న – అసురః – న – చ – రాక్షసః – స – దానవః – న – గంధర్వః – న – యక్షః – న – చ – పన్నగః, (మానుషః – రాఘవః – సుగ్రీవః – చ – హరీశ్వరః) – తస్మాత్ – ప్రాణపరిత్రాణం – కథం – రాజన్ – కరిష్యసి ॥

అన్వయక్రమము :– అయం సుగ్రీవః దేవః నహి; అసురః న; రాక్షసః చ న; దానవః న, గంధర్వః న, యక్షః చ న, పన్నగః చ న, (రాజన్! రాఘవః మానుషః; సుగ్రీవః హరీశ్వరః చ) రాజన్! తస్మాత్ ప్రాణపరిత్రాణం కథం కరిష్యసి?

ప్రతిపదార్థము :– అయం సుగ్రీవః = ఈ సుగ్రీవుడు, దేవః నహి = దేవత కాడు గదా! అసురః న = అసురుడు గాదు, రాక్షసః చ న = రాక్షసుడు గాదు, దానవః న = దానవుడు గాదు, గంధర్వః న = గంధర్వుడు గాదు, యక్షః న = యక్షుడు గాదు, పన్నగః చ న = పన్నగుడును కాదు, (రాజన్ = రాజా! రాఘవః = రఘువంశ తిలకుడగు శ్రీరాముడు, మానుషః = మానవుడు. సుగ్రీవః = సుగ్రీవుడు, హరీశ్వరః = వానరరాజు.) రాజన్ = రాజా!, తస్మాత్ = ఆ కారణమువలన, ప్రాణపరిత్రాణం = ప్రాణరక్షణమును, కథం = ఎట్లు, కరిష్యసి = చేసికొనగలవు?

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము, రా. శిరోమణి :– రాఘవః మానుషః, సుగ్రీవః హరీశ్వరః – నీవు వరమును గోరుసమయమున ఉపేక్షించినట్టి నరవానరజాతులకు చెందిన రఘురామ సుగ్రీవులవలన అవధ్యత్వవరము నీకు లేదు గదా! గావున వారినుండి నీకు ప్రాణరక్షణము ఎట్లు గలుగునని భావము.

సూచన :– మానుషో రాఘవః – ఇత్యాది శ్లోకపాదము దక్షిణాది ప్రతులందు గానరాదు.

వాసుదాసస్వామి :– నిన్ను యుద్ధమున జయించి కారాగృహమున నుంచినవాడు

కార్తవీర్యార్జునుడు. అట్టి వానిని బరిమార్చినవాడు పరశురాముడు. అట్టి పరశురాముని అరగడియలో బాణప్రయోగము చేయకయే రఘురాము డోడించెను. అట్టి వీరపురుషుని ఎదుట నీవు ప్రాణరక్షణ నెట్లు చేసికొనగలవు?

తాత్పర్యము :– ఈ సుగ్రీవుడు నిన్ను చంపజాలనట్టి దేవగణములోనివాడు గాదు కదా! అట్లే యసురుడుగాని రాక్షసుడుగాని దానవుడుగాని గంధర్వుడుగాని యక్షుడుగాని పన్నగుడు గాని కాదు. శ్రీరాముడు నరుడు, సుగ్రీవుడు వానరుడు. నీకు అవధ్యత్వము నరవానరులనుండి లేనందున ఇప్పుడు నీవు ప్రాణరక్షణము ఎట్లు చేసికొనగలవు?

శ్లో॥ న తు ధర్మోపసంహార మధర్మఫలసంహితమ్ ।
తదేవ ఫల మన్వేతి ధర్మ శ్చాధర్మనాశనః ॥ 28

శ్లో॥ ప్రాప్తం ధర్మఫలం తావ ద్భవతా నాత్ర సంశయః ।
ఫల మ స్యా ప్యధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే ॥ 29

పదచ్ఛేదము :– న – తు – ధర్మోపసంహారమ్ – అధర్మఫలసంహితమ్ – తత్ – ఏవ – ఫలమ్ – అన్వేతి – ధర్మః – చ – అధర్మనాశనః – ప్రాప్తం – ధర్మఫలం – తావత్ – భవతా – న – అత్ర – సంశయః – ఫలమ్ – అస్య – అపి – అధర్మస్య – క్షిప్రమ్ – ఏవ – ప్రపత్స్యసే ॥

అన్వయక్రమము :– న తు (మంతవ్యం) ధర్మోపసంహారమ్ అధర్మఫలసంహితం (అపి) తత్ ఫలం ఏవ అన్వేతి, ధర్మః అధర్మనాశనః చ ఇతి. భవతా తావత్ ధర్మఫలం ప్రాప్తం అత్ర సంశయః న, అస్య అధర్మస్య ఫలమ్ అపి క్షిప్రమ్ ఏవ ప్రపత్స్యసే.

ప్రతిపదార్థము :– న తు (మంతవ్యం) = ఇట్లు మాత్రము భావించరాదు, ధర్మోపసంహారం = ధర్మసంగ్రహము కలిగినట్టివానిని, అధర్మఫలసంహితమ్ అపి = పాపయుక్తుడుగా నున్నప్పటికిని, తత్ ఫలం ఏవ = పూర్వార్జితమైన పుణ్యమే, అన్వేతి = అనుసరించును, ధర్మః = ధర్మము, అధర్మనాశనః చ = అధర్మమును నశింపచేయునట్టికూడను, (ఇతి = అని); భవతా = నీచేత, తావత్ = ముందుగా, ధర్మఫలం = ధర్మముయొక్క ఫలితము, ప్రాప్తం = పొందబడినది, అత్ర = ఈ విషయమునందు, సంశయః = సందేహము, న = లేదు, అస్య = ఈ, అధర్మస్య = అధర్మముయొక్క, ఫలమ్ అపి = ఫలితమునుగూడ, క్షిప్రమ్ ఏవ = శీఘ్రముగనే, ప్రపత్స్యసే = పొందగలవు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

సూచన :– ఇందలి ఈ 28వ శ్లోకమునకు పూర్వవ్యాఖ్యాతలు పలువురు పలువిధములుగా నన్వయించి అర్థమును చెప్పియున్నారు. పాఠాంతరములుగూడ రెండుమూడు గానవచ్చుచున్నవి. మఱియు పలువురు దీనిని ప్రత్యేక శ్లోకములుగా విడిగానే చూసి అర్థము చెప్పినారు. మద్రాసు శ్రీరామరత్నప్రకాశక మహాశయులచే ప్రకటింపబడిన మూలప్రతియందు “నతు ధర్మోపసంహారం” అను దానికి బదులుగా ‘నను ధర్మోపసంహారం’ అను పాఠాంతరము స్వీకరింపబడినది. దీని ననుసరించి ఇందలి మొదటి శ్లోకము పూర్వపక్షవాక్యముగాను తరువాతి శ్లోకము దానికి సమాధాన వాక్యముగాను గ్రహింపవలెనని స్పష్టమగుచున్నది.

తిలకము :– అధర్మఫలముయొక్క ప్రాబల్యము గలవాడైన పురుషుడు ప్రస్తుతము ఆ యధర్మానుభవము నొందుచుండగా పూర్వము తాను చేసికొన్న కొద్ది ధర్మసంగ్రహ మున్నను ఆ ధర్మఫలము ఇప్పు డతనిని జేరదు. ఫలోన్ముఖమైన అధర్మమే యతనిని చేరుచుండును. అయినచో నిక ధర్మము అధర్మమును నశింపజేయును అను సిద్ధాంతమునకు అర్థమేమి? అనగా నిజమే, ఒకడు చేసిన యధర్మమును అతడు తరువాతి కాలమున చేసినట్టి ఉత్కటమైన ధర్మము నశింపజేయగలదు. కాని అదే విధముగ నాతడు చేసిన ఉత్కటమైన అధర్మము గూడ తాను పూర్వము చేసిన ధర్మమును నశింపజేయును గదా! కాబట్టి ఓ రావణా! ప్రస్తుతము నీవు చేసిన ఘోరమైన అధర్మముచే నీ పూర్వధర్మమంతయు నశించినది సుమా యని భావము.

ఇచ్చట కొందరు, ధర్మఫలమైనట్టి సుఖము అధర్మఫలమైనట్టి దుఃఖముతోగలసి యనుభవింపబడుట జరుగదు. అందుచే ధర్మఫలము ధర్మఫలముతోడను, అధర్మఫల మధర్మఫలము తోడను మాత్రమే గలియుచుండును. “ధర్మో నా ఽ ధర్మనాశనః”యని చెప్పబడెను. గనుక పూర్వకృతధర్మము ప్రస్తుతాధర్మమును నశింపచేయజాలదని భావము అని చెప్పుచున్నారు విజ్ఞులు. యుక్తమైన యర్థమును గ్రహించగలరు. రా. శిరోమణి గూడ తిలకవ్యాఖ్యానమునే అనుసరించెను.

గోవిందరాజీయము :– ధర్మఫల మధర్మఫలముతో గూడునది గాదు. అది ధర్మఫలముతో మాత్రమే గూడును. ధర్మము నెదుట యధర్మము నిలువజాలదు. “ధర్మేణ పాపమపనుదతి” అను శ్రుతి ప్రమాణమును బట్టి ధర్మమే యధర్మమును నశింపజేయును. కాని రావణా! నేను ధర్మము చేసిన వాడను కావున నా ధర్మఫలము ప్రస్తుతపు అధర్మమును నశింపజేయగలదు గదా యని తలపకుము. కాబట్టి ప్రస్తుతపు అధర్మమును నశింపజేసికొనుటకు సరిపడునంతటి గొప్పధర్మమును నీవు

చేసికొనవలసియున్నది. లేనిచో ఇప్పుడే నీకు వినాశము సంభవించును. ఇక ఇప్పుడు నీవు చేయదగు ధర్మ మేమందువా అది సీతమ్మను శ్రీరామున కప్పగించి ఆ మహానుభావుని శరణు వేడుకొనుటయే అని భావము. రావణుని ధర్మఫలము నశించిపోయెనని హనుమ కెట్లు తెలిసెననగా రావణుడు తన శౌర్యమును జూపు ధైర్యములేక చౌర్యవృత్తిని బూని సీతమ్మ నపహరించుటనుబట్టి గ్రహింపగల్గెనని తెలియవలెను.

మహేశ్వరతీర్థులు :– ధర్మఫలమైన సుఖము అధర్మఫలితమైన దుఃఖముతో గలసి అనుభవింపదగినదిగాదు. అనగా ధర్మఫలమైన రాజ్యభోగము, అధర్మఫలమైన రోగబాధయు రెండును గలసియే ఒకడు అనుభవించునట్లుగా రావణుడు చేసిన తీవ్రమైన తపస్సు అనెడి ధర్మమునకు ఫలమైనట్టి సుఖజీవన మనునదియును, పరదారాపహరణరూపమైన అత్యుత్కటమగు అధర్మమునకు ఫలమైన మృత్యువు అనునదియును, ఈ రెండును గలసి యనుభవించుటకు తగినవి గావు గదా! గావున ధర్మఫలము ధర్మఫలమునే యనుసరించును. ధర్మ మధర్మమును నశింపజేయునట్టిది గాదు. అనగా ధర్మము అధర్మఫలము నణచి తాను ఉత్తమ ఫలము నొసగజాలదు అని భావము. పూర్వము చేసిన ధర్మము ఇప్పుడు చేసిన అధర్మమును నశింపజేయునట్టిది గాజాలదు. ధర్మాధర్మములు రెండును దేనికదియే తమ తమ ఫలానుభవము నొసగి క్షీణించునట్టివని సారాంశము.

తాత్పర్యము :– నేనెంతయో ధర్మము జేసియున్నట్టి వాడను. ప్రస్తుతము కొద్ది అధర్మఫలము నన్నంటి నప్పటికిని నా పూర్వార్జిత ధర్మఫలము నావెంట యుండనే యున్నది. ధర్మ మధర్మమును నాశనముజేసి వేయగలదు గదా!" యని ఎంతమాత్రము భావింపకుము. ప్రస్తుతము నీవు చేసికొనుచున్న అధర్మమునకు ఫలితమును గూడక త్వరలోనే పొందబోవుచున్నావు సుమా!

శ్లో॥ జనస్థానవధం బుద్ధ్వా బుద్ధ్వా వాలివధం తథా ।
రామసుగ్రీవసఖ్యం చ బుధ్యస్వ హిత మాత్మనః ॥ 30

పదచ్ఛేదము :– జనస్థానవధం – బుద్ధ్వా – బుద్ధ్వా – వాలివధం – తథా – రామ సుగ్రీవసఖ్యం – చ – బుధ్యస్వ – హితమ్ – ఆత్మనః ॥

అన్వయక్రమము :– జనస్థానవధం బుద్ధ్వా, వాలివధం, తథా రామసుగ్రీవసఖ్యం చ బుద్ధ్వా ఆత్మనః హితం బుధ్యస్వ.

ప్రతిపదార్థము :– జనస్థానవధం = జనస్థానమునందలివధను, వాలివధం =

వాలివధను, తథా = అట్లే, రామసుగ్రీవసఖ్యం చ = రామసుగ్రీవుల మైత్రిని, బుద్ధ్వా = తెలిసికొని, ఆత్మనః = నీకు, హితం = శ్రేయస్సును, బుధ్యస్వ = తెలిసికొనుము.

తాత్పర్యము :– ఆనాడు జనస్థానమునందు జరిగిన ఖరదూషణాదుల వధను గూర్చియు, వాలివధను గూర్చియు, రామసుగ్రీవుల మధ్య నేర్పడిన మైత్రిని గూర్చియు పూర్తిగా తెలిసికొని నీకు మేలుగూర్చు మార్గ మేదియో నిర్ణయించుకొనుము.

శ్లో॥ కామం ఖ ల్వహ మ ప్యేక స్సవాజిరథకుంజరామ్ ।
లంకాం నాశయితుం శక్త స్తస్యైష తు న నిశ్చయః ॥ 31

పదచ్ఛేదము :– కామం – ఖలు – అహమ్ – అపి – ఏకః – సవాజిరథకుంజరామ్, లంకాం – నాశయితుం – శక్తః – తస్య – ఏషః – తు – న – నిశ్చయః ॥

అన్వయక్రమము :– అహమ్ ఏకః అపి సవాజిరథకుంజరాం లంకాం నాశయితుం కామం శక్తః ఖలు; ఏషః తు తస్య నిశ్చయః న.

ప్రతిపదార్థము :– అహం = నేను, ఏకః అపి = ఒక్కడనే గూడ, సవాజిరథకుంజరాం = అశ్వములతోడను రథములతోడను, ఏనుగులతోడను గూడిన, లంకాం = లంకానగరమును, నాశయితుం = నశింపజేయుటకు, కామం = పూర్తిగా, శక్తః ఖలు = సమర్థుడను సుమా! తు = కాని, ఏషః = ఇది, తస్య, ఆ శ్రీరామునియొక్క, నిశ్చయః న = నిర్ణయముగాదు.

తాత్పర్యము :– నేను ఒక్కడనే సమస్తములైన ఈ యశ్వములతోడను, రథములతోడను, ఏనుగులతోడను గూడిన ఈ లంక నంతయు నాశనము జేసి వేయగలను, కాని అట్లు చేయుట శ్రీరాముని నిర్ణయము గాదు.

శ్లో॥ రామేణ హి ప్రతిజ్ఞాతం హర్యృక్షగణసన్నిధౌ ।
ఉత్సాదన మమిత్రాణాం సీతా యై స్తు ప్రధర్షితా ॥ 32

పదచ్ఛేదము :– రామేణ – హి – ప్రతిజ్ఞాతం – హర్యృక్షగణసన్నిధౌ – ఉత్సాదనమ్ – అమిత్రాణాం – సీతా – యైః – తు – ప్రధర్షితా ॥

అన్వయక్రమము :– యైః సీతా ప్రధర్షితా (తేషామ్) అమిత్రాణామ్ ఉత్సాదనం హర్యృక్షణగణసన్నిధౌ రామేణ ప్రతిజ్ఞాతం హి.

ప్రతిపదార్థము :– యైః = ఎవరిచే, సీతా = సీతాదేవి, ప్రధర్షితా = పీడింపబడినదో, (తేషాం = ఆ) అమిత్రాణాం = శత్రువులయొక్క, ఉత్సాదనం = వినాశమును గూర్చి, హర్యృక్షగణసన్నిధౌ = వానరుల యొక్కయు భల్లూకముల యొక్కయు సమూహముల

సమక్షమున, రామేణ = శ్రీరామునిచే, ప్రతిజ్ఞాతం హి = ప్రతిజ్ఞ చేయబడెను సుమా!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- జాంబవంతుడు సుగ్రీవుడు మున్నగు పలువురు వృద్ధులున్న ఆ సభలో చేసిన ప్రతిజ్ఞను రాము డతిక్రమించుటకు వీలులేదు.

తాత్పర్యము :- మా వానరవీరులు, భల్లూకయోధులును గల పెద్ద సభలో తన భార్యను మోసగించినట్టి శత్రువును నశింపజేసెదనని శ్రీరాముడు ప్రతిజ్ఞ చేసియున్నాడు సుమా!

శ్లో॥ అపకుర్వ న్హి రామస్య సాక్షా దపి పురందరః ।
న సుఖం ప్రాప్నుయా దన్యః కిం పునస్త్వాదృశో జనః ॥ 33

పదచ్ఛేదము :- అపకుర్వన్ - హి - రామస్య - సాక్షాత్ - అపి - పురందరః - న - సుఖం - ప్రాప్నుయాత్ - అన్యః - కిం - పునః - త్వాదృశః - జనః ॥

అన్వయక్రమము :- రామస్య అపకుర్వన్ సాక్షాత్ పురందరః అపి సుఖం న ప్రాప్నుయాత్ హి, త్వాదృశః అన్యః జనః పునః కిం (వక్తవ్యమ్)!

ప్రతిపదార్థము :- రామస్య = శ్రీరామునకు, అపకుర్వన్ = అపకారము చేయుచున్నవాడు, సాక్షాత్ = స్వయముగా, పురందరః అపి = దేవేంద్రుడైనను, సుఖం = సౌఖ్యమును, న ప్రాప్నుయాత్ హి = పొందదు సుమా! త్వాదృశః = నీబోటి, అన్యః జనః = ఇతరవ్యక్తి, పునః = తిరిగి, కిం (వక్తవ్యమ్) = చెప్పవలసిన దేమి?

తాత్పర్యము :- శ్రీరామున కపకారము చేసినవాడు సాక్షాత్తుగ దేవేంద్రుడైనను సుఖముగ జీవింపజాలడు; ఇక నీబోటివారి విషయము వేఱుగ చెప్పవలయునా?

శ్లో॥ యాం సీతే త్యభిజానాసి యేయం తిష్ఠతి తే వశే ।
కాలరాత్రీతి తాం విద్ధి సర్వలంకావినాశినీమ్ ॥ 34

పదచ్ఛేదము :- యాం - సీతా - ఇతి - అభిజానాసి - యా - ఇయం - తిష్ఠతి -తే - వశే, కాలరాత్రీ - ఇతి - తాం - విద్ధి - సర్వలంకావినాశినీమ్ ॥

అన్వయక్రమము :- యా ఇయం తే వశే తిష్ఠతి, యాం సీతా ఇతి అభిజానాసి, సర్వలంకావినాశినీం తాం కాలరాత్రీ ఇతి విద్ధి.

ప్రతిపదార్థము :- యా ఇయం = ఏ ఈమె, తే = నీయొక్క, వశే = అధీనమున,

తిష్ఠతి = ఉన్నదో, యాం = ఎవరిని, సీతా ఇతి = సీత యని, అభిజానాసి = అనుకొనుచున్నావో, సర్వలంకావినాశినీమ్ = సమస్తమైన లంకను నశింపచేయునట్టి, తాం = ఆమెను, కాళరాత్రీ ఇతి = కాళరాత్రి యని, విద్ధి = తెలిసికొనుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– కాళరాత్రీ – మహాప్రళయమును గల్గించునట్టి భగవంతుని శక్తిని కాళరాత్రి యందురు.

వాసుదాసస్వామి :– మార్కండేయపురాణమునందు ఈ విష్ణుశక్తినే కాళరాత్రి నారాయణి మున్నగు పేర్లతో వ్యవహరించిరి. మహానారాయణోపనిషత్తునందు గూడ భగవంతుని మహామాయ ఆయన యాజ్ఞకు లోబడి వర్తించునని చెప్పబడినది. ఈ విష్ణుశక్తియే జగద్రక్షాకార్యమునందు కేవలసత్త్వగుణము గల్గి లక్ష్మి – శ్రీ – భూమి – నీశ – రుక్మిణి – సీతాది రూపంబుల నవతరించును. సంహారము చేయు కాలమందు తమోభూయిష్ఠయై మహాకాళరాత్రి మున్నగు నామధేయములు గలదై యుండును. త్రిగుణాత్మకమగు ప్రకృతి భగవచ్ఛక్తియే గదా!

కాళరాత్రి ప్రళయకాలమందు సంహారమెట్లు చేయునో యట్లే సీత నీవంశమును నాశనము చేయునని గ్రాహ్యము.

తాత్పర్యము :– నీ యధీనమందున్న ఎవ్వతెనైతే నీవు సీత యనెడి ఒక స్త్రీ యని అనుకొనుచున్నావో ఆమె నీ లంక నంతను నశింపజేయునట్టి ప్రళయకారణమగు కాళరాత్రి యని తెలిసికొనుము.

శ్లో॥ త దలం కాలపాశేన సీతావిగ్రహరూపిణా ।
స్వయం స్కంధావసక్తేన క్షేమ మాత్మని చింత్యతామ్ ॥ 35

పదచ్ఛేదము :– తత్ – అలం – కాలపాశేన – సీతావిగ్రహరూపిణా, స్వయం – స్కంధావసక్తేన – క్షేమమ్ – ఆత్మని – చింత్యతామ్ ॥

అన్వయక్రమము :– తత్ సీతావిగ్రహరూపిణా స్వయం స్కంధావసక్తేన కాలపాశేన అలమ్; ఆత్మని క్షేమం చింత్యతామ్.

ప్రతిపదార్థము :– తత్ = ఆ కారణమువలన, సీతావిగ్రహరూపిణా = సీతా స్వరూపమున నున్నట్టి, స్వయం = స్వయముగా, స్కంధావసక్తేన = మూపుపై వేసికొన్నట్టి, కాలపాశేన = యమపాశముచేత, అలమ్ = చాలును, ఆత్మని = నీవిషయమున, క్షేమం = మేలు, చింత్యతామ్ = ఆలోచింపబడుగాక!

తాత్పర్యము :– అందుచేత అజ్ఞానమువలన నీవు మెడపై వేసికొన్న ఈ సీతారూపమైన కాలపాశమును ఇప్పటికైనను గుర్తించుకొని విడిచిపెట్టి నీ యాత్మక్షేమమును గూర్చి ఆలోచించుకొనుము.

శ్లో॥ సీతాయా స్తేజసా దగ్ధాం రామకోపప్రపీడితామ్ ।
దహ్యమానా మిమాం పశ్య పురీం సాట్టప్రతోళికామ్ ॥ 36

పదచ్ఛేదము :– సీతయాః – తేజసా – దగ్ధాం – రామకోపప్రపీడితామ్, దహ్యమానామ్ – ఇమాం – పశ్య – పురీం – సాట్టప్రతోళికామ్ ॥

అన్వయక్రమము :– సాట్టప్రతోళికాం సీతాయాః తేజసా దగ్ధాం రామకోపప్రపీడితామ్ ఇమాం పురీం దహ్యమానాం పశ్య.

ప్రతిపదార్థము :– సాట్టప్రతోళికాం = కోటబురుజులతోను, రాజమార్గములతోడను గూడినదై, సీతయాః = సీతాదేవియొక్క, తేజసా = తేజస్సుచే, దగ్ధాం = దహింపబడినదియును, రామకోపప్రపీడితాం = శ్రీరాముని క్రోధముచే ధ్వంసము చేయబడినదైన, ఇమాం పురీం = ఈ లంకాపురిని, దహ్యమానాం = దహింపబడుచున్న దానినిగా, పశ్య = తెలిసికొనుము.

తాత్పర్యము :– సమస్తమైన కోట బురుజులతోడను, రాజవీథులతోడనుగూడిన ఈ లంకానగరము సీతాదేవియొక్క శోకాగ్నిచేతను శ్రీరాముని క్రోధముచేతను ధ్వంసమై అచిరకాలములో పూర్తిగా దహింపబడబోవుచున్నది అని ఇప్పుడే తెలిసికొనుము.

శ్లో॥ స్వాని మిత్రాణి మంత్రీంశ్చ జ్ఞాతీ న్భ్రాతౄ న్సుతా న్హితాన్ ।
భోగా న్దారాంశ్చ లంకాం చ మా వినాశ ముపానయ ॥ 37

పదచ్ఛేదము :– స్వాని – మిత్రాణి – మంత్రీన్ – చ – జ్ఞాతీన్ – భ్రాతౄన్ – సుతాన్ – హితాన్ – భోగాన్ – దారాన్ – చ – లంకాం – చ – మా – వినాశం – ఉపానయ ॥

అన్వయక్రమము :– స్వాని మిత్రాణి, మంత్రీన్ చ, జ్ఞాతీన్, భ్రాతౄన్, సుతాన్, హితాన్, భోగాన్, దారాన్ చ, లంకాం చ వినాశం మా ఉపానయ.

ప్రతిపదార్థము :– స్వాని మిత్రాణి = నీ స్నేహితులను, మంత్రీన్ చ = మంత్రులను, జ్ఞాతీన్ = జ్ఞాతులను, భ్రాతౄన్ = సోదరులను, సుతాన్ = పుత్రులను, హితాన్ = ఇష్టమైన, భోగాన్ = భోగములను, దారాన్ చ = భార్యలను, లంకాం చ = లంకను, వినాశం = వినాశనమును, మా ఉపానయ = పొందింపకుము.

తాత్పర్యము :– నీ స్నేహితులను మంత్రులను జ్ఞాతులను నీ సోదరులను పుత్రులను నీ ఇష్టమైన భోగములను నీ భార్యలను వేయేల నీలంకనంతను నిష్కారణముగా నాశనము జేసికొనకుము.

శ్లో॥ సత్యం రాక్షసరాజేంద్ర శృణుష్వ వచనం మమ ।
రామదాసస్య దూతస్య వానరస్య విశేషతః ॥ 38

పదచ్ఛేదము :– సత్యం – రాక్షసరాజేంద్ర – శృణుష్వ – వచనం – మమ, రామదాసస్య – దూతస్య – వానరస్య – విశేషతః ॥

అన్వయక్రమము :– రాక్షసరాజేంద్ర! రామదాసస్య దూతస్య వానరస్య మమ విశేషతః (ఉచ్యమానం) సత్యం వచనం శృణుష్వ.

ప్రతిపదార్థము :– రాక్షసరాజేంద్ర! = ఓ రాక్షసరాజోత్తమా! రామదాసస్య = శ్రీరామునకు దాసుడను, దూతస్య = దౌత్యమును నెఱవేర్చువాడను, వానరస్య = వానరజాతివాడను అగు, మమ = నాయొక్క, విశేషతః = విశేషించి (ఉచ్యమానం = చెప్పబడుచున్న) సత్యం వచనం = సత్యవచనమును, శృణుష్వ = వినుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– విశేషతః – నిష్కర్షచేసి చెప్పబడినది – అనగా తాను – రామదాసస్య – శ్రీరాముని మహిమను పూర్తిగా తెలిసినవాడననియును – దూతస్య – హితోపదేశాధికారము తనకు తన ప్రభువు వలన గలిగినదనియును – వానరస్య – మీ రాక్షసులయెడలగాని ఆ మనుష్యులయెడల గాని తాను పక్షపాతము లేనట్టివాడననియును హనుమయొక్క భావము అని గ్రహించవలెను.

తాత్పర్యము :– ఓ రాక్షసరాజా! శ్రీరామునకు దాసుడనై యున్నవాడను, దూతగా వచ్చినట్టివాడను, వానరజాతివాడను అగు నేను దూర మాలోచించి నిష్కర్షముగా చెప్పు మాటలను శ్రద్ధగా ఆలకించుము.

శ్లో॥ సర్వా న్లోకా న్సుసంహృత్య సభూతాన్ సచరాచరాన్ ।
పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశాః ॥ 39

పదచ్ఛేదము :– సర్వాన్ – లోకాన్ – సుసంహృత్య – సభూతాన్ – సచరాచరాన్ – పునః – ఏవ – తథా – స్రష్టుం – శక్తః – రామః – మహాయశాః ॥

అన్వయక్రమము :– సభూతాన్, సచరాచరాన్, సర్వాన్ లోకాన్ సుసంహృత్య

మహాయశాః రామః పునః తథా ఏవ స్రష్టుం శక్తః.

ప్రతిపదార్థము :– సభూతాన్ = పంచభూతములతో గూడినట్టివియును, సచరాచరాన్ = చరాచరములతో గూడినట్టివియు నగు, సర్వాన్ = సమస్తములైన, లోకాన్ = లోకములను, సుసంహృత్య = ఉపసంహరించి, పునః = తిరిగి, తథా ఏవ = ఆ రీతిగనే, స్రష్టుం = సృజించుటకు, మహాయశాః = మహాయశస్సంపన్నుడైన, స రామః = ఆ శ్రీరాముడు, శక్తః = సమర్థుడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– ఈ రీతి వర్ణనముచే శ్రీరాముడు సర్వజగత్తులయొక్క సృష్టిస్థితి సంహారములకు కర్తయై యున్నాడని బోధింపబడినది.

గోవిందరాజీయము :– సుసంహృత్య – ప్రళయావసానమున రుద్రుని మూలముననుు, స్వయముగను ఉపసంహరించి, స్రష్టుం – తిరిగి కల్పాదియందు 'ధాతా యథా పూర్వమకల్పయత్' అను శ్రుతివచనము ననుసరించి బ్రహ్మద్వారా సృష్టించుటకు సమర్థుడు అని చెప్పుచు అట్టి సామర్థ్యము రామునకు గలదని, మహాయశాః – అను పదముచే తెలుపుచు 'న తస్యేశే కశ్చన, తస్య నామ మహద్యశః' యను శ్రుతి ప్రమాణమును జ్ఞాపకము చేయుచున్నాడు.

వాసుదాసస్వామి :– ఈ శ్లోకము 'యతో వా ఇమాని భూతాని జాయంతే, యేన జాతాని జీవంతి, యత్ ప్రయం త్యభిసంవిశంతి, తద్బ్రహ్మేతి' అను శ్రుత్యర్థమును బోధించుచున్నది. ఇట్లు రామచంద్రమూర్తి పరత్వము చెప్పబడినది. అనేక కోటి బ్రహ్మాండములకంతయు ప్రథమకారణము ప్రథమాధికారి భగవంతు డొక్కడే. "ఏక మేవాద్వితీయం బ్రహ్మ" అన్నట్లు పరబ్రహ్మ ఒక్కడే. ఆ భగవంతుడే బ్రహ్మయందు ప్రవేశించి సృష్టికార్యము చేయును.

శ్రీరామశరణ్‌గారి రామోపాసనాసర్వస్వము :–

మహేశ్వరతంత్రములో బ్రహ్మ నారదునితో నిట్లనెను.

శ్లో॥ రామేణైవ జగత్సృష్టం రామేణైవ ప్రభూయతే ।
రామేణ స్థితి మాప్నోతి రామేణైవ ప్రలీయతే ।
రామా న్నాన్యత్పరం కించిత్సర్వం రామమయం జగత్ ॥

రామునిచేతనే జగత్తు సృష్టింపబడినది. రామునివలననే విస్తరింప చేయబడుచున్నది. రామునిచే పోషింపబడుచున్నది. రామునిచేతనే ప్రళయ

మొనర్పబడుచున్నది. ఈ జగత్తంతయును రామమయమే.

ఉపనిషత్తులలో –

“రామ ఏవ పరం బ్రహ్మ రామ ఏవ పరం తపః ।
రామ ఏవ పరం తత్త్వం శ్రీరామో బ్రహ్మ తారకమ్ ॥” అని చెప్పబడినది.

అనగా శ్రీరాముడే పరబ్రహ్మ, శ్రీరాముడే పరమతపము, శ్రీరాముడే పరమతత్త్వము. శ్రీరాముడు తారకపరబ్రహ్మ యని చెప్పబడినది.

వేదసారోపనిషత్తులో నిట్లు గలదు –

విరజాయాః పరే పారే లోకే వైకుంఠసంజ్ఞితే ।
తన్మధ్యే రాజతేఽయోధ్యా సచ్చిదానందరూపిణీ.
తత్ర లోకే చతుర్బాహూ రామనారాయణః ప్రభుః
అయోధ్యాయాం యథా చాస్య హ్యవతారో భవే దిహ,
తథాస్తి రామనామేద మవతారవిధో విభోః ॥

యాజ్ఞవల్క్యుడు జనకునితో నిట్లనెను –

“విరజానది కావల వైకుంఠమని పేరుగల లోకము గలదు. సచ్చిదానంద రూపిణియగు నయోధ్య దాని మధ్య విరాజిల్లుచుండును. అందు చతుర్బాహువులు గల్గిన రామనారాయణప్రభువు గలడు. అయోధ్యలో నుండు రాము డీయన యవతారమే. ఆయన తాను ఆ నామమునే యవతారకాలమునకూడ ధరించెను.

తాత్పర్యము :– పంచమహాభూతములతో కూడిన స్థావరజంగమాత్మకమైన ఈ సమస్త విశ్వమును అనంతశక్తిసంపన్నుదని కీర్తింపబడు శ్రీరాముడు తన ఇచ్ఛామాత్రముచే లయింపజేసి తిరిగి యథాపూర్వముగా సృజింపగల సామర్థ్యము గలవాడు సుమా ।

శ్లో॥ దేవాసురనరేంద్రేషు యక్షరక్షోగణేషు చ ।
విద్యాధరేషు సర్వేషు గంధర్వే షూరగేషు చ ।
సిద్ధేషు కిన్నరేంద్రేషు పతత్రిషు చ సర్వతః ।
యో రామం ప్రతియుధ్యేత విష్ణుతుల్యపరాక్రమమ్ ।
సర్వభూతేషు సర్వత్ర సర్వకాలేషు నాస్తి సః ॥ 40

పదచ్ఛేదము :– దేవాసురనరేంద్రేషు – యక్షరక్షోగణేషు – చ – విద్యాధరేషు – సర్వేషు – గంధర్వేషు – ఉరగేషు – చ, సిద్ధేషు – కిన్నరేంద్రేషు – పతత్రిషు – చ –

సర్వతః, సర్వభూతేషు – సర్వత్ర – సర్వకాలేషు – న – అస్తి – సః, యః – రామం – ప్రతియుధ్యేత – విష్ణుతుల్యపరాక్రమమ్ ॥

అన్వయక్రమము :– దేవాసురనరేంద్రేషు యక్షరక్షోగణేషు చ, విద్యాధరేషు, గంధర్వేషు, ఉరగేషు, సిద్ధేషు కిన్నరేంద్రేషు, పతత్రిషు, సర్వేషు చ, సర్వతః, సర్వభూతేషు, సర్వత్ర, సర్వకాలేషు విష్ణుతుల్యపరాక్రమం రామం యః ప్రతియుధ్యేత సః న అస్తి.

ప్రతిపదార్థము :– దేవాసురనరేంద్రేషు = దేవతలందును, రాక్షసులందును, అసురులందును, నరశ్రేష్ఠులందును, యక్షరక్షోగణేషు = యక్షుల యొక్కయు, రాక్షసుల యొక్కయు గణములయందును, విద్యాధరేషు = విద్యాధరులయందును, గంధర్వేషు = గంధర్వులయందును, ఉరగేషు చ = నాగులయందును, సిద్ధేషు = సిద్ధులయందును, కిన్నరేంద్రేషు = కిన్నరశ్రేష్ఠులందును, పతత్రిషు = పక్షులందును, సర్వేషు చ = సమస్తమైనవారియందును, సర్వతః = అన్ని యెడలను, సర్వకాలేషు = ఎల్లకాలములయందును, విష్ణుతుల్యపరాక్రమం = మహావిష్ణువుతో సాటియైన పరాక్రమము గల్గినట్టి, రామం = శ్రీరాముని, యః = ఎవ్వడు, ప్రతియుధ్యేత = ఎదిరించి పోరగలడో, సః = అట్టివాడు, న అస్తి = లేడు.

తాత్పర్యము :– శ్రీ మహావిష్ణువుతో సమానమైన పరాక్రమము గల్గినట్టి ఆ శ్రీరాము నెదిరించి నిలిచి యుద్ధము చేయగలవాడు దేవతలందుగాని, రాక్షసులందుగాని, పన్నగులందుగాని, సిద్ధులందుగాని, పక్షులందుగాని, ఎందును ఏకాలమునందును యే ప్రదేశమునందును, యే భూతములందును, ఎవ్వడును నుండ బోవడు సుమా!

శ్లో॥ సర్వలోకేశ్వర స్యైవం కృత్వా విప్రియ మీదృశమ్ ।
రామస్య రాజసింహస్య దుర్లభం తవ జీవితమ్ ॥ 41

పదచ్ఛేదము :– సర్వలోకేశ్వరస్య – ఏవం – కృత్వా – విప్రియమ్ – ఈదృశమ్, రామస్య – రాజసింహస్య – దుర్లభం – తవ – జీవితమ్ ॥

అన్వయక్రమము :– సర్వలోకేశ్వరస్య, రాజసింహస్య, రామస్య, ఈదృశం విప్రియం కృత్వా తవ జీవితం దుర్లభమ్.

ప్రతిపదార్థము :– సర్వలోకేశ్వరస్య = సమస్తమైన లోకములయొక్క ప్రభువైనవాడును, రాజసింహస్య = రాజులలో శ్రేష్ఠుడునగు, రామస్య = రామునకు, ఏవం = ఈరీతిగా, ఈదృశం = ఈ విధమైన, విప్రియం = అపకారమును, కృత్వా = చేసి, తవ = నీకు, జీవితం = జీవితము, దుర్లభమ్ = దుర్లభము.

తాత్పర్యము :- సమస్తలోకములకును ప్రభువైనవాడును, రాజులలో శ్రేష్ఠుడును అగు శ్రీరామునకు ఇట్టి అపకార మొనర్చినట్టి నీకు ప్రాణములతో నుండగలుగుట సాధ్యముగాదు సుమా!

శ్లో॥ దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేంద్ర
గంధర్వవిద్యాధరనాగయక్షాః ।
రామస్య లోకత్రయనాయకస్య
స్థాతుం న శక్తా స్సమరేషు సర్వే ॥ 42

పదచ్ఛేదము :- దేవాః - చ - దైత్యాః - చ - నిశాచరేంద్ర - గంధర్వవిద్యాధర నాగయక్షాః, రామస్య - లోకత్రయనాయకస్య - స్థాతుం - న శక్తాః - సమరేషు - సర్వే ॥

అన్వయక్రమము :- నిశాచరేంద్ర! లోకత్రయనాయకస్య రామస్య సమరేషు (అగ్రే) స్థాతుం సర్వే దేవాః చ దైత్యాః చ గంధర్వవిద్యాధరనాగయక్షాః చ శక్తాః న.

ప్రతిపదార్థము :- నిశాచరేంద్ర! = ఓ రాక్షసరాజా! లోకత్రయనాయకస్య = త్రిలోకములకు ప్రభువైనట్టి, రామస్య = శ్రీరామునకు, సమరేషు = యుద్ధములందు, (అగ్రే = ఎదుట) స్థాతుం = నిలుచుటకు, సర్వే = సమస్తమైన, దేవాః చ = దేవతలును, దైత్యాః చ = రాక్షసులును, గంధర్వవిద్యాధరనాగయక్షాః = గంధర్వులు విద్యాధరులు నాగులు యక్షలును గూడ, శక్తాః = సమర్థులు, న = కారు.

తాత్పర్యము :- ఓ రావణా! ముల్లోకములకును ప్రభువైనట్టి శ్రీరాముని ఎదిరించి రణరంగమునందు నిలబడుటకు సమర్థుడైనవాడు దేవతలలో గాని, దైత్యులలో గాని గంధర్వులందుగాని విద్యాధరులందుగాని నాగులందుగాని యక్షులందుగాని ఎవ్వడును లేడు సుమా!

శ్లో॥ బ్రహ్మా స్వయంభూ శ్చతురాననో వా
రుద్ర స్త్రినేత్ర స్త్రిపురాంతకో వా ।
ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా
త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్ ॥ 43

పదచ్ఛేదము :- బ్రహ్మా - స్వయంభూః - చతురాననః - వా - రుద్రః - త్రినేత్రః - త్రిపురాంతకః - వా - ఇంద్రః - మహేంద్రః - సురనాయకః - వా - త్రాతుం - న - శక్తాః - యుధి - రామవధ్యమ్ ॥

అన్వయక్రమము :- యుధి రామవధ్యం త్రాతుం స్వయంభూః చతురాననః బ్రహ్మా వా, త్రినేత్రః రుద్రః వా, మహేంద్రః సురనాయకః ఇంద్రో వా శక్తాః న.

ప్రతిపదార్థము :- యుధి = యుద్ధమునందు, రామవధ్యం = రామునిచే చంపబడవలసి యున్నట్టి వానిని, త్రాతుం = కాపాడుటకు, స్వయంభూః = స్వయముగనే ఉద్భవించినట్టి వాడును, చతురాననః = నాల్గు ముఖములు గల్గినట్టి వాడునగు, బ్రహ్మా వా = బ్రహ్మదేవుడుగాని, త్రినేత్రః = మూడుకన్నులు గలవాడును, త్రిపురాంతకః = త్రిపురాసురులను సంహరించినవాడు నగు, రుద్రః వా = రుద్రుడుగాని, మహేంద్రః = త్రిలోకప్రభువును, సురనాయకః = దేవతలకురాజు నగు, ఇంద్రో వా = దేవేంద్రుడు గాని, శక్తాః న = సమర్థులుగారు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము: సూచన :- ఈ శ్లోకమున 'పతత్ప్రకర్షము' అను దోషము నివారించుకొనుటకై చివరినుండి అన్వయించుకొనవలెను.

త్రిలోకాధిపతియు, వృత్రాసురసంహారియునగు దేవేంద్రుడుగాని, సమస్త దేవతలయొక్క సహాయముగల దేవేంద్రుడుగాని, అట్టి ఇంద్రుని మించిన మహాశక్తి గలిగినట్టి, ప్రళయకాలమున ప్రజలనందరను రోదింప చేయువాడును, తన తృతీయ నేత్రముతో మన్మథుని భస్మముజేసినవాడును, మహోగ్రబలశాలురైన త్రిపురాసురులను సంహరించినవాడునగు రుద్రుడుగాని, ఆ రుద్రునకు మూలమైనట్టి అనగా తండ్రియైనట్టి సమస్తవిశ్వమును వ్యాపించిన వాడును, స్వయంశక్తిచేతనే ఉద్భవించిన వాడును, ఒక్కమారుగనే నాల్గువేదములను ఉచ్చరింపగల ప్రభావాతిశయము గల బ్రహ్మదేవుడుగాని, వీరు విడిగానే గాక ముప్వురును గలసివచ్చినప్పటికిని, రామునకు వధ్యుడైనట్టి అపరాధిని రక్షించుటకు సమర్థులు గాజాలరు.

'స్థానవిత్ నిగ్రహస్య చ' అని పేరువడసిన శ్రీరామునికి అపరాధము చేసిన వానిని రక్షించుట కెవ్వరును సమర్థులుగారు. యుద్ధమునందు శ్రీరాముని ఎదిరించి, తాము పరులను రక్షింపజాలరు గాని, ఆ శ్రీరాముని శరణువేడినవారు గూడ పరులను రక్షింపగలరని సూచింపబడినది. ఇచ్చట ఇంద్రుడు రుద్రుడు, బ్రహ్మ యనెడి పరదేవతల కంటె శ్రీరాముడు మహిమోపేతుడని వేదాంతరహస్యము బోధింపబడినది. రక్షణ సమర్థులుగ ప్రధానులైన ముగ్గురిని చెప్పి విష్ణువును చెప్పకపోవుటచే, పరిశేష న్యాయమున శ్రీరాముడే మహావిష్ణువని వెల్లడింపబడినది.

మహేశ్వరతీర్థులు :- ఇంద్రః = పరమైశ్వర్యవంతుడు, మహేంద్రః = వృత్రాసురసంహారి,

'మహాన్ అయమభూత్ యో వృత్ర మవధీత్ ఇతి తన్మహేంద్రస్య మహేంద్రత్వం' అని శ్రుతి ప్రమాణము.

సురనాయకః :– సమస్త దేవతలతోగూడియున్నట్టివాడు, రుద్రః = సంహారకాలమున ప్రజలను రోదింపచేయువాడు, రుతము అనగా శబ్దము అనగా వేదము. ఆ వేదమును కల్పాదిని బ్రహ్మ కొసగినవాడు. నాదముచే సకల జగత్తును ద్రవింప చేయు వాడనగా రంజింపచేయువాడు. రుతముచే అనగా నాదముచే ప్రణవరూపమైన లేక వేదరూపమైన నాదముచే ఇష్టములైన అర్థములను ప్రసాదించువాడు. రుతము అనగా సంసారదుఃఖము లేదా ఆ దుఃఖకారణము, దానిని ద్రవింపచేయువాడు.

ఇందులకు ప్రమాణము – 'మత్ దుఃఖం దుఃఖహేతుం వా తద్రావయతి యత్ ప్రభుః రుద్ర ఇత్యుచ్యతే తస్మాత్ శివః పరమకారణమ్' ॥

త్రినేత్రః – శత్రు భస్మీకరణ సమర్థమైన ఫాలలోచనము గలవాడు, బ్రహ్మ – విశ్వము నంతటిని వ్యాపించి యుండువాడు. స్వయంభూః – పరతంత్రుడు గానివాడు, చతురాననః – బహుముఖకార్యనిర్వాహకశక్తివిశిష్టుడు అని భావము.

వాసుదాసస్వామి :– "హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే" యని బ్రహ్మదేవుడే పరదేవత యనియు "న సన్నచాసచ్ఛివ ఏవ కేవలః"యని రుద్రుడే పరదేవత యనియు "ఇంద్రో మాయాభిః పరరూప ఈయతే"యని ఇంద్రుడే పరదేవత యనియు వేదమున నీముగ్గురిని పరదేవతలుగా చెప్పియున్నను ఆ ముగ్గురికన్నను రాముడే పరాత్పరుడని ఇట చెప్పబడినది. వేదాంతమునందు సత్, బ్రహ్మ, ఆత్మ ఇత్యాదులైన సామాన్య శబ్దములున్నవి. వాటికన్నిటికి మూలతత్త్వము శ్రీరాములవారే. "ఇతి రామపదే నాసౌ పరబ్రహ్మాఽ భిధీయతే" యనినట్లు రామచంద్రమూర్తి త్రికాలసత్యమగు పరబ్రహ్మమని హనుమంతుడు చెప్పుచున్నాడు.

'స బ్రహ్మ స శివ స్సేంద్రః' యనుచో విష్ణువును చెప్పక యాయన పరత్వమును శ్రుతి సూచించు నట్టులిచట నా మువ్వురే చెప్పబడిరనియు వీరి మువ్వురికి పరుడైన వాడు శ్రీరాముడనియు సూచింపబడెను. అందుచే నీకు రక్షకము శ్రీరామశరణాగతియే యని భావము.

తాత్పర్యము :– స్వయంభువును చతుర్ముఖుడు నగు ఆ బ్రహ్మదేవుడు గాని, త్రినేత్రుడును త్రిపురాసురసంహారకుడును అగు రుద్రుడుగాని, మహేంద్రుడును దేవతలకు ప్రభువును అగు వజ్రపాణిగాని శ్రీరాముని యెడ అపరాధము గావించి అతనికి వధ్యుడైయున్నట్టి వానిని గాపాడుటకు సామర్థ్యము గలవారు కారు సుమా!

శ్లో॥ స సౌష్ఠవోపేత మదీనవాదినః
కపేర్నిశ మ్యాప్రతిమో ఽ ప్రియం వచః ।
దశాననః కోపవివృత్తలోచనః
సమాదిశత్తస్య వధం మహాకపేః ॥ 44

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"హనుమదుపదేశో" నామ
ఏకపంచాశస్సర్గః.

పదచ్ఛేదము :– సః – సౌష్ఠవోపేతమ్ – అదీనవాదినః – కపేః – నిశమ్య – అప్రతిమః – అప్రియం – వచః – దశాననః – కోపవివృత్తలోచనః – సమాదిశత్ – తస్య – వధం – మహాకపేః ॥

అన్వయక్రమము :– అదీనవాదినః కపేః అప్రియం సౌష్ఠవోపేతం వచః నిశమ్య అప్రతిమః సః దశాననః కోపవివృత్తలోచనః సన్ తస్య మహాకపేః వధం సమాదిశత్.

ప్రతిపదార్థము :– అదీనవాదినః = దైన్యములేకుండ మాటలాడువాడగు, కపేః = హనుమయొక్క, సౌష్ఠవోపేతం = ఔచిత్యముతో గూడినట్టి, అప్రియం = కటువైనట్టి, వచః = మాటను, నిశమ్య = విని, అప్రతిమః = సాటిలేనివీరుడైన, సః దశాననః= ఆ దశముఖుడు, కోపవివృత్తలోచనః సన్ = క్రోధముచే భీకరముగ తిరుగుచున్న కన్నులు గలవాడై, తస్య మహాకపేః = ఆ మహావానరుడైన హనుమయొక్క, వధం = వధనుగూర్చి, సమాదిశత్ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :– ఎట్టి దైన్యభావము లేకుండ అతిసముచితముగ మాటలాడిన ఆ హనుమ పలికిన అప్రియమైన వచనములను ఆలకించి నిరుపమానపరాక్రమశాలి యగు ఆ దశముఖుడు క్రోధముచే కన్నులు భయంకరముగా తిరిగిపోవుచుండగా నెదుటనున్న ఆ మహావానరుని వెంటనే వధింపుడని ఆజ్ఞాపించెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"హనుమదుపదేశము" అను
ఏబదియొకటవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

ద్విపంచాశసర్గ

శ్లో॥ తస్య తద్వచనం శ్రుత్వా వానరస్య మహాత్మనః ।
ఆజ్ఞాపయ త్తస్య వధం రావణః క్రోధమూర్ఛితః ॥ 1

పదచ్ఛేదము :– తస్య – తత్ – వచనం – శ్రుత్వా – వానరస్య – మహాత్మనః – ఆజ్ఞాపయత్ – తస్య – వధం – రావణః – క్రోధమూర్ఛితః ॥

అన్వయక్రమము :– మహాత్మనః తస్య వానరస్య తత్ వచనం శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః సన్ తస్య వధమ్ ఆజ్ఞాపయత్.

ప్రతిపదార్థము :– మహాత్మనః = మహనీయుడైనట్టి, తస్య వానరస్య = ఆ హనుమయొక్క, తత్ వచనం = ఆ మాటను, శ్రుత్వా = విని, రావణః = రావణుడు, క్రోధమూర్ఛితః = క్రోధవివశుడై, తస్య = ఆ హనుమయొక్క, వధమ్ = వధను, ఆజ్ఞాపయత్ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :– మహాత్ముడైన హనుమ పలికిన మాటలను విని రావణుడు క్రోధావేశము నొంది వెంటనే అతనిని వధింపుడని భటులకు ఆజ్ఞాపించెను.

శ్లో॥ వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా ।
నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః ॥ 2

పదచ్ఛేదము :– వధే – తస్య – సమాజ్ఞప్తే – రావణేన – దురాత్మనా – నివేదితవతః – దౌత్యం – న – అనుమేనే – విభీషణః ॥

అన్వయక్రమము :– దురాత్మనా రావణేన దౌత్యం నివేదితవతః తస్య వధే సమాజ్ఞప్తే (సతి) విభీషణః (తం) న అనుమేనే.

ప్రతిపదార్థము :– దురాత్మనా = దుర్మార్గుడైనట్టి, రావణేన = రావణునిచే, దౌత్యం = ప్రభుసందేశమును, నివేదితవతః = విన్నవించినట్టి, తస్య = ఆ హనుమయొక్క, వధే = వధ, సమాజ్ఞప్తే (సతి) = ఆజ్ఞాపింపబడగా, విభీషణః = విభీషణుడు (తం = ఆ వధను), న అనుమేనే = అనుమతించలేదు.

తాత్పర్యము :- దూతకృత్యముగా తన ప్రభువుయొక్క సందేశమును వినిపించినట్టి హనుమకు దుర్మార్గుడైన రావణుడు మరణదండన మాజ్ఞాపించగా దానికి విభీషణుడు సమ్మతించలేదు.

శ్లో॥ తం రక్షోధిపతిం క్రుద్ధం తచ్చ కార్యముపస్థితమ్ ।
విదిత్వా చింతయామాస కార్యం కార్యవిధౌ స్థితః ॥ 3

పదచ్ఛేదము :- తం - రక్షోధిపతిం - క్రుద్ధం - తత్ - చ - కార్యమ్ - ఉపస్థితమ్, విదిత్వా - చింతయామాస - కార్యం - కార్యవిధౌ - స్థితః ॥

అన్వయక్రమము :- కార్యవిధౌ స్థితః (సః)తం రక్షోధిపతిం క్రుద్ధమ్, ఉపస్థితం తత్ కార్యం చ విదిత్వా కార్యం చింతయామాస.

ప్రతిపదార్థము :- కార్యవిధౌ = కృత్యవిధానమునందు, స్థితః = ఉన్నట్టివాడైన, (సః = ఆ విభీషణుడు), తం రక్షోధిపతిం = ఆ రాక్షసరాజైన రావణుని, క్రుద్ధమ్ = కోపించియున్నవానినిగను, ఉపస్థితం = సమీపించియున్న, తత్ కార్యం చ = ఆ పనిని - అనగా - దూతవధను గూర్చియు, విదిత్వా = తెలిసికొని, కార్యం = కార్యమునుగూర్చి, చింతయామాస = ఆలోచించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- కార్యవిధౌ స్థితః - ప్రస్తుతకర్తవ్యాచరణమున దృఢచిత్తుడైయున్న వాడును, మంచి చెడ్డలను వివేకించి కార్యము నిర్ణయము చేయగల్గిన వాడును అని భావము.

తాత్పర్యము :- కార్యనిర్వహణమునందు దృఢమైన నిశ్చయము గల్గినట్టి ఆ విభీషణుడు అప్పుడు రాక్షసరాజు క్రోధావిష్టుడై యుండుటచే తాను తలపెట్టిన దూతవధ నివారణమనెడి అప్పటి కార్యము జాగరూకతతో నిర్వహింపవలసియున్నదని చక్కగా తెలిసికొని ఆ కర్తవ్యమును గూర్చి ఆలోచింపసాగెను.

శ్లో॥ నిశ్చితార్థ స్తత స్సామ్నా పూజ్యం శత్రుజిదగ్రజమ్ ।
ఉవాచ హిత మత్యర్థం వాక్యం వాక్యవిశారదః ॥ 4

పదచ్ఛేదము :- నిశ్చితార్థః - తతః - సామ్నా - పూజ్యం - శత్రుజిదగ్రజమ్ - ఉవాచ - హితమ్ - అత్యర్థం - వాక్యం - వాక్యవిశారదః ॥

అన్వయక్రమము :- తతః నిశ్చితార్థః వాక్యవిశారదః సః పూజ్యం శత్రుజిదగ్రజం

సామ్నా అత్యర్థం హితం వాక్యమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, నిశ్చితార్థః = నిశ్చయింపబడిన విషయము గలవాడును, వాక్యవిశారదః = మాటనేర్పుగలవాడునగు, సః = ఆ విభీషణుడు,పూజ్యం = పూజనీయుడైనట్టి, శత్రుజిదగ్రజం = శత్రువులను జయించువాడైన అన్నను గూర్చి, సామ్నా = మంచిమాటతో, అత్యర్థం = మిక్కిలి, హితం = మేలైనట్టి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :– 'శత్రుజిత్' అని విడదీసి శత్రుజిత్తు అయిన విభీషణుడని అర్థము చెప్పి 'అపూజ్యం' అని విడదీసి పూజింపదగని అని రావణునకు విశేషణముచేసి – శత్రుజిత్ విభీషణః, అపూజ్యం రావణం ఉవాచ – అని అన్వయించవలెను.

తాత్పర్యము :– ప్రస్తుత కర్తవ్యమును చక్కగా నిశ్చయించుకొన్నవాడై చక్కని మాటనేర్పు గలిగినట్టి ఆ విభీషణుడప్పుడు వీరుడును పూజ్యుడునగు తన యన్నతో మంచిమాటలతో అతనికి మేలుగూర్చునట్టి వచనముల నీ రీతిగ పలికెను.

శ్లో॥ క్షమస్వ రోషం త్యజ రాక్షసేంద్ర
ప్రసీద మద్వాక్య మిదం శృణుష్వ ।
వధం న కుర్వంతి పరావరజ్ఞా
దూతస్య సంతో వసుధాధిపేంద్రాః ॥ **5**

పదచ్ఛేదము :– క్షమస్వ – రోషం – త్యజ – రాక్షసేంద్ర – ప్రసీద – మద్వాక్యమ్ – ఇదం – శృణుష్వ – వధం – న – కుర్వంతి – పరావరజ్ఞాః – దూతస్య – సంతః – వసుధాధిపేంద్రాః ॥

అన్వయక్రమము :– రాక్షసేంద్ర! క్షమస్వ, రోషం త్యజ, ప్రసీద, ఇదం మద్వాక్యం శృణుష్వ, పరావరజ్ఞాః సంతః వసుధాధి పేంద్రాః దూతస్య వధం న కుర్వంతి.

ప్రతిపదార్థము :– రాక్షసేంద్ర! = ఓ రాక్షసరాజా, క్షమస్వ = మన్నింపుము, రోషం = క్రోధమును, త్యజ = విడువుము, ప్రసీద = ప్రసన్నుడవగుము, ఇదం మద్వాక్యం = ఈ నామాటను, శృణుష్వ = ఆలకింపుము, పరావరజ్ఞాః = మంచిచెడ్డలు తెలిసినట్టి, సంతః = సత్పురుషులైనట్టి, వసుధాధిపేంద్రాః = రాజశ్రేష్ఠులు, దూతస్య = దూతయొక్క, వధం = వధను, న కుర్వంతి = చేయరు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- క్షమస్వ రోషం - క్రోధమును సహింపుము. త్యజ - దూతవధనిమిత్తమై చేసిన ఆజ్ఞను విడువుము. పరావరజ్ఞాః - సమస్తకార్యవిషయములందు ఉత్కర్షాపకర్షముల నెఱిగినవారు.

గోవిందరాజీయము, మహేశ్వరతీర్థులు :- పరావరజ్ఞాః - త్యజింపదగినది, గ్రహింపదగినది అను వాని భేదమును గూర్చి బాగుగా తెలిసినట్టివారు.

తాత్పర్యము :- ఓ రాక్షసరాజా! క్షమింపుము. క్రోధమును వీడుము. అనుగ్రహము చూపుము. నేను చెప్పుమాటను శ్రద్ధగ వినుము. మంచి చెడు విషయములయొక్క తారతమ్యము నెఱిగినట్టి ఉత్తములైన రాజశ్రేష్ఠులు దూతను వధింపబూనరు.

శ్లో॥ రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తే శ్చ గర్హితమ్ ।
తవ చాసదృశం వీర కపే రస్య ప్రమాపణమ్ ॥ 6

పదచ్ఛేదము :- రాజధర్మవిరుద్ధం - చ - లోకవృత్తేః - చ - గర్హితమ్, తవ - చ - అసదృశం - వీర - కపేః - అస్య - ప్రమాపణమ్ ॥

అన్వయక్రమము :- వీర! అస్య కపేః ప్రమాపణం, రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తేః గర్హితం చ, తవ అసదృశం చ భవతి.

ప్రతిపదార్థము :- వీర! = ఓ వీరుడా!, అస్య కపేః = ఈ వానరునియొక్క ప్రమాపణం = సంహారము, రాజధర్మవిరుద్ధం చ = రాజధర్మమునకు విరుద్ధమైనట్టిదియును, లోకవృత్తేః = లోకముయొక్క నడవడికి, గర్హితం చ = నిందితమైనదియును, తవ = నీకు, అసదృశం చ = అనుచితమైనట్టిదియును, భవతి = అగును.

సూచన:- 'రాజధర్మవిరుద్ధం' అనుటకు బదులుగా 'రాజన్! ధర్మవిరుద్ధం' అని పాఠాంతరము.

తాత్పర్యము :- ఓ మహావీరుడా! ఇప్పుడీ దూతయైన వానరుని వధించుట రాజధర్మమున కెంతయును విరుద్ధమైనట్టిది, మఱియును లోకవ్యవహారమున గూడ నింద్యమైన విషయమగును,పైగా నీవంటి వానికి ఎంత మాత్రము ఇది ఉచితమైనది గాదు సుమా!

శ్లో॥ ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ రాజధర్మవిశారదః ।
పరావరజ్ఞో భూతానాం త్వమేవ పరమార్థవిత్ ॥ 7

పదచ్ఛేదము :- ధర్మజ్ఞః - చ - కృతజ్ఞః - చ - రాజధర్మవిశారదః, పరావరజ్ఞః - భూతానాం - త్వమ్ - ఏవ - పరమార్థవిత్ ॥

అన్వయక్రమము :- త్వమ్ ఏవ ధర్మజ్ఞః, కృతజ్ఞః చ, రాజధర్మవిశారదః చ, భూతానాం పరమార్థవిత్, పరావరజ్ఞః చ.

ప్రతిపదార్థము :- త్వమ్ ఏవ = నీవే, ధర్మజ్ఞః = ధర్మము తెలిసినవాడవు, కృతజ్ఞః చ = కృతజ్ఞుడవును, రాజధర్మవిశారదః చ = రాజధర్మములందు కోవిదుడవును, భూతానాం = ప్రాణులయొక్క, పరమార్థవిత్ = సారమును తెలిసినవాడవు, పరావరజ్ఞః = మహత్త్వము అల్పత్వము అను తారతమ్యము తెలిసివాడవు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :- పై శ్లోకమునందు చెప్పిన నీవంటివానికి అనున దిచ్చట వివరింపబడుచున్నది. ధర్మజ్ఞుడవు, కృతజ్ఞుడవు, రాజధర్మవిశేషజ్ఞుడవు, పరావరజ్ఞుడవు, సారజ్ఞుడవు గనుక నీవు దూతవధను అంగీకరింపరాదని భావము.

తాత్పర్యము :- రాజా! నీవు ధర్మజ్ఞుడవు. పరులు చేసిన మంచిచెడ్డలను గుర్తింపగలవాడవు. రాజధర్మనిపుణుడవు. గొప్ప విషయము హీనవిషయ మను విచక్షణ నెఱిగినవాడవు గాన సర్వప్రాణుల తత్త్వము నీకే సంపూర్ణముగ తెలియును గదా!

శ్లో॥ గృహ్యంతే యది రోషేణ త్వాదృశోఽపి విపశ్చితః ।
తత శ్శాస్త్రవిపశ్చిత్త్వం శ్రమ ఏవ హి కేవలమ్ ॥ 8

పదచ్ఛేదము :- గృహ్యంతే - యది - రోషేణ - త్వాదృశః - అపి - విపశ్చితః, తతః - శాస్త్రవిపశ్చిత్త్వం - శ్రమః - ఏవ - హి - కేవలమ్ ॥

అన్వయక్రమము :- త్వాదృశః విపశ్చితః అపి రోషేణ గృహ్యంతే యది తతః శాస్త్రవిపశ్చిత్త్వం కేవలం శ్రమః ఏవ హి.

ప్రతిపదార్థము :- త్వాదృశః = నీవంటివారయిన, విపశ్చితః అపి = విద్వాంసులుగూడ, రోషేణ = క్రోధముచే, గృహ్యంతే యది = పట్టుబడుదురేని, తతః = ఆ కారణమున, శాస్త్రవిపశ్చిత్త్వం = శాస్త్రములందు పాండిత్యము, కేవలం = కేవలము, శ్రమః ఏవ హి = ప్రయాసము మాత్రమే గదా!

తాత్పర్యము :- నీ వంటి ప్రాజ్ఞుడు గూడ ఇట్లు క్రోధావేశమునకు లోబడిపోయినచో ఈ శాస్త్రములయందలి పాండిత్యమంతయు కేవలము ప్రయాసము మాత్రమే యనుకొనవలసి వచ్చును గదా!

శ్లో॥ తస్మా త్ప్రసీద శత్రుఘ్న రాక్షసేంద్ర దురాసద ।
యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతే దండో విధీయతామ్ ॥ 9

పదచ్ఛేదము :- తస్మాత్ - ప్రసీద - శత్రుఘ్న - రాక్షసేంద్ర - దురాసద - యుక్తాయుక్తం - వినిశ్చిత్య - దూతే - దండః - విధీయతామ్ ॥

అన్వయక్రమము :- తస్మాత్ హే శత్రుఘ్న! రాక్షసేంద్ర! దురాసద! ప్రసీద, యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతే దండః విధీయతామ్.

ప్రతిపదార్థము :- తస్మాత్ = అందువలన, హే శత్రుఘ్న = ఓ శత్రుదమనుడా!, రాక్షసేంద్ర! = ఓ రాక్షసరాజా!, దురాసద! = చేరశక్యముగానివాడా!, ప్రసీద = శాంతించుము, యుక్తాయుక్తం = మంచి చెడ్డలను, వినిశ్చిత్య = నిర్ణయించి, దూతే = దూతయెడ, దండః = శిక్ష, విధీయతామ్ = విధింపబడుగాక!

తాత్పర్యము :- ఓ రాక్షసరాజా! నీవు శత్రుంజయుడవు. శత్రువులు నిన్ను జేరుటకే వెఱతురు. అందుకే ఈ దూతయెడల ప్రసన్నుడవు గమ్ము. యుక్తాయుక్తములను చక్కగ నిర్ణయించి దూతకు విధింపవలసిన ఒక శిక్షను ఆజ్ఞాపింపుము.

శ్లో॥ విభీషణవచ శ్ర్శుత్వా రావణో రాక్షసేశ్వరః ।
రోషేణ మహతాఽఽవిష్టో వాక్య ముత్తర మబ్రవీత్ ॥ 10

పదచ్ఛేదము :- విభీషణవచః - శ్రుత్వా - రావణః - రాక్షసేశ్వరః - రోషేణ - మహతా - ఆవిష్టః - వాక్యమ్ - ఉత్తరమ్ - అబ్రవీత్ ॥

అన్వయక్రమము :- విభీషణవచః శ్రుత్వా రాక్షసేశ్వరః రావణః మహతా రోషేణ ఆవిష్టః ఉత్తరం వాక్యమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :- విభీషణవచః = విభీషణుని మాటను, శ్రుత్వా = విని, రాక్షసేశ్వరః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, మహతా = గొప్పదైన, రోషేణ = క్రోధముచే, ఆవిష్టః = ఆవేశింపబడినవాడై, ఉత్తరం = సమాధానమైన, వాక్యం = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- రాక్షసరాజైన రావణుడు, విభీషణుడు చెప్పిన మాటను విని, తీవ్రమైన క్రోధావేశమునొంది సమాధానముగా నిట్లు పలికెను.

శ్లో॥ న పాపానాం వధే పాపం విద్యతే శత్రుసూదన ।
తస్మాదేనం వధిష్యామి వానరం పాపకారిణమ్ ॥ 11

పదచ్ఛేదము :- న - పాపానాం - వధే - పాపం - విద్యతే - శత్రుసూదన - తస్మాత్ - ఏనం - వధిష్యామి - వానరం - పాపకారిణమ్ ॥

అన్వయక్రమము :- హే శత్రుసూదన! పాపానాం వధే పాపం న విద్యతే. తస్మాత్ పాపకారిణమ్ ఏనం వధిష్యామి.

ప్రతిపదార్థము :- శత్రుసూదన! = ఓ శత్రుసంహారకుడా!, పాపానాం = పాపాత్ములయొక్క, వధే = వధయందు, పాపం = పాపము, న విద్యతే = ఉండదు, తస్మాత్ = అందువలన, పాపకారిణం = పాపము చేసినట్టి, ఏనం వానరం = ఈ వానరుని, వధిష్యామి = వధించెదను.

తాత్పర్యము :- శత్రుసంహారకుడవైన తమ్ముడా! పాపాత్ములను సంహరించుటలో పాపమేమియు లేదు కాబట్టి మనకు ద్రోహము తలపెట్టి పాపముల నాచరించినట్టి ఈ వానరుని నే నిప్పుడే వధించెదను.

శ్లో॥ అధర్మమూలం బహుదోషయుక్త
మనార్యజుష్టం వచనం నిశమ్య ।
ఉవాచ వాక్యం పరమార్థతత్త్వం
విభీషణో బుద్ధిమతాం వరిష్ఠః ॥ 12

పదచ్ఛేదము :- అధర్మమూలం - బహుదోషయుక్తమ్ - అనార్యజుష్టం - వచనం - నిశమ్య - ఉవాచ - వాక్యం - పరమార్థయుక్తం - విభీషణః - బుద్ధిమతాం - వరిష్ఠః ॥

అన్వయక్రమము :- అధర్మమూలం బహుదోషయుక్తమ్ అనార్యజుష్టం (రావణస్య) వచనం నిశమ్య బుద్ధిమతాం వరిష్ఠః విభీషణః పరమార్థతత్త్వం వాక్యం ఉవాచ.

ప్రతిపదార్థము :- అధర్మమూలం = అధర్మమునకు మూలమైనట్టిదియును, బహుదోషయుక్తం = అనేక దోషములతో గూడినదియును, అనార్యజుష్టం = దుష్టులచే సేవింపబడినదియునగు, రావణస్య = రావణునియొక్క, వచనం = మాటను, నిశమ్య = విని, బుద్ధిమతాం = బుద్ధిమంతులలో, వరిష్ఠః = శ్రేష్ఠుడైనట్టి, విభీషణః = విభీషణుడు, పరమార్థతత్త్వం = పరమార్థమైన సారముగల్గినట్టి, వాక్యం = వచనమును, ఉవాచ = పలికెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

సూచన :- 'బహురోషయుక్తం' అని పాఠాంతరము.

తాత్పర్యము :- అధర్మములకు కారణమైనదియును, అపకీర్తి మున్నగు అనేకమైన గొప్ప దోషములతో నిండినదియును, దుర్మార్గులు మాత్రమే అనుసరించునదియునగు రావణునియొక్క ఆ నిశ్చయమును విని ప్రాజ్ఞులలో ఎన్నదగినవాడైన విభీషణుడు పరమార్థసారమైనట్టి వచనములను అన్నతో నిట్లు పలికెను.

శ్లో॥ ప్రసీద లంకేశ్వర రాక్షసేంద్ర
ధర్మార్థయుక్తం వచనం శృణుష్వ ।
దూతా నవధ్యాన్ సమయేషు రాజన్
సర్వేషు సర్వత్ర వదంతి సంతః ॥ 13

పదచ్ఛేదము :- ప్రసీద - లంకేశ్వర - రాక్షసేంద్ర ! - ధర్మార్థయుక్తం - వచనం - శృణుష్వ - దూతాన్ - అవధ్యాన్ - సమయేషు - రాజన్ - సర్వేషు - సర్వత్ర - వదంతి - సంతః ॥

అన్వయక్రమము :- రాక్షసేంద్ర! లంకేశ్వర! ప్రసీద, ధర్మార్థయుక్తం వచనం, శృణుష్వ, రాజన్! సర్వేషు సమయేషు సర్వత్ర సంతః దూతాన్ అవధ్యాన్ వదంతి.

ప్రతిపదార్థము :- లంకేశ్వర! = ఓ లంకాధిపతీ! రాక్షసేంద్ర = రాక్షసరాజా! ప్రసీద = ప్రసన్నుడవగుము, ధర్మార్థయుక్తం = ధర్మముతోడను అర్థముతోడను గూడినట్టి, వచనం = మాటను, శృణుష్వ = వినుము, రాజన్ = ఓ రాజా! సర్వేషు సమయేషు = అన్నియెడలను, సర్వత్ర = అన్నివిషయములందును, సంతః = సత్పురుషులు, దూతాన్ = దూతలను, అవధ్యాన్ = చంపదగనివారినిగా, వదంతి = చెప్పుదురు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- సమయేషు - తన ప్రభువు నియోగించిన కృత్యమును తన ధర్మముగా అనుష్ఠించు కాలములందు అని భావము.

గోవిందరాజీయము :- సర్వత్ర - అన్ని జాతులయందును అనగా దూత ఏ జాతివాడైనను యని భావము.

తాత్పర్యము :- ఓ లంకాధిపతీ! రాక్షసరాజా! ఈ దూతయెడల ప్రసన్నుడవుగమ్ము. ధర్మసమ్మతమును అర్థసమ్మతమునగు నేను చెప్పు మాటల నాలకింపుము. ఎల్లయెడలను తన ప్రభువు పంపున దూతకృత్యమునకై వచ్చినవా డెట్టివాడైనను వానిని చంపగూడదని ధర్మజ్ఞులైన పెద్దలు వక్కాణింతురు గదా!

శ్లో॥ అసంశయం శత్రు రయం ప్రవృద్ధః
కృతం హ్యనే నాప్రియ మప్రమేయమ్ ।
న దూతవధ్యాం ప్రవదంతి సంతో
దూతస్య దృష్టా బహవో హి దండాః ॥ **14**

పదచ్ఛేదము :- అసంశయం – శత్రుః – అయం – ప్రవృద్ధః – కృతం – హి – అనేన – అప్రియమ్ – అప్రమేయమ్ – న – దూతవధ్యాం – ప్రవదంతి – సంతః – దూతస్య – దృష్టాః – బహవః – హి – దండాః ॥

అన్వయక్రమము :- అసంశయమ్ అయం ప్రవృద్ధః శత్రుః. అనేన అప్రమేయమ్ అప్రియం కృతం హి. సంతః దూతవధ్యాం న ప్రవదంతి. దూతస్య దండాః బహవః దృష్టాః హి.

ప్రతిపదార్థము :- అసంశయం = నిస్సంశయంగా, అయం = ఈతడు, ప్రవృద్ధః = పెచ్చు పెరిగినట్టి, శత్రుః = శత్రువు. అనేన = వీనిచే, అప్రమేయం = అపరిమితమైనట్టి, అప్రియం = అనిష్టము, కృతం హి = చేయబడినది సుమా. సంతః = సత్పురుషులు, దూతవధ్యాం = దూతయొక్క మరణమును, న ప్రవదంతి = చెప్పుటలేదు. దూతస్య = దూతకు, దండాః = దండములు, బహవః = పలువిధములు, దృష్టాః హి = కనబడుచున్నవిగదా!

తాత్పర్యము :- రాజా! నిస్సంశయముగా ఈ వానరుడు పెచ్చుపెరిగిపోయినట్టి ఘోరశత్రువే అయియున్నాడు. మఱియు నితడు ఇంత యంత అనరాని గొప్ప అనిష్టమునే మనకు కల్గించినవాడుకూడను. అయినప్పటికిని దూతను వధించుటకు పెద్దలెవ్వరును సమ్మతింపరు. ధర్మశాస్త్రములందు చూచినను దూతకు వధ గాక ఇతరశిక్షలు ఎన్నియో గాన్పించుచున్నవి గదా!

శ్లో॥ వైరూప్య మంగేషు కశాభిఘాతో
మౌండ్యం తథా లక్షణసన్నిపాతః ।
ఏతాన్ హి దూతే ప్రవదంతి దండాన్
వధస్తు దూతస్య న నః శ్రుతోఽపి ॥ **15**

పదచ్ఛేదము :- వైరూప్యమ్ – అంగేషు – కశాభిఘాతః – మౌండ్యం – తథా – లక్షణసన్నిపాతః – ఏతాన్ – హి – దూతే – ప్రవదంతి – దండాన్ – వధః – తు – దూతస్య – న – నః – శ్రుతః – అపి ॥

అన్వయక్రమము :- అంగేషు వైరూప్యం, కశాభిఘాతః, మౌణ్ద్యం, తథా లక్షణ సన్నిపాతః, ఏతాన్ హి దూతే దండాన్ ప్రవదంతి, దూతస్య వధః తు నః శ్రుతః అపి న.

ప్రతిపదార్థము :- అంగేషు = అవయవములందు, వైరూప్యం = వికృతి గల్గించుటయును, కశాభిఘాతః = కొరడాతో కొట్టుటయును, మౌణ్ద్యం = ముండనమును, తథా = అట్లే, లక్షణసన్నిపాతః = లజ్జాకరమైన గుర్తులను వేయుటయును, ఏతాన్ హి = వీనినిగదా, దూతే = దూతయెడల, దండాన్ = దండనములుగా, ప్రవదంతి = చెప్పుచున్నారు. దూతస్య = దూతయొక్క, వధః తు = వధ మాత్రము, నః = మనకు, శ్రుతః అపి = వినబడినది గూడ, న = లేదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- లక్షణసన్నిపాతః - దూతయొక్క ముఖము మున్నగు అవయవములందు స్థిరముగ నిలచియుండునట్లుగా కాల్చి అవమానకరమైన ముద్రలు వేయుట, అని ఒకరు అనగా మహేశ్వరతీర్థులు ముండనము మున్నగు వానిలో ఒకానొక్కటి విధించుటగాని లేక అన్ని దండనములను విధించుట గాని (సన్నిపాతః అను శబ్దముచే) అని చెప్పుచున్నారు.

రా. శిరోమణి :- వైరూప్యం = ముక్కు కోయుట మున్నగు అవయవచ్ఛేదము, మౌణ్ద్యం = కనుబొమ్మలతో సహితముగా వపనము చేయించుట, లక్షణసన్నిపాతః - రాగి ముద్రను కాల్చి నుదురు మున్నగు వానియందు గుర్తులు వేయుట.

తాత్పర్యము :- నాసిక మున్నగు అవయవములను ఖండించి వికృతరూపుని చేయుట, కొరడాతో దెబ్బలు కొట్టుట, సర్వాంగముండనము గావించుట, అపరాధచిహ్నముగా కాల్చి అవమానకరమైన ముద్రలు వేయుట అనువానిని దూతకు విధించవలసిన శిక్షలుగా పెద్దలు చెప్పుచున్నారు గదా! దూతకు మరణదండనము మన మెచ్చటనైన వినియున్నామా?

శ్లో॥ కథం చ ధర్మార్థవినీతబుద్ధిః
పరావరప్రత్యయనిశ్చితార్థః ।
భవద్విధః కోపవశే హి తిష్ఠే
త్కోపం నియచ్ఛంతి హి సత్త్వవంతః ॥ 16

పదచ్ఛేదము :- కథం - చ - ధర్మార్థవినీతబుద్ధిః - పరావరప్రత్యయనిశ్చితార్థః -

భవద్విధః – కోపవశే – హి – తిష్ఠేత్ – కోపం – నియచ్ఛంతి – హి – సత్త్వవంతః ॥

అన్వయక్రమము :– ధర్మార్థవినీతబుద్ధిః పరావరప్రత్యయనిశ్చితార్థః భవద్విధః కోపవశే కథం హి తిష్ఠేత్? సత్త్వవంతః కోపం నియచ్ఛంతి హి.

ప్రతిపదార్థము :– ధర్మార్థవినీతబుద్ధిః = ధర్మమునందును అర్థమునందును శిక్షణము పొందినట్టి బుద్ధిగలవాడవై, పరావరప్రత్యయనిశ్చితార్థః = ఘనమైనది, అల్పమైనది యను వివేకముతో నిర్ణయించుకొన్న విషయములు గల్గిన, భవద్విధః = నీవంటివాడు, కథం హి = ఎట్లుగా, కోపవశే = క్రోధముయొక్క యధీనమునందు, తిష్ఠేత్ = నిలుచును? సత్త్వవంతః = శక్తిమంతులైనవారు, కోపం = క్రోధమును, నియచ్ఛంతి హి = అణచి వేయుదురుగదా!

తాత్పర్యము :– ధర్మము అర్థము అను పురుషార్థములు రెండింటియందును చక్కని శిక్షణము నొందిన వాడవును, యుక్తాయుక్త వివేకముతో సర్వ విషయములను నిశ్చయింపగలవాడవు నగు నీవంటి వాడే క్రోధమునకు లొంగిపోవుట ఏమి ఉచిత మగును? శక్తిమంతులైన ధీరులు తమ క్రోధమును తాము వివేకముతో అణచు కొందురు కదా!

శ్లో॥ న ధర్మవాదే న చ లోకవృత్తే
న శాస్త్రబుద్ధిగ్రహణేషు చాపి ।
విద్యేత కశ్చిత్తవ వీర తుల్యా
స్త్వం హ్యుత్తమ స్సర్వసురాణామ్ ॥ 17

పదచ్ఛేదము :– న – ధర్మవాదే – న – చ – లోకవృత్తే – న – శాస్త్రబుద్ధిగ్రహణేషు – చ – అపి, విద్యేత – కశ్చిత్ – తవ – వీర – తుల్యాః – త్వం – హి – ఉత్తమః – సర్వసురాసురాణామ్ ॥

అన్వయక్రమము :– వీర! ధర్మవాదే తవ తుల్యాః న అస్తి, లోకవృత్తే చ న, శాస్త్రబుద్ధి గ్రహణేషు చ అపి తవ తుల్యాః కశ్చిత్ న విద్యేత. సర్వసురాసురాణాం త్వం హి ఉత్తమః.

ప్రతిపదార్థము :– వీర! = ఓ వీరుడా!, ధర్మవాదే = ధర్మప్రవచనమునందు, తవ = నీకు, తుల్యాః = సమానుడు, కశ్చిత్ = ఒక్కడును, న విద్యతే = లేడు, లోకవృత్తే చ = లోకవ్యవహారమునందును, న విద్యేత = ఉండడు, శాస్త్రబుద్ధిగ్రహణేషు చ అపి = శాస్త్రనిశ్చయములందును వినియోగమునందును గూడ, న విద్యేత = ఉండడు, సర్వసురాసురాణాం = సమస్తమైన దేవతలలోను దానవులలోను, త్వం హి =

నీవేగదా!, ఉత్తమః = శ్రేష్ఠుడవు.

తాత్పర్యము :- ఓ మహావీరుడా! ధర్మశాస్త్రముల ప్రవచనమునందుగాని, లోకవ్యవహారముల విషయమున గాని శాస్త్రముల నిర్ణయమునందుగాని, వాని వినియోగమునందుగాని నిన్ను బోలినవాడు ఎవ్వడును ఏ లోకమందును లేదు. దేవతలయందును దానవులందును గూడ ఎల్లవిషయములలోను నీవే శ్రేష్ఠుడవు.

శ్లో॥ న చా ప్యస్య కపేర్ఘాతే కంచి త్పశ్యా మ్యహం గుణమ్ ।
తే ష్వయం పాత్యతాం దండో యైరయం ప్రేషితః కపిః ॥ 18

పదచ్ఛేదము :- న - చ - అపి - అస్య - కపేః - ఘాతే - కం - చిత్ - పశ్యామి - అహం - గుణమ్ - తేషు - అయం - పాత్యతాం - దండః - యైః - అయం -ప్రేషితః - కపిః ॥

అన్వయక్రమము :- అస్య కపేః ఘాతే కంచిత్ గుణమ్ అపి చ అహం న పశ్యామి, యైః అయం కపిః ప్రేషితః, తేషు అయం దండః పాత్యతామ్.

ప్రతిపదార్థము :- అస్య కపేః = ఈ వానరుని యొక్క, ఘాతే = వధయందు, కంచిత్ గుణమ్ అపి చ = కొంచెము మేలునుగూడ, అహం = నేను, న పశ్యామి = చూడను, అయం కపిః = ఈ వానరుడు, యైః = ఎవరిచేతనయితే, ప్రేషితః = పంపబడినాడో, తేషు = వారియందు, అయం దండః = ఈ దండనము, పాత్యతాం = విధింపబడుగాక!

తాత్పర్యము :- ఈ దూతయైన వానరుని వధించుటవలన మనకు కలుగు ఎట్టి మేలును నాకు గాన్పించుట లేదు. మన కడకు ఈ దూతను బంపినట్టి ఆ శత్రువుల యెడనే ఈ మృత్యుదండనమును విధింతము గాక!

శ్లో॥ సాధు ర్వా యది వాఽసాధుః పరై రేష సమర్పితః ।
బ్రువన్ పరార్థం పరవా న్న దూతో వధ మర్హతి ॥ 19

పదచ్ఛేదము :- సాధుః - వా - యది - వా - అసాధుః - పరైః - ఏషః - సమర్పితః - బ్రువన్ - పరార్థం - పరవాన్ - న - దూతః - వధమ్ - అర్హతి ॥

అన్వయక్రమము :- సాధుః వా, అసాధుః వా, ఏషః పరైః సమర్పితః, పరార్థం బ్రువన్ పరవాన్ దూతః వధం న అర్హతి.

ప్రతిపదార్థము :- సాధుః వా = సాధువైనను, అసాధుః యది వా = అసాధువైనప్పటికిని, ఏషః = ఈ దూత, పరైః = ఇతరులచే, సమర్పితః = పంపబడినట్టివాడు, పరార్థం =

ఇతరులకొఱకై, బ్రువన్ = మాటాడుచు, పరవాన్ = పరాధీనుడైనట్టి, దూతః = దూత, వధం = మరణమును, న అర్హతి = (పొందుటకు) అర్హుడు గాడు.

తాత్పర్యము :- సాధువైనను అసాధువైనను ఈ దూత పరులచే పంపబడినట్టివాడు గదా! ఇతరులకొఱకై వారు చెప్పుమన్నది చెప్పుచున్నట్టి ఈ పరాధీనుడైన దూత మరణదండనమునకు ఎంత మాత్రము తగినవాడు గాడు.

శ్లో॥ అపి చాస్మి న్హతే రాజ న్నాన్యం పశ్యామి ఖేచరమ్ ।
ఇహ యః పున రాగచ్ఛే త్పరం పారం మహోదధేః ॥ 20

పదచ్ఛేదము :- అపి - చ - అస్మిన్ - హతే - రాజన్ - న - అన్యం - పశ్యామి - ఖేచరమ్ - ఇహ - యః - పునః - ఆగచ్ఛేత్ - పరం - పారం - మహోదధేః ॥

అన్వయక్రమము :- రాజన్ ! అపి చ అస్మిన్ హతే (సతి) ఇహ మహోదధేః పరం పారం యః పునః ఆగచ్ఛేత్ (తం) అన్యం ఖేచరం న పశ్యామి.

ప్రతిపదార్థము :- రాజన్! = ఓ రాజా!, అపి చ = మఱియును, అస్మిన్ = ఈ వానరుడు, హతే (సతి) = చంపబడగా, ఇహ = ఇక్కడకు, మహోదధేః = మహాసముద్రము యొక్క, పరం = ఆవలిదైన, పారం = తీరమును, యః = ఎవ్వడు, పునః = తిరిగి, ఆగచ్ఛేత్ = రాగలడో, తమ్ = అట్టి, అన్యం = వేఱొక, ఖేచరం = ఆకాశసంచారము గల్గినట్టి వానిని, న పశ్యామి = చూడను.

తాత్పర్యము :- నీవిప్పుడు వీనిని చంపివేసినచో ఈ మహాసముద్రము యొక్క ఆవలియొడ్డునుండి ఈవలి తీరమునకు వచ్చుటకు ఇంతటి ఆకాశగమనశక్తి గలిగిన వీరుడు ఇంకొకడు నాకు గాన్పింపడు.

శ్లో॥ తస్మా న్నాస్య వధే యత్నః కార్యః పరపురంజయ ।
భవా న్సేంద్రేషు దేవేషు యత్న మాస్థాతు మర్హతి ॥ 21

పదచ్ఛేదము :- తస్మాత్ - న - అస్య - వధే - యత్నః - కార్యః - పరపురంజయ - భవాన్ - సేంద్రేషు - దేవేషు - యత్నమ్ - ఆస్థాతుమ్ - అర్హతి ॥

అన్వయక్రమము :- పరపురంజయ! తస్మాత్ అస్య వధే యత్నః న కార్యః, భవాన్ సేంద్రేషు దేవేషు యత్నమ్ ఆస్థాతుమ్ అర్హతి.

ప్రతిపదార్థము :- పరపురంజయ = శత్రుపురములను జయించినట్టి వీరుడా!, తస్మాత్ = అందువలన, అస్య = ఈ దూతయొక్క, వధే = వధయందు, యత్నః = ప్రయత్నము, న కార్యః = చేయదగినది గాదు, భవాన్ = నీవు, సేంద్రేషు = ఇంద్రునితో గూడినట్టి,

దేవేషు = దేవతలయెడల, యత్నమ్ = ప్రయత్నమును, ఆస్థాతుం = చేయుటకు, అర్హతి = తగుదువు.

తాత్పర్యము :– ఓ శత్రుసంహారకుడా! ఈ కారణములచేత దూతగా వచ్చిన ఈతనిని వధించు యత్నమును విడువుము. కావలసిన యెడల దేవేంద్రునిగూర్చి దేవతలను గూర్చి నీ దండనప్రయత్నమును సాగింపుము.

శ్లో॥ అస్మి న్వినష్టే న హి దూత మన్యం
పశ్యామి య స్తౌ నరరాజపుత్రౌ ।
యుద్ధాయ యుద్ధప్రియ దుర్వినీతా
వుద్యోజయే ద్దీర్ఘపథావరుద్ధౌ ॥ 22

పదచ్ఛేదము :– అస్మిన్ – వినష్టే – న – హి – దూతమ్ – అన్యం – పశ్యామి – యః – తౌ – నరరాజపుత్రౌ – యుద్ధాయ – యుద్ధప్రియ – దుర్వినీతౌ – ఉద్యోజయేత్ – దీర్ఘపథావరుద్ధౌ ॥

అన్వయక్రమము :– యుద్ధప్రియ! అస్మిన్ వినష్టే సతి దీర్ఘపథావరుద్ధౌ, దుర్వినీతౌ తౌ నరరాజపుత్రౌ యః యుద్ధాయ ఉద్యోజయేత్ (తం) అన్యం దూతం న పశ్యామి హి.

ప్రతిపదార్థము :– యుద్ధప్రియ! = యుద్ధమునందు వేడుక గల్గినవాడా! అస్మిన్ = ఈ దూతయైన వానరుడు, వినష్టే సతి = చనిపోవగా, దీర్ఘపథావరుద్ధౌ = దూరమైన మార్గముచే అడ్డగింపబడినవారును, దుర్వినీతౌ = గర్వితులైనవారునగు, తౌ నరరాజపుత్రౌ = ఆ రాజపుత్రుల నిరువురను, యః = ఎవ్వడు, యుద్ధాయ = యుద్ధముకొఱకు, ఉద్యోజయేత్ = పురిగొల్పునో, (తం = అట్టి) అన్యం దూతం = వేరొక దూతను, న పశ్యామి హి = చూడను సుమా!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– యుద్ధప్రియ! – దూత చనిపోయిన నష్టమేమి? ఆ రామలక్ష్మణులు ఇటకు రాకున్న హాని యేమి యనగూడదు. నీవు యుద్ధప్రియుడవు. యుద్ధమున పరాక్రమించుట, విజయముచే కీర్తినొందుట నీకు మిక్కిలి ఇష్టము గదా! ఈ దూత మరణించిన నీకు ఆ కోరిక లెట్లు నెఱవేరును? అని రావణుని రాజసప్రకృతిని ప్రకోపింప చేయుచు విభీషణుడు తనకు ఇష్టములేకున్నను రామలక్ష్మణులను దుర్వినీతులని రావణుని ప్రీతికొఱకే పలికెను అని తెలియవలెను.

రా. శిరోమణి :- యుద్ధప్రియదుర్వినీతౌ - యుద్ధప్రియులైన గర్విష్ఠులు అని రామలక్ష్మణులకు విశేషముగా అన్వయించుకొననగును.

తాత్పర్యము :- మహావీరుడా! ఇప్పుడీ దూత మరణించిన యెడల మిక్కిలి దూరమందుండి గర్విష్ఠులై ఇటకు వచ్చుటకు అవకాశము లేక యుండునట్టి ఆ రాజకుమారు లిరువురిని యుద్ధమునకు సన్నద్ధము చేయుచు, దౌత్యము నెఱవేర్పగల వేఱొక యోధుడు ఆయనకడ నున్నట్లుగా నాకు గాన్పించుట లేదు. కాబట్టి యుద్ధప్రియుడవైన నీవు ఈ దూతను చంపి సిద్ధమైయున్న యుద్ధమునకు అవకాశము లేకుండ చేసికొనుట యుక్తమై యుండునా?

శ్లో॥ పరాక్రమోత్సాహమనస్వినాం చ
సురాసురాణామపి దుర్జయేన ।
త్వయా మనోనందన నైరృతానాం
యుద్ధాయతి ర్నాశయితుం న యుక్తా ॥ 23

పదచ్ఛేదము :- పరాక్రమోత్సాహమనస్వినాం - చ - సురాసురాణామ్ - అపి - దుర్జయేన - త్వయా - మనోనందన - నైరృతానాం - యుద్ధాయతిః - నాశయితుం - న - యుక్తా ॥

అన్వయక్రమము :- నైరృతానాం మనోనందన! పరాక్రమోత్సాహమనస్వినాం సురాసురాణామ్ అపి దుర్జయేన త్వయా యుద్ధాయతిః నాశయితుం న యుక్తా.

ప్రతిపదార్థము :- నైరృతానాం = రాక్షసులకు, మనోనందన = మనస్సుకు ఆనందము గల్గించు వీరుడా!, పరాక్రమోత్సాహమనస్వినాం = పరాక్రమము, ఉత్సాహము పౌరుషము గల్గినట్టి, సురాసురాణాం చ అపి = దేవతలకును దానవులకును గూడ, దుర్జయేన = జయింపరానట్టి, త్వయా = నీచేత, యుద్ధాయతిః = యుద్ధఫలము, నాశయితుం = నశింపజేయుటకు, న యుక్తా = యుక్తముగాదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :- "హే నందన! యుద్ధాయ (సముత్సుకం) నైరృతానాం మనః నిర్నాశయితుం న యుక్తమ్" - రాక్షసులను ఆనందింపజేయు నట్టి మహావీరుడా! యుద్ధమునకై యువ్విళ్లూరుచున్న రక్కసుల మనస్సును నాశ మొందించుట నీకు యుక్తము గాదు. కావున యుద్ధమున కనుకూలముగా వచ్చియున్న దూతను చంపుట మాని వెనుకకు బంపుమని భావము.

వాసుదాసస్వామి :- నీ భటులలో యుద్ధమెప్పుడు వచ్చునా యని ఎదురుచూచువారు యుద్ధమునందు జయింపరానివారు గలరు. కావున ఇంద్రుడు మొదలైన వారందరు దండెత్తి వచ్చినను యుద్ధము చేయుటయం దుత్సాహము వహించుటే మగతనము. దానిని నీవు తప్పించ జూడరాదు, కావున దూతను జంపకుము.

తాత్పర్యము :- రాక్షసరాజా! యుద్ధప్రియులైన రాక్షసులను సంతోషపెట్టుట నీకును అభిమతమే గదా! కావున పరాక్రమము, ఉత్సాహము, పౌరుషము గల దేవదానవు లెల్లరకును దుర్జయుడవైన నీవు ఈ దూతను వధించి, ఇప్పుడు సిద్ధముగ నున్నట్టి మన రాక్షసులకు ప్రియమైన ఈ యుద్ధలాభమును చెఱచుట నీకు యుక్తముగాదు సుమా!

శ్లో॥ హితాశ్చ శూరాశ్చ సమాహితాశ్చ
కులేషు జాతాశ్చ మహాగుణేషు ।
మనస్విన శ్శస్త్రభృతాం వరిష్ఠాః
కోట్యగ్రత స్తే సుభృతాశ్చ యోధాః ॥ 24

పదచ్ఛేదము :- హితాః - చ - శూరాః - చ - సమాహితాః - చ - కులేషు - జాతాః - చ - మహాగుణేషు - మనస్వినః - శస్త్రభృతాం - వరిష్ఠాః - కోట్యగ్రతః - తే - సుభృతాః - చ - యోధాః ॥

అన్వయక్రమము :- హితాః చ శూరాః చ సమాహితాః చ మహాగుణేషు కులేషు జాతాః చ మనస్వినః శస్త్రభృతాం వరిష్ఠాః సుభృతాః చ యోధాః తే కోట్యగ్రతః (సంతి).

ప్రతిపదార్థము :- హితాః చ = హితులైనవారును, శూరాః చ = వీరులైనవారును, సమాహితాః చ = సన్నద్ధులైయున్నవారును, మహాగుణేషు = గొప్పగుణములు గల్గినట్టి, కులేషు = వంశములందు, జాతాః చ = జన్మించినవారును, మనస్వినః = పౌరుషవంతులును, శస్త్రభృతాం = ఆయుధధారులలో, వరిష్ఠాః = శ్రేష్ఠులును, సుభృతాః = చక్కగ పోషింపబడినవారునగు, యోధాః =యోధులు, తే = నీకు, కోట్యగ్రతః = కోట్లకొలదిగ, (సంతి = ఉన్నారు).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- సమాహితాః - దానాది సమ్మానములచే వశము చేసికొనబడినట్టివారు ఇట్టి విశిష్ట లక్షణములుగల యోధులు నీకడ కోట్ల కొలదిగనుండుటచే నీకు జయము

తప్పదని సూచింపబడుచున్నది.

తాత్పర్యము :- నీకు హితులైన వారును, నీపై ననురాగముగల వారును, గొప్పగుణములుగల గొప్ప వంశమునందు జన్మించినవారును, నీచే చక్కగ పోషింపబడుచున్నవారు నగు మహాయోధులు నీకడ కోట్ల కొలదిగ నున్నారు గదా!

శ్లో॥ త దేకదేశేన బలస్య తావ
త్కేచిత్త వాదేశకృతోఽభియాంతు ।
తౌ రాజపుత్రౌ వినిగృహ్య మూఢౌ
పరేషు తే భావయితుం ప్రభావమ్ ॥ 25

పదచ్ఛేదము :- తత్ - ఏకదేశేన - బలస్య - తావత్ - కేచిత్ - తవ - ఆదేశకృతః - అభియాంతు - తౌ - రాజపుత్రౌ - వినిగృహ్య - మూఢౌ - పరేషు - తే - భావయితుం - ప్రభావమ్ ॥

అన్వయక్రమము :- తత్ తవ ఆదేశకృతః కేచిత్ బలస్య ఏకదేశేన సహ మూఢౌ తౌ రాజపుత్రౌ వినిగృహ్య పరేషు తే ప్రభావం భావయితుం తావత్ అభియాంతు.

ప్రతిపదార్థము :- తత్ = అందువలన, తన = నీయొక్క, ఆదేశకృతః = ఆజ్ఞను నెరవేర్చువారు, కేచిత్ = కొంతమంది, బలస్య = సైన్యముయొక్క, ఏకదేశేన (సహ) =ఒక భాగముతోగూడి, వినిగృహ్య = నిగ్రహించి, పరేషు = శత్రువులందు, తే = నీయొక్క, ప్రభావం = మహిమను, భావయితుం = వెల్లడించుటకై, తావత్ = ముందుగా, అభియాంతు = ఎదురు వెళ్లుదురు గాక!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము, రా. శిరోమణి :- రాజపుత్రౌ వినిగృహ్య - (ఆనయంతు ఇతి శేషః) రామలక్ష్మణులను బంధించి తెచ్చెదరు గాక!

తాత్పర్యము :- అందుచే అపారమైనట్టి నీ సైన్యములో నీ మనస్సు నెఱిగి నీ యాజ్ఞను చక్కగా నెఱవేర్చునట్టి కొంతమంది వీరులు మూఢులైన ఆ రాజపుత్రుల కడ కేగి వారిని భయగ్రస్తులుగా చేసి ఆ శత్రుసైన్యమునందు నీ ప్రభావమును తెలియజేయుటకై ముందుగ నటకు వెళ్లుదురు గాక!

శ్లో॥ నిశాచరాణా మధిపోఽనుజస్య
విభీషణ స్యోత్తమవాక్య మిష్టమ్ ।

జగ్రాహ బుద్ధ్యా సురలోకశత్రు
ర్మహాబలో రాక్షసరాజముఖ్యః ॥ 26

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"దూతవధనివారణం" నామ
పంచాశస్సర్గః.

పదచ్ఛేదము :- నిశాచరాణామ్ – అధిపః – అనుజస్య – విభీషణస్య – ఉత్తమవాక్యమ్ – ఇష్టమ్ – జగ్రాహ – బుద్ధ్యా – సురలోకశత్రుః – మహాబలః – రాక్షసరాజముఖ్యః ॥

అన్వయక్రమము :- నిశాచరాణాం అధిపః సురలోకశత్రుః మహాబలః రాక్షసరాజముఖ్యః (సః) అనుజస్య విభీషణస్య ఇష్టమ్ ఉత్తమవాక్యం బుద్ధ్యా జగ్రాహ.

ప్రతిపదార్థము :- నిశాచరాణాం = రాక్షసులకు, అధిపః = ప్రభువైనవాడును, సురలోకశత్రుః = దేవలోకమునకు శత్రువైనవాడును, మహాబలః = మహాబలాఢ్యుడును, రాక్షసరాజముఖ్యః = రాక్షసరాజులలో శ్రేష్ఠుడును అగు, (సః = ఆ రావణుడు) అనుజస్య = తమ్ముడైన, విభీషణస్య = విభీషణునియొక్క, ఇష్టం = నచ్చినట్టి, ఉత్తమవాక్యం = మేలైన మాటను, బుద్ధ్యా = నిశ్చితమైన బుద్ధిచేత, జగ్రాహ = స్వీకరించెను.

తాత్పర్యము :- రాక్షసులకు ప్రభువును, దేవతలకు శత్రువును అగు ఆ రావణుడు తన తమ్ముడైన విభీషణుడు పలికిన యిష్టమైన ఆ వచనమును నిశ్చయబుద్ధితో నంగీకరించెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"దూతవధనివారణము" అను
ఏబదిరెండవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

త్రిపంచాశసర్గ

శ్లో॥ తస్య తద్వచనం శ్రుత్వా దశగ్రీవో మహాబలః ।
దేశకాలహితం వాక్యం భ్రాతు రుత్తర మబ్రవీత్ ॥ 1

పదచ్ఛేదము :- తస్య - తత్ - వచనం - శ్రుత్వా - దశగ్రీవః - మహాబలః, దేశకాలహితం - వాక్యం - భ్రాతుః - ఉత్తరమ్ - అబ్రవీత్.

అన్వయక్రమము :- మహాబలః దశగ్రీవః తస్య తద్వచనం శ్రుత్వా భ్రాతుః దేశకాలహితం వాక్యమ్ ఉత్తరమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :- మహాబలః = మహాబలాఢ్యుడైన, దశగ్రీవః = రావణుడు, తస్య = ఆ విభీషణుని యొక్క, తత్ వచనం = ఆ మాటను, శ్రుత్వా = విని, భ్రాతుః = సోదరునకు, దేశకాలహితం = దేశమునకును, కాలమునకును హితమైనట్టి, వాక్యం = వచనమును, ఉత్తరం = సమాధానముగా, అబ్రవీత్ = పలికెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- 'దేశకాలహితం' - విభీషణుని వచనము దేశకాలోచితమైనదని అన్వయించుకొనవలెను.

రా.శిరోమణి :- 'మహాబలః' అనుటకు బదులుగా 'మహాత్మనః' అని పాఠాంతరము. అనగా మహాత్ముడైన విభీషణుని యొక్క మాటను విని యని అన్వయము.

తాత్పర్యము :- మహాబలశాలియగు దశకంఠుడు విభీషణుని వచనములను ఆలకించి దేశకాలోచితముగ సమాధానము చెప్పుచు తన తమ్మునిజూచి ఇట్లు పలికెను.

శ్లో॥ సమ్య గుక్తం హి భవతా దూతవధ్యా విగర్హితా ।
అవశ్యం తు వధా దన్యః క్రియతా మస్య నిగ్రహః ॥ 2

పదచ్ఛేదము :- సమ్యక్ - ఉక్తం - హి - భవతా - దూతవధ్యా - విగర్హితా - అవశ్యం - తు - వధాత్ - అన్యః - క్రియతామ్ - అస్య - నిగ్రహః ॥

అన్వయక్రమము :- భవతా సమ్యక్ ఉక్తం హి, దూతవధ్యా విగర్హితా, అవశ్యం అస్య వధాత్ అన్యః నిగ్రహః క్రియతామ్.

ప్రతిపదార్థము :- భవతా = నీచేత, సమ్యక్ = లెస్సగా, ఉక్తం హి = చెప్పబడినది సుమా!, దూతవధ్యా = దూతవధ, విగర్హితా = నింద్యమైనది, అవశ్యం = తప్పక, అస్య = వీనికి, వధాత్ = వధకంటె, అన్యః = వేరైనట్టి, నిగ్రహః = దండనము, క్రియతాం = చేయబడుగాక!

తాత్పర్యము :- దూతవధ నింధ్యమైనది యని నీవు లెస్సగ తెలిపితివి. అందుచే నీతనిని ఇప్పుడు చంపుట మాని వేఱొక విధమైన దండనము విధించవలెను.

శ్లో॥ కపీనాం కిల లాంగూల మిష్టం భవతి భూషణమ్ ।
త దస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు ॥ 3

పదచ్ఛేదము :- కపీనాం - కిల - లాంగూలమ్ - ఇష్టం - భవతి - భూషణమ్ - తత్ - అస్య - దీప్యతాం - శీఘ్రం - తేన - దగ్ధేన - గచ్ఛతు ॥

అన్వయక్రమము :- కపీనాం లాంగూలమ్ ఇష్టం భూషణం భవతి కిల. (తత్) శీఘ్రం అస్య తత్ దీప్యతాం, దగ్ధేన తేన గచ్ఛతు ॥

ప్రతిపదార్థము :- కపీనాం = వానరులకు, లాంగూలం = తోక, ఇష్టం = ప్రియమైన, భూషణం = అలంకారము, భవతి కిల = అగును గదా! (తత్ = అందువలన) శీఘ్రం = వెంటనే, అస్య = ఈతనియొక్క, తత్ = ఆ వాలము, దీప్యతాం = కాల్చబడుగాక, దగ్ధేన = కాల్చబడినట్టి, తేన = ఆ తోకతో, గచ్ఛతు = వెడలునుగాక!

తాత్పర్యము :- కోతులకు తమ తోక మిక్కిలి ప్రియమైన ఆభరణము వంటిది గదా! కాబట్టి వెంటనే ఆ తోకకు నిప్పుబెట్టి అంటింపుము. అప్పుడు కాలి పుండైన తోక తోడనే తన యజమాని దగ్గరకు అతడు వెడలగలడు!

శ్లో॥ తతః పశ్యం త్విమం దీన మంగవైరూప్యకర్శితమ్ ।
సమిత్రజ్ఞాతయ స్సర్వే బాంధవా స్ససుహృజ్జనాః ॥ 4

పదచ్ఛేదము :- తతః - పశ్యంతు - ఇమం - దీనమ్ - అంగవైరూప్యకర్శితమ్, సమిత్రజ్ఞాతయః - సర్వే - బాంధవాః - ససుహృజ్జనాః ॥

అన్వయక్రమము :- తతః అంగవైరూప్యకర్శితమ్ ఇమం దీనం సమిత్రజ్ఞాతయః ససుహృజ్జనాః బాంధవాః సర్వే పశ్యంతు.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, అంగవైరూప్యకర్శితం = అవయవములయొక్క వికారముచే పీడింపబడినట్టి, దీనం = దీనుడైయున్నట్టి, ఇమం = ఈతనిని, సమిత్రజ్ఞాతయః = మిత్రులతోడను జ్ఞాతులతోడను గూడినవారును, ససుహృజ్జనాః = అనురక్తులైన జనులతో గూడినవారునగు, బాంధవాః = బంధువులు, సర్వే = ఎల్లరును, పశ్యంతు = తిలకింతురుగాక!

తాత్పర్యము :– తగులబడిన తోకతో తనవారి కడకేగినపుడు అంగవైకల్యము నొంది దీనస్థితిలో నున్నట్టి వీనిని ఈతని మిత్రులును జ్ఞాతులును ఇష్టులును బంధువులును ఎల్లరును అసహ్యించుకొనుచు జూతురు గాక!

శ్లో॥ ఆజ్ఞాపయ ద్రాక్షసేంద్రః పురం సర్వం సచత్వరమ్ ।
లాంగూలేన ప్రదీప్తేన రక్షోభిః పరిణీయతామ్ ॥ 5

పదచ్ఛేదము :– ఆజ్ఞాపయత్ – రాక్షసేంద్రః – పురం – సర్వం – సచత్వరమ్, లాంగూలేన – ప్రదీప్తేన – రక్షోభిః – పరిణీయతామ్ ॥

అన్వయక్రమము :– రాక్షసేంద్రః ప్రదీప్తేన లాంగూలేన సచత్వరం పురం రక్షోభిః పరిణీయతామ్ (ఇతి) ఆజ్ఞాపయత్.

ప్రతిపదార్థము :– సచత్వరం = వీథిముంగిళ్లతో గూడిన, పురం సర్వం = పట్టణమంతయును, ప్రదీప్తేన = దహింపబడినట్టి, లాంగూలేన = తోకతో, (అయం = ఈ వానరుడు), రక్షోభిః = రాక్షసులచే, పరిణీయతాం = తీసికొని పోబడుగాక! (ఇతి = అని) రాక్షసేంద్రః = రావణాసురుడు, ఆజ్ఞాపయత్ = ఆజ్ఞాపించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'పురం సర్వం పరిణీయతాం' – తన పట్టణమంతయు త్రిప్పుట ఎందులకని యనగా తన మహాబలము, మహదైశ్వర్యము, తన దుర్గములు, తనయొక్క నగరవైభవము శత్రువు తెలిసికొని ఆశ్చర్యపడుటకై యని రావణుని భావము.

రా. శిరోమణి :– తోకనంటించి శిక్షింపబడిన హనుమంతుని చూచి ఈతనిచే చంపబడిన వారి బంధువులును స్త్రీలును తమ దుఃఖమును మఱచిపోవుదురని రావణుని భావము.

తాత్పర్యము :– తగులబడుచున్న తోకతో ఈతనిని మన పట్టణపు వీథులనన్నిటను మన రాక్షసులు త్రిప్పి తీసికొని వెళ్లెదరుగాక యని రావణుడు తన భటులకు ఆజ్ఞాపించెను.

శ్లో॥ తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాః కోపకర్కశాః ।
వేష్టయంతి స్మ లాంగూలం జీర్ణైః కార్పాసకైః పటైః ॥ 6

పదచ్ఛేదము :- తస్య - తత్ - వచనం - శ్రుత్వా - రాక్షసాః - కోపకర్కశాః - వేష్టయంతి - స్మ - లాంగూలం - జీర్ణైః - కార్పాసకైః - పటైః ॥

అన్వయక్రమము :- తస్య తత్ వచనం శ్రుత్వా రాక్షసాః కోపకర్కశాః (సంతః) లాంగూలం కార్పాసకైః జీర్ణైః పటైః వేష్టయంతి స్మ.

ప్రతిపదార్థము :- కోపకర్కశాః = క్రోధముచే క్రూరులైయున్నట్టి, రాక్షసాః = రాక్షసులు, తస్య = ఆ రావణునియొక్క, తత్ వచనం = ఆ మాటను, శ్రుత్వా = విని, లాంగూలం = తోకను, జీర్ణైః = పాతబడినట్టి, కార్పాసకైః = నూలు సంబంధమైనట్టి, పటైః = వస్త్రములతో, వేష్టయంతి స్మ = చుట్టబెట్టుచుండిరి.

తాత్పర్యము :- క్రోధావేశము నొందియున్న యచటి రాక్షసభటులు రావణుడు పలికిన మాటలను వినినంతనే జీర్ణమై యున్న నూలుబట్టలను తెచ్చి హనుమ తోకకు చుట్టబెట్టదొడగిరి.

శ్లో॥ సంవేష్ట్యమానే లాంగూలే వ్యవర్ధత మహాకపిః ।
శుష్క మింధన మాసాద్య వనే ష్వివ హుతాశనః ॥ 7

పదచ్ఛేదము :- సంవేష్ట్యమానే - లాంగూలే - వ్యవర్ధత - మహాకపిః, శుష్కమ్ - ఇంధనం - ఆసాద్య - వనేషు - ఇవ - హుతాశనః ॥

అన్వయక్రమము :- లాంగూలే సంవేష్ట్యమానే (సతి) మహాకపిః, శుష్కమ్ ఇంధనం ఆసాద్య హుతాశనః ఇవ వ్యవర్ధత.

ప్రతిపదార్థము :- లాంగూలే = వాలము, సంవేష్ట్యమానే (సతి) = చుట్టబెట్టబడుచుండగా, మహాకపిః = వానరశ్రేష్ఠుడైన హనుమ, వనేషు = అడవులయందు, శుష్కమ్ = ఎండిపోయిన, ఇంధనమ్ = కట్టెను, ఆసాద్య = చేరి, హుతాశనః ఇవ = అగ్నిహోత్రుడువలె, వ్యవర్ధత = వర్ధిల్లుచుండెను.

తాత్పర్యము :- ఆ రాక్షసభటులు తన తోకను పాతగుడ్డలతో అట్లు చుట్టబెట్టుచుండగా అడవిలో ఎండుకట్టెలు లభించినప్పుడు అగ్నిదేవుడు విజృంభించినట్లు హనుమ తన శరీరముతో మిక్కిలిగ పెరిగిపోయెను.

శ్లో॥ తైలేన పరిషి చ్యాథ తే ఉగ్నిం త త్రావపాతయన్ ।
లాంగూలేన ప్రదీప్తేన రాక్షసాం స్తా నపాతయత్ ।
స తు రోషపరీతాత్మా బాలసూర్యసమాననః ॥ 8

పదచ్ఛేదము :– తైలేన – పరిషిచ్య – అథ – తే – అగ్నిం – తత్ర – అవపాతయన్ – సః – తు – రోషపరీతాత్మా – బాలసూర్యసమాననః ॥

అన్వయక్రమము :– అథ తే తైలేన పరిషిచ్య తత్ర అగ్నిమ్ అవపాతయన్. ప్రదీప్తేన లాంగూలేన బాలసూర్యసమాననః సః తు రోషపరీతాత్మా (సన్) తాన్ రాక్షసాన్ లాంగూలేన అపాతయత్.

ప్రతిపదార్థము :– అథ = అటుపిమ్మట, తే = ఆ రాక్షసులు, తైలేన = నూనెతో, పరిషిచ్య = తడిపి, తత్ర = ఆ తోకయందు, అగ్నిం = నిప్పును, అపాతయన్ = పడవేసిరి. ప్రదీప్తేన = మండుచున్నట్టి, లాంగూలేన = తోకతో, బాలసూర్యసమాననః = లేత సూర్యునితో సమానమైన ముఖము గల్గినట్టి, సః తు = ఆ హనుమ అప్పుడు, రోషపరీతాత్మా (సన్) = క్రోధముచే నిండిన మనస్సు గలవాడగుచు, తేన లాంగూలేన = ఆ తోకతో, తాన్ రాక్షసాన్ = ఆ రాక్షసులను, అపాతయత్ = పడగొట్టెను.

తాత్పర్యము :– అప్పుడా రాక్షసభటులు తోకకు చుట్టబెట్టిన ఆ పాతగుడ్డలను నూనెతో తడిపి దానికి నిప్పును ముట్టించిరి. మండుచున్నట్టి తన తోకతో లేత సూర్యునివంటి తేజస్సుగల హనుమ తీవ్రమైన క్రోధావేశమునొంది మండుచున్న ఆ తోకతోడనే అచటి రాక్షసులను తటిమి పడగొట్టెను.

శ్లో॥ లాంగూలం సంప్రదీప్తం తు ద్రష్టుం తస్య హనూమతః ।
సహస్త్రీబాలవృద్ధాశ్చ జగ్ముః ప్రీతా నిశాచరాః ॥ 9

పదచ్ఛేదము :– లాంగూలం – సంప్రదీప్తం – తు – ద్రష్టుం – తస్య – హనూమతః – సహస్త్రీబాలవృద్ధాః – చ – జగ్ముః – ప్రీతాః – నిశాచరాః ॥

అన్వయక్రమము :– తస్య హనూమతః సంప్రదీప్తం లాంగూలం ద్రష్టుం ప్రీతాః నిశాచరాః సహస్త్రీబాలవృద్ధాః జగ్ముః.

ప్రతిపదార్థము :– తస్య హనూమతః = ఆ హనుమయొక్క, సంప్రదీప్తం = మండుచున్నట్టి, లాంగూలం = తోకను, ద్రష్టుం = చూచుటకై, ప్రీతాః = సంతోషము నొందినట్టి, నిశాచరాః = రాక్షసులు, సహస్త్రీబాలవృద్ధాః = స్త్రీలతోడను వృద్ధులతోడను గూడినవారై, జగ్ముః = చేరిరి.

తాత్పర్యము :- అట్లు అంటించబడి మండుచున్నట్టి ఆ హనుమ తోకను చూచి ఆనందించుటకై కుతూహలముతో నగరములోని రాక్షసులు స్త్రీ బాల వృద్ధులతో సహా అచటకు చేరుకొనిరి.

శ్లో॥ స భూయ స్సంగతైః క్రూరైః రాక్షసై ర్హరిసత్తమః ।
నిబద్ధః కృతవా న్వీర స్తత్కాలసదృశీం మతిమ్ ॥ 10

పదచ్ఛేదము :- సః భూయః - సంగతైః - క్రూరైః - రాక్షసైః - హరిసత్తమః -నిబద్ధః - కృతవాన్ - వీరః - తత్కాలసదృశీం - మతిమ్ ॥

అన్వయక్రమము :- సంగతైః క్రూరైః రాక్షసైః భూయః నిబద్ధః (సన్) వీరః సః హరిసత్తమః తత్కాలసదృశీం మతిం కృతవాన్.

ప్రతిపదార్థము :- సంగతైః = గుమికూడినట్టి, క్రూరైః = క్రూరులైనట్టి, రాక్షసైః = రాక్షసులచే, భూయః = తిరిగి, నిబద్ధః = బంధింపబడినట్టి, వీరః = వీరుడైన, సః హరిసత్తమః = ఆ వానరశ్రేష్ఠుడు, తత్కాలదృశీం = ఆ సమయమునకు తగినట్టి, మతిం = ఆలోచనమును, కృతవాన్ = చేసినవాడాయెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'తత్కాలసదృశీం మతిం కృతవాన్' రాక్షసుల బంధనములను తేలికగా త్రెంపుకొనగలవాడయినప్పటికిని సమయోచితముగ తనను నిగ్రహించుకొని ఈ పై విధముగా ఆలోచించెనని భావము.

తాత్పర్యము :- అచ్చటకు చేరిన దుర్మార్గులైన రాక్షసులు వీరుడైన హనుమను తిరిగి గట్టిగ బంధించుచుండగా హనుమ వాటిని సహించుచు సమయోచితముగ నిట్లాలోచించెను.

శ్లో॥ కామం ఖలు న మే శక్తా నిబద్ధస్యాపి రాక్షసాః ।
ఛిత్త్వా పాశాన్సముత్పత్య హన్యామహ మిమాన్ పునః ॥ 11

పదచ్ఛేదము :- కామం - ఖలు - న - మే - శక్తాః - నిబద్ధస్య - అపి - రాక్షసాః - ఛిత్త్వా - పాశాన్ - సముత్పత్య - హన్యామ్ - అహమ్ - ఇమాన్ - పునః ॥

అన్వయక్రమము :- నిబద్ధస్య అపి మే రాక్షసాః కామం న శక్తాః ఖలు. అహం పాశాన్ ఛిత్త్వా సముత్పత్య పునః ఇమాన్ హన్యామ్.

ప్రతిపదార్థము :- నిబద్ధస్య అపి = కట్టబడిన వాడనైనప్పటికిని, మే = నాకు, రాక్షసాః

= రాక్షసులు, (అపకర్తుం = హానిచేయుటకు), కామం = ఎంతమాత్రము, శక్తాః న ఖలు = సమర్థులు కారు గదా! అహం = నేను, పాశాన్ = బంధనములను, ఛిత్వా = త్రెంపుకొని, సముత్పత్య = మీదికి ఎగిరిపోయి, ఇమాన్ = ఈ రక్కసులను, పునః = తిరిగి, హన్యామ్ = చంపగలను.

తాత్పర్యము :– నేను బంధింపబడినప్పటికిని ఈ రాక్షసులు నన్నేమియు చేయజాలరు. ఏలనన నాకు కావలసినప్పుడు నేనీ బంధనములను ఛేదించుకొని ఈ రాక్షసుల నందరను మఱల హతమార్చగలను.

శ్లో॥ యది భర్తృహితార్థాయ చరంతం భర్తృశాసనాత్ ।
బధ్నం త్యేతే దురాత్మానో నతు మే నిష్కృతిః కృతా ॥ 12

పదచ్ఛేదము :– యది – భర్తృహితార్థాయ – చరంతం – భర్తృశాసనాత్ – బధ్నంతి – ఏతే – దురాత్మానః – న – తు – మే – నిష్కృతిః – కృతా ॥

అన్వయక్రమము :– భర్తృహితార్థాయ చరంతం (మాం) ఏతే దురాత్మానః భర్తృశాసనాత్ బధ్నంతి యది మే నిష్కృతిః తు న కృతా.

ప్రతిపదార్థము :– భర్తృహితార్థాయ = ప్రభువుయొక్క హితము కొఱకై, చరంతం = చరించు చున్నట్టి, (మాం = నన్ను) ఏతే దురాత్మానః = ఈ దుర్మార్గులు, బధ్నంతి యది = బంధించిన యెడల, మే = నాకు, నిష్కృతిః తు = ప్రతీకారము మాత్రము, న కృతా = చేయబడదు.

తాత్పర్యము :– నా ప్రభువుయొక్క మేలుకొఱకు నేను చరించుచుండగా నన్నీ దుర్మార్గులు తమ ప్రభువైన రావణుని యాజ్ఞననుసరించి బంధించినంత మాత్రమున నాపై పగదీర్చుకొనుట జరుగదుగదా!

శ్లో॥ సర్వేషామేవ పర్యాప్తో రాక్షసానా మహం యుధి ।
రామస్య కింతు ప్రీత్యర్థం విషహిష్యే ఽహ మీదృశమ్ ॥ 13

పదచ్ఛేదము :– సర్వేషామ్ – ఏవ – పర్యాప్తః – రాక్షసానామ్ – అహమ్ – యుధి – రామస్య – కిం – తు – ప్రీత్యర్థం – విషహిష్యే – అహమ్ – ఈదృశమ్ ॥

అన్వయక్రమము :– అహం యుధి సర్వేషాం రాక్షసానాం పర్యాప్తః ఏవ, కింతు రామస్య ప్రీత్యర్థమ్ ఈదృశమ్ (క్లేశం) అహం విషహిష్యే ॥

ప్రతిపదార్థము :– యుధి = యుద్ధమునందు, సర్వేషాం రాక్షసానాం = ఎల్లరు

రాక్షసులకును, అహం = నేను, పర్యాప్తః ఏవ = సరిపడినట్టివాడనే, కింతు = కాని, రామస్య = రామునియొక్క, ప్రీత్యర్థం = ప్రీతికొఱకై, ఈదృశం = ఈ విధమైన, (క్లేశం = క్లేశమును) అహం = నేను, విషహిష్యే = సహించెదను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'రామస్య ప్రీత్యర్థం' – సర్వరాక్షసులను స్వయముగ వధించుటచే శ్రీరామునకు గలుగునట్టి ప్రీతికి విఘ్నము గలుగకుండ నేనీ బంధనక్లేశమును సహించెదనని భావము.

మహేశ్వరతీర్థులు :– శ్రీరామునిచే సర్వరాక్షస సంహారము ప్రతిజ్ఞ చేయబడియుండుటచే ప్రస్తుతము తనకీ బంధనము అవమానకరమైనప్పటికి తాను తన ప్రభువు ప్రీతికొఱకై సహింతునని భావము.

తాత్పర్యము :– యుద్ధమున విజృంభించి ఇచ్చటి రాక్షసుల నెల్లరను మట్టుపెట్టుటకు నేనొక్కడనే చాలుదును గాని శత్రుసంహారకార్యము శ్రీరామునిది గాబట్టి అతనికి ప్రీతికరముగ ఆ పని అతనికే విడచిపెట్టి నేనీ స్వల్పమైన క్లేశమును ఓర్చుకొందునుగాక!

శ్లో॥ లంకా చారయితవ్యా వై పునరేవ భవే దితి ।
రాత్రౌ నహి సుదృష్టా మే దుర్గకర్మవిధానతః ।
అవశ్యమేవ ద్రష్టవ్యా మయా లంకా నిశాక్షయే ॥ 14

పదచ్ఛేదము :– లంకా – చారయితవ్యా – వై – పునః – ఏవ – భవేత్ – ఇతి – రాత్రౌ – న – హి – సుదృష్టా – మే – దుర్గకర్మవిధానతః, అవశ్యమ్ – ఏవ – ద్రష్టవ్యా – మయా – లంకా – నిశాక్షయే ॥

అన్వయక్రమము :– లంకా పునః ఏవ చారయితవ్యా భవేత్ ఇతి రాత్రౌ మే దుర్గకర్మవిధానతః న హి సుదృష్టా, లంకా నిశాక్షయే అవశ్యం మయా ద్రష్టవ్యా ఏవ.

ప్రతిపదార్థము :– లంకా = లంకానగరము, పునః = తిరిగి, చారయితవ్యా ఏవ = చరింపబడవలసినదే, భవేత్ = అగును, ఇతి = అని, రాత్రౌ = రాత్రియందు, మే = నాయొక్క, దుర్గకర్మవిధానతః = దుర్గరక్షణ క్రియయొక్క విధానము వలన, న హి సుదృష్టా = చక్కగా చూడబడలేదు, లంకా = లంకానగరము, నిశాక్షయే = ప్రాతఃకాలమునందు, అవశ్యం = తప్పక, మయా = నాచేత, ద్రష్టవ్యా ఏవ = చూడవలసినదే.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'రాత్రౌ దుర్గకర్మవిధానతః' – రాత్రిసమయమున దుర్గమమైన ప్రదేశములందు సంచరించుటకు వీలులేకపోవుట వలన అని భావము. 'నిశాక్షయే అవశ్యమేవ ద్రష్టవ్యా' – అని చెప్పుటచే సీతతో సంభాషించుట కొఱకు హనుమ కొన్ని దినములు లంకలో ఆగినట్లు గానవచ్చుచున్నది! ఫాల్గుణమాసమున రావణుడు సీత నపహరించుట, ఆశ్వయుజ శుక్లపక్షమున చివర హనుమంతుని ప్రేరణతో పక్షము దినములు గడువునిచ్చి, వానరులనుగూర్చి దూతను బంపుట, పిమ్మట కార్తీక శుక్లప్రతిపత్తున సీతాన్వేషణకై వానరులు వెడలుట, మార్గశిర శుక్లదశమినాడు సంపాతి దర్శనము. అప్పుడే సుగ్రీవుడొసగిన నెల రోజుల గడువు గడచినదని వానరులు చెప్పుట, పిమ్మట ఏకాదశినాడు హనుమ లంకకు వచ్చుట, ఆ రాత్రిశేషమునందే సీతను దర్శించుట, మరునాడు ద్వాదశీదినమున వనములో ఆగి ఆ రాత్రి సీతను స్వయముగ చూచుట, ఆ రాత్రిశేషమునందే అచటికి రావణుడు వచ్చుట, అప్పుడే యచ్చట రావణుడు పండ్రెండు మాసములకును ఇంక రెండు మాసములు మాత్రమే మిగిలియున్నవని కొద్ది రోజులు ఇంచుమించుగా చెప్పుట. మరునాడు త్రయోదశీ ఉదయము సీతమ్మతో సంభాషించుట, ఆనాటి పగలే అశోకవనభంజనము మొదలైనవి. చతుర్దశినాడు అక్షాధిరాక్షసవధ, ఆనాడో లేక పున్నమినాడో లంకాదహనము జరిగియుండెను అని తెలియనగును.

గోవిందరాజీయము :– 'దుర్గకర్మవిధానతః' – నగర రక్షణమునకై శత్రువులచే చేయబడిన విశేషమైన ఏర్పాటులను పరిశీలించుట.

తాత్పర్యము :– నేను రాత్రిసమయమున సీతమ్మను వెదకుచు తిరిగినప్పుడు ఇచ్చటి దుర్గకర్మ విధానము మున్నగునవి మఱల చూడవచ్చునని నేను అప్పుడు స్పష్టముగా చూడనైతిని. అందువలన ఈ ఉదయ సమయమునందు లంకయం దంతటనుగల రావణుని నగరరక్షణ విధానములను పరిశీలనముగా తప్పక చూడవలసియున్నది.

శ్లో॥ కామం బంధైశ్చ మే భూయః పుచ్ఛ స్యోద్దీపనేన చ ।
పీడాం కుర్వంతు రక్షాంసి న మేఽస్తి మనస శ్శ్రమః ॥ 15

పదచ్ఛేదము :– కామం – బంధైః – చ – మే – భూయః – పుచ్ఛస్య – ఉద్దీపనేన – చ, పీడాం – కుర్వంతు – రక్షాంసి – న – మే – అస్తి – మనసః – శ్రమః ॥

అన్వయక్రమము :– బంధైః చ, పుచ్ఛస్య ఉద్దీపనేన చ, మే భూయః కామం రక్షాంసి పీడాం కుర్వంతు, మే మనసః శ్రమః న అస్తి.

ప్రతిపదార్థము :- బంధైః చ = బంధనములచేతను, పుచ్ఛస్య = తోకయొక్క, ఉద్దీపనేన చ = అంటించుటచేతను, మే = నాకు, రక్షాంసి = రాక్షసులు, కామం = ఇష్టము వచ్చినట్లు, పీడాం = బాధను, కుర్వంతు = చేయుదురుగాక! మే = నాయొక్క మనసః = మనస్సునకు, శ్రమః = శ్రమము, న అస్తి = లేదు (ఇతి చింతయామాస = అని ఆలోచించెను).

తాత్పర్యము :- ఈ రాక్షసులు నన్ను బంధించియు, నా తోకకు నిప్పును ముట్టించియు తమ కిష్టము వచ్చినట్లు నన్ను బాధపెట్టుదురుగాక! నా మనస్సునకు మాత్రము పీడ ఏమియు గలుగుటలేదు గదా యని హనుమ తలపోసెను.

శ్లో॥ తతస్తే సంవృతాకారం సత్త్వవంతం మహాకపిమ్ ।
పరిగృహ్య యయు ర్హృష్టా రాక్షసాః కపికుంజరమ్ ॥ 16

పదచ్ఛేదము :- తతః - తే - సంవృతాకారం - సత్త్వవంతం - మహాకపిమ్ - పరిగృహ్య - యయుః - హృష్టాః - రాక్షసాః - కపికుంజరమ్ ॥

అన్వయక్రమము :- తతః సంవృతాకారం కపికుంజరం మహాకపిం పరిగృహ్య తే రాక్షసాః హృష్టాః (సంతః) యయుః.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, సంవృతాకారం = మఱుగుపఱుచుకొన్న రూపముగలవాడును, సత్త్వవంతం = బలశాలియును, మహాకపిం = వానర శ్రేష్ఠుడునగు, కపికుంజరం = హనుమను, పరిగృహ్య = పట్టుకొని, తే రాక్షసాః = ఆ రక్కసులు, హృష్టాః = సంతోషము నొందినవారై, యయుః = వెడలిపోయిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- 'మహాకపిం' = బుద్ధిచే ఘనుడైనవాడు, కపికుంజరం = వానరజాతిలో శ్రేష్ఠుడైనవాడు.

తాత్పర్యము :- అప్పుడా రాక్షసభటులు మహాబలాఢ్యుడైనను తన రూపమును మఱుగుపఱచుకొని యుండుటచే ఆ హనుమను తమ వెంటగొని సంతసమున నగరమునకు వెడలిపోయిరి.

శ్లో॥ శంఖభేరీనినాదైశ్చ ఘోషయంత స్స్వకర్మభిః ।
రాక్షసాః క్రూరకర్మాణ శ్చారయంతి స్మ తాం పురీమ్ ॥ 17

పదచ్ఛేదము :- శంఖభేరీనినాదైః - చ - ఘోషయంతః - స్వకర్మభిః, రాక్షసాః -

క్రూరకర్మాణః – చారయంతి – స్మ – తాం – పురీమ్ ॥

అన్వయక్రమము :– క్రూరకర్మాణః రాక్షసాః శంఖభేరీనినాదైః, స్వకర్మభిః (తం) తాం పురీం చారయంతి స్మ.

ప్రతిపదార్థము :– క్రూరకర్మాణః = క్రూరమైన కృత్యములు గల్గినట్టి, రాక్షసాః = రాక్షసులు, శంఖభేరీనినాదైః = శంఖములయొక్కయు భేరీలయొక్కయు ధ్వనులతోడను, స్వకర్మభిః చ = తమ చేష్టలతోడను, ఘోషయంతః = చాటించుచు, (తం = ఆ హనుమను) తాం పురీం = ఆ లంకానగరమునుగూర్చి, చారయంతి స్మ = త్రిప్పుచుండిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'స్వకర్మభిః ఘోషయంతః – రాజద్రోహియైన దుష్టునకు ఇట్టి దండనమే విధింపబడును. అను నీరీతి వచనములతో హనుమ పూర్వచేష్టలను ఎల్లరకును వెల్లడించుచు చాటించిరని భావము.

గోవిందరాజీయము :– జబ్బలు చఱచుట, సింహనాదములు చేయుట మున్నగు రాక్షస చేష్టలతోనని భావము.

తాత్పర్యము :– క్రూరమైన చేష్టలు తమ స్వభావమైయున్న ఆ రాక్షసులు శంఖభేరీ ప్రభృతి వాద్యధ్వనులతోడను తమ తమ వికారచేష్టలతోడను హనుమను గూర్చి నగరమున చాటుచు అతనిని నగరమంతయును త్రిప్పుచుండిరి.

శ్లో॥ అన్వీయమానో రక్షోభి ర్యయౌ సుఖ మరిందమః ।
హనుమాం శ్చారయామాస రాక్షసానాం మహాపురీమ్ ॥ 18

పదచ్ఛేదము :– అన్వీయమానః – రక్షోభిః – యయౌ – సుఖమ్ – అరిందమః – హనుమాన్ – చారయామాస – రాక్షసానాం – మహాపురీమ్ ॥

అన్వయక్రమము :– అరిందమః రక్షోభిః అన్వీయమానః (సన్) సుఖం యయౌ, హనుమాన్ రాక్షసానాం మహాపురీం చారయామాస.

ప్రతిపదార్థము :– అరిందమః = శత్రుమర్దనుడైనట్టి హనుమ, రక్షోభిః = రక్కసులచే, అన్వీయమానః = వెంబడింపబడుచున్నవాడై, సుఖం = సుఖముగా, యయౌ = వెడలెను, హనుమాన్ = హనుమ, రాక్షసానాం = రక్కసులయొక్క, మహాపురీం = మహానగరమును, చారయామాస = చరించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- చారయామాస = సంచారముచే చూచెనని భావము.

రా. శిరోమణి :- తిరిగెను.

గోవిందరాజీయము :- శోధించెను.

తాత్పర్యము :- శత్రుంజయుడైన హనుమ ఆ రాక్షసభటులు తన వెంబడి వచ్చుచుండగా లంకాపట్టణమంతయు సుఖముగ తిరుగుచు తనకు గావలసిన విశేషములను పరికించుచుండెను.

శ్లో॥ అ థాపశ్య ద్విమానాని విచిత్రాణి మహాకపిః ।
సంవృతాన్ భూమిభాగాంశ్చ సువిభక్తాంశ్చ చత్వరాన్ ॥ 19

పదచ్ఛేదము :- అథ - అపశ్యత్ - విమానాని - విచిత్రాణి - మహాకపిః - సంవృతాన్ - భూమిభాగాన్ - చ - సువిభక్తాన్ - చ - చత్వరాన్ ॥

అన్వయక్రమము :- అథ మహాకపిః విచిత్రాణి విమానాని, సంవృతాన్ భూమిభాగాన్ చ, సువిభక్తాన్ చత్వరాన్ చ అపశ్యత్.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, మహాకపిః = వానరశ్రేష్ఠుడైన హనుమ, విచిత్రాణి = విచిత్రములైనట్టి, విమానాని = విమానములను, సంవృతాన్ = మూయబడియున్న, భూమిభాగాన్ చ = భూమిభాగములను, సువిభక్తాన్ = చక్కగ తీర్చిదిద్దబడియున్న, చత్వరాన్ = ముంగిళ్ళను, అపశ్యత్ = చూచెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమ లంకానగరము నందలి మిక్కిలి విచిత్రములైన విమానములను, మూయబడియున్న భూమిభాగములను చక్కగా తీర్చిదిద్దబడియున్న ముంగిళ్లతో గూడిన భవనములను చూచుచు ముందుకు పోవుచుండెను.

శ్లో॥ వీథీశ్చ గృహసంబాధాః కపి శ్శృంగాటకాని చ ।
తథా రథ్యోపరథ్యాశ్చ తథైవ గృహకాంతరాన్ ।
గృహాంశ్చ మేఘసంకాశాన్ దదర్శ పవనాత్మజః ॥ 20

పదచ్ఛేదము :- వీథీః - చ - గృహసంబాధాః - కపిః - శృంగాటకాని - చ - తథా - రథ్యోపరథ్యాః - చ - తథా - ఏవ - గృహకాంతరాన్ - గృహాన్ - చ - మేఘసంకాశాన్ - దదర్శ - పవనాత్మజః ॥

అన్వయక్రమము :- పవనాత్మజః కపిః గృహసంబాధాః వీథీః చ, శృంగాటకాని చ, తథా రథ్యోపరథ్యాః చ, తథైవ గృహకాంతరాన్ మేఘసంకాశాన్ గృహాన్ చ దదర్శ.

ప్రతిపదార్థము :- పవనాత్మజః కపిః = వాయునందనుడైన హనుమ, గృహసంబాధాః = ఇండ్లతో క్రిక్కిరిసియున్న, వీథీః చ = వీథులను, శృంగాటకాని చ = చతుష్పథములను, తథా = అట్లు, రథ్యోపరథ్యాః చ = రాజమార్గములను చిన్న బాటలను, తథైవ = అట్లే, గృహకాంతరాన్ = రహస్యద్వారములుగల ఇండ్లను, మేఘసంకాశాన్ గృహాన్ = మేఘములను బోలిన ఇండ్లను, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- వాయునందనుడైన హనుమ క్రిక్కిరిసియున్న ఇండ్లతో నిండిన వీథులను, సుందరముగా కానవచ్చు చతుష్పథములను, విశాలమైన రాచబాటలను, వానిని చేరియున్న ప్రక్కప్రక్క వీథులను, రహస్యద్వారములతోగూడిన గృహవిశేషములను, మేఘములను తాకుచున్న ఉన్నతభవనములను విలోకించెను.

శ్లో॥ చత్వరేషు చతుష్కేషు రాజమార్గే తథైవ చ ।
ఘోషయంతి కపిం సర్వే చార ఇత్యేవ రాక్షసాః ॥ 21

పదచ్ఛేదము :- చత్వరేషు - చతుష్కేషు - రాజమార్గే - తథా - ఏవ - చ - ఘోషయంతి - కపిం - సర్వే - చారః - ఇతి - ఏవ - రాక్షసాః ॥

అన్వయక్రమము :- చతుష్కేషు చత్వరేషు తథా ఏవ రాజ్యమార్గే చ రాక్షసాః సర్వే కపిం చారః ఇతి ఏవ ఘోషయంతి.

ప్రతిపదార్థము :- చతుష్కేషు = చతుష్పథములందును, చత్వరేషు = ముంగిళ్లయందును, తథా ఏవ = అట్లే, రాజమార్గే = రాజవీథియందు, రాక్షసాః సర్వే = రాక్షసులందరును, కపిం = వానరుని, చారః ఇతి ఏవ = గూఢచారియనియే, ఘోషయంతి = చాటిరి.

సూచన :- చార ఇత్యేవ యనుటకు బదులుగా 'చారీక ఇతి' అని పాఠాంతరము.
చతుష్కేషు - చతుస్తంభ మండపము.

తాత్పర్యము :- రాజవీథులందును, నాల్గువీథుల మొగలందును, ఇండ్లముంగిళ్ల యందును గుమిగూడిన రక్కసులు వినునట్లుగా రాక్షసభటులు ఈ వానరుడు మన గుట్టుమట్టులు తెలిసికొనుటకై వచ్చినట్టి గూఢచారి సుడీయని పరిహాసపూర్వకముగా ఘోషించు చుండిరి.

శ్లో॥ స్త్రీబాలవృద్ధా నిర్జగ్ముస్తత్ర తత్ర కుతూహలాత్ ।
తం ప్రదీపితలాంగూలం హనుమంతం దిదృక్షవః ॥ 22

పదచ్ఛేదము :– స్త్రీబాలవృద్ధాః – నిర్జగ్ముః – తత్ర – తత్ర – కుతూహలాత్ – తం – ప్రదీపితలాంగూలం – హనుమంతం – దిదృక్షవః ॥

అన్వయక్రమము :– ప్రదీపితలాంగూలం – తం హనుమంతం దిదృక్షవః కుతూహలాత్ తత్ర తత్ర స్త్రీబాలవృద్ధాః నిర్జగ్ముః.

ప్రతిపదార్థము :– ప్రదీపితలాంగూలం = అంటింపబడినట్టి వాలముగల్గిన, తం హనుమంతం = ఆ హనుమంతుని, దిదృక్షవః = చూడగోరుచున్నవారై, కుతూహలాత్ = కుతూహలమువలన, తత్ర తత్ర = అచ్చటచ్చట, స్త్రీబాలవృద్ధాః = స్త్రీలును బాలురును వృద్ధులును, నిర్జగ్ముః = బయటకు వచ్చిరి.

తాత్పర్యము :– మండుచున్న తోకతో ఆ రీతిగా వీథులవెంబడి గొనిపోబడుచున్న హనుమంతుని చూడ ముచ్చట గలిగినవారై ఆయా వీథులందెల్ల ఇండ్లలోపలనున్న స్త్రీలును, బాలురును, వృద్ధులును గూడ బయటికి వచ్చుచుండిరి.

శ్లో॥ దీప్యమానే తతస్తస్య లాంగూలాగ్రే హనూమతః ।
రాక్షస్య స్తా విరూపాక్ష్య శ్శంసు ర్దేవ్యాస్తదప్రియమ్ ॥ 23

పదచ్ఛేదము :– దీప్యమానే – తతః – తస్య – లాంగూలాగ్రే – హనూమతః – రాక్షస్యః – తాః – విరూపాక్ష్యః – శంసుః – దేవ్యాః – తత్ – అప్రియమ్ ॥

అన్వయక్రమము :– తతః తస్య హనూమతః లాంగూలాగ్రే దీప్యమానే సతి, విరూపాక్ష్యః రాక్షస్యః దేవ్యాః తత్ అప్రియం శంసుః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తస్య హనూమతః = ఆ హనుమంతునియొక్క, లాంగూలాగ్రే = తోకచివరి భాగము, దీప్యమానే సతి = మండుచుండగా, తాః = ఆ, విరూపాక్ష్యః = వికృతమైన కన్నులు గలిగినట్టి, రాక్షస్యః = రాక్షసాంగనలు, దేవ్యాః = సీతాదేవికి, తత్ = ఆ, అప్రియం = అనిష్టవార్తను, శంసుః = తెలిపిరి.

తాత్పర్యము :– అప్పుడు హనుమంతుని లాంగూలాగ్రము మండుచుండగా సీతమ్మకు కావలిగానున్న వికారపుకన్నులుగల ఆ రాక్షసస్త్రీలు ఆమెకడకేగి ఆమెకు బాధకల్గించునట్టి ఆ వార్తను వినిపించిరి.

**శ్లో॥ యస్త్వయా కృతసంవాద స్సీతే తామ్రముఖః కపిః ।
లాంగూలేన ప్రదీప్తేన స ఏష పరిణీయతే ॥ 24**

పదచ్ఛేదము :- యః - త్వయా - కృతసంవాదః - సీతే - తామ్రముఖః - కపిః, లాంగూలేన - ప్రదీప్తేన - సః - ఏషః - పరిణీయతే ॥

అన్వయక్రమము :- సీతే! త్వయా కృతసంవాదః తామ్రముఖః యః కపిః (అస్తి) సః ఏషః ప్రదీప్తేన లాంగూలేన పరిణీయతే.

ప్రతిపదార్థము :- సీతే! = ఓ జానకీ!, త్వయా = నీతోడ, కృతసంవాదః = చేసిన సంభాషణము కల్గినట్టి, తామ్రముఖః = ఎఱ్ఱని ముఖము గల్గినట్టి, యః కపిః అస్తి = ఏ వానరు డున్నాడో, సః ఏషః = ఆ యతడు, ప్రదీప్తేన = అంటింప బడినట్టి, లాంగూలేన = తోకతోడ, పరిణీయతే = తీసికొనిపోబడుచున్నాడు.

తాత్పర్యము :- ఓ జానకీ! ఇంతకుముందు నీతో మాటలాడినట్టి ఎఱ్ఱని మూతిగల్గిన ఆ వానరుని, తోకకు ఇప్పుడు రాక్షసులు నిప్పు అంటించి, లంకావీథులందు త్రిప్పుచున్నారు సుమా!

**శ్లో॥ శ్రుత్వా తద్వచనం క్రూర మాత్మాపహరణోపమమ్ ।
వైదేహీ శోకసంతప్తా హుతాశన ముపాగమత్ ॥ 25**

పదచ్ఛేదము :- శ్రుత్వా - తత్ - వచనం - క్రూరమ్ - ఆత్మాపహరణోపమమ్, వైదేహీ - శోకసంతప్తా - హుతాశనమ్ - ఉపాగమత్ ॥

అన్వయక్రమము :- వైదేహీ, ఆత్మాపహరణోపమం తత్ క్రూరవచనం శ్రుత్వా శోకసంతప్తా సతీ హుతాశనమ్ ఉపాగమత్.

ప్రతిపదార్థము :- వైదేహీ = సీతాదేవి, ఆత్మాపహరణోపమం = తనను అపహరించుటతో సమానమైన, తత్ = ఆ, క్రూరం = దారుణమైన, వచనం = మాటను, శ్రుత్వా = విని, శోకసంతప్తా సతీ = శోకముచే దహింపబడుచున్నదై, హుతాశనం = అగ్నిహోత్రుని, ఉపాగమత్ = ఉపాసించెను.

తాత్పర్యము :- సీతాదేవి ఆ రాక్షసస్త్రీలు పలికినమాట తనను అపహరించినప్పుడు కలిగినంతటి తీవ్రమైన సంతాపమును గలిగింపగా ఆమె అగ్నిహోత్రుని ధ్యానింపదొడగెను.

**శ్లో॥ మంగళాభిముఖీ తస్య సా తదాసీ న్మహాకపేః ।
ఉపతస్థే విశాలక్షీ ప్రయతా హవ్యవాహనమ్ ॥ 26**

పదచ్ఛేదము :- మంగళాభిముఖీ - తస్య - సా - తదా - ఆసీత్ - మహాకపేః, ఉపతస్థే - విశాలాక్షీ - ప్రయతా - హవ్యవాహనమ్ ॥

అన్వయక్రమము :- తదా సా విశాలాక్షీ తస్య మహాకపేః మంగళాభిముఖీ (సతీ) ప్రయతా హవ్యవాహనం ఉపతస్థే.

ప్రతిపదార్థము :- తదా = అప్పుడు, సా విశాలాక్షీ = విశాలమైన కన్నులుగల ఆ సీతాదేవి, తస్య మహాకపేః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమకు, మంగళాభిముఖీ (సతీ) = మంగళములను గూర్చునట్టిదగుచు, ప్రయతా = నిష్ఠగలదై, హవ్యవాహనం = అగ్నిహోత్రుని, ఉపతస్థే = ధ్యానించినది.

తాత్పర్యము :- అప్పుడు ఆ సీతాదేవి తనకు మేలుగూర్చిన ఆ హనుమకు హాని తొలగించి మంగళము గూర్చు నిశ్చయము గలదై పరిశుద్ధమైన మనస్సుతో అగ్నిదేవుని గూర్చి ఇట్లు ప్రార్థింపసాగెను.

శ్లో॥ యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః ।
యది వాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః ॥ 27

పదచ్ఛేదము :- యది - అస్తి - పతిశుశ్రూషా - యది - అస్తి - చరితం - తపః - యది - వా - అస్తి - ఏకపత్నీత్వం - శీతః - భవ - హనూమతః ॥

అన్వయక్రమము :- (మమ) పతిశుశ్రూషా అస్తి యది; చరితం తపః అస్తి యది, ఏకపత్నీత్వం వా అస్తి యది, (అగ్నే) హనూమతః శీతః భవ.

ప్రతిపదార్థము :- (మమ = నాకు) పతిశుశ్రూషా = పతిసేవ, అస్తి యది = ఉన్నయెడల, చరితం = చేయబడినట్టి, తపః = తపస్సు, అస్తి యది = ఉన్నదేని, ఏకపత్నీత్వం వా = పాతివ్రత్యమైనను గాని, అస్తి యది = ఉన్నదేని, (అగ్నే! = ఓ అగ్నిదేవుడా) హనూమతః = హనుమంతునకు, శీతః = చల్లనివాడవు, భవ = అగుము.

తాత్పర్యము :- నాయందు పతిసేవాపుణ్య మున్నదేని, నాకు చేసికొన్న తపస్సు గలదేని, లేక నా యందు పాతివ్రత్యధర్మ మున్నదేని ఓ యగ్నిదేవా! హనుమంతుని యెడ నీవు చల్లనివాడవు గమ్ము!

శ్లో॥ యది కించి దనుక్రోశ స్తస్య మ య్యస్తి ధీమతః ।
యది వా భాగ్యశేషో మే శీతో భవ హనూమతః ॥ 28

పదచ్ఛేదము :- యది - కించిత్ - నుక్రోశః - తస్య - మయి - అస్తి - ధీమతః, యది - వా - భాగ్యశేషః - మే - శీతః - భవ - హనూమతః ॥

అన్వయక్రమము :- మయి ధీమతః తస్య కించిదనుక్రోశః అస్తి యది, మే భాగ్య శేషో వా (అస్తి) యది, హనూమతః శీతః భవ.

ప్రతిపదార్థము :- మయి = నాయందు, ధీమతః = ప్రజ్ఞావంతుడైన, తస్య = ఆ రామునకు, కించిదనుక్రోశః = కొద్ది కరుణ, అస్తి యది = ఉన్నదేని, మే = నాకు, భాగ్యశేషః వా = భాగ్యశేషమైనను గాని, (అస్తి) యది = ఉన్నయెడల, హనూమతః = హనుమంతునకు, శీతః = చల్లనివాడవు, భవ = అగుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- మే భాగ్యశేషః అస్తి యది - పూర్వజన్మము నందలి భాగ్యశేష మేమైన యున్నచో దాని మూలముననైనను ప్రస్తుతము తాననుభవించుచున్న నిరంతరదుఃఖమువలన ఈ జన్మమునందలి భాగ్యము లేకున్నను పూర్వపుణ్య ఫలముగనైన హనుమంతునియెడ అగ్నిదేవుడు చల్లనివాడు గావలెనని సీతాదేవి భావము.

తాత్పర్యము :- ప్రజ్ఞావంతుడైన ఆ శ్రీరామునకు నా యెడ కొంచెమేని కరుణయున్నను, లేక నాకు కొంచెమైన పూర్వజన్మమునందలి అదృష్టము శేషించియున్నను ఓ అగ్నిదేవుడా! నీవు హనుమంతునియెడ చల్లనివాడవు గమ్ము!

శ్లో॥ యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసామ్ ।
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః ॥ 29

పదచ్ఛేదము :- యది - మాం - వృత్తసంపన్నాం - తత్సమాగమలాలసామ్ - సః విజానాతి - ధర్మాత్మా - శీతః - భవ - హనూమతః ॥

అన్వయక్రమము :- మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసాం సః ధర్మాత్మా విజానాతి యది, హనూమతః శీతః భవ.

ప్రతిపదార్థము :- మాం = నన్ను, వృత్తసంపన్నాం = సద్వర్తనముతో నిండియున్న దానినిగను, తత్సమాగమలాలసాం = ఆతనియొక్క కలయికయందు తీవ్రమైన కోరికగలదాననుగను, సః ధర్మాత్మా = ఆ ధర్మాత్ముడైన రాముడు, విజానాతి యది = తెలిసికొనుచున్నయెడల, హనూమతః = హనుమంతునకు, శీతః = చల్లనివాడవు, భవ అగుము.

తాత్పర్యము :- ధర్మాత్ముడైన ఆ శ్రీరాముడు నన్ను సద్వర్తనముతో వెలయునట్టి దానినిగాను, ఆతనిని కలిసికొనుటకై ఉత్కంఠతో నున్నదానినిగాను తెలిసికొనుచున్న యెడల అగ్నిదేవా! నీవు హనుమంతుని యెడల చల్లనివాడ వగుదువు గాక!

శ్లో॥ యది మాం తారయే దార్య స్సుగ్రీవ స్సత్యసంగరః ।
అస్మా ద్దుఃఖాంబుసంరోధాచ్ఛీతో భవ హనూమతః ॥ 30

పదచ్ఛేదము :- యది - మాం - తారయేత్ - ఆర్యః - సుగ్రీవః - సత్యసంగరః, అస్మాత్ - దుఃఖాంబుసంరోధాత్ - శీతః - భవ - హనూమతః ॥

అన్వయక్రమము :- ఆర్యః సత్యసంగరః సుగ్రీవః మామ్ అస్మాత్ దుఃఖాంబుసంరోధాత్ తారయేత్ యది హనూమతః శీతః భవ.

ప్రతిపదార్థము :- ఆర్యః = పూజ్యుడును, సత్యసంగరః = సత్యమైన ప్రతిజ్ఞగలవాడునగు, సుగ్రీవః = సుగ్రీవుడు, మాం = నన్ను, అస్మాత్ = ఈ, దుఃఖాంబుసంరోధాత్ = దుఃఖమనెడి నీటి వెల్లువనుండి, తారయేత్ యది = తరింపచేయునేని, హనూమతః = హనుమంతునకు, శీతః = చల్లనివాడవు, భవ = అగుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- సీతాదేవి - భర్తృశుశ్రూష నొనరించుపడతినేని యని తెలిపి తన రామకైంకర్యమును స్థిరపరచెను. ఆమె ఇప్పుడు రామదాసుడగు హనుమద్భాగవతునకు నపాయము లేకుండజేసి భాగవతప్రీతి కనబఱచెను. దయ యాధారముగాగల పరోపకారము అవశ్యకర్తవ్యమైన మిత్రభాగవత భర్తృహిత లక్షణము. బిడ్డలను రక్షించుటయందు భర్తకు గల స్వాతంత్ర్యము భార్యకును గలదు.

తాత్పర్యము :- పూజ్యుడును సత్యప్రతిజ్ఞుడునైన సుగ్రీవుడు నన్నీ దుఃఖసముద్రమునుండి తప్పించుటయే తథ్యమైనయెడల ఓ యగ్నిదేవా! నీవు హనుమంతుని యెడ చల్లదనమును వహింపుము.

శ్లో॥ తత స్తీక్ష్ణార్చి రవ్యగ్రః ప్రదక్షిణశిఖోఽనలః ।
జజ్వాల మృగశాబాక్ష్యా శ్శంస న్నివ శివం కపేః ॥ 31

పదచ్ఛేదము :- తతః - తీక్ష్ణార్చిః - అవ్యగ్రః - ప్రదక్షిణశిఖః - అనలః, జజ్వాల - మృగశాబాక్ష్యాః - శంసన్ - ఇవ - శివం - కపేః ॥

అన్వయక్రమము :- తతః మృగశాబాక్ష్యాః కపేః శివం శంసన్ ఇవ, అనలః తీక్ష్ణార్చిః

ప్రదక్షిణశిఖః అవ్యగ్రః చ సన్ జజ్వాల.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, మృగశాబాక్ష్యాః = లేడిపిల్ల కన్నులవంటి కన్నులుగల సీతాదేవికి, కపేః = హనుమయొక్క, శివం = శుభమునుగూర్చి, శంసన్ ఇవ = చెప్పుచున్నవాడువలె, అనలః = అగ్ని, తీక్ష్ణార్చిః = తీక్ష్ణమైన జ్వాలలు గలవాడుగను, ప్రదక్షిణశిఖః =కుడివైపునకు తిరిగిన మంటలు గలవాడుగను, అవ్యగ్రః చ(సన్) = చాంచల్యములేనివాడుగను అగుచు, జజ్వాల = జ్వలించెను.

తాత్పర్యము :- అప్పుడా యగ్నిదేవుడు సీతాదేవికి హనుమయొక్క క్షేమము నివేదించుచున్నట్లుగా చాంచల్యము లేకుండ కుడివైపునకు వంగిన ప్రదీప్తమైన జ్వాలలతో ప్రజ్వలించుచు కానవచ్చెను.

శ్లో॥ హనుమజ్జనక శ్చాపి పుచ్ఛానలయుతో ఽనిలః ।
వవౌ స్వాస్థ్యకరో దేవ్యాః ప్రాలేయానిలశీతలః ॥ 32

పదచ్ఛేదము :- హనుమజ్జనకః - చ - అపి - పుచ్ఛానలయుతః - అనిలః - వవౌ - స్వాస్థ్యకరః - దేవ్యాః - ప్రాలేయానిలశీతలః ॥

అన్వయక్రమము :- పుచ్ఛానలయుతః అపి హనుమజ్జనకః అనిలః దేవ్యాః స్వాస్థ్యకరః ప్రాలేయానిలశీతలః (సన్) వవౌ.

ప్రతిపదార్థము :- పుచ్ఛానలయుతః అపి = తోకయందలి అగ్నితో గూడిన వాడయినప్పటికిని, హనుమజ్జనకః = హనుమంతుని తండ్రియైనట్టి, అనిలః = వాయువు, దేవ్యాః = సీతాదేవికి, స్వాస్థ్యకరః = స్వస్థతను గల్గించుచున్నవాడై, ప్రాలేయానిలశీతలః సన్ = మంచుతో గూడిన వాయువువలె చల్లని వాడగుచు, వవౌ = వీచెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమ తోకయందు జ్వలించుచున్న అగ్నితో గూడియున్నప్పటికిని హనుమంతుని తండ్రియైన వాయుదేవుడు సీతాదేవికి తాపము గలుగకుండ మంచుతో నిండిన వాయువువలెనే చల్లగ వీచుచు ఆమెకు సుఖమును గూర్చెను.

శ్లో॥ దహ్యమానే చ లాంగూలే చింతయామాస వానరః ।
ప్రదీప్తోఽగ్ని రయం కస్మాన్న మాం దహతి సర్వతః ॥ 33

పదచ్ఛేదము :- దహ్యమానే - చ - లాంగూలే - చింతయామాస - వానరః - ప్రదీప్తః - అగ్నిః - అయం - కస్మాత్ - న - మాం - దహతి - సర్వతః ॥

అన్వయక్రమము :- లాంగూలే దహ్యమానే (సతి) వానరః చింతయామాస; అయం సర్వతః ప్రదీప్తః అగ్నిః మాం కస్మాత్ న దహతి?

ప్రతిపదార్థము :- లాంగూలే = తోక, దహ్యమానే సతి = తగులపెట్టబడుచుండగా, వానరః = హనుమ, చింతయామాస = ఆలోచించెను, సర్వతః = అన్నివైపులనుండి, ప్రదీప్తః = ప్రజ్వలించుచున్నట్టి, అయం అగ్నిః = ఈ యగ్ని, మాం = నన్ను, కస్మాత్ = ఎందువలన, న దహతి = దహించుట లేదు?

తాత్పర్యము :- తన తోక అట్లు తగులబడుచున్నను తనకు తాపము కలుగుకుండుటచే తనలో నిట్లు చింతించెను. ఈ యగ్ని అన్నివైపులకును ఇట్లు చెలరేగి మండుచున్నను నన్ను కొంచెము గూడ ఎందుచే దహించుట లేదు?

శ్లో॥ దృశ్యతే చ మహాజ్వాలో న కరోతి చ మే రుజమ్ ।
శిశిర స్యేవ సంపాతో లాంగూలాగ్రే ప్రతిష్ఠితః ॥ 34

పదచ్ఛేదము :- దృశ్యతే - చ - మహాజ్వాలః - న - కరోతి - చ - మే - రుజమ్, శిశిరస్య - ఇవ - సంపాతః - లాంగూలాగ్రే - ప్రతిష్ఠితః ॥

అన్వయక్రమము :- మహాజ్వాలః దృశ్యతే; మే రుజం న చ కరోతి, లాంగూలాగ్రే ప్రతిష్ఠితః శిశిరస్య సంపాత ఇవ (అస్తి).

ప్రతిపదార్థము :- మహాజ్వాలః = గొప్పదైనమంట, దృశ్యతే = కనబడుచున్నది, మే = నాకు, రుజం = బాధను, న చ కరోతి = ఏ మాత్రమును కల్గించుటలేదు, లాంగూలాగ్రే = తోకచివరను, ప్రతిష్ఠితః = ఉంచబడిన, శిశిరస్య = మంచుయొక్క, సంపాతః ఇవ = ముద్దవలె (అస్తి = ఉన్నది).

తాత్పర్యము :- నాకు చూడగా ఈ యగ్ని పెద్దమంటలతో గానవచ్చుచున్నది. కాని బాధమాత్ర మేమియు గల్గించుటలేదు. నా తోక చివర ఒక మంచు ముద్దను పెట్టినట్లే యున్నది గాని అగ్నిగా నాకు కనిపించుటలేదు. ఇది ఏమి చిత్రమో!

శ్లో॥ అథవా తదిదం వ్యక్తం యద్దృష్టం ప్లవతా మయా ।
రామప్రభావా దాశ్చర్యం పర్వత స్సరితాం పతౌ ॥ 35

పదచ్ఛేదము :- అథవా - తత్ - ఇదం - యత్ - దృష్టం - ప్లవతా - మయా - రామప్రభావాత్ - ఆశ్చర్యం - పర్వతః - సరితాం - పతౌ ॥

అన్వయక్రమము :- అథవా ప్లవతా మయా రామప్రభావాత్ సరితాం పతౌ యత్

ఆశ్చర్యం పర్వతః దృష్టః తత్ ఇదం వ్యక్తమ్.

ప్రతిపదార్థము :- అథవా = లేక, ప్లవతా = దాటుచున్నట్టి, మయా = నాచేత, సరితాం పతౌ = సముద్రమునందు, రామప్రభావాత్ = శ్రీరాముని ప్రభావమువలన, యత్ = ఎట్లుగా, ఆశ్చర్యం = ఆశ్చర్యకరముగా, పర్వతః = మైనాకపర్వతము, దృష్టః = చూడబడినదో, తత్ = అట్లుగా, ఇదం = ఈ యగ్నిశైత్యము, వ్యక్తమ్ = స్పష్టమైనది.

తాత్పర్యము :- పూర్వము నేను మహాసాగరమును దాటుచున్నప్పుడు శ్రీరాముని ప్రభావముచే ఆశ్చర్యకరముగా సముద్రము నుండి మైనాకపర్వతము ఉద్భవించుట ఎట్లు జరిగినదో అట్లే ఇప్పుడీ యగ్నికి శైత్యము గూడ సంభవించియున్నదని స్పష్టమగుచున్నది.

శ్లో॥ యది తావ త్సముద్రస్య మైనాకస్య చ ధీమతః ।
రామార్థం సంభ్రమ స్తాదృ క్కి మగ్ని ర్న కరిష్యతి ॥ 36

పదచ్ఛేదము :- యది - తావత్ - సముద్రస్య - మైనాకస్య - చ - ధీమతః - రామార్థం - సంభ్రమః - తాదృక్ - కిమ్ - అగ్నిః - న - కరిష్యతి ॥

అన్వయక్రమము :- సముద్రస్య, ధీమతః మైనాకస్య చ, రామార్థం తావత్ సంభ్రమః దృష్టః యది అగ్నిః తాదృక్ (సంభ్రమం) కిం న కరిష్యతి?

ప్రతిపదార్థము :- సముద్రస్య = సముద్రమునకును, ధీమతః = గొప్పబుద్ధిగలవాడైన, మైనాకస్య చ = మైనాకునకును, రామార్థం = శ్రీరామునికొఱకై, తావత్ సంభ్రమః = అంతటి వేగిరపాటు (దృష్టః) యది = కనపడినప్పుడు, అగ్నిః = అగ్నిదేవుడు (మాత్రము) తాదృక్ సంభ్రమం = అంతటి ఉత్కంఠను, కిం = ఏల, న కరిష్యతి = చేయడు?

తాత్పర్యము :- ఆ నా డా మహనీయులైన సముద్రునకును మైనాకునకును శ్రీరాముని సేవకొఱకై అంతటి ఉత్కంఠ గల్గినప్పుడు ఇప్పుడీ యగ్నిదేవునకు మాత్రము ఇట్టి సంభ్రమము గలుగకుండ ఎట్లుండును?

శ్లో॥ సీతాయా శ్చానృశంస్యేన తేజసా రాఘవస్య చ ।
పితుశ్చ మమ సఖ్యేన న మాం దహతి పావకః ॥ 37

పదచ్ఛేదము :- సీతాయాః - చ - ఆనృశంస్యేన - తేజసా - రాఘవస్య - చ - పితుః - చ - మమ - సఖ్యేన - న - మాం - దహతి - పావకః ॥

అన్వయక్రమము :- సీతాయాః ఆనృశంస్యేన, రాఘవస్య తేజసా చ, మమ పితుః, సఖ్యేన చ పావకః మాం న దహతి.

ప్రతిపదార్థము :- సీతాయాః = సీతాదేవియొక్క, ఆనృశంస్యేన = కారుణ్యముచేతను, రాఘవస్య = శ్రీరామునియొక్క, తేజసా చ = తేజముచేతను, మమ = నాయొక్క పితుః = తండ్రియొక్క, సఖ్యేన చ = మైత్రిచేతను, పావకః = అగ్ని, మాం = నన్ను, న దహతి = దహించుటలేదు.

తాత్పర్యము :- సీతాదేవియొక్క దయావిశేషముచేతను, శ్రీరాముని యొక్క ప్రభావాతిశయముచేతను, నా తండ్రియగు వాయుదేవునియొక్క స్నేహాధిక్యముచేతను అగ్నిదేవుడు ఇప్పుడు నన్ను తపింపచేయుట లేదు.

శ్లో॥ భూయ స్స చింతయామాస ముహూర్తం కపికుంజరః ।
ఉత్పపా తాథ వేగేన ననాద చ మహాకపిః ॥ 38

పదచ్ఛేదము:- భూయః - సః - చింతయామాస - ముహూర్తం - కపికుంజరః, ఉత్పపాత - అథ - వేగేన - ననాద - చ - మహాకపిః ॥

అన్వయక్రమము :- సః కపికుంజరః భూయః ముహూర్తం చింతయామాస, అథ మహాకపిః వేగేన ఉత్పపాత ననాద చ.

ప్రతిపదార్థము :- సః కపికుంజరః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, భూయః = తిరిగి, ముహూర్తం = రెండు క్షణముల కాలము, చింతయామాస = ఆలోచించెను, అథ = పిమ్మట, మహాకపిః = వానరశ్రేష్ఠుడైన హనుమ, వేగేన = వేగముతో, ఉత్పపాత = మీదికి ఎగిరెను, ననాద చ = గర్జించెను కూడను.

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడైన ఆ హనుమ అప్పుడు తిరిగి కొద్దిసేపు ఆలోచించి వెంటనే మహావేగముతో మీదికెగసి పెద్ద సింహనాదమును జేసెను.

శ్లో॥ పురద్వారం తత శ్శ్రీమాన్ శైలశృంగ మివోన్నతమ్ ।
విభక్తరక్షస్సంబాధ మాససా దానిలాత్మజః ॥ 39

పదచ్ఛేదము :- పురద్వారం - తతః - శ్రీమాన్ - శైలశృంగమ్ - ఇవ - ఉన్నతమ్, విభక్తరక్షస్సంబాధమ్ - ఆససాద - అనిలాత్మజః ॥

అన్వయక్రమము :- తతః శ్రీమాన్ అనిలాత్మజః శైలశృంగమ్ ఇవ ఉన్నతం, విభక్తరక్షస్సంబాధం పురద్వారమ్ ఆససాద.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, శ్రీమాన్ = శుభలక్షణ సముపేతుడైన, అనిలాత్మజః = వాయునందనుడు, శైలశృంగమ్ ఇవ = పర్వతశిఖరమువలె, ఉన్నతం = ఎత్తైనదియును, విభక్తరక్షస్సంబాధం = విడివడిన రాక్షసులయొక్క సమ్మర్దము గలదియునగు, పురద్వారం = పట్టణద్వారమును, ఆససాద = చేరెను.

తాత్పర్యము :- అటు పిమ్మట వాయునందనుడు పర్వత శిఖరమువలె నున్నతమై రాక్షసుల సమ్మర్దములేనిదై యున్నట్టి పట్టణద్వారము కడకు చేరుకొనెను.

శ్లో॥ స భూత్వా శైలసంకాశః క్షణేన పున రాత్మవాన్ ।
హ్రస్వతాం పరమాం ప్రాప్తో బంధనా న్యవశాతయత్ ॥ 40

పదచ్ఛేదము :- సః - భూత్వా - శైలసంకాశః - క్షణేన - పునః - ఆత్మవాన్ - హ్రస్వతాం - పరమాం - ప్రాప్తః - బంధనాని - అవశాతయత్ ॥

అన్వయక్రమము :- ఆత్మవాన్ సః శైలసంకాశః భూత్వా పునః క్షణేన పరమాం హ్రస్వతాం ప్రాప్తః సన్ బంధనాని అవశాతయత్.

ప్రతిపదార్థము :- ఆత్మవాన్ సః = మహాత్ముడైన యా హనుమ, క్షణేన = ఒక్క క్షణమున, శైలసంకాశః = పర్వతమును బోలినట్టివాడుగా, భూత్వా = అయి (అనగా పెరిగి) పునః = తిరిగి, పరమాం = గొప్పదైన, హ్రస్వతాం = హ్రస్వరూపమును, ప్రాప్తః సన్ = పొందినవాడై, బంధనాని = బంధనములను, అవశాతయత్ = సడలించుకొనెను.

తాత్పర్యము :- మహాశక్తిసంపన్నుడైన యా హనుమ అప్పుడు క్షణములో పర్వతమువలె తన రూపమును పెద్దగా పెంచుకొని వెంటనే తిరిగి మిక్కిలి చిన్నదైన రూపమును ధరించి వెనుకటి బంధనములను అన్నింటిని సడలించుకొనెను.

శ్లో॥ విముక్త శ్చాభవ చ్ఛ్రీమాన్పునః పర్వతసన్నిభః ।
వీక్షమాణశ్చ దదృశే పరిఘం తోరణాశ్రితమ్ ॥ 41

పదచ్ఛేదము :- విముక్తః - చ - అభవత్ - శ్రీమాన్ - పునః - పర్వతసన్నిభః - వీక్షమాణః - చ - దదృశే - పరిఘం - తోరణాశ్రితమ్ ॥

అన్వయక్రమము :- శ్రీమాన్ సః విముక్తః సన్ పునః పర్వతసన్నిభః అభవత్, వీక్షమాణః తోరణాశ్రితం పరిఘం దదృశే.

ప్రతిపదార్థము :- శ్రీమాన్ సః = శుభలక్షణ సంపన్నుడైన యా హనుమ, విముక్తః =

బంధవిముక్తుడై, పునః = తిరిగి, పర్వతసన్నిభః = పర్వతముతో సమానుడు, అభవత్ = ఆయెను, వీక్షమాణః = పరికించుచున్నవాడైన, సః = ఆ హనుమ, తోరణాశ్రితం = పురద్వారము నంటియున్న, పరిఘం = ఇనుపగడియను, దదృశే = చూచెను.

తాత్పర్యము :– అట్లు తన బంధనమునుండి విడివడినట్టి మహాబలాఢ్యుడైన హనుమ, వెంటనే తిరిగి పర్వతసమానుడుగా వృద్ధిచెందెను. అట్టి రూపముతో ఇటు నటు చూడగా నాతనికి ఆ పట్టణద్వారము నంటియున్న ఇనుపగడియ గానవచ్చెను.

శ్లో॥ స తం గృహ్య మహాబాహుః కాలాయసపరిష్కృతమ్ ।
రక్షిణస్తాన్ పున స్సర్వాన్ సూదయామాస మారుతిః ॥ 42

పదచ్ఛేదము :– సః – తం – గృహ్య – మహాబాహుః – కాలాయసపరిష్కృతమ్, రక్షిణః – తాన్ – పునః – సర్వాన్ – సూదయామాస – మారుతిః ॥

అన్వయక్రమము :– సః మహాబాహుః మారుతిః కాలాయసపరిష్కృతం తం గృహ్య తాన్ రక్షిణః సర్వాన్ సూదయామాస.

ప్రతిపదార్థము :– సః = ఆ, మహాబాహుః = మహావీరుడైన, మారుతిః = హనుమ, కాలాయసపరిష్కృతం = ఉక్కుతో నిర్మింపబడినట్టి, తం = ఆ గడియను, గృహ్య = పట్టుకొని, తాన్ = ఆ, రక్షిణః సర్వాన్ = రక్షకభటులనందఱను, పునః = తిరిగి, సూదయామాస = హతమార్చెను.

తాత్పర్యము :– మహావీరుడైన హనుమ బలమైన ఆ ఉక్కుగడియను గైకొని, అచ్చట కావలియున్న భటుల నెల్లరను పరిమార్చెను.

శ్లో॥ స తా న్నిహత్వా రణచండవిక్రమః
సమీక్షమాణః పునరేవ లంకామ్ ।
ప్రదీప్తలాంగూల కృతార్చిమాలీ
ప్రకాశ తాదిత్య ఇ వార్చిమాలీ ॥ 43

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"పావకశైత్యమ్" నామ
త్రిపంచాశస్సర్గః.

పదచ్ఛేదము :– సః – తాన్ – నిహత్వా – రణచండవిక్రమః – సమీక్షమాణః – పునః – ఏవ – లంకాం – ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ, ప్రకాశత – ఆదిత్యః –

ఇవ - అర్చిమాలీ ॥

అన్వయక్రమము :- రణచండవిక్రమః సః తాన్ నిహత్వా పునః ఏవ లంకాం సమీక్షమాణః ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ అర్చిమాలీ ఆదిత్యః ఇవ ప్రకాశత.

ప్రతిపదార్థము :- రణచండవిక్రమః = యుద్ధమునందు భయంకరమైన పరాక్రమముగల్గినట్టి, సః = ఆ హనుమ, తాన్ = ఆ రక్షకభటులను, నిహత్వా = పరిమార్చి, పునః ఏవ = మఱల, లంకాం = లంకానగరిని, సమీక్షమాణః = పరికించుచున్నవాడై, ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ సన్ = ప్రజ్వలించుచున్న లాంగూలమునందు గూర్పబడిన అగ్నిజ్వాలలుగలవాడై, అర్చిమాలీ = కిరణముల సమూహము గల్గినట్టి, ఆదిత్యః ఇవ = సూర్యుడువలె, ప్రకాశత = ప్రకాశించెను.

తాత్పర్యము :- అచ్చటి రక్షకభటులైన రక్కసుల నెల్లరను ఉక్కడగించి నిలువబడి అటునుండియే లంకానగరమును జూచుచుండగా తన తోకయందు ప్రజ్వలించుచున్న జ్వాలలతో గూడిన యా హనుమ కిరణముల మాలికలతో తేజరిల్లుచున్న భాస్కరుని వలెనే ప్రకాశించెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"పావక శైత్యము" అను
ఏబదిమూడవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

చతుష్పంచాశసర్గ

శ్లో॥ వీక్షమాణ స్తతో లంకాం కపిః కృతమనోరథః ।
వర్ధమానసముత్సాహః కార్యశేష మచింతయత్ ॥ 1

పదచ్ఛేదము :- వీక్షమాణః - తతః - లంకాం - కపిః - కృతమనోరథః - వర్ధమానసముత్సాహః - కార్యశేషం - అచింతయత్ ॥

అన్వయక్రమము :- తతః కృతమనోరథః కపిః లంకాం వీక్షమాణః వర్ధమాన సముత్సాహః (సన్) కార్యశేషమ్ అచింతయత్.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, కృతమనోరథః = నెఱవేర్చుకొన్న కోరికగలవాడైనట్టి, కపిః = హనుమ, లంకాం = లంకా పట్టణమును, వీక్షమాణః = విలోకించుచున్నవాడై, వర్ధమానసముత్సాహః (సన్) = వృద్ధిపొందుచున్న గొప్ప ఉత్సాహముగలవాడగుచు, కార్యశేషం = కర్తవ్యముయొక్క శేషవిషయమును గూర్చి, అచింతయత్ = ఆలోచించెను.

తాత్పర్యము :- పిమ్మట హనుమంతుడు లంకానగరమును ఒకమాఱు పరికించి చూచుచు తన మనోరథము నెఱవేరుటవలన పొంగివచ్చుచున్న ఉత్సాహముతో ఇకమీదట తాను చేయవలసిన కర్తవ్యమును గూర్చి ఆలోచింపసాగెను.

శ్లో॥ కిం ను ఖల్వవశిష్టం మే కర్తవ్య మిహ సాంప్రతమ్ ।
య దేషాం రక్షసాం భూయః సంతాపజననం భవేత్ ॥ 2

పదచ్ఛేదము :- కిం - ను - ఖలు - అవశిష్టం - మే - కర్తవ్యమ్ - ఇహ - సాంప్రతమ్ - యత్ - ఏషాం - రక్షసాం - భూయః - సంతాపజననం - భవేత్ ॥

అన్వయక్రమము :- ఏషాం రక్షసాం భూయః యత్ సంతాపజననం భవేత్, ఇహ సాంప్రతం మే అవశిష్టం తత్ కర్తవ్యం కిం ను ఖలు?

ప్రతిపదార్థము :- ఏషాం రక్షసాం = ఈ రాక్షసులకు, భూయః = తిరిగి, యత్ = ఏ కృత్యము, సంతాపజననం = సంతాపమును కల్గించునట్టిది, భవేత్ = కాగలదో,

సాంప్రతం = ఇప్పుడు, ఇహ = ఇచ్చట, మే = నాకు, అవశిష్టం = మిగిలియున్నట్టి, తత్ = ఆ, కర్తవ్యం = చేయవలసియున్నపని, కిం ను ఖలు = ఏమియో గదా!

తాత్పర్యము :– ఇప్పుడీ రాక్షసులకు మఱల గొప్పసంతాపము గల్గించుటకు గాను నేను చేయవలసియున్నట్టిదైన మిగిలిపోయినపని ఇంక ఏమి యున్నదో గదా!

శ్లో॥ వనం తావ త్ప్రమథితం ప్రకృష్టా రాక్షసా హతాః ।
బలైకదేశః క్షపితః శేషం దుర్గవినాశనమ్ ॥ 3

పదచ్ఛేదము :– వనం – తావత్ – ప్రమథితం – ప్రకృష్టాః – రాక్షసాః – హతాః, బలైకదేశః – క్షపితః – శేషం – దుర్గవినాశనమ్ ॥

అన్వయక్రమము :– వనం తావత్ ప్రమథితం, ప్రకృష్టాః, రాక్షసాః హతాః, బలైకదేశః క్షపితః, శేషం దుర్గవినాశనమ్.

ప్రతిపదార్థము :– వనం తావత్ = వన మంతయును, ప్రమథితం = ధ్వంసము చేయబడినది, ప్రకృష్టాః = బలవంతులైన, రాక్షసాః = రాక్షసులు, హతాః = వధింపబడిరి, బలైకదేశః = సైన్యములో ఒక భాగము, క్షపితః = నాశనము చేయబడినది, దుర్గవినాశనం = కోటను కూల్చివేయుట, శేషం = మిగిలినది.

తాత్పర్యము :– ఈ లంకలోని వనమంతయును ధ్వంసము చేసినాను; బలవంతులైన రాక్షసులను పెక్కుమందిని చంపినాను; ఈ రాక్షససైన్యములో కొంతభాగమును హతమార్చినాను. ఇక మిగిలియున్నది కోటను పడగొట్టుటయే.

శ్లో॥ దుర్గే వినాశితే కర్మ భవే త్సుఖపరిశ్రమమ్ ।
అల్పయత్నేన కార్యేఽస్మిన్ మమ స్యా త్సఫలః శ్రమః ॥ 4

పదచ్ఛేదము :– దుర్గే – వినాశితే – కర్మ – భవేత్ – సుఖపరిశ్రమమ్ – అల్పయత్నేన – కార్యే – అస్మిన్ – మమ – స్యాత్ – సఫలః – శ్రమః ॥

అన్వయక్రమము :– దుర్గే వినాశితే (సతి) కర్మ సుఖపరిశ్రమం భవేత్; అస్మిన్ కార్యే మమ శ్రమః అల్పయత్నేన సఫలః స్యాత్.

ప్రతిపదార్థము :– దుర్గే = కోట, వినాశితే (సతి) = ధ్వంసము చేయబడగా, కర్మ = పని, సుఖపరిశ్రమం = సుఖకరమైన శ్రమగలది, భవేత్ = కాగలదు, అస్మిన్ కార్యే = ఈ కృత్యమునందు, మమ = నా యొక్క, శ్రమః = ప్రయాసము, అల్పయత్నేన = కొద్ది ప్రయత్నముతో, సఫలః = సఫలమైనది, స్యాత్ = కాగలదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'కర్మ సుఖపరిశ్రమం భవేత్' – సముద్రలంఘనము మున్నగు నా ప్రయాసము, కఠోరతపశ్చర్య ఫలించినట్టుగ సుఖప్రదమైన ప్రయాసము కలదగునని భావము.

గోవిందరాజీయము :– 'కర్మ' – వనభంజనము, సముద్రలంఘనము, దౌత్యకృత్యము అంతయును సఫలమగునని భావము.

తాత్పర్యము :– ఇప్పుడీ కోటను గూడ ధ్వంసము చేసినచో నేనింతవఱకును చేసిన కృషి యంతయును సఫలము కాగలదు. ఈ యల్పప్రయత్నముతో నే నీ పని గూడ నెరవేర్చుటవలన నా ప్రయాసమంతయును సఫలము కాగలదు.

శ్లో॥ యో హ్యయం మమ లాంగూలే దీప్యతే హవ్యవాహనః ।
అస్య సంతర్పణం న్యాయ్యం కర్తు మేభి ర్గృహోత్తమైః ॥ 5

పదచ్ఛేదము :– యః – హి – అయం – మమ – లాంగూలే – దీప్యతే – హవ్యవాహనః – అస్య – సంతర్పణం – న్యాయ్యం – కర్తుమ్ – ఏభిః – గృహోత్తమైః ॥

అన్వయక్రమము :– మమ లాంగూలే అయం యః హవ్యవాహనః దీప్యతే, అస్య ఏభిః గృహోత్తమైః సంతర్పణం కర్తుం న్యాయ్యం హి.

ప్రతిపదార్థము :– మమ = నాయొక్క, లాంగూలే = తోకయందు, అయం = ఈ, యః హవ్యవాహనః = ఏ యగ్నిహోత్రుడు, దీప్యతే = జ్వలించుచున్నాడో, అస్య = ఆ యగ్నిహోత్రునకు, ఏభిః గృహోత్తమైః = ఈ శ్రేష్ఠమైన భవనములతో, సంతర్పణం = విందును, కర్తుం = చేయుటకు, న్యాయ్యం హి = ఉచితముగదా!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము, గోవిందరాజీయము :– 'అస్య సంతర్పణం కర్తుం న్యాయ్యం' – తోకకు రాక్షసులు రగిల్చిన జ్వాలలచే వాని శరీరమునకు ఏమియు తాపము గల్గింపకుండుటచే ఆ యగ్నిదేవునకు తాను తిరిగి సంతృప్తిని గలిగించుట ఉచితమని భావము.

తాత్పర్యము :– నా వాలాగ్రమునందు ప్రజ్వలించుచున్నట్టి అగ్నిదేవుడు నా శరీరమునకు ఇసుమంతయును తాపమును కల్గించకుండ నాపై ప్రేమజూపినాడు కాబట్టి అట్టి ఆ యగ్నిదేవునకు ఇప్పుడు ఈ లంకానగరమునందలి ప్రాసాదములతో విందుచేయుట నాకు న్యాయమైయుండును గదా!

శ్లో॥ తతః ప్రదీప్తలాంగూల స్సవిద్యు దివ తోయదః ।
భవనాగ్రేషు లంకాయా విచచార మహాకపిః ॥ 6

పదచ్ఛేదము :– తతః – ప్రదీప్తలాంగూలః – సవిద్యుత్ – ఇవ – తోయదః – భవనాగ్రేషు – లంకాయాః – విచచార – మహాకపిః ॥

అన్వయక్రమము :– తతః ప్రదీప్తలాంగూలః సః మహాకపిః సవిద్యుత్ తోయదః ఇవ లంకాయాః భవనాగ్రేషు విచచార.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, ప్రదీప్తలాంగూలః = మండుచున్నతోక గల్గినట్టి, సః మహాకపిః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, సవిద్యుత్ = మెఱపులతో గూడినట్టి, తోయదః ఇవ = మేఘమువలె, లంకాయాః = లంకానగరముయొక్క, భవనాగ్రేషు = భవనములమీద, విచచార = పర్యటించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'తోయదః ఇవ' – సంధ్యాకాలమునందలి ఎఱ్ఱనైన మేఘమువలెనని భావము. హనుమంతుని దేహము రక్తవర్ణమైనది గదా!

గోవిందరాజీయము :– 'ప్రదీప్తలాంగూలః' – హనుమ తన దేహమును సంకోచింపజేసి బంధనమును తొలగించుకొనినప్పటికిని తోక పైనున్న అగ్నిని భావికృత్యముకొఱకై నిలుపుకొనెనని గ్రహింపవలెను.

తాత్పర్యము :– అట్లు నిశ్చయించుకొని హనుమ జ్వలించుచున్న తన వాలముతోడను తన ఎఱ్ఱని శరీరముతోడను ఆ లంకానగరమునందలి సౌధాగ్రములపై మెఱపులతో గూడిన సంధ్యాకాలమేఘమువలె పరిభ్రమించెను.

శ్లో॥ గృహా ద్గృహం రాక్షసానా ముద్యానాని చ వానరః ।
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః ॥ 7

పదచ్ఛేదము :– గృహాత్ – గృహం – రాక్షసానాం – ఉద్యానాని – చ – వానరః – వీక్షమాణః – హి – అసంత్రస్తః – ప్రాసాదాన్ – చ – చచార – సః ॥

అన్వయక్రమము :– సః వానరః రాక్షసానాం గృహాత్ గృహం ఉద్యానాని చ ప్రాసాదాన్ చ వీక్షమాణః అసంత్రస్తః చచార.

ప్రతిపదార్థము :– సః వానరః = ఆ హనుమ, రాక్షసానాం = రాక్షసులయొక్క, ఉద్యానాని చ = ఉద్యానవనములను, ప్రాసాదాంశ్చ = సౌధములను, వీక్షమాణః =

విలోకించుచున్నవాడై, అసంత్రస్తః = భయమును పొందనివాడై, గృహాత్ = ఒక యింటినుండి, గృహం = ఒక యింటికి, చచార = పరిభ్రమించెను.

తాత్పర్యము :- అప్పుడా హనుమ అచ్చటి రాక్షసులయొక్క సౌధములనెల్లను ఉద్యానవనములను పరికించుచు విసుగు చెందకుండ ఒక భవనమునుండి వేరొక భవనమునకు మిక్కిలి ఆసక్తితో పరిభ్రమించెను.

శ్లో॥ అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్ ।
అగ్నిం తత్ర వినిక్షిప్య శ్వసనేన సమో బలీ ॥ 8

శ్లో॥ తతోఽన్య త్పుప్లువే వేశ్మ ప్రహస్తస్య నివేశనమ్ ।
ముమోచ హనుమా నగ్నిం కాలానలశిఖోపమమ్ ॥ 9

పదచ్ఛేదము :- అపప్లుత్య - మహావేగః - ప్రహస్తస్య - నివేశనమ్, అగ్నిం - తత్ర - వినిక్షిప్య - శ్వసనేన - సమః - బలీ, తతః - అన్యత్ - పుప్లువే - వేశ్మ - మహాపార్శ్వస్య - వీర్యవాన్ - ముమోచ - హనుమాన్ - అగ్నిం - కాలానల శిఖోపమమ్ ॥

అన్వయక్రమము :- మహావేగః (సః) ప్రహస్తస్య నివేశనమ్ అవప్లుత్య తత్ర అగ్నిం వినిక్షిప్య బలీ, వీర్యవాన్, శ్వసనేన సమః హనుమాన్ తతః అన్యత్ మహాపార్శ్వస్య వేశ్మ పుప్లువే; కాలానలశిఖోపమమ్ అగ్నిం (తత్ర) ముమోచ.

ప్రతిపదార్థము :- మహావేగః (సః) = గొప్పవేగవంతుడైన ఆ హనుమ, ప్రహస్తస్య = ప్రహస్తునియొక్క, నివేశనం = భవనమును, అవప్ల్యుత్య = దుమికి, తత్ర = ఆ భవనముపై, అగ్నిం = అగ్నిని, వినిక్షిప్య = పడవేసి, బలీ = బలాఢ్యుడును, వీర్యవాన్ = పరాక్రమవంతుడును, శ్వసనేన = వాయుదేవునితో, సమః = సమానుడునగు, హనుమాన్ = హనుమ, తతః = అచ్చటినుండి, అన్యత్ = వేరైనట్టి, మహాపార్శ్వస్య = మహాపార్శ్వునియొక్క, వేశ్మ = భవనమును, పుప్లువే = ఉఱికెను, తత్ర = అచ్చట కాలానలశిఖోపమం = ప్రళయకాలాగ్నిజ్వాలవంటి, అగ్నిం = అగ్నిని, ముమోచ = విడిచెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- ప్రహస్తస్య నివేశనం - ప్రధానమంత్రి యగుట వలన మొట్టమొదట ఆతనిని గౌరవించుట ఉచితమని అతని భవనమునకే హనుమ అగ్నిసంస్కారము చేసెనని భావము.

తాత్పర్యము :- అప్పుడా హనుమ మహావేగముతో పోయి ప్రహస్తుని భవనము మీదికి ఉఱికి దానికి నిప్పు అంటించి మహాబలపరాక్రమసంపన్నుడైన యాతడు వాయువేగముతో అటనుండి వెడలి మహాపార్శ్వుని ప్రాసాదము మీది కుఱికి అచ్చట ఆ మేడకు ప్రళయకాలమునందలి అగ్నిజ్వాలవంటి మంటను ముట్టించెను.

శ్లో॥ వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః ।
శుకస్య చ మహాతేజా స్సారణస్య చ ధీమతః ॥ 10

శ్లో॥ తథా చేంద్రజితో వేశ్మ దదాహ హరియూథపః ।
జంబుమాలే స్సుమాలేశ్చ దదాహ భవనం తతః ॥ 11

పదచ్ఛేదము :- వజ్రదంష్ట్రస్య – చ – తథా – పుప్లువే – సః – మహాకపిః, శుకస్య – చ – మహాతేజాః – సారణస్య – చ – ధీమతః, తథా – చ – ఇంద్రజితః – వేశ్మ – దదాహ – హరియూథపః – జంబుమాలేః – సుమాలేః – చ – దదాహ – భవనం – తతః ॥

అన్వయక్రమము :- మహాతేజాః సః మహాకపిః తథా వజ్రదంష్ట్రస్య (వేశ్మ) చ పుప్లువే; హరియూథపః శుకస్య చ, ధీమతః సారణస్య చ, తథా ఇంద్రజితః వేశ్మ చ దదాహ. తతః జంబుమాలేః భవనం, సుమాలేః భవనం చ దదాహ.

ప్రతిపదార్థము :- మహాతేజాః = గొప్ప తేజశ్శాలి యగు, సః మహాకపిః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, తథా = ఆ రీతిగా, వజ్రదంష్ట్ర = వజ్రదంష్ట్రునియొక్క, వేశ్మ చ = భవనమును, పుప్లువే = లంఘించెను. తథా = అట్లే, శుకస్య = శుకాసురుని యొక్క, వేశ్మ చ = భవనమును, ధీమతః = ప్రజ్ఞాశాలియైన, సారణస్య చ = సారణరాక్షసునియొక్క, వేశ్మ చ = భవనమును, దదాహ = దహించెను, తతః = అటుపిమ్మట, హరియూథపః = వానరశ్రేష్ఠుడైన హనుమ, జంబుమాలేః = జంబుమాలియొక్క, భవనం = భవనమును, సుమాలేః = సుమాలియొక్క, భవనం = భవనమును, దదాహ = దహించెను.

తాత్పర్యము :- అప్పుడా హనుమ వజ్రదంష్ట్రుని భవనము మీది కుఱికి అటనుండి శుకుని మందిరమునకును, అటనుండి బుద్ధిశాలియైన సారణుని భవనమునకును అట్లే ఇంద్రజిత్తుసౌధమును జేరి వానినెల్ల దహించెను. తేజశ్శాలియైన ఆ వానరయోధుడు అటుపిమ్మట జంబుమాలి భవనమును, సుమాలి భవనమును గూడ దహించెను.

శ్లో॥ రశ్మికేతోశ్చ భవనం సూర్యశత్రో స్తథైవ చ ।
ప్రహ్రస్వకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః ॥ 12

శ్లో॥ యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య రక్షసః ।
విద్యుజ్జిహ్వస్య ఘోరస్య తథా హస్తిముఖస్య చ ॥ 13

శ్లో॥ కరాలస్య విశాలస్య శోణితాక్షస్య చైవ హి ।
కుంభకర్ణస్య భవనం మకరాక్షస్య చైవ హి ॥ 14

శ్లో॥ యజ్ఞశత్రోశ్చ భవనం బ్రహ్మశత్రోస్తథైవ చ ।
నరాంతకస్య కుంభస్య నికుంభస్య దురాత్మనః ॥ 15

శ్లో॥ వర్జయిత్వా మహాతేజా విభీషణగృహం ప్రతి ।
క్రమమాణః క్రమేణైవ దదాహ హరిపుంగవః ॥ 16

పదచ్ఛేదము: అన్వయక్రమము :- మహాతేజాః సః హరిపుంగవః విభీషణగృహం ప్రతి వర్జయిత్వా, రశ్మికేతోః భవనం చ, తథైవ సూర్యశత్రోః ప్రహ్రస్వకర్ణస్య, దంష్ట్రస్య, రక్షసః రోమశస్య చ, యుద్ధోన్మత్తస్య, మత్తస్య, రక్షసః ధ్వజగ్రీవస్య, విద్యుజ్జిహ్వస్య, ఘోరస్య, తథా హస్తిముఖస్య చ, కరాళస్య, విశాలస్య, శోణితాక్షస్య, కుంభకర్ణస్య, మకరాక్షస్య చ భవనం చ, యజ్ఞశత్రోః, బ్రహ్మశత్రోః చ తథా ఏవ నరాంతకస్య, కుంభస్య, దురాత్మనః నికుంభస్య చ భవనం చ క్రమేణ క్రమమాణః దదాహ ॥

ప్రతిపదార్థము :- మహాతేజాః = గొప్పతేజశ్శాలియైన, సః హరిపుంగవః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, క్రమేణైవ = వరుసగనే, క్రమమాణః = ముందున కేగుచున్నవాడై, విభీషణగృహం = విభీషణుని భవనమును, ప్రతివర్జయిత్వా = విడిచిపెట్టి, రశ్మికేతోః = రశ్మికేతువుయొక్క, భవనం చ = భవనమును, తథైవ = అట్లే, సూర్యశత్రోః చ = సూర్యశత్రువుయొక్కయు, ప్రహ్రస్వకర్ణస్య = ప్రహ్రస్వకర్ణునియొక్కయు, దంష్ట్రస్య = దంష్ట్రునియొక్కయు, రక్షసః = రాక్షసుడైన, రోమశస్య చ = రోమశునియొక్కయు, యుద్ధోన్మత్తస్య = యుద్ధోన్మత్తుని యొక్కయు, మత్తస్య = మత్తుని యొక్కయు, రక్షసః = రాక్షసుడైన, ధ్వజగ్రీవస్య = ధ్వజ గ్రీవునియొక్కయు, విద్యుజ్జిహ్వస్య = విద్యుజ్జిహ్వునియొక్కయు, ఘోరస్య = ఘోరుని యొక్కయు, తథా = అట్లు, హస్తిముఖస్య చ = హస్తిముఖునియొక్కయు, కరాళస్య = కరాళునియొక్కయు, విశాలస్య = విశాలుని యొక్కయు, శోణితాక్షస్య = శోణితాక్షునియొక్కయు, కుంభకర్ణస్య = కుంభకర్ణునియొక్కయు, మకరాక్షస్య చ =

మకరాక్షునియొక్కయు, భవనం = భవనమును, యజ్ఞశత్రోః చ = యజ్ఞశత్రువు యొక్కయు, బ్రహ్మశత్రోః = బ్రహ్మశత్రువు యొక్కయు, నరాంతకస్య = నరాంతకుని యొక్కయు, కుంభస్య = కుంభునియొక్కయు, దురాత్మనః = దుర్మార్గుడైన, నికుంభస్య చ = నికుంభుని యొక్కయు, భవనం = భవనమును, దదాహ = దహించెను.

తాత్పర్యము :- మహాతేజశ్శాలియైన వానరశ్రేష్ఠుడగు ఆ హనుమ లంకానగర వీథులందు తిరుగుచు వఱుసగ పోయి పోయి విభీషణుని భవనమును మాత్రము విడిచి రశ్మికేతువు, సూర్యశత్రువు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, విద్యుజ్జిహ్వుడు, ఘోరాసురుడు, హస్తిముఖుడు, కరాళుడు, విశాలాసురుడు, శోణితాక్షుడు, కుంభకర్ణుడు, మకరాక్షుడు, యజ్ఞశత్రువు, బ్రహ్మశత్రువు, నరాంతకుడు, కుంభుడు, దుర్మార్గుడగు నికుంభుడు అనువారల భవనముల మీదికి వెడలి వాటినన్నిటిని దహించెను.

శ్లో॥ తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః ।
గృహే ష్వృద్ధిమతా మృద్ధిం దదాహ స మహాకపిః ॥ 17

పదచ్ఛేదము :- తేషు - తేషు - మహార్హేషు - భవనేషు - మహాయశాః - గృహేషు - ఋద్ధిమతాం - ఋద్ధిం - దదాహ - సః - మహాకపిః ॥

అన్వయక్రమము :- మహాయశాః సః మహాకపిః ఋద్ధిమతాం గృహేషు తేషు తేషు మహార్హేషు భవనేషు ఋద్ధిం దదాహ.

ప్రతిపదార్థము :- మహాయశాః = గొప్పకీర్తిశాలియైన, సః మహాకపిః = ఆ వానరశ్రేష్ఠుడు, ఋద్ధిమతాం = గొప్ప సంపదలు గల్గినట్టి, (తేషాం = ఆ రక్కసుల యొక్క) గృహేషు = ఇండ్లయందును, తేషు తేషు = ఆ యా, మహార్హేషు = గొప్పవిలువైన, భవనేషు = భవనములందున్న, ఋద్ధిం = సంపదను, దదాహ = దహించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'ఋద్ధిమతాం ఋద్ధిం దదాహ' - అగ్నిదేవుడు పూర్వము రావణునికి భయపడియున్నవాడైనను నేడు మాత్రము సీతాదేవియొక్క తేజోబలసంబంధ విశేషముచేత సంశయము లేకుండగా రాక్షసభవనములను దహించెనని గ్రహించవలెను.

తాత్పర్యము :- మహాయశస్సంపన్నుడైన హనుమ అఖండైశ్వర్యములతో గూడిన ఆ

రాక్షసుల భవనములందలి సంపదలనెల్లను శ్రద్ధగా పరికించి వాటినెల్ల దహించెను.

శ్లో॥ సర్వేషాం సమతిక్రమ్య రాక్షసేంద్రస్య వీర్యవాన్ ।
ఆససా దాథ లక్ష్మీవాన్ రావణస్య నివేశనమ్ ॥ 18

పదచ్ఛేదము :- సర్వేషాం - సమతిక్రమ్య - రాక్షసేంద్రస్య - వీర్యవాన్, ఆససాద - అథ - లక్ష్మీవాన్ - రావణస్య - నివేశనమ్ ॥

అన్వయక్రమము :- వీర్యవాన్, లక్ష్మీవాన్, సః సర్వేషాం భవనాని సమతిక్రమ్య అథ రాక్షసేంద్రస్య రావణస్య నివేశనమ్ ఆససాద.

ప్రతిపదార్థము :- వీర్యవాన్ = పరాక్రమవంతుడును, లక్షీవాన్ = శోభాసంపన్నుడునగు, సః = ఆ హనుమ, సర్వేషాం = రాక్షసులందఱియొక్కయు, (భవనాని = భవనములను), సమతిక్రమ్య = దాటి, అథ = పిమ్మట, రాక్షసేంద్రస్య = రాక్షసరాజైన, రావణస్య = రావణునియొక్క, నివేశనం = భవనమును, ఆససాద = చేరుకొనెను.

తాత్పర్యము :- మహావీరుడైన హనుమ ఆ యా రాక్షసుల భవనము లన్నింటిని దాటివచ్చి చివరకు రాక్షసరాజైన రావణుని భవనము చేరుకొనెను.

శ్లో॥ తత స్తస్మిన్ గృహే ముఖ్యే నానారత్నవిభూషితే ।
మేరుమందరసంకాశే సర్వమంగళశోభితే ॥ 19

శ్లో॥ ప్రదీప్త మగ్ని ముత్సృజ్య లాంగూలాగ్రే ప్రతిష్ఠితమ్ ।
ననాద హనుమా న్వీరో యుగాంతే జలదో యథా ॥ 20

పదచ్ఛేదము :- తతః - తస్మిన్ - గృహే - ముఖ్యే - నానారత్నవిభూషితే, మేరు మందరసంకాశే - సర్వమంగళశోభితే, ప్రదీప్తమ్ - అగ్నిమ్ - ఉత్సృజ్య - లాంగూలాగ్రే - ప్రతిష్ఠితమ్ - ననాద - హనుమాన్ - వీరః - యుగాంతే - జలదః - యథా ॥

అన్వయక్రమము :- వీరః హనుమాన్ తతః నానారత్నవిభూషితే, మేరుమందరసంకాశే సర్వమంగళశోభితే, తస్మిన్ ముఖ్యే గృహే లాంగూలాగ్రే ప్రతిష్ఠితం ప్రదీప్తం అగ్నిమ్ ఉత్సృజ్య యుగాంతే జలదః యథా ననాద.

ప్రతిపదార్థము :- వీరః హనుమాన్ = వీరుడైన హనుమ, తతః = అటుపిమ్మట, నానారత్నవిభూషితే = వివిధములైన రత్నములచే అలంకరింపబడినదియును, మేరుమందరసంకాశే = మేరుపర్వతముతోడను మందరపర్వతముతోడను

సమానమైనట్టిదియును, సర్వమంగళశోభితే = సమస్త మంగళములతో ప్రకాశించుచున్నదియు నగు, ముఖ్యే = ప్రధానమైనట్టి, తస్మిన్ గృహే = ఆ భవనమునందు, లాంగూలాగ్రే = తోకచివరను, ప్రతిష్ఠితం = నిలుపబడియున్నట్టి, ప్రదీప్తం = జ్వలించుచున్నట్టి, అగ్నిం = అగ్నిని, ఉత్సృజ్య = విడిచి, యుగాంతే = ప్రళయకాలము నందలి, జలదః యథా = మేఘమువలె, ననాద = గర్జించెను.

తాత్పర్యము :– బహువిధ మణిగణములతో ప్రకాశించుచు మేరుమందర పర్వతములతో తులతూగుచున్నదై సర్వవిధమంగళ ద్రవ్యములతో శోభిల్లుచున్నట్టి ఆ రావణుని ప్రధాన భవనమునందు మహావీరుడైన హనుమ, తన లాంగూలాగ్రము నందు ప్రజ్వలించుచున్న అగ్నిని చక్కగ ప్రతిష్ఠించి అది రగులుకొనుచుండ తాను ప్రళయకాలమునందలి భయంకరమైన మేఘమువలె గర్జించుచుండెను.

శ్లో॥ శ్వసనేన చ సంయోగా దతివేగో మహాబలః ।
కాలాగ్నిరివ సందీప్తః ప్రావర్ధత హుతాశనః ॥ 21

పదచ్ఛేదము :– శ్వసనేన – చ – సంయోగాత్ – అతివేగః – మహాబలః, కాలాగ్నిః – ఇవ – సందీప్తః – ప్రావర్ధత – హుతాశనః ॥

అన్వయక్రమము :– అతివేగః మహాబలః హుతాశనః శ్వసనేన చ సంయోగాత్ సందీప్తః (సన్) కాలాగ్నిః ఇవ ప్రావర్ధత.

ప్రతిపదార్థము :– అతివేగః = మహావేగము గలవాడును, మహాబలః = అమిత బలాఢ్యుడును, అగు; (సః)హుతాశనః = (ఆ) అగ్ని, శ్వసనేన = వాయువుతోడి, సంయోగాత్ = కూడికవలన, సందీప్తః = మిక్కిలి ప్రజ్వలించినవాడై, కాలాగ్నిః ఇవ = ప్రళయకాలాగ్నివలె, ప్రావర్ధత = మిక్కిలి వృద్ధిచెందెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :–'శ్వసనేన చ సంయోగాత్' – సీతా నిశ్వాసవాయువులతో మిశ్రితమగుటచే వాయుదేవుడు గూడ నిర్భయముగా ఈ యగ్నికి సహాయము చేయుచున్నాడు అని గ్రహింపవలెను.

గోవిందరాజీయము :– వాయువును అగ్నియు గూడ రావణునకు భయపడియున్న వారైనప్పటికిని నేడు రాక్షసనాశనము త్వరలో గలుగుచున్నదని ధైర్యము వహించినవారై జంకులేకుండ విజృంభించిరని భావము.

తాత్పర్యము :- ఆ సమయమున మిత్రుడైన వాయువు వచ్చి తనతో గలిసియుండుటచే మహావేగమును మహాబలమును పొంది అగ్నిదేవుడు ప్రళయాగ్నివలె ప్రజ్వరిల్లుచు విజృంభింపసాగెను.

శ్లో॥ ప్రవృద్ధ మగ్నిం పవన స్తేషు వేశ్మ స్వచారయత్ ।
అభూ చ్ఛ్వసనసంయోగా దతివేగో హుతాశనః ॥ 22

పదచ్ఛేదము :- ప్రవృద్ధమ్ - అగ్నిం - పవనః - తేషు - వేశ్మసు - అచారయత్, అభూత్ - శ్వసనసంయోగాత్ - అతివేగః - హుతాశనః ॥

అన్వయక్రమము :- పవనః ప్రవృద్ధమ్ అగ్నిం తేషు వేశ్మసు అచారయత్, హుతాశనః శ్వసనసంయోగాత్ అతివేగః అభూత్.

ప్రతిపదార్థము :- పవనః = వాయువు, ప్రవృద్ధం = ప్రజ్వరిల్లినట్టి, అగ్నిం = అగ్నిని, తేషు వేశ్మసు = ఆ భవనములందు, అచారయత్ = ప్రసరింపజేసెను, హుతాశనః = అగ్ని, శ్వసనసంయోగాత్ = వాయువుయొక్క కూడిక వలన, అతివేగః = మహావేగసంపన్నుడు, అభూత్ = ఆయెను.

తాత్పర్యము :- అట్లు ప్రజ్వరిల్లుచుండిన ఆ యగ్నికి వాయుదేవుడు తోడుగా నుండి రావణుని భవనముల నన్నిటను ప్రసరింపజేసెను. అట్లు ఆ యగ్ని వాయువు సహాయముతో అమితమైన వేగముతో పరుగిడుచుండెను.

శ్లో॥ తాని కాంచనజాలాని ముక్తామణిమయాని చ ।
భవనాని వ్యశీర్యంత రత్నవంతి మహాంతి చ ॥ 23

పదచ్ఛేదము :- తాని - కాంచనజాలాని - ముక్తామణిమయాని - చ, భవనాని - వ్యశీర్యంత - రత్నవంతి - మహాంతి - చ ॥

అన్వయక్రమము :- కాంచనజాలాని ముక్తామణిమయాని రత్నవంతి మహాంతి తాని భవనాని వ్యశీర్యంత.

ప్రతిపదార్థము :- కాంచనజాలాని = బంగారు జాలరులు గల్గినవియును, ముక్తామణిమయాని చ = ముత్యములతో నిండినవియును, రత్నవంతి = రత్నములు గలవియును, మహాంతి చ = గొప్పవైనవియునగు, తాని = ఆ, భవనాని = భవనములు, వ్యశీర్యంత = శిథిలములైపోయెను.

తాత్పర్యము :- బంగారు గొలుసులతోను, మంచిముత్యములతోను, వివిధ

రత్నములతోను నిర్మింపబడిన ఆ యద్భుతమైన సౌధములన్నియును దహింపబడి, కరిగి నేలగూలినవి.

శ్లో॥ తాని భగ్నవిమానాని నిపేతు ర్ధరణీతలే ।
భవానానీవ సిద్ధానా మంబరా త్పుణ్యసంక్షయే ॥ 24

పదచ్ఛేదము :- తాని - భగ్నవిమానాని - నిపేతుః - ధరణీతలే, భవనాని - ఇవ - సిద్ధానామ్ - అంబరాత్ - పుణ్యసంక్షయే ॥

అన్వయక్రమము :- పుణ్యసంక్షయే అంబరాత్ సిద్ధానాం భవనాని ఇవ, భగ్నవిమానాని తాని భవనాని ధరణీతలే నిపేతుః.

ప్రతిపదార్థము :- పుణ్యసంక్షయే = పుణ్యముయొక్క క్షీణదశయందు, అంబరాత్ = ఆకాశమునుండి, సిద్ధానాం = సిద్ధులయొక్క, భవనాని ఇవ = భవనములవలె, భగ్నవిమానాని = విరిగిపోయిన అంతస్తులుగల, తాని భవనాని = ఆ రావణ భవనములు, ధరణీతలే = భూతలమునందు, నిపేతుః = పడిపోయినవి.

తాత్పర్యము :- తమ పుణ్యము నశించిపోయినపుడు సిద్ధులయొక్క భవనములు ఆకాశమునుండి పడిపోయి నట్లుండగ ఆ రావణుని భవనముల మీది అంతస్తులు ఒక్కటొక్కటిగ విరిగి పడుచుండగ సమూలముగా నేలపై కూలిపోయినవి.

శ్లో॥ సంజజ్ఞే తుముల శ్శబ్దో రాక్షసానాం ప్రధావతామ్ ।
స్వగృహస్య పరిత్రాణే భగ్నోత్సాహోర్జితశ్రియామ్ ॥ 25

పదచ్ఛేదము :- సంజజ్ఞే - తుములః - శబ్దః - రాక్షసానాం - ప్రధావతామ్, స్వగృహస్య - పరిత్రాణే - భగ్నోత్సాహోర్జితశ్రియామ్ ॥

అన్వయక్రమము :- స్వగృహస్య పరిత్రాణే భగ్నోత్సాహోర్జితశ్రియాం ప్రధావతాం రాక్షసానాం తుములః శబ్దః సంజజ్ఞే.

ప్రతిపదార్థము :- స్వగృహస్య = తమ గృహముయొక్క, పరిత్రాణే = కాపాడుకొనుట యందు, భగ్నోత్సాహోర్జితశ్రియామ్ = నశించిన ఉత్సాహమును, గొప్పవైన సంపదలను గల్గినట్టి, రాక్షసానాం = రాక్షసులు, ప్రధావతాం (సతాం) = పరుగులిడుచుండగా, తుములః శబ్దః = కోలాహలధ్వని, సంజజ్ఞే = ఉప్పతిల్లినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రామాయణశిరోమణి :- స్వే స్వే గృహపరిత్రాణే - భగ్నోత్సాహోర్జితశ్రియామ్ -

తమ గృహములను కాపాడుకొనుటకు శక్తిలేనివారును తమ సంపదలన్నింటిపై ఆశవదులుకొన్నవారునుగా ఆ రాక్షసులు కాన్పించుచున్నారని పాఠాంతరము.

తాత్పర్యము :- అచటి రాక్షసులు తమ తమ భవనములను దక్కించుకొను ఆశ గోల్పోయినవారై తమ ఐశ్వర్యములపై ఆశవదులుకొని నలువైపులకును పరుగెత్తుచుండగా వారి హాహాకారములవలన పెద్ద సంకులధ్వని యేర్పడెను.

శ్లో॥ నూన మేషోఽగ్ని రాయాతః కపిరూపేణ హా ఇతి ।
క్రందంత్య స్సహసా పేతుస్స్తనంధయధరాస్స్త్రియః ॥ 26

పదచ్ఛేదము :- నూనం - ఏషః - అగ్నిః - ఆయాతః - కపిరూపేణ - హా - ఇతి, క్రందంత్యః - సహసా - పేతుః - స్తనంధయధరాః - స్త్రియః ॥

అన్వయక్రమము :- హా నూనం కపిరూపేణ ఏషః అగ్నిః ఆయాతః ఇతి స్తనంధయధరాః స్త్రియః క్రందంత్యః సహసా పేతుః.

ప్రతిపదార్థము :- హా! = అయ్యో! నూనం = నిశ్చయముగా, కపిరూపేణ = వానర రూపముతో, ఏషః అగ్నిః = ఈ యగ్ని, ఆయాతః = వచ్చినది, ఇతి = అని, స్తనంధయధరాః = చన్నుగుడుచు బిడ్డలను ధరించిన, స్త్రియః = స్త్రీలు, క్రందంత్యః = ఆక్రోశించుచున్నవారై, సహసా = వెంటనే, పేతుః = పడిరి.

తాత్పర్యము :- అయ్యో! ఇప్పుడిచ్చటకు నిశ్చయముగా భీకరుడైనట్టి అగ్నిహోత్రుడే ఈ వానరరూపముతో నిట్లు వచ్చినాడు అని ఆక్రోశించుచు స్త్రీలు పాలుత్రాగుచున్న చంటిబిడ్డల నెత్తుకొని భీతితో పరువిడుచు త్రోవగానక ఆ మంటలో పడిరి.

శ్లో॥ కాశ్చి దగ్నిపరీతాంగ్యో హర్మ్యేభ్యో ముక్తమూర్ధజాః ।
పతంత్యో రేజిరేఽభ్రేభ్య స్సౌదామన్య ఇ వాంబరాత్ ॥ 27

పదచ్ఛేదము :- కాః - చిత్ - అగ్నిపరీతాంగ్యః - హర్మ్యేభ్యః - ముక్తమూర్ధజాః - పతంత్యః - రేజిరే - అభ్రేభ్యః - సౌదామన్యః - ఇవ - అంబరాత్ ॥

అన్వయక్రమము :- అగ్నిపరీతాంగ్యః ముక్తమూర్ధజాః కాశ్చిత్ హర్మ్యేభ్యః పతంత్యః అంబరాత్ అభ్రేభ్యః (పతంత్యః) సౌదామన్యః ఇవ రేజిరే.

ప్రతిపదార్థము :- అగ్నిపరీతాంగ్యః = అగ్నిచే చుట్టుకొనబడిన శరీరములు గలవారును, ము(గ్రమూర్ధజాః = విడివడినట్టి కేశములు గలవారునగు, కాశ్చిత్ = కొంతమంది స్త్రీలు, హర్మ్యేభ్యః = సౌధములనుండి, పతంత్యః = పడుచున్నవారై, అంబరాత్ =

ఆకాశమునుండి, అభ్రేభ్యః = మేఘములనుండి (పతంత్యః = పడుచున్నట్టి) సౌదామన్యః ఇవ = మెఱపుతీగలవలె, రేజిరే = ప్రకాశించిరి.

తాత్పర్యము :– తమ ఒడలంతయును అగ్నిజ్వాలలు చుట్టుముట్టుచుండ, చెదరిపోయిన జుట్టుతో మేడలనుండి క్రిందికి పడుచున్న స్త్రీలను చూడగా ఆకసమునందలి మేఘములనుండి క్రిందికి ప్రసరించుచున్న మెఱపుతీగలవలె గానవచ్చిరి.

శ్లో॥ వజ్రవిద్రుమవైదూర్య ముక్తారజతసంహితాన్ ।
విచిత్రాన్ భవనాన్ ధాతూన్ స్యందమానాన్ దదర్శ సః ॥ 28

పదచ్ఛేదము :– వజ్రవిద్రుమవైదూర్యముక్తారజతసంహితాన్, విచిత్రాన్ – భవనాన్ – ధాతూన్ – స్యందమానాన్ – దదర్శ – సః ॥

అన్వయక్రమము :– వజ్రవిద్రుమవైదూర్యముక్తారజతసంహితాన్, విచిత్రాన్ ధాతూన్ స్యందమానాన్ భవనాన్ సః దదర్శ.

ప్రతిపదార్థము :– వజ్రవిద్రుమవైదూర్యముక్తారజతసంహితాన్ = వజ్రములతోడను పవడములతోడను, వైడూర్యములతోడను మంచిముత్యములతోడను వెండితోడను మిశ్రితమైనట్టి, విచిత్రాన్ = విచిత్రములైనట్టి, ధాతూన్ = గైరికాది ధాతువులను, స్యందమానాన్ = స్రవించుచున్నట్టి, భవనాన్ = భవనములను, సః = ఆ హనుమ, దదర్శ = చూచెను.

తాత్పర్యము :– అప్పుడు హనుమంతు డచ్చట ఆ భవనములనుండి వజ్రములతోను పవడములతోను, వైడూర్యములతోడను, మంచి ముత్యములతోను, వెండితోను కలసి విచిత్రముగ రంగురంగుల ధాతుద్రవములు స్రవించుచుండుట గాంచెను.

శ్లో॥ నాగ్ని స్తృప్యతి కాష్ఠానాం తృణానాం చ యథా తథా,
హనుమాన్ రాక్షసేంద్రాణాం వధే కించి న్న తృప్యతి ।
న హనూమద్విశస్తానాం రాక్షసానాం వసుంధరా ॥ 29

పదచ్ఛేదము :– న – అగ్నిః – తృప్యతి – కాష్ఠానాం – తృణానాం – చ – యథా – తథా – హనుమాన్ – రాక్షసేంద్రాణాం – వధే – కించిత్ – న – తృప్యతి – న – హనూమద్విశస్తానాం – రాక్షసానాం – వసుంధరా ॥

అన్వయక్రమము :– యథా అగ్నిః కాష్ఠానాం తృణానాం చ న తృప్యతి, తథా రాక్షసేంద్రాణాం వధే హనుమాన్ కించిత్ న తృప్యతి. హనూమద్విశస్తానాం రాక్షసానాం వసుంధరా (అపి) న తృప్యతి.

ప్రతిపదార్థము :- యథా = ఏ రీతిగా, అగ్నిః = అగ్ని, కాష్ఠానాం = కట్టెలకును, తృణానాం = తృణములకును, న తృప్యతి = తృప్తినొందదో, తథా = అట్లు, రాక్షసేంద్రాణాం = రాక్షసశ్రేష్ఠులయొక్క, వధే = మారణమునందు, హనుమాన్ = హనుమ, కించిత్ = కొంచెమైనను, న తృప్యతి = తృప్తినొందుటలేదు, హనూమద్విశస్తానాం = హనుమంతునిచే వధింపబడినట్టి, రాక్షసానాం = రాక్షసులకు, వసుంధరా అపి = భూమిగూడ, న తృప్యతి = తృప్తిచెందుటలేదు.

సూచన:- ఇచ్చటి ఈ శ్లోకపాఠము బొంబాయి ప్రతినుండి గ్రహించబడినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- దక్షిణాది ప్రతుల పాఠము "నాగ్నిస్తృప్యతి కాష్ఠానాం తృణానాం హరియూథపః, నాగ్నిర్నాపి విశస్తానాం రాక్షసానాం వసుంధరా", కట్టెలకును తృణములకును అగ్ని తృప్తి నొందదు. అట్లే హనుమ తాను జ్వలింపచేయుచున్న అగ్నికిని తృప్తి నొందుటలేదు. అట్లే భూమి అప్పుడు చంపబడిన రాక్షసులకు తృప్తిపడుటలేదు.

తాత్పర్యము :- ఏ విధముగ అగ్ని కట్టెలచేతను తృణములచేతను తృప్తినొందుట యుండదో అట్లే హనుమ యానాడు చనిపోవుచున్న రాక్షసులచే తృప్తినొంద డాయెను. అట్లే భూమిగూడ హనుమంతునిచే తనపై కూలుచున్నట్టి రాక్షసులకు తృప్తినొంద దాయెను.

శ్లో॥ క్వచి త్కింశుకసంకాశాః క్వచి చ్ఛాల్మలిసన్నిభాః ।
క్వచి త్కుంకుమసంకాశాః శిఖా వహ్నే శ్చకాశిరే ॥ 30

పదచ్ఛేదము :- క్వచిత్ - కింశుకసంకాశాః - క్వచిత్ - శాల్మలిసన్నిభాః - క్వచిత్ - కుంకుమసంకాశాః - శిఖాః - వహ్నేః - చకాశిరే ॥

అన్వయక్రమము :- వహ్నేః శిఖాః క్వచిత్ కింశుకసంకాశాః క్వచిత్ శాల్మలిసన్నిభాః, క్వచిత్ కుంకుమసంకాశాః (సత్యః) చకాశిరే.

ప్రతిపదార్థము :- వహ్నేః = అగ్నియొక్క, శిఖాః = జ్వాలలు, క్వచిత్ = ఒకచోట, కింశుకసంకాశాః = మోదుగుపువ్వులను బోలినవిగను, క్వచిత్ = ఒకచోట, శాల్మలిసన్నిభాః = బూరుగుపువ్వులను బోలినవిగను, క్వచిత్ = ఒకచోట, కుంకుమసంకాశాః = కుంకుమపువ్వులను బోలునవిగను, (సత్యః = ఉన్నవై) చకాశిరే = ప్రకాశించినవి.

తాత్పర్యము :– లంకానగరభవనములందు చెలరేగిన అగ్నిజ్వాలలు అప్పుడు కొన్నిచోట్ల మోదుగ పువ్వులవలెను, కొన్నిచోట్ల బూరుగుపువ్వులవలెను, కొన్నిచోట్ల కుంకుమపువ్వులవలెను పలువిధములగు వన్నెలతో గాన్పించుచుండెను.

శ్లో॥ హనూమతా వేగవతా వానరేణ మహాత్మనా ।
లంకాపురం ప్రదగ్ధం త ద్రుద్రేణ త్రిపురం యథా ॥ 31

పదచ్ఛేదము :– హనూమతా – వేగవతా – వానరేణ – మహాత్మనా – లంకాపురం – ప్రదగ్ధం – తత్ – రుద్రేణ – త్రిపురం – యథా ॥

అన్వయక్రమము :– మహాత్మనా వేగవతా వానరేణ హనూమతా, రుద్రేణ తత్ త్రిపురం యథా లంకాపురం ప్రదగ్ధమ్.

ప్రతిపదార్థము :– మహాత్మనా = మహనీయుడైన, వేగవతా = వేగముగల, వానరేణ = కపిశ్రేష్ఠుడగు, హనూమతా = హనుమచే, రుద్రేణ = ఈశ్వరునిచే, తత్ త్రిపురం యథా = ఆ త్రిపురసమూహమువలె, లంకాపురం = లంకానగరము, ప్రదగ్ధం = మిక్కిలిగా దగ్ధము చేయబడినది.

తాత్పర్యము :– మహనీయుడైన హనుమ మహావేగమును వహించినవాడై ఆనాడు రుద్రుడు త్రిపురములను భస్మముచేసినట్లు లంకానగరమును దగ్ధపటలము కావించెను.

శ్లో॥ తతస్తు లంకాపురపర్వతాగ్రే
సముత్థితో భీమపరాక్రమోఽగ్నిః ।
ప్రసార్య చూడావలయం ప్రదీప్తో
హనూమతా వేగవతా విసృష్టః ॥ 32

పదచ్ఛేదము :– తతః – తు – లంకాపురపర్వతాగ్రే – సముత్థితః – భీమపరాక్రమః – అగ్నిః – ప్రసార్య – చూడావలయం – ప్రదీప్తః – హనూమతా – వేగవతా – విసృష్టః ॥

అన్వయక్రమము :– తతః వేగవతా హనూమతా విసృష్టః భీమపరాక్రమః అగ్నిః లంకాపురపర్వతాగ్రే చూడావలయం ప్రసార్య ప్రదీప్తః సన్ సముత్థితః.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, వేగవతా = గొప్పవేగము గల్గినట్టి, హనూమతా = హనుమంతునిచే, విసృష్టః = విడువబడిన, భీమపరాక్రమః = భీకరపరాక్రమము గల్గినట్టి, అగ్నిః = అగ్ని, లంకాపురపర్వతాగ్రే = లంకానగరముననున్న పర్వతాగ్రమున, చూడావలయం = జ్వాలల వలయమును, ప్రసార్య = ప్రసరింపజేసి, ప్రదీప్తః సన్ =

మిక్కిలి జ్వలించినదై, సముత్థితః = విజృంభించినది.

తాత్పర్యము :- అప్పుడు హనుమ మహావేగసంపన్నుడై అగ్నిని రగుల్కొల్పుచుండగా ఆ యగ్నిహోత్రుడు త్రికూట పర్వత శిఖరముపై భీమపరాక్రమముతో జ్వాలామాలలను ప్రసరింపచేయుచు విజృంభించి ప్రజ్వలింపసాగెను.

శ్లో॥ యుగాంత కాలానలతుల్యవేగః
సమారుతోఽగ్ని ర్వవృధే దివిస్పృక్ ।
విధూమరశ్మి ర్భవనేషు సక్తో
రక్షశ్శరీరాజ్యసమర్పితార్చిః ॥ 33

పదచ్ఛేదము :- యుగాంతకాలానలతుల్యవేగః - సమారుతః - అగ్నిః - వవృధే - దివిస్పృక్, విధూమరశ్మిః - భవనేషు - సక్తః - రక్షశ్శరీరాజ్యసమర్పితార్చిః ॥

అన్వయక్రమము :- సమారుతః (సః) అగ్నిః యుగాంతకాలానలతుల్యవేగః దివిస్పృక్ భవనేషు సక్తః రక్షశ్శరీరాజ్యసమర్పితార్చిః విధూమరశ్మిః (సన్) వవృధే.

ప్రతిపదార్థము :- సమారుతః = వాయువుతోకూడినట్టి, (సః) అగ్నిః = ఆ యగ్ని, యుగాంతకాలానలతుల్యవేగః = యుగావసానమునందలి ప్రళయకాలాగ్నితో సమానమైన వేగముగలదై, దివిస్పృక్ = ఆకసమునంటుచున్నదై, భవనేషు = భవనములందు, సక్తః = లగ్నమైనదై, రక్షశ్శరీరాజ్యసమర్పితార్చిః = రాక్షసుల శరీరము లనెడు నేయిచే ఏర్పడిన జ్వాలలు గలదై, విధూమరశ్మిః = పొగలేనట్టి మంటగలదై, వవృధే = విజృంభించెను.

తాత్పర్యము :- అప్పుడు వాయుదేవుని సహాయము నొందిన ఆ యగ్నిహోత్రుడు ప్రళయకాలమునందలి అగ్నితో సమానమైన విజృంభణముగలవాడై రాక్షసుల భవనములందు ప్రవేశించి యచ్చటి రాక్షసుల దేహములనెడి ఆజ్యముచే వృద్ధినొందిన జ్వాలలు గలవాడై పొగలేని దీప్తితో ఆకసము నంటుచు చూచుచుండగనే భీకరరూపముతో పెరిగిపోవుచుండెను.

శ్లో॥ ఆదిత్యకోటీసదృశ స్సుతేజా
లంకాం సమస్తాం పరివార్య తిష్ఠన్ ।
శబ్దైరనేకై రశనిప్రరూఢై
ర్భింద న్నివాండం ప్రబభౌ మహాగ్నిః ॥ 34

పదచ్ఛేదము :– ఆదిత్యకోటీసదృశః – సుతేజాః – లంకాం – సమస్తాం – పరివార్య – తిష్ఠన్ – శబ్దైః – అనేకైః – అశనిప్రరూఢైః – భిందన్ – ఇవ – అండం – ప్రబభౌ – మహాగ్నిః ॥

అన్వయక్రమము :– (సః) మహాగ్నిః ఆదిత్యకోటీసదృశః సుతేజాః సమస్తాం లంకాం పరివార్య తిష్ఠన్ అశనిప్రరూఢైః అనేకైః శబ్దైః అండం భిందన్ ఇవ ప్రబభౌ.

ప్రతిపదార్థము :– (సః) మహాగ్నిః = (ఆ)మహాగ్నిహోత్రము, ఆదిత్యకోటీసదృశః = కోటిసూర్యులతో సమానమైనదై, సుతేజాః = గొప్పతేజస్సుగల్గినదై, సమస్తాం = సంపూర్ణమైన, లంకాం = లంకానగరమును, పరివార్య = చుట్టుముట్టి, తిష్ఠన్ = నిలచినదై, అశనిప్రరూఢైః = పిడుగులవలె నుప్పతిల్లుచున్న, అనేకైః = బహువిధములైన, శబ్దైః = ధ్వనులతో, అండం = బ్రహ్మాండమును, భిందన్ ఇవ = బ్రద్దలుకొట్టుచున్నట్లుగా, ప్రబభౌ = మిక్కిలి ప్రకాశించెను.

తాత్పర్యము :– అట్లు చెలరేగిన ఆ యగ్నిహెూత్రము కోటిసూర్యులతో సమానముగ గొప్పతేజస్సు గలిగి లంకనంతను చుట్టుముట్టి పిడుగుపాటులవలె భీకరమైనట్టి బహువిధములైన ధ్వనులతో బ్రహ్మాండమును బ్రద్దలుగొట్టుచున్నట్టి ప్రళయకాలాగ్నివలె ప్రజ్వరిల్లెను.

శ్లో॥ త త్రాంబరా దగ్ని రతిప్రవృద్ధో
రూక్షప్రభః కింశుకపుష్పచూడః ।
నిర్వాణధూమాకులరాజయశ్చ
నీలోత్పలాభాః ప్రచకాశిరేఽ భ్రాః ॥ 35

పదచ్ఛేదము :– తత్ర – అంబరాత్ – అగ్నిః – అతిప్రవృద్ధః – రూక్షప్రభః – కింశుకపుష్పచూడః, నిర్వాణధూమాకులరాజయః – చ – నీలోత్పలాభాః – ప్రచకాశిరే – అభ్రాః ॥

అన్వయక్రమము :– తత్ర అగ్నిః రూక్షప్రభః కింశుకపుష్పచూడః అంబరాత్ అతిప్రవృద్ధః అభ్రాః చ నిర్వాణధూమాకులరాజయః నీలోత్పలాభాః (సంతః) ప్రచకాశిరే.

ప్రతిపదార్థము :– తత్ర = అచ్చట, అగ్నిః = అగ్ని, రూక్షప్రభః = కఠోరమైన ప్రకాశముగలదై, కింశుకపుష్పచూడః = మోదుగుపువ్వులవంటి జ్వాలలుగలదై, అంబరాత్ = ఆకాశము వఱకును, అతిప్రవృద్ధః = మిక్కిలి పెరిగినదయ్యెను. అభ్రాః చ = మేఘములును, నిర్వాణధూమాకులరాజయః = ఆరిన అగ్నియొక్క

ధూమములయొక్క చెదరిన సమూహములుగలవై, నీలోత్పలాభాః (సంతః) = నల్లకలువలవంటి కాంతులుగల్గినట్టివగుచు, ప్రచకాశిరే = ప్రకాశించినవి.

తాత్పర్యము :– అప్పుడచ్చటి మహాగ్ని భీకరమైన కాంతులతో మోదుగపువ్వులను బోలినట్టి జ్వాలలతో ఆకసము వఱకును పెరిగిపోవుచుండెను. అచటి మేఘములు అంతవరకును మండి చల్లారిన భవనములనుండి వచ్చినట్టి నల్లనిపొగలు చెదరి తనపై నలముకొనుటచే నల్లకలువల వంటి కాంతులుగలవై ప్రకాశించినవి.

శ్లో॥ వజ్రీ మహేంద్ర స్త్రిదశేశ్వరో వా
సాక్షా ద్యమో వా వరుణో ఽనిలో వా ।
రుద్రోఽగ్ని రర్కో ధనదశ్చ సోమో
న వానరో ఽయం స్వయమేవ కాలః ॥ 36

పదచ్ఛేదము :– వజ్రీ – మహేంద్రః – త్రిదశేశ్వరః – వా – సాక్షాత్ – యమః – వా – వరుణః – అనిలః – వా – రుద్రః – అగ్నిః – అర్కః – ధనదః – చ – సోమః – న – వానరః – అయం – స్వయమ్ – ఏవ – కాలః ॥

అన్వయక్రమము :– అయం త్రిదశేశ్వరః మహేంద్రః వజ్రీ వా, సాక్షాత్ యమః వా వరుణః వా అనిలః వా రుద్రః అగ్నిః అర్కః ధనదః సోమః వా భవేత్ (అయం) వానరః న, స్వయం కాలః ఏవ.

ప్రతిపదార్థము :– అయం = ఈతడు, త్రిదశేశ్వరః = దేవతలకు ప్రభువైనట్టి, వజ్రీ = వజ్రపాణియగు, మహేంద్రః వా = మహేంద్రుడో, సాక్షాత్ = ప్రత్యక్షముగా, యమః వా = యముడో, వరుణః వా = వరుణుడో, అనిలః వా = వాయుదేవుడో, రుద్రః = రుద్రుడో, అగ్నిః = అగ్నిదేవుడో, అర్కః = సూర్యుడో, ధనదః = కుబేరుడో, సోమః వా = చంద్రుడో, భవేత్ = అయియుండును. అయం = ఈతడు, వానరః = వానరుడు, న = కాడు, స్వయం = స్వయముగా, కాలః ఏవ = కాలుడే.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'రుద్రః అగ్నిః' అనుటకు బదులుగా 'రౌద్రః అగ్నిః' అని పాఠాంతరము ఈ పాఠమునకు రుద్రునియొక్క మూడవనేత్రమునకు సంబంధించిన అగ్ని యని అర్థము.

తాత్పర్యము :– మహాభయంకరుడైన ఈతడు దేవతలెల్లరకును ప్రభువైన వజ్రపాణియగు ఇంద్రుడుగాని లేక సాక్షాత్ యమధర్మరాజుగాని వరుణుడుగాని వాయుదేవుడుగాని

మహేశ్వరుడుగాని అగ్నిహోత్రుడుగాని భాస్కరుడు గాని కుబేరుడుగాని చంద్రుడుగాని అయియుండవలెను. అంతియేగాని వానరమాత్రుడు గాదు. ఆలోచించి చూడగా ఈతడు సాక్షాత్ మృత్యుదేవతయే యైయుండును.

శ్లో॥ కిం బ్రహ్మణ స్సర్వపితామహస్య
సర్వస్య ధాతు శ్చతురాననస్య ।
ఇ హాగతో వానరరూపధారీ
రక్షోపసంహారకరః ప్రకోపః ॥ 37

పదచ్ఛేదము :– కిం – బ్రహ్మణః – సర్వపితామహస్య – సర్వస్య – ధాతుః – చతురాననస్య – ఇహ – ఆగతః – వానరరూపధారీ – రక్షోపసంహారకరః – ప్రకోపః ॥

అన్వయక్రమము :– సర్వపితామహస్య, సర్వస్య ధాతుః, చతురాననస్య బ్రహ్మణః ప్రకోపః రక్షోపసంహారకరః వానరరూపధారీ (సన్) ఇహ ఆగతః కిం?

ప్రతిపదార్థము :– సర్వపితామహస్య = ఎల్లరకును పితామహుడైనవాడును, సర్వస్య = సమస్తమునకును, ధాతుః = ధరించినవాడును, చతురాననస్య = నాలుగుముఖములు గలవాడునగు, బ్రహ్మణః = బ్రహ్మయొక్క, ప్రకోపః = తీక్ష్ణమైన క్రోధము, రక్షోపసంహారకరః = రాక్షసులయొక్క వినాశమును గావించునదై, వానరరూపధారీ (సన్) = వానరరూపమును ధరించినదై, ఇహ = ఇచ్చటకు, ఆగతః కిం = వచ్చినదా యేమి?

తాత్పర్యము :– సమస్తప్రాణులకును మూలమైనవాడును సమస్తసృష్టికి కర్తయైనవాడును చతుర్ముఖుడు నగు బ్రహ్మదేవునకు గల్గినట్టి తీక్ష్ణమైన క్రోధమే ఈనా డీ రాక్షససంహారము గావించుచున్నట్టి ఈ వానరరూపమును ధరించినదై ఇప్పు డిట్లు ఇచ్చటకు వచ్చినదేమో!

శ్లో॥ కిం వైష్ణవం వా కపిరూపమేత్య
రక్షోవినాశాయ పరం సుతేజః ।
అనంత మవ్యక్త మచింత్యమేకం
స్వమాయయా సాంప్రత మాగతం వా? ॥ 38

పదచ్ఛేదము :– కిం – వైష్ణవం – వా – కపిరూపమ్ – ఏత్య – రక్షోవినాశాయ – పరం – సుతేజః, అనంతమ్ – అవ్యక్తమ్ – అచింత్యమ్ – ఏకం – స్వమాయయా – సాంప్రతమ్ – ఆగతం – వా ॥

అన్వయక్రమము :- అనంతం, అవ్యక్తం, అచింత్యం, ఏకం పరం వైష్ణవం సుతేజః వా రక్షోవినాశాయ స్వమాయయా సాంప్రతమ్ ఆగతం కిమ్ వా?

ప్రతిపదార్థము :- అనంతం = అంతములేనిదియును, అవ్యక్తం = అగోచరమైనదియును, అచింత్యం = ఊహింపరానిదియును, ఏకం = అద్వితీయ మైనదియును, పరం = ఉత్కృష్టమైనదియునగు, వైష్ణవం = విష్ణువునకు సంబంధించినట్టి, సుతేజః వా = ఉత్తమమైన తేజస్సే, రక్షోవినాశాయ = రాక్షసులయొక్క సంహారముకొఱకు, స్వమాయయా = తనయొక్క మాయచే, కపిరూపం = వానరరూపమును, ఏత్య = పొంది, సాంప్రతం = ఇప్పుడు, ఆగతం కిం వా = వచ్చినదో ఏమో!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :- 'అనంతం' దేశకాలవస్తు రూపమైన పరిమితిలేనట్టిది.

గోవిందరాజీయము :- 'అవ్యక్తం' - కంటికి కానరానిది. అచింత్యం - మనస్సునకు కూడా అందనిది. వైష్ణవం తేజః = విష్ణుశరీరాంతర్నిహితమైనట్టి తేజస్సు, స్వమాయయా - అసాధారణమైన తన ఆశ్చర్యశక్తిచేత.

వాసుదాసస్వామి :- అనంతము - కాలపరిచ్ఛేదము, వస్తుపరిచ్ఛేదము, దేశపరిచ్ఛేదము లేనిది.

అవ్యక్తము - కన్ను మొదలగు బాహ్యేంద్రియములకు గోచరింపనిది, ఏకము - అట్టిది రెండవది లేనిది, అచింత్యము - మనస్సుచే ఆలోచించి తెలిసికొన సాధ్యము గానిది. వైష్ణవం సుతేజః - విష్ణువునందున్న పూజ్యమగు పరమశక్తి. విష్ణుమూర్తియనెడి తేజస్సు -

"వా స్యాద్వికల్పోపమయో రేవార్థే చ సముచ్చయే"యని విశ్వనిఘంటువు.

దీనికి తరువాత మఱియొకటి దీనిని నిషేధించి చెప్పకుండుటచే నిది యే నిశ్చయమని గ్రహింపనగును.

తాత్పర్యము :- దేశకాలవస్తురూపమైన పరిమితి లేక అనంతమై అగోచరమై అనూహ్యమై అద్వితీయమై విలసిల్లునట్టి విష్ణుదేవుని అద్భుతతేజస్సు రక్షోవినాశముకొఱకై తన మాయావిలాసముచే ఇప్పు డీరీతిగ వానరరూపమును స్వీకరించివచ్చినదో యేమో!

శ్లో॥ ఇ త్యేవ మూచు ర్బహవో విశిష్టా
రక్షోగణా స్తత్ర సమేత్య సర్వే ।
సప్రాణిసంఘాం సగృహాం సవృక్షాం
దగ్ధాం పురీం తాం సహసా సమీక్ష్య ॥ 39

పదచ్ఛేదము :- ఇతి - ఏవమ్ - ఊచుః - బహవః - విశిష్టాః - రక్షోగణాః - తత్ర - సమేత్య - సర్వే - సప్రాణిసంఘాం - సగృహాం - సవృక్షాం - దగ్ధాం - పురీం - తాం - సహసా - సమీక్ష్య ॥

అన్వయక్రమము :- సప్రాణిసంఘాం సగృహాం సవృక్షాం సహసా దగ్ధాం తాం పురీం సమీక్ష్య బహవః విశిష్టాః రక్షోగణాః తత్ర సమేత్య సర్వే ఇతి ఏవం ఊచుః.

ప్రతిపదార్థము :- సప్రాణిసంఘాం = ప్రాణిసమూహములతో గూడినదియును, సగృహాం = భవనములతో గూడినదియును, సవృక్షాం = వృక్షములతోగూడినదియును, సహసా = హఠాత్తుగా, దగ్ధాం = దహింపబడినదియునగు, తాం పురీం = ఆ లంకానగరిని, సమీక్ష్య = కనుగొని, బహవః = పెక్కుమంది, విశిష్టాః = ప్రముఖులైన, రక్షోగణాః = రాక్షసబృందములు, తత్ర = అచ్చటికి, సమేత్య = చేరి, సర్వే = ఎల్లరును, ఇతి ఏవం = అని ఈరీతిగా, ఊచుః = పలికిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- విశిష్టాః = ప్రహస్తుడు మున్నగు మహావీరులు.

రా. శిరోమణి :- తత్ర - రావణసన్నిధిని (చేరి ఇట్లు పలికిరని భావము).

తాత్పర్యము :- అప్పుడా విధముగ సర్వప్రాణికోటితోడను వృక్షములు, గృహములు మున్నగువానితోడను హఠాత్తుగా తగులబడిన ఆ లంకానగరిని గాంచి ప్రముఖులైన రాక్షసవీరులు పెక్కుమంది అచటికి చేరి ఈ విధముగ తమ అభిప్రాయములను వెల్లడించిరి.

శ్లో॥ తతస్తు లంకా సహసా ప్రదగ్ధా
సరాక్షసా సాశ్వరథా సనాగా ।
సపక్షిసంఘా సమృగా సవృక్షా
రురోద దీనా తుములం సశబ్దమ్ ॥ 40

పదచ్ఛేదము :- తతః - తు - లంకా - సహసా - ప్రదగ్ధా - సరాక్షసా -

సాశ్వరథా - సనాగా, సపక్షిసంఘా - సమృగా - సవృక్షా - రురోద - దీనా - తుములం - సశబ్దమ్ ॥

అన్వయక్రమము :- తతః సహసా ప్రదగ్ధా లంకా తు సరాక్షసా సాశ్వరథా సనాగా సపక్షిసంఘా సమృగా సవృక్షా (సతీ) దీనా తుములం సశబ్దం రురోద.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, సహసా = హఠాత్తుగా, ప్రదగ్ధా = పూర్తిగా దహింపబడినట్టి, లంకా = లంకాపట్టణము, సరాక్షసా = రాక్షసులతో గూడినదియును, సాశ్వరథా = అశ్వములతోడను రథములతోడను గూడినదియును, సనాగా = ఏనుగులతో గూడినదియును, సపక్షిసంఘా = పక్షిసమూహములతో గూడినదియును, సమృగా = మృగములతో గూడినదియును, సవృక్షా (సతీ) = వృక్షములతో గూడినదియును అగుచు, దీనా = దీనమైనదై, తుములం = కోలాహలముగా, సశబ్దం పెద్దధ్వనితో, రురోద = విలపించెను.

తాత్పర్యము :- అప్పు డట్లు తగులబడిపోయిన ఆ లంకానగరి తనయం దున్నట్టి రాక్షసులతోడను, అశ్వములతోడను, రథములతోడను, ఏనుగులతోడను, పక్షిసంఘములతోడను, మృగములతోడను, వృక్షగణములతోడను గూడి దీనమైన రూపముతో పెద్ద కోలాహలధ్వనితో ఆక్రోశించినది.

శ్లో॥ హా తాత హా పుత్రక కాంత మిత్ర
హా జీవితం భోగయుతం సుపుణ్యమ్ ।
రక్షోభి రేవం బహుధా బ్రువద్భిః
శబ్దః కృతో ఘోరతర స్సుభీమః ॥ 41

పదచ్ఛేదము :- హా - తాత - హా - పుత్రక - కాంత - మిత్ర - హా - జీవితం - భోగయుతం - సుపుణ్యమ్ - రక్షోభిః - ఏవం - బహుధా - బ్రువద్భిః - శబ్దః - కృతః - ఘోరతరః - సుభీమః ॥

అన్వయక్రమము :- హా తాత! హా పుత్రక! హా కాంత! హా మిత్ర! భోగయుతం సుపుణ్యం జీవితం (గతమ్). ఏవం, బహుధా బ్రువద్భిః రక్షోభిః ఘోరతరః సుభీమః శబ్దః కృతః.

ప్రతిపదార్థము :- హా తాత! = అయ్యో తండ్రీ!, హా పుత్రక! = అయ్యో పుత్రుడా!, కాంత! = అయ్యో ప్రియుడా!, మిత్ర = అయ్యో మిత్రుడా!, హా = అయ్యో!, భోగయుతం = భోగముతో కూడిన, సుపుణ్యం = గొప్ప పుణ్యములు గల్గిన, జీవితం = జీవితము, (గతమ్ = పోయినది) (ఇతి = అని) ఏవం = ఈ రీతిగా, బహుధా =

పెక్కువిధములుగా, బ్రువద్భిః = పలుకుచున్నట్టి, రక్షోభిః = రక్కసులచే, ఘోరతరః = మిక్కిలి ఘోరమైన, సుభీమః = మిక్కిలి భయంకరమైనట్టి, శబ్దః = ధ్వని, కృతః = చేయబడినది.

తాత్పర్యము :– అయ్యో తండ్రీ! అయ్యో బిడ్డా! అయ్యో ప్రియుడా! అయ్యో మిత్రుడా! గొప్ప పుణ్యము చేసికొని సంపాదించుకొన్న భోగములతో గూడిన జీవిత మంతరించినది. నా కేది దిక్కనుచు నిట్లు పలువిధములుగ విలపించుచున్న రాక్షసులచే భీకరమైన మహాధ్వని చెలరేగినది.

శ్లో॥ హుతాశనజ్వాలసమావృతా సా
హతప్రవీరా పరివృత్తయోధా ।
హనూమతః క్రోధవశాభిభూతా
బభూవ శోకోపహతేవ లంకా ॥ 42

పదచ్ఛేదము :– హుతాశనజ్వాలసమావృతా – హతప్రవీరా – పరివృత్తయోధా – హనూమతః – క్రోధవశాభిభూతా – బభూవ – శాపోపహతా – ఇవ – లంకా ॥

అన్వయక్రమము :– హనూమతః క్రోధవశాభిభూతా, హుతాశనజ్వాలసమావృతా సా లంకా శాపోపహతా ఇవ హతప్రవీరా పరివృత్తయోధా బభూవ.

ప్రతిపదార్థము :– హనూమతః = హనుమంతునియొక్క, క్రోధవశాభిభూతా = క్రోధావేశముచే తిరస్కరింపబడినదై, హుతాశనజ్వాలసమావృతా = అగ్నిజ్వాలలచే ఆవరింపబడియున్నట్టి, సా లంకా = ఆ లంకానగరి, శాపోపహతా ఇవ = శాపముచే నశింపజేయబడినదివలె, హతప్రవీరా = చనిపోయిన మహావీరులు గలదిగను, పరివృత్తయోధా = అస్తమించిన యోధులుగలదిగను, బభూవ = ఆయెను.

తాత్పర్యము :– అట్లు హనుమంతుని క్రోధోద్రేకమునకు గురియై నాశము నొంది అగ్నిజ్వాలలచే చుట్టుకొనబడియున్న ఆ లంకానగరి హతమారిన మహావీరులతోను మరణించిన యుద్ధభటులతోను ఒకానొక మహాత్ముని శాపకారణముగా విధ్వస్తమైయున్నట్లు కనబడెను.

శ్లో॥ ససంభ్రమత్రస్త విషణ్ణరాక్షసాం
సముజ్జ్వలజ్వాల హుతాశనాంకితామ్ ।
దదర్శ లంకాం హనుమా న్మహామనాః
స్వయంభుకోపోపహతా మి వావనిమ్ ॥ 43

పదచ్ఛేదము :- ససంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసాం సముజ్జ్వలజ్వాలహుతాశనాంకితామ్ దదర్శ - లంకాం - హనుమాన్ - మహామనాః - స్వయంభుకోపోపహతామ్ ఇవ అవనిమ్ ॥

అన్వయక్రమము :- ససంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసాం, సముజ్జ్వలజ్వాలహుతాశనాంకితాం లంకాం మహామనాః హనుమాన్ స్వయంభుకోపోపహతాం అవనిమ్ ఇవ దదర్శ.

ప్రతిపదార్థము :- ససంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసాం = వేగిరపాటుతో భీతినొందిన విషాదము గల్గియున్న రాక్షసులతో గూడినదియును, సముజ్జ్వలజ్వాలహుతాశనాంకితాం = మిక్కిలిగ జ్వలించుచున్న మంటలు గల అగ్నితో నిండినదియును అగు, లంకాం = లంకానగరిని, మహామనాః = గొప్పమనస్సుగల, హనుమాన్ = హనుమంతుడు, స్వయంభుకోపోపహతాం = బ్రహ్మయొక్క క్రోధముచే ధ్వంసముచేయబడిన, అవనిమ్ ఇవ = భూమినివలె, దదర్శ = కనుగొనెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :- స్వయంభుకోపోపహతాం = ప్రళయకాలమున సంహారకారియైన శివుని క్రోధముచే నశించినది.

తాత్పర్యము :- వేగిరపాటుతో భీతిల్లి విషాదమును చెందిన రాక్షసులతో, తీవ్రమైన జ్వాలలచే ఆవరింపబడియున్న యా లంకానగరి హనుమకు ప్రళయకాలమునందు భస్మమగు భూమండలమువలె గానవచ్చెను.

శ్లో॥ భంక్త్వా వనం పాదపరత్నసంకులం
హత్వా తు రక్షాంసి మహాంతి సంయుగే ।
దగ్ధ్వా పురీం తాం గృహరత్నమాలినీం
తస్థౌ హనూమాన్ పవనాత్మజః కపిః ॥ 44

పదచ్ఛేదము :- భంక్త్వా - వనం - పాదపరత్నసంకులం, హత్వా - తు - రక్షాంసి - మహాంతి - సంయుగే, దగ్ధ్వా - పురీం - తాం - గృహరత్నమాలినీమ్ - తస్థౌ - హనూమాన్ - పవనాత్మజః - కపిః ॥

అన్వయక్రమము :- పవనాత్మజః హనుమాన్ పాదపరత్నసంకులం వనం భంక్త్వా సంయుగే మహాంతి రక్షాంసి హత్వా తు గృహరత్నమాలినీం తాం పురీం దగ్ధ్వా సుఖం తస్థౌ.

ప్రతిపదార్థము :– పవనాత్మజః = వాయునందనుడైన, కపిః = వానరశ్రేష్ఠుడైన, హనుమాన్ = హనుమ, పాదపరత్నసంకులం = శ్రేష్ఠమైన వృక్షములతో నిండియున్న, వనం = వనమును, భంక్త్వా = ధ్వంసముచేసి, సంయుగే = యుద్ధమునందు, మహాంతి = గొప్పవారయిన, రక్షాంసి = రాక్షసులను, హత్వా తు = పరిమార్చియు, గృహరత్నమాలినీం = శ్రేష్ఠములైన భవనపంక్తులు గలిగినట్టి, తాం పురీం = ఆ లంకాపురిని, దగ్ధ్వా = దహించి, సుఖం = సుఖముగా, తస్థౌ = కూర్చుండియుండెను.

తాత్పర్యము :– వాయునందనుడైన హనుమ ఈ విధముగ అపూర్వమైన వృక్షవిశేషములతో నిండిన ఆ యశోకవనమును ధ్వంసము చేసి మహావీరులైన రాక్షస శ్రేష్ఠులను యుద్ధమున మడియించి శ్రేష్ఠములైన భవనపంక్తులతో విరాజిల్లు లంకానగరిని దగ్ధముచేసి కృతకృత్యుడై సుఖముగ కూర్చుండెను.

శ్లో॥ త్రికూటశృంగాగ్రతలే విచిత్రే
ప్రతిష్ఠితో వానరరాజసింహః ।
ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ
వ్యరాజ తాదిత్య ఇ వాంశుమాలీ ॥ 45

పదచ్ఛేదము :– త్రికూటశృంగాగ్రతలే – విచిత్రే, ప్రతిష్ఠితః – వానరరాజసింహః, ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ, వ్యరాజత – ఆదిత్యః – ఇవ – అంశుమాలీ ॥

అన్వయక్రమము :– విచిత్రే త్రికూటశృంగాగ్రతలే ప్రతిష్ఠితః వానరరాజసింహః ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ (సన్) అంశుమాలీ ఆదిత్యః ఇవ వ్యరాజత.

ప్రతిపదార్థము :– విచిత్రే = విచిత్రమైన, త్రికూటశృంగాగ్రతలే = త్రికూటపర్వతము యొక్క శిఖరమునందలి పైభాగమునందు, ప్రతిష్ఠితః = నిలిచియున్నట్టి, వానరరాజసింహః = వానరశ్రేష్ఠుడైన హనుమ ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ (సన్) = ప్రజ్వలించుచున్న వాలముచే నేర్పబడిన కిరణసమూహముగల్గియున్న, ఆదిత్యః ఇవ = సూర్యునివలె, వ్యరాజత = విరాజిల్లెను.

సూచన – ఈ శ్లోకము ప్రక్షిప్తమని చెప్పబడినది.

తాత్పర్యము :– అప్పుడా త్రికూటశిఖరాగ్రమున వివిధ వర్ణములతో ప్రకాశించుచు సింహమువలె గూర్చుండియున్న యా హనుమ తన వాలమునందు జ్వలించుచున్న జ్వాలామాలికలచే ఉదయాద్రిపై కిరణసమూహముతో వెల్గొందు ఆదిత్యునివలె ప్రకాశించెను.

శ్లో॥ స రాక్షసాం స్తాన్ సుబహూంశ్చ హత్వా
వనం చ భంక్త్వా బహుపాదపం తత్ ।
విసృజ్య రక్షోభవనేషు చాగ్నిం
జగామ రామం మనసా మహాత్మా ॥ 46

పదచ్ఛేదము :– సః – రాక్షసాన్ – తాన్ – సుబహూన్ – చ – హత్వా, వనం – చ – భంక్త్వా – బహుపాదపం – తత్ – విసృజ్య – రక్షోభవనేషు – చ – అగ్నిం జగామ – రామం – మనసా – మహాత్మా ॥

అన్వయక్రమము :– మహాత్మా సః సుబహూన్ తాన్ రాక్షసాన్ హత్వా చ బహుపాదపం తత్ వనం భంక్త్వా చ రక్షోభవనేషు అగ్నిం విసృజ్య చ మనసా రామం జగామ.

ప్రతిపదార్థము :– మహాత్మా = మహనీయుడైన, సః = ఆ హనుమ, సుబహూన్ = చాలమందియైన, తాన్ రాక్షసాన్ = ఆ రాక్షసులను, హత్వా చ = చంపియు, బహుపాదపం = పెక్కు వృక్షములతోగూడిన, తత్ వనం = ఆ యశోకవనమును, భంక్త్వా చ = ధ్వంసముచేసియు, రక్షోభవనేషు = రాక్షసుల గృహములందు, అగ్నిం = అగ్నిని, విసృజ్య చ = విడిచియును, మనసా = మనస్సుచే, రామం = శ్రీరాముని, జగామ = పొందెను.

తాత్పర్యము :– మహాత్ముడైన హనుమ పెక్కుమంది రాక్షసవీరులను హతమార్చి వేలకొలది వృక్షములతో నిండిన అశోకవనమును ధ్వంసముచేసి రాక్షసుల భవనములకు నిప్పుబెట్టి తాను తలపెట్టిన పని కడముట్టుటచే తన మనస్సును రామప్రభువు సన్నిధికి జేర్చెను.

శ్లో॥ తతస్తు తం వానరవీరముఖ్యం
మహాబలం మారుతతుల్యవేగమ్ ।
మహామతిం వాయుసుతం వరిష్ఠం
ప్రతుష్టువు ర్దేవగణాశ్చ సర్వే ॥ 47

పదచ్ఛేదము :– తతః – తు – తం – వానరవీరముఖ్యం, మహాబలం – మారుతతుల్యవేగమ్ – మహామతిం – వాయుసుతం – వరిష్ఠం – ప్రతుష్టువుః దేవగణాః – చ – సర్వే ॥

అన్వయక్రమము :– తతః వానరవీరముఖ్యం మహాబలం మారుతతుల్యవేగం మహామతిం వరిష్ఠం తం వాయుసుతం సర్వే దేవగణాశ్చ ప్రతుష్టువుః.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, వానరవీరముఖ్యం = వానరవీరులలో శ్రేష్ఠుడైనవాడును, మహాబలం = మహాబలశాలియును, మారుతతుల్యవేగం = వాయువుతో సమానమైన వేగముగలవాడును, మహామతిం = గొప్ప ప్రజ్ఞగలవాడును, వరిష్ఠం = మిక్కిలిశ్రేష్ఠుడును అగు, తం వాయుసుతం = ఆ వాయునందనుని, సర్వే = సమస్తమైన, దేవగణాః చ = దేవసంఘములును, ప్రతుష్టువుః = స్తోత్ర మొనర్చినవి.

తాత్పర్యము :- వానరశీలురందు అగ్రేసరుడును, మహాబలాఢ్యుడును, వాయుసమానవేగసంపన్నుడును, ప్రజ్ఞాశాలియును, సర్వశ్రేష్ఠుడునగు వాయునందనుని దేవగణములన్నియు స్తుతియొనర్చెను.

శ్లో॥ భంక్త్వా వనం మహాతేజా హత్వా రక్షాంసి సంయుగే ।
దగ్ధ్వా లంకాపురీం రమ్యాం రరాజ స మహాకపిః ॥ 48

పదచ్ఛేదము :- భంక్త్వా - వనం - మహాతేజాః - హత్వా - రక్షాంసి - సంయుగే దగ్ధ్వా - లంకాపురీం - రమ్యాం - రరాజ - సః - మహాకపిః ॥

అన్వయక్రమము :- సః మహాతేజాః మహాకపిః వనం భంక్త్వా సంయుగే రక్షాంసి హత్వా రమ్యాం లంకాపురీం దగ్ధ్వా రరాజ.

ప్రతిపదార్థము :- మహాతేజాః = గొప్పతేజశ్శాలియగు, సః మహాకపిః = ఆ వానర శ్రేష్ఠుడు, వనం = అశోకవనమును, భంక్త్వా = ధ్వంసముచేసి, సంయుగే = యుద్ధమున, రక్షాంసి = రక్కసులను, హత్వా = పరిమార్చి, రమ్యాం = సుందరమైన, లంకాపురీం = లంకానగరిని, దగ్ధ్వా = దహించి, రరాజ = ప్రకాశించెను.

తాత్పర్యము :- మహాప్రతాపసంపన్నుడైన యా హనుమ అట్లు అశోకవనమును ధ్వంసముచేసి రాక్షసయోధులను నేలగూల్చి యా లంకామహానగరమును దగ్ధము చేసి యెదురులేని వీరునిగా విరాజిల్లెను.

శ్లో॥ తత్ర దేవా స్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః ।
దృష్ట్వా లంకాం ప్రదగ్ధాం తాం విస్మయం పరమం గతాః ॥ 49

పదచ్ఛేదము :- తత్ర - దేవాః - సగంధర్వాః - సిద్ధాః - చ - పరమర్షయః - దృష్ట్వా - లంకాం - ప్రదగ్ధాం - తాం - విస్మయం - పరమం - గతాః ॥

అన్వయక్రమము :- తత్ర దేవాః సగంధర్వాః సిద్ధాః పరమర్షయః చ తాం లంకాం ప్రదగ్ధాం దృష్ట్వా పరమం విస్మయం గతాః.

ప్రతిపదార్థము :– తత్ర = అచ్చట, దేవాః = దేవతలును, సగంధర్వాః = గంధర్వులతో కూడినవారైన, సిద్ధాః = సిద్ధులును, పరమర్షయః చ = మహాఋషులును, తాం లంకాం = ఆ లంకానగరిని, ప్రదగ్ధాం = దగ్ధమైనదానినిగా, దృష్ట్వా = చూచి, పరమం = గొప్పదైన, విస్మయం = ఆశ్చర్యమును, గతాః = పొందిరి.

తాత్పర్యము :– అప్పుడచ్చటి దేవతలును, గంధర్వులును, సిద్ధులును, మహాఋషులును ఆ లంకానగరము దగ్ధమై పోవుటను జూచి అమితాశ్చర్యము నొందిరి.

శ్లో॥ తం దృష్ట్వా వానరశ్రేష్ఠం హనూమంతం మహాకపిమ్
కాలాగ్నిరితి సంచింత్య సర్వభూతాని తత్రసుః ॥ 50

పదచ్ఛేదము :– తం – దృష్ట్వా – వానరశ్రేష్ఠం – హనూమంతం – మహాకపిమ్ – కాలాగ్నిః – ఇతి – సంచింత్య – సర్వభూతాని – తత్రసుః ॥

అన్వయక్రమము :– వానరశ్రేష్ఠం మహాకపిం తం హనూమంతం దృష్ట్వా కాలాగ్నిః ఇతి సంచింత్య సర్వభూతాని తత్రసుః.

ప్రతిపదార్థము :– వానరశ్రేష్ఠం = వానరులలో శ్రేష్ఠుడును, మహాకపిం = మహాత్ముడును అగు, తం హనూమంతం = ఆ హనుమంతుని, దృష్ట్వా = చూచి, కాలాగ్నిః ఇతి = ప్రళయకాలమునందలి అగ్ని యని, సంచింత్య = భావించి, సర్వభూతాని = సమస్త ప్రాణులును, తత్రసుః = భీతిల్లినవి.

తాత్పర్యము :– మహావీరుడైన ఆ వానరశ్రేష్ఠుని గాంచి ప్రళయకాలమునందు విజృంభించునట్టి కాలాగ్ని యని భావించి సమస్తభూతములును అమితమైన భీతికి లోనైనవి.

శ్లో॥ దేవాశ్చ సర్వే మునిపుంగవాశ్చ
గంధర్వవిద్యాధరకింనరాశ్చ ।
భూతాని సర్వాణి మహాంతి తత్ర
జగ్ముః పరాం ప్రీతి మతుల్యరూపామ్ ॥ 51

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"లంకాదహనం" నామ
చతిష్పంచాశస్సర్గః.

పదచ్ఛేదము :- దేవాః - చ - సర్వే - మునిపుంగవాః - చ, గంధర్వవిద్యాధరకింనరాః - చ, భూతాని - సర్వాణి - మహాంతి - తత్ర - జగ్ముః - పరాం - ప్రీతిమ్ - అతుల్యరూపామ్ ॥

అన్వయక్రమము :- తత్ర దేవాః చ, సర్వే మునిపుంగవాః చ, గంధర్వవిద్యాధరకిన్నరాః చ, సర్వాణి మహాంతి భూతాని పరామ్ అతుల్యరూపాం ప్రీతిం జగ్ముః.

ప్రతిపదార్థము :- తత్ర = అచ్చట, సర్వే = సమస్తమైన, దేవాః చ = దేవతలును, మునిపుంగవాః చ = మునిశ్రేష్ఠులును, గంధర్వవిద్యాధరకిన్నరాః చ = గంధర్వులును, విద్యాధరులును, కిన్నరులును, సర్వాణి = సమస్తములైన, మహాంతి = గొప్పవైన, భూతాని = భూతములును, పరాం = గొప్పదైన, అతుల్యరూపాం = సాటిలేని, ప్రీతిం = సంతోషమును, జగ్ముః = పొందినవి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- ఈ సర్గమునందలి చివరిశ్లోకములు కొన్ని ప్రతులలో వెనుకముందుగ నుండుట గానవచ్చుచున్నది.

తాత్పర్యము :- అప్పుడా హనుమ గావించిన లంకాదహనచర్యను గాంచి ఎల్లరు దేవతలును మహర్షులును గంధర్వులును విద్యాధరులును కింనరులును సమస్తమహాభూతములును ఎనలేని మహానందము నొందిరి.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"లంకాదహనము" అను
ఏబదినాల్గవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

పంచపంచాశసర్గ

శ్లో॥ లంకాం సమస్తాం సందీప్య లాంగూలాగ్నిం మహాబలః ।
నిర్వాపయామాస తదా సముద్రే హరిసత్తమః ॥ 1

పదచ్ఛేదము :- లంకాం - సమస్తాం - సందీప్య - లాంగూలాగ్నిం - మహాబలః నిర్వాపయామాస - తదా - సముద్రే - హరిసత్తమః ॥

అన్వయక్రమము :- మహాబలః, హరిసత్తమః, తదా సమస్తాం, లంకాం సందీప్య లాంగూలాగ్నిం సముద్రే నిర్వాపయామాస.

ప్రతిపదార్థము :- మహాబలః = మహాబలాఢ్యుడైన, హరిసత్తమః = వానరశ్రేష్ఠుడగు హనుమ, లంకాం = లంకానగరమును, సమస్తాం = అంతను, సందీప్య = దహించి, తదా = అప్పుడు, లాంగూలాగ్నిం = తోకయందలి అగ్నిని, సముద్రే = సముద్రమునందు, నిర్వాపయామాస = అర్పివైచెను.

తాత్పర్యము :- మహాబలశాలియగు ఆ హనుమ లంకానగరమును సమస్తమును దహించివైచి తన తోకయందు జ్వలించుచున్న ఆ యగ్నిని సముద్రజలములో ముంచి ఆర్పుకొనెను.

శ్లో॥ సందీప్యమానాం విధ్వస్తాం త్రస్తరక్షోగణాం పురీమ్ ।
అవేక్ష్య హనుమాన్ లంకాం చింతయామాస వానరః ॥ 2

పదచ్ఛేదము :- సందీప్యమానాం - విధ్వస్తాం - త్రస్తరక్షోగణాం - పురీమ్ - అవేక్ష్య - హనుమాన్ - లంకాం - చింతయామాస - వానరః ॥

అన్వయక్రమము :- వానరః, హనుమాన్, సందీప్యమానాం విధ్వస్తాం, త్రస్తరక్షోగణాం, లంకాపురీమ్, అవేక్ష్య, చింతయామాస ॥

ప్రతిపదార్థము :- వానరః = వానరశ్రేష్ఠుడైన, హనుమాన్ = హనుమ, సందీప్యమానాం = మండుచున్నదియును, విధ్వస్తాం = ధ్వంసమైనదియును, త్రస్తరక్షోగణాం = భీతిగ్రస్తులైన రాక్షస సమూహములు గలదియునగు, లంకాం పురీం = లంకానగరిని,

అవేక్ష్య = చూచి, చింతయామాస = ఆలోచింపసాగెను.

తాత్పర్యము :- అట్లు పెద్దమంటలతో తగులబడుచు విధ్వంసమై రాక్షసుల హాహాకారములతో గూడియున్న ఆ లంకానగరమును విలోకించి హనుమ చింతింపసాగెను.

శ్లో॥ తస్యాభూ త్సుమహాం స్త్రాసః కుత్సా చాత్మ న్యజాయత ।
లంకాం ప్రదహతా కర్మ కింస్వి త్కృత మిదం మయా ॥ 3

పదచ్ఛేదము :- తస్య - అభూత్ - సుమహాన్ - త్రాసః - కుత్సా - చ - ఆత్మని - అజాయత, లంకాం - ప్రదహతా - కర్మ - కింస్విత్ - కృతమ్ - ఇదం - మయా ॥

అన్వయక్రమము :- తస్య సుమహాన్ త్రాసః కుత్సా చ ఆత్మని అజాయత, లంకాం ప్రదహతా కర్మ కింస్విత్ కృతమ్ ఇదం మయా.

ప్రతిపదార్థము :- తస్య = అతనికి, సుమహాన్ = మిక్కిలిగొప్పదైన, త్రాసః = భీతి, అభూత్ = ఆయెను, లంకాం = లంకానగరమును, ప్రదహతా = తగులబెట్టుచున్నట్టి, మయా = నాచేత, ఇదం = ఈ, కింస్విత్ = ఏమి నీచమైన, కర్మ = కృత్యము, కృతం = చేయబడినది? (ఇతి = అని), ఆత్మని = తనయందు, కుత్సా చ = ఏవగింపుకూడ, అజాయత = కలిగెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమకు జరిగిన విషయమును గూర్చి మనస్సునందు గొప్పదైన భయము పొడమెను. ఈ లంకానగరమును తగులబెట్టుచు అక్కటా! నేనెట్టి దారుణమైన కృత్యమున కొడిగట్టితినని తనయందు తనకే ఒక యేవగింపు కూడ గలిగెను.

శ్లో॥ ధన్యాస్తే పురుషశ్రేష్ఠా యే బుద్ధ్యా కోప ముత్థితమ్ ।
నిరుంధంతి మహాత్మానో దీప్త మగ్ని మి వాంభసా ॥ 4

పదచ్ఛేదము :- ధన్యాః - తే - పురుషశ్రేష్ఠాః - యే - బుద్ధ్యా - కోపమ్ - ఉత్థితమ్, నిరుంధంతి - మహాత్మానః - దీప్తమ్ - అగ్నిమ్ - ఇవ - అంభసా ॥

అన్వయక్రమము :- దీప్తమ్ అగ్నిమ్, అంభసా ఇవ, యే మహాత్మానః, ఉత్థితం కోపం బుద్ధ్యా నిరుంధంతి, తే పురుషశ్రేష్ఠాః ధన్యాః.

ప్రతిపదార్థము :- దీప్తం = ప్రజ్వలితమైన, అగ్నిం = అగ్నిని, అంభసా ఇవ =

నీటితోవలె, యే మహాత్మానః = ఏ మహనీయులు, ఉత్థితం = ఉద్భవించినట్టి, కోపం = క్రోధమును, బుద్ధ్యా = బుద్ధిచే, నిరుంధంతి = అణచివేయుదురో, తే పురుషశ్రేష్ఠాః = ఆ పురుషశ్రేష్ఠులు, ధన్యాః = ధన్యులు.

తాత్పర్యము :– ఏ మహనీయులు తమ హృదయమునందు ఉద్భవించిన క్రోధమును ప్రజ్వలించిన అగ్నిని నీటితో చల్లార్చినట్లు తమ వివేకముచే అణచివేసికొందురో అట్టివారు ధన్యులు గదా!

శ్లో॥ క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యా ద్గురూనపి ।
క్రుద్ధః పరుషయా వాచా నర స్సాధూ నధిక్షిపేత్ ॥ 5

పదచ్ఛేదము :– క్రుద్ధః – పాపం – న – కుర్యాత్ – కః – క్రుద్ధః – హన్యాత్ – గురూన్ – అపి – క్రుద్ధః – పరుషయా – వాచా – నరః – సాధూన్ – అధిక్షిపేత్ ॥

అన్వయక్రమము :– క్రుద్ధః కః పాపం న కుర్యాత్? క్రుద్ధః, గురూన్, అపి, హన్యాత్. క్రుద్ధః, నరః, పరుషయా, వాచా, సాధూన్, అధిక్షిపేత్.

ప్రతిపదార్థము :– క్రుద్ధః = క్రోధమునొందినవాడు, కః = ఎవ్వడు, పాపం = పాపమును, న కుర్యాత్ = చేయకుండును? క్రుద్ధః = క్రోధితుడైనవాడు, గురూన్ అపి = గురువులను గూడ, హన్యాత్ = చంపివేయును, క్రుద్ధః = క్రోధమునొందిన, నరః = మనుష్యుడు, పరుషయా = పరుషమైన, వాచా = వాక్కుతో, సాధూన్ = సజ్జనులను, అధిక్షిపేత్ = నిందించును.

తాత్పర్యము :– క్రోధావేశము నొందినవాడు ఎవడు పాపము చేయకుండ నుండును? క్రోధోద్రిక్తుడు తన గురువునుగూడ వధించును. క్రోధమునకు వశుడైన నరుడు పరుషమైన వచనములతో సత్పురుషులను గూడ నిందించును గదా!

శ్లో॥ వాచ్యావాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్ ।
నాకార్య మస్తి క్రుద్ధస్య నావాచ్యం విద్యతే క్వచిత్ ॥ 6

పదచ్ఛేదము :– వాచ్యావాచ్యం – ప్రకుపితః – న – విజానాతి – కర్హిచిత్, న – అకార్యమ్ – అస్తి – క్రుద్ధస్య – న – అవాచ్యం – విద్యతే – క్వచిత్ ॥

అన్వయక్రమము :– ప్రకుపితః, కర్హిచిత్, వాచ్యావాచ్యం, న విజానాతి. క్రుద్ధస్య, అకార్యం నాస్తి, క్వచిత్, అవాచ్యం న విద్యతే.

ప్రతిపదార్థము :– ప్రకుపితః = క్రోధోద్రిక్తుడు, కర్హిచిత్ = ఎన్నడును, వాచ్యావాచ్యం

= అనదగిన దానిని అనదగని దానిని, న విజానాతి = విశేషించి తెలిసికొనలేదు, క్రుద్ధస్య = క్రోధము నొందియున్నవానికి, అకార్యం = చేయకూడనిది, నాస్తి = ఉండదు, క్వచిత్ = ఎచ్చటను, అవాచ్యం = అనరానిది, న విద్యతే = ఉండదు.

తాత్పర్యము :– క్రోధావేశము నొందినట్టివాడు ఎన్నడును అనదగినమాట అనదగని మాట యను అను విశేషము నెఱుగజాలడు. క్రోధావేశము నొందియున్న వానికి అకృత్య మనునట్టిది ఉండనే యుండదు. అట్లే అతనికి అనరాని మాట యనునది గూడ యుండదు.

శ్లో॥ య స్సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి ।
య థోరగ స్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే ॥ 7

పదచ్ఛేదము :– యః – సముత్పతితం – క్రోధం – క్షమయా – ఏవ – నిరస్యతి, యథా – ఉరగః – త్వచం – జీర్ణాం – సః – పురుషః – ఉచ్యతే ॥

అన్వయక్రమము :– ఉరగః యథా జీర్ణాం త్వచం నిరస్యతి తథా యః సముత్పతితం క్రోధం క్షమయా ఏవ నిరస్యతి, సః వై పురుషః ఉచ్యతే.

ప్రతిపదార్థము :– ఉరగః = సర్పము, యథా = ఏ విధముగా, జీర్ణాం = శిథిలమైన, త్వచం = చర్మమును, నిరస్యతి = తొలగించుకొనునో, తథా = ఆ రీతిగా, యః = ఎవ్వడయితే, సముత్పతితం = సంభవించినట్టి, క్రోధం = క్రోధమును, క్షమయా ఏవ = ఓర్పుతోడనే, నిరస్యతి = తొలగించుకొనునో, సః వై = అతడే, పురుషః ఉచ్యతే = పురుషుడుగా చెప్పబడుచున్నాడు.

తాత్పర్యము :– శిథిలమైన తనచర్మమును సర్ప మెట్లు వెంటనే తొలగించుకొనునో అట్లే ఏ వివేకవంతుడైతే తనలో పొడమిన క్రోధజ్వాలను తన సహనశక్తిచే వెంటనే తొలగించుకొనునో అతనినే సరియైన పురుషుడని చెప్పవలెను.

శ్లో॥ ధి గస్తు మాం సుదుర్బుద్ధిం నిర్లజ్జం పాపకృత్తమమ్ ।
అచింతయిత్వా తాం సీతా మగ్నిదం స్వామిఘాతుకమ్ ॥ 8

పదచ్ఛేదము :– ధిక్ – అస్తు – మాం – సుదుర్బుద్ధిం – నిర్లజ్జం – పాపకృత్తమమ్ – అచింతయిత్వా – తాం – సీతాం – అగ్నిదం – స్వామిఘాతుకమ్ ॥

అన్వయక్రమము :– సుదుర్బుద్ధిం నిర్లజ్జం పాపకృత్తమం తాం సీతాం అచింతయిత్వా అగ్నిదం స్వామిఘాతుకం మాం ధిక్ అస్తు.

ప్రతిపదార్థము :- సుదుర్బుద్ధిం = మిక్కిలి దుష్టమైన బుద్ధిగలవాడను, నిర్లజ్జం = సిగ్గుమాలినవాడను, పాపకృత్తమం = పాపాత్ములలో అగ్రేసరుడను, తాం సీతాం = ఆ సీతాదేవినిగూర్చి, అచింతయిత్వా = ఆలోచింపకుండ, అగ్నిదం = నిప్పుపెట్టినవాడను అగు, మాం = నన్నుగూర్చి, ధిక్ అస్తు = నిందయగుగాక!

తాత్పర్యము :- మిక్కిలి దుష్టమైన బుద్ధిగలవాడను, సిగ్గుమాలినవాడను, పాపాత్ములలో మొదటివాడను సీతాదేవిని గూర్చి ఆలోచింపకుండా ఆమె నివాసమునుగూడా అగ్నిపాలు చేసిన వాడను, అద్దాన నా రామచంద్రప్రభువునకే ద్రోహము గావించినవాడను గదా! ఆహా నేనెంత నింద్యమైన పని చేసితిని!

శ్లో॥ యది దగ్ధా త్వియం లంకా నూన మార్యాపి జానకీ ।
దగ్ధా తేన మయా భర్తుర్హతం కార్య మజానతా ॥ 9

పదచ్ఛేదము :- యది - దగ్ధా - తు - ఇయం - లంకా - నూనం - ఆర్యా - అపి - జానకీ - దగ్ధా - తేన - మయా - భర్తుః - హతం - కార్యమ్ - అజానతా ॥

అన్వయక్రమము :- ఇయం లంకా దగ్ధా యది ఆర్యా జానకీ అపి దగ్ధా; తేన అజానతా మయా భర్తుః కార్యం హతమ్.

ప్రతిపదార్థము :- ఇయం లంకా = ఈ లంకానగరము, దగ్ధా యది = దహింపబడినయెడల, ఆర్యా = పూజ్యురాలయిన, జానకీ అపి = సీతాదేవిగూడ, నూనం = నిశ్చయముగా, దగ్ధా = దహింపబడినది. తేన = అందుచే, అజానతా = తెలిసికొనలేనట్టి, మయా = నాచేత, భర్తుః = ప్రభువుయొక్క, కార్యం = పని, హతం = నశింపచేయబడినది.

తాత్పర్యము :- ఈ లంకానగరము దహింపబడినప్పుడు పూజ్యురాలైన సీతాదేవిగూడ నిశ్చయముగా దహింపబడియేయుండునుగదా! ఆమెయే దహింపబడినయెడల అజ్ఞానినైన నేను నా ప్రభువుకార్యము నేనే నాశనము చేసితినిగదా!

శ్లో॥ యదర్థ మయ మారంభ స్తత్కార్య మవసాదితమ్ ।
మయా హి దహతా లంకాం న సీతా పరిరక్షితా ॥ 10

పదచ్ఛేదము :- యదర్థమ్ - అయమ్ - ఆరంభః - తత్ - కార్యమ్ - అవసాదితమ్, మయా - హి - దహతా - లంకాం - న - సీతా - పరిరక్షితా ॥

అన్వయక్రమము :- అయమ్ ఆరంభః యదర్థం, తత్ కార్యం అవసాదితమ్; హి లంకాం దహతా మయా సీతా న పరిరక్షితా.

ప్రతిపదార్థము :- అయమ్ ఆరంభః = ఈ యుద్యమము, యదర్థం = దేనినిగురించియో, తత్ కార్యం = ఆ కృత్యము, అవసాదితమ్ = నశింపచేయబడినది, హి = ఎందుచేతననగా, లంకాం = లంకను, దహతా = తగులబెట్టుచున్నట్టి, మయా = నాచేత, సీతా = సీతాదేవి, న పరిరక్షితా = రక్షింపబడలేదు.

తాత్పర్యము :- నేను ఏ మహాకార్యమునుగూర్చి యత్న మారంభించితినో ఆ ప్రధానకార్యమును నేనే నాశమొనర్చుకొంటిని. ఈ లంకానగరమును తగులబెట్టుచు నా లక్ష్యమైన సీతాదేవిని నేను రక్షించుకొనలేకపోతినిగదా!

శ్లో॥ ఈషత్కార్య మిదం కార్యం కృతమాసీ న్న సంశయః ।
తస్య క్రోధాభిభూతేన మయా మూలక్షయః కృతః ॥ 11

పదచ్ఛేదము :- ఈషత్కార్యమ్ - ఇదం - కార్యం - కృతమ్ - ఆసీత్ - న - సంశయః, తస్య - క్రోధాభిభూతేన - మయా - మూలక్షయః - కృతః ॥

అన్వయక్రమము :- ఇదం కార్యం ఈషత్కార్యం కృతం ఆసీత్; సంశయః, న. క్రోధాభిభూతేన మయా తస్య మూలక్షయః కృతః.

ప్రతిపదార్థము :- ఇదం కార్యం = ఈ సీతాన్వేషణ కార్యము, ఈషత్కార్యం = స్వల్పముగ శేషించినట్టిపనిగా, కృతమ్ ఆసీత్ = చేయబడినదయ్యెను, సంశయః న = సందేహము లేదు, క్రోధాభిభూతేన = క్రోధముచే వివశుడనైనట్టి, మయా = నాచేత, తస్య = ఆ కృత్యమునకు, మూలక్షయః = మూలవిఘాతము, కృతః = చేయబడినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :- 'ఇదం కార్యం ఈషత్కార్యం కృతం' లంకాదహనము రాక్షసమారణము మున్నగు ఘనకార్యములు నేడు నీచమైన పనులుగా నైనవని భావము.

మహేశ్వరతీర్థులు:- ఈషత్కార్యం కృతం ఆసీత్ - సీతాన్వేషణము రావణ నిలయపరిజ్ఞానము సీతాదర్శనము క్షేమవార్తానివేదనము మున్నగు మహత్కార్యములలో శ్రీరామునకు తిరిగి నివేదించుట యను కొద్దిపనిమాత్రమే మిగిలినదిగా నిర్వహింపబడినది.

తాత్పర్యము :- కొద్దికార్యము మిగిలియున్నప్పటికిని నేను ఉద్యమించిన ఘనకార్యమునంతను నిర్వహించితిని. అది గొప్పవిషయమే గాని రావణునిపై క్రోధావేశమునొంది నేను నా లక్ష్యమైన సీతమ్మ కుశలస్థితి యనెడి ప్రధానకృత్యమునకే

భంగము గలిగించితినికదా!

శ్లో॥ వినష్టా జానకీ నూనం న హ్యదగ్ధః ప్రదృశ్యతే ।
లంకాయాం కశ్చి దుద్దేశ స్సర్వా భస్మీకృతా పురీ ॥ 12

పదచ్ఛేదము :- వినష్టా - జానకీ - నూనం - న - హి - అదగ్ధః - ప్రదృశ్యతే, లంకాయాం - కశ్చిత్ - ఉద్దేశః - సర్వా - భస్మీకృతా - పురీ ॥

అన్వయక్రమము :- జానకీ నూనం వినష్టా, లంకాయాం కశ్చిత్ ఉద్దేశః అదగ్ధః న ప్రదృశ్యతే, సర్వా పురీ భస్మీకృతా.

ప్రతిపదార్థము :- జానకీ = సీతాదేవి, నూనం = నిశ్చయముగా, వినష్టా = నశించినది, లంకాయాం = లంకయందు, కశ్చిత్ ఉద్దేశః = ఏ ప్రదేశముగూడ, అదగ్ధః = దహింపబడనిది, న ప్రదృశ్యతే = కానబడుటలేదు, పురీ = నగరము, సర్వా = అంతయును, భస్మీకృతా = భస్మము చేయబడినది.

తాత్పర్యము :- సీతాదేవి తప్పక నశించియుండును. ఈ లంకానగరమున దగ్ధముగాని ప్రదేశము ఒక్కటిగూడ లేదు; పట్టణమంతయును భస్మమైనది.

శ్లో॥ యది తద్విహతం కార్యం మమ ప్రజ్ఞావిపర్యయాత్ ।
ఇహైవ ప్రాణసంన్యాసో మమాపి హ్యద్య రోచతే ॥ 13

పదచ్ఛేదము :- యది - తత్ - విహతం - కార్యం - మమ - ప్రజ్ఞావిపర్యయాత్, ఇహ - ఏవ - ప్రాణసంన్యాసః - మమ - అపి - హి - అద్య - రోచతే ॥

అన్వయక్రమము :- మమ ప్రజ్ఞావిపర్యయాత్ తత్ కార్యం విహతం యది మమ అపి ఇహ ఏవ అద్య ప్రాణసంన్యాసః రోచతే.

ప్రతిపదార్థము :- మమ = నాయొక్క, ప్రజ్ఞావిపర్యయాత్ = బుద్ధివైపరీత్యమువలన, తత్ కార్యం = ఆ స్వామికార్యము, విహతం యది = నశించియున్నయెడల, మమ అపి = నాకుకూడ, ఇహ ఏవ = ఈ లంకయందే, అద్య = నేడు, ప్రాణసంన్యాసః = ప్రాణత్యాగము, రోచతే = ఇష్టమగును.

తాత్పర్యము :- నా బుద్ధివైపరీత్యమువలన నా స్వామికార్యమే చెడిపోయినయెడల నేడు నాకిచ్చటనే ప్రాణత్యాగమే కర్తవ్యమై యుండును.

శ్లో॥ కి మగ్నౌ నిపతా మ్యద్య ఆహోస్వి ద్బడబాముఖే ।
శరీర మాహో సత్త్వానాం దద్మి సాగరవాసినామ్ ॥ 14

పదచ్ఛేదము :– కిమ్ – అగ్నౌ – నిపతామి – అద్య – ఆహోస్విత్ – బడబాముఖే, శరీరమ్ – ఆహో – సత్త్వానాం – దద్మి – సాగరవాసినామ్ ॥

అన్వయక్రమము :– అద్య అగ్నౌ నిపతామి కిమ్, ఆహో స్విత్ బడబాముఖే నిపతామి, ఆహో! సాగరవాసినాం సత్త్వానాం శరీరం దద్మి (కిమ్)?

ప్రతిపదార్థము :– అద్య = ఇప్పుడు, అగ్నౌ = అగ్నియందు, నిపతామి కిం = పడుదునా ఏమి? ఆహోస్విత్ = లేక, బడబాముఖే = బడబాగ్నియందు, నిపతామి = పడుదునా? ఆహో = లేక, సాగరవాసినాం = సముద్రమునందు వసించునట్టి, సత్త్వానాం = జంతువులకు, శరీరం = దేహమును, దద్మి కిం = ఇత్తునా యేమి?

తాత్పర్యము :– నేనిప్పుడు నా శరీరమును అగ్ని కర్పింతునా లేక సముద్రమునందలి బడబాగ్ని కర్పింతునా లేక ఈ సముద్రమునందలి జంతువుల కాహారముగా నర్పింతునా?

శ్లో॥ కథం హి జీవతా శక్యో మయా ద్రష్టుం హరీశ్వరః ।
తౌ వా పురుషశార్దూలౌ కార్యసర్వస్వఘాతినా ॥ 15

పదచ్ఛేదము :– కథం – హి – జీవతా – శక్యః – మయా – ద్రష్టుం – హరీశ్వరః – తౌ – వా – పురుషశార్దూలౌ – కార్యసర్వస్వఘాతినా ॥

అన్వయక్రమము :– కార్యసర్వస్వఘాతినా జీవతా మయా హరీశ్వరః కథం ద్రష్టుం శక్యః? తౌ పురుషశార్దూలౌ వా (కథం శక్యౌ?).

ప్రతిపదార్థము :– కార్యసర్వస్వఘాతినా = కార్యము సమస్తము ధ్వంసము చేసినట్టి, మయా = నాచేత, జీవతా = బ్రతికియున్నవాడనై, హరీశ్వరః = వానరరాజైన సుగ్రీవుడు, ద్రష్టుం = చూచుటకు, కథం = ఎట్లు, శక్యః = వీలగును?, తౌ పురుషశార్దూలౌ వా = ఆ పురుషశ్రేష్ఠు లిరువు రయినప్పటికి, కథం = ఎట్లు, ద్రష్టుం = చూచుటకు, శక్యౌ = వీలగుదురు?

తాత్పర్యము :– స్వామికార్యమునకు మూలవిఘాతము చేసినట్టి నేను నా ప్రాణములతో నిలచి మా వానరరాజైన సుగ్రీవునెట్లు చూడగలను? పురుషశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణు లిరువురిని మాత్రమెట్లు దర్శింపగలను?

శ్లో॥ మయా ఖలు తదే వేదం రోషదోషా త్ప్రదర్శితమ్ ।
ప్రథితం త్రిషు లోకేషు కపిత్వ మనవస్థితమ్ ॥ 16

పదచ్ఛేదము :- మయా - ఖలు - తత్ - ఏవ - ఇదం - రోషదోషాత్ - ప్రదర్శితమ్, ప్రథితం - త్రిషు - లోకేషు - కపిత్వమ్ - అనవస్థితమ్ ॥

అన్వయక్రమము :- త్రిషు లోకేషు ప్రథితం తత్ అనవస్థితం ఇదం కపిత్వమ్ ఏవ రోషదోషాత్ మయా ప్రదర్శితం ఖలు!

ప్రతిపదార్థము :- త్రిషు లోకేషు = మూడులోకములందును, ప్రథితం = ప్రసిద్ధమైయున్న, తత్ = ఆ, అనవస్థితం = చంచలమైనట్టి, ఇదం కపిత్వమ్ ఏవ = ఈ వానరస్వభావమే, రోషదోషాత్ = క్రోధముయొక్క దోషమువలన, మయా = నాచేత, ప్రదర్శితం ఖలు = ప్రదర్శింపబడినదిగదా!

తాత్పర్యము :- మూడు లోకములందును ప్రసిద్ధమైయున్న వానరుల సహజగుణమగు మా చపలస్వభావమునే నేనిప్పుడు క్రోధమునకు చిక్కుకొని ప్రదర్శించుకొంటినిగదా!

శ్లో॥ ధిగస్తు రాజసం భావ మనీశ మనవస్థితమ్ ।
ఈశ్వరేణాపి య ద్రాగా న్మయా సీతా న రక్షితా ॥ 17

పదచ్ఛేదము :- ధిక్ - అస్తు - రాజసం - భావమ్ - అనీశమ్ - అనవస్థితమ్ - ఈశ్వరేణ - అపి - యత్ - రాగాత్ - మయా - సీతా - న - రక్షితా ॥

అన్వయక్రమము :- అనీశమ్ అనవస్థితం రాజసం భావం ధిక్ అస్తు; యత్ ఈశ్వరేణాపి మయా సీతా రాగాత్ న రక్షితా.

ప్రతిపదార్థము :- అనీశం = నిగ్రహములేనట్టిదియు, అనవస్థితం = స్థిరత్వములేనట్టిదియునగు, రాజసం భావం = రాజగుణమును గూర్చి, ధిక్ అస్తు = నిందయగుగాక! యత్ = ఎందువల్లననగా, రాగాత్ = రాజసగుణమువలన, ఈశ్వరేణాపి = సమర్థుడనైప్పటికిని, మయా = నాచేత, సీతా = సీతాదేవి, న రక్షితా = రక్షింపబడలేదు.

తాత్పర్యము :- నిగ్రహమును గోల్పోవజేసి చంచలత్వమునకు నిలయమై యుండెడు రాజసగుణము మిక్కిలి నింద్యమైనది. నే నా రాజసము వలన గల్గిన క్రోధముచేతనే ఇట్టి దహనకృత్యమునకు బూని సమర్థుడైనప్పటికిని జానకమ్మను గూర్చి ఆలోచించి రక్షింపలేకపోయితిని.

శ్లో॥ వినష్టాయాం తు సీతాయాం తావుభౌ వినశిష్యతః ।
తయో ర్వినాశే సుగ్రీవ స్సబంధు ర్వినశిష్యతి ॥ 18

పదచ్ఛేదము :- వినష్టాయాం - తు - సీతాయాం - తౌ - ఉభౌ - వినశిష్యతః , తయోః - వినాశే - సుగ్రీవః - సబంధుః - వినశిష్యతి ॥

అన్వయక్రమము :- సీతాయాం వినష్టాయాం (సత్యాం) తౌ ఉభౌ వినశిష్యతః, తయోః వినాశే (సతి) సుగ్రీవః సబంధుః వినశిష్యతి.

ప్రతిపదార్థము :- సీతాయాం = సీతాదేవి, వినష్టాయాం (సత్యాం) = నశించినది కాగా, తౌ ఉభౌ = ఆ రామలక్ష్మణు లిరువురును, వినశిష్యతః = నశించిపోవుదురు, తయోః = వారిరువురియొక్క, వినాశే (సతి) = వినాశము కాగా, సుగ్రీవః = సుగ్రీవుడు, సబంధుః = బంధువులతో సహితముగా, వినశిష్యతి = నశించును.

తాత్పర్యము :- సీతమ్మయే నశించినప్పుడు ఆ రామలక్ష్మణు లిరువురును మరణింతురు. వారిరువురును మరణించినప్పుడు తన బంధుగణములతో గలసి మా రాజగు సుగ్రీవుడు ప్రాణములు వీడును.

శ్లో॥ ఏతదేవ వచ శ్రుత్వా భరతో భ్రాతృవత్సలః ।
ధర్మాత్మా సహశత్రుఘ్నః కథం శక్ష్యతి జీవితుమ్ ॥ 19

పదచ్ఛేదము :- ఏతత్ - ఏవ - వచః - శ్రుత్వా - భరతః - భ్రాతృవత్సలః - ధర్మాత్మా - సహశత్రుఘ్నః - కథం - శక్ష్యతి - జీవితుమ్ ॥

అన్వయక్రమము :- ఏతత్ వచః శ్రుత్వా ఏవ భ్రాతృవత్సలః ధర్మాత్మా భరతః సహశత్రుఘ్నః జీవితుం కథం శక్ష్యతి?

ప్రతిపదార్థము :- ఏతత్ వచః = ఈ మాటను, శ్రుత్వా ఏవ = వినగానే, భ్రాతృవత్సలః సోదరప్రేమగలవాడును, ధర్మాత్మా = ధర్మమునందు నిష్ఠగలవాడును అగు, సహశత్రుఘ్నః = శత్రుఘ్నునితో గూడియున్నట్టి, భరతః = భరతుడు, జీవితుం = బ్రతికియుండుటకు, కథం = ఎట్లు, శక్ష్యతి = శక్తుడగును?

తాత్పర్యము :- ఈ దుర్వార్తను వినగానే సోదరప్రేమకు నిలయమైనవాడును పరమ ధార్మికుడును అగు భరతుడును, ఆ శత్రుఘ్నుడును ప్రాణముల నెట్లు నిలుపుకొనగలరు?

శ్లో॥ ఇక్ష్వాకువంశే ధర్మిష్ఠే గతే నాశ మసంశయమ్ ।
భవిష్యంతి ప్రజా స్సర్వా శ్శోకసంతాపపీడితాః ॥ 20

పదచ్ఛేదము :- ఇక్ష్వాకువంశే - ధర్మిష్ఠే - గతే - నాశమ్ - అసంశయమ్, భవిష్యంతి - ప్రజాః - సర్వాః - శోకసంతాపపీడితాః ॥

అన్వయక్రమము :- ధర్మిష్ఠే ఇక్ష్వాకువంశే నాశం గతే (సతి) అసంశయం ప్రజాః సర్వాః శోకసంతాపపీడితాః భవిష్యంతి.

ప్రతిపదార్థము :- ధర్మిష్ఠే = ధర్మనిష్ఠ గలిగినట్టి, ఇక్ష్వాకువంశే = ఇక్ష్వాకువంశము, నాశం గతే (సతి) = నాశనమునొందగా, అసంశయమ్ = నిస్సంశయముగా, ప్రజాః సర్వాః = ప్రజలెల్లరును, శోకసంతాపపీడితాః = దుఃఖసంతాపముచే పీడింపబడినవారు, భవిష్యంతి = కాగలరు.

తాత్పర్యము :- పరమధార్మికులని ప్రసిద్ధినొందిన ఇక్ష్వాకుమహారాజు వంశ మీరీతిగా నశించిపోగా లోకములోని జనులెల్లరును నిస్సందేహముగా దుఃఖసంతాపముతో పీడింపబడి నశించిపోవుదురు.

శ్లో॥ తదహం భాగ్యరహితో లుప్తధర్మార్థసంగ్రహః ।
రోషదోషపరీతాత్మా వ్యక్తం లోకవినాశనః ॥ 21

పదచ్ఛేదము :- తత్ - అహం - భాగ్యరహితః - లుప్తధర్మార్థసంగ్రహః, రోషదోషపరీతాత్మా - వ్యక్తం - లోకవినాశనః ॥

అన్వయక్రమము :- తత్ అహం భాగ్యరహితః లుప్తధర్మార్థసంగ్రహః, రోషదోషపరీతాత్మా వ్యక్తం లోకవినాశనః (భవిష్యామి).

ప్రతిపదార్థము :- తత్ = ఆ కారణమున, భాగ్యరహితః = అదృష్టహీనుడను, లుప్తధర్మార్థసంగ్రహః = లోపించిన ధర్మార్థముల సముదాయము గలవాడను, రోషదోషపరీతాత్మా = క్రోధముయొక్క దోషముచే నిండిన మనస్సుగలవాడను అగు, అహం = నేను, వ్యక్తం = స్పష్టముగా, లోకవినాశనః = లోకమునకు నాశనము గూర్చువాడను (భవిష్యామి = కాగలను).

తాత్పర్యము :- ఈ విధముగ అదృష్టహీనుడను, ధర్మార్థములను గోల్పోయినవాడను, క్రోధదుష్ఫలితమునకు వశుడైనవాడను అయి స్పష్టముగా లోకమునకు వినాశము తెచ్చిపెట్టినవాడను కాగలను గదా!

శ్లో॥ ఇతి చింతయత స్తస్య నిమిత్తా న్యుపపేదిరే ।
పూర్వ మ ప్యుపలబ్ధాని సాక్షా త్పున రచింతయత్ ॥ 22

పదచ్ఛేదము :- ఇతి - చింతయతః - తస్య - నిమిత్తాని - ఉపపేదిరే, పూర్వమ్ - అపి - ఉపలబ్ధాని - సాక్షాత్ - పునః - అచింతయత్ ॥

అన్వయక్రమము :- ఇతి చింతయతః తస్య పూర్వమ్ అపి ఉపలబ్ధాని నిమిత్తాని సాక్షాత్ ఉపపేదిరే (అతః సః) పునః అచింతయత్.

ప్రతిపదార్థము :- ఇతి = ఈ విధముగా, చింతయతః = ఆలోచించుచున్నట్టి, తస్య = ఆ హనుమకు, పూర్వమ్ అపి = పూర్వము గూడ, ఉపలబ్ధాని = చూడబడినట్టి, నిమిత్తాని = శుభశకునములు, సాక్షాత్ = ప్రత్యక్షముగా, ఉపపేదిరే = కలిగినవి (అతః = అందువలన, సః = అతడు) పునః = తిరిగి, అచింతయత్ = ఆలోచింపదొడగెను.

తాత్పర్యము :- ఈ విధముగా సంతాపముతో భయావహములైనట్టి ఆలోచనలు చేయుచున్న హనుమకు పూర్వము సీతాదర్శనమునకు ముందు గానవచ్చినట్టి శుభశకునములు మఱల గోచరింపసాగెను. అందుచే నాతడు సంతోషముతో తిరిగి ఇట్లు ఆలోచింపదొడగెను.

శ్లో॥ అథవా చారుసర్వాంగీ రక్షితా స్వేన తేజసా ।
న నశిష్యతి కళ్యాణీ నాగ్ని రగ్నౌ ప్రవర్తతే ॥ 23

పదచ్ఛేదము :- అథవా - చారుసర్వాంగీ - రక్షితా - స్వేన - తేజసా, న - నశిష్యతి - కళ్యాణీ - న - అగ్నిః - అగ్నౌ - ప్రవర్తతే ॥

అన్వయక్రమము :- అథవా - చారుసర్వాంగీ (సా) కళ్యాణీ స్వేన తేజసా రక్షితా న నశిష్యతి, అగ్నిః అగ్నౌ న ప్రవర్తతే.

ప్రతిపదార్థము :- అథవా = లేక, చారుసర్వాంగీ = సర్వాంగ సౌందర్యముగలదియును, కళ్యాణీ = మంగళస్వరూపురాలునగు, (సా = ఆ సీతాదేవి) స్వేన తేజసా = తన తేజస్సుచే, రక్షితా = రక్షింపబడినదై, న నశిష్యతి = నశింపబోవదు, అగ్నిః = అగ్ని, అగ్నౌ = అగ్నియందు, న ప్రవర్తతే = ప్రవర్తింపదు.

తాత్పర్యము :- అట్లుగాదు; నిండైన రమణీయరూపము గల్గినట్టి ఆ మంగళస్వరూపురాలు తన నిజతేజస్సుచేతనే తాను రక్షింపబడియుండగలదు. అగ్నిహోత్రుని తిరిగి అగ్ని దహించుట యనునది యుండునా.

శ్లో॥ నహి ధర్మాత్మన స్తస్య భార్యా మమితతేజసః ।
స్వచారిత్రాభిగుప్తాం తాం స్ప్రష్టు మర్హతి పావకః ॥ 24

పదచ్ఛేదము :- న - హి - ధర్మాత్మనః - తస్య - భార్యామ్ - అమితతేజసః, స్వచారిత్రాభిగుప్తాం - తాం - స్ప్రష్టుమ్ - అర్హతి - పావకః ॥

అన్వయక్రమము :– ధర్మాత్మనః అమితతేజసః తస్య భార్యాం స్వచారిత్రాభిగుప్తాం పావకః స్ప్రష్టుం న హి అర్హతి.

ప్రతిపదార్థము :– ధర్మాత్మనః = ధర్మాత్ముడును, అమితతేజసః = గొప్పతేజస్సుగలవాడు నగు, తస్య = ఆ శ్రీరామునియొక్క, భార్యాం = భార్యయైనట్టి, స్వచారిత్రాభిగుప్తాం = తన శీలముచేతనే రక్షణము నొందియున్నట్టి, తాం = ఆ సీతాదేవిని, పావకః = అగ్నిహోత్రుడు, స్ప్రష్టుం = తాకుటకు, న హి అర్హతి = సమర్థుడుగాడు గదా!

తాత్పర్యము :– పరమధర్మాత్ముడైన ఆ యపరిమితప్రతాపశాలి యగు శ్రీరాముని ధర్మపత్నియును తన పాతివ్రత్యధర్మమే కవచముగా గలిగియున్నదియునగు సాధ్వీమణియైన సీతమ్మను అగ్నిహోత్రు డెట్లు తాకగలడు?

శ్లో॥ నూనం రామప్రభావేణ వైదేహ్యా స్సుకృతేన చ ।
య న్మాం దహనకర్మాయం నాదహ ద్ధవ్యవాహనః ॥ 25

పదచ్ఛేదము :– నూనం – రామప్రభావేణ – వైదేహ్యాః – సుకృతేన – చ, యత్ – మాం – దహనకర్మా – అయం – న – అదహత్ – హవ్యవాహనః ॥

అన్వయక్రమము :– దహనకర్మా అయం హవ్యవాహనః మాం న అదహత్ (ఇతి) యత్ (తత్) నూనం రామప్రభావేణ, వైదేహ్యాః సుకృతేన చ.

ప్రతిపదార్థము :– దహనకర్మా = దహించుటయే కృత్యముగా కలిగినట్టి, అయం హవ్యవాహనః = ఈ యగ్నిహోత్రుడు, మాం = నన్ను, న అదహత్ = దహింపలేదు, (ఇతి యత్ = అనునదేది గలదో) తత్ = అది, నూనం = నిశ్చయముగా, రామప్రభావేణ = రఘురాముని ప్రభావముచేతను, వైదేహ్యాః = సీతాదేవియొక్క, సుకృతేన చ = పుణ్యముచేతను (జరిగినది).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– శ్రీరాముని ప్రభావమువలన అగ్ని అతని దాసుడనగు నన్నే దహింపనప్పుడు ఆతని ధర్మపత్ని నెట్లు తాకగలడని భావము.

తాత్పర్యము :– నిశ్చయముగా శ్రీరాముని ప్రభావముచేతను సీతాదేవియొక్క పుణ్యవిశేషముచేతను మాత్రమే ఆ యగ్నిహోత్రుడు తన నైజగుణముగా అన్నింటిని దహించువాడేయైనప్పటికిని నా శరీరమునందుండికూడ నన్ను దహింపలేదు. అట్టిచో నాతడు సీతాసాధ్వి నెట్లు తాకగలడు?

శ్లో॥ త్రయాణాం భరతాదీనాం భ్రాతౄణాం దేవతా చ యా ।
రామస్య చ మనఃకాంతా సా కథం వినశిష్యతి ? ॥ 26

పదచ్ఛేదము :– త్రయాణాం – భరతాదీనాం – భ్రాతౄణాం – దేవతా – చ – యా – రామస్య – చ – మనఃకాంతా – సా – కథం – వినశిష్యతి ॥

అన్వయక్రమము :– యా భరతాదీనాం త్రయాణాం భ్రాతౄణాం దేవతా చ రామస్య మనఃకాంతా చ, సా కథం వినశిష్యతి?

ప్రతిపదార్థము :– యా = ఏ పూజ్యురాలు, భరతాదీనాం = భరతుడు మున్నగు, త్రయాణాం భ్రాతౄణాం = మువ్వురుసోదరులకును, దేవతా చ = ఉపాస్యదేవతయైనదో, రామస్య = శ్రీరామునకు, మనఃకాంతా చ = మనోహారిణియునైయున్నదో, సా = ఆ దేవి, కథం = ఎట్లుగ, వినశిష్యతి = నశింపగలదు?

తాత్పర్యము :– ఏ పూజ్యురాలు భరతలక్ష్మణశత్రుఘ్నులను మువ్వురుసోదరులకును ఉపాస్యదైవమై శ్రీరామున కత్యంతప్రియరాలుగ వెలయుచున్నదో అట్టి మహాత్మురాలెట్లు నశించును?

శ్లో॥ యద్వా దహనకర్మాయం సర్వత్ర ప్రభు రవ్యయః ।
న మే దహతి లాంగూలం కథమార్యాం ప్రధక్ష్యతి ॥ 27

పదచ్ఛేదము :– యద్వా – దహనకర్మా – అయం – సర్వత్ర – ప్రభుః – అవ్యయః – న – మే – దహతి – లాంగూలం – కథమ్ – ఆర్యాం – ప్రధక్ష్యతి ॥

అన్వయక్రమము :– యద్వా సర్వత్ర దహనకర్మా ప్రభుః అవ్యయః అయం మే లాంగూలం న దహతి; ఆర్యాం కథం ప్రధక్ష్యతి?

ప్రతిపదార్థము :– యద్వా = లేక, సర్వత్ర = ఎల్లయెడలను, దహనకర్మా = దహించుటకృత్యముగాగల, ప్రభుః = సమర్థుడైనట్టి, అవ్యయః అయం = నాశనములేనట్టి ఈ యగ్నిహోత్రుడు, మే లాంగూలం = నాయొక్క తోకను, న దహతి = దహింపగలడు, ఆర్యాం = పూజ్యురాలైనట్టి సీతామాతను, కథం = ఎట్లు, ప్రధక్ష్యతి = దహింపగలడు.

తాత్పర్యము :– అట్లుగాక ఎల్లయెడల దహించుటయే తన స్వభావముగా తన సామర్థ్యమును ప్రదర్శించునట్టి ఈ యగ్నిహోత్రుడు నా వాలమును దహించుట మానినాడు. శ్రీరాముని సేవకుడనైన నన్నే విడిచిన ఈ యగ్నిదేవుడు రామపత్నియైన ఆ మహాసాధ్వి నెట్లు దహించును?

శ్లో॥ పున శ్చాచింతయ త్తత్ర హనుమా న్విస్మిత స్తదా ।
హిరణ్యనాభస్య గిరే ర్జలమధ్యే ప్రదర్శనమ్ ॥ 28

పదచ్ఛేదము :- పునః - చ - అచింతయత్ - తత్ర - హనుమాన్ - విస్మితః - తదా, హిరణ్యనాభస్య - గిరేః - జలమధ్యే - ప్రదర్శనమ్ ॥

అన్వయక్రమము :- తదా తత్ర హనుమాన్ విస్మితః (సన్) జలమధ్యే హిరణ్యనాభస్య గిరేః ప్రదర్శనం పునః చ అచింతయత్.

ప్రతిపదార్థము :- తదా = అప్పుడు, తత్ర = అచ్చట, హనుమాన్ = హనుమ, విస్మితః (సన్) = ఆశ్చర్యము నొందినవాడగుచు, జలమధ్యే = నీటినడుమ, హిరణ్యనాభస్య గిరేః = మైనాకపర్వతముయొక్క, ప్రదర్శనం = కాన్పించుటనుగూర్చి, పునః చ = మఱల, అచింతయత్ = ఆలోచించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- సముద్రజలమధ్యమున సీతాదేవి ప్రభావముచేతనే గదా నా విశ్రాంతి నిమిత్తమై పర్వత ముద్భవించినది! అట్టి ప్రభావశాలినియైన సీతాదేవిని అగ్నిదేవుడు ఎన్నడును దహింపడని హనుమ భావన.

రా. శిరోమణి :- పర్వతప్రభృతి సమస్తభూతజాలమును రామాజ్ఞావశవర్తులై యుండుటచే సీతాదేవికి అగ్నివలన భయముండదని హనుమ గ్రహించుచున్నాడు.

తాత్పర్యము :- అప్పుడా సమయమున విస్మయాన్వితుడైన హనుమ తిరిగి మహాసముద్రమధ్యమందు తన విశ్రాంతి నిమిత్తమై పర్వత ముద్భవించినట్టి విషయమును సీతారాముల ప్రభావమునకు నిదర్శనముగా జ్ఞప్తికి తెచ్చుకొనెను.

శ్లో॥ తపసా సత్యవాక్యేన అనన్యత్వాచ్చ భర్తరి ।
అపి సా నిర్దహే దగ్నిం న తా మగ్నిః ప్రధక్ష్యతి ॥ 29

పదచ్ఛేదము :- తపసా - సత్యవాక్యేన - అనన్యత్వాత్ - చ - భర్తరి, అపి - సా - నిర్దహేత్ - అగ్నిం - న - తామ్ - అగ్నిః - ప్రధక్ష్యతి ॥

అన్వయక్రమము :- తపసా సత్యవాక్యేన భర్తరి అనన్యత్వాత్ చ, సా అగ్నిమ్ అపి నిర్దహేత్, తాం అగ్నిః న ప్రధక్ష్యతి.

ప్రతిపదార్థము :- తపసా = తపస్సుచేతను, సత్యవాక్యేన = సత్యవచనముచేతను, భర్తరి = భర్త విషయమునందు, అనన్యత్వాత్ చ = ఇతరభావము లేకపోవుటచేతను,

సా = ఆ సీతాదేవి, అగ్నిమ్ అపి = అగ్నిని గూడ, నిర్దహేత్ = దహించివేయును, తాం = ఆ సీతాదేవిని, అగ్నిః = అగ్నిహోత్రుడు, న ప్రధక్ష్యతి = దహింపబోవడు.

తాత్పర్యము :– తన తపశ్శక్తిచేతను, సత్యపాలనప్రభావముచేతను భర్తయందలి తత్పరతచేతను సీతాదేవి అగ్నిహోత్రునే దహింపగలదు. అంతియేగాని అగ్నిహోత్రుడు మాత్ర మామె నెన్నడును తాకజాలడు.

శ్లో॥ స తథా చింతయం స్తత్ర దేవ్యా ధర్మపరిగ్రహమ్ ।
శుశ్రావ హనుమా న్వాక్యం చారణానాం మహాత్మనామ్ ॥ 30

పదచ్ఛేదము :– సః – తథా – చింతయన్ – తత్ర – దేవ్యాః – ధర్మపరిగ్రహం శుశ్రావ – హనుమాన్ – వాక్యం – చారణానాం – మహాత్మనామ్ ॥

అన్వయక్రమము :– సః హనుమాన్ తత్ర తథా దేవ్యాః ధర్మపరిగ్రహం చింతయన్ మహాత్మనాం చారణానాం వాక్యం శుశ్రావ.

ప్రతిపదార్థము :– సః హనుమాన్ = ఆ హనుమ, తత్ర = అచ్చట, తథా = అట్లు, దేవ్యాః = సీతాదేవియొక్క, ధర్మపరిగ్రహం = ధర్మతత్పరతనుగూర్చి, చింతయన్ = ఆలోచించుచు, మహాత్మనాం = మహనీయులైనట్టి, చారణానాం = చారణులయొక్క, వాక్యం = వచనమును, శుశ్రావ = వినెను.

తాత్పర్యము :– హనుమంతు డప్పుడు అచ్చట ఆ విధముగా సీతాదేవియొక్క ధర్మతత్పరతను గూర్చి స్మరించుచుండగా అతనికి చారణులు ఆకసమున తమలో తాము చెప్పుకొనుచున్నట్టి ఈ మాటలు వినవచ్చినవి.

శ్లో॥ అహో! ఖలు కృతం కర్మ దుష్కరం హి హనూమతా ।
అగ్నిం విసృజతాఽభీక్ష్ణం భీమం రాక్షససద్మని ॥ 31

పదచ్ఛేదము :– అహో – ఖలు – కృతం – కర్మ – దుష్కరం – హి – హనూమతా, అగ్నిం – విసృజతా – అభీక్ష్ణం – భీమం – రాక్షససద్మని ॥

అన్వయక్రమము :– అహో! రాక్షససద్మని భీమమ్ అభీక్ష్ణమ్ అగ్నిం విసృజతా హనూమతా దుష్కరం కర్మ కృతం హి ఖలు.

ప్రతిపదార్థము :– అహో = ఆహా!, రాక్షససద్మని = రాక్షసనివాసమునందు, అభీక్ష్ణం = మిక్కిలిగా, భీమం = భయంకరమైనట్టి, అగ్నిం = అగ్నిని, విసృజతా = విడుచుచున్నట్టి, హనూమతా = హనుమచే, దుష్కరం = అసాధ్యమైనట్టి, కర్మ = కృత్యము, కృతం హి ఖలు = చేయబడినదిగదా!

తాత్పర్యము :- ఆహా! రాక్షసులయొక్క నిలయములందు ఎడతెగని భయంకరమైన అగ్నిని రగిల్చి హనుమంతుడు ఎంతటి దుష్కరకార్యమును గావించినాడో గదా!

శ్లో॥ ప్రపలాయితరక్షఃస్త్రీ బాలవృద్ధసమాకులా ।
జనకోలాహలాధ్మాతా క్రందంతీ వాద్రికందరే ॥ 32

పదచ్ఛేదము :- ప్రపలాయితరక్షఃస్త్రీబాలవృద్ధసమాకులా, జనకోలాహలాధ్మాతా - క్రందంతీ - ఇవ - అద్రికందరే ॥

అన్వయక్రమము :- ప్రపలాయితరక్షఃస్త్రీబాలవృద్ధసమాకులా నగరీ జనకోలాహలాధ్మాతా అద్రికందరే క్రందంతీ ఇవ (వర్తతే).

ప్రతిపదార్థము :- ప్రపలాయితరక్షఃస్త్రీబాలవృద్ధసమాకులా = పరువిడుచున్న రాక్షసస్త్రీలతోడను బాలురతోడను వృద్ధులతోడను సంకులముగ నున్నదై, నగరీ = లంకాపురి, జనకోలాహలాధ్మాతా = జనులయొక్క కోలాహలముచే పూరింపబడినదై, అద్రికందరే = పర్వతగుహయందు, క్రందంతీ ఇవ = ఆక్రోశించుచున్నదానివలె (వర్తతే = ఉన్నది).

తాత్పర్యము :- ఇప్పు డీ లంకానగరిని చూడగా ప్రాణరక్షణముకొఱకై నలుమూలలకును పరుగిడుచున్న రాక్షస్త్రీలతోడను, బాలురతోడను, వృద్ధులతోడను మిక్కిలి సంకులముగ నుండి కోలాహలముగనున్న వారి ఆక్రోశధ్వనితో నిండి కొండగుహలు మాఱుమ్రోగుచుండ ఈ నగరియే అందుండి ఆక్రందించుచున్నట్లున్నది.

శ్లో॥ దగ్ధేయం నగరీ సర్వా సాట్టప్రాకారతోరణా ।
జానకీ న చ దగ్ధేతి విస్మయో ఉద్భుత ఏవ నః ॥ 33

పదచ్ఛేదము :- దగ్ధా - ఇయం - నగరీ - సర్వా - సాట్టప్రాకారతోరణా, జానకీ - న - చ - దగ్ధా - ఇతి - విస్మయః - అద్భుతః - ఏవ - నః ॥

అన్వయక్రమము :- సాట్టప్రాకారతోరణా, సర్వా ఇయం నగరీ దగ్ధా, జానకీ న చ దగ్ధా ఇతి నః విస్మయః అద్భుతః (భవతి).

ప్రతిపదార్థము :- సాట్టప్రాకారతోరణా = కోటబురుజులతోడను ప్రాకారములతోడను, బహిర్ద్వారముల తోడను కూడిన, సర్వా = సమస్తమైన, ఇయం నగరీ = ఈ పట్టణము, దగ్ధా = దహింపబడినది, జానకీ = సీతాదేవి, న చ దగ్ధా = ఏ మాత్రమును దహింపబడలేదు, ఇతి = అనునది, నః = మనకు, విస్మయః = ఆశ్చర్యమును, అద్భుతః = అద్భుతమును, (భవతి = అగుచున్నది).

తాత్పర్యము :– బురుజులతోడను, ప్రాకారములతోడను సింహద్వారములతోడను కూడిన నగరమంతయును తగలబడిపోయినది. కాని సీతాదేవి మాత్రము కసుగందలేదు. ఈ విషయము మన కపరిమితమైన ఆశ్చర్యముగను అద్భుతముగను ఉన్నది.

శ్లో॥ ఇతి శుశ్రావ హనుమా న్వాచం తా మమృతోపమామ్ ।
బభూవ చాస్య మనసో హర్ష స్తత్కాలసంభవః ॥ 34

పదచ్ఛేదము :– ఇతి – శుశ్రావ – హనుమాన్ – వాచం – తామ్ – అమృతోపమామ్, బభూవ – చ – అస్య – మనసః – హర్షః – తత్కాలసంభవః ॥

అన్వయక్రమము :– ఇతి హనుమాన్ అమృతోపమాం తాం వాచం శుశ్రావ, (అస్య మనసః) తత్కాలసంభవః హర్షః చ బభూవ.

ప్రతిపదార్థము :– ఇతి = అని, హనుమాన్ = హనుమ, అమృతోపమాం = అమృతతుల్యమైన, తాం వాచం = ఆ వచనమును, శుశ్రావ = ఆలకించెను. అస్య = ఆతనియొక్క, మనసః = మనస్సునకు, తత్కాలసంభవః = ఆ సమయమునందు జనించినట్టి, హర్షః చ = ఆనందము కూడ, బభూవ = కలిగెను.

తాత్పర్యము :– హనుమ ఈ విధమైన అమృతతుల్యమగు వచనములను ఆలకించగనే ఆతని మనస్సు ఆ సమయమునందు అమితమైన ఆనందము నొందెను.

శ్లో॥ స నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః ।
ఋషివాక్యైశ్చ హనుమా నభవ ప్ప్రీతమానసః ॥ 35

పదచ్ఛేదము :– సః – నిమిత్తైః – చ – దృష్టార్థైః – కారణైః – చ – మహాగుణైః, ఋషివాక్యైః – చ – హనుమాన్ – అభవత్– ప్రీతమానసః ॥

అన్వయక్రమము :– దృష్టార్థైః నిమిత్తైః చ మహాగుణైః కారణైః చ ఋషివాక్యైః చ సః హనుమాన్ ప్రీతమానసః అభవత్.

ప్రతిపదార్థము :– దృష్టార్థైః = కనపడిన ప్రయోజనముగల్గినట్టి, నిమిత్తైః చ = మంచిశకునములచేతను, మహాగుణైః = గొప్పగుణములుగల, కారణైః చ = కారణములచేతను, ఋషివాక్యైః చ = చారణుల వచనములచేతను, సః హనుమాన్ = ఆ హనుమ, ప్రీతమానసః = సంతోషము నొందిన మనస్సుగలవాడు, అభవత్ = ఆయెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- నిమిత్తైః - కుడికన్ను అదురుట మున్నగు శుభశకునములచే, కారణైః - సీతమ్మ పాతివ్రత్యము రఘురాముని ప్రభావము మున్నగు హేతువులచే, ఋషివాక్యైః - చారణుల పలుకులచే.

తాత్పర్యము :- కుడికన్ను అదురుట మున్నగు శుభశకునములచేతను, సీతారాముల దివ్యప్రభావము మున్నగు గొప్ప కారణములచేతను, ఆకసమునందు వినిపించిన చారణుల వచనములచేతను హనుమంతుని మనస్సునకు అప్పుడు మహానందము గలిగెను.

శ్లో॥ తతః కపిః ప్రాప్తమనోరథార్థ
స్తా మక్షతాం రాజసుతాం విదిత్వా ।
ప్రత్యక్షత స్తాం పునరేవ దృష్ట్వా
ప్రతిప్రయాణాయ మతిం చకార ॥ 36

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"హనుమద్విభ్రమో' నామ
పంచపంచాశస్సర్గః.

పదచ్ఛేదము :- తతః - కపిః - ప్రాప్తమనోరథార్థః - తామ్ - అక్షతాం - రాజసుతాం - విదిత్వా, ప్రత్యక్షతః - తాం - పునః - ఏవ - దృష్ట్వా - ప్రతిప్రయాణాయ - మతిం - చకార ॥

అన్వయక్రమము :- తతః కపిః ప్రాప్తమనోరథార్థః (సన్) తామ్ అక్షతాం రాజసుతాం విదిత్వా ప్రత్యక్షతః తాం పునః ఏవ దృష్ట్వా ప్రతిప్రయాణాయ మతిం చకార.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, కపిః = హనుమ, ప్రాప్తమనోరథార్థః (సన్) = పొందబడిన కోరికగలవా డగుచు, తాం రాజసుతాం = ఆ రాజకుమారియైన సీతాదేవిని, అక్షతాం = హానిలేనిదానినిగా, విదిత్వా = తెలిసికొని, పునః = తిరిగి, తాం = ఆమెను, ప్రత్యక్షతః = ప్రత్యక్షముగా, దృష్ట్వా ఏవ = చూచియే, ప్రతిప్రయాణాయ = తిరుగు ప్రయాణముకొఱకు, మతిం చకార = నిశ్చయము చేసికొనెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమ తలపెట్టిన యత్నము ఫలించినందున సీతాదేవి చెక్కుచెదరక క్షేమముగ నున్నదని తెలిసికొని మఱల నింకొకమాఱు ఆమెను ప్రత్యక్షముగ

దర్శించియే తన నిజనివాసమునకు వెడలవలెనని నిశ్చయించుకొనెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"హనుమద్విభ్రమము" అను
ఏబదియైదవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

షట్పంచాశసర్గ

శ్లో॥ తత స్తాం శింశుపామూలే జానకీం పర్యవస్థితామ్ ।
అభివా ద్యాబ్రవీ ద్దిష్ట్యా పశ్యామి త్వా మి హాక్షతామ్ ॥ 1

పదచ్ఛేదము :- తతః - తాం - శింశుపామూలే - జానకీం - పర్యవస్థితామ్ - అభివాద్య - అబ్రవీత్ - దిష్ట్యా - పశ్యామి - త్వామ్ - ఇహ - అక్షతామ్ ॥

అన్వయక్రమము :- తతః (హనుమాన్) శింశుపామూలే పర్యవస్థితాం తాం జానకీం అభివాద్య దిష్ట్యా త్వాం ఇహ అక్షతాం పశ్యామి (ఇతి) అబ్రవీత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, హనుమాన్ = హనుమ, శింశుపామూలే = శింశుపావృక్షము మొదట, పర్యవస్థితాం = కూర్చుండియున్న, తాం జానకీం = ఆ సీతమ్మను, అభివాద్య = నమస్కరించి, దిష్ట్యా = భాగ్యవశమున, త్వాం = నిన్ను, ఇహ = ఇచ్చట, అక్షతాం = కుశలముగ నున్నదానినిగా, పశ్యామి = చూచుచున్నాను, (ఇతి = అని) అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమ శింశుపావృక్షముక్రింద కూర్చుండియున్న సీతాదేవిని సమీపించి ఆమెకు మ్రొక్కి ఆమెతో తల్లీ! నా అదృష్టమున మఱల నిన్నిచ్చట క్షేమముగ నుండుట చూడగల్గితిని అని పలికెను.

శ్లో॥ తత స్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునః పునః ।
భర్తృస్నేహాన్వితం వాక్యం హనూమంత మభాషత ॥ 2

పదచ్ఛేదము :- తతః - తం - ప్రస్థితం - సీతా - వీక్షమాణా - పునః - పునః, భర్తృస్నేహాన్వితం - వాక్యం - హనూమంతమ్ - అభాషత ॥

అన్వయక్రమము :- తతః ప్రస్థితం తం హనూమంతం పునః పునః వీక్షమాణా సీతా భర్తృస్నేహాన్వితం వాక్యమ్ అభాషత.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, ప్రస్థితం = బయలుదేరినట్టి, తం హనూమంతం = ఆ హనుమను, పునః పునః = మఱల మఱల, వీక్షమాణా = చూచుచున్నదై, సీతా

= సీతమ్మ, భర్తృస్నేహాన్వితం = భర్తయందలి ప్రేమతోగూడినట్టి, వాక్యం = వచనమును, అభాషత = పలికెను.

తాత్పర్యము :- అప్పుడారీతిగా ప్రయాణమై వెడలిపోనుద్యుక్తుడైన హనుమంతుని అనురాగముతో మఱల మఱల చూచుచు సీతమ్మ తన భర్తయందలి ప్రేమాతిశయముచే అతనితో నీరీతిగా పలికినది.

శ్లో॥ కామ మస్య త్వమే వైకః కార్యస్య పరిసాధనే ।
పర్యాప్తః పరవీరఘ్న యశస్య స్తే బలోదయః ॥ 3

పదచ్ఛేదము :- కామమ్ - అస్య - త్వం - ఏవ - ఏకః - కార్యస్య - పరిసాధనే, పర్యాప్తః - పరవీరఘ్న - యశస్యః - తే - బలోదయః ॥

అన్వయక్రమము :- పరవీరఘ్న అస్య కార్యస్య పరిసాధనే త్వమ్ ఏకః ఏవ కామం పర్యాప్తః, తే బలోదయః యశస్యః.

ప్రతిపదార్థము :- పరవీరఘ్న = శత్రువీరులను దునుమాడు శూరుడా!, అస్య కార్యస్య = ఈ పనియొక్క, పరిసాధనే = నిర్వహణమునందు, త్వం = నీవు, ఏకః ఏవ = ఒక్కడవే, కామం = ఎంతయును, పర్యాప్తః = చాలినవాడవు; తే బలోదయః = నీ బలవిజృంభణము, యశస్యః = కీర్తికరమైనది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- 'అస్య కార్యస్య పరిసాధనే' - లంకయందలి రాక్షసుల నెల్లరను వధించి నన్ను శ్రీరామసన్నిధికి గొనిపోవుట యను కార్యముయొక్క నిర్వహణమునందు 'బలోదయః తే యశస్యః' - ఈ ప్రతాపప్రకర్షము నీకే కీర్తికరమగును, గాని రామునకు కాదు గదా యని భావము.

తాత్పర్యము :- ఓ శత్రుసంహారకుడా! ప్రస్తుతకార్యమును నీవొక్కడవు చేపట్టి సాధింపగల సామర్థ్యము గలవాడవు. ఈ బలవిజృంభణము నీకెంతయును ప్రతిష్ఠను గూర్చునట్టిదే.

శ్లో॥ శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః ।
మాం నయేద్యది కాకుత్థ్సస్తత్తస్య సదృశం భవేత్ ॥ 4

పదచ్ఛేదము :- శరైః - తు - సంకులాం - కృత్వా - లంకాం - పరబలార్దనః - మాం - నయేత్ - యది - కాకుత్థ్సః - తత్ - తస్య - సదృశం - భవేత్ ॥

అన్వయక్రమము :– తు పరబలార్దనః కాకుత్స్థః లంకాం శరైః సంకులాం కృత్వా మాం నయేత్ యది తత్ తస్య సదృశం భవేత్.

ప్రతిపదార్థము :– తు = కాని, పరబలార్దనః = శత్రుబలమును అణచివేయునట్టి, కాకుత్స్థః = శ్రీరాముడు, లంకాం = లంకానగరమును, శరైః = బాణములచే, సంకులాం = కల్లోలమైనదానినిగా, కృత్వా = చేసి, మాం = నన్ను, నయేత్ యది = కొనిపోయినయెడల, తత్ = అది, తస్య = అతనికి, సదృశం = యుక్తమైనది, భవేత్ = అగును.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– 'తత్ తస్య సదృశం భవేత్' – తన పరాక్రమమును కనపరచి నన్ను గొనిపోవుట అతనికి యుక్తమును, నా యభిలాషను నెఱవేర్చుటయు నగును. అట్లు గానిచో నేను వీరపత్ని ననిపించుకొనుట ఎట్లు సంభవించునని భావము.

తాత్పర్యము :– ఈ రక్కసులను సంహరించుటకు నీవు సమర్థుడవేయైనను శత్రుమర్దనుడైన శ్రీరాముడు తన శస్త్రవర్షముచే లంకానగరమును కల్లోలము గావించి విజయుడై నన్ను గొనిపోయినయెడల ఆ మహావీరున కది తన కర్తవ్యనిర్వహణరూపమైన కార్యమగును.

శ్లో॥ త ద్యథా తస్య విక్రాంత మనురూపం మహాత్మనః ।
భవే దాహవశూరస్య తథా త్వ ముపపాదయ ॥ 5

పదచ్ఛేదము :– తత్ – యథా – తస్య – విక్రాంతమ్ – అనురూపం – మహాత్మనః, భవేత్ – ఆహవశూరస్య – తథా – త్వమ్ – ఉపపాదయ ॥

అన్వయక్రమము :– తత్ ఆహవశూరస్య తస్య మహాత్మనః విక్రాంతమ్ అనురూపం యథా భవేత్ తథా త్వమ్ ఉపపాదయ.

ప్రతిపదార్థము :– తత్ = ఆ కారణమువలన, ఆహవశూరస్య = యుద్ధవీరుడైనట్టి, తస్య మహాత్మనః = ఆ మహాత్మునియొక్క, విక్రాంతం = విక్రమణము, అనురూపం = తగినట్టిది, యథా = ఏ విధముగా, భవేత్ = అగునో, తథా = ఆ విధముగా, త్వం = నీవు, ఉపపాదయ = ఏర్పఱచుము.

తాత్పర్యము :– అందుచేత మహావీరుడైన ఆ మహాత్మునియొక్క పరాక్రమమునకు తగియున్న పద్ధతి ఎట్టిదో నిశ్చయించి ఆ విధానమును నీవు సంఘటింపజేయుము.

శ్లో॥ తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్ ।
నిశమ్య హనుమాం స్తస్యా వాక్య ముత్తర మబ్రవీత్ ॥ 6

పదచ్ఛేదము :- తత్ - అర్థోపహితం - వాక్యం - ప్రశ్రితం - హేతుసంహితమ్ - నిశమ్య - హనుమాన్ - తస్యాః - వాక్యమ్ - ఉత్తరమ్ - అబ్రవీత్ ॥

అన్వయక్రమము :- అర్థోపహితం ప్రశ్రితం హేతుసంహితం తస్యాః తత్ వాక్యం నిశమ్య హనుమాన్ ఉత్తరం వాక్యమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :- అర్థోపహితం = గొప్ప అర్థముతో గూడినదియును, ప్రశ్రితం = వినయముతో గూడినదియును, హేతుసంహితం = కారణముతో గూడినదియునగు, తస్యాః = ఆమెయొక్క, తత్ వాక్యం = ఆ వచనమును, నిశమ్య = విని, హనుమాన్ = హనుమ, ఉత్తరం వాక్యం = సమాధానమైన వచనమును, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- ఆ రీతిగ సీతాదేవి మిక్కిలి అర్థవంతముగను వినయపూర్వకముగను న్యాయమైన కారణములతోను తెలిపిన మాటలను హనుమ విని ఆమెకు సమాధానముగా ఇట్లు పలికెను.

శ్లో॥ క్షిప్రమేష్యతి కాకుత్థ్సో హర్యృక్షప్రవరై ర్వృతః ।
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి ॥ 7

పదచ్ఛేదము :- క్షిప్రమ్ - ఏష్యతి - కాకుత్థ్సః - హర్యృక్షప్రవరైః - వృతః, యః - తే - యుధి - విజిత్య - అరీన్ - శోకం - వ్యపనయిష్యతి ॥

అన్వయక్రమము :- యః యుధి అరీన్ విజిత్య తే శోకం వ్యపనయిష్యతి (సః) కాకుత్థ్సః హర్యృక్షప్రవరైః వృతః క్షిప్రమ్ ఏష్యతి.

ప్రతిపదార్థము :- యః = ఏ మహావీరుడైతే, యుధి = యుద్ధమునందు, అరీన్ = శత్రువులను, విజిత్య = జయించి, తే = నీయొక్క, శోకం = దుఃఖమును, వ్యపనయిష్యతి = తొలగింపగలడో, (సః)కాకుత్థ్సః = (ఆ) శ్రీరాముడు, హర్యృక్షప్రవరైః = వానరుల యొక్కయు, భల్లూకముల యొక్కయు, శ్రేష్ఠులతో, వృతః = కూడినవాడై, క్షిప్రం = శీఘ్రముగా, ఏష్యతి = రాగలడు.

తాత్పర్యము :- తల్లీ! యుద్ధమునందు శత్రువుల నుక్కడగించి నీశోకమును తొలగించుటకుగాను శ్రీరామచంద్రుడు వానరవీరులతోడను భల్లూకయోధుల తోడనుగూడి శీఘ్రముగానే లంకకు రానైయున్నాడు సుమా!

శ్లో॥ ఏవ మాశ్వాస్య వైదేహీం హనుమా న్మారుతాత్మజః ।
గమనాయ మతిం కృత్వా వైదేహీ మభ్యవాదయత్ ॥ 8

పదచ్ఛేదము :- ఏవమ్ - ఆశ్వాస్య - వైదేహీం - హనుమాన్ - మారుతాత్మజః - గమనాయ - మతిం - కృత్వా - వైదేహీమ్ - అభ్యవాదయత్ ॥

అన్వయక్రమము :- మారుతాత్మజః హనుమాన్ వైదేహీమ్ ఏవమ్ ఆశ్వాస్య గమనాయ మతిం కృత్వా వైదేహీమ్ అభ్యవాదయత్.

ప్రతిపదార్థము :- మారుతాత్మజః హనుమాన్ = వాయునందనుడైన హనుమ, వైదేహీం = సీతాదేవిని, ఏవం = ఈ రీతిగా, ఆశ్వాస్య = ఓదార్చి, గమనాయ = పయనమునకై, మతిం కృత్వా = నిశ్చయముచేసికొని, వైదేహీం = జానకమ్మకు, అభ్యవాదయత్ = మ్రొక్కెను.

తాత్పర్యము :- వాయునందనుడైన హనుమ సీతాదేవి నీరీతిగా నూఱడించి తిరుగు ప్రయాణమునకు నిశ్చయించుకొని ఇంకొకమాఱు సీతమ్మకు వందనము గావించెను.

శ్లో॥ తత స్స కపిశార్దూల స్స్వామిసందర్శనోత్సుకః ।
ఆరురోహ గిరిశ్రేష్ఠ మరిష్ట మరిమర్దనః ॥ 9

పదచ్ఛేదము :- తతః - సః - కపిశార్దూలః - స్వామిసందర్శనోత్సుకః - ఆరురోహ - గిరిశ్రేష్ఠమ్ - అరిష్టమ్ - అరిమర్దనః ॥

అన్వయక్రమము :- తతః అరిమర్దనః సః కపిశార్దూలః స్వామిసందర్శనోత్సుకః (సన్) గిరిశ్రేష్ఠమ్ అరిష్టమ్ ఆరురోహ.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, అరిమర్దనః = శత్రుమర్దనుడైన, సః కపిశార్దూలః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, స్వామిసందర్శనోత్సుకః (సన్) = ప్రభువును చూచుటకు వేగిరపడుచున్నవాడై, అరిష్టం = అరిష్టమను పేరుగల, గిరిశ్రేష్ఠం = పర్వతశ్రేష్ఠమును, ఆరురోహ = ఆరోహించెను.

తాత్పర్యము :- పిమ్మట శత్రుసంహారకుడైన వానరోత్తముడగు హనుమ తన ప్రభువైన శ్రీరాముని సందర్శించుటకై వేగిరపడుచు లంకాతీరమునందున్న అరిష్టమనెడు పర్వతము నారోహించెను.

శ్లో॥ తుంగపద్మకజుష్టాభిర్నీలాభి ర్వనరాజిభిః ।
సోత్తరీయ మివాంభోదైః శృంగాంతరవిలంబిభిః ॥ 10

పదచ్ఛేదము :– తుంగపద్మకజుష్టాభిః – నీలాభిః – వనరాజిభిః – సోత్తరీయమ్ – ఇవ – అంభోదైః – శృంగాంతరవిలంబిభిః ॥

అన్వయక్రమము :– తుంగపద్మకజుష్టాభిః నీలాభిః వనరాజిభిః (సపరిధానమ్ ఇవ) శృంగాంతరవిలంబిభిః అంభోదైః సోత్తరీయమ్ ఇవ చ (స్థితం అరిష్టం సః ఆరురోహ).

ప్రతిపదార్థము :– తుంగపద్మకజుష్టాభిః = ఉన్నతమైన పద్మకవృక్షములతో నిండినట్టియు, నీలాభిః = నల్లనైనవియునగు, వనరాజిభిః = వనపంక్తులతో (సపరిధానమ్ ఇవ = కట్టుబట్టలతో గూడినవివలెను), శృంగాంతరవిలంబిభిః = శిఖరములనడుమ వ్రేలుచున్న, అంభోదైః = మేఘములచే, సోత్తరీయమ్ ఇవ చ = ఉత్తరీయము కల్గినదివలెను, స్థితం = ఉన్నట్టి, (అరిష్టం సః ఆరురోహ = అరిష్టపర్వతమును హనుమ ఆరోహించెను).

తాత్పర్యము :– హనుమ యారోహించిన ఆ యరిష్టపర్వతము నిండ ఉన్నతమైన నల్లని పద్మకవృక్షములు వఋసలు దీరి అవి యా కొండ ధరించిన వస్త్రములవలె నుండెను. శిఖరములపై మేఘపంక్తులు వ్రేలాడుచు అవి యా పర్వతము ధరించిన ఉత్తరీయమువలె నుండెను.

శ్లో॥ బోధ్యమానమివ ప్రీత్యా దివాకరకరైః శుభైః ।
ఉన్మిషంతమి వోద్ధూతై ర్లోచనైరివ ధాతుభిః ॥ 11

పదచ్ఛేదము :– బోధ్యమానం – ఇవ – ప్రీత్యా – దివాకరకరైః – శుభైః, ఉన్మిషంతమ్ – ఇవ – ఉద్ధూతైః – లోచనైః – ఇవ – ధాతుభిః ॥

అన్వయక్రమము :– శుభైః దివాకరకరైః ప్రీత్యా బోధ్యమానమ్ ఇవ, ఉద్ధూతైః ధాతుభిః లోచనైః ఉన్మిషంతమ్ ఇవ చ స్థితమ్ అరిష్టం సః ఆరురోహ.

ప్రతిపదార్థము :– శుభైః = మంగళకరమైన, దివాకరకరైః = సూర్యకిరణములచే, ప్రీత్యా = ప్రేమతో, బోధ్యమానమ్ ఇవ = మేలుకొలుపబడుచున్నదానివలెను, ఉద్ధూతైః = ఎగురుచున్నట్టి, ధాతుభిః = గైరికాదిధాతువులచే, లోచనైః = నేత్రములతో, ఉన్మిషంతమ్ ఇవ చ = కన్నులు తెఱచుచున్న దానివలెను, స్థితమ్ అరిష్టం సః ఆరురోహ = ఉన్నట్టి అరిష్టపర్వతమును హనుమ ఆరోహించెను).

తాత్పర్యము :– ఆ యరిష్టపర్వతముపై సూర్యుని కిరణములు సూటిగా పడుచుండెను. అవి సూర్యుడు తన చేతులతో నీ పర్వతమును మేలుకొలుపుచున్నట్టుగా గానవచ్చుచుండెను. అప్పుడా పర్వతము మీది రంగురంగుల గైరికాది ధాతువుల

శిలలు మిలమిల మెఱయుచుండగా నా పర్వతమే కన్నులువిప్పి చూచుచున్నట్లుండెను.

శ్లో॥ తోయౌఘనిస్వనై ర్మంద్రైః ప్రాధీతమివ సర్వతః ।
ప్రగీతమివ విస్పష్టై ర్నానాప్రస్రవణస్వనైః ॥ 12

పదచ్ఛేదము :- తోయౌఘనిస్వనైః - మంద్రైః - ప్రాధీతమ్ - ఇవ - సర్వతః - ప్రగీతమ్ - ఇవ - విస్పష్టైః - నానాప్రస్రవణస్వనైః ॥

అన్వయక్రమము :- సర్వతః మంద్రైః తోయౌఘనిస్వనైః ప్రాధీతమ్ ఇవ, విస్పష్టైః నానాప్రస్రవణస్వనైః ప్రగీతం ఇవ చ (స్థితం అరిష్టం సః ఆరురోహ).

ప్రతిపదార్థము :- సర్వతః = అంతటను, మంద్రైః = మధ్యమస్వరముగల, తోయౌఘనిస్వనైః = జలప్రవాహముయొక్క ధ్వనులచే, ప్రాధీతమ్ ఇవ = వేదాధ్యయనము చేయుచున్నదివలెను, విస్పష్టైః = మిక్కిలి స్పష్టమైన, నానాప్రస్రవణస్వనైః = బహువిధములైన సెలయేళ్ళధ్వనులచే, (ప్రగీతమ్ ఇవ = చక్కగా గానము చేయుచున్నది వలెను) (స్థితం = ఉన్నట్టి అరిష్టపర్వతమును) సః = హనుమ, ఆరురోహ = ఆరోహించెను).

తాత్పర్యము :- ఆ పర్వతముపై నంతటను మంద్రస్వరముతో చిన్న ఏఱులు ప్రవహించుచుండెను. ఆ మంద్రధ్వని వేదాధ్యయనము చేయుచున్న వారి స్వరమును బోలియుండెను. పెక్కుచోట్ల మీదినుండి తారస్వరముతో సెలయేళ్ళు ప్రవహించుచుండెను. ఆ స్వరము గొంతెత్తి పాడుచున్నవారి కంఠస్వరమువలె వినవచ్చుచుండెను.

శ్లో॥ దేవదారుభి రత్యుచ్చై రూర్ధ్వబాహుమివ స్థితమ్ ।
ప్రపాతజలనిర్ఘోషైః ప్రాకృష్టమివ సర్వతః ॥ 13

పదచ్ఛేదము :- దేవదారుభిః - అత్యుచ్చైః - ఊర్ధ్వబాహుమ్ - ఇవ - స్థితమ్, ప్రపాతజలనిర్ఘోషైః - ప్రాకృష్టమ్ ఇవ చ (స్థితం అరిష్టం సః ఆరురోహ) ॥

అన్వయక్రమము :- అత్యుచ్చైః దేవదారుభిః ఊర్ధ్వబాహుమ్ ఇవ, ప్రపాతజలనిర్ఘోషైః సర్వతః ప్రాకృష్టమ్ ఇవ చ (స్థితమ్ అరిష్టం సః ఆరురోహ).

ప్రతిపదార్థము :- అత్యుచ్చైః = మిక్కిలి యున్నతమైనట్టి, దేవదారుభిః = దేవదారు వృక్షములచే, ఊర్ధ్వబాహుమ్ ఇవ = ఎత్తైన చేతులు గలదిగను, ప్రపాతజలనిర్ఘోషైః = జలప్రపాతముల శబ్దములచే, సర్వతః = ఎల్లయెడలను, ప్రాకృష్టమ్ ఇవ = ఆక్రోశించుచున్నదివలెను, స్థితం = ఉన్నట్టి (అరిష్టం = అరిష్టపర్వతమును), సః =

ఆ హనుమ, ఆరురోహ = ఆరోహించెను.

తాత్పర్యము :– అరిష్టపర్వతముపై మిక్కిలి యున్నతమైన దేవదారు వృక్షములు గానవచ్చుచుండెను. అవి యా గిరి చేతులు మీదికి ఎత్తియుంచెనా యన్నట్లున్నవి. ఆ పర్వతముపైనున్న జలప్రవాహములనుండి పెద్దధ్వని వినవచ్చుచుండగా నది ఆక్రోశించుచున్నట్లుండెను.

శ్లో॥ వేపమానమివ శ్యామైః కంపమానై శ్శరద్వనైః ।
వేణుభి ర్మారుతోద్ధూతైః కూజంతమివ కీచకైః ॥ 14

పదచ్ఛేదము :– వేపమానమ్ – ఇవ – శ్యామైః – కంపమానైః – శరద్వనైః – వేణుభిః – మారుతోద్ధూతైః – కూజంతమ్ – ఇవ – కీచకైః ॥

అన్వయక్రమము :– కంపమానైః శ్యామైః శరద్వనైః వేపమానమ్ ఇవ, మారుతోద్ధూతైః వేణుభిః కూజంతమ్ ఇవ (స్థితమ్ అరిష్టం సః ఆరురోహ).

ప్రతిపదార్థము :– కంపమానైః = కంపించుచున్నట్టి, శ్యామైః = నల్లనైన, శరద్వనైః = శరత్కాలవృక్షములచే, వేపమానమ్ ఇవ = వణుకుచున్నదివలెను, మారుతోద్ధూతైః = వాయువుచే కదల్చబడిన, కీచకైః వేణుభిః = బొంగువెదుళ్ళతో, కూజంతమ్ ఇవ చ = కూయుచున్నదివలెను, స్థితమ్ = ఉన్నట్టి, అరిష్టం = అరిష్టపర్వతమును, సః = ఆ హనుమ, ఆరురోహ = ఆరోహించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– శరద్వనైః – ఏడాకుల అరటిచెట్టుమున్నగు శరత్కాలమున ఏపుగనుండు వృక్షములు.

రా. శిరోమణి :– శరద్ఘనైః – శరత్కాలమునందలి మేఘముల వంటి ఏడాకుల అరటిచెట్టుమున్నగువానిచే.

తాత్పర్యము :– కంపించుచున్న యేడాకుల అరటిచెట్టుమున్నగు శరత్కాల వృక్షములతో వణుకుచున్నదివలెను, గాలికి ధ్వనిచేయు బొంగు వెదుళ్ళచే పక్షుల కూతలతో కూడియున్నది వలెను ఆ యరిష్టపర్వతము గానవచ్చుచుండెను.

శ్లో॥ నిశ్శ్వసంతమి వామర్షా ద్ఘోరై రాశీవిషోత్తమైః ।
నీహారకృతగంభీరై ర్ధ్యాయంతమివ గహ్వరైః ॥ 15

పదచ్ఛేదము :– నిశ్శ్వసంతమ్ – ఇవ – అమర్షాత్ – ఘోరైః – ఆశీవిషోత్తమైః –

నీహారకృతగంభీరైః - ధ్యాయంతమ్ - ఇవ - గహ్వరైః ॥

అన్వయక్రమము :- ఘోరైః ఆశీవిషోత్తమైః అమర్షాత్ నిశ్శ్వసంతమ్ ఇవ, నీహారకృతగంభీరైః గహ్వరైః ధ్యాయంతమ్ ఇవ చ స్థితమ్ అరిష్టం సః ఆరురోహ.

ప్రతిపదార్థము :- ఘోరైః = భయంకరమైనట్టి, ఆశీవిషోత్తమైః = మహాసర్పములచే, అమర్షాత్ = క్రోధమువలన, నిశ్శ్వసంతమ్ ఇవ = నిట్టూర్పులు విడుచుచున్న వానివలెను, నీహారకృతగంభీరైః = మంచుచే కలిగిన గాంభీర్యముగల, గహ్వరైః = గుహలతో, ధ్యాయంతమ్ ఇవ చ = ధ్యానము చేయుచున్నవాని వలెను, స్థితం = ఉన్నట్టి, అరిష్టం = అరిష్ట పర్వతమును, సః = ఆ హనుమ, ఆరురోహ = ఆరోహించెను.

తాత్పర్యము :- ఆ పర్వతము నందలి భీకరమైన మహా సర్పములు బుసలు కొట్టుచుండగా ఆ యద్రి క్రోధముతో నిట్టూర్పులు విడుచుచున్నట్లుండెను. అందలి గుహలు మంచుచే గప్పబడి యుండగా నా గిరిరాజు గంభీరముగా ధ్యానస్థితిలో నింద్రియములను నిరోధించి కూర్చుండియున్నట్లుండెను.

శ్లో॥ మేఘపాదనిభైః పాదైః ప్రక్రాంతమివ సర్వతః ।
జృంభమాణమి వాకాశే శిఖరై రభ్రమాలిభిః ॥ 16

పదచ్ఛేదము :- మేఘపాదనిభైః - పాదైః - ప్రక్రాంతమ్ - ఇవ - సర్వతః - జృంభమాణమ్ - ఇవ - ఆకాశే - శిఖరైః - అభ్రమాలిభిః ॥

అన్వయక్రమము :- మేఘపాదనిభైః పాదైః సర్వతః ప్రక్రాంతమ్ ఇవ, ఆకాశే అభ్రమాలిభిః శిఖరైః జృంభమాణమ్ ఇవ చ (స్థితమ్ అరిష్టమ్ ఆరురోహ).

ప్రతిపదార్థము :- మేఘపాదనిభైః = మేఘములపాదములతో సమానముగనున్నట్టి, పాదైః = పర్వతము క్రిందనున్న బండలచే, సర్వతః = అంతటను, ప్రక్రాంతమ్ ఇవ = నడచిపోవుచున్నది వలెను, ఆకాశే = ఆకాశమునందలి, అభ్రమాలిభిః = మేఘపంక్తులతో కూడియున్న, శిఖరైః = శిఖరములచే, జృంభమాణమ్ ఇవ = ఆవులించుచున్నదివలెను, స్థితం = ఉన్నట్టి, అరిష్టమ్ = అరిష్టపర్వతమును, సః = ఆ హనుమ, ఆరురోహ = ఆరోహించెను.

తాత్పర్యము :- ఆ పర్వతము చుట్టునున్న ప్రాంతపర్వతములు మేఘములయొక్క పాదములవలె నుండుటచే ఆ పాదముతో పర్వతమే నడచి పోవుచున్నట్లుండెను. శిఖరములకడ తెల్లని మేఘములు నిలచియుండగా ఆ పర్వతము నోరుతెరచి ఆవలించుచున్నట్లు గానవచ్చుచుండెను.

శ్లో॥ కూటైశ్చ బహుధా కీర్ణైః శోభితం బహుకందరైః ।
సాలతాలాశ్వకర్ణైశ్చ వంశైశ్చ బహుభి ర్వృతమ్ ॥ 17

పదచ్ఛేదము :- కూటైః - చ - బహుధా - కీర్ణైః - శోభితం - బహుకందరైః, సాలతాలాశ్వకర్ణైః - చ - వంశైః - చ - బహుభిః - వృతమ్ ॥

అన్వయక్రమము :- బహుధా కీర్ణైః బహుకందరైః కూటైః చ శోభితం, సాలతాలాశ్వకర్ణైః బహుభిః వంశైః చ వృతమ్ - (అరిష్టం సః ఆరురోహ).

ప్రతిపదార్థము :- బహుధా = బహువిధములుగ, కీర్ణైః = చెదిరిపోయినట్టి, బహుకందరైః = పలుగుహలు కలిగినట్టి, కూటైః చ = శిఖరములతో, శోభితం = ప్రకాశించుచున్నదియును, సాలతాలాశ్వకర్ణైః చ = మద్దిచెట్లతోడను, తాడిచెట్లతోడను, గుఱ్ఱపుచెవి చెట్లతోడను, వృతం = చుట్టుకొనబడియున్న, (అరిష్టం = అరిష్ట పర్వతమును, సః = ఆ హనుమ, ఆరురోహ = ఆరోహించెను).

తాత్పర్యము :- ఆ యరిష్టపర్వతమునిండ అన్నివైపుల ఎన్నో శిఖరములుండెను. ఆ శిఖరములు పెక్కుగుహలతో ప్రకాశించుచుండెను. మఱియు నా పర్వతము చుట్టును మద్ది, తాడి, గుఱ్ఱపుచెవి మున్నగు వృక్షములును, ఎన్నియో వెదురు పొదలును వెలయుచుండెను.

శ్లో॥ లతావితానై ర్వితతైః పుష్పవద్భి రలంకృతమ్ ।
నానామృగగణాకీర్ణం ధాతునిష్యందభూషితమ్ ॥ 18

పదచ్ఛేదము :- లతావితానైః - వితతైః - పుష్పవద్భిః - అలంకృతమ్, నానామృగగణాకీర్ణం - ధాతునిష్యందభూషితమ్ ॥

అన్వయక్రమము :- పుష్పవద్భిః వితతైః లతావితానైః అలంకృతం నానామృగగణాకీర్ణం ధాతునిష్యందభూషితం (అరిష్టం సః ఆరురోహ).

ప్రతిపదార్థము :- పుష్పవద్భిః = పుష్పములతో నిండినట్టివియును, వితతైః = విస్తరించియున్నట్టివియునగు, లతావితానైః = లతల సమూహములతో, అలంకృతం = అలంకరింపబడియున్నదియును, నానామృగగణాకీర్ణం = బహువిధములగు జంతువుల సమూహముతో నిండియున్నదియును, ధాతునిష్యందభూషితం = ధాతుద్రవముల స్రావములతో నలంకరింపబడియున్నదియునునగు, అరిష్టం = అరిష్టపర్వతమును, సః = ఆ హనుమ, ఆరురోహ = ఆరోహించెను.

తాత్పర్యము :- ఆ యరిష్టపర్వతము పుష్పములతో కలకలలాడుచు దూరముగ కొనలు

సాగిన పూలతీగలతో నొప్పుచుండెను. బహువిధములగు మృగసమూహములు ముచ్చటగ అందు సంచరించుచుండెను. అటనట వివిధవర్ణముల ధాతుద్రవములు అందముగా స్రవించుచు గానవచ్చుచుండెను.

శ్లో॥ బహుప్రస్రవణోపేతం శిలాసంచయసంకటమ్ ।
మహర్షి యక్ష గంధర్వ కిన్నరోరగసేవితమ్ ॥ 19

పదచ్ఛేదము :– బహుప్రప్రవణోపేతం – శిలాసంచయసంకటమ్, మహర్షియక్షగంధర్వ కిన్నరోరగసేవితమ్ ॥

అన్వయక్రమము :– బహుప్రస్రవణోపేతం, శిలాసంచయసంకటమ్, మహర్షియక్షగంధర్వ కిన్నరోరగ సేవితమ్ అరిష్టం సః ఆరురోహ.

ప్రతిపదార్థము :– బహుప్రస్రవణోపేతం = అనేకములైన సెలయేళ్ళతో కూడినదియును, శిలాసంచయసంకటం = ఱాళ్లగుట్టలతో క్రిక్కిరిసియున్నదియును, మహర్షియక్షగంధర్వకిన్నరోరగసేవితం = మహాఋషులచేతను, యక్షులచేతను, గంధర్వులచేతను, కిన్నరులచేతను, నాగులచేతను, సేవింపబడుచున్నదియును అగు, (అరిష్టం = అరిష్టపర్వతమును, సః = ఆ హనుమ, ఆరురోహ = ఆరోహించెను).

తాత్పర్యము :– ఆ యరిష్టపర్వతముపై ఎన్నో సెలయేళ్లు సుందరముగ ప్రవహించు చుండెను. అడుగడుగున వివిధాకారములలో నున్న శిలల సమూహములు ముచ్చట గొల్పుచుండెను. అచ్చట మహర్షులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, నాగులు మున్నగువారు దాని నాశ్రయించి వసించుచుండిరి.

శ్లో॥ లతాపాదపసంబాధం సింహాధ్యుషితకందరమ్ ।
వ్యాఘ్రసంఘసమాకీర్ణం స్వాదుమూలఫలోదకమ్ ॥ 20

పదచ్ఛేదము :– లతాపాదపసంబాధం – సింహాధ్యుషితకందరమ్, వ్యాఘ్రసంఘ సమాకీర్ణం స్వాదుమూలఫలోదకమ్ ॥

అన్వయక్రమము :– సుగమము.

ప్రతిపదార్థము :– లతాపాదపసంబాధం = వృక్షములయొక్కయు, లతలయొక్కయు, గుబురులుగలదియును, సింహాధ్యుషితకందరం = సింహములచే వసింపబడుచున్న గుహలు గలదియును, వ్యాఘ్రసంఘసమాకీర్ణం = పెద్దపులులమందలతో నిండియున్నదియును, స్వాదుమూలఫలోదకం = రుచికరమైన మూలములును, ఫలములును, జలములును గలదియునగు, (అరిష్టం = అరిష్టపర్వతమును, సః =

ఆ హనుమ, ఆరురోహ = ఆరోహించెను).

తాత్పర్యము :- మఱియు నా పర్వతముపై వివిధములైన లతలును వృక్షములు క్రిక్కిరిసియుండెను. అందలి గుహలలో సింహములు సుఖముగా వసించుచుండెను. పెద్దపులుల మందలు అటనట పరువిడుచుండెను. అచటి కందమూలములు, పండ్లు, నీరు మిక్కిలి మధురముగ నుండెను.

శ్లో॥ త మారురోహ హనుమాన్ పర్వతం ప్లవగోత్తమః ।
రామదర్శనశీఘ్రేణ ప్రహర్షే ణాభిచోదితః ॥ 21

పదచ్ఛేదము :- తమ్ - ఆరురోహ - హనుమాన్ - పర్వతం - ప్లవగోత్తమః, రామదర్శనశీఘ్రేణ - ప్రహర్షేణ - అభిచోదితః ॥

అన్వయక్రమము :- ప్లవగోత్తమః హనుమాన్ రామదర్శనశీఘ్రేణ ప్రహర్షేణ అభిచోదితః (సన్) తం పర్వతమ్ ఆరురోహ.

ప్రతిపదార్థము :- ప్లవగోత్తమః = వానరశ్రేష్ఠుడైన, హనుమాన్ = హనుమ, రామదర్శనశీఘ్రేణ = శ్రీరామునియొక్క దర్శనము నందలి వేగిరపాటుతో కూడిన, ప్రహర్షేణ = అధికసంతోషముతో, అభిచోదితః = మిక్కిలి ప్రేరేపింపబడినవాడై, తం పర్వతం = ఆ యరిష్టపర్వతమును, ఆరురోహ = ఆరోహించెను.

తాత్పర్యము :- వానరోత్తముడైన హనుమ శ్రీరాముని దర్శింపవలెనను వేగిరపాటుతో కూడిన మహానందముతో ఆ యరిష్టపర్వతమును ఒక్క అంగతో ఎగిరి ఆరోహించెను.

శ్లో॥ తేన పాదతలాక్రాంతా రమ్యేషు గిరిసానుషు ।
సఘోషా స్సమశీర్యంత శిలా శ్చూర్ణీకృతా స్తతః ॥ 22

పదచ్ఛేదము :- తేన - పాదతలాక్రాంతాః - రమ్యేషు - గిరిసానుషు, సఘోషాః - సమశీర్యంత - శిలాః - చూర్ణీకృతాః - తతః ॥

అన్వయక్రమము :- రమ్యేషు గిరిసానుషు తేన పాదతలాక్రాంతాః శిలాః సఘోషాః సమశీర్యంతః తతః చూర్ణీకృతాః.

ప్రతిపదార్థము :- రమ్యేషు = సుందరములైనట్టి, గిరిసానుషు = కొండచరియలయందు, తేన = ఆ హనుమచే, పాదతలాక్రాంతాః = అరికాళ్లచే త్రొక్కబడినట్టి, శిలాః = శిలలు, సఘోషాః = ధ్వనితో కూడినవై, సమశీర్యంత = ముక్కలు ముక్కలైనవి, తతః = పిమ్మట, చూర్ణీకృతాః = చూర్ణమైపోయినవి.

తాత్పర్యము :- సుందరమైన ఆ కొండయందలి చఱియలపై హనుమ యుఱుకగనే అచ్చటి శిలలు పెద్దధ్వనితో నలిగి నుగ్గునుగ్గయిపోయినవి.

శ్లో॥ స త మారుహ్య శైలేంద్రం వ్యవర్ధత మహాకపిః ।
దక్షిణా దుత్తరం పారం ప్రార్థయన్ లవణాంభసః ॥ 23

పదచ్ఛేదము :- సః - తమ్ - ఆరుహ్య - శైలేంద్రం - వ్యవర్ధత - మహాకపిః, దక్షిణాత్ - ఉత్తరం - పారం - ప్రార్థయన్ - లవణాంభసః ॥

అన్వయక్రమము :- లవణాంభసః దక్షిణాత్ ఉత్తరం పారం ప్రార్థయన్ సః మహాకపిః తం శైలేంద్రమ్ ఆరుహ్య వ్యవర్ధత.

ప్రతిపదార్థము :- లవణాంభసః = లవణసముద్రముయొక్క, దక్షిణాత్ = దక్షిణమునుండి, ఉత్తరం పారం = ఉత్తరతీరమును, ప్రార్థయన్ = అభిలషించుచు, సః మహాకపిః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, తం శైలేంద్రం = ఆ మహాపర్వతమును, ఆరుహ్య = ఆరోహించి, వ్యవర్ధత = వృద్ధిపొందెను.

తాత్పర్యము :- హనుమ లంకయందలి యా సముద్రదక్షిణతీరమునకు చేరి తనవారున్న ఆవలి ఉత్తరపు తీరమునకు చేరుటకై ఆ యరిష్టపర్వతము నారోహించి తన గమనమున కనుకూలముగా తన శరీరమును మిక్కిలిగా పెంచుకొనెను.

శ్లో॥ అధిరుహ్య తతో వీరః పర్వతం పవనాత్మజః ।
దదర్శ సాగరం భీమం మీనోరగనిషేవితమ్ ॥ 24

పదచ్ఛేదము :- అధిరుహ్య - తతః - వీరః - పర్వతం - పవనాత్మజః, దదర్శ - సాగరం - భీమం - మీనోరగనిషేవితమ్ ॥

అన్వయక్రమము :- తతః వీరః పవనాత్మజః పర్వతమ్ అధిరుహ్య మీనోరగనిషేవితం భీమం సాగరం దదర్శ.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, వీరః = వీరుడైన, పవనాత్మజః = వాయునందనుడు, పర్వతం = అరిష్టపర్వతమును, అధిరుహ్య = ఆరోహించి, మీనోరగనిషేవితం = మత్స్యములతోడను, నాగములతోడను నిండిన, భీమం = భయంకరమైన, సాగరం = సముద్రమును, దదర్శ = చూచెను;

తాత్పర్యము :- వీరుడయిన వాయునందనుడు ఆ యరిష్టపర్వతము నారోహించి మహామీనములతోడను సర్పములతోడను భయంకరమైయున్న సాగరమును గాంచెను.

శ్లో॥ స మారుత ఇవాకాశం మారుత స్యాత్మసంభవః ।
ప్రపేదే హరిశార్దూలో దక్షిణా దుత్తరాం దిశమ్ ॥ 25

పదచ్ఛేదము :– సః – మారుతః – ఇవ – ఆకాశం – మారుతస్య – ఆత్మసంభవః – ప్రపేదే – హరిశార్దూలః – దక్షిణాత్ – ఉత్తరాం – దిశమ్ ॥

అన్వయక్రమము :– హరిశార్దూలః మారుతస్య ఆత్మసంభవః సః మారుతః ఆకాశం ఇవ దక్షిణాత్ ఉత్తరాం దిశం ప్రపేదే ॥

ప్రతిపదార్థము :– హరిశార్దూలః = వానర శ్రేష్ఠుడును, మారుతస్య = వాయువునకు, ఆత్మసంభవః = పుత్రుడునగు, సః = ఆ హనుమ, మారుతః = వాయువు, ఆకాశమ్ ఇవ = ఆకాశమువలె, దక్షిణాత్ = దక్షిణ దిక్కునుండి, ఉత్తరాం దిశం = ఉత్తరదిక్కును, ప్రపేదే = పొందెను.

తాత్పర్యము :– వాయునందనుడైన యా హనుమ అప్పుడు వాయువు సాధారణముగా ఆకాశమునందు దక్షిణదిక్కునుండి ఉత్తరదిశకు పయనము సాగించునట్లుగానే తా నా దక్షిణతీరపర్వతమునుండి ఉత్తరతీరమునకు వెడలెను.

శ్లో॥ స తదా పీడితస్తేన కపినా పర్వతోత్తమః ।
రరాస సహ తై ర్భూతైః ప్రవిశన్ వసుధాతలమ్ ।
కంపమానై శ్చ శిఖరైః పతద్భి రపి చ ద్రుమైః ॥ 26

పదచ్ఛేదము :– సః – తదా – పీడితః – తేన – కపినా – పర్వతోత్తమః, రరాస – సహ – తైః – భూతైః – ప్రవిశన్ – వసుధాతలమ్, కంపమానైః – చ – శిఖరైః – పతద్భిః – అపి – చ – ద్రుమైః ॥

అన్వయక్రమము :– తదా తేన కపినా పీడితః పర్వతోత్తమః కంపమానైః శిఖరైః చ, పతద్భిః ద్రుమైః అపి, వసుధాతలమ్ ప్రవిశన్, తైః భూతైః సహ రరాస.

ప్రతిపదార్థము :– తదా = అప్పుడు, తేన కపినా = ఆ హనుమచే, పీడితః = పీడింపబడినట్టి, కంపమానైః = కంపించుచున్నట్టి, శిఖరైః చ = శిఖరములతోడను, పతద్భిః = పడిపోవుచున్నట్టి, ద్రుమైః చ = వృక్షములతోడను, సః పర్వతోత్తమః = ఆ పర్వతశ్రేష్ఠము, వసుధాతలం = భూతలమును, ప్రవిశన్ = ప్రవేశించుచు, తైః భూతైః సహ = ఆ భూతములతోగూడ, రరాస = ఆక్రోశించెను.

తాత్పర్యము :– అప్పుడు హనుమ ఎగురుటకు అదుమగనే ఆ మహాపర్వతము కంపించుచున్న శిఖరములతోడను, కూలిపోవుచున్న చెట్లతోడను భూమిలోనికి

దిగబడుచు ఆ పర్వతము నందలి ప్రాణులన్నిటితో గలసి ఆక్రోశించుచున్నట్లుండెను.

శ్లో॥ త స్యోరువేగోన్మథితాః పాదపాః పుష్పశాలినః ।
నిపేతు ర్భూతలే భగ్నాః శక్రాయుధహతా ఇవ ॥ 27

పదచ్ఛేదము :- తస్య - ఊరువేగోన్మథితాః - పాదపాః - పుష్పశాలినః - నిపేతుః - భూతలే - భగ్నాః - శక్రాయుధహతాః - ఇవ ॥

అన్వయక్రమము :- తస్య ఊరువేగోన్మథితాః పుష్పశాలినః పాదపాః భగ్నాః శక్రాయుధహతాః ఇవ భూతలే నిపేతుః.

ప్రతిపదార్థము :- తస్య = ఆతనియొక్క, ఊరువేగోన్మథితాః = తొడలయొక్క వేగముచే నొరిపిడి నొందినట్టి, పుష్పశాలినః = పుష్పములతో నిండినట్టి, పాదపాః = వృక్షములు, భగ్నాః = శిథిలమైనవై, శక్రాయుధహతా ఇవ = దేవేంద్రుని వజ్రాయుధముచే ప్రహరింపబడినవివలె, భూతలే = భూమిపై, నిపేతుః = కూలినవి.

తాత్పర్యము :- ఆ హనుమయొక్క ప్రయాణవేగమున అతని తొడలచే ఒరిపిడినొందిన పుష్పవృక్షములు పిడుగుపడినప్పుడువలె శిథిలములై నేల గూలినవి.

శ్లో॥ కందరోదరసంస్థానాం పీడితానాం మహౌజసామ్ ।
సింహానాం నినదో భీమో నభో భిందన్ హి శుశ్రువే ॥ 28

పదచ్ఛేదము :- కందరోదరసంస్థానాం - పీడితానాం - మహౌజసామ్, సింహానాం - నినదః - భీమః - నభః -భిందన్ - హి - శుశ్రువే ॥

అన్వయక్రమము :- కందరోదరసంస్థానాం మహౌజసాం సింహానాం పీడితానాం భీమః నినదః నభః భిందన్ శుశ్రువే హి.

ప్రతిపదార్థము :- కందరోదరసంస్థానాం = గుహలలోపలనుండినట్టి, మహౌజసాం = గొప్పపరాక్రమము గల్గిన, పీడితానాం = పీడనొందినట్టి, సింహానాం = సింహములయొక్క, భీమః నినదః = భయంకరమైన శబ్దము (గర్జనము), నభః = ఆకాశమును, భిందన్ = బ్రద్దలుగొట్టుచు, శుశ్రువే హి = గొప్పగ వినబడెను.

తాత్పర్యము :- హనుమంతుడు ఆ పర్వతము నదమగా బాధనొంది గుహలో నివసించుచున్న మహాపరాక్రమముగల సింహములు భయముతో భీకరముగా గర్జించుచుండగా ఆ ధ్వని నభోమండలమును బ్రద్దలు గొట్టుచు మిగుల భయావహముగా వినిపించెను.

శ్లో॥ స్రస్తవ్యావిద్ధవసనా వ్యాకులీకృతభూషణాః ।
విద్యాధర్య స్సముత్పేతు స్సహసా ధరణీధరాత్ ॥ 29

పదచ్ఛేదము :- స్రస్తవ్యావిద్ధవసనాః - వ్యాకులీకృతభూషణాః - విద్యాధర్యః - సముత్పేతుః - సహసా - ధరణీధరాత్ ॥

అన్వయక్రమము :- విద్యాధర్యః స్రస్తవ్యావిద్ధవసనాః వ్యాకులీకృతభూషణాః (సత్యః) సహసా ధరణీధరాత్ సముత్పేతుః.

ప్రతిపదార్థము :- విద్యాధర్యః = విద్యాధరస్త్రీలు, స్రస్తవ్యావిద్ధవసనాః = జాఱి చెదరిపోయినట్టి వస్త్రము గలవారును, వ్యాకులీకృతభూషణాః = చెదిరిపోయిన నగలుగలవారును, (సత్యః = అగుచున్నవారై) సహసా = వెంటనే, ధరణీధరాత్ = పర్వతమునుండి, సముత్పేతుః = మీది కెగిరిరి.

తాత్పర్యము :- అందలి విద్యాధరస్త్రీలు భయముచే గలిగిన తొట్రుపాటు వలన తమ తమ చీరలు విడివడి జాఱిపోవుచుండగా ఒడలి మీద నున్న నగలు చెదరిపోవుచుండగా వారు తత్క్షణమే ఆ పర్వతమును వీడి ఆకసమున కెగసిరి.

శ్లో॥ అతిప్రమాణా బలినో దీప్తజిహ్వా మహావిషాః ।
నిపీడితశిరోగ్రీవా వ్యవేష్టన్త మహాహయః ॥ 30

పదచ్ఛేదము :- అతిప్రమాణాః - బలినః - దీప్తజిహ్వాః - మహావిషాః, నిపీడితశిరోగ్రీవాః - వ్యవేష్టంత - మహాహయః ॥

అన్వయక్రమము :- అతిప్రమాణాః బలినః దీప్తజిహ్వాః మహావిషాః మహాహయః నిపీడితశిరోగ్రీవాః (సంతః) వ్యవేష్టంత.

ప్రతిపదార్థము :- అతిప్రమాణాః = గొప్పపరిమాణము గలవియును, బలినః = గొప్పబలముగలవియును, దీప్తజిహ్వాః = జ్వలించుచున్న నాలుకలుగలవియును, మహావిషాః = తీవ్రమైన విషముగలవియునగు, మహాహయః = మహాసర్పములు, నిపీడితశిరోగ్రీవాః (సంతః) = చితుక గొట్టబడిన తలలును కంఠములును గలవై, వ్యవేష్టంత = చుట్టచుట్టుకొని పోయినవి.

తాత్పర్యము :- మిక్కిలి పొడవైన శరీరములుగలిగి మహాబలముతో నుండెడి ఆ పర్వతము మీది మహాసర్పములు జ్వలించుచున్న తమ నాలుకలనుండి తీవ్రమైన విషమును గ్రక్కుచు చిదికిపోయిన తలలతోను, కంఠములతోను తమలో తాము చుట్టలు చుట్టుకొనసాగినవి.

శ్లో॥ కిన్నరోరగగంధర్వ యక్షవిద్యాధరా స్తదా ।
పీడితం తం నగవరం త్యక్త్వా గగన మాశ్రితాః ॥ 31

పదచ్ఛేదము :- కిన్నరోరగగంధర్వయక్షవిద్యాధరాః - తదా, పీడితం - తం - నగవరం - త్యక్త్వా - గగనమ్ - ఆశ్రితాః ॥

అన్వయక్రమము :- తదా కిన్నరోరగగంధర్వయక్షవిద్యాధరాః పీడితం తం నగవరం త్యక్త్వా గగనమ్ ఆశ్రితాః.

ప్రతిపదార్థము :- తదా = అప్పుడు, కిన్నరోరగగంధర్వయక్షవిద్యాధరాః = కిన్నరులును, ఉరగులును, గంధర్వులును, యక్షులును, విద్యాధరులును, పీడితం = పీడింపబడినట్టి, తం నగవరం = ఆ పర్వతశ్రేష్ఠమును, త్యక్త్వా = విడిచి, గగనం = ఆకాశమును, ఆశ్రితాః = ఆశ్రయించిరి.

తాత్పర్యము :- అప్పుడా పర్వతవాసులైన కిన్నరులును, ఉరగులును, గంధర్వులును యక్షులును, విద్యాధరులును హనుమచే పీడింపబడిన యా పర్వతమున నిలువజాలక దానిని విడిచిపెట్టి ఆకాశము నాశ్రయించిరి.

శ్లో॥ స చ భూమిధర శ్శ్రీమాన్ బలినా తేన పీడితః ।
సవృక్షశిఖరోదగ్రః ప్రవివేశ రసాతలమ్ ॥ 32

పదచ్ఛేదము :- సః - చ - భూమిధరః - శ్రీమాన్ - బలినా - తేన - పీడితః - సవృక్షశిఖరోదగ్రః ప్రవివేశ రసాతలమ్ ॥

అన్వయక్రమము :- శ్రీమాన్ సః భూమిధరః బలినా తేన పీడితః సవృక్షశిఖరోదగ్రః రసాతలం ప్రవివేశ.

ప్రతిపదార్థము :- శ్రీమాన్ = గొప్పశోభతో గూడిన, సః భూమిధరః = ఆ పర్వతము, బలినా = బలాఢ్యుడైన, తేన = ఆ హనుమచే, పీడితః = పీడింపబడినదై, సవృక్షశిఖరోదగ్రః = వృక్షములతో గూడిన శిఖరములచే ఉన్నతమైనట్టిదై, రసాతలం = పాతాళమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తాత్పర్యము :- మహాబలాఢ్యుడైన యా హనుమ అదమగా అందమైన ఆ పర్వతము ఉన్నతమైన వృక్షములతో నిండిన శిఖరములతో కలిపి పాతాళలోకము లోనికి కూరుకొని పోయెను.

శ్లో॥ దశయోజనవిస్తార స్త్రింశద్యోజనముచ్ఛ్రితః ।
ధరణ్యాం సమతాం యాత స్స బభూవ ధరాధరః ॥ 33

పదచ్ఛేదము :- దశయోజనవిస్తారః - త్రింశద్యోజనమ్ - ఉచ్ఛ్రితః - ధరణ్యాం - సమతాం - యాతః - సః - బభూవ - ధరాధరః ॥

అన్వయక్రమము :- దశయోజనవిస్తారః త్రింశద్యోజనమ్ ఉచ్ఛ్రితః సః ధరాధరః ధరణ్యాం సమతాం యాతః బభూవ.

ప్రతిపదార్థము :- దశయోజనవిస్తారః = పది యోజనముల వెడల్పు గలదియును, త్రింశద్యోజనం =ముప్పదియోజనములు, ఉచ్ఛ్రితః = ఉన్నతమైనదియునగు, సః ధరాధరః = ఆ పర్వతము, ధరణ్యాం = భూమియందు, సమతాం = చదునును, యాతః = పొందినది, బభూవ = ఆయెను.

తాత్పర్యము :- పది యోజనముల వెడల్పును, ముప్పది యోజనముల పొడవును గల్గినట్టి యా పర్వతము అప్పుడు పాతాళమునకు దిగబడి నేలతో సమానముగా చదునై పోయినది.

శ్లో॥ స లిలంఘయిషు ర్భీమం సలీలం లవణార్ణవమ్ ।
కల్లోలాస్ఫాలవేలాంత ముత్పపాత నభో హరిః ॥ 34

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
“ప్రతిప్రయాణోత్పతనం” నామ
షట్పంచాశస్సర్గః.

పదచ్ఛేదము :- సః - లిలంఘయిషుః - భీమం - సలీలం - లవణార్ణవమ్, కల్లోలాస్ఫాలవేలాంతమ్ - ఉత్పపాత - నభః - హరిః ॥

అన్వయక్రమము :- సః హరిః కల్లోలాస్ఫాలవేలాంతం భీమం లవణార్ణవం లిలంఘయిషుః నభః ఉత్పపాత.

ప్రతిపదార్థము :- సః హరిః = ఆ హనుమ, కల్లోలాస్ఫాలవేలాంతం = కెరటములయొక్క చఱపులుగల తీరప్రాంతము గల్గినట్టి, భీమం = భీకరమైనట్టి, లవణార్ణవం = లవణసముద్రమును, లిలంఘయిషుః = దాటగోరినవాడై, సలీలం = హేలగా, నభః = ఆకసమునుగూర్చి, ఉత్పపాత = ఎగిరెను.

తాత్పర్యము :- ఆ హనుమ కల్లోలమైన తరంగముల తాకిడి నొందుచున్న తీరముతో భయంకరముగా నున్నట్టి లవణసముద్రమును హేలగా దాటగోరి ఒక్కమాఱుగా ఆకసమున కెగసెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"ప్రతిప్రయాణోత్పతనము" అను
ఏబదియారవసర్గము.
హరిః ఓం తత్ సత్.

★★★

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

సప్తపంచాశసర్గ

శ్లో॥ సచంద్రకుముదం రమ్యం సార్కకారండవం శుభమ్ ।
తిష్యశ్రవణకాదంబ మభ్రశైవాలశాద్వలమ్ ॥ 1

పదచ్ఛేదము :– సచంద్రకుముదం – రమ్యం – సార్కకారండవం – శుభమ్, తిష్యశ్రవణకాదంబమ్ – అభ్రశైవాలశాద్వలమ్ ॥

శ్లో॥ పునర్వసుమహామీనం లోహితాంగమహాగ్రహమ్ ।
ఐరావతమహాద్వీపం స్వాతీహంసవిలాసితమ్ ॥ 2

పదచ్ఛేదము :– పునర్వసుమహామీనం – లోహితాంగమహాగ్రహమ్ – ఐరావత మహాద్వీపం – స్వాతీహంసవిలాసితమ్ ॥

శ్లో॥ వాతసంఘాతజాతోర్మిచంద్రాంశుశిశిరాంబుమత్ ।
భుజంగయక్షగంధర్వ ప్రబుద్ధకమలోత్పలమ్ ॥ 3

పదచ్ఛేదము :– వాతసంఘాతజాతోర్మిచంద్రాంశుశిశిరాంబుమత్, భుజంగయక్షగంధర్వ ప్రబుద్ధకమలోత్పలమ్ ॥

శ్లో॥ హనుమా న్మారుతగతి ర్మహానౌరివ సాగరమ్ ।
అపార మపరిశ్రాంతః పుప్లువే గగనార్ణవమ్ ॥ 4

పదచ్ఛేదము :– హనుమాన్ – మారుతగతిః – మహానౌః – ఇవ – సాగరమ్, అపారమ్ – అపరిశ్రాంతః – పుప్లువే – గగనార్ణవమ్ ॥

అన్వయక్రమము :– సచంద్రకుముదం, రమ్యం సార్కకారండవం శుభం తిష్యశ్రవణ కాదంబమ్ అభ్రశైవాలశాద్వలం, పునర్వసుమహామీనం, లోహితాంగమహాగ్రహం, ఐరావతమహాద్వీపం, స్వాతీహంసవిలాసితం, వాతసంఘాతజాతోర్మిచంద్రాంశు శిశిరాంబుమత్, భుజంగయక్షగంధర్వప్రబుద్ధకమలోత్పలం అపారం గగనార్ణవం హనుమాన్ మారుతగతిః (సన్) మహానౌః సాగరమ్ ఇవ అపరిశ్రాంతః పుప్లువే.

ప్రతిపదార్థము :- సచంద్రకుముదం = చంద్రుడనెడు తెల్లకలువతో గూడినదియును; రమ్యం = సుందరమైనదియును, సార్కకారండవం = సూర్యుడనెడు నీరుకోడిని గలిగియున్నదియును, శుభం = మంగళకరమైనదియును, తిష్యశ్రవణకాదంబం = పుష్యమి శ్రవణము అను పేరులుగల నక్షత్రములనెడు హంసలు కలదియును, అభ్రశైవాలశాద్వలం = మేఘములనెడు నాచుతో పచ్చికతో గూడినదియును, పునర్వసు మహామీనం = పునర్వసు నక్షత్రమనెడు పెద్ద మత్స్యము గలదియును, లోహితాంగమహాగ్రహం = అంగారక గ్రహ మనెడు పెద్దమొసలి గలదియును, ఐరావతమహాద్వీపం = ఐరావత గజమనెడు పెద్ద దీవి కలదియును, (ఐరావతమును 'అభ్రమాతంగము' అందురు) స్వాతీహంసవిలాసితం = స్వాతి నక్షత్రమనెడు హంసచేత ప్రకాశించుచున్నదియును, వాతసంఘాతజాతోర్మిచంద్రాంశుశిశిరాంబుమత్ = వాయువుల సమూహము లనెడు కెరటములను, చంద్రకిరణము లనెడు చల్లని నీరును గలదియును, భుజంగయక్షగంధర్వ ప్రబుద్ధకమలోత్పలం = నాగులు యక్షులు గంధర్వులనెడి వికసించిన తామరపువ్వులును కలువపువ్వులును గలదియును, అపారం = అనంతమైనదియునగు, గగనార్ణవం = ఆకసమనెడు సముద్రమును, హనుమాన్ = హనుమ, మారుతగతిః (సన్) = వాయువుతో సమానమైన గమనము గలవాడై, మహానౌః = పెద్ద ఓడ, సాగరమ్ ఇవ = సముద్రమునువలె, అపరిశ్రాంతః = అలసటలేని వాడై, పుప్లువే = లంఘించెను.

సూచన :- స్వాతీహంసవిలాసితమ్ అనుటకు బదులుగా స్వాతీహంసవిలోలితమ్ అని పాఠాంతరము.

తాత్పర్యము :- అటుపిమ్మట హనుమ చంద్రుడనెడు కలువలతోడను, సూర్యుడనెడు జలపక్షితోడను, పుష్యమి శ్రవణము అనెడు కలహంసలతోడను, మేఘములనెడు నాచు పచ్చిక తోడను, పునర్వసు అనెడు మహామత్స్యములతోడను, అంగారక గ్రహమనెడు పెద్ద మొసలితోడను, ఐరావత దిగ్గజ మనెడు పెద్దద్వీపము తోడను, స్వాతి యనెడు హంసతోడను, పెనుగాలుల సమూహమనెడు కెరటములతోడను, చంద్ర కిరణములనెడు చల్లని నీటితోడను, భుజంగయక్షగంధర్వులనెడు వికసించిన తామరపూవులతోడను, కలువపువ్వులతోడను, రమణీయముగను మంగళకరముగను ఉండి అనంతమైన ఆకాశమనెడు మహాసముద్రమును వాయువేగముతో ఒకానొక మహానౌక మహా సాగరమును దాటుచున్నట్లు ఏమియు శ్రమలేకుండ హనుమ దాటుచుండెను.

శ్లో॥ గ్రసమాన ఇ వాకాశం తారాధిప మి వోల్లిఖన్ ।
హర న్నివ సనక్షత్రం గగనం సార్కమండలమ్ ॥ 5

శ్లో॥ మారుత స్యాత్మజ శ్శ్రీమాన్ కపి ర్వ్యోమచరో మహాన్ ।
హనుమా న్మేఘజాలాని వికర్షన్నివ గచ్ఛతి ॥ 6

పదచ్ఛేదము :– గ్రసమానః – ఇవ – ఆకాశం – తారాధిపమ్ – ఇవ – ఉల్లిఖన్, హరన్ – ఇవ – సనక్షత్రం – గగనం – సార్కమండలమ్, మారుతస్య – ఆత్మజః – మేఘజాలాని – వికర్షన్ – ఇవ – గచ్ఛతి ॥

అన్వయక్రమము :– మారుతస్య ఆత్మజః శ్రీమాన్ మహాన్ కపిః హనుమాన్ వ్యోమచరః (సన్) ఆకాశం గ్రసమానః ఇవ, తారాధిపం ఉల్లిఖన్ ఇవ, మేఘజాలాని వికర్షన్ ఇవ గచ్ఛతి.

ప్రతిపదార్థము :– మారుతస్య = వాయుదేవునియొక్క, ఆత్మజః = పుత్రుడును, శ్రీమాన్ = శుభలక్షణసముపేతుడును, మహాన్ = మహనీయుడును అగు, కపిః హనుమాన్ = వానరశ్రేష్ఠుడైన హనుమ, వ్యోమచరః (సన్) = ఆకసమున పయనించుచున్నవాడై, ఆకాశం = ఆకాశమును, గ్రసమానః ఇవ = మ్రింగివేయుచున్నవాడువలెను, తారాధిపం = చంద్రుని, ఉల్లిఖన్ ఇవ = ఒరయుచున్నవానివలెను, సనక్షత్రం = నక్షత్రములతో గూడినదియును, సార్కమండలం = సూర్యబింబముతో గూడినదియునగు, గగనం = ఆకాశమును, హరన్ ఇవ = హరించుచున్నవానివలెను, మేఘజాలాని = మేఘబృందములను, వికర్షన్ ఇవ = లాగికొనిపోవుచున్నవానివలెను, గచ్ఛతి = పోవుచుండెను.

తాత్పర్యము :– వాయునందనుడును మహనీయుడును అగు శ్రీమంతుడైన హనుమంతుడు అట్లు ఆకాశమునందు పయనించుచు ఆ యాకాశమును మ్రింగివేయుచున్నవానివలెను, అచటి చంద్రునితో నొరయగోరుచున్నవానివలెను, నక్షత్రములతోడను, సూర్యమండలముతోడను గూడిన ఆకాశమును హరించుకొని పోవుచున్నవానివలెను, అందలి మేఘముల గుంపును తనతో లాగికొని పోవుచున్న వానివలెను గన్పట్టుచు ముందుకు బోవుచుండెను.

శ్లో॥ పాండురారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ ।
హరితారుణవర్ణాని మహాభ్రాణి చకాశిరే ॥ 7

పదచ్ఛేదము :– పాండురారుణవర్ణాని – నీలమాంజిష్ఠకాని చ – హరితారుణవర్ణాని

- మహాభ్రాణి - చకాశిరే ॥

అన్వయక్రమము :- (తత్ర) మహాభ్రాణి పాండురారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ హరితారుణవర్ణాని చ చకాశిరే.

ప్రతిపదార్థము :- (తత్ర = అచ్చటి) మహాభ్రాణి = పెద్దమేఘములు, పాండురారుణవర్ణాని = తెల్లని ఎఱ్ఱనిరంగులుగలవిగను, నీలమాంజిష్ఠకాని చ = నల్లనివి పచ్చనివిగాను, హరితారుణవర్ణాని = పచ్చని ఎఱ్ఱనివర్ణములు గలవిగను, చకాశిరే = ప్రకాశించినవి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- మహాభ్రాణి - ఇచ్చటి మేఘములు హనుమచే తనవెంట లాగికొనిపోబడుచున్నవని తెలియవలెను.

తాత్పర్యము :- హనుమ వెంటనున్న ఆ మేఘబృందములు అతని ఒడలిపైగల రత్నాభరణముల కాంతులచే కొన్ని తెల్లని ఎఱ్ఱని రంగులతోడను, మఱికొన్ని నల్లని పచ్చని రంగులతోడను ఇంకను కొన్ని పచ్చని ఎర్రని రంగులతోడను ప్రకాశించుచుండినవి.

శ్లో॥ ప్రవిశ న్నభ్రజాలాని నిష్క్రమంశ్చ పునః పునః ।
ప్రకాశ శ్చాప్రకాశశ్చ చంద్రమా ఇవ లక్ష్యతే ॥ 8

పదచ్ఛేదము :- ప్రవిశన్ - అభ్రజాలాని - నిష్క్రమన్ - చ - పునః - పునః - ప్రకాశః - చ - అప్రకాశః - చ - చంద్రమాః ఇవ - లక్ష్యతే ॥

అన్వయక్రమము :- (సః) అభ్రజాలాని పునః పునః ప్రవిశన్ నిష్క్రమన్ చ ప్రకాశః చ అప్రకాశః చ చంద్రమాః ఇవ లక్ష్యతే.

ప్రతిపదార్థము :- (సః = ఆ హనుమ), అభ్రజాలాని = మేఘములయొక్క గుంపులను, పునః పునః = మఱల, ప్రవిశన్ = ప్రవేశించుచు, నిష్క్రమన్ చ = నిష్క్రమించుచును, ప్రకాశః చ = కనబడుచున్నవాడును, అప్రకాశః చ = కనబడనట్టివాడునగు, చంద్రమాః ఇవ = చంద్రుడువలె, లక్ష్యతే = కనబడుచుండెను.

తాత్పర్యము :- ఆ యాకాశమునందు పయనించుచున్న హనుమ దట్టమైన మేఘములలోనికి ప్రవేశించుచు మఱల వెలువడుచు మబ్బులలో మాటిమాటికిని కనిపించుచు మఱుగుపడుచు నుండునట్టి చంద్రునివలెనే గానవచ్చుచుండెను.

శ్లో॥ వివిధాభ్రఘనాపన్నగోచరో ధవళాంబరః ।
దృశ్యాదృశ్యతను ర్వీర స్తదా చంద్రాయతే ఽంబరే ॥ 9

పదచ్ఛేదము :- వివిధాభ్రఘనాపన్నగోచరః - ధవళాంబరః, దృశ్యాదృశ్యతనుః - వీరః - తదా - చంద్రాయతే - అంబరే ॥

అన్వయక్రమము :- ధవళాంబరః (సః) వీరః వివిధాభ్రఘనాపన్నగోచరః దృశ్యాదృశ్యతనుః తదా అంబరే చంద్రాయతే.

ప్రతిపదార్థము :- ధవళాంబరః = తెల్లని వస్త్రములుకలవాడయిన (సః) వీరః = ఆ వీరుడైన హనుమ, వివిధాభ్రఘనాపన్నగోచరః = వివిధములగు దట్టమైన మేఘములందు పొందిన మార్గముగలవాడై, దృశ్యాదృశ్యతనుః (సన్) = కనబడినదియు, కనబడనిదియునగు శరీరము గలవాడగుచు, అంబరే = ఆకాశమునందు, తదా = అప్పుడు, చంద్రాయతే = చంద్రుని వలెనే గోచరించుచుండెను.

తాత్పర్యము :- తెల్లని వస్త్రములు ధరించినవాడై తెల్లని దట్టమైన మేఘముల నడుమ పయనించుచు ఒకమాఱు కనబడుచు ఒకమాఱు కనబడనట్టి తన తెల్లని దేహముతో హనుమ అప్పుడా ఆకాశమునందుండు చంద్రునివలెనే గానవచ్చెను.

శ్లో॥ తార్క్ష్యాయమాణో గగనే బభాసే వాయునందనః ।
దారయన్ మేఘబృందాని నిష్పతంశ్చ పునః పునః ॥ 10

పదచ్ఛేదము :- తార్క్ష్యాయమాణః - గగనే - బభాసే - వాయునందనః - దారయన్ - మేఘబృందాని - నిష్పతన్ - చ - పునః - పునః ॥

అన్వయక్రమము :- పునః పునః మేఘబృందాని దారయన్, నిష్పతన్ చ గగనే వాయునందనః తార్క్ష్యాయమాణః బభాసే.

ప్రతిపదార్థము :- పునః పునః = మాటిమాటికిని, మేఘబృందాని = మబ్బుల గుంపులను, దారయన్ = చీల్చుచు, నిష్పతన్ చ = వెలువడుచు, వాయునందనః = వాయుపుత్రుడైన హనుమ, గగనే = ఆకాశమునందు, తార్క్ష్యాయమాణః = గరుత్మంతుని రీతిగ నున్నవాడై, బభాసే = ప్రకాశించెను.

తాత్పర్యము :- మఱియు హనుమ ఆ యాకాశమునందలి మేఘబృందములను చీల్చుకొనిపోవుచును, అందుండి వెలువడి వచ్చుచును, ఆకసమున విహరించు గరుత్మంతుని వలెనే ప్రకాశించుచుండెను.

శ్లో॥ నద న్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః ।
ప్రవరాన్ రాక్షసాన్ హత్వా నామ విశ్రావ్య చాత్మనః ॥ 11

పదచ్ఛేదము :- నదన్ - నాదేన - మహతా - మేఘస్వనమహాస్వనః - ప్రవరాన్ - రాక్షసాన్ - హత్వా - నామ - విశ్రావ్య - చ - ఆత్మనః ॥

శ్లో॥ ఆకులాం నగరీం కృత్వా వ్యథయిత్వా చ రావణమ్ ।
అర్దయిత్వా బలం ఘోరం వైదేహీ మభివాద్య చ ।
ఆజగామ మహాతేజాః పున ర్మధ్యేన సాగరమ్ ॥ 12

పదచ్ఛేదము :- ఆకులాం - నగరీం - కృత్వా - వ్యథయిత్వా - చ - రావణమ్ - అర్దయిత్వా - బలం - ఘోరం - వైదేహీమ్ - అభివాద్య - చ, ఆజగామ - మహాతేజాః - పునః - మధ్యేన - సాగరమ్ ॥

అన్వయక్రమము :- మేఘస్వనమహాస్వనః మహతా నాదేన నదన్, ప్రవరాన్ రాక్షసాన్ హత్వా, ఆత్మనః నామ విశ్రావ్య చ, నగరీం, ఆకులాం కృత్వా రావణం వ్యథయిత్వా చ ఘోరం బలం అర్దయిత్వా వైదేహీం అభివాద్య చ సః మహాతేజాః పునః సాగరం మధ్యేన ఆజగామ.

ప్రతిపదార్థము :- మేఘస్వనమహాస్వనః = మేఘముల యుఱుమువంటి మహాధ్వనిగలవాడై, మహతా = గొప్పదైన, నాదేన = శబ్దముతో, నదన్ = అఱచుచు, ప్రవరాన్ = శ్రేష్ఠులైన, రాక్షసాన్ = రాక్షసులను, హత్వా = పరిమార్చి, ఆత్మనః = తనయొక్క, నామ = పేరును, విశ్రావ్య = వినిపించి, నగరీం = లంకానగరమును, ఆకులాం = సంకులమైనదానినిగా, కృత్వా = చేసి, రావణం = దశగ్రీవుని, వ్యథయిత్వా చ = పీడించియు, ఘోరం = భయంకరమైన, బలం = సైన్యమును, అర్దయిత్వా చ = నశింపజేసియును, వైదేహీం = సీతాదేవిని, అభివాద్య చ = మ్రొక్కియును, మహాతేజాః సః = మహాప్రతాపశాలియగు ఆ హనుమ, పునః = తిరిగి, సాగరం = సముద్రమును, మధ్యేన = మధ్యగా, ఆజగామ = చేరుకొనెను.

తాత్పర్యము :- మేఘగర్జనము వంటి గొప్ప కంఠధ్వని గలవాడై పెద్ద శబ్దముతో అరచుచు ప్రముఖులైన రాక్షసులను ఎందఱినో వధించి, తన పేరును ఘనతను లంకలో చాటి ఆ నగరమునంతను కల్లోలము గావించి, రావణుని వెతలపాలు చేసి ఆతని సైన్యమును భీకరమైన రీతిగా హతమార్చి సీతమ్మకు మ్రొక్కి మహాప్రతాప సంపన్నుడైన హనుమ తిరిగి సముద్రమధ్యమునకు చేరుకొనెను.

శ్లో॥ పర్వతేంద్రం సునాభం చ సముపస్పృశ్య వీర్యవాన్ ।
జ్యాముక్త ఇవ నారాచో ఽ మహావేగోఽ భ్యుపాగతః ॥ 13

పదచ్ఛేదము :– పర్వతేంద్రం – సునాభం – చ – సముపస్పృశ్య – వీర్యవాన్ – జ్యాముక్తః – ఇవ – నారాచః – మహావేగః – అభ్యుపాగతః ॥

అన్వయక్రమము :– వీర్యవాన్ (సః) సునాభం పర్వతేంద్రం సముపస్పృశ్య చ మహావేగః (సన్) జ్యాముక్తః నారాచః ఇవ అభ్యుపాగతః.

ప్రతిపదార్థము :– వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, సః = ఆ హనుమ, సునాభం = మైనాకమనెడు, పర్వతేంద్రం = పర్వతరాజును, సముపస్పృశ్య = ఆదరముతో నిమిరి, మహావేగః (సన్) = గొప్పవేగము గలవాడై, జ్యాముక్తః = వింటి నారినుండి విడువబడినట్టి, నారాచః ఇవ = బాణమువలె, అభ్యుపాగతః = తిరిగివచ్చెను.

తాత్పర్యము :– ఆ మహావీరుడు ఆ మహాసముద్రమధ్యమునందలి మైనాకపర్వతమును ఆదరముతో నిమిరి ఎక్కుపెట్టిన వింటినుండి విడువబడిన బాణమువలె మహావేగముతో మఱలి వచ్చుచుండెను.

శ్లో॥ స కించి దనుసంప్రాప్త స్సమాలోక్య మహాగిరిమ్ ।
మహేంద్రం మేఘసంకాశం ననాద హరిపుంగవః ॥ 14

పదచ్ఛేదము :– సః – కించిత్ – అనుసంప్రాప్తః – సమాలోక్య – మహాగిరిమ్, మహేంద్రం – మేఘసంకాశం – ననాద – హరిపుంగవః ॥

అన్వయక్రమము :– సః హరిపుంగవః మేఘసంకాశం మహేంద్రం మహాగిరిం కించిత్ అనుసంప్రాప్తః సమాలోక్య ననాద.

ప్రతిపదార్థము :– సః హరిపుంగవః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, మేఘసంకాశం = మేఘసన్నిభమైన, మహేంద్రం = మహేంద్ర మను పేరుగల, మహాగిరిం = పెద్దపర్వతమును, కించిత్ = కొలదిగా, అనుసంప్రాప్తః = చేరినవాడై, సమాలోక్య = చూచి, ననాద = నాదమును గావించెను.

తాత్పర్యము :– వానరశ్రేష్ఠుడైన హనుమ ఉత్తరతీరపు సమీపమునకు జేరి అచ్చట పెద్దమేఘములను బోలిన మహేంద్రపర్వతమును విలోకించి సంతోషముతో సింహనాదమును జేసెను.

శ్లో॥ స పూరయామాస కపి ర్దిశో దశ సమంతతః ।
నద న్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః ॥ 15

పదచ్ఛేదము :– సః – పూరయామాస – కపిః – దిశః – దశ – సమంతతః, నదన్ – నాదేన – మహతా – మేఘస్వనమహాస్వనః ॥

అన్వయక్రమము :– మేఘస్వనమహాస్వనః సః కపిః నదన్ మహతా (తేన) నాదేన సమంతతః దశ దిశః పూరయామాస.

ప్రతిపదార్థము :– మేఘస్వనమహాస్వనః = మేఘగర్జనమువంటి గొప్పకంఠస్వరముగల, సః కపిః = ఆ వానరశ్రేష్ఠుడు, నదన్ = నాదము గావించుచు, తేన = ఆ, మహతా = గొప్పదైన, నాదేన = శబ్దముతో, సమంతతః = చుట్టును, దశదిశః = పదిదిక్కులను, పూరయామాస = నిండజేసెను.

తాత్పర్యము :– మేఘగర్జనమువంటి గొప్ప కంఠస్వరముగల ఆ హనుమ సంతోషముతో సింహనాదమును గావించుచు గొప్పదైన ఆ మహాధ్వనితో పదిదిక్కులను నిండునట్లు చేసెను.

శ్లో॥ స తం దేశ మను ప్రాప్త స్సుహృద్దర్శనలాలసః ।
ననాద హరిశార్దూలో లాంగూలం చాప్యకంపయత్ ॥ 16

పదచ్ఛేదము :– సః – తం – దేశమ్ – అనుప్రాప్తః – సుహృద్దర్శనలాలసః, ననాద – హరిశార్దూలః – లాంగూలం – చ – అపి – అకంపయత్ ॥

అన్వయక్రమము :– సః హరిశార్దూలః తం దేశమ్ అనుప్రాప్తః సుహృద్దర్శనలాలసః (సన్) ననాద. లాంగూలమ్ అపి అకంపయత్ చ.

ప్రతిపదార్థము :– సః హరిశార్దూలః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, తం = ఆ, దేశం = ప్రదేశమును, అనుప్రాప్తః = చేరినవాడై, సుహృద్దర్శనలాలసః (సన్) = స్నేహితులయొక్క దర్శనమునందు తీవ్రమైన ఇచ్ఛగలవాడగుచు, ననాద = గర్జించెను, లాంగూలం = వాలమును, అకంపయత్ చ = కంపింపచేసెను కూడ.

తాత్పర్యము :– వానరశ్రేష్ఠుడైన యా హనుమ తన మిత్రులను చూడవలెనను తీవ్రమైన కోరికతో ఆ ప్రదేశమును చేరుకొని వెంటనే తన వాలమును కంపింపచేయుచు పెద్దగర్జనము చేసెను.

శ్లో॥ తస్య నానద్యమానస్య సుపర్ణచరితే పథి ।
ఫలతీ వాస్యఘోషేణ గగనం సార్కమండలమ్ ॥ 17

పదచ్ఛేదము :- తస్య - నానద్యమానస్య - సుపర్ణచరితే - పథి - ఫలతి - ఇవ - ఆస్యఘోషేణ - గగనం - సార్కమండలమ్ ॥

అన్వయక్రమము :- సుపర్ణచరితే పథి నానద్యమానస్య తస్య ఆస్యఘోషేణ, సార్కమండలం గగనం ఫలతి ఇవ (ఆస).

ప్రతిపదార్థము :- సుపర్ణచరితే = గరుత్మంతునిచే సంచరింపబడినట్టి, పథి = మార్గమున, నానద్యమానస్య = బిగ్గరగా గర్జించుచున్నట్టి, తస్య = ఆ హనుమయొక్క, ఆస్యఘోషేణ = నోటిధ్వనిచే, సార్కమండలం = సూర్యమండలముతోగూడిన, గగనం = ఆకాశము, ఫలతి ఇవ = బ్రద్దలగుచున్నది వలె (ఆస = ఉండెను).

తాత్పర్యము :- ఆ హనుమ యట్లు గరుత్మంతుని సంచారమార్గమైన గగనతలమునందు బిగ్గరగా గర్జనము గావించుచుండగా అతని కంఠధ్వనికి సూర్యమండలముతో సహితముగ గగనమండలము బ్రద్దలగుచున్నట్లుండెను.

శ్లో॥ యే తు తత్రోత్తరే తీరే సముద్రస్య మహాబలాః ।
పూర్వం సంవిష్ఠితా శ్శూరా వాయుపుత్రదిదృక్షవః ॥ 18

శ్లో॥ మహతో వాయునున్నస్య తోయదస్యేవ గర్జితమ్ ।
శుశ్రువు స్తే తదా ఘోష మూరువేగం హనూమతః ॥ 19

పదచ్ఛేదము :- యే - తు - తత్ర - ఉత్తరే - తీరే - సముద్రస్య - మహాబలాః, పూర్వం - సంవిష్ఠితాః - శూరాః - వాయుపుత్రదిదృక్షవః, మహతః - వాయునున్నస్య - తోయదస్య - ఇవ - గర్జితమ్ - శుశ్రువుః - తే - తదా - ఘోషమ్ - ఉరువేగం - హనుమతః ॥

అన్వయక్రమము :- పూర్వం తత్ర సముద్రస్య ఉత్తరే తీరే వాయుపుత్రదిదృక్షవః (సంతః) మహాబలాః శూరాః యే సంవిష్ఠితాః తే తదా వాయునున్నస్య మహతః, తోయదస్య గర్జితమ్ ఇవ హనూమతః ఊరువేగం ఘోషం శుశ్రువుః.

ప్రతిపదార్థము :- పూర్వం = అంతకుపూర్వము, తత్ర = అచ్చట, సముద్రస్య = సముద్రముయొక్క, ఉత్తరే తీరే = ఉత్తరతీరమునందు, వాయుపుత్రదిదృక్షవః (సంతః) = పవనసుతుని చూడగోరుచున్నవారై, మహాబలాః = మహాబలాఢ్యులును, శూరాః = శూరులునగు, యే = ఏ వానరులైతే, సంవిష్ఠితాః = కూర్చొనియుండిరో, తే = ఆ

వానరులు, వాయునున్నస్య = వాయువుచే ప్రేరేపింపబడినట్టి, మహతః = గొప్పదైన, తోయదస్య = మేఘముయొక్క, గర్జితమ్ ఇవ = ఉఱుమునువలె, తదా = అప్పుడు, హనూమతః = హనుమంతునియొక్క, ఊరువేగం = తొడలవడిని, ఘోషం = సింహనాదమును, శుశ్రువుః = ఆకర్ణించిరి.

తాత్పర్యము :– ఆ మహాసముద్రముయొక్క ఉత్తరతీరమునందు పవననందనుని రాకకై వేయికన్నులతో నిరీక్షించుచు కూర్చుండియున్న వానరవీరులు, వాయువుచే త్రోయబడుచున్న ఒక మహామేఘమునుండి వచ్చెడి ఒక పెద్ద యుఱుమువలె వినవచ్చుచుండగా అపు డా హనుమ మహావేగముతో పయనించి వచ్చుచు చేయుచున్న ఆ సింహగర్జనమును ఆశ్చర్యముగా ఆలకించిరి.

శ్లో॥ తే దీనవదనా స్సర్వే శుశ్రువుః కాననౌకసః ।
వానరేంద్రస్య నిర్ఘోషం పర్జన్యనినదోపమమ్ ॥ 20

పదచ్ఛేదము :– తే – దీనవదనాః – సర్వే – శుశ్రువుః – కాననౌకసః, వానరేంద్రస్య – నిర్ఘోషం – పర్జన్యనినదోపమమ్ ॥

అన్వయక్రమము :– దీనవదనాః తే కాననౌకసః సర్వే పర్జన్యనినదోపమం వానరేంద్రస్య నిర్ఘోషం శుశ్రువుః.

ప్రతిపదార్థము :– దీనవదనాః = దైన్యముతో గూడిన ముఖము గల్గినట్టి, తే = ఆ, కాననౌకసః = వనచరులైన వానరులు, సర్వే = ఎల్లరును, పర్జన్యనినదోపమం = మేఘములయొక్క, ఉఱుముతో సమానమైన, వానరేంద్రస్య = హనుమయొక్క, నిర్ఘోషం = గర్జనమును, శుశ్రువుః = ఆలకించిరి.

తాత్పర్యము :– ఇంతవఱకును సీతాదేవిని గూర్చి ఎట్టి వార్త వినవలసియుండునో యని భీతితో దీనవదనులైయున్న యా వానరువీరు లెల్లరును మహామేఘధ్వనివలె వినవచ్చిన హనుమయొక్క సింహనాదమును మహానందముతో ఆలకించిరి.

శ్లో॥ నిశమ్య నదతో నాదం వానరా స్తే సమంతతః ।
బభూవు రుత్సుకా స్సర్వే సుహృద్దర్శనకాంక్షిణః ॥ 21

పదచ్ఛేదము :– నిశమ్య – నదతః – నాదం – వానరాః – తే – సమంతతః – బభూవుః – ఉత్సుకాః – సర్వే – సుహృద్దర్శనకాంక్షిణః ॥

అన్వయక్రమము :– నదతః నాదం నిశమ్య తే వానరాః సర్వే సమంతతః సుహృద్దర్శనకాంక్షిణః (సంతః) ఉత్సుకాః బభూవుః.

ప్రతిపదార్థము :- నదతః = గర్జించుచున్నట్టి హనుమయొక్క, నాదం = ధ్వనిని, నిశమ్య = ఆలకించి, తే = ఆ, వానరాః = వానరులు, సర్వే = ఎల్లరును, సమంతతః = అంతటను, సుహృద్దర్శనకాంక్షిణః (సంతః) = మిత్రునియొక్క దర్శనమును కోరుచున్నవారగుచు, ఉత్సుకాః = వేగిరపాటు నొందినవారు, బభూవుః = అయిరి.

తాత్పర్యము :- హనుమంతుడు గావించిన యా సింహగర్జనము నాకర్ణించి చుట్టుప్రక్కలనున్న ఆ వానరు లెల్లరును తమ ప్రియతమ మిత్రుని జూడవలయునను తీవ్రమైన కాంక్షతో మిక్కిలి తహతహపాటు నొందుచుండిరి.

శ్లో॥ జాంబవా న్స హరిశ్రేష్ఠః ప్రీతిసంహృష్టమానసః ।
ఉపామంత్ర్య హరీ న్సర్వా నిదం వచన మబ్రవీత్ ॥ 22

పదచ్ఛేదము :- జాంబవాన్ - సః - హరిశ్రేష్ఠః - ప్రీతిసంహృష్టమానసః, ఉపామంత్ర్య - హరీన్ - సర్వాన్ - ఇదం - వచనమ్ - అబ్రవీత్ ॥

అన్వయక్రమము :- హరిశ్రేష్ఠః సః జాంబవాన్ ప్రీతిసంహృష్టమానసః (సన్) హరీన్ సర్వాన్ ఉపామంత్ర్య ఇదం వచనమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :- హరిశ్రేష్ఠః = వానరశ్రేష్ఠుడైనట్టి, సః జాంబవాన్ = ఆ జాంబవంతుడు, ప్రీతిసంహృష్టమానసః = ప్రేమతో సంతోషమునొందిన మనస్సుగలవాడై, హరీన్ = వానరులను, సర్వాన్ = ఎల్లరను, ఉపామంత్ర్య = దగ్గఱకు పిలిచి, ఇదం = ఈ, వచనం = మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- అప్పుడు వానరశ్రేష్ఠుడైనట్టి జాంబవంతుడు ప్రేమపూర్ణమైన మనస్సుతో చుట్టునున్న వానరులనందరను దగ్గఱకు పిలిచి ఈ విధముగ పలికెను.

శ్లో॥ సర్వథా కృతకార్యో ఽసౌ హనుమాన్నాత్ర సంశయః ।
న హ్య స్యాకృతకార్యస్య నాద ఏవంవిధో భవేత్ ॥ 23

పదచ్ఛేదము :- సర్వథా - కృతకార్యః - అసౌ - హనుమాన్ - న - అత్ర - సంశయః- న - హి - అస్య - అకృతకార్యస్య - నాదః - ఏవంవిధః - భవేత్ ॥

అన్వయక్రమము :- అసౌ హనుమాన్ సర్వథా కృతకార్యః. అత్ర సంశయః న(అస్తి). అకృతకార్యస్య అస్య నాదః ఏవంవిధః న భవేత్ హి.

ప్రతిపదార్థము :- అసౌ = ఈ, హనుమాన్ = హనుమ, సర్వథా = సర్వవిధములుగా, కృతకార్యః = నెఱవేర్చిన కర్తవ్యముగలవాడు. అత్ర = ఈ విషయమునందు, సంశయః

= సందేహము, న అస్తి = లేదు. అకృతకార్యస్య = నెఱవేర్పని కర్తవ్యము గలిగినట్టి, అస్య = ఈ హనుమయొక్క, నాదః = శబ్దము, ఏవంవిధః = ఈ విధమైనదిగా, న భవేత్ హి = ఉండదుగదా!

తాత్పర్యము :– మన హనుమ నూటికి నూఱుపాళ్లు తన కర్తవ్యమును నెఱవేర్చియే వచ్చుచున్నాడు. ఈ విషయమునందు అణుమాత్రమును సందేహములేదు. తన కర్తవ్యమును నెఱవేర్పకుండగ వచ్చుచున్న యెడల యాతని కంఠస్వరము ఇంత ఉత్సాహముగను భీకరముగను ఉండదు గదా!

శ్లో॥ తస్య బాహూరువేగం చ నినాదం చ మహాత్మనః ।
నిశమ్య హరయో హృష్టా స్సముత్పేతు స్తతస్తతః ॥ 24

పదచ్ఛేదము :– తస్య – బాహూరువేగం – చ – నినాదం – చ – మహాత్మనః, నిశమ్య – హరయః – హృష్టాః – సముత్పేతుః – తతః – తతః ॥

అన్వయక్రమము :– మహాత్మనః తస్య బాహూరువేగం చ నినాదం చ నిశమ్య హరయః తతః తతః సముత్పేతుః.

ప్రతిపదార్థము :– మహాత్మనః = మహనీయుడైనట్టి, తస్య = ఆ హనుమయొక్క, బాహూరువేగం చ = బాహువులయొక్కయు, ఊరువులయొక్కయు వేగమును, నినాదం చ = కంఠస్వరమును, నిశమ్య = ఆకర్ణించి, హరయః = వానరులు, హృష్టాః = సంతోషము నొందినవారై, తతః తతః = అచ్చటచ్చటనుండి, సముత్పేతుః = ఎగురుచుండిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'బాహూరువేగం' – బాహువులయొక్కయు, ఊరువులయొక్కయు వేగముచే గలిగిన ధ్వనిని వానరులు వినిరని భావము.

తాత్పర్యము :– మహాప్రభావసంపన్నుడైన యా హనుమయొక్క బాహువుల యొక్కయు ఊరువులయొక్కయు వడిసవ్వడిని కంఠధ్వనిని ఆలించి ఆ వానరులు మహానందముతో ఎచ్చటి వారచ్చట మీది మీది కెగురుచుండిరి.

శ్లో॥ తే నగాగ్రా న్నగాగ్రాణి శిఖరా చ్ఛిఖరాణి చ ।
ప్రహృష్టా స్సమపద్యంత హనూమంతం దిదృక్షవః ॥ 25

పదచ్ఛేదము :– తే – నగాగ్రాత్ – నగాగ్రాణి – శిఖరాత్ – శిఖరాణి – చ,

ప్రహృష్టాః – సమపద్యంత – హనూమంతం – దిదృక్షవః ॥

అన్వయక్రమము :– తే ప్రహృష్టాః హనూమంతం దిదృక్షవః(సంతః) నగాగ్రాత్ శిఖరాత్ శిఖరాణి చ సమపద్యంత.

ప్రతిపదార్థము :– తే = ఆ వానరులు, ప్రహృష్టాః = గొప్ప సంతోషము నొందినవారై, హనూమంతం = హనుమను, దిదృక్షవః (సంతః) = చూడకోరికగలవారగుచు, నగాగ్రాత్ = చెట్టుకొననుండి, నగాగ్రాణి = చెట్టుకొనలను, శిఖరాత్ = గిరిశిఖరములనుండి, శిఖరాణి చ = ఉన్నతశిఖరములను, సమపద్యంత = చేరిరి.

తాత్పర్యము :– మహానందముతో గూడిన ఆ వానరులు హనుమంతుని దూరమునుండియే చూడగోరి తామున్న చెట్టుకొననుండి ఇంకను ఎత్తైన కొనకును పర్వతాగ్రము నుండి ఇంకను ఎత్తైన శిఖరాగ్రమునకును చేరుకొనుచుండిరి.

శ్లో॥ తే ప్రీతాః పాదపాగ్రేషు గృహ్య శాఖాస్సుపుష్పితాః ।
వాసాంసీవ ప్రశాఖాశ్చ సమావిధ్యంత వానరాః ॥ 26

పదచ్ఛేదము :– తే – ప్రీతాః – పాదపాగ్రేషు – గృహ్య – శాఖాః – సుపుష్పితాః – వాసాంసి – ఇవ – ప్రశాఖాః – చ – సమావిధ్యంత – వానరాః ॥

అన్వయక్రమము :– తే వానరాః ప్రీతాః (సంతః) పాదపాగ్రేషు సుపుష్పితాః శాఖాః గృహ్య ప్రశాఖాః వాసాంసి ఇవ సమావిధ్యంత.

ప్రతిపదార్థము :– తే = ఆ, వానరాః = వానరులు, ప్రీతాః (సంతః) = సంతోషము నొందినవారగుచు, పాదపాగ్రేషు = వృక్షాగ్రములయందు, సుపుష్పితాః = చక్కగాపూచినట్టి, శాఖాః = కొమ్మలను, గృహ్య = గ్రహించి, ప్రశాఖాః = చిన్నకొమ్మలను, వాసాంసి ఇవ = వస్త్రములనువలె, సమావిధ్యంత = ఊపుచుండిరి.

తాత్పర్యము :– ఆ వానరులు మహాసంతోషముతో చెట్ల కొనలపైనుండి చక్కగా పుష్పించియున్న కొమ్మలమీదికి చేరి చిన్న కొమ్మలను విఱిచి చేతితో పట్టుకొని గుడ్డ జండాలను ఊపినట్లుగా ఊపుచుండిరి.

శ్లో॥ గిరిగహ్వరసంలీనో యథా గర్జతి మారుతః ।
ఏవం జగర్జ బలవాన్ హనుమా న్మారుతాత్మజః ॥ 27

పదచ్ఛేదము :– గిరిగహ్వరసంలీనః – యథా – గర్జతి – మారుతః – ఏవం – జగర్జ – బలవాన్ – హనుమాన్ – మారుతాత్మజః ॥

అన్వయక్రమము :– మారుతః గిరిగహ్వరసంలీనః (సన్) యథా గర్జతి ఏవం బలవాన్ మారుతాత్మజః హనుమాన్ జగర్జ.

ప్రతిపదార్థము :– మారుతః = వాయువు, గిరిగహ్వరసంలీనః (సన్) = పర్వతగుహలందు ప్రవేశించినదై, యథా = ఏ విధముగా, గర్జతి = గర్జించునో, ఏవం = ఈ రీతిగా, బలవాన్ = బలాఢ్యుడైనట్టి, మారుతాత్మజః = మారుతతనయుడగు, హనుమాన్ = హనుమ, జగర్జ = గర్జించెను.

తాత్పర్యము :– పర్వతగుహలందు ప్రవేశించిన వాయువు మహాధ్వనితో ఎట్లు గర్జించునో అట్లే మహాబలశాలియైన వాయునందనుడగు హనుమ గొప్ప ధ్వనితో గర్జించుచుండెను.

శ్లో॥ త మభ్రఘనసంకాశ మాపతంతం మహాకపిమ్ ।
దృష్ట్వా తే వానరా స్సర్వే తస్థుః ప్రాంజలయ స్తదా ॥ 28

పదచ్ఛేదము :– తమ్ – అభ్రఘనసంకాశమ్ – ఆపతంతం – మహాకపిం, దృష్ట్వా – తే – వానరాః – సర్వే – తస్థుః – ప్రాంజలయః – తదా॥

అన్వయక్రమము :– అభ్రఘనసంకాశమ్ ఆపతంతం తం మహాకపిం దృష్ట్వా తదా తే వానరాః సర్వే ప్రాంజలయః తస్థుః.

ప్రతిపదార్థము :– అభ్రఘనసంకాశం = దట్టమైన మేఘముతో సమానుడై, ఆపతంతం = దగ్గఱకు పచ్చిపడుచున్న, తం మహాకపిం = ఆ వానరశ్రేష్ఠుని, దృష్ట్వా = చూచి, తే వానరాః = ఆ వానరులు, సర్వే = ఎల్లరును, ప్రాంజలయః = దోసిలిఒగ్గినవారై, తస్థుః = నిలచిరి.

తాత్పర్యము :– దట్టమైన పెద్ద మేఘమువంటి రూపముతో తమ సమీపమునకు వచ్చుచున్న వానరశ్రేష్ఠుడైన ఆ హనుమను గాంచి ఆ వానరులెల్లరును లేచి దోసిలియొగ్గి నిలువబడిరి.

శ్లో॥ తతస్తు వేగవాం స్తస్య గిరే ర్గిరినిభః కపిః ।
నిపపాత మహేంద్రస్య శిఖరే పాదపాకులే ॥ 29

పదచ్ఛేదము :– తతః – తు – వేగవాన్ – తస్య – గిరేః – గిరినిభః – కపిః, నిపపాత – మహేంద్రస్య – శిఖరే – పాదపాకులే ॥

అన్వయక్రమము :– తతః వేగవాన్ గిరినిభః కపిః తస్య మహేంద్రస్య గిరేః పాదపాకులే శిఖరే నిపపాత.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, వేగవాన్ = గొప్పవేగము గల్గినట్టి, గిరినిభః = పర్వతసన్నిభుడైన, కపిః = హనుమ, తస్య = ఆ, మహేంద్రస్య = మహేంద్ర మను పేరుగల, గిరేః = పర్వతముయొక్క, పాదపాకులే = వృక్షములతో దట్టముగనున్నట్టి, శిఖరే = శిఖరమునందు, నిపపాత = ఉరికెను.

తాత్పర్యము :– మహావేగముతో క్రిందికి పడుచున్న పర్వతము వలె నున్న ఆ హనుమ వివిధవృక్షములతో నిండియున్న మహేంద్రపర్వతము శిఖరము మీదికి ఉరికెను.

శ్లో॥ హర్షే ణాపూర్యమాణో ఽసౌ రమ్యే పర్వతనిర్ఝరే ।
ఛిన్న పక్ష ఇవాకాశా త్పపాత ధరణీధరః ॥ 30

పదచ్ఛేదము :– హర్షేణ – ఆపూర్యమాణః – అసౌ – రమ్యే – పర్వతనిర్ఝరే – ఛిన్నపక్షః – ఇవ – ఆకాశాత్ – పపాత – ధరణీధరః ॥

అన్వయక్రమము :– హర్షేణ ఆపూర్యమాణః అసౌ ఆకాశాత్ ఛిన్నపక్షః ధరణీధరః ఇవ రమ్యే పర్వతనిర్ఝరే పపాత.

ప్రతిపదార్థము :– హర్షేణ = సంతోషముతో, ఆపూర్యమాణః = నింపబడుచున్నట్టి, అసౌ = ఈ హనుమ, రమ్యే = సుందరమైనట్టి, పర్వతనిర్ఝరే = కొండవాగునందు, ఆకాశాత్ = ఆకాశమునుండి, ఛిన్నపక్షః = తెగగొట్టబడిన ఱెక్కలుగల్గినట్టి, ధరణీధరః ఇవ = పర్వతమువలె, పపాత = పడెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము:– పర్వతనిర్ఝరే పపాత – సెలయేళ్లు ప్రవహించుచున్న పర్వతముపై అనగా సెలయేళ్ల ప్రక్కను హనుమ దిగెను. లేక ప్రయాణము శ్రమ తొలగుటకై ఆ నీటియందే దూకెనని కొందరు చెప్పినదిగూడ యుక్తమే.

వాసుదాసస్వామి :– హనుమ కొండవంకయందు నీళ్లలో ఱెక్కలు విఱిగిన పర్వతమువలె దభాలున పడెను.

శ్రీరామదర్శనమునకై పోవుటయం దొక నిమేషమైన జాగు కారాదని ఇది యాయన త్వరను సూచించుచున్నది. లేని యెడల హనుమ దూరమునుండియే వేగము తగ్గించి యుండవచ్చును గదా!

తాత్పర్యము :– మహానందముతో నిండిన యా హనుమ సెలయేళ్లతో చల్లనైయున్న మహేంద్రగిరిపర్వతమున ఱెక్కలు తెగిన పర్వతమువలె ఆకసమునుండి క్రిందికి ఉరికెను.

శ్లో॥ తత స్తే ప్రీతమనస స్సర్వే వానరపుంగవాః ।
హనూమంతం మహాత్మానం పరివా ర్యోపతస్థిరే ॥ 31

పదచ్ఛేదము :– తతః – తే – ప్రీతమనసః – సర్వే – వానరపుంగవాః – హనూమంతం – మహాత్మానం – పరివార్య – ఉపతస్థిరే ॥

అన్వయక్రమము :– తతః తే వానరపుంగవాః సర్వే ప్రీతమనసః (సంతః) మహాత్మానం హనూమంతం పరివార్య ఉపతస్థిరే.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, తే = ఆ, వానరపుంగవాః = వానర శ్రేష్ఠులు, సర్వే = ఎల్లరును, ప్రీతమనసః (సంతః) = ఆనందము నొందిన మనస్సుగల వారగుచు, మహాత్మానం = మహనీయుడైనట్టి, హనూమంతం = హనుమను, పరివార్య = చుట్టునుచేరి, ఉపతస్థిరే = కూర్చుండిరి.

తాత్పర్యము :– అప్పుడా వానర వీరులెల్లరును మహానందభరితమైన మనస్సుతో మహాత్ముడైన యా హనుమచుట్టును జేరి కూర్చుండిరి.

శ్లో॥ పరివార్య చ తే సర్వే పరాం ప్రీతి ముపాగతాః ॥ 32

పదచ్ఛేదము :– పరివార్య – చ – తే – సర్వే – పరాం – ప్రీతిమ్ – ఉపాగతాః ॥

ప్రతిపదార్థము :– పరివార్య చ = చుట్టుముట్టి, తే సర్వే = ఆ వానరులెల్లరును, పరాం = గొప్పదైన, ప్రీతిం = సంతోషమును, ఉపాగతాః = పొందిరి.

తాత్పర్యము :– వానరవీరు లెల్లరును అట్లు హనుమ చుట్టును మూగి మహాసంతోషము నొందుచుండిరి.

శ్లో॥ ప్రహృష్టవదనా స్సర్వే త మరోగ ముపాగతమ్ ।
ఉపాయనాని చాదాయ మూలాని చ ఫలాని చ ।
ప్రత్యర్చయన్ హరిశ్రేష్ఠం హరయో మారుతాత్మజమ్ ॥ 33

పదచ్ఛేదము :– ప్రహృష్టవదనాః – సర్వే – తమ్ – అరోగమ్ – ఉపాగతమ్, ఉపాయనాని – చ – ఆదాయ – మూలాని – చ – ఫలాని – చ, ప్రత్యర్చయన్ – హరిశ్రేష్ఠం – హరయః – మారుతాత్మజమ్ ॥

అన్వయక్రమము :– ప్రహృష్టవదనాః సర్వే హరయః అరోగమ్ ఉపాగతం హరిశ్రేష్ఠం తం మారుతాత్మజమ్ ఉపాయనాని చ మూలాని చ ఫలాని చ ఆదాయ ప్రత్యర్చయన్.

ప్రతిపదార్థము :– ప్రహృష్టవదనాః = గొప్ప ఆనందము నొందిన ముఖములు కలిగినట్టి, సర్వే హరయః = ఆ వానరు లందరును, అరోగమ్ = అస్వస్థత లేనివాడై, ఉపాగతం = చేరినట్టి, హరిశ్రేష్ఠం = వానరశ్రేష్ఠుడైనట్టి, తం మారుతాత్మజమ్ = ఆ పవననందనుని, ఉపాయనాని చ = కానుకలను, మూలాని చ = దుంపలను, ఫలాని = పండ్లను, ఆదాయ = గ్రహించి, ప్రత్యర్చయన్ = సత్కరించిరి.

తాత్పర్యము :– ఎట్టి ఆపదయును లేకుండ సుఖముగా తిరిగి వచ్చిన ఆ వాయునందనుని గాంచి మహానందముతో వికసించిన ముఖము గల యా వానరులందఱును మధురములైన కందమూలఫలములు మొదలగు కానుకలను గొని తెచ్చి, గౌరవముతో అర్పించుచుండిరి.

శ్లో॥ హనుమాంస్తు గురూ న్వృద్ధాన్ జాంబవత్ప్రముఖాంస్తదా ।
కుమార మంగదం చైవ సోఽవందత మహాకపిః ॥ 34

పదచ్ఛేదము :– హనుమాన్ – తు – గురూన్ – వృద్ధాన్ – జాంబవత్ప్రముఖాన్ – తదా, కుమారమ్ – అంగదం – చ – ఏవ – సః – అవందత – మహాకపిః ॥

అన్వయక్రమము :– మహాకపిః హనుమాన్ తు గురూన్ వృద్ధాన్ జాంబవత్ప్రముఖాన్, కుమారమ్ అంగదం చ ఏవ అవందత.

ప్రతిపదార్థము :– మహాకపిః = వానరశ్రేష్ఠుడైనట్టి, సః హనుమాన్ = ఆ హనుమ, తదా = అప్పుడు, గురూన్ = గురువులను, వృద్ధాన్ = వృద్ధులును అగు, జాంబవత్ ప్రముఖాన్ = జాంబవంతుడు మున్నగు వారిని, కుమారం = చిన్నవాడైన, అంగదం చైవ = అంగదుని కూడ, అవందత = మ్రొక్కెను.

తాత్పర్యము :– వానరశ్రేష్ఠుడైన హనుమ యప్పుడు జాంబవంతుడు మున్నగు గురువులకును పెద్దలకును యువరాజైన అంగదునికిని వందన మాచరించెను.

శ్లో॥ స తాభ్యాం పూజితః పూజ్యః కపిభిశ్చ ప్రసాదితః ।
దృష్టా సీతేతి విక్రాంత స్సంక్షేపేణ న్యవేదయత్ ॥ 35

పదచ్ఛేదము :– సః – తాభ్యాం – పూజితః – పూజ్యః – కపిభిః – చ – ప్రసాదితః – దృష్టా – సీతా – ఇతి – విక్రాంతః – సంక్షేపేణ – న్యవేదయత్ ॥

అన్వయక్రమము :– తాభ్యాం పూజితః కపిభిః చ ప్రసాదితః విక్రాంతః సః పూజ్యః దృష్టా సీతా ఇతి సంక్షేపేణ న్యవేదయత్.

ప్రతిపదార్థము :- తాభ్యాం = జాంబవంతునిచేతను, అంగదునిచేతను, పూజితః = గౌరవింపబడినవాడై, కపిభిః చ = వానరులచేతను, ప్రసాదితః = సత్కరింపబడినవాడై, పూజ్యః = పూజనీయుడు అగు, సః = ఆ హనుమ, సంక్షేపేణ = సంక్షేపముగా, దృష్టా సీతా = చూడబడినది సీతాదేవి, ఇతి = అని, న్యవేదయత్ = నివేదించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

బొంబాయిపాఠము :- దృష్టా సీతా యనుటకు బదులుగా దృష్టా దేవీ యని గలదు.

వాసుదాసస్వామి :- ఏమి చెప్పునో యని తహతహలాడు వానరుల మనస్సు కుదుటబడుటకు 'చూచితి సీత నని' రెండుమాటలతో సారాంశమును తెలిపెను.

శ్రీమాన్ తెన్మఠం రంగాచార్యస్వామి :- ఇచ్చట 'సీతా దృష్టా'యని చెప్పిన యెడల సీతా శబ్దము నుచ్చరించి దృష్టా శబ్దము నుచ్చరించునంతలో సీతమ్మ ఏమయ్యెనని చెప్పునో యని వానరులు భయపడుదురని హనుమంతుడు 'దృష్టా సీతా' యని చెప్పెను.

తాత్పర్యము :- జాంబవంతుడును అంగదుడును మిక్కిలి గౌరవించుచుండ మిగిలిన వానరులెల్లరును ఆప్యాయముగ తనను తిలకించుచుండ హనుమ వారి నెల్లరను జూచుచు "చూచితిని సీతమ్మను" అని సంగ్రహముగ వారికి నివేదించెను.

శ్లో॥ నిషసాద చ హస్తేన గృహీత్వా వాలిన స్సుతమ్ ।
రమణీయే వనోద్దేశే మహేంద్రస్య గిరే స్తదా ॥ 36

పదచ్ఛేదము :- నిషసాద - చ - హస్తేన - గృహీత్వా - వాలినః - సుతమ్ - రమణీయే - వనోద్దేశే - మహేంద్రస్య - గిరేః - తదా ॥

అన్వయక్రమము :- తదా వాలినః సుతం హస్తేన గృహీత్వా రమణీయే మహేంద్రస్య గిరేః వనోద్దేశే నిషసాద చ.

ప్రతిపదార్థము :- తదా = అప్పుడు, వాలినః = వాలియొక్క, సుతం = పుత్రుడైన అంగదుని, హస్తేన = చేతితో, గృహీత్వా = పట్టుకొని, మహేంద్రస్య గిరేః = మహేంద్ర పర్వతముయొక్క, రమణీయే = సుందరమైనట్టి, వనోద్దేశే = వనప్రదేశమునందు, నిషసాద చ = కూర్చుండెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమ యువరాజైన అంగదుని చేతిని తనచేతిలోనికి తీసికొని యా మహేంద్రపర్వతమునందలి సుందరమైన ప్రదేశమున గూర్చుండెను.

శ్లో॥ హనుమా న(బ్రవీ ద్ధృష్ట స్తదా తా న్వానరర్షభాన్ ।
అశోకవనికాసంస్థా దృష్టా సా జనకాత్మజా ॥ 37

శ్లో॥ రక్ష్యమాణా సుఘోరాభీ రాక్షసీభి రనిన్దితా ।
ఏకవేణీధరా దీనా రామదర్శనలాలసా ॥ 38

శ్లో॥ ఉపవాసపరి(శ్రాంతా జటిలా మలినా కృశా ॥ 39

పదచ్ఛేదము :- హనుమాన్ - అ(బ్రవీత్ - హృష్టః - తదా - తాన్ - వానరర్షభాన్, అశోకవనికాసంస్థా - దృష్టా - సా - జనకాత్మజా - రక్ష్యమాణా - సుఘోరాభిః - రాక్షసీభిః - అనిందితా - ఏకవేణీధరా - దీనా - రామదర్శనలాలసా - ఉపవాసపరి(శ్రాంతా - జటిలా - మలినా - కృశా.

అన్వయక్రమము :- తదా హనుమాన్ హృష్టః సన్, సుఘోరాభిః రాక్షసీభిః రక్ష్యమాణా ఏకవేణీధరా దీనా రామదర్శనలాలసా ఉపవాసపరి(శ్రాంతా జటిలా మలినా కృశా సా అనిందితా జనకాత్మజా అశోకవనికాసంస్థా దృష్టా ఇతి తాన్ వానరర్షభాన్ అ(బ్రవీత్.

ప్రతిపదార్థము :- తదా = అప్పుడు, హనుమాన్ = హనుమంతుడు, హృష్టః సన్ = సంతోషించినవాడై, సుఘోరాభిః = మిక్కిలి భీకరులైనట్టి, రాక్షసీభిః = రాక్షస(స్త్రీలచే, రక్ష్యమాణా = రక్షింపబడుచున్నదై, ఏకవేణీధరా = జడగట్టిన కేశములుగలదియును, దీనా = దీనురాలును, రామదర్శనలాలసా = రఘురాముని దర్శనము కొఱకై వేగిరపడుచున్నదియును, ఉపవాసపరి(శ్రాంతా = ఉపవాసములచే బడలియున్నదియును, జటిలా = జడలు ధరించినదియును, మలినా = మలినమైయున్నదియును, కృశా = కృశించియున్నదియును అగు, సా = ఆ, ఆనిందితా = అనింద్యచరితురాలయిన, జనకాత్మజా = జానకీదేవి, అశోకవనికాసంస్థా = అశోకవనమునందు ఉన్నదిగా, దృష్టా = చూడబడినది, ఇతి = అని, తాన్ వానరర్షభాన్ = ఆ వానర (శ్రేష్ఠులనుగూర్చి, అ(బ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- అప్పుడు హనుమ మహానందముతో మి(త్రులైన వానరవీరులను జూచి నేను జానకమ్మను అశోకవనమునందు జూచితిని. ఆమెను భయంకరమైన రాక్షస(స్త్రీలు కావలి గాచుచున్నారు. జడగట్టిన కేశములతో దీనురాలై శ్రీరామ దర్శనమునకై పరితపించుచున్నదై ఉపవాసములచే బడలి కృశించి మలినమైయున్న కేశములతోను శరీరముతోను ఉత్తమపవి(త్రమూర్తిగానున్నది యని పలికెను.

శ్లో॥ తతో దృష్టేతి వచనం మహార్థ మమృతోపమమ్ ।
నిశమ్య మారుతే స్సర్వే ముదితా వానరా భవన్ ॥ 40

పదచ్ఛేదము :– తతః – దృష్టా – ఇతి – వచనం – మహార్థమ్ – అమృతోపమమ్ – నిశమ్య – మారుతేః – సర్వే – ముదితాః – వానరాః – అభవన్ ॥

అన్వయక్రమము :– తతః మారుతేః దృష్టా ఇతి మహార్థం అమృతోపమం వచనం నిశమ్య వానరాః సర్వే ముదితాః అభవన్.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, మారుతేః = హనుమనుండి, దృష్టా = చూడబడినది, ఇతి = అనెడు, మహార్థం = గొప్పయర్థముగలదియును, అమృతోపమం = అమృతతుల్యమైనదియును అగు, వచనం = మాటను, నిశమ్య = విని, వానరాః = వానరులు, సర్వే = అందఱును, ముదితాః = సంతోషమునొందినవారు, అభవన్ = అయిరి.

తాత్పర్యము :– హనుమంతుని నోటినుండి 'చూడబడినది'యనెడు మహార్థపూర్ణమైన అమృతము వంటి ఆ మాటను వినగనే వానరులెల్లరును మహానందము నొందిరి.

శ్లో॥ క్ష్వేళం త్యన్యే నదం త్యన్యే గర్జం త్యన్యే మహాబలాః ।
చక్రుః కిలకిలా మన్యే ప్రతిగర్జంతి చాపరే ॥ 41

పదచ్ఛేదము :– క్ష్వేళంతి – అన్యే – నదంతి – అన్యే – గర్జంతి – అన్యే – మహాబలాః, చక్రుః – కిలకిలామ్ – అన్యే – ప్రతిగర్జంతి – చ – అపరే ॥

ప్రతిపదార్థము :– అన్యే క్ష్వేళంతి = కొందఱు సింహగర్జనము చేయుచుండిరి. మహాబలాః = గొప్పబలముగల, అన్యే = కొందఱు, గర్జంతి = గర్జించుచుండిరి, అన్యే = మఱికొందఱు, కిలకిలాం = కిలకిలారావమును, చక్రుః = చేసిరి. అపరే = మఱికొందఱు, ప్రతిగర్జంతి చ = బదులుగా గర్జనము చేయుచుండిరి.

తాత్పర్యము :– ఆనందనిమగ్నులైన ఆ వానరులు కొందరు సింహనాదములు చేయుచుండిరి. మరికొందరు బిగ్గరగా యఱుచుచుండిరి. బలాఢ్యులైన మఱికొందరు మేఘములవలె ఉఱుముచుండిరి. కొందరు ఉల్లాసముతో కిలకిలారావములు చేయుచుండిరి. మఱికొందరు ఎదుటివాని గర్జనకు బదులుగా ఇంకను బిగ్గఱగా గర్జించుచుండిరి.

శ్లో॥ కేచి దుచ్ఛ్రితలాంగూలాః ప్రహృష్టాః కపికుంజరాః ।
అంచితాయతదీర్ఘాణి లాంగూలాని ప్రవివ్యథుః ॥ 42

పదచ్ఛేదము :- కేచిత్ - ఉచ్ఛ్రితలాంగూలాః - ప్రహృష్టాః - కపికుంజరాః, అంచితాయతదీర్ఘాణి - లాంగూలాని - ప్రవివ్యథుః ॥

అన్వయక్రమము :- కేచిత్ ప్రహృష్టాః కపికుంజరాః ఉచ్ఛ్రితలాంగూలాః (సంతః) అంచితాయతదీర్ఘాణి లాంగూలాని ప్రవివ్యథుః.

ప్రతిపదార్థము :- కేచిత్ = కొంతమంది, ప్రహృష్టాః = మిక్కిలి హర్షమునొందిన, కపికుంజరాః = వానరశ్రేష్ఠులు, ఉచ్ఛ్రితలాంగూలాః (సంతః) = ఉన్నతమైన వాలములు గలవారై, అంచితాయతదీర్ఘాణి = సుందరములును, స్థూలములును, దీర్ఘములును అగు, లాంగూలాని = తోకలను, ప్రవివ్యథుః = కొట్టుచుండిరి.

తాత్పర్యము :- మహానందము నొందుచున్న కొందఱు వానరవీరులు అత్యున్నతముగను సుందరముగను స్థూలముగను పొడవుగను ఉన్న తమ తోకలను ఊపుచు నేలపై కొట్టుచుండిరి.

శ్లో॥ అపరే చ హనూమంతం వానరా వారణోపమమ్ ।
ఆప్లుత్య గిరిశృంగేభ్య స్సంస్పృశంతి స్మ హర్షితాః ॥ 43

పదచ్ఛేదము :- అపరే - చ - హనూమంతం - వానరాః - వారణోపమమ్, ఆప్లుత్య - గిరిశృంగేభ్యః - సంస్పృశంతి - స్మ - హర్షితాః ॥

అన్వయక్రమము :- అపరాః వానరాః హర్షితాః గిరిశృంగేభ్యః ఆప్లుత్య వారణోపమం హనూమంతం సంస్పృశంతి స్మ.

ప్రతిపదార్థము :- అపరే = మఱికొందరు, వానరాః = వానరులు, హర్షితాః = సంతోషము నొందినవారై, గిరిశృంగేభ్యః = గిరిశిఖరములనుండి, ఆప్లుత్య = దుమికి, వారణోపమం = ఏనుగుతో సమానుడైయున్న, హనూమంతం = హనుమను, సంస్పృశంతి స్మ = ముట్టుకొనుచుండిరి.

తాత్పర్యము :- మఱికొందరు వానరులు ఆనందాతిశయముతో కొండకోనలనుండి క్రిందికి దూకి వచ్చి గజరాజసన్నిభుడైన హనుమయొడలిని తమ చేతితో నిమురుచుండిరి.

శ్లో॥ ఉక్తవాక్యం హనూమంత మంగద స్తమథాబ్రవీత్ ।
సర్వేషాం హరివీరాణాం మధ్యే వాచ మనుత్తమామ్ ॥ 44

పదచ్ఛేదము :- ఉక్తవాక్యం - హనూమంతమ్ - అంగదః - తమ్ - అథ - అబ్రవీత్, సర్వేషాం - హరివీరాణాం - మధ్యే - వాచమ్ - అనుత్తమామ్ ॥

అన్వయక్రమము :– అథ ఉక్తవాక్యం తం హనూమంతం హరివీరాణాం సర్వేషాం మధ్యే అంగదః అనుత్తమాం వాచమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, హరివీరాణాం = వానరుల, సర్వేషాం = ఎల్లరియొక్క, మధ్యే = నడుమ, అంగదః = అంగదుడు, ఉక్తవాక్యం = పలికిన మాటలుగల, హనూమంతం = హనుమంతునిగూర్చి, అనుత్తమాం = అత్యుత్తమమైనట్టి, వాచం = మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :– హనుమంతుడు చెప్పిన మాటలను విని ఆ వానరవీరుల నడుమనున్న అంగదు డా హనుమనుజూచి ఈ మంచి మాటలను పలికెను.

శ్లో॥ సత్త్వే వీర్యే న తే కశ్చిత్ సమో వానర విద్యతే ।
య దవప్లుత్య విస్తీర్ణం సాగరం పున రాగతః ॥ 45

పదచ్ఛేదము :– సత్త్వే – వీర్యే – న – తే – కశ్చిత్ – సమః – వానర – విద్యతే, యత్ – అవప్లుత్య – విస్తీర్ణం – సాగరం – పునః – ఆగతః ॥

అన్వయక్రమము :– వానర! సత్త్వే వీర్యే తే సమః కశ్చిత్ న విద్యతే, యత్ విస్తీర్ణం సాగరమ్ అవప్లుత్య పునః ఆగతః (అపి).

ప్రతిపదార్థము :– వానర! = ఓ వానరశ్రేష్ఠుడా!, సత్త్వే = బలమునందును, వీర్యే = పరాక్రమమునందును, తే = నీకు, సమః = సమానుడు, కశ్చిత్ = ఒక్కడును, న విద్యతే = ఉండడు, యత్ = ఎందువల్లననగా, విస్తీర్ణం = విశాలమైన, సాగరం = సముద్రమును, అవప్లుత్య = దాటి, పునః = తిరిగి, ఆగతః (అసి) = వచ్చినవాడవైతివి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– 'విస్తీర్ణం సాగరమ్ అవప్లుత్య పునః ఆగతః' అనుటచే అంగదునితో సహితముగా నీకు సాటియైన వానరుడు లేడు అనియును 'విస్తీర్ణం సాగరమ్ అవప్లుత్య' అనునంతవఱకును అంగదుని విడచి ఏ వానరుడును నీకు సాటి రాడనియు సూచింపబడినది.

తాత్పర్యము :– వానరవీరుడా! అతివిశాలమైన మహాసాగరము నవలీలగ దాటి తిరిగి వచ్చినట్టి నీకు బలమునందుగాని పరాక్రమమునందుగాని సాటివచ్చువాడు ఎవ్వడును లేడు సుమా!

శ్లో॥ జీవితస్య ప్రదాతా న స్త్వ మేకో వానరోత్తమ ।
త్వత్ప్రసాదా త్సమేష్యామ స్సిద్ధార్థా రాఘవేణ తు ॥ 46

సూచన :– ఈ శ్లోకము బొంబాయి ప్రతినుండి గ్రహింపబడినది. ఇది దక్షిణదేశ ప్రతులలో లేదు.

పదచ్ఛేదము :– జీవితస్య – ప్రదాతా – నః – త్వం – ఏకః – వానరోత్తమ – త్వత్ప్రసాదాత్ – సమేష్యామః – సిద్ధార్థాః – రాఘవేణ – తు ॥

అన్వయక్రమము :– వానరోత్తమ! త్వమ్ ఏకః నః జీవితస్య ప్రదాతా, త్వత్ప్రసాదాత్ సిద్ధార్థాః (సంతః) రాఘవేణ సమేష్యామః.

ప్రతిపదార్థము :– వానరోత్తమ! = వానరశ్రేష్ఠుడా!, త్వం = నీవు, ఏకః = ఒక్కడవు, నః = మాకు, జీవితస్య ప్రదాతా = జీవితముయొక్క దాతవు, త్వత్ప్రసాదాత్ = నీ దయవలన, సిద్ధార్థాః (సంతః) = చరితార్థులమై, రాఘవేణ = శ్రీరామునితో, సమేష్యామః = కలియగలము.

తాత్పర్యము :– ఓ వానరశ్రేష్ఠుడా! నీవే మా కీనాడు జీవితదానము చేసిన వాడవు. నీ యనుగ్రహమువలననే మేము చరితార్థులమై సంతోషముగా శ్రీరాముని దర్శింప గలుగుచున్నాము.

శ్లో॥ అహో స్వామిని తే భక్తి రహో వీర్య మహో ధృతిః ।
దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామపత్నీ యశస్వినీ
దిష్ట్యా త్యక్ష్యతి కాకుత్థ్సః శోకం సీతావియోగజమ్ ॥ 47

పదచ్ఛేదము :– అహో – స్వామిని – తే – భక్తిః – అహో – వీర్యమ్ – అహో – ధృతిః – దిష్ట్యా – దృష్టా – త్వయా – దేవీ – రామపత్నీ – యశస్వినీ – దిష్ట్యా – త్యక్ష్యతి – కాకుత్థ్సః – శోకం – సీతావియోగజమ్ ॥

అన్వయక్రమము :– తే స్వామిని భక్తిః అహో! వీర్యం అహో! ధృతిః అహో! దిష్ట్యా యశస్వినీ దేవీ రామపత్నీ త్వయా దృష్టా! దిష్ట్యా కాకుత్థ్సః సీతావియోగజం శోకం త్యక్ష్యతి.

ప్రతిపదార్థము :– తే = నీకు, స్వామిని = ప్రభువునందు, భక్తిః = భక్తి, అహో = ఎంత గొప్పదో, వీర్యం = పరాక్రమము, అహో = ఎంత గొప్పదో, ధృతిః = ధైర్యము, అహో! = ఆశ్చర్యకరమైనది! దిష్ట్యా = భాగ్యవశమున, యశస్వినీ = కీర్తిమంతురాలును, దేవీ = మహనీయురాలును అగు, రామపత్నీ = శ్రీరాముని ధర్మపత్ని, త్వయా = నీచేత, దృష్టా = చూడబడినది, దిష్ట్యా = అదృష్టవశమున, కాకుత్థ్సః = శ్రీరాముడు, సీతావియోగజం = జానకీవియోగమువలన గలిగినట్టి, శోకం = దుఃఖమును, త్యక్ష్యతి = విడువగలడు.

తాత్పర్యము :– ఓ వానరోత్తమా! నీ ప్రభుభక్తిని ఏమని కీర్తింపగలము. ఆహా! నీ పరాక్రమ మెంత గొప్పది. నీ ధైర్య మెంత యద్భుతమైనది. మా యందఱి అదృష్టముచేత పూజ్యురాలైన శ్రీరాముని ప్రియురాలిని నీవు కనుగొనగల్గితివి. మన అదృష్టవశమున నేటితో ఆ రఘుపుంగవుడు సీతావియోగజనితమైన శోకమును విడిచి పెట్టగలడుగదా!

శ్లో॥ త తో ఉంగదం హనూమంతం జాంబవంతం చ వానరాః ।
పరివార్య ప్రముదితా భేజిరే విపులా శ్శిలాః ॥ 48

శ్లో॥ శ్రోతుకామా స్సముద్రస్య లంఘనం వానరోత్తమాః ।
దర్శనం చాపి లంకాయా స్సీతాయా రావణస్య చ ॥ 49

శ్లో॥ తస్థుః ప్రాంజలయ స్సర్వే హనూమద్వదనోన్ముఖాః ॥ 50

పదచ్ఛేదము :– తతః – అంగదం – హనూమంతం – జాంబవంతం – చ – వానరాః, పరివార్య – ప్రముదితాః – భేజిరే – విపులాః – శిలాః, శ్రోతుకామాః – సముద్రస్య – లంఘనం – వానరోత్తమాః, దర్శనం – చ – అపి – లంకాయాః – సీతాయాః – రావణస్య – చ, తస్థుః – ప్రాంజలయః – సర్వే – హనుమద్వదనోన్ముఖాః ॥

అన్వయక్రమము :– తతః ప్రముదితాః వానరాః అంగదం హనూమంతం జాంబవంతం చ పరివార్య విపులాః శిలాః భేజిరే, వానరోత్తమాః సముద్రస్య లంఘనం లంకాయాః రావణస్య చ దర్శనం చ అపి శ్రోతుకామాః సర్వే హనుమద్వదనోన్ముఖాః ప్రాంజలయః తస్థుః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, ప్రముదితాః = సంతోషము నొందిన, వానరాః = వానరులు, అంగదం = అంగదుని, హనూమంతం = హనుమను, జాంబవంతం = జాంబవంతుని, పరివార్య = చుట్టును జేరి, విపులాః = విశాలములైన, శిలాః = శిలలను, భేజిరే = ఆశ్రయించిరి. వానరోత్తమాః = వానరశ్రేష్ఠులు, సముద్రస్య = సముద్రముయొక్క, లంఘనం = దాటుటను, లంకాయాః = లంకయొక్కయు, సీతాయాః = సీతయొక్కయు, రావణస్య చ = రావణునియొక్కయు, దర్శనం చాపి = దర్శనమునుగూర్చియు, శ్రోతుకామాః = వినగోరినవా రగుచు, సర్వే = ఎల్లరను, హనుమద్వదనోన్ముఖాః = హనుమముఖమునకే ఎదురుగ నున్నవారై, ప్రాంజలయః = దోసిలి యొగ్గినవారై, తస్థుః = ఉండిరి.

తాత్పర్యము :– అప్పుడు సంతోషాతిశయముతోనున్న యా వానరులు అంగదుని, హనుమంతుని, జాంబవంతుని చుట్టును జేరి యచటి విశాలమైన ఱాతిబండలపై

కూర్చుండిరి. ఆ వానరులు సముద్రలంఘనమును గూర్చియు లంకాగమనమును గూర్చియును సీతాసందర్శనమును గూర్చియును, రావణ సమాగమమును గూర్చియును వివరముగా తెలిసికొనగోరి హనుమ ముఖముపై చూపులు నిలిపి, చేతులు జోడించి యాతని వచనములను విను కుతూహలముతో వేచియుండిరి.

శ్లో॥ తస్థౌ తత్రాంగద శ్రీమాన్ వానరైర్బహుభి ర్వృతః ।
ఉపాస్యమానో విబుధై ర్దివి దేవపతిర్యథా ॥ 51

పదచ్ఛేదము :– తస్థౌ – తత్ర – అంగదః – శ్రీమాన్ – వానరైః – బహుభిః – వృతః, ఉపాస్యమానః – విబుధైః – దివి – దేవపతిః – యథా ॥

అన్వయక్రమము :– తత్ర బహుభిః వానరైః వృతః శ్రీమాన్ అంగదః దివి విబుధైః ఉపాస్యమానః దేవపతిః యథా తస్థౌ.

ప్రతిపదార్థము :– తత్ర = అచ్చట, బహుభిః = పెక్కుమంది, వానరైః = వానరులచే, వృతః = చుట్టుకొనబడియున్న, శ్రీమాన్ = మహాశోభాసంపన్నుడైన, అంగదః = అంగదుడు, దివి = స్వర్గమునందు, విబుధైః = దేవతలచే, ఉపాస్యమానః = సేవింపబడుచున్నట్టి, దేవపతిః యథా = దేవేంద్రునివలె, తస్థౌ = ఉండెను.

తాత్పర్యము :– ఆ మహేంద్రపర్వతముపై ఎదుట హనుమయు జాంబవంతుడును చుట్టును వానరవీరు లనేకులును కొలువుదీరియుండగా రాజశోభతో వెలుగొందు యువరాజైన అంగదుడప్పుడు స్వర్గలోకమునందు దేవగణములచే సేవింపబడు మహేంద్రునివలెనే వెలయుచుండెను.

శ్లో॥ హనూమతా కీర్తిమతా యశస్వినా
తథాంగదే నాంగదబద్ధబాహునా ।
ముదా తదా ఽధ్యాసిత మున్నతం మహ
న్మహీధరాగ్రం జ్వలితం శ్రియాఽ భవత్ ॥ 52

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"ప్రతిప్రయాణోత్పతనం" నామ
సప్తపంచాశస్సర్గః.

పదచ్ఛేదము :– హనూమతా – కీర్తిమతా – యశస్వినా, తథా – అంగదేన – అంగదబద్ధబాహునా, ముదా – తదా – అధ్యాసితం – ఉన్నతం – మహత్,

మహీధరాగ్రం - జ్వలితం - శ్రియా - అభవత్ ॥

అన్వయక్రమము :- కీర్తిమతా హనుమతా తథా అంగదబద్ధబాహునా యశస్వినా అంగదేన ముదా అధ్యాసితం ఉన్నతం మహత్ తత్ మహీధరాగ్రం తదా శ్రియా జ్వలితమ్ అభవత్.

ప్రతిపదార్థము :- కీర్తిమతా = కీర్తిసంపన్నుడైన, హనూమతా = హనుమంతుని చేతను, తథా = అట్లే, యశస్వినా = యశోవంతుడైన, అంగదబద్ధబాహునా = భుజకీర్తులచే గట్టబడిన భుజములు కల్గినట్టి, అంగదేన = అంగదునిచేతను, ముదా = సంతోషముతో, అధ్యాసితం = ఆశ్రయించబడినట్టి, ఉన్నతం = ఎత్తైనట్టి, మహత్ = గొప్పదైనట్టి, (తత్) మహీధరాగ్రం = ఆ పర్వతశిఖరము, తదా = అప్పుడు, శ్రియా = శోభతో, జ్వలితం = వెల్గొందుచున్నట్టిది, అభవత్ = అయెను.

తాత్పర్యము :- మహాకీర్తిని సంపాదించియున్న హనుమంతుడును అట్లే యువరాజపదవిచే లబ్ధప్రతిష్ఠుడై భుజకీర్తులతో వెలయుచున్న అంగదుడును ఆ మహేంద్రగిరి శిఖరాగ్రమున మహాసంతోషముతో కలిసి కూర్చుండియుండగా వారితో గూడిన ఆ గిరిశిఖర మద్భుతమైన శోభతో వెలుగొందుచుండెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"ప్రతిప్రయాణోత్పతనము" అను
ఏబదియేడవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

అష్టపంచాశసర్గ

శ్లో॥ తత స్తస్య గిరేః శృంగే మహేంద్రస్య మహాబలాః ।
హనుమత్ప్రముఖాః ప్రీతిం హరయో జగ్ము రుత్తమామ్ ॥ 1

పదచ్ఛేదము :- తతః - తస్య - గిరేః - శృంగే - మహేంద్రస్య - మహాబలాః, హనుమత్ప్రముఖాః - ప్రీతిం - హరయః - జగ్ముః - ఉత్తమామ్ ॥

అన్వయక్రమము :- తతః తస్య మహేంద్రస్య గిరేః శృంగే మహాబలాః హనుమత్ప్రముఖాః హరయః ఉత్తమాం ప్రీతిం జగ్ముః.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, తస్య = ఆ, మహేంద్రస్య గిరేః = మహేంద్ర పర్వతము యొక్క, శృంగే = శిఖరమునందు, మహాబలాః = గొప్పబలవంతులైన, హనుమత్ప్రముఖాః = హనుమంతుడు మొదలుగా గల్గినట్టి, హరయః = వానరులు, ఉత్తమాం = ఉత్తమమైన, ప్రీతిం = సంతోషమును, జగ్ముః = పొందిరి.

తాత్పర్యము :- అటు పిమ్మట మహేంద్రపర్వత శిఖరమునందు మహాబలాఢ్యుడైన హనుమ మున్నగు వానరవీరులందరును చిరకాలమునకు కలసికొని అమితమైన ఆనందము నొందిరి.

శ్లో॥ తం తతః ప్రీతిసంహృష్టః ప్రీతిమంతం మహాకపిమ్ ।
జాంబవా న్కార్యవృత్తాంత మపృచ్ఛ దనిలాత్మజమ్ ॥ 2

పదచ్ఛేదము :- తం - తతః - ప్రీతిసంహృష్టః - ప్రీతిమంతం - మహాకపిమ్, జాంబవాన్ - కార్యవృత్తాంతమ్ - అపృచ్ఛత్ - అనిలాత్మజమ్ ॥

అన్వయక్రమము :- తతః జాంబవాన్ ప్రీతిసంహృష్టః (సన్) తం ప్రీతిమంతం మహాకపిమ్ అనిలాత్మజం కార్యవృత్తాంతమ్ అపృచ్ఛత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, జాంబవాన్ = జాంబవంతుడు, ప్రీతిసంహృష్టః (సన్) = ప్రేమతో మిక్కిలి సంతోషించుచున్నవాడై, ప్రీతిమంతం = సంతోషము గలిగియున్న, మహాకపిం = వానరశ్రేష్ఠుడగు, తం = ఆ, అనిలాత్మజం =

వాయునందనుని, కార్యవృత్తాంతం = (చేసిన) పనివిషయమును గూర్చి, అపృచ్ఛత్= అడిగెను.

తాత్పర్యము :– అంతట జాంబవంతుడు హనుమంతునిపై అమితమైన అనురాగము గల్గిన మనస్సుతో, తమను కలిసికొని ఆనందభరితుడైయున్న వాయునందనుని జూచి ఆతడు సాధించుకొని వచ్చిన సీతాదర్శనాది విషయముల వివరమును గూర్చి ప్రశ్నించెను.

శ్లో॥ కథం దృష్టా త్వయా దేవీ కథం వా తత్ర వర్తతే ।
తస్యాం వా స కథం వృత్తః క్రూరకర్మా దశాననః ॥ 3

పదచ్ఛేదము :– కథం – దృష్టా – త్వయా – దేవీ – కథం – వా – తత్ర – వర్తతే – తస్యాం – వా – సః – కథం – వృత్తః – క్రూరకర్మా – దశాననః ॥

అన్వయక్రమము :– త్వయా దేవీ కథం దృష్టా? తత్ర కథం వా వర్తతే ? సః క్రూరకర్మా దశాననః వా తస్యాం కథం వృత్తః?

ప్రతిపదార్థము :– త్వయా = నీచేత, దేవీ = పూజ్యురాలైన సీత, కథం = ఎట్లు, దృష్టా = చూడబడినది? తత్ర = ఆ లంకయందు, కథం వా = ఎట్లుగా, వర్తతే = మెలగుచున్నది? సః = ఆ, క్రూరకర్మా = క్రూరాత్ముడైన, దశాననః వా = రావణుడు, తస్యాం = ఆమెయందు, కథం వృత్తః = ఎట్టి వర్తనముగలవాడై యున్నాడు?

తాత్పర్యము :– ఆ లంకయందు సీతాదేవిని నీవెట్లు చూడగలిగినావు? పూజ్యురాలైన ఆ సీతాదేవి ఆ లంకలో ఎట్లు జీవించుచున్నది? క్రూరచర్యలు గల రావణుడు సీతాదేవి యెడ ఎట్లుగా వర్తించుచున్నాడు?

శ్లో॥ తత్త్వత స్సర్వ మేత న్నః ప్రబ్రూహి త్వం మహాకపే!
సంమార్గితా కథం దేవీ కిం చ సా ప్రత్యభాషత? ॥
శ్రుతార్థా శ్చింతయిష్యామో భూయః కార్యవినిశ్చయమ్ ॥ 4

సూచన :– ఇందలి రెండవ పంక్తి కొన్ని ప్రతులలో కానవచ్చుట లేదు.

పదచ్ఛేదము :– తత్త్వతః – సర్వమ్ – ఏతత్ – నః – ప్రబ్రూహి – త్వం – మహాకపే, సంమార్గితా – కథం – దేవీ – కిం – చ – సా – ప్రత్యభాషత, శ్రుతార్థాః – చింతయిష్యామః – భూయః – కార్యవినిశ్చయమ్ ॥

అన్వయక్రమము :– మహాకపే! దేవీ కథం సంమార్గితా? సా కిం ప్రత్యభాషత చ?

ఏతత్ సర్వం నః త్వం తత్త్వతః ప్రబ్రూహి, శ్రుతార్థాః భూయః కార్యవినిశ్చయం చింతయిష్యామః.

ప్రతిపదార్థము :- మహాకపే! = వానరోత్తముడా! దేవీ = పూజ్యురాలైన సీత, కథం = ఎట్లు, సంమార్గితా = వెదుకబడినది? సా = ఆమె, కిం = ఏమి, ప్రత్యభాషత = బదులు చెప్పినది? ఏతత్ = ఇది, సర్వం = అంతయును, నః = మాకు, త్వం = నీవు, తత్త్వతః = ఉన్నది యున్నట్లుగా, ప్రబ్రూహి = వివరముగ చెప్పుము. శ్రుతార్థాః = వినిన విషయముగలవారమై, భూయః = తిరిగి, కార్యవినిశ్చయం = కర్తవ్యముయొక్క నిర్ణయమును గూర్చి, చింతయిష్యామః = ఆలోచింపగలము.

తాత్పర్యము :- ఓ వానరోత్తమా! లంకలో నీవు సీతాదేవిని ఎట్లు వెదక గలిగితివి? ఆమె తన ప్రతివచనముగా ఏమి చెప్పినది? ఇది యంతయును నీవు మాకు వివరముగా ఉన్నది యున్నట్లు తెలుపుము. ఆ విషయములన్నియును వినిన పిమ్మట అనంతర కర్తవ్యమును గూర్చి ఆలోచించుదుము.

శ్లో॥ యశ్చార్థ స్తత్ర వక్తవ్యో గతై రస్మాభి రాత్మవాన్ ।
రక్షితవ్యం చ య త్తత్ర త ద్భవాన్ వ్యాకరోతు నః ॥ 5

పదచ్ఛేదము :- యః - చ - అర్థః - తత్ర - వక్తవ్యః - గతైః - అస్మాభిః - ఆత్మవాన్, రక్షితవ్యం - చ - యత్ - తత్ర - తత్ - భవాన్ - వ్యాకరోతు - నః॥

అన్వయక్రమము :- తత్ర గతైః అస్మాభిః యః అర్థః వక్తవ్యః, యత్ రక్షితవ్యం చ, ఆత్మవాన్ భవాన్ తత్ నః వ్యాకరోతు.

ప్రతిపదార్థము :- తత్ర = అచ్చటకు, గతైః = వెడలినట్టి, అస్మాభిః = మనచేత, యః = ఏ, అర్థః = విషయము, వక్తవ్యః = చెప్పవలసినదో, యత్ = ఏది, రక్షితవ్యం చ = దాచవలసినదియును అగునో, తత్ = దానిని, ఆత్మవాన్ = బుద్ధిమంతుడవైన, భవాన్ = నీవు, నః = మాకు, వ్యాకరోతు = వివరింపుము.

తాత్పర్యము :- మనము శ్రీరాముని సన్నిధికి వెడలినప్పుడు చెప్పవలసిన విషయములు ఏమియుండునో చెప్పగూడనివి, దాచవలసినవి యేమి యుండునో ఆ విషయములను బుద్ధిమంతుడవై నీవు చక్కగా ఆలోచించి వివరింపుము.

శ్లో॥ స నియుక్త స్తత స్తేన సంప్రహృష్టతనూరుహః ।
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై ప్రత్యభాషత ॥ 6

పదచ్ఛేదము :- సః - నియుక్తః - తతః - తేన - సంప్రహృష్టతనూరుహః -

ప్రణమ్య – శిరసా – దేవ్యై – సీతాయై – ప్రత్యభాషత ॥

అన్వయక్రమము :– తతః తేన నియుక్తః సః సంప్రహృష్టతనూరుహః (సన్) దేవ్యై సీతాయై శిరసా ప్రణమ్య ప్రత్యభాషత.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తేన = ఆ జాంబవంతునిచే, నియుక్తః = నియోగింప బడినవాడైన, సః = ఆ హనుమ, సంప్రహృష్టతనూరుహః = గగురుపాటు చెందిన రోమములు గలవాడై, దేవ్యై = పూజ్యురాలైన, సీతాయై = సీతమ్మకు, శిరసా = శిరస్సుతో, ప్రణమ్య = మ్రొక్కి, ప్రత్యభాషత = బదులు పలికెను.

తాత్పర్యము :– జాంబవంతుడట్లు ప్రశ్నింపగా హనుమ అనందాతిశయముతో ఒడలినిండుగ పులకాంకురములు పొడమగా శిరమువంచి సీతామాతకు మ్రొక్కి బదులు చెప్పుటకు ఆరంభించెను.

శ్లో॥ ప్రత్యక్షమేవ భవతాం మహేంద్రాగ్రా త్ఖ మాప్లుతః ।
ఉదధే ర్దక్షిణం పారం కాంక్షమాణ స్సమాహితః ॥ 7

పదచ్ఛేదము :– ప్రత్యక్షమ్ – ఏవ – భవతాం – మహేంద్రాగ్రాత్ – ఖమ్ – ఆప్లుతః – ఉదధేః – దక్షిణం – పారం – కాంక్షమాణః – సమాహితః ॥

అన్వయక్రమము :– భవతాం ప్రత్యక్షమ్ ఏవ మహేంద్రాగ్రాత్ ఉదధేః దక్షిణం పారం కాంక్షమాణః సమాహితః ఖమ్ ఆప్లుతః.

ప్రతిపదార్థము :– భవతాం = మీ యొక్క, ప్రత్యక్షమ్ ఏవ = సమక్షముననే, మహేంద్రాగ్రాత్ = మహేంద్రగిరి శిఖరమున నుండి, ఉదధేః = సముద్రముయొక్క, దక్షిణం పారం = దక్షిణతీరమును, కాంక్షమాణః = (చేర) గోరుచున్నవాడనై, సమాహితః = ఏకాగ్రచిత్తుడనై, ఖం = ఆకాశమును గూర్చి, ఆప్లుతః = ఎగిరితిని.

తాత్పర్యము :– ఆనాడు మీరందరును జూచుచుండగా మీ సమక్షముననే ఈ మహేంద్రగిరి శిఖరము నుండి సముద్రము ఆవలిగట్టును చేరగోరి అందుకొరకు సన్నద్ధుడనై ఆకసమునకు ఎగిరియుంటిని గదా!

శ్లో॥ గచ్ఛతశ్చ హి మే ఘోరం విఘ్నరూపమి వాభవత్ ।
కాంచనం శిఖరం దివ్యం పశ్యామి సుమనోహరమ్ ॥ 8

శ్లో॥ స్థితం పంథాన మావృత్య మేనే విఘ్నం చ తం నగమ్ ॥ 9

పదచ్ఛేదము :– గచ్ఛతః – చ–హి–మే – ఘోరం – విఘ్నరూపమ్ – ఇవ –

అభవత్ – కాంచనం – శిఖరం – దివ్యం – పశ్యామి – సుమనోహరమ్, స్థితం – పంథానమ్ – ఆవృత్య – మేనే – విఘ్నం – చ – తం – నగమ్ ॥

అన్వయక్రమము :– గచ్ఛతః చ హి మే ఘోరం విఘ్నరూపమ్ ఇవ అభవత్, కాంచనం సుమనోహరం దివ్యం శిఖరం పశ్యామి, పంథానమ్ ఆవృత్య స్థితం తం నగమ్ అహమ్ విఘ్నం మేనే.

ప్రతిపదార్థము :– గచ్ఛతః = పోవుచున్నట్టి, మే = నాకు, ఘోరం = భయంకరమైన, విఘ్నరూపమ్ ఇవ = విఘ్నమువలె, అభవత్ = అయ్యెను, కాంచనం = స్వర్ణమయమైనను, మనోహరం = మిక్కిలి రమణీయమైన, దివ్యం = ఉజ్జ్వలమైన, శిఖరం = పర్వతశృంగమును, పశ్యామి = చూచితిని, పంథానం = మార్గమును, ఆవృత్య = ఆవరించి, స్థితం = ఉన్నట్టి, తం = ఆ, నగం = పర్వతమును, (అహం = నేను), విఘ్నం = అంతరాయముగా, మేనే = తలచితిని.

తాత్పర్యము :– నేనట్లు ఆకాశమున ఎగురుచుండగా ఒక భయంకరమైన విఘ్నము సంభవించినది. ఎదుట స్వర్ణమయమైన అతి రమణీయమైన ఒక పర్వత శిఖరము నా మార్గమునకు అడ్డముగ నిలచి యుండెను. ఆ పర్వతమును జూచి దానిని నాకొక పెద్ద విఘ్నముగా భావించితిని.

శ్లో॥ ఉపసంగమ్య తం దివ్యం కాంచనం నగసత్తమమ్ ।
కృతా మే మనసా బుద్ధి ర్భేత్తవ్యోఽయం మయేతి చ ॥ 10

పదచ్ఛేదము :– ఉపసంగమ్య – తం – దివ్యం – కాంచనం – నగసత్తమమ్, కృతా – మే – మనసా – బుద్ధిః – భేత్తవ్యః – అయం – మయా – ఇతి – చ ॥

అన్వయక్రమము :– దివ్యం కాంచనం తం నగసత్తమమ్ ఉపసంగమ్య మయా అయం భేత్తవ్యః ఇతి మే మనసా బుద్ధిః కృతా చ.

ప్రతిపదార్థము :– దివ్యం = ఉజ్జ్వలమైనట్టి, కాంచనం = సువర్ణమయమైన, తం = ఆ, నగసత్తమం = పర్వతశ్రేష్ఠమును, ఉపసంగమ్య = సమీపించి, అయం = ఇది, మయా = నాచేత, భేత్తవ్యః = బ్రద్దలు కొట్టవలసినట్టిది, ఇతి చ = అనియును, మే = నాకు, మనసా = మనస్సుచే, బుద్ధిః = ఆలోచనము, కృతా = చేయబడినది.

తాత్పర్యము :– నేను దివ్యమైన ఆ కాంచన పర్వతమును సమీపించి దీని నిప్పుడు బ్రద్దలు గొట్టవలయును కాబోలునని మనస్సునందు ఆలోచించితిని.

శ్లో॥ ప్రహతం చ మయా తస్య లాంగూలేన మహాగిరేః ।
శిఖరం సూర్యసంకాశం వ్యశీర్యత సహస్రధా ॥ 11

పదచ్ఛేదము :– ప్రహతం – చ – మయా – తస్య – లాంగూలేన – మహాగిరేః – శిఖరం – సూర్యసంకాశం – వ్యశీర్యత – సహస్రధా ॥

అన్వయక్రమము :– తస్య మహాగిరేః సూర్యసంకాశం శిఖరం మయా లాంగూలేన ప్రహతం (సత్) సహస్రధా వ్యశీర్యత చ.

ప్రతిపదార్థము :– తస్య = ఆ, మహాగిరేః = మహాపర్వతము యొక్క, సూర్యసంకాశం = సూర్యునితో సమానమైనట్టి, శిఖరం = శృంగము, మయా = నాచేత, లాంగూలేన = వాలముచే, ప్రహతం (సత్) = బ్రద్దలుకొట్టబడినదగుచు, సహస్రధా = వేయి విధములుగా, వ్యశీర్యత చ = ముక్కలైనది కూడను.

తాత్పర్యము :– వెంటనే నేను నా తోకతో ఆ పర్వత శిఖరమును ఒక్క వ్రేటున మోదితిని. దానితో సూర్యసన్నిభమైన ఆ గిరిశిఖరము వేయిముక్కలైనది.

శ్లో॥ వ్యవసాయం చ తం బుద్ధ్వా స హోవాచ మహాగిరిః ।
పుత్రేతి మధురాం వాణీం మనః ప్రహ్లాదయన్నివ ॥ 12

పదచ్ఛేదము :– వ్యవసాయం – చ – తం – బుద్ధ్వా – సః – హ – ఉవాచ – మహాగిరిః, పుత్ర – ఇతి – మధురాం – వాణీం – మనః – ప్రహ్లాదయన్ – ఇవ ॥

అన్వయక్రమము :– తం వ్యవసాయం బుద్ధ్వా సః మహాగిరిః మనః ప్రహ్లాదయన్ ఇవ పుత్ర ఇతి మధురాం వాణీమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :– తం = ఆ, వ్యవసాయం = ప్రయత్నమును, బుద్ధ్వా = తెలిసికొని, సః = ఆ, మహాగిరిః = మహాపర్వతము, మనః = మనస్సును, ప్రహ్లాదయన్ ఇవ = ఆనందింపచేయుచున్నట్లు, పుత్ర = కుమారా, ఇతి = అని, మధురాం = తియ్యనైన, వాణీమ్ = మాటను, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :– ఆ మహాపర్వతము నా ఉద్యమమును తెలుసుకొనుచు నా మనస్సునకు అమితమైన ఆహ్లాదము కలిగించుచు కుమారా! అని తియ్యనైన వచనముతో ఇట్లు పలికెను.

శ్లో॥ పితృవ్యం చాపి మాం విద్ధి సఖాయం మాతరిశ్వనః ।
మైనాకమితి విఖ్యాతం నివసంతం మహోదధౌ ॥ 13

పదచ్ఛేదము :– పితృవ్యం – చ – అపి – మాం – విద్ధి – సఖాయం – మాతరిశ్వనః, మైనాకమ్ ఇతి – విఖ్యాతం – నివసంతం – మహోదధౌ ॥

అన్వయక్రమము :– మాతరిశ్వనః సఖాయం మాం మైనాకమ్ ఇతి విఖ్యాతం మహోదధౌ నివసంతం (తవ) పితృవ్య (ఇతి) అపి చ విద్ధి.

ప్రతిపదార్థము :– మాం = నన్ను, మాతరిశ్వనః = వాయువుయొక్క, సఖాయం = మిత్రునిగను, మహోదధౌ = మహాసాగరమునందు, నివసంతం = నివసించుచున్నట్టి, మైనాకమ్ ఇతి = మైనాకుడని, విఖ్యాతం = ప్రసిద్ధుడైనవానినిగను, తవ = నీకు, పితృవ్యమ్ ఇతి అపి చ = పినతండ్రిని అనియును, విద్ధి = తెలిసికొనుము.

తాత్పర్యము :– నేను మీ తండ్రియైన వాయుదేవునకు మిత్రుడను కాబట్టి నేను నీకు పినతండ్రి నగుదును! ఈ మహాసాగరమున నివసించుచున్న నన్ను మైనాకుడని ఎల్లరును ఎరుగుదురు.

శ్లో॥ పక్షవంతః పురా పుత్ర బభూవుః పర్వతోత్తమాః ।
ఛందతః పృథివీం చేరు ర్బాధమానా స్సమంతతః ॥ 14

పదచ్ఛేదము :– పక్షవంతః – పురా – పుత్ర – బభూవుః – పర్వతోత్తమాః, ఛందతః – పృథివీం – చేరుః – బాధమానాః – సమంతతః ॥

అన్వయక్రమము :– పుత్ర! పురా పర్వతోత్తమాః పక్షవంతః బభూవుః. ఛందతః పృథివీం బాధమానాః సమంతతః చేరుః.

ప్రతిపదార్థము :– పుత్ర = కుమారా! పురా = పూర్వము, పర్వతోత్తమాః = పెద్ద పర్వతములు, పక్షవంతః = రెక్కలుగలవిగా, బభూవుః = ఉండినవి, (తే=అవి) ఛందతః = స్వేచ్ఛగా, పృథివీం = భూమిని, బాధమానాః = బాధించుచున్నవై, సమంతతః = ఎల్లయెడల, చేరుః = చరించినవి.

తాత్పర్యము :– కుమారా! పూర్వకాలమున పెద్ద పర్వతము లన్నియును రెక్కలు గలిగియుండెడివి. అవి అప్పుడు యథేచ్ఛగా లోకులకు బాధ కలిగించుచు భూమిపై నెల్లయెడలను తిరుగుచుండెడివి.

శ్లో॥ శ్రుత్వా నగానాం చరితం మహేంద్రః పాకశాసనః ।
చిచ్ఛేద భగవాన్ పక్షా న్వజ్రే ణైషాం సహస్రశః ॥ 15

పదచ్ఛేదము :– శ్రుత్వా – నగానాం – చరితం – మహేంద్రః – పాకశాసనః – చిచ్ఛేద – భగవాన్ – పక్షాన్ – వజ్రేణ – ఏషాం – సహస్రశః ॥

అన్వయక్రమము :- పాకశాసనః భగవాన్ మహేంద్రః నగానాం చరితం శ్రుత్వా వజ్రేణ ఏషాం పక్షాన్ సహస్రశః చిచ్ఛేద.

ప్రతిపదార్థము :- పాకశాసనః = పాకాసురసంహారియైన, భగవాన్ = పూజ్యుడగు, మహేంద్రః = దేవేంద్రుడు, నగానాం = పర్వతములయొక్క, చరితం = ప్రవర్తనమును, శ్రుత్వా = విని, వజ్రేణ = వజ్రముచే, ఏషాం = ఆ పర్వతముల యొక్క, పక్షాన్ = రెక్కలను, సహస్రశః = వేలముక్కలుగా, చిచ్ఛేద = ఛేదించెను.

తాత్పర్యము :- అప్పుడు దేవేంద్రుడా పర్వతముల ప్రవర్తనమును గూర్చి విని తన వజ్రాయుధముతో ఈ కొండల యొక్క రెక్కలను వేలముక్కలుగా వెదకి వెదకి ఖండించెను.

శ్లో॥ అహం తు మోక్షిత స్తస్మా త్తవ పిత్రా మహాత్మనా ।
మారుతేన తదా వత్స ప్రక్షిప్తోఽస్మి మహార్ణవే ॥ 16

పదచ్ఛేదము :- అహం - తు - మోక్షితః - తస్మాత్ - తవ - పిత్రా - మహాత్మనా - మారుతేన - తదా - వత్స - ప్రక్షిప్తః - అస్మి - మహార్ణవే ॥

అన్వయక్రమము :- వత్స! తదా అహం తు మహాత్మనా తవ పిత్రా మారుతేన మోక్షితః (సన్) మహార్ణవే ప్రక్షిప్తః అస్మి.

ప్రతిపదార్థము :- వత్స = బిడ్డా! తదా = అప్పుడు, అహం తు = నేను మాత్రము, తవ = నీయొక్క, పిత్రా = తండ్రియైన, మహాత్మనా = మహనీయుడగు, మారుతేన = వాయుదేవునిచే, తస్మాత్ = ఆ దేవేంద్రుని నుండి, మోక్షితః (సన్) = విడిపింపబడిన వాడనై, మహార్ణవే = మహాసముద్రమునందు, ప్రక్షిప్తః అస్మి = విసరబడినవాడనైతిని.

తాత్పర్యము :- బిడ్డా! ఆ సమయమున నేను మాత్రము మహాత్ముడైన నీ తండ్రి యగు వాయుదేవునిచే ఆ మహేంద్రుని బారి నుండి రక్షింపబడి ఈ మహా సముద్రమునందు విసరి వేయబడితిని.

శ్లో॥ రామస్య చ మయా సాహ్యే వర్తితవ్య మరిందమ ।
రామో ధర్మభృతాం శ్రేష్ఠో మహేంద్రసమవిక్రమః ॥ 17

పదచ్ఛేదము :- రామస్య - చ - మయా - సాహ్యే - వర్తితవ్యమ్ - అరిందమ, రామః - ధర్మభృతాం - శ్రేష్ఠః - మహేంద్రసమవిక్రమః ॥

అన్వయక్రమము :- అరిందమ! రామస్య సాహ్యే మయా చ వర్తితవ్యమ్, రామః ధర్మభృతాం శ్రేష్ఠః, మహేంద్రసమవిక్రమః చ.

ప్రతిపదార్థము :– అరిందిమ! = ఓ శత్రుసంహారకా! రామస్య = శ్రీరాముని యొక్క, సాహ్యే = సహాయమునందు, మయా చ = నాచేత గూడ, వర్తితవ్యం = వర్తింప వలసినది, (యతః = ఎందువల్లననగా), రామః = శ్రీరాముడు, ధర్మభృతాం = ధార్మికులలో, శ్రేష్ఠః = మేటి, మహేంద్రసమవిక్రమః = దేవేంద్రునితో సమానమైన పరాక్రమము గలవాడు.

తాత్పర్యము :– శ్రీరాముడు ధార్మికులలో నెల్ల శ్రేష్ఠుడు, దేవేంద్రునితో సమానమైన పరాక్రమము గలవాడు. అట్టి శ్రీరాముని కార్యమునందు నేను గూడ సహాయపడుచు పాల్గొనవలసినదే సుమా!

శ్లో॥ ఏత చ్ఛ్రుత్వా వచ స్తస్య మైనాకస్య మహాత్మనః ।
కార్య మావేద్య చ గిరే రుద్యతం చ మనో మమ ॥ 18

పదచ్ఛేదము :– ఏతత్ – శ్రుత్వా – వచః – తస్య – మైనాకస్య – మహాత్మనః – కార్యమ్ – ఆవేద్య – చ – గిరేః – ఉద్యతం – చ – మనః – మమ ॥

అన్వయక్రమము :– మహాత్మనః తస్య మైనాకస్య ఏతత్ వచః శ్రుత్వా మమ కార్యమ్, ఉద్యతం మనః చ గిరేః ఆవేద్య (ప్రస్థితః).

ప్రతిపదార్థము :– మహాత్మనః = మహనీయుడైన, తస్య = ఆ, మైనాకస్య = మైనాకుని యొక్క, ఏతత్ = ఈ, వచః = మాటను, శ్రుత్వా = విని, మమ = నా యొక్క, కార్యం చ = కర్తవ్యమును, ఉద్యతం = ఉద్యుక్తమై యున్న, మనః చ = మనస్సును గూడ, గిరేః = మైనాకగిరికి, ఆవేద్య = తెలిపి, (ప్రస్థితః = బయలుదేరితిని)

తాత్పర్యము :– మహాత్ముడైన ఆ మైనాకుడు ప్రేమతో పలికిన మాటల నాలకించి ఆతనికి నా కర్తవ్యమును గూర్చియు దాని నిర్వహణమున నా మనోనిశ్చయమును గూర్చియు తెలిపి అటనుండి బయలుదేరితిని.

శ్లో॥ తేన చాహ మనుజ్ఞాతో మైనాకేన మహాత్మనా ।
స చా ప్యంతర్హిత శ్శైలో మానుషేణ వపుష్మతా ।
శరీరేణ మహాశైల శ్శైలేన చ మహోదధౌ ॥ 19

పదచ్ఛేదము :– తేన – చ – అహమ్ – అనుజ్ఞాతః – మైనాకేన – మహాత్మనా, సః – చ – అపి – అంతర్హితః – శైలః – మానుషేణ – వపుష్మతా, శరీరేణ – మహాశైలః – శైలేన – చ – మహోదధౌ ॥

అన్వయక్రమము :– మహాత్మనా తేన మైనాకేన అహమ్ అనుజ్ఞాతః, సః శైలః చ

మానుషేణ వపుష్మతా అంతర్హితః, (సః) మహాశైలః శైలేన శరీరేణ మహోదధౌ (స్థితః).

ప్రతిపదార్థము :- మహాత్మనా = మహనీయుడైనట్టి, తేన = ఆ, మైనాకేన = మైనాకునిచే, అహం = నేను, అనుజ్ఞాతః = అనుమతింపబడితిని, సః శైలః చ అపి = ఆ గిరియును గూడ, మానుషేణ = మానవరూపమైన, వపుష్మతా = శరీరముతో, అంతర్హితః = అంతర్ధానమయ్యెను, సః మహాశైలః = ఆ మైనాక మహాపర్వతము, శైలేన = పర్వతరూపమైనట్టి, శరీరేణ = దేహముతో, మహోదధౌ = మహాసాగరము నందు, (స్థితః = ఉండెను).

తాత్పర్యము :- అప్పుడు మహాత్ముడైన ఆ మైనాకుడు ముందునకు సాగిపోవుటకు నాకు అనుమతినిచ్చి మానవరూపముతో నున్న తానుగూడ అంతర్ధానము నొంది వెంటనే పర్వతరూపమైన శరీరముతో ఆ మహాసముద్రమునందు మునిగియుండెను.

శ్లో॥ ఉత్తమం జవ మాస్థాయ శేషం పంథాన మాస్థితః ।
తతోఽహం సుచిరం కాలం వేగే నాభ్యగమం పథి ॥ 20

పదచ్ఛేదము :- ఉత్తమం - జవమ్ - ఆస్థాయ - శేషం - పంథానమ్ - ఆస్థితః - తతః - అహం - సుచిరం - కాలం - వేగేన - అభ్యగమం - పథి ॥

అన్వయక్రమము :- ఉత్తమం జవమ్ ఆస్థాయ (అహం) శేషం పంథానమ్ ఆస్థితః, తతః అహం సుచిరం కాలం పథి వేగేన అభ్యగమమ్.

ప్రతిపదార్థము :- ఉత్తమం = గొప్పదైన, జవం = వేగమును, ఆస్థాయ = పొంది, అహం = నేను, శేషం = మిగిలిన, పంథానం = మార్గమును, ఆస్థితః = పొందితిని, తతః = పిమ్మట, అహం = నేను, వేగేన = వేగముగా, సుచిరం కాలం = చాలకాలము, పథి = మార్గమున, అభ్యగమమ్ = పోయితిని.

తాత్పర్యము :- గొప్పదైన వేగముతో నేను నా మిగిలిన ప్రయాణమునకు పూనుకొంటిని. అది మొదలుకొని నేను చిరకాలము ఆకాశమార్గమున వేగముగ పయనించితిని.

శ్లో॥ తతః పశ్యా మ్యహం దేవీం సురసాం నాగమాతరమ్ ।
సముద్రమధ్యే సా దేవీ వచనం మా మభాషత ॥ 21

పదచ్ఛేదము :- తతః - పశ్యామి - అహం - దేవీం - సురసాం - నాగమాతరమ్, సముద్రమధ్యే - సా - దేవీ - వచనం - మామ్ - అభాషత ॥

అన్వయక్రమము :- తతః అహం నాగమాతరం సురసాం దేవీం పశ్యామి, సముద్రమధ్యే సా దేవీ మాం వచనమ్ అభాషత.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, అహం = నేను, నాగమాతరం = నాగులకు మాతయైనట్టి, దేవీం = పూజ్యురాలైనట్టి, సురసాం = సురసను, పశ్యామి = చూచితిని, సముద్రమధ్యే = సముద్రమధ్యమున, సా = ఆ, దేవీ = సురసాదేవి, మాం = నన్ను గూర్చి, వచనం = మాటను, అభాషత = పలికెను.

తాత్పర్యము :– అటుపిమ్మట సముద్రమధ్యమున నాకు నాగమాతయైన సురసాదేవి కాన్పించినది. ఆమె నన్నుజూచి ఈ విధముగ పలికినది.

శ్లో॥ మమ భక్షః ప్రదిష్ట స్త్వ మమరై ర్హరిసత్తమ ।
అత స్త్వాం భక్షయిష్యామి విహిత స్త్వం చిరస్య మే ॥ 22

పదచ్ఛేదము :– మమ – భక్షః – ప్రదిష్టః – త్వం – అమరైః – హరిసత్తమ, అతః – త్వాం – భక్షయిష్యామి – విహితః – త్వం – చిరస్య – మే ॥

అన్వయక్రమము :– హరిసత్తమ! అమరైః త్వం మమ భక్షః ప్రదిష్టః. అతః త్వాం భక్షయిష్యామి, త్వం మే చిరస్య విహితః.

ప్రతిపదార్థము :– హరిసత్తమ = ఓ వానరోత్తమా, త్వం = నీవు, అమరైః = దేవతలచే, మమ = నాకు, భక్షః = ఆహారముగా, ప్రదిష్టః = ఒసగబడితివి, అతః = అందువలన, త్వాం = నిన్ను, భక్షయిష్యామి = భక్షించెదను, త్వం = నీవు, మే = నాకు, చిరస్య = చిరకాలమునకు, విహితః = ఏర్పరుపబడితివి.

తాత్పర్యము :– ఓ వానరశ్రేష్ఠుడా! నిన్ను నాకు అమరులు ఆహారముగా నొసగినారు. కాబట్టి నిన్నిప్పుడే భక్షించెదను. చాలకాలమునకు నాకు నీవు ఆహారముగా సమకూర్చ బడితివి.

శ్లో॥ ఏవ ముక్త స్సురసయా ప్రాంజలిః ప్రణతః స్థితః ।
వివర్ణవదనో భూత్వా వాక్యం చేద ముదీరయమ్ ॥ 23

పదచ్ఛేదము :– ఏవమ్ – ఉక్తః – సురసయా – ప్రాంజలిః – ప్రణతః – స్థితః – వివర్ణవదనః – భూత్వా – వాక్యం – చ – ఇదమ్ – ఉదీరయమ్ ॥

అన్వయక్రమము :– సురసయా ఏవమ్ ఉక్తః ప్రాంజలిః ప్రణతః స్థితః, వివర్ణవదనః భూత్వా ఇదం వాక్యమ్ ఉదీరయమ్.

ప్రతిపదార్థము :– సురసయా = సురసాదేవిచే, ఏవం = ఈరీతిగా, ఉక్తః = చెప్పబడిన వాడనై, ప్రాంజలిః = దోసిలియొగ్గిన వాడనై, ప్రణతః = నమస్కరించుచున్నవాడనై, స్థితః = నిలచితిని, వివర్ణవదనః = పాలిపోయిన ముఖము గలవాడను, భూత్వా =

అయి, ఇదం = ఈ, వాక్యం చ = వచనమును గూడ, ఉదీరయమ్ = పలికితిని.

తాత్పర్యము :– సురసాదేవి ఇట్లు పలుకగనే దోసిలియొగ్గి శిరమువంచి నిలచి వివర్ణమైన వదనముతో ఆమెతో ఈ విధముగా పలికితిని.

శ్లో॥ రామో దాశరథి శ్రీమాన్ ప్రవిష్టో దండకావనమ్ ।
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చ పరంతపః ॥ 24

పదచ్ఛేదము :– రామః – దాశరథిః – శ్రీమాన్ – ప్రవిష్టః – దండకావనం, లక్ష్మణేన – సహ – భ్రాత్రా – సీతయా – చ – పరంతపః ॥

అన్వయక్రమము :– శ్రీమాన్ పరంతపః దాశరథిః రామః భ్రాత్రా లక్ష్మణేన సీతయా చ సహ దండకావనం ప్రవిష్టః.

ప్రతిపదార్థము :– శ్రీమాన్ = శుభలక్షణ సంపన్నుడును, పరంతపః = శత్రునాశకుడును అగు, దాశరథిః = దశరథ పుత్రుడైన, రామః = శ్రీరాముడు, భ్రాత్రా = సోదరుడైన, లక్ష్మణేన = లక్ష్మణునితోడను, సీతయా చ = సీతాదేవి తోడను, సహ = కూడ, దండకావనం = దండకారణ్యమును, ప్రవిష్టః = ప్రవేశించెను.

తాత్పర్యము :– శుభలక్షణ సమన్వితుడును శత్రుమర్దనుడునగు దశరథుని పుత్రుడైన శ్రీరాముడు తన తమ్ముడైన లక్ష్మణుని తోడను, భార్యయైన సీతాదేవితోడను దండకారణ్యమునకు వచ్చెను.

శ్లో॥ తస్య సీతా హృతా భార్యా రావణేన దురాత్మనా ।
తస్యా స్సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్ ॥ 25

పదచ్ఛేదము :– తస్య – సీతా – హృతా – భార్యా – రావణేన – దురాత్మనా – తస్యాః – సకాశం – దూతః – అహం – గమిష్యే – రామశాసనాత్ ॥

అన్వయక్రమము :– తస్య భార్యా సీతా దురాత్మనా రావణేన హృతా, రామశాసనాత్ దూతః (సన్) తస్యాః సకాశం గమిష్యే.

ప్రతిపదార్థము :– తస్య = ఆ శ్రీరాముని యొక్క, భార్యా = భార్యయైనట్టి, సీతా = సీతాదేవి, దురాత్మనా = దుర్మార్గుడైన, రావణేన = రావణునిచే, హృతా = అపహరింపబడినది, రామశాసనాత్ = శ్రీరాముని ఆజ్ఞచే, అహం = నేను, దూతః (సన్) = దూతగానున్నవాడనై, తస్యాః = ఆ సీతాదేవి యొక్క, సకాశం = సమీపమునకు, గమిష్యే = పోయెదను.

తాత్పర్యము :- ఆ శ్రీరాముని భార్యయైన సీతాదేవిని దుర్మార్గుడైన రావణుడు అపహరించినాడు. శ్రీరాముని ఆజ్ఞపై దూతగా నేను ఇప్పుడా సీతాదేవికడకే పోవుచున్నాను.

శ్లో॥ కర్తు మర్హసి రామస్య సాహాయ్యం విషయే సతీ ।
అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్ ।
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే ॥ 26

పదచ్ఛేదము :- కర్తుమ్ - అర్హసి - రామస్య - సాహాయ్యం - విషయే - సతీ, అథవా - మైథిలీం - దృష్ట్వా - రామం - చ - అక్లిష్టకారిణమ్, ఆగమిష్యామి - తే - వక్త్రం - సత్యం - ప్రతిశృణోమి - తే ॥

అన్వయక్రమము :- రామస్య విషయే సతీ (త్వం) (తస్య) సాహాయ్యం కర్తుమ్ అర్హసి, అథవా మైథిలీమ్, అక్లిష్టకారిణం రామం చ దృష్ట్వా తే వక్త్రం ఆగమిష్యామి, తే సత్యం ప్రతిశృణోమి.

ప్రతిపదార్థము :- రామస్య = శ్రీరాముని యొక్క, విషయే = రాజ్యమున, సతీ = ఉన్నదానవై, త్వం = నీవు, (తస్య = అతనికి) సాహాయ్యం = సాయమును, కర్తుం = చేయుటకు, అర్హసి = తగుదువు, అథవా = లేక, మైథిలీం = జానకిని, అక్లిష్టకారిణం = క్లేశములు గల్గింపకుండ కార్యములాచరించునట్టి, రామం చ = శ్రీరాముని గూడ, దృష్ట్వా = చూచి, తే = నీ యొక్క, వక్త్రం = నోటినిగూర్చి, ఆగమిష్యామి = రాగలను, తే = నీకు, సత్యం = యథార్థమును, ప్రతిశృణోమి = వాగ్దానము చేయుచున్నాను.

తాత్పర్యము :- శ్రీరాముని రాజ్యమునందు నివసించుచున్న దానవు కాబట్టి ఆ మహాత్మునకు నీవుగూడ సహాయము చేయవలసి యున్నది. అట్లు కాకపోయినచో ఆ సీతాదేవిని జూచి, మహాత్ముడైన శ్రీరామునకు ఆమె కుశలవార్తను విన్నవించి, త్వరలో నీకు ఆహారముగా నీ నోటికడకు నేనే చేరగలను. శపథపూర్వకముగా నేను సత్యము పలుకుచున్నాను.

శ్లో॥ ఏవ ముక్తా మయా సా తు సురసా కామరూపిణీ ।
అబ్రవీ న్నాతివర్తేత కశ్చి దేష వరో మమ ॥ 27

పదచ్ఛేదము :- ఏవమ్ - ఉక్తా - మయా - సా - తు - సురసా - కామరూపిణీ, అబ్రవీత్ - న - అతివర్తేత - కశ్చిత్ - ఏషః - వరః - మమ ॥

అన్వయక్రమము :- మయా ఏవమ్ ఉక్తా కామరూపిణీ సా సురసా తు అబ్రవీత్,

కశ్చిత్ న అతివర్తేత, ఏషః మమ వరః.

ప్రతిపదార్థము :– ఏవం = ఈ రీతిగా, మయా = నాచే, ఉక్తా = చెప్పబడినదై, కామరూపిణీ = కామరూపురాలైన, సా సురసా తు = ఆ సురస అప్పుడు, అబ్రవీత్ = పలికెను, కశ్చిత్ = ఏ ఒక్కడును, న అతివర్తేత = అతిక్రమింప గూడదు, మమ = నాకు, ఏషః = ఇది, వరః = వరము.

తాత్పర్యము :– నేనిట్లు చెప్పగనే కామరూపిణియైన ఆ సురస వెంటనే ఇట్లు పలికినది. నా కోరిక నెప్పుడును అతిక్రమించుటకు వీలులేదు. ఇది నాకు దైవమొసగిన వరము.

శ్లో॥ ఏవ ముక్త స్సురసయా దశయోజన మాయతః ।
తతో ఉర్ధగుణవిస్తారో బభూ వాహం క్షణేన తు ॥ 28

పదచ్ఛేదము :– ఏవం – ఉక్తః – సురసయా – దశయోజనమ్ – ఆయతః, తతః – అర్ధగుణవిస్తారః – బభూవ – అహం – క్షణేన – తు ॥

అన్వయక్రమము :– సురసయా ఏవమ్ ఉక్తః అహం తతః క్షణేన దశయోజనమ్ ఆయతః అర్ధగుణవిస్తారః బభూవ.

ప్రతిపదార్థము :– సురసయా = సురసచే, ఏవం = ఈరీతిగా, ఉక్తః = చెప్పబడిన వాడనై, అహం = నేను, తతః = పిమ్మట, క్షణేన = క్షణకాలమున, దశయోజనం = పదియామడలు, ఆయతః = పొడవైన వాడను, అర్ధగుణవిస్తారః = సగము లెక్కగల వెడల్పుగలవాడను, బభూవ = అయితిని.

తాత్పర్యము :– సురస ఇట్లు పలుకగనే నేను ఒక్కక్షణములో పది యోజనముల పొడవైన వాడనుగాను, ఐదు యోజనముల వెడల్పయినవాడనుగాను పెరిగిపోయితిని.

శ్లో॥ మత్ప్రమాణాధికం చైవ వ్యాదితం చ ముఖం తయా ।
త ద్దృష్ట్వా వ్యాదితం చాస్యం హ్రస్వం హ్యకరవం వపుః ॥ 29

పదచ్ఛేదము :– మత్ప్రమాణాధికం – చ – ఏవ – వ్యాదితం – చ – ముఖం – తయా – తత్ – దృష్ట్వా – వ్యాదితం – చ – ఆస్యం – హ్రస్వం – హి – అకరవం – వపుః ॥

అన్వయక్రమము :– తయా ముఖం మత్ప్రమాణాధికం ఏవ వ్యాదితమ్, (అహం) తత్ వ్యాదితమ్ ఆస్యం దృష్ట్వా వపుః హ్రస్వమ్ అకరవమ్.

ప్రతిపదార్థము :– తయా = ఆ సురసచే, ముఖం = నోరు, మత్ప్రమాణాధికమ్ ఏవ

= నా ప్రమాణము కంటెను పెద్దదిగనే, వ్యాదితం = తెఱువబడినది, (అహం = నేను) తత్ = ఆ, వ్యాదితం = తెరవబడిన, ఆస్యం = నోటిని, దృష్ట్వా = చూచి, వపుః = శరీరమును, హ్రస్వం = పొట్టిదానినిగా, అకరవమ్ = చేసితిని.

తాత్పర్యము :– వెంటనే ఆ సురస తన నోటిని నా దేహపరిమాణము కంటె పెద్దదిగా చేసికొన్నది. అట్లు తెరచిన యామె నోటిని జూచి వెంటనే నేను నా శరీరమును మిక్కిలి చిన్నదానినిగా చేసికొంటిని.

శ్లో॥ తస్మి న్ముహూర్తే చ తదా బభూ వాంగుష్ఠమాత్రకః ।
అభిప త్యాశు తద్వక్త్రం నిర్గతో ఽహం తతః క్షణాత్ ॥ 30

పదచ్ఛేదము :– తస్మిన్ – ముహూర్తే – చ – తదా – బభూవ – అంగుష్ఠమాత్రకః, అభిపత్య – ఆశు – తద్వక్త్రం – నిర్గతః – అహం – తతః – క్షణాత్ ॥

అన్వయక్రమము :– తదా తస్మిన్ ముహూర్తే అహం అంగుష్ఠమాత్రకః బభూవ, తతః అహం తద్వక్త్రమ్ ఆశు అభిపత్య క్షణాత్ నిర్గతః.

ప్రతిపదార్థము :– తస్మిన్ = ఆ, ముహూర్తే = సమయమునందు, (అహం = నేను) అంగుష్ఠమాత్రకః = బొటనవ్రేలి పరిమాణము గలవాడను, బభూవ = అయితిని, తతః = పిమ్మట, అహం = నేను, తద్వక్త్రం = ఆమెనోటిని, ఆశు = శీఘ్రముగా, అభిపత్య = ప్రవేశించి, క్షణాత్ = క్షణకాలమున, నిర్గతః = వెడలివచ్చితిని.

తాత్పర్యము :– అప్పుడు నేను బొటనవ్రేలి యంతటి పరిమాణముగల శరీరమును ధరించి వెంటనే ఆమె నోటిలోనికి ప్రవేశించి ఒక్క క్షణములో అచటి నుండి వెలుపలికి వచ్చితిని.

శ్లో॥ అబ్రవీ త్సురసా దేవీ స్వేన రూపేణ మాం పునః ।
అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్ ॥ 31

పదచ్ఛేదము :– అబ్రవీత్ – సురసా – దేవీ – స్వేన – రూపేణ – మాం – పునః, అర్థసిద్ధ్యై – హరిశ్రేష్ఠ – గచ్ఛ – సౌమ్య – యథాసుఖమ్ ॥

అన్వయక్రమము :– సురసాదేవీ స్వేన రూపేణ అబ్రవీత్ సౌమ్య హరిశ్రేష్ఠ అర్థసిద్ధ్యై యథాసుఖం గచ్ఛ.

ప్రతిపదార్థము :– సురసాదేవీ = సురసాదేవి, స్వేన రూపేణ = నిజరూపముతో, మాం = నన్నుగూర్చి, పునః = తిరిగి, అబ్రవీత్ = పలికెను, సౌమ్య = సజ్జనుడవైన,

హరిశ్రేష్ఠ = ఓ వానరశ్రేష్ఠుడా! అర్థసిద్ధ్యై = కార్యసిద్ధికొరకై, యథాసుఖం = సుఖముగ, గచ్ఛ = పొమ్ము.

తాత్పర్యము :– అప్పుడు సురసాదేవి తన నిజరూపమును ధరించి నాతో ఇట్లు పలికినది. సౌమ్యుడవైన ఓ వానరశ్రేష్ఠుడా! నీ కార్యమును సిద్ధింప జేసికొనుటకై నీవు సుఖముగా వెడలిరమ్ము. నీ యత్నము సఫలమగుగాక!

శ్లో॥ సమానయ చ వైదేహీం రాఘవేణ మహాత్మనా ।
సుఖీ భవ మహాబాహో ప్రీతాస్మి తవ వానర ॥ 32

పదచ్ఛేదము :– సమానయ – చ – వైదేహీం – రాఘవేణ – మహాత్మనా – సుఖీ – భవ – మహాబాహో! – ప్రీతా – అస్మి – తవ – వానర ॥

అన్వయక్రమము :– మహాత్మనా రాఘవేణ వైదేహీం సమానయ చ, మహాబాహో! సుఖీ భవ, వానర! తవ ప్రీతా అస్మి.

ప్రతిపదార్థము :– వైదేహీం = సీతాదేవిని, మహాత్మనా = మహనీయుడైన, రాఘవేణ = శ్రీరామునితో, సమానయ చ = కలుపుము, మహాబాహో! = ఓ వీరుడా! సుఖీ భవ = సుఖముగలవాడ వగుము, వానర! = ఓ వానరోత్తమా! తవ = నీ అనగా నీయెడల, ప్రీతా అస్మి = సంతుష్టురాల నైతిని.

తాత్పర్యము :– ఓ వానరశ్రేష్ఠుడా! జానకీదేవిని మహాత్ముడైన శ్రీరామునితో జేర్పుము. నీవు నీ పరాక్రమముతో చిరకాలము సుఖముగ నుండుము. ఉత్తమవిక్రముడవైన నీ యెడల నేనెంతయో సంతసించితిని.

శ్లో॥ తతోఽహం సాధు సాధ్వితి సర్వభూతైః ప్రశంసితః ।
తతో ఽంతరిక్షం విపులం ప్లుతోఽహం గరుడో యథా ॥ 33

పదచ్ఛేదము :– తతః – అహం – సాధు – సాధు – ఇతి – సర్వభూతైః – ప్రశంసితః, తతః – అంతరిక్షం – విపులం – ప్లుతః – అహం – గరుడః – యథా ॥

అన్వయక్రమము :– తతః అహం సర్వభూతైః సాధు సాధు ఇతి ప్రశంసితః, తతః అహం గరుడః యథా విపులమ్ అంతరిక్షం ప్లుతః.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, అహం = నేను, సర్వభూతైః = సమస్త భూతములచేతను, సాధు సాధు ఇతి = మేలుమేలని, ప్రశంసితః = ప్రశంసింపబడితిని, తతః = పిమ్మట, అహం = నేను, గరుడః యథా = గరుత్మంతుడువలె, విపులమ్ = విశాలమైనట్టి, అంతరిక్షం = ఆకాశమును గూర్చి, ప్లుతః = ఎగిరితిని.

తాత్పర్యము :– అప్పుడు నన్ను సమస్త భూతములును మేలు మేలని ప్రశంసించినవి. వెంటనే నేను అటనుండి గరుత్మంతునివలె మహావేగముతో ఆకాశమార్గమునకు ఎగసితిని.

శ్లో॥ ఛాయా మే నిగృహీతా చ న చ పశ్యామి కించన ।
సోఽహం విగతవేగస్తు దిశో దశ విలోకయన్ ॥ 34

శ్లో॥ న కించి త్తత్ర పశ్యామి యేన మేఽపహృతా గతిః ॥ 35

పదచ్ఛేదము :– ఛాయా – మే – నిగృహీతా – చ – న – చ – పశ్యామి – కించన, సః – అహం – విగతవేగః – తు – దిశః – దశ – విలోకయన్, న – కించిత్ – తత్ర – పశ్యామి – యేన – మే – అపహృతా – గతిః ॥

అన్వయక్రమము :– మే ఛాయా చ నిగృహీతా, కిం చన న పశ్యామి. విగతవేగః సః అహం దశదిశః విలోకయన్ యేన మే గతిః అపహృతా తత్ అత్ర కించిత్ న చ పశ్యామి.

ప్రతిపదార్థము :– మే = నాయొక్క, ఛాయా చ = నీడయును, నిగృహీతా = పట్టుకొనబడెను, కించన = దేనినిగూడ, న చ పశ్యామి = కానకున్నాను. విగతవేగః = తొలగిన వేగము గల్గినట్టి, సః అహం = ఆ నేను, దశ దిశః = పది దిక్కులును, విలోకయన్ = ఆలోకించుచు, యేన = ఎవనిచే, మే = నా యొక్క, గతిః = గమనము, అపహృతా = అపహరించబడినదో, తత్ = అట్టిదానిని, కించిత్ = దేనినికూడ, తత్ర = అచ్చట, న పశ్యామి = చూడలేకపోయితిని.

తాత్పర్యము :– అప్పుడు నా నీడ ఎవ్వరిచేతనో బలముగా లాగబడినది. ఎవ్వరును నా కచ్చట కాన్పింపకుండిరి. అప్పుడు నా వేగము కట్టుబడిపోవుటచే నేను దశదిశలను పరికించుచు నా గమనమును అడ్డగించినట్టి ఆ భూతమును నేను ఏమియు కనుగొన లేక పోయితిని.

శ్లో॥ తతో మే బుద్ధి రుత్పన్నా కిం నామ గగనే మమ ।
ఈదృశో విఘ్న ఉత్పన్నో రూపం యత్ర న దృశ్యతే ॥ 36

పదచ్ఛేదము :– తతః – మే – బుద్ధిః – ఉత్పన్నా – కిం – నామ – గగనే – మమ, ఈదృశః – విఘ్నః – ఉత్పన్నః – రూపం – యత్ర – న – దృశ్యతే ॥

అన్వయక్రమము :– తతః గగనే యత్ర రూపం న దృశ్యతే సః ఈదృశః విఘ్నః మమ కిం నామ ఉత్పన్నః? ఇతి మే బుద్ధిః ఉత్పన్నా.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, గగనే = ఆకాశమునందు, యత్ర = ఎచ్చటనయితే, రూపం = ఆకారము, న దృశ్యతే = కాన్పించుటలేదో, ఈదృశః = ఇట్టి, విఘ్నః = విఘ్నము, కిం నామ = ఏదో? ఉత్పన్నః = సంభవించినది, ఇతి = అని, మే = నాకు, బుద్ధిః = ఆలోచన, ఉత్పన్నా = కలిగినది.

తాత్పర్యము :- ఈ యాకాశమునందు తన స్వరూపము కాన్పించనట్టి నాకీ విఘ్నమేల తటస్థించినది? అని అప్పుడు నాకు తీవ్రమైన ఆలోచనము కలిగినది.

శ్లో॥ అధోభాగేన మే దృష్టి శ్శోచతా పాతితా మయా ।
తతోఽద్రాక్ష మహం భీమాం రాక్షసీం సలిలేశయామ్ ॥ 37

పదచ్ఛేదము :- అధోభాగేన - మే - దృష్టిః - శోచతా - పాతితా - మయా, తతః - అద్రాక్షమ్ - అహం - భీమాం - రాక్షసీం - సలిలేశయామ్ ॥

అన్వయక్రమము :- శోచతా మయా మే దృష్టిః అధోభాగేన పాతితా, తతః అహం భీమాం సలిలేశయాం రాక్షసీమ్ అద్రాక్షమ్.

ప్రతిపదార్థము :- శోచతా = చింతించుచున్నట్టి, మయా = నాచేత, మే = నాయొక్క, దృష్టిః = చూపు, అధోభాగేన = క్రిందిభాగమున, పాతితా = ప్రసరింపచేయబడినది, తతః = పిమ్మట, అహం = నేను, సలిలేశయాం = నీటియందు శయనించియున్న, భీమాం = భీకరమైన, రాక్షసీమ్ = రాక్షసస్త్రీని, అద్రాక్షమ్ = కనుగొంటిని.

తాత్పర్యము :- అట్లు చింతించుచు నేను క్రిందిభాగమును పరికించి చూచితిని. అచ్చట నీటిలో పరుండియున్న ఒకానొక భీకరమైన రాక్షసస్త్రీ నాకు కానవచ్చినది.

శ్లో॥ ప్రహస్య చ మహానాద ముక్తోఽహం భీమయా తయా ।
అవస్థిత మసంభ్రాంత మిదం వాక్య మశోభనమ్ ॥ 38

పదచ్ఛేదము :- ప్రహస్య - చ - మహానాదమ్ - ఉక్తః - అహం - భీమయా - తయా, అవస్థితమ్ - అసంభ్రాంతమ్ - ఇదం - వాక్యమ్ - అశోభనమ్ ॥

అన్వయక్రమము :- భీమయా తయా మహానాదం ప్రహస్య అవస్థితమ్ అసంభ్రాంతమ్ ఇదమ్ అశోభనం వాక్యమ్ అహమ్ ఉక్తః.

ప్రతిపదార్థము :- భీమయా = భయంకరురాలైనట్టి, తయా = ఆ రాక్షసస్త్రీచే, మహానాదం = పెద్దధ్వని కలుగునట్లు, ప్రహస్య = పెద్దగా నవ్వి, అవస్థితం = ధృఢముగను, అసంభ్రాంతమ్ = బెదురులేకుండను, ఇదమ్ = ఈ, అశోభనం =

అమంగళకరమైన, వాక్యం = వచనమును, అహం = నేను, ఉక్తః = పలుకబడితిని.

తాత్పర్యము :– ఆ మహాభయంకరురాలైన రాక్షసి నన్ను జూచి పెద్ద నవ్వు నవ్వి తానేమియును చలింపక తొట్రుపడక బిగ్గరగా ఈ కఠోరమైన వాక్యమును పలికినది.

శ్లో॥ క్వాసి గంతా మహాకాయ క్షుధితాయా మ మేప్సితః ।
భక్షః ప్రీణయ మే దేహం చిర మాహారవర్జితమ్ ॥ 39

పదచ్ఛేదము :– క్వ – అసి – గంతా – మహాకాయ – క్షుధితాయాః – మమ – ఈప్సితః – భక్షః – ప్రీణయ – మే – దేహం – చిరమ్ – ఆహారవర్జితమ్ ॥

అన్వయక్రమము :– మహాకాయ! క్వ గంతా అసి! క్షుధితాయాః మమ (త్వం) ఈప్సితః భక్షః, చిరమ్ ఆహారవర్జితం మే దేహం ప్రీణయ.

ప్రతిపదార్థము :– మహాకాయ! = గొప్పదైన శరీరము గలవాడా! క్వ = ఎచటికి, గంతా = పోవువాడవు, అసి = అగుచున్నావు? క్షుధితాయాః = ఆకలిగొనియున్న, మమ = నాకు, (త్వం = నీవు) ఈప్సితః = ఇష్టమైనట్టి, భక్షః = ఆహారము. చిరం = చిరకాలము నుండి, ఆహారవర్జితం = ఆహారరహితమైనట్టి, మే = నాయొక్క, దేహం = శరీరమును, ప్రీణయ = సంతోషపెట్టుము.

తాత్పర్యము :– బలిసియున్నట్టి శరీరముగల్గిన ఓ వానరుడా! నీవెచటికి పోయెదవు? ఆకలిగొనియున్న నాకు అభీష్టమైన ఆహారముగా లభించియున్నావు. కాబట్టి చిరకాలము నుండి ఆహారము లేకయున్న నాకు ఆహారముగా వచ్చి నన్ను తృప్తి పరచుము.

శ్లో॥ బాఢ మిత్యేవ తాం వాణీం ప్రత్యగృహ్ణో మహం తతః ।
ఆస్యప్రమాణా దధికం తస్యాః కాయ మపూరయమ్ ॥ 40

పదచ్ఛేదము :– బాఢమ్ – ఇతి – ఏవ – తాం – వాణీం – ప్రత్యగృహ్ణామ్ – అహం – తతః, ఆస్యప్రమాణాత్ – అధికం – తస్యాః – కాయమ్ – అపూరయమ్ ॥

అన్వయక్రమము :– అహం తాం వాణీం బాఢమ్ ఇతి ఏవ ప్రత్యగృహ్ణామ్, తతః కాయం తస్యాః ఆస్యప్రమాణాత్ అధికమ్ అపూరయమ్.

ప్రతిపదార్థము :– అహం = నేను, తాం = ఆ, వాణీం = వచనమును, బాఢం = మంచిది, ఇతి ఏవ = అనియే, ప్రత్యగృహ్ణామ్ = స్వీకరించితిని. తతః = పిమ్మట, కాయం = శరీరమును, తస్యాః = ఆమెయొక్క, ఆస్యప్రమాణాత్ = నోటియొక్క పరిమాణముకంటెను, అధికం = పెద్దదిగా, అపూరయమ్ = పెంచితిని.

తాత్పర్యము :– నే నామె పలికిన మాటను మంచిదే యని అంగీకరించితిని. మరియు నేను వెంటనే నా శరీరమును ఆమె నోటిపరిమాణము కంటెను మిక్కిలి పెద్దదైనట్టి దానినిగా చేసి నిలచితిని.

శ్లో॥ తస్యా శ్చాస్యం మహద్భీమం వర్ధతే మమ భక్షణే ।
న చ మాం సా తు బుబుధే మమ వా నికృతం కృతమ్ ॥ 41

పదచ్ఛేదము :– తస్యాః – చ – ఆస్యం – మహత్ – భీమం – వర్ధతే – మమ – భక్షణే, న – చ – మాం – సా – తు – బుబుధే – మమ – వా – నికృతం – కృతమ్ ॥

అన్వయక్రమము :– మమ భక్షణే మహత్ భీమం తస్యాః ఆస్యం చ వర్ధతే, సా తు మాం చ, కృతం మమ నికృతం వా న బుబుధే.

ప్రతిపదార్థము :– మమ = నా యొక్క, భక్షణే = భక్షించుట నిమిత్తము, మహత్ = గొప్పదైన, భీమం = భయంకరమైన, తస్యాః = ఆమెయొక్క, ఆస్యం చ = నోరుగూడ, వర్ధతే = పెరుగుచుండెను, సా తు = ఆ రాక్షసిమాత్రము, మాం చ = నన్నును, కృతం = చేయబడినట్టి, మమ = నా యొక్క, నికృతం వా = మోసమును గాని, న బుబుధే = గ్రహింపలేదు.

తాత్పర్యము :– నేను నా శరీరము పెంచుచుండగా ఆమెగూడ నన్ను మ్రింగివేయుటకై తన నోటినిగూడ భయంకరముగా పెద్దదిగా చేసికొనుచుండెను. పాపము ఆమె నా శక్తిని గురించి గాని నేను తలపెట్టిన మోసమును గురించిగాని ఏమియు తెలిసికొనలేకపోయెను.

శ్లో॥ తతో ఽహం విపులం రూపం సంక్షిప్య నిమిషాంతరాత్ ।
తస్యా హృదయ మాదాయ ప్రపతామి నభస్థ్సలమ్ ॥ 42

పదచ్ఛేదము :– తతః – అహం – విపులం – రూపం – సంక్షిప్య – నిమిషాంతరాత్, తస్యాః – హృదయమ్ – ఆదాయ – ప్రపతామి – నభఃస్థలమ్ ॥

అన్వయక్రమము :– తతః అహం నిమిషాంతరాత్ విపులం రూపం సంక్షిప్య తస్యాః హృదయమ్ ఆదాయ నభఃస్థలం ప్రపతామి.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, అహం = నేను, నిమిషాంతరాత్ = నిమిషములోపల, విపులం = గొప్పదైనట్టి, రూపం = శరీరమును, సంక్షిప్య = చిన్నదిగచేసి, తస్యాః = ఆ రాక్షసియొక్క, హృదయమ్ = గుండెను, ఆదాయ =

తీసికొని, నభఃస్థలం = గగనతలమును గూర్చి, ప్రపతామి = వెడలిపోయితిని.

తాత్పర్యము :– అప్పుడు నేను ఒక్క నిమిషములో అతివిస్తృతమైన నా శరీరమును మిక్కిలి చిన్నదిగ చేసికొని ఆమె నోటిలో ప్రవేశించి ఆమె గుండెను పెకలించి ఈవలకు వచ్చి ఆకసమున కెగిరి పోయితిని.

శ్లో॥ సా విసృష్టభుజా భీమా పపాత లవణాంభసి ।
మయా పర్వతసంకాశా నికృత్తహృదయా సతీ ॥ 43

పదచ్ఛేదము :– సా – విసృష్టభుజా – భీమా – పపాత – లవణాంభసి – మయా – పర్వతసంకాశా – నికృత్తహృదయా – సతీ ॥

అన్వయక్రమము :– విసృష్టభుజా పర్వతసంకాశా మయా నికృత్తహృదయా సతీ భీమా సా లవణాంభసి పపాత.

ప్రతిపదార్థము :– విసృష్టభుజా = జారిన భుజములు గలదియును, పర్వతసంకాశా = పర్వతమును బోలినదియును, భీమా = భయంకరురాలునగు, సా = ఆరాక్షసి, మయా = నాచేత, నికృత్తహృదయా = ఛేదింపబడిన గుండెకాయగలది, సతీ = అగుచు, సా = ఆ రాక్షసి, లవణాంభసి = లవణసముద్రమునందు, పపాత = కూలెను.

తాత్పర్యము :– నేను తన గుండెను ఛేదించివేయగనే భుజములు జారిపోవగా పెద్ద పర్వతము వంటి ఆకారముగల ఆ భయంకరమైన రాక్షసి ఆ సాగరజలమునందు కూలిపోయినది.

శ్లో॥ శృణోమి ఖగతానాం చ వాచః సౌమ్యా మహాత్మనామ్ ।
రాక్షసీ సింహికా భీమా క్షిప్రం హనుమతా హతా ॥ 44

పదచ్ఛేదము :– శృణోమి – ఖగతానాం – చ – వాచః – సౌమ్యాః – మహాత్మనామ్, రాక్షసీ – సింహికా – భీమా – క్షిప్రం – హనుమతా – హతా ॥

అన్వయక్రమము :– భీమా సింహికా రాక్షసీ క్షిప్రం హనుమతా హతా ఇతి ఖగతానాం మహాత్మనాం సౌమ్యాః వాచః శృణోమి.

ప్రతిపదార్థము :– భీమా = భయంకరమైనట్టి, సింహికా రాక్షసీ = సింహిక యను రక్కసి, క్షిప్రం = స్వల్పకాలములో, హనుమతా = హనుమచే, హతా = చంపబడినది, ఇతి = అనెడు, ఖగతానాం = ఆకాశమున నున్నట్టి, మహాత్మనాం = మహాత్ములయొక్క, సౌమ్యాః = మంచివైన, వాచః = మాటలను, శృణోమి = వింటిని.

తాత్పర్యము :– ఆ రాక్షసి సముద్రములో కూలగనే ఆకసమునందు చరించుచున్న మహాత్ములైన సిద్ధులు మున్నగువారు “ఆహా! మహాభయంకరురాలైన ఈ సింహికా రాక్షసి హనుమంతుని చేతిలో నొక్క తృటిలోనే కడతేరినదిగదా” అని ప్రశంసించుచు పలికిన మాటలు నాకు వినబడినవి.

శ్లో॥ తాం హత్వా పునరే వాహం కృత్య మాత్యయికం స్మరన్ ।
గత్వా చాహం మహాధ్వానం పశ్యామి నగమండితమ్ ॥ 45

శ్లో॥ దక్షిణం తీర ముదధే ర్లంకా యత్ర చ సా పురీ ॥ 46

పదచ్ఛేదము :– తాం – హత్వా – పునః – ఏవ – అహం – కృత్యమ్ – ఆత్యయికం – స్మరన్, గత్వా – చ – అహం – మహాధ్వానం – పశ్యామి – నగమండితమ్, దక్షిణం – తీరమ్ – ఉదధేః – లంకా – యత్ర – చ – సా పురీ ॥

అన్వయక్రమము :– తాం హత్వా పునః ఏవ అహమ్ ఆత్యయికం కృత్యం స్మరన్, మహాధ్వానం గత్వా చ యత్ర సా లంకాపురీ (అస్తి) తం నగమండితమ్ ఉదధేః దక్షిణం తీరం పశ్యామి.

ప్రతిపదార్థము :– తాం = ఆ సింహికను, హత్వా = చంపి, పునః ఏవ = వెంటనే తిరిగి, అహం = నేను, ఆత్యయికం = దారుణమారణమైన, కృత్యం = పనిని, స్మరన్ = తలచుకొనుచు, మహాధ్వానం = గొప్పదైన మార్గమును, గత్వా చ = పోయియును, యత్ర = ఎచ్చటనైతే, సా = ఆ, లంకాపురీ = లంకానగరి, అస్తి = ఉన్నదో, తం = ఆ, నగమండితం = పర్వతముచే అలంకరింపబడినట్టి, ఉదధేః = సముద్రముయొక్క, దక్షిణం = దక్షిణపు, తీరం = తీరమును, పశ్యామి = చూచితిని.

తాత్పర్యము :– ఆ సింహికను సంహరించి తిరిగి తిరిగి దారుణమైన ఆ సంహార కార్యమును గూర్చియే తలచుకొనుచు కడుదూరము పోయి పోయి లంకానగరములో విరాజిల్లుచున్న గొప్పపర్వతముగల దక్షిణసముద్రతీరమును గాంచితిని.

శ్లో॥ అస్తం దినకరే యాతే రక్షసాం నిలయం పురమ్ ।
ప్రవిష్టోఽహ మవిజ్ఞాతో రక్షోభి ర్భీమవిక్రమైః ॥ 47

పదచ్ఛేదము :– అస్తం – దినకరే – యాతే – రక్షసాం – నిలయం – పురమ్, ప్రవిష్టః – అహమ్ – అవిజ్ఞాతః – రక్షోభిః – భీమవిక్రమైః ॥

అన్వయక్రమము :– దినకరే అస్తం యాతే (సతి) భీమవిక్రమైః రక్షోభిః అవిజ్ఞాతః అహం రక్షసాం నిలయం పురం ప్రవిష్టః.

ప్రతిపదార్థము :- దినకరే = సూర్యుడు, అస్తం యాతే (సతి) = అస్తమించగా, భీమవిక్రమైః = భీకరమైన పరాక్రమము గలిగినట్టి, రక్షోభిః = రాక్షసులచే, అవిజ్ఞాతః = తెలియబడనివాడనై, రక్షసాం = రాక్షసులయొక్క, నిలయం = నివాసమైన, పురం = లంకానగరమును, అహం = నేను, ప్రవిష్టః = ప్రవేశించినాడను.

తాత్పర్యము :- ఆ సాగరతీరమును చేరి సూర్యు డస్తమించువరకును వేచియుండి భీకరులైన రాక్షసులకు కంటబడకుండ ఆ రాక్షసనివాసమైన లంకానగరమును ప్రదోష సమయమున ప్రవేశించితిని.

శ్లో॥ తత్ర ప్రవిశత శ్చాపి కల్పాంతఘనసన్నిభా ।
అట్టహాసం విముంచంతీ నారీ కా ప్యుత్థితా పురః ॥ 48

పదచ్ఛేదము :- తత్ర - ప్రవిశతః - చ - అపి - కల్పాంతఘనసన్నిభా, అట్టహాసం - విముంచంతీ - నారీ - కా - అపి - ఉత్థితా - పురః ॥

అన్వయక్రమము :- తత్ర ప్రవిశతః (మమ) పురః కల్పాంతఘనసన్నిభా కాఽపి నారీ అట్టహాసం విముంచంతీ ఉత్థితా.

ప్రతిపదార్థము :- తత్ర = ఆ లంకయందు, ప్రవిశతః = ప్రవేశించుచున్నట్టి, (మమ = నా యొక్క), పురః = ఎదుట, కల్పాంతఘనసన్నిభా = ప్రళయకాల మేఘముతో సమానమైనట్టి, కా అపి = ఒకానొక, నారీ = స్త్రీ, అట్టహాసం = పెద్ద నవ్వును, విముంచంతీ = వెలువరించుచున్నదై, ఉత్థితా = నిలువబడినది.

తాత్పర్యము :- నే నా లంకలో ప్రవేశించుచుండగా ప్రళయకాలమేఘమువంటి మహాభయంకరమైన శరీరముతో దిక్కులు మారుమ్రోగునట్లు బిగ్గరగా నవ్వుచు ఒకానొక స్త్రీ నా కెదురుగ వచ్చి నిలువబడినది.

శ్లో॥ జిఘాంసంతీం తత స్తాం తు జ్వలదగ్నిశిరోరుహామ్ ।
సవ్యముష్టిప్రహారేణ పరాజిత్య సుభైరవామ్ ॥ 49

శ్లో॥ ప్రదోషకాలే ప్రవిశం భీతయా ఽహం త యోదితః ॥ 50

పదచ్ఛేదము :- జిఘాంసంతీం - తతః - తాం - తు - జ్వలదగ్నిశిరోరుహామ్, సవ్యముష్టిప్రహారేణ - పరాజిత్య - సుభైరవామ్, ప్రదోషకాలే - ప్రవిశం - భీతయా - అహం - తయా - ఉదితః ॥

అన్వయక్రమము :- తతః జ్వలదగ్నిశిరోరుహాం, సుభైరవాం జిఘాంసంతీం తాం

సవ్యముష్టిప్రహారేణ పరాజిత్య ప్రదోషకాలే (నగరం) ప్రవిశమ్, భీతయా తయా అహం ఏవమ్ ఉదితః.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, జ్వలదగ్నిశిరోరుహాం = జ్వలించుచున్న అగ్నివంటి తలవెంట్రుకలు గల్గినట్టిదియును, సుభైరవాం = మిక్కిలి భయంకరమైనట్టిదియును, జిఘాంసంతీం = చంపగోరుచున్నదియునగు, తాం = ఆ రాక్షసిని, సవ్యముష్టి ప్రహారేణ = ఎడమ పిడికిటిపోటుతో, పరాజిత్య = ఓడించి, ప్రదోషకాలే = సాయం సమయమున, (నగరం = లంకానగరమును), ప్రవిశమ్ = ప్రవేశించితిని. భీతయా = భయమునొందినట్టి, తయా = ఆ రక్కసిచే, అహం = నేను, (ఏవం = ఇట్లు) ఉదితః = చెప్పబడితిని.

తాత్పర్యము :- అప్పుడు ప్రజ్వలించుచున్న అగ్నిజ్వాలలవంటి తలవెంట్రుకలతో, భీకరమైయున్న రూపముతో నన్ను హతమార్చుటకై మీదికి వచ్చుచున్న ఆ రక్కసిని నా యెడమచేతి పిడికిలిపోటుతో పడగొట్టి ఆ ప్రదోషసమయమునందు నగరములోనికి ప్రవేశింపబోవుచుంటిని. నా విక్రమమునకు అప్పుడామె భయగ్రస్తయై నాతో ఇట్లు పలికినది.

శ్లో॥ అహం లంకాపురీ వీర నిర్జితా విక్రమేణ తే ।
యస్మా త్తస్మా ద్విజేతాసి సర్వరక్షాం స్యశేషతః ॥ 51

పదచ్ఛేదము :- అహం - లంకాపురీ - వీర - నిర్జితా - విక్రమేణ - తే, యస్మాత్ - తస్మాత్ - విజేతా - అసి - సర్వరక్షాంసి - అశేషతః ॥

అన్వయక్రమము :- వీర అహం లంకాపురీ, యస్మాత్ (అహం) తే విక్రమేణ నిర్జితా, తస్మాత్ (త్వం) సర్వరక్షాంసి అశేషతః విజేతా అసి.

ప్రతిపదార్థము :- వీర = ఓ మహావీరుడా! అహం = నేను, లంకానగరీ = లంకానగరిని, యస్మాత్ = ఏ కారణమువలన, (అహం = నేను), తే విక్రమేణ = నీ పరాక్రమముచే, నిర్జితా = ఓడింపబడితినో, తస్మాత్ = ఆ కారణమువలన, (త్వం = నీవు), అశేషతః = నిశ్శేషముగా, సర్వరక్షాంసి = సకల రాక్షసులను, విజేతా అసి = జయింపగలవాడవగుదువు.

తాత్పర్యము :- ఓ మహావీరుడా! నేను లంకానగరిని, నీ పరాక్రమవిశేషముచే నన్ను నిర్జించితివి. కాబట్టి ఇక మీదట నీవు లంకలోని రాక్షసుల నెల్లరను గూడ నిశ్శేషముగా నిర్జింపగలవు సుమా.

శ్లో॥ త త్రాహం సర్వరాత్రం తు విచిన్వన్ జనకాత్మజామ్ ।
రావణాంతఃపురగతో న చాపశ్యం సుమధ్యమామ్ ॥ 52

పదచ్ఛేదము :– తత్ర – అహం – సర్వరాత్రం – తు – విచిన్వన్ – జనకాత్మజామ్, రావణాంతఃపురగతః – న – చ – అపశ్యం – సుమధ్యమామ్ ॥

అన్వయక్రమము :– తత్ర అహం రావణాంతఃపురగతః జనకాత్మజాం సర్వరాత్రం విచిన్వన్ సుమధ్యమాం న చ అపశ్యమ్.

ప్రతిపదార్థము :– తత్ర = ఆ లంకయందు, అహం = నేను, రావణాంతఃపురగతః = రావణునియొక్క అంతఃపురము చేరినవాడనై, సర్వరాత్రం = రాత్రియంతయును, జనకాత్మజాం = జానకిని, విచిన్వన్ = వెదకుచు, సుమధ్యమాం = చక్కని నడుముగల్గిన సీతాదేవిని, న చ అపశ్యమ్ = ఎంతమాత్రము చూడనైతిని.

తాత్పర్యము :– అటుపిమ్మట లంకయందు తిరుగుచు రావణుని అంతఃపురమును ప్రవేశించి సీతాదేవికొరకై రాత్రి అంతయును వెదకితిని గాని ఆమె నెచ్చటను కనుగొనలేక పోయితిని.

శ్లో॥ తత స్సీతా మపశ్యంస్తు రావణస్య నివేశనే ।
శోకసాగర మాసాద్య న పార ముపలక్షయే ॥ 53

పదచ్ఛేదము :– తతః – సీతామ్ – అపశ్యన్ – తు – రావణస్య – నివేశనే, శోకసాగరమ్ – ఆసాద్య – న పారమ్ – ఉపలక్షయే ॥

అన్వయక్రమము :– తతః రావణస్య నివేశనే సీతామ్ అపశ్యన్ శోకసాగరమ్ ఆసాద్య పారం న ఉపలక్షయే.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, రావణస్య = రావణునియొక్క, నివేశనే = భవనమునందు, సీతామ్ = సీతాదేవిని, అపశ్యన్ = కానక, శోకసాగరమ్ = దుఃఖ సముద్రమును, ఆసాద్య = చేరి, పారం = ఒడ్డును, న ఉపలక్షయే = కానకుంటిని.

తాత్పర్యము :– అప్పుడు రావణుని భవనమునందు సీతాదేవిని కనుగొనలేక దుఃఖ సాగరమున నిమగ్నుడనై దరిగానక విలపించుచుంటిని.

శ్లో॥ శోచతా చ మయా దృష్టం ప్రాకారేణ సమావృతమ్ ।
కాంచనేన వికృష్టేన గృహోపవన ముత్తమమ్ ॥ 54

పదచ్ఛేదము :– శోచతా – చ – మయా – దృష్టం – ప్రాకారేణ – సమావృతమ్,

కాంచనేన - వికృష్టేన - గృహోపవనమ్ - ఉత్తమమ్ ॥

అన్వయక్రమము :- శోచతా మయా వికృష్టేన కాంచనేన ప్రాకారేణ సమావృతమ్ ఉత్తమం గృహోపవనం దృష్టమ్.

ప్రతిపదార్థము :- శోచతా = దుఃఖించుచున్నట్టి, మయా = నాచేత, వికృష్టేన = మిక్కిలి పొడవైన, కాంచనేన = సువర్ణమయమైన, ప్రాకారేణ = ప్రాకారముతో, సమావృతం = చుట్టుకొనబడినట్టి, ఉత్తమం = శ్రేష్ఠమైనట్టి, గృహోపవనం = గృహోద్యానవనము, దృష్టమ్ = చూడబడినది.

తాత్పర్యము :- అట్లు దుఃఖనిమగ్నుడనై ఇటు నటు చూచుచుండ ఒకచోట సువర్ణ నిర్మితమై మిక్కిలి ఉన్నతమైన ప్రాకారముతో వెలుగొందుచున్న సుందరమైన ఉద్యానవన మొకటి నాకు దృష్టిగోచరమయ్యెను.

శ్లో॥ స ప్రాకార మవప్లుత్య పశ్యామి బహుపాదపమ్ ।
అశోకవనికామధ్యే శింశుపాపాదపో మహాన్ ॥ 55

శ్లో॥ త మారుహ్య చ పశ్యామి కాంచనం కదళీవనమ్ ॥ 56

పదచ్ఛేదము :- సః - ప్రాకారమ్ - అవప్లుత్య - పశ్యామి - బహుపాదపమ్, అశోకవనికామధ్యే - శింశుపాపాదపః - మహాన్, తమ్ - ఆరుహ్య - చ - పశ్యామి - కాంచనం - కదళీవనమ్ ॥

అన్వయక్రమము :- సః (అహం) ప్రాకారమ్ అవప్లుత్య బహుపాదపం (ఉపవనం) పశ్యామి. (తస్మిన్) అశోకవనికామధ్యే మహాన్ శింశుపాపాదపః (వర్తతే) తమ్ ఆరుహ్య కాంచనం కదళీవనం పశ్యామి.

ప్రతిపదార్థము :- సః (అహం) = ఆ నేను, ప్రాకారం = ప్రాకారమును, అవప్లుత్య = దిగి, బహుపాదపం = బహు వృక్షములతో గూడిన, (ఉపవనం = ఉపవనమును) పశ్యామి = చూచితిని, (తస్మిన్ = ఆ వనమందు), అశోకవనికామధ్యే = అశోకవనము నడుమ, మహాన్ = గొప్పదైన, శింశుపాపాదపః = శింశుపా వృక్షము, (వర్తతే = ఉన్నది), తం = ఆ వృక్షమును, ఆరుహ్య = ఆరోహించి, కాంచనం = స్వర్ణమయమైన, కదళీవనం = అరటితోటను, పశ్యామి = చూచితిని.

తాత్పర్యము :- నేను అప్పుడా ప్రాకారమును దిగి బహువృక్షములతో వెలయుచున్న ఒక ఉద్యానవనమును గాంచితిని. అచ్చటనున్న అశోకవనము నడుమ ఒక పెద్ద శింశుపావృక్షమున్నది. నేను దానిని ఆరోహించి ఆవలిదూరములో గానవచ్చుచున్న

బంగారు అరటితోటను చూచితిని.

శ్లో॥ అదూరే శింశుపావృక్షా త్పశ్యామి వరవర్ణినీమ్ ।
శ్యామాం కమలపత్రాక్షీ ముపవాసకృశాననామ్ ॥ **57**

శ్లో॥ తదేకవాసస్సంవీతాం రజోధ్వస్తశిరోరుహామ్ ।
శోకసంతాపదీనాంగీం సీతాం భర్తృహితే స్థితామ్ ॥ **58**

శ్లో॥ రాక్షసీభి ర్విరూపాభిః క్రూరాభి రభిసంవృతామ్ ।
మాంసశోణితభక్షాభి ర్వ్యాఘ్రీభి ర్హరిణీమివ ॥ **59**

పదచ్ఛేదము :- అదూరే - శింశుపావృక్షాత్ - పశ్యామి వరవర్ణినీమ్, శ్యామాం - కమలపత్రాక్షీమ్ - ఉపవాసకృశాననామ్, తదేకవాసస్సంవీతాం - రజోధ్వస్త శిరోరుహామ్, శోకసంతాపదీనాంగీం - సీతాం - భర్తృహితే - స్థితామ్, రాక్షసీభిః - విరూపాభిః - క్రూరాభిః - అభిసంవృతామ్, మాంసశోణితభక్షాభిః - వ్యాఘ్రీభిః - హరిణీమ్ - ఇవ ॥

అన్వయక్రమము :- శింశుపావృక్షాత్ అదూరే వరవర్ణినీం శ్యామాం మాంసశోణిత భక్షాభిః వ్యాఘ్రీభిః అభిసంవృతాం హరిణీమ్ ఇవ విరూపాభిః క్రూరాభిః రాక్షసీభిః అభిసంవృతాం సీతాం పశ్యామి.

ప్రతిపదార్థము :- శింశుపావృక్షాత్ = శింశుపావృక్షము నుండి, అదూరే = సమీపమున, వరవర్ణినీం = శ్రేష్ఠమైన ఛాయగలిగి యున్నదియును, శ్యామాం = యౌవన వయస్సున నున్నదియును, కమలపత్రాక్షీం = తామరరేకులవంటి కన్నులు గలదియును, ఉపవాసకృశాననాం = ఉపవాసములచే కృశించిన ముఖముగలదియును, తదేకవాస స్సంవీతాం = ఆ యొక్క చీరనే ధరించినదియును, రజోధ్వస్తశిరోరుహాం = ధూళిచే రూపుచెడియున్న తలవెండ్రుకలు గలదియును, శోకసంతాపదీనాంగీం = దుఃఖము యొక్క తీవ్రతాపముచే దీనమైన దేహము గల్గియున్నదియును, భర్తృహితే = భర్తయొక్క ప్రియమునందు, స్థితాం = నిలిచియున్నదియును, మాంసశోణితభక్షాభిః = మాంసమును రక్తమును భక్షించునట్టి, వ్యాఘ్రీభిః = ఆడపులులచే, అభిసంవృతాం = చుట్టుకొనబడియున్న, హరిణీమ్ ఇవ = ఆడులేడివలె, విరూపాభిః = వికారరూపము గల్గినట్టి, క్రూరాభిః = క్రూరస్వభావులైన, రాక్షసీభిః = రాక్షసస్త్రీలచే, అభిసంవృతాం = చుట్టబడియున్నదియును అగు, సీతాం = సీతాదేవిని, పశ్యామి = కనుగొంటిని.

తాత్పర్యము :- నేనప్పు డా శింశుపావృక్షమునకు దగ్గరలోనే సుందరమైన

దేహచ్ఛాయతో, నవయౌవనముననుండి, తామరరేకులవంటి కన్నులతో ఉపవాసములచే బడలియున్న ముఖముతో, మనము చూచినప్పటి చీరనే ధరించి యున్నదై, ధూళిచే అట్టగట్టియున్న కేశములతో, శోకాగ్నిచే తపించుచు, భర్తృక్షేమమునే వాంఛించుచు, మాంసము నెత్తురు ఆహారముగా గోరు భీకరములైన ఆడుపులుల నడుమ జిక్కుకొనియున్న ఆడులేడివలె, ఘోరమైన వికారరూపములతో క్రూరులైన రాక్షసస్త్రీలు తనను చుట్టుముట్టియుండగా దీనస్థితిలోనున్న సీతమ్మను కనుగొంటిని.

శ్లో॥ సామయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః ।
ఏకవేణీధరా దీనా భర్తృచింతాపరాయణా ॥ 60

శ్లో॥ భూమిశయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే ।
రావణా ద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా ।
కథంచి న్మృగశాబాక్షీ తూర్ణ మాసాదితా మయా ॥ 61

పదచ్ఛేదము :- స+ఆమయా - రాక్షసీమధ్యే - తర్జ్యమానా - ముహుః - ముహుః ఏకవేణీధరా - దీనా - భర్తృచింతాపరాయణా, భూమిశయ్యా - వివర్ణాంగీ - పద్మినీ - ఇవ - హిమాగమే, రావణాత్ - వినివృత్తార్థా - మర్తవ్యకృతనిశ్చయా, కథంచిత్ - మృగశాబాక్షీ - తూర్ణమ్ - ఆసాదితా - మయా ॥

అన్వయక్రమము :- రాక్షసీమధ్యే ముహుః ముహుః తర్జ్యమానా, ఏకవేణీధరా, దీనా, భర్తృచింతాపరాయణా, భూమిశయ్యా, హిమాగమే పద్మినీ ఇవ వివర్ణాంగీ, రావణాత్ వినివృత్తార్థా, మర్తవ్యకృతనిశ్చయా, సామయా మృగశాబాక్షీ కథంచిత్ మయా తూర్ణం ఆసాదితా.

ప్రతిపదార్థము :- రాక్షసీమధ్యే = రాక్షసస్త్రీల నడుమ, ముహుః ముహుః = మాటిమాటికిని, తర్జ్యమానా = బెదిరింపబడుచున్నదియును, ఏకవేణీధరా = జడగట్టిన తలవెండ్రుకలను ధరించినదియును, దీనా = దీనురాలును, భర్తృచింతాపరాయణా = భర్తయొక్క స్మరణమునందు నిమగ్నురాలై యున్నదియును, భూమిశయ్యా = నేలనే శయ్యగా చేసికొన్నదియును, హిమాగమే = మంచుకురియుకాలమున, పద్మినీ ఇవ = తామరతీగవలె, వివర్ణాంగీ = వెలవెలబోయిన రూపము గలదియును, రావణాత్ = రావణునినుండి, వినివృత్తార్థా = మరలిన ప్రయోజనము గలదియును, మర్తవ్యకృత నిశ్చయా = చనిపోవవలెనని చేసికొన్న నిర్ణయముగలదియును, (స+ఆమయా) సామయా = దుఃఖముతో గూడినదియునగు, (సా=అ), మృగశాబాక్షీ = లేడిపిల్ల యొక్క కన్నులవంటి కన్నులుగల్గినట్టి సీతాదేవి, కథంచిత్ = ఎట్లో, మయా = నాచేత,

తూర్ణం = త్వరగా, ఆసాదితా = చేరబడినది.

తాత్పర్యము :– నేను చూచిన ఆ సీతాదేవి అచటి రాక్షసస్త్రీలచే మాటి మాటికి భయపెట్టబడుచుండెను. ఆమె కేశములన్నియును ఒకే జడగా అంటుకొని పోయియున్నవి. తన భర్తనే స్మరించుకొనుచు దీనురాలై యున్నది. మంచుకురియు కాలమునందు వెలవెలబోవుచున్న తామరతీగవలె కాంతివిహీనమైన రూపముతో నేలనే తన శయ్యగా చేసికొని, రావణుని నుండి తన క్షేమమును గూర్చిన యాశను మరలించుకొని, ఆత్మహత్య చేసికొనుటకై నిశ్చయించుకొని, దుఃఖస్థితిలో నుండి భీతహరిణేక్షణయైయున్న పూజ్యురాలగు సీతాదేవిని దైవవశమున నేను వెంటనే కనుగొంటిని.

శ్లో॥ తాం దృష్ట్వా తాదృశీం నారీం రామపత్నీం యశస్వినీమ్ ।
తత్రైవ శింశుపావృక్షే పశ్య న్నహ మవస్థితః ॥ 62

పదచ్ఛేదము :– తాం – దృష్ట్వా – తాదృశీం – నారీం – రామపత్నీం – యశస్వినీమ్, తత్ర – ఏవ – శింశుపావృక్షే – పశ్యన్ – అహమ్ – అవస్థితః ॥

అన్వయక్రమము :– రామపత్నీం యశస్వినీం తాం నారీం తాదృశీం దృష్ట్వా అహం తత్ర శింశుపావృక్షే ఏవ (తాం పశ్యన్) అవస్థితః.

ప్రతిపదార్థము :– రామపత్నీం = శ్రీరాముని ధర్మపత్నియును, యశస్వినీం = కీర్తిమంతురాలునగు, తాం నారీం = ఆ పూజ్యురాలైన వనితను, తాదృశీం = ఆ రీతిగనున్న దానినిగా, దృష్ట్వా = చూచి, తత్ర = అచ్చట, శింశుపావృక్షే ఏవ = శింశుపావృక్షమునందే, (తాం = ఆ సీతాదేవిని), పశ్యన్ = చూచుచు, అహం = నేను, అవస్థితః = నిలచియుంటిని.

తాత్పర్యము :– శ్రీరాముని ధర్మపత్నియై సుగుణములచే జగద్విఖ్యాతి నొందినట్టి ఆ సాధ్వీమతల్లి అట్టి స్థితిలో నుండగా జూచి అచ్చటి ఆ శింశుపావృక్షము మీదనే ఆమెను చూచుచు నుంటిని.

శ్లో॥ తతో హలహలాశబ్దం కాంచీనూపురమిశ్రితమ్ ।
శృణో మ్యధికగంభీరం రావణస్య నివేశనే ॥ 63

పదచ్ఛేదము :– తతః – హలహలాశబ్దం – కాంచీనూపురమిశ్రితమ్, శృణోమి – అధికగంభీరం – రావణస్య – నివేశనే ॥

అన్వయక్రమము :– తతః రావణస్య నివేశనే కాంచీనూపురమిశ్రితమ్ అధికగంభీరం

హలహలాశబ్దం శృణోమి.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, రావణస్య = రావణునియొక్క, నివేశనే = భవనమునందు, కాంచీనూపురమిశ్రితం = మొలనూళ్ళ యొక్కయు, అందెల యొక్కయు (ధ్వనులతో గలసిన), అధికగంభీరం = మిక్కిలి గంభీరమైనట్టి, హలహలాశబ్దం = గలగలమను ధ్వనిని, శృణోమి = వింటిని.

తాత్పర్యము :- అటుపిమ్మట కనుచూపుమేరలో నున్న రావణునియొక్క భవనమునందు మొలనూలిగంటల సవ్వడియు, కాలియందెల మ్రోతయు గలసినట్టి ఒకానొక పరమ గంభీరమైన కలకలధ్వని నాకు వినవచ్చెను.

శ్లో॥ తతోఽహం పరమోద్విగ్న స్స్వం రూపం ప్రతిసంహరన్ ।
అహం తు శింశుపావృక్షే పక్షీవ గహనే స్థితః ॥ 64

పదచ్ఛేదము :- తతః - అహం - పరమోద్విగ్నః - స్వం - రూపం - ప్రతిసంహరన్, అహం - తు - శింశుపావృక్షే - పక్షీ - ఇవ - గహనే - స్థితః ॥

అన్వయక్రమము :- తతః అహం స్వం రూపం ప్రతిసంహరన్ పరమోద్విగ్నః (జాతః) అహం తు గహనే శింశుపావృక్షే పక్షీ ఇవ స్థితః.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, అహం = నేను, స్వం రూపం = నిజ రూపమును, ప్రతిసంహరన్ = సూక్ష్మీకరించుచు, పరమోద్విగ్నః = మిక్కిలి కంగారు పడినవాడను, జాతః = అయితిని. అహం తు = నేను అప్పుడు, పక్షీ ఇవ = పిట్టవలె, గహనే = దట్టమైన, శింశుపావృక్షే = శింశుపావృక్షమునందు, స్థితః = ఉంటిని.

తాత్పర్యము :- రావణుని భవనమున గంభీరమైన ఆ ధ్వని వినబడగనే నేనెంతయో కంగారుపడుచు నా రూపమును మిక్కిలి చిన్నదిగ చేసికొని పిట్టవలె ఆ శింశుపా వృక్షపు ఆకుల గుబురులో అణగియుంటిని.

శ్లో॥ తతో రావణదారాశ్చ రావణశ్చ మహాబలః ।
తం దేశం సమనుప్రాప్తాః యత్ర సీతా ఽభవ త్థితా ॥ 65

పదచ్ఛేదము :- తతః - రావణదారాః - చ - రావణః - చ - మహాబలః, తం - దేశం - సమనుప్రాప్తాః - యత్ర - సీతా - అభవత్ - స్థితా ॥

అన్వయక్రమము :- తతః సీతా యత్ర స్థితా అభవత్, తం దేశం మహాబలః రావణః చ రావణదారాః చ సమనుప్రాప్తాః.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, సీతా = సీతాదేవి, యత్ర = ఎచ్చటనయితే, స్థితా = ఉన్నది, అభవత్ = ఆయెనో, తం = ఆ, దేశం = ప్రదేశమును, మహాబలం = మహాబలశాలియైన, రావణః చ = రావణుడును, రావణదారాః చ = రావణుని భార్యలును, సమనుప్రాప్తాః = చేరిరి.

తాత్పర్యము :– అప్పుడు సీతాదేవి యుండు ప్రదేశమునకు మహాబలాఢ్యుడైన రావణుడును ఆతని భార్యలును వచ్చి చేరిరి.

శ్లో॥ తం దృష్ట్వా ఽథ వరారోహా సీతా రక్షోగణేశ్వరమ్ ।
సంకు చ్యోరూ స్తనౌ పీనౌ బాహుభ్యాం పరిరభ్య చ ॥ 66

పదచ్ఛేదము :– తం – దృష్ట్వా – అథ – వరారోహా – సీతా – రక్షోగణేశ్వరమ్, సంకుచ్య – ఊరూ – స్తనౌ – పీనౌ – బాహుభ్యాం – పరిరభ్య – చ ॥

అన్వయక్రమము :– అథ వరారోహా సీతా తం రక్షోగణేశ్వరం దృష్ట్వా ఊరూ సంకుచ్య పీనౌ స్తనౌ బాహుభ్యాం పరిరభ్య చ (విత్రస్తా అభవత్).

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, వరారోహా = శ్రేష్ఠమైన రూపముగల, సీతా = సీతాదేవి, తం = ఆ, రక్షోగణేశ్వరం = రాక్షసరాజును, దృష్ట్వా = చూచి, ఊరూ = తొడలను, సంకుచ్య = ముడుచుకొని, పీనౌ = స్థూలములైన, స్తనౌ = స్తనములను, బాహుభ్యాం = బాహువులచే, పరిరభ్య చ = కప్పుకొనియు, (విత్రస్తా = మిక్కిలి భీతినొందినది, అభవత్ = ఆయెను).

తాత్పర్యము :– అప్పుడు సౌందర్యవతియైన సీతాదేవి రాక్షసరాజైన రావణుడు తన కడకు వచ్చుచుండగా చూచి తన ఊరుద్వయమును దగ్గరకు కూడదీసికొని స్థూలములైన తన స్తనములను తన భుజములతో కప్పుకొని భీతురాలై యుండెను.

శ్లో॥ విత్రస్తాం పరమోద్విగ్నాం వీక్షమాణా మితస్తతః ।
త్రాణం కించి దపశ్యంతీం వేపమానాం తపస్వినీమ్ ॥ 67

శ్లో॥ తా మువాచ దశగ్రీవ స్సీతాం పరమదుఃఖితామ్ ।
అవాక్ఛిరాః ప్రపతితో బహుమన్యస్వ మా మితి ॥ 68

పదచ్ఛేదము :– విత్రస్తాం – పరమోద్విగ్నాం – వీక్షమాణామ్ – ఇతః – తతః – త్రాణం – కించిత్ – అపశ్యంతీం – వేపమానాం – తపస్వినీమ్, తామ్ – ఉవాచ – దశగ్రీవః – సీతాం – పరమదుఃఖితామ్, అవాక్ఛిరాః – ప్రపతితః – బహుమన్యస్వ – మామ్ – ఇతి ॥

అన్వయక్రమము :– విత్రస్తాం పరమోద్విగ్నామ్ ఇతః తతః వీక్షమాణాం కించిత్ త్రాణమ్ అపశ్యంతీం వేపమానాం తపస్వినీమ్ పరమదుఃఖితాం తాం సీతాం, బహుమన్యస్వ ఇతి, దశగ్రీవః అవాక్ఛిరాః ప్రపతితః (సన్) ఉవాచ.

ప్రతిపదార్థము :– విత్రస్తాం = మిక్కిలి భీతినొందినదియు, పరమోద్విగ్నాం = ఎంతయో కంగారు పడుచున్నదియును, ఇతః తతః = ఇటునటు, వీక్షమాణాం = చూచుచున్న దియును, కించిత్ = కొంచెమైన, త్రాణమ్ = రక్షణమును, అపశ్యంతీం = కానకున్న దియును, వేపమానాం = వణుకుచున్నదియునగు, తపస్వినీం = దీనురాలైనదియును, పరమదుఃఖితాం = మిక్కిలి దుఃఖించుచున్నదియునగు, తాం సీతాం = ఆ సీతాదేవిని గూర్చి, దశగ్రీవః = దశకంఠుడైన రావణుడు, మాం = నన్ను, బహుమన్యస్వ = మన్నింపుము, ఇతి = అనుచు, అవాక్ఛిరాః = క్రిందకు వంగిన శిరస్సుగలవాడుగా, ప్రపతితః = నేలపై బడినవాడై, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :– తనను జూచి భీతినొందుచు కంగారుతో ఇటు నటు జూచుచు తనను కాపాడువా రెవ్వరును లేక కంపించుచు దీనురాలై దుఃఖనిమగ్నురాలై యున్న ఆ సీతాదేవిని జూచి రావణుడు దయతో నన్ను మన్నింపుమనుచు తలవంచి నేలమీదికి ఒరిగి సీతాదేవితో ఇట్లు పలికెను.

శ్లో॥ యది చే త్త్వం తు దర్పా న్మాం నాభినందసి గర్వితే ।
ద్వౌ మాసా వంతరం సీతే పాస్యామి రుధిరం తవ ॥ 69

పదచ్ఛేదము :– యది – చేత్ – త్వం – తు – దర్పాత్ – మాం – న – అభినందసి – గర్వితే, ద్వౌ – మాసౌ – అంతరం – సీతే – పాస్యామి – రుధిరం – తవ ॥

అన్వయక్రమము :– గర్వితే సీతే! త్వం – దర్పాత్ మాం యది న అభినందసి, ద్వౌ మాసౌ అంతరం, (తతః) తవ రుధిరం పాస్యామి.

ప్రతిపదార్థము :– గర్వితే = ఓ గర్విష్ఠురాలవైన, సీతే = సీతాదేవీ! త్వం = నీవు, దర్పాత్ = మదముచే, మాం = నన్ను, యది = ఒకవేళ, న అభినందసి చేత్ = ఆమోదింపకున్నచో, ద్వౌ మాసౌ = రెండు నెలలు, అంతరం = గడువు, (తతః = పిమ్మట), తవ = నీయొక్క, రుధిరం = నెత్తురును, పాస్యామి = త్రాగుదును.

తాత్పర్యము :– గర్వితురాలవైన ఓ సీతా! నీవు నా కోరికను ఆమోదింపక దర్పముచే తిరస్కరించితివేని ఇదిగో రెండు మాసములు నీకు గడువిచ్చుచున్నాను. అటుపిమ్మట నిన్ను చంపి నీ నెత్తురును నేను త్రాగుదును సుమా!

శ్లో॥ ఏత చ్ఛ్రుత్వా వచ స్తస్య రావణస్య దురాత్మనః ।
ఉవాచ పరమక్రుద్ధా సీతా వచన ముత్తరమ్ ॥ 70

పదచ్ఛేదము :- ఏతత్ - శ్రుత్వా - వచః - తస్య - రావణస్య - దురాత్మనః, ఉవాచ - పరమక్రుద్ధా - సీతా - వచనమ్ - ఉత్తరమ్ ॥

అన్వయక్రమము :- దురాత్మనః తస్య రావణస్య ఏతత్ వచః శ్రుత్వా పరమక్రుద్ధా సీతా ఉత్తరం వచనమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :- దురాత్మనః = దుర్మార్గుడైనట్టి, తస్య = ఆ, రావణస్య = రావణుని యొక్క, ఏతత్ = ఈ, వచః = మాటను, శ్రుత్వా = విని, పరమక్రుద్ధా = మిక్కిలి క్రోధము నొందినట్టి, సీతా = సీతాదేవి, ఉత్తరం = సమాధానమైనట్టి, వచనం = మాటను, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- దుర్మార్గుడైన ఆ రావణుడు పలికిన మాటలను విని సీతాదేవి తీవ్రమైన క్రోధము నొంది యిట్లు జవాబు చెప్పెను.

శ్లో॥ రాక్షసాధమ రామస్య భార్యా మమితతేజసః ।
ఇక్ష్వాకుకులనాథస్య స్నుషాం దశరథస్య చ ।
అవాచ్యం వదతో జిహ్వా కథం న పతితా తవ ॥ 71

పదచ్ఛేదము :- రాక్షసాధమ - రామస్య - భార్యామ్ - అమితతేజసః - ఇక్ష్వాకు కులనాథస్య - స్నుషాం - దశరథస్య - చ, అవాచ్యం - వదతః - జిహ్వా - కథం - న - పతితా - తవ ॥

అన్వయక్రమము :- రాక్షసాధమ! అమితతేజసః రామస్య భార్యామ్ ఇక్ష్వాకుకులనాథస్య దశరథస్య స్నుషాం చ అవాచ్యం వదతః తవ జిహ్వా కథం న పతితా!

ప్రతిపదార్థము :- రాక్షసాధమ = ఓ నీచరాక్షసుడా! అమితతేజసః = అత్యంత ప్రతాపశాలియైన, రామస్య = శ్రీరామునియొక్క, భార్యాం = భార్యను, ఇక్ష్వాకుకులనాథస్య = ఇక్ష్వాకువంశమునకు ప్రభువగు, దశరథస్య = దశరథునియొక్క, స్నుషాం చ = కోడలినగు, (మాం = నన్నుగూర్చి), అవాచ్యం = అనరానిమాటలను, వదతః = పలుకుచున్నట్టి, తవ = నీయొక్క, జిహ్వా = నాలుక, కథం = ఎందుచే, న పతితా = పడిపోవలేదు?

తాత్పర్యము :- ఓ రాక్షసాధమా! అపరిమితపరాక్రమశాలియైన శ్రీరాముని భార్యను, ఇక్ష్వాకువంశప్రతిష్ఠాకరుడైన దశరథుని కోడలిని అగు నన్ను అనరాని మాటలను

పలికినట్టి నీ నాలుక ఏల ముక్కలుగ తెగి నేలపై బడకున్నది?

శ్లో॥ కింస్విద్వీర్యం త వానార్య యో మాం భర్తు రసన్నిధౌ ।
అపహృత్యాగతః పాప తేనాదృష్టో మహాత్మనా ॥ 72

పదచ్ఛేదము :– కింస్విత్ – వీర్యం – తవ – అనార్య – యః – మాం – భర్తుః – అసన్నిధౌ, అపహృత్య – ఆగతః – పాప – తేన – అదృష్టః – మహాత్మనా ॥

అన్వయక్రమము :– అనార్య! పాప! యః మాం భర్తుః అసన్నిధౌ తేన మహాత్మనా అదృష్టః మాం అపహృత్య ఆగతః (అసి) (తస్య) తవ వీర్యం కిం స్విత్!

ప్రతిపదార్థము :– అనార్య! = దురాత్ముడా! పాప! = పాపాత్ముడా! యః = ఏ, త్వం = నీవు, భర్తుః = భర్తయొక్క, అసన్నిధౌ = పరోక్షమునందు, తేన = ఆ, మహాత్మనా = మహనీయునిచే, అదృష్టః = చూడబడనివాడవై, అపహృత్య = అపహరించి, ఆగతః = వచ్చియుంటివో, (తస్య = అట్టి), తవ = నీయొక్క, వీర్యం = పరాక్రమము, కింస్విత్ = ఏమది?

సూచన :– ఈ శ్లోకమున "కించిద్వీర్యం తవానార్య" అను పాఠాంతరము ఉన్నది. అనగా "నీ పరాక్రమము అల్పము, నీచము" అని భావము. ఈ అర్థముతోనే "కింస్విద్వీర్య!" అని సంబోధనముగా ఇంకొక పాఠాంతరము కూడ ఉన్నది.

తాత్పర్యము :– ఓ దురాత్ముడా! మహాత్ముడైన నా భర్తకంట బడకుండగా ఆతడు దగ్గరలేనప్పుడు నన్ను దొంగిలించి తీసికొని వచ్చితివి గదా! అట్టి నీ పరాక్రమము అనగా ఎంతటిది?

శ్లో॥ న త్వం రామస్య సదృశో దాస్యేఽప్యస్య న యుజ్యసే ।
అజేయ స్సత్యవాదీ చ రణశ్లాఘీ చ రాఘవః ॥ 73

పదచ్ఛేదము :– న – త్వం – రామస్య – సదృశః – దాస్యే – అపి – అస్య – న – యుజ్యసే, అజేయః – సత్యవాదీ – చ – రణశ్లాఘీ – చ – రాఘవః ॥

అన్వయక్రమము :– రాఘవః అజేయః సత్యవాదీ చ, రణశ్లాఘీ చ (భవతి). త్వం రామస్య సదృశః న (భవసి). అస్య దాస్యే అపి న యుజ్యసే.

ప్రతిపదార్థము :– రాఘవః = రఘునందనుడు, అజేయః = జయింప శక్యముగాని వాడు, సత్యవాదీ చ = సత్యవచనుడును, రణశ్లాఘీ చ = యుద్ధమును గొనియాడువాడను, (భవతి = అగుచున్నాడు), త్వం = నీవు, రామస్య = రామునకు, సదృశః = సమానుడవు, న భవసి = కావు, అస్య = అతనియొక్క, దాస్యే అపి =

దాస్యమునందు గూడ, న యుజ్యసే = తగవు.

తాత్పర్యము :- నా భర్తయైన రఘునందనుడు అజేయుడు, సత్యవాది, రణమును శ్లాఘించువాడు. అట్టి ఆ రామునకు నీవెంతమాత్రము సాటి కాజాలవు. తుదకా మహనీయునికి దాస్యము చేయుటకు గూడ నీవు తగవు సుమా!

శ్లో॥ వివృత్య నయనే క్రూరే ముష్టి ముద్యమ్య దక్షిణమ్ ।
మైథిలీం హంతు మారబ్ధః స్త్రీభి ర్హాహాకృతం తదా ॥ 74

పదచ్ఛేదము :- వివృత్య - నయనే - క్రూరే - ముష్టిమ్ - ఉద్యమ్య - దక్షిణమ్, మైథిలీం - హంతుమ్ - ఆరబ్ధః - స్త్రీభిః - హాహాకృతం - తదా ॥

అన్వయక్రమము :- (సః) క్రూరే నయనే వివృత్య దక్షిణం ముష్టిమ్ ఉద్యమ్య మైథిలీం హంతుమ్ ఆరబ్ధః. తదా స్త్రీభిః హాహాకృతమ్.

ప్రతిపదార్థము :- (సః = ఆ దశకంఠుడు), క్రూరే = క్రూరములైన, నయనే = కన్నులను, వివృత్య = త్రిప్పి, దక్షిణం = కుడిదైన, ముష్టిమ్ = పిడికిలిని, ఉద్యమ్య = ఎత్తి, మైథిలీం = జానకిని, హంతుమ్ = చంపుటకు, ఆరబ్ధః = సమకట్టెను, తదా = అప్పుడు, స్త్రీభిః = స్త్రీలచే, హాహాకృతమ్ = హాహాకారము చేయబడెను.

తాత్పర్యము :- అటుపిమ్మట వెంటనే రావణుడు భీకరములైన తన మిడిగ్రుడ్లను త్రిప్పుచు కుడిచేతి పిడికిలిని మీదికి ఎత్తి సీతాదేవిని చంపుటకు మీదికి వచ్చుచుండెను. అప్పుడచటి స్త్రీలు ఎల్లరును భయముతో హాహాకారములు చేసిరి.

శ్లో॥ స్త్రీణాం మధ్యాత్ సముత్పత్య తస్య భార్యా దురాత్మనః ।
వరా మండోదరీ నామ తయా స ప్రతిషేధితః ॥ 75

పదచ్ఛేదము :- స్త్రీణాం - మధ్యాత్ - సముత్పత్య - తస్య - భార్యా - దురాత్మనః, వరా - మండోదరీనామ - తయా - సః - ప్రతిషేధితః ॥

అన్వయక్రమము :- దురాత్మనః తస్య భార్యా మండోదరీనామ వరా స్త్రీణాం మధ్యాత్ సముత్పత్య (ఆగతా). సః తయా ప్రతిషేధితః.

ప్రతిపదార్థము :- దురాత్మనః = దుర్మార్గుడైనట్టి, తస్య = ఆ రావణునియొక్క, భార్యా = భార్యయైన, మండోదరీనామ = మండోదరియను పేరుగల, వరా = ఉత్తమురాలు, స్త్రీణాం = స్త్రీలయొక్క, మధ్యాత్ = నడుమనుండి, సముత్పత్య = మీదికి లేచి, (ఆగతా = వచ్చినది). సః = ఆ రావణుడు, తయా = ఆమెచే, ప్రతిషేధితః = అడ్డగింపబడెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- మొదట ఈ సందర్భమున ధాన్యమాలిని రావణుని నిషేధించినదని చెప్పబడెను. ఇచ్చట మండోదరియని చెప్పుట ఎట్లు పొసగునని అనుకొననక్కరలేదు. రావణుని వారించినది వారిద్దరును కలిసియే. హనుమకు వారిరువురి వివరము తరువాత మాత్రమే ప్రక్కవారి మాటలవలన తెలిసినది.

తిలకము :- రావణాసురుని ధాన్యమాలినియు మండోదరియు కలిసి నివారించిరి అని అనుకొనవలెను. కొందరు పెద్దలు మండోదరికే ధాన్యమాలిని యని ఇంకొక పేరు ఉన్నదని చెప్పుచున్నారు.

తాత్పర్యము :- అప్పు డాతడా ఘాతుకకృత్యము జరుపకుండగ ఆ దుర్మార్గుని భార్యలలో నుత్తమురాలగు మండోదరియను సాధ్వి స్త్రీల నడుమనుండి ఈవలకు వచ్చి రావణుని అడ్డుకొనెను.

శ్లో॥ ఉక్తశ్చ మధురాం వాణీం తయా స మదనార్దితః ।
సీతయా తవ కిం కార్యం మహేంద్రసమవిక్రమ ॥ 76

శ్లో॥ దేవగంధర్వకన్యాభి ర్యక్షకన్యాభిరేవ చ ।
సార్ధం ప్రభో రమస్వేహ సీతయా కిం కరిష్యసి ॥ 77

పదచ్ఛేదము :- ఉక్తః - చ - మధురాం - వాణీం - తయా - సః - మదనార్దితః, సీతయా - తవ - కిం - కార్యం - మహేంద్రసమవిక్రమ, దేవగంధర్వకన్యాభిః - యక్షకన్యాభిః - ఏవ - చ, సార్ధం - ప్రభో - రమస్వ - ఇహ - సీతయా - కిం - కరిష్యసి ॥

అన్వయక్రమము :- ప్రభో! మహేంద్రసమవిక్రమ! తవ సీతయా కిం కార్యమ్? దేవగంధర్వకన్యాభిః యక్షకన్యాభిః సార్ధం రమస్వ, ఇహ సీతయా కిం కరిష్యసి? ఇతి మదనార్దితః సః తయా మధురాం వాణీమ్ ఉక్తః చ.

ప్రతిపదార్థము :- ప్రభో! = రాజా!, మహేంద్రసమవిక్రమః = దేవేంద్రునితో సమానమైన పరాక్రమము గల వీరుడా!, తవ = నీకు, సీతయా = సీతతో, కిం = ఏమి, కార్యం = పని, దేవగంధర్వకన్యాభిః = దేవకన్యలతోడను, గంధర్వకన్యలతోడను, యక్షకన్యాభిః చ సార్ధం = యక్షకన్యలతోడను గూడి, రమస్వ = క్రీడింపుము. ఇహ = ఇచ్చట, సీతయా = సీతతో, కిం కరిష్యసి = ఏమి చేయుదువు? ఇతి = అని, మదనార్దితః = కామముచే పీడింపబడినట్టి, సః = ఆ రావణుడు, తయా = ఆ మండోదరిచే, మధురాం

= తియ్యనైన, వాణీం = మాటను, ఉక్తః చ = చెప్పబడెను కూడను.

సూచనము :– 'మయా సహ రమస్వాద్య మద్విశిష్టా న జానకీ'

తాత్పర్యము :– నీవు నాతో చక్కగ క్రీడింపుము. ఈ జానకి నాకంటె ఎంతమాత్రము గొప్పది కాదు సుమా.

ఈ శ్లోకార్ధము పై శ్లోకముల నడుమ బొంబాయి ముద్రణమును గానవచ్చు చున్నది.

తాత్పర్యము :– దేవేంద్రునితో సమానమైన పరాక్రమవైభవము గల ఓ రాక్షసేంద్రా! నీ కీ మర్త్యురాలైన సీతతో ఏమి పని? దేవకన్యలు, గంధర్వకన్యలును, యక్షకన్యలును ఎందరో యున్నారు గదా! నీవు వారితో గూడి రమింపుము. నీపై మక్కువలేని సీతను నీవేమి చేసికొందువు? అని మన్మథపీడితుడైన రావణునితో మండోదరి తీయని మాటలతో ఆతని మనస్సును మరలించినది.

శ్లో॥ తత స్తాభి స్సమేతాభి ర్నారీభి స్స మహాబలః ।
ప్రసాద్య సహసా నీతో భవనం స్వం నిశాచరః ॥ 78

పదచ్ఛేదము :– తతః – తాభిః – సమేతాభిః – నారీభిః – సః – మహాబలః, ప్రసాద్య – సహసా – నీతః – భవనం – స్వం – నిశాచరః ॥

అన్వయక్రమము :– తతః సమేతాభిః తాభిః నారీభిః మహాబలః సః నిశాచరః ప్రసాద్య సహసా స్వం భవనం నీతః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, సమేతాభిః = దగ్గరకు చేరినట్టి, తాభిః = ఆ, నారీభిః = స్త్రీలచే, మహాబలః = గొప్పబలశాలియైన, సః = ఆ, నిశాచరః = రాక్షసుడు, ప్రసాద్య = బ్రతిమాలి, సహసా = వెంటనే, స్వం = తన, భవనం = మందిరమును గూర్చి, నీతః = కొనిపోవబడెను.

తాత్పర్యము :– అప్పు డాతని చుట్టును జేరి ఆతని భార్యలందరును మహాబలాఢ్యుడైన ఆ రాక్షసరాజును ఎట్లో ఒప్పించి తన భవనమునకు గొనిపోయిరి.

శ్లో॥ యాతే తస్మిన్ దశగ్రీవే రాక్షస్యో వికృతాననాః ।
సీతాం నిర్భర్త్సయామాసు ర్వాక్యైః క్రూరై స్సుదారుణైః ॥ 79

పదచ్ఛేదము :– యాతే – తస్మిన్ – దశగ్రీవే – రాక్షస్యః – వికృతాననాః, సీతాం – నిర్భర్త్సయామాసుః – వాక్యైః – క్రూరైః – సుదారుణైః ॥

అన్వయక్రమము :– తస్మిన్ దశగ్రీవే యాతే సతి వికృతాననాః రాక్షస్యః క్రూరైః సుదారుణైః వాక్యైః సీతాం నిర్భర్త్సయామాసుః.

ప్రతిపదార్థము :– తస్మిన్ = ఆ, దశగ్రీవే = రావణుడు, యాతే(సతి) = వెడలిపోవగా, వికృతాననాః = వికారమైన ముఖముగల, రాక్షస్యః = రాక్షతవనితలు, క్రూరైః = క్రూరములును, సుదారుణైః = ఘోరములునగు, వాక్యైః = మాటలతో, సీతాం = సీతాదేవిని, నిర్భర్త్సయామాసుః = పీడింపసాగిరి.

తాత్పర్యము :– రావణు డట్లు వెడలగనే అచట కావలియున్న వికారమైన ముఖములుగల రాక్షసస్త్రీలు మిక్కిలి క్రూరమైన ఘోరమైన వచనములతో సీతాదేవిని హింసింపసాగిరి.

శ్లో॥ తృణవ ద్భాషితం తాసాం గణయామాన జానకీ ।
తర్జితం చ తదా తాసాం సీతాం ప్రాప్య నిరర్థకమ్ ॥ 80

పదచ్ఛేదము :– తృణవత్ – భాషితం – తాసాం – గణయామాస – జానకీ, తర్జితం – చ – తదా – తాసాం – సీతాం – ప్రాప్య – నిరర్థకమ్ ॥

అన్వయక్రమము :– జానకీ తాసాం భాషితం తృణవత్ గణయామాస. తదా తాసాం తర్జితం చ సీతాం ప్రాప్య నిరర్థకం (జాతమ్).

ప్రతిపదార్థము :– జానకీ = సీతాదేవి, తాసాం = ఆ స్త్రీలయొక్క, భాషితం = మాటను, తృణవత్ = గడ్డిపోచవలె, గణయామాస = లెక్కించినది, తదా = అప్పుడు, తాసాం = ఆ రాక్షసస్త్రీలయొక్క, తర్జితం చ = బెదిరింపుగూడ, సీతాం = సీతాదేవిని, ప్రాప్య = పొంది, నిరర్థకం = వ్యర్థమైనది, (జాతం = అయినది).

తాత్పర్యము :– సీతాదేవి ఆ రాక్షసస్త్రీలు మహాభయంకరముగ పలికిన మాటలను గడ్డిపోచగా తీసిపారవైచెను. వారామెను బెదిరించుచు చేసిన ప్రయత్నమంతయును వ్యర్థమే అయ్యెను.

శ్లో॥ వృథాగర్జితనిశ్చేష్టా రాక్షస్యః పిశితాశనాః ।
రావణాయ శశంసు స్తా స్సీతావ్యవసితం మహత్ ॥ 81

పదచ్ఛేదము :– వృథాగర్జితనిశ్చేష్టాః – రాక్షస్యః – పిశితాశనాః, రావణాయ – శశంసుః – తాః – సీతావ్యవసితం – మహత్ ॥

అన్వయక్రమము :– పిశితాశనాః వృథాగర్జితనిశ్చేష్టాః తాః రాక్షస్యః మహత్ సీతావ్యవసితం రావణాయ శశంసుః.

ప్రతిపదార్థము :– పిశితాశనాః = మాంసభక్షణము గలిగినట్టి, తాః = ఆ, రాక్షస్యః = రాక్షసస్త్రీలు, వృథాగర్జితనిశ్చేష్టాః (సత్యః) = వ్యర్థమైన గర్జనములు గలిగి, చేష్టలులేని వారగుచు, మహత్ = గొప్పదైన, సీతావ్యవసితం = సీతయొక్క దృఢనిశ్చయమును గూర్చి, రావణాయ = రావణునకు, శశంసుః = తెలిపిరి.

తాత్పర్యము :– క్రూరులైన ఆ రాక్షసస్త్రీలు తమ గద్దింపులు వ్యర్థముకాగా చేయునదిలేక రావణుని కడకేగి ఆతనితో సీతాదేవియొక్క ధృఢనిశ్చయమును తెలియజెప్పిరి.

శ్లో॥ తత స్తా స్సహితా స్సర్వా నిహతాశా నిరుద్యమాః ।
పరిక్షిప్య సమంతా త్తాం నిద్రావశముపాగతాః ॥ 82

పదచ్ఛేదము :– తతః – తాః – సహితాః – సర్వాః – విహతాశాః – నిరుద్యమాః, పరిక్షిప్య – సమంతాత్ – తాం – నిద్రావశమ్ – ఉపాగతాః ॥

అన్వయక్రమము :– తతః తాః సర్వాః విహతాశాః నిరుద్యమాః (సత్యః) సమంతాత్ తాం పరిక్షిప్య నిద్రావశమ్ ఉపాగతాః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తాః = వారు, సర్వాః = ఎల్లరును, నిహతాశాః = నశించిన ఆశగలవారును, నిరుద్యమాః = ప్రయత్నము లేనివారునగుచు, సహితాః = కలిసియుండినవారై, సమంతాత్ = అన్నివైపులను, తాం = ఆ సీతాదేవిని, పరిక్షిప్య = చుట్టుముట్టి, నిద్రావశం = నిద్రయొక్క వశమును, ఉపాగతాః = పొందిరి.

తాత్పర్యము :– అప్పుడా రాక్షసస్త్రీలు ఎల్లరును తమ యత్నము వ్యర్థమైపోవుటచే చేయునదిలేక అందరు కలిసి ఆ సీతాదేవిని చుట్టుముట్టి కూర్చుండి కొద్దిసేపటిలో నిద్రకు లొంగిపోయి పరుండిరి.

శ్లో॥ తాసు చైవ ప్రసుప్తాసు సీతా భర్తృహితే రతా ।
విలప్య కరుణం దీనా ప్రశుశోచ సుదుఃఖితా ॥ 83

పదచ్ఛేదము :– తాసు – చ – ఏవ – ప్రసుప్తాసు – సీతా – భర్తృహితే – రతా, విలప్య – కరుణం – దీనా – ప్రశుశోచ – సుదుఃఖితా ॥

అన్వయక్రమము :– తాసు ప్రసుప్తాసు (సతీషు) భర్తృహితే రతా సీతా సుదుఃఖితా (సతీ) కరుణం విలప్య దీనా (సతీ) ప్రశుశోచ.

ప్రతిపదార్థము :– తాసు = ఆ రాక్షసస్త్రీలు, ప్రసుప్తాసు (సతీషు) = నిద్రించినవారై యుండగా, భర్తృహితే = భర్తయొక్క హితమునందు, రతా = ఆసక్తురాలైనట్టి, సీతా = సీతాదేవి, సుదుఃఖితా సతీ = మిక్కిలి దుఃఖము నొందినదై, కరుణం = జాలిగా,

విలప్య = విలపించి, దీనా (సతీ) = దీనురాలై, ప్రశుశోచ = మిక్కిలి శోకించెను.

తాత్పర్యము :– ఆ రాక్షసస్త్రీ లట్లు నిద్రలో మునిగియుండగా భర్త క్షేమమును కోరుచున్న సీతాదేవి దీనురాలై జాలిగా విలపించుచు దుఃఖము నాపుకొనలేక మిక్కిలిగ శోకించెను.

శ్లో॥ తాసాం మధ్యా త్సముత్థాయ త్రిజటా వాక్య మబ్రవీత్ ।
ఆత్మానం ఖాదత క్షిప్రం న సీతా వినశిష్యతి ।
జనక స్యాత్మజా సాధ్వీ స్నుషా దశరథస్య చ ॥ 84

పదచ్ఛేదము :– తాసాం – మధ్యాత్ – సముత్థాయ – త్రిజటా – వాక్యమ్ – అబ్రవీత్, ఆత్మానం – ఖాదత – క్షిప్రం – న – సీతా – వినశిష్యతి, జనకస్య – ఆత్మజా – సాధ్వీ – స్నుషా – దశరథస్య – చ ॥

అన్వయక్రమము :– తాసాం మధ్యాత్ సముత్థాయ త్రిజటా వాక్యమ్ అబ్రవీత్, క్షిప్రమ్ ఆత్మానం ఖాదత, జనకస్య ఆత్మజా దశరథస్య స్నుషా సాధ్వీ సీతా న వినశిష్యతి.

ప్రతిపదార్థము :– తాసాం = ఆ స్త్రీలయొక్క, మధ్యాత్ = నడుమ నుండి, సముత్థాయ = లేచి, త్రిజటా = త్రిజట అను రక్కసి, వాక్యమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను, క్షిప్రం = శీఘ్రముగా, ఆత్మానం = నన్ను, ఖాదత = తినుడు, జనకస్య = జనకునియొక్క, ఆత్మజా = పుత్రికయును, దశరథస్య స్నుషా చ = దశరథుని కోడలును, సాధ్వీ = పతివ్రతయునగు, సీతా = సీతాదేవి, న వినశిష్యతి = నాశనము నొందదు.

తాత్పర్యము :– అప్పుడా రాక్షసస్త్రీల నడుమనుండి త్రిజట యను నామె లేచి ఇట్లు పలికినది. మీకు కావలసినచో నన్ను తినివేయుడు. మీరు సీతాదేవి నేల హింసింతురు! జనక మహారాజు కుమార్తెయు, దశరథచక్రవర్తి కోడలును, మహాపతివ్రతయునగు సీతాదేవికి నాశము గలుగదు సుడీ!

శ్లో॥ స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః ।
రక్షసాం చ వినాశాయ భర్తు రస్యా జయాయ చ ॥ 85

పదచ్ఛేదము :– స్వప్నః – హి – అద్య – మయా – దృష్టః – దారుణః – రోమహర్షణః, రక్షసాం – చ – వినాశాయ – భర్తుః – అస్యాః – జయాయ – చ ॥

అన్వయక్రమము :– రక్షసాం వినాశాయ చ అస్యాః భర్తుః జయాయ చ అద్య మయా దారుణః రోమహర్షణః స్వప్నః దృష్టః హి!

ప్రతిపదార్థము :– రక్షసాం = రాక్షసులయొక్క, వినాశాయ చ = వినాశము కొరకును, అస్యాః = ఈమెయొక్క, భర్తుః = పెనిమిటియొక్క, జయాయ చ = జయముకొరకును,

అద్య = నేడు, మయా = నాచేత, దారుణః = ఘోరమైన, రోమహర్షణః = గగుర్పాటు గలిగించునట్టి, స్వప్నః = స్వప్నము, దృష్టః హి = చూడబడినదిసుడీ!

తాత్పర్యము :– ఈనాడు నాకు రాక్షసులకు వినాశకరమును, ఈమె భర్తకు జయకరమును అగు ఒకానొక ఘోరమైన ఒడలు గగుర్పొడుచునట్టి స్వప్నము వచ్చినదిసుడీ!

శ్లో॥ అల మస్మాన్ పరిత్రాతుం రాఘవా ద్రాక్షసీగణమ్ ।
అభియాచామ వైదేహీ మేతద్ధి మమ రోచతే ॥ 86

పదచ్ఛేదము :– అలం – అస్మాన్ – పరిత్రాతుం – రాఘవాత్ – రాక్షసీగణమ్, అభియాచామ – వైదేహీమ్ – ఏతత్ – హి – మమ – రోచతే ॥

అన్వయక్రమము :– రాఘవాత్ అస్మాన్ రాక్షసీగణం పరిత్రాతుం ఏషా అలమ్, (తత్) వైదేహీం అభియాచామ, మమ ఏతత్ హి రోచతే.

ప్రతిపదార్థము :– రాఘవాత్ = శ్రీరామునినుండి, అస్మాన్ = మనలను, రాక్షసీ గణం = రాక్షసవర్గమును, పరిత్రాతుం = పరిరక్షించుటకు, (ఏషా = ఈమె) అలం = చాలును, (తత్ = అందువలన), వైదేహీం = జానకీదేవిని, అభియాచామ = యాచించుదము, మమ = నాకు, ఏతత్ హి = ఇదియే, రోచతే = ఇష్టమగుచున్నది.

తాత్పర్యము :– మనకు గలుగబోవు వినాశమునకు మూలమైన శ్రీరాముని నుండి మనను, మన రాక్షసీబృందమును రక్షించుటకు ఇప్పు డీమెయే సమర్థురాలు. కాబట్టి ఈమెనే మనను కాపాడుటకై యాచింతుము గాక! నాకిదియే క్షేమమని తోచుచున్నది.

శ్లో॥ యస్యా హ్యేవంవిధ స్స్వప్నో దుఃఖితాయాః ప్రదృశ్యతే ।
సా దుఃఖై ర్వివిధై ర్ముక్తా సుఖం ప్రాప్నో త్యనుత్తమమ్ ॥ 87

పదచ్ఛేదము :– యస్యాః – హి – ఏవంవిధః – స్వప్నః – దుఃఖితాయాః – ప్రదృశ్యతే, సా – దుఃఖైః – వివిధైః – ముక్తా – సుఖం – ప్రాప్నోతి – అనుత్తమమ్ ॥

అన్వయక్రమము :– దుఃఖితాయాః యస్యాః విషయే ఏవంవిధః స్వప్నః ప్రదృశ్యతే, సా వివిధైః దుఃఖైః ముక్తా, అనుత్తమం సుఖం ప్రాప్నోతి.

ప్రతిపదార్థము :– దుఃఖితాయాః = దుఃఖించుచున్నట్టి, యస్యాః (విషయే) = ఎవతె విషయముననైతే, ఏవంవిధః = ఈ విధమైనట్టి, స్వప్నః = స్వప్నము, ప్రదృశ్యతే = గాన్పించునో, సా = ఆమె, వివిధైః = బహువిధములైన, దుఃఖైః = దుఃఖములచే,

ముక్తా = విడువబడినదై, అనుత్తమం = శ్రేష్ఠమైన, సుఖం = సౌఖ్యమును, ప్రాప్నోతి = పొందును.

తాత్పర్యము :- దుఃఖనిమగ్నురాలైన ఏ దీనురాలి విషయమై ఈ విధమగు స్వప్నము కానవచ్చెనో ఆ దుఃఖితురాలు తన సర్వదుఃఖములను తొలగించుకొని గొప్పదైన క్షేమమును తప్పక పొందగలదు.

శ్లో॥ ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా ॥ 88

పదచ్ఛేదము :- ప్రణిపాతప్రసన్నా - హి - మైథిలీ - జనకాత్మజా ॥

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- జనకాత్మజా = జనకమహారాజు పుత్రికయైన, మైథిలీ = సీతాదేవి, ప్రణిపాతప్రసన్నా హి = నమస్కారముచేతనే ప్రసన్నురాలగునట్టిది సుడీ!

తాత్పర్యము :- జనకరాజపుత్రియగు సీతాదేవి ఒక్క నమస్కారము తోడనే ప్రసన్నురాలయి మనకు కావలసినట్టి మేలు గల్గింపగలదు సుడీ!

సూచనము :- అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్ అనగా

ఓ రాక్షసస్త్రీలారా! ఎంతటి గొప్ప ప్రమాదము నుండియైనను మనను కాపాడుటకు ఈమె సర్వసమర్థురాలు సుడీ!

ఈ ఉత్తరార్ధము ఒక్క ఉత్తరాదిప్రతులందు మాత్రమే కానవచ్చుచున్నది.

శ్లో॥ తత స్సా హ్రీమతీ బాలా భర్తు ర్విజయహర్షితా ।
అవోచ ద్యది త త్తథ్యం భవేయం శరణం హి వః ॥ 89

పదచ్ఛేదము :- తతః - సా - హ్రీమతీ - బాలా - భర్తుః - విజయహర్షితా, అవోచత్ - యది - తత్ - తథ్యం - భవేయం - శరణం - హి - వః ॥

అన్వయక్రమము :- తతః హ్రీమతీ సా బాలా భర్తుః విజయహర్షితా అవోచత్, తత్ తథ్యం యది, వః శరణం భవేయం హి.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, హ్రీమతీ = లజ్జావతియైన, సా = ఆ, బాలా = తరుణి, భర్తుః = భర్తయొక్క, విజయహర్షితా = విజయముచే ఆనందము నొందినదై, అవోచత్ = పలికెను, తత్ = అయ్యది, తథ్యం = యథార్థము, యది = అయినయెడల, వః = మీకు, శరణం = రక్షకము, భవేయం హి = కాగలను సుడీ.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- లజ్జితా - నాకు ఇంతటి భాగ్యము ఎట్లు లభించును అని అను కొనుచున్నట్టి ఆమెకు అప్పుడు సిగ్గు కలిగినదని భావము.

తాత్పర్యము :- భర్తకు కలుగబోవు విజయమునకు మహానందము నొందుచు తాను పొందు ఆనందమును గూర్చి తానే సిగ్గునొందుచున్న ఆ బాలస్వభావురాలైన సీతాదేవి త్రిజటాదిరాక్షసస్త్రీలను జూచి మీరు పలికినదే నిజమైనచో నేను మీకు తప్పక రక్షణముగ నుందునని పలికెను.

శ్లో॥ తాం చాహం తాదృశీం దృష్ట్వా సీతాయా దారుణాం దశామ్ ।
చింతయామాస విక్రాంతో నచ మే నిర్వృతం మనః ॥ 90

పదచ్ఛేదము :- తాం - చ - అహం - తాదృశీం - దృష్ట్వా - సీతాయాః - దారుణాం - దశామ్, చింతయామాస - విక్రాంతః - న - చ - మే - నిర్వృతం - మనః ॥

అన్వయక్రమము :- సీతాయాః తాదృశీం తాం దారుణాం దశాం దృష్ట్వా విక్రాంతః అహం చింతయామాస, మే మనః న చ నిర్వృతమ్.

ప్రతిపదార్థము :- సీతాయాః = సీతాదేవియొక్క, తాదృశీం = ఆ విధమైనట్టి, దారుణాం = ఘోరమైన, తాం = ఆ, దశాం = పరిస్థితిని, దృష్ట్వా = చూచి, విక్రాంతః = దుఃఖాక్రాంతుడనై, అహం = నేను, చింతయామాస = ఆలోచించితిని. మే = నాయొక్క, మనః = మనస్సు, న చ నిర్వృతమ్ = సుఖములేనిదయ్యెను.

తాత్పర్యము :- సీతాదేవి ప్రస్తుతమున్న ఘోరమైన ఆ పరిస్థితిని చూడగనే నేను మిక్కిలి చింతాగ్రస్తుడనైతిని. అప్పట్ల నాకు మనస్సున ఏమియు సుఖము లేకుండెను.

శ్లో॥ సంభాషణార్థం చ మయా జానక్యా శ్చింతితో విధిః ।
ఇక్ష్వాకూణాం హి వంశ స్తు తతో మమ పురస్కృతః ॥ 91

పదచ్ఛేదము :- సంభాషణార్థం - చ - మయా - జానక్యాః - చింతితః - విధిః, ఇక్ష్వాకూణాం - హి - వంశః - తు - తతః - మమ - పురస్కృతః ॥

అన్వయక్రమము :- జానక్యాః సంభాషణార్థం మయా విధిః చింతితః. తతః ఇక్ష్వాకూణాం వంశః మమ పురస్కృతః.

ప్రతిపదార్థము :- జానక్యాః = సీతాదేవియొక్క, సంభాషణార్థం = సంభాషణము

కొఱకు, మయా = నాచేత, విధిః = విధానము, చింతితః = ఆలోచింపబడినది, తతః = పిమ్మట, ఇక్ష్వాకూణాం = ఇక్ష్వాకురాజులయొక్క, వంశః = వంశము, మమ (మయా) = నాచేత, పురస్కృతః = స్తుతించబడినది.

తాత్పర్యము :– పిమ్మట నేను సీతాదేవితో సంభాషించుటకై ఒక పద్ధతిని ఆలోచించితిని. వెంటనే నేను ఇక్ష్వాకువంశమును స్తుతింప నారంభించితిని.

శ్లో॥ శ్రుత్వా తు గదితాం వాచం రాజర్షిగణపూజితామ్ ।
ప్రత్యభాషత మాం దేవీ బాష్పైః పిహితలోచనా ॥ 92

పదచ్ఛేదము :– శ్రుత్వా – తు – గదితాం – వాచం – రాజర్షిగణపూజితామ్ । ప్రత్యభాషత – మాం – దేవీ – బాష్పైః – పిహితలోచనా ॥

అన్వయక్రమము :– రాజర్షిగణపూజితాం (తాం) గదితాం వాచం శ్రుత్వా బాష్పైః పిహితలోచనా దేవీ మాం ప్రత్యభాషత.

ప్రతిపదార్థము :– రాజర్షిగణపూజితాం = రాజఋషి బృందములచే శ్లాఘింపబడిన, తాం = ఆ, గదితాం = చెప్పబడినట్టి, వాచం = మాటను, శ్రుత్వా = విని, బాష్పైః = కన్నీళ్ళచే, పిహితలోచనా = కప్పబడిన కన్నులుగల్గినట్టి, దేవీ = ఆ పూజ్యురాలు, మాం = నన్నుగూర్చి, ప్రత్యభాషత = తిరిగి పలికెను.

తాత్పర్యము :– ఋషిగణము గూడ మెచ్చినట్టి నా మాటను వినినంతనే పూజ్యురాలైన ఆ సీత ఆనందబాష్పములతో తన కన్నులు నిండిపోయి యుండగా నాతో ఇట్లు పలికినది.

శ్లో॥ క స్త్వం కేన కథం చేహ ప్రాప్తో వానరపుంగవ ।
కాచ రామేణ తే ప్రీతి స్త న్మే శంసితు మర్హసి ॥ 93

పదచ్ఛేదము :– కః – త్వం – కేన – కథం – చ – ఇహ – ప్రాప్తః – వానరపుంగవ, కా – చ – రామేణ – తే – ప్రీతిః – తత్ – మే – శంసితుమ్ – అర్హసి ॥

అన్వయక్రమము :– వానరపుంగవ! త్వం కః? కేన కథం చ ఇహ ప్రాప్తః? తే రామేణ ప్రీతిః కా? తత్ మే శంసితుమ్ అర్హసి.

ప్రతిపదార్థము :– వానరపుంగవ! = ఓ వానర శ్రేష్ఠుడా!, త్వం = నీవు, కః = ఎవ్వడవు? కేన = ఏ కారణముచే, కథం = ఎట్లు, ఇహ = ఇటకు, ప్రాప్తః = చేరితివి? రామేణ = శ్రీరామునితో, తే = నీకు, ప్రీతిః = అనురాగము, కా = ఎట్టిది? తత్ = దానిని, మే = నాకు, శంసితుమ్ = చెప్పుటకు, అర్హసి = తగుదువు.

తాత్పర్యము :– ఓ వానరోత్తమా! నీవెవ్వడవు? ఎందుచేత ఇపుడు వచ్చితివి? నీ వెట్లుగ నిటకు రాగల్గితివి? రామునితో నీకు మైత్రి ఎట్లు గలిగినది? నా కది యంతయును తెలియజెప్పుము.

శ్లో॥ తస్యా స్తద్వచనం శ్రుత్వా హ్యహమ ప్యబ్రువం వచః ।
దేవి రామస్య భర్తు స్తే సహాయో భీమవిక్రమః ॥ 94

శ్లో॥ సుగ్రీవో నామ విక్రాంతో వానరేంద్రో మహాబలః ।
తస్య మాం విద్ధి భృత్యం త్వం హనుమంత మిహాగతమ్ ॥ 95

పదచ్ఛేదము :– తస్యాః – తత్ – వచనం – శ్రుత్వా – హి – అహమ్ – అపి – అబ్రువం – వచః, దేవి – రామస్య – భర్తుః – తే – సహాయః – భీమవిక్రమః, సుగ్రీవః – నామ – విక్రాంతః – వానరేంద్రః – మహాబలః – తస్య – మాం – విద్ధి – భృత్యం – త్వం – హనుమంతమ్ – ఇహ – ఆగతమ్ ॥

అన్వయక్రమము :– తస్యాః తత్ వచనం శ్రుత్వా అహమ్ అపి వచః అబ్రువమ్ – దేవి! తే భర్తుః రామస్య సహాయః భీమవిక్రమః విక్రాంతః మహాబలః సుగ్రీవః నామ వానరేంద్రః (అస్తి). తస్య భృత్యమ్ ఇహ ఆగతం హనుమంతం మాం త్వం విద్ధి.

ప్రతిపదార్థము :– తస్యాః = ఆమెయొక్క, తత్ = ఆ, వచనం = మాటను, శ్రుత్వా = విని, అహమ్ అపి = నేను గూడ, వచః = మాటను, అబ్రువమ్ = పలికితిని, దేవి! = ఓ పూజ్యురాలా!, తే = నీయొక్క, భర్తుః = భర్తయైన, రామస్య = రామునకు, సహాయః = సహాయకుడును, భీమవిక్రమః = భీకరపరాక్రమోపేతుడును, విక్రాంతః = మహావీరుడును, మహాబలః = మహాబలాఢ్యుడును అగు, సుగ్రీవః నామ = సుగ్రీవుడని పేరు పొందిన, వానరేంద్రః = వానరాధిపతి, (అస్తి = కలదు), తస్య = ఆతనియొక్క, భృత్యం = సేవకునిగను, ఇహ = ఇటకు, ఆగతం = వచ్చిన, హనుమంతం = హనుమంతుడను వానిగను, మాం = నన్ను గూర్చి, త్వం = నీవు, విద్ధి = తెలిసికొనుము.

తాత్పర్యము :– సీతాదేవి పలికిన ఆ మాటలను విని వెంటనే నేను ఆమెతో ఇట్లు చెప్పితిని – దేవీ! నీ భర్తయైన శ్రీరామునకు సహాయకుడుగా భీకరపరాక్రమోపేతుడును, మహావీరుడును, మహాబలాఢ్యుడును అగు సుగ్రీవుడను వానరరాజు గలడు. నేను ఆతడు పంపగ నిచటికి వచ్చిన హనుమంతుడను పేరుగల యాతని భృత్యుడనని నన్ను గూర్చి తెలుసుకొనుము.

శ్లో॥ భర్త్రాహం ప్రేషిత స్తుభ్యం రామే ణాక్లిష్టకర్మణా ।
ఇదం చ పురుషవ్యాఘ్రః శ్రీమాన్ దాశరథి స్స్వయమ్ ।
అంగులీయ మభిజ్ఞాన మదాత్తుభ్యం యశస్విని ॥ 96

పదచ్ఛేదము :– భర్త్రా – అహం – ప్రేషితః – తుభ్యం – రామేణ – అక్లిష్టకర్మణా, ఇదం – చ – పురుషవ్యాఘ్రః – శ్రీమాన్ – దాశరథిః – స్వయమ్, అంగులీయమ్ – అభిజ్ఞానమ్ – అదాత్ – తుభ్యం – యశస్విని ॥

అన్వయక్రమము :– అక్లిష్టకర్మణా తే భర్త్రా రామేణ అహం తుభ్యం ప్రేషితః, యశస్విని! పురుషవ్యాఘ్రః శ్రీమాన్ దాశరథిః స్వయం తుభ్యమ్ ఇదమ్ అభిజ్ఞానమ్ అంగులీయమ్ అదాత్.

ప్రతిపదార్థము :– అక్లిష్టకర్మణా = క్లేశములేని కర్మలు గలిగినట్టి, (తే) భర్త్రా = (నీ) భర్తయైన, రామేణ = శ్రీరామునిచే, అహం = నేను, తుభ్యం = నీ కొరకు, ప్రేషితః = పంపబడితిని, యశస్విని! = కీర్తిమంతురాలా! పురుషవ్యాఘ్రః = పురుష శ్రేష్ఠుడును, శ్రీమాన్ = శుభలక్షణ సంపన్నుడునగు, దాశరథిః = దశరథనందనుడు, స్వయం = స్వయముగా, తుభ్యం = నీ కొరకు, ఇదమ్ = ఈ, అభిజ్ఞానమ్ = ఆనవాలయినట్టి, అంగులీయమ్ = ఉంగరమును, అదాత్ = ఇచ్చెను.

తాత్పర్యము :– క్లేశదూరముగా ఆవశ్యకకృత్యములను గావించునట్టి ఉత్తముడైన నీనాథుడు నీకొరకై నన్ను ఇచ్చటికి పంపినాడు. కీర్తిమంతురాలవైన సీతా! పురుషోత్తము డయిన ఆ దశరథనందనుడు నీ కానవాలుగా ఈ యుంగరము నిమ్మని స్వయముగా నాచేతికి ఇచ్చినాడు.

శ్లో॥ త దిచ్ఛామి త్వయాఽఽజ్ఞప్తం దేవి కిం కరవా ణ్యహమ్ ।
రామలక్ష్మణయోః పార్శ్వం నయామి త్వాం కి ముత్తరమ్ ॥ 97

పదచ్ఛేదము :– తత్ – ఇచ్ఛామి – త్వయా – ఆజ్ఞప్తం – దేవి – కిం – కరవాణి – అహమ్ – రామలక్ష్మణయోః – పార్శ్వం – నయామి – త్వాం – కిమ్ – ఉత్తరమ్ ॥

అన్వయక్రమము :– తత్ దేవి! అహం కిం కరవాణి? త్వయా ఆజ్ఞప్తమ్ ఇచ్ఛామి, రామలక్ష్మణయోః పార్శ్వం త్వాం నయామి.

ప్రతిపదార్థము :– తత్ = అందువలన, దేవి! = ఓ జానకీదేవీ! అహం = నేను, కిం = ఏమి, కరవాణి = చేయుదును? త్వయా = నీచేత, ఆజ్ఞప్తం = ఆజ్ఞాపింపబడుటను, ఇచ్ఛామి = కోరుచున్నాను, త్వాం = నిన్ను, రామలక్ష్మణయోః = రామలక్ష్మణుల

యొక్క, పార్శ్వం = పజ్జకు, నయామి = కొనిపోవుదును, ఉత్తరం = సమాధానము, కిం = ఏమి?

తాత్పర్యము :– తల్లీ! ఇప్పుడు నన్ను ఏమి చేయుమందువో ఆజ్ఞాపింపుము. నిన్నిప్పుడే రామలక్ష్మణుల కడకు గొని పొమ్మందువా! నీ జవాబేమి? చెప్పుము.

శ్లో॥ ఏత చ్ఛ్రుత్వా విదిత్వా చ సీతా జనకనందినీ ।
ఆహ రావణ ముత్సాద్య రాఘవో మాం నయ త్వితి ॥ 98

పదచ్ఛేదము :– ఏతత్ – శ్రుత్వా – విదిత్వా – చ – సీతా – జనకనందినీ, ఆహ – రావణమ్ – ఉత్సాద్య – రాఘవః – మాం – నయతు – ఇతి ॥

అన్వయక్రమము :– జనకనందినీ సీతా ఏతత్ శ్రుత్వా విదిత్వా చ రాఘవః రావణం ఉత్సాద్య మాం నయతు ఇతి ఆహ.

ప్రతిపదార్థము :– జనకనందినీ = జనకునకు పుత్రికయైన, సీతా = సీతాదేవి, ఏతత్ = ఈ మాటను, శ్రుత్వా = విని, విదిత్వా చ = తెలిసికొని, రాఘవః = శ్రీరాముడు, రావణం = రావణుని, ఉత్సాద్య = పరిమార్చి, మాం = నన్ను, నయతు = తీసికొని వెళ్ళునుగాక!, ఇతి = అని, ఆహ = పలికెను.

తాత్పర్యము :– జనకపుత్రియైన సీతాదేవి నేను చెప్పిన దంతయును విని భావము గ్రహించి "శ్రీరాముడు రావణాసురుని సంహరించి నన్ను తనవెంట గైకొని పోవునుగాక!" అని నాకు సమాధానము చెప్పెను.

శ్లో॥ ప్రణమ్య శిరసా దేవీ మహ మార్యా మనిందితామ్ ।
రాఘవస్య మనోహ్లాద మభిజ్ఞాన మయాచిషమ్ ॥ 99

పదచ్ఛేదము :– ప్రణమ్య – శిరసా – దేవీమ్ – అహమ్ – ఆర్యామ్ – అనిందితామ్, రాఘవస్య – మనోహ్లాదమ్ – అభిజ్ఞానమ్ – అయాచిషమ్ ॥

అన్వయక్రమము :– అహమ్ ఆర్యామ్ అనిందితాం దేవీం శిరసా ప్రణమ్య రాఘవస్య మనోహ్లాదమ్ అభిజ్ఞానమ్ అయాచిషమ్.

ప్రతిపదార్థము :– అహమ్ = నేను, ఆర్యామ్ = పూజ్యురాలును, అనిందితాం = నిందారహితురాలునగు, దేవీం = సీతాదేవిని, శిరసా = శిరస్సుతో, ప్రణమ్య = మ్రొక్కి, రాఘవస్య = శ్రీరామునకు, మనోహ్లాదం = మనస్సున కానందము గల్గించునట్టి, అభిజ్ఞానం = ఆనవాలును, అయాచిషమ్ = అడిగితిని.

తాత్పర్యము :– నేనప్పుడు పవిత్రురాలును పూజ్యురాలునగు సీతాదేవికి తలవంచి నమస్కరించి శ్రీరాముని మనస్సునకు ప్రియమునుగూర్చు ఆనవా లొకటి యొసగుమని కోరితిని.

శ్లో॥ అథ మామబ్రవీ త్సీతా గృహ్యతా మయ ముత్తమః ।
మణిర్యేన మహాబాహూ రామ స్త్వాం బహుమన్యతే ॥ 100

పదచ్ఛేదము :– అథ – మామ్ – అబ్రవీత్ – సీతా – గృహ్యతామ్ – అయమ్ – ఉత్తమః, మణిః – యేన – మహాబాహుః – రామః – త్వాం – బహు – మన్యతే ॥

అన్వయక్రమము :– అథ సీతా, మహాబాహుః రామః త్వాం యేన బహుమన్యతే (సః) అయమ్ ఉత్తమః మణిః గృహ్యతామ్ (ఇతి) మామ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, సీతా = సీతాదేవి, మహాబాహుః = గొప్ప బాహువులు గల్గిన, రామః = శ్రీరాముడు, త్వాం = నిన్ను, యేన = దేనిచే, బహుమన్యతే = మెచ్చుకొనునో, (సః = అట్టి), అయం = ఈ, ఉత్తమః = శ్రేష్ఠమైన, మణిః = చూడామణి, గృహ్యతాం = గ్రహింపబడుగాక, (ఇతి = అని) మామ్ = నన్ను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :– అప్పుడు సీతాదేవి ఇదిగో ఈ యమూల్యమైన చూడామణిని తీసికొని వెళ్ళుము. దీనిని చూచి మహావీరుడైన శ్రీరాముడు నిన్నెంతయో మెచ్చుకొనునని పలికెను.

శ్లో॥ ఇత్యుక్త్వా తు వరారోహా మణిప్రవర మద్భుతమ్ ।
ప్రాయచ్ఛ త్పరమోద్విగ్నా వాచా మాం సందిదేశ హ ॥ 101

పదచ్ఛేదము :– ఇతి – ఉక్త్వా – తు – వరారోహ – మణిప్రవరమ్ – అద్భుతమ్, ప్రాయచ్ఛత్ – పరమోద్విగ్నా – వాచా – మాం – సందిదేశ – హ ॥

అన్వయక్రమము :– వరారోహా తు ఇతి ఉక్త్వా అద్భుతం మణిప్రవరం ప్రాయచ్ఛత్, పరమోద్విగ్నా వాచా మాం సందిదేశ హ.

ప్రతిపదార్థము :– వరారోహా తు = సుందరాంగియైన సీతాదేవి, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, అద్భుతం = అద్భుతమైన, మణిప్రవరం = మణిశ్రేష్ఠమును, ప్రాయచ్ఛత్ = ఒసగెను, పరమోద్విగ్నా (సతీ) = మిక్కిలిగా చింతావేశము నొందినదై, వాచా = మాటతో, మాం = నన్నుగూర్చి, సందిదేశ హ = సందేశమొసగినది.

తాత్పర్యము :– కోమలాంగి ఈ రీతిగ పలికి అద్భుతమైనట్టి ఆ చూడామణిని నా కొసగెను. మరియు మిక్కిలి చింతావేశముతో తన సందేశవచనములను కొన్నింటిని నాకు చెప్పినది.

శ్లో॥ తత స్తస్యై ప్రణ మ్యాహం రాజపుత్ర్యై సమాహితః ।
ప్రదక్షిణం పరిక్రామ మి హాభ్యుద్గతమానసః ॥ 102

పదచ్ఛేదము :– తతః – తస్యై – ప్రణమ్య – అహం – రాజపుత్ర్యై – సమాహితః, ప్రదక్షిణం – పరిక్రామమ్ – ఇహ – అభ్యుద్గతమానసః ॥

అన్వయక్రమము :– తతః అహం తస్యై రాజపుత్ర్యై ప్రణమ్య సమాహితః ఇహ అభ్యుద్గతమానసః (సన్) ప్రదక్షిణం పరిక్రామమ్.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, అహం = నేను, రాజపుత్ర్యై = రాజపుత్రికయైన సీతాదేవికి, ప్రణమ్య = నమస్కరించి, సమాహితః = శ్రద్ధగలవాడనై, ఇహ = ఇచ్చటికి, అభ్యుద్గతమానసః (సన్) = తిరిగివచ్చుటయందు మనస్సుగలవాడనగుచు, ప్రదక్షిణం = ప్రదక్షిణముగ, పరిక్రామమ్ = చుట్టును తిరిగితిని.

తాత్పర్యము :– అటుపిమ్మట నేను జానకీదేవికి మ్రొక్కి నిశ్చలమనస్కుడనై మిమ్ము త్వరలో చేరుకొనవలెనన్న తలంపుతో తిరిగి వచ్చుచు ఆమెకు ప్రదక్షిణము చేసితిని.

శ్లో॥ ఉక్తో ఽహం పునరే వేదం నిశ్చిత్య మనసా తయా ।
హనుమ న్మమ వృత్తాంతం వక్తు మర్హసి రాఘవే ॥ 103

పదచ్ఛేదము :– ఉక్తః – అహం – పునః – ఏవ – ఇదం – నిశ్చిత్య – మనసా – తయా, హనుమన్ – మమ – వృత్తాంతం – వక్తుమ్ – అర్హసి – రాఘవే ॥

అన్వయక్రమము :– తయా మనసా నిశ్చిత్య పునః ఏవ ఇదమ్ అహమ్ ఉక్తః. హనుమన్! రాఘవే మమ వృత్తాంతం వక్తుమ్ అర్హసి.

ప్రతిపదార్థము :– తయా = ఆ జానకీదేవిచే, మనసా = మనస్సుచే, నిశ్చిత్య = నిశ్చయించుకొని, పునః ఏవ = తిరిగి, అహం = నేను, ఉక్తః = చెప్పబడితిని, హనుమన్ = ఓ హనుమా! రాఘవే = శ్రీరాముని సన్నిధియందు, మమ = నాయొక్క, వృత్తాంతం = విషయమును, వక్తుమ్ = చెప్పుటకు, అర్హసి = తగుదువు.

తాత్పర్యము :– అప్పుడు జానకీదేవి తన మనస్సునందు నిశ్చయించుకొన్న మాటలను తిరిగి నాతో మనసార ఈ విధముగ చెప్పినది. ఓ హనుమా! శ్రీరామునకు నా వృత్తాంతమునంతను విశదము చేయుము.

శ్లో॥ యథా శ్రుత్వైవ నచిరా త్తావుభౌ రామలక్ష్మణౌ ।
సుగ్రీవసహితౌ వీరా వుపేయాతాం తథా కురు ॥ 104

పదచ్ఛేదము :- యథా - శ్రుత్వా - ఏవ - న - చిరాత్ - తౌ - ఉభౌ - రామలక్ష్మణౌ, సుగ్రీవసహితౌ - వీరౌ - ఉపేయాతాం - తథా - కురు ॥

అన్వయక్రమము :- శ్రుత్వా ఏవ వీరౌ తౌ ఉభౌ రామలక్ష్మణౌ యథా న చిరాత్ సుగ్రీవసహితౌ ఉపేయాతాం తథా కురు.

ప్రతిపదార్థము :- శ్రుత్వా ఏవ = వినినవెంటనే, వీరౌ = వీరులైనట్టి, తౌ = ఆ, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులు, ఉభౌ = ఇరువురును, యథా = ఏ రీతిగా, నచిరాత్ = శీఘ్రముగా, సుగ్రీవసహితౌ = సుగ్రీవునితో కూడినవారై, ఉపేయాతాం = రాగలరో, తథా = ఆ రీతిగా, కురు = చేయుము.

తాత్పర్యము :- మహావీరులైన ఆ రామలక్ష్మణులిరువురును నీవు చెప్పిన నా వృత్తాంతమును వినిన వెంటనే సుగ్రీవాదులతో గూడి శీఘ్రముగ నెట్లు బయలుదేరి రాగలరో ఆ పద్ధతిగా నీవు కార్యసాఫల్యమును చేకూర్చవలెను.

శ్లో॥ య దన్యథా భవే దేత ద్ద్వౌ మాసౌ జీవితం మమ ।
న మాం ద్రక్ష్యతి కాకుత్స్థో మ్రియే సాఽహ మనాథవత్ ॥ 105

పదచ్ఛేదము :- యది - అన్యథా - భవేత్ - ఏతత్ - ద్వౌ - మాసౌ - జీవితం - మమ, న - మాం - ద్రక్ష్యతి - కాకుత్స్థః - మ్రియే - సా - అహం - అనాథవత్ ॥

అన్వయక్రమము :- ఏతత్ అన్యథా భవేత్ యది మమ జీవితం ద్వౌ మాసౌ (భవేత్) కాకుత్స్థః మాం న ద్రక్ష్యతి, సా అహం అనాథవత్ మ్రియే.

ప్రతిపదార్థము :- ఏతత్ = ఈ యత్నము, అన్యథా = వేరొక రీతిగా, భవేత్ యది = జరిగినయెడల, మమ = నాకు, జీవితం = జీవితము, ద్వౌ మాసౌ = రెండు నెలలు, భవేత్ = అగును, కాకుత్స్థః = శ్రీరాముడు, మాం = నన్ను, న ద్రక్ష్యతి = చూడబోవడు, సా అహం = అట్టి నేను, అనాథవత్ = అనాథవలె, మ్రియే = మరణింతును.

తాత్పర్యము :- నీ యత్నము కొనసాగుట, రామలక్ష్మణులు వచ్చుట, యనునవి జరుగక పోయినచో ఇక మీదట నేను జీవించియుండు కాలము ఒక్క రెండు మాసములే సుమా! అటుపిమ్మట నన్ను శ్రీరాముడు చూడజాలడు. నే నిచ్చట దిక్కులేని దాననై మరణింపవలసినదే.

శ్లో॥ తచ్ఛ్రుత్వా కరుణం వాక్యం క్రోధో మా మభ్యవర్తత ।
ఉత్తరం చ మయా దృష్టం కార్యశేష మనంతరమ్ ॥ 106

పదచ్ఛేదము :– తత్ – శ్రుత్వా – కరుణం – వాక్యం – క్రోధః – మామ్ – అభ్యవర్తత, ఉత్తరం – చ – మయా – దృష్టం – కార్యశేషమ్ – అనంతరమ్ ॥

అన్వయక్రమము :– కరుణం తత్ వాక్యం శ్రుత్వా మాం క్రోధః అభ్యవర్తత; మయా అనంతరమ్ ఉత్తరం కార్యశేషం చ దృష్టమ్.

ప్రతిపదార్థము :– కరుణం = జాలిగొలుపునట్టి, తత్ = ఆ, వాక్యం = వచనమును, శ్రుత్వా = విని, మాం = నన్ను, క్రోధః = క్రోధము, అభ్యవర్తత = అలముకొనెను, అనంతరం = పిమ్మట, మయా = నాచేత, ఉత్తరం = తరువాతిదైన, కార్యశేషం = కర్తవ్యశేషము, దృష్టమ్ = చూడబడినది.

తాత్పర్యము :– సీతాదేవి పలికిన దీనమైన ఆ మాటలను వినినంతనే నాలో తీవ్రమైన క్రోధము చెలరేగినది. వెంటనే పూర్తి చేయవలసిన భవిష్యత్కార్యమును నిర్ణయించు కొంటిని.

శ్లో॥ తతోఽవర్ధత మే కాయ స్తదా పర్వతసన్నిభః ।
యుద్ధకాంక్షీ వనం తస్య వినాశయితు మారభే ॥ 107

పదచ్ఛేదము :– తతః – అవర్ధత – మే – కాయః – తదా – పర్వతసన్నిభః, యుద్ధకాంక్షీ – వనం – తస్య – వినాశయితుమ్ – ఆరభే ॥

అన్వయక్రమము :– తతః మే కాయః పర్వతసన్నిభః అవర్ధత, తదా (అహం) యుద్ధకాంక్షీ (సన్) తస్య వనం వినాశయితుమ్ ఆరభే.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, మే = నాయొక్క, కాయః = దేహము, పర్వతసన్నిభః = పర్వతముతో సమానమైనదిగా, అవర్ధత = పెరిగెను, తదా = అప్పుడు, (అహం = నేను) యుద్ధకాంక్షీ = యుద్ధమును గోరుచున్నవాడనై, తస్య = ఆ రావణునియొక్క, వనం = అశోకవనమును, వినాశయితుం = ధ్వంసము చేయుటకు, ఆరభే = ప్రారంభించితిని.

తాత్పర్యము :– అట్లు క్రోధావేశము నొందియున్న నా శరీరము పర్వతమువలె పెరిగిపోయినది. అంతట నేను రాక్షసులతో సంగ్రామ మొనర్ప గోరినవాడనై అచ్చట గల రావణుని అశోకవనమును ధ్వంసము చేయసాగితిని.

శ్లో॥ త ద్భగ్నం వనషండం తు భ్రాంతత్రస్తమృగద్విజమ్ ।
ప్రతిబుద్ధా నిరీక్షంతే రాక్షస్యో వికృతాననాః ॥ 108

పదచ్ఛేదము :– తత్ – భగ్నం – వనషండం – తు – భ్రాంతత్రస్తమృగద్విజమ్, ప్రతిబుద్ధాః – నిరీక్షంతే – రాక్షస్యః – వికృతాననాః ॥

అన్వయక్రమము :– భ్రాంతత్రస్తమృగద్విజం భగ్నం తత్ వనషండం ప్రతిబుద్ధాః వికృతాననాః రాక్షస్యః నిరీక్షంతే.

ప్రతిపదార్థము :– భ్రాంతత్రస్తమృగద్విజం = పరుగిడుచు భయము నొందిన జంతువులును పక్షులును గలిగినట్టి, భగ్నం = ధ్వంసము చేయబడిన, తత్ = ఆ, వనషండం = వనసమూహమును, ప్రతిబుద్ధాః = మేలుకొన్నట్టి, వికృతాననాః = వికారమైన ముఖములు కల్గినట్టి, రాక్షస్యః = రాక్షసస్త్రీలు, నిరీక్షంతే = తేరిపారి చూచుచుండిరి.

తాత్పర్యము :– ఆ రాక్షసస్త్రీలు మెలకువ వచ్చినవారై భయముతో బెదిరి పరుగిడుచున్న జంతువులను, పక్షులను, ధ్వంసమైయున్న ఆ వనమునందలి వృక్షసమూహములను వికారమైన ముఖములతో ఆశ్చర్యముతో చూడసాగిరి.

శ్లో॥ మాం చ దృష్ట్వా వనే తస్మి న్సమాగమ్య తత స్తతః ।
తా స్సమభ్యాగతాః క్షిప్రం రావణా యాచచక్షిరే ॥ 109

పదచ్ఛేదము :– మాం – చ – దృష్ట్వా – వనే – తస్మిన్ – సమాగమ్య – తతః – తతః, తాః – సమభ్యాగతాః – క్షిప్రం – రావణాయ – ఆచచక్షిరే ॥

అన్వయక్రమము :– తస్మిన్ వనే తతః తతః సమాగమ్య మాం దృష్ట్వా సమభ్యాగతాః తాః క్షిప్రం రావణాయ ఆచచక్షిరే.

ప్రతిపదార్థము :– తస్మిన్ = ఆ, వనే = అశోకవనమున, తతః తతః = అక్కడక్కడ నుండి, సమాగమ్య = చేరి, మాం = నన్ను, దృష్ట్వా = చూచి, సమభ్యాగతాః = కలసికొన్నట్టి, తాః = ఆ రాక్షసస్త్రీలు, క్షిప్రం = శీఘ్రముగా, రావణాయ = రావణుని కొరకు, ఆచచక్షిరే = చెప్పిరి.

తాత్పర్యము :– ఆ యశోకవనమున నలువైపులను కావలియున్న రాక్షసస్త్రీలు అందరును ఒక చోటికి చేరి నన్ను కనుగొని వెంటనే రావణుని కడకేగి జరిగిన వృత్తాంతమును తెలియజెప్పిరి.

శ్లో॥ రాజ న్వన మిదం దుర్గం తవ భగ్నం దురాత్మనా ।
వానరేణ హ్యవిజ్ఞాయ తవ వీర్యం మహాబల ॥ 110

పదచ్ఛేదము :– రాజన్ – వనమ్ – ఇదం – దుర్గం – తవ – భగ్నం – దురాత్మనా, వానరేణ – హి – అవిజ్ఞాయ – తవ – వీర్యం – మహాబల ॥

అన్వయక్రమము :– రాజన్! మహాబల! తవ వీర్యమ్ అవిజ్ఞాయ దురాత్మనా వానరేణ దుర్గమ్ ఇదం తవ వనం భగ్నమ్.

ప్రతిపదార్థము :– రాజన్ = ఓ రాజా! మహాబల = ఓ మహాబలశాలీ! తవ = నీ యొక్క, వీర్యం = పరాక్రమమును, అవిజ్ఞాయ = తెలియక, దురాత్మనా = దుర్మార్గుడైన, వానరేణ = ఒక వానరునిచే, దుర్గం = దుర్గమమైనట్టి, ఇదం = ఈ, తవ వనం = నీయొక్కవనము, భగ్నమ్ = ధ్వంసము చేయబడినది.

తాత్పర్యము :– మహావీరుడైన ఓ రాక్షసరాజా! నీ పరాక్రమమును గూర్చి ఏమియు ఎరుగనట్టి ఒకానొక వానరుడు, ఎవ్వరును దరిచేరరానట్టి నీ అశోకవనమును ప్రవేశించి ధ్వంసము చేసినాడు.

శ్లో॥ దుర్బుద్ధే స్తస్య రాజేంద్ర తవ విప్రియకారిణః ।
వధ మాజ్ఞాపయ క్షిప్రం యథా உసౌ విలయం వ్రజేత్ ॥ 111

పదచ్ఛేదము :– దుర్బుద్ధేః – తస్య – రాజేంద్ర – తవ – విప్రియకారిణః, వధమ్ – ఆజ్ఞాపయ – క్షిప్రం – యథా – అసౌ – విలయం – వ్రజేత్ ॥

అన్వయక్రమము :– రాజేంద్ర! యథా అసౌ విలయం వ్రజేత్ (తథా) క్షిప్రం తవ విప్రియకారిణః తస్య దుర్బుద్ధేః వధమ్ ఆజ్ఞాపయ.

ప్రతిపదార్థము :– రాజేంద్ర = ఓ రాజోత్తమా! యథా = ఏ రీతిగా, అసౌ = ఇతడు, విలయం = నాశమును, వ్రజేత్ = పొందునో, (తథా = ఆరీతిగా), క్షిప్రం = శీఘ్రముగా, తవ = నీకు, విప్రియకారిణః = అనిష్టము గావించినట్టి, తస్య = ఆ, దుర్బుద్ధేః = దురాత్మునకు, వధం = వధను, ఆజ్ఞాపయ = ఆజ్ఞాపించుము.

తాత్పర్యము :– మహారాజా! నీకు అనిష్టము గావించిన ఆ దుర్మార్గుడు నామరూపములు లేకుండ పోవునట్లుగా వెంటనే ఆతనికి మృత్యుదండనమును విధింపుము.

శ్లో॥ త చ్ఛ్రుత్వా రాక్షసేంద్రేణ విసృష్టా భృశదుర్జయాః ।
రాక్షసాః కింకరా నామ రావణస్య మనోనుగాః ॥ 112

పదచ్ఛేదము :- తత్ - శ్రుత్వా - రాక్షసేంద్రేణ - విసృష్టాః - భృశదుర్జయాః, రాక్షసాః - కింకరాః - నామ - రావణస్య - మనోనుగాః ॥

అన్వయక్రమము :- తత్ శ్రుత్వా రాక్షసేంద్రేణ భృశదుర్జయాః రావణస్య మనోనుగాః కింకరాః నామ రాక్షసాః విసృష్టాః.

ప్రతిపదార్థము :- తత్ = ఆ మాటను, శ్రుత్వా = విని, రాక్షసేంద్రేణ = రాక్షసాధిపతియైన రావణునిచే, భృశదుర్జయాః = మిక్కిలి అజేయులైనట్టి వారును, రావణస్య = రావణునకు, మనోనుగాః = మనస్సుననుసరించువారును అగు, కింకరాః నామ = కింకరులను పేరుగల, రాక్షసాః = రాక్షసులు, విసృష్టాః = పంపబడిరి.

తాత్పర్యము :- ఆ వనపాలకురాండ్రు చెప్పిన మాటలు విని రాక్షసరాజైన రావణుడు యుద్ధమునందు అజేయులైనవారును తన మనసుననుసరించి మెలగువారునగు కింకరులనెడి రాక్షసులను నన్నెదుర్కొనుటకై పంపెను.

శ్లో॥ తేషా మశీతిసాహస్రం శూలముద్గరపాణినామ్ ।
మయా తస్మి న్వనోద్దేశే పరిఘేణ నిషూదితమ్ ॥ 113

పదచ్ఛేదము :- తేషామ్ - అశీతిసాహస్రం - శూలముద్గరపాణినామ్, మయా - తస్మిన్ - వనోద్దేశే - పరిఘేణ - నిషూదితమ్ ॥

అన్వయక్రమము :- శూలముద్గరపాణినాం తేషామ్ అశీతిసాహస్రం మయా తస్మిన్ వనోద్దేశే పరిఘేణ నిషూదితమ్.

ప్రతిపదార్థము :- శూలముద్గరపాణినాం = శూలములు ముద్గరములు చేతులందు గలిగినట్టి, తేషాం = ఆ రాక్షసుల యొక్క, అశీతిసాహస్రం = ఎనుబదివేల సమూహము, మయా = నాచే, తస్మిన్ = ఆ, వనోద్దేశే = వనప్రదేశమునందు, పరిఘేణ = పరిఘాయుధముచే, నిషూదితమ్ = వధింపబడెను.

తాత్పర్యము :- శూలములు ముద్గరములు చేతియందు దాల్చి పోరాడుచున్నట్టి ఆ ఎనుబదివేలమంది రాక్షసులను నేనా వనప్రదేశమునందు పరిఘాయుధమును చేతబూని సంహరించివైచితిని.

శ్లో॥ తేషాం తు హతశేషా యే తే గత్వా లఘువిక్రమాః ।
నిహతం చ మహత్సైన్యం రావణాయాऽऽచచక్షిరే ॥ 114

పదచ్ఛేదము :- తేషాం - తు - హతశేషాః - యే - తే - గత్వా - లఘువిక్రమాః, నిహతం - చ - మహత్ - సైన్యం - రావణాయ - ఆచచక్షిరే ॥

అన్వయక్రమము :– తేషాం లఘువిక్రమాః యే హతశేషాః (సంతి) తే గత్వా రావణాయ మహత్ సైన్యం నిహతమ్ ఆచచక్షిరే.

ప్రతిపదార్థము :– తేషాం = వారిలో, లఘువిక్రమాః = లాఘవముగల పరాక్రమము గలవారు, యే = ఎవ్వరు, హతశేషాః = చావగా మిగిలినవారు, సంతి = ఉన్నారో, తే = వారు, గత్వా = పోయి, రావణాయ = రావణునికి, మహత్ = గొప్పదైన, సైన్యం = సైన్యము, నిహతం = మరణించినదిగా, ఆచచక్షిరే = చెప్పిరి.

తాత్పర్యము :– ఆ కింకరాసురులలో నా చేతినుండి తప్పించుకొని పోయిన హతశేషులైన రాక్షసవీరులు కొందరు శీఘ్రముగ రావణుని కడకు పోయి నీచే పంపబడిన ఆ గొప్ప సైన్యమంతయును మడిసినదని ఆతనికి తెలియజేసిరి.

శ్లో॥ తతో మే బుద్ధి రుత్పన్నా చైత్యప్రాసాద మాక్రమమ్ ।
తత్రస్థాన్ రాక్షసాన్ హత్వా శతం స్తంభేన వై పునః ।
లలామభూతో లంకాయా స్స వై విధ్వంసితో మయా ॥ 115

పదచ్ఛేదము :– తతః – మే – బుద్ధిః – ఉత్పన్నా – చైత్యప్రాసాదమ్ – ఆక్రమమ్, తత్రస్థాన్ – రాక్షసాన్ – హత్వా – శతం – స్తంభేన – వై – పునః, లలామభూతః – లంకాయాః – సః – వై – విధ్వంసితః – మయా ॥

అన్వయక్రమము :– తతః మే బుద్ధిః ఉత్పన్నా, చైత్యప్రాసాదమ్ ఆక్రమమ్, తత్రస్థాన్ శతం రాక్షసాన్ స్తంభేన హత్వా పునః లంకాయాః లలామభూతః సః చ మయా విధ్వంసితః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, మే = నాకు, బుద్ధిః = ఒక తలంపు, ఉత్పన్నా = జనించినది, చైత్యప్రాసాదం = చైత్యప్రాసాదమును, ఆక్రమమ్ = అక్రమించితిని. తత్రస్థాన్ = అందున్న, శతం = నూర్గురు, రాక్షసాన్ = రాక్షసులను, స్తంభేన = ప్రాసాద స్తంభముచే, హత్వా = పరిమార్చి, పునః = తిరిగి, లంకాయాః = లంకకు, లలామభూతః = ఆభరణమైనట్టి, సః చ = ఆ ప్రాసాదముగూడ, మయా = నాచేత, విధ్వంసితః = భగ్నము గావింపబడినది.

తాత్పర్యము :– అంతలో నాకొక తలంపు గలిగి ఆ సమీపముననే యున్న చైత్య ప్రాసాదమును జేరితిని. అచట రక్షకులుగా నున్న వందమంది రాక్షసభటులను ఆ ప్రాసాదస్తంభముతోనే మోది పరిమార్చితిని. మరియు ఆ లంకకు ఆభరణముగా నున్న ఆ చైత్యప్రాసాదమును గూడ నేలగూల్చితిని.

శ్లో॥ తతః ప్రహస్తస్య సుతం జంబుమాలిన మాదిశత్ ।
రాక్షసై ర్బహుభిః స్సార్ధం ఘోరరూపై ర్భయానకైః ॥ 116

పదచ్ఛేదము :- తతః - ప్రహస్తస్య - సుతం - జంబుమాలినమ్ - ఆదిశత్, రాక్షసైః - బహుభిః - సార్ధం - ఘోరరూపైః - భయానకైః ॥

అన్వయక్రమము :- తతః ఘోరరూపైః భయానకైః బహుభిః రాక్షసైః సార్ధం ప్రహస్తస్య సుతం జంబుమాలినమ్ ఆదిశత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, ఘోరరూపైః = భయంకరరూపము గల్గినవారు, భయానకైః = భయంకరులునగు, బహుభిః = పెక్కుమంది, రాక్షసైః సార్ధం = రాక్షసులతోగూడ, ప్రహస్తస్య = ప్రహస్తునియొక్క, సుతం = పుత్రుడైన, జంబుమాలినం = జంబుమాలియను వానిని, ఆదిశత్ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- భీకరమైన శరీరముతో భయము గొల్పునట్టి అసంఖ్యాకులైన రాక్షసులను తోడిచ్చి ప్రహస్తుడను మంత్రిపుత్రుడైన జంబుమాలిని రావణుడు నన్ను చంపి రమ్మని ఆజ్ఞాపించెను.

శ్లో॥ త మహం బలసంపన్నం రాక్షసం రణకోవిదమ్ ।
పరిఘే ణాతిఘోరేణ సూదయామి సహానుగమ్ ॥ 117

పదచ్ఛేదము :- తమ్ - అహం - బలసంపన్నం - రాక్షసం - రణకోవిదమ్, పరిఘేణ - అతిఘోరేణ - సూదయామి - సహానుగమ్ ॥

అన్వయక్రమము :- అహం బలసంపన్నం రణకోవిదం తం రాక్షసం సహానుగమ్ అతిఘోరేణ పరిఘేణ సూదయామి.

ప్రతిపదార్థము :- అహం = నేను, బలసంపన్నం = బలశాలియును, రణకోవిదం = యుద్ధమునం దారితేరిన వాడునగు, తం = ఆ, రాక్షసం = జంబుమాలిని, సహానుగం = సహచరులతో గూడ, అతిఘోరేణ = మిక్కిలి భీకరమైన, పరిఘేణ = ఇనుప గుదియతో, సూదయామి = హతమార్చితిని.

తాత్పర్యము :- వెంటనే నేను మహాబలాఢ్యుడును, యుద్ధవిశారదుడును అగు జంబుమాలిని, అతనితో వచ్చిన అసంఖ్యాకులైన రాక్షసవీరులనుగూడ నా చేతిలోని ఇనుపగుదియతోడనే హతమార్చితిని.

శ్లో॥ త చ్ఛ్రుత్వా రాక్షసేంద్రస్తు మంత్రిపుత్రా న్మహాబలాన్ ।
పదాతిబలసంపన్నాన్ ప్రేషయామాస రావణః ।
పరిఘేణైవ తా న్సర్వా న్నయామి యమసాదనమ్ ॥ 118

పదచ్ఛేదము :– తత్ – శ్రుత్వా – రాక్షసేంద్రః – తు – మంత్రిపుత్రాన్ – మహాబలాన్ – పదాతిబలసంపన్నాన్ – ప్రేషయామాస – రావణః, పరిఘేణ – ఏవ – తాన్ – సర్వాన్ – నయామి – యమసాదనమ్ ॥

అన్వయక్రమము :– రాక్షసేంద్రః రావణః తత్ శ్రుత్వా పదాతిబలసంపన్నాన్ మహాబలాన్ మంత్రిపుత్రాన్ ప్రేషయామాస, తాన్ సర్వాన్ అహం పరిఘేణ ఏవ యమసాదనం నయామి.

ప్రతిపదార్థము :– రాక్షసేంద్రః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, తత్ = ఆ విషయమును, శ్రుత్వా = విని, మహాబలాన్ = అమితబలసంపన్నులును, పదాతిబల సంపన్నాన్ = పెద్దకాల్బలముతో గూడినవారునగు, మంత్రిపుత్రాన్ = మంత్రికుమారులను, ప్రేషయామాస = పంపెను, తాన్ = వారిని, సర్వాన్ = అందరిని, పరిఘేణ ఏవ = ఇనుపగుదియ తోడనే, యమసాదనం = యముని భవనమునకు, నయామి = చేర్చితిని.

తాత్పర్యము :– రాక్షసరాజైన రావణుడు జంబుమాలి యుద్ధమున గూలెనని విని వెంటనే గొప్పదైన కాల్బలమును తోడుగ నిచ్చి మహాబలాఢ్యులైన మంత్రిపుత్రు లను నా మీదికి పంపెను. వారినందరిని నాచేతిలోని ఆ ఇనుప గుదియతోడనే యముని సదనమునకు పంపితిని.

శ్లో॥ మంత్రి పుత్రాన్ హతాన్ శ్రుత్వా సమరే లఘువిక్రమాన్ ।
పంచ సేనాగ్రగాన్ శూరాన్ ప్రేషయామాస రావణః ।
తా నహం సహసైన్యాన్వై సర్వానే వాభ్యసూదయమ్ ॥ 119

పదచ్ఛేదము :– మంత్రిపుత్రాన్ – హతాన్ – శ్రుత్వా – సమరే – లఘువిక్రమాన్, పంచసేనాగ్రగాన్ – శూరాన్ – ప్రేషయామాస – రావణః, తాన్ – అహం – సహసైన్యాన్ – వై – సర్వాన్ – ఏవ – అభ్యసూదయమ్ ॥

అన్వయక్రమము :– లఘువిక్రమాన్ మంత్రిపుత్రాన్ సమరే హతాన్ శ్రుత్వా రావణః శూరాన్ పంచసేనాగ్రగాన్ ప్రేషయామాస, అహం తాన్ సహసైన్యాన్ సర్వాన్ ఏవ అభ్యసూదయమ్.

ప్రతిపదార్థము :- లఘువిక్రమాన్ = లాఘవయుక్తమైన శౌర్యము గల్గినట్టి, మంత్రి పుత్రాన్ = మంత్రిపుత్రులను, సమరే = యుద్ధమున, హతాన్ = వధింపబడిన వారినిగా, శ్రుత్వా = విని, రావణః = రావణుడు, శూరాన్ = వీరులైన, పంచసేనాగ్రగాన్ = అయిదుగురు సేనానాయకులను, ప్రేషయామాస = పంపించెను, అహం = నేను, తాన్ = ఆ, సహసైన్యాన్ = సైన్యముతో గూడినట్టి, సర్వాన్ ఏవ = అందరిని గూడ, అభ్యసూదయమ్ = హతమార్చితిని.

తాత్పర్యము :- యుద్ధమునందు గొప్పలాఘవమును, పరాక్రమమును గల్గినట్టి ఆ మంత్రిపుత్రులందరుకూడ కడతేరిరని విని రావణుడు మహావీరులైన సేనాధిపతుల నైదుగురిని వెంటనే నా మీదికి పంపెను. నేనా సేనాధిపతులనేవురిని వారితో వచ్చిన సైన్యమునుగూడ యుద్ధమున హతమార్చితిని.

శ్లో॥ తతః పున ర్దశగ్రీవః పుత్ర మక్షం మహాబలమ్ ।
బహుభీ రాక్షసై స్సార్థం ప్రేషయామాస రావణః ॥ 120

పదచ్ఛేదము :- తతః - పునః - దశగ్రీవః - పుత్రమ్ - అక్షం - మహాబలమ్, బహుభిః - రాక్షసైః - సార్థం - ప్రేషయామాస - రావణః ॥

అన్వయక్రమము :- తతః దశగ్రీవః రావణః పునః బహుభిః రాక్షసైః సార్థం మహాబలం పుత్రమ్ అక్షం ప్రేషయామాస.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, దశగ్రీవః = దశకంఠుడైన, రావణః = రావణుడు, పునః = తిరిగి, బహుభిః = పెక్కుమంది, రాక్షసైః = రాక్షసులతో, సార్థం = కూడ, మహాబలం = మహాబలాఢ్యుడైన, పుత్రమ్ = కుమారుడైన, అక్షం = అక్షుని, ప్రేషయామాస = పంపెను.

తాత్పర్యము :- అప్పుడు దశగ్రీవుడు తన పుత్రుడైన అక్షుని పెద్దరాక్షససైన్యమును తోడిచ్చి నన్ను చంపుటకొరకై పంపించెను.

శ్లో॥ తం తు మండోదరీ పుత్రం కుమారం రణపండితమ్ ।
సహసా ఖం సముత్క్రాంతం పాదయోశ్చ గృహీతవాన్ ।
చర్మాసినం శతగుణం భ్రామయిత్వా వ్యపేషయమ్ ॥ 121

పదచ్ఛేదము :- తం - తు - మండోదరీపుత్రం - కుమారం - రణపండితమ్ - సహసా - ఖం - సముత్క్రాంతం - పాదయోః - చ - గృహీతవాన్, చర్మాసినం - శతగుణం - భ్రామయిత్వా - వ్యపేషయమ్ ॥

అన్వయక్రమము :- తం రణపండితం, సహసా ఖం సముత్ర్కాంతం, కుమారం మండోదరీపుత్రం పాదయోః, గృహీతవాన్, చర్మాసినం (తం) శతగుణం భ్రామయిత్వా వ్యపేషయమ్.

ప్రతిపదార్థము :- తం = ఆ, రణపండితం = యుద్ధవిశారదుడును, సహసా = వెంటనే, ఖం = ఆకాశమునకు, సముత్ర్కాంతం = ఎగిరిపోవుచున్న వాడును, కుమారం = చిన్నవాడునగు, మండోదరీపుత్రం = మండోదరి పుత్రుడైన అక్షుని, పాదయోః గృహీతవాన్ = రెండు కాళ్ళను పట్టుకొంటిని, చర్మాసినం = డాలును కత్తిని గలిగియున్న, తం = ఆ అక్షకుమారుని, శతగుణం = నూరుమారులు, భ్రామయిత్వా = త్రిప్పి, వ్యపేషయమ్ = ముద్దగా జేసితిని.

తాత్పర్యము :- యుద్ధవిద్యలో ఆరితేరినవాడైన ఆ మండోదరీపుత్రుడు నా మీదికి వచ్చి ఆకాశము మీదికి ఎగిరిపోవుచుండగా నేనాతని పాదములను పట్టుకొని క్రిందికి లాగి నూరు మారులు గిరగిరత్రిప్పి నేలపై పడగొట్టి నుగ్గు నుగ్గు చేసితిని.

శ్లో॥ త మక్ష మాగతం భగ్నం నిశమ్య స దశాననః ।
తత ఇంద్రజితం నామ ద్వితీయం రావణస్సుతమ్ ।
వ్యాదిదేశ సుసంక్రుద్ధో బలినం యుద్ధదుర్మదమ్ ॥ 122

పదచ్ఛేదము :- తమ్ - అక్షమ్ - ఆగతం - భగ్నం - నిశమ్య - సః - దశాననః - తతః - ఇంద్రజితం - నామ - ద్వితీయం - రావణః - సుతమ్, వ్యాదిదేశ - సుసంక్రుద్ధః - బలినం - యుద్ధదుర్మదమ్ ॥

అన్వయక్రమము :- ఆగతం తమ్ అక్షం భగ్నం నిశమ్య తతః దశాననః సః రావణః సుసంక్రుద్ధః (సన్) యుద్ధదుర్మదం బలినమ్ ఇంద్రజితం నామ సుతం వ్యాదిదేశ.

ప్రతిపదార్థము :- ఆగతం = వచ్చినట్టి, తమ్ అక్షం = ఆ అక్షకుమారుని, భగ్నం = మడిసిన వానినిగా, నిశమ్య = విని, తతః = పిమ్మట, దశాననః = దశగ్రీవుడైన, సః = ఆ, రావణః = రావణుడు, సుసంక్రుద్ధః (సన్) = మిక్కిలి క్రోధము నొందినవాడై, బలినం = మహాబలాఢ్యుడును, యుద్ధదుర్మదం = యుద్ధముకొరకై మదము నొందియున్నవాడునగు, ఇంద్రజితం నామ = ఇంద్రజిత్తను పేరుగల, సుతం = కుమారుని, వ్యాదిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- యుద్ధమునకు వచ్చినట్టి అక్షకుమారుడు వధింపబడెనని విని రాక్షసరాజు తీవ్రమైన క్రోధమునొంది, యుద్ధమును గూర్చి మదముతో ఎదురు చూచుచుండునట్టి తన పుత్రుడైన ఇంద్రజిత్తును నామీదికి పంపెను.

శ్లో॥ త చ్చా ప్యహం బలం సర్వం తం చ రాక్షసపుంగవమ్ ।
నష్టౌజసం రణే కృత్వా పరం హర్ష ముపాగమమ్ ॥ 123

పదచ్ఛేదము :- తత్ - చ - అపి - అహం - బలం - సర్వం - తం - చ - రాక్షసపుంగవమ్, నష్టౌజసం - రణే - కృత్వా - పరం - హర్షమ్ - ఉపాగమమ్ ॥

అన్వయక్రమము :- అహం తత్ బలం సర్వమ్ అపి చ, తం రాక్షసపుంగవం చ, రణే నష్టౌజసం కృత్వా పరం హర్షమ్ ఉపాగమమ్.

ప్రతిపదార్థము :- అహం = నేను, తత్ = ఆ, బలం = సైన్యమును, సర్వమ్ అపి చ = అంతనుగూడ, తం = ఆ, రాక్షసపుంగవం చ = రాక్షసశ్రేష్ఠుని గూడ, రణే = యుద్ధమునందు, నష్టౌజసం = నశించిన శక్తిగలవానినిగా, కృత్వా = చేసి, పరం = గొప్పదైన, హర్షమ్ = సంతోషమును, ఉపాగమమ్ = పొందితిని.

తాత్పర్యము :- అప్పుడు మహావీరుడైన ఆ ఇంద్రజిత్తును, ఆతనితో వచ్చిన అపారమైన సైన్యమును గూడ యుద్ధమునందు క్షీణశక్తులను గావించి నేను గొప్ప ఆనందము నొందితిని.

శ్లో॥ మహతా హి మహాబాహుః ప్రత్యయేన మహాబలః ।
ప్రేషితో రావణేనైవ సహవీరై ర్మదోత్కటైః ॥ 124

పదచ్ఛేదము :- మహతా - హి - మహాబాహుః - ప్రత్యయేన - మహాబలః, ప్రేషితః - రావణేన - ఏవ - సహ - వీరైః - మదోత్కటైః ॥

అన్వయక్రమము :- రావణేన మహతా ప్రత్యయేన మహాబాహుః మహాబలః (సః) మదోత్కటైః వీరైః (సహ) ప్రేషితః హి.

ప్రతిపదార్థము :- రావణేన = రావణాసురునిచే, మహతా = గొప్పదైన, ప్రత్యయేన = నమ్మకముతో, మహాబాహుః = గొప్పదైన బలముగలవాడగు, (సః = ఆ ఇంద్రజిత్తు) మదోత్కటైః = మదముచే గర్వించినవారగు, వీరైః (సహ) = వీరులతో గూడ, ప్రేషితః హి = పంపబడెను జుడీ!

తాత్పర్యము :- రావణాసురుడెంతో నమ్మకముతో మహా పరాక్రమ సంపన్నుడైన ఇంద్రజిత్తును మహాబలగర్వితులైన పెక్కుమంది వీరులను తోడిచ్చి యుద్ధమునకు పంపెను.

శ్లో॥ సోఽవిషహ్యం చ మాం బుద్ధ్వా స్వసైన్యం చావమర్దితమ్ ।
బ్రాహ్మే ణాస్త్రేణ స తు మాం ప్రాబధ్నా చ్చాతివేగితః ॥ 125

పదచ్ఛేదము :– సః – అవిషహ్యాం – చ – మాం – బుద్ధ్వా – స్వసైన్యం – చ – అవమర్దితమ్, బ్రాహ్మేణ – అస్త్రేణ – సః – తు – మాం – ప్రాబధ్నాత్ – చ – అతి – వేగితః ॥

అన్వయక్రమము :– సః స్వసైన్యమ్ అవమర్దితం చ, మామ్ అవిషహ్యాం చ బుద్ధ్వా అతివేగితః సః మాం బ్రాహ్మేణ అస్త్రేణ ప్రాబధ్నాత్.

ప్రతిపదార్థము :– సః = ఆ ఇంద్రజిత్తు, స్వసైన్యం = తన సైన్యమును, అవమర్దితం = నశింపచేయబడిన దానినిగను, మాం = నన్ను, అవిషహ్యాం = సహింపరాని వానినిగను, బుద్ధ్వా = తెలిసికొని, అతివేగితః = మిక్కిలి వేగిరపాటు నొందినవాడై, సః = ఆతడు, మాం = నన్ను, బ్రాహ్మేణ అస్త్రేణ = బ్రహ్మాస్త్రముచేత, ప్రాబధ్నాత్ = బంధించెను.

తాత్పర్యము :– అప్పుడా ఇంద్రజిత్తు తన సైన్యము నశించిపోవుచుండుటను, నేను తనకు ఎదుర్కొనుటకు శక్యముగాని వాడుగా నుండుటను తెలిసికొని వెంటనే నన్ను బ్రహ్మాస్త్రమును ప్రయోగించి బంధించెను.

శ్లో॥ రజ్జుభి శ్చాభిబధ్నంతి తతో మాం తత్ర రాక్షసాః ।
రావణస్య సమీపం చ గృహీత్వా మా ముపానయన్ ॥ 126

పదచ్ఛేదము :– రజ్జుభిః – చ – అభిబధ్నంతి – తతః – మాం – తత్ర – రాక్షసాః, రావణస్య – సమీపం – చ – గృహీత్వా – మామ్ – ఉపానయన్ ॥

అన్వయక్రమము :– తతః తత్ర రాక్షసాః మాం రజ్జుభిః చ అభిబధ్నంతి, మాం గృహీత్వా రావణస్య సమీపమ్ ఉపానయన్ చ.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తత్ర = ఆ యుద్ధభూమిలో, రాక్షసాః = రాక్షసులు, మాం = నన్ను, గృహీత్వా = పట్టుకొని, రావణస్య = రావణునియొక్క, సమీపం = సమీపమునుగూర్చి, ఉపానయన్ చ = తీసికొని పోయిరి కూడను.

తాత్పర్యము :– పిమ్మట అచ్చటి రాక్షసులు నన్ను త్రాళ్ళతోగూడ బంధించి తీసికొనిపోయి రావణుని సమీపమున నిలిపిరి.

శ్లో॥ దృష్ట్వా సంభాషిత శ్చాహం రావణేన దురాత్మనా ।
పృష్టశ్చ లంకాగమనం రాక్షసానాం చ తం వధమ్ ।
తత్సర్వం చ మయా తత్ర సీతార్థమితి జల్పితమ్ ॥ 127

పదచ్ఛేదము :- దృష్ట్వా - సంభాషితః - చ - అహం - రావణేన - దురాత్మనా, పృష్టః - చ - లంకాగమనం - రాక్షసానాం - చ - తం - వధమ్, తత్ - సర్వం - చ - మయా - తత్ర - సీతార్థమ్ - ఇతి - జల్పితమ్ ॥

అన్వయక్రమము :- అహం దురాత్మనా రావణేన దృష్ట్వా సంభాషితః చ, లంకాగమనం రాక్షసానాం తం వధం చ పృష్టః చ, తత్ర మయా తత్ సర్వం సీతార్థమ్ ఇతి జల్పితమ్.

ప్రతిపదార్థము :- అహం = నేను, దురాత్మనా = దుర్మార్గుడైన, రావణేన = రావణునిచే, దృష్ట్వా = చూచి, సంభాషితః చ = మాటాడబడితిని కూడను, లంకాగమనం = లంకలోనికి రాకను గూర్చియు, రాక్షసానాం = రాక్షసులయొక్క, తం = ఆ, వధం చ = మారణమును గూర్చియు, పృష్టః చ = అడుగబడితినిగూడను, తత్ర = ఆతనియెదుట, మయా = నాచేత, తత్ = అది, సర్వం = అంతయును, సీతార్థం = సీతాదేవి కొరకు, ఇతి = అని, జల్పితమ్ = పలుకబడినది.

తాత్పర్యము :- ఆ రావణుని కొలువునందు ఆ దుర్మార్గుడు నన్ను జూచి నాతో మాటాడుచు లంకలోనికి నేను వచ్చుటకు కారణమును. తన రాక్షసులను వధించుటకు హేతువును తెలుపుమని నన్నడుగగా నేను జేసిన ఆ పని అంతయును మా సీతమ్మ కొరకే అని బదులు చెప్పితిని.

శ్లో॥ తస్యాస్తు దర్శనాకాంక్షీ ప్రాప్త స్త్వద్భవనం విభో ।
మారుత స్యౌరసః పుత్రో వానరో హనుమా నహమ్ ॥ 128

పదచ్ఛేదము :- తస్యాః - తు - దర్శనాకాంక్షీ - ప్రాప్తః - త్వద్భవనం - విభో, మారుతస్య - ఔరసః - పుత్రః - వానరః - హనుమాన్ - అహమ్ ॥

అన్వయక్రమము :- అహం మారుతస్య ఔరసః వానరః పుత్రః హనుమాన్; విభో! అహం తస్యాః తు దర్శనాకాంక్షీ (సన్) త్వద్భవనం ప్రాప్తః.

ప్రతిపదార్థము :- అహం = నేను, మారుతస్య = వాయుదేవునియొక్క, ఔరసః పుత్రః = ఔరసపుత్రుడనగు, వానరః = వానరుడను, హనుమాన్ = హనుమంతుడనువాడను, విభో! = ఓ రాజా! తస్యాః తు = ఆ సీతమ్మ యొక్కయే, దర్శనాకాంక్షీ (సన్) = దర్శనము గోరినవాడనై, త్వద్భవనం = నీ భవనమును, ప్రాప్తః = చేరినాడను.

తాత్పర్యము :- రాజా! నేను వాయుదేవుని ఔరసపుత్రుడను, హనుమంతుడను పేరుగల వానరుడను. నీ లంకలో నున్న ఆ సీతాదేవిని దర్శించు కోరికతోడనే నీ భవనమునకు వచ్చితిని.

శ్లో॥ రామదూతం చ మాం విద్ధి సుగ్రీవసచివం కపిమ్ ।
సోఽహం దూత్యేన రామస్య త్వత్సకాశ మిహాగతః ॥ 129

పదచ్ఛేదము :– రామదూతం – చ – మాం – విద్ధి – సుగ్రీవసచివం – కపిమ్, సః – అహం – దూత్యేన – రామస్య – త్వత్సకాశమ్ – ఇహ – ఆగతః ॥

అన్వయక్రమము :– కపిం మాం సుగ్రీవసచివం రామదూతం చ విద్ధి, సః అహం రామస్య దూత్యేన ఇహ త్వత్సకాశమ్ ఆగతః.

సూచన :– ఇందు గోరఖ్‌పూర్ ప్రతిలో 'దూత్యేన' అనుదానికి బదులుగా 'దౌత్యేన' అని పాఠాంతరము.

ప్రతిపదార్థము :– కపిం = వానరుడనైన, మాం = నన్ను, సుగ్రీవసచివం = సుగ్రీవునియొక్క మంత్రినిగను, రామదూతం చ = రామునియొక్క దూతగను గూడ, విద్ధి = తెలిసికొనుము. సః = ఆ, అహం = నేను, రామస్య = రామునియొక్క, దూత్యేన = దూతకృత్యముచే, ఇహ = ఈ లంకయందు, త్వత్సకాశం = నీ సమీపమునకు, ఆగతః = వచ్చినాడను.

తాత్పర్యము :– సుగ్రీవుని మంత్రినగు వానరుడనైన నేను శ్రీరాముని దూతనని గూడ తెలిసికొనుము. అట్టి నేను శ్రీరాముని దూతకృత్యమును నెరవేర్చుటకొరకే ఈ లంకలో నీకడకు వచ్చియున్నాను.

శ్లో॥ సుగ్రీవశ్చ మహాతేజా స్స త్వాం కుశల మబ్రవీత్ ।
ధర్మార్థకామసహితం హితం పథ్య మువాచ చ ॥ 130

పదచ్ఛేదము :– సుగ్రీవః – చ – మహాతేజాః – సః – త్వాం – కుశలమ్ – అబ్రవీత్, ధర్మార్థకామసహితం – హితం – పథ్యమ్ – ఉవాచ – చ ॥

అన్వయక్రమము :– మహాతేజాః సః సుగ్రీవః త్వాం కుశలమ్ అబ్రవీత్, ధర్మార్థకామ సహితం హితం పథ్యమ్ ఉవాచ చ.

ప్రతిపదార్థము :– మహాతేజాః = మహాప్రతాప సంపన్నుడైన, సః సుగ్రీవః = ఆ సుగ్రీవుడు, త్వాం = నిన్ను, కుశలమ్ అబ్రవీత్ = క్షేమము నడిగెను, ధర్మార్థకామ సహితం = ధర్మము తోడను అర్థము తోడను, కామము తోడను గూడినట్టి, హితం = మేలైనదియును, పథ్యం = క్షేమకరమైనదియును అగు మాటను, ఉవాచ చ = పలికెను కూడను.

తాత్పర్యము :- మహాప్రతాపసంపన్నుడైన మా సుగ్రీవుడు నిన్ను క్షేమవార్త నడిగి ధర్మార్థకామసమ్మతమైనట్టి హితమును పథ్యమునగు సందేశమును ఇట్లు నీకు తెలుపుచున్నాడు.

శ్లో॥ వసతో ఋశ్యమూకే మే పర్వతే విపులద్రుమే ।
రాఘవో రణవిక్రాంతో మిత్రత్వం సముపాగతః ॥ 131

పదచ్ఛేదము :- వసతః - ఋశ్యమూకే - మే - పర్వతే - విపులద్రుమే - రాఘవః - రణవిక్రాంతః - మిత్రత్వం - సముపాగతః ॥

అన్వయక్రమము :- విపులద్రుమే ఋశ్యమూకే పర్వతే వసతః మే రణవిక్రాంతః రాఘవః మిత్రత్వం సముపాగతః.

ప్రతిపదార్థము :- విపులద్రుమే = విస్తారమైన వృక్షములు గల్గినట్టి, ఋశ్యమూకే పర్వతే = ఋష్యమూక పర్వతమునందు, వసతః = వసించుచున్నట్టి, మే = నాకు, రణవిక్రాంతః = యుద్ధమునందు గొప్పపరాక్రమము గలవాడయిన, రాఘవః = శ్రీరాముడు, మిత్రత్వం = మైత్రిని, సముపాగతః = పొందెను.

తాత్పర్యము :- దట్టమైన వృక్షములు గల్గియున్న ఋశ్యమూకపర్వతముపై నేను వసించుచుండగా మహాపరాక్రమశాలి యగు శ్రీరాముడు నాకు మిత్రుడుగ లభించినాడు.

శ్లో॥ తేన మే కథితం రాజ్ఞా భార్యా మే రక్షసా హృతా ।
తత్ర సాహాయ్య మస్మాకం కార్యం సర్వాత్మనా త్వయా ॥ 132

పదచ్ఛేదము :- తేన - మే - కథితం - రాజ్ఞా - భార్యా - మే - రక్షసా - హృతా, తత్ర - సాహాయ్యమ్ - అస్మాకం - కార్యం - సర్వాత్మనా - త్వయా ॥

అన్వయక్రమము :- తేన రాజ్ఞా మే కథితం మే భార్యా రక్షసా హృతా, తత్ర అస్మాకం త్వయా సర్వాత్మనా సాహాయ్యం కార్యమ్.

ప్రతిపదార్థము :- తేన = ఆ, రాజ్ఞా = రాజుచే, మే = నాకు, కథితం = చెప్పబడినది, మే = నా యొక్క, భార్యా = భార్య, రక్షసా = రాక్షసునిచే, హృతా = అపహరింపబడినది, తత్ర = ఆ విషయమున, అస్మాకం = మాకు, త్వయా = నీచేత, సర్వాత్మనా = సర్వవిధముల, సాహాయ్యం = సాహాయ్యము, కార్యం = చేయవలసినది.

తాత్పర్యము :- ఆ రామనరేంద్రుడు - "ఈ యరణ్యమునం దుండగా నా భార్య నొక రాక్షసు డపహరించెను. నా భార్యను కనుగొను ప్రయత్నమునందు నీవు నాకు

సర్వవిధముల తోడ్పడవలయును." అని నన్ను కోరినాడు.

శ్లో॥ మయా చ కథితం తస్మై వాలినశ్చ వధం ప్రతి ।
తత్ర సాహాయ్యహేతో ర్మే సమయం కర్తు మర్హసి ॥ 133

పదచ్ఛేదము :– మయా – చ – కథితం – తస్మై – వాలినః – చ – వధం – ప్రతి, తత్ర సాహాయ్యహేతోః – మే – సమయం – కర్తుమ్ – అర్హసి ॥

అన్వయక్రమము :– మయా చ తస్మై వాలినః వధం ప్రతి చ తత్ర సాహాయ్యహేతోః మే సమయం కర్తుమ్ అర్హసి (ఇతి) కథితమ్.

ప్రతిపదార్థము :– మయా చ = నాచేతగూడ, తస్మై = ఆ శ్రీరామునికొరకు, వాలినః = వాలియొక్క, వధం ప్రతి చ = వధను గూర్చియును, తత్ర = ఆ విషయము నందు, సాహాయ్యహేతోః = సహాయము నిమిత్తమై, సమయం = వాగ్దానమును, కర్తుం = చేయుటకు, అర్హసి = తగుదువు, (ఇతి చ = అనియును), కథితమ్ = చెప్పబడినది.

తాత్పర్యము :– అప్పుడు నేను వాలిని వధింపవలసిన విషయమును గూర్చి ఆతనికి తెలిపి ఆ సందర్భమున నాకు సహాయపడుటకై వాగ్దానముచేయవలయునని ఆతనిని కోరితిని.

శ్లో॥ వాలినా హృతరాజ్యేన సుగ్రీవేణ సహ ప్రభుః ।
చక్రే ఽగ్నిసాక్షికం సఖ్యం రాఘవ స్సహలక్ష్మణః ॥ 134

పదచ్ఛేదము :– వాలినా – హృతరాజ్యేన – సుగ్రీవేణ – సహ – ప్రభుః – చక్రే – అగ్నిసాక్షికం – సఖ్యం – రాఘవః – సహలక్ష్మణః ॥

అన్వయక్రమము :– సహలక్ష్మణః ప్రభుః రాఘవః వాలినా హృతరాజ్యేన సుగ్రీవేణ సహ అగ్నిసాక్షికం సఖ్యం చక్రే.

ప్రతిపదార్థము :– సహలక్ష్మణః = లక్ష్మణునితో కూడినట్టి, ప్రభుః = ప్రభువైన, రాఘవః = శ్రీరాముడు, వాలినా = వాలిచే, హృతరాజ్యేన = అపహరింపబడిన రాజ్యము గలవాడైనట్టి, సుగ్రీవేణ సహ = సుగ్రీవునితో కూడ, అగ్నిసాక్షికం = అగ్నిదేవుడు సాక్ష్యముగనున్నట్టి, సఖ్యం = మైత్రిని, చక్రే = చేసికొనెను.

తాత్పర్యము :– వాలి వలన రాజ్యము గోల్పోయిన సుగ్రీవునితో లక్ష్మణసహితుడైన రామప్రభువు అగ్ని సాక్షికముగా సఖ్యమును గూర్చుకొనెను.

శ్లో॥ తేన వాలిన ముత్పాట్య శరే ణైకేన సంయుగే ।
వానరాణాం మహారాజః కృత స్స ప్లవతాం వరః ॥ 135

పదచ్ఛేదము :- తేన - వాలినమ్ - ఉత్పాట్య - శరేణ - ఏకేన - సంయుగే, వానరాణాం - మహారాజః - కృతః - సః - ప్లవతాం - వరః ॥

అన్వయక్రమము :- తేన సంయుగే ఏకేన శరేణ వాలినమ్ ఉత్పాట్య సః ప్లవతాం వరః (అహం) వానరాణాం మహారాజః కృతః.

ప్రతిపదార్థము :- తేన = ఆ రామప్రభువుచే, సంయుగే = యుద్ధమునందు, ఏకేన శరేణ = ఒక్క బాణముతో, వాలినం = వాలిని, ఉత్పాట్య = నిర్మూలించి, సః = ఆ, ప్లవతాం వరః = వానరులలో శ్రేష్ఠుడనైనట్టి, (అహం = నేను), వానరాణాం = వానరులకు, మహారాజః = మహారాజుగా, కృతః = చేయబడితిని.

తాత్పర్యము :- అప్పుడు మహావీరుడైన రామప్రభువు ఒక్క బాణము తోడనే యుద్ధము నందు వాలిని వధించి వానరరాజ్యమునకు నన్ను మహారాజును గావించెను.

శ్లో॥ తస్య సాహాయ్య మస్మాభిః కార్యం సర్వాత్మనా త్విహ ।
తేన ప్రస్థాపిత స్తుభ్యం సమీప మిహ ధర్మతః ॥ 136

పదచ్ఛేదము :- తస్య - సాహాయ్యమ్ - అస్మాభిః - కార్యం - సర్వాత్మనా - తు - ఇహ, తేన - ప్రస్థాపితః - తుభ్యం - సమీపమ్ - ఇహ - ధర్మతః ॥

అన్వయక్రమము :- తస్య ఇహ అస్మాభిః సర్వాత్మనా సాహాయ్యం కార్యమ్, తేన ఇహ ధర్మతః తుభ్యం సమీపం (దూతః) ప్రస్థాపితః.

ప్రతిపదార్థము :- తస్య = ఆ శ్రీరామునకు, ఇహ = ఈ విషయమున, అస్మాభిః = మాచేత, సర్వాత్మనా = అన్ని విధముల, సాహాయ్యం = సాహాయ్యము, కార్యమ్ = చేయవలసియున్నది, తేన = అందుచే, ధర్మతః = ధర్మముననుసరించి, ఇహ = ఈ లంకకు, తుభ్యం సమీపం = నీ సమీపమును గూర్చి, (దూతః = దూత), ప్రస్థాపితః = పంపబడినాడు.

తాత్పర్యము :- అట్లు నా కుపకారము చేసిన శ్రీరామునకు నేను సర్వవిధముల ఆతని ప్రయత్నమునందు సహాయపడవలసి యున్నది. అందుచేతనే ధర్మసమ్మతముగా నీ కడకిప్పుడు దూతను పంపుచున్నాను.

శ్లో॥ క్షిప్ర మానీయతాం సీతా దీయతాం రాఘవాయ చ ।
యావ న్న హరయో వీరా విధమంతి బలం తవ ॥ 137

పదచ్ఛేదము :– క్షిప్రమ్ – ఆనీయతాం – సీతా – దీయతాం – రాఘవాయ – చ, యావత్ – న – హరయః – వీరాః – విధమంతి – బలం – తవ ॥

అన్వయక్రమము :– యావత్ వీరాః హరయః తవ బలం న విధమంతి (తావత్) క్షిప్రం సీతా ఆనీయతామ్, రాఘవాయ దీయతాం చ.

ప్రతిపదార్థము :– యావత్ = ఎంతలో, వీరాః = వీరులైన, హరయః = వానరులు, తవ = నీయొక్క, బలం = బలగమును, న విధమంతి = నశింపచేయరో, తావత్ = అంతలోనే, క్షిప్రం = శీఘ్రముగా, సీతా = సీతాదేవి, ఆనీయతామ్ = తీసికొని రాబడుగాక! రాఘవాయ = శ్రీరామునికొరకు, దీయతాం = ఇచ్చివేయబడుగాక.

తాత్పర్యము :– మహావీరులైన వానరయోధులు లంకలోని నీ బలగమునంతను నశింపజేయుటకు ముందుగనే నీవు తెచ్చిన సీతాదేవిని శీఘ్రముగ బంధనమునుండి తప్పించి శ్రీరామున కర్పింపుము.

శ్లో॥ వానరాణాం ప్రభావో హి న కేన విదితః పురా ।
దేవతానాం సకాశం చ యే గచ్ఛంతి నిమంత్రితాః ॥ 138

పదచ్ఛేదము :– వానరాణాం – ప్రభావః – హి – న – కేన – విదితః – పురా, దేవతానాం – సకాశం – చ – యే – గచ్ఛంతి – నిమంత్రితాః ॥

అన్వయక్రమము :– యే పురా నిమంత్రితాః (సంతః) దేవతానాం సకాశం చ గచ్ఛంతి (తేషాం) వానరాణాం ప్రభావః కేన న విదితః?

ప్రతిపదార్థము :– యే = ఎవ్వరయితే, పురా = పూర్వము, నిమంత్రితాః (సంతః) = ఆహ్వానింపబడినవారై, దేవతానాం = దేవతలయొక్క, సకాశం చ = సన్నిధినికూడ, గచ్ఛంతి = వెళ్లెడివారో, తేషాం = ఆ, వానరాణాం = వానరులయొక్క, ప్రభావః = ప్రభావము, కేన = ఎవనిచేత, న విదితః = తెలియబడదు?

తాత్పర్యము :– పూర్వకాలము నుండియు యుద్ధసమయములందు సాహాయ్యము కొరకై దేవతలచే స్వర్గలోకమునకు ఆహ్వానింపబడినట్టి వానరవీరుల యొక్క పరాక్రమ ప్రభావము ఎవ్వరికి తెలియనిది?

శ్లో॥ ఇతి వానరరాజ స్త్వా మాహే త్యభిహితో మయా ।
మా మైక్షత తతః క్రుద్ధో చక్షుషా ప్రదహన్నివ ॥ 139

పదచ్ఛేదము :– ఇతి – వానరరాజః – త్వామ్ – ఆహ – ఇతి – అభిహితః – మయా, మామ్ – ఐక్షత – తతః – క్రుద్ధః – చక్షుషా – ప్రదహన్ – ఇవ ॥

అన్వయక్రమము :- ఇతి త్వాం వానరరాజః ఆహ, ఇతి మయా అభిహితః (సః) క్రుద్ధః (సన్) చక్షుషా ప్రదహన్ ఇవ మామ్ ఐక్షత.

ప్రతిపదార్థము :- ఇతి = ఇట్లని, త్వాం = నిన్నుగూర్చి, వానరరాజః = వానరాధిపతియైన సుగ్రీవుడు, ఆహ = పలికెను, ఇతి = అని, మయా = నాచేత, అభిహితః = పలుకబడినవాడై, తతః = పిమ్మట, సః = ఆ రావణుడు, క్రుద్ధః (సన్) = క్రోధమునొందినవాడై, చక్షుషా = కంటితో, ప్రదహన్ ఇవ = దహించుచున్నట్లుగా, మామ్ = నన్ను, ఐక్షత = చూచెను.

తాత్పర్యము :- ఈ విధముగ మా వానరరాజైన సుగ్రీవుడు నీకు తెలుపుమనినాడు అని నేను రావణునితో చెప్పగనే ఆతడు తీవ్రమైన క్రోధము నొంది నన్ను నిప్పులు గ్రక్కుచున్న తన కన్నులతో దహించి వేయునట్లుగా జూచెను.

శ్లో॥ తేన వధ్యోఽహ మాజ్ఞప్తో రక్షసా రౌద్రకర్మణా ।
మత్ప్రభావ మవిజ్ఞాయ రావణేన దురాత్మనా ॥ 140

పదచ్ఛేదము :- తేన - వధ్యః - అహమ్ - ఆజ్ఞప్తః - రక్షసా - రౌద్రకర్మణా, మత్ప్రభావమ్ - అవిజ్ఞాయ - రావణేన - దురాత్మనా ॥

అన్వయక్రమము :- రౌద్రకర్మణా దురాత్మనా తేన రక్షసా రావణేన మత్ప్రభావమ్ అవిజ్ఞాయ అహం వధ్యః (ఇతి) ఆజ్ఞప్తః.

ప్రతిపదార్థము :- రౌద్రకర్మణా = భీకరచేష్టుడైన, దురాత్మనా = దుర్మార్గుడగు, తేన = ఆ, రక్షసా రావణేన = రావణాసురునిచే, మత్ప్రభావం = నా ప్రభావమును గూర్చి, అవిజ్ఞాయ = తెలియక, అహం = నేను, వధ్యః = వధింపవలసినవాడనుగా, ఆజ్ఞప్తః = ఆజ్ఞాపింపబడితిని.

తాత్పర్యము :- వెంటనే రౌద్రకృత్యములకు అలవాటు పడినట్టి దుర్మార్గుడైన ఆ రావణాసురుడు నా ప్రభావమెట్టిదో తెలిసికొనలేక నన్ను చంపుటకు ఆజ్ఞాపించెను.

శ్లో॥ తతో విభీషణో నామ తస్య భ్రాతా మహామతిః ।
తేన రాక్షసరాజోఽసౌ యాచితో మమ కారణాత్ ॥ 141

పదచ్ఛేదము :- తతః - విభీషణః - నామ - తస్య - భ్రాతా - మహామతిః, తేన - రాక్షసరాజః - అసౌ - యాచితః - మమ - కారణాత్ ॥

అన్వయక్రమము :- తతః మహామతిః విభీషణః నామ తస్య (యః) భ్రాతా (అస్తి) తేన అసౌ రాక్షసరాజః మమ కారణాత్ యాచితః.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, మహామతిః = గొప్పవివేకవంతుడైన, విభీషణః నామ = విభీషణుడను పేరుగల, తస్య = ఆతనియొక్క, (యః = ఏ), భ్రాతా = సోదరుడు, (అస్తి = ఉన్నాడో), తేన = అతనిచే, అసౌ = ఈ, రాక్షసరాజః = రాక్షసరాజైన రావణుడు, మమ కారణాత్ = నా నిమిత్తమై, యాచితః = వేడుకొనబడెను.

తాత్పర్యము :- అప్పుడు మహాబుద్ధిశాలియైన విభీషణుడను రావణుని తమ్ముడు నన్ను మృత్యుదండనమునుండి తప్పింపవలెనని నిశ్చయించుకొని రావణుని వేడుకొనెను.

శ్లో॥ నైవం రాక్షసశార్దూల త్యజ్యతా మేష నిశ్చయః ।
రాజశాస్త్రవ్యపేతో హి మార్గ స్సంసేవ్యతే త్వయా ॥ 142

పదచ్ఛేదము :- న - ఏవం - రాక్షసశార్దూల - త్యజ్యతామ్ - ఏషః - నిశ్చయః, రాజశాస్త్రవ్యపేతః - హి - మార్గః - సంసేవ్యతే - త్వయా ॥

అన్వయక్రమము :- రాక్షసశార్దూల! ఏవం న; ఏషః నిశ్చయః త్యజ్యతామ్; త్వయా రాజశాస్త్రవ్యపేతః మార్గః సంసేవ్యతే హి.

ప్రతిపదార్థము :- రాక్షసశార్దూల = ఓ రాక్షసశ్రేష్ఠుడా! ఏవం = ఈ రీతిగా, న (కార్యం) = (చేయ) తగదు, ఏషః = ఈ, నిశ్చయః = నిర్ణయము, త్యజ్యతామ్ = విడువబడుగాక! త్వయా = నీచేత, రాజశాస్త్రవ్యపేతః = రాజధర్మమునకు విరుద్ధమైనట్టి, మార్గః = పద్ధతి, సంసేవ్యతే హి = అవలంబింపబడుచున్నది సుమా!

శ్లో॥ దూతవధ్యా న దృష్టా హి రాజశాస్త్రేషు రాక్షస ।
దూతేన వేదితవ్యం చ యథాభిహితవాదినా ॥ 143

పదచ్ఛేదము :- దూతవధ్యా - న - దృష్టా - హి - రాజశాస్త్రేషు - రాక్షస, దూతేన - వేదితవ్యం - చ - యథాభిహితవాదినా ॥

అన్వయక్రమము :- రాక్షసరాజ! శాస్త్రేషు దూతవధ్యా న హి దృష్టా, యథాభిహితవాదినా దూతేన వేదితవ్యం (భవతి) చ.

ప్రతిపదార్థము :- రాక్షస! = ఓ రాక్షసోత్తమా! రాజశాస్త్రేషు = రాజధర్మములందు, దూతవధ్యా = దూతయొక్క వధ, న హి దృష్టా = ఎంతమాత్రము చూడబడలేదు, యథాభిహితవాదినా = (తనకు) చెప్పబడిన విధముగా పలుకునట్టి, దూతేన = దూతచే, వేదితవ్యం = నివేదింపబడవలసినది, భవతి = అగును.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

'యథాభిహితవాదినా' అను బొంబాయి పాఠమునకు బదులుగా 'యథార్థ హితవాదినా' యని దక్షిణాదిప్రతుల పాఠము. ఈ పాఠమునకు భావము మనకు హితమును పల్కు దూతచే సత్యమును గ్రహించవలెను అని భావము.

తిలకము :- 'దూతేన వేదితవ్యం' - దూత తనకు చెప్పినది యంతయు తాను మనకు నివేదింపవలసినదే. అందుండు అప్రియోక్తులకు అతని బాధ్యత ఏ ముండును? కనుక అతడు దండనీయుడు గాడని భావము.

రా.శిరోమణి :- 'దూతేన వేదితవ్యం' - (ఉక్తమ్ ఇతి శేషః) దూత చెప్పినది మనము శ్రద్ధగా గ్రహించవలెను. వానిని దూషింపరాదని భావము.

తాత్పర్యము :- ఓ రాక్షసరాజా, రాజధర్మములం దెచ్చటను దూతను వధించుట యుక్తమని చెప్పబడలేదు. మనకు చెప్పుమని చెప్పబడిన మాటలనే మన ఎదుట అన్నియును చెప్పుట అతని విధిగదా! అందు అతని యపరాధమేముండును?

శ్లో॥ సుమహ త్యపరాధేఽపి దూత స్యాతులవిక్రమ ।
విరూపకరణం దృష్టం న వధో ఽస్తి హి శాస్త్రతః ॥ 144

పదచ్ఛేదము :- సుమహతి - అపరాధే - అపి - దూతస్య - అతులవిక్రమ, విరూపకరణం - దృష్టం - న - వధః - అస్తి - హి - శాస్త్రతః ॥

అన్వయక్రమము :- అతులవిక్రమ! దూతస్య అపరాధే సుమహతి (సతి) అపి విరూపకరణం దృష్టం; శాస్త్రతః వధః నహి అస్తి.

ప్రతిపదార్థము :- అతులవిక్రమ = అనుపమానమైన పరాక్రమము గల్గిన ఓ రావణా!, దూతస్య = దూతయొక్క, అపరాధే = అపరాధము, సుమహతి (సతి) అపి = గొప్పదై యున్నప్పటికిని, విరూపకరణం = అంగవైకల్యము చేయుట, దృష్టం = చూడబడినది, శాస్త్రతః = శాస్త్రముననుసరించి, వధః = మారణము, నహి అస్తి = ఎంతమాత్రమును లేదు.

తాత్పర్యము :- అనుపమవిక్రమోపేతుడవైన ఓ రాక్షసరాజా! దూతచేసిన అపరాధము ఎంతగొప్పదైనప్పటికిని ఏ అంగవిచ్ఛేదమో దండనముగా విధింపబడినదిగాని శాస్త్రముల ననుసరించి చూచిన దూతను వధించుట ఎచ్చటను గానరాదు సుమా!

శ్లో॥ విభీషణే నైవ ముక్తో రావణ స్సందిదేశ తాన్ ।
రాక్షసా నేతదే వాస్య లాంగూలం దహ్యతా మితి ॥ 145

పదచ్ఛేదము :- విభీషణేన - ఏవమ్ - ఉక్తః - రావణః - సందిదేశ - తాన్, రాక్షసాన్ - ఏతత్ - ఏవ - అస్య - లాంగూలం - దహ్యతామ్ - ఇతి ॥

అన్వయక్రమము :- రావణః ఏవం విభీషణేన ఉక్తః అస్య ఏతత్ లాంగూలమ్ ఏవ దహ్యతాం ఇతి తాన్ రాక్షసాన్ సందిదేశ.

ప్రతిపదార్థము :- రావణః = రావణుడు, ఏవం = ఈరీతిగా, విభీషణేన = విభీషణునిచే, ఉక్తః = చెప్పబడినవాడై, అస్య = ఈ వానరునియొక్క, ఏతత్ = ఈ, లాంగూలమ్ ఏవ = తోకయే, దహ్యతాం = దహింపబడుగాక, ఇతి = అని, తాన్ = ఆ, రాక్షసాన్ = రాక్షసులను గూర్చి, సందిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- విభీషణు డిట్లు తెలుపగా రావణు డా మాటలను విని ఈ వానరుని లాంగూలమును తగులబెట్టుడని అచటనున్న రాక్షసభటులకు ఆజ్ఞాపించెను.

శ్లో॥ తత స్తస్య వచ శ్శ్రుత్వా మమ పుచ్ఛం సమంతతః ।
వేష్టితం శణవల్కైశ్చ జీర్ణైః కార్పాసజైః పటైః ॥ 146

పదచ్ఛేదము :- తతః - తస్య - వచః - శ్రుత్వా - మమ - పుచ్ఛం - సమంతతః, వేష్టితం - శణవల్కైః - చ - జీర్ణైః - కార్పాసజైః - పటైః ॥

అన్వయక్రమము :- తతః తస్య వచః శ్రుత్వా మమ పుచ్ఛం సమంతతః శణవల్కైః జీర్ణైః కార్పాసజైః పటైః చ వేష్టితమ్.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, తస్య = ఆ రావణునియొక్క, వచః = మాటను, శ్రుత్వా = విని, మమ = నాయొక్క, పుచ్ఛం = తోక, సమంతతః = అంతటను, శణవల్కైః = జనపనార గుడ్డలచేతను, జీర్ణైః = శిథిలములైన, కార్పాసజైః పటైః = నూలు గుడ్డలచేతను, వేష్టితమ్ = చుట్టబెట్టబడినది.

తాత్పర్యము :- రావణుని మాట వినగనే అతని భటులు గోనెగుడ్డలను పాతగుడ్డలను తెచ్చి నాతోక పొడవున చుట్టిరి.

శ్లో॥ రాక్షసా స్సిద్ధసన్నాహా స్తతస్తే చండవిక్రమాః ।
తదాదహంత మే పుచ్ఛం నిఘ్నంతః కాష్ఠముష్టిభిః ॥ 147

పదచ్ఛేదము :- రాక్షసాః - సిద్ధసన్నాహాః - తతః - తే - చండవిక్రమాః, తదా - అదహంత - మే - పుచ్ఛం - నిఘ్నంతః - కాష్ఠముష్టిభిః ॥

అన్వయక్రమము :- తతః చండవిక్రమాః తే రాక్షసాః సిద్ధసన్నాహాః (సంతః) కాష్ఠముష్టిభిః

నిఘ్నంతః మే పుచ్ఛమ్ అదహంత.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, చండవిక్రమాః = భయంకరమైన పరాక్రమము గలిగినట్టి, తే = ఆ, రాక్షసాః = రాక్షసులు, సిద్ధసన్నాహాః = సిద్ధమైన సన్నాహములు గలవారై, తదా = అప్పుడు, కాష్ఠముష్టిభిః = కఱ్ఱలతోడను, పిడికిళ్ళతోడను, నిఘ్నంతః = కొట్టుచున్నవారై, మే = నాయొక్క, పుచ్ఛమ్ = తోకను, అదహంత (అదహన్) = దహించిరి.

తాత్పర్యము :- అటుపిమ్మట మహాభయంకరచేష్టలు గల ఆ రాక్షసులు వలసిన సన్నాహములను పూర్తిచేసికొని, నన్ను కఱ్ఱలతోడను, తమ పిడికిళ్ళతోడను ప్రహరించుచు నాతోకకు నిప్పు ముట్టించిరి.

శ్లో॥ బద్ధస్య బహుభిః పాశైర్యంత్రితస్య చ రాక్షసైః ।
న మే పీడా భవే త్కాచి ద్దిదృక్షో ర్నగరీం దివా ॥ 148

పదచ్ఛేదము :- బద్ధస్య - బహుభిః - పాశైః - యంత్రితస్య - చ - రాక్షసైః - న - మే - పీడా - భవేత్ - కాచిత్ - దిదృక్షోః - నగరీం - దివా ॥

అన్వయక్రమము :- బహుభిః పాశైః బద్ధస్య రాక్షసైః యంత్రితస్య చ నగరీం దివా దిదృక్షోః చ మే కాచిత్ పీడా న భవేత్.

ప్రతిపదార్థము :- బహుభిః పాశైః = పెక్కుత్రాళ్ళతో, బద్ధస్య = బంధింపబడినట్టివాడను, రాక్షసైః = రాక్షసులచే, యంత్రితస్య చ = నిరోధింపబడు చున్నవాడనై, నగరీం = లంకానగరమును, దివా = పగటి సమయమున, దిదృక్షోః = చూడగోరుచున్నట్టి, మే = నాకు, కాచిత్ = కొంచమైనను, పీడా = బాధ, న భవేత్ (న అభవత్) = కాలేదు.

సూచన :- ఇందలి "భవేత్" అనుదానికి బదులుగా 'అభవత్' అని పాఠాంతరము, మరియు ఈ రెండవ సగము శ్లోకము కొన్ని ప్రతులలో లేదు.

తాత్పర్యము :- ఎన్నో త్రాళ్ళతో నన్ను కట్టి ఆ రాక్షసులు నన్ను నిరోధించుచున్నను లంకానగరమును పగటిపూట చూచు కోరికతో నున్న నాకు వారి హింసలు పీడను గల్గించకుండెను.

శ్లో॥ తత స్తే రాక్షసా శ్శూరా బద్ధం మా మగ్నిసంవృతమ్ ।
అఘోషయ న్రాజమార్గే నగరద్వారమాగతాః ॥ 149

పదచ్ఛేదము :- తతః - తే - రాక్షసాః - శూరాః - బద్ధం - మామ్ - అగ్ని సంవృతమ్, అఘోషయన్ - రాజమార్గే - నగరద్వారమ్ - ఆగతాః ॥

అన్వయక్రమము :– తతః శూరాః తే రాక్షసాః బద్ధమ్ అగ్నిసంవృతమ్ మాం రాజమార్గే నగరద్వారమ్ ఆగతాః అఘోషయన్.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, శూరాః = వీరులైన, తే = ఆ, రాక్షసాః = రాక్షసులు, బద్ధం = బంధింపబడినవాడను, అగ్నిసంవృతమ్ = అగ్నితో చుట్టుముట్ట బడినవాడను అగు, మాం = నన్ను గూర్చి, రాజమార్గే = రాజమార్గమున, నగరద్వారే = పట్టణద్వారమును, ఆగతాః = చేరినవారై, అఘోషయన్ = చాటింపు వేసిరి.

తాత్పర్యము :– వీరులైన ఆ రాక్షసులు రాజమార్గమునుండి బంధింపబడి, అగ్నితో చుట్టుముట్టబడియున్న నన్ను నగరద్వారమునకు తీసికొని పోవుచు నన్ను గూర్చి చాటింపు వేయుచుండిరి.

శ్లో॥ తతో౽హం సుమహ ద్రూపం సంక్షిప్య పున రాత్మనః ।
విమోచయిత్వా తం బంధం ప్రకృతిస్థ స్థ్సితః పునః ॥ 150

పదచ్ఛేదము :– తతః – అహం – సుమహత్ – రూపం – సంక్షిప్య – పునః – ఆత్మనః, విమోచయిత్వా – తం – బంధం – ప్రకృతిస్థః – స్థితః – పునః ॥

అన్వయక్రమము :– తతః అహమ్ ఆత్మనః సుమహత్ రూపం సంక్షిప్య తం బంధం విమోచయిత్వా పునః ప్రకృతిస్థః స్థితః.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, అహం = నేను, పునః = తిరిగి, సుమహత్ = గొప్పదైన, ఆత్మనః = నాయొక్క, రూపం = రూపమును, సంక్షిప్య = చిన్నదిగ చేసి, తం = ఆ, బంధం = బంధనమును, విమోచయిత్వా = విడిపించుకొని, పునః = తిరిగి, ప్రకృతిస్థః = సహజరూపమున నున్నవాడనుగా, స్థితః = ఉంటిని.

తాత్పర్యము :– అటు పిమ్మట నేను మిక్కిలి గొప్పదైన నా రూపమును చిన్నదిగ చేసికొని ఆ రాక్షసులు కట్టిన బంధములను విడిపించుకొని మరల వెనుకటి రూపమును దాల్చి నిలచితిని.

శ్లో॥ ఆయసం పరిఘం గృహ్యా తాని రక్షాం స్యసూదయమ్ ।
తత స్త న్నగరద్వారం వేగేనాప్లుతవా నహమ్ ॥ 151

పదచ్ఛేదము :– ఆయసం – పరిఘం – గృహ్యా – తాని – రక్షాంసి – అసూదయమ్, తతః – తత్ – నగరద్వారం – వేగేన – ఆప్లుతవాన్ – అహమ్ ॥

అన్వయక్రమము :– ఆయసం పరిఘం గృహ్యా తాని రక్షాంసి అసూదయమ్, తతః అహం వేగేన తత్ నగరద్వారం ఆప్లుతవాన్.

ప్రతిపదార్థము :– ఆయసం పరిఘం = ఉక్కుగుదియను, గృహ్య = గ్రహించి, తాని = ఆ, రక్షాంసి = రాక్షసులను, అసూదయమ్ = సంహరించితిని, తతః = పిమ్మట, అహం = నేను, వేగేన = వేగముగా, తత్ నగరద్వారం = ఆ పట్టణద్వారమును గూర్చి, ఆప్లుతవాన్ = గెంతితిని.

తాత్పర్యము :– వెంటనే నేను అచ్చటి ఇనుపగుదియను చేతబట్టుకొని అచటి రాక్షసుల నందరిని హతమార్చి వెంటనే వేగముగా ఆ పట్టణద్వారమును లంఘించితిని.

శ్లో॥ పుచ్ఛేన చ ప్రదీప్తేన తాం పురీం సాట్టగోపురామ్ ।
దహా మ్యహ మసంభ్రాంతో యుగాంతాగ్నిరివ ప్రజాః ॥ 152

పదచ్ఛేదము :– పుచ్ఛేన – చ – ప్రదీప్తేన – తాం – పురీం – సాట్టగోపురామ్, దహామి – అహమ్ – అసంభ్రాంతః – యుగాంతాగ్నిః – ఇవ – ప్రజాః ॥

అన్వయక్రమము :– ప్రదీప్తేన పుచ్ఛేన అహమ్ అసంభ్రాంతః యుగాంతాగ్నిః ప్రజాః ఇవ సాట్టగోపురాం తాం పురీం దహామి.

ప్రతిపదార్థము :– ప్రదీప్తేన = మిక్కిలిగా జ్వలించుచున్నట్టి, పుచ్ఛేన = తోకతో, అహం = నేను, అసంభ్రాంతః = భీతినొందని వాడనై, యుగాంతాగ్నిః = ప్రళయకాలము నందలి అగ్ని, ప్రజాః ఇవ = ప్రజలనువలె, సాట్టగోపురాం = బురుజులతోడను గోపురముల తోడను కూడిన, తాం = ఆ, పురీం = లంకాపురిని, దహామి = తగులబెట్టితిని.

తాత్పర్యము :– నా వాలము తీవ్రముగా జ్వలించుచున్నప్పటికిని నేనేమియు భయము నొందకుండ ప్రళయకాలమునందు చెలరేగిన అగ్ని ప్రజలను దహించునట్లు పెద్దబురుజుల తోడను, గోపురములతోడను కూడినట్టి ఆ లంకానగరమును తగులబెట్టితిని.

శ్లో॥ వినష్టా జానకీ వ్యక్తం న హ్యదగ్ధః ప్రదృశ్యతే ।
లంకాయాం కశ్చి దుద్దేశః సర్వా భస్మీకృతా పురీ ॥ 153

పదచ్ఛేదము :– వినష్టా – జానకీ – వ్యక్తం – న – హి – అదగ్ధః – ప్రదృశ్యతే, లంకాయాం – కశ్చిత్ – ఉద్దేశః – సర్వా – భస్మీకృతా – పురీ ॥

అన్వయక్రమము :– జానకీ వ్యక్తం వినష్టా, లంకాయాం కశ్చిత్ ఉద్దేశః అదగ్ధః న హి ప్రదృశ్యతే – సర్వా పురీ భస్మీకృతా.

ప్రతిపదార్థము :– జానకీ = సీతాదేవి, వ్యక్తం = స్పష్టముగా, వినష్టా = నశించినది, లంకాయాం = లంకయందు, కశ్చిత్ ఉద్దేశః = ఏ ప్రదేశముగూడ, అదగ్ధః = దహింపబడనిది, న హి ప్రదృశ్యతే = కనబడుట లేదుగదా, సర్వా = సమస్తమైన, పురీ = పట్టణము, భస్మీకృతా = భస్మము చేయబడినది.

తాత్పర్యము :– ఈ పరిస్థితి చూడగా నిస్సందేహముగా సీతాదేవి నశించిపోయినది. ఎందుచేతననగా దహింపబడకుండగ మిగిలిన ప్రదేశము కొంచెమైనను కాన్పించుట లేదు. మొత్తము పట్టణ మంతయును భస్మమై పోయెనుగదా!

శ్లో॥ దహతా చ మయా లంకాం దగ్ధా సీతా న సంశయః ।
రామస్య హి మహ త్కార్యం మ యేదం వితథీకృతమ్ ।
ఇతి శోకసమావిష్ట శ్చింతా మహముపాగతః ॥ 154

పదచ్ఛేదము :– దహతా – చ – మయా – లంకాం – దగ్ధా – సీతా – న – సంశయః – రామస్య – హి – మహత్ – కార్యం – మయా – ఇదం – వితథీకృతమ్, ఇతి – శోకసమావిష్టః – చింతామ్ – అహమ్ – ఉపాగతః ॥

అన్వయక్రమము :– లంకాం దహతా మయా సీతా చ దగ్ధా, సంశయః న, ఇదం మహత్ రామస్య కార్యం మయా వితథీకృతం హి, ఇతి శోకసమావిష్టః అహం చింతామ్ ఉపాగతః.

ప్రతిపదార్థము :– లంకాం = లంకానగరమును, దహతా = దహించుచున్నట్టి, మయా = నాచేత, సీతా చ = సీతాదేవియును, దగ్ధా = దహింపబడినది. సంశయః = సంశయము, న = లేదు, ఇదం = ఈ, మహత్ = గొప్పదైన, రామస్య = శ్రీరామునియొక్క, కార్యం = కార్యము, మయా = నాచేత, వితథీకృతమ్ = వ్యర్థము చేయబడినది, ఇతి = అని, అహం = నేను, శోకసమావిష్టః = దుఃఖము నొందినవాడనై, చింతాం = దిగులును, ఉపాగతః = పొందితిని.

తాత్పర్యము :– అక్కటా! ఈ లంకానగరమును దహించుచు నేను సీతాదేవినిగూడ దహించియే యుంటినిగదా! ఇందు సంశయమునకు తావు ఏమున్నది? ఇట్లు శ్రీరామచంద్రుని కొరకు నేను సాధించిన ఘనకార్యమును నేనే నిష్ఫలము చేసితినిగదా! అని వ్యాకులచిత్తముతో శోకగ్రస్తుడనైతిని.

శ్లో॥ అ థాహం వాచ మశ్రౌషం చారణానాం శుభాక్షరామ్ ।
జానకీ న చ దగ్ధేతి విస్మయోదంతభాషిణామ్ ॥ 155

పదచ్ఛేదము :- అథ - అహం - వాచమ్ - అశ్రౌషం - చారణానాం - శుభాక్షరామ్, జానకీ - న - చ - దగ్ధా - ఇతి - విస్మయోదంతభాషిణామ్ ॥

అన్వయక్రమము :- అథ అహం జానకీ న చ దగ్ధా ఇతి విస్మయోదంతభాషిణాం చారణానాం శుభాక్షరాం వాచమ్ అశ్రౌషమ్.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, అహం = నేను, జానకీ = సీతాదేవి, న చ దగ్ధా = ఏమియు దహింపబడలేదు, ఇతి = అని, విస్మయోదంతభాషిణాం = ఆశ్చర్యకరమైన వృత్తాంతమును గూర్చి మాటలాడుకొనుచున్నట్టి, చారణానాం = చారణులయొక్క, శుభాక్షరాం = మంగళకరమైన అక్షరములు గల, వాచమ్ = మాటను, అశ్రౌషమ్ = వింటిని.

తాత్పర్యము :- అప్పుడు ఆకాశమునందు 'ఆహా!' జానకీదేవి మాత్రము ఏమియు దహింపబడలేదు సుమా యనుచు ఆశ్చర్యముతో ఈ వృత్తాంతమును గూర్చి తమలో తాము సంభాషించుకొనుచున్న చారణగణములయొక్క అమృతప్రాయములైన వచనములు నాచెవిన బడినవి.

శ్లో॥ తతో మే బుద్ధిరుత్పన్నా శ్రుత్వా తా మద్భుతాం గిరమ్ ।
అదగ్ధా జానకీత్యేవం నిమిత్తైశ్చోపలక్షితా ॥ 156

పదచ్ఛేదము :- తతః - మే - బుద్ధిః - ఉత్పన్నా - శ్రుత్వా - తామ్ - అద్భుతాం - గిరమ్, అదగ్ధా - జానకీ - ఇతి - ఏవం - నిమిత్తైః - చ - ఉపలక్షితా ॥

అన్వయక్రమము :- తతః తాం అద్భుతాం గిరం శ్రుత్వా జానకీ అదగ్ధా ఇతి మే బుద్ధిః ఉత్పన్నా. నిమిత్తైః చ ఏవమ్ ఉపలక్షితా.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, అద్భుతాం = అద్భుతమైనట్టి, తాం = ఆ, గిరం = వాక్కును, శ్రుత్వా = విని, జానకీ = సీతాదేవి, అదగ్ధా = దహింపబడలేదు, ఇతి = అని, బుద్ధిః = నిశ్చయము, మే = నాకు, ఉత్పన్నా = గలిగినది, నిమిత్తైః చ = శుభశకునములచే గూడ, ఏవం = ఈరీతిగా, ఉపలక్షితా = గ్రహింపబడినది.

తాత్పర్యము :- ఆకసమునందు చారణగణములు పలుకుచున్న ఆశ్చర్యకరమైన ఆ మాటలు వినినంతనే సీతాదేవి దహింపబడలేదని నాకు నిశ్చయము గలిగినది. అప్పుడు నాకు గాన్పించిన శుభశకునములను బట్టి కూడ ఆ విషయము దృఢపడినది.

శ్లో॥ దీప్యమానే తు లాంగూలే న మాం దహతి పావకః ।
హృదయం చ ప్రహృష్టం మే వాతా స్సురభిగంధినః ॥ 157

పదచ్ఛేదము :– దీప్యమానే – తు – లాంగూలే – న – మాం – దహతి – పావకః, హృదయం – చ – ప్రహృష్టం – మే – వాతాః – సురభిగంధినః ॥

అన్వయక్రమము :– లాంగూలే దీప్యమానే (సతి) పావకః మాం న దహతి, మే హృదయం చ ప్రహృష్టం, వాతాః సురభిగంధినః (ఆసన్).

ప్రతిపదార్థము :– లాంగూలే = వాలము, దీప్యమానే (సతి) = దహింపబడుచున్నది యైనను, పావకః = అగ్ని, మాం = నన్ను, న దహతి = దహించుటలేదు, మే = నాయొక్క, హృదయం చ = హృదయము గూడ, ప్రహృష్టం = సంతుష్టమైయున్నది, వాతాః = వాయువులు, సురభిగంధినః = సువాసనగలవై, (ఆసన్ = ఉన్నవి).

తాత్పర్యము :– నా తోక దహింపబడుచున్నప్పటికిని అగ్ని నాకేమియును తాపమును గలిగించుటలేదు. నా హృదయము గూడ హర్షభరితమై యున్నది గాని ఏ విధమైన చింతను పొందుటలేదు. వీచుచున్న గాలులు గూడ పరిమళభరితములై నాకు ఆనందకరములే యగుచున్నవిగాని భయమునకు కారణమగుటలేదు.

శ్లో॥ తై ర్నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః ।
ఋషివాక్యైశ్చ సిద్ధార్థై రభవం హృష్టమానసః ॥ 158

పదచ్ఛేదము :– తైః – నిమిత్తైః – చ – దృష్టార్థైః – కారణైః – చ – మహాగుణైః – ఋషివాక్యైః – చ – సిద్ధార్థైః – అభవం – హృష్టమానసః ॥

అన్వయక్రమము :– దృష్టార్థైః తైః నిమిత్తైః చ, మహాగుణైః కారణైః చ, సిద్ధార్థైః ఋషివాక్యైః చ హృష్టమానసః అభవమ్.

ప్రతిపదార్థము :– దృష్టార్థైః = కాన్పించిన ఫలము గలిగినట్టి, తైః = ఆ, నిమిత్తైః చ = శుభశకునములచేతను, మహాగుణైః = గొప్ప గుణములు గల్గినట్టి, కారణైః చ = కారణములచేతను, సిద్ధార్థైః = సిద్ధించు ప్రయోజనము గల్గినట్టి, ఋషివాక్యైః చ = మునులవచనముల చేతను, హృష్టమానసః = హర్షము నొందిన మనస్సుగలవాడను, అభవమ్ = అయితిని.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– మహాగుణైః కారణైః = నన్ను నడిపించుచున్నట్టి సీతారాముల రూపములో నున్న మహాశక్తులచేతను.

తాత్పర్యము :– ఈ విధముగ నాకు కాన్పించిన ప్రత్యక్షఫలము గల శుభశకునముల

చేతను, అద్భుతమైన నా మనస్సును ప్రోత్సహించుచున్న శక్తులచేతను, ఆకసము నందలి ఫలసిద్ధికరములయిన ఋషివాక్యములచేతను నా హృదయము ఆనందభరితమయ్యెను.

శ్లో॥ పున ర్దృష్ట్వా చ వైదేహీం విసృష్టశ్చ తయా పునః ।
తతః పర్వత మాసాద్య త త్రారిష్ట మహం పునః ।
ప్రతిప్లవనమారేభే యుష్మద్దర్శనకాంక్షయా ॥ 159

పదచ్ఛేదము :– పునః – దృష్ట్వా – చ – వైదేహీం – విసృష్టః – చ – తయా – పునః, తతః – పర్వతమ్ – ఆసాద్య – తత్ర – అరిష్టమ్ – అహం – పునః – ప్రతిప్లవనమ్ – ఆరేభే – యుష్మద్దర్శనకాంక్షయా ॥

అన్వయక్రమము :– పునః చ వైదేహీం దృష్ట్వా తయా పునః చ విసృష్టః తతః అహం తత్ర అరిష్టం పర్వతమ్ ఆసాద్య యుష్మద్దర్శనకాంక్షయా పునః ప్రతిప్లవనం ఆరేభే.

ప్రతిపదార్థము :– పునః చ = తిరిగి, వైదేహీం = సీతాదేవిని, దృష్ట్వా = చూచి, తయా = ఆమెచే, పునః = తిరిగి, విసృష్టః = పంపబడినవాడనై, తతః = పిమ్మట, తత్ర = ఆ లంకయందు, అరిష్టం = అరిష్ట మను పర్వతమును, ఆసాద్య = చేరి, యుష్మద్దర్శనకాంక్షయా = మీయొక్క దర్శనమునందలి కోరికతో, అహం = నేను, ప్రతిప్లవనం = తిరిగి లంఘనమును, ఆరేభే = ఆరంభించితిని.

తాత్పర్యము :– తిరిగి సీతాదేవిని దర్శించి ఆమెకడ సెలవు గైకొని అటనుండి ఆ లంకయందలి అరిష్టపర్వతశిఖరమును చేరి మిమ్ముల నందరను దర్శించవలె ననెడి వేగిరపాటుతో తిరుగు ప్రయాణమునకై లంఘనమును ఆరంభించితిని.

శ్లో॥ తతః పవన చంద్రార్క సిద్ధగంధర్వ సేవితమ్ ।
పంథాన మహ మాక్రమ్య భవతో దృష్టవా నిహ ॥ 160

పదచ్ఛేదము :– తతః – పవనచంద్రార్క సిద్ధ గంధర్వ సేవితమ్, పంథానం – అహమ్ – ఆక్రమ్య – భవతః – దృష్టవాన్ – ఇహ ॥

అన్వయక్రమము :– తతః అహం పవనచంద్రార్క సిద్ధగంధర్వసేవితం పంథానమ్ ఆక్రమ్య ఇహ భవతః దృష్టవాన్.

ప్రతిపదార్థము :– తతః = అటు పిమ్మట, అహం = నేను, పవనచంద్రార్కసిద్ధ గంధర్వసేవితం = వాయువుచేతను చంద్రసూర్యులచేతను, సిద్ధులచేతను, గంధర్వులచేతను సేవింపబడుచున్నట్టి, పంథానం = మార్గమును, ఆక్రమ్య = చేరి,

ఇహ = ఈ సముద్రతీరమునందు, భవతః = మిమ్ములను, దృష్టవాన్ = దర్శించినాడను.

తాత్పర్యము :– అట్లు మహాసముద్రమును లంఘించి వాయువు, చంద్రసూర్యులు, సిద్ధగంధర్వాదులును సేవించుచున్నట్టి ఈ యాకాశమార్గమున పయనించి ఈ సముద్రతీరమును చేరుకొని మిమ్ముల నందరిని చూచితిని.

శ్లో॥ రాఘవస్య ప్రభావేణ భవతాం చైవ తేజసా ।
సుగ్రీవస్య చ కార్యార్థం మయా సర్వ మనుష్ఠితమ్ ॥ 161

పదచ్ఛేదము :– రాఘవస్య – ప్రభావేణ – భవతాం – చ – ఏవ – తేజసా – సుగ్రీవస్య – చ – కార్యార్థం – మయా – సర్వమ్ – అనుష్ఠితమ్ ॥

అన్వయక్రమము :– రాఘవస్య ప్రభావేణ, భవతాం తేజసా చ ఏవ సుగ్రీవస్య కార్యార్థం చ (ఏతత్) సర్వం మయా అనుష్ఠితమ్.

ప్రతిపదార్థము :– రాఘవస్య = శ్రీరామచంద్రునియొక్క, ప్రభావేణ = ప్రభావము చేతను, భవతాం = మీయొక్క, తేజసా చైవ = మహిమచేతను, సుగ్రీవస్య = సుగ్రీవుని యొక్క, కార్యార్థం = కర్తవ్యముకొరకును, (ఏతత్) సర్వం = (ఇది) అంతయును, మయా = నాచే, అనుష్ఠితమ్ = నెరవేర్పబడినది.

సూచన :– "రాఘవస్య ప్రభావేణ" అనుదానికి బదులుగా 'రాఘవస్య ప్రసాదేన' అని బొంబాయి ముద్రణమునందు గలదు – అనగా శ్రీరాముని అనుగ్రహవిశేషముచే అని భావము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి హృదయము :– 'రాఘవస్య ప్రభావేణ' అని అనుటలోని తాత్పర్యము – సీతాదేవిని హనుమ దర్శించగనే ఆమెయందలి దివ్యప్రభావమును పూర్తిగా గుర్తించెను. అప్పటినుండియు ఆతనికి ఆమె ప్రాణేశ్వరుడైన రాఘవునిపైగల పూర్వగౌరవము ఇంకను తీవ్రమైనది. అట్టి భక్తివిశేషముతోడనే ప్రస్తుతము ఇచ్చట శ్రీరాముని స్మరించుచు 'రాఘవస్య ప్రభావేణ' అనుచున్నాడు. మొదట ఈ లంకావృత్తాంతకథనము ఆరంభించినపుడు 'ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై' అని సీతమ్మకి మ్రొక్కి ముగింపునందు ఇచ్చట శ్రీరాముని స్మరించుటలో హనుమదృష్టిలో సీతారాముల అభేదము స్పష్టమగు చున్నది. ఇట్లు ఈ సీతారాముల అనపాయత్వము రామాయణసందేశము అని విదిత మగుచున్నది. రాఘవు డనగా సీతావల్లభు డనియు, సీత యనగా రామవల్లభ యనియు తత్త్వవేత్తలైన భక్తుల భావము.

తాత్పర్యము :- సీతావల్లభుని ప్రభావవిశేషముచేతను మీ యందరి మహిమచేతను సుగ్రీవమహారాజు కార్యనిర్వహణముకొరకు దీని నంతను ఇట్లు నేను నెరవేర్చుకొని వచ్చితిని.

శ్లో॥ ఏత త్సర్వం మయా తత్ర యథావ దుపపాదితమ్ ।
అత్ర య న్న కృతం శేషం తత్సర్వం క్రియతా మితి ॥ 162

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"హనుమద్వృత్తానుకథనం" నామ
అష్టపంచాశస్సర్గః

పదచ్ఛేదము :- ఏతత్ - సర్వం - మయా - తత్ర - యథావత్ - ఉపపాదితమ్, అత్ర - యత్ - న - కృతం - శేషం - తత్ - సర్వం - క్రియతామ్ - ఇతి ॥

అన్వయక్రమము :- తత్ర సర్వమ్ ఏతత్ యథావత్ ఉపపాదితమ్, అత్ర యత్ న కృతం తత్ శేషం సర్వం క్రియతామ్ ఇతి (హనుమతా నివేదితమ్).

ప్రతిపదార్థము :- తత్ర = ఆ లంకయందు, ఏతత్ = ఇది యంతయును, యథావత్ = ఉచితమైన రీతిగా, ఉపపాదితమ్ = ఆచరింపబడినది. అత్ర = ఈ కార్యమునందు, యత్ = ఏది, న కృతం = చేయబడలేదో, తత్ = ఆ, శేషం = మిగిలినది, సర్వం = అంతయును, క్రియతాం = చేయబడుగాక! ఇతి = అని, హనుమాన్ = హనుమ, ప్రత్యభాషత = పలికెను.

తాత్పర్యము :- ఈ రీతిగా నేను లంకయందు సముచితమైన రీతిగా కార్యక్రమమును నెరవేర్చి వచ్చితిని. ఇక ఈ కార్యనిర్వహణమునందు శేషించియున్న దంతయును మీరు గ్రహించి పూర్తిచేయుదురుగాక! అని హనుమ అంగదాదులతో పలికెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"హనుమద్ వృత్తానుకథనము" అను
ఏబదియెనిమిదవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

ఏకోనషష్టితమసర్గ

శ్లో॥ ఏత దాఖ్యాయ తత్సర్వం హనుమా న్మారుతాత్మజః ।
భూయ స్సముపచక్రామ వచనం వక్తు ముత్తరమ్ ॥ 1

పదచ్ఛేదము :– ఏతత్ – ఆఖ్యాయ – తత్ – సర్వం – హనుమాన్ – మారుతాత్మజః, భూయః – సముపచక్రామ – వచనం – వక్తుమ్ – ఉత్తరమ్ ॥

అన్వయక్రమము :– మారుతాత్మజః హనుమాన్ తత్ ఏతత్ సర్వమ్ ఆఖ్యాయ భూయః ఉత్తరం వచనం వక్తుం సముపచక్రామ.

ప్రతిపదార్థము :– మారుతాత్మజః = వాయునందనుడైన, హనుమాన్ = హనుమ, తత్ = ఆ, ఏతత్ = ఇది, సర్వం = అంతయును, ఆఖ్యాయ = చెప్పి, భూయః = తిరిగి, ఉత్తరం = తరువాతిదైన, వచనం = మాటను, వక్తుం = పలుకుటకు, సముపచక్రామ = ప్రారంభించెను.

తాత్పర్యము :– వాయునందనుడైన హనుమ తానాచరించిన ఆ వృత్తాంత మంతయును ఈ రీతిగ తెలిపి తిరిగి తెలుపవలసిన విషయమును ఇట్లు పలుక దొడగెను.

శ్లో॥ సఫలో రాఘవోద్యోగ స్సుగ్రీవస్య చ సంభ్రమః ।
శీల మాసాద్య సీతాయా మమ చ ప్రవణం మనః ॥ 2

పదచ్ఛేదము :– సఫలః – రాఘవోద్యోగః – సుగ్రీవస్య – చ – సంభ్రమః, శీలమ్ – ఆసాద్య – సీతాయాః – మమ – చ – ప్రవణం – మనః ॥

అన్వయక్రమము :– సీతాయాః శీలమ్ ఆసాద్య రాఘవోద్యోగః సఫలః, సుగ్రీవస్య సంభ్రమః చ (సఫలః). మమ మనః చ ప్రవణమ్.

ప్రతిపదార్థము :– సీతాయాః = సీతాదేవియొక్క, శీలం = సచ్చరిత్రమును, ఆసాద్య = చేరి, (ఆధారముగ చేసికొని), రాఘవోద్యోగః = శ్రీరాముని ఉద్యమము, సఫలః = సఫలమైనది, సుగ్రీవస్య = సుగ్రీవునియొక్క, సంభ్రమః చ = వేగిరపాటుకూడ, (సఫలః = సఫలమైనది), మమ = నాయొక్క, మనః చ = మనస్సుగూడ, ప్రవణమ్ =

భక్తితత్పరము (ఆయెను).

సూచన :– 'మమ చ ప్రవణం మనః' అనుటకు బదులుగా 'మమ చ ప్రీణితం మనః' అని బొంబాయి ముద్రణము. అనగా నా మనస్సు సంతోషయుక్తమైనదని భావము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– సుగ్రీవస్య చ సంభ్రమః సుగ్రీవుని ఆదరము ఉత్సాహము అని అర్థము. శీలమ్ ఆసాద్య – అనగా పాతివ్రత్యమును జూచి.

గోవిందరాజీయము :– 'మమ చ ప్రవణం మనః' నాకు పూర్వమే తెలిసి యున్నను ఆమెను దర్శించిన పిమ్మట సీతాప్రభావమునకు ఏమియు అసాధ్యముండదని తెలిసికొంటినని భావము.

తాత్పర్యము :– శ్రీరాముని ఉద్యమము, మన మహారాజు సుగ్రీవునియొక్క సంభ్రమము గూడ సీతాదేవి శీలవైభవమువలన సఫలత నొందినది. నా మనస్సుగూడ భక్తితత్పరమై నెగడుచున్నది.

శ్లో॥ తపసా ధారయే ల్లోకాన్క్రుద్ధో వా నిర్దహేదపి ।
సర్వథా ఽతిప్రవృద్ధోఽసౌ రావణో రాక్షసాధిపః ॥ 3

శ్లో॥ తస్య తాం స్పృశతో గాత్రం తపసా న వినాశితమ్ ॥ 4

పదచ్ఛేదము :– తపసా – ధారయేత్ – లోకాన్ – క్రుద్ధః – వా – నిర్దహేత్ – అపి, సర్వథా – అతిప్రవృద్ధః – అసౌ – రావణః – రాక్షసాధిపః, తస్య – తాం – స్పృశతః – గాత్రం – తపసా – న – వినాశితమ్ ॥

అన్వయక్రమము :– అసౌ రాక్షసాధిపః రావణః తపసా లోకాన్ ధారయేత్, క్రుద్ధః వా నిర్దహేత్ అపి, సర్వథా అతిప్రవృద్ధః. తాం స్పృశతః తస్య గాత్రం తపసా న వినాశితమ్.

ప్రతిపదార్థము :– అసౌ = ఈ, రాక్షసాధిపః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, తపసా = తపస్సుచే, లోకాన్ = జగత్తును, ధారయేత్ = నిలువబెట్టును. క్రుద్ధః వా = కోపించినవాడగునేని, నిర్దహేత్ అపి = దహించివేయునుగూడ, సర్వథా = ఎల్లవిధములుగా, అతిప్రవృద్ధః = మిక్కిలి వృద్ధిని సాధించి యున్నవాడు, తాం = ఆ సీతాదేవిని, స్పృశతః = తాకుచున్నట్టి, తస్య = ఆతనియొక్క, గాత్రం = శరీరము,

తపసా = తపస్సుచేతనే, న వినాశితమ్ = నశింపచేయబడలేదు.

తాత్పర్యము :– రాక్షసేశ్వరుడైన ఆ రావణుడు తనయొక్క తపఃప్రభావముచే లోకము లన్నింటిని నిలిపియుంచగలడు. కోపము వచ్చినయెడల సమస్తజగత్తులను దహించివేయగలడు. సర్వథా ఆతడు తన తపఃప్రభావముచే మహాశక్తిసంపన్నుడై యున్నాడు. అందుచేతనే ఆనాడు సీతాసాధ్విని స్పృశించినప్పటికిని తన తపోమహిమ కారణముగనే నాశనము నొందక నిలువగలిగెను.

శ్లో॥ న తదగ్నిశిఖా కుర్యా త్సంస్పృష్టా పాణినా సతీ ।
జనకస్యాత్మజా కుర్యా ద్యత్క్రోధకలుషీకృతా ॥ 5

పదచ్ఛేదము :– న – తత్ – అగ్నిశిఖా – కుర్యాత్ – సంస్పృష్టా – పాణినా – సతీ, జనకస్య – ఆత్మజా – కుర్యాత్ – యత్ – క్రోధకలుషీకృతా ॥

అన్వయక్రమము :– క్రోధకలుషీకృతా జనకస్య ఆత్మజా యత్ న కుర్యాత్, తత్ పాణినా సంస్పృష్టా సతీ అగ్నిశిఖా న కుర్యాత్.

ప్రతిపదార్థము :– క్రోధకలుషీకృతా = క్రోధముచే కలుషముగా చేయబడినట్టి, జనకస్య = జనకమహారాజుయొక్క, ఆత్మజా = పుత్రికయైన సీతాదేవి, యత్ = దేనిని, న కుర్యాత్ = చేయలేదో, తత్ = దానిని, పాణినా = చేతితో, సంస్పృష్టా = ముట్టుకొనబడినట్టి, అగ్నిశిఖా = అగ్నిజ్వాల, న కుర్యాత్ = చేయజాలదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– సీతాదేవి తన భర్తయొక్క పరాక్రమమును ఎరిగినది గావున తాను రావణునిపై క్రోధము నొందలేదు అని భావము. అయినను ఆమె పాతివ్రత్య ప్రభావముచే ఆమెను స్పృశించిన రావణుని శరీరము దహింపబడవలసినదేగాని రావణుడు గూడ మహాతపశ్శక్తి సంపన్నుడగుటచే అట్లు దహింపబడకుండ నిలువగలిగినాడని తెలియవలెను.

గోవిందరాజీయము :– తాను క్రోధ కలుషితురాలయినచో సీతాదేవి ఎట్టివారినైనను భస్మము చేయగలదు గాని తన భర్తచేతనే శత్రునిర్మూలనము చేయించుట వీరపత్ని యొక్క ధర్మము, కాబట్టి భర్త పరాక్రమమునకు అగౌరవము కలుగకుండ తాను పారతంత్ర్యమునే అంగీకరించినది. అందుచేతనే రావణుడు జీవించి యుండగలిగినాడు. ఈ విషయ మామె వెనుకయే చెప్పియున్నదిగదా!

"అసందేశాత్తు రామస్య తపసశ్చానుపాలనాత్,
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా ॥"

తాత్పర్యము :– సీతాదేవి క్రోధోద్రేకము నొందిన యెడల ఎట్టి భయంకర శత్రువునైనను నిర్మూలనము చేయగలదు. చేతితో ముట్టుకొన్న అగ్నిజ్వాల ఒకప్పుడు దహింపలేక పోవచ్చునేమో గాని సీతమ్మయొక్క క్రోధము మాత్రము దహింపకుండుట సంభవించదు.

శ్లో॥ జాంబవత్ప్రముఖా న్సర్వా ననుజ్ఞాప్య మహాహరీన్ ।
అస్మి న్నేవంగతే కార్యే భవతాం చ నివేదితే ।
న్యాయ్యం చ సహ వైదేహ్యా ద్రష్టుం తౌ పార్థివాత్మజౌ ॥ 6

పదచ్ఛేదము :– జాంబవత్ ప్రముఖాన్ – సర్వాన్ – అనుజ్ఞాప్య – మహాహరీన్ – అస్మిన్ – ఏవం – గతే – కార్యే – భవతాం – చ – నివేదితే – న్యాయ్యం – చ – సహ – వైదేహ్యా – ద్రష్టుం – తౌ – పార్థివాత్మజౌ ॥

అన్వయక్రమము :– అస్మిన్ కార్యే ఏవం గతే సతి భవతాం చ నివేదితే చ సతి జాంబవత్ప్రముఖాన్ మహాహరీన్ సర్వాన్ అనుజ్ఞాప్య వైదేహ్యా చ సహ తౌ పార్థివాత్మజౌ ద్రష్టుం న్యాయ్యమ్.

ప్రతిపదార్థము :– అస్మిన్ = ఈ, కార్యే = కార్యము, ఏవం = ఈరీతిగా, గతే = జరిగినదికాగా, భవతాం = నీకు, నివేదితే సతి = విన్నవింపబడియుండగా, జాంబవత్ప్రముఖాన్ = జాంబవంతుడు మొదలైనట్టి, మహాహరీన్ = మహనీయులైన వానరులను, సర్వాన్ = అందరిని, అనుజ్ఞాప్య = అంగీకరింపచేసి, వైదేహ్యా చ సహ = సీతాదేవితోగూడ, తౌ = ఆ, పార్థివాత్మజౌ = రాజపుత్రులను, ద్రష్టుం = చూచుటకు, న్యాయ్యమ్ = న్యాయ్యము.

తాత్పర్యము :– ప్రస్తుతము తలపెట్టిన ఉద్యమము ఇంతవరకు సిద్ధించినదని తెలుపబడినది. పిమ్మట జాంబవంతుడు మున్నగు మహనీయులైన వానరులకు విన్నవించి వారి యనుజ్ఞ తీసికొని మనము సీతాదేవిని లంకనుండి తీసికొనివచ్చి ఆమెతో గలసియే రామలక్ష్మణులను దర్శించుట న్యాయమై యుండును.

శ్లో॥ అహ మేకోఽపి పర్యాప్త స్సరాక్షసగణాం పురీమ్ ।
తాం లంకాం తరసా హంతుం రావణం చ మహాబలమ్ ॥ 7

పదచ్ఛేదము :– అహమ్ – ఏకః – అపి – పర్యాప్తః – సరాక్షసగణాం – పురీమ్, తాం – లంకాం – తరసా – హంతుం – రావణం – చ – మహాబలమ్ ॥

అన్వయక్రమము :– సరాక్షసగణాం తాం లంకాం పురీం, మహాబలం రావణం చ తరసా హంతుమ్ ఏకః అపి అహం పర్యాప్తః.

ప్రతిపదార్థము :– సరాక్షసగణాం = రాక్షససమూహములతో గూడినట్టి, తాం = ఆ, లంకాపురీం = లంకానగరమును, మహాబలం = గొప్పబలశాలియైన, రావణం చ = రావణుని, తరసా = వేగముతో (బలముచే), హంతుం = చంపుటకు, ఏకః అపి = ఒక్కడనైనప్పటికిని, అహం = నేను, పర్యాప్తః = చాలినవాడను.

తాత్పర్యము :– రాక్షససైన్యము లన్నింటితో గూడిన ఆ లంకానగరమును నశింపజేసి మహాబలశాలియైన రావణుని నా పరాక్రమముచే సంహరించుటకు నేనొక్కడనే సరిపడెదను.

శ్లో॥ కిం పున స్సహితో వీరైర్బలవద్భిః కృతాత్మభిః ।
కృతాస్త్రైః ప్లవగైః శూరై ర్భవద్భి ర్విజయైషిభిః ॥ 8

పదచ్ఛేదము :– కిం – పునః – సహితః – వీరైః – బలవద్భిః – కృతాత్మభిః – కృతాస్త్రైః – ప్లవగైః – శూరైః – భవద్భిః – విజయైషిభిః ॥

అన్వయక్రమము :– వీరైః బలవద్భిః కృతాత్మభిః కృతాస్త్రైః విజయైషిభిః శూరైః ప్లవగైః భవద్భిః సహితః (చేత్) పునః కిం (వక్తవ్యమ్?).

ప్రతిపదార్థము :– వీరైః = వీరులును, బలవద్భిః = బలవంతులును, కృతాత్మభిః = నిశ్చయమైన మనస్సుగలవారును, కృతాస్త్రైః = నేర్చిన అస్త్రవిద్యగలవారును, విజయైషిభిః = విజయము గోరువారు నగు, శూరైః ప్లవగైః = శూరులైన వానరులగు, భవద్భిః = మీతోడ, సహితః (చేత్) = కూడినవాడనైనచో, పునః = తిరిగి, కిం (వక్తవ్యమ్?) = ఏమి చెప్పవలెను?

తాత్పర్యము :– మహావీరులును, మహాబలాఢ్యులును, స్థిరసంకల్పులును, అస్త్రనిపుణులును, జయాభిలాష గలవారునగు యోధులైన మీ యందరితో గలసి లంకమీదికి వెడలినచో శత్రుసంహారవిషయమై ఇంక ఏమి చెప్పవలెను?

శ్లో॥ అహం తు రావణం యుద్ధే ససైన్యం సపురస్సరమ్ ।
సహపుత్రం వధిష్యామి సహోదరయుతం యుధి ॥ 9

పదచ్ఛేదము :– అహం – తు – రావణం – యుద్ధే – ససైన్యం – సపురస్సరమ్, సహపుత్రం – వధిష్యామి – సహోదరయుతం – యుధి ॥

అన్వయక్రమము :– అహం తు యుద్ధే ససైన్యం సపురస్సరం, సహపుత్రం,

సహోదరయుతం రావణం యుధి వధిష్యామి.

ప్రతిపదార్థము :– అహం తు = నేనే, యుద్ధే = యుద్ధమునందు, ససైన్యం = సేనతోగూడినవాడును, సపురస్సరం = అగ్రేసరులతో గూడినవాడును, సహపుత్రం = పుత్రులతో గూడినవాడును, సహోదరయుతం = సోదరులతో గూడినవాడునగు, రావణం = రావణుని, యుధి = యుద్ధమునందు, వధిష్యామి = సంహరించెదను.

తాత్పర్యము :– నేనొక్కడనే యుద్ధభూమిలో నిలిచి మహాసైన్యములతోడను, మహాసేనాధిపతులతోడను, పుత్రులతోడను, సోదరులతోడను గూడిన రావణునితో రణమొనరించి ఆతనిని వధించెదను.

శ్లో॥ బ్రాహ్మ మైంద్రం చ రౌద్రం చ వాయవ్యం వారుణం తథా ।
యది శక్రజితోఽస్త్రాణి దుర్నిరీక్ష్యాణి సంయుగే ॥ 10

శ్లో॥ తాన్యహం విధమిష్యామి నిహనిష్యామి రాక్షసాన్ ।
భవతామభ్యనుజ్ఞాతో విక్రమో మే రుణద్ధి తమ్ ॥ 11

పదచ్ఛేదము :– బ్రాహ్మమ్ – ఐంద్రం – చ – రౌద్రం – చ – వాయవ్యం – వారుణం – తథా, యది – శక్రజితః – అస్త్రాణి – దుర్నిరీక్ష్యాణి – సంయుగే, తాని – అహం – విధమిష్యామి – నిహనిష్యామి – రాక్షసాన్, భవతామ్ – అభ్యనుజ్ఞాతః – విక్రమః – మే – రుణద్ధి – తమ్ ॥

అన్వయక్రమము :– బ్రాహ్మమ్, ఐంద్రం, రౌద్రం, వాయవ్యం, వారుణం, తథా శక్రజితః దుర్నిరీక్ష్యాణి (అన్యాని) అస్త్రాణి, యది (ఆపతేయుః) తాని అహం భవతామ్ అభ్యనుజ్ఞాతః సంయుగే విధమిష్యామి, రాక్షసాన్ నిహనిష్యామి, మే విక్రమః తం రుణద్ధి.

ప్రతిపదార్థము :– బ్రాహ్మం = బ్రహ్మాస్త్రము, ఐంద్రం = ఇంద్రాస్త్రము, రౌద్రం = పాశుపతాస్త్రము, వాయవ్యం = వాయవ్యాస్త్రము, వారుణం = వారుణాస్త్రము, తథా = అట్లే, శక్రజితః = ఇంద్రజిత్తుయొక్క, (అన్యాని = ఇతరములైన) అస్త్రాణి = అస్త్రములు, యది (ఆపతేయుః) = ఒకవేళ ప్రయోగింపబడునేని, తాని = ఆ యస్త్రములను, అహం = నేను, భవతాం = మీయొక్క, అభ్యనుజ్ఞాతః = అనుమతి వలన, సంయుగే = యుద్ధమునందు, విధమిష్యామి = అణచివేయుదును, రాక్షసాన్ = రాక్షసులను, నిహనిష్యామి = పూర్తిగా వధించెదను, మే = నా యొక్క, విక్రమః = పరాక్రమము, తం = ఆ ఇంద్రజిత్తును, రుణద్ధి = నిరోధించును.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– 'భవతామ్ అభ్యనుజ్ఞాతః' – హనుమ పూర్వము లంకను ధ్వంసము చేసినప్పుడే ఆయా రక్కసులను వధించినప్పుడే రావణాదులను వధింపవచ్చును గదా అనుకొందురేమో యని, మీ యనుజ్ఞ లేకుండుటచేతనే వారిని అప్పుడు వధింప లేదనియు, మీ యనుజ్ఞయైనచో ఇప్పుడు వధింపగలననియు భావము.

రా.శిరోమణి :– 'భవతాం అభ్యనుజ్ఞాతః' – అనుదానికి బదులుగా 'భవతామననుజ్ఞాతః' అని పాఠాంతరము, ఈ పక్షమున –

'భవతామ్ అననుజ్ఞాతః మే విక్రమః మాం రుణద్ధి' అని అన్వయించి నీ యనుజ్ఞ లేకపోవుటచే నా పరాక్రమము నన్ను అడ్డగించి రావణాదులను వధింపకుండ చేసినది యని గ్రహించవలెను.

తాత్పర్యము :– వివిధమహాస్త్రవేదియైన ఇంద్రజిత్తుయొక్క బ్రాహ్మము, ఐంద్రము, పాశుపతము, వాయవ్యము, వారుణము మున్నగు శత్రుభయంకరములైన అస్త్రములు ఎన్ని ప్రయోగింపబడినప్పటికిని మీ యనుజ్ఞ పొంది రణరంగమునందు వాని నన్నింటిని ఎదుర్కొని అణచివైచెదను. ఆ రాక్షసుల నెల్లరిని సంహరించెదను. నా పరాక్రమ మా ఇంద్రజిత్తును అవలీలగా పరిమార్చగలదు.

శ్లో॥ మయా ఽతులా విసృష్టా హి శైలవృష్టి ర్నిరంతరా ।
దేవానపి రణే హన్యా త్కింపున స్తా న్నిశాచరాన్ ॥ 12

పదచ్ఛేదము :– మయా – అతులా – విసృష్టా – హి – శైలవృష్టిః – నిరంతరా, దేవాన్ – అపి – రణే – హన్యాత్ – కిం – పునః – తాన్ – నిశాచరాన్ ॥

అన్వయక్రమము :– రణే మయా విసృష్టా నిరంతరా అతులా శైలవృష్టిః దేవాన్ అపి రణే హన్యాత్, తాన్ నిశాచరాన్ (హన్యాత్ ఇతి) కిం పునః (వక్తవ్యమ్?).

ప్రతిపదార్థము :– రణే = యుద్ధమునందు, మయా = నాచేత, విసృష్టా = విడువబడిన, నిరంతరా = ఎడతెరిపిలేనట్టి, అతులా = సాటిలేనట్టి, శైలవృష్టిః = పర్వత వర్షము, దేవాన్ అపి = దేవతలనుగూడ, హన్యాత్ = హతమార్చును. తాన్ = ఆ, నిశాచరాన్ = రాక్షసులను, హన్యాత్ (ఇతి) = చంపునని, కిం పునః (వక్తవ్యమ్) = తిరిగి చెప్పవలసిన దేమి?

తాత్పర్యము :– రణరంగమున విజృంభించి నేను కురిపించెడి సాటిలేని శిలావర్షము దేవతలను గూడ హతమార్చును. ఈ లంకలోని రాక్షసులను సంహరించుట లెక్క

ఏమి?

శ్లో॥ సాగరో ఽప్యతియా ద్వేలాం మందరః ప్రచలేదపి ।
న జాంబవంతం సమరే కంపయే దరివాహినీ ॥ 13

పదచ్ఛేదము :– సాగరః – అపి – అతియాత్ – వేలాం – మందరః – ప్రచలేత్ – అపి, న – జాంబవంతం – సమరే – కంపయేత్ – అరివాహినీ ॥

అన్వయక్రమము :– సాగరః వేలాం అతియాత్ అపి, మందరః ప్రచలేత్ అపి, సమరే అరివాహినీ జాంబవంతం న కంపయేత్?

ప్రతిపదార్థము :– సాగరః = సముద్రము, వేలాం = చెలియలికట్టను, అతియాత్ అపి = దాటిరావచ్చునుగూడ, మందరః = మందర పర్వతము, ప్రచలేత్ అపి = చలింప వచ్చును గూడ, సమరే = యుద్ధమునందు, అరివాహినీ = శత్రుసైన్యము, జాంబవంతం = జాంబవంతుని, న కంపయేత్ = చలింపచేయజాలదు.

తాత్పర్యము :– సముద్రము చెలియలికట్ట దాటి రావచ్చును. మందరపర్వతము చలింప వచ్చును కూడ, కాని మన జాంబవంతుని మాత్రము యుద్ధమునందు ఎట్టి శత్రుసైన్యమైనను చలింపచేయజాలదు గదా!

శ్లో॥ సర్వరాక్షససంఘానాం రాక్షసా యే చ పూర్వజాః ।
అల మేకో వినాశాయ వీరో వాలిసుతః కపిః ॥ 14

పదచ్ఛేదము :– సర్వరాక్షససంఘానాం – రాక్షసాః – యే – చ – పూర్వజాః, అలమ్ – ఏకః – వినాశాయ – వీరః – వాలిసుతః – కపిః ॥

అన్వయక్రమము :– వీరః వాలిసుతః కపిః ఏకః, సర్వరాక్షససంఘానాం, యే పూర్వజాః రాక్షసాః (తేషాం సర్వేషాం) వినాశాయ అలమ్?

ప్రతిపదార్థము :– వీరః = వీరుడైనట్టి, వాలిసుతః = వాలిపుత్రుడైన, కపిః = అంగదుడు, సర్వరాక్షససంఘానాం = సమస్తరాక్షసగణములకును, పూర్వజాః = ప్రాచీనులైన, యే రాక్షసాః = ఏ రాక్షసులు అయితే, (సంతి = ఉన్నారో) తేషాం సర్వేషాం = వారందరియొక్క, వినాశాయ = వినాశము కొఱకు, ఏకః = ఒక్కడే, ఆలం = చాలును.

తాత్పర్యము :– లంకలో గల సర్వరాక్షసగణములను, వారికి పెద్దలైనట్టి మహావీరులను గూడ యుద్ధమునందు వధించుటకు వాలిపుత్రుడైన మన అంగదు డొక్కడే సరిపోవును.

శ్లో॥ పనస స్యోరువేగేన నీలస్య చ మహాత్మనః ।
మందరోఽపి విశీర్యేత కిం పున ర్యుధి రాక్షసాః ॥ 15

పదచ్ఛేదము :– పనసస్య – ఊరువేగేన – నీలస్య – చ – మహాత్మనః – మందరః – అపి – విశీర్యేత – కిం – పునః – యుధి – రాక్షసాః ॥

అన్వయక్రమము :– పనసస్య, మహాత్మనః నీలస్య చ ఊరువేగేన మందరః అపి విశీర్యేత, యుధి రాక్షసాః పునః కిమ్?

ప్రతిపదార్థము :– పనసస్య = పనసుని యొక్కయు, మహాత్మనః = మహనీయుడైన, నీలస్య చ = నీలునియొక్కయును, ఊరువేగేన = తొడలవేగముచే, మందరః అపి = మందరపర్వతము గూడ, విశీర్యేత = ముక్కలగును, యుధి = యుద్ధమునందు, రాక్షసాః = రక్కసులు, కిం పునః = చెప్పవలసినదేమి?

తాత్పర్యము :– పనసుడు, మహనీయుడైన నీలుడు ఇరువురును విజృంభించినచో వారి తొడల వేగముచే మందర పర్వతము గూడ బీటలు వారి ముక్కలు గావలసినదే! ఇక యుద్ధమున ఎదురు నిలుచు రాక్షసుల మాట చెప్పవలసినదేమున్నది?

శ్లో॥ సదేవాసురయక్షేషు గంధర్వోరగపక్షిషు ।
మైందస్య ప్రతియోద్ధారం శంసత ద్వివిదస్య వా ॥ 16

పదచ్ఛేదము :– సదేవాసురయక్షేషు – గంధర్వోరగపక్షిషు – మైందస్య – ప్రతియోద్ధారం – శంసత – ద్వివిదస్య – వా ॥

అన్వయక్రమము :– సదేవాసురయక్షేషు, గంధర్వోరగపక్షిషు మైందస్య, ద్వివిదస్య వా ప్రతియోద్ధారం శంసత.

ప్రతిపదార్థము :– సదేవాసురయక్షేషు = దేవతలతో గూడిన రాక్షసులందును, యక్షులందును, గంధర్వోరగపక్షిషు = గంధర్వులందును నాగులందును, పక్షులందును, మైందస్య = మైందునకు గాని, ద్వివిదస్య వా = ద్వివిదునకు గాని, ప్రతియోద్ధారం = ఎదురుగ నిల్చు వీరుని, శంసత = చెప్పుడు?

తాత్పర్యము :– దేవతలందైనను రాక్షసులందైనను యక్షులందైనను గంధర్వులందైనను నాగులలోనైనను పక్షులతోనైనను, మన మైందునకు గాని ద్వివిదునకు గాని, ఎదురుగ నిలచి పోరాడు యోధుడు ఉండునేమో మీరు చెప్పుడు?

శ్లో॥ పితామహవరోత్సేకా త్పరమం దర్ప మాస్థితౌ ।
అమృతప్రాశినా వేతౌ సర్వవానరసత్తమౌ ॥ 17

పదచ్ఛేదము :– పితామహవరోత్సేకాత్ – పరమం – దర్పమ్ – ఆస్థితౌ, అమృతప్రాశినౌ – ఏతౌ – సర్వవానరసత్తమౌ ॥

అన్వయక్రమము :– పితామహవరోత్సేకాత్ పరమం దర్పమ్ ఆస్థితౌ, అమృతప్రాశినౌ ఏతౌ సర్వవానరసత్తమౌ.

ప్రతిపదార్థము :– పితామహవరోత్సేకాత్ = బ్రహ్మదేవునియొక్క వరముయొక్క అతిశయమువలన, పరమం = గొప్పదైన, దర్పం = గర్వమును, ఆస్థితౌ = పొందిన వారును, అమృతప్రాశినౌ = అమృతమును భుజించిన వారునగు, ఏతౌ = వీరు, సర్వవానరసత్తమౌ = వానరులందరిలోను మిన్నలైనట్టివారు.

తాత్పర్యము :– అశ్వినీపుత్రులైన ఈ మైందద్వివిదులు బ్రహ్మ ఇచ్చిన వరముల ప్రభావముచే మిక్కిలి మదించి యున్నవారై అమృతమును భుజించి వానరులలో కెల్ల శ్రేష్ఠులని పేరుపొందినట్టివారుగదా!

శ్లో॥ అశ్వినో ర్మాననార్థం హి సర్వలోకపితామహః ।
సర్వావధ్యత్వ మతుల మనయో ర్దత్తవా న్పురా ॥ 18

పదచ్ఛేదము :– అశ్వినోః – మాననార్థం – హి – సర్వలోకపితామహః, సర్వావధ్యత్వమ్ – అతులం – అనయోః – దత్తవాన్ – పురా ॥

అన్వయక్రమము :– పురా సర్వలోకపితామహః అశ్వినోః మాననార్థమ్ అనయోః అతులం సర్వావధ్యత్వం దత్తవాన్ హి.

ప్రతిపదార్థము :– పురా = పూర్వము, సర్వలోకపితామహః = సమస్త లోకములకును పితామహుడైన బ్రహ్మదేవుడు, అశ్వినోః = అశ్వినీదేవతల యొక్క, మాననార్థం = గౌరవార్థమై, అనయోః = వీరిరువురికిని, అతులం = సాటిలేనట్టి, సర్వావధ్యత్వం = ఎల్లరిచేతను చావులేకుండుటను, దత్తవాన్ హి = ఇచ్చినాడుగదా!

తాత్పర్యము :– సమస్తలోకములకును పితామహుడైనట్టి బ్రహ్మదేవుడు అశ్వినీ దేవతలను గౌరవించుటకై వారి సంతానమైన వీరిరువురికిని పూర్వము ఎవ్వరి వలనను మరణము లేకుండునట్లు గొప్పదైన వరమును ఇచ్చి యున్నాడుగదా!

శ్లో॥ వరోత్సేకేన మత్తౌ చ ప్రమథ్య మహతీం చమూమ్ ।
సురాణా మమృతం వీరౌ పీతవంతౌ ప్లవంగమౌ ॥ 19

పదచ్ఛేదము :– వరోత్సేకేన – మత్తౌ – చ – ప్రమథ్య – మహతీం – చమూమ్, సురాణామ్ – అమృతం – వీరౌ – పీతవంతౌ – ప్లవంగమౌ ॥

అన్వయక్రమము :– వరోత్సేకేన మత్తౌ వీరౌ (ఏతౌ) ప్లవంగమౌ సురాణాం మహతీం చమూం ప్రమథ్య అమృతం పీతవంతౌ.

ప్రతిపదార్థము :– వరోత్సేకేన = వరముయొక్క అతిశయముచేత, మత్తౌ = మదించిన వారైన, ఏతౌ = ఈ, వీరౌ = వీరులైన, ప్లవంగమౌ = వానరులిరువురును, సురాణాం = దేవతల యొక్క, మహతీం = గొప్పదైన, చమూం = సైన్యమును, ప్రమథ్య = మర్దించి, అమృతం = అమృతమును, పీతవంతౌ = త్రాగినారు.

తాత్పర్యము :– ఆ వరముయొక్క మహిమచే మదించినవారై మహావీరులైన ఈ వానరులిరువురును స్వర్గమునందలి గొప్ప దేవతల సైన్యము నంతను అణచి అమృతమును త్రాగియున్నారు.

శ్లో॥ ఏతావేవ హి సంక్రుద్ధౌ సవాజిరథకుంజరామ్ ।
లంకాం నాశయితుం శక్తౌ సర్వే తిష్ఠంతు వానరాః ॥ 20

పదచ్ఛేదము :– ఏతౌ – ఏవ – హి – సంక్రుద్ధౌ – సవాజిరథకుంజరామ్, లంకాం – నాశయితుం – శక్తౌ – సర్వే – తిష్ఠంతు – వానరాః ॥

అన్వయక్రమము :– సంక్రుద్ధౌ ఏతౌ ఏవ సవాజిరథకుంజరాం లంకాం నాశయితుం శక్తౌ హి వానరాః సర్వే (దూరే) తిష్ఠంతు.

ప్రతిపదార్థము :– సంక్రుద్ధౌ = క్రోధము నొందినవారైన, ఏతౌ ఏవ = వీరిరువురే, సవాజిరథకుంజరాం = గుఱ్ఱములతోడను, రథములతోడను, ఏనుగులతోడను గూడినట్టి, లంకాం = లంకానగరమును, నాశయితుం = నశింపచేయుటకు, శక్తౌ హి = శక్తిగలిగినట్టివారు గదా! వానరాః = వానరులు, సర్వే = అందరును, (దూరే = దూరమున) తిష్ఠంతు = ఉందురుగాక!

తాత్పర్యము :– వీరిరువురును విజృంభించినయెడల చతురంగ బలసమేతమైన లంకానగరమునంతను ఒక్క చేతిమీదనే నశింప చేయగలరు; మిగిలిన వానరవీరు లెల్లరును కదలవలసిన పనియే యుండదు.

శ్లో॥ మయైవ నిహతా లంకా దగ్ధా భస్మీకృతా పునః ।
రాజమార్గేషు సర్వత్ర నామ విశ్రావితం మయా ॥ 21

పదచ్ఛేదము :– మయా – ఏవ – నిహతా – లంకా – దగ్ధా – భస్మీకృతా – పునః, రాజమార్గేషు – సర్వత్ర – నామ – విశ్రావితం – మయా ॥

అన్వయక్రమము :– లంకా మయా ఏవ నిహతా, దగ్ధా భస్మీకృతా, పునః రాజమార్గేషు మయా నామ సర్వత్ర విశ్రావితమ్.

ప్రతిపదార్థము :– లంకా = లంకానగరి, మయైవ = నాచేతనే, నిహతా = కూల్చబడినది, దగ్ధా = దహింపబడినది, భస్మీకృతా = బూడిదచేయబడినది, పునః = తిరిగి, రాజమార్గేషు = రాజవీథులందు, మయా = నాచేత, నామ = పేరు, సర్వత్ర = ఎల్లయెడల, విశ్రావితం = వినిపింపబడినది.

తాత్పర్యము :– నేనే లంకానగరము నంతను ధ్వంసము చేసి, దగ్ధము గావించి, భస్మముచేసి వచ్చితిని. మరియు నచ్చటి రాజమార్గమునం దెల్లెడల మన పేరును ఎల్లరికిని వినిపించితిని.

శ్లో॥ జయ త్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః ॥ 22

పదచ్ఛేదము :– జయతి – అతిబలః – రామః – లక్ష్మణః – చ – మహాబలః, రాజా – జయతి – సుగ్రీవః – రాఘవేణ – అభిపాలితః ॥

అన్వయక్రమము :– అతిబలః రామః జయతి, మహాబలః లక్ష్మణః చ జయతి, రాఘవేణ అభిపాలితః రాజా సుగ్రీవః జయతి.

ప్రతిపదార్థము :– అతిబలః = అమితబలాఢ్యుడైన, రామః = రాముడు, జయతి = వర్ధిల్లుచున్నాడు, మహాబలః = మహాబలశాలియైన, లక్ష్మణః చ = లక్ష్మణుడును, (జయతి = వర్ధిల్లుచున్నాడు), రాఘవేణ = శ్రీరామునిచే, అభిపాలితః = కాపాడబడు చున్నట్టి, రాజా = వానరరాజైన, సుగ్రీవః = సుగ్రీవుడు, జయతి = వర్ధిల్లు చున్నాడు.

తాత్పర్యము :– అమితబలసంపన్నుడైన శ్రీరామచంద్రుడు సర్వోత్కర్షముగా వర్ధిల్లు చున్నాడు. శ్రీరామునిచే కాపాడబడుచున్న వానరరాజైన సుగ్రీవుడును మహోత్కర్షముతో వృద్ధిపొందుచున్నాడు.

శ్లో॥ అహం కోసలరాజస్య దాసః పవనసంభవః ।
హనుమానితి సర్వత్ర నామ విశ్రావితం మయా ॥ 23

పదచ్ఛేదము :- అహం - కోసలరాజస్య - దాసః - పవనసంభవః, హనుమాన్ - ఇతి - సర్వత్ర - నామ - విశ్రావితం - మయా ॥

అన్వయక్రమము :- అహం కోసలరాజస్య దాసః పవనసంభవః హనుమాన్ ఇతి మయా సర్వత్ర నామ విశ్రావితమ్.

ప్రతిపదార్థము :- అహం = నేను, కోసలరాజస్య = కోసలాధిపతియొక్క, దాసః = బంటును, పవనసంభవః = వాయుపుత్రుడను, హనుమాన్ = హనుమంతుడను వాడను, ఇతి = అని, మయా = నాచేత, సర్వత్ర = ఎల్లయెడల, నామ = పేరు, విశ్రావితమ్ = వినిపింపబడినది.

తాత్పర్యము :- కోసలాధీశుడైన శ్రీరామచంద్రునకు దాసుడనైన నేను వాయుపుత్రుడను, హనుమంతు డను పేరుగలవాడ ననుచు ఎల్లెడల తిరుగుచు వారెల్లరికిని నా పేరు వినిపించితిని.

శ్లో॥ అశోకవనికామధ్యే రావణస్య దురాత్మనః ।
అధస్తా చ్ఛింశుపావృక్షే సాధ్వీ కరుణ మాస్థితా ॥ 24

పదచ్ఛేదము :- అశోకవనికామధ్యే - రావణస్య - దురాత్మనః, అధస్తాత్ - శింశుపావృక్షే - సాధ్వీ - కరుణమ్ - ఆస్థితా ॥

అన్వయక్రమము :- దురాత్మనః రావణస్య అశోకవనికామధ్యే శింశుపావృక్షే అధస్తాత్ సాధ్వీ కరుణమ్ ఆస్థితా.

ప్రతిపదార్థము :- దురాత్మనః = దుర్మార్గుడైన, రావణస్య = రావణుని యొక్క, అశోకవనికామధ్యే = అశోకవనము నడుమ, శింశుపావృక్షే = శింశుపావృక్షమున, అధస్తాత్ = క్రిందిభాగమున, సాధ్వీ = పతివ్రతయగు సీత, కరుణం = దుఃఖముగా, ఆస్థితా = ఉన్నది.

తాత్పర్యము :- దుర్మార్గుడైన ఆ రావణునియొక్క అశోకవనమునందు నడుమనున్న శింశుపావృక్షము క్రింద సీతమ్మతల్లి చూచువారికి దుఃఖము కల్గించుచు ఉన్నది.

శ్లో॥ రాక్షసీభిః పరివృతా శోకసంతాపకర్శితా ।
మేఘలేఖాపరివృతా చంద్రలేఖేవ నిష్ప్రభా ॥ 25

శ్లో॥ అచింతయంతీ వైదేహీ రావణం బలదర్పితమ్ ॥ 26

పదచ్ఛేదము :– రాక్షసీభిః – పరివృతా – శోకసంతాపకర్శితా, మేఘలేఖాపరివృతా – చంద్రలేఖా – ఇవ – నిష్ప్రభా, అచింతయంతీ – వైదేహీ – రావణం – బలదర్పితమ్ ॥

అన్వయక్రమము :– రాక్షసీభిః పరివృతా శోకసంతాపకర్శితా, బలదర్పితం రావణం అచింతయంతీ వైదేహీ, మేఘలేఖాపరివృతా నిష్ప్రభా చంద్రలేఖా ఇవ (కరుణమ్ ఆస్థితా).

ప్రతిపదార్థము :– రాక్షసీభిః = రాక్షసస్త్రీలచే, పరివృతా = చుట్టుకొనబడినదై, శోకసంతాపకర్శితా = శోకముచేత సంతాపముచేత కృశింపచేయబడినదై, బలదర్పితం = బలముచే మదించియున్న, రావణం = రావణుని, అచింతయంతీ = లెక్కచేయనిదై, మేఘలేఖాపరివృతా = మబ్బులపంక్తిచే కప్పబడియున్న, నిష్ప్రభా = కాంతిలేని, చంద్రలేఖా ఇవ = చంద్రరేఖవలె, (కరుణం = దుఃఖముగా), ఆస్థితా = ఉన్నది.

తాత్పర్యము :– అచ్చట జానకీదేవి బలదర్పితుడైన రావణుని ఏమియు లెక్కచేయకున్నదై రాక్షసస్త్రీలచే పరివేష్టింపబడి, శోకసంతాపములచే కృశించియున్నదై, మేఘఖండములచే కప్పబడియున్న తేజోవిహీనమైన చంద్రవంకవలె కానవచ్చుచున్నది.

శ్లో॥ పతివ్రతా చ సుశ్రోణీ అవష్టబ్ధా చ జానకీ ।
అనురక్తా హి వైదేహీ రామం సర్వాత్మనా శుభా ॥ 27

శ్లో॥ అనన్యచిత్తా రామే చ పౌలోమీవ పురందరే ॥ 28

పదచ్ఛేదము :– పతివ్రతా – చ – సుశ్రోణీ – అవష్టబ్ధా – చ – జానకీ, అనురక్తా – హి – వైదేహీ – రామం – సర్వాత్మనా – శుభా, అనన్యచిత్తా – రామే – చ – పౌలోమీ – ఇవ – పురందరే ॥

అన్వయక్రమము :– సుశ్రోణీ జానకీ పతివ్రతా అవష్టబ్ధా చ; శుభా వైదేహీ రామే అనన్యచిత్తా (సతీ) పురందరే పౌలోమీ ఇవ సర్వాత్మనా రామం అనురక్తా హి.

ప్రతిపదార్థము :– సుశ్రోణీ = సుందరమైన కటిసీమగల, జానకీ = సీతాదేవి, పతివ్రతా చ = పతివ్రతయును, అవష్టబ్ధా చ = అరికట్టబడినదిగను ఉన్నది, శుభా = మంగళ కరురాలైన, వైదేహీ = జానకీదేవి, రామే = శ్రీరామునియందు, అనన్యచిత్తా (సతీ) = ఏకాగ్రచిత్తురాలగుచు, పురందరే = దేవేంద్రునియందు, పౌలోమీ ఇవ = శచీదేవివలె, సర్వాత్మనా = సంపూర్ణమైన మనస్సుతో, రామం = శ్రీరాముని, అనురక్తా హి =

అనురక్తురాలై యున్నది.

తాత్పర్యము :– సుందరాంగియైన సీతాదేవి తన పతివ్రతాధర్మమును నిలుపుకొనుచు రాక్షసులచే నిర్బంధితురాలై యున్నది. మంగళస్వరూపురాలైన ఆ జానకీదేవి సర్వవిధముల శ్రీరామునియం దనురక్తురాలై, నహుషుని నిర్బంధము నందున్నను శచీదేవి దేవేంద్రునియందే తన మనస్సు లగ్నము చేసికొని యున్నట్లు, రామచంద్రుని యందే తన మనస్సు లగ్నము చేసి ఏకాగ్రచిత్తముతో నున్నది.

శ్లో॥ తదేకవాసస్సంవీతా రజోధ్వస్తా తథైవ చ ।
శోకసంతాపదీనాంగీ సీతా భర్తృహితే రతా ॥ 29

పదచ్ఛేదము :– తదేకవాసస్సంవీతా – రజోధ్వస్తా – తథా – ఏవ – చ, శోక సంతాపదీనాంగీ – సీతా – భర్తృహితే – రతా ॥

అన్వయక్రమము :– తదేకవాసస్సంవీతా తథైవ రజోధ్వస్తా శోకసంతాపదీనాంగీ, సీతా భర్తృహితే రతా.

ప్రతిపదార్థము :– తదేకవాసస్సంవీతా = ఆ ఒక్క చీరచేతనే ధరింపబడినదై, తథైవ = అట్లే, రజోధ్వస్తా = ధూళిచే మలినమైనదై, శోకసంతాపదీనాంగీ = శోకము చేతను సంతాపముచేతను దుఃఖజనకముగనున్న శరీరముగలదై, సీతా = సీతాదేవి, భర్తృహితే = భర్తయొక్క శ్రేయస్సునందు, రతా = నిమగ్నురాలై యున్నది.

తాత్పర్యము :– మనము చూచిన ఆనాటి చీరనే ధరించి యున్నదై శరీరమంతయును ధూళిచే కప్పబడి శోకసంతాపములచే కృశించిపోయిన శరీరముతో జానకీదేవి తన భర్తయొక్క శ్రేయస్సునే కాంక్షించుచున్నది.

శ్లో॥ సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః ।
రాక్షసీభి ర్విరూపాభి ర్దృష్టా హి ప్రమదావనే ॥ 30

పదచ్ఛేదము :– సా – మయా – రాక్షసీమధ్యే – తర్జ్యమానా – ముహుః – ముహుః, రాక్షసీభిః – విరూపాభిః – దృష్టా – హి – ప్రమదావనే ॥

అన్వయక్రమము :– ప్రమదావనే రాక్షసీమధ్యే విరూపాభిః రాక్షసీభిః ముహుః ముహుః తర్జ్యమానా సా మయా దృష్టా హి.

ప్రతిపదార్థము :– ప్రమదావనే = ఉద్యానవనమునందు, రాక్షసీమధ్యే = రాక్షసస్త్రీల నడుమ, విరూపాభిః = వికృతాకారములుగల, రాక్షసీభిః = రాక్షసవనితలచే, ముహుః ముహుః = మాటిమాటికిని, తర్జ్యమానా = గద్దింపబడుచున్నదై, సా = ఆ జానకీ

దేవి, మయా = నా చేత, దృష్టా హి = చూడబడెనుసుడీ!

తాత్పర్యము :– రావణుని ప్రమదావనమునందు రాక్షసస్త్రీల నడుమ వికృతమైన శరీరములు గల్గినట్టి రాక్షసవనితలు తనను మాటిమాటికిని గద్దించుచుండగా దీనమైన స్థితిలో సీతాదేవి నాకు కాన్పించినది.

శ్లో॥ ఏకవేణీధరా దీనా భర్తృచింతాపరాయణా ।
అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే ॥ 31

పదచ్ఛేదము :– ఏకవేణీధరా – దీనా – భర్తృచింతాపరాయణా, అధశ్శయ్యా – వివర్ణాంగీ – పద్మినీ – ఇవ – హిమాగమే ॥

అన్వయక్రమము :– ఏకవేణీధరా దీనా భర్తృచింతాపరాయణా అధశ్శయ్యా హిమాగమే పద్మినీ ఇవ వివర్ణాంగీ (దృష్టా).

ప్రతిపదార్థము :– ఏకవేణీధరా = ఒక్కజడగా ఏర్పడిన కేశసమూహమును ధరించినదియును, దీనా = దుఃఖజనకముగ నున్నదియును, భర్తృచింతాపరాయణా = భర్తయొక్క ధ్యానమునందు నిమగ్నురాలై యున్నదియును, అధశ్శయ్యా = నేలయే శయ్యగా గలదియును, హిమాగమే = హేమంతకాలమునందలి, పద్మినీ ఇవ = తామరతీగవలె, వివర్ణాంగీ = వెలవెల బోవుచున్న శరీరము గలదియును అగు, (సా = ఆ సీతాదేవి), (మయా = నాచే), దృష్టా = చూడబడినది.

తాత్పర్యము :– ఆ సీతాదేవి కేశములు ఒకే జడగా అంటుకొని పోయి యుండెను. ఆమె రూపము దుఃఖజనకముగ నుండెను. నేలనే శయ్యగా చేసికొని భర్తృ చింతాపరాయణురాలై హేమంతఋతువునందలి తామరతీగవలె వెలవెలపోవుచు కానవచ్చినది.

శ్లో॥ రావణా ద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా ।
కథంచి న్మృగశాబాక్షీ విశ్వాస ముపపాదితా ॥ 32

పదచ్ఛేదము :– రావణాత్ – వినివృత్తార్థా – మర్తవ్యకృతనిశ్చయా, కథంచిత్ – మృగశాబాక్షీ – విశ్వాసమ్ – ఉపపాదితా ॥

అన్వయక్రమము :– రావణాత్ వినివృత్తార్థా, మర్తవ్యకృతనిశ్చయా (సా) మృగశాబాక్షీ కథంచిత్ విశ్వాసమ్ ఉపపాదితా.

ప్రతిపదార్థము :– రావణాత్ = రావణునినుండి, వినివృత్తార్థా = మరలించుకొనిన ప్రయోజనము గలదియును, మర్తవ్యకృతనిశ్చయా = చనిపోవలెనని చేసికొనిన

నిశ్చయము గలదియును, (సా = ఆ), మృగశాబాక్షీ = లేడిపిల్ల కన్నులవంటి నేత్రములుగల ఆ సీతాదేవి, కథంచిత్ = ఎట్లో, విశ్వాసం = నమ్మకమును, ఉపపాదితా = కలిగింపబడినది.

తాత్పర్యము :– రావణునివలన తనకు విడుదల గలుగునను ఆశ తొలగినదై ఆత్మహత్య చేసికొనుటకే నిశ్చయించుకొన్నట్టి ఆ భీతచిత్తయైన సీతాదేవిని సమీపించి ఎట్లో ఆమెకు నాపై నమ్మకము కలిగించుకొనగలిగితిని.

శ్లో॥ తత స్సంభాషితా చైవ సర్వమర్థం చ దర్శితా ।
రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతి ముపాగతా ॥ 33

పదచ్ఛేదము :– తతః – సంభాషితా – చ – ఏవ – సర్వమ్ – అర్థం – చ – దర్శితా, రామసుగ్రీవసఖ్యం – చ – శ్రుత్వా – ప్రీతిమ్ – ఉపాగతా ॥

అన్వయక్రమము :– తతః సంభాషితా చ సర్వమ్ అర్థం దర్శితా చ (సా) రామసుగ్రీవ సఖ్యం శ్రుత్వా ప్రీతిమ్ ఉపాగతా.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, సంభాషితా = మాటలాడబడినదియును, సర్వం = సమస్తమైన, అర్థం = విషయమును, దర్శితా = తెలుపబడినది, (సతీ = అగుచు), సా = ఆ సీతమ్మ, రామసుగ్రీవసఖ్యం చ = రామసుగ్రీవుల మైత్రిని గూర్చి గూడ, శ్రుత్వా = విని, ప్రీతిం = సంతోషమును, ఉపాగతా = పొందినది.

తాత్పర్యము :– ఆమెకు నమ్మకము కలిగిన పిమ్మట ఆమెతో సంభాషించి తెలుపవలసిన విషయమును నివేదించితిని. నేను చెప్పినదంతయును తెలిసికొని రామసుగ్రీవుల మైత్రీ వృత్తాంతమును విని ఆమె మిక్కిలి సంతోషించెను.

శ్లో॥ నియత స్సముదాచారో భక్తి ర్భర్తరి చోత్తమా ।
య న్న హంతి దశగ్రీవం న మహాత్మా కృతాగసమ్ ॥ 34

శ్లో॥ నిమిత్తమాత్రం రామస్తు వధే తస్య భవిష్యతి ॥ 35

పదచ్ఛేదము :– నియతః – సముదాచారః – భక్తిః – భర్తరి – చ – ఉత్తమా, యత్ – న – హంతి – దశగ్రీవం – సః – మహాత్మా – కృతాగసమ్, నిమిత్తమాత్రం – రామః – తు – వధే – తస్య – భవిష్యతి ॥

అన్వయక్రమము :– (తస్యాః) సముదాచారః నియతః, భర్తరి భక్తిః చ ఉత్తమా, సా కృతాగసం దశగ్రీవం న హంతి ఇతి యత్ సః మహాత్మా, తస్య వధే రామః తు నిమిత్తమాత్రం భవిష్యతి.

ప్రతిపదార్థము :– (తస్యాః = ఆ సీతాదేవియొక్క) సముదాచారః = సదాచరణము, నియతః = నిత్యమైనది, భర్తరి = భర్తయందు, భక్తిః చ = భక్తియును, ఉత్తమా = శ్రేష్ఠమైనది, కృతాగసం = చేసిన అపరాధము గల్గినట్టి, దశగ్రీవం = రావణుని, న హంతి = చంపుటలేదు, ఇతి యత్ = అనునదేది గలదో, తత్ = ఆ కారణమున, సః = ఆ రావణుడు, మహాత్మా = మహనీయుడైనవాడు, తస్య = అతనియొక్క, వధే = వధయందు, రామః తు = రాముడు మాత్రము, నిమిత్తమాత్రం = నిమిత్తకారణము, భవిష్యతి = కాగలడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వరతీర్థులు :– 'తస్య వధే సీతా నిమిత్తమాత్రం భవతి, రామస్తు ప్రధానకారణం భవిష్యతి' –

స్వయముగా రావణుని వధింపని సీత ఆ రావణుని వధయందు కేవలము అప్రధానమైన కారణముగా నుండును. ప్రధానకారణముగా రాముడే రావణుని వధించునని భావము.

రా.శిరోమణి :– రావణుడు తన అధర్మముచే తన మహత్త్వమును గోల్పోయి యున్నాడు గనుక ప్రస్తుత మాతడు మృతప్రాయుడే. ఆతని వధయందు శ్రీరాముడు కేవలము నిమిత్తమాత్రుడై యుండునని భావము.

తాత్పర్యము :– ఆ సీతాసాధ్వియొక్క సదాచరణము ఎట్టి పరిస్థితియందైనను నిత్యమైనట్టిది. భర్తయం దామెకు గల భక్తియు సాటిలేనట్టిదే. ఇట్టి యామె ప్రభావము రావణుని హతమార్పకుండుటకు కారణము అతడును మహా తప స్సంపన్నుడై యుండుటయే. కాని నేడు అధర్మమున కొడిగట్టిన యాతని ధర్మప్రభావము నశించినది. కాబట్టి ఆతడు రామునిచేత తేలికగనే వధింపబడును.

శ్లో॥ సా ప్రకృత్యైవ తన్వంగీ తద్వియోగాచ్చ కర్శితా ।
ప్రతిపత్పాఠశీలస్య విద్యేవ తనుతాం గతా ॥ 36

పదచ్ఛేదము :– సా – ప్రకృత్యా – ఏవ – తన్వంగీ – తద్వియోగాత్ – చ – కర్శితా, ప్రతిపత్పాఠశీలస్య – విద్యా – ఇవ – తనుతాం – గతా ॥

అన్వయక్రమము :– ప్రకృత్యా ఏవ తన్వంగీ, తద్వియోగాత్ కర్శితా చ సా ప్రతిపత్పాఠశీలస్య విద్యా ఇవ తనుతాం గతా.

ప్రతిపదార్థము :– ప్రకృత్యా ఏవ = సహజముగనే, తన్వంగీ = కృశాంగియును,

తద్వియోగాత్ = ఆ శ్రీరాముని వియోగమువలన, కర్శితా చ (సతీ) = కృశింప చేయబడినదియు నగుచు, ప్రతిపత్పాఠశీలస్య = పాడ్యమినాడు చదువుకొను అలవాటు గలవానియొక్క, విద్యా ఇవ = విద్యవలె, తనుతాం = క్షీణతను, గతా = పొందినది.

తాత్పర్యము :- సీతాదేవి సహజముగనే సన్నని దేహము గలది, ఇప్పుడు ప్రియుని వియోగమువలన ఇంకను కృశించియున్నదై పాడ్యమినాడు పాఠము చదువుకొనువాని విద్యవలె క్షీణస్థితి నొందియున్నది.

శ్లో॥ ఏవ మాస్తే మహాభాగా సీతా శోకపరాయణా ।
య దత్ర ప్రతికర్తవ్యం తత్సర్వ ముపపాద్యతామ్ ॥ 37

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే ఆదికావ్యే సుందరకాండే
"అనంతరకర్తవ్యప్రరోచనం" నామ ఏకోనషష్టితమస్సర్గః.

పదచ్ఛేదము :- ఏవమ్ - ఆస్తే - మహాభాగా - సీతా - శోకపరాయణా - యత్ - అత్ర - ప్రతికర్తవ్యం - తత్ - సర్వమ్ - ఉపపాద్యతామ్ ॥

అన్వయక్రమము :- మహాభాగా సీతా ఏవం శోకపరాయణా ఆస్తే. అత్ర యత్ ప్రతికర్తవ్యం తత్ సర్వం (యుష్మాభిః) ఉపపాద్యతామ్.

ప్రతిపదార్థము :- మహాభాగా = మహనీయురాలైనట్టి, సీతా = జానకీదేవి, ఏవం = ఈవిధముగా, శోకపరాయణా = శోకనిమగ్నురాలై, ఆస్తే = ఉన్నది. అత్ర = ఈ విషయమునందు, యత్ = ఏది, ప్రతికర్తవ్యం = బదులుగ చేయవలసినది యున్నదో, తత్ సర్వం = అది యంతయును, (యుష్మాభిః = మీచే), ఉపపాద్యతామ్ = తెలుపబడుగాక.

తాత్పర్యము :- మహనీయురాలైన సీతాదేవి ఆ లంకయందు ఈ విధముగా శోకమగ్నురాలై యున్నది. ప్రస్తుత మీ సందర్భములో మీది కర్తవ్య మేమో దాని నంతను మీరే నిర్ణయింపవలసియున్నది.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"అనంతరకర్తవ్యప్రరోచనము" అను
ఏబదితొమ్మిదవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

షష్టితమసర్గ

శ్లో॥ తస్య తద్వచనం శ్రుత్వా వాలిసూను రభాషత ।
అయుక్తం తు వినా దేవీం దృష్టవద్భిశ్చ వానరాః ।
సమీపం గంతు మస్మాభీ రాఘవస్య మహాత్మనః ॥ 1

పదచ్ఛేదము :– తస్య – తత్ – వచనం – శ్రుత్వా – వాలిసూనుః – అభాషత – అయుక్తం – తు – వినా – దేవీం – దృష్టవద్భిః – చ – వానరాః, సమీపం – గంతుమ్ – అస్మాభిః – రాఘవస్య – మహాత్మనః ॥

అన్వయక్రమము :– తస్య తత్ వచనం శ్రుత్వా వాలిసూనుః అభాషత. వానరాః! దేవీం దృష్టవద్భిః అస్మాభిః మహాత్మనః రాఘవస్య సమీపం (దేవీం) వినా గంతుం తు అయుక్తమ్.

ప్రతిపదార్థము :– తస్య = హనుమంతునియొక్క, తత్ వచనం = ఆ మాటను, శ్రుత్వా = విని, వాలిసూనుః = వాలిపుత్రుడైన అంగదుడు, అభాషత = పలికెను, వానరాః = ఓ కపివరులారా!, దేవీం = సీతాదేవిని, దృష్టవద్భిః = చూచినట్టి, అస్మాభిః = మనచేత, (దేవీం) వినా = సీతాదేవి లేకుండగా, మహాత్మనః = మహనీయుడైన, రాఘవస్య = శ్రీరామునియొక్క, సమీపం = సమీపమునకు, గంతుః = వెళ్ళుటకు, అయుక్తమ్ = యుక్తమైనదిగాదు.

తాత్పర్యము :– హనుమ చెప్పిన మాటలను విని అంగదు డిట్లనెను – ఓ వానర శ్రేష్ఠులారా! సీతాదేవిని చూచి వచ్చిన మనము ఆ సీతాదేవి లేకుండ ఆ మహాత్ముడైన రాఘవునికడకు పోవుట ఉచితము కాదు.

శ్లో॥ దృష్టా దేవీ న చానీతా ఇతి తత్ర నివేదనమ్ ।
అయుక్తమివ పశ్యామి భవద్భిః ఖ్యాతవిక్రమైః ॥ 2

పదచ్ఛేదము :– దృష్టా – దేవీ – న – చ – ఆనీతా – ఇతి – తత్ర – నివేదనమ్, అయుక్తమ్ – ఇవ – పశ్యామి – భవద్భిః – ఖ్యాతవిక్రమైః ॥

అన్వయక్రమము :- తత్ర దేవీ దృష్టా న చ ఆనీతా; ఇతి ఖ్యాతవిక్రమైః భవద్భిః నివేదనమ్ అయుక్తమ్ ఇవ పశ్యామి.

ప్రతిపదార్థము :- తత్ర = ఆ రాఘవుని సమక్షమున, దేవీ = సీతాదేవి, దృష్టా = చూడబడినది, న చ ఆనీతా = కాని తీసికొని రాబడలేదు, ఇతి = అని, ఖ్యాతవిక్రమైః = ప్రఖ్యాతమైన పరాక్రమము గల్గినట్టి, భవద్భిః = మీచేత, నివేదనం = విన్నవించుట, అయుక్తమ్ ఇవ = అనుచితమైనదిగా, పశ్యామి = తలచుచున్నాను.

తాత్పర్యము :- మేము సీతాదేవిని చూచితిమి కాని ఆమెను తీసికొని రాలేదు. అని సువిఖ్యాతపరాక్రములైన మీరు శ్రీరాముని సన్నిధిని విన్నవించుట ఉచితముగ నుండదని భావించుచున్నాను.

శ్లో॥ నహి నః ప్లవనే కశ్చిత్ నాస్తి కశ్చి త్పరాక్రమే ।
తుల్య స్సామరదైత్యేషు లోకేషు హరిసత్తమాః ॥ 3

పదచ్ఛేదము :- న - హి - నః - ప్లవనే - కః - చిత్ - న - అపి - కః - చిత్ - పరాక్రమే - తుల్యః - సామరదైత్యేషు - లోకేషు - హరిసత్తమాః ॥

అన్వయక్రమము :- హరిసత్తమాః! సామరదైత్యేషు లోకేషు ప్లవనే కశ్చిత్ నః తుల్యః నహి, పరాక్రమే అపి కశ్చిత్ తుల్యః నహి.

ప్రతిపదార్థము :- హరిసత్తమాః = ఓ వానరశ్రేష్ఠులారా! సామరదైత్యేషు = దేవతలతోడను, రాక్షసులతోడను గూడినట్టి, లోకేషు = లోకములందు, ప్లవనే = లంఘించుటయందు, నః = మనకు, తుల్యః = సమానుడు, కశ్చిత్ = ఎవ్వడును, నహి = లేడుగదా! పరాక్రమే అపి = పరాక్రమమునందుగూడ, తుల్యః = సాటియగువాడు, కశ్చిత్ = ఎవ్వడును, నహి = లేడుగదా!

తాత్పర్యము :- ఓ వానరోత్తములారా! లంఘించుటయందు గాని పరాక్రమము చూపుటలోగాని మనకు సాటివచ్చువాడు దేవలోకమునందుగాని రాక్షసలోకమునందు గాని ఎవ్వడును లేడుగదా!

శ్లో॥ తే ష్వేవం హతవీరేషు రాక్షసేషు హనూమతా ।
కి మన్య దత్ర కర్తవ్యం గృహీత్వా యామ జానకీమ్ ॥ 4

శ్లో॥ రామలక్ష్మణయో ర్మధ్యే న్యస్యామ జనకాత్మజామ్ ॥ 5

పదచ్ఛేదము :- తేషు - ఏవం - హతవీరేషు - రాక్షసేషు - హనూమతా, కిం - అన్యత్ - అత్ర - కర్తవ్యం - గృహీత్వా - యామ - జానకీమ్, రామలక్ష్మణయోః

మధ్యే – న్యస్యామ – జనకాత్మజామ్ ॥

అన్వయక్రమము :– హనూమతా తేషు రాక్షసేషు ఏవం హతవీరేషు (సత్సు) అత్ర అన్యత్ కర్తవ్యం కిమ్? జానకీం గృహీత్వా యామ, జనకాత్మజాం రామలక్ష్మణయోః మధ్యే న్యస్యామ.

ప్రతిపదార్థము :– హనూమతా = హనుమచే, తేషు = ఆ, రాక్షసేషు = రాక్షసులు, ఏవం = ఈరీతిగా, హతవీరేషు (సత్సు) = చంపబడిన వీరులుగలవారై యుండగా, అత్ర = ఈ విషయమున, అన్యత్ = వేరైనట్టి, కర్తవ్యం = కృత్యము, కిం = ఏమున్నది? జానకీం = సీతాదేవిని, గృహీత్వా = తీసికొని, యామ = వెళ్ళుదుముగాక, జనకాత్మజాం = సీతాదేవిని, రామలక్ష్మణయోః మధ్యే = రామలక్ష్మణుల నడుమ, న్యస్యామ = ఉంచెదముగాక!

తాత్పర్యము :– మహావీరుడైన మన హనుమంతుడు ఆ రాక్షసులలోని మహావీరుల నందరిని చంపివేసియుండగా ఇంక మనకు మిగిలియున్న కార్యమేమున్నది? కాబట్టి లంకనుండి ఆ సీతాదేవిని తీసికొనివచ్చి రాముని కడకేగి సీతమ్మను ఆ యన్నదమ్ముల నడుమకు చేర్చుదము.

శ్లో॥ కిం వ్యలీకైస్తు తాన్ గత్వా హత్వా రాక్షసపుంగవాన్ ।
రాఘవం ద్రష్టుమర్హామ స్సుగ్రీవం సహలక్ష్మణమ్ ॥ 6

పదచ్ఛేదము :– కిం – వ్యలీకైః – తు – తాన్ – గత్వా – హత్వా – రాక్షసపుంగవాన్, రాఘవం – ద్రష్టుమ్ – అర్హామః – సుగ్రీవం – సహలక్ష్మణమ్ ॥

అన్వయక్రమము :– వ్యలీకైః తు కిమ్? గత్వా తాన్ రాక్షసపుంగవాన్ హత్వా సహలక్ష్మణం రాఘవం సుగ్రీవం ద్రష్టుమ్ అర్హామః.

ప్రతిపదార్థము :– వ్యలీకైః తు = వికల్పములతో, కిం = ఏమి ప్రయోజనము? గత్వా = పోయి, తాన్ రాక్షసపుంగవాన్ = ఆ రాక్షసశ్రేష్ఠులను, హత్వా చ = చంపి, సహలక్ష్మణం = లక్ష్మణునితో గూడియున్న, రాఘవం = శ్రీరాముని, సుగ్రీవం = సుగ్రీవుని, ద్రష్టుమ్ అర్హామః = చూడదగుదుము.

తాత్పర్యము :– అనావశ్యకములైన వికల్పము లెందుకు ? మనమిప్పుడే పోయి లంకలోని రాక్షసవీరుల నెల్లరిని వధించి రామలక్ష్మణులను సుగ్రీవుని చూచుటయే ఉచితము.

శ్లో॥ త మేవం కృతసంకల్పం జాంబవాన్ హరిసత్తమః ।
ఉవాచ పరమప్రీతో వాక్య మర్థవ దర్థవిత్ ॥ 7

పదచ్ఛేదము :- తమ్ - ఏవం - కృతసంకల్పం - జాంబవాన్ - హరిసత్తమః, ఉవాచ - పరమప్రీతః - వాక్యమ్ - అర్థవత్ - అర్థవిత్ ॥

అన్వయక్రమము :- హరిసత్తమః అర్థవిత్ జాంబవాన్ ఏవం కృతసంకల్పం తం, పరమప్రీతః (సన్) అర్థవత్ వాక్యమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :- హరిసత్తమః = వానరశ్రేష్ఠుడైన, అర్థవిత్ = విషయగ్రహణ కోవిదుడగు, జాంబవాన్ = జాంబవంతుడు, ఏవం = ఈరీతిగా, కృతసంకల్పం = చేయబడిన సంకల్పము గలిగినట్టి, తం = ఆ యంగదుని గూర్చి, అర్థవత్ = అర్థవంతమైనట్టి, వాక్యం = మాటను, పరమప్రీతః (సన్) = మిక్కిలి సంతోషము నొందినవా డగుచు, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- చేయవలసిన పనులను చక్కగా ఎరిగినవాడయిన వానరవృద్ధుడగు జాంబవంతుడు ఆ యంగదుని మాటలకు మిక్కిలి సంతోషించినవాడై ఆతని సంకల్పమును సరిదిద్దుటకై దూర మాలోచించిన మాటలతో ఇట్లు పలికెను.

శ్లో॥ నైషా బుద్ధి ర్మహాబుద్ధే యద్బ్రవీషి మహాకపే ।
విచేతుం వయ మాజ్ఞప్తా దక్షిణాం దిశ ముత్తమామ్ ।
నానేతుం కపిరాజేన నైవం రామేణ ధీమతా ॥ 8

పదచ్ఛేదము :- న - ఏషా - బుద్ధిః - మహాబుద్ధే - యత్ - బ్రవీషి - మహాకపే, విచేతుం - వయమ్ - ఆజ్ఞప్తాః - దక్షిణాం - దిశమ్ - ఉత్తమామ్, న - ఆనేతుం - కపిరాజేన - న - ఏవం - రామేణ - ధీమతా ॥

అన్వయక్రమము :- మహాబుద్ధే! మహాకపే (త్వం) యత్ బ్రవీషి ఏషా బుద్ధిః న, వయమ్ ఉత్తమాం దక్షిణాం దిశం విచేతుమ్ ఆజ్ఞప్తాః, కపిరాజేన ఆనేతుం న (ఆజ్ఞప్తాః) ఏవం ధీమతా రామేణ న (ఆజ్ఞప్తాః).

ప్రతిపదార్థము :- మహాబుద్ధే = గొప్పబుద్ధిమంతుడవైన, మహాకపే = ఓ వానరశ్రేష్ఠుడా! (త్వం = నీవు) యత్ = దేనిని, బ్రవీషి = చెప్పుచున్నావో, ఏషా = ఇది, బుద్ధిః = సరియైన ఆలోచన, న = కాదు, వయం = మనము, ఉత్తమాం = ఉత్తమమైనట్టి, దక్షిణాం దిశం = దక్షిణదిక్కును, విచేతుం = వెదుకుటకు, ఆజ్ఞప్తాః = ఆజ్ఞాపింపబడితిమి, కపిరాజేన = సుగ్రీవునిచే, (సీతాం = సీతను) ఆనేతుం = కొనివచ్చుటకు, న ఆజ్ఞప్తాః = ఆజ్ఞాపింపబడలేదు, ఏవం = అట్లే, ధీమతా = బుద్ధిశాలియైన, రామేణ = శ్రీరామునిచేత, న ఆజ్ఞప్తాః = ఆజ్ఞాపింపబడలేదు.

తాత్పర్యము :- గొప్ప బుద్ధిశాలివైన ఓ వానరశ్రేష్ఠుడా! నీవు ఇప్పుడు చెప్పుచున్నది

సరియైన ఆలోచనముగాదు. మనము ఆజ్ఞాపింపబడినట్టిది - ముఖ్యమైన దక్షిణ దిక్కునంతను వెదికి వచ్చుటయే. మహారాజైన సుగ్రీవుడుగాని ధీశాలియైన శ్రీరాముడుగాని సీతాదేవిని కొనిరండని మనను ఆజ్ఞాపించలేదుగదా!

శ్లో॥ కథంచి న్నిర్జితాం సీతా మస్మాభి ర్నాభిరోచయేత్ ।
రాఘవో నృపశార్దూలః కులం వ్యపదిశన్ స్వకమ్ ॥ 9

పదచ్ఛేదము :- కథంచిత్ - నిర్జితాం - సీతామ్ - అస్మాభిః - న - అభిరోచయేత్, రాఘవః - నృపశార్దూలః - కులం - వ్యపదిశన్ - స్వకమ్ ॥

అన్వయక్రమము :- నృపశార్దూలః రాఘవః స్వకం కులం వ్యపదిశన్ కథంచిత్ అస్మాభిః నిర్జితాం సీతాం న అభిరోచయేత్.

ప్రతిపదార్థము :- నృపశార్దూలః = రాజశ్రేష్ఠుడైనట్టి, రాఘవః = శ్రీరాముడు, స్వకం కులం = తన ఉన్నతకులమును, వ్యపదిశన్ = వెల్లడించుచు, కథంచిత్ = ఎట్లో, అస్మాభిః = మనచేత, నిర్జితాం = జయింపబడిన, సీతాం = సీతను, న అభిరోచయేత్ ఇష్టపడక పోవచ్చును.

తాత్పర్యము :- రాజశ్రేష్ఠుడైన శ్రీరాముడు తన క్షత్రియకులమునకు తగినట్లు పరాక్రమము చూపగోరును. కావున మనమెట్లో రావణుని ఓడించి సీతను తీసికొని వచ్చుట ఎంతమాత్రమునూ ఆతడు ఇష్టపడడు.

శ్లో॥ ప్రతిజ్ఞాయ స్వయం రాజా సీతావిజయ మగ్రతః ।
సర్వేషాం కపిముఖ్యానాం కథం మిథ్యా కరిష్యతి ॥ 10

పదచ్ఛేదము :- ప్రతిజ్ఞాయ - స్వయం - రాజా - సీతావిజయమ్ - అగ్రతః, సర్వేషాం - కపిముఖ్యానాం - కథం - మిథ్యా - కరిష్యతి ॥

అన్వయక్రమము :- రాజా సర్వేషాం కపిముఖ్యానామ్ అగ్రతః సీతావిజయం ప్రతిజ్ఞాయ కథం మిథ్యా కరిష్యతి?

ప్రతిపదార్థము :- రాజా = రాజైన సుగ్రీవుడు, సర్వేషాం కపిముఖ్యానామ్ అగ్రతః = వానరశ్రేష్ఠులందరి ఎదుటను, సీతావిజయం = సీతను జయించి తెచ్చుటను, స్వయం = స్వయముగా, ప్రతిజ్ఞాయ = ప్రతిజ్ఞచేసి, కథం = ఎట్లు, మిథ్యా కరిష్యతి = అసత్యము చేయగలడు?

తాత్పర్యము :- మన మహారాజైన సుగ్రీవుడు వానరశ్రేష్ఠు లందరి యెదుటను స్వయముగా శత్రువు నోడించి సీతను జయించి తెచ్చెదనని ప్రతిజ్ఞ చేసెనుగదా!

దాని నాతడు వ్యర్థము చేయుటకు ఎట్లు ఇష్టపడగలడు?

శ్లో॥ విఫలం కర్మ చ కృతం భవే త్తుష్టి ర్న తస్య చ ।
వృథా చ దర్శితం వీర్యం భవే ద్వానరపుంగవాః ॥ 11

పదచ్ఛేదము :– విఫలం – కర్మ – చ – కృతం – భవేత్ – తుష్టిః – న – తస్య – చ, వృథా – చ – దర్శితం – వీర్యం – భవేత్ – వానరపుంగవాః ॥

అన్వయక్రమము :– వానరపుంగవాః! కృతం కర్మ చ విఫలం భవేత్; తస్య తుష్టిః చ న (భవేత్); వీర్యం వృథా దర్శితం భవేత్.

ప్రతిపదార్థము :– వానరపుంగవాః = ఓ వానరశ్రేష్ఠులారా! విఫలం కర్మ = నిష్ఫలమైన పని, కృతం భవేత్ = చేయబడినట్లగును, తస్య = ఆ సుగ్రీవునకు, తుష్టిః చ = సంతోషముకూడ, న భవేత్ = కాకపోవును, వీర్యం = పరాక్రమము, వృథా = వ్యర్థముగా, దర్శితం = చూపబడినది, భవేత్ = కాగలదు.

తాత్పర్యము :– ఓ వానరోత్తములారా! మనము నిష్ప్రయోజనమైన పని చేసినట్లగును. రాజైన సుగ్రీవునకు గూడ తృప్తికరముగా నుండకపోవచ్చును. మన పరాక్రమ మంతయును వ్యర్థముగా ప్రదర్శించినట్లే అగును జుడీ!

శ్లో॥ తస్మా ద్గచ్ఛామ వై సర్వే యత్ర రామ స్సలక్ష్మణః ।
సుగ్రీవశ్చ మహాతేజాః కార్య స్యాస్య నివేదనే ॥ 12

పదచ్ఛేదము :– తస్మాత్ – గచ్ఛామ – వై – సర్వే – యత్ర – రామః – సలక్ష్మణః, సుగ్రీవః – చ – మహాతేజాః – కార్యస్య – అస్య – నివేదనే ॥

అన్వయక్రమము :– తస్మాత్ యత్ర సలక్ష్మణః రామః, మహాతేజాః సుగ్రీవః చ (అస్తి) (తత్ర) (వయం) సర్వే అస్య కార్యస్య నివేదనే గచ్ఛామ.

ప్రతిపదార్థము :– తస్మాత్ = అందువలన, యత్ర = ఎచ్చటనయితే, సలక్ష్మణః = లక్ష్మణునితో గూడినట్టి, రామః = రాముడును, మహాతేజాః = మహాప్రతాపశాలియైన, సుగ్రీవః చ = సుగ్రీవుడును, (స్తః = ఉన్నారో), తత్ర = అచ్చటికి, వయం సర్వే = మనమందరమును, అస్య కార్యస్య = ఈ కృత్యముయొక్క, నివేదనే = నివేదించు విషయమున, గచ్ఛామ = వెళ్ళుదము.

తాత్పర్యము :– అందుచే రాముడును, లక్ష్మణుడును, సుగ్రీవుడును ఉన్న చోటికే మనమందరమును పోయి ఈ సాధించిన కార్యమును నివేదించుదము.

శ్లో॥ న తావ దేషా మతి రక్షమా నో
యథా భవాన్ పశ్యతి రాజపుత్ర ।
యథా తు రామస్య మతి ర్నివిష్టా
తథా భవాన్ పశ్యతు కార్యసిద్ధిమ్ ॥ 13

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"అంగదజాంబవత్సంవాదో" నామ పంచాశస్సర్గః.

పదచ్ఛేదము :– న – తావత్ – ఏషా – మతిః – అక్షమా – నః, యథా – భవాన్ – పశ్యతి – రాజపుత్ర, యథా – తు – రామస్య – మతిః – నివిష్టా, తథా భవాన్ పశ్యతు కార్యసిద్ధిమ్ ॥

అన్వయక్రమము :– రాజపుత్ర! భవాన్ యథా పశ్యతి ఏషా మతిః నః అక్షమా న తావత్; రామస్య మతిః తు యథా నివిష్టా, భవాన్ కార్యసిద్ధిం తథా పశ్యతు.

ప్రతిపదార్థము :– రాజపుత్ర! = ఓ రాజకుమారుడా! భవాన్ = నీవు, యథా = ఏరీతిగా, పశ్యతి = చూచుచున్నావో, ఏషా మతిః = ఈ యాలోచన, నః = మనకు, అక్షమా = తగనిది, న తావత్ = కాజాలదు, రామస్య = శ్రీరాముని యొక్క, మతిః తు = ఆలోచనము మాత్రము, యథా = ఏరీతిగా, నివిష్టా = ఉండియున్నదో, భవాన్ = నీవు, కార్యసిద్ధిం = కార్యసిద్ధిని గూర్చి, పశ్యతు = ఆలోచించుము.

తాత్పర్యము :– ఓ రాజకుమారుడా! నీవాలోచించునట్టి పద్ధతి ఎంతమాత్రమును మనకు అసాధ్యమైనది కాదు, కాని శ్రీరాముని అభిప్రాయ మేరీతిగ నున్నదో ఆ రీతిగనే నీవు కార్యసిద్ధిని గూర్చి ఆలోచించవలసి యుండును గదా!

సూచన :– ఈ సర్గమునందు కొన్ని ప్రతులలో ఆరుశ్లోకములు మాత్రమే కానవచ్చు చున్నవి. మరికొన్ని ప్రతులలో పదిశ్లోకములకు మించి యున్నవి. బొంబాయి ప్రతియందు ఇరువది గలవు. ప్రముఖపండితులు నిర్ణయించి నట్టిదని మాచే ఈ శ్లోకముల పరిమితి గ్రహింపబడినది.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"అంగదజాంబవత్సంవాదము" అను అరువదవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

ఏకషష్టితమసర్గ

శ్లో॥ తతో జాంబవతో వాక్య మగృహ్ణంత వనౌకసః ।
అంగదప్రముఖా వీరా హనూమాంశ్చ మహాకపిః ॥ 1

పదచ్ఛేదము :– తతః – జాంబవతః – వాక్యమ్ – అగృహ్ణంత – వనౌకసః, అంగదప్రముఖాః – వీరాః – హనూమాన్ – చ – మహాకపిః ॥

అన్వయక్రమము :– తతః అంగదప్రముఖాః వీరాః వనౌకసః, మహాకపిః హనూమాన్ చ, జాంబవతః వాక్యమ్ అగృహ్ణంత.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, అంగదప్రముఖాః = అంగదుడు మొదలుగా కలిగినట్టి, వీరాః = వీరులైన, వనౌకసః = వానరులును, మహాకపిః = కపిశ్రేష్ఠుడైన, హనుమాన్ చ = హనుమంతుడును, జాంబవతః = జాంబవంతునియొక్క, వాక్యం = వాక్యమును, అగృహ్ణంత = స్వీకరించిరి.

తాత్పర్యము :– అటుపిమ్మట మహావీరులైన అంగదాదివానరులును , వానరశ్రేష్ఠుడైన హనుమంతుడును, జాంబవంతుడు చెప్పినమాట యుక్తమైనదే యని ఒప్పుకొనిరి.

శ్లో॥ ప్రీతిమంత స్తత స్సర్వే వాయుపుత్రపురస్సరాః ।
మహేంద్రాద్రిం పరిత్యజ్య పుప్లువుః ప్లవగర్షభాః ॥ 2

పదచ్ఛేదము :– ప్రీతిమంతః – తతః – సర్వే – వాయుపుత్రపురస్సరాః, మహేంద్రాద్రిం – పరిత్యజ్య – పుప్లువుః – ప్లవగర్షభాః ॥

అన్వయక్రమము :– తతః ప్లవగర్షభాః సర్వే ప్రీతిమంతః (సంతః) వాయుపుత్రపురస్సరాః మహేంద్రాద్రిం పరిత్యజ్య పుప్లువుః.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, ప్లవగర్షభాః = వానరశ్రేష్ఠులు, సర్వే = ఎల్లరును, ప్రీతిమంతః సంతః = మహాసంతోషము గలవారై, వాయుపుత్రపురస్సరాః = హనుమంతుని ముందిడుకొన్నవారై, మహేంద్రాద్రిం = మహేంద్రపర్వతమును, పరిత్యజ్య = విడిచి, పుప్లువుః = ఎగిరిరి.

తాత్పర్యము :– అప్పుడు ఆ వానరవీరు లందరును మిక్కిలి ఆనందముతో వాయునందనుని ముందిడుకొని మహేంద్రపర్వతము మీదనుండి ఆకసమున కెగసిరి.

శ్లో॥ మేరుమందరసంకాశా మత్తా ఇవ మహాగజాః ।
ఛాదయంత ఇ వాకాశం మహాకాయా మహాబలాః ॥ 3

పదచ్ఛేదము :– మేరుమందరసంకాశాః – మత్తాః – ఇవ – మహాగజాః – ఛాదయంతః – ఇవ – ఆకాశం – మహాకాయాః – మహాబలాః ॥

అన్వయక్రమము :– మహాకాయాః మహాబలాః, మేరుమందరసంకాశాః తే మత్తాః మహాగజాః ఇవ, ఆకాశం ఛాదయంతః ఇవ (పుప్లువః).

ప్రతిపదార్థము :– మహాకాయాః = గొప్పదైన దేహముగలవారును, మహాబలాః = గొప్పదైన బలముగలవారును, మేరుమందరసంకాశాః = మేరుపర్వతముతోడను మందరపర్వతముతోడను సమానులై యున్నట్టివారు నగు, తే = ఆ వానరులు, మత్తాః = మదించిన, మహాగజాః ఇవ = గొప్ప ఏనుగులవలె, ఆకాశం = ఆకాశమును, ఛాదయంతః ఇవ = కప్పివేయుచున్నవారువలె, పుప్లువః = ఎగిరిరి.

తాత్పర్యము :– మేరు మందర పర్వతములవంటి స్థూలములైన శరీరములు కలిగి, మదించిన మహాగజమువలె మహాబలాఢ్యులై యున్నట్టి ఆ వానరులు ఆకాశమును కప్పివేయుచున్నట్లుగా గగనవీథి నెగురుచు పోవుచుండిరి.

శ్లో॥ సభాజ్యమానం భూతైస్త మాత్మవంతం మహాబలమ్ ।
హనుమంతం మహావేగం వహంత ఇవ దృష్టిభిః ॥ 4

పదచ్ఛేదము :– సభాజ్యమానం – భూతైః – తమ్ – ఆత్మవంతం – మహాబలమ్, హనుమంతం – మహావేగం – వహంతః – ఇవ – దృష్టిభిః ॥

అన్వయక్రమము :– భూతైః సభాజ్యమానమ్ ఆత్మవంతం మహాబలం మహావేగం తం హనూమంతం దృష్టిభిః వహంతః ఇవ పుప్లువుః.

ప్రతిపదార్థము :– భూతైః = పృథివ్యాదిభూతములచే, సభాజ్యమానం = పూజింపబడుచున్న వాడును, ఆత్మవంతం = మహాధైర్యవంతుడును, మహాబలం = మహాబలాఢ్యుడును, మహావేగం = మహావేగసంపన్నుడునగు, హనుమంతం = హనుమంతుని, దృష్టిభిః = చూపులతో, వహంతః ఇవ = మోయుచున్నవారువలె, పుప్లువుః = ఎగిరిరి.

తాత్పర్యము :- పంచమహాభూతములచేతను సమస్తప్రాణులచేతను గౌరవింప బడుచున్నవాడును, మహాబలాఢ్యుడును, మహావేగసంపన్నుడును అగు హనుమంతుని ఆ వానరులెల్లరును రెప్పపాటులేని తమ చూపులతో మోయుచున్నట్లుగా సంతోషముతో చూచుచు ఆకసమున నెగురుచు పోవుచుండిరి.

శ్లో॥ రాఘవే చార్థనిర్వృత్తిం కర్తుం చ పరమం యశః ।
సమాదాయ సమృద్ధార్థాః కర్మసిద్ధిభి రున్నతాః ॥ 5

పదచ్ఛేదము :- రాఘవే - చ - అర్థనిర్వృత్తిం - కర్తుం - చ - పరమం - యశః, సమాధాయ - సమృద్ధార్థాః - కర్మసిద్ధిభిః - ఉన్నతాః ॥

అన్వయక్రమము :- రాఘవే అర్థనిర్వృత్తిం చ పరమం యశః చ కర్తుం సమాధాయ సమృద్ధార్థాః కర్మసిద్ధిభిః ఉన్నతాః చ (సంతః) (పుప్లవః).

ప్రతిపదార్థము :- రాఘవే = శ్రీరామునియందు, అర్థనిర్వృత్తిం చ = కార్యసిద్ధిని, పరమం యశః చ = గొప్ప కీర్తిని, కర్తుం = కూర్చుకొనుటకు, సమాధాయ = నిర్ణయించుకొని, సమృద్ధార్థాః = నెరవేరిన ప్రయోజనము గలవారై, కర్మసిద్ధిభిః = కార్యసిద్ధులచే, ఉన్నతాః (సంతః) = ఔన్నత్యము గలవారగుచు, పుప్లువుః = ఎగిరిరి.

తాత్పర్యము :- ఆ వానరులు శ్రీరామునకు కార్యసిద్ధిని, గొప్ప కీర్తిని సాధించి తమ ప్రయోజనము నెరవేర్చుకొని కార్యము సిద్ధించుటచే మిక్కిలి ఘనత వహించినవారై ఆకసమునం దెగిరి పోవుచుండిరి.

శ్లో॥ ప్రియాఖ్యానోన్ముఖా స్సర్వే సర్వే యుద్ధాభినందినః ।
సర్వే రామప్రతీకారే నిశ్చితార్థా మనస్వినః ॥ 6

పదచ్ఛేదము :- ప్రియాఖ్యానోన్ముఖాః - సర్వే - సర్వే - యుద్ధాభినందినః, సర్వే - రామప్రతీకారే - నిశ్చితార్థాః - మనస్వినః ॥

అన్వయక్రమము :- సర్వే ప్రియాఖ్యానోన్ముఖాః సర్వే యుద్ధాభినందినః సర్వే రామ ప్రతీకారే నిశ్చితార్థాః మనస్వినః (చ సంతః) పుప్లువుః.

ప్రతిపదార్థము :- సర్వే = ఆ వానరులందరును, ప్రియాఖ్యానోన్ముఖాః = ప్రియమును చెప్పుటకు ఉద్యుక్తులైనవారును, సర్వే = అందరును, యుద్ధాభినందినః = యుద్ధమును మెచ్చునట్టివారును, సర్వే = ఎల్లరును, రామప్రతీకారే = రామునకు సంబంధించిన ప్రతీకారమునందు, నిశ్చితార్థాః = నిశ్చయించిన కార్యములు గలవారును, మనస్వినః (చ సంతః) = పౌరుషవంతులును అగుచు, పుప్లువుః = ఎగురుచుండిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- "రామప్రతీకారే" రామునికి ప్రత్యుపకారమునందని భావము.

తిలకము :- 'రామప్రతీకారే' రాముడు చేయవలసియున్న రావణప్రతీకారము నందని భావము.

తాత్పర్యము :- ఆ వానరులెల్లరును శ్రీరామునకు ప్రియమైనవార్తను తెలుపుటకు వేగిర పడుచున్నట్టి వారును, యుద్ధమును గూర్చి యువ్విళ్ళూరుచున్న వారును. శ్రీరామునకు గల్గిన హానికి ప్రతీకారము గావింప నిశ్చయించుకొన్నట్టి వారును, మహాపౌరుషశాలురును అగుచు ఆకసమున కెగురుచుండిరి.

శ్లో॥ ప్లవమానా స్సముత్పత్య తత స్తే కాననౌకసః ।
నందనోపమ మాసేదు ర్వనం ద్రుమలతాయుతమ్ ॥ 7

శ్లో॥ యత్త న్మధువనం నామ సుగ్రీవ స్యాభిరక్షితమ్ ॥ 8

పదచ్ఛేదము :- ప్లవమానాః - సముత్పత్య - తతః - తే - కాననౌకసః, నందనోపమమ్ - ఆసేదుః - వనం - ద్రుమలతాయుతమ్, యత్ - తత్ - మధువనం - నామ - సుగ్రీవస్య - అభిరక్షితమ్॥

అన్వయక్రమము :- తతః తే కాననౌకసః ప్లవమానాః సముత్పత్య అభిరక్షితం ద్రుమలతాయుతం మధువనం నామ సుగ్రీవస్య నందనోపమం యత్ వనం తత్ ఆసేదుః.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, తే = ఆ, కాననౌకసః = వానరులు, ప్లవమానాః = ఎగురుచున్నవారై, సముత్పత్య = గెంతి, అభిరక్షితం = చక్కగ రక్షింపబడుచున్నదియును, ద్రుమలతాయుతం = వృక్షములతోడను తీగలతోడను లతలతోడను గూడినదియునగు, మధువనం నామ = మధువనమని పేరు గలిగినట్టి, నందనోపమం = నందనవనముతో సమానమైన, యత్ వనం = ఏ వనము, అస్తి = ఉన్నదో, తత్ = ఆ వనమును, ఆసేదుః = చేరిరి.

తాత్పర్యము :- ఆ వానరవీరు లందరును ఆకసమునం దెగురుచు పోయి పోయి పెక్కు వృక్షములతోడను లతలతోడను నిండి చక్కగ రక్షింపబడుచు, మధువనమని పేరు గలిగియున్నట్టి నందనము వంటి సుందరమైన వనమును జేరుకొనిరి.

శ్లో॥ అధృష్యం సర్వభూతానాం సర్వభూతమనోహరమ్ ।
యద్రక్షతి మహావీర్య స్సదా దధిముఖః కపిః ।
మాతులః కపిముఖ్యస్య సుగ్రీవస్య మహాత్మనః ॥ 9

పదచ్ఛేదము :– అధృష్యం – సర్వభూతానాం – సర్వభూతమనోహరం, యత్ – రక్షతి – మహావీర్యః – సదా – దధిముఖః – కపిః, మాతులః – కపిముఖ్యస్య – సుగ్రీవస్య – మహాత్మనః ॥

అన్వయక్రమము :– మహావీర్యః కపిముఖ్యస్య మహాత్మనః సుగ్రీవస్య మాతులః దధిముఖః కపిః యత్ రక్షతి, తత్ సర్వభూతానామ్ అధృష్యం సర్వభూతమనోహరం (మధువనమ్ ఆసేదుః).

ప్రతిపదార్థము :– యత్ = దేనినైతే, మహావీర్యః = మహాపరాక్రమసంపన్నుడును, కపిముఖ్యస్య = వానరశ్రేష్ఠుడైన, మహాత్మనః = మహనీయుడగు, సుగ్రీవస్య = సుగ్రీవుని యొక్క, మాతులః = మేనమామయైన, దధిముఖః కపిః = దధిముఖుడను వానరుడు, సదా = నిత్యము, రక్షతి = రక్షించుచున్నాడో, సర్వభూతానామ్ అధృష్యం = ఎల్ల ప్రాణులకును భయంకరముగ నుండునదియును, సర్వభూతమనోహరం = సర్వ ప్రాణులకును, ఆకర్షకముగ నుండునదియును అగు, తత్ మధువనం = ఆ మధువనమును, ఆసేదుః = చేరుకొనిరి.

తాత్పర్యము :– సర్వప్రాణిమనోహరమై యుండి మహనీయుడైన సుగ్రీవుని మేనమామ యగు దధిముఖు డను మహావీరుడైన వానరుడు ఎల్లకాలము మిక్కిలి శ్రద్ధతో రక్షించుచుండగా ఏ దుష్టప్రాణికిని చేరరానిదై యున్న సుందరమగు మధువనమును ఆ వానరులు చేరుకొనిరి.

శ్లో॥ తే తద్వన ముపాగమ్య బభూవుః పరమోత్కటాః ।
వానరా వానరేంద్రస్య మనఃకాంతతమం మహత్ ॥ 10

పదచ్ఛేదము :– తే – తత్ – వనమ్ – ఉపాగమ్య – బభూవుః – పరమోత్కటాః, వానరాః – వానరేంద్రస్య – మనఃకాంతతమం – మహత్ ॥

అన్వయక్రమము :– తే వానరాః మనఃకాంతతమం తత్ వానరేంద్రస్య మహత్ వనమ్ ఉపాగమ్య పరమోత్కటాః బభూవుః.

ప్రతిపదార్థము :– తే వానరాః = ఆ వానరులు, మనఃకాంతతమం = మిక్కిలి మనోహరమైనట్టి, తత్ = ఆ, వానరేంద్రస్య = సుగ్రీవునియొక్క, మహత్ = గొప్పదైనట్టి,

వనం = మధువనమును, ఉపాగమ్య = చేరి, పరమోత్కటాః = మహౌత్సుక్యము గలవారు, బభూవుః = అయిరి.

తాత్పర్యము :– ఆ వానరయోధులు మిక్కిలి రమణీయముగా నుండి సుగ్రీవునకు ప్రియమైనదై మిక్కిలి గొప్పదైయున్న మధువనమును చేరుకొని మహోత్సాహభరితులైరి.

శ్లో॥ తత స్తే వానరా హృష్టా దృష్ట్వా మధువనం మహత్ ।
కుమార మభ్యయాచంత మధూని మధుపింగళాః ॥ 11

పదచ్ఛేదము :– తతః – తే – వానరాః – హృష్టాః – దృష్ట్వా – మధువనం – మహత్, కుమారమ్ – అభ్యయాచంత – మధూని – మధుపింగళాః ॥

అన్వయక్రమము :– తతః తే మధుపింగళాః వానరాః మహత్ మధువనం దృష్ట్వా హృష్టాః (సంతః) కుమారం మధూని అభ్యయాచంత.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, మధుపింగళాః = తేనెవలె పచ్చని ఛాయగలిగినట్టి, తే = ఆ, వానరాః = వానరులు, మహత్ = గొప్పదైన, మధువనం = మధువనమును, దృష్ట్వా = చూచి, హృష్టాః (సంతః) = హర్షము నొందిన వారై, కుమారం = అంగదుని, మధూని = తేనెలను, అభ్యయాచంత = కోరుకొనిరి.

తాత్పర్యము :– అప్పుడు మధువువలెనే పచ్చగానున్న ఆ వానరులు ఆ మధువనమున ప్రవేశించి దానిని చూచి మహానందము నొందినవారై అంగదకుమారుని ఆ వనము నందలి మధువులను గ్రోలుటకు అనుమతిని అర్థించిరి.

శ్లో॥ తతః కుమార స్తాన్ వృద్ధాన్ జాంబవత్ప్రముఖాన్ కపీన్ ।
అనుమాన్య దదౌ తేషాం నిసర్గం మధుభక్షణే ॥ 12

పదచ్ఛేదము :– తతః – కుమారః – తాన్ – వృద్ధాన్ – జాంబవత్ప్రముఖాన్ – కపీన్, అనుమాన్య – దదౌ – తేషాం – నిసర్గం – మధుభక్షణే ॥

అన్వయక్రమము :– తతః కుమారః జాంబవత్ప్రముఖాన్ వృద్ధాన్ తాన్ కపీన్ అనుమాన్య తేషాం మధుభక్షణే నిసర్గం దదౌ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, కుమారః = అంగద కుమారుడు, వృద్ధాన్ = పెద్దలైనట్టి, జాంబవత్ప్రముఖాన్ = జాంబవంతుడు మొదలుగాగల, తాన్ కపీన్ = ఆ వానరులను, అనుమాన్య = అనుమతింపచేసి, తేషాం = ఆ వానర సమూహములకు, మధుభక్షణే = మధుభక్షణమున, నిసర్గం = అనుజ్ఞను, దదౌ = ఇచ్చెను.

తాత్పర్యము :– అంతట ఆ అంగదకుమారుడు, జాంబవంతుడు మున్నగు వానర వృద్ధులతో ఆలోచించి వారి అనుమతి వడసి ఆ వానరులందరికిని మధుభక్షణమునకు అనుమతి నొసగెను.

శ్లో॥ తత శ్చానుమతా స్సర్వే సంప్రహృష్టా వనౌకసః ।
ముదితాః ప్రేరితా శ్చాపి ప్రనృత్యంతో ఽభవం స్తదా ॥ 13

పదచ్ఛేదము :– తతః – చ – అనుమతాః – సర్వే – సంప్రహృష్టాః – వనౌకసః, ముదితాః – ప్రేరితాః – చ – అపి – ప్రనృత్యంతః – అభవన్ – తదా ॥

అన్వయక్రమము :– తతః అనుమతాః (తే) వనౌకసః సర్వే సంప్రహృష్టాః ముదితాః ప్రేరితాశ్చ అపి (సంతః) తదా ప్రనృత్యంతః అభవన్.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, అనుమతాః = అనుజ్ఞనొందినట్టి, తే = ఆ, వనౌకసః = వానరులు, సర్వే = అందరును, సంప్రహృష్టాః = మిక్కిలి ఆనందము నొందినవారును, ప్రేరితాః చ అపి (సంతః) = ప్రోత్సహింపబడినవారు నగుచు, తదా = అప్పుడు, ప్రనృత్యంతః = నృత్యముచేయుచున్నవారు, అభవన్ = అయిరి.

తాత్పర్యము :– అప్పుడా వానరులెల్లరును తమ కోరిక అనుమతింపబడినందుకు మహానందము నొందినవారై మహోత్సాహముతో అప్పుడు నాట్యము చేసిరి.

శ్లో॥ గాయంతి కేచి త్ప్రణమంతి కేచి
న్నృత్యంతి కేచి త్ప్రహసంతి కేచిత్ ।
పతంతి కేచి ద్విచరంతి కేచిత్
ప్లవంతి కేచి త్ప్రలపంతి కేచిత్ ॥ 14

పదచ్ఛేదము :– గాయంతి – కేచిత్ – ప్రణమంతి – కేచిత్, నృత్యంతి – కేచిత్ – ప్రహసంతి – కేచిత్, పతంతి – కేచిత్ – విచరంతి – కేచిత్, ప్లవంతి – కేచిత్ – ప్రలపంతి – కేచిత్ ॥

అన్వయక్రమము :– సుగమము.

ప్రతిపదార్థము :– కేచిత్ = కొంతమంది వానరులు, గాయంతి = పాడుచున్నారు, కేచిత్ = కొంతమంది, ప్రణమంతి = నమస్కరించుచున్నారు, కేచిత్ = కొంతమంది, నృత్యంతి = నాట్యము చేయుచున్నారు, కేచిత్ = కొంతమంది, ప్రహసంతి = పెద్దగ నవ్వుచున్నారు, కేచిత్ = కొంతమంది, పతంతి = పడుచున్నారు, కేచిత్ = కొందరు, విచరంతి = పరిభ్రమించుచున్నారు, కేచిత్ = కొంతమంది, ప్లవంతి = దుముకు

చున్నారు, కేచిత్ = కొంతమంది, ప్రలపంతి = ప్రలాపములు చేయుచున్నారు.

తాత్పర్యము :– మధుపానమున కనుజ్ఞనొందిన ఆ వానరులు ఆనందావేశముతో కొందరు పాటలు పాడుచుండిరి. కొందరు నమస్కారములు చేయుచుండిరి. కొందరు నృత్యము చేయుచుండిరి. కొందరు పెద్దగ నవ్వుచుండిరి. కొందరు చెట్లమీద నుండి క్రిందకు ఉరుకుచుండిరి. కొంద రావనమున కలియ తిరుగుచుండిరి. కొందరు గంతులు వేయుచుండిరి. కొందరతిగా వాగుచుండిరి.

శ్లో॥ పరస్పరం కేచి దుపాశ్రయంతే
పరస్పరం కేచి దుపాక్రమంతే ।
పరస్పరం కేచి దుపబ్రువంతే
పరస్పరం కేచి దుపారమంతే ॥ 15

పదచ్ఛేదము :– పరస్పరం – కేచిత్ – ఉపాశ్రయంతే – పరస్పరం – కేచిత్ – ఉపాక్రమంతే, పరస్పరం – కేచిత్ – ఉపబ్రువంతే – పరస్పరం – కేచిత్ – ఉపారమంతే ॥

అన్వయక్రమము :– సుగమము.

ప్రతిపదార్థము :– కేచిత్ = కొందరు వానరులు, పరస్పరం = ఒండొరులను, ఉపాశ్రయంతే = ఆశ్రయించుచుండిరి, కేచిత్ = కొందరు, పరస్పరం = ఒకరినొకరు, ఉపాక్రమంతే = ఆక్రమించుచుండిరి, కేచిత్ = కొందరు, పరస్పరం = ఒకరితో నొకరు, ఉపారమంతే = చేరి ఆడుచుండిరి.

తాత్పర్యము :– ఆ వానరులలో కొందరు ఒకరికొకరు దగ్గరకు చేరుకొనుచుండిరి. కొందరు ఒకరినొకరు చేరి కౌగిలించు కొనుచుండిరి. కొందరు ఒకరితో నొకరు రహస్యపుమాటలు చెప్పుకొనుచుండిరి. కొందరు ఒకరితో నొకరు క్రీడించుచుండిరి.

శ్లో॥ ద్రుమా ద్ద్రుమం కేచి దభిద్రవంతి
క్షితౌ నగాగ్రా న్నిపతంతి కేచిత్ ।
మహీతలా త్కేచి దుదీర్ణవేగా
మహాద్రుమాగ్రా ణ్యభిసంపతంతి ॥ 16

పదచ్ఛేదము :– ద్రుమాత్ – ద్రుమం – కేచిత్ – అభిద్రవంతి, క్షితౌ – నగాగ్రాత్ – నిపతంతి – కేచిత్ – మహీతలాత్ – కేచిత్ – ఉదీర్ణవేగాః, మహాద్రుమాగ్రాణి – అభిసంపతంతి ॥

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- కేచిత్ = కొందరు వానరులు, ద్రుమాత్ = ఒకచెట్టునుండి, ద్రుమం = ఇంకొక చెట్టునుగూర్చి, అభిద్రవంతి = పరుగెత్తుచుండిరి, కేచిత్ = కొందరు, నగాగ్రాత్ = చెట్టుకొననుండి, క్షితౌ = నేలమీద, నిపతంతి = ఉరుకుచుండిరి, కేచిత్ = కొంతమంది, మహీతలాత్ = నేలమీదనుండి, ఉదీర్ణవేగాః = గొప్పదైన వేగముగలవారై, మహాద్రుమాగ్రాణి = పెద్దవైన వృక్షములయొక్క అగ్రమును గూర్చి, అభిసంపతంతి = ఎగురుచుండిరి.

తాత్పర్యము :- ఆ వానరులలో కొందరు ఒక చెట్టునుండి ఇంకొక చెట్టుమీదకి గెంతుచుండిరి. కొందరు చెట్టుకొననుండి నేలమీదకి దూకుచుండిరి. కొందరు నేలమీది నుండి మహావేగముతో ఎత్తైన చెట్టు కొనల కెగురుచుండిరి.

శ్లో॥ గాయంత మన్యః ప్రహస న్నుపైతి
హసంత మన్యః ప్రరుద న్నుపైతి ।
రుదంత మన్యః ప్రణద న్నుపైతి
నదంత మన్యః ప్రణుద న్నుపైతి ॥ **17**

పదచ్ఛేదము :- గాయంతమ్ - అన్యః - ప్రహసన్ - ఉపైతి, హసంతమ్ - అన్యః - ప్రరుదన్ - ఉపైతి, రుదంతమ్ - అన్యః - ప్రణదన్ - ఉపైతి, నదంతం - అన్యః - ప్రణుదన్ - ఉపైతి ॥

ప్రతిపదార్థము :- గాయంతం = పాడుచున్నట్టి వానిని, అన్యః = వేరొకడు, ప్రహసన్ = బిగ్గరగ నవ్వుచు, ఉపైతి = సమీపించుచున్నాడు, హసంతం = నవ్వుచున్న ఒకనిని, అన్యః = వేరొకడు, ప్రరుదన్ = పెద్దగ ఏడ్చుచు, ఉపైతి = సమీపించుచున్నాడు, రుదంతం = ఏడ్చుచున్నట్టి వానిని, అన్యః = వేరొకడు, ప్రణదన్ = చప్పుడుచేయుచు, ఉపైతి = సమీపించు చున్నాడు, నదంతం = ధ్వనిచేయుచున్న వానిని, అన్యః = ఇంకొకడు, ప్రణుదన్ = త్రోయుచు, ఉపైతి = చేరుచున్నాడు.

తాత్పర్యము :- వారిలో నొక వానరుడు పాడుచుండగా వేరొకడు పెద్దగ నవ్వుచు దగ్గరకు వచ్చుచుండెను. ఆ నవ్వుచున్న వానికడకు వేరొక డేడ్చుచు సమీపించు చుండెను. ఏడ్చుచున్న వానికడకు ఇంకొకడు పెద్దకేకలు వేయుచు వచ్చు చుండెను. ఆ కేకలు వేయుచున్న వానికడకు మరియొకడు వచ్చి త్రోసివేయుచుండెను.

శ్లో॥ సమాకులం తత్కపిసైన్య మాసీత్
మధుప్రపానోత్కటసత్త్వచేష్టమ్ ।
న చాత్ర కశ్చి న్న బభూవ మత్తః
న చాత్ర కశ్చి న్న బభూవ తృప్తః ॥ 18

పదచ్ఛేదము :– సమాకులం – తత్ – కపిసైన్యమ్ – ఆసీత్ – మధుప్రపానోత్కట సత్త్వచేష్టమ్, న – చ – అత్ర – కః – చిత్ – న – బభూవ – మత్తః, న – చ – అత్ర – కః – చిత్ – న – బభూవ – తృప్తః ॥

అన్వయక్రమము :– తత్ కపిసైన్యం మధుప్రపానోత్కటసత్త్వచేష్టం సమాకులమ్ ఆసీత్, అత్ర కశ్చిత్ న మత్తః న బభూవ, కశ్చిత్ అత్ర న తృప్తః చ న బభూవ.

ప్రతిపదార్థము :– తత్ కపిసైన్యం = ఆ వానరసైన్యము, మధుప్రపానోత్కట సత్త్వ చేష్టం = తేనెలను త్రాగుటచే మదించిన మనస్సును, చేష్టలుకలదై, సమాకులమ్ = కల్లోలమైనది, ఆసీత్ = ఆయెను, అత్ర = ఆ వానర సమూహామునందు, కశ్చిత్ = ఒక్కడును, న మత్తః = మత్తిల్లనివాడు, న బభూవ = లేకుండెను, కశ్చిత్ = ఏ యొక్కడును, అత్ర = వీరిలో, న తృప్తః చ న బభూవ = తృప్తినొందనివాడును లేకుండెను.

తాత్పర్యము :– ఆ వానరసైన్య మంతయును మధుపానముచే మదించిన మనస్సుతో స్వేచ్ఛాచరణముగలదై మిక్కిలి కల్లోలమైనదిగ నుండెను. అప్పుడు అచ్చట ఏయొక్క వానరుడును మత్తెక్కియుండనివాడుగాని తేనెలు త్రాగి తృప్తిదీరనివాడుగాని లేకుండెను.

శ్లో॥ తతో వనం తైః పరిభక్ష్యమాణం
ద్రుమాంశ్చ విధ్వంసితపత్రపుష్పాన్ ।
సమీక్ష్య కోపా ద్దధివక్త్రనామా
నివారయామాస కపిః కపీం స్తాన్ ॥ 19

పదచ్ఛేదము :– తతః – వనం – తైః – పరిభక్ష్యమాణం, ద్రుమాన్ – చ – విధ్వంసితపత్రపుష్పాన్, సమీక్ష్య – కోపాత్ – దధివక్త్రనామా – నివారయామాస – కపిః – కపీన్ – తాన్ ॥

అన్వయక్రమము :– తతః తైః పరిభక్ష్యమాణం వనం విధ్వంసితపత్రపుష్పాన్ ద్రుమాన్ చ సమీక్ష్య దధివక్త్రనామా కపిః తాన్ కపీన్ నివారయామాస.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, తైః = ఆ వానరులచే, పరిభక్ష్యమాణం =

తినివేయబడుచున్నట్టి, వనం = వనమును, విధ్వంసితపత్రపుష్పాన్ = ధ్వంసము చేయబడిన ఆకులును పువ్వులును గలిగినట్టి, ద్రుమాన్ చ = వృక్షములనుకూడ, సమీక్ష్య = చూచి, దధివక్త్రనామా = దధిముఖుడను పేరుగల, కపిః = వానరుడు, తాన్ = ఆ, కపీన్ = వానరులను, నివారయామాస = అడ్డుకొనెను.

తాత్పర్యము :– అప్పు డా మధువనమును ఆ వానరులు తినివేయుటయును, చెట్ల యందలి ఆకులను పువ్వులను పాడుచేయుటయును చూచి దధిముఖుడను పేరుగల వనపాలకుడైన వానరుడు వచ్చి ఆ వానరుల నడ్డగించెను.

శ్లో॥ స తైః ప్రవృద్ధైః పరిభర్త్స్యమానో
వనస్య గోప్తా హరివీరవృద్ధః ।
చకార భూయో మతి ముగ్రతేజా
వనస్య రక్షాం ప్రతి వానరేభ్యః ॥ 20

పదచ్ఛేదము :– సః – తైః – ప్రవృద్ధైః – పరిభర్త్స్యమానః, వనస్య – గోప్తా – హరివీరవృద్ధః, చకార – భూయః – మతిమ్ – ఉగ్రతేజాః, వనస్య – రక్షాం – ప్రతి – వానరేభ్యః ॥

అన్వయక్రమము :– వనస్య గోప్తా హరివీరవృద్ధః సః ప్రవృద్ధైః తైః పరిభర్త్స్యమానః ఉగ్రతేజాః (సన్) వానరేభ్యః వనస్య రక్షాం ప్రతి భూయః మతిం చకార.

ప్రతిపదార్థము :– వనస్య గోప్తా = వనమునకు రక్షకుడైన, హరివీరవృద్ధః = వృద్ధవానర వీరుడైనట్టి, సః = ఆ దధిముఖుడు, ప్రవృద్ధైః = పెచ్చు పెరిగినట్టి, తైః = ఆ వానర వీరులచే, పరిభర్త్స్యమానః = గద్దింపబడుచున్నవాడై, ఉగ్రతేజాః (సన్) = ఉగ్రమైన పరాక్రమము గలవాడై, వానరేభ్యః = వానరుల నుండి, వనస్య = మధువనము యొక్క, రక్షాం ప్రతి = రక్షణమును గూర్చి, భూయః = తిరిగి, మతిం చకార = నిశ్చయించుకొనెను.

తాత్పర్యము :– మధువనపాలకుడైనట్టి ఆ వానరవీరవృద్ధుడైన దధిముఖుని ఆ కపిసేనలు దర్పించి లెక్కచేయక ఎదురు తిరిగి గద్దించుచుండగా ఆతనికి గొప్ప పౌరుషము గలిగి ఆ వానరులనుండి మధువనమును రక్షించుటకుగాను తీవ్రముగా నిశ్చయించుకొనెను.

శ్లో॥ ఉవాచ కాంశ్చి త్పరుషాణి ధృష్ట
మసక్త మన్యాంశ్చ తలై ర్జఘాన ।

సమేత్య కైశ్చి త్కలహం చకార
తథైవ సామ్నోపజగామ కాంశ్చిత్ ॥ 21

పదచ్ఛేదము :– ఉవాచ – కాన్ – చిత్ – పరుషాణి – ధృష్టమ్ – అసక్తమ్ – అన్యాన్ – చ – తలైః – జఘాన, సమేత్య – కైశ్చిత్ – కలహం – చకార – తథా – ఏవ – సామ్నా – ఉపజగామ – కాంశ్చిత్ ॥

అన్వయక్రమము :– (సః) కాంశ్చిత్ ధృష్టం పరుషాణి ఉవాచ, అన్యాన్ చ అసక్తం తలైః జఘాన, కైశ్చిత్ సమేత్య కలహం చకార, తథైవ కాంశ్చిత్ సామ్నా ఉపజగామ.

ప్రతిపదార్థము :– (సః = ఆ దధిముఖుడు), కాంశ్చిత్ = కొంతమందిని, ధృష్టం = పొగరుగా, పరుషాణి = పరుషవచనములను, ఉవాచ = పలికెను, అన్యాన్ చ = ఇతరులనుగూడ, అసక్తం = అంటకుండ, తలైః = అరచేతులతో, జఘాన = కొట్టెను, కైశ్చిత్ = కొందరితో, సమేత్య = కలసి, కలహం చకార = కలహము పెట్టుకొనెను, తథా ఏవ = అట్లే, కాంశ్చిత్ = కొందరిని, సామ్నా = మంచిగనే, ఉపజగామ = సమీపించెను.

తాత్పర్యము :– అప్పుడా దధిముఖుడు కొందరు వానరులతో పొగరుగా పరుష వచనములు పలికెను. మరి కొందరిని తన అరచేతులతో ప్రహరించెను. కొందరికడ కేగి వారితో కయ్యము పెట్టుకొనెను. మరికొందరికడ కేగి మంచిగనే మాటలాడి ఒప్పించ యత్నించెను.

శ్లో॥ స తై ర్మదా త్సంపరివార్య వాక్యై
ర్బలాచ్చ తేన ప్రతివార్యమాణైః ।
ప్రధర్షిత స్త్యక్తభయై స్సమేత్య
ప్రకృష్యతే చా ప్యనవేక్ష్య దోషమ్ ॥ 22

పదచ్ఛేదము :– సః – తైః – మదాత్ – సంపరివార్య – వాక్యైః – బలాత్ – చ – తేన – ప్రతివార్యమాణైః, ప్రధర్షితః – త్యక్తభయైః – సమేత్య – ప్రకృష్యతే – చ – అపి – అనవేక్ష్య – దోషమ్ ॥

అన్వయక్రమము :– మదాత్ సంపరివార్య వాక్యైః బలాత్ చ తేన ప్రతివార్యమాణైః త్యక్తభయైః తైః సమేత్య, దోషం చ అపి అనవేక్ష్య సః ప్రధర్షితః ప్రకృష్యతే చ.

ప్రతిపదార్థము :– మదాత్ = మదమువలన, సంపరివార్య = చుట్టును మూగి, వాక్యైః = మాటలతోడను, బలాత్ చ = బలమువలనను, తేన = వానిచే,

ప్రతివార్యమాణైః = అడ్డగింపబడుచున్న వారును, త్యక్తభయైః = విడిచిపెట్టబడిన భయముగలవారునగు, తైః = ఆ వానరులచే, ప్రధర్షితః = తిరస్కరింపబడినవాడై, సః = ఆ దధిముఖుడు, దోషమ్ అపి = దోషమునుగూడ, అనవేక్ష్య = చూడకుండ, ప్రకృష్యతే చాపి = ఈడ్వబడు చుండెను గూడను.

తాత్పర్యము :– ఆ దధిముఖుడు కొంతవరకు మాటలతోను, కొంతవరకు దేహబలము తోడను తమ్ము ఎంత అడ్డగించినను ఆ వానరవీరులు మదముచే లెక్కచేయక భయము విడిచి దోషమని ఎంచక అందరును కలసి ఆతనిని గద్దించుచు క్రిందకు పడగొట్టి లాగుచుండిరి.

శ్లో॥ నఖై స్తుదంతో దశనై ర్దశంత
స్తలైశ్చ పాదైశ్చ సమాపయంతః ।
మదా త్కపిం తం కపయ స్సమగ్రా
మహావనం నిర్విషయం చ చక్రుః ॥ 23

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"మధువనప్రవేశో" నామ
ఏకషష్టితమస్సర్గః.

పదచ్ఛేదము :– నఖైః – తుదంతః – దశనైః – దశంతః – తలైః – చ – పాదైః – చ – సమాపయంతః, మదాత్ – కపిం – తం – కపయః – సమగ్రాః – మహావనం – నిర్విషయం – చ – చక్రుః ॥

అన్వయక్రమము :– సమగ్రాః కపయః మదాత్ తం కపిం నఖైః తుదంతః, దశనైః దశంతః తలైః చ పాదైః చ సమాపయంతః, మహావనం నిర్విషయం చక్రుః.

ప్రతిపదార్థము :– సమగ్రాః కపయః = అందరు వానరులును, మదాత్ = మదము వలన, తం కపిం = ఆ దధిముఖుని, నఖైః = గోళ్ళతో, తుదంతః = హింసించుచు, దశనైః = దంతములతో, దశంతః = కరచుచు, తలైః చ = అరచేతులతోడను, పాదైః చ = పాదములతోడను, సమాపయంతః = అంతమొందించుచు, మహావనం = మహావనమైన ఆ మధువనమును, నిర్విషయం = ఒక్క వస్తువు కూడ లేనిదిగా, చక్రుః = చేసిరి.

తాత్పర్యము :– అప్పుడా వానరులెల్లరును మధుపానముచే మత్తిల్లి యున్నవారై ఆ

దధిముఖునిపై బడి తమ గోళ్ళతో రక్కుచు పన్నులతో కరచుచు అరచేతులతో బాదుచు కాళ్ళతో తన్నుచు ఆతనిని చావగొట్టుచున్నవారై మహావనమైన ఆ మధువనమునందు తేనెగాని ఫలములు పుష్పములు మున్నగునవిగాని ఏమియును లేకుండజేసిరి.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"మధువన ప్రవేశము" అను
అరువదియొకటవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

ద్విషష్టితమసర్గ

శ్లో॥ తా నువాచ హరిశ్రేష్ఠో హనుమా న్వానరర్షభః ।
అవ్యగ్రమనసో యూయం మధు సేవత వానరాః ।
అహ మావారయిష్యామి యుష్మాకం పరిపంథినః ॥ 1

పదచ్ఛేదము :- తాన్ - ఉవాచ - హరిశ్రేష్ఠః - హనుమాన్ - వానరర్షభః, అవ్యగ్రమనసః – యూయం – మధు – సేవత – వానరాః, అహమ్ – ఆవారయిష్యామి – యుష్మాకం - పరిపంథినః ॥

అన్వయక్రమము :- వానరర్షభః హరిశ్రేష్ఠః హనుమాన్ తాన్ ఉవాచ. వానరాః! యూయం అవ్యగ్రమనసః (సంతః) మధు సేవత; యుష్మాకం పరిపంథినః అహమ్ ఆవారయిష్యామి.

ప్రతిపదార్థము :- వానరర్షభః = వానరోత్తముడైన, హరిశ్రేష్ఠః హనుమాన్ = కపిశ్రేష్ఠుడగు హనుమ, తాన్ = ఆ వానరులను గూర్చి, ఉవాచ = పలికెను, వానరాః = ఓ వానరులారా!, యూయం = మీరు, అవ్యగ్రమనసః = నిశ్చింతగల మనస్సు గలవారై, మధు = తేనెను, సేవత = సేవింపుడు, యుష్మాకం = మీయొక్క పరిపంథినః = శత్రువులను, అహం = నేను, ఆవారయిష్యామి = నివారించెదను.

తాత్పర్యము :- అప్పుడా వానరశ్రేష్ఠుడైన ఆ హనుమ ఆ వానరులను గూర్చి ఇట్లు పలికెను. ఓ వానరులారా! మీరు నిశ్చింతగా ఇచట మధువును సేవింపుడు. మిమ్ములను అడ్డుకొనెడి శత్రువులను అందరిని నేను నివారించెదను.

శ్లో॥ శ్రుత్వా హనుమతో వాక్యం హరీణాం ప్రవరోఽంగదః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా పిబంతు హరయో మధు ॥ 2

పదచ్ఛేదము :- శ్రుత్వా – హనుమతః – వాక్యం – హరీణాం – ప్రవరః – అంగదః, ప్రత్యువాచ - ప్రసన్నాత్మా - పిబంతు - హరయః - మధు ॥

అన్వయక్రమము :- హనుమతః వాక్యం శ్రుత్వా హరీణాం ప్రవరః అంగదః

ప్రసన్నాత్మా (సన్) ప్రత్యువాచ 'హరయః మధు పిబంతు'.

ప్రతిపదార్థము :– హనుమతః = హనుమయొక్క, వాక్యం = మాటను, శ్రుత్వా = విని, హరీణాం = వానరులలో, ప్రవరః = శ్రేష్ఠుడైన, అంగదః = అంగదుడు, ప్రసన్నాత్మా సన్ = ప్రసన్నమైన మనస్సుగలవాడై, ప్రత్యువాచ = బదులు పలికెను, హరయః = వానరులు, మధు = తేనెను, పిబంతు = త్రాగుదురుగాక.

తాత్పర్యము :– హనుమ చెప్పిన మాటను విని వానరశ్రేష్ఠుడైన అంగదుడు సంతోషము నొందిన మనస్సుతో తిరిగి ఇట్లు పలికెను. "ఈ వానరులు స్వేచ్ఛగా మధువును త్రాగుదురుగాక! వీరి నెవ్వరును అడ్డగింపరాదు".

శ్లో॥ అవశ్యం కృతకార్యస్య వాక్యం హనుమతో మయా ।
అకార్యమపి కర్తవ్యం కి మంగ పున రీదృశమ్ ॥ 3

పదచ్ఛేదము :– అవశ్యం – కృతకార్యస్య – వాక్యం – హనుమతః – మయా, అకార్యమ్ – అపి – కర్తవ్యం – కిమ్ – అంగ – పునః – ఈదృశమ్ ॥

అన్వయక్రమము :– కృతకార్యస్య హనుమతః వాక్యమ్ అకార్యమ్ అపి మయా అవశ్యం కర్తవ్యమ్, అంగ! ఈదృశం కిం పునః (వక్తవ్యమ్?).

ప్రతిపదార్థము :– కృతకార్యస్య = చేయబడిన కార్యము గల్గినట్టి, హనుమతః = హనుమంతునియొక్క, వాక్యం = మాట, అకార్యమ్ అపి = చేయరానిదైనను, మయా = నాచే, అవశ్యం = తప్పక, కర్తవ్యమ్ = చేయవలసినది, అంగ = ఆహా! ఈదృశం = ఇట్టిది, కిం పునః = ఏమి చెప్పవలయును?

తాత్పర్యము :– కార్యము సాధించుకొని వచ్చిన మహాత్ముడైన హనుమయొక్క వచనము చేయకూడనిదైనను నాకు శిరోధార్యమే యగును. అట్టిచో సర్వవానరులకు వాంఛితమైన ఈ విషయ మేల అంగీకారయోగ్యము కాకుండును?

శ్లో॥ అంగదస్య ముఖా చ్ఛ్రుత్వా వచనం వానరర్షభాః ।
సాధు సాధ్వితి సంహృష్టా వానరాః ప్రత్యపూజయన్ ॥ 4

పదచ్ఛేదము :– అంగదస్య – ముఖాత్ – శ్రుత్వా – వచనం – వానరర్షభాః, సాధు – సాధు – ఇతి – సంహృష్టాః – వానరాః – ప్రత్యపూజయన్ ॥

అన్వయక్రమము :– వానరర్షభాః వానరాః అంగదస్య ముఖాత్ వచనం శ్రుత్వా సంహృష్టాః సాధు సాధు ఇతి ప్రత్యపూజయన్.

ప్రతిపదార్థము :- వానరర్షభాః వానరాః = వానరశ్రేష్ఠులైన ఆ కపివీరులు, అంగదస్య = అంగదునియొక్క, ముఖాత్ = నోటినుండి, వచనం = మాటను, శ్రుత్వా = విని, సంప్రహృష్టాః = మిక్కిలి సంతోషించినవారై, సాధు సాధు ఇతి = బాగుబాగని, ప్రత్య పూజయన్ = అభినందించిరి.

తాత్పర్యము :- అప్పుడా వానరశ్రేష్ఠులందరును అంగదుడు పలికిన సంతోషకరమైన ఆ మాటను విని అమితానందము నొందినవారై బాగు బాగని అంగదుని మెచ్చుకొనిరి.

శ్లో॥ పూజయిత్వాంగదం సర్వే వానరా వానరర్షభమ్ ।
జగ్ము ర్మధువనం యత్ర నదీవేగా ఇవ ద్రుతమ్ ॥ 5

పదచ్ఛేదము :- పూజయిత్వా - అంగదం - సర్వే - వానరాః - వానరర్షభమ్ - జగ్ముః - మధువనం - యత్ర - నదీవేగాః - ఇవ - ద్రుతమ్ ॥

అన్వయక్రమము :- సర్వే వానరాః వానరర్షభమ్ అంగదం పూజయిత్వా నదీవేగాః ఇవ ద్రుతం యత్ర మధువనం (తత్ర) జగ్ముః.

ప్రతిపదార్థము :- సర్వే వానరాః = ఎల్లవానరులును, వానరర్షభమ్ అంగదం = వానరశ్రేష్ఠుడైన అంగదుని, పూజయిత్వా = గౌరవించి, నదీవేగాః ఇవ = నదీవేగములవలె, ద్రుతం = వడిగా, యత్ర మధువనం = ఎక్కడ మధువనమున్నదో, తత్ర = అచ్చటికి, జగ్ముః = వెడలిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- "మధువనం జగ్ముః" మధువనమునకు వెడలిరి అని చెప్పుట ఇంకను మధువు సమృద్ధిగా నున్నట్టి ప్రదేశమునకు వెడలిరని భావము. లేక పూర్వము దధిముఖు డెదుర్కొనగా కొంతదూరము ఈవలికి వచ్చి హనుమంతుడును అంగదుడును ధైర్యము చెప్పగా మరల నటకు వెడలిరని చెప్పవచ్చును.

తాత్పర్యము :- ఆ వానరులెల్లరును వానరోత్తముడైన అంగదుని మెచ్చుకొని నదీప్రవాహములవలె మరల వడివడిగా మధువనమునకు పరుగిడిరి.

శ్లో॥ తే ప్రవిష్టా మధువనం పాలా నాక్రమ్య వీర్యతః ।
అతిసర్గాచ్చ పటవో దృష్ట్వా శ్రుత్వా చ మైథిలీమ్ ।
పపు స్సర్వే మధు తదా రసవత్ఫల మాదదుః ॥ 6

పదచ్ఛేదము :- తే - ప్రవిష్టాః - మధువనం - పాలాన్ - ఆక్రమ్య - వీర్యతః,

అతిసర్గాత్ – చ – పటవః – దృష్ట్వా – శ్రుత్వా – చ – మైథిలీమ్, పపుః – సర్వే – మధు – తదా – రసవత్ – ఫలమ్ – ఆదదుః ॥

అన్వయక్రమము :– మైథిలీం దృష్ట్వా శ్రుత్వా చ అతిసర్గాత్ చ పటవః తే సర్వే మధువనం ప్రవిష్టాః వీర్యతః పాలాన్ ఆక్రమ్య మధు పపుః తథా రసవత్ ఫలం ఆదదుః.

ప్రతిపదార్థము :– మైథిలీం = సీతాదేవిని, దృష్ట్వా = చూచి, శ్రుత్వా చ = వినియును, అతిసర్గాత్ చ = అనుజ్ఞవలనను, పటవః = గొప్పబలముగలవారై, మధువనం = మధువనమును, ప్రవిష్టాః = ప్రవేశించినవారై, వీర్యతః = పరాక్రమమువలన, పాలాన్ = వనపాలురను, ఆక్రమ్య = చుట్టుముట్టి, తే సర్వే = ఆ వానరులందరును, మధు = తేనెను, పపుః = త్రాగిరి, తథా = అట్లు, రసవత్ = రసవంతమైన, ఫలం = ఫలములను, ఆదదుః = తినిరి.

తాత్పర్యము :– అప్పుడా వానరులందరును సీతాదేవిని గూర్చి వింటిమి, చూచితిమి అను గర్వముతోను, అంగదుని అనుజ్ఞ పొందితిమను దర్పముతోను తమ శౌర్యమును ప్రదర్శించుచు, వనపాలకులను త్రోసిపుచ్చి మధువనమున ప్రవేశించి స్వేచ్ఛగా మధువును త్రాగిరి మరియు అందలి రసవంతములైన పండ్లను తృప్తిగా భక్షించిరి.

శ్లో॥ ఉత్పత్య చ తత స్సర్వే వనపాలా న్సమాగతాన్ ।
తాడయంతి స్మ శతశ స్సక్తా న్మధువనే తదా ॥ 7

పదచ్ఛేదము :– ఉత్పత్య – చ – తతః – సర్వే – వనపాలాన్ – సమాగతాన్, తాడయంతి – స్మ – శతశః – సక్తాన్ – మధువనే – తదా ॥

అన్వయక్రమము :– తతః సర్వే ఉత్పత్య మధువనే సక్తాన్ సమాగతాన్ వనపాలాన్ తదా శతశః తాడయంతి స్మ.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, సర్వే = ఎల్లరును, ఉత్పత్య = ఎగిరి, మధువనే = మధువనమునందు, సక్తాన్ = ఆసక్తిగలిగియున్నట్టి, సమాగతాన్ = ఎదురుగ వచ్చినవారైన, వనపాలాన్ = వనరక్షకులను, తదా = అప్పుడు, శతశః = పలువిధములుగా, తాడయంతి స్మ = ప్రహరించిరి.

తాత్పర్యము :– అప్పుడా వానరులందరును ఎగురుచు వచ్చి ఆ మధువన రక్షణము నందు నిమగ్నులై యుండి తమ నెదుర్కొనుటకై వచ్చినట్టి వనపాలకులను పలు విధములుగా ప్రహరింప దొడగిరి.

శ్లో॥ మధూని ద్రోణమాత్రాణి బాహుభిః పరిగృహ్యా తే ।
పిబంతి సహితా స్సర్వే నిఘ్నంతి స్మ తథాఽపరే ॥ 8

పదచ్ఛేదము :– మధూని – ద్రోణమాత్రాణి – బాహుభిః – పరిగృహ్య – తే – పిబంతి – సహితాః – సర్వే – నిఘ్నంతి – స్మ – తథా – అపరే ॥

అన్వయక్రమము :– తే సర్వే సహితాః ద్రోణమాత్రాణి మధూని బాహుభిః పరిగృహ్య పిబంతి, తథా అపరే నిఘ్నంతి స్మ.

ప్రతిపదార్థము :– తే = ఆ వానరులు, సర్వే = అందరును, సహితాః = కలిసినవారై, ద్రోణమాత్రాణి = తూమెడు పరిమాణము గల్గినట్టి, మధూని = మధుకోశములను, బాహుభిః = బాహువులతో, పరిగృహ్య = వెలుపలికి లాగి, పిబంతి స్మ = త్రాగుచుండిరి, తథా = అట్లు, అపరే = మరికొంతమంది, నిఘ్నంతి స్మ = ప్రహరించుచుండిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– 'అపరే నిఘ్నంతి స్మ' అనగా మరి కొందరు త్రాగగా మిగిలిన ఆ తేనెపట్టులను చిదిమివేయుచుండిరని భావము.

తాత్పర్యము :– ఆ వానరులందరును కలసి ఆ వనమునందున్న పెద్ద పెద్ద తేనెపట్టులను తమ బాహువులతో చెట్లనుండి క్రిందికి దింపి అందలి మధువును త్రాగుచుండగా మరి కొందరు తమను వారింపవచ్చిన వనరక్షకులతో పోరాడుచుండిరి.

శ్లో॥ కేచి త్పీత్వాపవిధ్యంతి మధూని మధుపింగళాః ।
మధూచ్ఛిష్టేన కేచిచ్చ జఘ్ను రన్యోన్య ముత్కటాః ॥ 9

పదచ్ఛేదము :– కే – చిత్ – పీత్వా – అపవిధ్యంతి – మధూని – మధుపింగళాః – మధూచ్ఛిష్టేన – కేచిత్ – చ – జఘ్నుః – అన్యోన్యమ్ – ఉత్కటాః ॥

అన్వయక్రమము :– కేచిత్ మధుపింగళాః మధూని పీత్వా అపవిధ్యంతి. ఉత్కటాః కేచిత్ మధూచ్ఛిష్టేన అన్యోన్యం జఘ్నుః.

ప్రతిపదార్థము :– మధుపింగళాః = తేనెవన్నెగల, కేచిత్ = కొంతమంది, మధూని = తేనెలను, పీత్వా = త్రాగి, అపవిధ్యంతి = పారవేయుచుండిరి, కేచిత్ = మరికొంతమంది, ఉత్కటాః = మదించినవారై, మధూచ్ఛిష్టేన = మైనముతో, అన్యోన్యం = పరస్పరము, జఘ్నుః = కొట్టుకొనుచుండిరి.

తాత్పర్యము :– పచ్చని తేనెవన్నెగల కొందరు వానరులు తేనెలను త్రాగి తేనె పట్టులను

పారవైచుచుండిరి. మరికొందరు మదించి యున్నవారై ఆ తేనెపట్టునందలి మైనముతో ఒకరి నొకరు కొట్టుకొనుచుండిరి.

శ్లో॥ అపరే వృక్షమూలే తు శాఖాం గృహ్య వ్యవస్థితాః ।
అత్యర్థం చ మదగ్లానాః పర్ణా న్యాస్తీర్య శేరతే ॥ 10

పదచ్ఛేదము :– అపరే – వృక్షమూలే – తు – శాఖాం – గృహ్య – వ్యవస్థితాః, అత్యర్థం – చ – మదగ్లానాః – పర్ణాని – ఆస్తీర్య – శేరతే ॥

అన్వయక్రమము :– అపరే శాఖాం గృహ్య వృక్షమూలే వ్యవస్థితాః, (అన్యే) అత్యర్థం మదగ్లానాః పర్ణాని ఆస్తీర్య శేరతే.

ప్రతిపదార్థము :– అపరే = మరికొందరు, శాఖాం = కొమ్మను, గృహ్య = పట్టుకొని, వృక్షమూలే = చెట్టుమొదట, వ్యవస్థితాః = నిలచియుండిరి, (అన్యే = ఇతరులు), అత్యర్థం = మిక్కిలిగా, మదగ్లానాః = మత్తుచే డస్సినవారై, పర్ణాని = ఆకులను, ఆస్తీర్య = పరచుకొని, శేరతే = నిద్రించుచుండిరి.

తాత్పర్యము :– వారిలో కొందరు కొమ్మలను పట్టుకొని చెట్లమొదళ్ళలో నిలచి యుండిరి. మరికొందరు మిక్కిలి మదించి అలసి నేలపై ఆకులను పరచుకొని వాటిపై పరుండిరి.

శ్లో॥ ఉన్మత్తభూతాః ప్లవగా మధుమత్తాశ్చ హృష్టవత్ ।
క్షిపంతి చ తదాఽన్యోన్యం స్ఖలంతి చ తథాఽపరే ॥ 11

పదచ్ఛేదము :– ఉన్మత్తభూతాః – ప్లవగాః – మధుమత్తాః – చ – హృష్టవత్, క్షిపంతి – చ – తదా – అన్యోన్యం – స్ఖలంతి – చ – తథా – అపరే ॥

అన్వయక్రమము :– ప్లవగాః ఉన్మత్తభూతాః మధుమత్తాః చ హృష్టవత్ తదా అన్యోన్యం క్షిపంతి తథా అపరే స్ఖలంతి.

ప్రతిపదార్థము :– ప్లవగాః = వానరులు, ఉన్మత్తభూతాః = ఉన్మత్తప్రాయులై, మధుమత్తాః = తేనెలచే మత్తిల్లినవారై, హృష్టవత్ = సంతోషించినట్లుగా, తదా = అప్పుడు, అన్యోన్యం = ఒకరినొకరు, క్షిపంతి = త్రోసికొనుచుండిరి, తథా = అట్లు, అపరే = మరికొందరు, స్ఖలంతి చ = తూలుచుండిరిగూడను.

తాత్పర్యము :– ఆ వానరులు పిచ్చి ఎక్కినవారివలె మధుపానముచే మత్తెక్కి ఆనందావేశమునొంది ఒకరినొకరు త్రోసికొనుచుండిరి. మరికొందరు నడచుచు తూలిపోవుచుండిరి.

శ్లో॥ కేచిత్ క్ష్వేళాం ప్రకుర్వంతి కేచి త్కూజంతి హృష్టవత్ ।
హరయో మధునా మత్తాః కేచి త్సుప్తా మహీతలే ॥ 12

పదచ్ఛేదము :– కేచిత్ – క్ష్వేళాం – ప్రకుర్వంతి – కేచిత్ – కూజంతి – హృష్టవత్, హరయః – మధునా – మత్తాః – కేచిత్ – సుప్తాః – మహీతలే ॥

అన్వయక్రమము :– హరయః కేచిత్ క్ష్వేళాం ప్రకుర్వంతి, కేచిత్ హృష్టవత్ కూజంతి, మధునా మత్తాః కేచిత్ మహీతలే సుప్తాః.

ప్రతిపదార్థము :– మధునా = తేనెచేత, మత్తాః = మత్తెక్కిన వారైన, హరయః = వానరులు, కేచిత్ = కొంతమంది, క్ష్వేళాం = గర్జనమును, ప్రకుర్వంతి = చేయుచుండిరి, కేచిత్ = కొంతమంది, హృష్టవత్ = సంతోషించినట్లు, కూజంతి = కూయుచుండిరి, కేచిత్ = కొంతమంది, మహీతలే = నేలపై, సుప్తాః = నిద్రించి యుండిరి.

తాత్పర్యము :– మధుపానముచే మత్తెక్కియున్న ఆ వానరులలో కొందరు సింహగర్జనములు చేయుచుండిరి. మరికొంద రానందావేశముతో పక్షులవలె కూయుచుండిరి. మరికొందరు నేలపైబడి నిద్రించుచుండిరి.

శ్లో॥ కృత్వా కేచి ద్ధసం త్యన్యే కేచి త్కుర్వంతి చేతరత్ ।
కృత్వా కించి ద్వదం త్యన్యే కేచి ద్బుధ్యంతి చేతరత్ ॥ 13

పదచ్ఛేదము :– కృత్వా – కేచిత్ – హసంతి – అన్యే – కేచిత్ – కుర్వంతి – చ – ఇతరత్, కృత్వా – కించిత్ – వదంతి – అన్యే – కేచిత్ – బుధ్యంతి – చ – ఇతరత్ ॥

అన్వయక్రమము :– కేచిత్ కృత్వా హసంతి, అన్యే కేచిత్ ఇతరత్ కుర్వంతి, కేచిత్ కృత్వా వదంతి, అన్యే కేచిత్ ఇతరత్ బుధ్యంతి.

ప్రతిపదార్థము :– కేచిత్ = కొంతమంది, కృత్వా = చేసి, హసంతి = నవ్వుచుండిరి, అన్యే కేచిత్ = మరికొంతమంది, ఇతరత్ = ఇంకొకటి, కుర్వంతి = చేయుచుండిరి, కేచిత్ = కొంతమంది, కృత్వా = చేసి, వదంతి = చెప్పుచుండిరి, అన్యే కేచిత్ = మరికొంతమంది, ఇతరత్ బుధ్యంతి = వేరొకటి తలచుచుండిరి.

తాత్పర్యము :– ఆ వానరులలో కొందరు గ్రామ్యకృత్యమును చేసి నవ్వుచుండిరి. మరికొందరు మరియొకరీతిని గ్రామ్యధర్మమును చేయుచుండిరి. మరికొంద రట్టిపనినే చేసి దానిని ఘనముగ చెప్పుకొనుచుండిరి. మరికొందరు వేరొకరీతి పని చేయవలెనని తలచుచుండిరి.

శ్లో॥ యే ఽ ప్యత్ర మధుపాలా స్స్యుః ప్రేష్యా దధిముఖస్య తు ।
తేఽ పి తై ర్వానరై ర్భీమైః ప్రతిషిద్ధా దిశో గతాః ॥ 14

పదచ్ఛేదము :– యే – అపి – అత్ర – మధుపాలాః – స్యుః – ప్రేష్యాః – దధిముఖస్య – తు – తే – అపి – తైః – వానరైః – భీమైః – ప్రతిషిద్ధాః – దిశః – గతాః ॥

అన్వయక్రమము :– దధిముఖస్య ప్రేష్యాః అత్ర యే మధుపాలాః స్యుః తే అపి తైః భీమైః వానరైః ప్రతిషిద్ధాః దిశః గతాః.

ప్రతిపదార్థము :– దధిముఖస్య = దధిముఖునియొక్క, ప్రేష్యాః = సేవకులైన, యే మధుపాలాః = ఏ మధువనరక్షకులైతే, అత్ర = ఈ వనమున, స్యుః = ఉందురో, తే అపి = వారును, తైః = ఆ, భీమైః = భయంకరులైన, వానరైః = వానరులచే, ప్రతిషిద్ధాః = వారింపబడినవారై, దిశః = దిక్కులను గూర్చి, గతాః = పోయినారు.

తాత్పర్యము :– ఈ మధువనమునందు దధిముఖుని సేవకులైనట్టి వనరక్షకుల నందరిని, ఆ భయంకరులైన వానరులు నలుదిక్కులకును తరిమివేసిరి.

శ్లో॥ జానుభిస్తు ప్రకృష్టాశ్చ దేవమార్గం చ దర్శితాః ।
అబ్రువన్ పరమోద్విగ్నా గత్వా దధిముఖం కపిమ్ ॥ 15

పదచ్ఛేదము :– జానుభిః – తు – ప్రకృష్టాః – చ – దేవమార్గం – చ – దర్శితాః – అబ్రువన్ – పరమోద్విగ్నాః – గత్వా – దధిముఖం – కపిమ్ ॥

అన్వయక్రమము :– జానుభిః ప్రకృష్టాః దేవమార్గం దర్శితాః చ (సంతః) పరమోద్విగ్నాః (తే) దధిముఖం కపిం గత్వా అబ్రువన్.

ప్రతిపదార్థము :– జానుభిః = మోకాళ్ళతో, ప్రకృష్టాః = పొడవబడినవారై, దేవమార్గం = పృష్ఠభాగమును, దర్శితాః చ (సంతః) = చూపబడినవారగుచును, పరమోద్విగ్నాః = మిక్కిలి వ్యాకులత నొందినవారైన, తే = ఆ వనపాలకులు, దధిముఖం కపిం = దధిముఖ వానరుని గూర్చి, గత్వా = పోయి, అబ్రువన్ = పలికిరి.

సూచన :– 'దేవమార్గం దర్శితాః' అనగా ఆకాశముమీదికి విసరి వేయబడిరి. అని భావముగా కొందరు వివరించి యున్నారు.

తాత్పర్యము :– ఆ వనరక్షకులను ఈ వానరవీరులు మోకాళ్ళతో పొడిచియు పృష్ఠభాగమును జూపియు, అవమానింపగా వారు మిక్కిలి వ్యాకులత నొందినవారై దధిముఖుని కడకుపోయి ఇట్లు పలికిరి.

శ్లో॥ హనూమతా దత్తవరై ర్హతం మధువనం మహత్ ।
వయం చ జానుభిః కృష్టా దేవమార్గం చ దర్శితాః ॥ 16

పదచ్ఛేదము :- హనూమతా - దత్తవరైః - హతం - మధువనం - మహత్, వయం - చ - జానుభిః - కృష్టాః - దేవమార్గం - చ - దర్శితాః ॥

అన్వయక్రమము :- హనూమతా దత్తవరైః తైః మహత్ మధువనం హతమ్, వయం చ జానుభిః కృష్టాః దేవమార్గం దర్శితాః చ.

ప్రతిపదార్థము :- హనూమతా = హనుమంతునిచే, దత్తవరైః = ఈయబడిన యనుజ్ఞ గలవారయిన, తైః = ఆ వానరులచే, మహత్ = గొప్పదైన, మధువనం = మధువనము, హతం = ధ్వంసము చేయబడినది, వయం చ = మేమును, జానుభిః = మోకాళ్ళతో, కృష్టాః = పొడువబడితిమి. దేవమార్గం = పృష్ఠభాగమును, దర్శితాః చ = చూపబడితిమి కూడను.

తాత్పర్యము :- హనుమంతుడు వారి కనుజ్ఞనీయగా గొప్పదైన మన మధువనము నంతను ధ్వంసము చేసినారు. వారు మమ్ము మోకాళ్ళతో బొడిచియు పృష్ఠభాగమును జూపియు చాలా అవమానించినారు.

శ్లో॥ తతో దధిముఖః క్రుద్ధో వనప స్తత్ర వానరః ।
హతం మధువనం శ్రుత్వా సాంత్వయామాస తా న్హరీన్ ॥ 17

పదచ్ఛేదము :- తతః - దధిముఖః - క్రుద్ధః - వనపః - తత్ర - వానరః, హతం - మధువనం - శ్రుత్వా - సాంత్వయామాస - తాన్ - హరీన్ ॥

అన్వయక్రమము :- తతః తత్ర వనపః దధిముఖః వానరః మధువనం హతం శ్రుత్వా తాన్ హరీన్ సాంత్వయామాస.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, తత్ర = అచ్చట, వనపః = వనరక్షకుడయిన, దధిముఖః వానరః = దధిముఖ వానరుడు, మధువనం = మధువనమును, హతం = ధ్వంసముచేయబడిన దానినిగా, శ్రుత్వా = విని, తాన్ హరీన్ = ఆ వానరులను, సాంత్వయామాస = ఓదార్చెను.

తాత్పర్యము :- అప్పుడు మధువనమున కధికారియైన ఆ దధిముఖుడు క్రోధితుడై తన మధువనము ధ్వంసము చేయబడినట్లు దీనులై చెప్పుచున్న ఆ వానరులను భయముదీర్చి ఓదార్చెను.

శ్లో॥ ఇహా ఉ_ఉ_గచ్ఛత గచ్ఛామో వానరాన్ బలదర్పితాన్ ।
బలేన వారయిష్యామో మధు భక్షయతో వయమ్ ॥ 18

పదచ్ఛేదము :– ఇహ – ఆగచ్ఛత – గచ్ఛామః – వానరాన్ – బలదర్పితాన్, బలేన – వారయిష్యామః – మధు – భక్షయతః – వయమ్ ॥

అన్వయక్రమము :– ఇహ ఆగచ్ఛత, గచ్ఛామః; బలదర్పితాన్ మధు భక్షయతః వానరాన్ వయం బలేన వారయిష్యామః.

ప్రతిపదార్థము :– ఇహ = ఇటు, ఆగచ్ఛత = రండు, గచ్ఛామః = పోవుదము, బలదర్పితాన్ = బలముచే మదించినవారై, మధు = తేనెను, భక్షయతః = భక్షించుచున్నట్టి, వానరాన్ = వానరులను, వయం = మనము, బలేన = బలముతో, వారయిష్యామః = పారద్రోలుదము.

తాత్పర్యము :– ఇటురండు; మనమందరమును కలసి వెడలి బలముచే మదించి మధుపానము చేయుచున్న ఆ వానరులను మనబలము జూపి తరిమి వేయుదము.

శ్లో॥ శ్రుత్వా దధిముఖ స్యేదం వచనం వానరర్షభాః ।
పున ర్వీరా మధువనం తేనైవ సహితా యయుః ॥ 19

పదచ్ఛేదము :– శ్రుత్వా – దధిముఖస్య – ఇదం – వచనం – వానరర్షభాః, పునః – వీరాః – మధువనం – తేన – ఏవ – సహితాః – యయుః ॥

అన్వయక్రమము :– వీరాః వానరర్షభాః దధిముఖస్య ఇదం వచనం శ్రుత్వా తేన ఏవ సహితాః పునః మధువనం యయుః.

ప్రతిపదార్థము :– వీరాః = వీరులైనట్టి, వానరర్షభాః = వానరశ్రేష్ఠులు, దధిముఖస్య = దధిముఖునియొక్క, ఇదం = ఈ, వచనం = మాటను, శ్రుత్వా = విని, తేన ఏవ = అతని తోడనే, సహితాః = కూడినవారై, పునః = తిరిగి, మధువనం = మధువనమును గూర్చి, యయుః = వెడలిరి.

తాత్పర్యము :– దధిముఖుడు చెప్పిన ఆ మాటలను విని వీరులైన ఆ వానరులు అతడే తమతో వచ్చుచున్నాడను ధైర్యముతో తిరిగి మధువనమున కేగిరి.

శ్లో॥ మధ్యే చైషాం దధిముఖః ప్రగృహ్య తరసా తరుమ్ ।
సమభ్యధావ ద్వేగేన తే చ సర్వే ప్లవంగమాః ॥ 20

పదచ్ఛేదము :– మధ్యే – చ – ఏషాం – దధిముఖః – ప్రగృహ్య – తరసా –

తరుమ్, సమభ్యధావత్ – వేగేన – తే – చ – సర్వే – ప్లవంగమాః ॥

అన్వయక్రమము :– ఏషాం మధ్యే దధిముఖః తరసా తరుం ప్రగృహ్యా వేగేన సమభ్యధావత్, తే ప్లవంగమాః చ (అధావన్).

ప్రతిపదార్థము :– ఏషాం = ఆ వానరులయొక్క, మధ్యే = నడుమ, దధిముఖః = దధిముఖుడు, తరసా = బలముతో, తరుం = వృక్షమును, ప్రగృహ్యా = పట్టుకొని, వేగేన = వేగముగా, సమభ్యధావత్ = ఎదురుగ పరుగిడెను, తే = ఆ, ప్లవంగమాః = వానరులు, సర్వే చ = అందరునుగూడ, (అధావన్ = పరుగెత్తిరి).

తాత్పర్యము :– ఆ వానరుల నడుమనున్న దధిముఖుడు ఒక చెట్టును బలముగ పెకలించి దానిని గైకొని మధువనమువైపునకు పరుగెత్తెను. ఆతని అనుచరులు గూడ అట్లే వానివెంట పరుగిడిరి.

శ్లో॥ తే శిలాః పాదపాంశ్చాపి పర్వతాం శ్చాపి వానరాః ।
గృహీత్వా ఽభ్యగమన్ క్రుద్ధా యత్ర తే కపికుంజరాః ॥ 21

పదచ్ఛేదము :– తే – శిలాః – పాదపాన్ – చ – అపి – పర్వతాన్ – చ – అపి – వానరాః, గృహీత్వా – అభ్యగమన్ – క్రుద్ధాః – యత్ర – తే – కపికుంజరాః ॥

అన్వయక్రమము :– తే వానరాః శిలాః పాదపాన్ చ అపి గృహీత్వా క్రుద్ధాః తే కపికుంజరాః యత్ర (సంతి) తత్ర అభ్యగమన్.

ప్రతిపదార్థము :– తే వానరాః = ఆ వానరులు, శిలాః = రాళ్ళను, పాదపాన్ చ అపి = వృక్షములను, పర్వతాన్ చ అపి = పర్వతములను గూడ, గృహీత్వా = తీసికొని, క్రుద్ధాః = క్రోధము నొందినవారై, తే కపికుంజరాః = ఆ వానర శ్రేష్ఠులు, యత్ర = ఎచ్చటనైతే, (సంతి = ఉన్నారో), తత్ర = అచ్చటికి, అభ్యగమన్ = పరుగెత్తిరి.

తాత్పర్యము :– వనరక్షకులైన ఆ వానరులు శిలలను, వృక్షములను పర్వతములను గూడ పట్టుకొని మిక్కిలి క్రోధముతో అంగదాది వానరులున్న చోటికి పరుగున వెడలిరి.

శ్లో॥ తే స్వామివచనం వీరా హృదయే ష్వవసజ్య తత్ ।
త్వరయా హ్యభ్యధావంత సాలతాలశిలాయుధాః ॥ 22

పదచ్ఛేదము :– తే – స్వామివచనం – వీరాః – హృదయేషు – అవసజ్య – తత్, త్వరయా – హి – అభ్యధావంత – సాలతాలశిలాయుధాః ॥

అన్వయక్రమము :– తే వీరాః స్వామివచనం హృదయేషు అవసజ్య సాలతాల

శిలాయుధాః (సంతః) త్వరయా తత్ అభ్యధావంత.

ప్రతిపదార్థము :– తే వీరాః = ఆ వానరవీరులు, స్వామివచనం = యజమాని మాటను, హృదయేషు = మనస్సులందు, అవసజ్య = నిలుపుకొని, సాలతాల శిలాయుధాః (సంతః) = మద్దిచెట్లను, తాటిచెట్లను, శిలలను ఆయుధములుగా గలవారయి, త్వరయా = వేగముగా, తత్ = ఆ వనమునుగూర్చి, అభ్యధావంత = పరుగిడిరి.

తాత్పర్యము :– వనరక్షకులయిన ఆ వానరవీరులు దధిముఖుడు చెప్పిన మాటను మనస్సునం దుంచుకొని మద్దిచెట్లను, తాడిచెట్లను, రాళ్ళను ఆయుధములుగ చేసికొని ఆ మధువనమునకు వేగముగా పరుగిడిరి.

శ్లో॥ వృక్షస్థాంశ్చ తలస్థాంశ్చ వానరాన్ బలదర్పితాన్ ।
అభ్యక్రామం స్తతో వీరాః పాలా స్తత్ర సహస్రశః ॥ 23

పదచ్ఛేదము :– వృక్షస్థాన్ – చ – తలస్థాన్ – చ – వానరాన్ – బలదర్పితాన్, అభ్యక్రామన్ – తతః – వీరాః – పాలాః – తత్ర – సహస్రశః ॥

అన్వయక్రమము :– సహస్రశః వీరాః పాలాః తతః తత్ర వృక్షస్థాన్ చ తలస్థాన్ చ బలదర్పితాన్ వానరాన్ అభ్యక్రామన్.

ప్రతిపదార్థము :– సహస్రశః = వేలకొలది, వీరాః = వీరులైనట్టి, పాలాః = వనపాలురు, తతః = అటుపిమ్మట, తత్ర = అచ్చట, వృక్షస్థాన్ = చెట్లపైనున్న, తలస్థాన్ చ = నేలపై నున్నవారును, బలదర్పితాన్ = బలముచే మదించియున్నవారునగు, వానరాన్ = వానరులగు, అభ్యక్రామన్ = ఆక్రమించిరి.

తాత్పర్యము :– వేలకొలదిగనున్న వీరులైన ఆ వనపాలకులు ఆ వనమునందు చెట్లమీదను నేలమీదను బలదర్పితులై విహరించుచున్న అంగదాది వీరులను చుట్టుముట్టిరి.

శ్లో॥ అథ దృష్ట్వా దధిముఖం క్రుద్ధం వానరపుంగవాః ।
అభ్యధావంత వేగేన హనుమత్ప్రముఖా స్తదా ॥ 24

పదచ్ఛేదము :– అథ – దృష్ట్వా – దధిముఖం – క్రుద్ధం – వానరపుంగవాః, అభ్యధావంత – వేగేన – హనుమత్ప్రముఖాః – తదా ॥

అన్వయక్రమము :– అథ హనుమత్ప్రముఖాః వానరపుంగవాః క్రుద్ధం దధిముఖం తదా దృష్ట్వా వేగేన అభ్యధావంత.

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, హనుమత్ప్రముఖాః = హనుమంతుడాదిగా గల, వానరపుంగవాః = వానరశ్రేష్ఠులు, తదా = అప్పుడు, క్రుద్ధం = క్రోధము నొందిన, దధిముఖం = దధిముఖుని, దృష్ట్వా = చూచి, వేగేన = వేగముగా, అభ్యధావంత = ఎదురుగా పరుగెత్తిరి.

తాత్పర్యము :– హనుమంతుడు మున్నగు ఆ వానరవీరులు ఆ సమయమున క్రోధముతో వచ్చుచున్న దధిముఖుని జూచి వెంటనే ఆతని మీదికి పరుగెత్తిరి.

శ్లో॥ తం సవృక్షం మహాబాహు మాపతంతం మహాబలమ్ ।
ఆర్యకం ప్రాహర త్తత్ర బాహుభ్యాం కుపితోఽంగదః ॥ 25

పదచ్ఛేదము :– తం – సవృక్షం – మహాబాహుం – ఆపతంతం – మహాబలమ్, ఆర్యకం – ప్రాహరత్ – తత్ర – బాహుభ్యాం – కుపితః – అంగదః ॥

అన్వయక్రమము :– మహాబాహుం మహాబలం సవృక్షమ్ ఆపతంతం తమ్ ఆర్యకం తత్ర కుపితః అంగదః బాహుభ్యాం ప్రాహరత్.

ప్రతిపదార్థము :– మహాబాహుం = గొప్పభుజములు గలవాడును, మహాబలం = గొప్పబలముగలవాడును, సవృక్షం = వృక్షముతోడ, ఆపతంతం = మీదికి వచ్చుచున్న వాడునగు, తమ్ ఆర్యకం = ఆ దధిముఖుని, కుపితః = కోపము నొందియున్న, అంగదః = అంగదుడు, బాహుభ్యాం = భుజములతో, ప్రాహరత్ = మోదెను.

తాత్పర్యము :– మహాబలశాలియు మహావీరుడును పూజనీయుడును అగు దధిముఖుడు వృక్షమును చేతబట్టి తన మీదికి వచ్చుచుండుట చూచి క్రోధము నొందిన అంగదుడు వానిని తన బాహువులతో మోదెను.

శ్లో॥ మదాంధశ్చ న వే దైనమ్ ఆర్యకో ఽయం మమేతి సః ।
అ థైనం నిష్పిపే షాశు వేగవ ద్వసుధాతలే ॥ 26

పదచ్ఛేదము :– మదాంధః – చ – న – వేద – ఏనమ్ – ఆర్యకః – అయం – మమ – ఇతి – సః – అథ – ఏనం – నిష్పిపేష – ఆశు – వేగవత్ – వసుధాతలే ॥

అన్వయక్రమము :– మదాంధః సః అయం ఆర్యకః మమ ఇతి ఏవం న వేద, అథ ఏనం వసుధాతలే వేగవత్ ఆశు నిష్పిపేష.

ప్రతిపదార్థము :– మదాంధః = మదముచే గ్రుడ్డివాడయిన, సః = ఆ అంగదుడు, అయం = ఈతడు, మమ = నాకు, ఆర్యకః = పూజ్యబంధువు, ఇతి = అని, ఏనం = ఈతనినిగూర్చి, న వేద = తెలిసికొనలేదు, అథ = పిమ్మట, ఏనం = వీనిని,

వసుధాతలే = నేలపై, ఆశు = వెంటనే, వేగవత్ = వేగముగా, నిష్పిపేష = నలిపివేసెను.

తాత్పర్యము :- మద్యముమత్తుచే కన్నుగానకయున్న ఆ అంగదుడు ఈ దధిముఖుడు నాకు పూజ్యుడైన బంధువని ఏమియు తెలిసికొనక ఆతనిని నేలపై బడవైచి క్రుమ్ముచు నలిపివేసెను.

శ్లో॥ స భగ్నబాహూరుభుజో విహ్వల శ్శోణితోక్షితః ।
ముమోహ సహసా వీరో ముహూర్తం కపికుంజరః ॥ 27

పదచ్ఛేదము :- సః - భగ్నబాహూరుభుజః - విహ్వలః - శోణితోక్షితః - ముమోహ - సహసా - వీరః - ముహూర్తం - కపికుంజరః ॥

అన్వయక్రమము :- భగ్నబాహూరుభుజః శోణితోక్షితః విహ్వలః సః వీరః కపికుంజరః సహసా ముహూర్తం ముమోహ.

ప్రతిపదార్థము :- భగ్నబాహూరుభుజః = విరిగిన బాహువులును తొడలును, భుజములును గలవాడును, శోణితోక్షితః = నెత్తురుతో తడిసిన వాడును, విహ్వలః = స్పృహతప్పినవాడునగు, సః = ఆ, వీరః = వీరుడైన, కపికుంజరః = వానరశ్రేష్ఠుడైన దధిముఖుడు, సహసా = వెంటనే, ముహూర్తం = కొద్దికాలము, ముమోహ = మూర్ఛితుడయ్యెను.

తాత్పర్యము :- అప్పుడు మహావీరుడైన దధిముఖుడు తన భుజములును, తొడలును, చేతులును విరుగగా రక్తముతో తడిసి స్పృహను గోల్పోయి వెంటనే కొద్దిసేపు మూర్ఛ నొందెను.

శ్లో॥ స సమాశ్వస్య సహసా సంక్రుద్ధో రాజమాతులః ।
వానరా న్వారయామాస దండేన మధుమోహితాన్ ॥ 28

పదచ్ఛేదము :- సః - సమాశ్వస్య - సహసా - సంక్రుద్ధః - రాజమాతులః, వానరాన్ - వారయామాస - దండేన - మధుమోహితాన్ ॥

అన్వయక్రమము :- రాజమాతులః సః సహసా సమాశ్వస్య సంక్రుద్ధః (సన్) మధుమోహితాన్ వానరాన్ దండేన వారయామాస.

ప్రతిపదార్థము :- రాజమాతులః = రాజగు సుగ్రీవునకు మేనమామయైనట్టి, సః = ఆ దధిముఖుడు, సహసా = వెంటనే, సమాశ్వస్య = తెప్పరిల్లి, మధుమోహితాన్ = తేనెలచే మత్తిల్లియున్నట్టి, వానరాన్ = వానరులను, దండేన = దండముతో, వారయామాస = నివారించెను.

తాత్పర్యము :– సుగ్రీవునకు మేనమామయైన ఆ దధిముఖుడు వెంటనే మూర్ఛనుండి తేరుకొని మధుపానముచే మత్తులైయున్న ఆ వానరులను ఒక కఱ్ఱ తీసికొని తరుమ దొడగెను.

శ్లో॥ స కథంచి ద్విముక్త స్తై ర్వానరై ర్వానరర్షభః ।
ఉవాచైకాంతమాశ్రిత్య భృత్యా న్స్వా న్సముపాగతాన్ ॥ 29

పదచ్ఛేదము :– సః – కథంచిత్ – విముక్తః – తైః – వానరైః – వానరర్షభః, ఉవాచ – ఏకాంతమ్ – ఆశ్రిత్య – భృత్యాన్ – స్వాన్ – సముపాగతాన్ ॥

అన్వయక్రమము :– సః వానరర్షభః కథంచిత్ తైః వానరైః విముక్తః (సన్) సముపాగతాన్ స్వాన్ భృత్యాన్ ఏకాంతమ్ ఆశ్రిత్య ఉవాచ.

ప్రతిపదార్థము :– సః = ఆ, వానరర్షభః = వానరశ్రేష్ఠుడైన దధిముఖుడు, కథంచిత్ = ఎట్లో, తైః = ఆ, వానరైః = వానరులచే, విముక్తః = విడువబడినవాడై, సముపాగతాన్ = సమీపించినట్టి, స్వాన్ భృత్యాన్ = తన భటులను గూర్చి, ఏకాంతమ్ ఆశ్రిత్య = రహస్యప్రదేశమును చేరి, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :– ఆ దధిముఖుడు ఎట్లో అంగదాది వానరులనుండి తప్పించుకొని రహస్యప్రదేశమునకు చేరి తనకడకు చేరినట్టి తన బంటులతో ఇట్లు పలికెను.

శ్లో॥ ఏతే తిష్ఠంతు గచ్ఛామో భర్తా నో యత్ర వానరః ।
సుగ్రీవో విపులగ్రీవ స్సహ రామేణ తిష్ఠతి ॥ 30

పదచ్ఛేదము :– ఏతే – తిష్ఠంతు – గచ్ఛామః – భర్తా – నః – యత్ర – వానరః, సుగ్రీవః – విపులగ్రీవః – సహ – రామేణ – తిష్ఠతి ॥

అన్వయక్రమము :– ఏతే తిష్ఠంతు; యత్ర నః భర్తా విపులగ్రీవః సుగ్రీవః వానరః రామేణ సహ తిష్ఠతి (తత్ర) గచ్ఛామః.

ప్రతిపదార్థము :– ఏతే = వీరు, తిష్ఠంతు = ఉందురుగాక! యత్ర = ఎచ్చటనైతే, నః = మనయొక్క, భర్తా = ప్రభువైనట్టి, విపులగ్రీవః = స్థూలమైన కంఠము గలిగినట్టి, సుగ్రీవః వానరః = సుగ్రీవవానరుడు, రామేణ సహ = శ్రీరామునితోగూడ, తిష్ఠతి = ఉండునో, (తత్ర = అచ్చటికి), గచ్ఛామః = పోవుదము.

తాత్పర్యము :– ఈ వానరుల నిక్కడ నుండనిండు; మహావీరుడైన మన ప్రభువు సుగ్రీవుడు శ్రీరామునితో కలిసి కొలువుదీరియున్న చోటికి మనమిప్పుడే పోవుదము.

శ్లో॥ సర్వం చై వాంగదే దోషం శ్రావయిష్యామి పార్థివే ।
అమర్షీ వచనం శ్రుత్వా ఘాతయిష్యతి వానరాన్ ॥ 31

పదచ్ఛేదము :– సర్వం – చ – ఏవ – అంగదే – దోషం – శ్రావయిష్యామి – పార్థివే, అమర్షీ – వచనం – శ్రుత్వా – ఘాతయిష్యతి – వానరాన్ ॥

అన్వయక్రమము :– అంగదే సర్వం దోషం చైవ పార్థివే శ్రావయిష్యామి, అమర్షీ (సః) వచనం శ్రుత్వా వానరాన్ ఘాతయిష్యతి.

ప్రతిపదార్థము :– అంగదే = అంగదునియందలి, దోషం సర్వం చైవ = దోషము సర్వమును, పార్థివే = రాజైన సుగ్రీవునికడ, శ్రావయిష్యామి = వినిపించెదను, అమర్షీ = క్రోధముగలవాడయిన, (సః = ఆ సుగ్రీవుడు), వచనం శ్రుత్వా = మాటను విని, వానరాన్ = వానరులను, ఘాతయిష్యతి = కొట్టించగలడు.

తాత్పర్యము :– నే నా మహారాజుకడ కేగి ఈ మధువనధ్వంసమునకు కారణము అంతయు అంగదుడే యని తెలియపరచెదను. అత డా మాటలు విని తప్పక క్రోధము నొంది ఈ వానరుల నందరిని చావగొట్టించును.

శ్లో॥ ఇష్టం మధువనం హ్యేత త్సుగ్రీవస్య మహాత్మనః ।
పితృపైతామహం దివ్యం దేవైరపి దురాసదమ్ ॥ 32

పదచ్ఛేదము :– ఇష్టం – మధువనం – హి – ఏతత్ – సుగ్రీవస్య – మహాత్మనః, పితృపైతామహం – దివ్యం – దేవైః – అపి – దురాసదమ్ ॥

అన్వయక్రమము :– పితృపైతామహం దివ్యం దేవైః అపి దురాసదమ్ ఏతత్ మధువనం మహాత్మనః సుగ్రీవస్య ఇష్టం హి.

ప్రతిపదార్థము :– పితృపైతామహం = తండ్రి తాతలనాటి నుండి వచ్చుచున్నదియును, దివ్యం = దివ్యమైనదియును, దేవైః అపి = దేవతలకు కూడ, దురాసదం = చేరశక్యము గానట్టిదియునగు, ఇదం మధువనం = ఈ మధువనము, మహాత్మనః = మహనీయులైన, సుగ్రీవస్య = సుగ్రీవునకు, ఇష్టం హి = మిక్కిలి ఇష్టమైనదిగదా!

తాత్పర్యము :– మహాత్ముడైన సుగ్రీవునకు తండ్రితాతలనాటి నుండి వంశానుక్రమముగ వచ్చుచున్నదియును, దివ్యమైనదియును దేవతలకు గూడ లభ్యము గానిదియును అగు నీమధువనము ఆతనికి ఎంతయో ప్రియమైనదిగదా!

శ్లో॥ స వానరా నిమా న్సర్వాన్ మధులుబ్ధా న్గతాయుషః ।
ఘాతయిష్యతి దండేన సుగ్రీవ స్ససుహృజ్జనాన్ ॥ **33**

పదచ్ఛేదము :– సః – వానరాన్ – ఇమాన్ – సర్వాన్ – మధులుబ్ధాన్ – గతాయుషః, ఘాతయిష్యతి – దండేన – సుగ్రీవః – ససుహృజ్జనాన్ ॥

అన్వయక్రమము :– మధులుబ్ధాన్ గతాయుషః ఇమాన్ ససుహృజ్జనాన్ వానరాన్ సర్వాన్ సః సుగ్రీవః దండేన ఘాతయిష్యతి.

ప్రతిపదార్థము :– మధులుబ్ధాన్ = తేనెపై పేరాస గలిగినవారును, గతాయుషః = ఆయువు మూడినవారునగు, ఇమాన్ = ఈ, ససుహృజ్జనాన్ = మిత్రవర్గముతో గూడినట్టి, వానరాన్ సర్వాన్ = వానరుల నందరిని, సః సుగ్రీవః = ఆ సుగ్రీవుడు, దండేన = దండనముచే, ఘాతయిష్యతి = కొట్టింపగలడు.

తాత్పర్యము :– మన సుగ్రీవమహారాజు, తేనెకు ఆశపడి ఆయువు మూడివచ్చిన ఈ వానరులను వారి వారి స్నేహితులతో గలపి అందరినిగూడ తన ఉగ్రమైన దండనమునకు గురిచేసి చావకొట్టించగలడు.

శ్లో॥ వధ్యా హ్యేతే దురాత్మానో నృపాజ్ఞాపరిభావినః ।
అమర్షప్రభవో రోషః సఫలో నో భవిష్యతి ॥ **34**

పదచ్ఛేదము :– వధ్యాః – హి – ఏతే – దురాత్మానః – నృపాజ్ఞాపరిభావినః, అమర్షప్రభవః – రోషః – సఫలః – నః – భవిష్యతి ॥

అన్వయక్రమము :– నృపాజ్ఞాపరిభావినః ఏతే దురాత్మానః వధ్యాః హి, అమర్షప్రభవః నః రోషః సఫలః భవిష్యతి.

ప్రతిపదార్థము :– నృపాజ్ఞాపరిభావినః = రాజాజ్ఞను ధిక్కరించినట్టి, ఏతే = ఈ, దురాత్మానః = దుర్మార్గులు, వధ్యాః హి = చంపదగినవారే గదా, అమర్షప్రభవః = క్రోధమువలన జనించినట్టి, నః = మనయొక్క, రోషః = రోషము, సఫలః = సఫలమైనది, భవిష్యతి = కాగలదు.

తాత్పర్యము :– రాజాజ్ఞను ధిక్కరించినట్టి ఈ దుర్మార్గులు తప్పక వధ్యులే యగుదురు గదా! అప్పుడు మనకు గలిగిన క్రోధమును, రోషమును శమింపగలవు.

శ్లో॥ ఏవ ముక్త్వా దధిముఖో వనపాలా న్మహాబలః ।
జగామ సహ సోత్పత్య వనపాలై స్సమన్వితః ॥ **35**

పదచ్ఛేదము :– ఏవమ్ – ఉక్త్వా – దధిముఖః – వనపాలాన్ – మహాబలః – జగామ – సహసా – ఉత్పత్య – వనపాలైః – సమన్వితః ॥

అన్వయక్రమము :– మహాబలః దధిముఖః వనపాలాన్ ఏవమ్ ఉక్త్వా సహసా వనపాలైః సమన్వితః ఉత్పత్య జగామ.

ప్రతిపదార్థము :– మహాబలః = అమితబలాఢ్యుడైన, దధిముఖః = దధిముఖుడు, వనపాలాన్ = వనరక్షకులను గూర్చి, ఏవం = ఇట్లు, ఉక్త్వా = పలికి, సహసా = వెంటనే, వనపాలైః = ఆ తోటకాపరులతో, సమన్వితః = కూడినవాడై, ఉత్పత్య = మీదికి ఎగిరి, జగామ = వెడలెను.

తాత్పర్యము :– మహావీరుడైన దధిముఖుడు ఆ వనపాలకులతో ఇట్లు పలికి వారిని వెంటబెట్టుకొని వెంటనే ఆకసమునకు ఎగిరి వెడలెను.

శ్లో॥ నిమేషాంతరమాత్రేణ స హి ప్రాప్తో వనాలయః ।
సహస్రాంశుసుతో ధీమా న్సుగ్రీవో యత్ర వానరః ॥ 36

పదచ్ఛేదము :– నిమేషాంతరమాత్రేణ – సః – హి – ప్రాప్తః – వనాలయః, సహస్రాంశు సుతః – ధీమాన్ – సుగ్రీవః – యత్ర – వానరః ॥

అన్వయక్రమము :– సః వనాలయః నిమేషాంతరమాత్రేణ ధీమాన్ సహస్రాంశు సుతః సుగ్రీవః వానరః యత్ర (వర్తతే) (తత్ర) ప్రాప్తః.

ప్రతిపదార్థము :– సః వనాలయః = ఆ దధిముఖుడు, నిమేషాంతరమాత్రేణ = ఒక్క నిమిషములోపలనే, ధీమాన్ = బుద్ధిమంతుడైనట్టి, సహస్రాంశుసుతః సుగ్రీవః = సూర్యతనయుడైన సుగ్రీవుడు, యత్ర = ఎచ్చటనయితే, (వర్తతే = ఉన్నాడో) (తత్ర = అచ్చటికి), ప్రాప్తః = చేరెను.

తాత్పర్యము :– పిమ్మట దధిముఖుడు అచటినుండి పోయి ఒక్క నిమిషములోనే బుద్ధిశాలియైన సుగ్రీవుడున్న చోటికి చేరుకొనెను.

శ్లో॥ రామం చ లక్ష్మణం చైవ దృష్ట్వా సుగ్రీవమేవ చ ।
సమప్రతిష్ఠాం జగతీ మాకాశాన్నిపపాత హ ॥ 37

పదచ్ఛేదము :– రామం – చ – లక్ష్మణం – చ – ఏవ – దృష్ట్వా – సుగ్రీవమ్ – ఏవ – చ – సమప్రతిష్ఠాం – జగతీమ్ – ఆకాశాత్ – నిపపాత – హ ॥

అన్వయక్రమము :– రామం చ లక్ష్మణం చ ఏవ సుగ్రీవం చ ఏవ దృష్ట్వా ఆకాశాత్

సమప్రతిష్ఠాం జగతీం నిపపాత.

ప్రతిపదార్థము :- రామం చ = శ్రీరాముని, లక్ష్మణం చ ఏవ = లక్ష్మణుని, సుగ్రీవం చ ఏవ = సుగ్రీవుని కూడ, దృష్ట్వా = చూచి, ఆకాశాత్ = ఆకాశమునుండి, సమప్రతిష్ఠాం = సమానమైన ప్రదేశము కల్గినట్టి, జగతీం = నేలను, నిపపాత = పడెను.

తాత్పర్యము :- ఆ దధిముఖుడు దూరమునుండి శ్రీరాముని లక్ష్మణుని సుగ్రీవుని కనుగొని చదునైన నేలచూచుకొని ఆకాశమునుండి వారి ముందు దూకెను.

శ్లో॥ సన్నిపత్య మహావీర్య స్సర్వై స్తైః పరివారితః ।
హరి ర్దధిముఖః పాలైః పాలానాం పరమేశ్వరః ॥ 38

శ్లో॥ స దీనవదనో భూత్వా కృత్వా శిరసి చాంజలిమ్ ।
సుగ్రీవస్య శుభౌ మూర్ధ్నా చరణౌ ప్రత్యపీడయత్ ॥ 39

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"దధిముఖ ఖలీకరణం" నామ
ద్విషష్టితమస్సర్గః.

పదచ్ఛేదము :- సన్నిపత్య - మహావీర్యః - సర్వైః - తైః - పరివారితః, హరిః - దధిముఖః - పాలైః - పాలానాం - పరమేశ్వరః, సః - దీనవదనః - భూత్వా - కృత్వా - శిరసి - చ - అంజలిమ్, సుగ్రీవస్య - శుభౌ - మూర్ధ్నా - చరణౌ - ప్రత్యపీడయత్ ॥

అన్వయక్రమము :- మహావీర్యః పాలానాం పరమేశ్వరః సః దధిముఖః హరిః, తైః పాలైః సర్వైః పరివారితః దీనవదనః భూత్వా, శిరసి అంజలిం కృత్వా సుగ్రీవస్య శుభౌ చరణౌ మూర్ధ్నా ప్రత్యపీడయత్.

ప్రతిపదార్థము :- మహావీర్యః = మహాపరాక్రమవంతుడును, పాలానాం = వనరక్షకులకు, పరమేశ్వరః = ప్రభువును అగు, సః = ఆ, దధిముఖః హరిః = దధిముఖ వానరుడు, తైః = ఆ, పాలైః సర్వైః = వనరక్షకులందరిచే, పరివారితః = చుట్టుముట్టబడినవాడై, దీనవదనః భూత్వా = దీనమైన ముఖముగలవాడై, శిరసి = తలపై, అంజలిం = దోసిలిని, కృత్వా చ = చేసికొనియు, సుగ్రీవస్య = సుగ్రీవునియొక్క, శుభౌ = మంగళకరములైన, చరణౌ = పాదములను, మూర్ధ్నా

= శిరస్సుతో, ప్రత్యపీడయత్ = మ్రొక్కెను.

తాత్పర్యము :- అట్లు క్రిందికి దిగినట్టి మహావీరుడును, వనరక్షకులకు ప్రభువునగు ఆ దధిముఖుడు తన పరివారమైన వనరక్షకులు తన చుట్టునుండగా ముందునకు వచ్చి దీనమైన వదనముతో తలపై దోసిలిని చేర్చి సుగ్రీవమహారాజు యొక్క పవిత్రమైన పాదములకు మ్రొక్కెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"దధిముఖ ఖిలీకరణము" అను
అరువదిరెండవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

త్రిషష్టితమసర్గ

శ్లో॥ తతో మూర్ధ్నా నిపతితం వానరం వానరర్షభః ।
దృష్ట్వై వోద్విగ్నహృదయో వాక్య మేత దువాచ హ ॥ 1

పదచ్ఛేదము :– తతః – మూర్ధ్నా – నిపతితం – వానరం – వానరర్షభః – దృష్ట్వా – ఏవ – ఉద్విగ్నహృదయః – వాక్యమ్ – ఏతత్ – ఉవాచ – హ ॥

అన్వయక్రమము :– తతః మూర్ధ్నా నిపతితం వానరం వానరర్షభః దృష్ట్వా ఏవ ఉద్విగ్నహృదయః (సన్) ఏతత్ వాక్యమ్ ఉవాచ హ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, మూర్ధ్నా = శిరస్సుతో, నిపతితం = ఒరిగియున్న, వానరం = దధిముఖుని, వానరర్షభః = సుగ్రీవుడు, దృష్ట్వా ఏవ = చూడగనే, ఉద్విగ్నహృదయః (సన్) = వ్యాకులత నొందిన మనస్సుగలవాడై, ఏతత్ = ఈ, వాక్యం = మాటను, ఉవాచ = పలికెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– దధిముఖుడు సుగ్రీవుని మేనమామయైనను ఇచట తన మేనల్లుని మహారాజుగనే గౌరవించి పాదముల నంటినాడని తెలియవలెను.

తాత్పర్యము :– అట్లు తన పాదములపై శిరమును మోపియున్న దధిముఖుని చూడగనే సుగ్రీవుడు వ్యాకులత నొందిన మనస్సుతో ఆతనితో ఇట్లు పలికెను.

శ్లో॥ ఉత్తి ష్ఠోత్తిష్ఠ కస్మా త్త్వం పాదయోః పతితో మమ ।
అభయం తే భవే ద్వీర సర్వమే వాభిధీయతామ్ ॥ 2

పదచ్ఛేదము :– ఉత్తిష్ఠ – ఉత్తిష్ఠ – కస్మాత్ – త్వం – పాదయోః – పతితః – మమ, అభయం – తే – భవేత్ – వీర – సర్వమ్ – ఏవ – అభిధీయతామ్ ॥

అన్వయక్రమము :– వీర ఉత్తిష్ఠ ఉత్తిష్ఠ. త్వం కస్మాత్ మమ పాదయోః పతితః, తే అభయం భవేత్, సర్వమ్ ఏవ అభిధీయతామ్.

ప్రతిపదార్థము :– వీర! = ఓ వీరుడా!, ఉత్తిష్ఠ ఉత్తిష్ఠ = లెమ్ము లెమ్ము, త్వం = నీవు, కస్మాత్ = ఎందువలన, మమ = నాయొక్క, పాదయోః = పాదములపై, పతితః = పడినావు, తే = నీకు, అభయం = అభయము, భవేత్ = అగును, సర్వమ్ ఏవ = అంతయును, అభిధీయతామ్ = చెప్పబడుగాక!

తాత్పర్యము :– ఓ మహావీరుడా! లెమ్ము లెమ్ము, ఇట్లు హఠాత్తుగా వచ్చి నా పాదములపై బడుటకు కారణమేమి? నీకు నే నభయ మొసంగుచున్నాను. విషయమును సమగ్రముగా తెలుపుము.

శ్లో॥ స తు విశ్వాసిత స్తేన సుగ్రీవేణ మహాత్మనా ।
ఉత్థాయ సుమహాప్రాజ్ఞో వాక్యం దధిముఖో ఽబ్రవీత్ ॥ 3

పదచ్ఛేదము :– సః – తు – విశ్వాసితః – తేన – సుగ్రీవేణ – మహాత్మనా, ఉత్థాయ – సుమహాప్రాజ్ఞః – వాక్యం – దధిముఖః – అబ్రవీత్ ॥

అన్వయక్రమము :– మహాత్మనా తేన సుగ్రీవేణ విశ్వాసితః సుమహాప్రాజ్ఞః సః దధిముఖః ఉత్థాయ వాక్యమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :– మహాత్మనా = మహనీయుడైనట్టి, తేన సుగ్రీవేణ = ఆ సుగ్రీవునిచే, విశ్వాసితః = నమ్మకము కల్గింపబడినట్టి, సః = ఆ, సుమహాప్రాజ్ఞః = గొప్ప ప్రాజ్ఞుడైనట్టి, దధిముఖః = దధిముఖుడు, ఉత్థాయ = లేచి, వాక్యమ్ = మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :– మహనీయుడైన సుగ్రీవుడు తన నిట్లు ఓదార్చుచు పలుకగా మహాప్రాజ్ఞుడైన ఆ దధిముఖుడు భయము తొలగి లేచి నిలబడి ఆతనితో ఇట్లు పలికెను.

శ్లో॥ నైవర్క్షరజసా రాజన్న త్వయా నాపి వాలినా ।
వనం నిసృష్టపూర్వం హి భక్షితం తచ్చ వానరైః ॥ 4

పదచ్ఛేదము :– న – ఏవ – ఋక్షరజసా – రాజన్ – న – త్వయా – న – అపి – వాలినా, వనం – నిసృష్టపూర్వం – హి – భక్షితం – తత్ – చ – వానరైః ॥

అన్వయక్రమము :– రాజన్, వనం ఋక్షరజసా న నిసృష్టపూర్వం హి, త్వయా అపి న వాలినా అపి న, తత్ (అద్య) వానరైః భక్షితం హి.

ప్రతిపదార్థము :– రాజన్ = ఓ రాజా!, వనం = మధువనము, ఋక్షరజసా =

ఋక్షరజసునిచే, న ఏవ నిసృష్టపూర్వం = పూర్వము వదలివేయబడలేదు, త్వయా అపి = నీచేతను గూడ, న = వదలివేయబడలేదు, వాలినా అపి = వాలిచేతను గూడ, న = వదిలివేయబడలేదు, తత్ చ = అదియును, (అద్య = నేడు), వానరైః = వానరులచే, భక్షితం హి = తినివేయబడెను సుమా!

తాత్పర్యము :– మహారాజా! అమూల్యమైన ఈ మధువనము మీ తండ్రిగారయిన ఋక్షరజసుడుగాని స్వయముగా నీవుగాని, నీయన్నయైన వాలిగాని ఎన్నడును ఎవరికిని స్వేచ్ఛగా భక్షించుటకై వదలివేయలేదు. కాని అట్టి ఆ వనమును నేడు కోతిమూకలు వచ్చి సర్వము తినివేసెను సుమా!

శ్లో॥ ఏభిః ప్రధర్షితాశ్చైవ వానరా వనరక్షిభిః ।
మధూ న్యచింతయి త్వేమాన్ భక్షయంతి పిబంతి చ ॥ 5

పదచ్ఛేదము :– ఏభిః – ప్రధర్షితాః – చ – ఏవ – వానరాః – వనరక్షిభిః – మధూని – అచింతయిత్వా – ఇమాన్ – భక్షయంతి – పిబంతి – చ ॥

అన్వయక్రమము :– వానరాః ఏభిః వనరక్షిభిః ప్రధర్షితాః చ ఏవ ఇమాన్ అచింతయిత్వా మధూని భక్షయంతి పిబంతి చ.

ప్రతిపదార్థము :– వానరాః = వానరులు, ఏభిః = ఈ, వనరక్షిభిః = వనపాలకులచే, ప్రధర్షితాః చ ఏవ = ఎదుర్కొనబడిన వారయినను, ఇమాన్ = వీరిని, అచింతయిత్వా = లెక్కచేయక, మధూని = తేనెలను, భక్షయంతి = తినుచున్నారు, పిబంతి చ = త్రాగుచున్నారు కూడ.

తాత్పర్యము :– దుష్టులైన ఆ వానరులు మా వనరక్షకులు ఎంత అడ్డుకొనుచున్నను వీరి నేమియును లెక్కచేయక స్వేచ్ఛగా తేనెపట్టులను తినుచు, తేనెను త్రాగుచు యథేచ్ఛగా విహరించుచున్నారు.

శ్లో॥ శిష్ట మత్రాపవిధ్యంతి భక్షయంతి తథా ఽపరే ।
నివార్యమాణా స్తే సర్వే భ్రుకుటిం దర్శయంతి చ ॥ 6

పదచ్ఛేదము :– శిష్టమ్ – అత్ర – అపవిధ్యంతి – భక్షయంతి – తథా – అపరే, నివార్యమాణాః – తే – సర్వే – భ్రుకుటిం – దర్శయంతి – చ ॥

అన్వయక్రమము :– అత్ర శిష్టమ్ అపవిధ్యంతి, తథా అపరే భక్షయంతి, నివార్యమాణాః తే సర్వే భ్రుకుటిం దర్శయంతి చ.

ప్రతిపదార్థము :– అత్ర = ఈ మధువనమున, శిష్టం = మిగిలినదానిని, అపవిధ్యంతి

= పారవేయుచున్నారు, తథా = అట్లు, అపరే = మరికొందరు, భక్షయంతి = తినివేయుచున్నారు, నివార్యమాణాః = అడ్డగింపబడుచున్నట్టి, తే సర్వే = వారందరు, భ్రుకుటిం = బొమముడిని, దర్శయంతి చ = చూపుచున్నారుకూడను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– శిష్టమ్ అపవిధ్యంతి – మధుకోశములలో మిగిలిన మైనపుముద్దను మట్టిపాలుచేసి పాడుచేయుచున్నారు.

తాత్పర్యము :– మరియు ఆ వానరులు త్రాగినంతత్రాగి మిగిలినది పారబోయు చున్నారు. మరికొందరు మైనములనుకూడ తినివేయుచున్నారు. మేము వారికి ఎదురుగబోయి బెదిరించి అడ్డుకొనుచుండగా వారు బొమముడులను చూపి మమ్ములను భయపెట్టుచున్నారు.

శ్లో॥ ఇమే హి సంరబ్ధతరా స్తథా తై స్సంప్రధర్షితాః ।
వారయంతో వనా త్తస్మాత్క్రుద్ధై ర్వానరపుంగవైః ॥ 7

పదచ్ఛేదము :– ఇమే – హి – సంరబ్ధతరాః – తథా – తైః – సంప్రధర్షితాః, వారయంతః – వనాత్ – తస్మాత్ – క్రుద్ధైః – వానరపుంగవైః ॥

అన్వయక్రమము :– ఇమే సంరబ్ధతరాః వారయంతః తస్మాత్ వనాత్ క్రుద్ధైః వానరపుంగవైః తథా సంప్రధర్షితాః.

ప్రతిపదార్థము :– ఇమే = ఈ వానరులు, సంరబ్ధతరాః = మిక్కిలి పూనికగలవారై, తస్మాత్ వనాత్ = ఆ మధువనమునుండి, వారయంతః = అడ్డుకొనుచు, క్రుద్ధైః = క్రోధము నొందియున్న, తైః = ఆ, వానరపుంగవైః = వానరయోధులచే, తథా = ఆ రీతిగా, సంప్రధర్షితాః = మిక్కిలి బెదిరింపబడిరి.

తాత్పర్యము :– నా వనపాలకులు మిక్కిలి పూనికతో ఆ మధువనము నుండి వారిని వారించుచుండగా మిక్కిలి క్రోధముతో ఆ వానరయోధులు మా భటులను పలువిధములుగ బెదిరించిరి.

శ్లో॥ తత స్తై ర్బహుభి ర్వీరై ర్వానరై ర్వానరర్షభ ।
సంరక్తనయనైః క్రోధా ద్ధరయః ప్రవిచాలితాః ॥ 8

పదచ్ఛేదము :– తతః – తైః – బహుభిః – వీరైః – వానరైః – వానరర్షభ, సంరక్తనయనైః – క్రోధాత్ – హరయః – ప్రవిచాలితాః ॥

అన్వయక్రమము :– తతః వానరర్షభః వీరైః సంరక్తనయనైః బహుభిః వానరైః క్రోధాత్ హరయః ప్రవిచాలితాః.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, వానరర్షభ = ఓ వానరరాజా, వీరైః = వీరులైనట్టి, సంరక్తనయనైః = ఎఱ్ఱబారిన కన్నులు గలిగినట్టి, తైః బహుభిః వానరైః = ఆ పెక్కుమంది వానరులచే, క్రోధాత్ = క్రోధము వలన, హరయః = వనరక్షకులయిన వానరులు, ప్రవిచాలితాః = తరిమివేయబడిరి.

తాత్పర్యము :– ఓ వానరరాజా! ఆ మహావీరులైన వానరులు పెక్కు మంది గ్రుడ్లెఱ్ఱజేయుచు తీవ్రమయిన క్రోధముతో ఆ వనపాలురను అచ్చటి నుండి తరిమి వేసిరి.

శ్లో॥ పాణిభి ర్నిహతాః కేచి త్కేచి జ్జానుభి రాహతాః ।
ప్రకృష్టాశ్చ యథాకామం దేవమార్గం చ దర్శితాః ॥ 9

పదచ్ఛేదము :– పాణిభిః – నిహతాః – కేచిత్ – కేచిత్ – జానుభిః – ఆహతాః, ప్రకృష్టాః – చ – యథాకామం – దేవమార్గం – చ – దర్శితాః ॥

అన్వయక్రమము :– కేచిత్ పాణిభిః నిహతాః. కేచిత్ జానుభిః ఆహతాః. యథాకామం ప్రకృష్టాః చ దేవమార్గం దర్శితాః చ.

ప్రతిపదార్థము :– కేచిత్ = కొంతమంది, పాణిభిః = చేతులతో, నిహతాః = కొట్టబడిరి, కేచిత్ = కొంతమంది, జానుభిః = మోకాళ్ళతో, ఆహతాః = క్రుమ్మబడిరి, కేచిత్ = కొంతమంది, యథాకామం = ఇష్టమువచ్చినరీతిగా, ప్రకృష్టాః చ = ఈడ్వబడిరి, (కేచిత్ = కొంతమంది), దేవమార్గం = పృష్ఠభాగమును, దర్శితాః = చూపబడినారు కూడను.

తాత్పర్యము :– మదించిన ఆ వానరులు మా వనపాలకులను కొందరిని చేతులతో కొట్టియు, కొందరిని మోకాళ్ళతో పొడిచియు, కొందరిని ఇష్టమువచ్చినట్టు నేలపై నీడ్చియు పీడించినారు. మరి కొంతమందికి తమపృష్ఠభాగమును జూపి వారి నవమానించినారు కూడను.

శ్లో॥ ఏవ మేతే హతా శ్శూరా స్త్వయి తిష్ఠతి భర్తరి ।
కృత్స్నం మధువనం చైవ ప్రకామం తైః ప్రభక్ష్యతే ॥ 10

పదచ్ఛేదము :– ఏవమ్ – ఏతే – హతాః – శూరాః – త్వయి – తిష్ఠతి – భర్తరి, కృత్స్నం – మధువనం – చ – ఏవ – ప్రకామం – తైః – ప్రభక్ష్యతే ॥

అన్వయక్రమము :– భర్తరి త్వయి తిష్ఠతి (సతి) ఏతే శూరాః ఏవం హతాః తైః మధువనం చ ఏవ కృత్స్నం ప్రకామం ప్రభక్ష్యతే.

ప్రతిపదార్థము :– భర్తరి = ప్రభువైనట్టి, త్వయి = నీవు, తిష్ఠతి సతి = ఉండగా, ఏతే = ఈ, శూరాః = వీరులు, ఏవం = ఇట్లు, హతాః = హతమారినారు; మధువనం చ ఏవ = మధువనముగూడ, కృత్స్నం = సంపూర్ణముగా, తైః = వారిచే, ప్రకామం = స్వేచ్ఛగా, ప్రభక్ష్యతే = తినివేయబడుచున్నది.

తాత్పర్యము :– నీ యంతటివాడు ప్రభువుగా నుండగనే వీరులైన ఈ వనపాలురు ఈ విధముగా వారి చేతిలో హింసలకు గురియైనారు. అమూల్యమైన మన మధు వనమంతయును గూడా వారు స్వేచ్ఛగా మ్రింగివేయుచున్నారు.

శ్లో॥ ఏవం విజ్ఞాప్యమానం తం సుగ్రీవం వానరర్షభః ।
అపృచ్ఛ త్తం మహాప్రాజ్ఞో లక్ష్మణః పరవీరహా ॥ 11

పదచ్ఛేదము :– ఏవం – విజ్ఞాప్యమానం – తం – సుగ్రీవం – వానరర్షభమ్, అపృచ్ఛత్ – తం – మహాప్రాజ్ఞః – లక్ష్మణః – పరవీరహా ॥

అన్వయక్రమము :– ఏవం విజ్ఞాప్యమానం వానరర్షభం తం సుగ్రీవం మహాప్రాజ్ఞః పరవీరహా లక్ష్మణః తమ్ అపృచ్ఛత్.

ప్రతిపదార్థము :– ఏవం = ఇట్లు, విజ్ఞాప్యమానం = విన్నవింపబడుచున్న, వానరర్షభం = వానరశ్రేష్ఠుడైనట్టి, తం = ఆ, సుగ్రీవం = సుగ్రీవుని, మహాప్రాజ్ఞః = గొప్ప ప్రాజ్ఞుడైనట్టియు, పరవీరహా = శత్రువీరులను హతమార్చువాడునగు, లక్ష్మణః = లక్ష్మణుడు, తం = ఆ విషయమును గూర్చి, అపృచ్ఛత్ = అడిగెను.

తాత్పర్యము :– దధిముఖుడు వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుని ఈ రీతిగా భయపడుచు వ్యాకులతతో అడుగుచుండగా చూచి మహావీరుడును మహాప్రాజ్ఞుడునగు లక్ష్మణుడు ఎవరికెట్టి హాని కలిగినదో యని శంకనొందుచు తనకు దధిముఖుని భాష అర్థముగాక పోవుటచే ఆతడు మీతో చెప్పుచున్న విషయ మేమిటని సుగ్రీవుని అడిగెను.

శ్లో॥ కి మయం వానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః ।
కం చార్థ మభినిర్దిశ్య దుఃఖితో వాక్య మబ్రవీత్ ॥ 12

పదచ్ఛేదము :– కిమ్ – అయం – వానరః – రాజన్ – వనపః – ప్రత్యుపస్థితః – కం – చ – అర్థమ్ – అభినిర్దిశ్య – దుఃఖితః – వాక్యమ్ – అబ్రవీత్ ॥

అన్వయక్రమము :– రాజన్! వనపః అయం వానరః కిం ప్రత్యుపస్థితః? దుఃఖితః

(సన్) కమ్ అర్థమ్ అభినిర్దిశ్య వాక్యమ్ అబ్రవీత్ చ?

ప్రతిపదార్థము :– రాజన్! = ఓ రాజా! వనపః = వనపాలకుడైనట్టి, అయం = ఈ, వానరః = వానరుడు, కిం = ఎందుకొరకు, ప్రత్యుపస్థితః = వచ్చియున్నాడు? దుఃఖితః సన్ = దుఃఖితుడై, కం = ఏ, అర్థమ్ = విషయమును, అభినిర్దిశ్య = నిర్దేశించి, వాక్యం = మాటను, అబ్రవీత్ = పలికెను?

తాత్పర్యము :– రాజా! వనపాలకుడైనట్టి ఈ వానరుడు మీకడకు వచ్చుటకు కారణమేమి? ఎంతయో దుఃఖవ్యాకులుడై ఈతడు నీతో ఇప్పుడు చెప్పుచున్నట్టి ఆ విషయమేమి?

శ్లో॥ ఏవ ముక్తస్తు సుగ్రీవో లక్ష్మణేన మహాత్మనా ।
లక్ష్మణం ప్రత్యువా చేదం వాక్యం వాక్యవిశారదః ॥ 13

పదచ్ఛేదము :– ఏవమ్ – ఉక్తః – తు – సుగ్రీవః – లక్ష్మణేన – మహాత్మనా, లక్ష్మణం – ప్రత్యువాచ – ఇదం – వాక్యం – వాక్యవిశారదః ॥

అన్వయక్రమము :– మహాత్మనా లక్ష్మణేన ఏవమ్ ఉక్తః వాక్యవిశారదః సుగ్రీవః తు లక్ష్మణమ్ ఇదం వాక్యం ప్రత్యువాచ.

ప్రతిపదార్థము :– మహాత్మనా = మహనీయుడైనట్టి, లక్ష్మణేన = లక్ష్మణునిచే, ఏవం = ఈరీతిగా, ఉక్తః = చెప్పబడినవాడై, వాక్యవిశారదః = మాటలనేర్పు గలిగినట్టి, సుగ్రీవః తు = సుగ్రీవుడు అప్పుడు, లక్ష్మణం = లక్ష్మణునిగూర్చి, ఇదం = ఈ, వాక్యం = మాటను, ప్రత్యువాచ = బదులుచెప్పెను.

తాత్పర్యము :– మహాత్ముడైన లక్ష్మణుడు తన నిట్లు ప్రశ్నింపగా వాక్యవిశారదుడైన సుగ్రీవుడు లక్ష్మణునికి ఇట్లు సమాధానము చెప్పెను.

శ్లో॥ ఆర్య లక్ష్మణ సంప్రాహ వీరో దధిముఖః కపిః ।
అంగదప్రముఖై ర్వీరై ర్భక్షితం మధు వానరైః ॥ 14

శ్లో॥ విచిత్య దక్షిణా మాశా మాగతై ర్హరిపుంగవైః ॥ 15

పదచ్ఛేదము :– ఆర్య – లక్ష్మణ – సంప్రాహ – వీరః – దధిముఖః – కపిః, అంగదప్రముఖైః – వీరైః – భక్షితం – మధు – వానరైః – విచిత్య – దక్షిణామ్ – ఆశామ్ – ఆగతైః – హరిపుంగవైః ॥

అన్వయక్రమము :– ఆర్య! లక్ష్మణ! దక్షిణామ్ ఆశాం విచిత్య ఆగతైః అంగదప్రముఖైః

వీరైః వానరైః హరిపుంగవైః మధు భక్షితమ్ ఇతి వీరః దధిముఖః సంప్రాహ.

ప్రతిపదార్థము :– ఆర్య! = పూజ్యుడైన, లక్ష్మణ! = ఓ సౌమిత్రీ! దక్షిణామ్ ఆశాం = దక్షిణ దిక్కును, విచిత్య = వెదకి, ఆగతైః = వచ్చినట్టి, అంగదప్రముఖైః = అంగదుడు మున్నగు, వీరైః వానరైః = వీరులైనట్టి వానరులచేతను, హరిపుంగవైః = వానర శ్రేష్ఠులచేతను, మధు = తేనె, భక్షితమ్ = భక్షింపబడినది, ఇతి = అని, వీరః = వీరుడైన, దధిముఖః = దధిముఖుడు, సంప్రాహ = పలికెను.

తాత్పర్యము :– పూజ్యుడైన లక్ష్మణా! దక్షిణదిక్కుకు పోయి సీతమ్మను వెదకి వచ్చినట్టి మన అంగదాది వానరశ్రేష్ఠులును, మహావీరులైన ఇతర వానరోత్తములును మధువనమున ప్రవేశించి తేనెను త్రాగివేసినారని ఈతడు నాకు తెలుపుచున్నాడు.

శ్లో॥ నైషా మకృతకృత్యానా మీదృశ స్స్యాదుపక్రమః ।
ఆగతైశ్చ ప్రమథితం యథా మధువనం హి తైః ।
ధర్షితం చ వనం కృత్స్న ముపభుక్తం చ వానరైః ॥ 16

పదచ్ఛేదము :– న – ఏషామ్ – అకృతకృత్యానామ్ – ఈదృశః – స్యాత్ – ఉపక్రమః – ఆగతైః – చ – ప్రమథితం – యథా – మధువనం – హి – తైః, ధర్షితం – చ – వనం – కృత్స్నమ్ – ఉపభుక్తం – చ – వానరైః ॥

అన్వయక్రమము :– ఆగతైః తైః వానరైః యథా మధువనం ప్రమథితం, కృత్స్నం వనం ధర్షితమ్ ఉపభుక్తం చ (తథా) ఈదృశః ఉపక్రమః అకృతకృత్యానామ్ ఏషాం న స్యాత్ హి.

ప్రతిపదార్థము :– ఆగతైః = వచ్చినట్టి, తైః = ఆ, వానరైః = వానరులచే, యథా = ఏ విధముగా, మధువనం = మధువనము, ప్రమథితం = కల్లోలము చేయబడినదో, వనం = తోట, కృత్స్నం = అంతయును, ధర్షితం = చిందరవందర చేయబడినదో, ఉపభుక్తం = భుజింపబడినదో, (తథా = ఆ విధమునుబట్టి), ఈదృశః = ఇట్టి, ఉపక్రమః = ఆచరణము, అకృతకృత్యానాం = కృతకృత్యులుగాని, ఏషాం = వీరికి, న స్యాత్ హి = ఉండదుగదా!

తాత్పర్యము :– తిరిగివచ్చుచున్న ఈ అంగదాదివీరులు మధువనమున ప్రవేశించి దానిని చిందరవందరచేసి ధ్వంసము గావించి స్వేచ్ఛగా మధుపానమును చేయుటనుబట్టి చూడగా ఇట్టి ఉత్సాహచర్యను కార్యము సాధింపనట్టివారు చేయలేరని తెలియుచునే యున్నది.

శ్లో॥ వనం యదా ఽభిపన్నా స్తే సాధితం కర్మ వానరైః ।
దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా ।
న హ్యన్య స్సాధనే హేతుః కర్మణో ఽస్య హనూమతః ॥ 17

పదచ్ఛేదము :– వనం – యదా – అభిపన్నాః – తే – సాధితం – కర్మ – వానరైః, దృష్టా – దేవీ – న – సందేహః – న – చ – అన్యేన – హనూమతా, న – హి – అన్యః – సాధనే – హేతుః – కర్మణః – అస్య – హనూమతః ॥

అన్వయక్రమము :– తే యదా వనమ్ అభిపన్నాః తదా వానరైః కర్మ సాధితమ్; దేవీ దృష్టా; సందేహః న; అన్యేన చ న; హనుమతా దృష్టా, అస్య కర్మణః సాధనే హనూమతః అన్యః హేతుః న హి.

ప్రతిపదార్థము :– తే = ఆ వానరులు, యదా = ఎప్పుడయితే, వనం = మధువనమును, గూర్చి, అభిపన్నాః = వచ్చియున్నారో, తదా = అప్పుడే, వానరైః = వానరులచే, కర్మ = కార్యము, సాధితం = సాధింపబడినది, దేవీ = సీతాదేవి, దృష్టా = చూడబడినది, సందేహః = సంశయము, న = లేదు, అన్యేన చ = వేరెవ్వరిచేతను, న = కాదు, హనూమతా = హనుమచేత, (దృష్టా = చూడబడినది), అస్య = ఈ, కర్మణః = పనియొక్క, సాధనే = సాధనమునందు, హనూమతః = హనుమంతునికంటె, అన్యః = వేరొకడు, హేతుః = కారణము, నహి = కాదుసుమా!

తాత్పర్యము :– ఈ వానరులు మధువనమును ప్రవేశించుట ఎప్పుడు జరిగినదో అప్పుడే వీరు తాము పూనిన కార్యమును సాధించుకొని వచ్చినారని తెలియుచున్నది, కాబట్టి వారు సీతాదేవిని చూచియే వచ్చినారు. అందు సందేహ మేమియును లేదు. ఆ యమ్మను జూచినదిగూడ హనుమంతుడే కాని వేరెవ్వరును కాదు. ఈ కార్యసాధనలో హనుమవిక్రమముకంటె వేరైనదేదియును కారణమై యుండదు సుమా!

శ్లో॥ కార్యసిద్ధి ర్మతిశ్చైవ తస్మి న్వానరపుంగవే ।
వ్యవసాయశ్చ వీర్యం చ శ్రుతం చాపి ప్రతిష్ఠితమ్ ॥ 18

పదచ్ఛేదము :– కార్యసిద్ధిః – మతిః – చ – ఏవ – తస్మిన్ – వానరపుంగవే, వ్యవసాయః – చ – వీర్యం – చ – శ్రుతం – చ – అపి – ప్రతిష్ఠితమ్ ॥

అన్వయక్రమము :– తస్మిన్ వానరపుంగవే కార్యసిద్ధిః మతిః చ ఏవ వ్యవసాయః చ, వీర్యం చ శ్రుతం చ అపి ప్రతిష్ఠితమ్.

ప్రతిపదార్థము :– తస్మిన్ = ఆ, వానరపుంగవే = వానరశ్రేష్ఠునియందు, కార్యసిద్ధిః

= కార్యసిద్ధియు, మతిః చ ఏవ = ప్రజ్ఞయును, వ్యవసాయః చ = ప్రయత్నమును, వీర్యం చ = శౌర్యమును, శ్రుతం చ అపి = వైదుష్యమును, ప్రతిష్ఠితమ్ = రూఢమైయున్నది.

తాత్పర్యము :- వానరోత్తముడైన ఆ హనుమంతునియందు కార్యసిద్ధియును, ప్రజ్ఞయును, ప్రయత్నమును, శౌర్యమును, వైదుష్యమును చిరకాలమునుండి సుప్రతిష్ఠితములై యున్నవి.

శ్లో॥ జాంబవా న్యత్ర నేతా స్యా దంగదశ్చ మహాబలః ।
హనుమాం శ్చాప్యధిష్ఠాతా న తస్య గతి రన్యథా ॥ 19

పదచ్ఛేదము :- జాంబవాన్ - యత్ర - నేతా - స్యాత్ - అంగదః - చ - మహాబలః - హనుమాన్ - చ - అపి - అధిష్ఠాతా - న - తస్య - గతిః - అన్యథా ॥

అన్వయక్రమము :- యత్ర నేతా జాంబవాన్, మహాబలః అంగదశ్చ స్యాత్, అధిష్ఠాతా హనుమాన్ స్యాత్, తస్య గతిః అన్యథా న స్యాత్.

ప్రతిపదార్థము :- యత్ర = ఏ కార్యమునందు, నేతా = నాయకుడు, జాంబవాన్ = జాంబవంతుడును, మహాబలః = మహాబలసంపన్నుడైన, అంగదః చ = అంగదుడును, స్యాత్ = అగునో, అధిష్ఠాతా = అధిపతి, హనుమాన్ చ స్యాత్ = హనుమంతుడును అగునో, తస్య = ఆ కార్యముయొక్క, గతిః = విధానము, అన్యథా = వేరు రీతిగా, న స్యాత్ = కానేరదు.

తాత్పర్యము :- ఏ మహాకార్యమునందు వృద్ధవీరుడైన జాంబవంతుడును, మహాబలాఢ్యుడైన అంగదుడును నాయకులుగా నున్నారో హనుమంతుడు స్వయముగా కార్యవిధాతగా వ్యవహరించుచున్నాడో ఆ కార్యముయొక్క ఫలితము వేరొకరీతిగా నుండనేరదు.

శ్లో॥ అంగదప్రముఖై ర్వీరై ర్హతం మధువనం కిల ।
వారయంతశ్చ సహితా స్తథా జానుభి రాహతాః ॥ 20

పదచ్ఛేదము :- అంగదప్రముఖైః - వీరైః - హతం - మధువనం - కిల, వారయంతః - చ - సహితాః - తథా - జానుభిః - ఆహతాః ॥

అన్వయక్రమము :- మధువనమ్ అంగదప్రముఖైః వీరైః హతం కిల! తథా వారయంతః సహితాః జానుభిః ఆహతాః కిల!

ప్రతిపదార్థము :– అంగదప్రముఖైః = అంగదుడు మున్నగువారు గల, వీరైః = వీరులచే, మధువనం = మధువనము, హతం కిల = ధ్వంసము చేయబడినదట, తథా = అట్లే, సహితాః = కలసినవారై, వారయంతః = అడ్డగించుచున్నవారై, జానుభిః = మోకాళ్ళతో, ఆహతాః కిల = కొట్టబడినారట!

తాత్పర్యము :– అంగదుడు మున్నగు వానరవీరులు మధువనమును ధ్వంసము చేసినారట. మరియు వారిని వలదని వారింపగా ఆ వనపాలురను వారు మోకాళ్ళతో పొడిచి హింసించినారట.

శ్లో॥ ఏతదర్థమయం ప్రాప్తో వక్తుం మధురవా గిహ ।
నామ్నా దధిముఖో నామ హరిః ప్రఖ్యాతవిక్రమః ॥ 21

పదచ్ఛేదము :– ఏతదర్థమ్ – అయం – ప్రాప్తః – వక్తుం – మధురవాక్ – ఇహ, నామ్నా – దధిముఖః – నామ – హరిః – ప్రఖ్యాతవిక్రమః ॥

అన్వయక్రమము :– మధురవాక్ ప్రఖ్యాతవిక్రమః నామ్నా దధిముఖః అయం హరిః ఏతదర్థం వక్తుమ్ ఇహ ప్రాప్తః.

ప్రతిపదార్థము :– మధురవాక్ = మధురమైన వాక్కు గలవాడును, ప్రఖ్యాతవిక్రమః = విఖ్యాతమైన పరాక్రమముగలవాడును, నామ్నా = పేరుచేత, దధిముఖః నామ = దధిముఖుడను ప్రసిద్ధిగలవాడునగు, అయం = ఈ, హరిః = వానరుడు, ఏతత్ = ఈ, అర్థం = విషయమును, వక్తుం = చెప్పుటకు, ఇహ = ఇటకు, ప్రాప్తః = వచ్చినాడు.

తాత్పర్యము :– మధురముగ మాటలాడువాడును మహాపరాక్రమవంతుడునగు ఈ దధిముఖుడను సుప్రసిద్ధుడైన వానరోత్తముడు తనకు విషాదము గలిగించిన విషయమును తెలుపుటకై ఇట్లు ఇచటికి వచ్చినాడు.

శ్లో॥ దృష్టా సీతా మహాబాహో సౌమిత్రే పశ్య తత్త్వతః ।
అభిగమ్య తథా సర్వే పిబంతి మధు వానరాః ॥ 22

పదచ్ఛేదము :– దృష్టా – సీతా – మహాబాహో – సౌమిత్రే – పశ్య – తత్త్వతః, అభిగమ్య – తథా – సర్వే – పిబంతి – మధు – వానరాః ॥

అన్వయక్రమము :– మహాబాహో సౌమిత్రే తత్త్వతః పశ్య, సీతా దృష్టా, తథా వానరాః సర్వే అభిగమ్య మధు పిబంతి.

ప్రతిపదార్థము :- మహాబాహో = భుజబలసంపన్నుడవైన, సౌమిత్రే = లక్ష్మణా, తత్త్వతః = యథార్థవిషయమును బట్టి, పశ్య = పరికింపుము, సీతా = సీతాదేవి, దృష్టా = చూడబడినది, తథా = ఆ కారణముగనే, వానరాః = వానరులు, సర్వే = అందరును, అభిగమ్య = చేరి, మధు = తేనెను, పిబంతి = త్రాగుచున్నారు.

తాత్పర్యము :- మహావీరుడైన లక్ష్మణా! జరిగినది తెలిసికొను దృష్టితో పరికించి చూడుము; మనవానరు లెల్లరును కూడి మధువనము జొచ్చి ఉల్లాసముగా మధువును గ్రోలుచున్నారనగా దానిని బట్టి వారు సీతాదేవిని చూచి వచ్చినారని తెలియుచునే యున్నదిగదా!

శ్లో॥ న చాప్యదృష్ట్వా వైదేహీం విశ్రుతాః పురుషర్షభ ।
వనం దత్తవరం దివ్యం ధర్షయేయు ర్వనౌకసః ॥ 23

పదచ్ఛేదము :- న - చ - అపి - అదృష్ట్వా - వైదేహీం - విశ్రుతాః - పురుషర్షభ, వనం - దత్తవరం - దివ్యం - ధర్షయేయుః - వనౌకసః ॥

అన్వయక్రమము :- పురుషర్షభ! విశ్రుతాః వనౌకసః వైదేహీమ్ అదృష్ట్వా దత్తవరం దివ్యం వనం న చ ధర్షయేయుః.

ప్రతిపదార్థము :- పురుషర్షభ = వానరశ్రేష్ఠుడా! విశ్రుతాః = సుప్రసిద్ధులైనట్టి, వనౌకసః = వానరులు, వైదేహీం = జానకిని, అదృష్ట్వా = చూడకుండ, దత్తవరం = ఈయబడిన వరముగల, దివ్యం = గొప్పదైనట్టి, వనం = మధువనమును, నచ ధర్షయేయుః = ధ్వంసము చేయరుసుమా!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- 'దత్తవరం దివ్యం వనం' పూర్వము బ్రహ్మదేవుడు సుగ్రీవుని తండ్రియైన ఋక్షరజసున కీ మధువనము నొసగినాడని తెలియుచున్నది.

రా.శిరోమణి :- 'దత్తవరం దివ్యం వనం' మాచే అధికార మొసగబడి రక్షింపబడు చున్నట్టి వనము.

తాత్పర్యము :- ఓ పురుషశ్రేష్ఠుడా! విఖ్యాతచరిత్రులైన మన అంగదాదివీరులు సీతాదేవిని చూడకుండ బ్రహ్మదేవునిచే వరముగా మా కొసగబడినట్టి ఈ దివ్యమైన మధువనమును ధ్వంసము చేయబోవరు సుమా!

శ్లో॥ తతః ప్రహృష్టో ధర్మాత్మా లక్ష్మణ స్సహరాఘవః ॥ 24

పదచ్ఛేదము :- తతః - ప్రహృష్టః - ధర్మాత్మా - లక్ష్మణః - సహరాఘవః ॥

అన్వయక్రమము :- తతః ధర్మాత్మా సహరాఘవః లక్ష్మణః ప్రహృష్టః (అభవత్).

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, ధర్మాత్మా = పరమ ధార్మికుడును, సహరాఘవః = శ్రీరామునితో కూడియున్న వాడునగు, లక్ష్మణః = లక్ష్మణుడు, ప్రహృష్టః = మిక్కిలి హర్షము నొందినవాడు, అభవత్ = అయ్యెను.

తాత్పర్యము :- సుగ్రీవుని మాటలను విని ధర్మాత్ముడైన లక్ష్మణుడు శ్రీరామునితో కలిసి మిక్కిలి ఆనందమునొందెను.

శ్లో॥ శ్రుత్వా కర్ణసుఖాం వాణీం సుగ్రీవవదనా చ్చ్యుతామ్ ।
ప్రాహృష్యత భృశం రామో లక్ష్మణశ్చ మహాబలః ॥ 25

పదచ్ఛేదము :- శ్రుత్వా - కర్ణసుఖాం - వాణీం - సుగ్రీవవదనాత్ - చ్యుతామ్, ప్రాహృష్యత - భృశం - రామః - లక్ష్మణః - చ - మహాబలః ॥

అన్వయక్రమము :- రామః సుగ్రీవవదనాత్ చ్యుతాం కర్ణసుఖాం వాణీం శ్రుత్వా భృశం ప్రాహృష్యత, మహాబలః లక్ష్మణః చ (ప్రాహృష్యత).

ప్రతిపదార్థము :- రామః = శ్రీరాముడు, సుగ్రీవవదనాత్ చ్యుతాం = సుగ్రీవుని నోటినుండి వెలువడినట్టి, కర్ణసుఖాం = వీనులకు విందైనట్టి, వాణీం = మాటను, శ్రుత్వా = విని, భృశం = మిక్కిలిగా, ప్రాహృష్యత = ఆనందము నొందెను, మహాబలః = వీరుడైన, లక్ష్మణః చ = లక్ష్మణుడును, ప్రాహృష్యత = ఆనందించెను.

తాత్పర్యము :- "మన హనుమ సీతాదేవిని కనుగొని వచ్చినాడని తెలియుచున్నది" అని సుగ్రీవుడు వీనులకు విందుగా చెప్పుచున్న మాటలను వినుచు శ్రీరాముడమితమైన ఆనందము నొందెను. తమ్ముడైన లక్ష్మణుడును ఎంతయో సంతోషించెను.

శ్లో॥ శ్రుత్వా దధిముఖ స్యేదం సుగ్రీవస్తు ప్రహృష్య చ ।
వనపాలం పునర్వాక్యం సుగ్రీవః ప్రత్యభాషత ॥ 26

పదచ్ఛేదము :- శ్రుత్వా - దధిముఖస్య - ఇదం - సుగ్రీవః - తు - ప్రహృష్య - చ, వనపాలం - పునః - వాక్యం - సుగ్రీవః - ప్రత్యభాషత ॥

అన్వయక్రమము :- దధిముఖస్య ఇదం (వాక్యం) శ్రుత్వా సుగ్రీవః తు ప్రహృష్య వనపాలం పునః వాక్యం ప్రత్యభాషత.

ప్రతిపదార్థము :- ఇదం (వాక్యం) = ఈ మాటను, శ్రుత్వా = విని, సుగ్రీవః =

మంచికంఠము కల్గినట్టి, సుగ్రీవః తు = సుగ్రీవుడు, ప్రహృష్య = మిక్కిలి సంతసించి, వనపాలం = వనపాలకుడైన దధిముఖునిగూర్చి, పునః = తిరిగి, వాక్యం = మాటను, ప్రత్యభాషత = సమాధానముగా చెప్పెను.

తాత్పర్యము :- దధిముఖుడు చెప్పిన మాటలను ఆలకించి చక్కని కంఠముగల సుగ్రీవుడు మహానందముతో ఆతనిని గూర్చి ఈ రీతిగా పలికెను.

శ్లో॥ ప్రీతో ఽస్మి సోఽహం యద్భుక్తం వనం తైః కృతకర్మభిః ।
మర్షితం మర్షణీయం చ చేష్టితం కృతకర్మణామ్ ॥ 27

పదచ్ఛేదము :- ప్రీతః - అస్మి - సః - అహం - యత్ - భుక్తం - వనం - తైః - కృతకర్మభిః, మర్షితం - మర్షణీయం - చ - చేష్టితం - కృతకర్మణామ్ ॥

అన్వయక్రమము :- యత్ కృతకర్మభిః తైః వనం భుక్తం, (తత్) సః అహం ప్రీతః అస్మి, కృతకర్మణాం మర్షణీయం చేష్టితం మర్షితం చ.

ప్రతిపదార్థము :- యత్ = ఏ కారణమువలన, కృతకర్మభిః = సాధించిన కృత్యముగల వారైనట్టి, తైః = ఆ వానరులచే, వనం = మధువనము, భుక్తం = భక్షింపబడినదో, (తత్ = ఆ కారణమువల్ల) సః = అట్టి, అహం = నేను, ప్రీతః = సంతోషము నొందినవాడను, అస్మి = అగుచున్నాను, కృతకర్మణాం = సాధింపబడిన కృత్యములు గల్గినట్టి వారియొక్క, మర్షణీయం = క్షమింపదగినట్టి, చేష్టితం = చర్య, మర్షితం చ = క్షమింపబడినదికూడను.

తాత్పర్యము :- తాను పూనిన పనిని సాధించుకొనివచ్చిన అంగదాది వానరశ్రేష్ఠులు మన మధువనమునుచేరి మధువును భక్షించిరని తెలిసి నేను మిక్కిలి సంతసించితిని, కృతకృత్యులై వచ్చినట్టి వారిచర్య సహింపదగ్గదే కాబట్టి నేను దానిని క్షమించుచున్నాను.

శ్లో॥ ఇచ్ఛామి శీఘ్రం హనుమత్ప్రధానాన్
శాఖామృగాం స్తాన్ మృగరాజదర్పాన్ ।
ద్రష్టుం కృతార్థాన్ సహ రాఘవాభ్యాం
శ్రోతుం చ సీతాధిగమే ప్రయత్నమ్ ॥ 28

పదచ్ఛేదము :- ఇచ్ఛామి - శీఘ్రం - హనుమత్ప్రధానాన్ - శాఖామృగాన్ - తాన్ - మృగరాజదర్పాన్, ద్రష్టుం - కృతార్థాన్ - సహ - రాఘవాభ్యాం - శ్రోతుం - చ - సీతాధిగమే - ప్రయత్నమ్ ॥

అన్వయక్రమము :- హనుమత్ప్రధానాన్ మృగరాజదర్పాన్ కృతార్థాన్ తాన్ శాఖా

మృగాన్ రాఘవాభ్యాం సహ ద్రష్టుం, సీతాధిగమే ప్రయత్నం శ్రోతుం చ ఇచ్ఛామి.

ప్రతిపదార్థము :– హనుమత్ప్రధానాన్ = హనుమంతుడు మొదలైన, మృగరాజదర్పాన్ = సింహదర్పము కల్గినట్టి, తాన్ = ఆ, కృతార్థాన్ = కార్యసాఫల్యము కలిగినట్టి, శాఖామృగాన్ = వానరులను, శీఘ్రం = త్వరగా, రాఘవాభ్యాం సహ = రామలక్ష్మణులతో కలిసి, ద్రష్టుం = చూచుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను, సీతాధిగమే = సీతమ్మను తెలిసికొనుటయందు, ప్రయత్నం చ = ప్రయత్నమును గూర్చియును, శ్రోతుం చ = వినుటకుగూడ, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తాత్పర్యము :– సింహపరాక్రములైనట్టి హనుమంతుడు మున్నగు కృతకృత్యులై వచ్చిన మా వానరవీరులను నేనును మా రామలక్ష్మణులును శీఘ్రముగా చూడవలెననియు, సీతమ్మకొరకై చేసెడి ప్రయత్నమును గూర్చి వినవలెననియును మిక్కిలి కుతూహలముగ నున్నాము.

శ్లో॥ ప్రీతిస్ఫీతాక్షౌ సంప్రహృష్టౌ కుమారౌ
దృష్ట్వా సిద్ధార్థౌ వానరాణాం చ రాజా ।
అంగై స్సంహృష్టైః కర్మసిద్ధిం విదిత్వా
బాహ్వో రాసన్నాం సోఽతిమాత్రం ననంద ॥ 29

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"సుగ్రీవహర్షో" నామ
త్రిషష్టితమస్సర్గః

పదచ్ఛేదము :– ప్రీతిస్ఫీతాక్షౌ – సంప్రహృష్టౌ – కుమారౌ – దృష్ట్వా – సిద్ధార్థౌ – వానరాణాం – చ – రాజా, అంగైః – సంహృష్టైః – కర్మసిద్ధిం – విదిత్వా – బాహ్వోః – ఆసన్నాం – సః – అతిమాత్రం – ననంద ॥

అన్వయక్రమము :– కుమారౌ సిద్ధార్థౌ ప్రీతిస్ఫీతాక్షౌ సంప్రహృష్టౌ దృష్ట్వా సః వానరాణాం రాజా సంహృష్టైః అంగైః కర్మసిద్ధిం బాహ్వోః ఆసన్నాం విదిత్వా అతిమాత్రం ననంద.

ప్రతిపదార్థము :– కుమారౌ = రాజకుమారులగు ఆ రామలక్ష్మణు లిర్వురును, సిద్ధార్థౌ = కృతార్థులైనవారినిగాను, ప్రీతిస్ఫీతాక్షౌ = సంతోషముచే విప్పారిన కన్నులుగల వారినిగాను, సంప్రహృష్టౌ = మిక్కిలి ఆనందము నొందిన వారినిగాను, దృష్ట్వా = చూచి, సః = ఆ, వానరాణాం రాజా = వానరరాజైన సుగ్రీవుడు, సంహృష్టైః =

గగుర్పాటు నొందినట్టి, అంగైః = అవయవములచే, కర్మసిద్ధిం = కార్యసిద్ధిని, బాహ్వోః = చేతులకు, ఆసన్నాం = సమీపించిన దానినిగా, విదిత్వా = తెలిసికొని, అతిమాత్రం = మిక్కిలిగా, ననంద = ఆనందించెను.

తాత్పర్యము :– రామలక్ష్మణు లిరువురును అప్పుడు తెలిసిన కార్యసాఫల్యమునకు గొప్ప ఆనందము గలిగి ముఖము వికసించి ఒడలు పులకరించుచుండగా మిక్కిలి సంతోషము నొందుటను జూచుచు సుగ్రీవు డా సమయమునందు తనకు గలిగిన అవయవములందలి గగుర్పాటుచే తాను పూనిన యత్నము సఫలమై ఫలితము చేతికి లభించినదని అమితమైన ఆనందము నొందెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"సుగ్రీవహర్షము" అను
అరువదిమూడవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

చతుష్షష్టితమసర్గ

శ్లో॥ సుగ్రీవేణైవ ముక్తస్తు హృష్టో దధిముఖః కపిః ।
రాఘవం లక్ష్మణం చైవ సుగ్రీవం చాభ్యవాదయత్ ॥ 1

పదచ్ఛేదము :- సుగ్రీవేణ – ఏవమ్ – ఉక్తః – తు – హృష్టః – దధిముఖః – కపిః, రాఘవం – లక్ష్మణం – చ – ఏవ – సుగ్రీవం – చ – అభ్యవాదయత్ ॥

అన్వయక్రమము :- సుగ్రీవేణ ఏవమ్ ఉక్తః దధిముఖః కపిః హృష్టః సన్ రాఘవం లక్ష్మణం చ, సుగ్రీవం చ ఏవ అభ్యవాదయత్.

ప్రతిపదార్థము :- సుగ్రీవేణ = సుగ్రీవునిచే, ఏవం = ఈరీతిగా, ఉక్తః = చెప్పబడినవాడై, దధిముఖః వానరః = దధిముఖుడను వానరుడు, హృష్టః సన్ = సంతోషము నొందినవాడై, రాఘవం = శ్రీరాముని, లక్ష్మణం చ = లక్ష్మణుని మరియు, సుగ్రీవం చైవ = సుగ్రీవునిని, అభ్యవాదయత్ = మ్రొక్కెను.

తాత్పర్యము :- సుగ్రీవుడిట్లు చెప్పగనే ఆ దధిముఖుడు సంతోషము నొందినవాడై, శ్రీరామునకును లక్ష్మణునకును సుగ్రీవునకును నమస్కారములు చేసెను.

శ్లో॥ స ప్రణమ్య చ సుగ్రీవం రాఘవౌ చ మహాబలౌ ।
వానరై స్సహిత శ్శూరై ర్దివమే వోత్పపాత హ ॥ 2

పదచ్ఛేదము :- సః – ప్రణమ్య – చ – సుగ్రీవం – రాఘవౌ – చ – మహాబలౌ, వానరైః – సహితః – శూరైః – దివమ్ – ఏవ – ఉత్పపాత – హ ॥

అన్వయక్రమము :- సః సుగ్రీవం మహాబలౌ రాఘవౌ చ ప్రణమ్య శూరైః వానరైః సహితః దివమ్ ఏవ ఉత్పపాత.

ప్రతిపదార్థము :- సః = ఆ దధిముఖుడు, సుగ్రీవం = సుగ్రీవుని, మహాబలౌ = మహాబల సంపన్నులైన, రాఘవౌ చ = రామలక్ష్మణులను, ప్రణమ్య = నమస్కరించి, శూరైః = వీరులైన, వానరైః = వానరులతో, సహితః = కూడినవాడై, దివమ్ ఏవ = ఆకాశమును గూర్చియే, ఉత్పపాత = ఎగిరెను.

తాత్పర్యము :- అప్పుడా దధిముఖుడు అట్లు సుగ్రీవునకును మహావీరులైన రామలక్ష్మణులకును మ్రొక్కి తన పరివారముతో కలిసి ఆకాశము మీదికి ఎగిరి పోయెను.

శ్లో॥ స యథై వాగతః పూర్వం తథైవ త్వరితం గతః ।
నిపత్య గగనా ద్భూమౌ తద్వనం ప్రవివేశ హ ॥ 3

పదచ్ఛేదము :- యథా - ఏవ - ఆగతః - పూర్వం - తథా - ఏవ - త్వరితం - గతః, నిపత్య - గగనాత్ - భూమౌ - తత్ - వనం - ప్రవివేశ - హ ॥

అన్వయక్రమము :- సః పూర్వం యథైవ ఆగతః, తథైవ త్వరితం గతః, గగనాత్ భూమౌ నిపత్య తత్ వనం ప్రవివేశ.

ప్రతిపదార్థము :- సః = ఆ దధిముఖుడు, పూర్వం = వెనుక, యథైవ = ఏ రీతిగా, ఆగతః = వచ్చినాడో, తథైవ = ఆ రీతిగనే, త్వరితం = వేగముగా, గతః = వెడలినాడు, గగనాత్ = ఆకాశమునుండి, భూమౌ = నేలమీద, నిపత్య = దిగి, తత్ = ఆ, వనం = మధువనమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తాత్పర్యము :- ఆ దధిముఖుడు వెనుక తాను వచ్చినట్లుగనే మిక్కిలి వేగముతో తిరిగి వెడలిపోయెను. అట్లు ఆకసమున పయనించి తన వనముకడ నేల మీదికి దిగి ఆ మధువనమున ప్రవేశించెను.

శ్లో॥ స ప్రవిష్టో మధువనం దదర్శ హరియూథపాన్ ।
విమదా నుత్థితా న్సర్వా న్మేహమానా న్మధూదకమ్ ॥ 4

పదచ్ఛేదము :- సః - ప్రవిష్టః - మధువనం - దదర్శ - హరియూథపాన్, విమదాన్ - ఉత్థితాన్ - సర్వాన్ - మేహమానాన్ - మధూదకమ్ ॥

అన్వయక్రమము :- సః మధువనం ప్రవిష్టః సన్ హరియూథపాన్ సర్వాన్, విమదాన్ ఉత్థితాన్ మధూదకం మేహమానాన్ దదర్శ.

ప్రతిపదార్థము :- సః = ఆ దధిముఖుడు, మధువనం = మధువనమును, ప్రవిష్టః = ప్రవేశించినవాడై, హరియూథపాన్ = వానరయోధులను, సర్వాన్ = అందరిని, విమదాన్ = మత్తుతొలగిన వారినిగను, ఉత్థితాన్ = మేల్కొన్న వారినిగను, మధూదకం = మధుమిశ్రితమైన నీరును, మేహమానాన్ = మూత్రించుచున్న వారినిగను, దదర్శ = చూచెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– తేనెలను నీటిని మూత్రముగ విడుచుచున్నట్టి వారు అనగా వారు త్రాగిన మధువు జీర్ణమై మత్తు తొలగిపోయినది. వారు విమదులై ఉత్థితులై యుండిరి. వారు తేనెతోబాటుగా నీరుకూడ అనుపానముగా త్రాగియున్నారు. తేనెకు ఉదక మనుపానమని వాగ్భటుడు తెలిపియున్నాడు.

"శ్లో॥ అనుపానం హిమం వారి యవగోధూమయో ర్హితమ్ ।
దధ్ని మద్యే బిసే క్షౌద్రే కోష్ణం పిష్టమయేషు చ ॥"

తాత్పర్యము :– ఆ దధిముఖుడు అట్లు మధువనమున ప్రవేశించి అచ్చట అప్పటికి మధుపానముచే గలిగిన మైకము తొలగి మత్తునుండి లేచి మిక్కిలిగ మధుపానము చేయుటచే మధువుతో గూడిన మూత్రము విడుచుచున్న వానరయోధులను గాంచెను.

శ్లో॥ స తా నుపాగమ ద్వీరో బద్ధ్వా కరపుటాంజలిమ్ ।
ఉవాచ వచనం శ్లక్ష్ణ మిదం హృష్టవ దంగదమ్ ॥ 5

పదచ్ఛేదము :– సః – తాన్ – ఉపాగమత్ – వీరః – బద్ధ్వా – కరపుటాంజలిమ్, ఉవాచ – వచనం – శ్లక్ష్ణమ్ – ఇదం – హృష్టవత్ – అంగదమ్ ॥

అన్వయక్రమము :– వీరః సః తాన్ ఉపాగమత్, కరపుటాంజలిం బద్ధ్వా హృష్టవత్ అంగదం శ్లక్ష్ణమ్ ఇదం వచనమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :– వీరః = వీరుడైనట్టి, సః = ఆ దధిముఖుడు, తాన్ = ఆ వానరులను, ఉపాగమత్ = చేరెను, కరపుటాంజలిం = దగ్గరకు చేర్చిన చేతులుగల దోసిలిని, బద్ధ్వా = కూర్చి, హృష్టవత్ = సంతోషించినట్లు, అంగదం = అంగదునిగూర్చి, శ్లక్ష్ణం = మృదువైనట్టి, ఇదం = ఈ, వచనం = మాటను, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :– అప్పుడా దధిముఖుడా వానరవీరులను చేరి దోసిలొగ్గి వినయముతో తన సంతోషమును సూచించుచు అంగదుని చూచి మృదువైన మాటలతో ఇట్లు పలికెను.

శ్లో॥ సౌమ్య రోషో న కర్తవ్యో య దేభి రభివారితః ।
అజ్ఞానా ద్రక్షిభిః క్రోధా ద్భవంతః ప్రతిషేధితాః ॥ 6

పదచ్ఛేదము :– సౌమ్య – రోషః – న – కర్తవ్యః – యత్ – ఏభిః – అభివారితః, అజ్ఞానాత్ – రక్షిభిః – క్రోధాత్ – భవంతః – ప్రతిషేధితాః ॥

అన్వయక్రమము :- సౌమ్య! ఏభిః అభివారితః (ఇతి) యత్ (అత్ర) రోషః న కర్తవ్యః. భవంతః అజ్ఞానాత్ క్రోధాత్ రక్షిభిః ప్రతిషేధితాః.

ప్రతిపదార్థము :- సౌమ్య! = ఓ సౌమ్యస్వభావుడా! ఏభిః = ఈ వనపాలురచే, అభివారితః = అడ్డగింపబడితిని, ఇతి = అని, యత్ = ఏది యున్నదో, అత్ర = ఈ విషయమున, రోషః = కోపము, న కర్తవ్యః = చేయదగదు, భవంతః = మీరలు, అజ్ఞానాత్ = అజ్ఞానమువలన, క్రోధాత్ = కోపమువలన, రక్షిభిః = వనరక్షకులచే, ప్రతిషేధితాః = నివారింపబడినారు.

తాత్పర్యము :- ఓ సౌమ్యుడా! మా వనపాలురు అడ్డగించినందులకు కోపము నొందవలదు. ఏలననగా ఈ వనరక్షకులు మీ యధికారమును గూర్చి తెలియక అజ్ఞానముచే క్రోధము నొంది మిమ్మందరిని ఎదుర్కొని అడ్డగించినారు.

శ్లో॥ యువరాజ స్త్వ మీశశ్చ వన స్యాస్య మహాబల!
మౌర్ఖ్యా త్పూర్వం కృతో దోష స్తం భవాన్ క్షంతుమర్హతి ॥ 7

పదచ్ఛేదము :- యువరాజః - త్వమ్ - ఈశః - చ - వనస్య - అస్య - మహాబల!, మౌర్ఖ్యాత్ - పూర్వం - కృతః - దోషః - తం - భవాన్ - క్షంతుమ్ - అర్హతి ॥

అన్వయక్రమము :- మహాబల! త్వం యువరాజః, అస్య వనస్య ఈశః చ, మౌర్ఖ్యాత్ పూర్వం దోషః కృతః, భవాన్ తం క్షంతుమ్ అర్హతి.

ప్రతిపదార్థము :- మహాబల! = ఓ మహాబలాఢ్యుడా!, త్వం = నీవు, యువరాజః = యువరాజువు, అస్య = ఈ, వనస్య = మధువనమునకు, ఈశః చ = అధిపతివి గూడ, పూర్వం = వెనుక, మౌర్ఖ్యాత్ = అజ్ఞానమువలన, దోషః = అపరాధము, కృతః = చేయబడినది, తం = ఆ తప్పును, భవాన్ = నీవు, క్షంతుం = క్షమించుటకు, అర్హతి = తగుదువు.

తాత్పర్యము :- ఓ మహాబలాఢ్యుడా! వానరరాజ్యమునకు యువరాజైనట్టి నీవు ఈ మధువనమునకు గూడ ప్రభువై యున్నావుగదా! ఇంతకుముందు మేము అజ్ఞానముచే నీయెడ అపరాధమును చేసియున్నాము. ఆ తప్పును నీవు దయతో క్షమింపుము.

శ్లో॥ శ్రాంతో దూరా దనుప్రాప్తో భక్షయస్వ స్వకం మధు ।
యథైవ హి పితా తే ఽభూ త్పూర్వం హరిగణేశ్వరః ।
తథా త్వ మపి సుగ్రీవో నాన్యస్తు హరిసత్తమ ॥ 8

పదచ్ఛేదము :- శ్రాంతః - దూరాత్ - అనుప్రాప్తః - భక్షయస్వ - స్వకం - మధు,

మధు – యథా – ఏవ – హి – పితా – తే – అభూత్ – పూర్వం – హరిగణేశ్వరః, తథా – త్వమ్ – అపి – సుగ్రీవః – న – అన్యః – తు – హరిసత్తమ ॥

అన్వయక్రమము :– దూరాత్ అనుప్రాప్తః (త్వం) శ్రాంతః స్వకం మధు భక్షయస్వ, హరిసత్తమ! యథైవ పూర్వం తే పితా హరిగణేశ్వరః తథా త్వమ్ అపి సుగ్రీవః (అపి) అన్యః తు న.

ప్రతిపదార్థము :– దూరాత్ = దూరమునుండి, అనుప్రాప్తః = వచ్చినట్టి, (త్వం = నీవు) శ్రాంతః = అలసినాడవు, స్వకం = నీ స్వంతమైనట్టి, మధు = మధువును, భక్షయస్వ =భక్షింపుము, పూర్వం = వెనుకటికాలమున, యథైవ = ఏరీతిగా, తే = నీయొక్క, పితా = తండ్రియైన వాలి, హరిగణేశ్వరః = వానరసమూహమునకు ప్రభువై యుండెనో, హరిసత్తమ! = ఓ వానరశ్రేష్ఠుడా! తథా = అట్లు, త్వమ్ అపి = నీవుగూడను, సుగ్రీవః అపి = సుగ్రీవుడు కూడను, హరిగణేశ్వరః = వానరాధిపతి, అన్యః తు = వేరొకడు మాత్రము, న = కాడు.

తాత్పర్యము :– ఓ యువరాజా! నీవు చాలదూరమునుండి ఈ వనమునకు వచ్చి అలసియుంటివి. కాబట్టి నీ తోటలోని తేనెను నీవు స్వేచ్ఛగా త్రాగుము. ఇంతకు పూర్వము నీ తండ్రియైన వాలి వానరలోకమున కెట్లు ప్రభువో నేడు నీవును సుగ్రీవుడును అట్లే వానరరాజ్యమునకు ప్రభువులై యున్నారుగదా!

సూచన :– ఈ మూడు శ్లోకార్థములు కొన్ని ప్రతులందు లేవు.

శ్లో॥ ఆఖ్యాతం హి మయా గత్వా పితృవ్యస్య త వానఘ ।
ఇహోపయాతం సర్వేషా మేతేషాం వనచారిణామ్ ॥ 9

పదచ్ఛేదము :– ఆఖ్యాతం – హి – మయా – గత్వా – పితృవ్యస్య – తవ – అనఘ, ఇహ – ఉపయాతం – సర్వేషామ్ – ఏతేషాం – వనచారిణామ్ ॥

అన్వయక్రమము :– అనఘ! తవ పితృవ్యస్య ఏతేషాం వనచారిణాం సర్వేషామ్ ఇహ ఉపయాతం మయా గత్వా ఆఖ్యాతం హి.

ప్రతిపదార్థము :– అనఘ = ఓ పాపరహితుడా, ఏతేషాం = ఈ, వనచారిణాం సర్వేషాం = వానరులందరియొక్క, ఇహ = ఇచటికి, ఉపయాతం చ = వచ్చుటను గూర్చి, మయా = నాచేత, గత్వా = పోయి, తవ = నీయొక్క, పితృవ్యస్య = పినతండ్రియైన సుగ్రీవునకు, ఆఖ్యాతం హి = చెప్పబడెను సుమా!

తాత్పర్యము :– ఓ పుణ్యాత్ముడా! మీ వానరులందరును ఈ మధువనమునకు వచ్చిన

విషయమును నేను నీ పినతండ్రియైన సుగ్రీవుని కడకుపోయి తెలిపియుంటిని సుమా!

శ్లో॥ స త్వదాగమనం శ్రుత్వా స హైభి ర్హరియూథపైః ।
ప్రహృష్టో నతు రుష్టో ఽసౌ వనం శ్రుత్వా ప్రధర్షితమ్ ॥ 10

పదచ్ఛేదము :– సః – త్వదాగమనం – శ్రుత్వా – సహ – ఏభిః – హరియూథపైః, ప్రహృష్టః – న – తు – రుష్టః – అసౌ – వనం – శ్రుత్వా – ప్రధర్షితమ్ ॥

అన్వయక్రమము :– సః ఏభిః హరియూథపైః సహ త్వదాగమనం శ్రుత్వా ప్రహృష్టః, అసౌ వనం ప్రధర్షితం శ్రుత్వా నతు రుష్టః.

ప్రతిపదార్థము :– సః = ఆ సుగ్రీవుడు, ఏభిః = ఈ, హరియూథపైః సహ = వానరయోధులతోగూడ, త్వదాగమనం = నీరాకనుగూర్చి, శ్రుత్వా = విని, ప్రహృష్టః = మిక్కిలి సంతోషించినాడు, అసౌ = ఆతడు, వనం = మధువనమును, ప్రధర్షితం = ధ్వంసముచేయబడిన దానినిగా, శ్రుత్వా = విని, న తు రుష్టః = కోపించినవాడు కాలేదు.

తాత్పర్యము :– ఈ వానరసమూహములతో కలిసి నీ వీ వనమునకు వచ్చుటను గూర్చి విన్న ఆ వానరరాజు మిక్కిలి సంతసించినాడు. ఈ మధువనము ధ్వంసము చేయబడినట్లు వినికూడ ఏమియు కోపము తెచ్చుకొనలేదు.

శ్లో॥ ప్రహృష్టో మాం పితృవ్యస్తే సుగ్రీవో వానరేశ్వరః ।
శీఘ్రం ప్రేషయ సర్వాం స్తా నితి హోవాచ పార్థివః ॥ 11

పదచ్ఛేదము :– ప్రహృష్టః – మాం – పితృవ్యః – తే – సుగ్రీవః – వానరేశ్వరః, శీఘ్రం – ప్రేషయ – సర్వాన్ – తాన్ – ఇతి – హ – ఉవాచ – పార్థివః ॥

అన్వయక్రమము :– తే పితృవ్యః వానరేశ్వరః పార్థివః సుగ్రీవః ప్రహృష్టః (సన్) తాన్ సర్వాన్ శీఘ్రం ప్రేషయ ఇతి మాం ఉవాచ హ!

ప్రతిపదార్థము :– తే పితృవ్యః = నీ పినతండ్రియును, వానరేశ్వరః = వానరరాజునగు, పార్థివః సుగ్రీవః = మహారాజైన సుగ్రీవుడు, ప్రహృష్టః (సన్) = మిక్కిలి సంతోషము నొందినవాడై, తాన్ సర్వాన్ = వారి నందరిని, శీఘ్రం = త్వరగా, ప్రేషయ = పంపుము, ఇతి = అని, మాం = నన్నుగూర్చి, ఉవాచ హ = పలికెను సుమా!

తాత్పర్యము :– వానరప్రభువైన నీ పినతండ్రి సుగ్రీవమహారాజు మిక్కిలి సంతోషించి మా అంగదాది వీరుల నందరిని త్వరగా ఇచటికి పంపించుమని నాతో చెప్పెను.

శ్లో॥ శ్రుత్వా దధిముఖ స్యైత ద్వచనం శ్లక్ష్ణ మంగదః ।
అబ్రవీ త్తాన్ హరిశ్రేష్ఠో వాక్యం వాక్యవిశారదః ॥ 12

పదచ్ఛేదము :– శ్రుత్వా – దధిముఖస్య – ఏతత్ – వచనం – శ్లక్ష్ణమ్ – అంగదః, అబ్రవీత్ – తాన్ – హరిశ్రేష్ఠః – వాక్యం – వాక్యవిశారదః ॥

అన్వయక్రమము :– దధిముఖస్య ఏతత్ శ్లక్ష్ణం వచనం శ్రుత్వా వాక్యవిశారదః హరిశ్రేష్ఠః అంగదః తాన్ వాక్యమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :– దధిముఖస్య = దధిముఖునియొక్క, ఏతత్ = ఈ, శ్లక్ష్ణం = మృదువైనట్టి, వచనం = మాటను, శ్రుత్వా = విని, వాక్యవిశారదః = మాటలందు నేర్పరియైనట్టి, హరిశ్రేష్ఠః అంగదః = వానరశ్రేష్ఠుడైన అంగదుడు, తాన్ = ఆ వానరులను గూర్చి, వాక్యమ్ అబ్రవీత్ = మాటను పలికెను.

తాత్పర్యము :– దధిముఖుడు చెప్పిన ఈ మృదువైన మాటలు విని వాక్యవిశారదుడైన అంగదుడు తన వానరవీరులను గూర్చి ఇట్లు పలికెను.

శ్లో॥ శంకే శ్రుతో ఉ యం వృత్తాంతో రామేణ హరియూథపాః ।
తత్క్షమం నేహ న స్థాతుం కృతే కార్యే పరంతపాః ॥ 13

పదచ్ఛేదము :– శంకే – శ్రుతః – అయం – వృత్తాంతః – రామేణ – హరియూథపాః, తత్ – క్షమం – న – ఇహ – నః – స్థాతుం – కృతే – కార్యే – పరంతపాః ॥

అన్వయక్రమము :– పరంతపాః హరియూథపాః! రామేణ అయం వృత్తాంతః శ్రుతః (ఇతి) శంకే, తత్ కార్యే కృతే (సతి) నః ఇహ స్థాతుం న క్షమమ్.

ప్రతిపదార్థము :– పరంతపాః = ఓ శత్రుసంహారకులారా! హరియూథపాః = వానరాగ్రేసరులారా!, రామేణ = శ్రీరామునిచే, అయం = ఈ, వృత్తాంతః = వృత్తాంతము, శ్రుతః = వినబడినది, (ఇతి = అని) శంకే = ఊహించుచున్నాను. తత్ = అందువలన, కార్యే = కార్యము, కృతే సతి = నెరవేర్పబడియుండగా, నః = మనకు, ఇహ = ఇచ్చట, స్థాతుం = నిలుచుటకు, న క్షమమ్ = తగదు.

తాత్పర్యము :– ఓ శత్రుభయంకరులైన వానరవీరులారా! మన వృత్తాంతమంతయును శ్రీరామునకు తెలిసిపోయినదని నేను ఊహించుచున్నాను. అందుచేత కర్తవ్యమును నిర్వహించుకొని వచ్చిన మనము ఇచ్చట జాగుచేయుట ఎంత మాత్రము ఉచితము కాదు.

శ్లో॥ పీత్వా మధు యథాకామం విశ్రాంతా వనచారిణః ।
కిం శేషం గమనం తత్ర సుగ్రీవో యత్ర నో విభుః ॥ 14

పదచ్ఛేదము :- పీత్వా - మధు - యథాకామం - విశ్రాంతాః - వనచారిణః, కిం - శేషం - గమనం - తత్ర - సుగ్రీవః - యత్ర - నః - విభుః ॥

అన్వయక్రమము :- వనచారిణః యథాకామం మధు పీత్వా విశ్రాంతాః. శేషం కిమ్? యత్ర నః విభుః సుగ్రీవః (అస్తి) తత్ర గమనం (ఉచితమ్).

ప్రతిపదార్థము :- వనచారిణః = వనచారులైన వానరులు, యథాకామం = స్వేచ్ఛగా, మధు = తేనెను, పీత్వా = త్రాగి, విశ్రాంతాః = విశ్రాంతినొందినారు. శేషం = మిగిలినది, కిం = ఏమి? యత్ర = ఎచ్చట, నః = మనయొక్క, విభుః = ప్రభువైన, సుగ్రీవః = సుగ్రీవుడు, (అస్తి = ఉన్నాడో), తత్ర = అచ్చటికి, గమనం = పోవుట, (ఉచితం = తగినది).

తాత్పర్యము :- మన వానరవీరు లెల్లరును తనివితీర తేనెలను త్రాగి విశ్రాంతి తీసికొనియున్నారు. ఇక మిగిలినది ఏమున్నది? ఇక మీదట మన ప్రభువైన సుగ్రీవుడున్న చోటికి త్వరితముగ పోవుదము.

శ్లో॥ సర్వే యథా మాం వక్ష్యంతి సమేత్య హరియూథపాః ।
తథా ఽస్మి కర్తా కర్తవ్యే భవద్భిః పరవా నహమ్ ॥ 15

పదచ్ఛేదము :- సర్వే - యథా - మాం - వక్ష్యంతి - సమేత్య - హరియూథపాః, తథా - అస్మి - కర్తా - కర్తవ్యే - భవద్భిః - పరవాన్ - అహమ్ ॥

అన్వయక్రమము :- హరియూథపాః సర్వే యథా సమేత్య మాం వక్ష్యంతి తథా కర్తా అస్మి, కర్తవ్యే అహం భవద్భిః పరవాన్.

ప్రతిపదార్థము :- హరియూథపాః = వానర ప్రభువులు, సర్వే = అందరును, సమేత్య = కలసి, యథా = ఏరీతిగా, మాం = నన్నుగూర్చి, వక్ష్యంతి = పలుకుదురో, తథా = ఆ రీతిగా, కర్తా = చేయువాడను, అస్మి = అగుచున్నాను. కర్తవ్యే = కర్తవ్యమునందు, అహం = నేను, భవద్భిః = మీచేత, పరవాన్ = పరాధీనుడను.

తాత్పర్యము :- మీ వానరశ్రేష్ఠు లెల్లరును కలసి ఆలోచించి నన్నేరీతిగా ఆజ్ఞాపించెదరో ఆ విధముగా చేయుటకు నేను సంసిద్ధుడనే. కర్తవ్య నిర్ణయమునందు సర్వథా మీకు నేను అధీనుడను.

శ్లో॥ నాఽఽజ్ఞాపయితు మీశోఽహం యువరాజోఽస్మి యద్యపి ।
అయుక్తం కృతకర్మాణో యూయం ధర్షయితుం మయా ॥ 16

పదచ్ఛేదము :– న – ఆజ్ఞాపయితుమ్ – ఈశః – అహం – యువరాజః – అస్మి – యది – అపి, అయుక్తం – కృతకర్మాణః – యూయం – ధర్షయితుం – మయా ॥

అన్వయక్రమము :– యువరాజః అస్మి యద్యపి అహమ్ ఆజ్ఞాపయితుం ఈశః న, యూయం కృతకర్మాణః, మయా ధర్షయితుమ్ అయుక్తమ్.

ప్రతిపదార్థము :– యువరాజః = యువరాజును, అస్మి యద్యపి = అయినప్పటికిని, ఆజ్ఞాపయితుం = ఆజ్ఞాపించుటకు, అహం = నేను, ఈశః = సమర్ధుడను, న = కాను, కృతకర్మాణః = చేయబడినకార్యము కల్గియున్నట్టి, యూయం = మీరు, మయా = నాచేత, ధర్షయితుమ్ = బలవంతము చేయుటకు, అయుక్తమ్ = న్యాయముకాదు.

తాత్పర్యము :– నే నెంతటి యువరాజు నైనప్పటికిని, ఇట్లే చేయుడని మిమ్మాజ్ఞాపించుట నాకు తగదు. కర్తవ్యమును నెరవేర్చుకొని వచ్చినట్టి మిమ్ము నేను బలవంతము చేసి ఆజ్ఞాపించుట ఎంతమాత్రము ఉచితముకాదు.

శ్లో॥ బ్రువత శ్చాంగద స్యైవం శ్రుత్వా వచన మవ్యయమ్ ।
ప్రహృష్టమనసో వాక్య మిద మూచు ర్వనౌకసః ॥ 17

పదచ్ఛేదము :– బ్రువతః – చ – అంగదస్య – ఏవం – శ్రుత్వా – వచనమ్ – అవ్యయమ్, ప్రహృష్టమనసః – వాక్యమ్ – ఇదమ్ – ఊచుః – వనౌకసః ॥

అన్వయక్రమము :– ఏవం బ్రువతః అంగదస్య అవ్యయం వచనం శ్రుత్వా వనౌకసః ప్రహృష్టమనసః (సంతః) ఇదం వాక్యమ్ ఊచుః.

ప్రతిపదార్థము :– ఏవం = ఈరీతిగా, బ్రువతః = పలుకుచున్నట్టి, అంగదస్య = అంగదునియొక్క, అవ్యయం = స్థిరమైనట్టి, వచనం = మాటను, శ్రుత్వా = విని, వనౌకసః = వానరులు, ప్రహృష్టమనసః (సంతః) = గొప్ప సంతోషము నొందిన మనస్సుగలవా రగుచు, ఇదం = ఈ, వాక్యం = మాటను, ఊచుః = పలికిరి.

తాత్పర్యము :– అంగదు డిట్లు పలుకుటను విని ఆ వానరులందరును ఆతని యథార్థ వచనములకు మిక్కిలి సంతోషము నొందినవారై ఆతనితో ఇట్లు పలికిరి.

శ్లో॥ ఏవం వక్ష్యతి కో రాజన్ ప్రభు స్సన్ వానరర్షభ ।
ఐశ్వర్యమదమత్తో హి సర్వో ఽహ మితి మన్యతే ॥ 18

పదచ్ఛేదము :- ఏవం - వక్ష్యతి - కః - రాజన్ - ప్రభుః - సన్ - వానరర్షభ, ఐశ్వర్యమదమత్తః - హి - సర్వః - అహమ్ - ఇతి - మన్యతే ॥

అన్వయక్రమము :- వానరర్షభ! రాజన్! ప్రభుః సన్ కః ఏవం వక్ష్యతి? సర్వః ఐశ్వర్యమదమత్తః అహం శ్రేష్ఠః ఇది మన్యతే హి.

ప్రతిపదార్థము :- వానరర్షభ! = వానర శ్రేష్ఠుడా!, రాజన్ = రాజా!, ప్రభుః సన్ = అధికారియై యుండియును, కః = ఎవ్వడు, ఏవం = ఇట్లు వినయముగా, వక్ష్యతి = పలుకగలడు? సర్వః = ప్రతివాడును, ఐశ్వర్యమదమత్తః = అధికారమదముచే మత్తిల్లినవాడై, అహం = నేను, శ్రేష్ఠః = సర్వాధికుడను, ఇతి = అని, మన్యతే హి = తలచునుగదా!

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడవైన ఓ యువరాజా! గొప్ప అధికారము చేతియందు ఉండియుగూడ ఇంత వినయముగా ఎవడు మాటాడగలడు? లోకమునందు ప్రతివాడును ఐశ్వర్యమదముచే మత్తిల్లినవాడై అందరికంటె నేనే ఉత్కృష్టుడనని భావించును గదా!

శ్లో॥ తవ చేదం సుసదృశం వాక్యం నాన్యస్య కస్యచిత్ ।
సంనతిర్హి తవాఖ్యాతి భవిష్యచ్ఛుభయోగ్యతామ్ ॥ 19

పదచ్ఛేదము :- తవ - చ - ఇదం - సుసదృశం - వాక్యం - న - అన్యస్య - కస్యచిత్, సంనతిః - హి - తవ - ఆఖ్యాతి - భవిష్యచ్ఛుభయోగ్యతామ్ ॥

అన్వయక్రమము :- ఇదం వాక్యం చ తవ సుసదృశమ్, అన్యస్య కస్యచిత్ న (సదృశమ్). తవ సంనతిః భవిష్యచ్ఛుభయోగ్యతాం ఆఖ్యాతి హి.

ప్రతిపదార్థము :- ఇదం = ఈ, వాక్యం చ = మాటయును, తవ = నీకు, సుసదృశం = మిక్కిలి తగియున్నది, అన్యస్య = వేరైనట్టి, కస్యచిత్ = ఎవ్వనికిని, న = తగినట్టిది గాదు, తవ = నీయొక్క, సంనతిః = వినయము, భవిష్యచ్ఛుభయోగ్యతాం = భావిశ్రేయములకు అర్హతను, ఆఖ్యాతి = చెప్పుచున్నది.

తాత్పర్యము :- నీవు చెప్పినమాట నీ యోగ్యతకు ఎంతయో సరిపడి యున్నది. వేరెవ్వడును ఇంత ఉచితముగ పలుకజాలడు. ఇట్టి నీ వినయమే నీవు భవిష్యత్కాలమున పొందబోయెడి గొప్పశుభములను వెల్లడించుచున్నది సుమా!

శ్లో॥ సర్వే వయమపి ప్రాప్తా స్తత్ర గంతుం కృతక్షణాః ।
స యత్ర హరివీరాణాం సుగ్రీవః పతి రవ్యయః ॥ 20

పదచ్ఛేదము :– సర్వే – వయం – అపి – ప్రాప్తాః – తత్ర – గంతుం – కృతక్షణాః, సః – యత్ర – హరివీరాణాం – సుగ్రీవః – పతిః – అవ్యయః ॥

అన్వయక్రమము :– హరివీరాణాం పతిః సుగ్రీవః అవ్యయః సన్ యత్ర (అస్తి), ప్రాప్తాః వయం సర్వే అపి తత్ర గంతుం కృతక్షణాః (స్మః).

ప్రతిపదార్థము :– హరివీరాణాం = వానరవీరులకు, పతిః = ప్రభువైనట్టి, సః సుగ్రీవః = ఆ సుగ్రీవుడు, అవ్యయః = స్థిరమైనవాడై, యత్ర = ఎచ్చటనయితే, అస్తి = ఉన్నాడో, ప్రాప్తాః = చేరియున్నట్టి, వయం = మేము, సర్వే అపి = ఎల్లరముగూడి, తత్ర = అచ్చటికి, గంతుం = పోవుటకు, కృతక్షణాః = పొందిన యుత్సాహము గలవారముగా, (స్మః = ఉన్నాము).

తాత్పర్యము :– వానరవీరులకు ప్రభువైన ఆ సుగ్రీవమహారాజు స్థిరసంకల్పుడై నిలచియున్నచోటికి పోవుటకు ఇక్కడ చేరిన మేమెల్లరమును గూడ కుతూహలముతో నున్నాము.

శ్లో॥ త్వయా హ్యనుక్తై ర్హరిభి ర్నైవ శక్యం పదాత్పదమ్ ।
క్వచి ద్గంతుం హరిశ్రేష్ఠ బ్రూమ స్సత్య మిదం తు తే ॥ 21

పదచ్ఛేదము :– త్వయా – హి – అనుక్తైః – హరిభిః – న – ఏవ – శక్యం – పదాత్ – పదమ్, క్వచిత్ – గంతుం – హరిశ్రేష్ఠ – బ్రూమః – సత్యమ్ – ఇదం – తు – తే ॥

అన్వయక్రమము :– హరిశ్రేష్ఠ! త్వయా అనుక్తైః హరిభిః పదాత్ పదం క్వచిత్ గంతుం నైవ శక్యమ్, ఇదం సత్యం తే బ్రూమః.

ప్రతిపదార్థము :– హరిశ్రేష్ఠ! = ఓ వానరశ్రేష్ఠుడా! త్వయా = నీచేత, అనుక్తైః = చెప్పబడనట్టి, హరిభిః = వానరులచేత, క్వచిత్ = ఎచ్చటికిని, పదాత్ = ఒక అడుగు నుండి, పదం = (ఇంకొక) అడుగును, గంతుం = పోవుటకు, నైవ శక్యం = ఏమియును శక్యము గాదు. ఇదం = ఈ, సత్యం = యథార్థమును, తే = నీకు, బ్రూమః = చెప్పుచున్నాము.

తాత్పర్యము :– ఓ వానరశ్రేష్ఠుడా! నీవు ఆజ్ఞాపించని యెడల మా వానరులతో ఎవ్వడును గూడ ఒక అడుగుతీసి ఇంకొక అడుగు ఎచ్చటికిని వేయజాలడు. ఈ వాస్తవమును నీకు మరల మేము తెలుపుచున్నాము.

శ్లో॥ ఏవం తు వదతాం తేషా మంగదః ప్రత్యభాషత ।
బాఢం గచ్ఛామ ఇత్యుక్త్వా ఖ ముత్పేతు ర్మహాబలాః ॥ 22

పదచ్ఛేదము :- ఏవం - తు - వదతాం - తేషామ్ - అంగదః - ప్రత్యభాషత, బాఢం - గచ్ఛామః - ఇతి - ఉక్త్వా - ఖమ్ - ఉత్పేతుః - మహాబలాః ॥

అన్వయక్రమము :- తేషామ్ ఏవం వదతాం (సతామ్) అంగదః బాఢమ్ ఇతి ప్రత్యభాషత, గచ్ఛామః ఇతి ఉక్త్వా (తే) ఖమ్ ఉత్పేతుః.

ప్రతిపదార్థము :- తేషామ్ = ఆ వానరవీరులు, ఏవం = ఈవిధముగా, వదతాం సతామ్ = చెప్పుచుండగా, అంగదః = అంగదుడు, బాఢం = బాగు, ఇతి = అని, ప్రత్యభాషత = జవాబుచెప్పెను, గచ్ఛామః = వెడలుదము, ఇతి = అని, ఉక్త్వా = పలికి, మహాబలాః = మహాబలసంపన్నులైన, తే = ఆ వానరులు, ఖం = ఆకాశమును గూర్చి, ఉత్పేతుః = ఎగిరిరి.

తాత్పర్యము :- వానరులందరు ఇట్లు పలుకుచుండగా అంగదుడు సరియే అనెను. అంతట మహాబలశాలురైన ఆ వానరులెల్లరును పోవుదము రండని ఆకసము మీదికి ఎగిరిపోయిరి.

శ్లో॥ ఉత్పతంత మనూత్పేతు స్సర్వే తే హరియూథపాః ।
కృత్వా ఽఽకాశం నిరాకాశం యంత్రోత్క్షిప్తా ఇవాఽచలాః ॥23

పదచ్ఛేదము :- ఉత్పతంతం - అనూత్పేతుః - సర్వే - తే - హరియూథపాః, కృత్వా - ఆకాశం - నిరాకాశం - యంత్రోత్క్షిప్తాః - ఇవ - అచలాః ॥

అన్వయక్రమము :- తే హరియూథపాః సర్వే యంత్రోత్క్షిప్తాః అచలాః ఇవ ఆకాశం నిరాకాశం కృత్వా ఉత్పతంతం (తం) అనూత్పేతుః.

ప్రతిపదార్థము :- తే హరియూథపాః = ఆ వానరవీరులు, సర్వే = అందరును, యంత్రోత్క్షిప్తాః = యంత్రముచే మీదికి విసరబడిన, అచలాః ఇవ = పర్వతములవలె, ఆకాశం = ఆకాశమును, నిరాకాశం = అవకాశము లేనిదానినిగా, కృత్వా = చేసి, ఉత్పతంతం = మీదికి ఎగురుచున్న, (తం = ఆ అంగదుని), అనూత్పేతుః = అనుసరించి ఎగిరిరి.

తాత్పర్యము :- అట్లు ఆకసము మీదికి ఎగురుచున్న అంగదుని వెంట ఆ వానర యోధులెల్లరును ఒకానొక యంత్రముచే మీదికి విసరివేయబడుచున్న పర్వతములవలె రివ్వున మీదికెగసి ఆకసమునంతయును కప్పి వేయుచు ఆతనిని వెంబడించిరి.

శ్లో॥ తే ఽంబరం సహ సోత్పత్య వేగవంతః ప్లవంగమాః ।
వినదంతో మహానాదం ఘనా వాతేరితా యథా ॥ 24

పదచ్ఛేదము :– తే – అంబరం – సహసా – ఉత్పత్య – వేగవంతః – ప్లవంగమాః, వినదంతః – మహానాదం – ఘనాః – వాతేరితాః – యథా ॥

అన్వయక్రమము :– తే ప్లవంగమాః వేగవంతః అంబరం సహసా ఉత్పత్య వాతేరితాః ఘనాః యథా మహానాదం వినదంతః (జగ్మః).

ప్రతిపదార్థము :– తే ప్లవంగమాః = ఆ వానరులు, వేగవంతః = గొప్పవేగముగలవారై, అంబరం = ఆకసమునుగూర్చి, సహసా = తత్క్షణమే, ఉత్పత్య = ఎగిరి, వాతేరితాః = వాయువుచే నెట్టబడుచున్న, ఘనాః యథా = మేఘములవలె, మహానాదం వినదంతః = గొప్పదైన ధ్వనిచేయుచున్నవారై, (జగ్మః = వెడలిరి).

తాత్పర్యము :– ఆ వానరు లట్లు మహావేగముతో తత్క్షణమే ఆకసమున ఎగిరి వాయువుచే ఎగురగొట్ట బడుచున్న మేఘములవలె ఉరుములవంటి పెద్దపెద్ద గర్జనలు చేయుచు పోవుచుండిరి.

శ్లో॥ అంగదే హ్యనుప్రాప్తే సుగ్రీవో వానరాధిపః ।
ఉవాచ శోకోపహతం రామం కమలలోచనమ్ ॥ 25

పదచ్ఛేదము :– అంగదే – హి – అననుప్రాప్తే – సుగ్రీవః – వానరాధిపః – ఉవాచ – శోకోపహతం – రామం – కమలలోచనమ్ ॥

అన్వయక్రమము :– అంగదే అననుప్రాప్తే (సతి) వానరాధిపః సుగ్రీవః శోకోపహతం కమలలోచనం రామమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :– అంగదే = అంగదుడు, అననుప్రాప్తే సతి = రాకయుండగా, వానరాధిపః = వానరరాజైనట్టి, సుగ్రీవః = సుగ్రీవుడు, శోకోపహతం = దుఃఖముచే వివశుడైనట్టి, కమలలోచనం = పద్మనయనుడైన, రామం = శ్రీరాముని గూర్చి, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :– అంగదుడు తమకడకు రాకముందు సుందరమైన నేత్రద్వయము గలిగియున్న శ్రీరాముడు విషాదభరితుడైయుండగా ఆతనితో సుగ్రీవుడు ఇట్లు పలికెను.

శ్లో॥ సమాశ్వసిహి భద్రం తే దృష్టా దేవీ న సంశయః ।
నాఽఽగంతు మిహ శక్యం తైరతీతే సమయే హి నః ॥ 26

పదచ్ఛేదము :– సమాశ్వసిహి – భద్రం – తే – దృష్టా – దేవీ – న – సంశయః, న – ఆగంతుమ్ – ఇహ – శక్యం – తైః – అతీతే – సమయే – హి – నః ॥

అన్వయక్రమము :- సమాశ్వసిహి, తే భద్రం, దేవీ దృష్టా, సంశయః న, నః సమయే అతీతే సతి తైః ఇహ ఆగంతుం న శక్యం హి.

ప్రతిపదార్థము :- సమాశ్వసిహి = ఊరడిల్లుము. తే = నీకు, భద్రం = శుభము. దేవీ = సీతాదేవి, దృష్టా = చూడబడినది. సంశయః = సందేహము, న = లేదు. నః = మనయొక్క, సమయే = గడువు, అతీతే సతి = అతిక్రమించినదికాగా, తైః = వారిచే, ఇహ = ఇచ్చటికి, ఆగంతుం = వచ్చుటకు, న శక్యం హి = శక్యముకాదుగదా.

తాత్పర్యము :- రామచంద్రా! ఊరడిల్లుము. నీకు శుభమగుచున్నది! సీతాదేవి కాన్పించినది. అందు సందేహమేమియును లేదు. మనమొసగిన గడువు దాటిపోయిన పిమ్మట కృతకృత్యులు గాకుండ వారు మన ఎదుటికి వచ్చుటకు శక్యముగాదు సుమా!

శ్లో॥ న మత్సకాశ మాగచ్ఛే త్కృత్యే హి వినిపాతితే ।
యువరాజో మహాబాహుః ప్లవతాం ప్రవరోఽంగదః ॥ 27

పదచ్ఛేదము :- న - మత్సకాశమ్ - ఆగచ్ఛేత్ - కృత్యే - హి - వినిపాతితే, యువరాజః - మహాబాహుః - ప్లవతాం - ప్రవరః - అంగదః ॥

అన్వయక్రమము :- యువరాజః మహాబాహుః ప్లవతాం ప్రవరః అంగదః కృత్యే వినిపాతితే సతి మత్సకాశం న అగచ్ఛేత్ హి.

ప్రతిపదార్థము :- యువరాజః = యువరాజును, మహాబాహుః = గొప్ప భుజములు గలవాడును, ప్లవతాం ప్రవరః = వానరులలో శ్రేష్ఠుడు నగు, అంగదః = అంగదుడు, కృత్యే = కర్తవ్యము, వినిపాతితే సతి = చెడిపోయినది కాగా, మత్సకాశం = నా సమీపమునకు, న ఆగచ్ఛేత్ హి = రాజాలడు సుమా!

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడును మహావీరుడు నగు యువరాజైన అంగదుడు తన కప్పగింపబడిన కార్యము చెడిపోయిన పక్షమున నా ఎదుటికి రాజాలడు సుమా!

శ్లో॥ యద్య ప్యకృతకృత్యానా మీదృశః స్యా దుపక్రమః ।
భవే త్స దీనవదనో భ్రాంతవిప్లుతమానసః ॥ 28

పదచ్ఛేదము :- యది అపి - అకృతకృత్యానామ్ - ఈదృశః - స్యాత్ - ఉపక్రమః, భవేత్ - సః - దీనవదనః - భ్రాంతవిప్లుతమానసః ॥

అన్వయక్రమము :- అకృతకృత్యానాం ఈదృశః ఉపక్రమః (స్యాత్) యద్యపి సః దీనవదనః భ్రాంతవిప్లుతమానసః భవేత్.

ప్రతిపదార్థము :- అకృతకృత్యానాం = చేయబడని కృత్యములుగల వారియొక్క, ఉపక్రమః = చేష్టితము, ఈదృశః = ఈ విధమైనది, స్యాత్ యద్యపి = అయినయెడల, సః = ఆ యంగదుడు, దీనవదనః = దీనమైన ముఖముగలవాడును, భ్రాంతవిప్లుత మానసః = విభ్రాంతినొంది కలగియున్న మనస్సు గలవాడుగాను, భవేత్ = ఉండవలయును.

తాత్పర్యము :- ఒకవేళ ఈ మధువనభంగము అనెడి ఈ సాహసచేష్టితము కృతకృత్యులు కాకుండగనే ఆ వానరులు చేసియున్న యెడల ఆ అంగదుడు ముఖము వ్రేలవేసికొని వ్యాకులమైన మనస్సుతోడనే కాన్పించును.

శ్లో॥ పితృపైతామహం చైత త్పూర్వకై రభిరక్షితమ్ ।
న మే మధువనం హన్యా దహృష్టః ప్లవగేశ్వరః ॥ 29

పదచ్ఛేదము :- పితృపైతామహం - చ - ఏతత్ - పూర్వకైః - అభిరక్షితమ్, న - మే - మధువనం - హన్యాత్ - అహృష్టః - ప్లవగేశ్వరః ॥

అన్వయక్రమము :- మే పూర్వకైః అభిరక్షితం పితృపైతామహం ఏతత్ మే మధువనం ప్లవగేశ్వరః అహృష్టః సన్ న హన్యాత్.

ప్రతిపదార్థము :- మే పూర్వకైః = నా పూర్వులచే, అభిరక్షితం = కాపాడబడినదియును, పితృపైతామహం = తండ్రితాతలకు సంబంధించినదియునగు, ఏతత్ మధువనం = ఈ మధువనమును, ప్లవగేశ్వరః = వానరప్రభువైన అంగదుడు, అహృష్టః సన్ = సంతోషము నొందనివాడగుచు, న హన్యాత్ = పాడుచేయడు.

తాత్పర్యము :- మా పూర్వవంశీయులచే ప్రాణపదముగా కాపాడబడి మా తండ్రితాతల వలన మాకు లభించినట్టి ఈ మధువనమును యువరాజైన అంగదుడు సంతోషభరితుడై యుండనియెడల ఈ విధముగా పాడుచేసి యుండడు.

శ్లో॥ కౌసల్యా సుప్రజా రామ సమాశ్వసిహి సువ్రత ।
దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా ॥ 30

శ్లో॥ న హ్యన్యః కర్మణో హేతు స్సాధనే ఽస్య హనూమతః ॥ 31

పదచ్ఛేదము :- కౌసల్యా - సుప్రజాః - రామ - సమాశ్వసిహి - సువ్రత, దృష్టా - దేవీ - న - సందేహః - న - చ - అన్యేన - హనూమతా, న - హి - అన్యః - కర్మణః - హేతుః - సాధనే - అస్య - హనూమతః ॥

అన్వయక్రమము :- రామ! కౌసల్యా సుప్రజాః. సువ్రత! సమాశ్వసిహి, దేవీ దృష్టా,

సందేహః న, అన్యేన చ న, హనూమతా (దృష్టా), అస్య కర్మణః సాధనే హనూమతః అన్యః హేతుః న.

ప్రతిపదార్థము :- రామ = ఓ శ్రీరామా, కౌసల్యా = కౌసల్యాదేవి, సుప్రజాః = ఉత్తమమైన సంతానము గలది, సువ్రత = ఉత్తమవ్రతసంపన్నుడా!, సమాశ్వసిహి = ఊరడిల్లుము, దేవీ = సీతాదేవి, దృష్టా = చూడబడినది, సందేహః = సంశయము, న = లేదు, అన్యేన చ = ఇతరునిచేత గూడ, న = కాదు. హనూమతా = హనుమచేత, (దృష్టా = చూడబడినది), అస్య కర్మణః = ఈ కార్యముయొక్క, సాధనే = నిర్వహణమునందు, హనూమతః = హనుమంతునికంటె, అన్యః = వేరైనట్టి, హేతుః = కారణము, న (అస్తి) = లేదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- సీతమ్మయొక్క ఉనికి తెలిసికొన్నవాడవై నీవు ప్రాణములతో సుఖముగ నుందువు కాబట్టి ఇట్టి అదృష్టవంతుడవైన నిన్ను గన్న కౌసల్య సత్‌సంతానవతి సుమా! అని భావము.

తాత్పర్యము :- రామభద్రా! సీతాక్షేమవార్త విని నీవు క్షేమముగా నుందువు గనుక నిన్ను గన్న ఆ కౌసల్యాదేవి సత్‌సంతానముగన్న ఉత్తమమైన జనని యగును. ఇక నీవు ఊరడిల్లుము. మనవారికి సీతాదేవి కాన్పించినది. సందేహ మేమియును లేదు. ఆమెను చూచినది గూడ హనుమంతుడే తప్ప వేరెవ్వరును కాదు. ఈ కార్యసిద్ధిలో హనుమంతుని ప్రయత్నవిశేషమే గాక వేరొక హేతు వేదియును లేదు.

శ్లో॥ హనూమతి హి సిద్ధిశ్చ మతిశ్చ మతిసత్తమ ।
వ్యవసాయశ్చ వీర్యం చ సూర్యే తేజ ఇవ ధ్రువమ్ ॥ 32

పదచ్ఛేదము :- హనూమతి - హి - సిద్ధిః - చ - మతిః - చ - మతిసత్తమ, వ్యవసాయః - చ - వీర్యం - చ - సూర్యే - తేజః - ఇవ - ధ్రువమ్ ॥

అన్వయక్రమము :- మతిసత్తమ! సూర్యే తేజః ఇవ, హనూమతి సిద్ధిః చ, మతిః చ, వ్యవసాయః చ ధ్రువమ్ (వర్తంతే).

ప్రతిపదార్థము :- మతిసత్తమ = బుద్ధిశ్రేష్ఠుడవైన ఓ శ్రీరామా! సూర్యే = సూర్యుని యందు, తేజః ఇవ = ప్రకాశమువలె, హనూమతి = హనుమంతునియందు, సిద్ధిః చ = కార్యసిద్ధియును, మతిః చ = జ్ఞానమును, వ్యవసాయః చ = ప్రయత్నమును, వీర్యం చ = పరాక్రమమును, ధ్రువం = స్థిరముగా (వర్తంతే హి = ఉన్నవి గదా).

తాత్పర్యము :- ఓ ప్రజ్ఞావంతుడా! సూర్యునిలో తేజస్సు నియతమైనట్లుగా హనుమంతునియందు కార్యసిద్ధియు కర్తవ్యనిశ్చయమును తీవ్రప్రయత్నమును దానికి కావలసిన పరాక్రమమును అన్నియును సుస్థిరములై ఒప్పుచున్నది సుమా!

శ్లో॥ జాంబవా న్యత్ర నేతా స్యా దంగదశ్చ బలేశ్వరః ।
హనుమాం శ్చాప్యధిష్ఠాతా న తస్య గతి రన్యథా ॥ 33

శ్లో॥ మా భూ శ్చింతాసమాయుక్త స్సంప్ర త్యమితవిక్రమ ॥ 34

పదచ్ఛేదము :- జాంబవాన్ – యత్ర – నేతా – స్యాత్ – అంగదః – చ – బలేశ్వరః, హనుమాన్ – చ – అపి – అధిష్ఠాతా – న – తస్య – గతిః – అన్యథా, మా – భూః – చింతాసమాయుక్తః – సంప్రతి – అమితవిక్రమ ॥

అన్వయక్రమము :- యత్ర జాంబవాన్ నేతా స్యాత్, అంగదః చ బలేశ్వరః (స్యాత్) హనుమాన్ చ అధిష్ఠాతా (స్యాత్), తస్య గతిః అన్యథా న (స్యాత్). అమితవిక్రమ! సంప్రతి చింతాసమాయుక్తః మా భూః.

ప్రతిపదార్థము :- యత్ర = ఏ కార్యమునందు, జాంబవాన్ = జాంబవంతుడు, నేతా = నాయకుడు, స్యాత్ = అగునో, అంగదః చ = అంగదుడును, బలేశ్వరః = సైన్యాధిపతిగా, (స్యాత్ = ఉండునో), తస్య = ఆ కార్యముయొక్క, గతిః = విధానము, అన్యథా = వేరువిధముగా, న స్యాత్ = ఉండదు. అమితవిక్రమ = అఖండమైన పరాక్రమముగల ఓ శ్రీరామా!, సంప్రతి = ఇప్పుడు, చింతాసమాయుక్తః = చింతతో నున్నవాడవు, మా భూః = కాకుము.

తాత్పర్యము :- ఏ కార్యమునందు జాంబవంతుడు నాయకత్వము వహించియుండునో, అంగదుడు సేనాధిపత్యమును వహించియుండునో, హనుమంతుడు కార్యనిర్వహణమునకు పూనుకొనునో ఆ కార్యముయొక్క సిద్ధివిషయమునందు వేరు విధమగు అనుమానమునకు అవకాశము లేదు. కాబట్టి పరాక్రమశాలియైన ఓ శ్రీరామా! నీ వికనుండి దిగులు పొందవలసిన పనిలేదు సుమా!

శ్లో॥ తతః కిలకిలాశబ్దం శుశ్రా వాసన్న మంబరే ।
హనూమత్కర్మదృప్తానాం నర్దతాం కాననౌకసామ్ ।
కిష్కింధా ముపయాతానాం సిద్ధిం కథయతామివ ॥ 35

పదచ్ఛేదము :- తతః – కిలకిలాశబ్దం – శుశ్రావ – ఆసన్నమ్ – అంబరే – హనూమత్కర్మదృప్తానాం – నర్దతాం – కాననౌకసామ్ – కిష్కింధామ్ – ఉపయాతానాం

- సిద్ధిం - కథయతామ్ - ఇవ ॥

అన్వయక్రమము :- తతః హనూమత్కర్మదృప్తానాం కిష్కింధామ్ ఉపయాతానాం సిద్ధిం కథయతామ్ ఇవ నర్దతాం కాననౌకసామ్ అంబరే ఆసన్నం కిలకిలాశబ్దం శుశ్రావ.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, హనూమత్కర్మదృప్తానాం = హనుమంతునియొక్క కార్యముచే దర్పించియున్నవారును, కిష్కింధాం = కిష్కింధనుగూర్చి, ఉపయాతానాం = సమీపించినట్టివారును, సిద్ధిం = కార్యసిద్ధిని, కథయతామ్ ఇవ = చెప్పుచున్న వారునువలె, నర్దతాం = అరచుచున్నట్టి, కాననౌకసాం = వానరులయొక్క, అంబరే = ఆకసమునందు, ఆసన్నం = సమీపించియున్నట్టి, కిలకిలాశబ్దం = కిలకిల యను ధ్వనిని, శుశ్రావ = వినెను.

తాత్పర్యము :- అంతట హనుమ సాధించిన కార్యసిద్ధిచే గర్వించియున్నవారై కిష్కింధకు వచ్చుచు, తమ కార్యసిద్ధివార్తనే ఘోషించుచున్నట్లుగా సింహనాదములు చేయుచున్న ఆ వానరులయొక్క కిలకిలారావము ఆకసమునుండి దగ్గరలో వినవచ్చెను.

శ్లో॥ తత శ్శ్రుత్వా నినాదం తం కపీనాం కపిసత్తమః ।
ఆయతాంచితలాంగూల స్సో౽భవ ద్ధృష్టమానసః ॥ 36

పదచ్ఛేదము :- తతః - శ్రుత్వా - నినాదం - తం - కపీనాం - కపిసత్తమః, ఆయతాంచితలాంగూలః - సః - అభవత్ - హృష్టమానసః ॥

అన్వయక్రమము :- తతః సః కపిసత్తమః కపీనాం తం నినాదం శ్రుత్వా ఆయతాంచిత లాంగూలః (సన్) హృష్టమానసః అభవత్.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, సః కపిసత్తమః = ఆ వానరోత్తముడైన సుగ్రీవుడు, కపీనాం = వానరులయొక్క, తం = ఆ, నినాదం = ధ్వనిని, శ్రుత్వా = విని, ఆయతాంచితలాంగూలః (సన్) = పొడవైన అందమైన తోకగలవా డగుచు, హృష్టమానసః = సంతోషము నొందిన మనస్సుగలవాడు, అభవత్ = ఆయెను.

తాత్పర్యము :- అప్పుడు వానరులు చేయుచున్న ఆ కోలాహలధ్వనిని వీనులవిందుగ విని వానరుడైన సుగ్రీవుడు తన వాలమును అందముగ పొడవుగ పెంచి ఆనంద భరితుడయ్యెను.

శ్లో॥ ఆజగ్ము స్తే౽పి హరయో రామదర్శనకాంక్షిణః ।
అంగదం పురతః కృత్వా హనూమంతం చ వానరమ్ ॥ 37

పదచ్ఛేదము :– ఆజగ్ముః – తే – అపి – హరయః – రామదర్శనకాంక్షిణః – అంగదం – పురతః – కృత్వా – హనూమంతం – చ – వానరమ్ ॥

అన్వయక్రమము :– తే హరయః అపి రామదర్శనకాంక్షిణః (సంతః) అంగదం హనూమంతం వానరం చ పురతః కృత్వా ఆజగ్ముః.

ప్రతిపదార్థము :– తే = ఆ, హరయః అపి = వానరులుగూడ, రామదర్శనకాంక్షిణః (సంతః) = రామునియొక్క దర్శనము కోరుచున్నవారగుచు, అంగదం = అంగదుని, వానరం = వానరుడైన, హనూమంతం చ = హనుమంతుని, పురతః = ఎదురుగా, కృత్వా = చేసికొని, ఆజగ్ముః = వచ్చిరి.

తాత్పర్యము :– జాంబవంతుడు మున్నగు వానరవీరులు ఎల్లరును శ్రీరాముని సందర్శించు కుతూహలముతో అంగదుని, హనుమను ముందు ఉంచుకొని ఆ ప్రదేశమునకు వచ్చిరి.

శ్లో॥ తే ఽంగదప్రముఖా వీరాః ప్రహృష్టాశ్చ ముదాన్వితాః ।
నిపేతు ర్హరిరాజస్య సమీపే రాఘవస్య చ ॥ 38

పదచ్ఛేదము :– తే – అంగదప్రముఖాః – వీరాః – ప్రహృష్టాః – చ – ముదా – అన్వితాః – నిపేతుః – హరిరాజస్య – సమీపే – రాఘవస్య – చ ॥

అన్వయక్రమము :– అంగదప్రముఖాః తే వీరాః ప్రహృష్టాః ముదా అన్వితాః చ (సంతః) హరిరాజస్య రాఘవస్య చ సమీపే నిపేతుః.

ప్రతిపదార్థము :– అంగదప్రముఖాః = అంగదుడు మొదలుగాగల, తే = ఆ, వీరాః = వానరవీరులు, ప్రహృష్టాః = హర్షము నొందినవారును, ముదా = ప్రీతితో, అన్వితాః చ సంతః = కూడినవారు నగుచు, హరిరాజస్య = వానరరాజైన సుగ్రీవునకును, రాఘవస్య చ = శ్రీరామునకును, సమీపే = సమీపమునందు, నిపేతుః = దిగిరి.

తాత్పర్యము :– అట్లు ఆ యంగదప్రముఖులైన వానరశ్రేష్ఠులు మిక్కిలి ఆనందముతోను ప్రీతితోను నిండినవారై రామసుగ్రీవుల సన్నిధిని ఆకసమునుండి భూమిమీదకు దిగిరి.

శ్లో॥ హనూమాంశ్చ మహాబాహుః ప్రణమ్య శిరసా తతః ।
నియతా మక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్ ॥ 39

పదచ్ఛేదము :– హనూమాన్ – చ – మహాబాహుః – ప్రణమ్య – శిరసా – తతః, నియతామ్ – అక్షతాం – దేవీం – రాఘవాయ – న్యవేదయత్ ॥

అన్వయక్రమము :- తతః మహాబాహుః హనుమాన్ శిరసా ప్రణమ్య రాఘవాయ దేవీం నియతామ్ అక్షతాం న్యవేదయత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, మహాబాహుః = గొప్పవైన బాహువులు గలిగినట్టి, హనుమాన్ = హనుమంతుడు, శిరసా = శిరస్సుతో, ప్రణమ్య = మ్రొక్కి, రాఘవాయ = శ్రీరాముని కొరకు, దేవీం = సీతాదేవిని, నియతాం = నియమవంతురాలినిగాను, అక్షతాం = హాని నొందనిదానినిగాను, న్యవేదయత్ = నివేదించెను.

తాత్పర్యము :- అంతట మహాబాహువైన హనుమంతుడు శ్రీరామునకు సాష్టాంగ వందనము గావించి సీతాదేవి నియమవతియై హానినొందనిదై యున్నదని విన్నవించెను.

శ్లో॥ దృష్టా దేవీతి హనుమ ద్వదనా దమృతోపమమ్ ।
ఆకర్ణ్య వచనం రామో హర్ష మాప సలక్ష్మణః ॥ 40

పదచ్ఛేదము :- దృష్టా - దేవీ - ఇతి - హనుమద్వదనాత్ - అమృతోపమమ్, ఆకర్ణ్య - వచనం - రామః - హర్షమ్ - ఆప - సలక్ష్మణః ॥

అన్వయక్రమము :- హనుమద్వదనాత్ అమృతోపమం "దృష్టా దేవీ" ఇతి వచనం ఆకర్ణ్య సలక్ష్మణః రామః హర్షమ్ ఆప.

ప్రతిపదార్థము :- హనుమద్వదనాత్ = హనుమయొక్క ముఖమునుండి, అమృతోపమం = అమృతతుల్యమైనట్టి, దృష్టా దేవీ = సీతాదేవి చూడబడినది, ఇతి = అను, వచనం = మాటను, ఆకర్ణ్య = విని, సలక్ష్మణః = లక్ష్మణునితో కూడియున్న, రామః = శ్రీరాముడు, హర్షం = ఆనందమును, ఆప = పొందెను.

తాత్పర్యము :- హనుమంతుడు నోరార పలికినట్టి "సీతాదేవి కాన్పించినది" అనెడి అమృతోపమానమైన వచనమును విని శ్రీరాముడు తన తమ్ముడైన లక్ష్మణునితోకూడ ఎంతయో ఆనందించెను.

శ్లో॥ నిశ్చితార్థ స్తత స్తస్మిన్ సుగ్రీవః పవనాత్మజే ।
లక్ష్మణః ప్రీతిమాన్ ప్రీతం బహుమానా దవైక్షత ॥ 41

పదచ్ఛేదము :- నిశ్చితార్థః - తతః - తస్మిన్ - సుగ్రీవః - పవనాత్మజే, లక్ష్మణః - ప్రీతిమాన్ - ప్రీతం - బహుమానాత్ - అవైక్షత ॥

అన్వయక్రమము :- తతః సుగ్రీవః తస్మిన్ పవనాత్మజే నిశ్చితార్థః (అభవత్), ప్రీతిమాన్ లక్ష్మణః ప్రీతం బహుమానాత్ అవైక్షత.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, సుగ్రీవః = సుగ్రీవుడు, తస్మిన్ = ఆ, పవనాత్మజే = హనుమంతునియందు, నిశ్చితార్థః = నిశ్చయింపబడిన కార్యముగలవాడు, అభవత్ = అయ్యెను, లక్ష్మణః = లక్ష్మణుడు, ప్రీతిమాన్ = ప్రీతినొందినవాడై, బహుమానాత్ = గౌరవపూర్వకముగా, ప్రీతం = ఇష్టుడైన హనుమను, అవైక్షత = చూచెను.

తాత్పర్యము :– అప్పుడు సుగ్రీవుడు ఈ సంతోషకార్యమును సాధించినట్టివాడు హనుమయే అని నిశ్చయించుకొని సంతోషించుచుండెను. లక్ష్మణుడా హనుమయెడల అమితమైన ప్రేమగలవాడై ప్రీతిపాత్రుడైన ఆతనిని పరమాదరముతో చూచుచుండెను.

శ్లో॥ ప్రీత్యా చ రమమాణో ఽథ రాఘవః పరవీరహా ।
బహుమానేన మహతా హనుమంత మవైక్షత ॥ 42

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"హనుమదాద్యాగమనం" నామ
చతుఃషష్టితమస్సర్గః.

పదచ్ఛేదము :– ప్రీత్యా – చ – రమమాణః – అథ – రాఘవః – పరవీరహా, బహుమానేన – మహతా – హనుమంతమ్ – అవైక్షత ॥

అన్వయక్రమము :– అథ పరవీరహా రాఘవః ప్రీత్యా రమమాణః మహతా బహుమానేన హనుమంతమ్ అవైక్షత.

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, పరవీరహా = శత్రువీరసంహారకుడైన, రాఘవః = శ్రీరాముడు, ప్రీత్యా = సంతోషముతో, రమమాణః = ఉల్లాసము నొందుచున్నవాడై, హనుమంతం = హనుమను, మహతా = గొప్పదైన, బహుమానేన = గౌరవముతో, అవైక్షత = చూచెను.

తాత్పర్యము :– అప్పుడు మహావీరుడైన శ్రీరాముడు ఆనందముతో ఉప్పొంగుచున్న అమితమైన ఆదరవిశేషముతో విప్పారియున్నట్టి కన్నులతో హనుమను విలోకించెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"హనుమదాద్యాగమనము" అను
అరువదినాల్గవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

పంచషష్టితమసర్గ

శ్లో॥ తతః ప్రస్రవణం శైలం తే గత్వా చిత్రకాననమ్ ।
ప్రణమ్య శిరసా రామం లక్ష్మణం చ మహాబలమ్ ॥ 1

శ్లో॥ యువరాజం పురస్కృత్య సుగ్రీవ మభివాద్య చ ।
ప్రవృత్తి మథ సీతాయాః ప్రవక్తు ముపచక్రముః ॥ 2

పదచ్ఛేదము :- తతః - ప్రస్రవణం - శైలం - తే - గత్వా - చిత్రకాననమ్, ప్రణమ్య - శిరసా - రామం - లక్ష్మణం - చ - మహాబలమ్, యువరాజం - పురస్కృత్య - సుగ్రీవమ్ - అభివాద్య - చ, ప్రవృత్తిమ్ - అథ - సీతాయాః - ప్రవక్తుమ్ - ఉపచక్రముః ॥

అన్వయక్రమము :- తతః తే చిత్రకాననం ప్రస్రవణం శైలం గత్వా రామం మహాబలం లక్ష్మణం చ శిరసా ప్రణమ్య యువరాజం పురస్కృత్య సుగ్రీవం చ అభివాద్య అథ సీతాయాః ప్రవృత్తిం ప్రవక్తుమ్ ఉపచక్రముః.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, తే = ఆ వానరులు, యువరాజం = అంగదుని, పురస్కృత్య = ముందుంచుకొని, చిత్రకాననం = చిత్రములైన అరణ్యములు గల్గినట్టి, ప్రస్రవణం = ప్రస్రవణ మను పేరు గల, శైలం = పర్వతమునుగూర్చి, గత్వా = పోయి, రామం = శ్రీరాముని, మహాబలం = గొప్పబలశాలియైన, లక్ష్మణం చ = లక్ష్మణుని, శిరసా = శిరస్సుతో, ప్రణమ్య = నమస్కరించి, సుగ్రీవం చ = సుగ్రీవునికిని, అభివాద్య = మ్రొక్కి, అథ = పిమ్మట, సీతాయాః = సీతాదేవియొక్క, ప్రవృత్తిం = వృత్తాంతమును, ప్రవక్తుం = చెప్పుటకు, ఉపచక్రముః = ఆరంభించిరి.

తాత్పర్యము :- అప్పుడు జాంబవత్ప్రముఖులైన వానరులు యువరాజైన అంగదుని ముందుంచుకొని చిత్రమైన వనములతో శోభిల్లుచున్న ప్రస్రవణపర్వతమునకు వెడలి అచ్చటగల శ్రీరామునకును, లక్ష్మణునకును శిరమువంచి నమస్కరించి, సుగ్రీవున కభివాదన మొనర్చి, సీతాదేవిని గూర్చిన వృత్తాంతమును తెలుపుట కుపక్రమించిరి.

శ్లో॥ రావణాంతఃపురే రోధం రాక్షసీభిశ్చ తర్జనమ్ ।
రామే సమనురాగం చ యశ్చాయం సమయః కృతః ।
ఏతదాఖ్యాంతి తే సర్వే హరయో రామసన్నిధౌ ॥ 4

పదచ్ఛేదము :- రావణాంతఃపురే - రోధం - రాక్షసీభిః - చ - తర్జనమ్, రామే - సమనురాగం - చ - యః - చ - అయం - సమయః - కృతః, ఏతత్ - ఆఖ్యాంతి - తే - సర్వే - హరయః - రామసన్నిధౌ ॥

అన్వయక్రమము :- రావణాంతఃపురే (సీతాయాః) రోధం రాక్షసీభిః తర్జనం చ రామే సమనురాగం చ (రావణేన) యః సమయః కృతః అయం, రామసన్నిధౌ తే సర్వే హరయః ఏతత్ ఆఖ్యాంతి.

ప్రతిపదార్థము :- రావణాంతఃపురే = రావణుని అంతఃపురమునందు, సీతాయాః = సీతాదేవియొక్క, రోధం = నిరోధమును, రాక్షసీభిః = రాక్షసాంగనలచే, తర్జనం చ = బెదిరింపును, రామే = శ్రీరామునియందు, సమనురాగం చ = ఎక్కువైన ప్రేమను, (రావణేన = రావణునిచే), యః సమయః = ఏ గడువు, కృతః = చేయబడెనో, అయం చ = ఇదియును, రామసన్నిధౌ = శ్రీరాముని సాన్నిధ్యమునందు, తే = ఆ, హరయః = వానరులు, సర్వే = అందరు, ఏతత్ = ఈ విషయమును, ఆఖ్యాంతి = చెప్పిరి.

తాత్పర్యము :- ఆ వానరులు శ్రీరాముని సమక్షమున ఉపవిష్టులై సీతాదేవికి రావణాంతఃపురమునందు కలుగుచున్న బాధలను, రాక్షసవనితలు ఆమెతో పలుకుచున్న పరుషవచనములను బెదిరింపులను శ్రీరామునియెడ ఆమెకు గల నమ్మకముతో కూడిన అనురాగమును, రావణుడు ఆమె కిచ్చిన గడువును గూర్చి కుతూహలముతో చెప్పిరి.

శ్లో॥ వైదేహీ మక్షతాం శ్రుత్వా రామ స్తూత్తర మబ్రవీత్ ।
క్వ సీతా వర్తతే దేవీ కథం చ మయి వర్తతే ।
ఏత న్మే సర్వ మాఖ్యాత వైదేహీం ప్రతి వానరాః ॥ 5

పదచ్ఛేదము :- వైదేహీమ్ - అక్షతాం - శ్రుత్వా - రామః - తు - ఉత్తరమ్ - అబ్రవీత్, క్వ - సీతా - వర్తతే - దేవీ - కథం - చ - మయి - వర్తతే, ఏతత్ - మే - సర్వమ్ - ఆఖ్యాత - వైదేహీం - ప్రతి - వానరాః ॥

అన్వయక్రమము :- రామః తు వైదేహీమ్ అక్షతాం శ్రుత్వా ఉత్తరం అబ్రవీత్, వానరాః! దేవీ సీతా క్వ వర్తతే? మయి కథం వర్తతే? వైదేహీం ప్రతి మే ఏతత్ సర్వమ్ ఆఖ్యాత.

ప్రతిపదార్థము :– రామః తు = రాముడప్పుడు, వైదేహీం = జానకిని, అక్షతాం = హానినొందనిదానినిగా, శ్రుత్వా = విని, ఉత్తరం = సమాధానము, అబ్రవీత్ = పలికెను, వానరాః = ఓ వానరులారా!, దేవీ సీతా = పూజ్యురాలైన సీతాదేవి, క్వ = ఎక్కడ, వర్తతే = ఉన్నది? మయి చ = నాయందును, కథం = ఎట్లు, వర్తతే = ఉన్నది? వైదేహీం ప్రతి = సీతాదేవినిగూర్చి, మే = నాకు, ఏతత్ = దీనిని, సర్వం = అంతను, ఆఖ్యాత = చెప్పుడు.

తాత్పర్యము :– శ్రీరాముడు అంతట వానరులవలన సీతాదేవి ఏ యాపదయు నొందకుండ నున్నదని తెలిసికొని వెంటనే వారిని నా సీతాదేవి ఇప్పు డెచ్చట నున్నది? నాయం దెట్టి భావమును గలిగియున్నది? ఈ విషయము నాకు సవిస్తరముగా తెలుపుడని అడిగెను.

శ్లో॥ రామస్య గదితం శ్రుత్వా హరయో రామసన్నిధౌ ।
చోదయంతి హనూమంతం సీతావృత్తాంతకోవిదమ్ ॥ 6

పదచ్ఛేదము :– రామస్య – గదితం – శ్రుత్వా – హరయః – రామసన్నిధౌ, చోదయంతి – హనూమంతం – సీతావృత్తాంతకోవిదమ్ ॥

అన్వయక్రమము :– హరయః రామస్య గదితం శ్రుత్వా సీతావృత్తాంతకోవిదం హనూమంతం రామసన్నిధౌ చోదయంతి.

ప్రతిపదార్థము :– హరయః = వానరులు, రామస్య = శ్రీరామునియొక్క, గదితం = వచనమును, శ్రుత్వా = విని, సీతావృత్తాంతకోవిదం = సీతమ్మయొక్క వృత్తాంతమును తెలిసియున్న, హనూమంతం = హనుమను, రామసన్నిధౌ = రాముని సమీపమున, చోదయంతి = ప్రోత్సహించిరి.

తాత్పర్యము :– రాముడడిగిన ప్రశ్నలను విని ఆ వానరులు సీతమ్మను గూర్చిన విషయములను అన్నింటిని తెలిసియున్న హనుమంతుని శ్రీరాముని సమక్షమునకు చేర్చి సీతాదేవివృత్తాంతమును వివరింపుమని కోరిరి.

శ్లో॥ శ్రుత్వా తు వచనం తేషాం హనుమా న్మారుతాత్మజః ।
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై తాం దిశం ప్రతి ।
ఉవాచ వాక్యం వాక్యజ్ఞ స్సీతాయా దర్శనం యథా ॥ 7

పదచ్ఛేదము :– శ్రుత్వా – తు – వచనం – తేషాం – హనుమాన్ – మారుతాత్మజః, ప్రణమ్య – శిరసా – దేవ్యై – సీతాయై – తాం – దిశం – ప్రతి, ఉవాచ – వాక్యం

– వాక్యజ్ఞః – సీతాయాః – దర్శనం – యథా ॥

అన్వయక్రమము :– మారుతాత్మజః హనుమాన్ తేషాం వచనం శ్రుత్వా దేవ్యై సీతాయై తాం దిశం ప్రతి శిరసా ప్రణమ్య యథా సీతాయాః దర్శనం (అభవత్) తథా వాక్యజ్ఞః వాక్యమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :– మారుతాత్మజః = వాయునందనుడైనట్టి, హనుమాన్ తు = హనుమంతు డప్పుడు, తేషాం = ఆ వానరులయొక్క, వచనం = మాటను, శ్రుత్వా = విని, దేవ్యై = పూజ్యురాలయిన, సీతాయై = సీతకొరకు, తాం = ఆ, దిశం ప్రతి = దక్షిణదిశనుగూర్చి, శిరసా = శిరస్సుతో, ప్రణమ్య = మ్రొక్కి, వాక్యజ్ఞః = వాక్యవిశారదుడైన ఆతడు, యథా = ఏరీతిగా, సీతాయాః = సీతాదేవియొక్క, దర్శనం = దర్శనము, అభవత్ = ఆయెనో, తథా = అట్లు, వాక్యం = మాటను, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :– అప్పుడు వాయునందనుడు తోడివానరుల ప్రోత్సాహమునొంది దక్షిణ దిక్కునకు తిరిగి సీతాదేవికి శిరమువంచి నమస్కరించి తనకు సీతాదర్శనము లభించిన విధమునుగూర్చి వాక్యవిశారదుడైన ఆతడు వివరముగా ఇట్లు తెలుపదొడగెను.

శ్లో॥ తం మణిం కాంచనం దివ్యం దీప్యమానం స్వతేజసా ।
దత్త్వా రామాయ హనుమాం స్తతః ప్రాంజలి రబ్రవీత్ ॥ 8

పదచ్ఛేదము :– తం – మణిం – కాంచనం – దివ్యం – దీప్యమానం – స్వతేజసా, దత్త్వా – రామాయ – హనుమాన్ – తతః – ప్రాంజలిః – అబ్రవీత్ ॥

అన్వయక్రమము :– హనుమాన్ స్వతేజసా దీప్యమానం దివ్యం తం కాంచనం మణిం రామాయ దత్త్వా తతః ప్రాంజలిః (సన్) అబ్రవీత్.

ప్రతిపదార్థము :– హనుమాన్ = హనుమ, స్వతేజసా = తన తేజస్సుచే, దీప్యమానం = ప్రకాశించుచున్నదియును, దివ్యం = దేవసంబంధమైనదియును అగు, తం = ఆ, కాంచనం = సువర్ణమయమైన, మణిం = చూడామణిని, రామాయ = శ్రీరామునకు, దత్త్వా = ఇచ్చి, తతః = పిమ్మట, ప్రాంజలిః సన్ = దోసిలియొగ్గినవాడై, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :– హనుమంతు డప్పుడు తన ప్రకాశముతో మిక్కిలిగా తేజరిల్లుచున్న అపూర్వమైనట్టి తాను తెచ్చిన ఆ చూడామణిని శ్రీరాముని కొసగి దోసిలొగ్గి తిరిగి ఇట్లు పలికెను.

సూచన :– ఈ శ్లోకము బొంబాయి ప్రతియందు మాత్రమే కలదు.

శ్లో॥ సముద్రం లంఘయిత్వా ఽహం శతయోజన మాయతమ్ ।
అగచ్ఛం జానకీం సీతాం మార్గమాణో దిదృక్షయా ॥ 9

పదచ్ఛేదము :– సముద్రం – లంఘయిత్వా – అహం – శతయోజనమ్ – ఆయతమ్, అగచ్ఛం – జానకీం – సీతాం – మార్గమాణః – దిదృక్షయా ॥

అన్వయక్రమము :– అహం శతయోజనమ్ ఆయతం సముద్రం లంఘయిత్వా జానకీం సీతాం దిదృక్షయా మార్గమాణః అగచ్ఛమ్.

ప్రతిపదార్థము :– అహం = నేను, జానకీం = జనకరాజపుత్రియైన, సీతాం = సీతాదేవిని, దిదృక్షయా = చూచు కోరికతో, మార్గమాణః = వెదుకుచున్నవాడనై, శతయోజనం = నూరామడలు, ఆయతం = పొడవైనట్టి, సముద్రం = సముద్రమును, లంఘయిత్వా = దాటి, అగచ్ఛమ్ = పోయితిని.

తాత్పర్యము :– నేను జానకీదేవిని చూడవలెనను కోరికతో ఆమెను వెదకుచు నూరామడల పొడవైన సముద్రమును దాటి దక్షిణదిశగా కడుదూరము వెడలితిని.

శ్లో॥ తత్ర లంకేతి నగరీ రావణస్య దురాత్మనః ।
దక్షిణస్య సముద్రస్య తీరే వసతి దక్షిణే ॥ 10

పదచ్ఛేదము :– తత్ర – లంకా – ఇతి – నగరీ – రావణస్య – దురాత్మనః, దక్షిణస్య – సముద్రస్య – తీరే – వసతి – దక్షిణే ॥

అన్వయక్రమము :– తత్ర దక్షిణస్య సముద్రస్య దక్షిణే తీరే లంకా ఇతి దురాత్మనః రావణస్య నగరీ వసతి.

ప్రతిపదార్థము :– తత్ర = అచ్చట, దక్షిణస్య సముద్రస్య = దక్షిణసముద్రముయొక్క, దక్షిణే తీరే = దక్షిణతీరమునందు, దురాత్మనః = దుర్మార్గుడైన, రావణస్య = రావణునకు, లంకా ఇతి = లంక అను, నగరీ = పట్టణము, వసతి = ఉన్నది.

తాత్పర్యము :– ఆ దక్షిణసముద్రతీరమునందు లంక యను పేరుగల పట్టణ మున్నది. అది దుర్మార్గుడైన రావణాసురుని రాజధాని.

శ్లో॥ తత్ర సీతా మయా దృష్టా రావణాంతఃపురే సతీ ।
సంన్యస్య త్వయి జీవంతీ రామా రామ మనోరథమ్ ॥ 11

పదచ్ఛేదము :– తత్ర – దృష్టా – మయా – సీతా – రావణాంతఃపురే – సతీ,

సంన్యస్య - త్వయి - జీవంతీ - రామా - రామ - మనోరథమ్ ॥

అన్వయక్రమము :- రామ! తత్ర రావణాంతఃపురే మనోరథం త్వయి సంన్యస్య జీవంతీ సతీ సీతా రామా మయా దృష్టా.

ప్రతిపదార్థము :- రామ = ఓ శ్రీరామా!, తత్ర = ఆ లంకయందు, రావణాంతఃపురే = రావణుని అంతఃపురమునందు, మనోరథం = కోరికను, త్వయి = నీయందు, సంన్యస్య = ఉంచి, జీవంతీ = బ్రతుకుచున్నదియును, సతీ = పతివ్రతయునగు, సీతా రామా = సీతాసుందరి, మయా = నాచేత, దృష్టా = చూడబడినది.

తాత్పర్యము :- ఆ లంకానగరమున రావణుని యంతఃపురమునందు తన కోరికలన్నియు నీయందే నిలుపుకొని కొనయూపిరితో జీవించుచు పాతివ్రత్యధర్మముతో మెలగుచున్న సీతారమణి నాకు గానవచ్చినది.

శ్లో॥ దృష్టా మే రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః ।
రాక్షసీభి ర్విరూపాభీ రక్షితా ప్రమదావనే ॥ 12

పదచ్ఛేదము :- దృష్టా - మే - రాక్షసీమధ్యే - తర్జ్యమానా - ముహుః - ముహుః, రాక్షసీభిః - విరూపాభిః - రక్షితా - ప్రమదావనే ॥

అన్వయక్రమము :- రాక్షసీమధ్యే ముహుః ముహుః తర్జ్యమానా ప్రమదావనే విరూపాభిః రాక్షసీభిః రక్షితా మే దృష్టా.

ప్రతిపదార్థము :- రాక్షసీమధ్యే = రాక్షసస్త్రీల నడుమ, ముహుః ముహుః = మాటిమాటికి, తర్జ్యమానా = గద్దింపబడుచున్నదియును, విరూపాభిః = వికారమైన రూపముగల్గినట్టి, రాక్షసీభిః = రాక్షసాంగనలచే, ప్రమదావనే = అంతఃపురోద్యానమునందు, రక్షితా = రక్షింపబడుచున్నదియునగు, (సా = ఆ సీతాదేవి), మే = నాచే, దృష్టా = చూడబడినది.

తాత్పర్యము :- ఆ రావణుని నివాసమునందు సీతాదేవిని రాక్షసస్త్రీలు మాటిమాటికిని గద్దించుచుండిరి. అచటి అంతఃపురోద్యానవనమునందు భీకరములైన రూపములు గల రాక్షసవనిత లామె చుట్టునుండి కావలి కాయుచున్నారు.

శ్లో॥ దుఃఖ మాపద్యతే దేవీ త వాదుఃఖోచితా సతీ ।
రావణాంతఃపురే రుద్ధా రాక్షసీభి స్సురక్షితా ॥ 13

పదచ్ఛేదము :- దుఃఖమ్ - ఆపద్యతే - దేవీ - తవ - అదుఃఖోచితా - సతీ, రావణాంతఃపురే - రుద్ధా - రాక్షసీభిః - సురక్షితా ॥

అన్వయక్రమము :- అదుఃఖోచితా సతీ తవ దేవీ రావణాంతఃపురే రాక్షసీభిః సురక్షితా రుద్ధా దుఃఖమ్ ఆపద్యతే.

ప్రతిపదార్థము :- అదుఃఖోచితా = దుఃఖమునకు తగినది కానట్టిదియు, సతీ = పతివ్రతయునగు, తవ = నీయొక్క, దేవీ = మహిషి, రావణాంతఃపురే = రావణుని అంతఃపురమునందు, రాక్షసీభిః = రాక్షసస్త్రీలచే, సురక్షితా = కావలియుంచబడినదై, రుద్ధా = బంధింపబడినదై, దుఃఖం = శోకమును, ఆపద్యతే = పొందుచున్నది.

తాత్పర్యము :- ఎట్టి దుఃఖములకును తగనట్టి మహాపతివ్రతయగు నీ యర్ధాంగి రావణాంతఃపురమునందు రాక్షసస్త్రీలు కావలిగాయుచుండగా బంధితురాలై దుఃఖసాగరమున మునిగియున్నది.

శ్లో॥ ఏకవేణీధరా దీనా త్వయి చింతాపరాయణా ।
అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే ॥ 14

పదచ్ఛేదము :- ఏకవేణీధరా - దీనా - త్వయి - చింతాపరాయణా, అధశ్శయ్యా - వివర్ణాంగీ - పద్మినీ - ఇవ - హిమాగమే ॥

అన్వయక్రమము :- ఏకవేణీధరా దీనా త్వయి చింతాపరాయణా అధశ్శయ్యా వివర్ణాంగీ హిమాగమే పద్మినీ ఇవ వివర్ణాంగీ (ఆస్తే).

ప్రతిపదార్థము :- ఏకవేణీధరా = జడకట్టిన కేశములు ధరించినదియును, దీనా = దీనురాలును, త్వయి = నీయందు, చింతాపరాయణా = ధ్యాననిమగ్నురాలును, అధశ్శయ్యా = నేలయే శయ్యగా గలదియును, హిమాగమే = హేమంతఋతువునందు, పద్మినీ ఇవ = తామరతీగవలె, వివర్ణాంగీ = వన్నెతొలగిన శరీరముగలదియునై, (అస్తి = ఉన్నది).

తాత్పర్యము :- జడగట్టియున్న తలవెంట్రుకలతో దీనమైన రూపముతో నేలపై శయనించియుండి నీ స్మరణమునందే నిమగ్నురాలై హేమంతకాలములోని తామరతీగవలె లావణ్యమును గోల్పోయిన శరీరముతో నాకు కానవచ్చినది.

శ్లో॥ రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా ।
దేవీ కథంచిత్ కాకుత్స్థ త్వన్మనా మార్గితా మయా ॥ 15

పదచ్ఛేదము :- రావణాత్ - వినివృత్తార్థా - మర్తవ్యకృతనిశ్చయా - దేవీ - కథంచిత్ - కాకుత్స్థ - త్వన్మనాః - మార్గితా - మయా ॥

అన్వయక్రమము :– కాకుత్థ్స! రావణాత్ వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా త్వన్మనాః దేవీ మయా కథంచిత్ మార్గితా.

ప్రతిపదార్థము :– కాకుత్థ్స = ఓ శ్రీరామా!, రావణాత్ = రావణాసురునినుండి, వినివృత్తార్థా = మరలింపబడిన ప్రయోజనము గలదియును, మర్తవ్యకృతనిశ్చయా = మరణింపవలెనను నిశ్చయము గలదియును, త్వన్మనాః = నీయందు మనస్సుగలదియు నగు, దేవీ = సీతాదేవి, మయా = నాచేత, కథంచిత్ = ఎట్లో, మార్గితా = వెదుకబడినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :– సీతాదేవి సత్పురుషులు మెచ్చుకొనెడి భక్తి స్వభావము, పాతివ్రత్యము, తపస్సు అను సద్గుణములు విడువక అశోకవనము నందు నీ కొరకై తపించుచున్నది అని భావము.

తాత్పర్యము :– ఓ రామా! రావణుని కోరికను వ్యర్థము చేయగోరి మరణమే కర్తవ్యమని నిర్ణయించుకొన్నదై నీయందే తన సమస్తభావమును లగ్నము చేసినదై అప్పటికెట్లో జీవించియున్న సీతాదేవిని వెదకి వెదకి అతికష్టముమీద చివరకు కనుగొనగలిగితిని.

శ్లో॥ ఇక్ష్వాకువంశవిఖ్యాతిం శనైః కీర్తయతాఽనఘ ।
సా మయా నరశార్దూల విశ్వాస ముపపాదితా ॥ 16

పదచ్ఛేదము :– ఇక్ష్వాకువంశవిఖ్యాతిం – శనైః – కీర్తయతా – అనఘ, సా – మయా – నరశార్దూల – విశ్వాసమ్ – ఉపపాదితా ॥

అన్వయక్రమము :– అనఘ! నరశార్దూల! ఇక్ష్వాకువంశవిఖ్యాతిం కీర్తయతా మయా సా శనైః విశ్వాసమ్ ఉపపాదితా.

ప్రతిపదార్థము :– అనఘ! = పాపరహితుడవైనట్టి, నరశార్దూల! = ఓ పురుషశ్రేష్ఠుడా!, ఇక్ష్వాకువంశవిఖ్యాతిం = ఇక్ష్వాకువంశముయొక్క ప్రశస్తిని, కీర్తయతా = కీర్తించుచున్నట్టి, మయా = నాచేత, శనైః = నెమ్మదిగా, విశ్వాసం = నమ్మకము, ఉపపాదితా = కల్గింపబడినది.

తాత్పర్యము :– పాపరహితుడవైన ఓ పురుషోత్తమా! నేను ఆ జానకీదేవిని సమీపించి ఇక్ష్వాకువంశముయొక్క ప్రశస్తిని కీర్తించుచు మెల్లగా ఆమె మనస్సునందు నేను రామదూతనే గాని రాక్షసుడను గానని నమ్మకము కలిగించుకొంటిని.

శ్లో॥ తత స్సంభాషితా దేవీ సర్వ మర్థం చ దర్శితా ।
రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతి ముపాగతా ॥ 17

పదచ్ఛేదము :– తతః – సంభాషితా – దేవీ – సర్వమ్ – అర్థం – చ – దర్శితా, రామసుగ్రీవసఖ్యం – చ – శ్రుత్వా – ప్రీతిమ్ – ఉపాగతా ॥

అన్వయక్రమము :– తతః దేవీ సంభాషితా, సర్వమ్ అర్థం దర్శితా చ, రామసుగ్రీవ సఖ్యం శ్రుత్వా ప్రీతిమ్ ఉపాగతా చ.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, దేవీ = సీతాదేవి, సంభాషితా = మాటాడబడినది, సర్వమ్ అర్థం = విషయమంతయును, దర్శితా చ = తెలుపబడినది కూడను. రామ సుగ్రీవసఖ్యం = రామసుగ్రీవులకు జరిగిన మైత్రిని గూర్చి, శ్రుత్వా = విని, ప్రీతిం = సంతోషమును, ఉపాగతా చ = పొందినది గూడను.

తాత్పర్యము :– నాపై నమ్మకము గల్గిన పిమ్మట, నే నామెతో సంభాషణము గావించి జరిగిన విషయము నంతను ఆమె కెరిగించితిని. తన భర్తకును సుగ్రీవునకును గలిగిన మైత్రిని గూర్చి విని ఆమె ఎంతయో సంతోషించినది.

శ్లో॥ నియత స్సముదాచారో భక్తి శ్చాస్యా స్తథా త్వయి ।
ఏవం మయా మహాభాగా దృష్టా జనకనందినీ ।
ఉగ్రేణ తపసా యుక్తా త్వద్భక్త్యా పురుషర్షభ ॥ 18

పదచ్ఛేదము :– నియతః – సముదాచారః – భక్తిః – చ – అస్యాః – తథా – త్వయి, ఏవం – మయా – మహాభాగా – దృష్టా – జనకనందినీ, ఉగ్రేణ – తపసా – యుక్తా – త్వద్భక్త్యా – పురుషర్షభ ॥

అన్వయక్రమము :– పురుషర్షభ! అస్యాః సముదాచారః నియతః త్వయి భక్తిః చ తథా, మహాభాగా జనకనందినీ త్వద్భక్త్వా ఏవం ఉగ్రేణ తపసా యుక్తా మయా దృష్టా.

ప్రతిపదార్థము :– పురుషర్షభ = ఓ పురుషశ్రేష్ఠుడా!, అస్యాః = ఈ సీతాదేవియొక్క, సముదాచారః = పాతివ్రత్యాచరణము, నియతః = అచంచలమైనట్టిది, త్వయి = నీ యందు, భక్తిః చ = భక్తియును, తథా = అట్టిదే. మహాభాగా = మహాత్మురాలైనట్టి, జనకనందినీ = జనకతనయ, త్వద్భక్త్యా = నీయందలి భక్తిచే, ఏవం = ఈరీతిగా, ఉగ్రేణ = తీవ్రమైన, తపసా = తపస్సుతో, యుక్తా = కూడినట్టిదిగా, మయా = నాచే, దృష్టా = చూడబడినది.

తాత్పర్యము :– ఓ పురుషోత్తమా! సీతాదేవియొక్క పాతివ్రత్యరూపమైన ధర్మాచరణము అచంచలమై యున్నది. ఆమెకు నీయందుగల భక్తిగూడ అట్లే నిశ్చలమైనట్టిది. మహాత్మురాలైన ఆ జానకీదేవి మూర్తీభవించినట్టి పతిభక్తిగాను, తీవ్రమైనట్టి మహాతపస్సుగాను నాకు కాన్పించినది.

శ్లో॥ అభిజ్ఞానం చ మే దత్తం యథావృత్తం తవాంతికే ।
చిత్రకూటే మహాప్రాజ్ఞ వాయసం ప్రతి రాఘవ ॥ 19

పదచ్ఛేదము :– అభిజ్ఞానం – చ – మే – దత్తం – యథా – వృత్తం – తవ – అంతికే, చిత్రకూటే – మహాప్రాజ్ఞ – వాయసం – ప్రతి – రాఘవ ॥

అన్వయక్రమము :– మహాప్రాజ్ఞ! రాఘవ! చిత్రకూటే తవ అంతికే వాయసం ప్రతి యథా వృత్తం (తథా) అభిజ్ఞానం చ మే దత్తమ్.

ప్రతిపదార్థము :– మహాప్రాజ్ఞ = గొప్ప ప్రాజ్ఞుడవైన, రాఘవ! = శ్రీరామా!, చిత్రకూటే = చిత్రకూటపర్వతమున, తవ = నీయొక్క, అంతికే = సమీపమున, వాయసం ప్రతి = కాకమునుగూర్చి, యథా = ఏ విధముగా, వృత్తం = జరిగినదో, తథా = ఆ విధముగ, మే = నాకు, అభిజ్ఞానం = గుర్తు కూడ, దత్తం = ఈయబడినది.

తాత్పర్యము :– ఓ మహాప్రాజ్ఞుడవైన రఘునందనా! పూర్వము చిత్రకూటపర్వతముపై నీయెదుట కాకి చేసినట్టి ఆ దుష్టచర్యను ఆనవాలుగా చెప్పినది.

శ్లో॥ విజ్ఞాప్యశ్చ నరవ్యాఘ్రో రామో వాయుసుత త్వయా ।
అఖిలే నేహ యద్దృష్ట మితి మా మాహ జానకీ ॥ 20

పదచ్ఛేదము :– విజ్ఞాప్యః – చ – నరవ్యాఘ్రః – రామో – వాయుసుత – త్వయా – అఖిలేన – ఇహ – యత్ – దృష్టమ్ – ఇతి – మామ్ – ఆహ – జానకీ ॥

అన్వయక్రమము :– వాయుసుత! నరవ్యాఘ్రః రామః త్వయా ఇహ యత్ దృష్టమ్ అఖిలేన విజ్ఞాప్యః చ, ఇతి జానకీ మామ్ ఆహ.

ప్రతిపదార్థము :– వాయుసుత = ఓ వాయునందనా, ఇహ = ఇచ్చట, త్వయా = నీచేత, యత్ = ఏది, దృష్టం = చూడబడినదో, (తత్ = అది), అఖిలేన = సంపూర్ణముగా, నరవ్యాఘ్రః = పురుషశ్రేష్ఠుడైన, రామః = శ్రీరాముడు, విజ్ఞాప్యః చ = విన్నవించబడవలసినవాడు సుమా!, ఇతి = అని, జానకీ = సీతాదేవి, మాం = నన్నుగూర్చి, ఆహ = పలికెను.

తాత్పర్యము :– ఓ వాయునందనా! నీ విచ్చట ఏమి చూచితివో అది యంతయును

సంపూర్ణముగా పురుషోత్తముడైన ఆ శ్రీరామునకు ఎరిగింపవలయును సుమా! అని సీతమ్మ నన్ను కోరినది.

శ్లో॥ అయం చాస్మై ప్రదాతవ్యో యత్నా త్సుపరిరక్షితః ।
బ్రువతా వచనా న్యేవం సుగ్రీవ స్యోపశృణ్వతః ।
ఏష చూడామణిః శ్రీమా న్మయా సుపరిరక్షితః ॥ 21

పదచ్ఛేదము :– అయం – చ – అస్మై – ప్రదాతవ్యః – యత్నాత్ – సుపరిరక్షితః, బ్రువతా – వచనాని – ఏవం – సుగ్రీవస్య – ఉపశృణ్వతః, ఏషః – చూడామణి – శ్రీమాన్ – మయా – సుపరిరక్షితః ॥

అన్వయక్రమము :– శ్రీమాన్ ఏషః చూడామణిః మయా సుపరిరక్షితః, ఏవం వచనాని బ్రువతా త్వయా సుగ్రీవస్య ఉపశృణ్వతః (సతః) యత్నాత్ సుపరిరక్షితః అయం చ అస్మై ప్రదాతవ్యః.

ప్రతిపదార్థము :– శ్రీమాన్ = గొప్పశోభకల్గినట్టి, ఏషః = ఈ, చూడామణిః = చూడామణి, మయా = నాచేత, సుపరిరక్షితః = భద్రముగా కాపాడుకొనబడినది, సుగ్రీవస్య = సుగ్రీవుడు, ఉపశృణ్వతః (సతః) = వినుచుండగా, ఏవం = ఈ రీతిగా, వచనాని = మాటలను, బ్రువతా = పల్కుచున్నట్టి, (త్వయా = నీచేత), యత్నాత్ = ప్రయత్న పూర్వకముగా, సుపరిరక్షితః = భద్రముగా కాపాడు కొనబడినట్టి, అయం చ = ఈ చూడామణి గూడ, అస్మై = ఆ శ్రీరామునకు, ప్రదాతవ్యః = ఈయబడవలసినది.

తాత్పర్యము :– ఈ చూడామణిని మిక్కిలి శ్రేష్ఠమైనదిగా ప్రేమించుచు నేనెంతయో భద్రముగా దాచుకొని యుంటిని. సుగ్రీవుని సన్నిధిని నా మాటలన్నియు నీవు చెప్పుచున్నప్పుడు ఈ అమూల్యమైన చూడామణిని నా నాథున కొసగుము.

శ్లో॥ మనశ్శిలాయా స్తిలకో గండపార్శ్వే నివేశితః ।
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి ॥ 22

పదచ్ఛేదము :– మనశ్శిలాయాః – తిలకః – గండపార్శ్వే – నివేశితః – త్వయా – ప్రణష్టే – తిలకే – తం – కిల – స్మర్తుమ్ – అర్హసి ॥

అన్వయక్రమము :– తిలకే ప్రణష్టే (సతి) మనశ్శిలాయాః తిలకః గండపార్శ్వే త్వయా నివేశితః, తం స్మర్తుమ్ అర్హసి కిల.

ప్రతిపదార్థము :– తిలకే = బొట్టు, ప్రణష్టే (సతి) = చెరిగిపోవగా, గండపార్శ్వే =

కపోలముపై గల, మనశ్శిలాయాః = మణిశిలయొక్క, తిలకః = బొట్టు, త్వయా = నీచేత, నివేశితః = ఉంచబడినది, తం = ఆ విషయమును, స్మర్తుం = స్మరించుటకు, అర్హసి కిల = తగుదువు సుమా!.

తాత్పర్యము :- ఒకమారు నా నుదుటిపై బొట్టు చెదిరిపోవగా అప్పుడు నీవు నా చెక్కిలిపై గల మణిశిలాధాతురేఖను ఒలిచి నా నుదుటిపై బొట్టుగా ఉంచినావు. ఆ సంఘటనమును జ్ఞాపకము చేసికొనుము.

శ్లో॥ ఏష నిర్యాతితః శ్రీమా న్మయా తే వారిసంభవః ।
ఏతం దృష్ట్వా ప్రమోదిష్యే వ్యసనే త్వామివానఘ ॥ 23

పదచ్ఛేదము :- ఏషః - నిర్యాతితః - శ్రీమాన్ - మయా - తే - వారిసంభవః - ఏతం - దృష్ట్వా - ప్రమోదిష్యే - వ్యసనే - త్వామ్ - ఇవ - అనఘ ॥

అన్వయక్రమము :- అనఘః వారిసంభవః శ్రీమాన్ ఏషః తే నిర్యాతితః, వ్యసనే ఏతం దృష్ట్వా త్వామ్ (దృష్ట్వా) ఇవ ప్రమోదిష్యే.

ప్రతిపదార్థము :- అనఘః = పాపరహితుడు, వారిసంభవః = సముద్రము నుండి ఉద్భవించినట్టి, ఏషః = ఈ చూడామణి, తే = నీ కొరకు, నిర్యాతితః = పంపబడినది, వ్యసనే = కష్టకాలమునందు, ఏతం = ఈ యంగుళీయకమును, దృష్ట్వా = చూచి, త్వాం = నిన్ను, దృష్ట్వా ఇవ = చూచినట్లుగా, ప్రమోదిష్యే = ఆనందించెదను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వరతీర్థులు, తిలకము :- ఏతం = త్వత్ప్రేషితమ్ అంగులీయకమ్ ఇత్యర్థః.

తాత్పర్యము :- ఓ పుణ్యశీలుడా! దివ్యమైనట్టిదియును, గొప్పశోభకు నిలయమైనట్టిది యును నేను ప్రేమపూర్వకముగా దాచుకొనినట్టిదియునునగు నా చూడామణిని నీ కిప్పుడు పంపివేయుచున్నాను. అయినను ఇక మీదట నా కష్టకాలమునందు నీవు పంపిన ఈ యంగుళీయకమును జూచుకొనుచు నేను నిన్ను జూచినట్లే సంతోషింపగలను సుమా!

శ్లో॥ జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ ।
ఊర్ధ్వం మాసా న్న జీవేయం రక్షసాం వశ మాగతా ॥ 24

పదచ్ఛేదము :- జీవితం - ధారయిష్యామి - మాసం - దశరథాత్మజ, ఊర్ధ్వం - మాసాత్ - న - జీవేయం - రక్షసాం - వశమ్ - ఆగతా ॥

అన్వయక్రమము :– దశరథాత్మజ! మాసం జీవితం ధారయిష్యామి. రక్షసాం వశం ఆగతా మాసాత్ ఊర్ధ్వం న జీవేయమ్.

ప్రతిపదార్థము :– దశరథాత్మజ = ఓ దశరథనందనా!, మాసం = నెల, జీవితం = జీవితమును, ధారయిష్యామి = ధరించెదను. రక్షసాం = రాక్షసులయొక్క, వశం = అధీనమును, ఆగతా = చేరినదాననై, మాసాత్ = నెలకంటె, ఊర్ధ్వం = తరువాత, న జీవేయమ్ = జీవింపను.

తాత్పర్యము :– ఓ దశరథనందనా! నే నీ పరిస్థితిలో ఒక్క నెల మాత్రము జీవనముతో నిలువగలను. ఈ రాక్షసుల పాలబడియున్న నేను ఈ నెలదాటిన పిమ్మట ఏ మాత్రము జీవించజాలను.

శ్లో॥ ఇతి మా మబ్రవీ త్సీతా కృశాంగీ ధర్మచారిణీ ।
రావణాంతఃపురే రుద్ధా మృగీ వోత్ఫుల్లలోచనా ॥ 25

పదచ్ఛేదము :– ఇతి – మామ్ – అబ్రవీత్ – సీతా – కృశాంగీ – ధర్మచారిణీ, రావణాంతఃపురే – రుద్ధా – మృగీ – ఇవ – ఉత్ఫుల్లలోచనా – ॥

అన్వయక్రమము :– కృశాంగీ ధర్మచారిణీ, రావణాంతఃపురే రుద్ధా, మృగీ ఇవ ఉత్ఫుల్లలోచనా సీతా మామ్ ఇతి అబ్రవీత్.

ప్రతిపదార్థము :– కృశాంగీ = కృశించిన శరీరము గలదియును, ధర్మచారిణీ = ధర్మాచరణము గలదియును, మృగీ ఇవ = ఆడులేడి వలె, ఉత్ఫుల్లలోచనా = విశాలమైన కన్నులు గలదియునగు, సీతా = సీతాదేవి, రావణాంతఃపురే = రావణుని అంతఃపురము నందు, రుద్ధా = బంధింపబడినదై, ఇతి = ఈ విధముగా, మాం = నన్నుగూర్చి, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :– ధర్మాచరణమున ఏమరుపాటులేనిదై కృశించిన శరీరముతో లేడికన్నుల వంటి విశాలమైన నేత్రములుగల సీతాదేవి రావణాంతఃపురమున అట్లు బంధింపబడి యుండి నాతో ఈ రీతిగా పలికినది.

శ్లో॥ ఏతదేవ మయాఽఽఖ్యాతం సర్వం రాఘవ యద్యథా ।
సర్వథా సాగరజలే సంతారః ప్రవిధీయతామ్ ॥ 26

పదచ్ఛేదము :– ఏతత్ – ఏవ – మయా – ఆఖ్యాతం – సర్వం – రాఘవ – యత్ – యథా, సర్వథా – సాగరజలే – సంతారః – ప్రవిధీయతామ్ ॥

అన్వయక్రమము :- రాఘవ! యత్ యథా (స్థితం) ఏతత్ (తత్) ఏవ సర్వం మయా ఆఖ్యాతమ్, సర్వథా సాగరజలే సంతారః ప్రవిధీయతామ్.

ప్రతిపదార్థము :- రాఘవ = ఓ రఘునందనా!, యత్ = ఏది, యథా = ఏరీతిగా, స్థితం = ఉన్నదో, మయా = నాచేత, ఏతత్ = ఇది, తత్ ఏవ = అదియే, సర్వం = అంతయును, ఆఖ్యాతమ్ = చెప్పబడినది. సర్వథా = సర్వవిధముల, సాగరజలే = సముద్రజలమున, సంతారః = తరణోపాయము (సేతువు), ప్రవిధీయతామ్ = ఏర్పరుపబడుగాక.

తాత్పర్యము :- ఓ రఘునందనా! ఉన్నది యున్నట్లుగా జరిగిన దంతయును నీకు విన్నవించితిని. ఇక ఇప్పుడు లంకను చేరుటకై సముద్రమును దాటు ఉపాయమును ఏర్పాటుచేయవలసి యున్నది.

శ్లో॥ తౌ జాతాశ్వాసౌ రాజపుత్రౌ విదిత్వా
తచ్చాభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ ।
దేవ్యా చాఖ్యాతం సర్వమే వానుపూర్వ్యా
ద్వాచా సంపూర్ణం వాయుపుత్ర శ్శశంస ॥ 27

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"చూడామణి ప్రదానం" నామ
పంచషష్టితమ స్సర్గః.

పదచ్ఛేదము :- తౌ - జాతాశ్వాసౌ - రాజపుత్రౌ - విదిత్వా - తత్ - చ - అభిజ్ఞానం - రాఘవాయ - ప్రదాయ - దేవ్యా - చ - ఆఖ్యాతం - సర్వమ్ - ఏవ - అనుపూర్వ్యాత్ - వాచా - సంపూర్ణం - వాయుపుత్రః - శశంస ॥

అన్వయక్రమము :- తౌ రాజపుత్రౌ జాతాశ్వాసౌ విదిత్వా తత్ అభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ చ, వాయుపుత్రః దేవ్యా ఆఖ్యాతం సర్వం చ ఆనుపూర్వ్యాత్ వాచా సంపూర్ణం శశంస.

ప్రతిపదార్థము :- తౌ = ఆ, రాజపుత్రౌ = రాజకుమారులైన రామలక్ష్మణులను, జాతాశ్వాసౌ = కలిగిన ఊరటగలవారినిగా, విదిత్వా = తెలిసికొని, రాఘవాయ = శ్రీరామునికొరకు, తత్ = ఆ, అభిజ్ఞానం = ఆనవాలును, ప్రదాయ = ఇచ్చి, దేవ్యా = సీతాదేవిచే, ఆఖ్యాతం = చెప్పబడినదానిని, సర్వమ్ ఏవ చ = అంతయును కూడ, వాయుపుత్రః = వాయునందనుడు, ఆనుపూర్వ్యాత్ = క్రమపూర్వకముగా,

వాచా = మాటలతో, సంపూర్ణం = సమగ్రముగా, శశంస = చెప్పెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- దేవ్యా చాఖ్యాతం సర్వమేవ – శశంస.

హనుమన్న శ్రీరామునితో లంకలో తాను నెరపిన విషయము లన్నియును చెప్పవలసియుండగా నచ్చటి అక్షవధ మున్నగువానినిగూర్చియు, లంకా దహనాదికమును గూర్చియు, నట్లే సముద్రలంఘన సమయమున సురసానిరస నాదికమును గూర్చియు చెప్పకుండుట అనునది అత్మస్తుతిగా గాన్పించునను భావముతోడనే అనియును, పూర్వ మంగదాదులకడ ఉన్నది యున్నట్లు చెప్పవలెనను భావముతో మాత్రమే అచట చెప్పియుండెననియును గ్రహించవలెను.

తాత్పర్యము :- ఆ రామలక్ష్మణులు తమ చిరకాల చింత తొలగి ఆనందించు చున్నందుకు సంతసించుచు, తన గుర్తుగా సీతమ్మ ఇచ్చిన చూడామణిని రామునకు ఒసగి, ఆమె ఆతనితో చెప్పుమన్నమాటల నన్నింటిని పూసగుచ్చినట్లు హనుమ ఏమియు విడువకుండ శ్రీరామునకు వివరించెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"చూడామణిప్రదానము" అను
అరువదియైదవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

షట్‌షష్టితమసర్గ

శ్లో॥ ఏవముక్తో హనుమతా రామో దశరథాత్మజః ।
తం మణిం హృదయే కృత్వా ప్రరురోద సలక్ష్మణః ॥ 1

పదచ్ఛేదము :– ఏవమ్ – ఉక్తః – హనుమతా – రామః – దశరథాత్మజః – తం – మణిం – హృదయే – కృత్వా – ప్రరురోద – సలక్ష్మణః ॥

అన్వయక్రమము :– దశరథాత్మజః సలక్ష్మణః రామః హనుమతా ఏవమ్ ఉక్తః (సన్) తం మణిం హృదయే కృత్వా ప్రరురోద.

ప్రతిపదార్థము :– దశరథాత్మజః = దశరథనందనుడైనట్టి, సలక్ష్మణః = లక్ష్మణునితో కూడిన, రామః = శ్రీరాముడు, హనుమతా = హనుమచే, ఏవమ్ = ఇట్లు, ఉక్తః (సన్) = చెప్పబడినవాడై, తం = ఆ, మణిం = చూడామణిని, హృదయే = గుండెపై, కృత్వా = తీసికొని, ప్రరురోద = మిక్కిలిగ శోకించెను.

తాత్పర్యము :– హనుమంతు డిట్లు చెప్పగనే దశరథనందనుడు తన ప్రియురాలిచే గుర్తుగా ఈయబడినట్టి ఆ చూడామణిని తన గుండెపై నుంచుకొని తమ్మునితో గూడి ఎంతగానో విలపించెను.

శ్లో॥ తం తు దృష్ట్వా మణిశ్రేష్ఠం రాఘవ శ్శోకకర్శితః ।
నేత్రాభ్యా మశ్రుపూర్ణాభ్యాం సుగ్రీవ మిద మబ్రవీత్ ॥ 2

పదచ్ఛేదము :– తం – తు – దృష్ట్వా – మణిశ్రేష్ఠం – రాఘవః – శోకకర్శితః, నేత్రాభ్యామ్ – అశ్రుపూర్ణాభ్యాం – సుగ్రీవమ్ – ఇదమ్ – అబ్రవీత్ ॥

అన్వయక్రమము :– తం మణిశ్రేష్ఠం దృష్ట్వా రాఘవః శోకకర్శితః (సన్) అశ్రుపూర్ణాభ్యాం నేత్రాభ్యాం సుగ్రీవమ్ ఇదమ్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :– తం = ఆ, మణిశ్రేష్ఠం = గొప్పదైనట్టి చూడామణిని, దృష్ట్వా = చూచి, రాఘవః = శ్రీరాముడు, శోకకర్శితః సన్ = దుఃఖముచే పీడింపబడినవాడై, అశ్రుపూర్ణాభ్యాం = కన్నీటితో నిండినట్టి, నేత్రాభ్యాం = కన్నులతో, సుగ్రీవం =

సుగ్రీవునిగూర్చి, ఇదం = ఈ మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :– అమూల్యమైనట్టి ఆ చూడామణిని కనుగొనగానే శ్రీరాముడు తన హృదయమున దుఃఖము పొంగివచ్చుచుండగా దుఃఖాశ్రువులతో నిండిన కన్నులతో సుగ్రీవుని జూచుచు ఇట్లు పలికెను.

శ్లో॥ యథైవ ధేను స్స్రవతి స్నేహా ద్వత్సస్య వత్సలా ।
తథా మమాపి హృదయం మణిరత్నస్య దర్శనాత్ ॥ 3

పదచ్ఛేదము :– యథా – ఏవ – ధేనుః – స్రవతి – స్నేహాత్ – వత్సస్య – వత్సలా, తథా – మమ – అపి – హృదయం – మణిరత్నస్య – దర్శనాత్ ॥

అన్వయక్రమము :– యథా ఏవ వత్సలా ధేనుః వత్సస్య స్నేహాత్ స్రవతి తథా మణిరత్నస్య దర్శనాత్ మమ హృదయమ్ అపి స్రవతి.

ప్రతిపదార్థము :– యథా ఏవ = ఏరీతిగానైతే, వత్సలా = వాత్సల్యము గలిగినట్టి, ధేనుః = ఆవు, వత్సస్య = బిడ్డయొక్క, స్నేహాత్ = ప్రేమవలన, స్రవతి = ద్రవించునో, తథా = ఆ విధముగా, మణిరత్నస్య = గొప్పదైన చూడామణియొక్క, దర్శనాత్ = దర్శనమువలన, మమ = నాయొక్క, హృదయమ్ అపి = హృదయము గూడ, స్రవతి = ద్రవించుచున్నది.

తాత్పర్యము :– తన బిడ్డపై మక్కువగలిగియుండు ఆవు తన దూడను చాలకాలమునకు చూచినప్పుడు ప్రేమచేత పొదుగెట్లు స్రవించునో అట్లే ఈ చూడామణిని జూచినంతనే నా హృదయముగూడ ద్రవించిపోవుచున్నది.

శ్లో॥ మణిరత్న మిదం దత్తం వైదేహ్యా శ్శ్వశురేణ మే ।
వధూకాలే యథా బద్ధ మధికం మూర్ధ్ని శోభతే ॥ 4

పదచ్ఛేదము :– మణిరత్నమ్ – ఇదం – దత్తం – వైదేహ్యాః – శ్వశురేణ – మే, వధూకాలే – యథా – బద్ధమ్ – అధికం – మూర్ధ్ని – శోభతే ॥

అన్వయక్రమము :– వధూకాలే మూర్ధ్ని యథా అధికం శోభతే, తథా బద్ధం మణిరత్నం మే శ్వశురేణ వైదేహ్యా దత్తమ్.

ప్రతిపదార్థము :– వధూకాలే = వివాహసమయమునందు, యథా = ఏరీతిగా, మూర్ధ్ని = శిరస్సునందు, అధికం = మిక్కిలిగా, శోభతే = ప్రకాశించునో, తథా = ఆరీతిగా, బద్ధం = కట్టబడినట్టి, ఇదం = ఈ, మణిరత్నం = గొప్పదైన చూడామణి, మే = నాయొక్క, శ్వశురేణ = మామయైన జనకునిచే, వైదేహ్యాః = జానకికి, దత్తం

= ఈయబడినది.

తాత్పర్యము :– వివాహ సమయమునందు శిరస్సున అలంకరింపబడి మిక్కిలి శోభతో ప్రకాశించినట్టిదైన ఈ దివ్యమైన చూడామణిని నా మామగారైన జనకమహారాజు సీతాదేవి కొసగినాడు.

శ్లో॥ అయం హి జలసంభూతో మణి స్సజ్జనపూజితః ।
యజ్ఞే పరమతుష్టేన దత్త శ్శక్రేణ ధీమతా ॥ 5

పదచ్ఛేదము :– అయం – హి – జలసంభూతః – మణిః – సజ్జనపూజితః, యజ్ఞే – పరమతుష్టేన – దత్తః – శక్రేణ – ధీమతా ॥

అన్వయక్రమము :– జలసంభూతః సజ్జనపూజితః అయం మణిః యజ్ఞే పరమతుష్టేన ధీమతా శక్రేణ దత్తః.

ప్రతిపదార్థము :– జలసంభూతః = జలమునుండి పుట్టినదియును, సజ్జనపూజితః = సత్పురుషులచే పూజింపబడినదియునగు, అయం = ఈ, మణిః = చూడామణి, యజ్ఞే = యజ్ఞమునందు, పరమతుష్టేన = మిక్కిలి తృప్తినొందినట్టి, ధీమతా = బుద్ధిశాలియైన, శక్రేణ = దేవేంద్రునిచే, దత్తః = ఈయబడినది.

తాత్పర్యము :– ఈ చూడామణి జలమునుండి జనించినట్టిది, సజ్జను లెల్లరిచే ప్రశంసింపబడినట్టిది. మరియును ఒకానొక యాగమునందు దేవేంద్రుడు మిక్కిలి సంతోషించి తాను స్వయముగా నా మామయైన జనకమహారాజునకు ఇచ్చినట్టిది యును సుమా!

శ్లో॥ ఇమం దృష్ట్వా మణిశ్రేష్ఠం యథా తాతస్య దర్శనమ్ ।
అద్యా స్మ్యవగత స్సౌమ్య వైదేహస్య తథా విభోః ॥ 6

పదచ్ఛేదము :– ఇమం – దృష్ట్వా – మణిశ్రేష్ఠం – యథా – తాతస్య – దర్శనమ్ – అద్య – అస్మి – అవగతః – సౌమ్య – వైదేహస్య – తథా – విభోః ॥

అన్వయక్రమము :– సౌమ్య! ఇదం మణిశ్రేష్ఠం దృష్ట్వా అద్య తాతస్య దర్శనం యథా వైదేహస్య విభోః దర్శనం చ అవగతః అస్మి.

ప్రతిపదార్థము :– సౌమ్య = ఓ సజ్జనుడా, ఇదం = ఈ , మణిశ్రేష్ఠం = గొప్పదైన చూడామణిని, దృష్ట్వా = చూచి, తాతస్య = తండ్రియొక్క, దర్శనం యథా = దర్శనమట్లు, అద్య = ఇప్పుడు, వైదేహస్య విభోః = జనకమహారాజుయొక్క, దర్శనం = దర్శనమును, అవగతః = పొందినవాడను, అస్మి = అగుచున్నాను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– పూర్వము సీతాసందేశ సందర్భమున 39వ సర్గలో 2వ శ్లోకమున సీత తానొసగిన చూడామణిని చూడగనే శ్రీరాముడు తన తల్లిని, తనను, దశరథమహారాజును ముప్పురిని స్మరింపగలడని తెలిపినది. అచ్చట ముప్పురిని అనగా ఆమె భావమున తననే గాక ఇంకను చాలామందిని స్మరించునని తెలుపుటయే. అందుకు తగినట్లుగానే శ్రీరాము డిప్పు డిచట తన తండ్రియైన దశరథుని మామయైన జనకుని గూడ స్మరించుట సహజముగా నున్నది.

తాత్పర్యము :– ఓ సజ్జనుడా! గొప్పదైనట్టి ఈ చూడామణిని చూడగనే నాతండ్రియైన దశరథుని దర్శించినట్లును మామయైన జనకమహారాజును చూచినట్లును నా మనస్సునకు సంతోషము కలుగుచున్నది సుమా!

శ్లో॥ అయం హి శోభతే తస్యాః ప్రియాయా మూర్ధ్ని మే మణిః ।
అద్యాస్య దర్శనే నాహం ప్రాప్తాం తామివ చింతయే ॥ 7

పదచ్ఛేదము :– అయం – హి – శోభతే – తస్యాః – ప్రియాయాః – మూర్ధ్ని – మే – మణిః, అద్య – అస్య – దర్శనేన – అహం – ప్రాప్తాం – తామ్ – ఇవ – చింతయే ॥

అన్వయక్రమము :– అయం మణిః తస్యాః మే ప్రియాయాః మూర్ధ్ని (ఏవ) శోభతే హి, అద్య అహం అస్య దర్శనేన తాం ప్రాప్తామ్ ఇవ చింతయే.

ప్రతిపదార్థము :– అయం = ఈ, మణిః = మణి, తస్యాః = ఆ, మే = నాయొక్క ప్రియాయాః = ప్రియురాలియొక్క, మూర్ధ్ని ఏవ = శిరమునందే, శోభతే హి = ప్రకాశించును సుమా!, అద్య = నేడు, అహం = నేను, అస్య = ఈ మణియొక్క, దర్శనేన = చూచుటచేత, తాం = ఆ సీతాదేవిని, ప్రాప్తామ్ ఇవ = ప్రాప్తించిన దానినిగనే, చింతయే = భావించుచున్నాను.

తాత్పర్యము :– ఈ చూడామణి నా ప్రియురాలి శిరముపై నున్నప్పుడు ఎంత గొప్పగనో ప్రకాశించుచుండెడిది సుమా! నే డీ మణిని దర్శించుచుండగా నాకు ప్రియురాలే ఎదుట నిలచినట్లుగా తోచుచున్నది.

శ్లో॥ కి మాహ సీతా వైదేహీ బ్రూహి సౌమ్య పునః పునః ।
పిపాసుమివ తోయేన సించంతీ వాక్యవారిణా ॥ 8

పదచ్ఛేదము :– కిమ్ – ఆహ – సీతా – వైదేహీ – బ్రూహి – సౌమ్య – పునః –

పునః, పిపాసుమ్ – ఇవ – తోయేన – సించంతీ – వాక్యవారిణా ॥

అన్వయక్రమము :– సౌమ్య! పిపాసుం తోయేన ఇవ వాక్యవారిణా సించంతీ వైదేహీ సీతా కిమ్ ఆహ? పునః పునః బ్రూహి.

ప్రతిపదార్థము :– సౌమ్య = ఓ సజ్జనుడా!, పిపాసుం = దప్పిగొన్నవానిని, తోయేన ఇవ = మంచినీటితో వలె, వాక్యవారిణా = వచనజలముచే, సించంతీ = తడుపుచున్నదై, వైదేహీ = విదేహరాజు తనయయైన, సీతా = సీతాదేవి, కిం = ఏమి, ఆహ = పలికెను. పునః పునః = మరల మరల, బ్రూహి = చెప్పుము.

తాత్పర్యము :– దప్పిగొన్నవానిని మంచినీటితో తృప్తి పరచినట్లు తన వచనామృతముచే నన్ను తృప్తిపరచుచు ఆ విదేహరాజతనయ ఏమేమి పలికినది? అవి యన్నియును నాకు మరల మరల చెప్పుము.

శ్లో॥ ఇతస్తు కిం దుఃఖతరం య దిమం వారిసంభవమ్ ।
మణిం పశ్యామి సౌమిత్రే వైదేహీ మాగతాం వినా ॥ 9

పదచ్ఛేదము :– ఇతః – తు – కిం – దుఃఖతరం – యత్ – ఇమం – వారిసంభవమ్, మణిం – పశ్యామి – సౌమిత్రే – వైదేహీమ్ – ఆగతాం – వినా ॥

అన్వయక్రమము :– సౌమిత్రే! ఆగతాం వైదేహీం వినా వారిసంభవమ్ ఇమం మణిం పశ్యామి ఇతి యత్ ఇతః దుఃఖతరం కిం?

ప్రతిపదార్థము :– సౌమిత్రే = ఓ సుమిత్రానందనా!, వైదేహీమ్ ఆగతాం వినా = జానకిరాకుండా, వారిసంభవం = జలసంభూతమైన, ఇమం = ఈ, మణిం = రత్నమును, పశ్యామి = చూచుచున్నాను, ఇతి యత్ = అను మాట ఏది గలదో, ఇతః = ఇంతకంటె, దుఃఖతరం = మిక్కిలి దుఃఖకరమైనట్టిది, కిం = ఏది యుండును.

తాత్పర్యము :– తమ్ముడా! సీత లేకుండ ఆమె ధరించినట్టి ఈ దివ్యమైన రత్నమును మాత్రమే చూడవలసి వచ్చుచున్నట్టి ఈ దుస్థితికంటె దుఃఖతరమైన విషయమేది యుండును?

శ్లో॥ చిరం జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి ।
న జీవేయం క్షణమపి వినా తా మసితేక్షణామ్ ॥ 10

పదచ్ఛేదము :– చిరం – జీవతి – వైదేహీ – యది – మాసం – ధరిష్యతి, న – జీవేయం – క్షణమ్ – అపి – వినా – తామ్ – అసితేక్షణామ్ ॥

అన్వయక్రమము :– వైదేహీ మాసం (ప్రాణాన్) ధరిష్యతి యది చిరం జీవతి, అసితేక్షణాం తాం వినా (అహం) క్షణమ్ అపి న జీవేయమ్.

ప్రతిపదార్థము :– వైదేహీ = జానకీదేవి, మాసం = ఒకనెల కాలము, (ప్రాణాన్ = ప్రాణములను), ధరిష్యతి యది = ధరించునెడల, చిరం = చిరకాలము, జీవతి = జీవించును, అసితేక్షణాం = నల్లని కన్నులుగల, తాం వినా = ఆమె లేకుండగ, (అహం = నేను), క్షణమపి = ఒక్క క్షణముగూడ, న జీవేయమ్ = బ్రతుకజాలను.

తాత్పర్యము :– జానకి నెలదినములు ప్రాణములు నిలుపుకొనగలిగిన యెడల ఆమె చిరకాలము జీవించినట్లే యని నమ్ముము. నేను మాత్రము నా ప్రియురాలు లేకుండగ ఒక్క క్షణము గూడ జీవింపలే ననిపించుచున్నది.

శ్లో॥ నయ మామపి తం దేశం యత్ర దృష్టా మమ ప్రియా ।
న తిష్ఠేయం క్షణమపి ప్రవృత్తి ముపలభ్య చ ॥ 11

పదచ్ఛేదము :– నయ – మామ్ – అపి – తం – దేశం – యత్ర – దృష్టా – మమ – ప్రియా, న – తిష్ఠేయం – క్షణమ్ – అపి – ప్రవృత్తిమ్ – ఉపలభ్య – చ ॥

అన్వయక్రమము :– మమ ప్రియా యత్ర దృష్టా మామ్ అపి తం దేశం నయ, ప్రవృత్తిమ్ ఉపలభ్య చ క్షణమ్ అపి న తిష్ఠేయమ్.

ప్రతిపదార్థము :– మమ = నాయొక్క, ప్రియా = ప్రియురాలు, యత్ర = ఎచ్చట, దృష్టా = చూడబడినదో, మామ్ అపి = నన్ను గూడ, తం = ఆ, దేశం = ప్రదేశమును గూర్చి, నయ = తీసికొనిపొమ్ము, ప్రవృత్తిం = వార్తను, ఉపలభ్య చ = పొంది గూడ, క్షణమ్ అపి = క్షణమైనను, న తిష్ఠేయమ్ = నిలువజాలను.

తాత్పర్యము :– ఓ హనుమా! నా ప్రియురాలి నెచ్చట చూచినావో అచటికే నన్ను గూడ వెంటనే గొనిపొమ్ము. ఆమె వార్త తెలిసిన పిమ్మటగూడ నే నామెను చూడకుండ ఒక్క క్షణమైనను బ్రదుకజాలను.

శ్లో॥ కథం సా మమ సుశ్రోణీ భీరుభీరుస్సతీ సదా ।
భయావహానాం ఘోరాణాం మధ్యే తిష్ఠతి రక్షసామ్ ॥ 12

పదచ్ఛేదము :– కథం – సా – మమ – సుశ్రోణీ – భీరుభీరుః – సతీ – సదా, భయావహానాం – ఘోరాణాం – మధ్యే – తిష్ఠతి – రక్షసామ్ ॥

అన్వయక్రమము :– మమ సుశ్రోణీ సా సదా భీరుభీరుః సతీ భయావహానాం ఘోరాణాం రక్షసాం మధ్యే కథం తిష్ఠతి?

ప్రతిపదార్థము :– మమ = నాయొక్క, సుశ్రోణీ సా = ప్రియురాలైన ఆమె, సదా = ఎల్లప్పుడును, భీరుభీరుః సతీ = మిక్కిలి భీతినొందు స్వభావము గల్గినట్టిదై, భయావహానాం = భయము గొల్పెడి, ఘోరాణాం = క్రూరులైన, రక్షసాం = రాక్షసుల యొక్క, మధ్యే = నడుమ, కథం = ఎట్లు, తిష్ఠతి = ఉన్నది?

తాత్పర్యము :– మిక్కిలి భయస్వభావము గల్గినట్టి నా ప్రియురాలు మహాభయంకరులైన ఆ క్రూరరాక్షసుల నడుమ ఎటు లుండగలుగుచున్నదో గదా!

శ్లో॥ శారద స్తిమిరోన్ముక్తో నూనం చంద్ర ఇ వాంబుదైః ।
ఆవృతం వదనం తస్యా న విరాజతి రాక్షసైః ॥ 13

పదచ్ఛేదము :– శారదః – తిమిరోన్ముక్తః – నూనం – చంద్రః – ఇవ – అంబుదైః, ఆవృతం – వదనం – తస్యాః – న – విరాజతి – రాక్షసైః ॥

అన్వయక్రమము :– తిమిరోన్ముక్తః అంబుదైః (ఆవృతః) శారదః చంద్రః ఇవ రాక్షసైః ఆవృతం తస్యాః వదనం నూనం న విరాజతి.

ప్రతిపదార్థము :– తిమిరోన్ముక్తః = చీకటినుండి విడువబడినట్టిదియును, అంబుదైః = మేఘములచే, ఆవృతః = ఆవరింపబడినదియును అగు, శారదః = శరత్కాలము నందలిదైన, చంద్రః ఇవ = చంద్రబింబమువలె, రాక్షసైః = రాక్షసులచే, ఆవృతం = ఆవరింపబడిన, తస్యాః = ఆ సీతాదేవియొక్క, వదనం = ముఖము, నూనం = నిశ్చయముగా, న విరాజతి = శోభిల్లదు.

తాత్పర్యము :– చీకటిచే విడువబడి చక్కగా ప్రకాశింపవలసిన శరత్కాల చంద్రబింబము మేఘము లావరించుటచే ప్రకాశవిహీనమై యున్నట్లుగా మిక్కిలి సుందరమైన నా జానకి ముఖము రాక్షసాంగనలు చుట్టుకొని యుండుటచే ఎంత శోభావిహీనమై యున్నదో గదా!

శ్లో॥ కిమాహ సీతా హనుమం స్తత్త్వతః కథయాఽద్య మే ।
ఏతేన ఖలు జీవిష్యే భేషజే నాతురో యథా ॥ 14

పదచ్ఛేదము :– కిమ్ – ఆహ – సీతా – హనుమన్ – తత్త్వతః – కథయ – అద్య – మే – ఏతేన – ఖలు – జీవిష్యే – భేషజేన – ఆతురః – యథా ॥

అన్వయక్రమము :– హనుమన్! సీతా కిమ్ ఆహ? మే అద్య తత్త్వతః కథయ, ఆతురః భేషజేన యథా (అహం) ఏతేన జీవిష్యే ఖలు!

ప్రతిపదార్థము :– హనుమన్ = ఓ హనుమా!, సీతా = జానకి, కిం = ఏమి?, ఆహ

= పలికినది? మే = నాకు, అద్య = ఇప్పుడు, తత్త్వతః = ఉన్నది ఉన్నట్లు, కథయ = చెప్పుము, ఆతురః = రోగి, భేషజేన యథా = ఔషధముచేత వలె, (అహం = నేను), ఏతేన = ఈ సందేశముచేతనే, జీవిష్యే ఖలు = జీవింతును సుమా!

తాత్పర్యము :– ఓ హనుమా! నా సీతాదేవి ఏమి చెప్పినది? అది యంతయును ఆమె నీతో చెప్పినది చెప్పినట్లు ఇప్పుడు నాకు చెప్పుము. రోగి ఔషధముచే ప్రాణమును నిలుపుకొనునట్లుగా, నీవు చెప్పు మాటలచేతనే సుమా నేను జీవించునట్టిది.

శ్లో॥ మధురా మధురాలాపా కిమాహ మమ భామినీ ।
మద్విహీనా వరారోహా హనుమన్ కథయస్వ మే ॥ 15

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"సీతాభాషితప్రశ్నో" నామ
షట్షష్టితమస్సర్గః

పదచ్ఛేదము :– మధురా – మధురాలాపా – కిమ్ – ఆహ – మమ – భామినీ, మద్విహీనా – వరారోహా – హనుమన్ – కథయస్వ – మే ॥

అన్వయక్రమము :– మధురా మధురాలాపా వరారోహా మద్విహీనా మమ భామినీ కిమ్ ఆహ? హనుమన్! మే కథయస్వ.

ప్రతిపదార్థము :– మధురా = సుందరియును, మధురాలాపా = మధురమైన మాటలు గలదియును, వరారోహా = చక్కని ఆకారము గలదియును, మద్విహీనా = నేను లేకుండ నున్నదియు నగు, మమ = నాయొక్క, భామినీ = ప్రియురాలు, కిం = ఏమి, ఆహ = చెప్పినది?, హనుమన్! = ఓ హనుమా, మే = నాకు, కథయస్వ = చెప్పుము.

తాత్పర్యము :– సుందరమైన రూపము గలదియును మధురముగ మాటలాడునదియును సుందరమైన ఆకారము గలదియు నగు నా ప్రియురాలు నాకు దూరముగ నుండి ఏమి చెప్పినదో ఓ హనుమా! అవి యన్నియును నాకు వీనులవిందుగా వినిపింపుము.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"సీతాభాషితప్రశ్నము" అను అరువదియారవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

సప్తషష్టితమసర్గ

శ్లో॥ ఏవ ముక్తస్తు హనుమాన్ రాఘవేణ మహాత్మనా ।
సీతాయా భాషితం సర్వం న్యవేదయత రాఘవే ॥ 1

పదచ్ఛేదము :– ఏవమ్ – ఉక్తః – తు – హనుమాన్ – రాఘవేణ – మహాత్మనా, సీతాయాః – భాషితం – సర్వం – న్యవేదయత – రాఘవే ॥

అన్వయక్రమము :– మహాత్మనా రాఘవేణ ఏవం ఉక్తః హనుమాన్ సీతాయాః భాషితం సర్వం రాఘవే న్యవేదయత్.

ప్రతిపదార్థము :– మహాత్మనా = మహనీయుడైన, రాఘవేణ = శ్రీరామునిచే, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = చెప్పబడినవాడై, హనుమాన్ = హనుమ, సీతాయాః = సీతాదేవియొక్క, భాషితం = మాటను, సర్వం = అంతను, రాఘవే = శ్రీరామునియెడ, న్యవేదయత్ = నివేదించెను.

తాత్పర్యము :– మహాత్ముడైన శ్రీరాముడు తనతో అట్లు పలుకగా హనుమ శ్రీరామునకు సీతాదేవి తెలిపిన విషయమునంతను విన్నవించెను.

శ్లో॥ ఇద ముక్తవతీ దేవీ జానకీ పురుషర్షభ ।
పూర్వవృత్త మభిజ్ఞానం చిత్రకూటే యథాతథమ్ ॥ 2

పదచ్ఛేదము :– ఇదమ్ – ఉక్తవతీ – దేవీ – జానకీ – పురుషర్షభ – పూర్వవృత్తమ్ – అభిజ్ఞానం – చిత్రకూటే – యథాతథమ్ ॥

అన్వయక్రమము :– పురుషర్షభ! జానకీ దేవీ చిత్రకూటే పూర్వవృత్తమ్ అభిజ్ఞానం యథాతథమ్ ఇదమ్ ఉక్తవతీ.

ప్రతిపదార్థము :– పురుషర్షభ = ఓ పురుషశ్రేష్ఠుడా!, జానకీ దేవీ = సీతాదేవి, చిత్రకూటే = చిత్రకూటపర్వతమునందు, పూర్వవృత్తం = వెనుకజరిగిన దానిని, అభిజ్ఞానం = ఆనవాలుగా, యథాతథం = ఉన్నది యున్నట్లుగా, ఇదం = ఈ విషయమును, ఉక్తవతీ = చెప్పినది.

తాత్పర్యము :– ఓ పురుషోత్తమా! సీతాదేవి పూర్వము చిత్రకూటమునం దుండగా జరిగిన సంఘటనమును నీకు ఆనవాలుగా ఉన్నది యున్నట్లు ఇట్లు చెప్పినది సుమా!

శ్లో॥ సుఖసుప్తా త్వయా సార్ధం జానకీ పూర్వముత్థితా ।
వాయస స్సహ సోత్పత్య విదదార స్తనాంతరే ॥ 3

పదచ్ఛేదము :– సుఖసుప్తా – త్వయా – సార్ధం – జానకీ – పూర్వమ్ – ఉత్థితా, వాయసః – సహసా – ఉత్పత్య – విదదార – స్తనాంతరే ॥

అన్వయక్రమము :– జానకీ త్వయా సార్ధం సుఖసుప్తా (సతీ) పూర్వమ్ ఉత్థితా, వాయసః సహసా ఉత్పత్య స్తనాంతరే విదదార.

ప్రతిపదార్థము :– జానకీ = సీతాదేవి, త్వయా సార్ధం = నీతోడ, సుఖసుప్తా సతీ = సుఖముగా నిద్రించినదై, పూర్వం = ముందుగా, ఉత్థితా = లేచినది, వాయసః = కాకము, సహసా = అకస్మాత్తుగా, ఉత్పత్య = ఎగిరి, స్తనాంతరే = స్తనమధ్యమున, విదదార = పొడిచెను.

తాత్పర్యము :– సీతాదేవి నీతో గూడ సుఖముగా నిద్రించి తాను ముందుగనే మేల్కొనెను. అప్పుడే అకస్మికముగా ఒక వాయసము ఎగిరివచ్చి ఆమె స్తనమధ్యమున ముక్కుతో పొడిచినది.

శ్లో॥ పర్యాయేణ చ సుప్త స్త్వం దేవ్యంకే భరతాగ్రజ ।
పునశ్చ కిల పక్షీ స దేవ్యా జనయతి వ్యథామ్ ॥ 4

పదచ్ఛేదము :– పర్యాయేణ – చ – సుప్తః – త్వం – దేవ్యంకే – భరతాగ్రజ, పునః – చ – కిల – పక్షీ – సః – దేవ్యాః – జనయతి – వ్యథామ్ ॥

అన్వయక్రమము :– భరతాగ్రజ! పర్యాయేణ త్వం దేవ్యంకే సుప్తః. సః పక్షీ పునః దేవ్యాః వ్యథాం జనయతి కిల.

ప్రతిపదార్థము :– భరతాగ్రజ = భరతుని జ్యేష్ఠసోదరుడైన రామా!, పర్యాయేణ = పర్యాయక్రమముగా, త్వం = నీవు, దేవ్యంకే = సీతాదేవిని యొడిలో, సుప్తః = నిద్రించినవాడవు, సః పక్షీ = ఆ వాయసము, పునః చ = మరల గూడ, దేవ్యాః = సీతాదేవికి, వ్యథాం = బాధను, జనయతి కిల = కలిగించుచుండెనట.

తాత్పర్యము :– ఓ రామా! ఒకరి పిమ్మట ఒకరు చొప్పున నీ వప్పుడు సీతాదేవి యొడిలో నిదురించుచుంటి వట – ఆ వాయసము మరల వచ్చి ఆమెను బాధింప నారంభించెనట.

శ్లో॥ పునః పున రుపాగమ్య విదదార భృశం కిల ।
తత స్త్వం బోధిత స్తస్యా శ్శోణితేన సముక్షితః ॥ 5

పదచ్ఛేదము :– పునః – పునః – ఉపాగమ్య – విదదార – భృశం – కిల, తతః – త్వం – బోధితః – తస్యాః – శోణితేన – సముక్షితః ॥

అన్వయక్రమము :– (సః) పునః పునః ఉపాగమ్య భృశం విదదార కిల, తతః తస్యాః శోణితేన సముక్షితః త్వం బోధితః.

ప్రతిపదార్థము :– (సః = ఆ వాయసము), పునః పునః = మరల మరల, ఉపాగమ్య = వచ్చి, భృశం = తీవ్రముగా, విదదార కిల = పొడుచుచుండెనట, తతః = పిమ్మట, తస్యాః = ఆమెయొక్క, శోణితేన = రక్తముచే, సముక్షితః = తడుపబడినవాడవై, త్వం = నీవు, బోధితః = మేలుకొల్పబడినవాడవు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా.శిరోమణి :– "పునః పునః ఆగమ్య భృశం విదదార" అనగా పొడిచినట్లుగా నటించెనని అర్థము చెప్పవలెను – అట్లే "శోణితేన సముక్షితః బోధితః" అనగా నెత్తురు చుక్కలచే తడుపబడినట్లు తన చీరపై సహజముగనున్న ఎర్రని బిందువులచే సీతాదేవి భ్రమచెంది ఆమెచే రాముడు మేల్కొల్పబడెను. అంతియేగాని సీతాదేవి వక్షమును కాకి పొడుచుట, రక్తముకారుట యనునది అసంభావ్యము. ఏలనన సీతారాముల శరీరము లప్రాకృతములు అని ఒప్పుకొనవలెనుగదా!,

"యో వేత్తి భౌతికం దేహం రామస్య పరమాత్మనః
స సర్వస్మాత్ బహిః కార్యః శ్రౌతస్మార్తవిధానతః."

పరమాత్మయైన శ్రీరాముని దేహమును భౌతికమని భావించునతడు ఎట్టివైదిక క్రియకును అర్హుడు కాజాలడని భావము ఈ సందర్భమున గ్రహింపవలసినది. వనవాసము మొదటిరోజులలో సీతారాములు చిత్రకూటగిరిపై నివసించుచు అచటి మనోహర వాతావరణమున మహోల్లాసముగా నుండిరి. అది గమనించిన ఇంద్రపుత్రుడైన జయంతునకు శంక కలిగెను. శ్రీరాముడు చేయవలసియున్న దుష్టశిక్షణము రావణాదుల నిగ్రహణము సాధ్యమా అని. ఆ శంక తీరుటకై రామునకు క్రోధము కలిగించెను. దాని ఫలితము వెల్లడి అయ్యెను.

తాత్పర్యము :– ఆ వాయసము మరల మరల వచ్చి ఆమె నట్లు పొడుచుచు బాధించెనట. అప్పుడు స్రవించిన రక్తబిందువులు నీయొడలి కంటి నీవు మేల్కొంటివట.

శ్లో॥ తాం తు దృష్ట్వా మహాబాహో దారితాం చ స్తనాంతరే ।
ఆశీవిష ఇవ క్రుద్ధో నిశ్శ్వస న్నభ్యభాషథాః ॥ 6

పదచ్ఛేదము :– తాం తు – దృష్ట్వా – మహాబాహో – దారితాం – చ – స్తనాంతరే, ఆశీవిషః – ఇవ – క్రుద్ధః – నిశ్శ్వసన్ – అభ్యభాషథాః ॥

అన్వయక్రమము :– మహాబాహో! స్తనాంతరే దారితాం తాం దృష్ట్వా ఆశీవిషః ఇవ క్రుద్ధః (సన్) నిశ్శ్వసన్ (త్వమ్) అభ్యభాషథాః.

ప్రతిపదార్థము :– మహాబాహో = గొప్ప భుజములు గల ఓ రామా!, స్తనాంతరే = స్తనమధ్యమున, దారితాం = చీల్చబడినట్టి, తాం = ఆ సీతాదేవిని, దృష్ట్వా = చూచి, త్వం = నీవు, ఆశీవిషః ఇవ = త్రాచుపామువలె, క్రుద్ధః సన్ = క్రోధము నొందినవాడనై, నిశ్శ్వసన్ = నిట్టూర్చుచు, అభ్యభాషథాః = పలికితివట.

తాత్పర్యము :– ఓ మహావీరుడా! నీవు మేల్కొని స్తనమధ్యమున గాయముతో నున్న సీతాదేవిని గాంచి తీవ్రమైన క్రోధమునొంది త్రాచుపాము బుసకొట్టినట్లు నిశ్శ్వసించు చుంటివట!

శ్లో॥ నఖాగ్రైః కేన తే భీరు దారితం తు స్తనాంతరమ్ ।
కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా ॥ 7

పదచ్ఛేదము :– నఖాగ్రైః – కేన – తే – భీరు – దారితం – తు – స్తనాంతరమ్, కః – క్రీడతి – సరోషేణ – పంచవక్త్రేణ – భోగినా ॥

అన్వయక్రమము :– భీరు! తే స్తనాంతరం నఖాగ్రైః కేన దారితమ్? కః పంచవక్త్రేణ సరోషేణ భోగినా క్రీడతి?

ప్రతిపదార్థము :– భీరు = భయమునొందియున్న ఓ కోమలీ, తే = నీయొక్క, స్తనాంతరం = స్తనమధ్యము, నఖాగ్రైః = గోళ్ళకొనలచే, కేన = ఎవ్వనిచే, దారితం = చీల్చబడినది? కః = ఎవ్వడు, పంచవక్త్రేణ = ఐదుముఖములుకల్గిన, సరోషేణ = క్రోధముతోనున్నట్టి, భోగినా = సర్పముతో, క్రీడతి = ఆటలాడుచున్నాడు?

తాత్పర్యము :– భీతచిత్తవైన ఓ సీతా! నీ స్తనమధ్యమును గోళ్ళకొనలతో చీల్చిన దెవ్వరు? ఐదు పడగల మహాసర్పముతో ఆటలాడు నీచుడెవరు?

శ్లో॥ నిరీక్షమాణ స్సహసా వాయసం సమవైక్షథాః ।
నఖై స్సరుధిరై స్తీక్ష్ణై స్తామే వాభిముఖం స్థితమ్ ॥ 8

పదచ్ఛేదము :– నిరీక్షమాణః – సహసా – వాయసం – సమవైక్షథాః – నఖైః – సరుధిరైః – తీక్ష్ణైః – తామ్ – ఏవ – అభిముఖం – స్థితమ్ ॥

అన్వయక్రమము :– సహసా నిరీక్షమాణః త్వం సరుధిరైః తీక్ష్ణైః నఖైః తామ్ అభిముఖమ్ ఏవ స్థితం వాయసం సమవైక్షథాః.

ప్రతిపదార్థము :– సహసా = తత్క్షణమే, నిరీక్షమాణః = పరీక్షించుచున్నవాడవై, త్వం = నీవు, సరుధిరైః = నెత్తురుతో కూడినవియును, తీక్ష్ణైః = వాడివైనవియునగు, నఖైః = గోళ్ళతో, తాం = సీతాదేవిని (కి), అభిముఖమ్ ఏవ = ఎదురుగనే, స్థితం = నిలచియున్న, వాయసం = కాకమును, సమవైక్షథాః = చూచితివి.

తాత్పర్యము :– అప్పుడు నీవు వెంటనే నలుప్రక్కలకును చూచుచుండగా నెత్తురు అంటియున్న వాడియైన గోళ్ళతో సీతాదేవికి ఎదురుగనే నిలచియున్న వాయసమును చూచితివట.

శ్లో॥ సుతః కిల స శక్రస్య వాయసః పతతాం వరః ।
ధరాంతరచర శ్శీఘ్రం పవనస్య గతౌ సమః ॥ 9

పదచ్ఛేదము :– సుతః – కిల – సః – శక్రస్య – వాయసః – పతతాం – వరః – ధరాంతరచరః – శీఘ్రం – పవనస్య – గతౌ – సమః ॥

అన్వయక్రమము :– పతతాం వరః గతౌ పవనస్య సమః శీఘ్రం ధరాంతరచరః సః వాయసః శక్రస్య సుతః కిల.

ప్రతిపదార్థము :– పతతాం వరః = పక్షులలో శ్రేష్ఠమైనదియును, గతౌ = గమనము నందు, పవనస్య = వాయువునకు, సమః = తుల్యమైనదియును, శీఘ్రం = వడిగా, ధరాంతరచరః = కొండలపై సంచరించునదియును అగు, సః = ఆ, వాయసః = కాకము, శక్రస్య = దేవేంద్రునియొక్క, సుతః కిల = పుత్రుడట.

తాత్పర్యము :– వాయుసమాన గమనము గల్గి పర్వతములపై మహావేగముతో సంచరించుచున్నట్టి, ఆ పక్షిరాజమైన వాయసము దేవేంద్రుని పుత్రుడట.

శ్లో॥ తత స్తస్మిన్ మహాబాహో కోపసంవర్ధితేక్షణః ।
వాయసే త్వం కృథాః క్రూరాం మతిం మతిమతాం వర ॥ 10

పదచ్ఛేదము :– తతః – తస్మిన్ – మహాబాహో – కోపసంవర్ధితేక్షణః – వాయసే – త్వం – కృథాః – క్రూరాం – మతిం – మతిమతాం – వర ॥

అన్వయక్రమము :– మహాబాహో! మతిమతాంవర! తతః త్వం కోపసంవర్ధితేక్షణః సన్ వాయసే క్రూరాం మతిం కృథాః.

ప్రతిపదార్థము :– మహాబాహో = గొప్పవైన భుజములు గలవాడవును, మతిమతాం వర = బుద్ధిశాలురలో శ్రేష్ఠుడవునగు ఓ రామా!, తతః = పిమ్మట, త్వం = నీవు, తస్మిన్ = ఆ, వాయసే = కాకమునందు, కోపసంవర్ధితేక్షణః = క్రోధముచే పెద్దవిగ చేయబడిన కన్నులు గలవాడవై, క్రూరాం = ఉగ్రమైనట్టి, మతిం = మనస్సును, కృథాః = చేసితివి.

తాత్పర్యము :– కోపసంవర్ధితేక్షణః – అనుదానికి మారుగా "కోపసంవర్తితేక్షణః" (కోపముతో ప్రక్కకు మరల్చిన కన్నులు కలవాడు) అని పాఠాంతరము.

తాత్పర్యము :– మహావీరుడైన ఓ ప్రజ్ఞావంతుడా! నీ వప్పుడు క్రోధముచే కన్నులను పెద్దవిగ చేసి ఆ వాయసమును గూర్చి ఉగ్రమైన భావమును పూనితివట.

శ్లో॥ స దర్భం సంస్తరా ద్గృహ్య బ్రహ్మాస్త్రేణ హ్యయోజయః ।
స దీప్త ఇవ కాలాగ్ని ర్జజ్వా లాభిముఖః ఖగమ్ ॥ 11

పదచ్ఛేదము :– సః – దర్భం – సంస్తరాత్ – గృహ్య – బ్రహ్మాస్త్రేణ – హి – ఆయోజయః, సః – దీప్తః – ఇవ – కాలాగ్నిః – జజ్వాల – అభిముఖః – ఖగమ్ ॥

అన్వయక్రమము :– సః (త్వం) సంస్తరాత్ దర్భం గృహ్య బ్రహ్మాస్త్రేణ అయోజయః హి, సః దీప్తః కాలాగ్నిః ఇవ ఖగమ్ అభిముఖః జజ్వాల.

ప్రతిపదార్థము :– సః (త్వం) = ఆ నీవు, సంస్తరాత్ = దర్భాసనమునుండి, దర్భం = ఒక దర్భను, గృహ్య = గ్రహించి, బ్రహ్మాస్త్రేణ = బ్రహ్మాస్త్రమంత్రముచే, ఆయోజయః హి = కూర్చితివట, సః = ఆ దర్భ, దీప్తః = ప్రజ్వలించుచున్న, కాలాగ్నిః ఇవ = ప్రళయాగ్నివలె, ఖగమ్ అభిముఖః = వాయసమున కెదురు తిరిగినదై, జజ్వాల = ప్రజ్వలింపసాగెను.

తాత్పర్యము :– అట్లు ఉగ్రమైన నిశ్చయము వహించినట్టి నీవు దర్భాసనమునుండి ఒక దర్భను తీసికొని దానిని బ్రహ్మాస్త్రమంత్రముచే అభిమంత్రించితివట. అట్లు ప్రయోగింపబడిన బ్రహ్మాస్త్రము ప్రళయకాలాగ్నివలె ప్రజ్వరిల్లుచు వాయసము నెదుట భీకరముగ మండదొడగెను.

శ్లో॥ క్షిప్తవాం స్త్వం ప్రదీప్తం హి దర్భం తం వాయసం ప్రతి ।
తతస్తు వాయసం దీప్త స్స దర్భో ఽనుజగామ హ ॥ 12

పదచ్ఛేదము :– క్షిప్తవాన్ – త్వం – ప్రదీప్తం – హి – దర్భం – తం – వాయసం – ప్రతి – తతః – తు – వాయసం – దీప్తః – సః – దర్భః – అనుజగామ – హ ॥

అన్వయక్రమము :– తం ప్రదీప్తం దర్భం త్వం వాయసం ప్రతి క్షిప్తవాన్, తతః సః దీప్తః దర్భః వాయసమ్ అనుజగామ హ.

ప్రతిపదార్థము :– ప్రదీప్తం = ప్రజ్వలించుచున్నట్టి, తం = ఆ, దర్భం = దర్భను, త్వం = నీవు, తం = ఆ, వాయసం ప్రతి = కాకమునుగూర్చి, క్షిప్తవాన్ = విసిరినావు, తతః = పిమ్మట, దీప్తః = ప్రజ్వలించుచున్న, సః = ఆ, దర్భః = దర్భ, వాయసం = కాకిని, అనుజగామ హ = వెంబడించెనట.

తాత్పర్యము :– అట్లు ప్రజ్వలించుచున్న ఆ దర్భను నీవు వాయసము మీదికి విసిరితివట. జ్వలించుచున్న ఆ దర్భ వెంటనే ఆ వాయసమును వెంబడింప దొడగెనట!.

శ్లో॥ స పిత్రా చ పరిత్యక్త స్సురైశ్చ సమహర్షిభిః ।
త్రీన్లోకా న్సంపరిక్రమ్య త్రాతారం నాధిగచ్ఛతి ॥ 13

పదచ్ఛేదము :– సః – పిత్రా – చ – పరిత్యక్తః – సురైః – చ – సమహర్షిభిః, త్రీన్ – లోకాన్ – సంపరిక్రమ్య – త్రాతారం – న – అధిగచ్ఛతి ॥

అన్వయక్రమము :– సః పిత్రా చ సమహర్షిభిః సురైః చ పరిత్యక్తః త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య త్రాతారం న అధిగచ్ఛతి.

ప్రతిపదార్థము :– సః = ఆ వాయసము, పిత్రా చ = తండ్రిచేతను, సమహర్షిభిః = మహర్షులతో గూడినట్టి, సురైః చ = దేవతలచేతను, పరిత్యక్తః = విడువబడినదై, త్రీన్ లోకాన్ = మూడులోకములను, సంపరిక్రమ్య = పరిభ్రమించి, త్రాతారం = రక్షణచేయువానిని, న అధిగచ్ఛతి = పొందకుండెను.

తాత్పర్యము :– బ్రహ్మాస్త్రముచే తరుమబడుచున్న ఆ వాయసము పరుగిడిపోయి తన లోకములోని తల్లిచేతను, తండ్రిచేతనుగాని ఋషులచేతను, దేవతలచేతను కాని ఎట్టి రక్షణను పొందలేక ఎల్లరిచే విడువబడి ముల్లోకములును తిరిగి తిరిగి ఎచ్చట కూడ తనను రక్షించువానిని కనుగొనలేక పోయెను.

శ్లో॥ పునరే వాగత స్త్రస్త స్త్వత్సకాశ మరిందమ ।
స తం నిపతితం భూమౌ శరణ్య శ్శరణాగతమ్ ।
వధార్హమపి కాకుత్స్థ కృపయా పర్యపాలయః ॥ 14

పదచ్ఛేదము :– పునః – ఏవ – ఆగతః – త్రస్తః – త్వత్సకాశమ్ – అరిందమ – సః – తం – నిపతితం – భూమౌ – శరణ్యః – శరణాగతమ్ – వధార్హమ్ – అపి – కాకుత్థ్స – కృపయా – పర్యపాలయః ॥

అన్వయక్రమము :– అరిందమ! త్రస్తః (సః) పునః త్వత్సకాశమ్ ఏవ ఆగతః, కాకుత్థ్సః శరణాగతం భూమౌ నిపతితం తం వధార్హమ్ అపి సః (త్వం) కృపయా పర్యపాలయః.

ప్రతిపదార్థము :– అరిందమ! = ఓ శత్రుమర్దనుడా!, త్రస్తః = భీతినొందినట్టి, (సః = ఆ వాయసము), పునః = మరల, త్వత్సకాశమ్ ఏవ = నీ సన్నిధిని గూర్చియే, ఆగతః = వచ్చినది, కాకుత్థ్స = ఓ శ్రీరామా, శరణాగతం = రక్షణమునకై వచ్చినదియును, భూమౌ = నేలపై, నిపతితం = పడియున్నదియునగు, తం = ఆ వాయసమును, వధార్హమ్ అపి = వధకు తగినదైనప్పటికిని , శరణ్యః = రక్షకుడవైన, సః త్వం = ఆ నీవు, కృపయా = దయతో, పర్యపాలయః = కాపాడితివి.

తాత్పర్యము :– ఓ శత్రుమర్దనుడా! తనను రక్షించువానిని గానక భీతిచెందిన ఆ వాయసము తిరిగి తిరిగి నీ పాదములను చేరి నేలపై బడియుండగా ఆ వాయసమును గాంచి వధార్హమైనను దాని యపరాధమును మన్నించి శరణాగతవత్సలుడవైన నీవు దయతో గాపాడితివట.

శ్లో॥ మోఘ మస్త్రం న శక్యం తు కర్తు మిత్యేవ రాఘవ ।
భవాం స్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్ ॥ 15

పదచ్ఛేదము :– మోఘమ్ – అస్త్రం – న – శక్యం – తు – కర్తుమ్ – ఇతి – ఏవ – రాఘవ – భవాన్ – తస్య – అక్షి – కాకస్య – హినస్తి – స్మ – సః – దక్షిణమ్ ॥

అన్వయక్రమము :– రాఘవ! అస్త్రం తు మోఘం కర్తుం న శక్యమ్ ఇతి ఏవ సః భవాన్ తస్య కాకస్య దక్షిణమ్ అక్షి హినస్తి స్మ.

ప్రతిపదార్థము :– రాఘవ! = ఓ శ్రీరామా!, అస్త్రం తు = బ్రహ్మాస్త్రమును, మోఘం = వ్యర్థమైన దానినిగా, కర్తుం = చేయుటకు, న శక్యం = వీలులేనిది, ఇతి ఏవ = అనియే, సః = ఆ, భవాన్ = నీవు, తస్య = ఆ, కాకస్య = కాకముయొక్క, దక్షిణమ్ అక్షి = కుడి కంటిని, హినస్తి స్మ = హింసించితివి.

తాత్పర్యము :– ఓ శ్రీరామా! ప్రయోగింపబడిన బ్రహ్మాస్త్రమును వ్యర్థము చేయుటకు వీలు లేదని గ్రహించి నీవు ఆ కాకముయొక్క కుడి కంటిని ఆ యస్త్రమునకు ఎరచేసి యుంటివి.

శ్లో॥ రామ త్వాం స నమస్కృత్య రాజ్ఞే దశరథాయ చ ।
విసృష్టస్తు తదా కాకః ప్రతిపేదే స్వ మాలయమ్ ॥ 16

పదచ్ఛేదము :- రామ - త్వాం - సః - నమస్కృత్య - రాజ్ఞే - దశరథాయ - చ, విసృష్టః - తు - తదా - కాకః - ప్రతిపేదే - స్వమ్ - ఆలయమ్ ॥

అన్వయక్రమము :- రామ! సః కాకః తు త్వాం నమస్కృత్య రాజ్ఞే దశరథాయ చ (నమస్కృత్య) విసృష్టః (సన్) తదా స్వమ్ ఆలయం ప్రతిపేదే.

ప్రతిపదార్థము :- రామ = ఓ రాఘవా!, సః = ఆ, కాకః = కాకము, త్వాం = నిన్ను, నమస్కృత్య = నమస్కరించి, రాజ్ఞే = రాజయిన, దశరథాయ చ = దశరథుని కొరకును, (నమస్కృత్య = నమస్కరించి), విసృష్టః (సన్) = విడువబడినదై, తదా = అప్పుడు, స్వం = తనదైన, ఆలయం = నివాసమును, ప్రతిపేదే = చేరెను.

తాత్పర్యము :- ఓ శ్రీరామా! అప్పు డా వాయసము నీకును నీ తండ్రియగు మహారాజైన దశరథునకును మ్రొక్కి నీచేత ప్రాణములతో విడువబడి సంతోషముతో తన నివాసమును చేరుకొనెను.

శ్లో॥ ఏవ మస్త్రవిదాం శ్రేష్ఠ స్సత్త్వవాంశ్శీలవానపి ।
కిమర్థ మస్త్రం రక్షస్సు న యోజయసి రాఘవ ॥ 17

పదచ్ఛేదము :- ఏవమ్ - అస్త్రవిదాం - శ్రేష్ఠః - సత్త్వవాన్ - శీలవాన్ - అపి, కిమర్థమ్ - అస్త్రం - రక్షస్సు - న - యోజయసి - రాఘవ ॥

అన్వయక్రమము :- రాఘవ! అస్త్రవిదాం శ్రేష్ఠః సత్త్వవాన్ శీలవాన్ అపి కిమర్థమ్ ఏవం రక్షస్సు అస్త్రం న యోజయసి?

ప్రతిపదార్థము :- రాఘవ = ఓ శ్రీరామా!, అస్త్రవిదాం = అస్త్రవేత్తలలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడవును, సత్త్వవాన్ = శక్తిమంతుడవును, శీలవాన్ అపి = శీలవంతుడవు నైనప్పటికిని, కిమర్థం = ఏ కారణమున, ఏవం = ఇట్లు, (త్వం = నీవు), రక్షస్సు = రాక్షసులయెడ, అస్త్రం = అస్త్రమును, న యోజయసి = సంధింపకున్నావు?

తాత్పర్యము :- ఓ శ్రీరామా! అస్త్రవేత్తలలో సర్వశ్రేష్ఠుడవును మహాపరాక్రమ సంపన్నుడవును ఉత్తమశీలసంపన్నుడవు నగు నీవు కాకాసురునియెడ వలెనే ఈ రాక్షసులపై ఏ కారణముచే అస్త్రమును సంధించి పగ దీర్చుకొనకున్నావు.

శ్లో॥ న నాగా నాపి గంధర్వా నాసురా న మరుద్గణాః ।
తవ రామ రణే శక్తా స్తథా ప్రతిసమాసితుమ్ ॥ 18

పదచ్ఛేదము :- న - నాగాః - న - అపి - గంధర్వాః - న - అసురాః - న - మరుద్గణాః, తవ - రామ - రణే - శక్తాః - తథా - ప్రతిసమాసితుమ్ ॥

అన్వయక్రమము :- రామ! రణే తవ ప్రతిసమాసితుం నాగాః న శక్తాః, గంధర్వాః అపి న, అసురాః న, మరుద్గణాః అపి న (శక్తాః).

ప్రతిపదార్థము :- రామ = ఓ శ్రీరామా!, రణే = యుద్ధమునందు, తవ = నీకు, తథా = ఆ వాయసము వలెనే, ప్రతిసమాసితుం = ఎదురునిల్చుటకు, నాగాః = నాగజాతివీరులు, శక్తాః న = సమర్థులు కారు, గంధర్వాః అపి = గంధర్వులుకూడ, న = సమర్థులుకారు, అసురాః = రాక్షసులు, న = సమర్థులు కారు, మరుద్గణాః అపి = దేవగణములుగూడ, న(శక్తాః) = సమర్థులు కారు .

తాత్పర్యము :- ఓ శ్రీరామా! యుద్ధమునందు ఆ వాయసమువలెనే నీ కెదురుగా నిలువబడుటకు నాగవీరులుగాని, గంధర్వులుగాని, రాక్షసులుగాని దేవగణములలో మరెవ్వరైన గాని సమర్థులుగారు కదా!

శ్లో॥ తవ వీర్యవతః కశ్చి న్మయి యద్యస్తి సంభ్రమః ।
క్షిప్రం సునిశితై ర్బాణై ర్హన్యతాం యుధి రావణః ॥ 19

పదచ్ఛేదము :- తవ - వీర్యవతః - కశ్చిత్ - మయి - యది - అస్తి - సంభ్రమః, క్షిప్రం - సునిశితైః - బాణైః - హన్యతాం - యుధి - రావణః ॥

అన్వయక్రమము :- వీర్యవతః తవ కశ్చిత్ సంభ్రమః మయి అస్తి యది క్షిప్రం సునిశితైః బాణైః రావణః యుధి హన్యతామ్.

ప్రతిపదార్థము :- వీర్యవతః = పరాక్రమవంతుడవైన, తవ = నీకు, కశ్చిత్ = కొంచెమైన, సంభ్రమః = వేగిరపాటు, మయి = నాయందు, అస్తి యది = ఉన్న యెడల, క్షిప్రం = వెంటనే, సునిశితైః = మిక్కిలి వాడియైన, బాణైః = బాణములచే, రావణః = రావణుడు, యుధి = యుద్ధమునందు, హన్యతామ్ = చంపబడుగాక!

తాత్పర్యము :- మహాపరాక్రమ సంపన్నుడవైన నీకే గనుక నన్ను గూర్చి కొంచెమైన వేగిరపా టున్నయెడల వెంటనే యుద్ధమునందు రావణాసురుని వాడియైన బాణములతో సంహరింప వలసియున్నది.

శ్లో॥ భ్రాతు రాదేశ మాజ్ఞాయ లక్ష్మణో వా పరంతపః ।
స కిమర్థం నరవరో న మాం రక్షతి రాఘవః ॥ 20

పదచ్ఛేదము :– భ్రాతుః – ఆదేశమ్ – ఆజ్ఞాయ – లక్ష్మణః – వా – పరంతపః – సః – కిమర్థం – నరవరః – న – మాం – రక్షతి – రాఘవః ॥

అన్వయక్రమము :– భ్రాతుః ఆదేశమ్ ఆజ్ఞాయ పరంతపః నరవరః సః రాఘవః లక్ష్మణః కిమర్థం మాం న రక్షతి?

ప్రతిపదార్థము :– భ్రాతుః = సోదరునియొక్క, ఆదేశం = ఆజ్ఞను, ఆజ్ఞాయ = స్వీకరించి, పరంతపః = శత్రుతాపనుడును, నరవరః = పురుషశ్రేష్ఠుడునగు, సః = ఆ, రాఘవః = రఘునందనుడైన, లక్ష్మణః = లక్ష్మణుడు, కిమర్థం = ఎందుకొరకు, మాం = నన్ను, న రక్షతి = రక్షించుట లేదు?

తాత్పర్యము :– అన్నగారి యాజ్ఞను గైకొని శత్రుసంహారకుడును పురుషపుంగవుడును రఘువంశవర్ధనుడునగు ఆ లక్ష్మణుడు ఇంతవర కేల నన్ను రక్షించుటకై రాకున్నాడు.

శ్లో॥ శక్తౌ తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ ।
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మా ముపేక్షతః ॥ 21

పదచ్ఛేదము :– శక్తౌ – తౌ – పురుషవ్యాఘ్రౌ – వాయ్వగ్నిసమతేజసౌ, సురాణామ్ – అపి – దుర్ధర్షౌ – కిమర్థం – మామ్ – ఉపేక్షతః ॥

అన్వయక్రమము :– శక్తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ సురాణామ్ అపి దుర్ధర్షౌ తౌ కిమర్థం మామ్ ఉపేక్షతః?

ప్రతిపదార్థము :– శక్తౌ = సమర్థులును, పురుషవ్యాఘ్రౌ = పురుషశ్రేష్ఠులును, వాయ్వగ్నిసమతేజసౌ = వాయువుతోడను అగ్నితోడను సమానమైన ప్రతాపముగల వారును, సురాణామ్ అపి = దేవతలకుగూడ, దుర్ధర్షౌ = ఎదిరింప శక్యముగాని వారునగు, తౌ = వారిరువురును, కిమర్థం = ఎందుకు, మామ్ = నన్ను, ఉపేక్షతః = ఉపేక్షించుచున్నారు.

తాత్పర్యము :– సర్వసమర్థులును, పురుషసింహులును, వాయ్వగ్నులతో సమానమైన ప్రతాపము గలవారును, దేవతలకు గూడ ఎదుర్కొన శక్యముగాని పరాక్రమము గలవారునగు ఆ యన్నదమ్ము లిరువురును ఏ కారణముచే నన్నిట్లుపేక్షించుచున్నారు?

శ్లో॥ మమైవ దుష్కృతం కించి న్మహ దస్తి న సంశయః ।
సమర్థౌ సహితౌ య న్మాం నావేక్షేతే పరంతపౌ ॥ 22

పదచ్ఛేదము :– మమ – ఏవ – దుష్కృతం – కించిత్ – మహత్ – అస్తి – న – సంశయః, సమర్థౌ – సహితౌ – యత్ – మాం – న – అవేక్షేతే – పరంతపౌ ॥

అన్వయక్రమము :– సమర్థౌ సహితౌ (తౌ) పరంతపౌ యత్ మాం న అవేక్షేతే (తత్) మమ కించిత్ మహత్ దుష్కృతమ్ అస్తి ఏవ, సంశయః న.

ప్రతిపదార్థము :– సమర్థౌ = సమర్థులును, సహితౌ = కలిసికొన్నవారునగు, తౌ = ఆ, పరంతపౌ = శత్రుమర్దనులు, యత్ = ఏ కారణమున, మాం = నన్ను, న అవేక్షేతే = చూడకున్నారో, తత్ = ఆ కారణమున, మమ = నాయొక్క, కించిత్ = కొద్ది, మహత్ దుష్కృతం = పెద్దదైన పాపము, అస్తి ఏవ = తప్పకయున్నది, సంశయః చ = సందేహము, న = లేదు.

తాత్పర్యము :– సమర్థులైన ఆ యన్నదమ్ములు ఒకరినొకరు కలిసి యున్నవారై కూడ శత్రుసంహారదక్షులై యుండికూడ ఇంతవరకును నన్ను చూడకున్నారనగా ఏ కొద్దియో గొప్పదైన నా పాపమే కారణమైయుండును; సందేహములేదు!

శ్లో॥ వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రు భాషితమ్ ।
పునర ప్యహ మార్యాం తా మిదం వచన మబ్రువమ్ ॥ 23

పదచ్ఛేదము :– వైదేహ్యాః – వచనం – శ్రుత్వా – కరుణం – సాశ్రు – భాషితమ్, పునః – అపి – అహమ్ – ఆర్యాం – తామ్ – ఇదం – వచనమ్ – అబ్రువమ్ ॥

అన్వయక్రమము :– వైదేహ్యాః కరుణం సాశ్రు భాషితం శ్రుత్వా అహం పునః అపి తామ్ ఆర్యామ్ ఇదం వచనమ్ అబ్రువమ్.

ప్రతిపదార్థము :– వైదేహ్యాః = జానకీదేవియొక్క, కరుణం = దుఃఖకరమును, సాశ్రు భాషితం = కన్నీటితో కూడిన మాటలు కలదియునగు, వచనం = వచనమును, శ్రుత్వా = విని, అహం = నేను, పునః అపి = మరలగూడ, తాం = ఆ, ఆర్యాం = పూజ్యురాలిని గూర్చి, ఇదం = ఈ, వచనం = మాటను, అబ్రువమ్ = పలికితిని.

తాత్పర్యము :– జానకీదేవి కన్నీరు స్రవించుచుండ దుఃఖకరముగ పలికిన మాటలను అన్నియు విని మరల ఆ పూజ్యురాలితో ఈ విధముగా పలికితిని.

శ్లో॥ త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే ।
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే ॥ 24

పదచ్ఛేదము :- త్వచ్ఛోకవిముఖః - రామః - దేవి - సత్యేన - తే - శపే - రామే - దుఃఖాభిభూతే - తు - లక్ష్మణః - పరితప్యతే ॥

అన్వయక్రమము :- దేవి! తే సత్యేన శపే; రామః త్వచ్ఛోకవిముఖః, రామే దుఃఖాభిభూతే తు (సతి) లక్ష్మణః పరితప్యతే.

ప్రతిపదార్థము :- దేవి = ఓ సీతాదేవీ!, తే సత్యేన శపే = నీపై ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను, రామః = శ్రీరాముడు, త్వచ్ఛోకవిముఖః = నిన్ను గూర్చిన దుఃఖముచే అన్నిటియెడ విముఖుడై యున్నాడు, రామే = శ్రీరాముడు, దుఃఖాభిభూతే (సతి) = దుఃఖముచే వివశుడై యుండగా, లక్ష్మణః = లక్ష్మణుడు, పరితప్యతే = సంతాపము నొందుచున్నాడు.

తాత్పర్యము :- ఓ జానకీదేవీ! నీపై ఒట్టుపెట్టి చెప్పుచున్నాను వినుము. శ్రీరాముడిప్పుడు నిన్ను గూర్చిన దుఃఖావేశముచే ఒడలెరుగక యున్నాడు. ఆహారాదులయెడ సైతము విముఖుడైయున్నాడు. రాముడిట్లు దుఃఖవివశుడై యుండగా లక్ష్మణుని సంతాపమునకు మేరయే లేకున్నది.

శ్లో॥ కథంచి ద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్ ।
అస్మి న్ముహూర్తే దుఃఖానా మంతం ద్రక్ష్యసి భామిని ॥ 25

పదచ్ఛేదము :- కథంచిత్ - భవతీ - దృష్టా - న - కాలః - పరిశోచితుమ్ - అస్మిన్ - ముహూర్తే - దుఃఖానామ్ - అంతం - ద్రక్ష్యసి - భామిని ॥

అన్వయక్రమము :- భామిని! భవతీ కథంచిత్ దృష్టా, పరిశోచితుం కాలః న, అస్మిన్ ముహూర్తే దుఃఖానామ్ అంతం ద్రక్ష్యసి.

ప్రతిపదార్థము :- భామిని = కోమలీ!, కథంచిత్ = ఎట్లో, భవతీ = నీవు, దృష్టా = కనబడితివి, పరిశోచితుం = దుఃఖించుటకు, కాలః = సమయము, న = కాదు. అస్మిన్ = ఈ, ముహూర్తే = క్షణమునందు, దుఃఖానాం = దుఃఖములకు, అంతం = అంతమును, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :- తల్లీ! నా యదృష్టవశముచే ఎట్లో నీవు మా కన్నులబడితివి. ఇప్పుడు దుఃఖింపవలసిన సమయముగాదు. ఈ క్షణమునుండియే నీవు పొందిన దుఃఖములన్నియును కడతేరగలవు.

శ్లో॥ తా వుభౌ నరశార్దూలౌ రాజపుత్రా వనిందితౌ ।
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః ॥ 26

పదచ్ఛేదము :– తౌ – ఉభౌ – నరశార్దూలౌ – రాజపుత్రౌ – అనిందితౌ, త్వద్దర్శన కృతోత్సాహౌ – లంకాం – భస్మీకరిష్యతః ॥

అన్వయక్రమము :– నరశార్దూలౌ అనిందితౌ ఉభౌ తౌ రాజపుత్రౌ త్వద్దర్శనకృతోత్సాహౌ (సంతౌ) లంకాం భస్మీకరిష్యతః.

ప్రతిపదార్థము :– నరశార్దూలౌ = పురుషశ్రేష్ఠులును, అనిందితౌ = నిందలేని చరిత్రులునగు, ఉభౌ = ఇద్దరైన, తౌ = ఆ, రాజపుత్రౌ = రాజపుత్రులు, త్వద్దర్శన కృతోత్సాహౌ (సంతౌ) = నిన్ను దర్శించుట కొరకు పొంగివచ్చుచున్న ఉత్సాహముగల్గిన వారగుచు, లంకాం = లంకను, భస్మీకరిష్యతః = భస్మము చేయగలరు.

తాత్పర్యము :– అనింద్యచరిత్రులును పురుషశ్రేష్ఠులు నగు ఆ రాజపుత్రు లిరువురును నిన్ను జూడవలెనను గొప్ప ఉత్సాహముతో వచ్చి ఈ లంకను భస్మము గావించెదరు సుమా!

శ్లో॥ హత్వా చ సమరే రౌద్రం రావణం సహబాంధవమ్ ।
రాఘవ స్త్వాం వరారోహే స్వాం పురీం నయితా ధ్రువమ్ ॥ 27

పదచ్ఛేదము :– హత్వా – చ – సమరే – రౌద్రం – రావణం – సహబాంధవమ్, రాఘవః – త్వాం – వరారోహే – స్వాం – పురీం – నయితా – ధ్రువమ్ ॥

అన్వయక్రమము :– వరారోహే! రాఘవః సమరే రౌద్రం రావణం సహబాంధవం హత్వా చ త్వాం స్వాం పురీం ధ్రువం నయితా.

ప్రతిపదార్థము :– వరారోహే = సుందరీ!, రాఘవః = శ్రీరాముడు, సమరే = యుద్ధమునందు, రౌద్రం = భయంకరుడగు, రావణం = రావణుని, సహబాంధవమ్ = బంధువులతో సహితముగా, హత్వా చ = పరిమార్చి పిమ్మట, త్వాం = నిన్ను, స్వాం పురీం = తన పట్టణమునుగూర్చి, ధ్రువం = నిశ్చయముగా, నయితా = తీసికొని పోవగలడు.

తాత్పర్యము :– ఓ జానకీ! శ్రీరాముడు మహాక్రూరుడైన ఆ రావణాసురుని యుద్ధమునందు బంధుసహితముగా హతమార్చి నిన్ను అచిరకాలములోనే తప్పక అయోధ్యానగరికి గొనిపోవగలడు సుమా!

శ్లో॥ యత్తు రామో విజానీయా దభిజ్ఞాన మనిందితే ।
ప్రీతిసంజననం తస్య ప్రదాతుం త్వ మిహార్హసి ॥ 28

పదచ్ఛేదము :– యత్ – తు – రామః – విజానీయాత్ – అభిజ్ఞానమ్ – అనిందితే,

ప్రీతిసంజననం – తస్య – ప్రదాతుం – త్వమ్ – ఇహ – అర్హసి ॥

అన్వయక్రమము :– అనిందితే రామః యత్ అభిజ్ఞానం విజానీయాత్ తస్య ప్రీతిసంజననం తత్ త్వమ్ ఇహ ప్రదాతుమ్ అర్హసి.

ప్రతిపదార్థము :– అనిందితే = ఓ యనింద్యచరిత్రురాలా!, రామః తు = రాముడు మాత్రము, యత్ = ఏ, అభిజ్ఞానం = గుర్తును, విజానీయాత్ = తెలిసికొనునో, తస్య = ఆతనికి, ప్రీతిసంజననం = ప్రీతిని గలిగించునట్టిదైన, తత్ = ఆ యానవాలును, ఇహ = ఇప్పుడు, త్వం = నీవు, ప్రదాతుం = ఇచ్చుటకు, అర్హసి = తగుదువు.

తాత్పర్యము :– అనింద్యచరిత్రురాలవైన ఓ సీతాదేవీ! శ్రీరాముడు మాత్రము తెలిసికొన గలిగినట్టి ఒకానొక ఆనవాలును ఆతనికి సంతోషము గలిగించునట్లుగా నీ విప్పుడు నా కిచ్చుట ఉచితమై యుండును.

శ్లో॥ సా ఉఽభివీక్ష్య దిశ స్సర్వా వేణ్యుద్గ్రథిత ముత్తమమ్ ।
ముక్త్వా వస్త్రాద్దదౌ మహ్యం మణి మేతం మహాబల ॥ 29

పదచ్ఛేదము :– సా – అభివీక్ష్య – దిశః – సర్వాః – వేణ్యుద్గ్రథితమ్ – ఉత్తమమ్, ముక్త్వా – వస్త్రాత్ – దదౌ – మహ్యం – మణిమ్ – ఏతం – మహాబల ॥

అన్వయక్రమము :– మహాబల! సా సర్వాః దిశః అభివీక్ష్య ఉత్తమం వేణ్యుద్గ్రథితం ముక్త్వా వస్త్రాత్ ఏతం మణిం మహ్యం దదౌ.

ప్రతిపదార్థము :– మహాబల = ఓ మహాబలాఢ్యుడా!, సా = ఆ సీతాదేవి, సర్వాః దిశః = అన్ని దిక్కులను, అభివీక్ష్య = పరికించి చూచి, ఉత్తమం = శ్రేష్ఠమైన, ఏతం = ఈ, వేణ్యుద్గ్రథితం = జడయందు ముడివేసికొన్నట్టి, మణిం = చూడామణిని, వస్త్రాత్ = చీరకొంగునుండి, ముక్త్వా = విప్పి, మహ్యం = నాకొరకు, దదౌ = ఇచ్చినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– 'దిశః సర్వాః అభివీక్ష్య' – అచటి రాక్షసస్త్రీలు ఈ విషయమును చూచి రావణున కెరిగింపగలరను భయముతో చుట్టును గలియ జూచి ఇతరులు చూచుటలేదను నిశ్చయముతో కొంగునందు ముడివేసికొన్న తన చూడామణిని విప్పి హనుమ కిచ్చెనని భావము.

తాత్పర్యము :– ఓ మహాబలాఢ్యుడా! అప్పుడు సీతాదేవి నలుదిక్కులను పరికించి చూచి రాక్షసాంగనల కంటబడకుండ జడయందు ధరింపవలసిన చూడామణిని

చీరకొంగునందు ముడివైచుకొనియుండుటచేత దానిని అప్పుడు ముడివిప్పి నాచేతి కిచ్చినది.

శ్లో॥ ప్రతిగృహ్యా మణిం దివ్యం తవ హేతో రఘూద్వహ ।
శిరసా తాం ప్రణ మ్యార్యా మహ మాగమనే త్వరే ॥ 30

పదచ్ఛేదము :– ప్రతిగృహ్యా – మణిం – దివ్యం – తవ – హేతోః – రఘూద్వహ, శిరసా – తాం – ప్రణమ్య – ఆర్యామ్ – అహమ్ – ఆగమనే – త్వరే ॥

అన్వయక్రమము :– రఘూద్వహ! తవ హేతోః దివ్యం (తం) మణిం ప్రతిగృహ్యా తామ్ ఆర్యాం శిరసా ప్రణమ్య అహమ్ ఆగమనే త్వరే.

ప్రతిపదార్థము :– రఘూద్వహ = ఓ రఘువంశశ్రేష్ఠుడా, తవ హేతోః = నీ కారణమున, దివ్యం = దివ్యమైనట్టి, తం = ఆ, మణిం = చూడామణిని, ప్రతిగృహ్యా = స్వీకరించి, తాం = ఆ, ఆర్యాం = పూజ్యురాలిని, శిరసా = శిరముతో, ప్రణమ్య = మ్రొక్కి, అహం = నేను, ఆగమనే = వచ్చువిషయమున, త్వరే = వేగిరపడితిని.

తాత్పర్యము :– ఓ రఘువంశశ్రేష్ఠుడా! నీకు సమర్పించుటకుగాను దివ్యమైన ఆ చూడామణిని ఆమెనుండి గైకొని ఆ పూజ్యురాలికి పాదాభివందనము గావించి తిరిగి ఇచ్చటికి రావలెనని వేగిరపడితిని.

శ్లో॥ గమనే చ కృతోత్సాహ మవేక్ష్య వరవర్ణినీ ।
వివర్ధమానం చ హి మా మువాచ జనకాత్మజా ॥ 31

పదచ్ఛేదము :– గమనే – చ – కృతోత్సాహం – అవేక్ష్య – వరవర్ణినీ, వివర్ధమానం – చ – హి – మామ్ – ఉవాచ – జనకాత్మజా ॥

అన్వయక్రమము :– వరవర్ణినీ జనకాత్మజా గమనే కృతోత్సాహం వివర్ధమానం చ మామ్ అవేక్ష్య ఉవాచ.

ప్రతిపదార్థము :– వరవర్ణినీ = శ్రేష్ఠమైన ఛాయ గలిగినట్టి, జనకాత్మజా = జానకీదేవి, గమనే = ప్రయాణమునందు, కృతోత్సాహం = ఉత్సాహముతో గూడినట్టివాడను, వివర్ధమానం = వృద్ధిపొందుచున్నవాడను అగు, మాం = నన్ను, అవేక్ష్య = చూచి, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :– గొప్పదైన దేహచ్ఛాయతో ప్రకాశించుచున్న ఆ జానకీదేవి నేను తిరుగ ప్రయాణమునకై ఉత్సాహపడుచు నా శరీరమును వృద్ధి పొందించుకొనుటను జూచి నాతో తిరిగి ఇట్లు పలికినది.

శ్లో॥ అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పసందిగ్ధభాషిణీ ।
మ మోత్పతనసంభ్రాంతా శోకవేగసమాహతా ॥ 32

పదచ్ఛేదము :– అశ్రుపూర్ణముఖీ – దీనా – బాష్పసందిగ్ధభాషిణీ, మమ – ఉత్పతన సంభ్రాంతా – శోకవేగసమాహతా ॥

అన్వయక్రమము :– (తదా) (సా) అశ్రుపూర్ణముఖీ, బాష్పసందిగ్ధభాషిణీ, మమ ఉత్పతన సంభ్రాంతా దీనా శోకవేగసమాహతా (ఆసీత్).

ప్రతిపదార్థము :– (తదా = అప్పుడు), (సా = ఆమె), అశ్రుపూర్ణముఖీ = కన్నీటితో నిండిన ముఖము గలదియును, బాష్పసందిగ్ధభాషిణీ = కన్నీటితో అస్పష్టముగా మాటలాడుచున్నదియును, మమ = నాయొక్క, ఉత్పతనసంభ్రాంతా = మీది కెగురు యత్నమునకు భీతినొందినదియును, దీనా = దీనురాలును, శోకవేగసమాహతా = దుఃఖముయొక్క వేగముచే బాధింపబడినదియును, (ఆసీత్ = ఆయెను).

తాత్పర్యము :– అప్పుడు ఆమె కన్నీటితో నిండిన ముఖముతోడను, ఆ కన్నీటి వేగముచే స్పష్టముగా వినిపించని మాటలతోడను, వెడలిపోవుటకై నేను ఎగిరిపోయెదనను భయావేశముతోడను పీడింపబడుచు దుఃఖకరమైన స్థితిలో నుండెను.

శ్లో॥ మా ముువాచ తతస్సీతా సభాగ్యోఽసి మహాకపే ।
యద్ద్రక్ష్యసి మహాబాహుం రామం కమలలోచనమ్ ।
లక్ష్మణం చ మహాబాహుం దేవరం మే యశస్వినమ్ ॥ 33

పదచ్ఛేదము :– మామ్ – ఉవాచ – తతః – సీతా – సభాగ్యః – అసి – మహాకపే, యత్ – ద్రక్ష్యసి – మహాబాహుం – రామం – కమలలోచనమ్ – లక్ష్మణం – చ – మహాబాహుం – దేవరం – మే – యశస్వినమ్ ॥

అన్వయక్రమము :– తతః సీతా మామ్ ఉవాచ. మహాకపే! యత్ మహాబాహుం కమలలోచనం రామం, మహాబాహుం యశస్వినం మే దేవరం లక్ష్మణం చ ద్రక్ష్యసి, (తత్) (త్వం) సభాగ్యః అసి.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, సీతా = సీతాదేవి, మాం = నన్ను గూర్చి, ఉవాచ = పలికెను, మహాకపే = ఓ వానరశ్రేష్ఠుడా!, యత్ = ఏకారణము వలన, మహా బాహుం = గొప్ప భుజములు గలవాడును, కమలలోచనం = పద్మములవంటి నేత్రములు గలవాడునగు, రామం = శ్రీరాముని, మహాబాహుం = ఆజానుబాహుడును, యశస్వినం = కీర్తిశాలియునగు, మే = నాయొక్క, దేవరం = మరిదియైనట్టి, లక్ష్మణం

చ = లక్ష్మణునికూడ, ద్రక్ష్యసి = చూడగలవో, (తత్ = ఆ కారణమున), (త్వం = నీవు), సభాగ్యః = భాగ్యవంతుడవు, అసి = అగుచున్నావు.

తాత్పర్యము :– అప్పుడు సీతాదేవి నాతో ఇట్లన్నది – ఓ వానరోత్తముడా! నీ వెంత అదృష్టవంతుడవు! ఆజానుబాహుడును, కమలాయతలోచనుడునగు నా నాథుడైన శ్రీరాముని, మహాబాహువును యశశ్శాలియునగు నామరిదియైన లక్ష్మణుని, కన్నులార గాంచు భాగ్యము నిరంతరముగా నీకు కల్గుచున్నదిగదా!

శ్లో॥ సీతయా ప్యేవ ముక్తో ఽహ మబ్రవం మైథిలీం తదా ।
పృష్ఠమారోహ మే దేవి క్షిప్రం జనకనందిని ॥ 34

శ్లో॥ యావ త్తే దర్శయా మ్యద్య ససుగ్రీవం సలక్ష్మణమ్ ।
రాఘవం చ మహాభాగే భర్తార మసితేక్షణే ॥ 35

పదచ్ఛేదము :– సీతయా – అపి – ఏవమ్ – ఉక్తః – అహమ్ – అబ్రవం – మైథిలీం – తదా, పృష్ఠమ్ – ఆరోహ – మే – దేవి – క్షిప్రం – జనకనందిని, యావత్ – తే – దర్శయామి – అద్య – ససుగ్రీవం – సలక్ష్మణమ్, రాఘవం – చ – మహాభాగే – భర్తారమ్ – అసితేక్షణే ॥

అన్వయక్రమము :– సీతయా అపి ఏవమ్ ఉక్తః అహం తదా మైథిలీమ్ అబ్రవమ్, దేవి! జనకనందిని! క్షిప్రం మే పృష్ఠమ్ ఆరోహ, మహాభాగే అసితేక్షణే! అద్య ససుగ్రీవం లక్ష్మణం తే భర్తారం రాఘవం యావత్ దర్శయామి.

ప్రతిపదార్థము :– సీతయా అపి = సీతమ్మ చేతను, ఏవం = ఈరీతిగా, ఉక్తః = చెప్పబడినవాడనై, అహం = నేను, తదా = అప్పుడు, మైథిలీం = జానకీదేవిని గూర్చి, అబ్రవమ్ = పలికితిని, దేవి! జనకనందిని = ఓ జానకీదేవీ, క్షిప్రం = శీఘ్రముగా, మే = నా యొక్క, పృష్ఠం = వీపును, ఆరోహ = అధిష్ఠించుము, మహాభాగే = ఓ మహాత్మురాలా!, అసితేక్షణే = నల్లని కన్నులుగల సీతాదేవీ, అద్య = ఇప్పుడు, ససుగ్రీవం = సుగ్రీవునితోగూడిన వాడును, సలక్ష్మణం = లక్ష్మణునితో గూడినవాడును అగు, తే భర్తారం = నీ నాథుడైన, రాఘవం = శ్రీరాముని, యావత్ = త్వరలో, దర్శయామి = చూపించెదను.

తాత్పర్యము :– సీతాదేవి నన్నుగూర్చి ఇట్లు పలుకగా అప్పుడు నేను వెంటనే ఆమెతో ఇట్లంటిని. 'ఓ తల్లీ జానకీ! నీ విప్పుడే నా వీపు నారోహింపుము. సుగ్రీవుని తోడను లక్ష్మణునితోడను కూడియున్న నీ నాథుడైన రాఘవుని నీ కిప్పుడే చూపగలను.

శ్లో॥ సా ఽబ్రవీ న్మాం తతో దేవీ నైష ధర్మో మహాకపే ।
యత్తే పృష్ఠం సిషేవేఽహం స్వవశా హరిపుంగవ ॥ 36

పదచ్ఛేదము :– సా – అబ్రవీత్ – మాం – తతః – దేవీ – న – ఏషః – ధర్మః – మహాకపే, యత్ – తే – పృష్ఠం – సిషేవే – అహం – స్వవశా – హరిపుంగవ ॥

అన్వయక్రమము :– తతః సా దేవీ మామ్ అబ్రవీత్, మహాకపే! హరిపుంగవ! స్వవశా అహం తే పృష్ఠం సిషేవే (ఇతి) యత్, ఏషః ధర్మః న.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, సా = ఆ, దేవీ = సీతాదేవి, మాం = నన్నుగూర్చి, అబ్రవీత్ = పలికెను, మహాకపే = ఓ వానరశ్రేష్ఠుడా!, హరిపుంగవ = ఓ కపిసత్తమా!, స్వవశా = స్వతంత్రురాలనైన, అహం = నేను, తే = నీయొక్క, పృష్ఠం = వీపును, సిషేవే = సేవించితిని, ఇతి యత్ = అనునది ఏదియున్నదో, ఏషః = ఇయ్యది, ధర్మః = ధర్మము, న = కాదు.

తాత్పర్యము :– అప్పుడు సీతాదేవి నాతో ఇట్లు చెప్పినది. ఓ వానరోత్తమా! నేను నా యిష్టముతో నీ వీపు నధిరోహించుట అనునది ధర్మమైన విషయము కాదు సుమా!

శ్లో॥ పురా చ య దహం వీర స్పృష్టా గాత్రేషు రక్షసా ।
త త్రాహం కిం కరిష్యామి కాలే నోపనిపీడితా ॥ 37

పదచ్ఛేదము :– పురా – చ – యత్ – అహం – వీర – స్పృష్టా – గాత్రేషు – రక్షసా, తత్ర – అహం – కిం – కరిష్యామి – కాలేన – ఉపనిపీడితా ॥

అన్వయక్రమము :– వీర! పురా గాత్రేషు రక్షసా అహం స్పృష్టా ఇతి యత్ తత్ర కాలేన ఉపనిపీడితా, అహం కిం కరిష్యామి?

ప్రతిపదార్థము :– వీర! = ఓ వీరుడా!, పురా = పూర్వము, గాత్రేషు = అవయవములందు, రక్షసా = రక్కసులచే, అహం = నేను, స్పృష్టా = తాకబడితిని, ఇతి యత్ = అనునదేది గలదో, తత్ర = ఆ విషయమున, కాలేన = కాలముచే, ఉపనిపీడితా = బాధింపబడినదానను, కిం కరిష్యామి = ఏమి చేయగలను ?

తాత్పర్యము :– ఓ వీరాగ్రేసరుడా, వెనుకటి సమయమున ఆ రావణాసురునిచే నా శరీరము తాకబడుట జరిగియున్నప్పటికిని అప్పుడు కాలప్రభావముచే వివశురాలనై యుండుటచే నే నేమియును చేయజాలకుంటిని.

శ్లో॥ గచ్ఛ త్వం కపిశార్దూల యత్ర తే నృపతే స్సుతౌ ।
ఇత్యేవం సా సమాభాష్య భూయ స్సందేష్టు మాస్థితా ॥ 38

పదచ్ఛేదము :– గచ్ఛ – త్వం – కపిశార్దూల – యత్ర – తౌ – నృపతేః – సుతౌ, ఇతి – ఏవం – సా – సమాభాష్య – భూయః – సందేష్టుమ్ – ఆస్థితా ॥

అన్వయక్రమము :– కపిశార్దూల! తౌ నృపతేః సుతౌ యత్ర (వర్తేతే) తత్ర త్వం గచ్ఛ, ఇతి ఏవం సా సమాభాష్య భూయః సందేష్టుమ్ ఆస్థితా.

ప్రతిపదార్థము :– కపిశార్దూల = ఓ వానరశ్రేష్ఠుడా!, తౌ = ఆ, నృపతేః = రాజుయొక్క సుతౌ = కుమారులిరువురును, యత్ర = ఎచ్చటనయితే, (వర్తేతే = ఉన్నారో), తత్ర = అచటికి, త్వం = నీవు, గచ్ఛ = పొమ్ము, ఇతి = అని, సా = ఆమె, ఏవం = ఇట్లు, సమాభాష్య = పలికి, భూయః = తిరిగి, సందేష్టుం = సందేశము చెప్పుటకు, ఆస్థితా = సమకట్టినది.

తాత్పర్యము :– ఓ వానరోత్తమా! ఆ రాజపుత్రు లున్నచోటికే వెడలి అనంతరకార్యము చక్కబెట్టుమని నాతో పలికి తిరిగి ఇట్లు చెప్పదొడగెను.

సూచన :– శ్లో 33 నుండి 38 వరకుగల ఈ యారు శ్లోకములును కొన్ని తెలుగులిపి ప్రతులలో లేవు. మరియు వేరు వేరు ముద్రణములలో (వెనుక ముందులుగా కూడ) కనిపించుచున్నవి.

శ్లో॥ హనుమన్ సింహసంకాశౌ వుభౌ తౌ రామలక్ష్మణౌ ।
సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్ ॥39

పదచ్ఛేదము :– హనుమన్ – సింహసంకాశౌ – ఉభౌ – తౌ – రామలక్ష్మణౌ, సుగ్రీవం – చ – సహామాత్యం – సర్వాన్ – బ్రూయాః – హి – అనామయమ్ ॥

అన్వయక్రమము :– హనుమన్! సింహసంకాశౌ తౌ రామలక్ష్మణౌ ఉభౌ చ సహామాత్యం సుగ్రీవం చ సర్వాన్ అనామయం బ్రూయాః హి.

ప్రతిపదార్థము :– హనుమన్ = ఓ హనుమా!, సింహసంకాశౌ = సింహసమానులైనట్టి, తౌ = ఆ, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులను, ఉభౌ = ఇరువురిని, సహామాత్యం = మంత్రులతో గూడినట్టి, సుగ్రీవం చ = సుగ్రీవునికూడ, అనామయం = క్షేమమును, బ్రూయాః హి = పలుకవలెను సుమా!

తాత్పర్యము :– ఓ హనుమా! సింహపరాక్రమము కలిగినట్టి ఆ రామలక్ష్మణుల నిరువురిని, మంత్రిసమేతుడైన ఆ సుగ్రీవుని, అచటి వానరవీరుల నెల్లరిని నేను కుశలము నడిగినట్లు చెప్పవలెను సుమా!

శ్లో॥ యథా చ స మహాబాహు ర్మాం తారయతి రాఘవః ।
అస్మా ద్దుఃఖాంబుసంరోధా త్త్వం సమాధాతు మర్హసి ॥ 40

పదచ్ఛేదము :- యథా - చ - సః - మహాబాహుః - మాం - తారయతి - రాఘవః - అస్మాత్ - దుఃఖాంబుసంరోధాత్ - త్వం - సమాధాతుమ్ - అర్హసి ॥

అన్వయక్రమము :- మహాబాహుః సః రాఘవః యథా అస్మాత్ దుఃఖాంబుసంరోధాత్ మాం తారయతి (తథా) త్వం సమాధాతుమ్ అర్హసి.

ప్రతిపదార్థము :- మహాబాహుః = గొప్పభుజములు కల్గినట్టి, సః = ఆ, రాఘవః = శ్రీరాముడు, అస్మాత్ = ఈ, దుఃఖాంబుసంరోధాత్ = దుఃఖపు నీటివెల్లువనుండి, యథా = ఎట్లు, మాం = నన్ను, తారయతి = దాటించునో, (తథా = అట్లు), త్వం = నీవు, సమాధాతుం = సమకూర్చుటకు, అర్హసి = తగుదువు.

తాత్పర్యము :- ఓ హనుమా! మహావీరుడైన ఆ రాఘవుడు నన్నీ దుఃఖసముద్రము నుండి త్వరలో ఒడ్డునకు చేర్చునట్టి విధానమును నీవే సమకూర్చగలవాడవు సుమా!

శ్లో॥ ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభి రేభిః పరిభర్త్సనం చ ।
బ్రూయాస్తు రామస్య గత స్సమీపం
శివశ్చ తేఽ ధ్వాఽ స్తు హరిప్రవీర ॥ 41

పదచ్ఛేదము :- ఇమం - చ - తీవ్రం - మమ - శోకవేగం - రక్షోభిః - ఏభిః - పరిభర్త్సనం - చ - బ్రూయాః - తు - రామస్య - గతః - సమీపం - శివః - చ - తే - అధ్వా - అస్తు - హరిప్రవీర ॥

అన్వయక్రమము :- హరిప్రవీర! ఇమం తీవ్రం మమ శోకవేగం చ, ఏభిః రక్షోభిః పరిభర్త్సనం చ రామస్య సమీపం గతః (సన్) బ్రూయాః; తే అధ్వా చ శివః అస్తు.

ప్రతిపదార్థము :- హరిప్రవీర! = వానరయోధుడా!, ఇమం = ఈ, తీవ్రం = తీవ్రమైనట్టి, మమ = నాయొక్క, శోకవేగం చ = దుఃఖాతిశయమును గూర్చియు, ఏభిః = ఈ, రక్షోభిః = రక్కసులచేతనైన, పరిభర్త్సనం చ = గద్దింపును గూర్చియు, రామస్య = శ్రీరామునియొక్క, సమీపం = సన్నిధిని, గతః సన్ = చేరినవాడవై, బ్రూయాః = చెప్పుము, తే = నీయొక్క, అధ్వా చ = మార్గము గూడ, శివః = మంగళకరమైనది, అస్తు = అగుగాక!

తాత్పర్యము :- ఓ వానరవీరుడా! నీవు రాముని సన్నిధికేగి నేననుభవించుచున్న ఈ

తీవ్రమైన దుఃఖమును గూర్చియు, ఇచ్చటి రక్కసులు నన్ను బెదిరించుచున్న విధమును గూర్చియు వివరముగా ఆతనికి తెలుపుము. నీకు మార్గము క్షేమకరమగుగాక!

శ్లో॥ ఏత త్త వార్యా నృపరాజసింహ
సీతా వచః ప్రాహ విషాదపూర్వమ్ ।
ఏతచ్చ బుద్ధ్వా గదితం మయా త్వం
శ్రద్ధత్స్వ సీతాం కుశలాం సమగ్రామ్ ॥ 42

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"సీతాభాషితానువచనం" నామ
సప్తషష్టితమస్సర్గః

పదచ్ఛేదము :– ఏతత్ – తవ – ఆర్యా – నృపరాజసింహ – సీతా – వచః – ప్రాహ – విషాదపూర్వమ్ – ఏతత్ – చ – బుద్ధ్వా – గదితం – మయా – త్వం – శ్రద్ధత్స్వ – సీతాం – కుశలాం – సమగ్రామ్ ॥

అన్వయక్రమము :– నృపరాజసింహ! ఆర్యా సీతా విషాదపూర్వమ్ ఏతత్ వచః ప్రాహ, మయా గదితం ఏతత్ చ బుద్ధ్వా త్వం సీతాం కుశలాం సమగ్రాం శ్రద్ధత్స్వ.

ప్రతిపదార్థము :– నృపరాజసింహ = మనుజులను పాలించునట్టి రాజశ్రేష్ఠుడా!, ఆర్యా = పూజ్యురాలయిన, సీతా = సీతాదేవి, విషాదపూర్వం = దుఃఖపూర్వకముగా, ఏతత్ = ఈ, వచః = మాటను, తవ = నీకు, ప్రాహ = చెప్పినది. మయా = నాచేత, గదితం = చెప్పబడినట్టి, ఏతత్ చ = ఈ మాటను గూడా, బుద్ధ్వా = గ్రహించి, సీతాం = సీతాదేవిని, కుశలాం = క్షేమముగ నున్నదిగను, సమగ్రాం = పతివ్రతలలో అగ్రేసరురాలినిగాను, శ్రద్ధత్స్వ = విశ్వసింపుము.

తాత్పర్యము :– ఓ రాజశ్రేష్ఠుడా! పూజ్యురాలయిన సీతాదేవి విషాదపూర్వకముగా నీకీ మాటలను తెలిపినది. నేను చెప్పిన ఈ మాటలను తెలిసికొని నీ ప్రియురాలు క్షేమముగ నున్నదనియు పతివ్రతాధర్మమున వెలయుచున్నదనియు నమ్ముము.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"సీతాభాషితానువచనం" అను అరువదియేడవసర్గము.
హరిః ఓం తత్ సత్.

☆☆☆

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

అష్టషష్టితమసర్గ

శ్లో॥ అథాహ ముత్తరం దేవ్యా పునరుక్త స్ససంభ్రమః ।
తవ స్నేహా న్నరవ్యాఘ్ర సౌహార్దా దనుమాన్య వై ॥ 1

పదచ్ఛేదము :- అథ – అహమ్ – ఉత్తరం – దేవ్యా – పునః – ఉక్తః – ససంభ్రమః – తవ – స్నేహాత్ – నరవ్యాఘ్ర – సౌహార్దాత్ – అనుమాన్య – వై ॥

అన్వయక్రమము :- నరవ్యాఘ్ర! అథ ససంభ్రమః అహం తవ స్నేహాత్ సౌహార్దాత్ దేవ్యా అనుమాన్య పునః ఉత్తరమ్ ఉక్తః.

ప్రతిపదార్థము :- నరవ్యాఘ్ర = ఓ పురుషశ్రేష్ఠుడా!, అథ = పిమ్మట, ససంభ్రమః = వేగిరపాటుతో గూడినట్టి, అహం = నేను, తవ = నీయొక్క, స్నేహాత్ = మైత్రివలనను, సౌహార్దాత్ = అనురాగమువలనను, అనుమాన్య = గౌరవించి, దేవ్యా = సీతాదేవిచేత, పునః = తిరిగి, ఉత్తరం = మీది కార్యమును గూర్చి, ఉక్తః = చెప్పబడినాను.

తాత్పర్యము :- ఓ పురుషశ్రేష్ఠుడా! పిమ్మట సీతాదేవి నాయందు నీకుగల స్నేహ విశేషమును, అనురాగాతిశయమును చక్కగా గ్రహించినదై నన్ను తగువిధముగా గౌరవించుచు తిరిగి, భావికర్తవ్యమును గూర్చి ఇట్లు చెప్పినది.

శ్లో॥ ఏవం బహువిధం వాచ్యో రామో దాశరథి స్త్వయా ।
యథా మా మాప్నుయా చ్ఛీఘ్రం హత్వా రావణ మాహవే ॥ 2

పదచ్ఛేదము :- ఏవం – బహువిధం – వాచ్యః – రామః – దాశరథిః – త్వయా, యథా – మాం – ఆప్నుయాత్ – శీఘ్రం – హత్వా – రావణమ్ – ఆహవే ॥

అన్వయక్రమము :- దాశరథిః రామః ఆహవే రావణం హత్వా యథా మాం శీఘ్రం ఆప్నుయాత్, ఏవం త్వయా బహువిధం వాచ్యః.

ప్రతిపదార్థము :- దాశరథిః = దశరథనందనుడైన, రామః = శ్రీరాముడు, ఆహవే = యుద్ధమునందు, రావణం = రావణుని, హత్వా = వధించి, మాం = నన్ను, యథా = ఏవిధముగా, శీఘ్రం = అచిరకాలములో, ఆప్నుయాత్ = పొందునో, ఏవం = ఆ

విధముగా, త్వయా = నీచేత, బహువిధం = పలువిధములుగా, వాచ్యః = చెప్పదగినవాడు.

తాత్పర్యము :– ఓ హనుమా! ఆ దశరథనందనుడు రావణాసురుని యుద్ధమున హతమార్చి నన్నతిశీఘ్రముగా గొనిపోవునట్లుగా బహువిధముల నా వృత్తాంతమును గూర్చి తెలుపవలయును సుమా!

శ్లో॥ యది వా మన్యసే వీర వ సైకాహ మరిందమ ।
కస్మింశ్చిత్సంవృతే దేశే విశ్రాంత శ్శ్వో గమిష్యసి ॥ 3

పదచ్ఛేదము :– యది – వా – మన్యసే – వీర – వస – ఏకాహమ్ – అరిందమ – కస్మిన్ – చిత్ – సంవృతే – దేశే – విశ్రాంతః – శ్వః – గమిష్యసి ॥

అన్వయక్రమము :– అరిందమ, మన్యసే యది వా ఏకాహం (ఇహ) వస, కస్మిన్చిత్ సంవృతే దేశే విశ్రాంతః (సన్) శ్వః గమిష్యసి.

ప్రతిపదార్థము :– అరిందమ = శత్రుమర్దనుడవైన, వీర = పరాక్రమవంతుడా!, మన్యసే యది వా = నీవు తలచిన యెడల, (ఇహ = ఈ లంకలో), ఏకాహం = ఒక్క దినము, వస = వసింపుము, కస్మిన్చిత్ = ఏదైన, సంవృతే = గుప్తమైనట్టి, దేశే = ప్రదేశమునందు, విశ్రాంతః సన్ = విశ్రమించినవాడవై, శ్వః = రేపు, గమిష్యసి = వెళ్ళగలవు.

తాత్పర్యము :– శత్రుభయంకరుడవైన ఓ మహావీరుడా! నీ కిష్టమైనచో ఇచ్చట ఇంకొక రోజు ఆగిపొమ్ము. ఎచటనైన రహస్యప్రదేశమునందు చక్కగా విశ్రాంతి దీసికొని రేపు తిరిగి వెడలిపోవచ్చును.

శ్లో॥ మమ చా ప్యల్పభాగ్యాయా స్సాన్ని ధ్యాత్తవ వానర ।
అస్య శోకవిపాకస్య ముహూర్తం స్యా ద్విమోక్షణమ్ ॥ 4

పదచ్ఛేదము :– మమ – చ – అపి – అల్పభాగ్యాయాః – సాన్నిధ్యాత్ – తవ – వానర, అస్య – శోకవిపాకస్య – ముహూర్తం – స్యాత్ – విమోక్షణమ్ ॥

అన్వయక్రమము :– వానర! తవ సాన్నిధ్యాత్ అల్పభాగ్యాయాః మమ చ అపి అస్య శోకవిపాకస్య ముహూర్తం విమోక్షణం స్యాత్.

ప్రతిపదార్థము :– వానర! = ఓ వానరోత్తమా!, తవ = నీయొక్క, సాన్నిధ్యాత్ = సామీప్యమువలన, అల్పభాగ్యాయాః = మందభాగ్యురాలనైనట్టి, మమ చ = నాకును, అస్య = ఈ, శోకవిపాకస్య = దుఃఖపరిణామమునకు, ముహూర్తం = కొద్దికాలము,

విమోక్షణం = విముక్తి, స్యాత్ = అగును.

తాత్పర్యము :– ఓ హనుమా! నీవు నా దగ్గర నుండుటవలన మందభాగ్యురాలనైనట్టి నన్ను పీడించుచున్న ఈ దుఃఖభారమునుండి కొన్ని క్షణముల కాలమైనను నాకు విముక్తి లభించగలదు.

శ్లో॥ గతే హి త్వయి విక్రాంతే పునరాగమనాయ వై ।
ప్రాణానామపి సందేహో మమ స్యా న్నాత్ర సంశయః ॥ 5

పదచ్ఛేదము :– గతే – హి – త్వయి – విక్రాంతే – పునః – ఆగమనాయ – వై, ప్రాణానామ్ – అపి – సందేహః – మమ – స్యాత్ – న – అత్ర – సంశయః ॥

అన్వయక్రమము :– విక్రాంతే త్వయి పున రాగమనాయ గతే (సతి) మమ ప్రాణానామ్ అపి సందేహః స్యాత్, అత్ర సంశయః న.

ప్రతిపదార్థము :– విక్రాంతే = పరాక్రమవంతుడవైన, త్వయి = నీవు, పునః = తిరిగి, ఆగమనాయ = వచ్చుటకై, గతే (సతి) = వెడలియుండగా, మమ = నాయొక్క, ప్రాణానామ్ అపి = ప్రాణములకుగూడ, సందేహః = సంశయము, స్యాత్ = కాగలదు, అత్ర = ఈ విషయమున, సంశయః = సందేహము, న = లేదు.

తాత్పర్యము :– మహాపరాక్రమసంపన్నుడవైన నీ విప్పుడు మరల తిరిగి రావచ్చును గదా అని వెడలిపోవగనే, దుఃఖాతిశయమువలన నా ప్రాణములు నిలుచుట కూడ సంశయమే అగును. ఇందుకు సందేహము లేదు.

శ్లో॥ త వాదర్శనజ శ్శోకో భూయో మాం పరితాపయేత్ ।
దుఃఖా ద్దుఃఖపరాభూతాం దుర్గతాం దుఃఖభాగినీమ్ ॥ 6

పదచ్ఛేదము :– తవ – అదర్శనజః – శోకః – భూయః – మాం – పరితాపయేత్, దుఃఖాత్ – దుఃఖపరాభూతాం – దుర్గతాం – దుఃఖభాగినీమ్ ॥

అన్వయక్రమము :– దుఃఖాత్ దుఃఖపరాభూతాం దుర్గతాం దుఃఖభాగినీం మాం తవ అదర్శనజః శోకః భూయః పరితాపయేత్.

ప్రతిపదార్థము :– దుఃఖాత్ = దుఃఖమునుండి, దుఃఖపరాభూతాం = దుఃఖముచే పరాభవింపబడినదానను, దుర్గతాం = దీనురాలను, దుఃఖభాగినీం = దుఃఖము పొందినదానను అగు, మాం = నన్ను, తవ = నీయొక్క, అదర్శనజః = కాన్పింప కుండుట వలన కలిగినట్టి, శోకః = దుఃఖము, భూయః = తిరిగి ఇంకను, పరితాప యేత్ = పరితపింపజేయును.

తాత్పర్యము :– దుఃఖము వెంబడి దుఃఖముచే పీడింపబడుచు దీనురాలనై దుఃఖముల పాలైయున్న నాకు నీవు దూరమగుటవలన ఇప్పుడు గలుగు ఇంకొక దుఃఖము తిరిగి ఇంకను సంతాపమును గలుగచేయును సుమా!

శ్లో॥ అయం చ వీర సందేహ స్తిష్ఠతీవ మమాగ్రతః ।
సుమహాం స్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర ॥ 7

పదచ్ఛేదము :– అయం – చ – వీర – సందేహః – తిష్ఠతి – ఇవ – మమ – అగ్రతః, సుమహాన్ – త్వత్సహాయేషు – హర్యృక్షేషు – హరీశ్వర ॥

అన్వయక్రమము :– వీర! హరీశ్వర! త్వత్సహాయేషు హర్యృక్షేషు సుమహాన్ అయం సందేహః చ మమ అగ్రతః తిష్ఠతి ఇవ.

ప్రతిపదార్థము :– వీర! = ఓ మహావీరుడా!, హరీశ్వర = వానరోత్తమా, త్వత్సహాయేషు = నీ సహాయకులైనట్టి, హర్యృక్షేషు = వానరులందును, ఎలుగుబంట్ల యందును, సుమహాన్ = మిక్కిలి గొప్పదైన, అయం = ఈ, సందేహః = సంశయము, మమ = నాకు, అగ్రతః = ఎదుట, తిష్ఠతి ఇవ = నిలచినట్లున్నది.

తాత్పర్యము :– ఓ మహావీరుడా! నీకు సహాయకులుగా నున్నట్టి ఆ వానరసైన్యముల విషయముననను భల్లూకగణముల యెడలను నాకు గొప్ప సందేహము గలిగి నన్ను బాధించుచున్నది సుమా!

శ్లో॥ కథం ను ఖలు దుష్పారం తరిష్యంతి మహోదధిమ్ ।
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ ॥ 8

పదచ్ఛేదము :– కథం – ను – ఖలు – దుష్పారం – తరిష్యంతి – మహోదధిమ్, తాని – హర్యృక్షసైన్యాని – తౌ – వా – నరవరాత్మజౌ ॥

అన్వయక్రమము :– తాని హర్యృక్షసైన్యాని తౌ నరవరాత్మజౌ వా దుష్పారం మహోదధిం కథం ను తరిష్యంతి ఖలు!

ప్రతిపదార్థము :– తాని = ఆ, హర్యృక్షసైన్యాని = వానరులయొక్కయు, భల్లూకముల యొక్కయు సైన్యములుగాని, తౌ = ఆ, నరవరాత్మజౌ = రాజపుత్రులిద్దరునుగాని, దుష్పారం = దాటుటకు శక్యముగాని, మహోదధిం = మహాసాగరమును, కథం ను = ఎటుగా, తరిష్యంతి ఖలు = దాటగలరో గదా!

తాత్పర్యము :– మీయొక్క ఆ వానరసైన్యములుగాని భల్లూక సైన్యములు గాని మరియు ఆ రాజపుత్రులైన రామలక్ష్మణులుగాని దాటుటకు దుష్కరమైన ఈ మహాసాగరము

నెట్లుగా దాటి రాగలరో గదా!

శ్లో॥ త్రయాణామేవ భూతానాం సాగర స్యాస్య లంఘనే ।
శక్తి స్స్యా ద్వైనతేయస్య వాయోర్వా తవ వానఘ ॥ 9

పదచ్ఛేదము :– త్రయాణామ్ – ఏవ – భూతానాం – సాగరస్య – అస్య – లంఘనే, శక్తిః – స్యాత్ – వైనతేయస్య – వాయోః – వా – తవ – వా – అనఘ ॥

అన్వయక్రమము :– అనఘ! వైనతేయస్య వా వాయోః వా తవ వా త్రయాణాం భూతానాం ఏవ, అస్య సాగరస్య లంఘనే శక్తిః స్యాత్.

ప్రతిపదార్థము :– అనఘ! = ఓ పాపరహితుడా!, వైనతేయస్య వా = గరుత్మంతునికి గాని, వాయోః వా = వాయుదేవునకుగాని, తవ వా = నీకుగాని, త్రయాణాం భూతానాం ఏవ = ఈ ముగ్గురు ప్రాణులకు మాత్రమే, అస్య = ఈ, సాగరస్య = సముద్రము యొక్క, లంఘనే = దాటుటయందు, శక్తిః = సామర్థ్యము, స్యాత్ = ఉండును.

తాత్పర్యము :– గరుత్మంతుడు, వాయుదేవుడు, నీవు – ఈ ముగ్గురు మాత్రమే గదా లోకము మొత్తము నందీ మహాసముద్రమును దాటుటకు సామర్థ్యమును గల్గియుందురు!

శ్లో॥ త దస్మి న్కార్యనిర్యోగే వీ రైవం దురతిక్రమే ।
కిం పశ్యసి సమాధానం బ్రూహి కార్యవిదాం వర ॥ 10

పదచ్ఛేదము :– తత్ – అస్మిన్ – కార్యనిర్యోగే – వీర – ఏవం – దురతిక్రమే, కిం – పశ్యసి – సమాధానం – బ్రూహి – కార్యవిదాం – వర ॥

అన్వయక్రమము :– తత్ ఏవం దురతిక్రమే అస్మిన్ కార్యనిర్యోగే సమాధానం కిం పశ్యసి? వీర! కార్యవిదాం వర! బ్రూహి.

ప్రతిపదార్థము :– తత్ = ఆ కారణమువలన, ఏవం = ఈ విధముగా, దురతిక్రమే = దాటుటకు దుష్కరమైనట్టి, అస్మిన్ = ఈ, కార్యనిర్యోగే = కార్యనిర్వహణమునందు, సమాధానం = సమాధానముగా, కిం = ఏమి, పశ్యసి = చూచుచున్నావు, కార్యవిదాం = కర్తవ్యము నెరిగియున్నవారిలో, వర = శ్రేష్ఠుడవైన, వీర! = ఓ వీరుడా!, బ్రూహి = చెప్పుము.

తాత్పర్యము :– ఈ విధముగా అసాధ్యముగా గానవచ్చుచున్నట్టి ఈ కార్యమును నిర్వహించుటకై నీవు ఊహించుచున్న మార్గము ఎట్టిది? కార్యనిర్వాహకులలో మేటివైన వీరుడవు గాబట్టి ఈ నిర్ణయమును నీవే తెలుపుము.

శ్లో॥ కామ మస్య త్వ మే వైకః కార్యస్య పరిసాధనే ।
పర్యాప్తః పరవీరఘ్న యశస్య స్తే బలోదయః ॥ 11

పదచ్ఛేదము :– కామమ్ – అస్య – త్వం – ఏవ – ఏకః – కార్యస్య – పరిసాధనే, పర్యాప్తః – పరవీరఘ్న – యశస్యః – తే – బలోదయః – ॥

అన్వయక్రమము :– పరవీరఘ్న! అస్య కార్యస్య పరిసాధనే త్వమ్ ఏకః ఏవ కామం పర్యాప్తః, తే బలోదయః యశస్యః భవేత్.

ప్రతిపదార్థము :– పరవీరఘ్న! = శత్రువీరులను హతమార్చు మహావీరుడా!, అస్య = ఈ, కార్యస్య = కార్యముయొక్క, పరిసాధనే = నిర్వహణమునందు, త్వం = నీవు, ఏకః ఏవ = ఒక్కడవే, కామం = సంపూర్ణముగా, పర్యాప్తః = సరిపడినట్టివాడవు, తే = నీయొక్క, బలోదయః = పరాక్రమాతిశయము, యశస్యః = కీర్తికరమైనది, (భవేత్ = అగును).

తాత్పర్యము :– ఓ శత్రువీరసంహారకుడా! ఈ ప్రస్తుత కార్యమును తుదముట్టించుటకు తలచుకొన్నచో నీ వొక్కడవే సరిపడుదువు. కాని అట్టి నీపరాక్రమవిజృంభణము నీ కొక్కనికి మాత్రమే గొప్ప కీర్తిని గూర్చగలదు.

శ్లో॥ బలై స్సమగ్రై ర్యది మాం హత్వా రావణ మాహవే ।
విజయీ స్వాం పురీం రామో నయే త్తత్స్యా ద్యశస్కరమ్ ॥ 12

పదచ్ఛేదము :– బలైః – సమగ్రైః – యది – మాం – హత్వా – రావణమ్ – ఆహవే – విజయీ – స్వాం – పురీం – రామః – నయేత్ – తత్ – స్యాత్ – యశస్కరమ్ ॥

అన్వయక్రమము :– రామః సమగ్రైః బలైః ఆహవే రావణం హత్వా విజయీ సన్ మాం స్వాం పురీం నయేత్ యది తత్ యశస్కరం స్యాత్.

ప్రతిపదార్థము :– రామః = శ్రీరాముడు, సమగ్రైః = సంపూర్ణములైనట్టి, బలైః = సైన్యములతో, ఆహవే = యుద్ధమునందు, రావణం = రావణాసురుని, హత్వా = వధించి, విజయీ సన్ = విజయవంతుడై, మాం = నన్ను, స్వాం = తనదైన, పురీం = అయోధ్యానగరమును, నయేత్ యది = తీసుకొనిపోయిన యెడల, తత్ = అది, యశస్కరం = కీర్తికరమైనది, స్యాత్ = కాగలదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– "తత్ యశస్కరం స్యాత్' – ఆ చర్య కీర్తికరమైనది గాగలదు అనగా నీవు రావణవధకు సమర్థుడవైనను స్వయముగ తాను వధించుటయే శ్రీరామునకు

ప్రతిష్ఠాకరమగునని సీతమ్మ భావము.

తాత్పర్యము :– శ్రీరాముడు సంపూర్ణములైన సైన్యములతో ఇచటికి వచ్చి యుద్ధము నందు రావణుని సంహరించి శత్రువిజయము సాధించినవాడై నన్ను అయోధ్యా పట్టణమునకు గొనిపోయిన యెడల ఆ చర్యయే ఎంతయును యశస్కరమైనదిగా నుండును గదా!

శ్లో॥ యథాహం తస్య వీరస్య వనా దుపధినా హృతా ।
రక్షసా తద్భయాదేవ తథా నార్హతి రాఘవః ॥ 13

పదచ్ఛేదము :– యథా – అహం – తస్య – వీరస్య – వనాత్ – ఉపధినా – హృతా, రక్షసా – తద్భయాత్ – ఏవ – తథా – న – అర్హతి – రాఘవః ॥

అన్వయక్రమము :– తస్య వీరస్య భయాత్ ఏవ రక్షసా వనాత్ అహం యథా ఉపధినా హృతా, రాఘవః తథా (కర్తుం) న అర్హతి.

ప్రతిపదార్థము :– తస్య వీరస్య = ఆ వీరుడైన రామునియొక్క, భయాత్ ఏవ = భయమువలననే, రక్షసా = రావణునిచే, అహం = నేను, యథా = ఏ విధముగానైతే, ఉపధినా = మోసముచే, హృతా = అపహరింపబడితినో, తథా = అట్లుగానే, (కర్తుం = చేయుటకు), రాఘవః = శ్రీరాముడు, న అర్హతి = తగడు.

తాత్పర్యము :– వీరుడైన శ్రీరామునకు భయపడియే నన్నా రావణుడు ఆనా డా యరణ్యమునుండి ఎట్లుగా మోసముచే అపహరించియున్నాడో అట్లే భయవిదూరుడైన శ్రీరాముడు కూడ రావణుని మోసగించియే నన్ను గొనిపోవలసిన పనిలేదు.

శ్లో॥ బలైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః ।
మాం నయేద్యది కాకుత్స్థ స్తత్తస్య సదృశం భవేత్ ॥ 14

పదచ్ఛేదము :– బలైః – తు – సంకులాం – కృత్వా – లంకాం – పరబలార్దనః, మాం – నయేత్ – యది – కాకుత్స్థః – తత్ – తస్య – సదృశం – భవేత్ ॥

అన్వయక్రమము :– పరబలార్దనః కాకుత్స్థః బలైః లంకాం సంకులాం కృత్వా మాం నయేత్ యది తత్ తస్య సదృశం భవేత్.

ప్రతిపదార్థము :– పరబలార్దనః = శత్రుసైన్యమును హతమార్చునట్టి, కాకుత్స్థః = శ్రీరాముడు, బలైః = సైన్యములతో, లంకాం = లంకను, సంకులాం = కల్లోలితమును, కృత్వా = చేసి, మాం = నన్ను, నయేత్ యది = తీసికొని పోయిన యెడల, తత్ = అది, తస్య = శ్రీరామునకు, సదృశం = తగినది, భవేత్ = అగును.

తాత్పర్యము :– శత్రుమర్దనుడైన రాఘవుడు సమర్థములైన సైన్యములతో వచ్చి లంకను కల్లోలము నొందించి నన్ను వెంట గైకొని పోయినచో ఆ వీరకృత్యము ఆతని కుచితమైనదిగా నుండును.

శ్లో॥ త ద్యథా తస్య విక్రాంత మనురూపం మహాత్మనః ।
భవ త్యాహవశూరస్య తథా త్వ ముపపాదయ ॥ 15

పదచ్ఛేదము :– తత్ – యథా – తస్య – విక్రాంతమ్ – అనురూపం – మహాత్మనః, భవతి – ఆహవశూరస్య – తథా – త్వమ్ – ఉపపాదయ ॥

అన్వయక్రమము :– ఆహవశూరస్య, మహాత్మనః తస్య తత్ విక్రాంతం యథా అనురూపం భవతి తథా త్వమ్ ఉపపాదయ.

ప్రతిపదార్థము :– ఆహవశూరస్య = యుద్ధవీరుడైన, తస్య = ఆ, మహాత్మనః = మహనీయునియొక్క, తత్ = ఆ, విక్రాంతం = పరాక్రమము, యథా = ఏ విధముగా, అనురూపం = ఉచితమైనట్టిది, భవతి = అగునో, తథా = అట్లుగా, త్వం = నీవు, ఉపపాదయ = తెలుపుము.

తాత్పర్యము :– రణరంగవీరుడైన ఆ రాఘవుని పరాక్రమమునకు ఏ విధాన ముచితమై యుండునో నీవట్టి విధమును చక్కగా ఆలోచించి తెలుపుము.

శ్లో॥ తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్ ।
నిశ మ్యాహం తత శ్శేషం వాక్య ముత్తర మబ్రవమ్ ॥ 16

పదచ్ఛేదము :– తత్ – అర్థోపహితం – వాక్యం – ప్రశ్రితం – హేతుసంహితమ్, నిశమ్య – అహం – తతః – శేషం – వాక్యమ్ – ఉత్తరమ్ – అబ్రవమ్ ॥

అన్వయక్రమము :– అర్థోపహితం ప్రశ్రితం హేతుసంహితం తత్ వాక్యం నిశమ్య, తతః అహం శేషమ్ ఉత్తరం వాక్యమ్ అబ్రవమ్.

ప్రతిపదార్థము :– అర్థోపహితం = ప్రయోజనముతో గూడినదియును, ప్రశ్రితం = వినయముతో గూడినదియును, హేతుసంహితం = కారణములతో నొప్పుచున్నది యునగు, తత్ = ఆ, వాక్యం = మాటను, నిశమ్య = విని, తతః = పిమ్మట, అహం = నేను, శేషం = మిగిలినట్టి, ఉత్తరం = సమాధానమైనట్టి, వాక్యం = వాక్యమును, అబ్రవమ్ = చెప్పితిని.

తాత్పర్యము :– అర్థవంతముగను, వినయయుక్తముగను, సకారణముగను సీతమ్మ పలికిన ఆ మాటలను ఆలకించి నేను జవాబుగా చెప్పవలసిన మిగిలిన మాటలను

ఇట్లు చెప్పితిని.

శ్లో॥ దేవి హర్యృక్షసైన్యానా మీశ్వరః ప్లవతాం వరః ।
సుగ్రీవ స్సత్త్వసంపన్న స్తవార్థే కృతనిశ్చయః ॥ 17

పదచ్ఛేదము :– దేవి – హర్యృక్షసైన్యానామ్ – ఈశ్వరః – ప్లవతాం – వరః – సుగ్రీవః – సత్త్వసంపన్నః – తవ – అర్థే – కృతనిశ్చయః ॥

అన్వయక్రమము :– దేవి! హర్యృక్షసైన్యానామ్ ఈశ్వరః, ప్లవతాం వరః, సత్త్వసంపన్నః సుగ్రీవః తవ అర్థే కృతనిశ్చయః.

ప్రతిపదార్థము :– దేవి = సీతాదేవీ!, హర్యృక్షసైన్యానాం = వానరభల్లూకముల సైన్యములకు, ఈశ్వరః, = ప్రభువును, ప్లవతాం = వానరులలో, వరః = శ్రేష్ఠుడును, సత్త్వసంపన్నః = మహాబలశాలియునగు, సుగ్రీవః = సుగ్రీవుడు, తవ = నీయొక్క, అర్థే = కార్యవిషయమున, కృతనిశ్చయః = దృఢమైన నిశ్చయము గల్గియున్నవాడు.

తాత్పర్యము :– వానర భల్లూకముల సేనల కధిపతియును, మహాబలాఢ్యుడును అగు వానరరాజైన సుగ్రీవుడు నిన్నుగూర్చి దృఢనిశ్చయముతో కార్యసాధనకు సిద్ధముగా నున్నాడుసుమా!

శ్లో॥ తస్య విక్రమసంపన్నా స్సత్త్వవంతో మహాబలాః ।
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయ స్థ్సితాః ॥ 18

పదచ్ఛేదము :– తస్య – విక్రమసంపన్నాః – సత్త్వవంతః – మహాబలాః, మనస్సంకల్ప సంపాతాః – నిదేశే – హరయః – స్థితాః ॥

అన్వయక్రమము :– విక్రమసంపన్నాః సత్త్వవంతః మహాబలాః మనస్సంకల్పసంపాతాః హరయః (బహవః) తస్య నిదేశే స్థితాః.

ప్రతిపదార్థము :– విక్రమసంపన్నాః = గొప్ప పరాక్రమము గలవారును, సత్త్వవంతః = గొప్పశక్తి గలవారును, మహాబలాః = మహాబలాఢ్యులును, మనస్సంకల్పసంపాతాః = మనస్సుయొక్క సంకల్పము ననుసరించిన వేగగమనము గలవారును అగు, హరయః = వానరులు, (బహవః = పెక్కుమంది), తస్య = ఆతనియొక్క, నిదేశే = ఆజ్ఞయందు, స్థితాః = నిలచియున్నారు.

తాత్పర్యము :– అమితమైన పరాక్రమము గలవారును మహాశక్తిసంపన్నులును మహాబలాఢ్యులును మనస్సుయొక్క సంకల్పము ననుసరించి వేగముగా చరించు సామర్థ్యము గలవారు నగు వానరవీరులు పెక్కుమంది ఆతని యధీనమునందు

వేచియున్నారు సుమా!

శ్లో॥ ఏషాం నోపరి నాధస్తా న్న తిర్య క్సజ్జతే గతిః ।
న చ కర్మసు సీదంతి మహ త్స్వమితతేజసః ॥ 19

పదచ్ఛేదము :- ఏషాం - న - ఉపరి - అధస్తాత్ - న - తిర్యక్ - సజ్జతే - గతిః, న - చ - కర్మసు - సీదంతి - మహత్సు - అమితతేజసః ॥

అన్వయక్రమము :- ఏషాం గతి, ఉపరి న సజ్జతే, అధస్తాత్ న సజ్జతే, తిర్యక్ న సజ్జతే, అమితతేజసః (ఏతే) మహత్సు కర్మసు చ న సీదంతి.

ప్రతిపదార్థము :- ఏషాం = ఈ వీరులయొక్క, గతిః = గమనము, ఉపరి = పైలోకమున, న సజ్జతే = అడ్డదు, అధస్తాత్ = అధోలోకమున, న సజ్జతే = అడ్డదు, తిర్యక్ = పార్శ్వదేశమున, న సజ్జతే, = అడ్డదు, అమితతేజసః = అపరిమిత పరాక్రమము గల్గినట్టి, (ఏతే = వీరు), మహత్సు = గొప్పవైనట్టి, కర్మసు చ = కృత్యములందుగూడ, న సీదంతి = క్షీణతనొందరు.

సూచన :- ఈ శ్లోకములోని "ఏషాం"కు మారుగా "యేషాం" అని అర్థవిశేష భేదములేని పాఠాంతరము కొన్ని ప్రతులలో కానవచ్చుచున్నది.

తాత్పర్యము :- సుగ్రీవుని వశమునందున్నట్టి ఆ వానరయోధులు ఊర్ధ్వలోకములందు గాని, పాతాళలోకములందుగాని చుట్టుప్రక్కల ప్రదేశములందు గాని గమనమునకు వెనుదీయనివారు. అమిత ప్రతాపసంపన్నులైనట్టి ఆ వీరులు ఎంతటి దుష్కర కార్యమునకు గూడ వెనుదీయని ప్రభావశాలురు సుమా!

శ్లో॥ అసకృత్తై ర్మహాభాగై ర్వానరై ర్బలదర్పితైః ।
ప్రదక్షణీకృతా భూమి ర్వాయుమార్గానుసారిభిః ॥ 20

పదచ్ఛేదము :- అసకృత్ - తైః - మహాభాగైః - వానరైః - బలదర్పితైః, ప్రదక్షణీకృతా - భూమిః - వాయుమార్గానుసారిభిః ॥

అన్వయక్రమము :- మహాభాగైః బలదర్పితైః తైః వానరైః వాయుమార్గానుసారిభిః (సద్భిః) అసకృత్ భూమిః ప్రదక్షిణీకృతా.

ప్రతిపదార్థము :- మహాభాగైః = మహనీయులును, బలదర్పితైః = బలగర్వితులునగు, తైః = ఆ, వానరైః = వానరులచే, వాయుమార్గానుసారిభిః సద్భిః = వాయుమార్గమును అనుసరించుచు, అసకృత్ = పలుమారులు, భూమిః = భూమండలము, ప్రదక్షిణీకృతా = ప్రదక్షిణము చేయబడినది.

తాత్పర్యము :- నిరుపమానమైన తమ బలాతిశయముచే గర్వించియున్నట్టి మహనీయులైన ఆ వానరవీరులు ఆకాశమార్గమును బూని ఎన్ని మారులో భూమిచుట్టును ప్రదక్షిణము చేసి వచ్చిరి.

శ్లో॥ మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః ।
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవసన్నిధౌ ॥ 21

పదచ్ఛేదము :- మద్విశిష్టాః – చ – తుల్యాః – చ – సంతి – తత్ర – వనౌకసః, మత్తః – ప్రత్యవరః – కః – చిత్ – న – అస్తి – సుగ్రీవసన్నిధౌ ॥

అన్వయక్రమము :- తత్ర సుగ్రీవసన్నిధౌ వనౌకసః మద్విశిష్టాః చ తుల్యాః చ సంతి, మత్తః ప్రత్యవరః కశ్చిత్ న అస్తి.

ప్రతిపదార్థము :- సుగ్రీవసన్నిధౌ = సుగ్రీవుని సన్నిధియందు, వనౌకసః = వానరులు, మద్విశిష్టాః = నాకంటె అధికులైనవారు, తత్ర = అచ్చట, సంతి = ఉన్నారు, మత్తః = నాకంటె, ప్రత్యవరః = తక్కువవాడు, కశ్చిత్ = ఎవ్వడును, న అస్తి = లేడు.

తాత్పర్యము :- సుగ్రీవుని కొలువులోని వానరులెల్లరును నాకంటె ఘనులైనవారును నాతో సమానమైనవారునై ఉన్నారు. ఆతనికడ నాకంటె తక్కువైన వాడు ఒక్కడును లేడు సుమా!

శ్లో॥ అహం తావ దిహ ప్రాప్తః కింపున స్తే మహాబలాః ।
నహి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరే జనాః ॥ 22

పదచ్ఛేదము :- అహం – తావత్ – ఇహ – ప్రాప్తః – కిం – పునః – తే – మహాబలాః, న – హి – ప్రకృష్టాః – ప్రేష్యంతే – ప్రేష్యంతే – హి – ఇతరే – జనాః ॥

అన్వయక్రమము :- అహం తావత్ ఇహ ప్రాప్తః, తే మహాబలాః పునః కిమ్? ప్రకృష్టాః న ప్రేష్యంతే హి, ఇతరే జనాః ప్రేష్యంతే హి.

ప్రతిపదార్థము :- అహం తావత్ = నేనయితే, ఇహ = ఇచటికి, ప్రాప్తః = చేరితిని, మహాబలాః = మహాబలసంపన్నులైన, తే = వారు, కిం పునః = చెప్పవలసినదేమి?, ప్రకృష్టాః = శ్రేష్ఠులైనవారు, న ప్రేష్యంతే హి = దూతగా పంపబడరు గదా, ఇతరే జనాః = సామాన్యజనులే, ప్రేష్యంతే హి = పంపబడుదురు గదా.

తాత్పర్యము :- నావంటివాడనే ఇచటికి చేరుకొనగల్గితిని గదా! ఇక మహాబలాఢ్యుల విషయము చెప్పవలసిన దేమున్నది? దూతకృత్యమునకు పెద్దవారిని ఎంచి

పంపరుగదా! చిన్నవారినేగదా ఏరి పంపుదురు!

శ్లో॥ త దలం పరితాపేన దేవి మన్యు ర్వ్యపైతు తే ।
ఏకోత్పాతేన వై లంకా మేష్యంతి హరియూథపాః ॥ 23

పదచ్ఛేదము :– తత్ – అలం – పరితాపేన – దేవి – మన్యుః – వ్యపైతు – తే, ఏకోత్పాతేన – వై – లంకామ్ – ఏష్యంతి – హరియూథపాః ॥

అన్వయక్రమము :– దేవి! తత్ పరితాపేన అలమ్, తే మన్యుః వ్యపైతు, తే హరియూథపాః ఏకోత్పాతేన లంకామ్ ఏష్యంతి.

ప్రతిపదార్థము :– తత్ = ఆ కారణముచేత, దేవి = ఓ సీతాదేవీ, పరితాపేన అలం = సంతాపమువలదు, తే = నీ యొక్క, మన్యుః = శోకము, వ్యపైతు = తొలగిపోవుగాక!, తే = ఆ, హరియూథపాః = వానరవీరులు, ఏకోత్పాతేన = ఒక గెంతుతో, లంకాం = లంకనుగూర్చి, ఏష్యంతి = రాగలరు.

తాత్పర్యము :– అందుచేత ఓ సీతాదేవీ! నీవు సంతాపము నొందవలసిన పనిలేదు, నీ మనసునందలి దిగులు తొలగించుకొనుము. ఆ వానరవీరు లందరును ఒక్క గెంతుతోనే లంకలోనికి రాబోవుచున్నారు సుమా!

శ్లో॥ మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యావివోదితౌ ।
త్వత్సకాశం మహాభాగే నృసింహౌ వాగమిష్యతః ॥ 24

పదచ్ఛేదము :– మమ – పృష్ఠగతౌ – తౌ – చ – చంద్రసూర్యౌ – ఇవ – ఉదితౌ, త్వత్సకాశం – మహాభాగే – నృసింహౌ – ఆగమిష్యతః ॥

అన్వయక్రమము :– మహాభాగే! నృసింహౌ తౌ చ మమ పృష్ఠగతౌ (సంతౌ) ఉదితౌ చంద్రసూర్యౌ ఇవ త్వత్సకాశం ఆగమిష్యతః.

ప్రతిపదార్థము :– మహాభాగే = ఓ మహాత్మురాలా!, నృసింహౌ = పురుషశ్రేష్ఠులైనట్టి, తౌ చ = ఆ రామలక్ష్మణు లిరువురును, మమ = నాయొక్క, పృష్ఠగతౌ (సంతౌ) = వీపు నధిష్ఠించినవారై, ఉదితౌ = ఉదయించినట్టి, చంద్రసూర్యౌ ఇవ = చంద్రసూర్యుల వలె, త్వత్సకాశం = నీ సమీపమును గూర్చి, ఆగమిష్యతః = రాగలరు.

తాత్పర్యము :– తల్లీ! పురుషసింహులైన ఆ యన్నదమ్ము లిరువురును నావీపు నధిరోహించి అప్పుడే ఉదయించిన చంద్రసూర్యులవలె నీ కడకు రానై యున్నారు సుమా!

శ్లో॥ అరిఘ్నం సింహసంకాశం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్ ।
లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వార ముపస్థితమ్ ॥ 25

పదచ్ఛేదము :- అరిఘ్నం - సింహసంకాశం - క్షిప్రం - ద్రక్ష్యసి - రాఘవమ్, లక్ష్మణం - చ - ధనుష్పాణిం - లంకాద్వారమ్ - ఉపస్థితమ్ ॥

అన్వయక్రమము :- అరిఘ్నం సింహసంకాశం రాఘవం చ లంకాద్వారమ్ ఉపస్థితం ధనుష్పాణిం లక్ష్మణం చ క్షిప్రం ద్రక్ష్యసి.

ప్రతిపదార్థము :- అరిఘ్నం = శత్రుమర్దనుడును, సింహసంకాశం = సింహ సన్నిభుడునగు, రాఘవం చ = శ్రీరాముని, లంకాద్వారం = లంకాపురద్వారమును, ఉపస్థితం = చేరినట్టి, ధనుష్పాణిం = విల్లు చేతియందు గల్గినట్టి, లక్ష్మణం చ = లక్ష్మణుని, క్షిప్రం = శీఘ్రముగా, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :- శత్రుసంహారకుడును సింహవిక్రముడునగు నీ నాథుడైన శ్రీరాముని, ధనుర్ధారియై లంకానగరద్వారమునందు నిలచియున్న నీ మరదియైన లక్ష్మణుని అచిరకాలములోనే చూడగలవు సుమా!

శ్లో॥ నఖదంష్ట్రాయుధా న్వీరా న్సింహశార్దూలవిక్రమాన్ ।
వానరా న్వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్ ॥ 26

పదచ్ఛేదము :- నఖదంష్ట్రాయుధాన్ - వీరాన్ - సింహశార్దూలవిక్రమాన్ - వానరాన్ - వారణేంద్రాభాన్ - క్షిప్రం - ద్రక్ష్యసి - సంగతాన్ ॥

అన్వయక్రమము :- నఖదంష్ట్రాయుధాన్ సింహశార్దూలవిక్రమాన్ వారణేంద్రాభాన్ వానరాన్ సంగతాన్ క్షిప్రం ద్రక్ష్యసి.

ప్రతిపదార్థము :- నఖదంష్ట్రాయుధాన్ = గోళ్ళను, కోరలును ఆయుధములుగాగల వారును, సింహశార్దూలవిక్రమాన్ = సింహములయొక్కయు వ్యాఘ్రముల యొక్కయు విక్రమమువంటి పరాక్రమము గలవారును, వారణేంద్రాభాన్ = మత్తగజమువలె ప్రకాశించువారునగు, వానరాన్ = వానరులను, క్షిప్రం = త్వరలో, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :- తమ గోళ్ళను, కోరలను ఆయుధములుగా నుపయోగించువారును సింహములతో, వ్యాఘ్రములతో సమానమైన పరాక్రమము గలవారును మదపుటేనుగు వలె బలసి యున్నవారునగు వానరులు మహాసైన్యముగా లంకనంతయును నిండి యుండుట అచిరకాలములోనే చూడగలవు.

శ్లో॥ శైలాంబుదనికాశానాం లంకామలయసానుషు ।
నర్దతాం కపిముఖ్యానా మచిరా చ్ఛ్రోష్యసి స్వనమ్ ॥ 27

పదచ్ఛేదము :- శైలాంబుదనికాశానాం - లంకామలయసానుషు - నర్దతాం - కపిముఖ్యానామ్ - అచిరాత్ - శ్రోష్యసి - స్వనమ్ ॥

అన్వయక్రమము :- శైలాంబుదనికాశానాం లంకామలయసానుషు నర్దతాం కపిముఖ్యానాం స్వనమ్ అచిరాత్ శ్రోష్యసి.

ప్రతిపదార్థము :- శైలాంబుదనికాశానాం = పర్వతములతోడను, మేఘములతోడను సమానమైనట్టివారును, లంకామలయసానుషు = లంకయందలి మలయపర్వతముల యొక్క చరియలయందు, నర్దతాం = గర్జించుచున్నట్టి వారును అగు, కపిముఖ్యానాం = వానరశ్రేష్ఠులయొక్క, స్వనం = శబ్దమును, అచిరాత్ = శీఘ్రముగా, శ్రోష్యసి = వినగలవు.

తాత్పర్యము :- ఈ లంకానగరమునందలి మలయపర్వతపు చరియలను ఆరోహించి పెద్ద పర్వతముపై చేరిన మేఘములవలె, పెద్దయురుములవంటి గర్జనలు చేయుచున్న వానరవీరులయొక్క సింహనాదముల నతిత్వరలోనే నీవు వినగలవు.

శ్లో॥ నివృత్తవనవాసం చ త్వయా సార్ధ మరిందమమ్ ।
అభిషిక్త మయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్ ॥ 28

పదచ్ఛేదము :- నివృత్తవనవాసం - చ - త్వయా - సార్ధమ్ - అరిందమమ్, అభిషిక్తమ్ - అయోధ్యాయాం - క్షిప్రం - ద్రక్ష్యసి - రాఘవమ్ ॥

అన్వయక్రమము :- అరిందమం నివృత్తవనవాసం త్వయా సార్ధమ్ అయోధ్యాయామ్ అభిషిక్తం రాఘవం క్షిప్రం ద్రక్ష్యసి.

ప్రతిపదార్థము :- అరిందమం = శత్రుమర్దనుడును, నివృత్తవనవాసం = ముగిసినట్టి వనవాసదీక్ష గలవాడును, త్వయా సార్ధం = నీతోగూడ, అయోధ్యాయాం = అయోధ్య యందు, అభిషిక్తం = పట్టాభిషిక్తుడయి యున్నవాడునగు, రాఘవం = శ్రీరాముని, క్షిప్రం = శీఘ్రముగా, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :- శత్రుసంహారము గావించి వనవాసవ్రతమును ముగించుకొని అయోధ్యానగరమునందు నీతోగూడ సింహాసనము నధిష్ఠించి పట్టాభిషేకము నొందు శ్రీరాముని అచిరకాలములోనే చూడగలవు.

శ్లో॥ తతో మయా వాగ్భి రదీనభాషిణా
శివాభి రిష్టాభి రభిప్రసాదితా ।
జగామ శాంతిం మమ మైథిలాత్మజా
తవాపి శోకేన తథాఽభిపీడితా ॥ 29

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకిరామాయణే
ఆదికావ్యే సుందరకాండే
"హనుమత్సమాశ్వాసన వచనానువాదో" నామ
అష్టషష్టితమస్సర్గః

పదచ్ఛేదము :– తతః – మయా – వాగ్భిః – అదీనభాషిణా – శివాభిః – ఇష్టాభిః – అభిప్రసాదితా, జగామ – శాంతిం – మమ – మైథిలాత్మజా – తవ – అపి – శోకేన – తథా – అభిపీడితా ॥

అన్వయక్రమము :– తతః తవ శోకేన అపి అభిపీడితా మైథిలాత్మజా అదీనభాషిణా మయా శివాభిః ఇష్టాభిః వాగ్భిః తథా అభిప్రసాదితా (సతీ) మమ (పురతః) శాంతిం జగామ.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తవ = నీయొక్క, శోకేన అపి = దుఃఖముచేత గూడ, అభిపీడితా = మిక్కిలి బాధింపబడినట్టి, మైథిలాత్మజా = జనకరాజపుత్రి, అదీనభాషిణా = దైన్యమును తొలగించు మాటలు పలుకుచున్నట్టి, మయా = నాచేత, శివాభిః = మంగళకరములును, ఇష్టాభిః = ప్రీతికరములునగు, వాగ్భిః = పలుకులచే, తథా = అట్లు, అభిప్రసాదితా (సతీ) = ఉపశమింపచేయబడినదై, (మమ) పురతః = నా యెదుట, శాంతిం = ఊరటను, జగామ = పొందెను.

తాత్పర్యము :– శ్రీరామా! తన కొరకై నీవు పొందుచున్న దుఃఖమును గూర్చి నేను చెప్పగా విని సీతమ్మ మిక్కిలి దుఃఖము నొందుచున్నది. నేను మంగళకరమైన ప్రియ వచనములతో ఆమె నూరడింపగా ఎట్లో తన దుఃఖమును దిగమ్రింగి యామె శాంతి వహించియున్నది.

ఇది శ్రీమత్సుందరకాండమున
"సుబోధిని"యను ఆంధ్రవివరణమునందు
"హనూమత్సమాశ్వాసనవచనానువాదము" అను
అరువదియెనిమిదవ సర్గము.
హరిః ఓం తత్ సత్.

★★★

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

అథ శ్రీరామ పట్టాభిషేక ఘట్టః

శ్లో॥ తత స్స ప్రయతో వృద్ధో వసిష్ఠో బ్రాహ్మణైస్సహ ।
రామం రత్నమయే పీఠే సహసీతం న్యవేశయత్ ॥ 1

పదచ్ఛేదము :– తతః – సః – ప్రయతః – వృద్ధః – వసిష్ఠః – బ్రాహ్మణైః – సహ, రామం – రత్నమయే – పీఠే – సహసీతం – న్యవేశయత్ ॥

అన్వయక్రమము :– తతః ప్రయతః వృద్ధః సః వసిష్ఠః బ్రాహ్మణైః సహ సహసీతం రామం రత్నమయే పీఠే న్యవేశయత్.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, వృద్ధః = వృద్ధుడును, ప్రయతః = పరిశుద్ధుడును అగు, వసిష్ఠః = వసిష్ఠమహర్షి, బ్రాహ్మణైః సహ = బ్రాహ్మణులతో గూడ, సహసీతం = సీతాదేవితో గూడియున్న, రామం = శ్రీరాముని, రత్నమయే = రత్నఖచిత మైనట్టి, పీఠే = సింహాసనమునందు, న్యవేశయత్ = కూర్చుండజేసెను.

తాత్పర్యము :– ఐదువందల నదుల నుండియు, నాలుగు సముద్రముల నుండియు అభిషేకజలము గొని రాబడుటజూచి శత్రుఘ్నుడు మీది కార్యక్రమమునకై తనను కోరి యుండగా వృద్ధుడైన ఆ వసిష్ఠ మహర్షి పవిత్రమైన మనస్సుతో ఋత్విజులగు బ్రాహ్మణులు దగ్గరనుండగా శ్రీరాముని, సీతాదేవిని రత్నఖచితమైన బంగారు సింహాసనముపై నధిష్ఠింపజేసెను.

శ్లో॥ వసిష్ఠో వామదేవశ్చ జాబాలి రథ కాశ్యపః ।
కాత్యాయన స్సుయజ్ఞశ్చ గౌతమో విజయస్తథా ॥ 2

అభ్యషించ న్నరవ్యాఘ్రం ప్రసన్నేన సుగంధినా ।
సలిలేన సహస్రాక్షం వసవో వాసవం యథా ॥ 3

పదచ్ఛేదము :– వసిష్ఠః – వామదేవః – చ – జాబాలిః – అథ – కాశ్యపః, కాత్యాయనః – సుయజ్ఞః – చ – గౌతమః – విజయః – తథా, – అభ్యషించన్ – నరవ్యాఘ్రం – ప్రసన్నేన – సుగంధినా, సలిలేన – సహస్రాక్షం – వసవః –

వాసవం – యథా ॥

అన్వయక్రమము :– వసవః సహస్రాక్షం వాసవం యథా వసిష్ఠః వామదేవః చ, జాబాలిః అథ కాశ్యపః కాత్యాయనః సుయజ్ఞః చ, గౌతమః తథా విజయః, ప్రసన్నేన సుగంధినా సలిలేన నరవ్యాఘ్రమ్ అభ్యషించన్.

ప్రతిపదార్థము :– అథ = పిమ్మట, వసవః = అష్టవసువులు, సహస్రాక్షం = వేయి కన్నులు గల్గినట్టి, వాసవం యథా = దేవేంద్రునివలె, వసిష్ఠః = వసిష్ఠుడును, వామదేవశ్చ = వామదేవుడును, జాబాలిః = జాబాలియును, కాశ్యపః = కాశ్యపుడును, కాత్యాయనః = కాత్యాయనుడును, సుయజ్ఞః చ = సుయజ్ఞుడును, గౌతమః = గౌతముడును, తథా = అట్లే, విజయః = విజయుడును, ప్రసన్నేన = నిర్మలమైనట్టి, సుగంధినా = పరిమళవంతమైనట్టి, సలిలేన = జలముచే, నరవ్యాఘ్రం = పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముని, అభ్యషించన్ = అభిషేకించిరి.

తాత్పర్యము :– అటుపిమ్మట, ఎనమండుగురు వసువులు మున్ను ముల్లోకములకు ప్రభువైన దేవేంద్రు నభిషేకించిన విధముగా వసిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు మరియు విజయుడు అను ఎనమండుగురు మహర్షులు పరిమళభరితమైన నిర్మలజలముతో పురుషపుంగవుడైన శ్రీరామచంద్రునికి అభిషేకము చేసిరి.

శ్లో॥ ఋత్విగ్భి ర్బ్రాహ్మణైః పూర్వం కన్యాభి ర్మంత్రిభి స్తథా ।
యోధైశ్చై వాభ్యషించం స్తే సంప్రహృష్టా స్సనైగమైః ॥ 4

పదచ్ఛేదము :– ఋత్విగ్భిః – బ్రాహ్మణైః – పూర్వం – కన్యాభిః – మంత్రిభిః – తథా, యోధైః – చ – ఏవ – అభ్యషించన్ – తే – సంప్రహృష్టాః – సనైగమైః ॥

అన్వయక్రమము :– సంప్రహృష్టాః తే పూర్వం ఋత్విగ్భిః బ్రాహ్మణైః, తథా కన్యాభిః మంత్రిభిః, సనైగమైః యోధైశ్చైవ అభ్యషించన్.

ప్రతిపదార్థము :– సంప్రహృష్టాః = మిక్కిలి సంతోషముతో నున్నట్టి, తే = ఆ వసిష్ఠాది మహర్షులు, పూర్వం = మొదట, ఋత్విగ్భిః = ఋత్విక్కులుగా నున్నట్టి, బ్రాహ్మణైః = బ్రాహ్మణులచేతను, తథా = అట్లు, కన్యాభిః = కన్యలచేతను, మంత్రిభిః = అమాత్యుల చేతను, అభ్యషించన్ = అభిషేకము చేయించిరి.

తాత్పర్యము :– అటుపిమ్మట ఆనందభరితులైన వసిష్ఠాది మహర్షులు మొదలు ఋత్విక్కులైన బ్రాహ్మణులచేతను పిమ్మట కన్యకలచేతను, మంత్రులచేతను, వణిక్ శ్రేష్ఠులచేతను, యోధులచేతనుగూడ శ్రీరామున కభిషేకము చేయించిరి.

శ్లో॥ సర్వౌషధిరసై ర్దివ్యై ర్దైవతై ర్నభసి స్థితైః ।
చతుర్భి ర్లోకపాలైశ్చ సర్వై ర్దేవైశ్చ సంగతైః ॥ 5

పదచ్ఛేదము :– సర్వౌషధిరసైః – దివ్యైః – దైవతైః – నభసి – స్థితైః – చతుర్భిః – లోకపాలైః – చ – సర్వైః – దేవైః – చ – సంగతైః ॥

అన్వయక్రమము :– నభసి స్థితైః దైవతైః చతుర్భిః లోకపాలైః చ, సంగతైః సర్వైః దేవైః చ, దివ్యైః సర్వౌషధిరసైః అభ్యషించన్.

ప్రతిపదార్థము :– నభసి = ఆకాశమునందు, స్థితైః = ఉన్నట్టి, దైవతైః = దేవతాశ్రేష్ఠులైన, చతుర్భిః = నలుగురైన, లోకపాలైః చ = దిక్పాలకులచేతను, సంగతైః = చేరియున్న, సర్వైః దేవైః చ = సమస్త దేవతలచేతను, దివ్యైః = దివ్యములైనట్టి, సర్వౌషధిరసైః = సమస్త ఓషధీరసములతో, అభ్యషించన్ = అభిషేకము చేయించిరి.

తాత్పర్యము :– అప్పుడా వసిష్ఠాది మహర్షులు శ్రీరామపట్టాభిషేకోత్సవమును దర్శింపవచ్చి ఆకసమున నిలచియున్నట్టి ఇంద్ర, యమ, వరుణ, కుబేరు లను నలుగురు దిక్పాలకులచేతను అచటికి చేరియున్న దేవతలందరిచేతను విశేషమైన దివ్యౌషధీ రసములతో శ్రీరామున కభిషేకము చేయించిరి.

శ్లో॥ బ్రహ్మణా నిర్మితం పూర్వం కిరీటం రత్నశోభితమ్ ।
అభిషిక్తః పురా యేన మను స్తం దీప్తతేజసమ్ ॥ 6

శ్లో॥ త స్యాన్వవాయే రాజానః క్రమా ద్యే నాభిషేచితాః ।
సభాయాం హేమక్లుప్తాయాం శోభితాయాం మహాజనైః ॥ 7

శ్లో॥ రత్నై ర్నానావిధైశ్చైవ చిత్రితాయాం సుశోభనైః ।
నానారత్నమయే పీఠే కల్పయిత్వా యథావిధి ॥ 8

శ్లో॥ కిరీటేన తతః పశ్చా ద్వసిష్ఠేన మహాత్మనా ।
ఋత్విగ్భి ర్భూషణైశ్చైవ సమయోక్ష్యత రాఘవః ॥ 9

పదచ్ఛేదము :– బ్రహ్మణా – నిర్మితం – పూర్వం – కిరీటం – రత్నశోభితమ్, అభిషిక్తః – పురా – యేన – మనుః – తం – దీప్తతేజసమ్, తస్య – అన్వవాయే – రాజానః – క్రమాత్ – యేన – అభిషేచితాః – సభాయాం – హేమక్లుప్తాయాం – శోభితాయాం – మహాజనైః, రత్నైః – నానావిధైః – చ – ఏవ – చిత్రితాయాం – సుశోభనైః, నానారత్నమయే – పీఠే – కల్పయిత్వా – యథావిధి, కిరీటేన – తతః –

పశ్చాత్ – వసిష్ఠేన – మహాత్మనా – ఋత్విగ్భిః – భూషణైః చ – ఏవ – సమయోక్ష్యత – రాఘవః ॥

అన్వయక్రమము :– పూర్వం బ్రాహ్మణా నిర్మితం రత్నశోభితం, పురా మనుః యేన అభిషిక్తః, తస్య అన్వవాయే రాజానః క్రమాత్ యేన అభిషేచితాః, తం దీప్తతేజసం కిరీటం, మహాజనైః శోభితాయాం, సుశోభనైః నానావిధైః రత్నైః చిత్రితాయాం, హేమక్లుప్తాయాం, సభాయాం నానారత్నమయే పీఠే యథావిధి కల్పయిత్వా తతః పశ్చాత్ మహాత్మనా వసిష్ఠేన ఋత్విగ్భిః తేన కిరీటేన భూషణైః చైవ రాఘవః సమయోక్ష్యత.

ప్రతిపదార్థము :– పూర్వం = పూర్వకాలమున, బ్రాహ్మణా = బ్రహ్మదేవునిచే, నిర్మితం = నిర్మింపబడినదియును, రత్నశోభితం = రత్నములతో ప్రకాశించుచున్నదియును, పురా = పూర్వము, మనుః = వైవస్వతమనువు, యేన = దేనిచేతనయితే, అభిషిక్తః = అభిషేకింపబడియుండెనో, తం = ఆ, దీప్తతేజసం = జ్వలించుచున్న తేజస్సు గలిగినట్టి, కిరీటం = కిరీటమును, మహాజనైః = మహాజనులతో, శోభితాయాం = శోభిల్లుచున్నదియును, సుశోభనైః = మిక్కిలి మంగళకరములగు, నానావిధైః = బహువిధములగు, రత్నైః చైవ = రత్నములచేతను, చిత్రితాయాం = అలంకరింపబడినట్టి, హేమక్లుప్తాయాం = సువర్ణముచే నిర్మింపబడినట్టి, సభాయాం = సభామందిరమునందు, నానారత్నమయే = బహురత్ననిర్మితమైన, పీఠే = పీఠమునందు, యథావిధి = శాస్త్రముననుసరించి, కల్పయిత్వా = ఆసీనుని చేసి, తతః పశ్చాత్ = అటుపిమ్మట, మహాత్మనా = మహనీయుడైనట్టి, వసిష్ఠేన = వసిష్ఠ మహర్షిచేతను, ఋత్విగ్భిః = ఋత్విక్కులచేతను, తేన కిరీటేన = ఆ కిరీటముతోడను, భూషణైః చైవ = ఆభరణముల తోడను, రాఘవః = శ్రీరాముడు, సమయోక్ష్యత = అలంకరింపబడెను.

తాత్పర్యము :– ఏ కిరీటమును పూర్వము బ్రహ్మదేవుడు స్వయముగ నిర్మింపజేసి యుండెనో, ఏ కిరీటముచే పూర్వము వైవస్వతమను వభిషేకింపబడెనో అది మొదలు ఆతని వంశమునందలి రాజులెల్లరును వరుసగా ఏ కిరీటముతో నభిషేకించబడిరో, రత్నశోభితమై వెల్గొందుచున్నట్టి ఆ దివ్యకిరీటమును, మహాజనులతో విలసిల్లుచు ఉజ్జ్వలములైన రత్నములతో ప్రకాశించుచున్నట్టి ఆ సభాభవనమునందు ముందుగా ఒక రత్నమయపీఠముపై నిల్పి యథాశాస్త్రముగా నర్చించి మహాత్ముడైన వసిష్ఠుడు, మిగిలిన ఋత్విక్కులతో గూడి రత్నమయసింహాసనముపై నధిష్ఠించియున్న శ్రీరాముని ఆ అర్చింపబడిన కిరీటముతోడను వివిధములైన ఆభరణములతోడను అలంకరించెను.

శ్లో॥ ఛత్రం తు తస్య జగ్రాహ శత్రుఘ్నః పాండురం శుభమ్ ।
శ్వేతం చ వాలవ్యజనం సుగ్రీవో వానరేశ్వరః ॥ 10

పదచ్ఛేదము :– ఛత్రం – తు – తస్య – జగ్రాహ – శత్రుఘ్నః – పాండురం – శుభమ్, శ్వేతం – చ – వాలవ్యజనం – సుగ్రీవః – వానరేశ్వరః ॥

అన్వయక్రమము :– శత్రుఘ్నః తస్య పాండురం శుభం ఛత్రం జగ్రాహ, వానరేశ్వరః సుగ్రీవః చ శ్వేతం వాలవ్యజనం జగ్రాహ.

ప్రతిపదార్థము :– శత్రుఘ్నః = శత్రుఘ్నుడు, తస్య = ఆ శ్రీరామునకు, శుభం = మంగళకరమైన, పాండురం ఛత్రం = తెల్లని గొడుగును, జగ్రాహ = పట్టెను, వానరేశ్వరః = వానరప్రభువైన, సుగ్రీవః = సుగ్రీవుడు, శ్వేతం వాలవ్యజనం = తెల్లని చామరమును, జగ్రాహ = పట్టెను.

తాత్పర్యము :– అట్లు పట్టాభిషిక్తుడైన శ్రీరామునకు శత్రుఘ్నుడు మంగళప్రదమైన శ్వేతఛత్రమును పట్టి నిలచెను. వానరరాజైన సుగ్రీవుడు తెల్లని చామరమును వీచుచుండెను.

శ్లో॥ అపరం చంద్రసంకాశం వాలవ్యజన ముత్తమమ్ ।
హృష్టో రామస్య జగ్రాహ రాక్షసేంద్రో విభీషణః ॥ 11

పదచ్ఛేదము :– అపరం – చంద్రసంకాశం – వాలవ్యజనమ్ – ఉత్తమమ్, హృష్టః – రామస్య – జగ్రాహ – రాక్షసేంద్రః – విభీషణః ॥

అన్వయక్రమము :– హృష్టః రాక్షసేంద్రః విభీషణః రామస్య చంద్రసంకాశమ్ ఉత్తమం అపరం వాలవ్యజనం జగ్రాహ.

ప్రతిపదార్థము :– హృష్టః = ఆనందభరితుడైన, రాక్షసేంద్రః = రాక్షసరాజగు, విభీషణః = విభీషణుడు, రామస్య = శ్రీరామునకు, చంద్రసంకాశం = చంద్రుని బోలినట్టి, ఉత్తమం = శ్రేష్ఠమైన, అపరం వాలవ్యజనం = ఇంకొక వింజామరమును, జగ్రాహ = పట్టెను.

తాత్పర్యము :– మహానందభరితుడైన రాక్షసరాజగు విభీషణుడు చంద్రునివలె తెల్లని కాంతుల నీనుచున్నట్టి వేరొక వింజామరమునుపట్టి శ్రీరామునకు వీచుచుండెను.

శ్లో॥ మాలాం జ్వలంతీం వపుషా కాంచనీం శతపుష్కరామ్ ।
రాఘవాయ దదౌ వాయు ర్వాసవేన ప్రచోదితః ॥ 12

పదచ్ఛేదము :- మాలాం - జ్వలంతీం - వపుషా - కాంచనీం - శతపుష్కరామ్, రాఘవాయ - దదౌ - వాయుః - వాసవేన - ప్రచోదితః ॥

అన్వయక్రమము :- వపుషా జ్వలంతీం కాంచనీం శతపుష్కరాం మాలాం వాసవేన ప్రచోదితః వాయుః రాఘవాయ దదౌ.

ప్రతిపదార్థము :- వపుషా = దేవేంద్రునిచే, ప్రచోదితః = ప్రేరేపింపబడినవాడై, వాయుః = వాయుదేవుడు, రాఘవాయ = శ్రీరామునకు, వపుషా = స్వరూపముచే, జ్వలంతీం = మిక్కిలిగా ప్రకాశించుచున్నట్టి, కాంచనీం = సువర్ణమయమైనట్టి, శత పుష్కరాం = నూరు తామరపూవులుగల, మాలాం = మాలికను, దదౌ = ఇచ్చెను.

తాత్పర్యము :- అప్పుడు శ్రీరామునకు దేవేంద్రుడు వాయుదేవునిద్వారా గొప్పకాంతితో ప్రజ్వరిల్లుచున్న స్వర్ణమయమైన నూరుతామరపువ్వులుగల ఒక మాలికను కానుకగా సమర్పించెను.

శ్లో॥ సర్వరత్నసమాయుక్తం మణిరత్నవిభూషితమ్ ।
ముక్తాహారం నరేంద్రాయ దదౌ శక్రప్రచోదితః ॥ **13**

పదచ్ఛేదము :- సర్వరత్నసమాయుక్తం - మణిరత్నవిభూషితమ్, ముక్తాహారం - నరేంద్రాయ - దదౌ - శక్రప్రచోదితః ॥

అన్వయక్రమము :- నరేంద్రాయ శక్రప్రచోదితః (వాయుః) సర్వరత్నసమాయుక్తం మణిరత్నవిభూషితం ముక్తాహారం దదౌ.

ప్రతిపదార్థము :- శక్రప్రచోదితః = దేవేంద్రునిచే ప్రేరేపింపబడినట్టి, (వాయుః = వాయుదేవుడు), నరేంద్రాయ = శ్రీరామునికొరకు, సర్వరత్నసమాయుక్తం = సర్వవిధములైన రత్నములతో గూడియున్నదియును, మణిరత్నవిభూషితం = శ్రేష్ఠమైన ప్రత్యేకమణితో నలంకరింపబడినదియునగు, ముక్తాహారం = ముత్యాలహారమును గూడ, దదౌ = ఒసగెను.

తాత్పర్యము :- దేవేంద్రునిచే ప్రోత్సహించబడిన వాయుదేవుడు శ్రీరామునకు అప్పుడు నవవిధరత్నములతో గూడి నాయకమణిగా అమూల్యమైన వేరొక గొప్పమణితో నిర్మింపబడిన వేరొక మంచి ముత్యాలహారమునుగూడ కానుకగా నర్పించెను.

శ్లో॥ ప్రజగు ర్దేవగంధర్వా ననృతు శ్చాప్సరోగణాః ।
అభిషేకే తదర్హస్య తదా రామస్య ధీమతః ॥ **14**

పదచ్ఛేదము :– ప్రజగుః – దేవగంధర్వాః – ననృతుః – చ – అప్సరోగణాః, అభిషేకే – తదర్హస్య – తదా – రామస్య – ధీమతః ॥

అన్వయక్రమము :– తదా ధీమతః తదర్హస్య రామస్య అభిషేకే దేవగంధర్వాః ప్రజగుః, అప్సరోగణాః ననృతుః చ.

ప్రతిపదార్థము :– తదా = అప్పుడు, ధీమతః = బుద్ధిశాలియైన, తదర్హస్య = పట్టాభిషేకమున కర్హుడైనట్టి, రామస్య = శ్రీరాముని యొక్క, అభిషేకే = అభిషేకమున, దేవగంధర్వాః = దేవతలు గంధర్వులును, ప్రజగుః = గొప్పగా పాడిరి. అప్సరోగణాః = అప్సరసల సమూహములు, ననృతుః చ = నృత్యమును గూడ చేసిరి.

తాత్పర్యము :– మహాత్ముడైన సర్వసమర్థుడగు శ్రీరాముని పట్టాభిషేక సమయమునందు దేవగంధర్వులు మహానందముతో గానము చేసిరి. అప్సర స్త్రీలు హర్షాతిశయముతో నృత్య మొనర్చిరి.

శ్లో॥ భూమి స్సస్యవతీ చైవ ఫలవంతశ్చ పాదపాః ।
గంధవంతి చ పుష్పాణి బభూవూ రాఘవోత్సవే ॥ 15

పదచ్ఛేదము :– భూమిః – సస్యవతీ – చ – ఏవ – ఫలవంతః – చ – పాదపాః, గంధవంతి – చ – పుష్పాణి – బభూవుః – రాఘవోత్సవే ॥

అన్వయక్రమము :– రాఘవోత్సవే భూమిః సస్యవతీ (బభూవ), పాదపాః ఫలవంతః (బభూవుః), పుష్పాణి గంధవంతి (బభూవుః).

ప్రతిపదార్థము :– రాఘవోత్సవే = శ్రీరాముని పట్టాభిషేకోత్సవ సమయమున, భూమిః = భూమి, సస్యవతీ = సస్యసంపన్నమైనది, (బభూవ = ఆయెను), పాదపాః = వృక్షములు, ఫలవంతః = ఫలసమృద్ధిగలవి, (బభూవుః = అయినవి), పుష్పాణి = పుష్పములు, గంధవంతి = పరిమళ భరితములు, (బభూవుః = అయినవి).

తాత్పర్యము :– శ్రీరాముని వియోగముచే ప్రజలతోబాటు చింతలో మునిగియున్న ప్రకృతియంతయును శ్రీరామపట్టాభిషేకోత్సవమునకు ప్రజలవలెనే మహానందము ననుభవించినది. భూమి ఎల్లయెడలను సకలసస్యసంభరితమై ఒప్పెను. వృక్షములన్నియు ఫలసమృద్ధి వహించియుండెను, పుష్పములు దివ్యమైన సౌరభమును వెదజల్లుచుండెను.

శ్లో॥ సహస్రశత మశ్వానాం ధేనూనాం చ గవాం తథా ।
దదౌ శతం వృషాన్ పూర్వం ద్విజేభ్యో మనుజర్షభః ॥ 16

పదచ్ఛేదము :– సహస్రశతం – అశ్వానాం – ధేనూనాం – చ – గవాం – తథా, దదౌ – శతం – వృషాన్ – పూర్వం – ద్విజేభ్యః – మనుజర్షభః ॥

అన్వయక్రమము :– మనుజర్షభః పూర్వం ద్విజేభ్యః అశ్వానాం చ ధేనూనాం చ తథా గవాం చ సహస్రశతం శతం వృషాన్ చ దదౌ.

ప్రతిపదార్థము :– మనుజర్షభః = మనుజశ్రేష్ఠుడైన శ్రీరాముడు, పూర్వం = ముందుగా, ద్విజేభ్యః = బ్రాహ్మణులకొరకు, అశ్వానాం = అశ్వములయొక్కయు, ధేనూనాం = పాడియావులయొక్కయు, గవాం = శ్రేష్ఠమైన గోవులయొక్కయు, సహస్రశతం = లక్షసంఖ్యగలవానిని, శతం = వందసంఖ్యగల, వృషాన్ = వృషభములను, దదౌ = ఇచ్చెను.

తాత్పర్యము :– పట్టాభిషిక్తుడైన శ్రీరాముడు మొట్టమొదట బ్రాహ్మణులకు లక్ష అశ్వములను, లక్ష ధేనువులను, లక్ష మేలుజాతిగోవులను, వంద ఆబోతులను దాన మొసగెను.

శ్లో॥ త్రింశత్కోటీ ర్హిరణ్యస్య బ్రాహ్మణేభ్యో దదౌ పునః ।
నానాభరణవస్త్రాణి మహార్హాణి చ రాఘవః ॥ **17**

పదచ్ఛేదము :– త్రింశత్కోటీః – హిరణ్యస్య – బ్రాహ్మణేభ్యః – దదౌ – పునః, నానాభరణవస్త్రాణి – మహార్హాణి – చ – రాఘవః ॥

అన్వయక్రమము :– రాఘవః పునః బ్రాహ్మణేభ్యః హిరణ్యస్య త్రింశత్‌కోటీః మహార్హాణి నానాభరణవస్త్రాణి చ దదౌ.

ప్రతిపదార్థము :– రాఘవః = శ్రీరాముడు, పునః = తిరిగి, బ్రాహ్మణేభ్యః = విప్రుల కొరకు, హిరణ్యస్య = బంగారు నాణెములయొక్క, త్రింశత్ కోటీః = ముప్పదికోట్లను, మహార్హాణి = మిక్కిలి విలువైనట్టి, నానాభరణవస్త్రాణి చ = బహువిధములగు భూషణములను, వస్త్రములను, దదౌ = ఒసగెను.

తాత్పర్యము :– శ్రీరాము డప్పుడు బ్రాహ్మణులకు తిరిగి ముప్పది కోట్ల బంగారు నాణెములను గొప్ప విలువగల్గినట్టి బహువిధములగు ఆభరణములను చీనాం బరములను దాన మొసగెను.

శ్లో॥ అర్కరశ్మిప్రతీకాశాం కాంచనీం మణివిగ్రహామ్ ।
సుగ్రీవాయ స్రజం దివ్యాం ప్రాయచ్ఛ న్మనుజేశ్వరః ॥ **18**

పదచ్ఛేదము :- అర్కరశ్మిప్రతీకాశాం - కాంచనీం - మణివిగ్రహామ్, సుగ్రీవాయ - స్రజం - దివ్యాం - ప్రాయచ్ఛత్ - మనుజేశ్వరః ॥

అన్వయక్రమము :- మనుజేశ్వరః సుగ్రీవాయ అర్కరశ్మిప్రతీకాశాం మణివిగ్రహాం దివ్యాం కాంచనీం స్రజం ప్రాయచ్ఛత్.

ప్రతిపదార్థము :- మనుజేశ్వరః = మహారాజైన శ్రీరాముడు, సుగ్రీవాయ = సుగ్రీవునికి, అర్కరశ్మిప్రతీకాశాం = సూర్యకిరణములవలె ప్రకాశించునదియును, మణివిగ్రహాం = రత్నవిగ్రహము గలదియును, దివ్యాం = దివ్యమైనట్టిదియును అగు, కాంచనీం = సువర్ణనిర్మితమైనట్టి, దివ్యాం = దివ్యమైన, స్రజం = మాలికను, ప్రాయచ్ఛత్ = ఒసగెను.

తాత్పర్యము :- పిమ్మట శ్రీరాముడు సుగ్రీవునకు సూర్యకిరణముల ప్రకాశమువంటి తేజస్సు గలిగి మణివిగ్రహములతో కూడియున్న ఒకానొక దివ్యమైన సువర్ణమాలికను బహుమానముగా నొసగెను.

శ్లో॥ వైదూర్యమణిచిత్రే చ వజ్రరత్నవిభూషితే ।
వాలిపుత్రాయ ధృతిమా నంగదా యాంగదే దదౌ ॥ 19

పదచ్ఛేదము :- వైదూర్యమణిచిత్రే - చ - వజ్రరత్నవిభూషితే, వాలిపుత్రాయ - ధృతిమాన్ - అంగదాయ - అంగదే - దదౌ ॥

అన్వయక్రమము :- ధృతిమాన్ వాలిపుత్రాయ అంగదాయ వైదూర్యమణిచిత్రే వజ్రరత్నవిభూషితే చ అంగదే దదౌ.

ప్రతిపదార్థము :- ధృతిమాన్ = ఉత్సాహవంతుడైన శ్రీరాముడు, వాలిపుత్రాయ = వాలికుమారుడైనట్టి, అంగదాయ = అంగదుని కొరకు, వైదూర్యమణిచిత్రే = వైడూర్యరత్నములయొక్క చిత్రములు గలవియును, వజ్రరత్నవిభూషితే చ = గొప్ప వజ్రములతో పొదగబడియున్నవియునగు, అంగదే = రెండు భుజకీర్తులను, దదౌ = ఇచ్చెను.

తాత్పర్యము :- తరువాత శ్రీరాముడు వాలిపుత్రుడైన అంగదునకు సుందరమైన వైడూర్యరత్నములును గొప్పగొప్ప వజ్రములును పొదిగిన సుందరమైన రెండు భుజకీర్తులను ఇచ్చెను.

శ్లో॥ మణిప్రవరజుష్టం చ ముక్తాహారమనుత్తమమ్ ।
సీతాయై ప్రదదౌ రామ శ్చంద్రరశ్మిసమప్రభమ్ ॥ 20

పదచ్ఛేదము :- మణిప్రవరజుష్టం - చ - ముక్తాహారమ్ - అనుత్తమమ్, సీతాయై - ప్రదదౌ - రామః - చంద్రరశ్మిసమప్రభమ్ ॥

అన్వయక్రమము :- రామః మణిప్రవరజుష్టం చంద్రరశ్మిసమప్రభమ్ అనుత్తమం చ ముక్తాహారం సీతాయై ప్రదదౌ.

ప్రతిపదార్థము :- రామః = శ్రీరాముడు, మణిప్రవరజుష్టం = శ్రేష్ఠమైన రత్నములతో గూడినదియును, చంద్రరశ్మిసమప్రభం = చంద్రకిరణములతో సమానమైన కాంతి గలదియునగు, అనుత్తమం చ = సర్వశ్రేష్ఠమైనదియునగు, ముక్తాహారం = ముత్యాలహారమును, సీతాయై = సీతాదేవికొరకు, ప్రదదౌ = ఇచ్చెను.

తాత్పర్యము :- అటుపిమ్మట శ్రీరాముడు శ్రేష్ఠమైన రత్నములతో నిర్మింపబడి చంద్రకిరణములవంటి కాంతులను విరజిమ్ముచున్న సర్వశ్రేష్ఠమైన ఒక మంచి ముత్యాలహారమును సీతాదేవి కొసగెను.

శ్లో॥ అరజే వాససీ దివ్యే శుభా న్యాభరణాని చ ।
అవేక్షమాణా వైదేహీ ప్రదదౌ వాయుసూనవే ॥ 21

పదచ్ఛేదము :- అరజే - వాససీ - దివ్యే - శుభాని - ఆభరణాని - చ, అవేక్షమాణా - వైదేహీ - ప్రదదౌ - వాయుసూనవే ॥

అన్వయక్రమము :- వైదేహీ అవేక్షమాణా వాయుసూనవే అరజే దివ్యే వాససీ చ, శుభాని ఆభారణాని చ ప్రదదౌ.

ప్రతిపదార్థము :- వైదేహీ = జానకీదేవి, అవేక్షమాణా = (భర్తను) చూచుచున్నదై, అరజే = ధూళియంటనట్టి, దివ్యే = దివ్యమైనట్టి, వాససీ = రెండు వస్త్రములను, శుభాని = మంగళకరమైనట్టి, ఆభరణాని చ = ఆభరణములను, వాయుసూనవే = వాయునందనునకు, ప్రదదౌ = ఒసగెను.

తాత్పర్యము :- అంత జానకీదేవి తన భర్త ముఖమును విలోకించుచు ధూళియంటనట్టి దివ్యమైన వస్త్రయుగ్మమును, మంగళకరమైనట్టి పెక్కు ఆభరణములను హనుమకు బహుమానముగా నొసగెను.

శ్లో॥ అవము చ్యాత్మనః కంఠా ద్ధారం జనకనందినీ ।
అవైక్షత హరీ న్సర్వా న్భర్తారం చ ముహుర్ముహుః ॥ 22

పదచ్ఛేదము :- అవముచ్య - ఆత్మనః - కంఠాత్ - హారం - జనకనందినీ, అవైక్షత - హరీన్ - సర్వాన్ - భర్తారం - చ - ముహుః - ముహుః ॥

అన్వయక్రమము :- జనకనందినీ ఆత్మనః కంఠాత్ హారమ్ అవముచ్య, సర్వాన్ హరీన్ భర్తారం చ ముహుః ముహుః అవైక్షత.

ప్రతిపదార్థము :- జనకనందినీ = జనకమహారాజపుత్రికయైన సీతాదేవి, ఆత్మనః = తనయొక్క, కంఠాత్ = కంఠమునుండి, హారం = ముత్యాలహారమును, అవముచ్య = ఈవలికి తీసి, హరీన్ = వానరులను, సర్వాన్ = అందరిని, భర్తారం చ = భర్తను, ముహుః ముహుః = మరల మరల, అవైక్షత = చూచుచుండెను.

తాత్పర్యము :- పిమ్మట జానకీదేవి తన కంఠమునందు అలంకరించుకొన్న దివ్యమైన ముత్యాలహారమును ఈవలికి తీసి చేత బట్టుకొని అచ్చటనున్న వానరులందరివైపును, భర్తముఖమును మరల మరల చూచుచుండెను.

శ్లో॥ తా మింగితజ్ఞ స్సంప్రేక్ష్య బభాషే జనకాత్మజామ్ ।
ప్రదేహి సుభగే హారం యస్య తుష్టాసి భామిని ।
పౌరుషం విక్రమో బుద్ధి ర్యస్మి న్నేతాని సర్వశః ॥ 23

పదచ్ఛేదము :- తామ్ - ఇంగితజ్ఞః - సంప్రేక్ష్య - బభాషే - జనకాత్మజామ్, ప్రదేహి - సుభగే - హారం - యస్య - తుష్టా - అసి - భామిని, పౌరుషం - విక్రమః - బుద్ధిః - యస్మిన్ - ఏతాని - సర్వశః ॥

అన్వయక్రమము :- ఇంగితజ్ఞః (రామః) తాం జనకాత్మజాం సంప్రేక్ష్య బభాషే. సుభగే! భామిని! యస్య (త్వం) తుష్టా అసి పౌరుషం విక్రమః బుద్ధిః ఏతాని సర్వశః యస్మిన్ (సంతి) హారం (తస్మై) ప్రదేహి.

ప్రతిపదార్థము :- ఇంగితజ్ఞః = పరుల యభిప్రాయమును తెలిసికొనగల్గిన వాడైనట్టి, (రామః = శ్రీరాముడు), తాం = ఆ, జనకాత్మజాం = జానకీదేవిని, సంప్రేక్ష్య = చూచి, బభాషే = పలికెను, సుభగే = ఓ సౌభాగ్యవతీ! యస్య = ఎవనికి, త్వం = నీవు, తుష్టా అసి = సంతోషించినదాన వగుచున్నావో, యస్మిన్ = ఎవనియం దయితే, పౌరుషం = పౌరుషము, విక్రమః = పరాక్రమము, (బుద్ధిః = తెలివి అను), ఏతాని = ఈ సద్గుణములు, సర్వశః = అన్నివిధముల, (సంతి = ఉన్నవో), హారం = హారమును, తస్మై = వానికి, ప్రదేహి = ఒసగుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

"సుభగే యస్య తుష్టాసి" - అనుటచే నీ సౌభాగ్యమునకు కారణమైన మహనీయుడని నీ వెవనియెడ సంతుష్టి నొందియున్నావో అట్టి గుణశాలి కొసగుమని

ఆ సంబోధనలోనే ధ్వనింపచేయబడినది.

తాత్పర్యము :- తనవైపు చూచుచున్న సీతాదేవియొక్క మనస్సునందలి అభిప్రాయమును శ్రీరాముడు వెంటనే గ్రహించి ఆమెకు తన అనుమతిని తెలుపుచు ఆమెను జూచి "ఓ కోమలీ! నీ వెవ్వనియెడ సంతోషము నొందియుంటివో ఎవ్వనియందు సర్వకార్య నిర్వహణములయందును పౌరుషము పరాక్రమము వివేకము అను సద్గుణములు నిత్యము వెలయుచుండునో అట్టి ఉత్తమునకు నీ వీ హారమును బహుమానముగా ఇమ్ము అనెను.

శ్లో॥ దదౌ సా వాయుపుత్రాయ తం హార మసితేక్షణా ।
హనుమాం స్తేన హారేణ శుశుభే వానరర్షభః ।
చంద్రాంశుచయగౌరేణ శ్వేతాభ్రేణ యథాఽచలః ॥ 24

పదచ్ఛేదము :- దదౌ - సా - వాయుపుత్రాయ - తం - హారమ్ - అసితేక్షణా, హనుమాన్ - తేన - హారేణ - శుశుభే - వానరర్షభః, చంద్రాంశుచయగౌరేణ - శ్వేతాభ్రేణ - యథా - అచలః ॥

అన్వయక్రమము :- సా అసితేక్షణా తం హారం వాయుపుత్రాయ దదౌ, వానరర్షభః తేన హారేణ చంద్రాంశుచయగౌరేణ శ్వేతాభ్రేణ అచలః యథా శుశుభే.

ప్రతిపదార్థము :- సా = ఆ, అసితేక్షణా = నల్లని కన్నులుగల సీతాదేవి, తం = ఆ, హారం = హారమును, వాయుపుత్రాయ = వాయునందనునకు, దదౌ = ఇచ్చెను, హనుమాన్ = ఆ వాయునందనుడైన, వానరర్షభః = వానరశ్రేష్ఠుడు, తేన = ఆ, హారేణ = ముత్యాలహారముచే, చంద్రాంశుచయగౌరేణ = చంద్రకిరణముల యొక్క సమూహముచే తెల్లనైనట్టి, శ్వేతాభ్రేణ = తెల్లని మేఘముచే, అచలః యథా = పర్వతమువలె, శుశుభే = ప్రకాశించెను.

తాత్పర్యము :- సీతాదేవి అట్లు భర్త అనుమతిని పొంది తన చేతిలోని ఆ ముత్యాలహారమును సముద్రలంఘనముచే బలమును, లంకాదహనముచే విక్రమమును, అశోకవనికాప్రవేశముచే బుద్ధిబలమును చూపినట్టి వాయునందనునకు బహుమానముగ నొసగెను. దివ్యమైన ఆ హారమును తన వక్షమున ధరించిన హనుమ చంద్రకిరణముల కాంతిచే మిక్కిలి తెల్లనైయున్న శరత్కాలపు మేఘముతో కూడియున్న పర్వతమువలె మిక్కిలి శోభిల్లెను.

శ్లో॥ తతో ద్వివిదమైందాభ్యాం నీలాయ చ పరంతపః ।
సర్వా న్కామగుణా న్వీక్ష్య ప్రదదౌ వసుధాధిపః ॥ 25

పదచ్ఛేదము :– తతః – ద్వివిదమైందాభ్యాం – నీలాయ – చ – పరంతపః, సర్వాన్ – కామగుణాన్ – వీక్ష్య – ప్రదదౌ – వసుధాధిపః ॥

అన్వయక్రమము :– తతః పరంతపః వసుధాధిపః వీక్ష్య ద్వివిదమైందాభ్యాం నీలాయ చ సర్వాన్ కామగుణాన్ ప్రదదౌ.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, పరంతపః = శత్రుమర్దనుడైన, వసుధాధిపః = రామభూపతి, వీక్ష్య = చూచి, ద్వివిదమైందాభ్యాం = ద్వివిదునకును మైందునకును, నీలాయ చ = నీలునకును, సర్వాన్ = సమస్తమైన, కామగుణాన్ = ఇష్టములైన వస్తువులను, ప్రదదౌ = బహూకరించెను.

తాత్పర్యము :– అటుపిమ్మట శత్రుభీకరుడైన శ్రీరాముడు అచ్చటి వానరవీరులను జూచుచు కవలలైన ద్వివిదునకును మైందునకును మరియు నీలునకును వారివారికి అభీష్టములైనట్టి శ్రేష్ఠములైన ఆభరణాదికములను బహూకరించెను.

శ్లో॥ సర్వే వానరవృద్ధాశ్చ యే చాన్యే వానరేశ్వరాః ।
వాసోభి ర్భూషణైశ్చైవ యథార్హం ప్రతిపూజితాః ॥ 26

పదచ్ఛేదము :– సర్వే – వానరవృద్ధాః – చ – యే – చ – అన్యే – వానరేశ్వరాః, వాసోభిః – భూషణైః – చ – ఏవ – యథార్హం – ప్రతిపూజితాః ॥

అన్వయక్రమము :– సర్వే వానరవృద్ధాః చ అన్యే యే వానరేశ్వరాః (తే) చ వాసోభిః భూషణైః చ ఏవ యథార్హం ప్రతిపూజితాః.

ప్రతిపదార్థము :– సర్వే వానరవృద్ధాః చ = ఎల్లవానరవృద్ధులును, అన్యే = ఇతరులైన, యే వానరేశ్వరాః = ఏ వానరశ్రేష్ఠులుగలరో, (తే) చ = వారును, వాసోభిః = వస్త్రములచేతను, భూషణైః చైవ = ఆభరణములచేతను, యథార్హం = అర్హత ననుసరించి, ప్రతిపూజితాః = సత్కరింపబడిరి.

తాత్పర్యము :– పిమ్మట శ్రీరాముడు వానరవృద్ధు లెల్లరిని, మిగిలిన కపిశ్రేష్ఠులను అందరిని గూడ వారి వారి అర్హతకు తగిన విధముగ విలువగల వస్త్రములతోడను ఆభరణములతోడను సత్కరించెను.

శ్లో॥ విభీషణోఽథ సుగ్రీవో హనుమాన్ జాంబవాం స్తథా ।
సర్వే వానరముఖ్యాశ్చ రామేణాక్లిష్టకర్మణా ॥ 27

శ్లో॥ యథార్హం పూజితా స్సర్వైః కామైః రత్నైశ్చ పుష్కలైః ।
ప్రహృష్టమనస స్సర్వే జగ్మురేవ యథాగతమ్ ॥ 28

పదచ్ఛేదము :– విభీషణః – అథ – సుగ్రీవః – హనుమాన్ – జాంబవాన్ – తథా, సర్వే – వానరముఖ్యాః – చ – రామేణ – అక్లిష్టకర్మణా, యథార్హం – పూజితాః – సర్వైః – కామైః – రత్నైః – చ – పుష్కలైః, ప్రహృష్టమనసః – సర్వే – జగ్ముః – ఏవ – యథాగతమ్ ॥

అన్వయక్రమము :– అథ అక్లిష్టకర్మణా రామేణ విభీషణః సుగ్రీవః హనుమాన్ జాంబవాన్ తథా సర్వే వానరముఖ్యాః చ యథార్హం పుష్కలైః రత్నైః చ సర్వైః కామైః చ పూజితాః (సంతః) సర్వే ప్రహృష్టమనసః యథాగతం జగ్ముః.

ప్రతిపదార్థము :– అథ = అటుపిమ్మట, అక్లిష్టకర్మణా = క్లేశమును గల్గింపని కార్యములు గల్గినట్టి, రామేణ = శ్రీరామునిచే, విభీషణః = విభీషణుడు, సుగ్రీవః = సుగ్రీవుడును, హనుమాన్ = హనుమయును, జాంబవాన్ = జాంబవంతుడును, తథా = అట్లుగా, సర్వే వానరముఖ్యాశ్చ = వానరులలో ముఖ్యులెల్లరును, పుష్కలైః = సమృద్ధములైన, రత్నైః చ = రత్నములతోడను, సర్వైః = సమస్తమైన, కామైః = ఇష్టములైన వస్తువులతోడను, యథార్హం = అర్హతకు తగినట్లుగా, పూజితాః (సంతః) = పూజింపబడినవారై, ప్రహృష్టమనసః = మిక్కిలి ఆనందము నొందిన మనస్సుగల వారగుచు, సర్వే = అందరును, యథాగతం = వచ్చినట్లుగనే, జగ్ముః = వెడలిపోయిరి.

తాత్పర్యము :– అటుపిమ్మట ఇతరుల క్లేశమును సహింపని శ్రీరామచంద్రుడు విభీషణుని, సుగ్రీవుని, హనుమంతుని, జాంబవంతుని మరియు ప్రధానులైన వానరవీరుల నెల్లరిని వారి వారి అర్హత ననుసరించి పుష్కలములైన రత్నాభరణముల తోడను వారివారికి అభీష్టములైన ఇతరవస్తువులతోడను ఎల్లరిని సత్కరింపగా వారందరును ఎంత ఆనందముతో అయోధ్యకు వచ్చిరో అంత సంతోషముతో తమ తమ నివాసములకు వెడలిపోయిరి.

శ్లో॥ నత్వా సర్వే మహాత్మానం తత స్తే ప్లవగర్షభాః ।
విసృష్టాః పార్థివేంద్రేణ కిష్కింధా మభ్యుపాగమన్ ॥ 29

పదచ్ఛేదము :– నత్వా – సర్వే – మహాత్మానం – తతః – తే – ప్లవగర్షభాః, విసృష్టాః – పార్థివేంద్రేణ – కిష్కింధామ్ – అభ్యుపాగమన్ ॥

అన్వయక్రమము :– తతః తే ప్లవగర్షభాః సర్వే మహాత్మానం నత్వా పార్థివేంద్రేణ విసృష్టాః కిష్కింధామ్ అభ్యుపాగమన్.

ప్రతిపదార్థము :– తతః = పిమ్మట, తే = ఆ, ప్లవగర్షభాః = వానరశ్రేష్ఠులు, సర్వే = ఎల్లరును, మహాత్మానం = మహనీయుడైన శ్రీరామునికి, నత్వా = మ్రొక్కి, పార్థివేంద్రేణ

= శ్రీరామునిచే, విసృష్టాః = సెలవొసంగబడినవారై, కిష్కింధాం = కిష్కింధను, అభ్యుపాగమన్ = చేరుకొనిరి.

తాత్పర్యము :– అటుపిమ్మట ఆ వానరశ్రేష్ఠులెల్లరును మహాత్ముడైన శ్రీరామచంద్రునికి మ్రొక్కి ఆ పట్టాభిరాముని కడ సెలవుగైకొని కిష్కింధకు చేరుకొనిరి.

శ్లో॥ సుగ్రీవో వానరశ్రేష్ఠో దృష్ట్వా రామాభిషేచనమ్ ।
పూజితశ్చైవ రామేణ కిష్కింధాం ప్రావిశత్పురీమ్ ॥ 30

పదచ్ఛేదము :– సుగ్రీవః – వానరశ్రేష్ఠః – దృష్ట్వా – రామాభిషేచనమ్, పూజితః – చ – ఏవ – రామేణ – కిష్కింధాం – ప్రావిశత్ – పురీమ్ ॥

అన్వయక్రమము :– వానరశ్రేష్ఠః సుగ్రీవః రామాభిషేచనం దృష్ట్వా రామేణ పూజితః కిష్కింధాం పురీం ప్రావిశత్.

ప్రతిపదార్థము :– వానరశ్రేష్ఠః = కపిముఖ్యుడైనట్టి, సుగ్రీవః = సుగ్రీవుడు, రామాభిషేచనం = శ్రీరాముని పట్టాభిషేకమును, దృష్ట్వా = చూచి, రామేణ = శ్రీరామునిచే, పూజితః = సత్కరింపబడినవాడై, కిష్కింధాం పురీం = కిష్కింధా నగరమును, ప్రావిశత్ = ప్రవేశించెను.

తాత్పర్యము :– వానరరాజైన సుగ్రీవుడు శ్రీరామచంద్రుని పట్టాభిషేక మహోత్సవమును కనులార తిలకించి రామచంద్రునిచే గౌరవభావముతో వీడ్కోలు నొంది నిజనగరమైన కిష్కింధకు చేరుకొనెను.

శ్లో॥ రామేణ సర్వకామైశ్చ యథార్హం ప్రతిపూజితః ।
లబ్ధ్వా కులధనం రాజా లంకాం ప్రాయా ద్విభీషణః ॥ 31

పదచ్ఛేదము :– రామేణ – సర్వకామైః – చ – యథార్హం – ప్రతిపూజితః, లబ్ధ్వా – కులధనం – రాజా – లంకాం – ప్రాయాత్ – విభీషణః ॥

అన్వయక్రమము :– రాజా విభీషణః కులధనం లబ్ధ్వా యథార్హం సర్వకామైః ప్రతిపూజితః లంకాం ప్రాయాత్.

ప్రతిపదార్థము :– రాజా = రాక్షసరాజైన, విభీషణః = విభీషణుడు, కులధనం = తన కులధనమైన రాజ్యమును, లబ్ధ్వా = పొంది, యథార్హం = తగినరీతిగా, సర్వకామైః చ = సమస్తమైన అభీష్టములతో, ప్రతిపూజితః = సత్కరింపబడినవాడై, లంకాం = లంకానగరమును గూర్చి, ప్రాయాత్ = వెడలిపోయెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– "కులధనము" అనగా ఇక్ష్వాకువంశీయుల కులధనమని భావము. శ్రీరంగవిమానమని సంప్రదాయార్థము.

రామానుజీయము :– 'కులధనము' అనగా ఇక్ష్వాకుల కులధనము శ్రీరంగసంజ్ఞకమైన విమానమని పెద్దలు చెప్పుదురు. విభీషణకులక్రమాగతమైనట్టి లంకారాజ్యమని కొందరు చెప్పుచున్నారు.

మహేశ్వరతీర్థులు :– ఇచ్చట "కులధన" శబ్దముచేత ఇదివరలో శ్రీరామునిచే అనుగ్రహింపబడిన రాక్షసకులధనమైనట్టి లంకారాజ్యమని వాల్మీకి యూహ. వెనుకటి విషయమునే జ్ఞాపకము చేయుచున్నాడు. కొందరు కులధనము అనగా ఇక్ష్వాకు కులదైవతమైన రంగవిమానమని వివరించుచున్నారు. అది యుక్తము గాదు; కులధనము అనగా ఇక్ష్వాకుకులధనమని ఎచ్చటను చెప్పబడలేదు. శ్రీరాముని అవతారసమాప్తి సమయమునందు విభీషణునకు ఇక్ష్వాకుకుల దైవతమైన రంగవిమానమును ఒసగినట్లు చెప్పబడుచున్నది. అచ్చట విభీషణునితో శ్రీరాము డిట్లు పలికెను; "కించాన్యద్వక్తు మిచ్ఛామి రాక్షసేంద్ర మహాబల, ఆరాధయ జగన్నాథ మిక్ష్వాకుకులదైవతమ్" పద్మపురాణమునందు అవతారసమాప్తి సమయమునందు తన దగ్గరకు వచ్చిన విభీషణునితో శ్రీరాముడిట్లు పలికెనని యున్నది.

"యావచ్చంద్రశ్చ సూర్యశ్చ యావత్తిష్ఠతి మేదినీ ।
తావద్రమస్వ రాజ్యస్థః కాలే మమ పదం వ్రజ ।
ఇత్యుక్త్వా ప్రదదౌ తస్మై స్వవిశ్లేషాసహిష్ణవే ।
శ్రీరంగశాయినం స్వార్చ్య మిక్ష్వాకుకులదైవతమ్ ।
రంగం విమాన మాదాయ లంకాం ప్రాయా ద్విభీషణః ॥"

అని యవతార సమాప్తి కాలమునందు రంగవిమానము నొసగినట్లు తెలుపబడుటచే ప్రస్తుతసందర్భమునందలి కులధనశబ్దమునకు రాక్షసకులధనమైనట్టి లంకారాజ్యమనియే వాల్మీకి యభిప్రాయమని తెలియవలెను.

తిలక వ్యాఖ్యానముకూడ పై మహేశ్వరతీర్థవ్యాఖ్యానమునే బలపరచినది.

తాత్పర్యము :– పిమ్మట రాక్షసవల్లభుడైన విభీషణుడు తనను యథోచితముగ శ్రీరాముడు అభీష్టవస్తువులతో సత్కరింపగా పూర్వము శ్రీరాముడొసగిన తన కులధనమైన లంకారాజ్యమును పొంది నిజనివాసమైన లంకానగరమున కేగెను.

శ్లో॥ స రాజ్య మఖిలం శాస న్నిహతారి ర్మహాయశాః ।
రాఘవః పరమోదారో రరాజ పరయా ముదా ॥ 32

పదచ్ఛేదము :- సః - రాజ్యమ్ - అఖిలం - శాసన్ - నిహతారిః - మహాయశాః - రాఘవః - పరమోదారః - రరాజ - పరయా - ముదా ॥

అన్వయక్రమము :- మహాయశాః పరమోదారః నిహతారిః సః రాఘవః అఖిలం రాజ్యం శాసన్ పరయా ముదా రరాజ.

ప్రతిపదార్థము :- మహాయశాః = గొప్పకీర్తి గలవాడును, పరమోదారః = గొప్ప ఔదార్యము గలవాడును, నిహతారిః = సంహరింపబడిన శత్రువులు గలవాడునగు, సః = ఆ, రాఘవః = శ్రీరాముడు, అఖిలం = సమస్తమైన, రాజ్యం = రాజ్యమును, శాసన్ = శాసించుచు, పరయా = గొప్పదైన, ముదా = సంతోషముతో, రరాజ = విరాజిల్లెను.

తాత్పర్యము :- శత్రువుల నెల్లరిని సంహరించి శ్రీరామచంద్రుడు మహాకీర్తి వైభవములతో ఉదారమైన హృదయము గల్గి సమస్తరాజ్యమును నిష్కంటకముగా శాసించుచు మహానందముతో విరాజిల్లెను.

శ్లో॥ ఉవాచ లక్ష్మణం రామో ధర్మజ్ఞం ధర్మవత్సలః ॥ 33

పదచ్ఛేదము :- ఉవాచ - లక్ష్మణం - రామః - ధర్మజ్ఞం - ధర్మవత్సలః ॥

అన్వయక్రమము :- ధర్మవత్సలః రామః ధర్మజ్ఞం లక్ష్మణమ్ ఉవాచ.

ప్రతిపదార్థము :- ధర్మవత్సలః = ధర్మమునందు ప్రీతిగలిగినట్టి, రామః = శ్రీరాముడు, ధర్మజ్ఞం = ధర్మము నెరిగియున్నవాడైన, లక్ష్మణం = లక్ష్మణుని గూర్చి, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- ధర్మానుష్ఠానమునందు ప్రీతి గలిగినట్టి శ్రీరాముడు ధర్మవేత్తయైన లక్ష్మణునితో ఇట్లు పలికెను.

శ్లో॥ ఆతిష్ఠ ధర్మజ్ఞ మయా సహేమాం
గాం పూర్వరాజాధ్యుషితాం బలేన ।
తుల్యం మయా త్వం పితృభిర్ధృతా యా
తాం యౌవరాజ్యే ధుర ముద్వహస్వ ॥ 34

పదచ్ఛేదము :- ఆతిష్ఠ - ధర్మజ్ఞ - మయా - సహ - ఇమాం - గాం -

పూర్వరాజాధ్యుషితాం – బలేన – తుల్యం – మయా – త్వం – పితృభిః – ధృతా – యా – తాం – యౌవరాజ్యే – ధురమ్ – ఉద్వహస్వ ॥

అన్వయక్రమము :– ధర్మజ్ఞ! బలేన పూర్వరాజాధ్యుషితాం ఇమాం గాం మయా సహ ఆతిష్ఠ! పితృభిః యా ధృతా తాం ధురం యౌవరాజ్యే (అభిషిక్తః సన్) ఉద్వహస్వ.

ప్రతిపదార్థము :– ధర్మజ్ఞ = ధర్మము నెరిగిన ఓ లక్ష్మణుడా! బలేన = శక్తితో, పూర్వరాజాధ్యుషితాం = పూర్వులైన రాజులచే పరిపాలింపబడినట్టి, ఇమాం = ఈ, గాం = భూమిని, మయా సహ = నాతో గూడ, ఆతిష్ఠ = స్వీకరింపుము, పితృభిః = తండ్రితాతలచే, యా = ఎయ్యది, ధృతా = ధరింపబడినదో, తాం = ఆ, ధురం = భారమును, త్వం = నీవు, మయా = నాతో, తుల్యమ్ = సమానముగా, ఉద్వహస్వ = వహింపుము.

తాత్పర్యము :– ధర్మవేత్తవైన ఓ తమ్ముడా! గొప్పదైన తమ సామర్థ్యముతో మన పూర్వులైన రాజులు ఏలిన ఈ రాజ్యమును నాతో కలిసి నీవును పాలింపుము. యౌవరాజ్యమునందు పట్టాభిషిక్తుడవై మన తాతతండ్రులు వహించిన ఈ రాజ్యభారమును నాతో సమముగా ఇప్పుడు నీవును వహింపవలసియున్నది.

శ్లో॥ సర్వాత్మనా పర్యనునీయమానో
యదా న సౌమిత్రి రుపైతి యోగమ్ ।
నియుజ్యమానోఽపి చ యౌవరాజ్యే
తతోఽభ్యషించ ద్భరతం మహాత్మా ॥ 35

పదచ్ఛేదము :– సర్వాత్మనా – పర్యనునీయమానః – యదా – న – సౌమిత్రిః – ఉపైతి – యోగమ్, నియుజ్యమానః – అపి – చ – యౌవరాజ్యే – తతః – అభ్యషించత్ – భరతం – మహాత్మా ॥

అన్వయక్రమము :– సర్వాత్మనా పర్యనునీయమానః నియుజ్యమానః అపి చ సౌమిత్రిః యదా యోగం న ఉపైతి, తతః మహాత్మా భరతం యౌవరాజ్యే అభ్యషించత్.

ప్రతిపదార్థము :– సర్వాత్మనా = సమస్తవిధముల, పర్యనునీయమానః = బ్రతిమాలబడుచున్న వాడును, నియుజ్యమానః అపి చ = నియోగింపబడుచున్న వాడును అయినప్పటికిని, సౌమిత్రిః = లక్ష్మణుడు, యదా = ఎప్పుడైతే, యోగం = అభిషేక యోగమును, న ఉపైతి = స్వీకరింపకుండెనో, తతః = అప్పుడు, మహాత్మా = మహాత్ముడైన శ్రీరాముడు, యౌవరాజ్యే = యువరాజపదవియందు, భరతం = భరతుని, అభ్యషించత్ = అభిషేకించెను.

తాత్పర్యము :- అనేకవిధములుగా తనను ఆదేశించి ప్రతిమాలినప్పటికిని లక్ష్మణుడు యువరాజపదవిని చేపట్టుటకు అంగీకరింపకుండుటచే మహాత్ముడైన శ్రీరాముడు యువరాజుగా భరతుని అభిషిక్తుని గావించెను.

శ్లో॥ పౌండరీకాశ్వమేధాభ్యాం వాజపేయేన చాసకృత్ ।
అన్యైశ్చ వివిధై ర్యజ్ఞై రయజత్ పార్థివర్షభః ॥ 36

పదచ్ఛేదము :- పౌండరీకాశ్వమేధాభ్యాం - వాజపేయేన - చ - అసకృత్, అన్యైః - చ - వివిధైః - యజ్ఞైః - అయజత్ - పార్థివర్షభః ॥

అన్వయక్రమము :- పార్థివర్షభః పౌండరీకాశ్వమేధాభ్యాం వాజపేయేన చ అన్యైః వివిధైః యజ్ఞైః చ అసకృత్ అయజత్.

ప్రతిపదార్థము :- పార్థివర్షభః = రాజశ్రేష్ఠుడైన శ్రీరాముడు, పౌండరీకాశ్వమేధాభ్యాం = పౌండరీకము అశ్వమేధము అను యాగములచేతను, వాజపేయేన చ = వాజపేయ మను యాగముచేతను, వివిధైః = అనేకవిధములైనట్టి, అన్యైః = ఇతరములైన, యజ్ఞైః = యజ్ఞములతోడను, ఆసకృత్ = పెక్కుమారులు, అయజత్ = దేవతలను తృప్తి పరచెను.

తాత్పర్యము :- రాజశ్రేష్ఠుడైన శ్రీరాముడు అనేక పర్యాయములు పౌండరీకము, అశ్వమేధము, వాజపేయము మున్నగు అనేకములైన యాగములను గావించుచు దేవతలను తృప్తి పరచెను.

శ్లో॥ రాజ్యం దశసహస్రాణి ప్రాప్య వర్షాణి రాఘవః ।
శతాశ్వమేధా నాజహ్రే సదశ్వాన్ భూరిదక్షిణాన్ ॥ 37

పదచ్ఛేదము :- రాజ్యం - దశసహస్రాణి - ప్రాప్య - వర్షాణి - రాఘవః, శతాశ్వమేధాన్ - ఆజహ్రే - సదశ్వాన్ - భూరిదక్షిణాన్ ॥

అన్వయక్రమము :- రాఘవః దశసహస్రాణి వర్షాణి రాజ్యం ప్రాప్య సదశ్వాన్ భూరిదక్షిణాన్ శతాశ్వమేధాన్ ఆజహ్రే.

ప్రతిపదార్థము :- రాఘవః = శ్రీరాముడు, దశసహస్రాణి వర్షాణి = పదివేల సంవత్సరములు, రాజ్యం = రాజ్యమును, ప్రాప్య = పొంది, సదశ్వాన్ = ఉత్తమములైన గుఱ్ఱములు గలిగినవియును, భూరిదక్షిణాన్ = అధికమైన దక్షిణలు గలవియునగు, శతాశ్వమేధాన్ = నూరు అశ్వమేధములను, ఆజహ్రే = యజించెను.

తాత్పర్యము :- శ్రీరాముడు పదివేల సంవత్సరములు రాజ్యపాలనము గావించి శ్రేష్ఠములైన అశ్వములతో విస్తారమైన దక్షిణములతో నూరశ్వమేధయాగములను గావించెను.

శ్లో॥ ఆజానులంబబాహు స్స మహాస్కంధః ప్రతాపవాన్ ।
లక్ష్మణానుచరో రామః పృథివీ మన్వపాలయత్ ॥ 38

పదచ్ఛేదము :- ఆజానులంబబాహుః - సః - మహాస్కంధః - ప్రతాపవాన్ - లక్ష్మణానుచరః - రామః - పృథివీమ్ - అన్వపాలయత్ ॥

అన్వయక్రమము :- ఆజానులంబబాహుః మహాస్కంధః ప్రతాపవాన్ సః రామః లక్ష్మణానుచరః (సన్) పృథివీమ్ అన్వపాలయత్.

ప్రతిపదార్థము :- ఆజానులంబబాహుః = మోకాళ్ళవరకును పొడవైన బాహువులు గలవాడును, మహాస్కంధః = గొప్పవైన భుజశిరస్సులు గలవాడును, ప్రతాపవాన్ = గొప్ప ప్రతాపముగలవాడునగు, రామః = శ్రీరాముడు, లక్ష్మణానుచరః (సన్) = లక్ష్మణుడు అనుచరుడుగా గలవాడై, పృథివీం = భూమిని, అన్వపాలయత్ = పరిపాలించెను.

తాత్పర్యము :- ఆజానుదీర్ఘబాహువులును బలిష్ఠములైన భుజశిరస్సులును గలిగి మహాపరాక్రమసంపన్నుడైయున్న శ్రీరాముడు తమ్ముడైన లక్ష్మణుడు అన్నివిధముల తన ననుసరించుచుండగా ధర్మము తప్పకుండ భూమిని పాలించెను.

శ్లో॥ రాఘవశ్చాపి ధర్మాత్మా ప్రాప్య రాజ్య మనుత్తమమ్ ।
ఈజే బహువిధై ర్యజ్ఞై స్ససుహృజ్జ్ఞాతిబాంధవః ॥ 39

పదచ్ఛేదము :- రాఘవః - చ - అపి - ధర్మాత్మా - ప్రాప్య - రాజ్యమ్ - అనుత్తమమ్, ఈజే - బహువిధైః - యజ్ఞైః - ససుహృజ్జ్ఞాతిబాంధవః ॥

అన్వయక్రమము :- ధర్మాత్మా రాఘవః చ అపి అనుత్తమం రాజ్యం ప్రాప్య ససుహృజ్జ్ఞాతి బాంధవః బహువిధైః యజ్ఞైః ఈజే.

ప్రతిపదార్థము :- ధర్మాత్మా = పరమధార్మికుడైన, రాఘవః చాపి = శ్రీరాముడును, అనుత్తమం = సర్వశ్రేష్ఠమైనట్టి, రాజ్యం = రాజ్యమును, ప్రాప్య = పొంది, ససుహృజ్జ్ఞాతి బాంధవః = మిత్రులు జ్ఞాతులు బంధువులు అయినట్టి వారితో గూడినట్టివాడై, బహువిధైః = అనేకవిధములైన, యజ్ఞైః = యాగాలతో, ఈజే = దేవతలకు ప్రీతి గలిగించెను.

తాత్పర్యము :– ధర్మానుష్ఠానమునందు అమితమైన శ్రద్ధగలిగిన శ్రీరామచంద్రుడు గొప్పదైన అయోధ్యారాజ్యమును పాలించుచు తన మిత్రులతోడను, జ్ఞాతులతోడను, బంధువులతోడను గూడి వివిధములైన యాగములు నెన్నింటినో చేసి దేవతలకు ప్రీతిని గూర్చెను.

శ్లో॥ న పర్యదేవ న్విధవా న చ వ్యాళకృతం భయమ్ ।
న వ్యాధిజం భయం వాపి రామే రాజ్యం ప్రశాసతి ॥ 40

పదచ్ఛేదము :– న – పర్యదేవన్ – విధవాః – న – చ – వ్యాళకృతం – భయమ్, న – వ్యాధిజం – భయం – వా – అపి – రామే – రాజ్యం – ప్రశాసతి ॥

అన్వయక్రమము :– రామే రాజ్యం ప్రశాసతి (సతి) విధవాః న పర్యదేవన్, వ్యాళకృతం భయం చ న (అస్తి). వ్యాధిజం భయం వాపి న (అస్తి).

ప్రతిపదార్థము :– రామే = శ్రీరాముడు, రాజ్యం = రాజ్యమును, ప్రశాసతి (సతి) = పాలించుచుండగా, విధవాః = వితంతువులు, న పర్యదేవన్ = విలపించుటలేదు, వ్యాళకృతం = క్రూరమృగములచే చేయబడినట్టి, భయం చ = భయమును, న అస్తి = లేకుండెను.

తాత్పర్యము :– శ్రీరామచంద్రుడు సింహాసనము నధిష్ఠించి అయోధ్యారాజ్యము నేలుచుండగా స్త్రీలు వితంతువులై విలపించుట యనునది లేకుండెను. జనులకు క్రూరమృగాదుల బాధ లేకుండెను. జనులను ఎట్టి వ్యాధులు పీడింపకుండెను.

శ్లో॥ నిర్దస్యు రభవ ల్లోకో నానర్థః కంచి దస్పృశత్ ।
న చ స్మ వృద్ధా బాలానాం ప్రేతకార్యాణి కుర్వతే ॥ 41

పదచ్ఛేదము :– నిర్దస్యుః – అభవత్ – లోకః – న – అనర్థః – కంచిత్ – అస్పృశత్, న – చ – స్మ – వృద్ధాః – బాలానాం – ప్రేతకార్యాణి – కుర్వతే ॥

అన్వయక్రమము :– లోకః నిర్దస్యుః అభవత్, కంచిత్ అనర్థః న అస్పృశత్, వృద్ధాః బాలానాం ప్రేతకార్యాణి న చ కుర్వతే స్మ.

ప్రతిపదార్థము :– లోకః = లోకము, నిర్దస్యుః = దొంగలు లేనిది, అభవత్ = అయ్యెను, కంచిత్ = ఎవ్వనిని, అనర్థః = ఉపద్రవము, న అస్పృశత్ = అంటకుండెను, వృద్ధాః = పెద్దలు, బాలానాం = పిల్లలకు, ప్రేతకార్యాణి = ప్రేతసంస్కారములను, న చ కుర్వతే స్మ = చేయరైరి.

తాత్పర్యము :– లోకమున దొంగల భయము లేకుండెను. ఏ మనుజునకును ఎట్టి యనర్థమును వాటిల్లకుండెను. ఆ రాజ్యమున పెద్దవారికి – పిన్నవారికి ప్రేతకార్యములు చేయు దుస్థితి ఎచ్చటను లేకుండెను.

శ్లో॥ సర్వం ముదితమే వాసీ త్సర్వో ధర్మపరో ఽభవత్ ।
రామమే వానుపశ్యంతో నాభ్యహింస న్పరస్పరమ్ ॥ 42

పదచ్ఛేదము :– సర్వం – ముదితమ్ – ఏవ – ఆసీత్ – సర్వః – ధర్మపరః – అభవత్, రామమ్ – ఏవ – అనుపశ్యంతః – న – అభ్యహింసన్ – పరస్పరమ్ ॥

అన్వయక్రమము :– సర్వం ముదితం ఏవ ఆసీత్, సర్వః ధర్మపరః అభవత్, రామమ్ ఏవ అనుపశ్యంతః పరస్పరం న అభ్యహింసన్.

ప్రతిపదార్థము :– సర్వం = సమస్తమును, ముదితమ్ ఏవ = సంతోషమునొందినదే, ఆసీత్ = అయ్యెను, సర్వః = ప్రతిమనుజుడును, ధర్మపరః = ధర్మమునందు శ్రద్ధగలవాడు, అభవత్ = అయ్యెను, రామమ్ఏవ = శ్రీరామునే, అనుపశ్యంతః = చూచుచున్నవారై, పరస్పరం = ఒండొరులను, న అభ్యహింసన్ = హింసింపకుండిరి.

తాత్పర్యము :– ప్రాణికోటి అంతయును సంతోషభరితమై యుండెను. జనులెల్లరును ధర్మపరాయణులై యుండిరి. ఎట్టి సందర్భమునందును శ్రీరామునకు అప్రియము కలుగకూడదను కోరికగలవారై ఒకరికొకరు ఎట్టి హానియును గలుగ నీయకుండ అన్యోన్యప్రేమతో జీవించుచుండిరి.

శ్లో॥ ఆసన్ వర్షసహస్రాణి తథా పుత్రసహస్రిణః ।
నిరామయా విశోకాశ్చ రామే రాజ్యం ప్రశాసతి ॥ 43

పదచ్ఛేదము :– ఆసన్ – వర్షసహస్రాణి – తథా – పుత్రసహస్రిణః – నిరామయాః – విశోకాః – చ – రామే – రాజ్యం – ప్రశాసతి ॥

అన్వయక్రమము :– రామే రాజ్యం ప్రశాసతి (సతి నరాః) నిరామయాః విశోకాః చ తథా పుత్రసహస్రిణః చ (సంతః) వర్షసహస్రాణి ఆసన్.

ప్రతిపదార్థము :– రామే = శ్రీరాముడు, రాజ్యం = రాజ్యమును, ప్రశాసతి (సతి) = పాలించుచుండగా, (నరాః = ప్రజలు), వర్షసహస్రాణి = వేలకొలది సంవత్సరములు, నిరామయాః = రోగములు లేనివారుగాను, తథా = అట్లు, పుత్రసహస్రిణః = బహుపుత్రులు గలవారుగను, ఆసన్ = ఉండిరి.

తాత్పర్యము :- శ్రీరాము డట్లు రాజ్యము చేయుచున్న కాలమున ప్రజలందరును ఎట్టి అనారోగ్యమును, ఎట్టి దుఃఖమును లేకుండ బహుళమైన పుత్రపౌత్రాదిసంపత్తితో వేలకొలది సంవత్సరములు సుఖముగా జీవించుచుండిరి.

శ్లో॥ రామో రామో రామ ఇతి ప్రజానా మభవ న్కథాః ।
రామభూతం జగ దభూ ద్రామే రాజ్యం ప్రశాసతి ॥ 44

పదచ్ఛేదము :- రామః - రామః - రామః - ఇతి - ప్రజానాం - అభవన్ - కథాః, రామభూతం - జగత్ - అభూత్ - రామే - రాజ్యం - ప్రశాసతి ॥

అన్వయక్రమము :- రామే రాజ్యం ప్రశాసతి (సతి) ప్రజానాం కథాః రామః రామః రామః ఇతి అభవన్, జగత్ రామభూతం అభూత్.

ప్రతిపదార్థము :- రామే = శ్రీరాముడు, రాజ్యం = రాజ్యమును, ప్రశాసతి సతి = పరిపాలించుచుండగా, ప్రజానాం = ప్రజలలో, కథాః = భాషణములు, రామః రామః రామః ఇతి = రాముడు రాముడు రాముడు అని, అభవన్ = ఉండెడివి, జగత్ = లోకము, రామభూతం = రామమయముగా, అభూత్ = ఆయెను.

తాత్పర్యము :- శ్రీరాముడు రాజ్యము చేయుచున్న ఆ పుణ్యకాలమున జనులలో ఎచ్చట చూచినను, శ్రీరాముడిట్లు చెప్పెను. శ్రీరాముడిట్లు చేసెను, రామభద్రుడు దీనినే సమ్మతించును, అనుమాటలే సర్వత్ర వినవచ్చుచుండెను. ఇట్లానాడు జగమంతయును రామమయమై యుండెను.

శ్లో॥ నిత్యపుష్పా నిత్యఫలా స్తరవ స్స్కంధవిస్తృతాః ।
కాలే వర్షీ చ పర్జన్య స్సుఖస్పర్శశ్చ మారుతః ॥ 45

పదచ్ఛేదము :- నిత్యపుష్పాః - నిత్యఫలాః - తరవః - స్కంధవిస్తృతాః - కాలే - వర్షీ - చ - పర్జన్యః - సుఖస్పర్శః - చ - మారుతః ॥

అన్వయక్రమము :- తరవః నిత్యపుష్పాః నిత్యఫలాః స్కంధవిస్తృతాః (అభవన్). పర్జన్యః చ కాలే వర్షీ (అభవత్). మారుతః సుఖస్పర్శః చ.

ప్రతిపదార్థము :- తరవః = వృక్షములు, స్కంధవిస్తృతాః = బలసిన మ్రానులు గలవై, నిత్యపుష్పాః = ఎల్లప్పుడును పూవులు కలవిగను, నిత్యఫలాః చ = ఎల్లప్పుడును పండ్లుగలవిగను, (అభవన్ = ఉండినవి), పర్జన్యః = మేఘము, కాలే = సకాలము నందు, వర్షీ = వర్షించునదిగా, (అభవత్ = ఉండెను), మారుతః = వాయువు, సుఖస్పర్శః = సుఖమైన స్పర్శగలదిగా, అభవత్ = ఉండెను.

తాత్పర్యము :– ఆ కాలమునందు వృక్షములన్నియును పెద్దశాఖలతో చక్కగా విస్తరించినవిగను, ఎల్లకాలములందు పూవులు పూయునవిగను, పండ్లుగలవిగను ఉండెను. మరియు మేఘుడు సకాలములో సువృష్టి నొసగుచుండెను. వాయువు జీవులకు సుఖకరముగ వీచుచుండెను.

శ్లో॥ బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా లోభవివర్జితాః ।
స్వకర్మసు ప్రవర్తంతే తుష్టా స్స్వైరేవ కర్మభిః ॥ 46

పదచ్ఛేదము :– బ్రాహ్మణాః – క్షత్రియాః – వైశ్యాః – శూద్రాః – లోభవివర్జితాః, స్వకర్మసు – ప్రవర్తంతే – తుష్టాః – స్వైః – ఏవ – కర్మభిః ॥

అన్వయక్రమము :– బ్రాహ్మణాః క్షత్రియాః వైశ్యాః శూద్రాః లోభవివర్జితాః స్వైః కర్మభిః ఏవ తుష్టాః (సంతః) స్వకర్మసు ప్రవర్తంతే.

ప్రతిపదార్థము :– బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, క్షత్రియాః = క్షత్రియులు, వైశ్యాః = కోమటులు, శూద్రాః = శూద్రులు, లోభవివర్జితాః = లోభముచే విడువబడినవారై, స్వైః కర్మభిః ఏవ = తమ తమ పనులతోడనే, తుష్టాః (సంతః) = సంతుష్టి నొందినవారై, స్వకర్మసు = తమ పనులయందు, ప్రవర్తంతే = ప్రవర్తిల్లు చుండిరి.

తాత్పర్యము :– బ్రాహ్మణులును క్షత్రియులును వైశ్యులును శూద్రులును ఇసుమంతయును లోభగుణములేనివారై తమ తమ పనులను నిర్వహించుటయందే సంతృప్తి గలవారై తమకు విహితములైన కర్మలయందే నిమగ్నులై యుండెడివారు.

శ్లో॥ ఆస న్ప్రజా ధర్మరతా రామే శాసతి నానృతాః ।
సర్వే లక్షణసంపన్నా స్సర్వే ధర్మపరాయణాః ॥ 47

పదచ్ఛేదము :– ఆసన్ – ప్రజాః – ధర్మరతాః – రామే – శాసతి – నానృతాః, సర్వే – లక్షణసంపన్నాః – సర్వే – ధర్మపరాయణాః ॥

అన్వయక్రమము :– రామే – శాసతి (సతి) ప్రజాః సర్వే ధర్మరతాః నానృతాః లక్షణసంపన్నాః సర్వే ధర్మపరాయణాః ఆసన్.

ప్రతిపదార్థము :– రామే = శ్రీరాముడు, శాసతి (సతి) = పరిపాలించుచుండగా, ప్రజాః = ప్రజలు, ధర్మరతాః = ధర్మమునం దాసక్తి గలవారుగను, నానృతాః = అసత్యము పలుకనివారుగను, సర్వే = ఎల్లరును, లక్షణసంపన్నాః = ఉత్తమ లక్షణములు గలవారుగను, సర్వే = ఎల్లరును, ధర్మపరాయణాః = ధర్మతత్పరులుగను, ఆసన్ = ఉండిరి.

తాత్పర్యము :– శ్రీరాముడు రాజ్యపాలనము చేయుచుండగా జనులెల్లరును సత్యనిరతులై యుండిరి. ఆనాడు ప్రజలెల్లరును శుభలక్షణములతో విలసిల్లు చుండిరి. ఎల్లరును ధర్మపరాయణులై యుండిరి.

శ్లో॥ దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ ।
భ్రాతృభి స్సహితః శ్రీమా న్రామో రాజ్య మకారయత్ ॥ 48

పదచ్ఛేదము :– దశవర్షసహస్రాణి – దశవర్షశతాని – చ, భ్రాతృభిః సహితః – శ్రీమాన్ – రామః – రాజ్యమ్ – అకారయత్ ॥

అన్వయక్రమము :– శ్రీమాన్ రామః భ్రాతృభిః సహితః (సన్) దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ రాజ్యమ్ అకారయత్.

ప్రతిపదార్థము :– శ్రీమాన్ = శ్రీమంతుడైనట్టి, రామః = రామచంద్రుడు, భ్రాతృభిః = సోదరులతో, సహితః (సన్) = కూడినవాడై, దశవర్షసహస్రాణి = పదివేలయేండ్లును, దశవర్షశతాని చ = పదివందల సంవత్సరములును, రాజ్యం = రాజ్యమును, అకారయత్ = పాలించెను.

తాత్పర్యము :– శ్రీరామచంద్రుడు తన సోదరవర్గముతో గూడినవాడై పదునొకండువేల సంవత్సరములు ప్రజారంజకముగ రాజ్యపాలన మొనరించెను.

శ్లో॥ ధన్యం యశస్య మాయుష్యం రాజ్ఞాం చ విజయావహమ్ ।
ఆదికావ్య మిదం త్వార్షం పురా వాల్మీకినా కృతమ్ ।
యః పఠేచ్ఛృణుయాల్లోకే నరః పాపాద్విముచ్యతే ॥ 49

పదచ్ఛేదము :– ధన్యం – యశస్యమ్ – ఆయుష్యం – రాజ్ఞాం – చ – విజయావహమ్, ఆదికావ్యమ్ – ఇదం – తు – ఆర్షం – పురా – వాల్మీకినా – కృతమ్, యః – పఠేత్ – శృణుయాత్ – లోకే – నరః – పాపాత్ – విముచ్యతే ॥

అన్వయక్రమము :– ధన్యం యశస్యమ్ ఆయుష్యం రాజ్ఞాం విజయావహమ్, పురా వాల్మీకినా కృతమ్ ఇదమ్ ఆర్షమ్ ఆదికావ్యం, యః పఠేత్ శృణుయాత్ (సః) నరః లోకే పాపాత్ విముచ్యతే.

ప్రతిపదార్థము :– ధన్యం = పుణ్యప్రదమైనదియును, యశస్యం = కీర్తికరమైనదియును, ఆయుష్యం = ఆయుర్వృద్ధికరమును, రాజ్ఞాం = రాజులకు, విజయావహం = విజయమును గూర్చునదియును, పురా = పూర్వము, వాల్మీకినా = వాల్మీకిమహర్షిచే, కృతం = రచింపబడినదియును, ఆర్షం = వేదసమ్మతమైనదియునుఅగు, ఇదం =

ఈ, ఆదికావ్యం = ఆదికావ్యమును, యః = ఎవ్వడు, పఠేత్ = పఠించునో, శృణుయాత్ = వినునో, (సః = ఆ), నరః = మనుజుడు, లోకే = లోకమునందు, పాపాత్ = పాపమునుండి, విముచ్యతే = విడువబడును.

తాత్పర్యము :– మిక్కిలి ధన్యమైనదియును, కీర్తికరమైనదియును ఆయుర్వర్ధనమైనదియును, మహారాజులకు విజయమును సమకూర్చునదియును, శ్రీరాముని యవతారకారమునందే వేదముల సారమును వివరించునట్టి రీతిలో వాల్మీకిచే రచింపబడినదియును అగు ఈ యాదికావ్యమైన శ్రీమద్రామాయణము నెవరు భక్తిశ్రద్ధలతో పఠింతురో ఆకర్ణించెదరో అట్టి మనుజులు సర్వపాపములనుండి విముక్తి నొందుదురు.

శ్లో॥ పుత్రకామస్తు పుత్రాన్వై ధనకామో ధనాని చ ।
లభతే మనుజో లోకే శ్రుత్వా రామాభిషేచనమ్ ।
మహీం విజయతే రాజా రిపూంశ్చా ప్యధితిష్ఠతి ॥ 50

పదచ్ఛేదము :– పుత్రకామః – తు – పుత్రాన్ – వై – ధనకామః – ధనాని – చ, లభతే – మనుజః – లోకే – శ్రుత్వా – రామాభిషేచనమ్, మహీం – విజయతే – రాజా – రిపూన్ – చ – అపి – అధితిష్ఠతి ॥

అన్వయక్రమము :– రామాభిషేచనమ్ శ్రుత్వా లోకే పుత్రకామః మనుజః పుత్రాన్, ధనకామః ధనాని చ లభతే. రాజా మహీం విజయతే, రిపూన్ అపి అధితిష్ఠతి చ.

ప్రతిపదార్థము :– రామాభిషేచనమ్ = రాముని అభిషేకమును, శ్రుత్వా = విని, లోకే = లోకమునందు, పుత్రకామః = పుత్రులను గోరునట్టి, మనుజః = నరుడు, పుత్రాన్ = పుత్రులను, ధనకామః = ధనమును గోరునట్టివాడు, ధనాని చ = ధనమును, లభతే = పొందును. రాజా = రాజు, మహీం = భూమిని, విజయతే = జయించును, అపి చ = మరియును, రిపూన్ = శత్రువులను, అధితిష్ఠతి = జయించును.

తాత్పర్యము :– ఈ లోకమున జనులలో శ్రీరామపట్టాభిషేకవృత్తాంతమును భక్తితో నాకర్ణించిన పుణ్యాత్ముడు సంతానమును గోరువాడయిన పుత్రులను బడయును. ఐశ్వర్యమును గోరువాడయిన సంపదలను సంపాదించుకొనును. రాజు రాజ్యమును జయించును. మరియు శత్రువుల నణచివేయును.

శ్లో॥ రాఘవేణ యథా మాతా సుమిత్రా లక్ష్మణేన చ ।
భరతేనేవ కైకేయీ జీవపుత్రా స్తథా స్త్రియః ॥ 51

శ్లో॥ భవిష్యంతి సదానందాః పుత్రపౌత్రసమన్వితాః ॥ 52

పదచ్ఛేదము :– రాఘవేణ – యథా – మాతా – సుమిత్రా – లక్ష్మణేన – చ – భరతేన – ఇవ – కైకేయీ – జీవపుత్రాః – తథా – స్త్రియః, భవిష్యంతి – సదానందాః – పుత్రపౌత్రసమన్వితాః ॥

అన్వయక్రమము :– (రామాభిషేచనం శ్రుత్వా) తథా స్త్రియః మాతా రాఘవేణ యథా సుమిత్రా లక్ష్మణేన యథా, కైకేయీ భరతేన ఇవ జీవపుత్రాః పుత్రపౌత్రసమన్వితాః సదానందాః భవిష్యంతి.

ప్రతిపదార్థము :– (రామాభిషేచనం శ్రుత్వా = శ్రీరామపట్టాభిషేకమును విని), తథా = ఆ విధముగ, స్త్రియః = స్త్రీలు, రాఘవేణ = శ్రీరామునితో, మాతా యథా = తల్లియగు కౌసల్యవలెను, లక్ష్మణేన = లక్ష్మణునితో, సుమిత్రా యథా = సుమిత్రవలెను, భరతేన = భరతునితో, కైకేయీ ఇవ = కైకేయివలెను, జీవపుత్రాః = జీవించియున్న బిడ్డలు గలవారుగను, పుత్రపౌత్రసమన్వితాః = పుత్రులతోడను, పౌత్రులతోడను గూడియున్నవారై, సదానందాః = నిత్యము సంతోషముగలవారు, భవిష్యంతి = కాగలరు.

తాత్పర్యము :– స్త్రీలు శ్రీరామపట్టాభిషేకముతో గూడిన రామాయణశ్రవణమువలన శ్రీరామునితో కౌసల్యవలెను, లక్ష్మణునితో సుమిత్రవలెను, భరతునితో కైకేయివలెను చిరంజీవులగు బిడ్డలతో పుత్రపౌత్రాభివృద్ధిగా ఆనందము నొందగలరు.

శ్లో॥ శ్రుత్వా రామాయణ మిదం దీర్ఘమాయుశ్చ విందతి ।
రామస్య విజయం చైవ సర్వ మక్లిష్టకర్మణః ॥ 53

పదచ్ఛేదము :– శ్రుత్వా – రామాయణమ్ – ఇదం – దీర్ఘమ్ – ఆయుః – చ – విందతి, రామస్య – విజయం – చ – ఏవ – సర్వమ్ – అక్లిష్టకర్మణః ॥

అన్వయక్రమము :– అక్లిష్టకర్మణః రామస్య విజయమ్ ఇదం రామాయణం సర్వం చైవ శ్రుత్వా దీర్ఘమ్ ఆయుః చ విందతి.

ప్రతిపదార్థము :– అక్లిష్టకర్మణః = క్లేశములు గల్గింపని కృత్యములు గల్గినట్టి, రామస్య = రామునియొక్క, విజయం = విజయమైనట్టి, ఇదం = ఈ, రామాయణం = రామాయణమును, సర్వం చైవ = సమస్తమును, శ్రుత్వా = విని, దీర్ఘం = దీర్ఘమైన, ఆయుః చ = ఆయుర్దాయమునుకూడ, విందతి = పొందును.

తాత్పర్యము :– ఇతరులకు ఎట్టి క్లేశము గల్గింపకుండ ఉత్కృష్టకృత్యములు సాధించు

వాడయిన శ్రీరాముని విజయగాథయైనట్టి ఈ రామాయణము నంతయును భక్తితో ఆకర్ణించినట్టి నరుడు దీర్ఘాయువును గూడ పొందును.

శ్లో॥ శృణోతి య ఇదం కావ్య మార్షం వాల్మీకినా కృతమ్ ।
శ్రద్ధధానో జితక్రోధో దుర్గా ణ్యతితర త్యసౌ ।
సమాగమం ప్రవాసాంతే లభతే చాపి బాంధవైః ।
ప్రార్థితాంశ్చ వరా న్సర్వా న్ప్రాప్నుయా దిహ రాఘవాత్ ॥ 54

పదచ్ఛేదము :– శృణోతి – యః – ఇదం – కావ్యమ్ – ఆర్షం – వాల్మీకినా – కృతమ్, – శ్రద్ధధానః – జితక్రోధః – దుర్గాణి – అతితరతి – అసౌ, సమాగమం – ప్రవాసాంతే – లభతే – చ – అపి – బాంధవైః, ప్రార్థితాన్ – చ – వరాన్ – సర్వాన్ – ప్రాప్నుయాత్ – ఇహ – రాఘవాత్ ॥

అన్వయక్రమము :– వాల్మీకినా కృతమ్ ఇదమ్ ఆర్షం కావ్యం శ్రద్ధధానః జితక్రోధః యః శృణోతి అసౌ దుర్గాణి అతితరతి, ప్రవాసాంతే బాంధవైః సమాగమం చ లభతే, రాఘవాత్ ఇహ ప్రార్థితాన్ సర్వాన్ వరాన్ ప్రాప్నుయాత్.

ప్రతిపదార్థము :– వాల్మీకినా = వాల్మీకిమహర్షిచే, కృతం = రచింపబడిన, ఇదం = ఈ, ఆర్షం = వేదసమ్మతమైన, కావ్యం = కావ్యమును, శ్రద్ధధానః = శ్రద్ధగలిగిన వాడగుచు, జితక్రోధః = జయింపబడిన క్రోధముగలవా డగుచును, యః = ఏ నరుడు, శృణోతి = వినునో, అసౌ = అతడు, దుర్గాణి = విషమపరిస్థితులను, అతితరతి = దాటును. అపిచ = మరియును, ప్రవాసాంతే = ప్రవాసానంతరము, బాంధవైః = బంధువులతో, సమాగమం = కూడికను, లభతే = పొందును, ఇహ = ఈ లోకమునందు, రాఘవాత్ = శ్రీరామునినుండి, ప్రార్థితాన్ = కోరబడినట్టి, సర్వాన్ = సమస్తములైన, వరాన్ చ = వరములను గూడ, ప్రాప్నుయాత్ = పొందును.

తాత్పర్యము :– వాల్మీకి మహర్షిచే విరచితమైనట్టి ఈ వేదతుల్యమైన శ్రీమద్రామాయణ మహాకావ్యమును శ్రద్ధావంతుడును క్రోధరహితుడు నగుచు ఆలకించినట్టి పుణ్యాత్ముడు తనకు ఘటిల్లునట్టి విషమపరిస్థితుల నన్నిటిని తప్పించుకొనగలడు. ప్రవాసమున నున్నవాడు తన బంధువులను చేరుకొనగలడు. వేయేల! ఆతడు శ్రీరాముని కరుణకు పాత్రుడై తాను కోరుకొనిన కోరికల నన్నింటిని సిద్ధింపచేసి కొనగలడు.

శ్లో॥ శ్రవణేన సురా స్సర్వే ప్రీయంతే సంప్రశృణ్వతామ్ ।
వినాయకాశ్చ శామ్యంతి గృహే తిష్ఠంతి యస్య వై ॥ 55

పదచ్ఛేదము :– శ్రవణేన – సురాః – సర్వే – ప్రీయంతే – సంప్రశృణ్వతామ్, వినాయకాః – చ – శామ్యంతి – గృహే – తిష్ఠంతి – యస్య – వై ॥

అన్వయక్రమము :– శ్రవణేన సంప్రశృణ్వతాం సర్వే సురాః ప్రీయంతే, యస్య గృహే వినాయకాః తిష్ఠంతి (తే) చ శామ్యంతి.

ప్రతిపదార్థము :– శ్రవణేన = వినుటచేత, సంప్రశృణ్వతాం = లెస్సగ వినువారికి, సురాః = దేవతలు, సర్వే = ఎల్లరును, ప్రీయంతే = ప్రీతినొందుదురు, యస్య = ఎవనియొక్క, గృహే = గృహమునందు, వినాయకాః = విఘాతకారకములైన గ్రహములు, తిష్ఠంతి = ఉండునో, తే చ = అవియును, శామ్యంతి = శమించును.

తాత్పర్యము :– ఈ రామాయణమును వినిన పుణ్యాత్ములకు దేవతలెల్లరును ప్రసన్నులగుదురు. ఎవని గృహమందైన ఆతని పుణ్యమునకు విఘాతము కల్గించునట్టి దుష్టగ్రహము లున్నయెడల అవి అన్నియును సమసిపోగలవు.

శ్లో॥ విజయేత మహీం రాజా ప్రవాసీ స్వస్తిమా న్వ్రజేత్ ।
స్త్రియో రజస్వలా శ్శృత్వా పుత్రా న్సూయు రనుత్తమాన్ ॥ 56

పదచ్ఛేదము :– విజయేత – మహీం – రాజా – ప్రవాసీ – స్వస్తిమాన్ – వ్రజేత్ – స్త్రియః – రజస్వలాః – శ్రుత్వా – పుత్రాన్ – సూయుః – అనుత్తమాన్ ॥

అన్వయక్రమము :– రాజా మహీం విజయేత, ప్రవాసీ స్వస్తిమాన్ వ్రజేత్, రజస్వలాః స్త్రియః శ్రుత్వా అనుత్తమాన్ పుత్రాన్ సూయుః.

ప్రతిపదార్థము :– రాజా = రాజు, మహీం = భూమిని, విజయేత = జయించును, ప్రవాసీ = దూరదేశస్థుడైనవాడు, స్వస్తిమాన్ = క్షేమముగలవాడై, వ్రజేత్ = చేరును, రజస్వలాః = ఋతుమతులైన, స్త్రియః = స్త్రీలు, శ్రుత్వా = విని, అనుత్తమాన్ = మిక్కిలి ఉత్తమమైన, పుత్రాన్ = బిడ్డలను, సూయుః = ప్రసవింతురు.

తాత్పర్యము :– మహారాజు తన రాజ్యమును విస్తరింప చేసికొనును, దూరదేశగతుడైన వాడు క్షేమముగ తన నివాసమునకు చేరుకొనును. ఋతుస్నాతలైన స్త్రీలు ఆలకించిన యెడల సర్వోత్తమమైన సంతానమును బడయగల్గుదురు.

శ్లో॥ పూజయంశ్చ పఠం శ్చేమ మితిహాసం పురాతనమ్ ।
సర్వపాపా త్ప్రముచ్యేత దీర్ఘమాయు రవాప్నుయాత్ ॥ 57

పదచ్ఛేదము :– పూజయన్ – చ – పఠన్ – చ – ఇమమ్ – ఇతిహాసం –

పురాతనమ్, సర్వపాపాత్ – ప్రముచ్యేత – దీర్ఘమ్ – ఆయుః – అవాప్నుయాత్ ॥

అన్వయక్రమము :– పురాతనమ్ ఇమమ్ ఇతిహాసం పూజయన్ చ పఠన్ చ, సర్వపాపాత్ ప్రముచ్యేత, దీర్ఘమ్ ఆయుః అవాప్నుయాత్.

ప్రతిపదార్థము :– పురాతనం = ప్రాచీనమైనట్టి, ఇమం = ఈ, ఇతిహాసం = చరిత్రను, పూజయన్ చ = పూజించుచును, పఠన్ చ = పఠించుచును, (నరః = మనుజుడు), సర్వపాపాత్ = సమస్తపాపమునుండియు, ప్రముచ్యేత = విడువబడును, దీర్ఘమ్ = దీర్ఘమైనట్టి, ఆయుః = ఆయువును, అవాప్నుయాత్ = పొందును.

తాత్పర్యము :– ప్రాచీనమైనట్టి ఈ రామాయణగాథను పూజ్యభావముతో పఠించునట్టి నరుడు సమస్తవిధములైన పాతకములనుండియు విముక్తినొంది చిరాయువు నొందగలడు.

శ్లో॥ ప్రణమ్య శిరసా నిత్యం శ్రోతవ్యం క్షత్రియై ర్ద్విజాత్ ।
ఐశ్వర్యం పుత్రలాభశ్చ భవిష్యతి న సంశయః ॥ 58

పదచ్ఛేదము :– ప్రణమ్య – శిరసా – నిత్యం – శ్రోతవ్యం – క్షత్రియైః – ద్విజాత్, ఐశ్వర్యం – పుత్రలాభః – చ – భవిష్యతి – న – సంశయః ॥

అన్వయక్రమము :– క్షత్రియైః నిత్యం శిరసా ప్రణమ్య ద్విజాత్ శ్రోతవ్యమ్, (శృణ్వతాం) ఐశ్వర్యం పుత్రలాభః చ భవిష్యతి, సంశయః న (అస్తి).

ప్రతిపదార్థము :– క్షత్రియైః = క్షత్రియులచే, నిత్యం = ఎల్లప్పుడును, శిరసా = శిరస్సుతో, ప్రణమ్య = నమస్కరించి, ద్విజాత్ = విప్రునివలన, శ్రోతవ్యం = వినవలసినది, (శృణ్వతాం = వినువారికి), ఐశ్వర్యం = సంపదయును, పుత్రలాభః చ = సంతాన లాభమును, భవిష్యతి = కలుగగలదు. సంశయః = సందేహము, న (అస్తి) = లేదు.

తాత్పర్యము :– గౌరవపూర్వకముగా నమస్కారము చేసి క్షత్రియు లీ రామాయణమును నిత్యము విప్రునివలన భక్తితో వినవలయును. అట్లాలకించిన పుణ్యాత్ములకు ఐశ్వర్యమును పుత్రసంతతియును నిస్సంశయముగా లభించును.

శ్లో॥ రామాయణ మిదం కృత్స్నం శృణ్వతః పఠత స్సదా ।
ప్రీయతే సతతం రామ స్సహి విష్ణు స్సనాతనః ॥ 59

పదచ్ఛేదము :– రామాయణమ్ – ఇదం – కృత్స్నం – శృణ్వతః – పఠతః – సదా – ప్రీయతే – సతతం – రామః – సః – హి – విష్ణుః – సనాతనః ॥

అన్వయక్రమము :- ఇదం రామాయణం కృత్స్నం సదా శృణ్వతః, పఠతః రామః సతతం ప్రీయతే, సః సనాతనః విష్ణుః హి.

ప్రతిపదార్థము :- ఇదం = ఈ, రామాయణం = రామాయణమును, కృత్స్నం = సంపూర్ణముగా, సదా = నిత్యమును, శృణ్వతః = వినువారికిని, పఠతః = పఠించువారికిని, సతతం = ఎల్లప్పుడును, రామః = శ్రీరాముడు, ప్రీయతే = ప్రీతినొందును, సః = ఆతడు, సనాతనః = ఆదిదేవుడైన, విష్ణుః హి = విష్ణువేగదా!

తాత్పర్యము :- నిత్యము ఈ రామాయణమును సమగ్రముగ భక్తితో వినువారి యెడను చదువువారియెడను గూడ శ్రీరాముడు ప్రసన్నుడై యుండును. శ్రీరాము డనగా సనాతనుడైన ఆ శ్రీమహావిష్ణువే గదా!

శ్లో॥ ఆదిదేవో మహాబాహు ర్హరి ర్నారాయణః ప్రభుః ।
సాక్షా ద్రామో రఘుశ్రేష్ఠ శ్శేషో లక్ష్మణ ఉచ్యతే ॥ 60

పదచ్ఛేదము :- ఆదిదేవః - మహాబాహుః - హరిః - నారాయణః - ప్రభుః, సాక్షాత్ - రామః - రఘుశ్రేష్ఠః - శేషః - లక్ష్మణః - ఉచ్యతే ॥

అన్వయక్రమము :- రఘుశ్రేష్ఠః రామః సాక్షాత్ మహాబాహుః ఆదిదేవః నారాయణః ప్రభుః హరిః ఉచ్యతే, శేషః లక్ష్మణః ఉచ్యతే.

ప్రతిపదార్థము :- రఘుశ్రేష్ఠః = రఘువంశతిలకుడైన, రామః చ = శ్రీరాముడు, సాక్షాత్ మహాబాహుః = సాక్షాత్తుగా ఆజానుబాహువును, ఆదిదేవః = స్వయంభువును, నారాయణః = మహార్ణవశాయియును, ప్రభుః = జగత్ ప్రభువును అగు, హరిః = శ్రీహరిగా, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు, శేషః = ఆదిశేషుడు, లక్ష్మణః = లక్ష్మణుడుగా, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తాత్పర్యము :- రఘుకుల తిలకుడైన శ్రీరాముడు సాక్షాత్తుగా అనంత వీర్య సంపన్నుడును, ఆదిదేవుడును, త్రిజగత్తులకు ప్రభువును అగు ఆ శ్రీహరియే అనియును, లక్ష్మణుడు ఆదిశేషుడు అనియు జ్ఞానులు తెలుపుదురు.

శ్లో॥ కుటుంబవృద్ధిం ధనధాన్యవృద్ధిం
స్త్రియశ్చ ముఖ్యా స్సుఖ ముత్తమం చ ।
శ్రుత్వా శుభం కావ్య మిదం మహార్థం
ప్రాప్నోతి సర్వాం భువి చార్థసిద్ధిమ్ ॥ 61

పదచ్ఛేదము :- కుటుంబవృద్ధిం - ధనధాన్యవృద్ధిం - స్త్రియః - చ - ముఖ్యాః -

సుఖమ్ – ఉత్తమం – చ, శ్రుత్వా – శుభం – కావ్యమ్ – ఇదం – మహార్థం – ప్రాప్నోతి – సర్వాం – భువి – చ – అర్థసిద్ధిమ్ ॥

అన్వయక్రమము :– మహార్థం శుభమ్ ఇదం కావ్యం శ్రుత్వా భువి కుటుంబవృద్ధిం ధనధాన్యవృద్ధిం ముఖ్యాః స్త్రియః చ, ఉత్తమం సుఖం చ సర్వామ్ అర్థసిద్ధిం చ ప్రాప్నోతి.

ప్రతిపదార్థము :– మహార్థం = పరమపురుషార్థప్రదమును, శుభం = మంగళకరమునగు, ఇదం = ఈ, కావ్యం = కావ్యమును, శ్రుత్వా = విని, (నరః = మనుజుడు), కుటుంబవృద్ధిం = కుటుంబముయొక్క అభివృద్ధిని, ధనధాన్యవృద్ధిం = ధనధాన్యముల అభివృద్ధిని, ముఖ్యాః = ముఖ్యులైన, స్త్రియః చ = స్త్రీలను, ఉత్తమం = మేలైన, సుఖం చ = సౌఖ్యమును, సర్వాం = సమస్తమైన, అర్థసిద్ధిం చ = అభీష్టముల సిద్ధిని కూడ, ప్రాప్నోతి = పొందును.

తాత్పర్యము :– పరమార్థభరితమైన ఈ మంగళకరమగు రామాయణకావ్యమును వినిన మనుజుడు తమ కుటుంబము అభివృద్ధిని, ధనధాన్యముల అభ్యుదయమును, మేలైన స్త్రీలను, ఉత్తమమైన సుఖమును, భూమియందు తాను కోరదగిన సమస్తమైన అభీష్టములను గూడ పొందగల్గును.

శ్లో॥ ఆయుష్య మారోగ్యకరం యశస్యం
సౌభ్రాతృకం బుద్ధికరం సుఖం చ ।
శ్రోతవ్య మేత న్నియమేన సద్భి
రాఖ్యాన మోజస్కర మృద్ధికామైః ॥ 62

పదచ్ఛేదము :– ఆయుష్యమ్ – ఆరోగ్యకరం – యశస్యం – సౌభ్రాతృకం – బుద్ధికరం – సుఖం – చ, శ్రోతవ్యమ్ – ఏతత్ – నియమేన – సద్భిః – ఆఖ్యానమ్ – ఓజస్కరమ్ – ఋద్ధికామైః ॥

అన్వయక్రమము :– ఆయుష్యమ్ ఆరోగ్యకరం, యశస్యం, సౌభ్రాతృకం, బుద్ధికరం సుఖం చ ఏతత్ ఓజస్కరమ్ ఆఖ్యానమ్ ఋద్ధికామైః సద్భిః నియమేన శ్రోతవ్యమ్.

ప్రతిపదార్థము :– ఆయుష్యం = ఆయుర్వృద్ధికరమును, ఆరోగ్యకరం = ఆరోగ్య ప్రదమును, యశస్యం = కీర్తికరమును, సౌభ్రాతృకం = మంచి తోబుట్టువులను గలిగించునదియును, బుద్ధికరం = బుద్ధిప్రదమైనదియును, సుఖం = సుఖప్రదమైనది యును అగు, ఏతత్ = ఈ, ఓజస్కరం = తేజస్సును గూర్చునట్టి, ఆఖ్యానం = ఇతిహాసమును, ఋద్ధికామైః = అభ్యుదయమును గోరునట్టి, సద్భిః = సత్పురుషులచే,

నియమేన = నియమపూర్వకముగా, శ్రోతవ్యమ్ = వినదగినది.

తాత్పర్యము :- దీర్ఘాయువును, ఉత్తమమైన ఆరోగ్యమును, కీర్తిని, సోదరసంపదను సద్బుద్ధిని, ఉత్తమసౌఖ్యమును ప్రసాదించునట్టి మహాప్రభావసంపన్నమైన ఈ రామాయణకావ్యమును అభ్యుదయమును కాంక్షించు సత్పురుషులు నియమనిష్ఠలు గలవారై భక్తితో వినవలయును.

శ్లో॥ ఏవ మేత త్పురావృత్త మాఖ్యానం భద్ర మస్తు వః ।
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్ ॥ 63

పదచ్ఛేదము :- ఏవమ్ - ఏతత్ - పురా - వృత్తమ్ - ఆఖ్యానం - భద్రమ్ - అస్తు - వః, ప్రవ్యాహరత - విస్రబ్ధం - బలం - విష్ణోః - ప్రవర్ధతామ్ ॥

అన్వయక్రమము :- పురా ఏవం వృత్తమ్ ఏతత్ ఆఖ్యానం విస్రబ్ధం ప్రవ్యాహరత, వః భద్రమ్ అస్తు, విష్ణోః బలం ప్రవర్ధతామ్.

ప్రతిపదార్థము :- పురా = పూర్వము, ఏతత్ = ఈ, ఆఖ్యానం = గాథను, ఏవం = ఈ రీతిగా, వృత్తం = జరిగినట్టి దానిని, విస్రబ్ధం = నమ్మకముతో, ప్రవ్యాహరత = ఘోషింపుడు, వః = మీకు, భద్రం = మేలు, అస్తు = అగుగాక, విష్ణోః = విష్ణువుయొక్క, బలం = శక్తి, ప్రవర్ధతామ్ = ప్రవర్ధమానమగుగాక.

తాత్పర్యము :- పూర్వకాలమున నీ విధముగ జరిగినట్టి ఈ రామాయణగాథను మీరెల్లరును విశ్వాసబుద్ధితో చదివి వినిపింపుడు. మీకు శుభమగుగాక! మానవులందు మహావిష్ణువుయొక్క అనంతశక్తి ప్రవర్ధమానమగు గాక!

శ్లో॥ దేవాశ్చ సర్వే తుష్యంతి శ్రవణా ద్గ్రహణా త్తథా ।
రామాయణస్య శ్రవణా త్తుష్యంతి పితరస్తథా ॥ 64

పదచ్ఛేదము :- దేవాః - చ - సర్వే - తుష్యంతి - శ్రవణాత్ - గ్రహణాత్ - తథా, రామాయణస్య - శ్రవణాత్ - తుష్యంతి - పితరః - తథా ॥

అన్వయక్రమము :- రామాయణస్య శ్రవణాత్ తథా గ్రహణాత్ దేవాః సర్వే చ తుష్యంతి, తథా శ్రవణాత్ పితరః చ తుష్యంతి.

ప్రతిపదార్థము :- రామాయణస్య = రామాయణముయొక్క, శ్రవణాత్ = శ్రవణము వలనను, తథా = అట్లే, గ్రహణాత్ = పఠనమువలనను, దేవాః = దేవతలు, సర్వే చ = అందరును, తుష్యంతి = సంతోషింతురు.

తాత్పర్యము :- ఈ రామాయణకావ్యమును భక్తితో వినినను ఆసక్తితో పఠించినను దేవత లెల్లరును సంతోషింతురు మరియు ఈ రామాయణశ్రవణమువలన పితృదేవతల కెంతయో తృప్తి చేకూరును.

శ్లో॥ భక్త్యా రామస్య యే చేమాం సంహితా మృషిణా కృతామ్ ।
లేఖయంతీహ చ నరా స్తేషాం వాస స్త్రివిష్టపే ॥ 65

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే యుద్ధకాండే
"శ్రీరామపట్టాభిషేకో" నామ
ఏకత్రింశదుత్తర శతతమ స్సర్గః

పదచ్ఛేదము :- భక్త్యా – రామస్య – యే – చ – ఇమాం – సంహితాం – ఋషిణా – కృతామ్, లేఖయంతి – ఇహ – చ – నరాః – తేషాం – వాసః – త్రివిష్టపే ॥

అన్వయక్రమము :- ఋషిణా కృతామ్ ఇమాం రామస్య సంహితాం యే నరాః భక్త్యా ఇహ లేఖయంతి చ తేషాం త్రివిష్టపే వాసః లభ్యతే.

ప్రతిపదార్థము :- ఋషిణా = వాల్మీకిమహర్షిచే, కృతాం = రచియింపబడినట్టి, ఇమాం = ఈ, రామస్య = శ్రీరామునియొక్క, సంహితాం = వేదతుల్యమైన గాథను, యే నరాః = ఏ మనుజులు, భక్త్యా = భక్తితో, ఇహ = ఈ లోకమునందు, లేఖయంతి చ = వ్రాసెదరో లేక వ్రాయించెదరో, తేషాం = వారికి, త్రివిష్టపే = స్వర్గమునందు, వాసః = నివాసము, లభ్యతే = లభించును.

తాత్పర్యము :- వాల్మీకి మహర్షి రచించినట్టి వేదతుల్యమైన ఈ శ్రీరామచరిత్రమును భక్తితో వ్రాసినవారును, వ్రాయించినవారునుగూడ చిరకాలము స్వర్గనివాసమును బడయుదురు.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే యుద్ధకాండే
"శ్రీరామపట్టాభిషేకో" నామ
ఏకత్రింశదుత్తరశతతమ స్సర్గః.
హరిః ఓం తత్ సత్.

☆☆☆